శ్రీవేదవ్యాస విరచితం

శివ మహాపురాణం

ప్రథమ భాగం

(తెలుగు అనువాదం)

అనువాదకులు

డా॥ పి. చెంచుసుబ్బయ్య, ఎమ్.ఎ, పిహెచ్.డి.,

సంపాదకులు

డా॥ ఆకెళ్ల విభీషణ శర్మ

ఎమ్.ఎ.(సంస్కృతం), ఎమ్.ఎ.(తెలుగు), పిహెచ్.డి.,

ప్రత్యేకాధికారి

పురాణ ఇతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2024

SIVAMAHAPURANAM
FIRST PART
(with Telugu Translation)

Translated by:
Dr. P. Chenchu subbaiah,M.A.Ph.D.,

Editor:
Dr. Akella Vibhishana Sharma
M.A.(Sanskrit) M.A.(Telugu) Ph.D.,
Special Officer, Purana Itihasa Project
T.T.Devasthanams, Tirupati.

T.T.D. Religious Publications Series No.

© All Rights Reserved

First Print : 2024

Copies: 500

Published by:
J.Shyamala Rao, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Cover Design & D.T.P. Type Setting:
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.

Printed at:
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.

శ్రీపద్మావతిఅమ్మవారు

శ్రీవేంకటేశ్వరస్వామివారు



వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

తిరుమల తిరుపతి దేవస్థానములు
పురాణ ఇతిహాస ప్రాజెక్టు
పండితపరిషత్తు - సలహామండలి

అధ్యక్షులు

శ్రీ జె. శ్యామల రావు గారు ఐ.ఏ.ఎస్.,

కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

సభ్యులు

శ్రీమతి ఎం.గౌతమి గారు ఐ.ఏ.ఎస్.,

సంయుక్త కార్యనిర్వహణాధికారి,

తి.తి.దే., తిరుపతి.

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు,
జాతీయ సంస్కృత విద్యాపీఠం - తిరుపతి.

డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు
విశ్రాంత ఉపకులపతి,
జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు,
ప్రభుత్వ ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ,
హైదరాబాద్.

డా॥ ధూళిపాళ మహాదేవమణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు,
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి.

సంచాలకులు

డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మగారు

ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుమల తిరుపతి దేవస్థానములు

పురాణ ఇతిహాస ప్రాజెక్టు

పరిష్కరణ పరిషత్తు

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు,
జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

డా॥ శ్రీపాద సత్యనారాయణమూర్తిగారు
విశ్రాంత ఉపకులపతి,
జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

డా॥ సూరం శ్రీనివాసులుగారు
విశ్రాంత ప్రాచ్య కళాశాలాధ్యక్షులు,
శ్రీ గోరంట్లవెంకన్న ఓరియంటల్ కళాశాల,
తిమ్మసముద్రం.

డా॥ ధూళిపాళ ప్రభాకర కృష్ణమూర్తిగారు
విశ్రాంత డిస్ట్రిక్ట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్,
నిడదవోలు.

డా॥ ధూళిపాళ అన్నపూర్ణగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకురాలు,
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి.

డా॥ వేదాల వేంకట సీతారామాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు,
ఎస్.బి.ఎస్. సంస్కృతకళాశాల, పొన్నూరు.

శ్రీ గార్లపాటి ప్రభాకరశర్మగారు
విశ్రాంత ప్రిన్సిపాల్, ధర్మప్రబోధ కళాశాల,
హిందూ ధర్మప్రచార పరిషత్, తి.తి.దే., తిరుపతి.

ఆచార్య డి.వి.జి.ఎ.సోమయాజులుగారు
విశ్రాంత సహప్రాచార్యులు (తెలుగు)
ఎ.యమ్.ఎ.యల్.కళాశాల, అనకాపల్లి.

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు,
ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీ, హైదరాబాద్.

డా॥ ధూళిపాళ మహాదేవమణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు,
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల, రాజమండ్రి.

ఆచార్య ఆర్.వెంకటరామకృష్ణశాస్త్రిగారు
విశ్రాంత ఆచార్యులు (సంస్కృతం&తెలుగు),
హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

డా॥ కె.లక్ష్మీనారాయణగారు
విశ్రాంత రీడర్(సంస్కృతం),
వేదసంస్కృత కళాశాల, నెల్లూరు.

ఆచార్య జానమద్ది రామకృష్ణగారు
విశ్రాంత వ్యాకరణాచార్యులు,
జాతీయ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి.

డా॥ కడిమిళ్ళ వరప్రసాద్‌గారు
విశ్రాంత ఆంధ్రోపాధ్యాయులు,
టేలర్ హైస్కూల్, నరసాపురం.

డా॥ సి.హెచ్.రమాదేవిగారు
విశ్రాంత కళాశాల అధ్యక్షురాలు (FAC),
యస్.వి.జె.వి.సంస్కృత కళాశాల, కొవ్వూరు.

డా॥ ఓరుగంటి సీతగారు
విశ్రాంత సహప్రాచార్యురాలు,
ఎ.వి.ఎన్.కళాశాల, విశాఖపట్నం.

సంచాలకులు

డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మగారు

ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

విషయానుక్రమణిక

విషయం	**పుటసంఖ్య**
ముందుమాట	01
నివేదన	03
పురాణపురుషుడు శ్రీమన్నారాయణుడు	09
శివపురాణ కథాసారం	10
శివమహాపురాణం - మహాత్మ్యం	
1. మహిమ వర్ణనం	01
2. దేవరాజుకు ముక్తి చేకూరిన వర్ణనం	09
3. చంచులా వైరాగ్య వర్ణనం	15
4. చంచులా సద్గతి వర్ణనం	24
5. బిందుగ సద్గతి వర్ణనం	32
6. శ్రవణ విధి వర్ణనం	41
7. శివపురాణ దీక్షాపరుల విధి నిషేధ పుస్తక వక్తృ పూజన వర్ణనం	51
విద్యేశ్వర సంహిత	
1. ముని ప్రశ్నవర్ణనం	58
2. శివపురాణపరిచయం	65
3. శ్రవణమననకీర్తనలు	76
4. శ్రవణమననకీర్తనముల మహిమ	80
5. శివలింగమహిమావర్ణనము	84
6. బ్రహ్మ విష్ణు సంగ్రామం	89
7. కూటసాక్ష్యం	94
8. శివుడు బ్రహ్మావిష్ణువుననుగ్రహించుట	99
9. శివరాత్రి - అరుణాచలం	103
10. పంచకృత్యాలు - ప్రణవం - పంచాక్షరి	110
11. లింగప్రతిష్ఠ - ప్రణవం - పంచాక్షరి	116
12. తీర్థములు, క్షేత్రములు	126
13. సదాచారం - శౌచం - ధర్మానుష్ఠానం	132
14. మూడు యజ్ఞాలు - సప్తాహం	145
15. దానము, దేశకాలపాత్రలు	152
16. పూజావిధానం, పూజాఫలం	161

17. ప్రణవపంచాక్షరీమంత్రముల మహిమ – శివలోకవైభవం 178
18. శివలింగ మహిమ 199
19. పార్థివశివలింగ పూజన మాహాత్మ్యం 222
20. పార్థివశివలింగపూజావిధి వర్ణనం 228
21. పార్థివపూజావర్ణనము 238
22. శివనైవేద్యవర్ణనము 246
23. శివనామమాహాత్మ్యవర్ణనము 252
24. భస్మధారణ వర్ణనం 259
25. రుద్రాక్ష మాహాత్మ్యం 276
రుద్రసంహిత సృష్టిఖండం
1. మునిప్రశ్న వర్ణనం 290
2. నారదుని తపస్సు 295
3. నారదుని మోహం 303
4. నారదునకు విష్ణువు గావించిన ఉపదేశం 312
5. నారదుడు తండ్రిని ప్రశ్నించుట 323
6. విష్ణువు జన్మించుట 328
7. విష్ణు బ్రహ్మల వివాదం 337
8. శబ్ద బ్రహ్మ తనువర్ణనం 347
9. శివతత్త్వం 354
10. పరమశివతత్త్వం 363
11. శివపూజావిధి 369
12. సార, అసారవస్తువిచారం 380
13. శివపూజావర్ణనం 392
14. శివపూజ 403
15. రుద్రావతారావిర్భావం 415
16. బ్రహ్మ నారద సంవాదంలో సృష్టివర్ణనం 424
17. గుణనిధి చరిత్ర 431
18. గుణనిధి సద్గతిని పొందుట 440
19. శివునితో కుబేరుని మైత్రి 450
20. శివుడు కైలాసానికి వెళ్లుట 455
అనుబంధం
పురాణప్రశస్తి 464
అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం 478

తొలిపలుకు

"ఓం నమో వేంకటేశాయ"

శ్రీ జె. శ్యామలరావు, ఐ.ఏ.యస్.,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

ప్రపంచభాషలలో సంస్కృతం అతిప్రాచీనం. ఈ భాషలోనే వేదాలు, ఉపనిషత్తులు, శ్రీమద్రామాయణ భారతేతిహాసాలు వెలువడ్డాయి. వీటన్నిటికంటే సామాన్యప్రజలకు పురాణాలు సన్నిహితాలు సామాన్య జనులకు దూరమయిన చతుర్విధ పురుషార్థాలను పురాణాలు కథలద్వారా అందుబాటులోకి అందించాయి. కనుకనే ఆలయాలలో, రచ్చబండలమీద, భజనమందిరాలలో లేదా కలవారి లోగిళ్ళలో పురాణప్రవచనం నేటికీ సాగుతూ వుంది. వృద్ధులు, ధార్మికశ్రవణాసక్తులు పురాణాలను వింటూ నేటికి తాము పునీతులవుతున్నారు.

ప్రాచీనకాలంలో రాజాస్థానాలలో పౌరాణికులుండేవారు. రాజులకేదయినా సందేహం కలిగినపుడు పౌరాణికులు పురాణాలలోని అంశాలను చెబుతూ సంశయనివృత్తి చేసేవారు. అనంతమయిన, ఆర్షమయిన మానవాళికి శ్రేయోదాయకమయిన అనేకాంశాలు పురాణాలలో వివిధరూపాలలో వ్యక్తమవుతున్నాయి.

పురాణాలు కట్టుకథలుకావు. తమకాలం నాటివరకు ప్రచారంలోవున్న కథలకు, సన్నివేశాలకు, ఆచారసంప్రదాయాలను, విశ్వాసాలకు నిలయం. పౌరాణిక ప్రమాణం బలవత్తరం కనుక నాడు సంఘం అంగీకరించేది. బలపరచేది. ఆచరించదగిందని గట్టిగా వాదించేది.

పురాణాలు 18 అని ఒక గణన. ఉపపురాణాలు కూడా పద్ధెనిమిదే. ఈ పురాణాలు దేవతల ప్రాధాన్యం దృష్ట్యా శివాత్మకాలు. విష్ణ్వాత్మకాలు, శాక్తేయాలని విభజించినా ఇవన్నీ ఒక గమ్యాన్ని చేరడానికి మార్గాలే. కారణం ఇవన్నీ లోకులకు అనుగ్రహించినవాడే వ్యాసమహర్షి. సువిశాలమయిన భారతదేశసంస్కృతీ దర్శనం పురాణాలవల్లనే సాధ్యం. పురాణాలలోని కథలే తరువాతి కాలంలో కాంతాసమ్మితాలయి కావ్యాలుగా రచింపబడ్డాయి.

మర్రిచెట్టుకు ఊడల్లాగే, కల్పవృక్షానికి శాఖల్లాగే పురాణాలు ఆయా అంశాలకనుగుణంగా విభజింపబడ్డాయి. పురాణాలలో ఆధ్యాత్మికాంశాలే గాక లౌకికాంశాలు కూడా ఎన్నో వున్నాయి. కంటికి వేసుకొన్న సులోచనాలలాగా ఏ దృష్టితో చూస్తే వారికి ప్రీతికరమయిన జిజ్ఞాసాత్మకమయిన అంశాలే పురాణాలలో దృగ్గోచరమవుతాయి.

ఇంతటి విశిష్టతగల పురాణాలను తెలుగులో తాత్పర్యసహితంగా ముద్రించాలని తి.తి.దే చక్కటి ప్రణాళిక సిద్ధం చేసింది. ఆ ప్రణాళికలో భాగంగా ఇప్పటిదాకా కూర్మపురాణం, విష్ణుపురాణం, బ్రహ్మపురాణం, మత్స్యపురాణం, అగ్నిపురాణం, వామనపురాణం, మార్కండేయపురాణం, లింగపురాణం, గరుడపురాణాలు వెలువడ్డాయి. ప్రస్తుతం తి.తి.దే అందిస్తున్న పురాణం శివమహాపురాణం. ఈ పురాణ అనువాద రచయిత తి.తి.దే హిందూ ధర్మప్రచార పరిషత్ పూర్వకార్యదర్శి, పురాణ ప్రవచన ధురీణ స్వర్గీయ డా॥ పమిడి కాల్వ చెంచుసుబ్బయ్యగారు. అనువదితపురాణాలను పండితపరిషత్తుచే సంస్కరించి నిర్దుష్టంగా ముద్రించడానికి కృషిచేసిన డా॥ ఆకెళ్ళ విభీషణశర్మగారిని అభినందిస్తున్నాను. ఇలాగే భవిష్యత్తులో తదితర పురాణాలు వెలువడగలవని ఆశిస్తున్నాను.

సదా శ్రీవారి సేవలో

జె.శ్యామల రావు, ఐ.ఏ.యస్.,

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు.

నివేదన

భారతీయ సంప్రదాయం సనాతనమయింది. ఈ సంప్రదాయం ధర్మ అర్థ కామ మోక్షాలనే పునాదిపై సమస్త మానవాళికి దిశానిర్దేశం చేస్తున్నది. వీటిలో మోక్షం ఉత్తమపురుషార్థంగా మహర్షులు తీర్మానించారు. ఈ పురుషార్థసాధనకు వేద వేదాంగ ఇతిహాసపురాణాలు ఉపాయాలని కూడా సూచించారు. అయితే సామాన్య జనావళికి అపౌరుషేయమయిన వేదసారం గ్రహించడం కష్టసాధ్యం. ఆ కారణంగా వేదవ్యాసులవారు వేదరాశిని విభజించి మార్గం సుగమం చేశారు. అయినా ఈ విభాగం సరిపోదని తరువాత కాలంలో పురాణాల రచన కూడా చేశారు. ఎంతగా విశదీకరించినా నేటి జనావళికి పురాణాలు అతిప్రాచీనములనే భావన ఉండనే ఉంది. కాని ఇది సరికాదు. పురాణాలెంత ప్రాచీనమయినా ఎన్నో మార్పులకు లోనవుతున్న ఈనాటి సమాజానికి కూడా సదుపదేశాన్ని అందిస్తున్నాయి. ఇందుకు ప్రధానకారణం పురాణరచనావిధానమే. పురాణాల ద్వారా శ్రుతిస్మృతులలోని అంశాల అవగాహన సులభగ్రాహ్యమవుతుంది. ఇందుకు ప్రమాణ శ్లోకం –

యన్నదృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।
ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥

ప్రాచీనులు వైదిక వాఙ్మయ అధ్యయనాన్ని ప్రోత్సహిస్తూ పురాణాధ్యయనం తప్పక చేయాలన్నారు. అలా చేయకపోతే విచక్షణుడు కాలేడని కూడా తీర్మానించారు. ఇందుకు ప్రమాణం ఛాందోగ్యోపనిషత్ శ్లోకం. ఈ శ్లోకం సామాన్యులు చెప్పింది కాదు. వక్త నారదుడు. పృచ్ఛకుడు సనత్కుమారుడు. త్రిలోకసంచారి, సకల లోకహితాన్ని కోరే నారదమహర్షి సవినయంగా తనకు నాలుగు వేదాలు, ఇతిహాస, పురాణ, పరిజ్ఞానముందని ఆత్మప్రత్యయంతో చెప్పినమాట ఇది.

పురాణాల విభాగం

పురాణవాఙ్మయకర్త వేదవ్యాసులవారే. విష్ణురూపుడయిన వ్యాసులవారి మహాపురాణాలు, ఉపపురాణాలు, ఆర్షధర్మానికి మిత్రసమ్మితాలుగా వెలుగొందుతున్నాయి. ఆ మహాపురాణాలు – బ్రహ్మ, పద్మ, విష్ణు, శివ, శ్రీమద్భాగవత, నారద, మార్కండేయ, అగ్ని, భవిష్య – బ్రహ్మవైవర్త, లింగ, వరాహ, వామన, కూర్మ, మత్స్య, గరుడ, స్కాంద బ్రహ్మాండనామకాలు. ఇలాంటి మహాపురాణాలలో నాల్గవది శివపురాణం. ఈ పురాణానికి వాయుపురాణమనే పేరుంది.

శివమహాపురాణంలో విద్యేశ్వరసంహిత, రుద్రసంహిత, శతరుద్రసంహిత, కోటిరుద్రసంహిత, ఉమాసంహిత, కైలాససంహిత, వాయవీయసంహిత అనే ఏడు సంహితలున్నాయి. రెండవదైన రుద్రసంహితలో

సృష్టిఖండం, సతీఖండం, పార్వతీఖండం, కుమారఖండం, యుద్ధఖండమనే ఐదు ఖండాలున్నాయి. గ్రంథం ప్రారంభం నుండి రెండవదైన రుద్రసంహితలోని సృష్టిఖండం వరకు శివమహాపురాణం మొదటిభాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారి పురాణేతిహాసప్రాజెక్టు ద్వారా ప్రచురింపబడుతోంది.

శివమహాపురాణం మొదటి భాగంలో శివపురాణమాహాత్మ్యం, విద్యేశ్వరసంహిత, రుద్రసంహిత, సృష్టిఖండము అనే అంశాలున్నాయి. శివపురాణమాహాత్మ్యంలో ఏడు అధ్యాయాలు, మూడువందల డెబ్బైమూడు శ్లోకాలు, విద్యేశ్వరసంహితలో ఇరవై ఐదు అధ్యాయాలతో పదిహేను వందల ముప్పై ఏడు శ్లోకాలున్నాయి. రుద్రసంహితలో సృష్టిఖండం ఇరవై అధ్యాయాలు, పన్నెండు వందల ఇరవై రెండు శ్లోకాలను కలిగి ఉంది. ఈ విధంగా శివమహాపురాణం మొదటిభాగం గ్రంథ ప్రారంభంనుండి రుద్రసంహిత-సృష్టిఖండం వరకు మూడువేల నూటముప్పై రెండు శ్లోకాల తెలుగు అనువాదంతో పురాణపాఠకుల కోసం ప్రచురించబడుతోంది.

మునులలో శ్రేష్ఠుడైన శౌనకుడు మహాజ్ఞానియైన సూతమహామునిని 'ఓ మహర్షి'! కలియుగంలో మానవులు తమోగుణం ఎక్కువ కావడంతో రాక్షసప్రవృత్తితో జీవిస్తున్నారు. ఏ ఉపాయంతో వారు చెడుస్వభావాన్ని వదలి మంచి పనులు చేస్తూ శివైక్యం పొందుతారో అటువంటి పురాణకథాసారాన్ని మాకు తెలియజేయమని అడిగాడు. పరమశివుడే స్వయంగా శివమహాపురాణాన్ని సనత్కుమారునికి ఉపదేశించగా, సనత్కుమారుడు మానవుల హితం కోరి వ్యాసునికి ఉపదేశించగా, వ్యాసుడు సూతునికి చెప్పాడు. సూతుడు శివపదప్రాప్తికి సాధనమైన శివమహాపురాణాన్ని శౌనకమహర్షికి వినిపించాడు. ఏడు సంహితలతో ఉన్న ఈ శివమహాపురాణాన్ని భక్తిశ్రద్ధలతో చదివే మానవుడు ముక్తిని పొందుతాడని శివపురాణమాహాత్మ్యంలో సూతుడు శౌనకునికి వివరించి చెప్పాడు.

దీనిని బలపరచడానికి చెడునడత కల దేవరాజు అనే బ్రాహ్మణుడు ఒకరోజు అనుకోకుండా శివాలయానికి వెళ్ళి జ్వరంతో కదలలేని స్థితిలో ఉండిపోయి శివపురాణాన్ని విని మరణం తరువాత శివపదాన్ని చేరినట్లు అతని వృత్తాంతం వివరించబడింది.

శివపురాణం విన్నంత మాత్రానే శివసాయుజ్యాన్ని చేరతారని చెప్పడానికి మూడవ అధ్యాయంలో చంచులా వృత్తాంతం వివరంగా చెప్పబడింది. నీచమైన జీవితం గడిపి ముసలితనంలో చంచుల దైవయోగంవల్ల బంధువులతో కలిసి గోకర్ణక్షేత్రాన్ని చేరి అక్కడ శివపురాణం విని వైరాగ్యంతో మంచి పనులు చేసింది. మరణం తరువాత కైలాసాన్ని చేరడమేగాక, గొప్ప స్తోత్రాలతో పార్వతీదేవిని తృప్తిపరచి తన భర్తయైన బిందుగునికి కూడా శివసాయుజ్యాన్ని కలుగజేసింది.

ఈ విధంగా శివపురాణమాహాత్మ్యాన్ని సూతుడు శౌనకునికి తెలియజేసాడు. శివపురాణమాహాత్మ్యంలోని ఆరవ అధ్యాయంలో శివపురాణం వినే విధివిధానాలు చెప్పబడ్డాయి. ఏడవ అధ్యాయంలో శివపురాణం వినడానికి

యోగ్యులెవరు? వారి నియమాలేవి? శివపురాణం విన్నవారు, విన్న తరువాత ముగింపును ఏ విధంగా నిర్వర్తించాలి? అనే విషయాలు సూతమహర్షి వివరించి చెప్పాడు.

ఏడు సంహితలతో కూడిన శివమహాపురాణంలో ఇరవై ఐదు అధ్యాయాలతో శోభిల్లుతున్న విద్యేశ్వర సంహిత మొదటిది. సృష్టి, స్థితి, లయం, తిరోధానం, అనుగ్రహమనే ఐదు కర్మలను అవలీలగా చేసే అంబికాపతియైన శంకరునికి నమస్కారమన్న మంగళశ్లోకంతో విద్యేశ్వరసంహిత ప్రారంభమయ్యింది. గంగాయమునల సంగమం, పరమ పుణ్యక్షేత్రమైన ప్రయాగలో మహాసత్రయాగం జరుగుతోందని విని, వ్యాసశిష్యుడు పౌరాణికులలో ఉత్తముడైన సూతమహర్షి అక్కడి వచ్చాడు. అక్కడ ఉన్న మహర్షులు ఆనందంతో అతనికి భక్తిశ్రద్ధలతో సేవలు చేసి,

లఘూపాయేన యేనైషాం భవేత్ సద్యోఽఘనాశనమ్ ।
సర్వసిద్ధాంతవిత్త్వం హి కృపయా తద్వదాధునా ॥

ఓ సూతమహర్షి! నీవు వ్యాసుని ద్వారా పురాణజ్ఞానాన్ని పొందావు. కలియుగంలో మానవుల పాపాలను సులభంగా పోగొట్టే ఉపాయాన్ని చెప్పవలసిందని ప్రార్థిస్తే, సూతమహర్షి శివమహాపురాణాన్ని వినిపించాడు. ఆ పురాణ గొప్పతనాన్ని చెబుతూ –

శైవం పురాణతిలకం ఖలు సత్పురాణం ।
వేదాంతవేదవిలసత్పరవస్తుగీతమ్ ॥

శైవపురాణం ఉపనిషత్తుల సారమని ప్రశంసించాడు. సూతమహర్షి మాటలు విన్న మహర్షులు వేదాంతసారసర్వస్వమైన శివమహాపురాణాన్ని వినిపించమని సూతుని ప్రార్థించారు.

విద్యేశ్వరసంహిత నాలుగవ అధ్యాయంలో పరమశివుని కథలను వినడం, స్మరించడం, కీర్తించడమనే విధివిధానములు చెప్పబడ్డాయి. ఈ మూడే ముక్తికి ఉపాయాలు. శ్రవణ, మనన, కీర్తనలనే మూడింటిని ఆచరించటానికి సామర్థ్యములేని మానవులు ఏ కర్మలు చేస్తే ముక్తి లభిస్తుందని తిరిగి మహర్షులు ప్రశ్నించారు. ఈ సందర్భంలో సూతముని ఐదవ అధ్యాయంలోని శివలింగమహిమను వారికి విస్తారంగా ప్రబోధించాడు.

శ్రవణాదిత్రికేఽశక్తో లింగబేరం చ శాంకరమ్ ।
సంస్థాప్య నిత్యమభ్యర్చ్య తరేత్సంసారసాగరమ్ ॥

లింగమూర్తిలో శివుని ఆవాహన చేసి ప్రతినిత్యం పూజించినవాడు సంసారసాగరాన్ని దాటగలడు. ఆరవ అధ్యాయంలో బ్రహ్మవిష్ణుసంగ్రామం వర్ణించబడింది. వారిద్దరి మహాసంగ్రామాన్ని చూచి భయపడిన దేవతలు

కైలాసాన్ని చేరి సంగ్రామవృత్తాంతాన్ని విన్నవించారు. అప్పుడు శివుడు అగ్నిస్తంభరూపం ధరించి వారిద్దరి మధ్య నిలిచాడు. బ్రహ్మవిష్ణువులు ఎంత ప్రయత్నించినా అగ్నిస్తంభం మొదలు చివరలను కనుక్కోలేకపోయారు. చివరికి వారిద్దరు పశ్చాత్తాపంతో శివుణ్ణి అనుగ్రహించమని అర్థించారు. అగ్నిస్తంభం ఏర్పడిన ఆ ప్రదేశం అరుణాచలంగా ప్రసిద్ధిచెందుతుందని, లింగాకారస్తంభాన్ని ప్రతిరోజు పూజించమని శివుడు వారిద్దరికి చెప్పాడు.

ఈ పురాణం పదకొండవ అధ్యాయంలో లింగప్రతిష్ఠ ఎలా చేయాలి? లింగలక్షణాలేవి? దానిని ఏవిధంగా, ఏ సమయంలో పూజించాలి మొదలైన విషయాలు విశదీకరించబడ్డాయి.

విద్యేశ్వరసంహితలో శైవక్షేత్రాలు, తీర్థాలు, అగ్నియజ్ఞ-దేవయజ్ఞ-బ్రహ్మయజ్ఞాలు, పార్థివలింగపరిమాణం, దాని పూజావిధానం, పంచాక్షరీ మంత్రమహిమ, శివలింగపూజమాహాత్మ్యం, భస్మధారణం, రుద్రాక్షల మాహాత్మ్యం మొదలైన విషయాలు చక్కగా వివరించబడ్డాయి.

"శివనామకుఠారేణ వినాశో జాయతే ధ్రువమ్"

శివనామమనే గొడ్డలితో సంసారానికి మూలకారణమైన పాపాలన్నీ నశిస్తాయనే ఉపాయాన్ని కూడా సూతుడు శౌనకాది మునులకు ఉపదేశించాడు.

రుద్రసంహితవిశేషాలు సృష్టిఖండంలో ఇరవై అధ్యాయాలుగా ఉన్నాయి. శౌనకాది మహర్షులు సూతుని 'ఓ మహాత్మ! శివస్వరూపాన్ని, శివపార్వతుల దివ్యచరితను చెప్పమని అడిగారు. అప్పుడు సూతుడు 'మహర్షులారా! ఒకప్పుడు నారదుడు శివస్వరూపమైన విష్ణువుచేత ప్రోత్సహించబడి తన తండ్రి బ్రహ్మను మీరు అడిగినట్లు అడిగాడు. బ్రహ్మనారద సంవాదాన్ని మీ ప్రశ్నలకు సమాధానంగా వినిపిస్తానని చెప్పాడు. రెండవ అధ్యాయం నుండి నారదుని తపస్సు, అతనిని మాయ ఆవరించడం మొదలైనవి వర్ణింపబడ్డాయి. ఒకప్పుడు నారదుడు హిమపర్వత సమీపంలో గంగానదీతీరంలోని ఆశ్రమంలో చాలాకాలం తపస్సు చేసాడు. ఇది తెలుసుకొని ఇంద్రుడు తన పదవిని కోరి తపస్సు చేస్తున్నాడనే భ్రమతో, మన్మథునితో మునితపస్సును భంగం చేయమని చెప్పాడు. కాని శివమాయవల్ల నారదుడు తపస్సు చేసే ప్రాంతంలో మన్మథుని శక్తి పనిచేయలేదు. తపస్సు పూర్తైన తరువాత మన్మథునిపై విజయం తన గొప్పతనమని భావించి శివమాయలో పడి ఈ మన్మథుని జయించిన విషయం శివునికి చెప్పాలని కైలాసానికి వెళ్ళాడు. అప్పుడు శివుడు నారదునితో ఈ విషయం మరెవరితోను చెప్పవద్దని చెప్పాడు. కాని శివమాయతో ఉన్న నారదుడు విష్ణువు దగ్గరికి వెళ్ళి అహంకారంతో జరిగినదంతా చెప్పాడు. కాని విష్ణువు నారదునికి శివమాయద్వారానే మన్మథవిజయము సాధ్యమైందని శివస్మరణతో తెలుసుకున్నాడు. దాన్ని విష్ణువు ప్రబోధించగా చివరికి నారదునికి ఆవహించిన శివమాయ తొలగిపోయింది. వివేకంతో జరిగిన వ్యవహారాన్ని తలచుకుని దుఃఖించిన నారదునికి విష్ణువు -

"స స్రష్టా సర్వలోకానాం, స ఏవ త్రివిధః ప్రభుః"

ఆ పరమేశ్వరుడే బ్రహ్మ–విష్ణు–రుద్రరూపాన్ని ధరించి సృష్టిస్థితిలయకారకుడైనాడు. బ్రహ్మవిష్ణు స్తోత్రాలకు తృప్తిపడిన శివుడు ప్రత్యక్షమై విష్ణువుకు శ్వాసద్వారా వేదాన్ని అందించాడు. శివస్వరూపులైన బ్రహ్మవిష్ణురుద్రులు ముగ్గురు క్రమంగా వాగ్దేవి–లక్ష్మి–కాళి అనే మూడు శక్తుల సహకారంతో సృష్టిస్థితిలయలకు కారణమౌతారని పరమేశ్వరుడు అనుగ్రహించాడు. ఈ విధంగా పదవ అధ్యాయం వరకు శివతత్త్వం చాలా వైభవంగా అభివర్ణించ బడింది.

పదకొండవ అధ్యాయం నుండి పదునాల్గవ అధ్యాయం వరకు శివపూజలోని వివిధ పద్ధతులను సూతుడు మహర్షులకు ఉపదేశించాడు. బ్రహ్మవిష్ణువులకు సృష్టిస్థితిరూపకార్యాలను అప్పగించి శివుడు అంతర్ధానంకాగా, వారిద్దరు జగత్తును సృష్టించాలి, పాలించాలనే కోరికతో హంసవరాహరూపాల్ని ధరించారు. ఏ రోజైతే విష్ణువు వరాహరూపాన్ని ధరించాడో ఆనాటి నుండి మొదలైన కల్పానికి 'వరాహకల్ప'మనే పేరొచ్చింది. పదహారవ అధ్యాయంలో సృష్టిక్రమం చాలా వైజ్ఞానికంగా వివరించబడింది.

బ్రహ్మ నారదునితో శివుని కైలాసయాత్ర, అలకాధిపతి యక్షరాజు కుబేరునితో మైత్రి మొదలయిన విషయాలను గురించి సూతుడు మహర్షులకు వివరించాడు. కాంపిల్యనగరంలో వేదవిద్యావిశారదుడైన యజ్ఞదత్తుడనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతనికి గుణనిధి అనే పుత్రుడున్నాడు. ఉపనయనం తరువాత చాలా విద్యలను నేర్చిన గుణనిధి జూదంలో ఆసక్తిని పెంచుకొని సదాచారాలను విడిచి, దేవ బ్రాహ్మణులను నిందిస్తూ, చెడు సహవాసాలకు లోనయ్యాడు. తండ్రి యజ్ఞదత్తుడు తన భార్యను పుత్రుని గురించి ఎప్పుడు అడిగినా ఏదో ఒకటి చెబుతూ కొడుకు చేసే చెడుపనులను కప్పిపుచ్చుతూ భర్తను మోసగించేది. గుణనిధికూడా తల్లిమాటలను పట్టించుకునేవాడు కాదు. చివరకు కొడుకు చెడుపనులు, భార్య అసలు విషయం దాచి కొడుకును వెనక్కి వేసుకొని చేసిన మోసాన్ని తెలిసి యజ్ఞదత్తుడు పుత్రుని విడిచిపెట్టాడు. అదేరోజు సాంసారిక బాధ్యత పాటించక పుత్రప్రేమతో భార్యచేసిన మోసానికి ప్రతీకారంగా ఆమెను విడిచివేసి, మరో బ్రాహ్మణకుమార్తెను వివాహం చేసుకొన్నాడు. తండ్రిచేత విడువబడిన గుణనిధి తను చేసిన పూర్వపు చెడుపనులకు పరితాపం చెందాడు. ఏమీ తోచక ఆకలితో బాధపడుతూ గ్రామాంతరంలోని ఒక శివాలయంలో ఎవరో భక్తులు నివేదించిన వంటకాలను దొంగతనంగా తిన్నాడు. రక్షకభటులు ఆ గుణనిధిని దొంగ అని భావించి బాగా కొట్టారు. మరణం తరువాత గుణనిధి శివైక్యాన్ని పొందాడని ఇందుకు కారణం శివప్రసాదమహిమ అని వర్ణించబడింది. పంతొమ్మిదవ అధ్యాయంలో శివకుబేరమైత్రి, ఇరవైయవ అధ్యాయంలో కైలాసయాత్ర ఘనత చెప్పబడింది.

నాటి అరుణాచలం నేటి తిరువణ్ణామలై. ఇటీవలి కాలంలో విభిన్నప్రాంతాలవారు తిరువణ్ణామలైయాత్ర చేస్తున్నారు. ప్రతి పున్నమిరోజూ గిరిప్రదక్షిణం చేస్తున్నారు. కార్తికమాసంలో తిరువణ్ణామలై దీపోత్సవదర్శనానికి ఉత్సాహం చూపుతున్నారు. ఈ అగ్నిపర్వతరహస్యం, అగ్నిలింగప్రాదుర్భావకారణం సమగ్రంగా తెలియడానికి శివపురాణం చక్కని మణిదర్పణం.

ఈ శివపురాణంలోని 'గుణనిధి' కథ తెలుగువారికి అందించిన కవిసార్వభౌముడు శ్రీనాథమహాకవి. కాశీఖండంలో ఒక భాగంగా గుణనిధిచరిత్రను రమ్యంగా తీర్చిదిద్దాడు. మార్కండేయపురాణం అనేక కథలకు పుట్టిల్లు. అలాగే ఈ శివపురాణం కూడా అనేక కథలకు ఆకరం. పైపెచ్చు శివపూజావిధానం, పురాణశ్రవణ విధానమనే వాటిని సాధికారికంగా విశదం చేసే పురాణం ఇది. ఈ భాగాన్ని అనువదించిన అవధానకేసరి, మహాపండితులు డా॥ పమిడికాల్వ చెంచుసుబ్బయ్య గారికి, అలాగే పురాణపండితపరిషత్తు విద్వాంసులకు నా సాదర కృతజ్ఞతాంజలి.

ఇమాం కథాం పఠేద్యస్తు శృణుయాద్వా సమాహితః ।
ఇహ భుక్తిం సమాసాద్య లభేన్ముక్తిం పరత్ర సః ॥

ఈ శివపురాణగాథలను శ్రద్ధగా చదివినవారు, విన్నవారు ఈ లోకంలో సుఖాన్ని పొంది చివరికి మోక్షాన్ని పొందుతారని ఫలశ్రుతి.

శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే

డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ
ప్రత్యేకాధికారి, పురాణ ఇతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు

పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు



బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ । వైష్ణవం దక్షిణో బాహు: వాయుర్వామో మహేశితు: ॥
ఊరూ భాగవతం ప్రోక్తం నాభి: స్యాన్నారదీయకమ్ । మార్కండేయం చ దక్షాంఘ్రి: వామో హ్యాగ్నేయముచ్యతే ॥
భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మన: । బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృత: ॥
లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ । స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥
కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేధ: ప్రకీర్త్యతే । మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణు: పురాణావయవో హరి: ।

శివపురాణ కథాసారం

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరనారాయణులకు, సరస్వతీదేవికి, వేదవ్యాసమహామునికి నమస్కరించి, అటు పిమ్మట జయశబ్దనామకమైన మహాభారతాన్ని, పద్దెనిమిది పురాణాలను ప్రవచనం చేయాలని ఆర్యోక్తి, ఐహిక, ఆముష్మిక ఫలాలను రెంటినీ సిద్ధింపచేసేది పురాణపఠనం.

"ఆత్మావాఽరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః" అని ఉపనిషద్వచనము, వేదాన్తములంటే వేదములయొక్క చివరిభాగాలు ఉపనిషత్తులని అర్థము. అట్టి వేదాన్తవాక్యాల శ్రవణము, మననము, నిదిధ్యాసనము (ధ్యానము)ల వల్ల ఆత్మసాక్షాత్కారం అనగా మోక్షం లభిస్తుందని ఆపైన చెప్పిన వేదాన్తవాక్యానికి అర్థం. అయితే అందరూ వేదాలను అధ్యయనం చేయలేరు. మరి సామాన్యులకి మోక్షం లభించే అవకాశమే లేదా? అన్న ప్రశ్నకు ఈ పురాణంలో సమాధానం మరియు మోక్షాన్ని పొందే ఉపాయము ఈ రెండూ ఈ విధంగా చెప్పబడ్డాయి.

"శ్రవణాదిత్రికేఽశక్తో లింగబేరం చ శాంకరమ్ ।
సంస్థాప్య నిత్యమభ్యర్చ్య తరేత్సంసారసాగరమ్" ॥ అని (విద్యేశ్వరసంహిత 5-1)

వేదాన్తవాక్యాల శ్రవణ, మనన, నిదిధ్యాసనములను ఆచరించుటలో సామర్థ్యము లేనివాడు లింగమందు, మూర్తియందు (ఆకారమందు) శంకరుని ఆవాహనము చేసి ప్రతిరోజు అర్చించినచో సంసారసాగరాన్ని దాటగలడు అనగా మోక్షాన్ని పొందగలడని అర్థం.

"శ్రవణం కీర్తనం శంభోర్మననం చ మహత్తరమ్ ।
త్రయం సాధనముక్తం చ విద్యతే వేదసమ్మతమ్" ॥ (విద్యేశ్వరసంహిత 4-16)

పరమశివుని నామమును వినుట, కీర్తించుట, మననము చేయుట అనగా మరలమరల మనస్సులో జపించుట ఈ మూడు మోక్షమును పొందుటలో గొప్ప వేదసమ్మతమైన సాధనములుగా చెప్పబడినవి. అని అర్థం.

అందువల్లనే "ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్" అని ఆర్యోక్తి ఏర్పడినది. రామాయణ మహాభారతాది ఇతిహాస గ్రంథాలవల్లా, పురాణాలవల్లా వేదాలలో నిక్షిప్తమైన అనేక అమూల్యమైన విషయాలను తెలుసుకోవచ్చని అర్థం. అందువల్లనే వ్యాసభగవానుడు జనులందరిపై ఉన్న కరుణాదృష్టితో అష్టాదశ మహాపురాణాలను రచించి మనకి అందించాడు. ఈ పురాణాలన్నింటిలో మనం జన్మించిన తర్వాత ఈ లోకంలో తప్పక ఆచరించతగిన కర్మల విచారం, మోక్షసాధనమైన ఆత్మవిచారం ఈ రెండు కనిపిస్తాయి గావున పురాణాలు ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధపురుషార్థాలను సిద్ధింపచేస్తాయనడంలో సందేహం లేదు. ఈ పద్దెనిమిది పురాణాలలో ఏ పురాణానికున్న వైశిష్ట్యం ఆ పురాణానికుంది. ప్రస్తుత శివపురాణం గ్రంథంలో శివపురాణం యొక్క వైశిష్ట్యం ఈ విధంగా వర్ణింపబడింది.

"శ్రీమత్ శివపురాణం తు పురాణతిలకం స్మృతమ్ ।
మహత్ శివప్రియం రమ్యం భవరోగనివారణమ్" ॥ అని (విద్యేశ్వరసంహిత 7-48)

పురాణాలన్నింటిలో శ్రేష్టమైన ఈ శ్రీమత్ శివపురాణం ఈశ్వరునికి ఎంతో ప్రియమైనది. చాలా అందమైనది. సంసారబాధలను తొలగిస్తుంది అని అర్థం. సూతమహర్షులవారిచే శౌనకమహర్షికి ఈ పురాణం బోధింపబడింది.

శ్రీ శౌనకమహర్షి శ్రీ సూతమహర్షులవారిని ఈ పురాణం ఆరంభంలో ఇలా ప్రశ్నిస్తాడు.

"యేన తత్సాధనేనాశు శుద్ధ్యత్యాత్మా విశేషతః ।
శివప్రాప్తిర్భవేత్తాత సదా నిర్మలచేతసః" ॥ అని (విద్యేశ్వర సంహిత 1-5)

ఓ సూతమహర్షీ! ఏ సాధనం వల్ల మనస్సు సంపూర్ణంగా పరిశుద్ధమవుతుంది? ఇంకను నిర్మలమైన మనస్సు కలవానికి ఏ విధంగా శివపదప్రాప్తి సిద్ధిస్తుంది?

ఈ ప్రశ్నకు సమాధానంగా సూతమహర్షి ఈ విధంగా బదులిచ్చాడు.

"ఏతచ్ఛివపురాణం హి పరమం శాస్త్రముత్తమమ్
శివరూపం క్షితా జ్ఞేయం సేవనీయం చ సర్వథా ।
పఠనాచ్ఛ్రవణాదస్య భక్తిమాన్ నరసత్తమః ।
సద్యశ్శివపదప్రాప్తిం లభతే సర్వసాధనాత్" ॥ అని (విద్యేశ్వర సంహిత 1-12,13)

ఈ శివపురాణం ఉత్తమమైన గొప్పశాస్త్రం. ఆ పరమశివుని రూపాన్ని జనులందరు తెలుసుకోవాలి, సేవించాలి కూడా. భక్తిమంతుడైన మానవశ్రేష్ఠుడు ఈ పురాణాన్ని చదివినా విన్నా కూడా సమస్తసాధనలు సిద్ధించి వెంటనే శివపదప్రాప్తిని పొందుతాడు. అని అర్థం. అంతేకాదు, సూతమహర్షి ఇంకా ఇలా అంటాడు.

"యే శృణ్వన్తి మునే! శైవం పురాణం శాస్త్రముత్తమమ్ ।
తే మనుష్యా న మన్తవ్యా రుద్రా ఏవ న సంశయః" ॥ అని (1-18)

ఓ శౌనకమహర్షీ! ఉత్తమశాస్త్రమైన ఈ శివపురాణాన్ని ఏ జనులయితే వింటారో వాళ్ళు సామాన్యమానవులు కారు, రుద్రస్వరూపులే. ఇందుకు సందేహము లేదు.

ఈ విధంగా అష్టాదశపురాణాలలో ఈ పురాణానికి ఒక విశిష్టస్థానం ఉంది. "ఏతచ్ఛివపురాణం హి సప్తసంహితమాదరాత్" అని ఈ శివపురాణంలో ఏడు సంహితలున్నాయని గ్రంథంలో చెప్పబడింది. అవి వరుసగా 1) విద్యేశ్వరసంహిత 2) రుద్రసంహిత 3) శతరుద్రసంహిత 4) కోటిరుద్రసంహిత 5) ఉమాసంహిత 6) కైలాససంహిత 7) వాయవీయసంహిత అని.

ఈ పురాణం ఆరంభంలో రెండవ అధ్యాయంలో మహాపాపి అయిన దేవరాజు వేశ్యాలోలుడై, మద్యపాన ప్రియుడై, తల్లిదండ్రుల్ని, భార్యనీ చంపి కూడా అనుకోకుండా ఒక శివాలయాన్ని ప్రవేశించడం, అక్కడ శివపురాణ ప్రవచనాన్ని వినడం వల్ల అంత్యకాలంలో శివపదాన్నిచేరిన వృత్తాంతాన్ని చూడవచ్చు. 3,4,5 అధ్యాయాలలో

చంచులాబిందుగుల కథావృత్తాంతం శివగాథల మహిమ ఎట్టిదో చక్కగా వివరిస్తుంది. నైచ్య జీవితం గడిపిన చంచుల ఒకసారి బంధువులతో గోకర్ణక్షేత్రానికి వెళ్ళింది. అచ్చట ఒక దేవాలయంలో ఆమె ఈశ్వరుని పురాణగాథను విన్నది. వ్యభిచారం చేసే స్త్రీలు నరకలోకంలో ఎట్టి బాధలను అనుభవిస్తారో ఆమె ఆ పురాణశ్రవణంలో విని భయంతో వణుకుతూ బ్రాహ్మణుడగు ఆ ప్రవచనకర్తను పాపపరిహారానికి ఉపాయాన్ని కోరింది. అంతట ఆ ప్రవచనకర్త ఇలా బదులిచ్చాడు.

"ఏతత్ శివపురాణస్య కథాశ్రవణతో యథా
జాయతే చిత్తశుద్ధిర్హి న తథాన్యైరుపాయతః ।
శోధమానం దర్పణం హి యథా భవతి నిర్మలమ్
తథైతత్కథయా చేతః విశుద్ధిం యాత్యసంశయమ్" ॥ అని

ఈ శివపురాణగాథను విన్నందువల్ల చిత్తశుద్ధి కలిగినట్లుగా, మరి ఏ ఇతర ఉపాయాలతోనూ సిద్ధించదు. మాలిన్యము తొలగింపబడిన అద్దం ఎంత నిర్మలంగా ఉంటుందో అట్లే ఈ శివపురాణగాథల శ్రవణమువల్ల కూడా మనస్సు నిర్మలమవుతుంది. ఇందు సందేహము లేదు. అని అర్థం. అంతట శైవకథలను వినిపించి తనను ఉద్ధరించవలసిందిగా చంచుల ఆ బ్రాహ్మణుని కోరింది. శివభక్తులలో అగ్రగణ్యుడయిన ఆ బ్రాహ్మణుడు వెంటనే ఆమెకు ఉత్తమమైన శివపురాణాన్ని వివరించాడు. భక్తిజ్ఞానవైరాగ్యాలను పెంపొందించి, ముక్తిని ప్రసాదించే శివపురాణగాథను విని చంచుల కృతార్థురాలయ్యింది. అంత్యకాలంలో ఆమె శివపార్వతుల సాన్నిధ్యాన్ని చేరింది, దివ్యరూపిణియగు పార్వతీదేవి చంచులను అత్యంతప్రేమతో సఖురాలిగా చేసుకొని ఆమెకు గొప్ప ఆనందాన్ని కలిగించింది.

ఒకనాడు చంచుల చేతులు జోడించుకొని పార్వతీదేవిని ఇలా అడిగింది. "ఓ పుణ్యురాలా! నా భర్త బిందుగుని జాడ తెలియడం లేదు. ప్రస్తుతం ఎక్కడ ఉన్నాడు? దయతో నేను నా భర్తతో కలిసి ఉండేటట్లు అనుగ్రహించు" అని, చంచుల అనేకమార్లు పార్వతీదేవిని ప్రార్థించగా భక్తవత్సల అయిన పార్వతదేవి ప్రసన్నురాలయింది. అంతట ఆమె శివపురాణాన్ని చక్కగా గానం చేయగల తుంబురుడనే గంధర్వరాజును పిలిపించి, శివపురాణగాథను పిశాచరూపంలో ఉన్న బిందుగునికి వినిపించమని కోరింది. పిశాచరూపంలో ఉన్న బిందుగుని పాశాలతో బంధించి కూర్చోబెట్టి తుంబురుడు వీణ చేతబట్టి శివపురాణాన్ని గానం చేసాడు. ఏడు సంహితలతో కూడిన శివపురాణాన్ని విని పిశాచరూపంలో ఉన్న బిందుగుడు సమస్తపాపములు తొలగినవాడై, పిశాచదేహాన్ని త్యజించి, ఈశ్వరుని సన్నిధికి చేరాడు.

పైన చెప్పబడిన కథ ఆధారంగా ఈ శివపురాణం పుణ్యప్రదం, పాపనాశకం, నిర్మలం, భక్తివర్ధకమనీ, ఇంకా పార్వతీపరమేశ్వరులకు పరమానందాన్ని కలిగిస్తుందనీ తెలుస్తుంది. శివపురాణాన్ని ఎలా వింటే సంపూర్ణమైన ఉత్తమఫలితాలు లభిస్తాయో ఆరవ అధ్యాయంలో చెప్పబడింది. అన్నిటా భగవంతుని చూస్తూ శివపూజా విధానానుగుణంగా ఈ గ్రంథాన్ని పూజించి, నవగ్రహాలను కూడా పూజించి ప్రవచనకార్యక్రమాన్ని ప్రారంభించి శ్రవణం చేయాలి. ఏడు సంహితలతో కూడిన ఈ శివపురాణాన్ని భక్తి-విశ్వాసాలతో పఠించేవాడు జీవన్ముక్తుడవుతాడు.

భ్రమలను గొల్పే ఎన్ని శాస్త్రాలు, పురాణాలు ఉన్నా ఏమి ప్రయోజనం? ఒక్క శివపురాణాన్ని మాత్రం వినడంతోనే ముక్తి లభిస్తుందని చెప్పబడింది. కథాశ్రవణదీక్షను ఎవరు స్వీకరిస్తారో వారు మాత్రమే శివపురాణగాథను వినడానికి అర్హులు, ఏడవ అధ్యాయంలో కోరికలున్నవాడైనా, లేనివాడైనా ఈ కథను వినవచ్చును. దానివల్ల కోరికలున్నవారికి కోరికలు నెరవేరుతాయి. కోరికలు లేనివారికి మోక్షం సిద్ధిస్తుంది. పారాయణ పుస్తకానికి, పౌరాణికునికీ చేసే పూజాకార్యక్రమాన్ని గొప్ప ఉత్సవంలా చేయాలని చెప్పబడింది.

శివపురాణ మాహాత్మ్యాన్ని వర్ణించే ఏడు అధ్యాయాలు పూర్తి అయిన తరువాత విద్యేశ్వరసంహితయను మొదటి సంహిత ప్రారంభమవుతుంది. ధర్మానికి నిలయము, మహాక్షేత్రము, గంగాయమునల సంగమప్రదేశము, బ్రహ్మలోకానికి మార్గము, పరమపుణ్యప్రదమూ అయినది ప్రయాగక్షేత్రము. అట్టి ప్రయాగక్షేత్రంలో ఇంద్రియాలను జయించిన మహర్షులు మహాసత్రయాగాన్ని ఆచరించారు. ఆ మహాసత్రయాగాన్ని చూడటానికి వ్యాసభగవానుని శిష్యుడు, పురాణవేత్తలలో శ్రేష్ఠుడూ అయిన సూతమహాముని వచ్చాడు. సూతమహామునికి ఇతర మునిపుంగవులు యథావిధిగా సపర్యలు చేసి, స్తుతించి ఇలా పలికారు. “ఓ సూతమహామునీ! అమూల్యమైన రత్నాలకు సముద్రం నిలయమైనట్లుగా, నీవు సకల–పురాణాలకు నీవు ఆకారమై ఉన్నావు. భూతభవిష్యద్వర్తమానములను ఎరుగు నీకు ఈ ముల్లోకాలలో తెలియనిది ఏదీ లేదు. కలియుగం ప్రారంభం కాగానే మానవుల ప్రవర్తనలో చిత్రమైన మార్పులు వస్తాయి. దురాచారాల పట్ల అత్యంతాసక్తి చూపిస్తారు, ఇతరుల ధనాన్ని, పరస్త్రీలను కోరుకుంటారు. దేహమే ఆత్మయనే భ్రమ కలిగి ఉంటారు. వారింకా నాస్తికులై, పశుప్రవర్తన కలిగి తల్లిదండ్రులను ద్వేషించువారై, స్త్రీలను భోగవస్తువుగా భావించువారై కామానికి బానిసలవుతారు, తల్లిదండ్రుల పట్ల ఏ మాత్రము భక్తిలేని పుత్రులు చెడుబుద్ధులు నేర్చి, చెడు చదువులు చదువుతారు, నిత్యమూ రోగాలతో బాధపడుతుంటారు. ఓ సూత మహర్షీ! ఈ విషయాలన్నీ మాకు నిత్యమూ మనసులో చింత కలిగిస్తున్నాయి. అట్టి మానవుల పాపాలు తొలగే తేలిక అయిన ఉపాయం ఏమైనా ఉన్నదా? నీవు సమస్త సిద్ధాంతాలను, తెలిసినవాడవు, కావున దయతో సరి అయిన మార్గాన్ని తెలియచేయుము.” అని.

మహర్షులు పలికిన మాటలను విని సూతమహర్షి మనస్సులో పరమశివుణ్ణి తలచుకొని ఆ మునులతో చెప్పిన విషయాలను శివపురాణపరిచయమనే రెండవ అధ్యాయంలో చూడవచ్చు మునులు అడిగిన ప్రశ్నలకు బదులుగా సూతమహర్షి ఇలా చెప్పడం ప్రారంభించాడు.

“వేదాంతసారసర్వస్వం పురాణం శైవముత్తమమ్ ।
సర్వాఘౌఘోద్ధారకరం పరత్ర పరమార్థదమ్” ॥ అని

“పురాణాలలో శివపురాణం చాలా గొప్పది. ఉపనిషత్తులసారమే ఈ ఉపనిషత్తు. సమస్త పాపాల ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. జీవులు మరణించిన పిమ్మట పరలోకంలో పరమపురుషార్థమైన మోక్షాన్ని ప్రసాదిస్తుంది” అని అర్థం. ఓ మునులారా! ఈ శివపురాణంలో కలిదోషాల్ని నశింపచేసే శక్తి, చతుర్విధ పురుషార్థాలను ప్రసాదించే శక్తి, శివుని కీర్తి అంతటా విస్తారముగా ఉన్నాయి. ఈ శివపురాణాన్ని చదివినంత మాత్రాన సామాన్యమానవులు సైతం శివపదప్రాప్తియనే గొప్ప సద్గతిని పొందుతారు. ఈ శివపురాణమందున్న ఏడు సంహితలను చదివిన వ్యక్తి జీవన్ముక్తుడవుతాడు”, అని.

సూతమహర్షి మాటలను విని, ఉపనిషత్ సారాభూతమైన ఈ అద్భుతమైన పురాణాన్ని వినిపించవలసిందిగా ఆ మునులందరూ సూతమహర్షిని కోరారు. అంతట సూతమహర్షి "రోగాలను నివారించే శివుని తలచుకొని వేదసారంగా లభించిన ఈ శివపురాణాన్ని ఇక్కడున్న మునులందరూ విందురుగాక!" అని పలికి శివనామ మాహాత్మ్యము, శివభక్తిప్రాశస్త్యము మొదలగు విషయాలను చెప్పడం ప్రారంభించాడు. ఈ విషయాలను విద్యేశ్వరసంహితలోని మూడవ అధ్యాయం నుంచి శివనామముయొక్క శ్రవణమననకీర్తనల మహిమను వర్ణించుట ద్వారా చెప్పడం జరిగింది. వేదాంతవాక్యాల శ్రవణమనననిధిధ్యాసనములవల్ల ఆత్మజ్ఞానం సిద్ధిస్తుందని ఉపనిషత్తులలో చెప్పడం జరిగింది. అట్టి ఆత్మజ్ఞానము శివనామము యొక్క శ్రవణమననకీర్తనముల ద్వారా సిద్ధిస్తుంది. లింగమందు, మూర్తియందు శంకరుని ఆవాహన చేసి ప్రతిరోజు అర్చించినచో సంసారమనే సముద్రాన్ని తరించడం సాధ్యమవుతుందని కూడా చెప్పడం జరిగింది. ఇంకనూ సూతమహర్షి ఇలా చెప్పాడు. "ఓ మునిపుంగవులారా! మీరడిగిన ప్రశ్నకు సమాధానము చెప్పగలిగిన పురుషుడు ఆదిదేవుడైన ఆ మహాదేవుడు ఒక్కడు మాత్రమే. ఆ పరమశివుడే స్వతః చెప్పిన విషయాలను గురుముఖతః నేను విన్నవాటిని ఒక క్రమపద్ధతిలో మీకు చెబుతాను. శివుడు ఒక్కడే పరబ్రహ్మస్వరూపుడు. అందువల్లనే ఆయన నిరాకారుడని చెప్పబడుచున్నాడు. శివునకు రూపము కూడా కలదు. అందువలన ఆయన నిరాకారాడు మరియు సాకారుడు కూడా. ఈశ్వరుడు నిరాకారాడు కనుక ఆయన నిరాకారమైన లింగమునందు పూజింపబడుచున్నాడు. అట్లే ఆయన సాకారుడు గనుక సాకారమైన సాకారమైన మూర్తియందు ఆరాధింపబడుచున్నాడు. ఈ విధముగా పరమశివుడు సాకారనిరాకార స్వరూపుడగుటచేతనే పరబ్రహ్మశబ్దముచే చెప్పబడుచున్నాడు. ఇతర దేవతలు ఎవ్వరికీ నిరాకారాత్వము లేదు గనుక వారు పరబ్రహ్మశబ్దముచే చెప్పబడుటలేదు". అని.

ఇక ఆరవ అధ్యాయం ప్రారంభించి బ్రహ్మవిష్ణుసంగ్రామం వర్ణింపబడింది. వారిరువురు 'నేనే గొప్పవాడను, నేను ప్రభువును, నీవు కాదు" అని పరస్పరము మోహమును పొంది కలహించుకోసాగారు. ఒకరిపై ఒకరు అస్త్రములను ప్రయోగించుకోసాగారు. ఆ సమయంలో దేవతలందరు విమానములద్వారా వచ్చి ఆ యుద్ధమును వీక్షించసాగారు. విష్ణువు బ్రహ్మపై మహేశ్వరాస్త్రమును ప్రయోగించగా, బ్రహ్మ మరింత రెట్టించిన కోపముతో విష్ణువుయొక్క ఛాతిభాగమందు పాశుపతాస్త్రాన్ని ప్రయోగించాడు. ఈ రెండు అస్త్రాలు లోకాలన్నింటికి భయమును కొల్పసాగినవి. వీరి యుద్ధమును చూచి దేవతలందరు కంగారుపడి కైలాసశిఖరమందు కొలువైయున్న ఓంకారస్వరూపుడగు శివుని వద్దకు వెళ్ళి శివునికి నమస్కరించారు. అంతట పరమేశ్వరుడు దేవతలతో "ఓ దేవతలారా! బ్రహ్మవిష్ణుల యుద్ధము నాకు ముందుగానే తెలుసు" అని పలికి, దేవతలందరితో కూడా యుద్ధప్రదేశానికి వెళ్ళి పెద్ద అగ్నిస్తంభమువలె తన రూపమును దాల్చి వారిద్దరి మధ్యలో నిలిచాడు. వారిరువురు ప్రయోగించిన ఆ గొప్ప రెండు అస్త్రములు ఆ మహాగ్నిస్తంభములో పడి క్షణకాలంలో దానియందు కలిసిపోయాయి. ఆ అగ్నిస్తంభము ఏమో తెలుసుకోవాలని వారిరువురు భావించారు. బ్రహ్మవిష్ణువులు ఇరువురు శాంతించుట, పరమేశ్వరుని అనుగ్రహము పొందుట మొ॥ విషయాలను కథారూపంగా ఈ అధ్యాయాలలో మనం చూడవచ్చు.

తొమ్మిదవ అధ్యాయం బ్రహ్మవిష్ణువులు శివుని పూజించడంలో ప్రారంభమవుతుంది. శివుడు ప్రసన్నమైన ముఖంతో వారితో ఇట్లు పలికాడు. "పుత్రులారా! మీరు ఈనాడు నాకు చేసిన పూజకు సంతోషించాను, శివరాత్రిపుణ్య

దినాన నన్ను పూజించినచో ఒక సంవత్సరకాలం ప్రతిరోజూ నన్ను పూజించిన ఫలం లభిస్తుంది. ఈ యుద్ధప్రదేశంలో నేను లింగాకారంగా వ్యక్తమయ్యాను కావున ఈ ప్రదేశం లింగస్థానంగా పేరు పొందుతుంది. ఈ శివలింగం సర్వజనావళికి సుఖమునిస్తుంది. జీవనోపాధికి, తనువు చాలించిన తర్వాత ముక్తికి ఇది ఒకటే సాధనమవుతుంది. దీనిని చూసినవారలకు, చేతితో ముట్టుకొన్నవారికి మరలా జన్మ ఉండదు, అగ్నిపర్వతం వంటి కాంతితో పుట్టుటవలన ఇది **అరుణాచలం** అనే పేరుతో పిలవబడుతుంది.

పదవ అధ్యాయంనుంచి, ఇరవై అయిదవ అధ్యాయం వరకు అంటే విద్యేశ్వరసంహిత పూర్తి అయ్యేవరకు పరమశివునికి పంచకృత్యాలు (అయిదు చేయదగిన పనులు); ప్రణవం (ఓంకారం); లింగప్రతిష్ఠ; శివపదాన్ని సిద్ధింపచేసే వివిధమంత్రాలు; మోక్షదాయకమైన శివక్షేత్రాలు; సదాచారం; శౌచం, ధర్మానుష్ఠానం; త్రివిధయజ్ఞాలు; గురుపూజ; బ్రహ్మతృప్తి; శుద్ధగృహం, గోశాల, దేవాలయం మొదలగు దేశాల విశేషాలు; గాయత్రీమంత్రజపఫలం; అన్నదానవైశిష్ట్యం, సువర్ణదానం, ఆజ్యదానం, కన్యాదానం మొదలగు వివిధదానాల ఫలం; పూజావిధానం, పూజాఫలం; కార్తికమాసంలో శివుడు మొదలగు దేవతలను ఆరాధించడంవల్ల కలిగే ఫలం; ధనుర్మాసవైశిష్ట్యం; మహానైవేద్యఫలం; ఈ చరాచరప్రపంచమంతా బిందునాదస్వరూపం, ఆ రెంటిలో బిందువు నాదం ఈ రెండు పదాల అర్థవివరణ; శివశక్తుల గుర్తులు శివలింగంలో మిళితమైయుండుట; శివలింగానికి షోడశోపచారపూజ; పంచగవ్యాలు; రుద్రాక్షధారణఫలం; ప్రణవనామౌచిత్యం, ప్రణవభేదాలు; ఓంకారజపఫలం; గురూపదేశవైశిష్ట్యం; మాఘభాద్ర పదమాసాలలో చేసే జపం యొక్క ఫలం; పంచాక్షరీమంత్రజపం; మంత్రసిద్ధి; పాతాళం మొదలగు సత్యలోకవైభవం; బంధమోక్షాలస్వరూపం; ప్రకృత్యాది అష్టకం; దేహోత్పత్తి కారణం; స్థూలశరీరము, సూక్ష్మశరీరము, కారణశరీరము అనే శరీరత్రైవిధ్యం; ప్రకృత్యాది అష్టకమే మహాచక్రం; పరమశివుని పరమానుగ్రహం; స్వయంభూలింగం, బిందులింగం, ప్రతిష్ఠితలింగం మొ॥లగు లింగాల స్వరూపం; బ్రాహ్మణులకు రసలింగం, క్షత్రియులకు బాణలింగం, వైశ్యులకు బంగారులింగం, శూద్రులకు రాత్రిలింగం, సభర్తృకస్త్రీలకు మట్టితో చేసిన లింగం, భర్తృరహితస్త్రీలకు స్ఫటికలింగం మరియు రసలింగం, నివృత్తిమార్గంలో ఉన్నవారికి సూక్ష్మలింగం ఫలప్రదాలని నిరూపణ; విభూతివైశిష్ట్యం; శివశబ్దంలో శకార, ఇకార, వకారాల అర్థనిరూపణ; విభూతితో త్రిపుండ్రాన్ని ధరించినందువల్ల కలిగే ఫలం; అత్యాశ్రమి లేదా శివాశ్రమనిరూపణ; గురులింగం నిరూపణ; గురువు త్రాగగా తినగా మిగిలినవి శివోచ్ఛిష్టంతో సమానం; యముని ప్రీతికోసం కాలదానం అంటే వంద లేక పదిపలాల బంగారంతో బంగారు పాశాన్ని అంకుశాన్ని ధరించిన కాలపురుషుని బొమ్మను తయారుచేసి దక్షిణతో సహాదానం చేయడం; పూర్ణాయుర్దాయం కొరకు నువ్వుల దానం; కాలభైరవమహాపూజ; దీపదానం; సూర్యమంత్రాన్ని జపిస్తూ వంద; వేయి; పదివేలు, లక్ష, కోటి నమస్కారాలు చేసినందువలన కలిగే ఫలం; నమస్కారమనే ఆత్మయజ్ఞం; శివప్రదక్షిణ; శివలింగమహిమ; శివుని పార్థివలింగమహిమ; పార్థివలింగపూజావిధానం; పంచాక్షరీమంత్రంతో పూజాసామగ్రిని శుద్ధి చేయుట, **"భూరసి"** మంత్రంతో క్షేత్రాన్ని సిద్ధం చేయడం, "ఆపోఽస్మాన్" మంత్రంతో నీటిని సంస్కరించుట, ఇంకా ఆయా మంత్రాలతో ప్రదేశాన్ని శుద్ధి చేయుట, పంచామృతాలను ప్రోక్షణ చేయుట మొ॥ విధివిధానముల నిరూపణ; ఎన్ని పార్థివలింగాలను పూజిస్తే ఏఏ ఫలాలు లభిస్తాయి అను విషయనిరూపణ; శివనైవేద్యాన్ని తీసుకోరాదేమో అన్న భావనను విడిచి శివనైవేద్యాన్ని తప్పక గ్రహించుట, మరియు శివనైవేద్యాన్ని

గ్రహించినదాని ఫలము; లింగంపై ఉంచిన ద్రవ్యాన్ని తీసుకోరాదు, లింగస్పర్శకు బయట ఉన్న శివనైవేద్యం పవిత్రమని చెప్పుట; బిల్వమహిమ; పూజ అయిన తరువాత లింగాన్ని తలపై తప్పక ధరించుట; భస్మమహిమ, రుద్రాక్షమహిమ, శివనామమహిమ ఈ మూడింటి వివరణ, వైశిష్ట్యం; భస్మధారణవర్ణన; "శివోఽహమ్" అని భావన చేయుట; మహేశ్వరుణ్ణి, త్రిపుండ్రధారులను నిందించే వారికి కలిగే అనర్థాలు; త్రిపుండ్రధారణవిధానం; ఏకముఖిరుద్రాక్ష, భుక్తిముక్తులను ఫలాన్నిచ్చేది మరియు సాక్షాత్తు శివస్వరూపమే; ద్విముఖి, త్రిముఖి, చతుర్ముఖి, పంచముఖి మొ॥లగు రుద్రాక్షల స్వరూపస్వభావాలు; మొదలగు విషయాలు విశదీకరింపబడ్డాయి. సామాన్యమానవుల దగ్గర నుంచి విద్వాంసులవరకు సమస్తజనులకు ఈ పైన చెప్పిన విషయాలు ఉపయోగిస్తాయి అనడంలో సందేహం లేదు. ఈ విషయాలతో విద్యేశ్వరసంహిత అనే మొదటి సంహిత పూర్తి అవుతుంది.

ఓం శ్రీనివాస పరబ్రహ్మణే నమః

శ్రీవేదవ్యాస విరచితం

శివమహాపురాణమ్

ప్రథమభాగః - మొదటి భాగం

శివమహాపురాణ మాహాత్మ్యం

ప్రథమోఽధ్యాయః - మొదటి అధ్యాయం

మహిమ వర్ణనమ్ - మహిమ వర్ణనం

శ్రీ శౌనక ఉవాచ - శ్రీ శౌనక మహర్షులవారు చెప్పారు.

హే హే సూత మహాప్రాజ్ఞ! సర్వసిద్ధాంతవిత్ ప్రభో ।
ఆఖ్యాహి మే కథాసారం పురాణానాం విశేషతః ॥1॥

మహామతీ! అన్ని సిద్ధాంతాలూ తెలిసినవాడా! ప్రభూ! ఓ సూతమహర్షీ! పురాణాల కథాసారం మాకు విశేషంగా వివరించండి.

సపుత్రాయాశ్చ సద్భక్తేర్వివేకో వర్ధతే కథమ్? ।
స్వవికార నిరాసశ్చ సజ్జనైః క్రియతే కథమ్? ॥2॥

జ్ఞాన వైరాగ్యాలనే పుత్రులు గల సద్భక్తికి సంబంధించిన వివేకం ఎలా పెంపొందుతుంది? సజ్జనులు తమ మానసిక వికారాలను ఎలా తొలగించుకుంటారు?

జీవాశ్చాసురతాం ప్రాప్తాః ప్రాయో ఘోరో కలావిహ ।
తస్య సంశోధనే కిం హి విద్యతే పరమాఽయనమ్? ॥3॥

భయంకరమైన కలియుగంలో జీవులందరూ సామాన్యంగా రాక్షసత్వాన్ని పొంది ఉంటారు? ఆ దుర్గుణాన్ని తొలగించుకోవడానికి మంచి మార్గమేదైనా ఉందా?

యదస్తి వస్తు పరమం శ్రేయసాం శ్రేయ ఉత్తమమ్ ।
పావనం పావనానాం చ సాధనం తద్వదాధునా ॥4॥

శ్రేయస్సును కల్గించేవాటిల్లో ఉత్తమోత్తమశ్రేయస్కరశ్రేష్ఠ వస్తువేదైనా ఉందా? పవిత్రమైన వాటిల్లో మిక్కిలి పవిత్రమైన శ్రేయస్సాధనాన్ని నీవిపుడు చెప్పుము.

యేన తత్ సాధనేనాశు శుద్ధ్యత్యాత్మా విశేషతః ।
శివప్రాప్తిర్భవేత్తాత! సదా నిర్మలచేతసః ॥5॥

మహర్షీ! ఏ సాధనవల్ల హృదయం త్వరగా పూర్తిగా పరిశుద్ధమవుతుంది? దేనివల్ల సదా నిర్మల మనస్కులైన మానవులకు శివపదం సిద్ధిస్తుంది?

సూత ఉవాచ – సూతమహర్షి చెప్పాడు.

ధన్యస్త్వం మునిశార్దూల! శ్రవణప్రీతిలాలసః ।
అతో విచార్య సుధియా వచ్మి శాస్త్రం మహోత్తమమ్ ॥6॥

ఓ శౌనకమునీంద్రా! కనుక నీవు ధన్యుడివి. పురాణకథాసారమును వినాలనే కోరిక కల్గిన నేను సద్బుద్ధితో చక్కగా విచారించి, ఉత్తమశాస్త్రాన్ని వినిపిస్తాను.

సర్వసిద్ధాంతనిష్పన్నం భక్త్యాదికవివర్ధనమ్ ।
శివతోషకరం దివ్యం శృణు వత్స! రసాయనమ్ ॥7॥

నాయనా! శౌనకమహర్షీ! అన్ని సిద్ధాంతాల సారమూ, భక్తి జ్ఞాన వైరాగ్యాలను వృద్ధిచేసేది, శివునికి సంతోషాన్ని కలిగించేది, వినేవారి చెవులకు దివ్యరసాయనమయింది చెప్తాను విను.

కాలవ్యాలమహాత్రాసవిధ్వంసకరముత్తమమ్ ।
శైవం పురాణం పరమం శివేనోక్తం పురా మునే! ॥8॥

ఓ మునివర్యా! కాలమనే గొప్ప పాము వల్ల కలిగే మహాభయాన్ని నశింపజేసేదీ, ఉత్తమోత్తమమయిందీ, శ్రేష్ఠమయిందీ, పూర్వం స్వయంగా శివుడే చెప్పిందీ శివపురాణం.

సనత్కుమారస్య మునేరుపదేశాత్ పరాదరాత్ ।
వ్యాసేనోక్తం తు సంక్షేపాత్ కలిజానాం హితాయ చ ॥9॥

సనత్కుమారుడనే మహాముని శివునివల్ల తాను విన్న శివపురాణాన్ని పరమాదరంతో వ్యాసమహర్షికి ఉపదేశించాడు. కలియుగ మానవుల హితాన్ని కోరి, ఆ వ్యాస భగవానుడు సంగ్రహంగా నాకు చెప్పాడు.

ఏతస్మాదపరం కించిత్ పురాణాచ్ఛైవతో మునే ।
న విద్యతే మనశ్శుద్ధ్యై కలిజానాం విశేషతః ॥10॥

శౌనకమహర్షీ! కలికాల మానవుల చిత్తశుద్ధికి శివపురాణాన్ని మించిన ముఖ్య సాధనం మరొక్కటి లేదు. (అంటే శివపురాణాన్ని వినడం కంటే మరోమార్గం లేదని భావం).

జన్మాంతరే భవేత్ పుణ్యం మహత్తస్య సుధీమతః ।
తస్య ప్రీతిర్భవేత్తత్ర మహాభాగ్యవతో మునే ॥11॥

మునీశ్వరా! జన్మాంతరంలో ఎంతో గొప్పపుణ్యం చేసుకొన్న మహాభాగ్యవంతులైన బుద్ధిమంతులకే ఈ శివపురాణం పై ప్రీతి ఏర్పడుతుంది.

ఏతచ్ఛివపురాణం హి పరమం శాస్త్రముత్తమమ్ ।
శివరూపం క్షితౌ జ్ఞేయం సేవనీయం చ సర్వథా ॥12॥

ఈ శివపురాణం పరమపవిత్రమైన ఉత్తమశాస్త్రం. ఇది సాక్షాత్తు భూలోకంలో శివరూపమే! అని తెలుసుకోండి. ఈ పురాణాన్నే అన్నివిధాలా, అన్నివేళలా సేవించండి.

పఠనాచ్ఛ్రవణాదస్య భక్తిమాన్ నరసత్తమః ।
సద్యశ్శివపదప్రాప్తిం లభతే సర్వసాధనాత్ ॥13॥

ఈ శివపురాణాన్ని శ్రద్ధగా చదివినా, విన్నా, ఆ భక్తుడు మానవోత్తముడై, అతని అన్ని సాధనలూ ఫలించి, వెంటనే శివస్థానాన్ని పొందుతున్నాడు.

తస్మాత్ సర్వయత్నేన కాంక్షితం పఠనం నృభిః ।
తథాస్య శ్రవణం ప్రేమ్ణా సర్వకామఫలప్రదమ్ ॥14॥

శౌనక మహర్షీ! ఈ శివపురాణం సాక్షాత్తు శివస్వరూపమూ, శివపద ప్రాప్తికరమూ కనుక అన్ని విధాలా గట్టిగా ప్రయత్నించి, మానవులు దీన్ని పరమప్రేమతో పఠించాలి, వినాలి. ఇలా చేస్తే అన్ని కోరికలూ ఫలిస్తాయి.

పురాణశ్రవణాచ్ఛంభోః నిష్పాపో జాయతే నరః ।
భుక్త్వా భోగాన్ సువిపులాన్ శివలోకమవాప్నుయాత్ ॥15॥

ఓ మహర్షీ! శివపురాణాన్ని విన్న మానవుడు పాపాలు తొలగి, పుణ్యాత్ముడవుతాడు. అన్ని ఉత్తమ భోగాలూ పూర్తిగా అనుభవించి, పిదప శివలోకాన్ని పొందుతాడు.

రాజసూయేన యత్పుణ్యమగ్నిష్టోమశతేన చ ।
తత్పుణ్యం లభతే శంభోః కథాశ్రవణమాత్రతః ॥16॥

శివుని కథలు వింటేచాలు, వానికి రాజసూయం చేసిన పుణ్యం, నూరు అగ్నిష్టోమాలు చేసిన పుణ్యం లభిస్తుంది.

యే శృణ్వంతి మునే! శైవం పురాణం శాస్త్రముత్తమమ్ ।
తే మనుష్యా న మంతవ్యా రుద్రా ఏవ న సంశయః ॥17॥

ఓ మహర్షీ! ఉత్తమ శాస్త్రమైన ఈ శివపురాణం వినేవాళ్లను సామాన్యమానవులుగా భావించడం తగదు. వాళ్లు నిజంగా రుద్రులే (శివులే). ఇందులో ఏమాత్రం సందేహం లేదు.

శృణ్వతాం తత్పురాణం హి తథా కీర్తయతాంచ తత్ ।
పాదాంబుజరజాంస్యేవ తీర్థాని మునయో విదుః ॥18॥

శివపురాణాన్ని కీర్తించే (వివరించే) వాళ్ల యొక్క మరియు వినే వాళ్ల యొక్క పాదపద్మాల ధూళియే సకల పుణ్య తీర్థాలని మునులు భావిస్తారు.

గంతుం నిశ్శ్రేయసం స్థానం యేఽభివాంఛంతి దేహినః ।
శైవం పురాణమమలం భక్త్యా శృణ్వంతు తే సదా ॥19॥

ఏ మానవులు మోక్షాన్ని కోరుకొంటారో వాళ్లు తప్పకుండా శివపురాణాన్ని భక్తితో ఎల్లప్పుడు వినాలి.

సదా శ్రోతుం యద్యశక్తో భవేత్స మునిసత్తమ ।
నియతాత్మా ప్రతిదినం శృణుయాద్వా ముహూర్తకమ్ ॥20॥

ఓ మునివర్యా! ఎల్లప్పుడూ వినడానికి అవకాశం లేకపోతే, నియమనిష్ఠలతో ప్రతిదినమూ ఒక్క ముహూర్తకాలం (48 నిమిషాల కాలం) అయినా వినవలెను.

యది ప్రతిదినం శ్రోతుమశక్తో మానవో భవేత్ ।
పుణ్యమాసాదిషు మునే! శృణుయాచ్ఛివపురాణకమ్ ॥21॥

ఓ మహామునీ! ప్రతిదినమూ నియమంగా వినేందుకు అవకాశం లేకపోతే, కనీసం పుణ్యమాసాల్లో నైనా శివపురాణాన్ని వినవలయును.

ముహూర్తం వా తదర్థం వా తదర్థం వా క్షణం చ వా ।
యే శృణ్వంతి పురాణం తన్న తేషాం దుర్గతి ర్భవేత్ ॥22॥

పుణ్య మాసాల్లోనూ వినేందుకు అవకాశం లేనివారు, శ్రద్ధతో ముహూర్తకాలం కానీ, (48 నిమిషాలు), అందులో అర్ధం (24 నిమిషాలు) కానీ, మరల అందులో అర్ధం కానీ (12 నిమిషాలు). అదీ కాకపోతే ఒక్క క్షణకాలమైన (4 నిమేషాలు ఒక్క క్షణం) శివ పురాణాన్ని భక్తితో వింటేచాలు. వాళ్లకు దుర్గతి ఉండదు.

తత్ పురాణం చ శృణ్వానః పురుషో యో మునీశ్వర ।
స నిస్తరతి సంసారం దగ్ధ్వా కర్మ మహాటవీమ్ ॥23॥

ఓ మునీశ్వరా! శివ పురాణాన్ని వినాలనే ఆసక్తి గలవాడు ఇహజన్మలో జన్మాంతరాలలో చేసిన కర్మలనే మహారణ్యాన్ని కాల్చి భస్మం చేసి, సంసార బంధాల నుండి విముక్తుడవుతాడు.

తత్పుణ్యం సర్వదానేషు సర్వయజ్ఞేషు వా మునే ।
శంభోః పురాణశ్రవణాత్ తత్ఫలం నిశ్చలం భవేత్ ॥24॥

సకల దానాలూ, సమస్తయజ్ఞాలూ శ్రద్ధగా చేస్తే ఎంత పుణ్యమో అంతే పుణ్యం శివపురాణ శ్రవణం వల్ల స్థిరంగా ఉంటుంది.

విశేషతః కలౌ శైవపురాణశ్రవణాదృతే ।
పరోధర్మో న పుంసాం హి ముక్తిసాధనకృన్మునే ॥25॥

మహర్షీ! విశేషించి, కలియుగంలో శివపురాణ శ్రవణం తప్ప మరే పరమధర్మమూ ముక్తి సాధనమయింది లేదు.

పురాణశ్రవణం శంభోర్నామసంకీర్తనం తథా ।
కల్పద్రుమఫలం సమ్యఙ్మనుష్యాణాం న సంశయః ॥26॥

శివపురాణ శ్రవణం కానీ, శివనామ సంకీర్తనం కానీ కల్పవృక్షంలాగా కోరికలు తీరుస్తుంది. ఈ విషయంలో సందేహం లేదు.

కలౌ దుర్మేధసాం పుంసాం ధర్మాచారోజ్ఝితాత్మనామ్ ।
హితస్య విదధే శంభుః పురాణాఖ్యం సుధారసమ్ ॥27॥

కలియుగంలోని దుర్బుద్ధులూ, దురాచార పరులూ అయిన మానవులకు హితాన్ని చేకూర్చడానికై మహాశివుడు 'శివపురాణం' అనే దివ్యామృతరసాన్ని సృజించి యిచ్చాడు.

ఏకోఽజరామరస్స్యాద్వై పిబన్నేవామృతం పుమాన్ ।
శంభోః కథామృతం కుర్యాత్ కులమేవాజరామరమ్ ॥28॥

దేవలోకంలోని అమృతం ఆస్వాదించినవాణ్ణి మాత్రమే వార్ధక్యం, మరణం లేని వాణ్ణిగా చేస్తుంది. కాని శివకథలనే అమృతం ఆస్వాదించినవాణ్ణి మాత్రమే కాక, వాని కులాన్నంతా కూడా జరామరణాలు లేని వాళ్లనుగా చేస్తుంది.

సదా సేవ్యా సదా సేవ్యా సదా సేవ్యా విశేషతః ।
ఏతచ్ఛివపురాణస్య కథా పరమపావనీ ॥29॥

ఈ శివపురాణ కథ పరమపావనం. కనుకనే దీన్ని ఎల్లప్పుడు సేవించాలి. (సేవించడమంటే వినడం, నిస్సందేహంగా శివకథామృతాన్ని ఆస్వాదించాలి అని భావం.)

ఏత చ్ఛివపురాణస్య కథాశ్రవణమాత్రతః ।
కిం బ్రవీమి ఫలం తస్య శివశ్చిత్తం సమాశ్రయేత్ ॥30॥

ఈ శివపురాణాన్ని వినడం వల్ల కలిగే ఫలం ఏమని చెప్పగలం? సాక్షాత్తు శివుడే వినేవారి మనస్సుల్లో కొలువై ఉంటాడు.

చతుర్వింశతిసాహస్రో గ్రంథోఽయం సప్తసంహితః ।
భక్తిత్రికసుసంపూర్ణం శృణుయాత్తం పరాదరాత్ ॥31॥

ఇరువది నాల్గువేల శ్లోకాలతో, ఏడు సంహితలతో, మూడు భక్తి విభాగాలతో పరిపూర్ణమై విరాజిల్లే ఈ శివపురాణాన్ని పరమాదరంతో, శ్రద్ధతో వినాలి.

విద్యేశ్వరసంహితాద్యా ద్వితీయా రుద్రసంహితా ।
తృతీయా శతరుద్రాఖ్యా కోటిరుద్రా చతుర్థికా ॥32॥

పంచమ్యుమాసంహితోక్తా షష్ఠీ కైలాససంహితా ।
సప్తమీ వాయవీయాఖ్యా సప్తైవం సంహితా ఇహ ॥33॥

ఈ శివపురాణంలో ఏడు సంహితలున్నాయి. ఇందులో మొదటిది విద్యేశ్వరసంహిత. రెండవది రుద్రసంహిత. మూడవదానిని శతరుద్ర మంటారు. నాలుగవది కోటిరుద్రసంహిత. ఐదవది ఉమాసంహితగా చెప్పబడింది. ఆరవది కైలాస సంహితయని ఏడవది వాయవీయమని చెప్పబడింది.

ససప్తసంహితం దివ్యం పురాణం శివసంజ్ఞికమ్ ।
వరీవర్తి బ్రహ్మతుల్యం సర్వోపరి గతిప్రదమ్ ॥34॥

సప్త సంహితాత్మకమై దివ్యమగు ఈ శివపురాణం పరమాత్మతో సమానం. సర్వోత్కృష్టమగు మోక్షమును ఇచ్చునదై విరాజిల్లుచున్నది.

ఏతచ్ఛివపురాణం హి సప్తసంహితమాదరాత్ ।
పరిపూర్ణం పఠేద్యస్తు స జీవన్ముక్త ఉచ్యతే ॥35॥

ఏడు సంహితలతో కూడిన ఈ శివపురాణాన్ని భక్తి విశ్వాసాలతో పూర్తిగా పఠించేవాడు జీవన్ముక్తుడవుతాడు.

పుమానజ్ఞానతస్తావద్ భ్రమతేఽస్మిన్ భవే మునే ।
యావత్కర్ణగతం నాస్తి పురాణం శైవముత్తమమ్ ॥36॥

మునీశ్వరా! మానవుడు అజ్ఞానం వల్ల ఎంతవరకూ ఉత్తమమైన శివపురాణాన్ని ఆలకించడో అంతవరకూ సంసారచక్రంలో తగుల్కొని కొట్టుమిట్టాడుతుంటాడు.

కిం శ్రుతైర్బహుభిశ్శాస్త్రైః పురాణైశ్చ భ్రమావహైః ।
శైవం పురాణమేకం హి ముక్తిదానేన గర్జతి ॥37॥

భ్రమ సందేహాత్మకాలైన శాస్త్రాలూ, పురాణాలూ ఎన్ని విన్నా ప్రయోజనం సున్న. ఒక్క శివపురాణం మాత్రమే వినడంతోనే ముక్తినిస్తానని ఎలుగెత్తి చాటింది.

ఏతచ్ఛివపురాణస్య కథా భవతి యద్గృహే ।
తీర్థభూతం హి తద్గేహం వసతాం పాపనాశనమ్ ॥38॥

ఈ శివపురాణ కథాగ్రంథం ఏయింట్లో ఉంటుందో ఆయిల్లు నిజంగా పుణ్యతీర్థక్షేత్రం అవుతుంది. ఆ యింట్లో ఉండేవాళ్లకు సకల పాపాలూ నశించిపోతాయి.

అశ్వమేధసహస్రాణి వాజపేయశతాని చ ।
కలాం శివపురాణస్య నార్హంతి ఖలు షోడశీమ్ ॥39॥

వేల కొలదీ అశ్వమేధయాగాలూ, నూర్లకొలదీ వాజపేయ యజ్ఞాలూ అయినా ఈ శివపురాణం వల్ల కలిగే పుణ్యంలో పదహారవ వంతుకూడా ఇవ్వజాలవు.

తావత్ స ప్రోచ్యతే పాపీ పాపకృన్మునిసత్తమ ।
యావచ్ఛివపురాణం హి న శృణోతి సుభక్తితః ॥40॥

పాపకార్యములు చేయువాడు ఎప్పటివరకు భక్తిపూర్వకంగా శివపురాణాన్ని వినడో అప్పటివరకు అతడు, పాపియని చెప్పబడతాడు.

గంగాద్యాః పుణ్యనద్యశ్చ సప్తపుర్యో గయా తథా ।
ఏతచ్ఛివపురాణస్య సమతాం యాంతి న క్వచిత్ ॥41॥

గంగాదిపుణ్యనదులూ, మోక్షదాయకాలుగా ప్రసిద్ధికెక్కిన అయోధ్యాది సప్త నగరాలూ, గయాది పుణ్యతీర్థాలూ, ఈ శివపురాణ శ్రవణ ఫలానికి సాటియైన పుణ్యఫలాన్ని అనుగ్రహించలేవు.

నిత్యం శివపురాణస్య శ్లోకం శ్లోకార్ధమేవ చ ।
స్వముఖేన పఠేద్ భక్త్యా యదీచ్ఛేత్ పరమాం గతిమ్ ॥42॥

ముక్తిని కోరుకొనేవాడయితే ప్రతిదినమూ తానే స్వయంగా భక్తితో శివపురాణంలోని ఒక శ్లోకాన్ని కానీ అర్థ శ్లోకాన్ని గాని తప్పక పఠించాలి.

ఏతచ్ఛివపురాణం యో వాచయేదర్థతోఽనిశమ్ ।
పఠేద్వా ప్రీతితో నిత్యం స పుణ్యాత్మా న సంశయః ॥43॥

ఏవడైతే నిత్యమూ అర్థవంతంగా ఈ శివపురాణాన్ని వివరిస్తాడో, నిత్యం ప్రీతితో పఠిస్తాడో అతడు నిస్సంశయంగా పరమపుణ్యాత్ముడే!.

అంతకాలే హి యశ్చైనం శృణుయాద్భక్తితస్సుధీః ।
సుప్రసన్నో మహేశానస్తస్మై యచ్ఛతి స్వం పదమ్ ॥44॥

ఎవడైతే తనమరణ కాలంలో భక్తితో ఈ శివపురాణాన్ని వింటాడో ఆ బుద్ధిమంతుని విషయంలో మహేశ్వరుడు సుప్రసన్నుడై అతనికి తన శివపదాన్నే ఇస్తాడు.

ఏతచ్ఛివపురాణం యః పూజయేన్నిత్యమాదరాత్ ।
స భుక్త్వేహాఖిలాన్ కామానంతే శివపదం లభేత్ ॥45॥

ఎవడైతే ఈ శివపురాణాన్ని అక్షరాత్మక పరమశివుడని విశ్వసించి, నిత్యమూ భక్తితో పూజిస్తాడో అతడు ఈ లోకంలో అన్ని కోరికలూ తీర్చుకొని, చివరకు శివపదాన్ని తప్పక పొందుతాడు.

ఏతచ్ఛివపురాణస్య కుర్వన్నిత్యమతంద్రితః ।
పట్టవస్త్రాదినా సమ్యక్ సత్కారం స సుఖీ సదా ॥46॥

ఎవడైతే ఈ శివ పురాణాన్ని శివునితో అభేదంగా భావించి, జాగరూకుడై పట్టువస్త్రాదులతో చక్కగా అలంకరించి, గౌరవిస్తాడో అతడు ఎల్లప్పుడు సుఖంగా ఉంటాడు.

శైవం పురాణమమలం శైవసర్వస్వమాదరాత్ ।
సేవనీయం ప్రయత్నేన పరత్రేహ సుఖేప్సునా ॥47॥

పవిత్రం, శివసర్వస్వం అయినది ఈ శివపురాణం. దీన్ని ప్రేమతో, పట్టుదలతో ఇహపర సుఖ ప్రాప్తికోసం సేవించాలి.

చతుర్వర్గప్రదం శైవం పురాణమమలం పరమ్ ।
శ్రోతవ్యం సర్వదా ప్రీత్యా పఠితవ్యం విశేషతః ॥48॥

ధర్మార్థ కామమోక్షాలు అనే నాల్గింటినీ ఇచ్చేదీ, పవిత్రమయిందీ, శ్రేష్ఠమయిందీ ఈ శివపురాణం. దీన్ని ఎల్లప్పుడూ ప్రీతితో వినాలి. విశేషించి చదవాలి.

వేదేతిహాసశాస్త్రేషు పరం శ్రేయస్కరం మహత్ ।
శైవం పురాణం విజ్ఞేయం సర్వథా హి ముముక్షుభిః ॥49॥

వేదాలకంటే, ఇతిహాసాలకంటే, శాస్త్రాలకంటే శ్రేష్ఠమూ, మహాశ్రేయస్కరమూ అయింది ఈ శివపురాణం అని మోక్షాన్ని కోరేవాళ్లు తెలుసుకోవాలి.

శైవం పురాణ మిదమాత్మవిదాం వరిష్ఠం సేవ్యం సదా పరమవస్తుసతాం సమర్చ్యమ్ ।
తాపత్రయాభిశమనం సుఖదం సదైవ ప్రాణప్రియం విధిహరీశముఖామరాణామ్ ॥50॥

ఆత్మజ్ఞానాభిలాషులకు ఈ శివపురాణం పరమ శ్రేష్ఠం. మహాత్ములకు మోక్షవస్తువై సదా పూజింపదగింది. ఆధ్యాత్మికము, ఆధిదైవికము, ఆధిభౌతికమను తాపత్రయాన్ని సమూలంగా నాశనం చేస్తుంది. ఎప్పుడూ పరమసుఖాన్నే ప్రసాదిస్తుంది. ఇంతేకాదు, బ్రహ్మ. విష్ణువు, ఈశ్వరుడు మొదలైన దేవతలందరికీ ప్రాణప్రియమయినది ఈ శివపురాణం.

వందే శివపురాణం హి సర్వదాఽహం ప్రసన్నధీః ।
శివః ప్రసన్నతాం యాయాద్దద్యాత్ స్వపదయో రతిమ్ ॥51॥

ప్రసన్నాత్ముణ్ణిఅయి ఈ పురాణానికి సదా నమస్కరిస్తున్నాను. ఇందువల్ల పరమశివుడు నాయందు ప్రసన్నుడగుగాక! తన పాదపద్మారాధనయందు నాకు నిష్ఠ కల్గించుగాక!

ఇతి శ్రీస్కాందే మహాపురాణే శివపురాణ మాహాత్మ్యే తన్మహిమవర్ణనం నామ ప్రథమోఽధ్యాయః ॥1॥

శ్రీ స్కాంద మహాపురాణం శివపురాణ మాహాత్మ్యంలో ఆ పురాణమహిమను వర్ణించే మొదటి అధ్యాయం సమాప్తం.

ద్వితీయోఽధ్యాయః – రెండవ అధ్యాయం

దేవరాజు ముక్తివర్ణనమ్ – దేవరాజుకు ముక్తి చేకూరిన వర్ణనం

శ్రీ శౌనక ఉవాచ – శ్రీ శౌనక మహర్షి చెప్పాడు.

సూత సూత మహాభాగ! ధన్యస్త్వం పరమార్థవిత్ ।
అద్భుతేయం కథా దివ్యా శ్రావితా కృపయా హి నః ॥1॥

ఓ సూతమహర్షీ! మహాత్మా! పరమార్థం తెలిసినవాడివైన నీవు ధన్యుడవు. పరమాద్భుతమూ, దివ్యమూ అయిన ఈ కథను దయతో మాకు వినిపించావు. వినడం వల్ల మేమూ ధన్యులం అయ్యాము.

అఘౌఘవిధ్వంసకరీ మనశ్శుద్ధివిధాయినీ ।
శివసంతోషజననీ కథేయం న శ్రుతాద్భుతా ॥2॥

పాపాలనెడి సముద్రాలను ఇంకింపజేసేదీ, మనశ్శుద్ధి చేకూర్చేదీ, శివానందాన్ని కల్గించేదీ అయిన శివకథను మాకు విన్పించావు.

ఏతత్కథాసమానం న భువి కించిత్ పరాత్పరమ్ ।
నిశ్చయేనేతి విజ్ఞాతమస్మాభిః కృపయా తవ ॥3॥

ఈ శివపురాణ కథతో సమానమైనదీ, శ్రేష్ఠమైనదీ ఈ లోకంలో ఏదీలేదనే విషయం నీదయ వలన మాకు నిశ్చయంగా కల్గింది. ధన్యులమయ్యాము.

కే కే విశుద్ధ్యంత్యనయా కథయా పాపినః కలౌ ।
వద తాన్ కృపయా సూత! కృతార్థం భువనం కురు ॥4॥

ఏయే పాపాత్ములు ఈ కలికాలంలో ఈ శివకథల వల్ల శుద్ధాత్ములవుతున్నారో, అయ్యారో వాళ్ళను గూర్చి దయతో వివరించి, ఈ భూలోకాన్ని కృతార్థం చెయ్యండి.

సూత ఉవాచ – సూత మహర్షి చెప్పాడు.

యే మానవాః పాపకృతో దురాచారరతాః ఖలాః ।
కామాదినిరతా నిత్యం తేఽపి శుద్ధ్యంత్యనేన వై ॥5॥

ఏ మానవులైతే నిత్యమూ పాపకార్యాలు చేస్తూ దురాచారులై, దుర్మార్గులై, కామక్రోధాదులకు వశులై ఉంటారో వాళ్లు కూడా ఈ శివపురాణాన్ని వినడం వల్ల, చదవడం వల్ల పరిశుద్ధులవుతున్నారు.

జ్ఞానయజ్ఞః పరోఽయం వై భుక్తిముక్తిప్రదస్సదా ।
శోధనస్సర్వపాపానాం శివసంతోషకారకః ॥6॥

ఈ పురాణ శ్రవణం గొప్ప జ్ఞానయజ్ఞం. సదా భక్తినీ, ముక్తినీ (ఇహాన్నీ, పరాన్నీ) ఇచ్చేది. సర్వపాపాలనూ పరిహరించేది. శివానందాన్ని పొందడానికి పరమసాధనం.

తృష్ణాకులాస్సత్యహీనాః పితృమాతృవిదూషకాః ।
దాంభికా హింసకా యే చ తేఽపి శుద్ధ్యంత్యనేన వై ॥7॥

కోరికలచేత కలత చెందిన వాళ్లూ, అబద్ధాలు చెప్పేవాళ్లూ, తల్లిదండ్రుల్ని దూషించేవాళ్లూ, దురహంకారులూ, హింసాస్వభావులూ కూడా ఈ పురాణశ్రవణంవల్ల పునీతులవుతారు.

స్వవర్ణాశ్రమధర్మేభ్యో వర్జితా మత్సరాన్వితాః ।
జ్ఞానయజ్ఞేన తేఽనేన సంపునంతి కలావపి ॥8॥

తమ తమ వర్ణాశ్రమధర్మాలను వదలిపెట్టినవాళ్లూ, మత్సరగ్రస్తులూ అయిన వాళ్ళు కూడా ఈ కలి కాలంలో ఈ శివపురాణ జ్ఞానయజ్ఞం వల్ల పవిత్రులవుతున్నారు.

ఛలచ్ఛద్మకరా యే చ యే చ క్రూరాస్సునిర్దయాః ।
జ్ఞానయజ్ఞేన తేఽనేన సంపునంతి కలావపి ॥9॥

కుటిల స్వభావులూ, మోసగాళ్లూ, క్రూరులూ, నిర్దయులూ కూడా ఈ శివపురాణాన్ని వినడంతో కలి కాలంలో పవిత్రులవుతున్నారు.

బ్రహ్మస్వపుష్టాస్సతతం వ్యభిచారరతాశ్చ యే ।
జ్ఞానయజ్ఞేన తేఽనేన సంపునంతి కలావపి ॥10॥

బ్రాహ్మణధనంతో పరిపుష్టులూ, ఎల్లపుడూ వ్యభిచారదోషాల్లో ఆసక్తులై ఉండేవాళ్లూ కూడా ఈ కలికాలంలో శివపురాణశ్రవణంవల్ల పవిత్రులవుతున్నారు.

సదా పాపరతా యే చ యే శఠాతిదురాశయాః ।
జ్ఞానయజ్ఞేన తేఽనేన సంపునంతి కలావపి ॥11॥

ఎల్లప్పుడూ పాపకార్యాలు చేయడంలోనే ఆసక్తిగలవాళ్లూ, దుర్జనులూ, దుష్టస్వభావులూ కూడా కలియుగంలో శివపురాణ శ్రవణమనే జ్ఞానయజ్ఞంవల్ల కూడా పునీతులగుచున్నారు.

మలినా దుర్ధియోఽశాంతా దేవతాద్రవ్యభోజినః ।
జ్ఞానయజ్ఞేన తేఽనేన సంపునంతి కలావపి ॥12॥

నిందా స్వభావులూ, దుర్బుద్ధిగలవాళ్లూ, శాంతం లేని వాళ్లూ, అధర్మంగా దేవతాద్రవ్యాన్ని అనుభవించే వాళ్ళు కూడా కలియుగంలో శివపురాణం జ్ఞానయజ్ఞంవల్ల పవిత్రులగుచున్నారు.

పురాణస్యాస్య పుణ్యం సన్మహాపాతకనాశనమ్ ।
భుక్తిముక్తిప్రదం చైవ శివసంతోషహేతుకమ్ ॥13॥

ఈ శివపురాణ పఠన శ్రవణాదుల వల్ల కలిగే పుణ్యం ఉత్కృష్టమయినది. మహా పాపాలను కూడా నాశనం చేస్తుంది. భుక్తినీ ముక్తినీ చక్కగా ప్రసాదించేదీ, శివానందాన్ని చేకూర్చేది.

అత్రైవోదాహరంతీమమితిహాసం పురాతనమ్ ।
యస్య శ్రవణమాత్రేణ పాపహానిర్భవత్యలమ్ ॥14॥

ఈ విషయంగా ఒక పురాతనమైన కథ ఉదాహరించబడుతూంది. ఈ కథను విన్నంతనే పాపాలు పూర్తిగా తొలగిపోతాయి.

ఆసీత్ కిరాతనగరే బ్రాహ్మణో జ్ఞానదుర్బలః ।
దరిద్రో రసవిక్రేతా దేవధర్మపరాఙ్ముఖః ॥15॥

పూర్వం కిరాత నగరంలో ఒక బ్రాహ్మణుడుండేవాడు. అతడు జ్ఞానహీనుడు, దరిద్రుడు, రసద్రవ్యాలైన పాదరసం, నీళ్లు, మద్యం మొదలైనవి విక్రయించేవాడు. దేవుని యందూ ధర్మంపైనా విముఖుడు.

సంధ్యాస్నానపరిభ్రష్టో వైశ్యవృత్తిపరాయణః ।
దేవరాజ ఇతిఖ్యాతో విశ్వస్తజనవంచకః ॥16॥

స్నానం, సంధ్యావందనం మొదలైన సదాచారాలన్నీ వదలిపెట్టినవాడు, వేశ్యా సంబంధమైన ప్రవృత్తికి అలవాటు పడినవాడు, నమ్మకద్రోహియై తిరుగుతున్నవాడు, వాని పేరు దేవరాజు.

స విప్రాన్ క్షత్రియాన్ వైశ్యాన్ శూద్రాంశ్చాపి తథాపరాన్ ।
హత్వా నానామిషేణైవ తత్తద్ధనమపాహరత్ ॥17॥

ఆ భ్రష్ట బ్రాహ్మణుడు దేవరాజు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రాదుల్ని అనేకవిధాలైన మోసాలతో చంపుతూ, వాళ్ల సంపదల్ని దోచుకొనేవాడు.

అధర్మాద్బహువిత్తాని పశ్చాత్తేనార్జితాని వై ।
న ధర్మాయ ధనం తస్య స్వల్పం చాపీహ పాపినః ॥18॥

ఈ విధంగా అధార్మికంగా సంపాదించిన ధనాన్ని ఆ బ్రాహ్మణపాపి తర్వాతి కాలంలో ఏనాడూ కొంచెం కూడా దానధర్మాది పుణ్యకార్యాలకు వినియోగించలేదు.

ఏకదైకతడాగే స స్నాతుం యాతో మహీసురః ।
వేశ్యాం శోభావతీం నామ దృష్ట్వా తత్రాతివిహ్వలః ॥19॥

ఒకమారు ఆ దేవరాజు అనే బ్రాహ్మణుడు ఒక చెరువులో స్నానం చేయడానికై వెళ్లాడు. అక్కడ శోభావతి అనే ఒక వేశ్యను చూచి, కామాతురుడై ఆమెను మోహించాడు.

స్వవశం ధనినం విప్రం జ్ఞాత్వా హృష్టాఽథ సుందరీ ।
వార్తాలాపేన తచ్చిత్తం ప్రీతిమత్సమజాయత ॥20॥

ధనికుడైన ఆ బ్రాహ్మణుడు తనకు వశుడైనాడని గ్రహించి, సంతోషించింది. ఆవేశ్య ఆ మాటా ఈమాటా మాట్లాడుతూ తనమాటకారితనంతో అతణ్ణి లోబరుచుకొనింది. అతని మనస్సును దోచుకొనింది.

స్త్రియం కర్తుం స తాం మేనే, పతిం కర్తుం చ సా తథా ।
ఏవం కామవశౌ భూత్వా బహుకాలం విజహ్రతుః ॥21॥

ఆమెను భార్యగా పొందాలని బ్రాహ్మణుడూ, అతణ్ణి భర్తగా పొందాలని ఆ వేశ్య ఎంతో ఆశపడ్డారు. తత్ఫలంగా ఇరువురూ కామమోహితులై చాలాకాలం స్వేచ్ఛగా విహరించారు.

ఆసనే శయనే పానే భోజనే క్రీడనే తథా ।
దంపతీవ సదా ద్వౌ తు వవృతాతే పరస్పరమ్ ॥22॥

ఆ యిద్దరూ కూర్చొన్నా, పరుండినా, త్రాగినా, తిన్నా, విహరించినా అన్నింటా ఒకరిని విడిచి ఒకరు ఉండకుండా ఎల్లప్పుడూ దంపతుల మాదిరే కలిసిమెలసి ఉండేవాళ్లు.

మాత్రా పిత్రా తథా పత్న్యా వారితోఽపి పునః పునః ।
నామన్యత వచస్తేషాం పాపవృత్తిపరాయణః ॥23॥

అతని చెడునడవడికను మాన్పించాలని మాటిమాటికీ తల్లి, తండ్రి, భార్య ఎంతగానో ప్రయత్నించారు. కానీ పాపప్రవృత్తికి బానిసైన ఆ దేవరాజు వాళ్ల మంచి మాటలు తలకెక్కించుకోలేదు.

ఏకదేర్ష్యావశాద్రాత్రౌ మాతరం పితరం వధూమ్ ।
ప్రసుప్తాన్న్యవధీద్దుష్టో ధనం తేషాం తథాహరత్ ॥24॥

ఒకనాడు ఈర్ష్యా హృదయుడయిన ఆ దుష్టుడు తనదారికి అడ్డంగా ఉన్నారని తలంచి, తల్లి, తండ్రి, భార్య, బాగా నిద్రిస్తున్న రాత్రివేళ ముగ్గుర్నీ చంపి వాళ్ల వద్దనున్న ధనాన్ని గైకొన్నాడు.

ఆత్మనీనం ధనం యచ్చ పిత్రాదీనాం తథా ధనమ్ ।
వేశ్యాయై దత్తవాన్ సర్వం కామీ తద్గతమానసః ॥25॥

ఆ దేవరాజు తనవద్దనున్న ధనాన్ని తల్లిదండ్రుల నుండీ భార్యనుండీ, ఇంకా ఎందర్నో వంచించి, చంపి చేకూర్చుకొన్న ధనాన్నీ యావత్తూ వేశ్యాధీనుడైన దేవరాజు ఆ శోభావతికి అర్పించాడు.

సోఽభక్ష్యభక్షకః పాపీ మదిరాపానలాలసః ।
ఏకపాత్రీ సదాభౌక్షీత్ సవేశ్యో బ్రాహ్మణాధమః ॥26॥

ఆ బ్రాహ్మణాధముడు తినకూడనివి తింటూ, మద్యపానం చేస్తూ, వేశ్యతో కూడా ఒకే కంచంలో భోంచేస్తూ దురాచార జీవనం సాగిస్తున్నాడు.

కదాచిద్దైవయోగేన ప్రతిష్ఠానముపాగతః ।
శివాలయం దదర్శాఽసౌ తత్ర సాధుజనావృతమ్ ॥27॥

కొన్నాళ్ల తరువాత దైవయోగంవల్ల ఆ బ్రాహ్మణుడు ప్రతిష్ఠానపురం వెళ్లి అక్కడొక శివాలయాన్ని దర్శించాడు. అక్కడ ఎందరో సాధు సత్పురుషులు పరమశివుణ్ణి సేవించడానికై చేరి ఉన్నారు.

స్థిత్వా తత్ర చ విప్రోఽసౌ జ్వరేణాతిపీడితః ।
శుశ్రావ సతతం శైవం కథాం విప్రముఖోద్గతామ్ ॥28॥

ఆ శివాలయం చేరగానే దేవరాజుకు తీవ్రంగా జ్వరం వచ్చింది. అందువల్ల ఎక్కడికీ పోలేక ఆలయంలోనే ఉండిపోయాడు. ఆ సమయంలో అక్కడొక బ్రాహ్మణుడు శివపురాణం ప్రవచనం చేస్తుండగా దేవరాజు విన్నాడు.

దేవరాజశ్చ మాసాంతే జ్వరేణాపీడితో మృతః ।
బద్ధో యమభటైః పాశైర్నీతో యమపురం బలాత్ ॥29॥

ఇలా ఒకనెల గడిచింది. ఇంతలో జ్వరతీవ్రత ఎక్కువయింది. దేవరాజు మరణించాడు. వెంటనే యమభటులువచ్చి అతణ్ణి పాశాలతో బంధించి, యమపట్టణానికి బలాత్కారంగా తీసుకువెళ్లారు.

తావచ్ఛివగణాశ్శుభ్రాస్త్రిశూలాంచితపాణయః ।
భస్మభాసితసర్వాంగాః రుద్రాక్షాంచితవిగ్రహాః ॥30॥

శివలోకాత్ సమాగత్య క్రుద్ధా యమపురీం యయుః ।
తాడయిత్వా తు తద్దూతాంస్తర్జయిత్వా పునః పునః ॥31॥

దేవరాజం సమామోచ్య విమానే పరమాద్భుతే ।
ఉపవేశ్య యదా దూతాః కైలాసం గంతుముత్సుకాః ॥32॥

తదా యమపురీమధ్యే మహాకోలాహలోఽభవత్ ।
ధర్మరాజస్తు తం శ్రుత్వా స్వాలయాద్బహిరాగమత్ ॥33॥

దృష్ట్వాథ చతురో దూతాన్ సాక్షాద్రుద్రానివాపరాన్ ।
పూజయామాస ధర్మజ్ఞో ధర్మరాజో యథావిధి ॥34॥

జ్ఞానేన చక్షుషా సర్వం వృత్తాంతం జ్ఞాతవాన్ యమః ।
న భయాత్ పృష్టవాన్ కించిత్ శంభోర్దూతాన్ మహాత్మనః ॥35॥

పూజితాః ప్రార్థితాస్తే వై కైలాసమగమంస్తదా ।
దదుశ్శివాయ సాంబాయ తం దయావారిరాశయే ॥36॥

అంతలోనే శివభటులు నల్వురు అక్కడికి వచ్చారు. వాళ్లు పరిశుద్ధులు. త్రిశూలాలు ధరించిన వాళ్లు, విభూతి పూతతో వాళ్ల శరీరం స్వచ్ఛంగా ప్రకాశిస్తుంది. రుద్రాక్షలు దాల్చి తేజస్సుతో శివమూర్తుల్లాగా ఉన్నారు. వాళ్లు శివలోకం నుండి వచ్చారు. కోపంతో యమపురికి ప్రవేశించారు. యమభటుల్ని కొట్టి బెదిరించారు. దేవరాజును పాశబంధాల నుండి విడిపించుకొని పరమాద్భుతమైన దివ్య విమానంలో కూర్చుండ బెట్టుకొని, కైలాసానికి తీసుకవెళ్లడానికి సిద్ధమయ్యారు. అప్పుడాయమనగరమంతా కోలాహలధ్వనులు వ్యాపించాయి. ఆ ధ్వని విని యమధర్మరాజు ఏం జరిగిందో నని తనమందిరం నుంచి వెలుపలికి వచ్చాడు. సాక్షాత్తు రుద్రుల్లాగా ప్రకాశిస్తున్న నల్వురు శివదూతల్ని చూచాడు. మహా శివభక్తి తత్పరుడూ ధర్మజ్ఞుడూ కనుక యముడు యథా విధిగా ఆ శివదూతల్ని పూజించి, గౌరవించాడు. దివ్య దృష్టితో విషయమంతా తెలుసుకొన్నాడు. కనుక యముడు భయపడి ఆ శివదూతల్తో మీరెందుకు ఇలా చేశారు అని ప్రశ్నించలేదు. అలా యమునితో పూజలుగొన్న ఆ శివదూతలు ఏమీ మాట్లాడకుండా దేవరాజును గైకొని కైలాసానికి వెళ్లి దయాసముద్రుడూ, ఉమాసహితుడూ అయిన శివునికి అతణ్ణి అప్పగించారు.

ధన్యా శివపురాణస్య కథా పరమపావనీ ।
యస్యాశ్శ్రవణమాత్రేణ పాపీయానపి ముక్తిభాక్ ॥37॥

పరమపవిత్రమైన శివపురాణకథ ధన్యం అయింది. ఈ కథను విన్నంతనే మహా పాపాత్ముడు కూడా మహాపుణ్యాత్ముడై ముక్తినొందుతాడు.

సదాశివమహాస్థానం పరంధామ పరం పదమ్ ।
యదాహుర్వేదవిద్వాంసః సర్వలోకోపరిస్థితమ్ ॥38॥

సదాశివుని నివాసస్థానము సర్వోత్కృష్టమైనది, అన్నిలోకములకంటె శ్రేష్ఠమైనదిగా వేదవిద్వాంసులు చెప్పుచున్నారు.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాశ్శూద్రా అన్యేఽపి ప్రాణినః ।
హింసితా ధనలోభేన బహవో యేన పాపినా ॥39॥

మాతృపితృవధూహంతా వేశ్యాగామీ చ మద్యపః ।
దేవరాజో ద్విజ స్తత్ర గత్వా ముక్తోఽభవత్ క్షణాత్ ॥40॥

ధనలోభం కారణంగా బ్రాహ్మణుల్నీ, క్షత్రియుల్నీ, వైశ్యుల్నీ, శూద్రుల్నీ ఇంకా ఎంతో మందిని ఎన్నోవిధాల హింసించి, చంపడమేకాక తల్లిదండ్రుల్నీ, భార్యనూ కూడా చంపి, వేశ్యాలోలుడై, మద్యపాన ప్రియుడై, అనేక పాపాలు చేసిన దేవరాజు అనే బ్రాహ్మణుడు ఆ శివపదాన్ని చేరుకోగానే క్షణకాలంలో ముక్తినొందాడు.

ఇతి శ్రీస్కాందే మహాపురాణే శివపురాణ మాహాత్మ్యే దేవరాజముక్తి వర్ణనం నామ ద్వితీయోఽధ్యాయః ॥2॥

శ్రీ స్కాంద మహాపురాణంలోని శివపురాణ మాహాత్మ్యంలో దేవరాజుకు ముక్తి చేకూరిన వర్ణన గల రెండవ అధ్యాయం సమాప్తం.

తృతీయోఽధ్యాయః - మూడవ అధ్యాయం

చంచులా వైరాగ్య వర్ణనమ్ - చంచులా వైరాగ్య వర్ణనం

శ్రీ శౌనక ఉవాచ - శ్రీ శౌనక మహర్షి చెప్పాడు.

సూత సూత మహాభాగ! సర్వజ్ఞోఽసి మహామతే ।
త్వత్ప్రసాదాత్ కృతార్థోఽహం, కృతార్థోఽహం పునఃపునః ॥1॥

ఓ సూత మహర్షీ! మహానుభావుడవు. సమస్తమూ తెలిసినవాడవు బుద్ధిమంతుడవైన నీ అనుగ్రహం వలన నేను కృతార్థుడనయ్యాను.

ఇతిహాసమిమం శ్రుత్వా మనో మేఽతీవ మోదతే ।
అన్యామపి కథాం శంభోర్వద ప్రేమవివర్ధినీమ్ ॥2॥

పురాతనమైన ఈ శివపురాణగాథను విని నామనస్సెంతో ఆనందమును పొందుచున్నది. భగవత్ప్రేమను పెంచగలిగే మరొక ఈశ్వరగాథను చెప్పవలసిందిగా కోరుచున్నాను.

నామృతం పిబతాం లోకే ముక్తిః క్వాపి సభాజ్యతే ।
శంభోః కథా సుధాపానం ప్రత్యక్షం ముక్తిదాయకమ్ ॥3॥

అమృతాన్ని త్రాగుటవలన ఎవడూ ముక్తిని పొందలేడు. కాని ఈశ్వరుని కథామృతాన్ని త్రాగడం నేరుగా ముక్తినిస్తుంది.

ధన్యా ధన్యా కథా శంభోః త్వం ధన్యో ధన్య ఏవ చ ।
యదాఽఽకర్ణన మాత్రేణ శివలోకం వ్రజేన్నరః ॥4॥

ఈశ్వరుని కథలు ధన్యములు, చెప్పిన నీవు ధన్యుడవు. కేవలం విన్నంత మాత్రమునే మానవులు శివలోకమును చేరగలరు.

సూత ఉవాచ - సూతుడు పలికాడు.

శృణు శౌనక వక్ష్యామి త్వదగ్రే గుహ్యమప్యుత ।
యతస్త్వం శివభక్తానామగ్రణీః వేదవిత్తమః ॥5॥

శౌనక మునీశ్వరా! శివభక్తులలో అగ్రేసురడవు, వేదవేత్తవు కావున రహస్యమైన దైననూ ఆ ఈశ్వరగాథను నీకు చెప్పెదను వినుము.

సముద్రనికటే దేశే గ్రామో బాష్కలసంజ్ఞకః ।
వసంతి యత్ర పాపిష్ఠా వేదధర్మోజ్ఝితా జనాః ॥6॥

సముద్ర తీర ప్రాంతంలో బాష్కలము అనే పేరుగల గ్రామం ఉంది. అక్కడ వేదధర్మాన్ని పాటించని పాపాత్ములైన మానవులు నివసిస్తున్నారు.

దుష్టా దుర్విషయాత్మానో నిర్దైవా జిహ్మవృత్తయః ।
కృషీవలాః శస్త్రధరాః పరస్త్రీభోగినః ఖలాః ॥7॥

దుష్టులు, ఇంద్రియలోలురు, దైవదూషకులు, కుటిలవర్తనులు, వ్యవసాయదారులు, శస్త్రధరులు, పరస్త్రీకాముకులు, మూర్ఖులతోనూ బాష్కలగ్రామం నిండి ఉంది. (వ్యవసాయం అందరికోసం కాక తమపొట్టనింపుకోవడం కోసం మాత్రమే చేసేవారు. ఇతరుల పై దాడి చేయడం కోసం, దోచుకోవడానికి నిరంతరం ఆయుధాలను ధరించి ఉండేవారు. అని భావం)

జ్ఞానవైరాగ్యసద్ధర్మా న జానంతి పరం హి తే ।
కుకథాశ్రవణాధ్యేషు నిరతాః పశుబుద్ధయః ॥8॥

జ్ఞానమూ, వైరాగ్యము, ధర్మము, పరహితమూ అనే విషయములు వారికి తెలియవు. తెలుసుకోవాలనే ప్రయత్నం కూడా చేయరు. నిత్యం పశువుల్లా ప్రవర్తిస్తూ దుష్టమైన కథలను వినడంలో ముందుంటారు.

అన్యే వర్ణాశ్చ కుధియః స్వధర్మవిముఖాః ఖలాః ।
కుకర్మనిరతా నిత్యం సదా విషయిణశ్చ తే ॥9॥

దుర్బుద్ధులు, తాము చేయవలసిన పనులపట్ల శ్రద్ధలేనివారు, నిత్యం చెడ్డపనులపై ఆసక్తికలవారు, విషయవాంఛలకై ప్రాకులాడేవారుగా అన్ని కులాలలోనూ ఉన్నారు.

స్త్రియస్సర్వాశ్చ కుటిలాః స్వైరిణ్యః పాపలాలసాః ।
కుధియో వ్యభిచారిణ్యః సద్వృత్తాచారవర్జితాః ॥10॥

ఇంకా ఆ గ్రామంలో ఆడవాళ్ళంతా కుటిలమైన స్వభావులు. పెద్దలను భర్తలనూ లెక్కచేయరు. పాపబుద్ధిపై అమితాసక్తికలవారు, దుర్బుద్ధులు, వ్యభిచారిణులు, సత్ప్రవర్తనను పూర్తిగా విడిచినవారే.

ఏవం కుజనసంవాసే గ్రామే బాష్కలసంజ్ఞితే ।
తత్రైకో బిందుగో నామ విప్ర ఆసీన్మహాధమః ॥11॥

ఈ రకంగా దుర్మార్గులకు ఆలవాలమైన బాష్కల గ్రామంలో 'బిందుగుడు' అనే పేరుగల నీచుడైన బ్రాహ్మణుడున్నాడు.

స దురాత్మా మహాపాపీ సుదారోఽపి కుమార్గగః ।
వేశ్యాపతిర్బభూవాథ కామాకులిత మానసః ॥12॥

ఆ దురాత్ముడైన పాపికి అందమైన భార్య ఉన్నప్పటికీ, ఆ బిందుగుడు కామాసక్తుడై ఒక వేశ్యను భార్యగా చేపట్టాడు.

స్వపత్నీం చంచులాం నామ హిత్వా నిత్యం సుధర్మిణీమ్ ।
రేమే స వేశ్యయా దుష్టః స్మరబాణప్రపీడితః ॥13॥

బిందుగుడు చంచులా అనే పేరు గల్గిన ధర్మపరురాలైన తన భార్యను విడిచి, మన్మథార్తితో ఆ వేశ్యతోనే నిత్యం సుఖిస్తున్నాడు.

ఏవం కాలో వ్యతీయాయ మహాంస్తస్య కుకర్మిణః ।
సా స్వధర్మభయాత్ క్లేశాత్ స్మరార్తాపి చ చంచులా ॥14॥

ఆ దుష్టుని భార్య చంచుల కామబాధపీడితురాలైనప్పటికీ ధర్మభంగ భయంతో కాలం గడుపుచున్నది.

అథస్తస్యాంగనా సాపి ప్రరూఢనవయౌవనా ।
అవిషహ్యస్మరావేశా స్వధర్మాద్విరరామహే ॥15॥

మిసమిసలాడే యౌవనంలో ఉన్న చంచుల కామబాధను నిగ్రహించుకోలేక పతివ్రతాధర్మాన్ని విడిచి పెట్టింది.

జారేణ సంగతా రాత్రౌ రేమే పాపేన గుప్తతః ।
పతిదృష్టిం వంచయిత్వా భ్రష్టసత్త్వా కుమార్గగా ॥16॥

భర్త కళ్ళుగప్పి, కామాన్ని జయించలేక బలహీనురాలై ఆ దుర్మార్గురాలు రహస్యంగా విటునితో రాత్రంతా రమించింది.

కదాచిత్తాం దురాచారం స్వపత్నీం చంచులాం మునే ।
జారేణ సంగతాం రాత్రౌ దదర్శ స్మరవిహ్వలామ్ ॥17॥

ఓ శౌనకమునీ! అలా ఆ చంచుల పాపకార్యం నిరంతరం సాగుతుండగా, ఒకనాటి రాత్రి విటునితో గూడి మన్మథ పారవశ్యంతో ఉన్న తన భార్యను బిందుగుడు చూశాడు.

దృష్ట్వా తాం దుష్టినీం పత్నీం కుకర్మాసక్తమానసామ్ ।
జారేణ సంగతాం రాత్రౌ క్రోధాద్దుద్రావ వేగతః ॥18॥

రాత్రి విటునితో కలిసి నీచకార్యంలో ఉన్న ఆ దుష్టురాలైన భార్యను చూసి బిందుగుడు క్రోధంతో ఇంట్లోనికి వేగంగా పరుగెత్తాడు.

తమాగతం గృహే దుష్టమాజ్ఞాయ బిందుగం ఖలః ।
పలాయితో ద్రుతం జారో వేగతశ్ఛద్మవాన్ స వై ॥19॥

ఇంట్లోకి వేగంగా వస్తున్న బిందుగుని చూసి (గుర్తించి) ఆ విటుడు బిందుగునికి కనిపించకుండా నక్కి నక్కి పారిపోయాడు.

అథ స బిందుగః పత్నీం గృహీత్వా సుదురాశయః ।
ముష్టిబంధేన సంతర్జ్య పునః పునరతాడయత్ ॥20॥

బిందుగుడు భార్యయైన చంచులను పట్టుకొని పిడికిళ్ళతో గ్రుద్దుతూ, మాటిమాటికీ కొట్టాడు.

సా నారీ తాడితా భర్త్రా చంచులా స్వైరిణీ ఖలా ।
కుపితా నిర్భయా ప్రాహ స్వపతిం బిందుగం ఖలమ్ ॥21॥

భర్తచే కొట్టబడి దుష్టురాలైన చంచుల భయం లేకుండా, కోపంతో మూర్ఖుడైన తన భర్త బిందుగునితో ఇలా అంది.

భవాన్ ప్రతిదినం కామం రమతే వేశ్యయా కుధీః ।
మాం విహాయ స్వపత్నీం చ యువతీం పతిసేవినీమ్ ॥22॥

నీవు యౌవనంలో ఉన్న పతిసేవా పరాయణురాలినైన నన్ను విడిచి ప్రతిరోజూ దుర్బుద్ధితో వేశ్యతో రమిస్తున్నావు.

రూపవత్యా యువత్యాశ్చ కామాకులితచేతసా ।
వినా పతివిహారం స్యాత్ కా గతిర్మే భవాన్వదేత్ ॥23॥

అందగత్తె, యౌవని, కామవాంఛలతో రగిలే భార్య తన భర్తను పొందలేక పోతే ఎలా ఉంటుంది? అలాంటి నాకు గతి ఏమిటో నీవే చెప్పు.

అహం మహారూపవతీ నవయౌవనవిహ్వలా ।
కథం సహే కామదుఃఖం తవసంగం వినార్తధీః ॥24॥

నేన గొప్ప అందగత్తెను. నూత్న యౌవనంతో మిడిసిపడుతున్నాను. అటువంటి నేను నీ పొందు లేకుండా బాధతో కామదుఃఖాన్ని ఎలా ఓర్చుకోగలను?

సూత ఉవాచ – సూతుడు పలికాడు.

ఇత్యుక్తస్స తయా మూర్ఖో మూఢధీః బ్రాహ్మణాధమః ।
ప్రోవాచ బిందుగః పాపీ స్వధర్మవిముఖః ఖలః ॥25॥

మూర్ఖుడు, మూఢబుద్ధిగల ఆ నీచబ్రాహ్మణుడైన బిందుగుడు, భర్త ధర్మాన్ని విడిచి పాపాత్ముడై భార్య చంచులతో ఇలా అన్నాడు.

సత్యమేతత్త్వయోక్తం హి కామవ్యాకులచేతసా ।
హితం వక్ష్యామి తస్మాత్ తే శ్రుణు కాంతే భయం త్యజ ॥26॥

కామం వలన అదుపు తప్పిన మనస్సుతో నీవు నిజాన్నే చెప్పావు. అయితే ఓ భార్యామణీ! నీకో మంచి విషయం చెబుతాను. భయం విడిచి విను.

జారైర్విహర నిత్యం త్వం చేతసా నిర్భయేన వై ।
ధనమాకర్ష తేభ్యో హి దత్వా తేభ్యః పరాం రతిమ్ ॥27॥

ఇక నుండి నీవు విటులతో నిర్భయంగా తిరుగు. వారికి అంతులేని రతి సుఖాలను అందించి, వారి నుండి ధనాన్ని రాబట్టు.

తద్ధనం దేహి సర్వం మే వేశ్యాసంసక్తచేతసః ।
మహత్స్వార్థే భవేన్నూనం తవాపి మమాపి చ ॥28॥

ఆ ధనం మొత్తాన్ని వేశ్యాలోలుడనైన నాకు ఇచ్చేయ్. దాని వల్ల నీకు నాకు కూడా ప్రయోజనం చేకూరుతుంది.

సూత ఉవాచ – సూతుడు పలికాడు.

ఇతి భర్తృవచః శ్రుత్వా చంచులా తద్వధూశ్చ సా ।
తథేతి భర్తృవచనం ప్రతిజగ్రాహ హృష్టధీః ॥29॥

భర్త మాటలను విని చంచుల ఆనందించి సరేనని అంగీకరించినది.

కృత్వైవం సమయం తౌ వై దంపతీ దుష్టమానసౌ ।
కుకర్మనిరతౌ జాతా నిర్భయేన కుచేతసా ॥30॥

ఈ విధంగా, దుష్టబుద్ధిగల ఆ దంపతులు నియమాన్ని ఏర్పరుచుకొని భయం లేకుండా దురాత్ములై నీచకార్యమగ్నులైనారు.

ఏవం తయోస్తు దంపత్యోః దురాచారప్రవృత్తయోః ।
మహాన్ కాలో వ్యతీయాయ నిష్ఫలో మూఢచేతసోః ॥31॥

ఈ విధంగా దురాచార ప్రవర్తకులైన ఆ దంపతుల కాలం నిరర్థకంగా గడచిపోయింది.

అథ విప్రస్య కుమతిః బిందుగో వృషలీపతిః ।
కాలేన నిధనం ప్రాప్తో జగామ నరకం ఖలః ॥32॥

తరువాత దుర్బుద్ధి మరియు శూద్రస్త్రీకి భర్తయైన ఆ బిందుగ బ్రాహ్మణుడు కాలగమనంలో మరణించి నరకలోకానికి చేరాడు.

భుక్త్వా నరకదుఃఖాని బహ్వాహాని స మూఢధీః ।
వింధ్యేఽభవత్పిశాచో హి గిరౌ పాపీ భయంకరః ॥33॥

ఎన్నో రోజులు బిందుగుడు నరకలోక దుఃఖాలను అనుభవించి, పాపానుభవం పూర్తికాక పోవడం చేత భయంకరమైన పిశాచమై వింధ్యపర్వతం పైకి చేరాడు.

మృతే భర్తరి తస్మిన్ వై దురాచారేఽథ బిందుగే ।
ఉవాస స్వగృహే పుత్రైః చిరకాలం విమూఢధీః ॥34॥

దురాచారుడైన బిందుగుడు మరణించిన తరువాత మూఢబుద్ధిగల అతని భార్య చంచుల చాలాకాలం వరకూ పుత్రులతో కలసి సొంత ఇంటిలోనే నివసించింది.

ఏవం విహరతీ జారైస్సా నారీ చంచులాహ్వయా ।
ఆసీత్కామరతా ప్రీతా కించిదుత్క్రాంతయౌవనా ॥35॥

కామ కేళియందుగల ఆసక్తితో చంచుల విటులతో యథేచ్ఛగా తిరుగసాగింది. కొన్నాళ్ళకు ఆమె యౌవన దశను దాటింది వృద్ధురాలైంది.

ఏకదా దైవయోగేన సంప్రాప్తే పుణ్యపర్వణి ।
సా నారీ బంధుభిస్సార్థే గోకర్ణం క్షేత్రమాయయౌ ॥36॥

ఒకప్పుడు పుణ్యదినం రోజున బంధువులందరూ గోకర్ణయాత్రకు బయలుదేరారు. భగవంతుని అనుగ్రహం వల్ల చంచుల వారితో పాటు తానుకూడా గోకర్ణ క్షేత్రానికి వెళ్ళింది.

ప్రసంగాత్సా తదా గత్వా కస్మింశ్చిత్ తీర్థపాథసి ।
సస్నౌ సామాన్యతో యత్ర తత్ర బభ్రామ బంధుభిః ॥37॥

మాటల మధ్య వెళుతూ ఒకానొక తీర్థజలంలో స్నానం చేసింది. మామూలుగా అక్కడ బంధువులతో కలిసి తిరుగాడింది.

దేవాలయేఽథ కస్మింశ్చిత్ దైవజ్ఞముఖతః శుభామ్ ।
శుశ్రావ సత్కథాం శంభోః పుణ్యాం పౌరాణకీం చ సా ॥38॥

తరువాత దేవాలయంలో ఒక దైవజ్ఞ పండితుని ద్వారా పుణ్యప్రదమైన ఈశ్వరుని పురాణ గాథను విన్నది.

యోషితాం జారసక్తానాం నరకే యమకింకరాః ।
సంతప్తలోహపరఘం క్షిపంతి స్మర మందిరే ॥39॥

జారుల పట్ల ఆసక్తులైన స్రీలు మరణించి నరకానికి వెళతారు. అక్కడ యమకింకరులు బాగా కాల్చిన ఇనుప గుదియను ఆ స్త్రీల యోనిలోకి త్రోస్తారు.

ఇతి పౌరాణికేనోక్తాం శ్రుత్వా వైరాగ్యవర్ధినీమ్ ।
కథామాసీద్భయోద్విగ్నా చకంపే తత్ర సా చ వై ॥40॥

ఇలా పౌరాణికుడు చెప్పిన వైరాగ్యం పెంపొందించే కథను విని చంచులకు జీవితంపై ఏవగింపు కలిగి సిగ్గుతో భయంతో వణికి పోయింది.

కథా సమాప్తౌ సా నారీ నిర్గతేషు జనేషు చ ।
భీతా రహసి తం ప్రాహ శైవం సంవాచకం ద్విజమ్ ॥41॥

కథ ముగియగానే భక్త జనులందరూ వెళ్ళిపోయిన తరువాత శివపురాణం చెప్పిన బ్రాహ్మణునితో భయ పడుతూ రహస్యంగా ఇలా అంది.

చంచుల ఉవాచ – చంచుల పలికింది.

బ్రహ్మన్ త్వం శ్రుణ్వసద్వృత్తమజానంత్యా స్వధర్మకమ్ ।
శ్రుత్వా మాముద్ధర స్వామిన్ కృపాం కృత్వాఽతులామపి ॥42॥

ఓ బ్రహ్మస్వరూపుడా! ధర్మము తెలియక నేను దుర్మార్గంగా ప్రవర్తించిన విషయము వినుము. స్వామీ! ఆ పై సాటిలేని దయతో ఈ పాపకూపం నుండి నన్ను ఉద్ధరించు.

చరితం సూల్బణం పాపం మయా మూఢధియా ప్రభో ।
నీతం పౌంశ్చల్యతస్సర్వం యౌవనం మదనాంధయా ॥43॥

ప్రభూ! మూర్ఖబుద్ధి వలన కామంతో కళ్ళు మూసుకుపోయిన యౌవనంలో రంకుతనం వల్ల పొందిన పాపపుపొంగంతా శివపురాణ కథా శ్రవణం వల్ల తొలగిపోయింది.

శ్రుత్వేదం వచనం తేఽద్య వైరాగ్యరసజ్జృంభితమ్ ।
జాతా మహాభయా సాహం సకంపాత్తవియోగికా ॥44॥

ఇప్పుడు వైరాగ్యరసాన్ని చిప్పిలజేసే నీ మాటలు విని నాకు భయంతోనూ, వణుకుతోనూ కూడిన వైరాగ్యం కలిగింది.

ధిక్ మాం మూఢధియం పాపాం కామమోహితచేతసామ్ ।
నింద్యాం దుర్విషయాసక్తాం విముఖీం హి స్వధర్మతః ॥45॥

ఛీఛీ! మూఢబుద్ధిని, పాపాత్మురాలను, కామమోహితను, నింద్యురాలను, విషయలోలను ఐన నేను నా ధర్మవర్తనము నుండి ప్రక్కకు తప్పుకున్నాను.

యదల్పస్య సుఖస్యార్థే స్వకార్యస్య వినాశినః ।
మహాపాపం కృతం ఘోరం అజానంత్యతికష్టదమ్ ॥46॥

అత్యల్పమైన సుఖం కోసం, శాశ్వతమైన స్వకార్యమును నాశనం చేసుకునే వారు, ఎంతోకష్టాన్ని కలిగించే గొప్ప పాపాన్ని చేస్తున్నామని తెలుసుకోవడం లేదు.

యాస్యామి దుర్గతిం కాం కాం ఘోరాం హా కష్టదాయినీమ్ ।
కోఽజ్ఞోయాస్యతి మాం తత్ర కుమార్గరతమానసామ్ ॥47॥

నేను భయంకరమై కష్టాలను కలిగించే ఏ దుర్గతిని పొందుతాను? నీచమార్గ గమనాసక్తురాలినైన నన్ను ఏజ్ఞాని కాపాడుతాడు?

మరణే యమదూతాన్ తాన్ కథం ద్రక్ష్యే భయంకరాన్ ।
కథం పాశైర్బలాత్కంఠే బధ్యమానా ధృతిం లభే ॥48॥

మరణానంతరం భయంకరమైన యమదూతలను ఎలా చూడగలను? పాశములతో బలవంతంగా కంఠాన్ని బంధిస్తుంటే ఎలా ధైర్యాన్ని పొందగలను?

కథం సహిష్యే నరకే ఖండశో దేహకృంతనమ్ ।
యాతనాం తత్ర మహతీం దుఃఖదాం చ విశేషతః ॥49॥

నరకంలో దేహాన్ని బల్లెములతో ముక్కలు చేస్తున్నప్పుడు విపరీతమైన దుఃఖాన్ని కలిగించే బాధలను పెడుతున్నప్పుడు ఎట్లా ఓర్చుకోగలను.

దివా చేష్టామింద్రియాణాం కథం ప్రాప్స్యామి శోచతీ ।
రాత్రౌ కథం లభిష్యేహం నిద్రాం దుఃఖ పరిప్లుతా ॥50॥

పగలనకా రాత్రనకా నిరంతరం ఇంద్రియ సుఖాల కోసం పరితపించేవారికి రాత్రి నిద్ర ఎలా పడుతుంది? దుఃఖాన్ని కొని తెచ్చుకోవడం తప్ప.

హా! హతాస్మి చ దగ్ధాస్మి విదీర్ణహృదయాస్మి చ ।
సర్వథాఽహం వినష్టాస్మి పాపినీ సర్వథాప్యహమ్ ॥51॥

అయ్యో! నేను హతురాలనైతిని, కాల్చబడితిని, గుండె పగిలినదాననైనాను. అన్ని విధాలా నష్టపోయాను. పాపినయ్యాను.

హా విధే! మాం మహాపాపే దత్త్వా దుశ్శేముషీం హఠాత్ ।
అపైతి యత్స్వధర్మాద్వై సర్వసౌఖ్యకరాదహో ॥52॥

ఓ భగవంతుడా! మహాపాపినైన నాకు దుర్బుద్ధినిచ్చి హఠాత్తుగా సర్వసౌఖ్యములను కలిగించి పతివ్రతా ధర్మము నుండి దూరం చేసితివి.

శూలప్రోతస్య శైలాగ్రాత్ సతతస్తుంగతో ద్విజ ।
యద్దుఖం దేహినో ఘోరం తస్మాత్కోటిగుణం మమ ॥53॥

ఓ బ్రాహ్మణోత్తమా! శూలంతో గుచ్చడం, ఎత్తైన పర్వతాగ్రం నుండి పడద్రోయడం వలన కలిగే బాధ అన్ని ప్రాణుల కంటె నాకు కోటిరెట్లు ఎక్కువగా ఉంటుంది.

అశ్వమేధశతం కృత్వా గంగాం స్నాత్వా శతం సమాః ।
న శుద్ధిర్జాయతే ప్రాయో మత్పాపస్య గరీయసః ॥54॥

నూరు అశ్వమేధ యాగములు చేసినా, నూరు సంవత్సరముల పాటు గంగానదిలో స్నానం చేసినా నామహాపాపములు క్షాళనగావు.

కిం కరోమి? క్వ గచ్ఛామి? కం వా శరణమాశ్రయే? ।
కః త్రాయతే మాం లోకేస్మిన్ పతంతీం నరకార్ణవే ॥55॥

నరకమనే మహా సముద్రంలో పడబోయే నన్ను ఈ లోకంలో ఎవడు రక్షిస్తాడు? ఏమి చేయను? ఎక్కడకు వెళ్ళను? ఎవరి శరణమును పొందుదును?

త్వమేవ మే గురుర్బ్రహ్మన్ త్వం మాతా త్వం పితాసి చ ।
ఉద్ధరోద్ధర మాం దీనాం త్వమేవ శరణం గతామ్ ॥56॥

ఓ బ్రాహ్మణోత్తమా! నీవే నాకు గురువు, తల్లివి, తండ్రివి. నిన్నే శరణు పొందుతున్నాను. దీనురాలనైన నన్ను ఉద్ధరించుము.

సూత ఉవాచ – సూతుడు పలికాడు.

ఇతి సంజాతనిర్వేదాం పతితాం చరణద్వయే ।
ఉత్థాప్య కృపయా ధీమాన్ బభాషే బ్రాహ్మణస్స హి ॥57॥

ఈ విధంగా అనంతమైన దుఃఖంతో దైవజ్ఞుని పాదములపై పడిన చంచులను దయతో లేవనెత్తి బ్రాహ్మణుడిట్లు చెప్పాడు.

ఇతి శ్రీ స్కాందపురాణే శివ పురాణ మాహాత్మ్యే చంచులా వైరాగ్య వర్ణనం నామ తృతీయోఽధ్యాయః ॥3॥

శ్రీ స్కాంద మహాపురాణం శివపురాణ మాహాత్మ్యంలో చంచులా వైరాగ్య వర్ణనమనే మూడవ అధ్యాయం సమాప్తం.

చతుర్థోఽధ్యాయః - నాల్గవ అధ్యాయం

చంచులా సద్గతి వర్ణనం - చంచులా సద్గతి వర్ణనం

బ్రాహ్మణ ఉవాచ - బ్రాహ్మణుడు పలికాడు.

దిష్ట్యా కాలే ప్రబుద్ధాసి శివానుగ్రహతో వరామ్ ।
శివపురాణస్య శ్రుత్వా వై వైరాగ్యవత్కథామ్ ॥1॥

ఓ చంచులా! అదృష్టవశాత్తు వైరాగ్యాన్ని కలిగించే శివపురాణం వినడం వలన, శివానుగ్రహంతో తగిన సమయంలో బుద్ధిమంతురాలవయ్యావు.

మా భైషీః ద్విజపత్ని త్వం శివస్య శరణం వ్రజ ।
శివానుగ్రహతస్సర్వే పాపం సద్యో వినశ్యతి ॥2॥

ఓ బ్రాహ్మణపత్నీ! భయపడకు. ఈశ్వరుని శరణుపొందు. ఆయన దయవలన సమస్త పాపమూ వెంటనే నశించిపోతుంది.

వక్ష్యామి తే పరం వస్తు శివకీర్తిసమన్వితమ్ ।
భవిష్యతి గతిర్యేన సర్వదా తే సుఖావహా ॥3॥

ఈశ్వర మహిమతో కూడిన గొప్ప విషయాన్ని నీకు చెబుతాను. అది ఎల్లపుడూ సుఖాన్ని కలిగించే సద్గతికాగలదు.

సత్కథాశ్రవణాదేవ జాతా తే మతిరీదృశీ ।
పశ్చాత్తాపాన్వితా శుద్ధా వైరాగ్యం విషయేషు చ ॥4॥

ఈశ్వరుని సత్కథలు వినడం చేత పశ్చాత్తాపంతో కూడిన పవిత్రత, విషయ వైరాగ్యము కలిగి బుద్ధి నిర్మలమవుతుంది.

పశ్చాత్తాపః పాపకృతాం పాపానాం నిష్కృతిః పరా ।
సర్వేషాం వర్ణితం సద్భిః సర్వపాపవిశోధనమ్ ॥5॥

పాపకార్యాలు చేసిన పాపులకు పశ్చాత్తాపమే గొప్ప తరణోపాయం. మహానుభావులందరూ సర్వపాపాలనూ హరించే పశ్చాత్తాపం గూర్చి చెప్పారు.

పశ్చాత్తాపేనైవ శుద్ధిః ప్రాయశ్చిత్తం కరోతి సః ।
యథోపదిష్టం సద్భిర్హి సర్వపాపవిశోధనమ్ ॥6॥

సత్పురుషులు చెప్పినట్లుగా సర్వపాపాలనూ నశింపజేసే ప్రాయశ్చిత్తకర్మను ఆచరించాలి. అటువంటి పశ్చాత్తాపం వల్లనే ఆత్మ శుద్ధమౌతుంది.

ప్రాయశ్చిత్తమధీకృత్య విధివత్ నిర్భయః పుమాన్ ।
న యాతి సుగతిం ప్రాయః పశ్చాత్తాపీ న సంశయః ॥7॥

శాస్త్రానుగుణమైన ప్రాయశ్చిత్తకాండను ఆచరించడానికి వెనుకాడేవాడు స్వర్గమును పొందలేడు. పశ్చాత్తాపం పొందినవాడు సందేహం లేకుండా స్వర్గాన్ని పొందుతాడు.

ఏతత్ శివపురాణస్య కథాశ్రవణతో యథా ।
జాయతే చిత్తశుద్ధిర్హి న తథాన్యైరుపాయతః ॥8॥

ఈ శివపురాణ శ్రవణం వలన మనస్సుకు పవిత్రతచేకూరినట్లు మరే ఇతర ఉపాయాలతోనూ కలుగదు. అనగా శివపురాణ కథా శ్రవణము మాత్రమే మనస్సుకు శుద్ధిని కలిగిస్తుంది.

శోధమానం దర్పణం హి యథా భవతి నిర్మలమ్ ।
తథైతత్కథయా చేతః విశుద్ధిం యాత్యసంశయమ్ ॥9॥

కడుగబడిన అద్దం ఎంత నిర్మలంగా ఉంటుందో, అట్లే శివపురాణ కథలచే కడుగబడిన మనస్సు కూడా అంతే నిర్మలంగా ఉంటుంది. దీనిలో ఎట్టి సందేహమూలేదు.

విశుద్ధే చేతసి శివో నృణాం తిష్ఠతి సాంబికః ।
తతో యాతి విశుద్ధాత్మా సాంబశంభోః పరం పదమ్ ॥10॥

నిర్మలమైన మానవుల మనస్సులలో ఈశ్వరుడు పార్వతీసహితుడై కొలువుంటాడు. ఆ తరువాత ఆ నిర్మల మనస్కుడు పార్వతీ పరమేశ్వరుల సన్నిధికి చేరుకుంటాడు.

అతస్సర్వస్య వర్గస్య ఏతత్కథాసాధనం మతమ్ ।
ఏతదర్థే మహాదేవో నిర్మమేఽనుగ్రహాది మామ్ ॥11॥

అందువలన అన్ని వర్గముల వారికి ఈ కథ సాధనం మౌతుంది. అందుకోసమే పరమేశ్వరుడు శివ పురాణాన్ని దయతో సృష్టించాడు.

కథయా సిధ్యతి ధ్యానం అనయా గిరిజాపతేః ।
ధ్యానాత్ జ్ఞానం పరం తస్మాత్ కైవల్యం భవతి ధ్రువమ్ ॥12॥

ఆ పరమేశ్వరుని కథ వలన ధ్యానం కలుగుతుంది. ధ్యానం వలన గొప్ప జ్ఞానము, జ్ఞానం వలన మోక్షము సిద్ధిస్తుంది.

అసిద్ధశంకరజ్ఞానం కథామేవ శృణోతి యః ।
స ప్రాప్యాన్యభవే ధ్యానం శంభోర్యాతి పరాంగతిమ్ ॥13॥

ఈశ్వరజ్ఞానం సిద్ధించకుండా, కేవలం కథనే విన్నవాడు మరు జన్మలో ధ్యానాన్ని పొంది ఈశ్వరుని కైవల్యపదానికి చేరుకుంటాడు.

ఏతత్కథాశ్రవణతః కృత్వా ధ్యానముమాపతేః ।
తే పశ్చాత్తాపినః పాపా బహవః సిద్ధిమాగతాః ॥14॥

ఈ మహాపురాణ కథను వినడం చేత, ఉమాపతిని ధ్యానించుట చేత పశ్చాత్తాపము పొందిన పాపులు సిద్ధి పొందారు.

సర్వేషాం శ్రేయసాం బీజం సత్కథాశ్రవణం నృణామ్ ।
యథావర్త్మ సమారాధ్యం భవబంధగదాపహమ్ ॥15॥

ఈ శివపురాణ కథా శ్రవణము. మానవుల సర్వశుభాలకు మూలమైనది సంసార బంధనాల పాపాలను ఛేదించే ఈ మార్గమే అందరికీ అనుసరణీయం.

కథాశ్రవణతః శంభోః మననాచ్చ తతో హృదా ।
నిదిధ్యాసనతశ్చైవ చిత్తశుద్ధిర్భవత్యలమ్ ॥16॥

శివపురాణ కథను వినడం, హృదయంలో మననం చేయడం, పదేపదే స్మరించడం అనే వాటి వలన మనస్సు నిర్మల మవుతుంది.

అతిభక్తిర్మహేశస్య పుత్రాభ్యాం భవతి ధ్రువమ్ ।
తదనుగ్రహాత్ దివ్యా తతో ముక్తిర్న సంశయః ॥17॥

నిర్మలమైన మనసుకు గణపతి కుమార స్వాముల వలన కూడా భక్తి కలుగుతుంది. వారి అనుగ్రహము వలన కూడా దివ్యత్వము ఆపై మోక్షము తప్పక కలుగుతాయి.

తద్విహీనః పశుఃజ్ఞేయః మాయాబంధనసక్తధీః ।
సంసారబంధనాత్ నైవ ముక్తో భవతి స ధ్రువమ్ ॥18॥

భక్తిలేనివాడు పశువుతో సమానుడు. మాయ పట్ల ఆసక్తుడై సంసార బంధనాలలో చిక్కుకొన్నవాడు నిశ్చయంగా మోక్షాన్ని పొందలేడు.

అతో హి ద్విజపత్నిత్వం విషయేభ్యో నివృత్తధీః ।
శ్రుణు శంభో కథాం చైతాం భక్త్యా పరమపావనీమ్ ॥19॥

కావున ఓ బ్రాహ్మణ పత్నీ! నీవు ఇంద్రియ సుఖములపై విరక్తి కలిగి పరమ పావనమైన శివుని కథను భక్తితో వినుము.

శ్రుణ్వన్త్యాస్సత్కథామేతాం శంకరస్య పరాత్మనః ।
శుద్ధిమేష్యతి చేతస్తే తతో ముక్తిమవాప్స్యసి ॥20॥

పరమేశ్వరుడైన శంకరుని కథలను వినడంచేత నీ మనస్సు పవిత్రమవుతుంది. పవిత్ర మనస్కురాలవై మోక్షాన్ని పొందుతావు.

ధ్యాయతః శివపదాబ్జం చేతసా నిర్మలేన వై ।
ఏకేన జన్మనా ముక్తిః సత్యం సత్యం వదామ్యహమ్ ॥21॥

నిర్మలమైన మనస్సుతో ఈశ్వర పదకమలాలను ధ్యానిస్తే ఒక్క జన్మతోనే మోక్షం లభిస్తుందనే సత్యాన్ని నొక్కి వక్కాణిస్తున్నాను.

సూత ఉవాచ – సూతుడు పలికాడు.

ఇత్యుక్త్వా స ద్విజవరో వరశ్శైవః కృపార్ద్రధీః ।
తూష్ణీం బభూవ శుద్ధాత్మా శివధ్యానపరాయణః ॥22॥

దయా ఈశ్వరానుగ్రహ చిత్తుడైన ఆ దైవజ్ఞుడు ఇలా చెప్పి శివధ్యానంతో విశుద్ధుడై మౌనంగా ఉండిపోయాడు.

అథ బిందుగపత్నీ సా చంచులాహ్వా ప్రసన్నధీః ।
ఇత్యుక్త్వా తేన విప్రేణ సమాసీద్బాష్పలోచనా ॥23॥

తరువాత ప్రశాంత బుద్ధితో బిందుగుని భార్యయైన చంచుల కన్నీళ్ళు పెట్టుకొని బ్రాహ్మణునితో ఇలా అంది.

పపాతారం ద్విజేంద్రస్య పాదయోస్తస్య హృష్టధీః ।
చంచులా సాంజలిస్సా చ కృతార్థాస్మీత్యభాషత ॥24॥

బ్రాహ్మణుని మాటలకు సంతుష్టురాలై ఆయన పాదములపైబడి నమస్కరిస్తూ స్వామీ! నీవలన కృతార్థురాలనైనాను అని అంది.

అథ సోత్థాయ సాతంకా సాంజలిర్గద్గదాక్షరం ।
తమువాచ మహాశైవం వైరాగ్యయుక్తధీః ॥25॥

చంచుల ఉద్వేగంతో పైకిలేచి నమస్కరిస్తూ, తడబడే కంఠంతో, మహాశైవుడైన బ్రాహ్మణునితో విరాగియై ఇలా అంది.

బ్రహ్మన్ శైవవరస్వామిన్ ధన్యస్త్వం పరమార్థదృక్ ।
పరోపకారనిరతో వర్ణనీయః సుసాధుషు ॥26॥

ఓ స్వామీ! బ్రాహ్మణుడా! శివభక్తులలో శ్రేష్ఠుడా! పరమార్థదృష్టి కలవాడా! నీవు ధన్యుడవు. పరోపకార నిరతుడవు. సాధువులందు వర్ణింపదగినావు.

ఉద్ధరోద్ధర మాం సాధో పతంతీం నరకార్ణవే ।
శ్రుత్వా యాం సుకథాం శైవీం పురాణార్థవిజృంభితామ్ ॥27॥

ఓ పుణ్యమూర్తీ ! మహా ప్రయోజనం గల శైవసత్కథను వినిపించి నరక మహా సముద్రంలో పడిపోయే నన్ను ఉద్ధరించు.

విరక్తం ధీరహం జాతా విషయేభ్యశ్చ సర్వతః ।
సుశ్రద్ధా మహతీహ్యేతత్ పురాణ శ్రవణేఽధునా ॥28॥

నేను సమస్త విషయవాంఛల నుండి విరక్తురాలనయ్యాను. ఇప్పుడు శివపురాణం వినాలనే శ్రద్ధ కలిగింది.

సూత ఉవాచ – సూతుడు పలికాడు.

ఇత్యుక్త్వా సాంజలిః సాశ్రో వై సంప్రాప్య తదనుగ్రహమ్ ।
తత్పురాణం శ్రోతుకామాఽతిష్ఠత్ తత్సేవనే రతా ॥29॥

చంచుల ఈ విధంగా పలికి దైవజ్ఞుని అనుగ్రహాన్ని పొంది, నమస్కరించి ఆయన సేవలో మునిగి శివపురాణాన్ని వినాలనే కోరికతో కూర్చున్నది.

అథ శైవవరో విప్రః తస్మిన్నేవ స్థలే సుధీః ।
సత్కథాం శ్రావయామాస తత్పురాణస్య తాం స్త్రియమ్ ॥30॥

శివభక్తాగ్రగణ్యుడైన బ్రాహ్మణుడు ఆ ప్రదేశంలోనే చంచులకు శివపురాణగాథను వినిపించాడు.

ఇత్థం తస్మిన్ మహాక్షేత్రే తస్మాదేవ ద్విజోత్తమాత్ ।
కథాం శివపురాణస్య సా శుశ్రావ మహోత్తమామ్ ॥31॥

ఈ విధంగా ఆ బ్రాహ్మణోత్తముడు, ఆ స్థలంలోనే ఉత్తమమైన శివ పురాణాన్ని వివరించాడు.

భక్తిజ్ఞానవిరాగాణాం వర్ధినీం ముక్తిదాయినీమ్ ।
బభూవ సుకృతార్థా సా శ్రుత్వా తాం సత్కథాం పరామ్ ॥32॥

భక్తి జ్ఞాన వైరాగ్యాలను పెంపొందించి ముక్తిని ప్రసాదించే శివపురాణకథను విని చంచుల కృతార్థురాలయింది.

సద్గురోస్తస్య కృపయా శుద్ధచిత్తా చ సా ద్రుతమ్ ।
శివానుగ్రహతః శంభో రూపధ్యానమవాప హ ॥33॥

ఆ సద్గురుని దయవల్ల చంచుల త్వరగా నిర్మల మనస్కురాలయింది. ఈశ్వరానుగ్రహం వల్ల స్వామి రూపధ్యానంలో నిమగ్నురాలైంది.

ఇత్థం సద్గురుమాశ్రితస్య సా ప్రాప్తశివసన్మతిః ।
దధ్యౌ ముహుర్ముహుః శంభోః చిదానందమయం వపుః ॥34॥

ఈ విధంగా ఉత్తమగురువునాశ్రయించి ఆ చంచుల శివానుగ్రహం పొందింది. మాటిమాటికీ జ్ఞానానంద స్వరూపుడైన ఈశ్వరుని, చిదానందమయమైన శరీరాన్ని మాటిమాటికీ తన మనస్సులో స్థాపించుకొని ధ్యానించింది.

స్నాత్వా తీర్థజలే నిత్యం జటావల్కలధారిణీ ।
భస్మోద్ధూళితసర్వాంగీ రుద్రాక్షకృతభూషణా ॥35॥

రోజూ పుణ్యతీర్థంలో స్నానం చేసి, నార చీరలను ధరించి, శరీరమంతా భస్మాన్ని పూసుకొని, రుద్రాక్ష మాలలను ఆభరణాలుగా ధరిస్తోంది.

శివనామజపాఽఽసక్తా వాగ్యతా మితభోజనా ।
గురూపదిష్టమార్గేణ సా శివం సమతోషయత్ ॥36॥

చంచుల శివజపంపట్ల ఆసక్తురాలైంది. మితభాషణం, మితభోజనం, ఆచరిస్తూ గురువు చెప్పిన మార్గాన్ని అనుసరిస్తూ ఈశ్వరుని సంతృప్తి పరచింది.

ఏవం తస్యాః చంచులాయాః కుర్వంత్యా ధ్యానముత్తమమ్ ।
బహుకాలో వ్యతీయాయ శంభోస్తత్రైవ శౌనక ॥37॥

ఓ శౌనకా! ఈ విధంగా చంచుల ఉత్తమమైన ఈశ్వరధ్యానం చేసింది. అలా చాలా కాలం గడిచింది.

అథ కాలేన పూర్ణేన భక్తిత్రికసమన్వితా ।
సముత్ససర్జ దేహస్వం అనాయాసేన చంచులా ॥38॥

ఆ విధమైన సాధన, భావన, ప్రేమ భక్తులతో స్వామిని మెప్పించిన చంచుల అంతిమకాలం సమీపించగా అనాయాసంగా దేహాన్ని విడిచి పెట్టింది.

విమానం ద్రుతమాయాతం ప్రేషితం త్రిపురారిణా ।
దివ్యం స్వగణసంయుక్తం నానాశోభాసమన్వితమ్ ॥39॥

వెంటనే ఈశ్వరుడు చంచులను తన సన్నిధికి తీసుకురమ్మని ప్రమథగణాలతో కూడిన అతి సుందరమైన దివ్య విమానాన్ని పంపించాడు.

అథ తత్ర సమారూఢా మహేశ్వరానుచరైర్వరైః ।
నీతా శివపురీం సద్యో ధ్వస్తసర్వమలా చ సా ॥40॥

శివుని అనుచరగణం చంచులను దివ్య విమానం ఎక్కించి ఈశ్వర నగరానికి తీసుకువచ్చారు. సమస్త కలుషాలు నశించి చంచుల అతి పవిత్రురాలయింది.

దివ్యరూపధరా దివ్యా దివ్యావయవశాలినీ ।
చంద్రార్ధశేఖరా గౌరీ విలసద్దివ్యభూషణా ॥41॥

ఆమె దివ్య రూపము ధరించి దివ్య అవయవాలతో, ప్రకాశిస్తూ చంద్రుని సగభాగాన్ని తలపై ధరించి గౌరవర్ణము కలదై దివ్యభూషణాలతో ప్రకాశించింది.

గత్వా తత్ర మహాదేవం సా దదర్శ త్రిలోచనమ్ ।
విష్ణుబ్రహ్మాదిభిర్దేవైః సేవ్యమానం సనాతనమ్ ॥42॥

కొంచెం ముందుకు వెళ్ళి విష్ణు, బ్రహ్మాది సకల దేవతలతో పూజలందుకుంటున్న త్రిలోచనుడైన ఆది దేవుని చూసింది.

గణేశభృంగినందీశవీరభద్రేశ్వరాదిభిః ।
ఉపాస్యమానం సద్భక్త్యా కోటిసూర్యసమప్రభమ్ ॥43॥

గణపతి, నంది, భృంగి, వీరభద్రుడు మొదలైన ప్రమథులు భక్తితో పూజిస్తుండగా కోటిసూర్యుల ప్రకాశంతో వెలిగిపోతున్న శివుని చూసింది.

నీలగ్రీవం పంచవక్త్రం త్ర్యంబకం చంద్రశేఖరమ్ ।
వామాంగే బిభ్రతం గౌరీం విద్యుత్పుంజసమప్రభమ్ ॥44॥

నల్లని కంఠంతో, ఐదుముఖాలతో, మూడుకళ్ళతో సిగపై చంద్రునితో పార్వతీదేవిని శరీరార్ధభాగంలో ధరించి మెరుపుల గుంపుతో సమానంగా ప్రకాశిస్తున్న స్వామిని చూసింది.

కర్పూరగౌరగౌరీశం సర్వాలంకారధారిణమ్ ।
సితభస్మలసద్దేహం సితవస్త్రం మహోజ్జ్వలమ్ ॥45॥

కర్పూరం వంటి తెలుపుతో, సర్వాలంకారాలను ధరించి, తెల్లని విభూతిచే ప్రకాశించు శరీరంతో, తెల్లని వస్త్రాలతో మిరిమిట్లు గొలుపుతున్న శంకరుని చూసింది.

దృష్ట్వా ఏవం శంకరం నారీ సా ముమోదాతిచంచులా ।
సుసంభ్రమాత్ మహాప్రీతా ప్రణనామ పునః పునః ॥46॥

శంకరుని చూసి అత్యంతానందాన్ని పొందిన చంచుల ఆశ్చర్యంతో ప్రీతితో పదే పదే నమస్కరించింది.

సాంజలిస్సా ముదా ప్రేమ్ణా సంతుష్టా చ వినీతికా ।
ఆనందాశ్రుజలైర్యుక్తా రోమహర్ష సమన్వితా ॥47॥

నమస్కరించిన ఆమెకు సంతోషమూ, ప్రేమ, సంతృప్తి, వినయము, ముప్పిరిగొని శరీరం గగుర్పాటు చెందగా ఆనంద బాష్పములను రాల్చింది.

అథ సా వై కరుణయా పార్వత్యా శంకరేణ చ ।
సమానీతోపకంఠం హి సుదృష్ట్యా చ విలోకితా ॥48॥

తరువాత పార్వతీ పరమేశ్వరులు ఆమెను పరిశీలనగా చూస్తూ దయతో దగ్గరకు తీసుకున్నారు.

పార్వత్యా సా కృతా ప్రీత్యా స్వసఖీ దివ్యరూపిణీ ।
దివ్యసౌఖ్యాన్వితా తత్ర చంచులా బిందుగప్రియా ॥49॥

దివ్యరూపం గల పార్వతీ దేవి బిందుగుని భార్యయైన చంచులను అత్యంత ప్రేమతో సఖురాలిగా చేసుకొని ఆమెకు గొప్ప ఆనందాన్ని కలిగించింది.

తస్మిన్ లోకే పరానందఘనజ్యోతిషి శాశ్వతీ ।
లబ్ధ్వా నివాసమచలం లేభే సుఖమనాహతమ్ ॥50॥

నిరాఘాటంగా ప్రకాశరూపమైన ఆ శాశ్వతలోకంలో ఎంతో ఆనందంగా శాశ్వత నివాసాన్ని పొందిన ఆ చంచుల అఖండసుఖాలను పొందింది.

ఇతి శ్రీస్కాందే మహాపురాణే శివపురాణ మాహాత్మ్యే చంచులా సద్గతి వర్ణనం నామ చతుర్థోఽధ్యాయః ॥4॥

శ్రీ స్కాంద మహాపురాణం శివపురాణ మాహాత్మ్యంలో చంచులా సద్గతి వర్ణనమనే నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచమోఽధ్యాయః - అయిదవ అధ్యాయం
బిందుగ సద్గతి వర్ణనమ్ - బిందుగ సద్గతి వర్ణనం

శౌనక ఉవాచ - శౌనకుడు పలికాడు.

సూత సూత మహాభాగ ధన్యస్త్వం శివసక్తధీః ।
శ్రావితేయం కథాస్మాకం అద్భుతా భక్తివర్ధినీ ॥1॥

ఓ సూత మహర్షీ! మహానుభావా! శివాసక్తమైన బుద్ధిగల నీవు ధన్యుడవు. భక్తిని పెంచే అద్భుతగాథను వినిపించావు.

తత్ర గత్వా కిం చకార చంచులా ప్రాప్తసద్గతిః ।
తత్ త్వం వద విశేషేణ తత్పతేశ్చ మహామతే ॥2॥

ఓ సుమతీ! భగవత్సన్నిధికి చేరిన చంచుల ఇంకేమి చేసింది? ఆమె భర్తయైన బిందుగుని సంగతులేమిటి?

సూత ఉవాచ - సూతుడు పలికాడు.

సా కదాచిత్ ఉమాదేవీం ఉపగమ్య ప్రణమ్య చ ।
సంతుష్టావ కరౌ బధ్వా పరమానందసంప్లుతా ॥3॥

ఒకనాడు చంచుల పార్వతీ దేవిని సమీపించి, చేతులు మొగిడ్చి పరమానంద భరితురాలై ఆమెను స్తుతించింది.

చంచులా ఉవాచ - చంచుల పలికింది.

గిరిజే స్కందమాతస్త్వం సేవితా సర్వదా నరైః ।
సర్వసౌఖ్యప్రదే శంభుప్రియే బ్రహ్మస్వరూపిణి ॥4॥

ఓ గిరిజా! కుమార స్వామి జననీ! శంకర ప్రేయసీ! నీవు మానవులచే నిత్యం సేవింపబడతూ, సర్వ సౌఖ్యాలను ప్రసాదించే బ్రహ్మ స్వరూపిణివి!

విష్ణుబ్రహ్మాదిభిస్సేవ్యా సగుణా నిర్గుణాపి చ ।
త్వమాద్యా ప్రకృతిస్సూక్ష్మా సచ్చిదానందరూపిణీ ॥5॥

నీవు బ్రహ్మ విష్ణు మొదలైన సకల దేవతలచే సేవింపబడుతున్న సగుణ, నిర్గుణ రూపిణివి, మూల ప్రకృతివి, సూక్ష్మమైనదానవు సత్, చిత్, ఆనంద స్వరూపిణివి.

సృష్టిస్థితిలయకరీ త్రిగుణా త్రిసురాలయా ।
బ్రహ్మవిష్ణుమహేశానాం సుప్రతిష్ఠాకరా పరా ॥6॥

సృష్టిస్థితిలయకారిణివై, త్రిగుణాత్మకవై, బ్రహ్మ విష్ణు మహేశ్వరులకు మూడులోకాలను సృజించి వాటిలో వారిని చక్కగా కూర్చుండబెట్టిన పరాదేవివి.

సూత ఉవాచ – సూతుడు పలికాడు.

ఇతి స్తుత్వా మహేశీం తాం చంచులా ప్రాప్తసద్గతిః ।
విరరామ నతస్కంధా ప్రేమపూర్ణాశ్రులోచనా ॥7॥

సద్గతిని పొందిన చంచుల పార్వతీ దేవిని అనేక విధముల సంస్తుతించి, కన్నీరొలుకుతూ, తలను వంచుకుని మౌనంగా నిలబడింది.

తతస్సా కరుణావిష్టా పార్వతీ శంకరప్రియా ।
తామువాచ మహాప్రీత్యా చంచులాం భక్తవత్సలా ॥8॥

శంకరప్రియ, భక్తవత్సలయైన పార్వతీ దేవి, చంచులపై జాలిపడి ప్రేమతో ఇలా అంది.

పార్వత్యువాచ – పార్వతీ దేవి పలికింది.

చంచులే సఖి సుప్రీతాఽనయా స్తుత్యాఽస్మి సుందరీ ।
కిం యాచసే వరం బ్రూహి నాదేయం విద్యతే తవ ॥9॥

ఓ సఖీ! చంచులా! నీ ప్రార్థనచే నేను సంతుష్టురాలనైతిని. ఏ వరం కావాలో కోరుకో. నీకు ఇవ్వకూడనిది లేదు.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

ఇత్యుక్తా సా గిరిజయా చంచులా సుప్రణమ్య తామ్ ।
పర్యపృచ్ఛత సుప్రీత్యా సాంజలిర్నతమస్తకా ॥10॥

పార్వతీ దేవి మాటలకు చంచుల ఎంతో ఆనందించి చేతులొగ్గి నమస్కరించి ఇలా అడిగింది.

చంచులోవాచ – చంచుల చెప్పింది.

మమ భర్తాధునా క్వాస్తే నైవ జానామి తద్గతిమ్ ।
తేన యుక్తా యథాఽహం వై భవామి గిరిజేఽనఘే ॥
తథైవ కురు కల్యాణి కృపయా దీనవత్సలే ॥11॥

ఓ పుణ్యురాలా! గిరిజాదేవీ! నా భర్త బిందుగుని జాడ తెలియడం లేదు. ప్రస్తుతం ఎక్కడ ఉన్నాడు? కళ్యాణీ! దయతో నా భర్తతో నేను కలిసి ఉండేటట్లు అనుగ్రహించు.

మహాదేవి! మహేశాని! భర్తా మే వృషలీపతిః ।
మత్తః పూర్వం మృతః పాపీ న జానే కాం గతిం గతః ॥12॥

ఓ మహేశ్వరీ! శూద్ర జాతీయస్త్రీయగు వేశ్యయందు ఆసక్తుడైన నాభర్త మదోన్మత్తుడై ఎన్నో "పాపకార్యము" లాచరించి మరణించాడు. అతడు ఏ అవస్థను పొందాడో తెలియదు.

సూత ఉవాచ – సూత మహర్షి పలికాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్యాః చంచులా యాహి పార్వతీ ।
ప్రత్యువాచ సుసంప్రీత్యా గిరిజా నయవత్సలా ॥13॥

చంచుల మాటలను విని ప్రీతితో నయవత్సల అయిన పార్వతీ దేవి ఆమెతో ఇలా అంది.

గిరిజోవాచ – గిరిజాదేవి పలికింది.

సుతే! భర్తా బిందుగాహ్వో మహాపాపీ చ దురాశయః ।
వేశ్యాభోగీ మహామూఢో మృత్వా స నరకం గతః ॥14॥

ఓ బిడ్డా! మహాపాపి, దురాశాపరుడు, వేశ్యాలోలుడు, మూర్ఖుడూ ఐన నీ భర్త బిందుగుడు మరణించి నరకానికి వెళ్ళాడు.

భుక్త్వా నరకదుఃఖాని వివిధాన్యమితాః సమాః ।
పాపశేషేణ పాపాత్మా వింధ్యే జాతః పిశాచః ॥15॥

అనేక సంవత్సరాలు నరక దుఃఖాలను అనుభవించి, ఇంకా కొంత పాపం మిగిలి ఉండడం చేత, వింధ్య పర్వతం పై పిశాచరూపం లో తిరుగుతున్నాడు.

ఇదానీం స పిశాచోఽస్తి నానాక్లేశసమన్వితః ।
తత్రైవ వాతభుక్ దుష్టః సర్వకష్టవహస్సదా ॥16॥

ఇప్పుడాపిశాచి ఎన్నో కష్టాలు పడుతూ, కష్టాలన్నిటినీ భరిస్తూ గాలిని భుజిస్తూ ఆ వింధ్యపర్వతం మీదే ఉన్నాడు.

ఇతి గౌర్యా వచః శ్రుత్వా చంచులా సా శుభవ్రతా ।
పతిదుఃఖేన మహతా దుఃఖితాసీత్తదా కిల ॥17॥

పార్వతీదేవి మాటలను విన్న చంచుల, భర్త అనుభవిస్తున్న కష్టాలకు ఎంతో దుఃఖించింది.

సమాధాయ తతశ్చిత్తం సప్రణమ్య మహేశ్వరీమ్ ।
పునః పప్రచ్ఛ సా నారీ హృదయేన విదూషితా ॥18॥

చంచుల మనసును సమాధాన పరచుకొని పార్వతీ దేవికి నమస్కరించి విచారహృదయంతో ఇలా అంది.

చంచులోవాచ–చంచుల చెప్పింది.

మహేశ్వరి! మహాదేవి! కృపాం కురు మమోపరి ।
సముద్ధర పతిం మేఽద్య దుష్టకర్మకరం ఖలమ్ ॥19॥

ఓ పార్వతీ! మహాదేవీ! నాపై దయయుంచి మూర్ఖుడు, దుష్టుడు అయిన నా భర్తను ఉద్ధరించుము.

కేనోపాయేన మే భర్తా పాపాత్మా స కుబుద్ధిమాన్ ।
సద్గతా ప్రాప్నుయాద్దేవి! తద్వదాశు నమోఽస్తు తే ॥20॥

ఓ దేవీ! పాపాత్ముడు, దుర్బుద్ధి అయిన నా భర్త ఏ ఉపాయం చేత సద్గతిని పొందుతాడో త్వరగా చెప్పుము. నీకు నమస్కారము.

సూతఉవాచ – సూతుడు పలికాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్యాః పార్వతీ భక్తవత్సలా ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా చంచులాం స్వసఖీంచ తామ్ ॥21॥

భక్తవత్సలయైన పార్వతీదేవి, చంచుల మాటలకు ప్రసన్నురాలై ఇలా అంది.

పార్వత్యువాచ – పార్వతీ దేవి పలికింది.

శ్రుణుయాద్యది తే భర్తా పుణ్యాం శివకథాం పరామ్ ।
నిస్తీర్య దుర్గతిం సర్వో సద్గతిం ప్రాప్నుయాదితి ॥22॥

పుణ్యప్రదమైన శివపురాణ గాధను నీ భర్త వింటే సమస్తదోషాలు నశించి ఉత్తమగతిని పొందుతాడు.

ఇతి గౌర్యా వచః శ్రుత్వాఽమృతాక్షరమథాదరాత్ ।
కృతాంజలిర్నతస్కంధా ప్రణనామ పునః పునః ॥23॥

ఎంతో ఆదరంగా చెప్పిన గౌరీదేవి యొక్క అమృత తుల్యములైన మాటలను చంచుల విని తలవంచుకొని చేతులొగ్గి పదే పదే నమస్కరించింది.

తత్కథాశ్రవణం భర్తుః సర్వపాపవిశుద్ధయే ।
సద్గతిప్రాప్తయే చైవ ప్రార్థయామాస తాం తదా ॥24॥

భర్తకు శివపురాణగాధను వినిపింపజేసి, పాప విముక్తిని సద్గతిని ప్రసాదించమని చంచల గిరిజాదేవిని ప్రార్థించింది.

సూత ఉవాచ – సూతుడు పలికాడు.

తయా ముహుర్ముహుర్నార్యా ప్రార్థ్యమానా శివప్రియా ।
గౌరీ కృపాన్వి తాఽఽసీత్ మహేశీ భక్తవత్సలా ॥25॥

చంచుల అనేకమార్లు పార్వతీ దేవిని ప్రార్థించగా, భక్తవత్సలయైన మహేశ్వరి ప్రసన్నురాలయింది.

అథ తుంబురుమాహూయ శివసత్కీర్తిగాయకమ్ ।
ప్రీత్యా గంధర్వరాజం హి గిరికన్యేదమబ్రవీత్ ॥26॥

తరువాత శివపురాణాన్ని చక్కగా గానం చేయగల తుంబురుడు అనే గంధర్వరాజును పిలిపించి, అతనితో పార్వతీదేవి ఇలా అంది.

గిరిజోవాచ – పార్వతీ దేవి పలికింది.

హే తుంబురో శివప్రీత! మమ మానసకారక ।
సహానయా వింధ్యశైలం భద్రం తే గచ్ఛ సత్వరమ్ ॥27॥

ఓ తుంబురుడా! మాదంపతులకు ఇష్టమైన వాడా! నీవు వెంటనే ఈమెతో వింధ్యపర్వతానికి వెళ్ళిరావాలి. నీకు శుభమగు గాక వెళ్ళు.

ఆస్తే తత్ర మహాఘోరః పిశాచోఽస్తి భయంకరః ।
తద్వృత్తం శ్రుణు సుప్రీత్యాదితస్సర్వే బ్రవీమి తే ॥28॥

వింధ్యపర్వతం మీద ఘోరమైన పిశాచం, భయంకరాకారంతో సంచరిస్తున్నది. ఆ పిశాచ వృత్తాంతాన్ని పూర్తిగా చెబుతాను విను.

పురాభవే పిశాచస్స బిందుగాహ్వోఽభవద్విజః ।
అస్యా నార్యాః పతిర్దుష్టో మత్సఖ్యా వృషలీపతిః ॥29॥

పూర్వజన్మలో ఆ పిశాచం బిందుగుడనే పేరుగల బ్రాహ్మణుడు. అతడు దుష్టుడు. నా సఖియైన ఈ చంచులకు భర్త.

స్నానసంధ్యాక్రియాహీనోఽశౌచః క్రోధవిమూఢధీః ।
దుర్భక్షీ సజ్జనద్వేషీ దుష్పరిగ్రహకారకః ॥30॥

స్నాన సంధ్యాదులు, శుచిశుభ్రతలు విడిచి, తినగూడనివి తింటూ, సత్పురుషులను ద్వేషిస్తూ, దుష్టులను చేరదీసి, మహాకోపియై మూర్ఖబుద్ధితో విహరించాడు.

హింసకః శస్త్రధారీ చ సవ్యహస్తేన భోజనీ ।
దీనానాం పీడకః క్రూరః పరవేశ్మప్రదీపకః ॥31॥

ఆయుధాలను ధరించి అందరినీ హింసిస్తూ, ఎడంచేత్తో భోజనం చేస్తూ, పేదలను దుఃఖపెడుతూ, క్రూరుడై పొరుగిళ్ళ అభివృద్ధికి పాటు పడుతూ, సొంతవారిని నిర్లక్ష్యం చేస్తూ, బ్రాహ్మణ విరుద్ధమైన పనులు చేస్తున్నాడు.

చండాలాభిరతో నిత్యం వేశ్యాభోగీ మహాఖలః ।
స్వపత్నీత్యాగకృత్పాపీ దుష్టసంగరతస్తదా ॥32॥

నీచకార్యాసక్తుడు, వేశ్యాలోలుడు, సాధ్వియైన భార్యను త్యజించిన పాపి, మూర్ఖుడు, దుర్జన సహవాసి ఆ బిందుగుడు.

తేన వేశ్యాకుసంగేన సుకృతం నాశితం మహత్ ।
విత్తలోభేన మహిషీ నిర్భయా జారిణీ కృతా ॥33॥

అతడు వేశ్యా సాంగత్యం వలన పుణ్యమంతటినీ పోగొట్టుకొన్నాడు. ధనవ్యామోహంతో భార్యను కులటగా మార్చివేశాడు.

ఆమృత్యోస్స దురాచారీ కాలేన నిధనం గతః ।
యయౌ యమపురం ఘోరం భోగస్థానం హి పాపినామ్ ॥34॥

మరణపర్యంతం పాపాలనే చేసిన ఆదురాచారుడు, కాలక్రమంలో మరణించి, నరక బాధలను అనుభవించడానికి నెలవైన సంయమనీ నగరానికి చేరాడు.

తత్ర భుక్త్వా స దుష్టాత్మా నరకాని బహూని చ ।
ఇదానీం స పిశాచోఽస్తి విన్ధ్యేఽద్రౌ పాపభుక్ఖలః ॥35॥

ఆ దుర్మార్గుడు రౌరవాది నరక బాధలననుభవించి, ఇప్పుడు వింధ్యపర్వతంపై పిశాచ రూపంలో ఉన్నాడు.

తస్యాగ్రే పరమాం పుణ్యాం సర్వపాపవినాశనీమ్ ।
దివ్యాం శివపురాణస్య కథాం కథయ యత్నతః ॥36॥

సర్వపాప వినాశకరమూ, పుణ్యప్రదమూ, అయిన శివపురాణ గాథను పిశాచ రూపంలో ఉన్న బిందుగునికి ఎలాగోలా వినిపించు.

ద్రుతం శివపురాణస్య కథాశ్రవణతః పరాత్ ।
సర్వపాపవిశుద్ధాత్మా హాస్యతి ప్రేతతాం చ సః ॥37॥

శివపురాణాన్ని విన్న వెంటనే బిందుగుడు సర్వపాపముల నుండి విముక్తుడై పిశాచ రూపాన్ని విడిచిపెడతాడు.

ముక్తం చ దుర్గతేః తం వై బిందుగం త్వం పిశాచకమ్ ।
మదాజ్ఞయా విమానేన సమానయ శివాంతికమ్ ॥38॥

దుర్గతి నుండి విముక్తి పొందిన బిందుగుని విమానం పై ఈశ్వరుని సన్నిధికి తీసుకొనిరమ్ము. ఇది నా ఆజ్ఞ

సూత ఉవాచ – సూతుడు పలికాడు.

ఇత్యాదిష్టో మహేశాన్యా గంధర్వేంద్రశ్చ తుంబురః ।
ముముదేఽతీవ మనసి భాగ్యం నిజమవర్ణయత్ ॥39॥

గంధర్వరాజైన తుంబురుడు పార్వతీదేవి ఆజ్ఞను మహద్భాగ్యంగా భావించి ఎంతోసంతోషించాడు.

ఆరుహ్య సువిమానం స సత్యా తత్ప్రియయా సహ ।
యయౌ విన్ధ్యాచలే సౌరం యత్రాస్తే నారదప్రియః ॥40॥

నారద ప్రియుడైన తుంబురుడు, చంచులతో సహా సుందరమైన విమానం ఎక్కి బిందుగుడు ఉన్న వింధ్యపర్వతానికి చేరుకున్నాడు.

తత్రాపశ్యత్పిశాచం తం మహాకాయం మహాహనుమ్ ।
ప్రహసంతం రుదంతం చ వల్గం తం వికటాకృతిమ్ ॥41॥

అక్కడ పెద్ద శరీరం, పెద్ద పెద్ద దవడలతో, వికృతాకారియై, పెద్దగా నవ్వుతూ, ఏడుస్తూ, పరుగెడుతున్న పిశాచాన్ని చూశాడు.

బలాజ్జగ్రాహ తం పాశైః పిశాచం చాతిభీకరమ్ ।
తుంబురుశ్శివసత్కీర్తిం గాయకశ్చ మహాబలీ ॥42॥

ఈశ్వరగానకీర్తివిశారదుడు, బలవంతుడునైన తుంబురుడు పిశాచ రూపంలో ఉన్న బిందుగుని బలవంతంగా పాశములతో బంధించి పట్టుకున్నాడు.

అథో శివపురాణస్య వాచనార్థం తుంబురుః ।
నిశ్చిత్య రచనాం చక్రే మహోత్సవసమన్వితమ్ ॥43॥

బిందుగునికి శివపురాణాన్ని చెప్పడం కోసం తుంబురుడు అక్కడొక ఉత్సవ వాతావరణాన్ని కల్పించాడు.

పిశాచం తారితుం దేవ్యాః శాసనాత్తుంబురుర్గతః ।
వింధ్యం శివపురాణం స హ్యద్రిం శ్రావయితుం పరమ్ ॥44॥

పార్వతీ దేవి ఆజ్ఞానుసారం, బిందుగుని పిశాచ రూపాన్ని తొలగించడానికి తుంబురుడు వింధ్యాద్రి పై అత్యుత్తమమైన శివపురాణ గాథను వినిపించడానికి సన్నద్ధుడయ్యాడు.

ఇతి కోలాహలో జాతః సర్వలోకేషు వై మహాన్ ।
తత్ర తత్ శ్రవణార్థాయ యయుర్దేవర్షయో ద్రుతమ్ ॥45॥

ఈ కోలాహలం అన్ని లోకాలకు వ్యాపించింది. శివపురాణాన్ని వినడానికి, దేవర్షులు కూడా వేగంగా వింధ్యాద్రికి వెళ్ళారు.

సమాజస్తత్ర పరమోఽద్భుతశ్చాసీత్ శుభావహః ।
తేషాం శివపురాణస్యాగతానాం శ్రోతుమాదరాత్ ॥46॥

శివపురాణాన్ని వినడానికి వచ్చిన వారిచే వింధ్యపై శుభప్రదమైన అద్భుత సమీకరణం జరిగింది.

పిశాచమథ తం పాశైః బద్ధ్వా సముపవేశ్య చ ।
తుంబురుర్వల్లకీహస్తః జగౌ గౌరీపతేః కథామ్ ॥47॥

పిశాచ రూపంలో ఉన్న బిందుగుని పాశములతో బంధించి కూర్చోబెట్టి, తుంబురుడు వీణచేతబట్టి శివపురాణాన్ని గానంచేశాడు.

ఆరభ్య సంహితామాద్యాం సప్తమీసంహితావధి ।
స్పష్టం శివపురాణం హి స మాహాత్మ్యం సమావదత్ ॥48॥

మొదటి సంహిత నుండి ఏడవ సంహిత వరకు, శివపురాణాన్ని మాహాత్మ్యంతో అవిస్పష్టంగా తుంబురుడు వినిపించాడు.

శ్రుత్వా శివపురాణం తం సప్తసంహితమాదరాత్ ।
బభూవుః సుకృతార్థాస్తే సర్వే శ్రోతార ఏవ హి ॥49॥

ఏడు సంహితలు కలిగిన శివపురాణ గాథను శ్రద్ధగా విని అక్కడున్న శ్రోతలందరూ ధన్యులయ్యారు.

స పిశాచో మహాపుణ్యం శ్రుత్వా శివపురాణకమ్ ।
విధూయ కలుషం సర్వే జహౌ పైశాచికం వపుః ॥50॥

మహాపుణ్యప్రదమైన శివపురాణాన్ని విని పిశాచరూపంలో ఉన్న బిందుగుడు, సమస్త పాపములు తొలగినవాడై పిశాచదేహాన్ని త్యజించాడు.

దివ్యరూపో బభూవాశు గౌరవర్ణః సితాంశకః ।
సర్వాలంకారదీప్తాంగః త్రినేత్రశ్చంద్రశేఖరః ॥51॥

వెంటనే తెల్లని శరీరచ్ఛాయతో, తెల్లని వస్త్రములతో సర్వాలంకార భూషితుడై ముక్కంటియగు చంద్రశేఖరునివలె దివ్యరూపాన్ని పొందాడు.

దివ్యం దివ్యవపుర్భూత్వా తయా స నిజకాంతయా ।
జగౌ స్వయమపి శ్రీమాన్ చరితం పార్వతీపతేః ॥52॥

దివ్య శరీరాన్ని పొందిన బిందుగుడు, భార్యతో కలిసి తానే మహేశ్వరుని దివ్య చరితను గానం చేశాడు.

తద్వధూమితి సంధృష్ట్వా సర్వే దేవర్షయశ్చ తే ।
బభూవుర్విస్మితాశ్చిత్తే పరమానందసంయుతాః ॥53॥

బిందుగుని భార్యను చూసి ఋషులందరూ ఆశ్చర్యపడి ఆమె పతి భక్తికి పరమానందాన్ని పొందారు.

సుకృతార్థా మహేశస్య శ్రుత్వా చరితమద్భుతమ్ ।
స్వం స్వం ధామ యయుః ప్రీత్యా శంసతశ్శంకరం యశః ॥54॥

ఆ ఋషులందరూ తుంబురుని ద్వారా అద్భుతమైన శివపురాణాన్ని శ్రద్ధతోవిని, ఈశ్వరుని మహిమను కీర్తిస్తూ వారి వారి నిజావాసాలకు వెళ్ళిపోయారు.

బిందుగస్సోఽపి దివ్యాత్మా సువిమానస్థితస్సుఖీ ।
స్వకాంతాపార్శ్వగః శ్రీమాన్ సుశోభేఽతీవ ఖస్థితః ॥55॥

బిందుగుడు చంచులతో సహా ఆకాశంలోని విమానస్థుడై గొప్పగా ప్రకాశించాడు.

అథ గాయన్ మహేశస్య పార్వత్యా చ సబిందుగః ।
స్వగణశ్చ కృతః ప్రీత్యా సాఽభవద్గిరిజా సఖీ ॥56॥

తరువాత తుంబురుడు, మనోహరములైన శివుని గుణాలను గానం చేస్తూ ఈశ్వరుని సన్నిధికి చేరాడు.

సుసత్కృతో మహేశేన పార్వత్యా చ స బిందుగః ।
స్వగుణశ్చ కృతః ప్రీత్యా సాఽభవద్గిరిజా సఖీ ॥57॥

పార్వతీ పరమేశ్వరులు బిందుగుని ఎంతగానో సత్కరించారు. పార్వతిదేవి సఖురాలైన చంచుల కూడా అత్యంతప్రీతిని పొందింది.

తస్మిన్ లోకే పరానందే ఘనజ్యోతిషి శాశ్వతే ।
లబ్ధ్వా నివాసమచలం ప్రభాతే పరమం సుఖమ్ ॥58॥

ఆ పరమేశ్వరుని లోకంలో, శాశ్వతమైన జ్యోతిర్మండలంలో, స్థిరనివాసాన్ని పొంది బిందుగుడు కైలాసంలో పరమసుఖాన్ని పొందాడు.

ఇత్యేతత్కథితం పుణ్యం ఇతిహాసమఘాపహమ్ ।
శివాశివపరానందం నిర్మలం భక్తివర్ధనమ్ ॥59॥

ఈ శివపురాణం పుణ్యప్రదం, పాపనాశకం, నిర్మలం, భక్తివర్ధకం. పార్వతీ పరమేశ్వరులకు పరమానందాన్ని కలిగిస్తుంది.

య ఇదం శ్రుణుయాద్భక్త్యా కీర్తయేద్వా సమాహితః ।
స భుక్త్వా విపులాన్ భోగాన్ అంతే ముక్తిమవాప్నుయాత్ ॥60॥

ఎవరైతే ఈ శివపురాణాన్ని భక్తితో వింటారో, గానం చేస్తారో, మననం చేసుకుంటారో వారు భూలోక సుఖాలన్నీ అనుభవించి చివరకు ముక్తిని పొందుతారు.

ఇతి శ్రీస్కాందే మహాపురాణే శివ పురాణ మాహాత్మ్యే బిందుగ సద్గతి వర్ణనో నామ పంచమోఽధ్యాయః ॥5॥

శ్రీ స్కాంద మహాపురాణం శివపురాణ మాహాత్మ్యంలో బిందుగసద్గతివర్ణనము అనే పేరుగల అయిదవ అధ్యాయం సమాప్తం.

షష్ఠోఽధ్యాయః - ఆరవ అధ్యాయం

శ్రవణ విధి వర్ణనమ్ - శ్రవణ విధి వర్ణనం

శౌనక ఉవాచ - శౌనకుడు పలికాడు.

సూత సూత! మహాప్రాజ్ఞ! వ్యాసశిష్య నమోఽస్తు తే ।
ధన్యస్త్వం శైవవర్యోసి వర్ణనీయమహద్గుణః ॥1॥

ఓ సూత మహర్షీ! మహాప్రాజ్ఞుడవు, వ్యాసశిష్యుడవైన నీకు నమస్కారం. స్తుతిపాత్రమైన సద్గుణవంతుడవు. శివభక్తులలో మేటివి. మిక్కిలి ధన్యుడవు.

శ్రీమచ్ఛివపురాణస్య శ్రవణస్య విధిం వద ।
యేన సర్వం లభేత్ శ్రోతా సంపూర్ణం ఫలముత్తమమ్ ॥2॥

దేని వలన శ్రోతలందరికీ ఉత్తమ ఫలితాలు లభిస్తాయో శుభమైన ఆ శివపురాణం వినే విధివిధానాలను వివరించు.

అథ తే సంప్రవక్ష్యామి సంపూర్ణఫలహేతవే ।
విధిం శివపురాణస్య శ్రవణే శౌనకమునే ॥3॥

ఓ శౌనకమునీ! శివ పురాణాన్ని ఎలావింటే సంపూర్ణమైన ఉత్తమ ఫలితాలు లభిస్తాయో వివరంగా చెబుతాను.

దైవజ్ఞం చ సమాహూయ సంతోష్య చ జనాన్వితః ।
ముహూర్తే శోధయేచ్ఛుద్ధం నిర్విఘ్నేన సమాప్తయే ॥4॥

శివపురాణాన్ని వినిపించడానికి దైవజ్ఞుని ఆహ్వానించాలి. శ్రోతలందరూ ఆయన్ని సంతోష పరచాలి. కథ నిరాటంకంగా ముగియడానికి తగిన మంచి ముహూర్తాన్ని సిద్ధం చేసుకోవాలి.

వార్తా ప్రేష్యా ప్రయత్నేన దేశే దేశే చ సా శుభా ।
భవిష్యతి కథాశైలీ ఆగంతవ్యం శుభార్థిభిః ॥5॥

శివపురాణ ప్రవచనం జరుగుతున్న సంగతిని అన్ని ప్రాంతాల వారికి తెలియజేయాలి. దానివల్ల ఎక్కువ జనం చేరుతారు. విన్నవారందరికీ శుభం కలుగుతుంది.

దూరే హరికథాః కేచిత్ దూరే శంకరకీర్తనాః ।
స్త్రియః శూద్రాదయో యే చ బోధస్తేషాం భవేద్యతః ॥6॥

కొందరు హరి కథలకు, శివకథలకు దూరంగా ఉండిపోతున్నారు. ముఖ్యంగా స్త్రీలు శూద్రులు సమాచారం తెలియక వినలేక పోతున్నారు. అలాంటి వారికి మేలు జరిగే విధంగా పిలిపించి బోధింపజేయాలి.

దేశే దేశే శాంభవా యే కీర్తనశ్రవణోత్సుకాః ।
తేషామానయనం కార్యం తత్ప్రకారార్థమాదరాత్ ॥7॥

ప్రతిచోట ఈశ్వరుని గుణకీర్తనను వినాలనే ఆసక్తి కలవారున్నారు. వారందిరినీ సగౌరవంగా రప్పించి కథాకార్యక్రమాన్ని తెలియజేయాలి.

భవిష్యతి సమాజేஉత్ర సాధూనాం పరమోత్సవః ।
పారాయణే పురాణస్య శైవస్య పరమాద్భుతః ॥8॥

పరమాద్భుతమైన శివపురాణ పారాయణం వలన సమాజంలోని సత్పురుషులందరికీ మహాపర్వంగా ఉంటుంది.

శ్రీమచ్ఛివపురాణాహ్వరసపానాయ చాదరాత్ ।
ఆయాంత్వరం భవంతశ్చ కృపయా ప్రేమతత్పరాః ॥9॥

శ్రీమత్ శివపురాణమనే మధుర రసాన్ని త్రాగుటకు మీరందరూ గౌరవంతో ప్రేమనిండగా వెంటనే రండి.

నావకాశో యది ప్రేమ్ణా గంతవ్యం దినమేకకమ్ ।
సర్వథా గమనం కార్యే దుర్లభా చ క్షణస్థితిః ॥10॥

ఒక వేళ కథను సంపూర్ణంగా వినే అవకాశం లేకపోతే ఒక్కరోజైనా తప్పకరండి. జీవితంలో ఒక్క క్షణం ఉండడం కూడా దుర్లభమే

తేషామాహ్వానమేవం హి కార్యే సవినయం ముదా ।
ఆగతానాం చ తేషాం హి సర్వథా కార్య ఆదరః ॥11॥

సవినయంగా గౌరవంతో ఆహ్వానించాలి. వచ్చిన వారికి సకల మర్యాదలనూ చేయాలి.

శివాలయే చ తీర్థే వా వనే వాపి గృహేஉథవా ।
కార్యే శివపురాణస్య శ్రవణస్థలముత్తమమ్ ॥12॥

శివపురాణాన్ని వినడానికి శివాలయం, పుణ్యతీర్థం, పవిత్రవనం, గృహం అనేవి అనువైన ఉత్తమ స్థలములు.

కార్యే సంశోధనం భూమేః లేపనం ధాతుమండనమ్ ।
విచిత్రా రచనా దివ్యా మహోత్సవపురస్సరమ్ ॥13॥

ఈ స్థలాన్ని బాగా శుద్ధిచేసి, అలికి ముగ్గులు పెట్టి రంగురంగుల పూలతో ఆకులతో అలంకరించాలి. మహోత్సవానికి సన్నద్ధమౌతున్నట్లుగా ఉండాలి.

గృహోపస్కరముద్ధృత్య నిఖిలం తదయోగ్యకమ్ ।
ఏకాంతే గృహకోణే చాదృశ్యే యత్నాన్నివేశయేత్ ॥14॥

ఇంట్లో అయితే కావలసిన సామగ్రినంతా సిద్ధం చేసుకొని ప్రస్తుతం అవసరం లేని సామగ్రిని పరికరాలను ఇంట్లో ఒక మూల కనబడకుండా ఉంచాలి.

కర్తవ్యో మండపోఽత్యుచ్చైః కదలీస్తంభమండితః ।
ఫలపుష్పాదిభిస్సమ్యక్ విష్వగ్వితానరాజితః ॥15॥

మండపాన్ని అందరికీ కనిపించేటట్లు ఎత్తుగా ఏర్పాటుచేయాలి. అరటిబోదలతో ఫలపుష్పములతో మండపమంతటనీ శోభాయమానంగా అలంకరించాలి. నాలుగువైపులా పైన చాందినీ ఏర్పాటుచేయాలి.

చతుర్దిక్షు ధ్వజారోపః సపతాకః సుశోభనః ।
సుభక్తిస్సర్వదా కార్యా సర్వానందవిధాయినీ ॥16॥

భక్తితో నాలుగు దిక్కులందూ జెండాలను ఎగుర వేయాలి. మండపం పై అందంగా ఎగిరే జెండాలు అందరికీ ఆనందాన్ని కలిగిస్తాయి.

సంకల్ప్యమాసనం దివ్యం శంకరస్య పరాత్మనః ।
వక్తుశ్చాపి తథా దివ్యం ఆసనం సుఖసాధనమ్ ॥17॥

మండపంలో మహాదేవుడైన శంకరునికి గొప్ప ఆసనాన్ని ఏర్పాటు చేయాలి. వక్తకు కూడా సుఖంగా కూర్చుని చెప్పేందుకు మరొక ఆసనాన్ని వేయాలి.

శ్రోతౄణాం కల్పనీయాని సుస్థలాని యథార్హతః ।
అన్యేషాం చ స్థలాన్యేవ సాధారణతయా మునే ॥18॥

ఓశౌనక మునీ! శ్రోతలకు కూడా వారి వారి అర్హతలను బట్టి కూర్చోవడానికి తగిన స్థలాన్ని కేటాయించాలి. శ్రోతలు కాక మిగిలిన వారికి మామూలు స్థలాన్ని నిర్దేశించాలి.

వివాహే యాదృశం చిత్తం తాదృశం కార్యమేవ హి ।
అన్యా చింతా వినిర్వార్యా సర్వా శౌనక లౌకికీ ॥19॥

ఓ శౌనకర్షీ! వివాహసమయంలో పెళ్ళి మండపంలో ఉన్నవారంతా లౌకికమైన ఆలోచనలను విడిచి కేవలం ఆనూతన దంపతులమీదే మనస్సులనెలా నిలుపుతారో, అదే విధంగా శ్రోతలందరూ పౌరాణికుని మీదే మనస్సులను నిలపాలి.

ఉదఙ్ముఖో భవేద్వక్తా శ్రోతా ప్రాగ్వదనస్తథా ।
వ్యుత్క్రమః పాదయోః జ్ఞేయో విరోధో నాస్తి కశ్చన ॥20॥

వక్త ఉత్తర ముఖంగానూ, శ్రోతలు తూర్పు ముఖంగానూ కూర్చోవాలి. కాళ్లను అటుఇటుగా ముడుచుకు కూర్చున్నా దోషం లేదు.

అథవా పూర్వదిక్ జ్ఞేయా పూజ్యపూజకమధ్యతః ।
అథవా సంముఖే వక్తుః శ్రోతౄణామాననం స్మృతమ్ ॥21॥

లేనిచో వక్త, శ్రోతలు కూడా తూర్పు దిక్కుకే తిరిగి కూర్చోవాలి. అది కుదరనిచో వక్త, శ్రోతలు ఎదురెదురుగా కూర్చోవాలి. అప్పుడు అవి ఏదిక్కువైనా ఫరవాలేదు.

వ్యాసాసనసమారూఢో యథా పౌరాణికో ద్విజః ।
ఆసమాప్తౌ ప్రసంగస్య నమస్కుర్యాత్ న కస్యచిత్ ॥22॥

వేదికపై ఆసీనుడైన తరువాత పౌరాణికుడు తన ప్రసంగం ముగిసే వరకు ఎవరికీ నమస్కరింపగూడదు.

బాలో యువాథ వృద్ధో వా దరిద్రోవాపి దుర్బలః ।
పురాణజ్ఞః సదా వంద్యః పూజ్యశ్చ సుకృతార్తిభిః ॥23॥

బాలుడు, యువకుడు, వృద్ధుడు, దరిద్రుడు, దుర్బలుడు అనే నిమిత్తం లేకుండా పౌరాణికుడు ఎల్లవేళలా నమస్కరింపదగినవాడే, పుణ్యాత్ములైన శ్రోతలచే పూజింపదగినవాడే.

నీచబుద్ధిం న కుర్వీత పురాణజ్ఞే కదాచన ।
యస్య వక్త్రోద్గతా వాణీ కామధేనుశ్శరీరిణామ్ ॥24॥

పౌరాణికుని పట్ల ఎప్పుడూ తక్కువ భావం ఉండకూడదు. అతని నోటిమాటలు మానవులకు కామధేనువు వంటివి. శ్రోతల కోరికలను సిద్ధింపజేస్తాయి.

గురువత్సంతి బహవో జన్మతో గుణతశ్చైవ ।
పరో గురుః పురాణజ్ఞః తేషాం మధ్యే విశేషతః ॥25॥

ఉత్తమజన్మచేత, గుణంచేత ఎందరెందరో గురువులు తారస పడుతుంటారు. కాని వారందరిలో పౌరాణికుడు, మహాగురువుగా గణింపబడతాడు.

భవకోటిసహస్రేషు భూత్వా భూత్వావసీదతామ్ ।
యో దదాతి పరాం ముక్తిం కోఽన్యః తస్మాత్ పరో గురుః ॥26॥

కోట్లాది జన్మలతో అలమటించేవారికి, ఎవడైతే జరామరణ చక్రం నుండి తప్పించి మోక్షాన్ని సిద్ధింపజేస్తాడో అతడే ఉత్తమ గురువు అతడే శివపురాణాన్ని వినిపించగల దైవజ్ఞుడు.

పురాణజ్ఞః శుచిర్దక్షః శాంతో విజితమత్సరః ।
సాధుః కారుణ్యవాన్ వాగ్మీ వదేత్ పుణ్యకథామిమామ్ ॥27॥

పవిత్రుడు, సమర్థుడు, శాంతచిత్తుడు, అసూయలేనివాడు, అహింసాపరుడు, దయాశాలి, మాటకారి, అయిన పౌరాణికుడు మాత్రమే శివపురాణాన్ని చెప్పగలడు.

ఆసూర్యోదయమారభ్య సార్ధత్రిపహరాంతకమ్ ।
కథా శివపురాణస్య వాచ్యా సమ్యక్ సుధీమతా ॥28॥

పురాణవేత్త సూర్యోదయమునుండి కథను ప్రారంభించి, మూడున్నర జాముల వరకు చక్కగా చెప్పాలి.

యే ధూర్తా చ దుర్వృత్తా యే చాన్యే విజిగీషవః ।
తేషాం కుటిలవృత్తీనాం అగ్రేనైవ వదేత్కథామ్ ॥29॥

నీచులు, దుష్ప్రవర్తకులు, వాదించి ఇతరులను జయించాలని అనుకునేవారు మరియు కుటిల ప్రవృత్తి కలవారి సమక్షంలో ఈ కథను చెప్పగూడదు.

న దుర్జనసమాకీర్ణే న తు దస్యుసమావృతే ।
దేశే న ధూర్తసదనే వదేత్పుణ్యకథామిమామ్ ॥30॥

దుర్జనులు, దొంగలు కూడిన చోట, ధూర్తుల ఇండ్లలోను, ఈ పుణ్యకథను చెప్పకూడదు.

కథావిరామః కర్తవ్యో మధ్యాహ్నే హి ముహూర్తకమ్ ।
మలమూత్రోత్సర్జనార్థం తత్కథాకీర్తనాన్నరైః ॥31॥

మధ్యాహ్న సమయంలో శ్రోతలకు 48 నిమిషాలు (ముహూర్తకాలం) విరామాన్ని ఇవ్వాలి. ఆ సమయంలో వారు మల మూత్రాదికమైన దేహ బాధలను తీర్చుకుంటారు.

వక్త్రా క్షౌరం హి సంకార్యే దినాదర్వాగ్వ్రతాప్తయే ।
కార్యే సంక్షేపతో నిత్యకర్మ సర్వే ప్రయత్నతః ॥32॥

కథా ప్రారంభానికి ముందురోజే వక్త చక్కగా క్షురకర్మ చేయించుకోవాలి. నిత్యకృత్యాలను సాధ్యమైనంత వరకు క్లుప్తంగా ముగించాలి.

వక్తుః పార్శ్వే సమాయార్థం అన్యః స్థాప్యస్తథావిధః ।
పండితస్సంశయచ్ఛేత్తా లోకబోధనతత్పరః ॥33॥

వక్త ప్రక్కన ఒక పండితుని సహాయకునిగా కూర్చోబెట్టాలి. అతడు ప్రవచనం మధ్యలో తలెత్తే సందేహాలను తీర్చగలిగే లౌక్యం తెలిసినవాడై ఉండాలి.

కథావిఘ్నవినాశార్థం గణనాథం ప్రపూజయేత్ ।
యథాధీశం శివం భక్త్యా పుస్తకం చ విశేషతః ॥34॥

కథా ప్రవచనానికి ఆటంకం కలుగకుండా మొదట గణపతిని పూజించాలి. తరువాత భక్తితో శంకరుని, పురాణ గ్రంథాన్ని కూడా పూజించాలి.

కథాం శివపురాణస్య శృణుయాదాదరాత్సుధీః ।
శ్రోతా సువిధినా శుద్ధః శుద్ధచిత్తప్రసన్నధీః ॥35॥

బుద్ధిమంతుడు శివపురాణాన్ని శ్రద్ధతో వినాలి. శారీరకంగా మానసికంగానూ పవిత్రుడై ప్రసన్నునిగా ఉండడం వలన చిత్తశుద్ధి కలిగి, బుద్ధిమరింత నిష్కళంకమౌతుంది.

అనేకకర్మవిభ్రాంతః కామాదిషడ్వికారవాన్ ।
స్త్రైణః పాఖండవాదీ చ వక్తా శ్రోతా న పుణ్యభాక్ ॥36॥

అనేక వ్యర్థ కర్మలలో బడి తిరిగేవాడు. కామక్రోధాది వికారి, స్త్రీలోలుడు, వేదవిముఖుడు వక్తగా గాని శ్రోతగా కాని పనికిరాడు.

లోకచింతాం ధనాగారపుత్రచింతాం వ్యుదస్య చ ।
కథాచిత్తః శుద్ధమతిః స లభేత్ఫలముత్తమమ్ ॥37॥

లౌకిక విచారాలను, ధనము, పుత్రుల గూర్చి ఆలోచనలను విడిచిపెట్టి, కథపై మనస్సును నిలిపినవాడు ఉత్తమఫలితాన్ని పొందుతాడు.

శ్రద్ధాభక్తిసమాయుక్తాః నాన్యకార్యేషు లాలసాః ।
వాగ్యతాః శుచయోఽవ్యగ్రాః శ్రోతారః పుణ్యభాగినః ॥38॥

శివపురాణం పట్ల శ్రద్ధ, భక్తి కలవారు, ఇతర పనులపై ఆరాటం లేనివారు, చక్కని మాటతీరు కలవారు పవిత్రులు, మనసులో అలజడి లేనివారు మాత్రమే వినుటకు అర్హులు.

అభక్తా యే కథాం పుణ్యాం శ్రుణ్వంతీమామ్ నరాధమాః ।
తేషాం శ్రవణజం నాస్తి ఫలం దుఃఖం భవే భవే ॥39॥

శివభక్తులు కాని నీచులు శివపురాణాన్ని వినడం వలన ఎట్టి ప్రయోజనమూ ఉండదు. వారు జన్మ జన్మలకు దుఃఖాన్నే పొందుతారు.

అసంపూజ్య పురాణం యే యథాశక్త్యాద్యుపాయనైః ।
శ్రుణ్వంతీమాం కథాం మూఢాః స్యుర్దరిద్రా న పావనాః? ॥40॥

పురాణం పట్ల గౌరవం లేకుండా శక్తి కొలది కానుకలు సమర్పించకుండా. ఈ కథను విన్నవారు మూర్ఖులు, అపవిత్రులు, దరిద్రులైపోతారు.

కథాయాం కథ్యమానాయాం గచ్ఛత్యన్యత్ర యే నరాః ।
భోగాంతరే ప్రణశ్యంతి తేషాం దారాదిసంపదః ॥41॥

పౌరాణికుడు కథను చెబుతూ ఉండగా, మధ్యలో లేచి వెళ్ళిపోయిన వారికి భార్యాపుత్రాది సంపదలు సమస్తభోగములు నశించిపోతాయి.

సోష్ణీషమస్తకా యే చ శ్రుణ్వంతీమాం కథాం నరాః ।
తత్పుత్రాశ్చ ప్రజాయంతే పాపినః కులదూషకాః ॥42॥

తలపాగా ధరించి ఈ కథను వినేవారి పుత్రులు, పాపాత్ములుగా, వంశ గౌరవాన్ని నాశనం చేసేవారుగా తయారౌతారు.

తాంబూలం భక్షయంతో యే శ్రుణ్వంతీమాం కథాం నరాః ।
స్వవిష్ఠాం ఖాదయంత్యేతాన్ నరకే యమ కింకరాః ॥43॥

తాంబూలాన్ని నములుతూ విన్నవారు మరణానంతరం, యమదూతలు, ఈశ్రోతలచే వారి మలాన్ని వారిచే తినిపిస్తారు.

యే చ తుంగాసనారూఢాః శ్రుణ్వంతీమాం కథాం నరాః ।
భుక్త్వా తే నరకాన్ సర్వాంస్తతః కాకా భవంతి హ ॥44॥

పౌరాణికుని కంటె ఎత్తైన ఆసనంలో కూర్చుని విన్నవారు మరణానంతరం నరకబాధలన్నీ అనుభవించి తరువాత కాకి జన్మనెత్తుతారు.

యే వీరాద్యాసనారూఢాః శ్రుణ్వంతీమాం కథాం శుభామ్ ।
భుక్త్వా తే నరకాన్ సర్వాన్ విషవృక్షా భవంతి వై ॥45॥

కథను వినేటప్పుడు ఎవరు వీరాసనంతో కూర్చుంటారో వారుమరణానంతరం నరకం లోని శిక్షలన్నిటినీ అనుభవించి తర్వాత విషవృక్షాలుగా పుడతారు.

అసంప్రణమ్య వక్తారం కథాం శ్రుణ్వంతి యే నరాః ।
భుక్త్వా తే నరకాన్ సర్వాన్ భవంత్యర్జున పాదపః ॥46॥

పౌరాణికునికి నమస్కరించకుండా కథను విన్నవారు నరకబాధలన్నిటినీ అనుభవించి తరువాత మద్ది చెట్టుగా పుడతారు.

అనాతురాశ్శయానా యే శృణ్వంతీమాం కథాం నరాః ।
భుక్త్వా తే నరకాన్ సర్వాన్ భవంత్యజగరాదయః ॥47॥

ఆసక్తి లేకుండా, పడుకొని ఎవరు కథను వింటారో వారు నరకబాధలన్నిటినీ అనుభవించి తరువాత కొండచిలువ వంటి పెద్దపాములై పుడతారు.

వక్తుస్సమాసనారూఢా శృణ్వంతి చ కథామిమామ్ ।
గురుతల్పసమం పాపం ప్రాప్యతే నారకైస్సదా ॥48॥

వక్త కూర్చున్న ఆసనంతో సమానమైన ఆసనం పై కూర్చుని కథను విన్నవారు, గురువుగారి భార్యతో సంగమించిన మహాపాపి పొందే భయంకర నరకబాధలను నిరంతరం పొందుతూనే ఉంటాడు.

యే నిందంతి చ వక్తారం కథాంచేమాం సుపావనీమ్ ।
భవంతి శునకా భుక్త్వా దుఃఖం జన్మశతం హి తే ॥49॥

ఎవరైతే వక్తనుగాని, కథనుగాని నిందిస్తారో వారు నూరు జన్మలు కుక్కగా పుట్టి దుఃఖాన్ని అనుభవిస్తారు.

కథాయాం వర్తమానాయాం దుర్వాదం యే వదంతి హి ।
భుక్త్వా తే నరకాన్ ఘోరాన్ భవంతి గర్దభాస్తతః ॥50॥

కథ జరుగుతుండగా ఎవరైతే వితండవాదం చేస్తారో వారు నరక బాధలను అనుభవించిన తరువాత గాడిదలై పుడతారు.

కదాచిన్నాపి శ్రుణ్వంతి కథామేతాం సుపావనీమ్ ।
భుక్త్వా తే నరకాన్ ఘోరాన్ భవంతి వనసూకరాః ॥51॥

ఈ పావనమైన శివపురాణగాథను ఒక్కసారి కూడా విననివారు నరక బాధలను అనుభవించి, అనంతరం అడవి పందులుగా పుడతారు.

కథాయాం కీర్త్యమానాయాం విఘ్నం కుర్వంతి యే ఖలాః ।
కోట్యబ్దం నరకాన్ భుక్త్వా భవంతి గ్రామసూకరాః ॥52॥

కథ జరుగుతుండగా యే మూర్ఖులు ఆటంకం కలిగిస్తారో వారు కోటి సంవత్సరములు నరకబాధలను పొంది, తరువాత ఊరపందులు గా పుడతారు.

ఏవం విచార్య శుద్ధాత్మా శ్రోతా వక్తృసుభక్తిమాన్ ।
కథాశ్రవణహేతోః హి భవేత్ప్రీత్యోద్యతస్సుధీః ॥53॥

చెప్పిన విషయములను ఆకలింపుచేసుకొని పౌరాణికుని యందు భక్తి కల్గినవాడై శ్రోతనిర్మలమగు మనస్సుతో కథాశ్రవణమునకై ప్రీతితో ప్రయత్నము చేయవలెను.

కథావిఘ్నవినాశార్థే గణేశం పూజయే త్త్వరా ।
నిత్యం సంపాద్య సంక్షేపాత్ ప్రాయశ్చిత్తం సమాచరేత్ ॥54॥

కథను ప్రారంభించే ముందు ఆటంకాలు కలుగకుండా గణపతిని పూజించాలి. నిత్యకర్మలలో తెలియక దోషాలు దొర్లిఉంటాయి. కావున సంగ్రహంగా ప్రాయశ్చిత్తం చేసుకోవాలి.

నవగ్రహాంశ్చ సంపూజ్య సర్వతోభద్రదైవతమ్ ।
శివపూజోక్తవిధినా పుస్తకం తత్సమర్చయేత్ ॥55॥

అన్నిటా భగవంతుని చూస్తూ, శివ పూజా విధానానుగుణంగా గ్రంథాన్ని పూజించాలి. నవగ్రహాలను కూడా పూజించాలి.

పూజనాంతే మహాభక్త్యా కరౌ బద్ధ్వా వినీతకః ।
సాక్షాచ్ఛివస్వరూపస్య పుస్తకస్య స్తుతిం చరేత్ ॥56॥

పూజానంతరం భక్తితో చేతులు జోడించి వినయంతో సాక్షాత్తు శివరూపమైన పుస్తకాన్ని ప్రార్థించాలి.

శ్రీమచ్ఛివపురాణాఖ్యః ప్రత్యక్షస్త్వం మహేశ్వరః ।
శ్రవణార్థే స్వీకృతోఽసి సంతుష్టో భవ వై మయి ॥57॥

ఓశివపురాణ గ్రంథమా! కనిపించే పరమేశ్వరరూపమైన నిన్ను కథను వినడానికి తీసుకుంటున్నాను. నన్ను అనుగ్రహించు.

మనోరథో మదీయోఽయం కర్తవ్యస్సఫలస్త్వయా ।
నిర్విఘ్నే సుసంపూర్ణే హి కథా శ్రవణమస్తు తే ॥58॥

శివపురాణ గాథను వినాలనే కోరిక నీవలన ఫలించింది. నిరాటంకంగా, పూర్తిగా శ్రవణ కార్యం జరుగును గాక!

భవాబ్ధిమగ్నం దీనం మాం సముద్ధర భవార్ణవాత్ ।
కర్మగ్రాహగృహీతాంగం దాసోఽహం తవ శంకర ॥59॥

ఓ శంకరా! సంసార సాగరంలో మునిగి, కర్మలనే మొసళ్ళచేత పట్టుకోబడి దీనావస్థలో నున్న నీదాసుడనైన నన్ను ఉద్ధరింపుము.

ఏవం శివపురాణం హి సాక్షాత్ శివస్వరూపకమ్ ।
స్తుత్వా దీనవచః ప్రోచ్య వక్తుః పూజాం సమారభేత్ ॥60॥

ఈ విధంగా సాక్షాత్ శివస్వరూపమైన శివపురాణ గ్రంథాన్ని ప్రార్థించి, తరువాత వక్తకు పూజను ప్రారంభించాలి.

శివపూజోక్తవిధినా వక్తారం చ సమర్చయేత్ ।
సపుష్పవస్త్రభూషాభిః ధూపదీపాదినాఽర్చయేత్ ॥61॥

శివపూజా విధానంలో చెప్పినట్లుగా వక్తను పుష్ప, వస్త్ర అలంకార ధూప దీపాదులతో పూజించాలి.

తదగ్రే శుద్ధచిత్తేన కర్తవ్యో నియమస్తదా ।
ఆసమాప్తి యథాశక్త్యా ధారణీయస్సుయత్నతః ॥62॥

అతని ముందు చిత్తశుద్ధితో, నియమంతో పురాణం ముగిసే వరకు ధ్యానతత్పరతతో కూర్చోవాలి.

వ్యాసరూపప్రబోధాయ శివశాస్త్రవిశారద ।
ఏతత్కథాప్రకాశేన మదజ్ఞానం వినాశయ ॥63॥

శివ పురాణమును బాగా తెలిసిన, వ్యాస సమానుడవైన ఓ పౌరాణిక శ్రేష్ఠా! ఈ కథను వినిపించి నాలోని అజ్ఞానాన్ని తొలగించు.

వరణం పంచవిప్రాణాం కార్యే వైకస్య భక్తితః ।
శివపంచార్ణమంత్రస్య జపః కార్యశ్చ తైస్సదా ॥64॥

ఐదుగురు బ్రాహ్మణులను లేక ఒకరినైనా ఎంచుకొని వారితోబాటు నిరంతరం ఓం నమశ్శివాయ అనే పంచాక్షర మంత్రాన్ని జపించాలి.

ఇత్యుక్తస్స మునే భక్త్యా కథాశ్రవణసద్విధిః ।
శ్రోతౄణాం చైవ భక్తానాం కిమన్యత్ శ్రోతుమిచ్ఛసి ॥65॥

ఈ విధంగా సూతముని కథాశ్రవణవిధానాన్ని వివరించి ఓ శౌనక మహర్షీ! భక్తితో కథను వినగోరే శ్రోతల గురించి ఇంకా వినాలనుకుంటున్నావా? అని అడిగాడు.

ఇతి శ్రీ స్కాంద మహాపురాణే శివపురాణ మాహాత్మ్యే శ్రవణ విధి వర్ణనో నామ షష్ఠోఽధ్యాయః ॥6॥

శ్రీ స్కాంద మహాపురాణములోని శివపురాణ మాహాత్మ్యమందలి శ్రవణ విధి వర్ణనం అనే ఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తమోఽధ్యాయః - ఏడవ అధ్యాయం

శివపురాణ శ్రవణవ్రతినాం విధి నిషేధ పుస్తక వక్తృ పూజన వర్ణనమ్

శివపురాణ దీక్షాపరుల విధి నిషేధ పుస్తక వక్తృ పూజన వర్ణనం

శౌనక ఉవాచ - శౌనకుడు పలికాడు.

సూత సూత! మహాప్రాజ్ఞ! ధన్యస్త్వం శైవపుంగవ ।
శ్రావితేయం కథాస్మాకం అద్భుతేయం శుభావహా ॥1॥

శివభక్తాగ్ర గణ్యుడవైన సూతమహర్షీ! మహాప్రాజ్ఞా, మాకు అద్భుతమూ. శుభావహమూ ఐన కథను వినిపించి ధన్యుడవయ్యావు.

పుంసాం శివపురాణస్య శ్రవణం వ్రతినాం మునే ।
సర్వలోకహితార్థాయ దయయా నియమం వద ॥2॥

ఓ సూతమునీ! శివపురాణాన్ని వినాలనే నియమం పెట్టుకున్న మానవులకు, అందరి మేలుకోరి దయతో ఆ నియమాలను చెప్పండి.

సూత ఉవాచ - సూతుడు పలికాడు.

నియమం శృణు సద్భక్త్యా పుంసాం తేషాం చ శౌనక ।
నియమాత్ సత్కథాం శ్రుత్వా నిర్విఘ్నఫలముత్తమమ్ ॥3॥

ఓ శౌనకమునీ! నియమాన్ని చెబుతాను విను. మానవులు భక్తితో నియమబద్ధంగా కథను వింటే నిరాటంకంగా ఉత్తమఫలితాన్ని పొందుతారు.

పుంసాం దీక్షావిహీనానాం నాధికారః కథాశ్రవే ।
శ్రోతుకామైరతో వక్తుః దీక్షా గ్రాహ్యా చ తైః మునే ॥4॥

ఓ శౌనకర్షీ! కథాశ్రవణ దీక్షను స్వీకరించని వారికి శివపురాణకథను వినే అర్హత లేదు. కాబట్టి వినదలచిన వారితో వక్త దీక్షను స్వీకరింపజేయాలి.

బ్రహచర్యమధస్సుప్తిః పత్రావల్ల్యాం చ భోజనమ్ ।
కథాసమాప్తౌ భుక్తిం చ కుర్యాత్ నిత్యం కథావ్రతీ ॥5॥

బ్రహ్మచర్యం, తగిననిద్ర, ఆకుల్లోభోజనం, కథ ముగిసిన తరువాతే తినడం మొ॥ వాటిని కథా శ్రవణ వ్రతాన్ని స్వీకరించినవాడు ఆచరించాలి.

ఆసమాప్త పురాణం హి సముపోష్య సుశక్తిమాన్ ।
శృణుయాత్ భక్తితః శుద్ధః పురాణం శైవముత్తమమ్ ॥6॥

మంచి శక్తిమంతుడు పురాణసమాప్తి వరకు ఉపవసించి భక్తితో శుద్ధుడై ఉత్తమమయిన శివపురాణమును వినవలెను.

ఘృతపానం పయఃపానం కృత్వా వా శ్రుణుయాత్సుఖమ్ ।
ఫలాహారేణ వా శ్రావ్యం ఏకభుక్తం న వా హి తత్ ॥7॥

శ్రోత నెయ్యిగాని, పాలుగాని త్రాగి వచ్చి సుఖంగా కథను వినాలి. ఫలాహారము చేసినను, ఏకభుక్తముగా నయినను కథాశ్రవణము చేయవచ్చును.

ఏకవారం హవిష్యాన్నం భుంజ్యాదేతత్కథావ్రతీ ।
సుఖసాధ్యం యథా స్యాత్తత్ శ్రవణం కార్యమేవ చ ॥8॥

ఏమీ తినకుండా వినడం కష్టంగా ఉంటే తన సుఖం కొరకు ఒకమారు యజ్ఞంలో మిగిలిని హవిష్యాన్నాన్ని తిని వినవచ్చు.

భోజనం సుకరం మన్యే కథా సుశ్రవణప్రదమ్ ।
నోపవాసో వరశ్చేత్ స్యాత్ కథాశ్రవణవిఘ్నకృత్ ॥9॥

ఉపవాసం వలన కథా శ్రవణానికి ఆటంకం కలుగుతుందని భావిస్తే, తక్కువగా భుజించి వినవచ్చును.

గరిష్ఠం ద్విదళం దగ్ధం నిష్పావాంశ్చ మసూరికామ్ ।
భావదుష్టం పర్యుషితం జగ్ధ్వా నిత్యం కథావ్రతీ ॥10॥

వార్తాకం చ కలిందం చ పిచండం మూలకం తథా ।
కూష్మాండం నాలికేరం చ మూలం జగ్ధ్వా కథావ్రతీ ॥11॥

పలాండుం లశునం హింగుం గృంజనం మాదకం హి తత్ ।
వస్తూన్యామిషసంజ్ఞాని వర్జయేత్ యః కథావ్రతీ ॥12॥

కఠినమయిన పప్పుధాన్యములు, వేయించినవానిని శుభ్రము చేయనిశనగలు భావదుష్టమయిన వానిని నిల్వయున్నవానిని, వంగ, కలింద, ముల్లంగి, కంద, గుమ్మడి, కొబ్బరి, దుంపకూరలు, ఉల్లి, వెల్లుల్లి, ఇంగువ, విషము పూసిన బాణముతో చంపబడిన జంతువుమాంసము, మత్తుపదార్థములు మొ॥వి మాంసాహారముతో సమానమైనవానిని కథావ్రతుడు విడిచిపెట్టవలెను.

కామాది షడ్వికారం చ ద్విజానాం చ వినిందనమ్ ।
పతివ్రతాసుతాం నిందాం వర్జయేత్ యః కథావ్రతీ ॥13॥

కామక్రోధాది వికారములను, బ్రాహ్మణ ద్వేషాన్ని, సాధ్వీసంతానదూషణాన్ని కథావ్రతి విడిచిపెట్టాలి.

రజస్వలాం న పశ్యేచ్చ పతితాత్ న వదేత్ కథామ్ ।
ద్విజ ద్విషో వేదవర్జ్యాత్ న వదేత్ యః కథావ్రతీ ॥14॥

కథావ్రతి రజస్వలను చూడ కూడదు. భ్రష్టులకు, బ్రాహ్మణద్వేషి, మరియు వేదవిహితకర్మలను విడిచి పెట్టినవారికీ కథను చెప్పకూడదు.

సత్యం శౌచం దయాం మౌనం ఆర్జవం వినయం తథా ।
ఔదార్యమనసశ్చైవ కుర్యాత్ నిత్యం కథావ్రతీ ॥15॥

కథావ్రతుడు సత్యం, శౌచం, దయ, మౌనం, ఋజుత్వం, వినయం, దానం అనే వాటిని ఆచరించాలి.

నిష్కామశ్చ సకామశ్చ నియతాత్ శృణుయాత్ కథామ్ ।
సకామః కామమాప్నోతి నిష్కామో మోక్షమాప్నుయాత్ ॥16॥

కోరికలున్న వాడైనా లేనివాడైనా కథను వినవచ్చును. దానివలన కోరికలున్న వానికి కోరికలు నెరవేరుతాయి. లేని వారికి మోక్షం సిద్ధిస్తుంది.

దరిద్రశ్చ క్షయీ రోగీ పాపీ నిర్భాగ్య ఏవ చ ।
అనపత్యోఽపి పురుషః శృణుయాత్సత్కథామిమామ్ ॥17॥

నిరుపేద, క్షయరోగి, పాపాత్ముడు, నిర్భాగ్యుడు సంతానం లేనివాడు మొదలగు వారుకూడా కథను వినవచ్చును.

కాకవంధ్యాదయస్సప్తవిధా అపి ఖలస్త్రియః ।
స్రవద్గర్భా చ యా నారీ తాభ్యాం శ్రావ్యా కథా పరీ ॥18॥

కాకవంధ్య (కాకి వలె ఒకసారి మాత్రమే గర్భమును ధరించే స్త్రీ) మొదలైన ఏడురకాలైన స్త్రీలు, గర్భస్రావము జరిగిన స్త్రీ కూడా కథను వినవచ్చును.

సర్వేషాం శ్రవణం కార్యం స్త్రీభిః పుంభిః చ యత్నతః ।
ఏతచ్ఛివపురాణస్య విధినా చ కథాం మునే ॥19॥

ఓ శౌనక మునీ! ఈశివపురాణాన్ని స్త్రీ పురుషులందరూ ప్రయత్నపూర్వకముగా నియమబద్ధులై వినవలెను.

ఏతచ్ఛివపురాణస్య పారాయణదినాని తై ।
అత్యుత్తమాని బోధ్యాని కోటియజ్ఞసమాని చ ॥20॥

ఈశివపురాణాన్ని పారాయణ చేసే రోజులు, మిక్కిలి శ్రేష్ఠమైనవిగా చెప్పబడినవి. కోటియజ్ఞ సమఫలదములు.

ఏతేషు విధినా దత్తం యదల్పమపి వస్తు హి ।
దివసేషు వరిష్ఠేషు తదక్షయ్య ఫలం లభేత్ ॥21॥

పారాయణ దినములలో నియమానుసారం చేసిన అతిస్వల్ప దానమైన పర్వదినాల్లో చేసిన దానంలా, అనంత శుభఫలాన్నిస్తుంది.

ఏవం కృత్వా వ్రతవిధిం శ్రుత్వేమాం పరమాం కథామ్ ।
పరానందయుతః శ్రీమాన్ ఉద్యాపనమథాచరేత్ ॥22॥

శ్రవణవ్రతం ప్రకారం ఉత్కృష్టమైన శివపురాణాన్ని విని పరమానందాన్ని పొంది తరువాత ఉద్యాపనం చేయాలి.

ఏతదుద్యాపనవిధిః చతుర్దశ్యా సమో మతః ।
కార్యస్తద్వద్ధనాఢ్యైశ్చ తదుక్తఫలకాంక్షిభిః ॥23॥

కథాశ్రవణ ఫలాన్ని ఆశించే ధనవంతులైనా ఈ ఉద్యాపనకార్యాన్ని చేయాలి. ఇది చతుర్దశి (శివరాత్రి పుణ్య తిథి) తిథితో సమానమంటారు.

అకించనేషు భక్తేషు ప్రాయో నోద్యాపన గ్రహః ।
శ్రవణేనైవ పూతాస్తే నిష్కామాశ్శాంభవా మతాః ॥24॥

నిరుపేదలైన భక్తులు ఉద్యాపన క్రియను జరుపలేనిచో కేవలం వినడం వల్లనే వారు పవిత్రులౌతారు. అని శైవమత పెద్దలు చెబుతారు.

ఏవం శివపురాణస్య పారాయణమఖోత్సవే ।
సమాప్తే శ్రోతృభిర్భక్త్యా పూజా కార్యా ప్రయత్నతః ॥25॥

ఈ విధంగా శివపురాణ పారాయణ మహాయజ్ఞం ముగిసిన తరువాత శ్రోతలందరూ భక్తితో పూజా కార్యక్రమాన్ని ప్రారంభించాలి.

శివపూజనవత్సమ్యక్ పుస్తకస్య పురో మునే ।
పూజా కార్యా సువిధినా వక్తుశ్చ తదనంతరమ్ ॥26॥

ఓ శౌనక మునీ! శివపూజా విధానం ప్రకారం ముందుగా పుస్తకాన్ని పూజించి, తరువాత వక్తను పూజించాలి.

పుస్తకాచ్ఛాదనార్థం హి నవీనం వసనం శుభమ్ ।
సమర్పయేత్ దృఢం దివ్యం బంధనార్థే చ సూత్రకమ్ ॥27॥

గ్రంథాన్ని కప్పియుంచడానికి క్రొత్త వస్త్రాన్ని కట్టడానికి దృఢమై త్రాటిని సమర్పించాలి.

పురాణార్థే ప్రయచ్ఛంతి యే సూత్రం వసనం నవమ్ ।
భోగినో జ్ఞానసంపన్నాః తే భవంతి భవే భవే ॥28॥

అలా ఎవరైతే క్రొత్త వస్త్రాన్ని, త్రాటిని సమర్పిస్తారో, వారు జన్మజన్మలందు జ్ఞాన సంపన్నులుగా భోగులుగా అవతరిస్తారు.

వక్త్రే దద్యాత్ మహార్హాణి వస్తూని వివిధాని చ ।
వస్త్రభూషణపాత్రాని దివ్యం బహు విశేషతః ॥29॥

పౌరాణికునకు తగిన అనేక వస్తువులు, వస్త్రములు, అలంకారములు, పాత్రసామగ్రి ఇబ్బడి ముబ్బడిగా ఇవ్వాలి.

ఆసనార్థం ప్రయచ్ఛంతి పురాణస్య చ యే నరాః ।
కంబలాజినవాసాంసి మంచం ఫలకమేవ చ ॥30॥

ఆయన కూర్చోవడానికి కంబలి, జింకచర్మం, తివాచీ, మంచము, మేజాబల్ల మొదలగు వాటిని సమర్పించాలి.

స్వర్గలోకం సమాసాద్య భుక్త్వా భోగాన్యథేప్సితాన్ ।
స్థిత్వా బ్రహ్మపదే కల్పం యాంతి శైవం పదం తతః ॥31॥

అలా సమర్పించినవారు మరణానంతరం స్వర్గాన్ని చేరి అక్కడ యథేచ్ఛగా భోగాలను అనుభవించి, తరువాత బ్రహ్మలోకం లో అనేక యుగాలు గడిపి, చివరకు శివసాయుజ్యాన్ని పొందుతారు.

ఏవం కృత్వా విధానేన పుస్తకస్య ప్రపూజనమ్ ।
వక్తుశ్చ భువి శార్దూలమహోత్సవపురస్సరమ్ ॥32॥

ఈ విధంగా పుస్తకానికి, పౌరాణికునికి చేసే పూజా కార్యక్రమాన్ని గొప్ప ఉత్సవంలా చెయ్యాలి.

సహాయార్థే స్థాపితస్య పండితస్య ప్రపూజనమ్ ।
కుర్యాత్తదనుసారేణ కించిదూనం ధనాదిభిః ॥33॥

పౌరాణికుని సహాయకుడిగా వచ్చిన పండితునికి, కూడా కథకుని కంటె కొంచెం తక్కువగా ధనాదులచే తగిన రీతిని పూజించాలి.

సమాగతేభ్యో విప్రేభ్యో దద్యాదన్నం ధనాదికమ్ ।
మహోత్సవః ప్రకర్తవ్యో గీతైర్వాద్యైశ్చ నర్తనైః ॥34॥

హాజరైన ఇతర బ్రాహ్మణులకు కూడా భోజనం పెట్టి ధనదానం చెయ్యాలి. పాటలతో, వాద్యసంగీతములతో నృత్యములతో గొప్ప ఉత్సవాన్ని జరపాలి.

విరక్తశ్చ భవేత్ శ్రోతా పరేఽహని విశేషతః ।
గీతా వాచ్యా శివేనోక్తా రామచంద్రాయ యా మునే ॥35॥

ఓ శౌనకమునీ! శ్రోతకు కథ పట్ల ఇష్టం కలుగక పోతే మరునాడు అతనికి మహేశ్వరుడు శ్రీరామునకు చెప్పిన గీతావాక్యములను వినిపించాలి.

గృహస్థశ్చేద్భవేత్ శ్రోతా కర్తవ్యస్తేన ధీమతా ।
హోమః శుద్ధేన హవిషా కర్మణస్తస్య శాంతయే ॥36॥

శ్రోత గృహస్థుడైతే హోమంలో శుద్ధమైన హవిస్సుచేత శాంతి కొరకు కర్మకాండను జరపాలి.

రుద్రసంహితయా హోమః ప్రతిశ్లోకేన వా మునే ।
గాయత్ర్యాస్తన్మయత్వాచ్చ పురాణస్యాస్య తత్త్వతః ॥37॥

ఓ మహర్షీ! రుద్రసంహితలోని ప్రతిశ్లోకంతో గాని, గాయత్రీ మంత్రంతో గాని ఏకాగ్రతతో హోమం చెయ్యాలి.

అథవా మూలమంత్రేణ పంచవర్ణేన శైవతః ।
హోమాశక్తో బుధో హోమ్యం హవిర్దద్యాత్ ద్విజాయ తత్ ॥38॥

వివేకవంతుడైన శివపంచాక్షరీ మూలమంత్రముతో హోమము చేయుటకు శక్తిలేని అనగా సమర్థుడు కానిచో హోమమునకు సంబంధించిన హవిర్ద్రవ్యమును బ్రాహ్మణునకు ఈయవలెను.

దోషయోః ప్రశమార్థం చ న్యూనతాధికతాఖ్యయోః ।
పఠేచ్చ శృణుయాద్భక్త్యా శివనామసహస్రకమ్ ॥39॥

తరువాత న్యూనత్వ, ఆధిక్య దోషనివారణార్థం ఈశ్వర సహస్ర నామాలను, హెచ్చు తగ్గులతో భక్తిగా పఠించాలి లేదా వినాలి.

తేన స్యాత్ సఫలం సర్వం సఫలం నాత్ర సంశయః ।
యత్ నాస్త్యధికం త్వస్మాత్ త్రైలోక్యే వస్తు కించన ॥40॥

దానివల్ల ఆచరించిన కృత్యాలచే సందేహం లేకుండా మంచి ఫలితం వస్తుంది. దీనికంటె మించిన ఫలితం మూడు లోకాలలో ఎక్కడా ఉండదు.

ఏకాదశమితాన్ విప్రాన్ భోజయేత్ మధుపాయసైః ।
దద్యాత్తేభ్యో పక్షిణాం చ వ్రతపూర్ణత్వసిద్ధయే ॥41॥

వ్రత సంపూర్ణ ఫలితం కోసం 11 మంది బ్రాహ్మణులకు, వారి సంబంధితులకు కూడా మధుపాయసాలతో భోజనం పెట్టాలి.

శక్తౌ పలత్రయమితస్వర్ణేన సుందరం మునే ।
సింహం విధాయ తత్రాస్య పురాణస్య శుభాక్షరమ్ ॥42॥

మూడు బంగారు తూనికరాళ్ళ బరువుతో సమానమైన బంగారంతో అందంగా సింహతలాటం చేయించి దానిపై పౌరాణికుని నామాక్షరాలను చెక్కించి పౌరాణికునికి బహూకరించాలి.

లేఖితం లిఖితం వాసి సంస్థాప్య విధినా పుమాన్ ।
సంపూజ్య వాహనాద్యైః హ్యుపచారైః సదక్షిణా ॥43॥

అలా వ్రాయబడిన స్వర్ణ కంకణాన్ని బహూకరించి, శాస్త్రప్రకారం పూజించి, దక్షిణ లిచ్చి వాహన సదుపాయం కల్పించాలి.

వస్త్రభూషణగంధాద్యైః పూజితాయ యతాత్మనే ।
ఆచార్యాయ సుధీర్దద్యాద్ శివ సంతోషహేతవే ॥44॥

నూతన వస్త్రములు, ఆభరణములు, సుగంధ ద్రవ్యాలతో (భక్తులు) పౌరాణికుని సత్కరించాలి. దీనివల్ల శివుడు సంతోషిస్తాడు.

తేన దానప్రభావేణ పురాణస్యాస్య శౌనక ।
సంప్రాప్యానుగ్రహం శైవం ముక్తస్స్యాత్ భవబంధనాత్ ॥45॥

ఓశౌనక మహర్షీ! ఇలా స్వర్ణదానం చేయడం వలన ఈశ్వరానుగ్రహం కలిగి, భవబంధముల నుండి మోక్షం కలుగుతుంది.

ఏవం కృతే విధానేన చ శ్రీమత్ శివ పురాణకమ్ ।
సంపూర్ణ ఫలదం స్యాత్ వై భుక్తిముక్తిప్రదాయకమ్ ॥46॥

ఈ విధంగా శివపురాణగాథను విన్న తరువాత, పుస్తక పౌరాణిక పూజలు చేయడం వలన పూర్తి ఫలితం సిద్ధిస్తుంది. భుక్తికి లోటుండదు. అంతంలో మోక్షం లభిస్తుంది.

ఇతి తే కథితం సర్వం కిం భూయః శ్రోతుమిచ్ఛసి ।
శ్రీమత్ శివ పురాణస్య మాహాత్మ్యం సర్వకామదమ్ ॥47॥

సమస్త కోరికలను తీర్చే శివపురాణ మాహాత్మ్య కథను వినాలని అభిలషిస్తున్నావు కాబట్టి నీకు చెప్పాను. ఇకమీదట ఏమివినాలని కోరుకుంటున్నావు?

శ్రీమత్ శివపురాణం తు పురాణతిలకం స్మృతమ్ ।
మహత్ శివప్రియం రమ్యం భవరోగనివారణమ్ ॥48॥

పురాణాలన్నిటిలోని శ్రేష్ఠమైన ఈ శివపురాణం ఈశ్వరునికి ఎంతో ఇష్టమైనది. వినుటకింపైనది. మరియు సంసార బాధలను తొలగిస్తుంది.

యే జన్మభాజః ఖలు జీవలోకే యే వై సదా ధ్యాయతి విశ్వనాథమ్ ।
వాణీగుణాన్ స్తౌతి కథాం శృణోతి శ్రోత్రద్వయం తే భవముత్తరంతి ॥49॥

ప్రాణిలోకంలో జన్మించినవారు విశ్వేశ్వరుని నిరంతరం ధ్యానిస్తే, వారికి సరస్వతీ దేవి ఒక చెవిలో ఈశ్వరుని గుణగణాలను మరొక చెవిలో ఈశ్వరుని కథలను చెబుతుంది. దాంతో వారు సంసారసాగరాన్ని దాటగలుగుతారు.

సకల గుణవిభేదైర్నిత్యమస్పష్టరూపం జగతి చ బహిరంతః భాసమానం మహిమ్నా ।
మనసి చ విహరంతః వాఙ్మనో వృత్తిరూపం పరమశివమనంతానంతసాంద్రం ప్రపద్యే ॥50॥

సగుణ ఉపాధులన్నిటికీ వేరుగా, అస్పష్టమైన రూపం కలిగి మహిమాన్వితుడై, వాక్కు, మనస్సు, ప్రవర్తన రూపాల్లో మనసులో విహరిస్తూ, విశ్వమంతటా సంచరించే, అపార ఆనందమయుడైన పరమశివుని శరణు పొందుతున్నాను.

ఇతి శ్రీస్కాందే మహాపురాణే సనత్కుమార సంహితాయాం శివపురాణ శ్రవణవ్రతినాం విధి నిషేధ పుస్తక వక్తృ పూజన వర్ణనం నామ సప్తమోఽధ్యాయః ॥7॥

శ్రీ స్కాంద మహాపురాణాంతర్గత సనత్కుమార సంహితయందలి శివపురాణ దీక్షాపరుల విధి నిషేధ పుస్తక వక్తృ పూజన వర్ణనం అనే ఏడవ అధ్యాయం సమాప్తం

ప్రథమోఽధ్యాయః - మొదటి అధ్యాయం

ముని ప్రశ్నవర్ణనమ్ - ముని ప్రశ్నవర్ణనం

విద్యేశ్వరసంహితాప్రారంభః - విద్యేశ్వరసంహిత ప్రారంభం

ఆద్యంతమంగళమజాతసమానభావమార్యం తమీశమజరామరమాత్మదేవమ్ ।
పంచాననం ప్రబలపంచవినోదశీలం సంభావయే మనసి శంకరమంబికేశమ్ ॥

శ్రీ గణపతికి, శ్రీ సరస్వతికి, శ్రీ గురుదేవులకు నమస్కారములు. ఇపుడు శివపురాణంలోని మొదటిదైన "విద్యేశ్వరసంహిత" ప్రారంభించబడుతూంది. శివుడు ఆదిలో, మధ్యలో, అంతంలోనూ సదా మంగళస్వరూపుడు. ఆయనతో సమానమైన తత్త్వం ఎక్కడా లేదు. ఆయనకు జననమరణాలు లేవు. జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయం, తిరోధానం, అనుగ్రహం - అనే ఐదుపనులనూ ఆయన ఏ మాత్రం శ్రమ లేకుండా వినోదప్రాయంగా నిర్వహిస్తాడు. ఆయన పంచముఖుడు. లోకాలకు మంగళం కల్గించేవాడు. లోకేశ్వరుడు - లోకనాథుడు ...ఇట్టి పార్వతీపతిని (శివుణ్ణి) మనస్సులో ధ్యానిస్తాను.

వ్యాస ఉవాచ - వ్యాసభగవానుడు ఇలా చెప్పాడు.

ధర్మక్షేత్రే మహాక్షేత్రే గంగాకాళిందిసంగమే ।
ప్రయాగే పరమే పుణ్యే బ్రహ్మలోకస్య వర్త్మని ॥1॥

ధర్మానికి నిలయమైన మహాక్షేత్రమూ, గంగాయమునల కూడలి, బ్రహ్మలోకానికి మార్గము - అలాగే పరమపుణ్యప్రదము అయినది ప్రయాగక్షేత్రం. ఇటువంటి క్షేత్రాలలో-

మునయశ్శంసితాత్మానస్సత్యవ్రతపరాయణాః ।
మహౌజసో మహాభాగా మహాసత్రం వితేనిరే ॥2॥

ఇంద్రియాలను జయించిన వాళ్లు, సత్యాన్నే వ్రతంగా పాటించే వాళ్లు, గొప్పతేజస్సుతో ప్రకాశించే వాళ్లు, మహాత్ములు అయిన మహర్షులు, మహాసత్రయాగాన్ని ఆచరించారు.

తత్ర సత్రం సమాకర్ణ్య వ్యాసశిష్యో మహామునిః ।
ఆజగామ మునీన్ద్రష్టుం సూతః పౌరాణికోత్తమః ॥3॥

అక్కడ జరుగుతున్న మహాసత్రయాగాన్ని చూసేందుకు వ్యాసభగవానుని శిష్యుడు, పురాణవేత్తలలో ఉన్నతశ్రేష్ఠుడు అయిన సూతమహాముని వచ్చాడు.

తం దృష్ట్వా సూతమాయాంతం హర్షితా మునయస్తదా ।
చేతసా సుప్రసన్నేన పూజాం చక్రుర్యథావిధి ॥4॥

ఆ విధంగా యజ్ఞాన్ని చూసేందుకు వచ్చిన సూతమునిని చూసి, ఇతర మునిపుంగవులు చాలా సంతోషపడి, ప్రసన్నమగు చిత్తశుద్ధితో వారికి యథావిధి సపరిచర్యలూ, శాస్త్రబద్ధంగా పూజలూ చేశారు.

తతో వినయసంయుక్తాః ప్రోచుస్సాంజలయశ్చ తే ।
సుప్రసన్నా మహాత్మానః స్తుతిం కృత్వా యథావిధి ॥5॥

పూజాదులు ముగిసిన అనంతరం మహర్షులందరు దోసిలి యొగ్గి, నిర్మలమైన మనసుతో స్తుతించి, ఈ విధంగా పలికారు.

రోమహర్షణ సర్వజ్ఞ భవాన్ వై భాగ్యగౌరవాత్ ।
పురాణవిద్యామఖిలాం వ్యాసాత్ ప్రత్యర్థమీయివాన్ ॥6॥

ఓ రోమహర్షణా! నీవు అత్యంతభాగ్యశాలివి అగుట చేతనే, వ్యాసమహర్షి నుండి పరమోత్కృష్టమైన పురాణశాస్త్రవిద్యలను ఆసాంతం పొంది, సర్వజ్ఞుడుగా పేరు పొందావు.

తస్మాదాశ్చర్యభూతానాం కథానాం త్వం హి భాజనమ్ ।
రత్నానామురుసారాణాం రత్నాకర ఇవార్ణవః ॥7॥

ఓ సూతమహర్షీ! నీవు చెప్పుతున్న గాథలకు నీవు నిధివై చక్కని ప్రమాణంగా, సాక్షీభూతంగా కనిపిస్తున్నావు. మిక్కిలి విలువైన రత్నాలకు సముద్రం ఏ విధంగా ఆకరపట్టు అవుతుందో అలా సకలపురాణాలకు నీవే నిధివై ఉన్నావు.

యచ్చ భూతం చ భవ్యం చ యచ్చాన్యద్వస్తు వర్తతే ।
న త్వయాఽవిదితం కించిత్ త్రిషు లోకేషు విద్యతే ॥8॥

నీవు సర్వజ్ఞుడవు అనడానికి గల కారణం నీకు జరిగినవీ, ఇకపై జరుగబోయేవీ ప్రస్తుతం జరుగుతున్న అన్ని వృత్తాంతాలు కూలంకషంగా అవగతమౌతాయి. నీకు తెలియని వస్తువూ, సంగతులూ ఈ ముల్లోకాలలో ఏవియూ లేవు.

త్వం మద్దిష్టవశాదస్య దర్శనార్థమిహాగతః ।
కుర్వన్ కిమపి నః శ్రేయో న వృథా గంతుమర్హసి ॥9॥

మా అదృష్టం కొద్దీ నీవు ఈ యాగాన్ని చూడడానికై వచ్చినావు. మాకు ఏదో ఒక శ్రేయస్సును కలిగించకుండా నీవు వృథాగా ఇచటి నుండి వెనుదిరుగరాదు.

తత్త్వం శ్రుతం స్మ నస్సర్వం పూర్వమేవ శుభాశుభమ్ ।
న తృప్తిమధిగచ్ఛామః శ్రవణేచ్ఛా ముహుర్ముహుః ॥10॥

గతంలో మేము చాలా తత్త్వాలను గురించి విన్నాము అందులో కొన్ని శుభకరమైనవీ, మరికొన్ని అశుభతత్త్వాలుగానూ తెలియబడ్డాయి. అందువల్ల మాకు సంపూర్ణమైన తృప్తి కలుగలేదు. ఇపుడు నీ ద్వారా మరల మరల వినాలనే కోరిక కల్గుతున్నది.

ఇదానీమేకమేవాస్తి శ్రోతవ్యం సూత సన్మతే ।
తద్రహస్యమపి బ్రూహి యది తేఽనుగ్రహో భవేత్ ॥11॥

ఓ సూతమహర్షీ! నీవు సద్బుద్ధి గలవాడవు. ఎందువల్లనంటే – అతి రహస్యమైన విషయాలను మాకు అనుగ్రహించగల వాడవు. నీ నుండి వినుటకు వేచి ఉన్నాము.

ప్రాప్తే కలియుగే ఘోరే నరాః పుణ్యవివర్జితాః ।
దురాచారరతాస్సర్వే సత్యవార్తాపరాఙ్ముఖాః ॥12॥

కలియుగం ప్రారంభం కాగానే మానవుల ప్రవర్తనలో చిత్రమైన మార్పులు వస్తాయి. మానవులందరూ పుణ్యదూరులై, దురాచారాల పట్ల అత్యంతాసక్తి చూపిస్తారు. ఏనాడూ సత్యవాక్కునందు శ్రద్ధ కలిగి ఉండరు.

పరాపవాదనిరతాః పరద్రవ్యాభిలాషిణః ।
పరస్త్రీసక్తమనసః పరహింసాపరాయణాః ॥13॥

ఎల్లప్పుడూ ఇతరులను నిందించే వారుగా, ఇతరుల ధనానికి ఆశపడే వారుగా, పరస్త్రీలపై మనసున్న వారుగా, ఇతరులను హింసించటమే ప్రధానప్రవృత్తిగా కల వారై ఉంటారు.

దేహాత్మదృష్టయో మూఢా నాస్తికాః పశుబుద్ధయః ।
మాతృపితృకృతద్వేషాః స్త్రీదేవాః కామకింకరాః ॥14॥

మానవులు బాహ్యమగు దేహానికి ప్రాధాన్యాన్ని ఇస్తూ, ఆత్మతత్త్వాన్ని మరచి, దేహమే ఆత్మ అని మూఢమతులై, నాస్తికులై, పశువుల వలె బుద్ధిహీనులై, తల్లిదండ్రులను ద్వేషించు వారై, స్త్రీలను భోగవస్తువుగా భావించు వారై, కామానికి బానిసలవుతారు.

విప్రా లోభగ్రహగ్రస్తా వేదవిక్రయజీవినః ।
ధనార్జనార్థమభ్యస్తవిద్యామదవిమోహితాః ॥15॥

బ్రాహ్మణులు అధికమైన లోభత్వాన్ని పెంచుకొని, దయ్యం ఆవహించినట్లుగా ధనార్జన కోసం యత్నిస్తారు. వేదాన్ని అమ్మకం పెట్టి ధనం సంపాదిస్తారు. ధనం సంపాదించటం కోసం విద్యను నేర్చి, ఆ ధనగర్వంతో విఱ్ఱవీగుతారు.

త్యక్తస్వజాతికర్మాణః ప్రాయశః పరవంచకాః ।
త్రికాలసంధ్యయా హీనా బ్రహ్మబోధవివర్జితాః ॥16॥

తమ జన్మతః వచ్చిన లక్షణాలను, చేయవలసిన కర్మలను మరచి, తరచుగా ఇతరులను మోసగించే మార్గాలు ఎన్నుకొంటారు. మూడు సంధ్యలలో చేయవలసిన సంధ్యావందనం ఆచరించరు. అట్టి వారిలో బ్రహ్మజ్ఞానం శూన్యమై, వారికి భ్రష్టత్వం ఆపాదించబడుతుంది.

అదయాః పండితమ్మన్యాస్స్వాచారవ్రతలోపకాః ।
కృష్యుద్యమరతాః క్రూరస్వభావా మలినాశయాః ॥17॥

బ్రహ్మజ్ఞానశూన్యులైన వారికి దయాగుణం ఉండదు. కేవలం పండితులనుకునే అహంకారం తప్ప, వారియందు సౌశీల్యం, వ్రతనియమభావనలూ లోపిస్తాయి. వ్యవసాయం చేయడంలో ఆసక్తి కల్గి, క్రూరస్వభావం, దుష్టబుద్ధీ కల్గి ఉంటారు.

క్షత్రియాశ్చ తథా సర్వే స్వధర్మత్యాగశీలినః ।
అసత్సంగాః పాపరతా వ్యభిచారపరాయణాః ॥18॥

క్షత్రియులందరూ స్వధర్మాలను విడనాడి, దుష్టులతో స్నేహం చేసి, పాపకార్యక్రమాలు ఆచరిస్తారు. వ్యభిచారం వంటి పనులలో నిమగ్నులవుతారు.

అశూరా అరణప్రీతాః పలాయనపరాయణాః ।
కుచౌరవృత్తయశ్శూద్రాః కామకింకరచేతసః ॥19॥

క్షత్రియులు పిటికి వార్రై, యుద్ధం చేసే అభిరుచి లేని వార్రై, పారిపోయే మనస్తత్త్వం కలిగి ఉంటారు. దుష్టచిత్తులై, శూద్రులు చోరభావాలు కలిగి, కామానికి వశులై జీవిస్తారు.

శస్త్రాస్త్రవిద్యయా హీనా ధేనువిప్రా వనోజ్ఝితాః ।
శరణ్యావనహీనాశ్చ కామిన్యాతిమృగాస్సదా ॥20॥

అంతే గాక శస్త్రాస్త్రవిద్యలను నేర్వరు. గోవులను, బ్రాహ్మణులను రక్షించాలనే ప్రాథమికధర్మాలను విడిచి పెడతారు. ఆపదలో ఉండి శరణు కోరిన వారిని రక్షించరు. అన్ని కాలాలలో పశువుల వలె కామినీస్త్రీల సాంగత్యం కోరుకుంటారు.

ప్రజాపాలనసద్ధర్మవిహీనా భోగతత్పరాః ।
ప్రజాసంహారకా దుష్టా జీవహింసాకరా ముదా ॥21॥

ప్రజలను రక్షించాలనే కనీస ధర్మాన్నీ పాటించరు. భోగాలాలసులై, దుష్టులై ప్రజలను హింసిస్తుంటారు. జీవహింసను ఆనందక్రీడగా చేసి, విషయవాంఛల్లో మునిగి జీవితం సాగిస్తుంటారు.

వైశ్యాస్సంస్కారహీనాస్తే స్వధర్మత్యాగశీలినః ।
కుపథాః స్వార్జనరతాస్తులాకర్మకువృత్తయః ॥22॥

వైశ్యులు సంస్కారాలు లేని వార్రై, నీతిబాహ్యులై, తమ ధర్మాలను మరచి స్వభావాలను విడిచేస్తారు. వక్రమార్గంలో నడుస్తారు. వ్యాపారంలోని నియమాలు క్రయవిక్రయాల విలువలను మరచి, తూకాల్లో ప్రజలను మోసగించి, ధనార్జనయందు ప్రీతి కల వారవుతారు.

గురుదేవద్విజాతీనాం భక్తిహీనాః కుబుద్ధయః ।
అభోజితద్విజాః ప్రాయః కృపణా బద్ధముష్టయః ॥23॥

గురువులు, దేవతలు, బ్రాహ్మణులయందు ఇసుమంతైనా భక్తి లేక, లోభత్వం కలవారై, పిడికిలి బిగించుకొని, దానగుణం లేని వారై ఉంటారు. చివరకు బ్రాహ్మణునికి కూడా ఒకపూట భోజనం పెట్ట లేరు.

కామినీజారభావేషు సురతా మలినాశయాః ।
లోభమోహవిచేతస్కాః పూర్తాదిసువృషోజ్ఝితాః ॥24॥

నిత్యం వేశ్యాసమూహాల వెంట విటులుగా మారి, మలినమనస్కులవుతారు. లోభం, అజ్ఞానం అధికమై, సద్బుద్ధిని విడనాడి, ప్రజోపయోగకరమగు పనులైన బావులు త్రవ్వించుట, వృక్షసంపద పెంచుట విడిచి పెడతారు.

తద్వచ్ఛూద్రాశ్చ యే కేచిత్ బ్రాహ్మణాచారతత్పరాః ।
ఉజ్జ్వలాకృతయో మూఢాః స్వధర్మత్యాగశీలినః ॥25॥

చిత్రమేమంటే కొందరు శూద్రులు బ్రాహ్మణుల ఆచారసంప్రదాయాలను అనుసరించటానికి ఇష్టపడతారు. బాహ్యపటాటోపం ప్రకటించి, విచిత్రవేషధారణులై, తమ నిజధర్మాలను మరచి ప్రవర్తిస్తారు.

కర్తారస్తపసాం భూయో ద్విజతేజోపహారకాః ।
శిశ్వల్పమృత్యుకారాశ్చ మంత్రోచ్చారపరాయణాః ॥26॥

ఇంకనువారు తపస్సులను ఆచరిస్తుంటారు. ద్విజుల తేజస్సును అపహరిస్తుంటారు. శిశువుల, బలహీనుల మరణానికి కారణమవుతారు. మంత్రాలను పలకడంలో నిమగ్నులవుతారు.

శాలిగ్రామశిలాదీనాం పూజకా హోమతత్పరాః ।
ప్రతికూలవిచారాశ్చ కుటిలా ద్విజదూషకాః ॥27॥

అయినప్పటికీ, సాలిగ్రామశిలలకు పూజలు చేసేటప్పుడు, హోమాలు చేసేటప్పుడు, వాటికి వశులై ఉంటారు. శూద్రులు చెడు భావాలు కల్గి, ధర్మానికి వ్యతిరేకంగా ఆలోచించి, బ్రాహ్మణులను దూషిస్తారు.

ధనవంతః కుకర్మాణో విద్యావంతో వివాదినః ।
ఆఖ్యాయోపాసనా ధర్మవక్తారో ధర్మలోపకాః ॥28॥

వారిలో కొంతమంది ధనవంతులు చెడుపనులు చేస్తుంటారు. విద్యావంతులు అయిన కొంతమంది వాదప్రతివాదాలు చేస్తుంటారు. గొప్పలు చెప్తుంటారు. ఉపాసనలు చేస్తుంటారు. ధర్మాన్ని గూర్చి చెప్తుంటారు. ధర్మలోపానికి కారణమవుతారు.

సుభూషాకృతయో దంభాః సుదాతారో మహామదాః ।
విప్రాదీన్ సేవకాన్ మత్వా మన్యమానా నిజం ప్రభుమ్ ॥29॥

వారు ఖరీదైన అలంకారాలకు ధనం వెచ్చించి, తాము చేస్తున్న ధర్మసేవలకు చాలా ప్రచారం ఇచ్చుకొంటారు. వారిలో దానం చేసేవారికి అధికగర్వం ఉంటుంది. తమను ప్రభువులుగా భావించి, బ్రాహ్మణులను సేవకులుగా భావిస్తారు.

స్వధర్మరహితా మూఢాస్సంకరాః క్రూరబుద్ధయః ।
మహాభిమానినో నిత్యం చతుర్వర్ణవిలోపకాః ॥30॥

ఈ విధంగా వీరు సహజధర్మాలను మరచి, మూఢులై, సంకరజాతికి చెందినవారై, ఎప్పుడూ అహంకారమును ప్రకటిస్తుంటారు. నాలుగువర్ణాల విధానానికి లోపం కల్గిస్తుంటారు.

సుకులీనాన్నిజాన్మత్వా చతుర్వర్ణవివర్తనాః ।
సర్వవర్ణభ్రష్టకరా మూఢాస్సత్కర్మకారిణః ॥31॥

తమను తాము మంచి కులంలో పుట్టినట్లుగా భావించి, చాతుర్వర్ణ్యవ్యవస్థకు భంగం కలిగించుచూ, సర్వవర్ణభ్రంశమునకు కారకులై, మూఢులై, పెద్దలు చేయు పనులను తామే ఆచరిస్తుంటారు.

స్త్రియశ్చ ప్రాయశో భ్రష్టా భర్త్రవజ్ఞానకారికాః ।
శ్వశురద్రోహకారిణ్యో నిర్భయా మలినాశనాః ॥32॥

అధికశాతం స్త్రీలు పతితలుగా మారిపోతారు. భర్తను అవమానం చేయడానికీ వెనుకాడరు. మామగారికి ద్రోహం చేస్తారు. భయం లేకుండా నీచమైన ఆహారం స్వీకరిస్తారు.

కుహావభావనిరతాః కుశీలాః స్మరవిహ్వలాః ।
జారసంగరతా నిత్యం స్వస్వామివిముఖాస్తథా ॥33॥

చెడుహావభావాలు నిత్యం ప్రదర్శిస్తూ, శీలసంపదను కోల్పోయి, నిత్యమూ పరపురుషులతో సుఖిస్తూ, తాళి కట్టిన భర్తయందు అనురాగం లేనివారై జీవిస్తుంటారు.

తనయా మాతృపిత్రోశ్చ భక్తిహీనా దురాశయాః ।
అవిద్యాపాఠకా నిత్యం రోగగ్రసితదేహకాః ॥34॥

తల్లిదండ్రులయందు భక్తి లేని పుత్రులు, చెడు బుద్ధులు నేర్చి, చెడు చదువులు చదువుతారు. నిత్యమూ రోగాలతో బాధపడుతుంటారు.

ఏతేషాం నష్టబుద్ధీనాం స్వధర్మత్యాగశీలినామ్ ।
పరలోకేఽపీహ లోకే కథం సూత గతిర్భవేత్ ॥35॥

ఓ సూతమహర్షీ! ఇటువంటి బుద్ధి నశించిన, స్వధర్మమును వీడిన స్వభావం గల వారికి ఈ లోకంలో, పరలోకంలో ఎటువంటి గతి పడుతుంది?

ఇతి చింతాకులం చిత్తం జాయతే సతతం హి నః ।
పరోపకారసదృశో నాస్తి ధర్మోఽపరః ఖలు ॥36॥

ఈ విషయాలన్నీ మాకు నిత్యమూ మనసులో చింత కల్గిస్తున్నాయి. పరోపకారాన్ని మించిన మహాధర్మం మరొకటి లేదు కదా!

లఘూపాయేన యేనైషాం భవేత్ సద్యోఽఘనాశనమ్ ।
సర్వసిద్ధాంతవిత్త్వం హి కృపయా తద్వదాధునా ॥37॥

వీరందరికీ త్వరితగతిని పాపాలు తొలగే తేలికైన ఉపాయం ఉన్నదా? నీవు అన్నిరీతులూ, సిద్ధాంతాలూ తెలిసిన వాడవు. కావున దయతో సరియైన మార్గాన్ని తెలియచేయుము.

వ్యాస ఉవాచ - వ్యాసమహర్షి ఇట్లు చెప్తున్నాడు.

ఇత్యాకర్ణ్య వచస్తేషాం మునీనాం భావితాత్మనామ్ ।
మనసా శంకరం స్మృత్వా సూతః ప్రోవాచ తాన్మునీన్ ॥38॥

నిర్మలములూ, పవిత్రములు అయిన ఆ మునుల మాటలను విని, సూతమహర్షి మనస్సులో పరమశివుణ్ణి తలచుకొని, ఆ మునులతో ఇట్లు చెప్పాడు.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం మునిప్రశ్నవర్ణనో నామ ప్రథమోఽధ్యాయః ॥1॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు మునిప్రశ్నవర్ణనం అను పేరు గల మొదటి అధ్యాయం సమాప్తం.

ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయం

శివపురాణపరిచయః - శివపురాణపరిచయం

సూత ఉవాచ - సూతమహాముని చెప్పాడు.

సాధుపృష్టం సాధవో వస్త్రైలోక్యహితకారకమ్ ।
గురుం స్మృత్వా భవత్స్నేహాద్వక్ష్యే తచ్ఛృణుతాదరాత్ ॥1॥

ఓ సాధుపుంగవులారా! మీరు మూడులోకాలకు హితం (శుభము) కల్గే సరియైన ప్రశ్నను అడిగారు. గురువును మదిలో స్మరించుకొని, మీతో గల స్నేహం వల్ల చెప్తాను. ఆదరంతో వినండి.

వేదాంతసారసర్వస్వం పురాణం శైవముత్తమమ్ ।
సర్వాఘౌఘోద్ధారకరం పరత్ర పరమార్థదమ్ ॥2॥

శివపురాణం ఉత్తమమైనది. వేదాల అంతాలైన ఉపనిషత్తుల మొత్తం సారాంశమంతా శివపురాణంలో ఉంది. సకలపాపాల నుండి ఉద్ధరిస్తుంది. తనువులు చాలించిన పిదప పురుషార్థాలలో ముఖ్యమైన మోక్షాన్ని ఇస్తుంది.

కలికల్మషవిధ్వంసి యస్మిన్ శివయశః పరమ్ ।
విజృంభతే సదా విప్రాశ్చతుర్వర్గఫలప్రదమ్ ॥3॥

ఓ బ్రాహ్మణులారా! ఈ శివపురాణంలో కలిదోషాల్ని నాశనం చేసే శక్తి, ధర్మార్థకామమోక్షాలు అనే నాలుగు పురుషార్థాలనూ ఇచ్చే శక్తి, అత్యంతకష్టతరమైన శివుని కీర్తి అంతటా విస్తారముగా ఉన్నది.

తస్యాధ్యయనమాత్రేణ పురాణస్య ద్విజోత్తమాః ।
సర్వోత్తమస్య శైవస్య తే యాస్యంతి సుసద్గతిమ్ ॥4॥

ఓ బ్రాహ్మణోత్తములారా! ఈ శివపురాణాన్ని చదివినంత మాత్రాన, సామాన్యమానవులు సర్వశ్రేష్ఠులైన శివభక్తులు పొందే ఉత్తమగతిని పొందుతారు.

తావద్విజృంభతే పాపం బ్రహ్మహత్యాపురస్సరమ్ ।
యావచ్ఛివపురాణం హి నోదేష్యతి జగత్యహో ॥5॥

ఈ లోకంలో శివపురాణం ఉదయించనంతవరకే బ్రహ్మహత్యాది పాపాలు విపరీతమవుతూ ఉంటాయి.

తావత్కిల మహోత్పాతాః సంచరిష్యంతి నిర్భయాః ।
యావచ్ఛివపురాణం హి నోదేష్యతి జగత్యహో ॥6॥

ఈ లోకంలో శివపురాణం లోకప్రియం కానంత వరకే ఘోరమైన ఆపదలు, ప్రమాదాలు, అపశకునాలూ విపరీతంగా సంభవిస్తుంటాయి.

తావత్సర్వాణి శాస్త్రాణి వివదంతి పరస్పరమ్ ।
యావచ్ఛివపురాణం హి నోదేష్యతి జగత్యహో ॥7॥

ఈ లోకంలో శివపురాణం జనాదరణ పొందనంత వరకే, ఇతరశాస్త్రలన్నీ ఒకదానితో మరొకటి పోటీ పడుతుంటాయి.

తావత్స్వరూపం దుర్బోధం శివస్య మహతామపి ।
యావచ్ఛివపురాణం హి నోదేష్యతి జగత్యహో ॥8॥

ఈ లోకంలో శివపురాణం ఉదయించనంతవరకు మాత్రమే శివునియొక్క మాహాత్మ్యం, తత్త్వం మహాత్ములకు కూడా తెలియబడదు.

తావద్యమభటాః క్రూరాః సంచరిష్యంతి నిర్భయాః ।
యావచ్ఛివపురాణం హి నోదేష్యతి జగత్యహో ॥9॥

శివపురాణం తన మహిమను లోకానికి చూపనంతవరకు మాత్రమే క్రూరులైన యమభటులు భయం లేకుండా ఈ లోకంలో సంచరిస్తుంటారు.

తావత్సర్వపురాణాని ప్రగర్జంతి మహీతలే ।
యావచ్ఛివపురాణం హి నోదేష్యతి జగత్యహో ॥10॥

శివపురాణం ఉదయించనంతవరకే శివపురాణం యొక్క గొప్పతనం తెలియక, ఇతర పురాణాలు గర్జిస్తుంటాయి.

తావత్సర్వాణి తీర్థాని వివదంతి మహీతలే ।
యావచ్ఛివపురాణం హి నోదేష్యతి జగత్యహో ॥11॥

శివపురాణసంగతులు తెలియనంతవరకే పుణ్యనదులన్నీ తమలో తాము తగవులాడుకొంటున్నాయి.

తావత్సర్వాణి మంత్రాణి వివదంతి మహీతలే ।
యావచ్ఛివపురాణం హి నోదేష్యతి మహీతలే ॥12॥

శివపురాణప్రాభవం తెలియక మంత్రాలన్నీ ఒకదానితో మరొకటి విభేదిస్తుంటాయి.

తావత్సర్వాణి క్షేత్రాణి వివదంతి మహీతలే ।
యావచ్ఛివపురాణం హి నోదేష్యతి మహీతలే ॥13॥

శివపురాణవైభవం తెలియక పుణ్యక్షేత్రాలన్నీ తమలో తాము పోటీతత్త్వాన్ని పెంచుకొంటున్నాయి.

తావత్సర్వాణి పీఠాని వివదంతి మహీతలే ।
యావచ్ఛివపురాణం హి నోదేష్యతి మహీతలే ॥14॥

శివపురాణమహిమ లోకానికి పరిచయం కానంత వరకు మాత్రమే సర్వపీఠాలూ ఒకదానితో మరొకటి తమ తమ గొప్పతనం కొరకు తగవులాడుకొంటాయి.

తావత్సర్వాణి దానాని వివదంతి మహీతలే ।
యావచ్ఛివపురాణం హి నోదేష్యతి మహీతలే ॥15॥

శివపురాణమహిమ లోకంలో తెలియనంత వరకు మాత్రమే, సర్వదానాలూ తమలో తాము గొప్పవని తలంచి, ఒకదానితో మరొకటి తగవులాడుతుంటాయి.

తావత్సర్వే చ తే దేవా వివదంతి మహీతలే ।
యావచ్ఛివపురాణం హి నోదేష్యతి మహీతలే ॥16॥

ఈ లోకంలో శివపురాణవైభవం ప్రకటితం కానంత వరకు మాత్రమే సర్వదేవతాగణం తమలో తాము వారి గొప్పతనం కోసం తగవులాడుతారు.

తావత్సర్వే చ సిద్ధాంతా వివదంతి మహీతలే ।
యావచ్ఛివపురాణం హి నోదేష్యతి మహీతలే ॥17॥

ఈ లోకంలో శివపురాణమాహాత్మ్యం తెలియనంత వరకే అన్ని సిద్ధాంతాలూ తమలో వాటి గొప్పతనం చాటుకోవడానికై తగవులాడుకుంటాయి.

అస్య శైవపురాణస్య కీర్తనశ్రవణాత్ ద్విజాః ।
ఫలం వక్తుం న శక్నోమి కార్త్స్న్యేన మునిసత్తమాః ॥18॥

ఓ బ్రాహ్మణులారా! ఈ మహాపురాణం గురించి చెప్పడం వల్ల, వినడం వల్ల మీకు లభించే ఫలితాలను గురించి పూర్తిగా తెలియ చెప్పటానికి శక్తి లేనివాణ్ణి నేను.

తథాపి తస్య మాహాత్మ్యం వక్ష్యే కించిత్తు వోఽనఘాః ।
చిత్తమాధాయ శృణుత వ్యాసేనోక్తం పురా మమ ॥19॥

అయినప్పటికీ శివపురాణమాహాత్మ్యాన్ని కొంత వరకు తెలియచెప్తాను. ఓ మునిపుంగవులారా! మీ మనసును లగ్నం చేసి, శ్రద్ధగా వినండి. ఈ విషయాలన్నీ గతంలో నాకు వ్యాసమహర్షి చెప్పి ఉన్నాడు.

ఏతచ్ఛివపురాణం హి శ్లోకం శ్లోకార్థమేవ చ ।
యః పఠేద్భక్తిసంయుక్తస్స పాపాన్ముచ్యతే క్షణాత్ ॥20॥

ఈ శివమహాపురాణంలోని ఒక్క శ్లోకమే గానీ, లేదా శ్లోకంలోని సగభాగాన్ని కానీ భక్తితో చదివిన వారికి క్షణకాలంలోనే చేసిన పాపాలనుండి ముక్తి కలుగుతుంది.

ఏతచ్ఛివపురాణం హి యః ప్రత్యహమతంద్రితః ।
యథాశక్తి పఠేద్భక్త్యా స జీవన్ముక్త ఉచ్యతే ॥21॥

ఎవరైతే ఈ శివపురాణాన్ని ప్రతిదినమూ శక్తి మేరకు భక్తితో చదువుతారో వారు జీవన్ముక్తులవుతారు.

ఏతచ్ఛివపురాణం హి యో భక్త్యార్చయతే సదా ।
దినే దినేఽశ్వమేధస్య ఫలం ప్రాప్నోత్యసంశయమ్ ॥22॥

ఎవరైతే ఈ శివపురాణాన్ని ప్రతిదినమూ భక్తితో పూజిస్తారో వారికి అశ్వమేధయాగం చేసినంతటి గొప్పఫలాలు తప్పక లభిస్తాయి. ఇందులకు ఎట్టి సందేహమూ లేదు.

ఏతచ్ఛివపురాణం యస్సాధారణపదేచ్ఛయా ।
అన్యతః శృణుయాత్సోఽపి మత్తో ముచ్యేత పాతకాత్ ॥23॥

ప్రాపంచికాలైన పదవుల కోసం ఎవరైనా శివపురాణాన్ని ఇతరుల ద్వారా విన్నా చాలు - విషయేచ్ఛ వల్ల పాపాల నుండి విముక్తులు కాగలరు.

ఏతచ్ఛివపురాణం యో నమస్కుర్యాదదూరతః ।
సర్వదేవార్చనఫలం స ప్రాప్నోతి న సంశయః ॥24॥

ఎవరు ఈ శివపురాణగ్రంథం దగ్గరకు వచ్చి, నమస్కరిస్తారో వారికి సకలదేవతలనూ పూజించిన పుణ్యఫలం లభిస్తుంది. ఇందులో ఎట్టి సందేహమూ లేదు.

ఏతచ్ఛివపురాణం వై లిఖిత్వా పుస్తకం స్వయమ్ ।
యో దద్యాచ్ఛివభక్తేభ్యస్తస్య పుణ్యఫలం శృణు ॥25॥

ఇక ఈ శివమహాపురాణాన్ని ఎవడైతే స్వయంగా వ్రాసి శివభక్తులకు ఇస్తాడో వానికి కలిగే పుణ్యఫలాలను గురించి చెబుతాను - వినండి.

అధీతేషు చ శాస్త్రేషు వేదేషు వ్యాకృతేషు చ ।
యత్ఫలం దుర్లభం లోకే తత్ఫలం తస్య సంభవేత్ ॥26॥

సకలశాస్త్రాలను, నాలుగువేదాలను పూర్తిగా చదివి, మరల వాటిని చెప్పడం వల్ల, ఈ లోకంలో అతికష్టమైన ఫలాలు ఏ విధంగా లభిస్తాయో ఈ శివపురాణాన్ని చదివిన వారికి ఆ పుణ్యఫలాలన్నీ చేకూరుతాయి.

ఏతచ్ఛివపురాణం హి చతుర్దశ్యాముపోషితః ।
శివభక్తసభాయాం యో వ్యాకరోతి స ఉత్తమః ॥27॥

ఎవరు ఈ శివమహాపురాణాన్ని చతుర్దశీతిథినాడు ఉపవాసంతో ఉండి శివభక్తులకు సభాముఖంగా వినిపిస్తాడో వారు ఉత్తములవుతారు.

ప్రత్యక్షరం తు గాయత్రీపురశ్చర్యాఫలం లభేత్ ।
ఇహ భుక్త్వాఖిలాన్ కామానంతే నిర్వాణతాం వ్రజేత్ ॥28॥

పైన చెప్పిన ఉత్తముడు పలికే ప్రతి అక్షరానికి లక్షలమార్లు గాయత్రీమంత్రపఠనఫలం పొంది, ఈ భూలోకంలోని కోరికలన్నిటినీ అనుభవించి, దేహం నశించిన తరువాత మోక్షం పొందుతాడు.

ఉపోషితశ్చతుర్దశ్యాం రాత్రౌ జాగరణాన్వితః ।
యః పఠేచ్ఛృణుయాద్వాపి తస్య పుణ్యం వదామ్యహమ్ ॥29॥

ఇక శివపురాణాన్ని చతుర్దశి తిథినాడు ఉపవాసం ఉండి, రాత్రి పూర్తిగా మేల్కొని ఉండి దీన్ని చదువుతారో లేక వింటారో వారికి లభించే పుణ్యాన్ని చెప్తాను – విను.

కురుక్షేత్రాదినిఖిలపుణ్యతీర్థేష్వనేకశః ।
ఆత్మతుల్యధనం సూర్యగ్రహణే సర్వతోముఖే ॥30॥

కురుక్షేత్రము నుండి మొదలైన అనేక పుణ్యతీర్థాలలో సంపూర్ణసూర్యగ్రహణం నాడు తన దేహసమానమైన బరువు గల ధనాన్ని పెక్కుమార్లు ఇచ్చిన ఫలం కలుగుతుంది.

విప్రేభ్యో వ్యాసముఖ్యేభ్యో దత్త్వా యత్ఫలమశ్నుతే ।
తత్ఫలం సంభవేత్తస్య సత్యం సత్యం న సంశయః ॥31॥

పైన చెప్పిన దేహసమానమైన బరువుతో కూడిన ధనాన్ని పౌరాణికశ్రేష్ఠులు, ఇంకా ఇతరబ్రాహ్మణులకు ఇస్తే ఎట్టి ఫలం లభించునో అట్టి ఫలం ఈ శివపురాణం చదివిన, వినిన వారికి లభిస్తుంది. ఇది సత్యం. ఇందులో ఎటువంటి సందేహమూ లేదు.

ఏతచ్ఛివపురాణం హి గాయతే యోఽప్యహర్నిశమ్ ।
ఆజ్ఞాం తస్య ప్రతీక్షేరన్ దేవా ఇంద్రపురోగమాః ॥32॥

ఎవ రైతే ఈ శివపురాణాన్ని రాత్రి, పగలు అనే భేదం లేకుండా గానము చేస్తారో వారి ఆజ్ఞ కొరకు ఇంద్రుడు మున్నగు అందరి దేవతలు ఎదురు చూస్తుంటారు.

ఏతచ్ఛివపురాణం యః పఠన్ శృణ్వన్ హి నిత్యశః ।
యద్యత్కరోతి సత్కర్మ తత్కోటిగుణితం భవేత్ ॥33॥

ఎవడైతే ఈ శివపురాణాన్ని నిత్యమూ పఠించి, వింటూ ఉంటాడో ఆ వ్యక్తి ఏ పుణ్యమైన పనిచేసినా, దాని ఫలం కోటిరెట్లు అవుతుంది.

సమాహితః పఠేద్యస్తు తత్ర శ్రీరుద్రసంహితామ్ ।
స బ్రహ్మఘ్నోఽపి పూతాత్మా త్రిభిరేవ దినైర్భవేత్ ॥34॥

ఈ శివపురాణంలోని రుద్రసంహితను మనస్సు లగ్నము చేసి, చదివిన వాడు, ఒకవేళ బ్రహ్మహత్య చేసిన వాడైనా, మూడురోజులలో వాని మనస్సు శుద్ధియై, ఆ పాపం నుండి బయటపడగలడు.

తాం రుద్రసంహితాం యస్తు భైరవప్రతిమాంతికే ।
త్రిః పఠేత్ ప్రత్యహం మౌనీ స కామానఖిలాన్ లభేత్ ॥35॥

ఈ రుద్రసంహితను ప్రతిదినమూ మూడుసార్లు శివుని రూపమైన భైరవప్రతిమ వద్ద మౌని వలె ఎవరు చదువుతారో వారి కోరికలన్నీ సఫలమవుతాయి.

తాం రుద్రసంహితాం యస్తు స పఠేద్వటబిల్వయోః ।
ప్రదక్షిణాం ప్రకుర్వాణో బ్రహ్మహత్యా నివర్తతే ॥36॥

ఈ రుద్రసంహితను చదువుతూ ఎవరు మారేడు, మఱ్ఱిచెట్లకు ప్రదక్షిణాలు చేస్తారో వారు బ్రహ్మహత్యాపాపం నుండి విముక్తులవుతారు.

కైలాససంహితా తత్ర తతోఽపి పరమస్మృతా ।
బ్రహ్మస్వరూపిణీ సాక్షాత్ప్రణవార్థప్రకాశికా ॥37॥

ఈ శివపురాణంలోని కైలాససంహిత మరింత పవిత్రమై ఉన్నది. వేదమే ఈ సంహితారూపంతో తెలియబడుతూంది. అందు ప్రణవంగా పిలిచే "ఓంకారం" యొక్క అర్థాన్ని ప్రకాశం చేసింది.

కైలాససంహితాయాస్తు మాహాత్మ్యం వేత్తి శంకరః ।
కృత్స్నం తదర్ధం వ్యాసశ్చ తదర్ధం వేద్మ్యహం ద్విజాః ॥38॥

ఓ బ్రాహ్మణులారా! కైలాససంహితయొక్క పూర్తి మాహాత్మ్యం ఒక్క శంకరునికే తెలుస్తుంది. అందులో సగభాగం వ్యాసునికి తెలుసు. వాసునికి తెలిసిన దానిలో సగభాగం నాకు తెలుసు.

తత్ర కించిత్ ప్రవక్ష్యామి కృత్స్నం వక్తుం న శక్యతే ।
యద్ జ్ఞాత్వా తత్క్షణాల్లోకశ్చిత్తశుద్ధిమవాప్నుయాత్ ॥39॥

అట్లు నాకు తెలిసిన భాగం నుండి కొంత మీకు చెప్తాను. పూర్తిగా చెప్పడానికి వీలు కాదు. ఈ కైలాససంహితను తెలుసుకున్న మరుక్షణంలోనే మానవుడు నిర్మలమనస్కుడవుతాడు.

న నాశయతి యత్పాపం సా రౌద్రీ సంహితా ద్విజాః ।
తన్న పశ్యామ్యహం లోకే మార్గమాణోఽపి సర్వదా ॥40॥

ఓ బ్రాహ్మణులారా! ఈ లోకంలో రుద్రసంహిత చదవటం వల్ల కలిగే పుణ్యం ఎంతటి పాపాన్నయినా నశింప చేయగలదు. ఇంత గొప్పది ఎంత వెతికినా మరొకటి నాకు కనపడలేదు.

శివేనోపనిషత్సింధుమంథానోత్పాదితాం ముదా ।
కుమారాయార్పితాం తాం వై సుధాం పీత్వాఽమరో భవేత్ ॥41॥

ఉపనిషత్తులనే సముద్రాన్ని మథించి, శివుడు రుద్రసంహిత అనే అమృతాన్ని వెలికి తీశాడు. దాన్ని కుమారస్వామికి అంద చేశాడు. ఆ అమృతాన్ని అనగా ఆ రుద్రసంహితను గ్రహించిన వాడు చావు లేని వాడవుతాడు.

బ్రహ్మహత్యాదిపాపానాం నిష్కృతిం కర్తుముద్యతః ।
మాసమాత్రం సంహితాం తాం పఠిత్వా ముచ్యతే తతః ॥42॥

ఏ మానవుడు ఒక నెలరోజులపాటు ఈ రుద్రసంహితను చదువుతాడో అట్టివాడు బ్రహ్మహత్యాదులైన అనేకపాపముల నుండి విముక్తుడవుతాడు.

దుష్ప్రతిగ్రహదుర్భోజ్యదురాలాపాదిసంభవమ్ ।
పాపం సకృత్ కీర్తనేన సంహితా సా వినాశయేత్ ॥43॥

ఈ రుద్రసంహితను చదివిన వారు తెలియక తీసుకున్న చెడు దానాల పాపం, తినకూడని ఆహారాన్ని తీసుకున్న పాపం, పలుక కూడని పలుకులు పలికిన పాపం – ఇలా అనేక పాపాల నుండి ఉపశమనం పొందుతాడు.

శివాలయే బిల్వవనే సంహితాం తాం పఠేత్తు యః ।
స తత్ఫలమవాప్నోతి యద్వాచోఽపి న గోచరే ॥44॥

శివాలయంలో గానీ, మారేడుచెట్ల వనంలో గానీ ఈ రుద్రసంహితను చదివిన వారికి కలిగే మంచి ఫలితాలు మాటలలో చెప్పనలవి కానివి.

సంహితాం తాం పఠన్ భక్త్యా యః శ్రాద్ధే భోజయేత్ ద్విజాన్ ।
తస్య యే పితరస్సర్వే యాంతి శంభోః పరం పదమ్ ॥45॥

ఎవరైతే శ్రాద్ధసమయాలలో రుద్రసంహితను చదువుతూ బ్రాహ్మణులకు భోజనం వడ్డిస్తారో వారి తరంలోని తల్లిదండ్రులు అందరూ శివసన్నిధిని చేరుకొంటారు.

చతుర్దశ్యాం నిరాహారో యః పఠేత్సంహితాం చ తామ్ ।
బిల్వమూలే శివస్సాక్షాత్స దేవైశ్చ ప్రపూజ్యతే ॥46॥

ఎవడు చతుర్దశి తిథి నాడు ఉపవాసం చేసి, మారేడుచెట్టు మొదలునందుండి ఈ రుద్రసంహిత చదువుతాడో అట్టి వాణ్ణి శివస్వరూపునిగా గుర్తించి దేవతలు కూడా పూజిస్తారు.

అన్యాపి సంహితా తత్ర సర్వకామఫలప్రదా ।
ఉభే విశిష్టే విజ్ఞేయే లీలావిజ్ఞానపూరితే ॥47॥

మరియొక సంహిత కూడ సర్వకామఫలప్రదము అయినది కలదు. ఇవి కోరిన ఫలాలన్నిటినీ ఇస్తాయి. అందులో శివుని లీలలు రెండు సంహితలలో చక్కగా వర్ణించబడి ఉన్నాయి.

తదిదం శైవమాఖ్యాతం పురాణం వేదసమ్మితమ్ ।
నిర్మితం తచ్ఛివేనైవ ప్రథమం బ్రహ్మసమ్మితమ్ ॥48॥

ఇది వేదంతో సమానమైన ప్రామాణ్యం కలది. దీన్ని శివుడే ముందుగా సిద్ధం చేసినాడు.

విద్యేశం చ తథా రౌద్రం వైనాయకమథౌమికమ్ ।
మాత్రం రుద్రైకాదశకం కైలాసం శతరుద్రకమ్ ॥49॥

ఈ శివపురాణంలో విద్యేశ్వరం, రుద్రం, వినాయకం, ఉమ, మాతృ, ఏకాదశరుద్రం, కైలాసం, శతరుద్రం అనునవి.

కోటిరుద్రసహస్రాద్యం కోటిరుద్రం తథైవ చ ।
వాయవీయం ధర్మసంజ్ఞం పురాణమితి భేదతః ॥50॥

ఈ శివపురాణంలో కోటిరుద్ర, సహస్రకోటిరుద్ర, వాయు, ధర్మసంహితలు అనునవి కలవు.

సంహితాద్వాదశమితా మహాపుణ్యతరా మతా ।
తాసాం సంఖ్యాం బ్రువే విప్రాః శృణుతాదరతోఖిలమ్ ॥51॥

ఓ బ్రాహ్మణోత్తములారా! ఇందులోని పన్నెండు సంహితలు చాలా పుణ్యవంతమైనవి. వాటిలో గల శ్లోకసంఖ్య వివరాలు తెలియ చేస్తాను. పూర్తిగా వినండి.

విద్యేశం దశసాహస్రం రుద్రం వైనాయకం తథా ।
ఔమం మాతృపురాణాఖ్యం ప్రత్యేకాష్టసహస్రకమ్ ॥52॥

విద్యేశ్వరసంహితలో పదివేల శ్లోకాలు, రుద్ర, వినాయక, ఉమా, మాతృసంహితలలో ఒక్కొక్క దానిలో ఎనిమిదివేల శ్లోకాలు ఉన్నాయి.

త్రయోదశసహస్రం హి రుద్రైకాదశకం ద్విజాః ।
షట్సహస్రం చ కైలాసం శతరుద్రం తదర్ధకమ్ ॥53॥

ఏకాదశరుద్రసంహితలో పదమూడువేల శ్లోకాలు, కైలాససంహితలో ఆరువేల శ్లోకాలు, శతరుద్రసంహితలో మూడువేల శ్లోకాలు ఉన్నాయి.

కోటిరుద్రం త్రిగుణితమేకాదశసహస్రకమ్ ।
సహస్రకోటిరుద్రాఖ్యముదితం గ్రంథసంఖ్యయా ॥54॥

కోటిరుద్రసంహితలో తొమ్మిదివేల శ్లోకాలు, సహస్రకోటిరుద్రసంహితలో పదకొండువేల శ్లోకాలు ఉన్నాయి.

వాయవీయం ఖాబ్ధిశతం ధర్మం రవిసహస్రకమ్ ।
తదేవం లక్షసంఖ్యాకం శైవసంఖ్యావిభేదతః ॥55॥

వాయుసంహితలో నాలుగువేలు, ధర్మసంహితలో పన్నెండువేల శ్లోకాలు, అన్నీ కలిసి ఒక లక్ష శ్లోకాలు శివపురాణంలో ఉన్నాయి.

వ్యాసేన తత్తు సంక్షిప్తం చతుర్వింశత్సహస్రకమ్ ।
శైవం తత్ర చతుర్థం వై పురాణం సప్తసంహితమ్ ॥56॥

వ్యాసమహర్షి ఈ లక్షశ్లోకాలను కుదించి, ఏడుసంహితలు, ఇరవైనాలుగువేల శ్లోకాలతో శివపురాణాన్ని సంగ్రహించాడు.

శివేన కల్పితం పూర్వం పురాణం గ్రంథసంఖ్యయా ।
శతకోటిప్రమాణం హి పురా సృష్టౌ సువిస్తృతమ్ ॥57॥

సృష్టి ఆదిలో శివుడు వందకోట్ల శ్లోకాలతో చాలా విస్తరించియున్న పురాణాన్ని తయారు చేశాడు.

వ్యస్తేఽష్టాదశధా చైవ పురాణే ద్వాపరాదిషు ।
చతుర్లక్షేణ సంక్షిప్తే కృతే ద్వైపాయనాదిభిః ॥58॥

కృష్ణద్వైపాయనాది మహర్షులు ద్వాపరాదియుగాలలో నాలుగులక్షల శ్లోకాలుగా కుదించి, పద్దెనిమిది పురాణాలుగా విభజించారు.

ప్రోక్తం శివపురాణం హి చతుర్వింశత్సహస్రకమ్ ।
శ్లోకానాం సంఖ్యయా సప్తసంహితం బ్రహ్మసమ్మితమ్ ॥59॥

ఈ విధంగా వేదసమానమైన శివపురాణములో ఏడు సంహితలు, ఇరవైనాలుగువేల శ్లోకాలు ఉన్నాయి.

విద్యేశ్వరాఖ్యా తత్రాద్యా రౌద్రీ జ్ఞేయా ద్వితీయికా ।
తృతీయా శతరుద్రాఖ్యా కోటిరుద్రా చతుర్థికా ॥60॥

శివపురాణమందున్న ఏడు సంహితలలో మొదటిది విద్యేశ్వరసంహిత, రెండవది రుద్రసంహిత, మూడవది శతరుద్రసంహిత, నాలుగవది కోటిరుద్రసంహితగానూ ఉన్నాయి.

పంచమీ చైవమౌమాఖ్యా షష్ఠీ కైలాససంజ్ఞికా ।
సప్తమీ వాయవీయాఖ్యా సప్తైవం సంహితా మతాః ॥61॥

శివపురాణమందున్న ఐదవది ఉమాసంహిత, ఆరవది కైలాససంహిత ఏడవది వాయుసంహిత.

ససప్తసంహితం దివ్యం పురాణం శివసంజ్ఞకమ్ ।
వరీవర్తి బ్రహ్మతుల్యం సర్వోపరి గతిప్రదమ్ ॥62॥

ఈ శివపురాణము ఏడు సంహితలతో కూడి, వేదముతో సమానమైన విలువగలది. ఇది చాల ఉత్తమమైన మోక్షమును, మంచి దారిని చూపిస్తుంది. ఇది చాలా కష్టతరమైనదైనప్పటికి ఒక దివ్యమైనదిగా ఉన్నది.

ఏతచ్ఛివపురాణం హి సప్తసంహితమాదరాత్ ।
పరాపూర్ణం పఠేద్యస్తు స జీవన్ముక్త ఉచ్యతే ॥63॥

ఈ శివపురాణమందున్న ఏడు సంహితలను పూర్తిగా చదివిన వ్యక్తికి జీవన్ముక్తి కలుగుతుంది.

శ్రుతిస్మృతిపురాణేతిహాసాగమశతాని చ ।
ఏతచ్ఛివపురాణస్య నార్హంత్యల్పాం కలామపి ॥64॥

ఈ శివపురాణంలోని ఒక చిన్న అంశానికి ఉన్న మహిమ శ్రుతులు, స్మృతులు, పురాణములు, ఇతిహాసములు, ఆగమశాస్త్రాలకున్న మహిమలకు సాటిరావు.

శైవం పురాణమమలం శివకీర్తితం తత్ వ్యాసేన శైవప్రవణేన న సంగృహీతమ్ ।
సంక్షేపతః సకలజీవగుణోపకారే తాపత్రయఘ్నమతులం శివదం సతాం హి ॥65॥

శివునిచే తయారు చేయబడిన ఈ పుణ్యశివపురాణాన్ని, శివభక్తులలో మొదటివాడైన వ్యాసమహాముని తెలుసుకొని, మానవులందరికి మంచి చేయాలనుకొని, లక్షల శ్లోకాలను తక్కువకు కుదించాడు. ఇది తాపత్రయములనే మూడు రకాల దుఃఖాలను పోగొట్టి మంచి వారలకు మరిన్ని మంచికలుగునట్లు చేస్తుంది.

వి. తాపత్రయములనగా 1) ఆధిదైవిక 2) ఆధిభౌతిక 3) ఆధ్యాత్మిక దుఃఖములు.

వికైతవో ధర్మ ఇహ ప్రగీతో వేదాంతవిజ్ఞానమయః ప్రధానః ।
అమత్సరాంతర్బుధవేద్యవస్తు సత్క్లుప్తమంత్రౌఘత్రివర్గయుక్తమ్ ॥66॥

ఇది ఉపనిషత్తుల సారాంశాన్ని సూచించి, మోక్షధర్మాలను సూటిగా తెలియ చేసింది. అసూయ, ద్వేషము లేని పండితులు తెలుసుకున్న పరమాత్మతత్త్వాన్ని, ఉత్తమమైన మంత్రాలను మరియు నాలుగు విధములైన పురుషార్థములను ఇందు తెలియ చేయడమైనది.

శైవం పురాణతిలకం ఖలు సత్పురాణం వేదాంతవేదవిలసత్పరవస్తుగీతమ్ ।
యో వై పఠేచ్చ శృణుయాత్పరమాదరేణ శంభుప్రియస్స హి లభేత్పరమాం గతిం వై ॥67॥

పురాణములలో గొప్పదైన ఈ శివపురాణమందు వేదాంతాలైన ఉపనిషత్తులలో గల సారము, వేదములందు తెలియ చేసిన పరమాత్మ గొప్పదనము చక్కగా తెలియ చేశారు. దీనిని ఆదరించి చదివిన వారు ఆ మహాదేవుని కృపను పొంది, దేహమును విడచిన పిదప గొప్పస్థానాన్ని పొందుతారు.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం శివపురాణపరిచయం నామ ద్వితీయోఽధ్యాయః ॥2॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు శివపురాణపరిచయం అను పేరు గల రెండవ అధ్యాయం సమాప్తం.

తృతీయోఽధ్యాయః - మూడవ అధ్యాయం
శ్రవణమననకీర్తనం - శ్రవణమననకీర్తనలు

వ్యాస ఉవాచ - వ్యాసుడు చెప్పాడు.

> **ఇత్యాకర్ణ్య వచస్సౌతం ప్రోచుస్తే పరమర్షయః ।**
> **వేదాంతసారసర్వస్వం పురాణం శ్రావయాద్భుతమ్ ॥1॥**

సూతుని మాటలను విని మహర్షులందరూ "ఉపనిషత్ సారాంశము అంతయు తనలో నిండియున్న ఆ అద్భుతమైన పురాణమును" తమకు వినిపించమని కోరారు.

> **ఇతి శ్రుత్వా మునీనాం స వచనం సుప్రహర్షితః ।**
> **సంస్మరన్ శంకరం సూతః ప్రోవాచ మునిసత్తమాన్ ॥2॥**

అట్లు మహర్షులు పలికిన మాటలను విని, సూతమహర్షి మిక్కిలి సంతోషము పొంది, శంకరుని తలచుకొని, అక్కడున్న మునులతో ఇట్లు చెప్పాడు.

సూత ఉవాచ - సూతుడు చెప్పాడు.

> **శృణ్వంతు ఋషయస్సర్వే స్మృత్వా శివమనామయమ్ ।**
> **పురాణప్రవణం శైవం పురాణం వేదసారజమ్ ॥3॥**

ఇక్కడున్న ఋషులందరూ శుభకరుడైన శంకరుని తలచుకొని వేదసారంగా లభించిన ఈ శివపురాణమును విందురు గాక!

> **యత్ర గీతం త్రికం ప్రీత్యా భక్తిజ్ఞానవిరాగకమ్ ।**
> **వేదాంతవేద్యం సద్వస్తు విశేషేణ ప్రవర్ణితమ్ ॥4॥**

ఈ శివపురాణములో భక్తి, జ్ఞాన, వైరాగ్యవిషయాలు, ఉపనిషత్తులయందు నిజమని తేలిన పరబ్రహ్మతత్త్వము ప్రత్యేకముగా తెలియబడేలా ఉన్నది.

సూత ఉవాచ - సూతుడిట్లు పలికాడు.

> **శృణ్వంతు ఋషయః సర్వే పురాణం వేదసారజమ్ ।**
> **పురా కాలేన మహతా కల్పేఽతీతే పునః పునః ॥**
> **అస్మిన్నుపస్థితే కల్పే ప్రవృత్తే సృష్టికర్మణి ॥5॥**

ఇంతకుముందు చాలాకాలం క్రిందట పూర్వకల్పము పూర్తై, ప్రస్తుతకల్పము ప్రారంభమైనది. ఆ సమయంలో సృష్టికార్యము ప్రారంభమైనది.

మునీనాం షట్కులీనానాం బ్రువతామితరేతరమ్ ।
ఇదం పరమిదం నేతి వివాదస్సుమహానభూత్ ॥6॥

ఆ సమయంలో ఆరు రకాల సముదాయాలకు చెందిన ఋషులు ఒకరితో మరియొకరు “ఇది గొప్పది, ఇది గొప్పది కాదు” అనుకుంటూ వివాదములు చేయనారంభించారు.

తేఽభిజగ్ముర్విధాతారం బ్రహ్మాణం ప్రష్టుమవ్యయమ్ ।
వాగ్భిర్వినయగర్భాభిస్సర్వే ప్రాంజలయోఽబ్రువన్ ॥7॥

తమ సంశయమును నివృత్తిచేసుకొనుటకు ఋషులందరూ బ్రహ్మ వద్దకు వెళ్లి, చేతులు జోడించి, వినయముతో ఇట్లు పలికినారు.

త్వం హి సర్వజగద్ధాతా సర్వకారణకారణమ్ ।
కః పుమాన్ సర్వతత్త్వేభ్యః పురాణః పరతః పరః ॥8॥

ఓ పరబ్రహ్మా! నీవు సకలప్రపంచాన్ని పుట్టించిన వాడవు. అన్ని కారణములకు కారణభూతుడవు. అన్ని తత్త్వముల కంటే పూర్వమునుండి ఉన్న వాడవు. అన్నింటికన్న గొప్పదై కనిపించక ఉండే తత్త్వము కన్నా ఉన్న గొప్పపురుషుడు ఎవ్వరు? అని అడిగారు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇట్లు పలికాడు.

యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ ।
యస్మాత్సర్వమిదం బ్రహ్మావిష్ణురుద్రేంద్రపూర్వకమ్ ॥9॥

ఎవరి గొప్పతనము వివరించుటలో మాటలు సరిపడక వెనుకకు మరలుచున్నాయో, ఎవరిని మనస్సుతో కూడా అన్ని ఇంద్రియాలు చేరుట లేదో, బ్రహ్మ, విష్ణు, రుద్ర ఇంద్రుడుగాగల దేవతలతో –

సహ భూతేంద్రియైస్సర్వైః ప్రథమం సంప్రసూయతే ।
ఏష దేవో మహాదేవః సర్వజ్ఞో జగదీశ్వరః ॥10॥

అలాగే పంచభూతములతో, అన్ని ఇంద్రియములతో కూడిన ఈ సకలప్రపంచము ఎవని నుండి పుట్టుచున్నదో, ఆ దైవమే మహాదేవుడు. ఆతడే అన్నివిషయములు తెలిసిన వాడు. ప్రపంచానికి ఈశ్వరుడై ఉన్నాడు.

అయం తు పరయా భక్త్యా దృశ్యతే నాఽన్యథా క్వచిత్ ।
రుద్రో హరిర్హరశ్చైవ తథాన్యే చ సురేశ్వరాః ॥11॥

గొప్పదైన భక్తిని కల్గి ఆయనను దర్శించుట సులభమే. జరిగే పనే. ఇదితప్ప ఆయనను దర్శించే దారి వేరేది లేదు. రుద్రుడు, విష్ణుమూర్తి మొదలగు దేవతలు ఇలాగే చేశారు.

భక్త్యా పరమయా తస్య నిత్యం దర్శనకాంక్షిణః ।
బహునాత్ర కిముక్తేన శివే భక్త్యా విముచ్యతే ॥12॥

దేవతలందరూ గొప్పదైన భక్తిని కలిగి ప్రతిరోజు ఆయనదర్శనము కోరుకుంటారు. ఇన్నిమాటలెందుకు? శివునియందు భక్తి ఉంటే తప్పక మోక్షము కలుగుతుంది.

ప్రసాదాద్దేవతాభక్తిః ప్రసాదో భక్తిసంభవః ।
యథేహాంకురతో బీజం బీజతో వా యథాంకురః ॥13॥

ఈ ప్రపంచములో అంకురము నుండి విత్తనము, విత్తనము నుండి అంకురము పుట్టినట్లుగా దైవము యొక్క అనుగ్రహము వలన భక్తి, భక్తి నుండి దైవము యొక్క అనుగ్రహము పుడుతున్నాయి.

తస్మాదీశప్రసాదార్థం యూయం గత్వా భువం ద్విజాః ।
దీర్ఘసత్రం సమాకృధ్వం యూయం వర్షసహస్రకమ్ ॥14॥

కాబట్టి ఓ బ్రాహ్మణోత్తములారా! మీరందరూ భూలోకమునకు వెళ్లి శివానుగ్రహము కొరకై వేయి సంవత్సరముల సుదీర్ఘకాలము మహాసత్రయాగమును చేయండి.

అముష్యై వాధ్వరేశస్య శివస్యైవ ప్రసాదతః ।
వేదోక్తవిద్యాసారం తు జ్ఞాయతే సాధ్యసాధనమ్ ॥15॥

సాక్షాత్తు యజ్ఞపురుషుడగు పరమేశ్వరుని యొక్క కృపవలననే ఈ వేదవిద్యలోని సారాంశాలన్నీ సాధ్యా సాధ్యాలుగా తెలిసివస్తాయి.

మునయః ఊచుః – మునులు ఇట్లు పలికారు.

అథ కిం పరమం సాధ్యం కిం వా తత్సాధనం పరమ్ ।
సాధకః కీదృశస్తత్ర తదిదం బ్రూహి తత్త్వతః ॥16॥

అన్నిటికంటె ఉత్తమమై సాధ్యమయ్యేది ఏది? అట్టిదానిని పొందే ఉత్తమమైన సాధనము ఏది? ఆ సాధ్యమును పొందాలనే సాధకుడు ఏ విధముగా ఉంటాడు? మాకు ఈ విషయాలను తెలియచేయుము.

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇట్లు పలికెను.

సాధ్యం శివపదప్రాప్తిః సాధనం తస్య సేవనమ్ ।
సాధకస్తత్ప్రసాదాద్యోఽనిత్యాదిఫలనిస్పృహః ॥17॥

శివసేవయను సాధనమే శివుని పొందుటకు సాధ్యము ఔతుంది. ఆ శివుని యొక్క అనుగ్రహము వలననే నిత్యము కాని ఫలములయందు కోరికలు లేని వ్యక్తి సాధకుడనబడతాడు.

కర్మ కృత్వా తు వేదోక్తం తదర్పితమహాఫలమ్ ।
పరమేశపదప్రాప్తః సాలోక్యాదిక్రమాత్తతః ॥18॥

మనుషులు వేదసమ్మతమైన కర్మలను చేసి, తద్ద్వారా వచ్చిన ఫలములను శివునికే సమర్పించి, శివుని లోకములో, శివునికి దగ్గరగా ఉండి సాలోక్యాదిక్రమంలో పరమేశ్వరస్థానమును పొందుతాడు.

తత్తద్భక్త్యనుసారేణ సర్వేషాం పరమం ఫలమ్ ।
తత్సాధనం బహువిధం సాక్షాదీశేన బోధితమ్ ॥19॥

భక్తిమార్గంలో చాలా రకాల సాధనాలున్నాయి. మానవులందరికీ వారియొక్క భక్తిని బట్టి అటువంటి గొప్పఫలితాలు లభిస్తాయి. ఈ సాధనాలన్నింటిని శివుడే స్వయంగా బోధించాడు.

సంక్షిప్య తత్ర వస్సారం సాధనం ప్రబ్రవీమ్యహమ్ ।
శ్రోత్రేణ శ్రవణం తస్య వచసా కీర్తనం తథా ॥20॥

శివుడు బోధించిన సారవంతమైన సాధనములను నేను మీకు తెలియచెబుతానని బ్రహ్మ చెప్తున్నాడు. ఈ చెవులతో శివుని గొప్పవిషయాలను వినటం, మాటలతో శివుని నామసంకీర్తన చేయటం గొప్పవని తెలుసుకోండి.

మనసా మననం తస్య మహాసాధనముచ్యతే ।
శ్రోతవ్యః కీర్తితవ్యశ్చ మంతవ్యశ్చ మహేశ్వరః ॥21॥

చెవులతో శివుని మహిమలు వినుట, మాటలతో శివుని కీర్తించుటతోబాటు మనస్సులో శివుని ధ్యానించటం అనే ఈ మూడు మహాసాధనగా తెలుసుకొని, శివుని మహిమలు వినాలి. కీర్తించాలి, అలాగే ధ్యానించాలి.

ఇతి శ్రుతిప్రమాణం నః సాధనేనాఽమునా పరమ్ ।
సాధ్యం వ్రజత సర్వార్థసాధనైకపరాయణాః ॥22॥

ఈ విషయములన్నింటికి మనకు వేదమే ప్రమాణమై ఉన్నది. అత్యంతకష్టతరమై ఉన్న దానిని ఈ సాధనములతో పొందండి. అన్ని పురుషార్థములను ఇచ్చే ఈ ఒక్క సాధనను మనసుతో ఆచరించండి.

ప్రత్యక్షం చక్షుషా దృష్ట్వా తత్ర లోకః ప్రవర్తతే ।
అప్రత్యక్షం హి సర్వత్ర జ్ఞాత్వా శ్రోత్రేణ చేష్టతే ॥23॥

మనుషులు ముందుగా కళ్లతో చూసి దానిప్రకారం ప్రవర్తిస్తారు. అయితే కంటికి కనపడని వాటిని చెవులతో విని దాని ప్రకారం పనులు చేస్తుంటారు.

తస్మాచ్ఛ్రవణమేవాదౌ శ్రుత్వా గురుముఖాద్బుధః ।
తతస్సంసాధయేదన్యత్ కీర్తనం మననం సుధీః ॥24॥

ఆ విధముగానే మంచి బుద్ధి గలవాడు ముందుగా గురుముఖము నుండి వచ్చిన మాటలను విని, తరువాత వాటిని భక్తి, శ్రద్ధలతో మననం చేసుకోవాలి.

క్రమాన్మననపర్యంతే సాధనేఽస్మిన్ సుసాధితే ।
శివయోగో భవేత్తేన సాలోక్యాదిక్రమాచ్ఛనైః ॥25॥

ఇట్లు మననము వరకు చేయు సాధనమును బాగుగా నేర్చిన తర్వాత భక్తుడు సాలోక్యము (శివలోకము) సారూప్యము (శివరూపము) వంటి వరుసలలో ఉండి శివునితో కలసి ఉంటాడు.

సర్వాంగవ్యాధయః పశ్చాత్సర్వానందశ్చ లీయతే ।
అభ్యాసాత్ క్లేశమేతద్వై పశ్చాదాద్యంతమంగలమ్ ॥26॥

ఇట్లు సాధనము చేసినవారి దేహమందలి అన్ని అవయవముల రోగములు నశించి, ప్రాపంచిక ఆనందములన్నీ లీనమై పోతాయి. ఈ సాధన మొదట్లో కష్టముగా అనిపించినా, మొదటి నుండి చివర వరకూ శుభములనిచ్చును.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం సాధ్యసాధనఖండే శ్రవణమననకీర్తనం నామ తృతీయోఽధ్యాయః ॥3॥

శ్రీశివమహాపురాణములోని విద్యేశ్వర సంహితయందు సాధ్యసాధన ఖండములోని శ్రవణమననకీర్తనములు అనే మూడవ అధ్యాయం సమాప్తం.

చతుర్థోఽధ్యాయః - నాల్గవ అధ్యాయం
శ్రవణమననకీర్తనమహిమాః - శ్రవణమననకీర్తనముల మహిమ

మునయ ఊచుః - మునిపుంగవులు ఇట్లు పలికారు.

మననం కీదృశం బ్రహ్మన్ శ్రవణం చాపి కీదృశమ్ ।
కీర్తనం వా కథం తస్య కీర్తయైతద్యథాయథమ్ ॥1॥

ఓ బ్రహ్మదేవా! మననము అనగా ఏమిటి? శ్రవణము అనగా ఎట్లుంటుంది? అలాగే శివుని కీర్తించుట ఎట్లు? ఈ సంగతులన్నీ చక్కగా వరుస క్రమముతో మాకు వివరించి చెపుము.

బ్రహ్మోవాచ - బ్రహ్మదేవుడు ఇట్లు చెప్పెను.

పూజాజపేశగుణరూపవిలాసనామ్నాం యుక్తిప్రియేణ మనసా పరిశోధనం యత్ ।
తత్సంతతం మననమీశ్వరదృష్టిలభ్యం సర్వేషు సాధనవరేష్వపి ముఖ్యముఖ్యమ్ ॥2॥

శివుని యొక్క పూజ, శివుని మంత్రాన్ని జపించటము, శివుని గుణములను, శివరూపాన్ని, లీలలను, శివనామాన్ని, శివయుక్తి (తెలివి) వంటి విషయాలందు ఇష్టము గల మనస్సుతో అన్ని వేళలలో శివుని గురించి ఆలోచించుట వంటి అన్నింటిని మననము అంటారు. సాధనలన్నింటిలో అతిగొప్ప సాధనము ఈ మననమే. ఇది కూడా శివుని అనుగ్రహమువలననే కల్గును.

గీతాత్మనా శ్రుతిపదేన చ భాషయా వా శంభుప్రతాపగుణరూపవిలాసనామ్నామ్ ।
వాచా స్ఫుటం తు రసవత్ స్తవనం యదస్య తత్కీర్తనం భవతి సాధనమత్ర మధ్యమ్ ॥3॥

పరమశివుని యొక్క ప్రతాపము, గుణము, రూపము, లీలాతత్త్వము మరియు నామాన్ని గానరూపముగా గాని, వేదపఠనం వలన గాని లేదా లోకహితమైన భాషయందు స్పష్టంగా, రసభరితంగా కీర్తించుట మరియొక రెండవ సాధనము.

యేనాపి కేన కరణేన చ శబ్దపుంజం యత్ర క్వచిచ్ఛివపరం శ్రవణేంద్రియేణ ।
స్త్రీకేలివత్ దృఢతరం ప్రణిధీయతే యత్ తద్వై బుధాః శ్రవణమత్ర జగత్ప్రసిద్ధమ్ ॥4॥

ఏ కారణమైనా, ఏ ప్రదేశమైనా శివుని కీర్తించే శబ్దములను చెవులతో శ్రద్ధగా వినాలి. ఎలా వినాలంటే ప్రియుడు తన ప్రియురాలు పలికే మాటలను ఎంత శ్రద్ధగా వింటాడో ఆ విధముగా వినాలి. ఇలా శ్రద్ధగా వినటాన్నే శ్రవణమని పండితులు తెలియ చేశారు.

సత్సంగమేన భవతి శ్రవణం పురస్తాత్ సంకీర్తనం పశుపతేరథ తత్ దృఢం స్యాత్ ।
సర్వోత్తమం భవతి తన్మననం తదంతే సర్వం హి సంభవతి శంకరదృష్టిపాతే ॥5॥

మొదట సత్పురుషుల కలయికవలన శ్రవణము (వినుట) అనే అదృష్టము కలుగుతుంది. ఆ తర్వాత ఆ శివుని కీర్తనము బలపడును. దాని తర్వాత అన్నివిధాల గొప్పదైన శివుని మననము లభించును. ఇవన్నియు లభించాలంటే శంకరుని దృష్టి మనమీద ఉండితీరాలి.

సూత ఉవాచ – సూతముని ఈ విధముగా పలికెను.

అస్మిన్ సాధనమాహాత్మ్యే పురావృత్తం మునీశ్వరాః ।
యుష్మదర్థం ప్రవక్ష్యామి శృణుధ్వమవధానతః ॥6॥

ఓ ఉత్తమమునులారా! సాధనము యొక్క గొప్పతనము తెలియ చేసే ఒక వెనుకటి కాలంనాటి కథను మీకు చెప్తాను. శ్రద్ధగా వినండి.

పురా మమ గురుర్వ్యాసః పరాశరమునేస్సుతః ।
తపశ్చచార సంభ్రాంతః సరస్వత్యాస్తటే శుభే ॥7॥

పూర్వము నాకు గురువు, పరాశరముని యొక్క కుమారుడైన వ్యాసమహర్షి దీక్ష పూని పవిత్రసరస్వతీ నదీతీరములో తపస్సు ప్రారంభించాడు.

గచ్ఛన్ యదృచ్ఛయా తత్ర విమానేనార్కరోచిషా ।
సనత్కుమారో భగవాన్ దదర్శ మమ దేశికమ్ ॥8॥

ఆ సమయంలో భగవాన్ సనత్కుమారుడు సూర్యప్రకాశంతో విరాజిల్లే విమానంలో అనుకోకుండా నా గురువైన వ్యాసమహర్షిని చూశాడు.

ధ్యానారూఢః ప్రబుద్ధోఽసౌ దదర్శ తమజాత్మజమ్ ।
ప్రణిపత్యాహ సంభ్రాంతః పరం కౌతూహలం మునిః ॥9॥

తపస్సులో ఉన్న వ్యాసుడు తర్వాత ధ్యానమును విడిచి ఎదురుగా ఉన్న బ్రహ్మపుత్రుడైన సనత్కుమారుని చూశాడు. కుతూహలంతో ఆయనకు నమస్కారం చేశాడు.

దత్త్వార్ఘ్యమస్మై ప్రదదౌ దేవయోగ్యం చ విష్టరమ్ ।
ప్రసన్నః ప్రాహ తం ప్రహ్వం ప్రభుర్గంభీరయా గిరా ॥10॥

వ్యాసమహర్షి సనత్కుమారునికి నీటిని ఇచ్చి సేవలు చేసి, దేవతలకు ఇచ్చే గొప్ప ఆసనమును ఇచ్చి కూర్చుండబెట్టాడు. దానికి సనత్కుమారుడు ఆనందించి పునీతుడగు వ్యాసునితో గంభీరంగా ఇట్లు పలికాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు ఈ విధముగా పలికాడు.

సత్యం వస్తు మునే దధ్యాః సాక్షాత్కరణగోచరః ।
స శివోథాసహాయోత్ర తపశ్చరసి కిం కృతే ॥11॥

ఓ వ్యాసమునీంద్రా! లోకములో ఉన్న సత్యవస్తువును ధ్యానించు. అతిసులభంగా కరుణించే శివుడే ఆ సత్యవస్తువు. నీవు ఈ ప్రదేశములో ఎందుకు, దేని కోసం నిస్సహాయంగా తపస్సు చేస్తున్నావు?

ఏవముక్తః కుమారేణ ప్రోవాచ స్వాశయం మునిః ।
ధర్మార్థకామమోక్షాశ్చ వేదమార్గే కృతాదరాః ॥12॥

అట్లు సనత్కుమారుని మాటలు వినిన వ్యాసుడు తన మనస్సులోని ఆలోచనలను ఇట్లు చెప్పాడు. ధర్మార్థకామమోక్షములనే నాలుగు రకాల పురుషార్థములకు వైదికజీవనములో ఒక ప్రత్యేకమైన స్థానము కలదు.

బహుధా స్థాపితా లోకే మయా త్వత్కృపయా తథా ।
ఏవంభూతస్య మేఽప్యేవం గురుభూతస్య సర్వతః ॥13॥

ఈ విషయాలన్నింటినీ నేను మీయొక్క కృపతో ఈ లోకములో చక్కగా ఏర్పాటు చేశాను. అందువలన నేను అన్నిచోట్ల గురువుగా గౌరవించబడుతున్నాను.

ముక్తిసాధనకం జ్ఞానం నోదేతి పరమాద్భుతమ్ ।
తపశ్చరామి ముక్త్యర్థం న జానే తత్ర కారణమ్ ॥14॥

అయినప్పటికి నాకు ముక్తికి సాధనమగు జ్ఞానము లభించ లేదు. ఈ విషయము నాకు చాలా ఆశ్చర్యము కల్గించినది. కారణము తెలియుట లేదు. అందువలన నేను ముక్తికొరకు తపస్సును చేస్తున్నాను.

ఇత్థం కుమారో భగవాన్ వ్యాసేన మునినార్థితః ।
సమర్థః ప్రాహ విప్రేంద్రా నిశ్చయం ముక్తికారణమ్ ॥15॥

ఓ బ్రాహ్మణోత్తములారా! అంత సమర్థుడగు భగవాన్ సనత్కుమారుడు వ్యాసమునీంద్రునిచే కీర్తింపబడినవాడై, ముక్తిసాధనము ఎట్లు నెరవేరునో తెలియ చెప్పాడు.

శ్రవణం కీర్తనం శంభోర్మననం చ మహత్తరమ్ ।
త్రయం సాధనముక్తం చ విద్యతే వేదసమ్మతమ్ ॥16॥

శివుని యొక్క నామమును వినటము, కీర్తనము చేయటమూ, మరియు మననము అనగా సదా తలచుకొనటమూ అను ఈ మూడు చాలా గొప్పవైన వేదసమ్మతసాధనములుగా తెలియ చెప్పాడు.

పురాహమథ సంభ్రాంతో హ్యన్యసాధనసంభ్రమః ।
అచలే మందరే శైలే తపశ్చరణమాచరమ్ ॥17॥

నేను ఈ విషయము తెలియక గతకాలంలో ఇతర సాధన మాయ (భ్రాంతి) కలిగి మందరపర్వతప్రాంతంలో తపస్సు చేశానని సనత్కుమారుడు చెప్పాడు.

శివాజ్ఞయా తతః ప్రాప్తో భగవాన్నందికేశ్వరః ।
స మే దయాలుర్భగవాన్ సర్వసాక్షీ గణేశ్వరః ॥18॥

ఆ సమయంలో శివుని ఆజ్ఞ ప్రకారం దయాహృదయుడు గణాధిపతి అయిన వినాయకుడు, సర్వసాక్షిరూపమైన భగవాన్ నందీశ్వరుడు నా వద్దకు వచ్చాడు.

ఉవాచ మహ్యం సస్నేహం ముక్తిసాధనముత్తమమ్ ।
శ్రవణం కీర్తనం శంభోర్మననం వేదసమ్మతమ్ ॥19॥

కావున శివుని నామాన్ని వినుట, కీర్తించుట, మననం చేసుకొనుట అనే ఈ కలసినదే ఉత్తమముక్తి సాధనమగునని శివుడు నాకు చెప్పాడు.

త్రికం చ సాధనం ముక్తౌ శివేన మమ భాషితమ్ ।
శ్రవణాదిం త్రికం బ్రహ్మన్ కురుష్వేతి ముహుర్ముహుః ॥20॥

కావున ఓ సనత్కుమారా! ఈ మూడింటిని నీవు ఆచరించు అని నందీశ్వరుడు చాలాసార్లు చెప్పినాడు. ఇదే విషయాన్ని శివుడు తనకు చెప్పినట్లుగా కూడా చెప్పాడు.

ఏవముక్త్వా తతో వ్యాసం సానుగో విధినందనః ।
జగామ స్వవిమానేన పదం పరమశోభనమ్ ॥21॥

ఈ విధముగా బ్రహ్మకుమారుడైన సనత్కుమారుడు వ్యాసునితో పలికి, తర్వాత తన అనుచరులతో కలసి విమానములో సుందరమైన బ్రహ్మలోకమునకు వెళ్ళాడు.

ఏవముక్తం సమాసేన పూర్వవృత్తాంతముత్తమమ్ ।

ఉత్తమమైన ఈ పూర్వకాలకథనంతయు నీకు సంగ్రహముగా తెలియ చేశాను.

ఋషయ ఊచుః – ఋషులు ఇట్లు పలికికారు.

శ్రవణాది త్రయం సూత ముక్త్యోపాయస్త్వయేరితః ॥22॥

ఓ సూతమునీంద్రా! శ్రవణ, కీర్తన, మననములనే మూడువిధాలు ముక్తికి మార్గమను ఉపాయమును నీవు చెప్పావు.

శ్రవణాదిత్రికేఽశక్తః కిం కృత్వా ముచ్యతే జనః ।
అయత్నేనైవ ముక్తిస్స్యాత్ కర్మణా కేన హేతునా ॥ 23॥

ఓ సూతా! ముక్తిసాధనకు మూలమైన మూడుమార్గాలను (శ్రవణ, కీర్తన, మననములు) ఆచరించుటకు శక్తిలేని మానవులకు ఏ విధముగా ముక్తి లభించునో చెప్పుము. అలాగే ఏ కర్మలను ఆచరించుట వలన ముక్తిని పొందురో కూడా తెలుపుము అని ఋషులు అడిగారు.

ఇతి శ్రీశివమహాపురాణే ప్రథమాయాం విద్యేశ్వరసంహితాయాం సాధ్యసాధనఖండే శ్రవణమననకీర్తన మహిమా నామ చతుర్థోఽధ్యాయః ॥4॥

శ్రీశివమహాపురాణంలోని మొదటిదగు విద్యేశ్వరసంహితయందుగల సాధ్యసాధనఖండములోని శ్రవణ మననకీర్తనముల మహిమ అనే నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచమోఽధ్యాయః - అయిదవ అధ్యాయం

శివలింగమహిమావర్ణనమ్ - శివలింగమహిమావర్ణనము

సూత ఉవాచ - సూతుడు ఇట్లు పలికాడు.

శ్రవణాదిత్రికేఽశక్తో లింగబేరం చ శాంకరమ్ ।
సంస్థాప్య నిత్యమభ్యర్చ్య తరేత్సంసారసాగరమ్ ॥1॥

శివనామము వినుట, కీర్తనము చేయుట, మననము చేయుటయందు శక్తి లేనివాడు శంకరుని లింగము నందు, మూర్తి (ఆకారము - రూపము) యందు ఆవాహన చేసి, ప్రతిరోజు అర్చించినచో సంసారమను సముద్రము నుండి దాటివేయగలడు.

అపి ద్రవ్యం వహేదేవ యథాబలమవంచయన్ ।
అర్పయేల్లింగబేరార్థమర్చయేదపి సంతతమ్ ॥2॥

శక్తి ఉన్నంత మేరకు, మోసము చేయకుండా ధనమును సంపాదించి, ఆ ధనమును నిత్యశివార్చనకు, మూర్తి అర్చనకు ఖర్చుచేయవలెను.

మండపం గోపురం తీర్థం మఠం క్షేత్రం తథోత్సవమ్ ।
వస్త్రం గంధం చ మాల్యం చ ధూపం దీపం చ భక్తితః ॥3॥

మండపమును, గోపురమును, తీర్థమును, మఠమును, శివక్షేత్రమును నిర్మించి, ఉత్సవములను చేయాలి. వస్త్రమును, గంధమును, పూలదండలను, ధూపదీపములను భక్తితో అర్చించాలి.

వివిధాన్నం చ నైవేద్యం అపూపవ్యంజనైర్యుతమ్ ।
ఛత్రం ధ్వజం చ వ్యజనం చామరం చాపి సాంగకమ్ ॥4॥

వివిధ రకములగు అన్నములను, అపూపములు, పచ్చళ్లను నైవేద్యము వంటి సేవలను ప్రతిదినము చేయాలి.

రాజోపచారవత్సర్వం ధారయేల్లింగబేరయోః ।
ప్రదక్షిణాం నమస్కారం యథాశక్తి జపం తథా ॥5॥

రాజ్యాన్ని పాలించే రాజుకు చేసే అన్నిసేవలు, మర్యాదలు చేయాలి. ప్రదక్షిణము, నమస్కారము అలాగే శక్తి మేరకు జపమును చేయాలి.

ఆవాహనాదాదిసర్గాంతం నిత్యం కుర్యాత్సుభక్తితః ।
ఇత్థమభ్యర్చయన్ దేవం లింగే బేరే చ శాంకరే ॥6॥

ఈ విధముగా ప్రతిరోజు ఆవాహనము మొదలుకొని విసర్జనమువరకు భక్తిశ్రద్ధలతో చేయాలి. ఇట్లు శివుని లింగరూపమును, మూర్తిని అర్చించాలి.

సిద్ధిమేతి శివప్రీత్యా హిత్వాపి శ్రవణాదికమ్ ।
లింగబేరార్చనామాత్రాన్ముక్తాః పూర్వే మహాజనాః ॥7॥

శివుని యొక్క అనుగ్రహమును పొందిన వ్యక్తి, శ్రవణాదులను విడిచిపెట్టినప్పటికీ తప్పక సిద్ధిని పొందుతాడు. ఇంతకు పూర్వము మహాత్ములు లింగమును, మూర్తిని అర్చించుట వలన మాత్రమే ముక్తిని పొందారు.

మునయః ఊచుః – మునులు పలికారు.

బేరమాత్రే తు సర్వత్ర పూజ్యంతే దేవతాగణాః ।
లింగే బేరే చ సర్వత్ర కథం సంపూజ్యతే శివః ॥8॥

లోకములో దేవతలందరిని మూర్తిరూపములో పూజిస్తుండగా, శివుని మాత్రము లింగరూపము లోనూ, మూర్తిరూపములోనూ కూడా పూజించడానికి గల కారణమేమిటి?

సూత ఉవాచ – సూతుడు ఇట్లు పలికాడు.

అహో మునీశ్వరాః పుణ్యం ప్రశ్నమేతన్మహాద్భుతమ్ ।
అత్ర వక్తా మహాదేవో నాన్యోఽస్తి పురుషః క్వచిత్ ॥9॥

ఓ మునిపుంగవులారా! మీరు ప్రశ్నించిన విధానము పవిత్రమైనది. మరియు విస్మయమును కలిగించునదిగా ఉన్నది. ఈ ప్రశ్నకు సమాధానము చెప్పగల పురుషుడు ఒక్క మహాదేవుడు మాత్రమే. అటువంటి వాడు మరెక్కడనూ లేడు.

శివేనోక్తం ప్రవక్ష్యామి క్రమాద్గురుముఖాచ్ఛ్రుతమ్ ।
శివైకో బ్రహ్మరూపత్వాన్నిష్కలః పరికీర్తితః ॥10॥

నాకు శివుని చేత చెప్పబడిన, గురువు నుండి నాచే తెలియబడిన సమాధానమును ఒక క్రమపద్ధతిలో చెప్తాను. శివుడు ఒక్కడే పరబ్రహ్మస్వరూపుడు. కావున ఆయనను నిరాకారుడని అన్నారు.

రూపిత్వాత్సకలస్తద్వత్ తస్మాత్సకలనిష్కలః ।
నిష్కలత్వాన్నిరాకారం లింగం తస్య సమాగతమ్ ॥11॥

శివునకు రూపము కూడా కలదు. అందువలన ఆయన నిరాకారుడు మరియు సాకారుడు కూడా. ఈశ్వరుడు నిరాకారుడు కనుక, ఆయన నిరాకారమైన లింగమునందు పూజింపబడుచున్నాడు.

సకలత్వాత్తథా బేరం సాకారం తస్య సంగతమ్ ।
సకలాకలరూపత్వాద్బ్రహ్మశబ్దాభిధః పరః ॥12॥

అట్లే ఆయన సాకారుడు గనుక మూర్తియందు ఆరాధింపబడుతున్నాడు. ఈ విధముగా ఆయన సాకారనిరాకారరూపుడగుట చేత పరబ్రహ్మ అనే శబ్దనామంగా ఉన్నాడు.

అపి లింగే చ బేరే చ నిత్యమభ్యర్చ్యతే జనైః ।
అబ్రహ్మత్వాత్తదన్యేషాం నిష్కలత్వం న హి క్వచిత్ ॥13॥

శివుని మానవులు లింగరూపమునందు, మూర్తిరూపమునందు ఆరాధిస్తున్నారు. ఇతర దేవతలందరూ పరబ్రహ్మస్వరూపులు కాదు. కనుక, వారికి నిరాకారతత్వమను గుణము లేదు.

తస్మాత్తే నిష్కలే లింగే నారాధ్యంతే సురేశ్వరాః ।
అబ్రహ్మత్వాచ్చ జీవత్వాత్తథాన్యే దేవతాగణాః ॥14॥

కావున ఇతర దేవతలందరూ బ్రహ్మరూపము లేని వారు. వారు అందరూ జీవులు. కాబట్టి నిరాకారమగు లింగరూపముగా పూజించరు.

తూష్ణీం సకలమాత్రత్వాదర్చ్యంతే బేరమాత్రకే ।
జీవత్వం శంకరాన్యేషాం బ్రహ్మత్వం శంకరస్య చ ॥15॥

దేవతలందరూ సాకారులు కనుక వారు మూర్తిరూపమున పూజింపబడుతున్నారు. శంకరుడు మాత్రము పరబ్రహ్మ. శంకరునికంటే భిన్నముగా ఉన్న దేవతలందరు జీవులు.

వేదాంతసారసంసిద్ధం ప్రణవార్థే ప్రకాశనాత్ ।
ఏవమేవ పురా పృష్టో మందరే నందికేశ్వరః ॥16॥

సనత్కుమారమునినా బ్రహ్మపుత్రేణ ధీమతా ।

శంకరుని బ్రహ్మత్వము ఉపనిషత్తుల సారాంశముగా ఓంకారము యొక్క అర్థముగా నిరూపణ జరిగినది. బ్రహ్మకుమారుడు, బుద్ధిమంతుడగు సనత్కుమారుడు మందరగిరిపర్వతమునందు నందికేశ్వరుని ఈ విధముగా ప్రశ్నించాడు.

సనత్కుమార ఉవాచ - సనత్కుమారుడు ఇట్లు పలికాడు.

శివాన్యదేవవశ్యానాం సర్వేషామపి సర్వతః ॥17॥

బేరమాత్రం చ పూజార్థం శ్రుదృష్టం చ భూరిశః ।
శివమాత్రస్య పూజాయాం లింగం బేరం చ దృశ్యతే ॥18॥

శివునికంటే భిన్నముగా ఉన్నదేవతలను ఎప్పుడూ మూర్తిరూపమందు చేయు ఆరాధనము గురించి మాత్రమే వింటున్నాము. చూస్తున్నాము. కేవలము శివార్చనయందే లింగరూపము, మూర్తిరూపము కనపడుతుంది.

అతస్తద్బ్రూహి కల్యాణతత్త్వం మే సాధు బోధనమ్ ।

కావున, ఓ మంగళరూపా! నాకు చక్కగా అర్థమయ్యే విధంగా ఈ తత్త్వమును తెలియచేయుము.

నందికేశ్వర ఉవాచ - నందికేశ్వరుడు ఇట్లు పలికాడు.

అనుత్తరమిమం ప్రశ్నం రహస్యం బ్రహ్మలక్షణమ్ ॥19॥

ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వటం చాల కష్టము. ఇది అతిరహస్యమగు బ్రహ్మవిద్య.

కథయామి శివేనోక్తం భక్తియుక్తస్య తేఽనఘ ।
శివస్య బ్రహ్మరూపత్వాన్నిష్కలత్వాచ్చ నిష్కలమ్ ॥20॥

పాపములెరుగని ఓ సనత్కుమారా! భక్తుడవగు నీకు శివుడు చెప్పిన రహస్యమును నీకు చెప్తాను. శివుడు సాక్షాత్తు పరబ్రహ్మస్వరూపుడు, నిరాకారుడు కూడా.

లింగం తస్యైవ పూజాయాం సర్వవేదేషు సమ్మతమ్ ।
తస్యైవ సకలత్వాచ్చ తథా సకలనిష్కలమ్ ॥21॥

కాబట్టి శివునికి మాత్రమే లింగరూపమున అర్చన జరుగు విధానము వేదములన్నిటియందు నిర్ణయింపబడి ఉన్నది.

సకలం చ తథా బేరం పూజాయాం లోకసమ్మతమ్ ।
శివాన్యేషాం చ జీవత్వాత్ సకలత్వాచ్చ సర్వతః ॥22॥

కాబట్టి ఈ లోకములో శివుడు మూర్తిరూపములో కూడా పూజలు అందుకొంటాడు. శివునికంటే భిన్నముగా ఉన్న దేవతలందరూ జీవులు. సాకారులుగా తెలిసికొనుము.

బేరమాత్రం చ పూజాయాం సమ్మతం వేదనిర్ణయే ।
స్వావిర్భావే చ దేవానాం సకలం రూపమేవ హి ॥23॥

అందువలన వారికి మూర్తిరూపము నందు మాత్రమే అర్చన చేయు విధానము వేదము నందు నిర్ణయమైనది. దేవతలు సాకారముగానే ఆవిర్భవిస్తారు.

శివస్య లింగం బేరం చ దర్శనే దృశ్యతే ఖలు ।

కాని శివుడు అటు లింగరూపములోనూ, ఇటు మూర్తిరూపములోనూ దర్శనమిస్తాడు.

సనత్కుమార ఉవాచ – సనత్కుమారుడు ఇట్లు పలికాడు.

ఉక్తం త్వయా మహాభాగ లింగబేరప్రచారణమ్ ॥24॥

శివస్య చ తదన్యేషాం విభజ్య పరమార్థతః ।
తస్మాత్తదేవ పరమం లింగబేరాది సంభవమ్ ॥25॥

శ్రోతుమిచ్ఛామి యోగీంద్ర లింగావిర్భావ లక్షణం ।

ఓ మహానుభావా! శివునకు రెండురూపముల యందు అర్చన, ఇతరదేవతలందరికి మూర్తియందు మాత్రమే అర్చన ప్రచారములో ఉండుటకు గల కారణములను విడమరచి నీవు పరమార్థదృష్టితో వివరించావు. కావున ఓ యోగిపుంగవా! లింగమెట్లు ఆవిర్భవించినదో తెలుపుము. నేను నీనుండి వినవలెనని కోరుకొనుచున్నాను.

నందికేశ్వర ఉవాచ - నందికేశ్వరుడు ఇట్లు పలికాడు.

శృణు వత్స భవత్ప్రీత్యా వక్ష్యామి పరమార్థతః ॥26॥

ఓ వత్సా! నీ ఆనందముకొరకు పరమార్థమును వివరిస్తాను. వినుము.

పురా కల్పే మహాకాలే ప్రపన్నే లోకవిశ్రుతే ।
అయుధ్యేతాం మహాత్మానౌ బ్రహ్మవిష్ణూ పరస్పరమ్ ॥27॥

పూర్వకల్పమునందు ప్రళయకాలము వచ్చిన సమయంలో బ్రహ్మ, విష్ణువులు ఇరువురు ఒకరితో ఒకరు పోట్లాటకు దిగారు.

తయోర్మానం నిరాకర్తుం తన్మధ్యే పరమేశ్వరః ।
నిష్కలస్తంభరూపేణ స్వరూపం సమదర్శయత్ ॥28॥

వారిద్దరి అహంకారమును తొలగించుటకై పరమేశ్వరుడు వారి మధ్యలో నిరాకారమగు స్తంభరూపముగా తన రూపమును ప్రదర్శించాడు.

తతః స్వలింగచిహ్నత్వాత్ స్తంభతో నిష్కలం శివః ।
స్వలింగం దర్శయామాస జగతాం హితకామ్యయా ॥29॥

అంతట శివుడు లోకముల క్షేమము కోరి, ఆ స్తంభము నుండి నిరాకారమగు లింగరూపముగా అవతరించాడు.

తదా ప్రభృతి లోకేషు నిష్కలం లింగమైశ్వరమ్ ।
సకలం చ తథా బేరం శివస్యైవ ప్రకల్పితమ్ ॥30॥

ఆ సమయము నుండి లోకములో శివునికి మాత్రమే నిరాకారమగు లింగమునందు, సాకారమగు మూర్తిరూపమునందు పూజలు చేయబడుతున్నాయి.

శివాన్యేషాం తు దేవానాం బేరమాత్రం ప్రకల్పితమ్ ।
తత్తద్బేరం తు దేవానాం తత్తద్భోగప్రదం శుభమ్ ॥
శివస్య లింగబేరత్వభోగమోక్షప్రదం శుభమ్ ॥31॥

శివునికంటే భిన్నంగా ఉన్న ఇతరదేవతలకు మూర్తి అర్చన ఒక్కటే విధానమై ఉన్నది. దేవతలైనవారిని పూజించినచో ఆయా భోగములు, శుభఫలములు కలుగుతాయి. శివుని లింగమును, మూర్తిని పూజించినచో భోగములు, శుభఫలములతో బాటు మోక్షము కూడా లభిస్తుంది.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం శివలింగమహిమావర్ణనమ్ పంచమోఽధ్యాయః ॥5॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు శివలింగమహిమావర్ణన అను పేరు గల అయిదవ అధ్యాయం సమాప్తం.

షష్ఠో౽ధ్యాయః - ఆరవ అధ్యాయం

బ్రహ్మ విష్ణు సంగ్రామః - బ్రహ్మ విష్ణు సంగ్రామం

నందికేశ్వర ఉవాచ - నందికేశ్వరుడు ఇట్లు పలికాడు.

పురా కదాచిద్యోగీంద్ర విష్ణుర్విషధరాసనః ।
సుష్వాప పరయా భూత్యా స్వానుగైరపి సంవృతః ॥1॥

ఓ సనత్కుమారయోగిశ్రేష్ఠా! పూర్వము ఒకనాడు శ్రీమహావిష్ణువు వైభవముగా శేషశయనముపై నిద్రించాడు. అనుచరులందరూ ఆయన చుట్టూ గుమిగూడి ఉన్నారు.

యదృచ్ఛయా గతస్తత్ర బ్రహ్మా బ్రహ్మవిదాం వరః ।
అపృచ్ఛత్పుండరీకాక్షం శయనం సర్వసుందరమ్ ॥2॥

వేదవేత్తలలో శ్రేష్ఠుడగు బ్రహ్మ అచటకు అనుకోకుండా వెళ్లి, పద్మముల వంటి కళ్లు, సర్వాంగసుందర రూపుడైన శ్రీమహావిష్ణువును పడుకొని ఉండుట చూసి, బ్రహ్మ ఇట్లు ప్రశ్నించాడు.

కస్త్వం పురుషవచ్ఛేషే దృష్ట్వా మామపి దృప్తవత్ ।
ఉత్తిష్ఠ వత్స మాం పశ్య తవ నాథమిహాగతమ్ ॥3॥

నీ వెవరవు? నన్ను చూసి కూడా గర్వముతో శేషునిపై నిద్రిస్తున్నావు. ఓ వత్సా! లెమ్ము! నేను ప్రభువును వచ్చాను. నన్ను చూడు.

ఆగతం గురుమారాధ్యం దృష్ట్వా యో దృప్తవచ్చరేత్ ।
ద్రోహిణస్తస్య మూఢస్య ప్రాయశ్చిత్తం విధీయతే ॥4॥

పూజ్యనీయుడైన గురువు వచ్చినపుడు చూసి కూడా ఎవరైతే గర్వముతో ప్రవర్తిస్తారో అటువంటి ద్రోహబుద్ధి గల మూర్ఖులకు ప్రాయశ్చిత్తము చేయక తప్పదు.

ఇతి శ్రుత్వా వచః క్రుద్ధో బహిశ్శాంతవదాచరత్ ।
స్వస్తి తే స్వాగతం వత్స తిష్ఠ పీఠమితో విశ ॥5॥

ఈ మాటలను విన్న విష్ణువు కోపమును తెచ్చుకొని పైకి మాత్రము శాంతమును కనబరచి ఇట్లు పలికాడు. ఓ వత్సా! నీకు స్వాగతము. ఇదిగో ఆసనము. కూర్చునుము.

కిము తే వ్యగ్రవద్వక్త్రం విభాతి విషమేక్షణమ్ ।

నీ ముఖము విచారముతో ఉన్నది. ఏమి కారణము? అలాగే నీ చూపులు తేడాగా వున్నాయి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఈ విధముగా పలికాడు.

వత్స విష్ణో మహామానమాగతం కాలవేగతః ॥6॥

వత్సా! విష్ణూ! ఎంతో అభిమానము గల నేను కాలముతో సమానమైన వేగముతో నీ వద్దకు వచ్చాను.

పితామహశ్చ జగతః పాతా చ తవ వత్సక ।

నేను నీకు తండ్రివంటి వాడను. వత్సా! ప్రపంచాన్ని, నిన్ను కూడా రక్షించువాడను.

విష్ణురువాచ – విష్ణువు ఇట్లు పలికాడు.

మత్స్థం జగదిదం వత్స మనుషే త్వం హి చోరవత్ ।
మన్నాభికమలాజ్జాతః పుత్రస్త్వం భాషసే వృథా ॥7॥

వత్సా! ఈ ప్రపంచమంతయు నాయందున్నది. నీవు చోరుని వలె (దొంగ) ప్రవర్తిస్తున్నావు. నీవు నా నాభిలోని పద్మము నుండి పుట్టినావు. నాకు పుత్రుడవు. నీవు అనవసరముగా మాట్లాడుతున్నావు.

నందికేశ్వర ఉవాచ – నందికేశ్వరుడు ఇట్లు పలికాడు.

ఏవం హి వదతోస్తత్ర ముగ్ధయోరజయోస్తదా ॥8॥

అజులగు వారిరువురు అపుడు ఈ విధముగా మోహమును పొంది ఇట్లు మాట్లాడటం మొదలు పెట్టారు.

అహమేవ వరో న త్వమహం ప్రభురహం ప్రభుః ।
పరస్పరం హంతుకామౌ చక్రతుస్సమరోద్యమమ్ ॥9॥

నేను గొప్పవాడను. నీవు కాదు. నేనే ప్రభువును. కాదు నేను ప్రభువును అని ఇద్దరూ ఒకరినొకరు హింసించుకొన ప్రయత్నించి యుద్ధమునకు తయారయ్యారు.

యుయుధాతేఽమరౌ వీరౌ హంసపక్షీంద్రవాహనౌ ।
వైరంచ్యా వైష్ణవాశ్చైవం మిథో యుయుధిరే తదా ॥10॥

హంస, గరుడపక్షి వాహనములు గల ఆ దేవతలు ఇద్దరూ యుద్ధము చేస్తుండగా, వారి యొక్క సేవకులు, సహచరులు కూడా ఒకరితో ఒకరు యుద్ధమునకు తలపడ్డారు.

తావద్విమానగతయః సర్వా వై దేవజాతయః ।
దిదృక్షవః సమాజగ్ముః సమరం తం మహాద్భుతమ్ ॥11॥

ఆ సమయంలో దేవజాతుల వారందరూ విమానముల ద్వారా వచ్చి ఆ మహాయుద్ధమును చూచుటకు ఉత్సాహము చూపారు.

క్షిపంతః పుష్పవర్షాణి వశ్యంతః స్వైరమంబరే ।
సుపర్ణవాహనస్తత్ర క్రుద్ధో వై బ్రహ్మవక్షసి ॥12॥

ముమోచ బాణానసహానస్త్రాంశ్చ వివిధాన్ బహూన్ ।
ముమోచాఽథ విధిః కృద్ధో విష్ణోరురసి దుస్సహాన్ ॥13॥

బాణాననలసంకాశాన్ అస్త్రాంశ్చ బహుశస్తదా ।
తదాశ్చర్యమితిస్పష్టం తయోస్సమరగోచరమ్ ॥14॥

అట్లు ఆకాశము నుండి వారు చూస్తూ పుష్పవర్షమును కురిపించారు. అంత గరుడవాహనుడు కోపముతో బ్రహ్మ వక్షస్థలముపై భరింపశక్యము కాని బాణములను, వివిధములగు ఇతర అస్త్రములను ప్రయోగించాడు. అపుడు బ్రహ్మయు కోపముతో విష్ణువు యొక్క వక్షస్థలమునందు నిప్పుల వలె భరింపశక్యము కాని బాణములను, వివిధ అస్త్రములను ప్రయోగించాడు. అట్లు జరిగే ఆ ఉభయుల యుద్ధము ఆశ్చర్యము కలిగించింది.

సమీక్ష్య దైవతగణాశ్శశంసుర్భృశమాకులాః ।
తతో విష్ణుస్సుసంక్రుద్ధః శ్వసన్ వ్యసనకర్శితః ॥15॥

దేవతాబృందము అందరూ ఆ యుద్ధమును చూసి చాలా కంగారు పడినారు. అంతట విష్ణువు మిక్కిలి కోపమును పొంది, గాయములచే బాధింపబడిన వాడై, దీర్ఘనిశ్వాసములను విడుస్తూ ఉండినాడు.

మహేశ్వరాస్త్రం మతిమాన్ సందధే బ్రహ్మణోపరి ।
తతో బ్రహ్మ భృశం క్రుద్ధః కంపయన్ విశ్వమేవ హి ॥16॥

మహేశ్వరాస్త్రమును స్మరించి, విష్ణువు బ్రహ్మపై ప్రయోగించాడు. అంతట బ్రహ్మ మరింత రెట్టించిన కోపముతో జగత్తును వణికించేలా –

అస్త్రం పాశుపతం ఘోరం సంధదే విష్ణువక్షసి ।

విష్ణువు యొక్క ఛాతి భాగమున భయంకరమగు పాశుపతాస్త్రాన్ని ప్రయోగించాడు.

తతస్తదుత్థితం వ్యోమ్ని తపనాయుతసన్నిభమ్ ॥17॥

సహస్రముఖమత్యుగ్రం చండవాతభయంకరమ్ ।
అస్త్రద్వయమిదం తత్ర బ్రహ్మవిష్ణ్వోర్భయంకరమ్ ॥18॥

అలా వేసిన పాశుపతాస్త్రము ఆకాశము పైకి లేచి, కోటిసూర్యకాంతులతో వేయిముఖాలతో, భయంకరమైన గాలి వలె మిక్కిలి భయపెట్టుచుండినవి. బ్రహ్మవిష్ణువుల ఈ రెండుఅస్త్రాలు చాల భయమును కల్గిస్తూ ఉండినవి.

ఇత్థం బభూవ సమరో బ్రహ్మ విష్ణ్వోః పరస్పరమ్ ।
తతో దేవగణాస్సర్వే విషణ్ణా భృశమాకులాః ॥19॥

ఇలా బ్రహ్మ, విష్ణువు ఇద్దరు యుద్ధము చేస్తుండగా దేవగణములోని వారందరు కంగారు పడ్డారు.

ఊచుః పరస్పరం తాత రాజక్షోభే యథా ద్విజాః ।
సృష్టిః స్థితిశ్చ సంహారస్తిరోభావోఽప్యనుగ్రహః ॥20॥

రాజమందిరంలో సంక్షోభం ఏర్పడినపుడు అక్కడున్న బ్రాహ్మణుల్లాగా ఆ దేవతలు ఇలా అంటున్నారు. పరాకృత్యాలను ఐదువిధాలుగా ప్రస్తావించారు.

అవి - సృష్టి, స్థితి, లయం, తిరోభావం, అనుగ్రహం.

వి. సృష్టి = పుట్టుక, స్థితి = పోషణ, లయం = నశించడం, తిరోభావం = ప్రకృతి పరమాత్మలో కలియడం, అనుగ్రహం = పునః సృష్టికై ఆదేశం.

యస్మాత్ప్రవర్తతే తస్మై బ్రహ్మణే చ త్రిశూలినే ।

ఏ పరబ్రహ్మ నుండి ప్రభవించెనో అట్టి త్రిశూలధారియగు శివునకు నమస్కారము.

అశక్యమన్యైర్యదనుగ్రహం వినా తృణక్షయోఽప్యత్ర యదృచ్ఛయా క్వచిత్ ॥21॥

శివుని యొక్క అనుగ్రహము లేనిదే ఈ లోకములో ఇతరులు గడ్డిపోచను కూడ త్రుంచలేరు.

ఇతి దేవా భయం కృత్వా విచిన్వంతః శివక్షయమ్ ।
జగ్ముః కైలాసశిఖరం యత్రాస్తే చంద్రశేఖరః ॥22॥

ఇట్లు భయపడిన దేవతలందరూ చంద్రశేఖరనివాసస్థలమైన కైలాసశిఖరమును వెదుకుతూ వెళ్ళారు.

దృష్ట్వైవమమరా హృష్టాః పదం తత్పారమేశ్వరమ్ ।
ప్రణేముః ప్రణవాకారం ప్రవిష్టాస్తత్ర సద్మని ॥23॥

అట్లు వెదుకుతూ వెళ్లిన దేవతలు పరమేశ్వరుడున్న చోటును చూసి సంతోషించారు. శివనివాసములోనికి వెళ్లి ఓంకారస్వరూపుడగు శివునికి నమస్కరించారు.

తేఽపి తత్ర సభామధ్యే మండపే మణివిష్టరే ।
విరాజమానముమయా దదృశుర్దేవపుంగవమ్ ॥24॥

అక్కడ సభామధ్యములో మణులు పొదిగిన మంటపమునందు ఉమాదేవితో కూడి ఉన్న మహాదేవుని చూశారు.

సవ్యోత్తరేతరపదం తదర్పితకరాంబుజమ్ ।
స్వగణైస్సర్వతో జుష్టం సర్వలక్షణలక్షితమ్ ॥25॥

శివుడు తన ఎడమకాలిపై కుడికాలును ఉంచి, దానిపై పద్మమువంటి చేతిని ఉంచి కూర్చుని ఉన్నాడు. సకలకల్యాణగుణములు గల ప్రమథగణములు శివుని చుట్టూ నిలిచి ఉన్నారు.

వీజ్యమానం విశేషజ్ఞైః స్త్రీజనైస్త్రీప్రభావనైః ।
శస్యమానం సదా వేదైరనుగృహ్ణంతమీశ్వరమ్ ॥26॥

పరిచారికలైన స్త్రీలు శ్రద్ధగా వింజామరలతో వీస్తున్నారు. వేదములన్నీ శివుని ఎల్లపుడూ స్తుతిస్తూ ఉన్నాయి.

దృష్ట్వైవమీశమమరాస్సంతోషసలిలేక్షణాః ।
దండవద్దూరతో వత్స నమశ్చక్రుర్మహాగణాః ॥27॥

ఓ వత్సా! అట్లున్న శివుని చూసి దేవతాగణములన్నీ ఆనందముతో కన్నుల నీరు కారుస్తూ, సాష్టాంగ ప్రణామములు చేశారు.

తానవేక్ష్య పతిర్దేవాన్ సమీపే చాహ్వయద్గణైః ।
అథ సంహ్లాదయన్ దేవాన్దేవో దేవశిఖామణిః ॥
అవోచదర్థగంభీరం వచనం మధు మంగలమ్ ॥28॥

అంతట శివుడు దేవతలను అందరిని తన దగ్గరకు పంపమని ప్రమథగణములకు చెప్పాడు. దేవదేవుడైన శివుడు ఆ దేవతలనందరిని సంతోషపరుస్తూ, తీయని అర్థగాంభీర్యం గల శబ్దాలను, మంగళప్రదమైన మాటలను పలికాడు.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం బ్రహ్మ విష్ణు సంగ్రామో నామ షష్ఠోఽధ్యాయః ॥6॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు బ్రహ్మ, విష్ణు సంగ్రామం అనే పేరు గల ఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తమోऽధ్యాయ - ఏడవ అధ్యాయం

కూటసాక్ష్యం - కూటసాక్ష్యం

ఈశ్వర ఉవాచ - ఈశ్వరుడు ఇట్లు పలికాడు.

వత్సకాః స్వస్తి వః కచ్చిద్వర్తతే మమ శాసనాత్ ।
జగచ్చ దేవతావంశః స్వస్వకర్మణి కిం న వా ॥1॥

ప్రియమైన దేవతలారా! మీరందరికి శుభమగుగాక. నా శాసనము వలన ప్రపంచము, దేవవంశములు తమ తమ విధులందు నిమగ్నమై ఉన్నవా? లేవా?

ప్రాగేవ విదితం యుద్ధం బ్రహ్మవిష్ణ్వోర్మయా సురాః ।
భవతామభితాపేన పౌనరుక్త్యేన భాషితమ్ ॥2॥

ఓ దేవతలారా! బ్రహ్మవిష్ణుల యుద్ధము నాకు ముందుగానే తెలుసు. మీ కలవరమును చూసి నాకు మరల తెలిసినట్లు అయినది.

ఇతి సస్మితయా మాధ్వ్యా కుమారపరిభాషయా ।
సమతోషయదంబాయాః సపతిస్తత్సురవ్రజమ్ ॥3॥

సాంబశివుడు ఈ విధముగా చిరునవ్వుతో కూడిన మాటలతో కుమారులను పలుకరించిన తీరు దేవతలను సంతోషపెట్టింది.

అథ యుద్ధాంగణం గంతుం హరిధాత్రోరధీశ్వరః ।
ఆజ్ఞాపయద్గణేశానాం శతం తత్రైవ సంసది ॥4॥

ఆ తర్వాత, బ్రహ్మ విష్ణువులకు ప్రభువగు శివుడు వందమంది తన ప్రమథగణాలను యుద్ధమునకు వెళ్లమని ఆదేశించాడు.

తతో వాద్యం బహువిధం ప్రయాణాయ పరేశితుః ।
గణేశ్వరాశ్చ సన్నద్ధా నానావాహనభూషణాః ॥5॥

అపుడు శివుని ప్రయాణము కొరకు అనేకవిధములైన వాద్యములు, అలంకారములతో కూడిన అనేక వాహనములు, సిద్ధము చేశారు. ప్రమథగణాధిపతులు కూడా సిద్ధమైనారు.

ప్రణవాకారమాద్యం తం పంచమండలమండితమ్ ।
ఆరురోహ రథం భద్రమంబికాపతిరీశ్వరః ॥6॥

ఓంకార ఆకారము కలిగి, ఐదు మండలములచే అలంకరింపబడిన మంగళప్రదమైన మొదటి రథమును అంబికానాథుడైన శివుడు అధిష్ఠించాడు.

ససూనుగణమింద్రాద్యాః సర్వేఽప్యనుయయుస్సురాః ।
చిత్రధ్వజవ్యజనచామరపుష్పవర్షసంగతినృత్యనివహైరపి వాద్యవర్గైః ॥
సమ్మానితః పశుపతిః పరయా చ దేవ్యా సాకం తయోస్సమరభూమిమగాత్ససైన్యః ॥7॥

కుమారులతో, ప్రమథగణములతో కూడియున్న శివుని ఇంద్రాది దేవతలు అందరూ అనుసరించారు. చిత్రమైన ధ్వజములతో, వింజామరలతో, పూలవానలతో, సంగీతముతో కలసి, నృత్య సముదాయములతో వాద్య వర్గములతో కూడి సమ్మానితుడై పశుపతిదేవితో కూడి తన సైన్యముతో బ్రహ్మ విష్ణువు పోరాడుకొనుచున్న యుద్ధ రంగమునకు వెళ్ళాడు.

సమీక్ష్య తు తయోర్యుద్ధం నిగూఢోఽభ్రం సమాస్థితః ।
సమాప్తవాద్యనిర్ఘోషః శాంతోరుగణనిఃస్వనః ॥8॥

అంతట శివుడు ఆకాశమార్గమునందుండి రహస్యముగా ఇద్దరూ చేస్తున్న యుద్ధమును చూస్తూ ఉండినాడు. వాద్యముల ధ్వనులన్నియు ఆపివేయబడ్డాయి. గణములు చేయు పెద్ద ధ్వనులన్నియు ఆగిపోయాయి.

అథ బ్రహ్మాచ్యుతౌ వీరౌ హంతుకామౌ పరస్పరమ్ ।
మహేశ్వరేణ చాఽస్త్రేణ తథా పాశుపతేన చ ॥9॥

ఇంతలో వీరులయిన బ్రహ్మ, విష్ణువు ఒకరినొకరు హింసించుకోవాలనే ఆలోచనలతో మహేశ్వర పాశుపతాస్త్రములను ప్రయోగించారు.

అస్త్రజ్వాలైరథో దగ్ధం బ్రహ్మవిష్ణ్వోర్జగత్త్రయమ్ ।
ఈశోపి తం నిరీక్ష్యాథ హ్యకాలప్రలయం భృశమ్ ॥10॥

ఇట్లు పోరాడుచున్న బ్రహ్మ, విష్ణువుల అస్త్రముల జ్వాలలచే మూడులోకములు మంటలతో తగుల బడుచుండినవి. అంతట శివుడు ఈ భయంకరమైన అకాలప్రళయాన్ని చూశాడు.

మహానలస్తంభవిభీషణాకృతిర్బభూవ తన్మధ్యతలే స నిష్కలః ॥11॥

అతిభయంకరమైన ఆకారముగల పెద్ద అగ్నిస్తంభము వలె తన రూపమును దాల్చి శివుడు వారిద్దరి మధ్యలో నిలిచాడు.

తే అస్త్రే చాపి సజ్వాలే లోకసంహరణక్షమే ।
నిపతేతుః క్షణేనైవ హ్యావిర్భూతే మహానలే ॥12॥

లోకములను తగులబెట్టే విధంగా ఉన్న ఆ రెండుఅస్త్రములు అచట నిల్చిన మహాగ్నిస్తంభములో పడి క్షణకాలములో దానియందు కలసిపోయాయి.

దృష్ట్వా తదద్భుతం చిత్రమస్త్రశాంతికరం శుభమ్ ।
కిమేతదద్భుతాకారమిత్యూచుశ్చ పరస్పరమ్ ॥13॥

ఈ విధముగా అస్త్రములను శాంతింప చేసి, శుభములను ఇచ్చిన ఆ ఆశ్చర్యకరమైన అగ్నిస్తంభమును చూసి, దేవతలు తమలో తాము “ఏమి ఈ అద్భుత ఆకారము” అని తమలో తాము అడుగుతున్నారు.

అతీంద్రియమిదం స్తంభమగ్నిరూపం కిముత్థితమ్ ।
అస్యోర్ధ్వమపి చాధశ్చ ఆవయోర్లక్ష్యమేవ హి ॥14॥

ఇచట వెలసిన ఈ అగ్నిస్తంభము ఇంద్రియములకు కనిపించేదిగా లేదు. ఇది ఏమై ఉంటుంది? ఇపుడు మనము ఇద్దరము దీని యొక్క మొదలు నుండి చివర వరకు గల విషయమును తెలుసుకోవాలి.

ఇతి వ్యవసితౌ వీరౌ మిలితౌ వీరమానినౌ ।
తత్పరౌ తత్పరీక్షార్థం ప్రతస్థాతేఽథ సత్వరమ్ ॥15॥

అట్లు తెలుసుకోవాలనుకున్న వీరులగు బ్రహ్మవిష్ణువులు ఇద్దరూ తమ పరాక్రమము వలన కలిగిన గర్వముతో ఆ స్తంభమును చూచుటయందు మనసుంచి వెంటనే బయలుదేరారు.

ఆవయోర్మిశ్రయోస్తత్ర కార్యమేకం న సంభవేత్ ।
ఇత్యుక్త్వా సూకరతనుః విష్ణుస్తస్యాదిమీయివాన్ ॥16॥

మనం ఇద్దరం కలసి వెళ్లినచో ఒక అగ్రమునైన చూడలేము అని చెప్పి విష్ణుమూర్తి వరాహరూపమును దాల్చి దాని మూలమును (ఆదిని) చూడటానికి బయలుదేరాడు.

తథా బ్రహ్మా హంసతనుస్తదంతం వీక్షితుం యయౌ ।
భిత్త్వా పాతాలనిలయం గత్వా దూరతరం హరిః ॥17॥

అదే విధముగా బ్రహ్మ కూడా తాను హంసరూపమును దాల్చి, దాని అంతమును (చివరిభాగమును) చూచుటకు వెళ్ళాడు.

నాఽపశ్యత్తస్య సంస్థానం స్తంభస్యానలవర్చసః ।
శ్రాంతస్స సూకరహరిః ప్రాప పూర్వం రణాంగణమ్ ॥18॥

వరాహరూపములో వెళ్లిన విష్ణువు ఆ అగ్నిస్తంభము యొక్క ఆదిని (మూలమును) కనుగొనలేక అలసిపోయి మరల యుద్ధప్రాంతానికి బ్రహ్మ కంటే ముందుగా తిరిగి వచ్చాడు.

అథ గచ్ఛంస్తు వ్యోమ్నా చ విధిస్తాత పితా తవ ।
దదర్శ కేతకీపుష్పం కించిద్విచ్యుతమద్భుతమ్ ॥19॥

ఓ వత్సా! నీ తండ్రియగు బ్రహ్మ ఆకాశములో వెళ్లుతూ కొంచెము ప్రక్కనుండి జారుతున్న మొగలిపువ్వును చూశాడు.

అతిసౌరభ్యమమ్లానం బహువర్షచ్యుతం తథా ।
అన్వీక్ష్య చ తయోః కృత్యం భగవాన్ పరమేశ్వరః ॥20॥

పరిహాసం తు కృతవాన్ కంపనాచ్చలితం శిరః ।
తస్మాత్తావనుగృహ్ణాతుం చ్యుతం కేతకముత్తమమ్ ॥21॥

ఆ పుష్పము మిక్కిలి సుగంధము కల్గి వాడిపోకుండా ఉంది. అది జారిపడి చాలా కాలమైంది. భగవానుడు పరమేశ్వరుడు బ్రహ్మ, విష్ణువుల యొక్క కృత్యమును చూసి, వారిరువురను అనుగ్రహించుటకు పరిహాసము చేసెను. ఆ కదలికకు కంపించిన శిరసునుండి మొగలిపువ్వు జారిపడినది.

కిం త్వం పతసి పుష్పేశ పుష్పరాట్ కేన వా ధృతమ్ ।
ఆదిమస్యాప్రమేయస్య స్తంభమధ్యాచ్యుతశ్చిరమ్ ॥22॥

జారిపడుతున్న కేతోకీ పుష్పమును చూసి బ్రహ్మ ప్రశ్నించెను. ఓ పుష్పరాజమా! నీవు ఏల క్రింద పడుచుంటివి? నిన్ను ధరించినది ఎవరు? అని బ్రహ్మ ప్రశ్నించాడు. నేను అప్రమేయమైన ఆదికల ఈ స్తంభము యొక్క మధ్యభాగమునుండి జారిపడ్డాను అని మొగలిపువ్వు చెప్పింది.

న సంపశ్యామి తస్మాత్త్వం జహ్యాశామంతదర్శనే ।
అస్యాంతస్య చ సేవార్థం హంసమూర్తిరిహాగతః ॥23॥

కాబట్టి ఈ స్తంభము యొక్క పైభాగము చివరను చూడాలనే ఆశను వదులుకో! అని మొగలిపువ్వు బదులు చెప్పింది. నేను దీని యొక్క చివరి భాగమును పూజించుట కోసం హంసరూపములో ఇక్కడకు వచ్చాను అని బ్రహ్మ పలికాడు.

ఇతః పరం సఖే మేఽద్య త్వయం కీర్తవ్యమీప్సితమ్ ।
మయా సహ త్వయా వాచ్యమేతద్విష్ణోశ్చ సన్నిధౌ ॥24॥

స్తంభాంతో వీక్షితో ధాత్రా తత్ర సాక్ష్యహమచ్యుత ।
ఇత్యుక్త్వా కేతకం తత్ర ప్రణనామ పునః పునః ॥25॥

ఓ మిత్రుడా! ఇపుడు నీవు నా చిన్నకోరికను మన్నించాలి. నీవు నాతో విష్ణువు వద్దకు వచ్చి "బ్రహ్మ ఈ స్తంభము యొక్క చివరిభాగమును చూశాడు. ఓ విష్ణుదేవా! దీనికి నేను సాక్ష్యము" అని చెప్పవలెనని కోరాడు.

అసత్యమపి శస్తం స్యాదాపదీత్యనుశాసనమ్ ।
సమీక్ష్య తత్రాఽచ్యుతమాయతశ్రమం ప్రనష్టహర్షం తు ననర్త హర్షాత్ ॥
ఉవాచ చైనం పరమార్థమచ్యుతం షంధాత్తవాదస్స్వవిధిస్తతోఽచ్యుతమ్ ॥26॥

ఆపద సమయంలో అబద్ధము చెప్పుట శాస్త్ర అంగీకారమే అని బ్రహ్మ ఆ పుష్పమును ఒప్పించాడు. అచట మిక్కిలి శ్రమనొంది. ఆనందమును కొల్పోయిన విష్ణువును చూసి సంతోషముతో నృత్యము చేసెను. అసత్యవాదమును ఆశ్రయించిన బ్రహ్మ సత్యానికి కట్టుబడిన విష్ణువుతో ఇట్లు పలికెను.

స్తంభాగ్రమేతత్సముదీక్షితం హరే తత్రైవ సాక్షీ నను కేతకం త్విదమ్ ।
తతోఽవదత్తత్ర హి కేతకం మృషా తథేతి తద్ధాతృవచస్తదంతికే ॥27॥

విష్ణుదేవా! ఓ హరీ! నేను ఈ స్తంభము యొక్క అగ్రభాగమును చక్కగా చూశాను. అందుకు ఈ మొగలిపువ్వే సాక్షి అని పలికాడు. అపుడు ఆ మొగలిపువ్వు కూడా విష్ణువుతో "ఔను" అని అబద్ధము చెప్పింది.

హరిశ్చ తత్సత్యమితీవ చింతయన్ చకార తస్మై విధయే నమః స్వయమ్ ।
షోడశైరుపచారైశ్చ పూజయామాస తం విధిమ్ ॥28॥

విష్ణువు ఆ మాటలను నిజమే అని తలచి బ్రహ్మకు నమస్కరించి షోడశోపచారములతో పూజించాడు.

విధిం ప్రహర్తుం శఠమగ్నిలింగతః స ఈశ్వరస్తత్ర బభూవ సాకృతిః ।
సముత్థితః స్వామివిలోకనాత్పునః ప్రకంపపాణిః పరిగృహ్య తత్పదమ్ ॥29॥

అంతలో అబద్ధములాడి మోసము చేసిన బ్రహ్మను శిక్షించుటకై ఈశ్వరుడు అగ్నిలింగమునుండి అక్కడ సాకారముగ ప్రత్యక్షమయ్యెను. విష్ణువు ఈశ్వరుని చూసి, లేచి వణుకుతున్న చేతులతో ఆయనకు నమస్కరించి ఇట్లు పలికాడు.

ఆద్యంతహీనవపుషి త్వయి మోహబుద్ధ్యా భూయాద్విమర్శ ఇహ నావతి కామనోత్థః ।
సత్వం ప్రసీద కరుణాకరకశ్మలం నౌ మృష్టం క్షమస్వ విహితం భవతైవ కేల్యా ॥30॥

నీ దేహము మొదలు చివర, ప్రారంభము, ముగింపులు లేనివి. మేము ఇద్దరము మోహముతో కూడిన బుద్ధితో, నీ అగ్నిలింగమును పరీక్షించాలనుకున్నాము. ఓ కరుణానిలయా! నీవు ప్రసన్నుడవై మా ఈ దోషములను క్షమించుము. ఇదంతయూ నీ లీలయే కదా!

ఈశ్వర ఉవాచ - ఈశ్వరుడు ఇట్లు పలికాడు.

వత్స ప్రసన్నోఽస్మి హరే యతస్త్వం ఈశత్వమిచ్ఛన్నపి సత్యవాక్యమ్ ।
బ్రూయాస్తతస్తే భవితా జనేషు సామ్యం మయా సత్కృతిరప్యలప్థాః ॥31॥

వత్సా! విష్ణూ! నీవు ఈశ్వరత్వమును కోరుకునే వాడివే అయిననూ సత్యమైన మాటను పలికావు. అందువలన నేను చాలా ఆనందించాను. నీకు నాతో సమానమైన పూజాసత్కారములు మానవుల నుండి లభిస్తాయి.

ఇతః పరం తే పృథగాత్మనశ్చ । క్షేత్ర ప్రతిష్ఠోత్సవ పూజనం చ ॥32॥

ఇక నుండి నాకంటే వేరుగా నీకు కూడా క్షేత్రము, ప్రతిష్ఠ, ఉత్సవము, పూజ ఉంటాయి.

ఇతి దేవః పురా ప్రీతః సత్యేన హరయే పరమ్ ।
దదౌ స్వసామ్యమత్యర్థం దేవసంఘే చ పశ్యతి ॥33॥

ఈ విధముగా శివుడు విష్ణువు యొక్క సత్యవాక్యపాలనమును మెచ్చుకొని, ఆనందించి, దేవతాగణములందరి ఎదురుగా, తనతో సమానమైన స్థాయిని ఇచ్చాడు.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం కూటసాక్ష్యం నామ సప్తమోఽధ్యాయః ॥7॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు కూటసాక్ష్యం అను పేరు గల ఏడవ అధ్యాయం సమాప్తం.

అష్టమోఽధ్యాయః - ఎనిమిదవ అధ్యాయం

బ్రహ్మవిష్ణ్వోఃప్రతి శివానుగ్రహః - శివుడు బ్రహ్మవిష్ణువునను గ్రహించుట

నందికేశ్వర ఉవాచ - నందికేశ్వరుడు ఇట్లు పలికాడు.

ససర్జాథ మహాదేవః పురుషం కంచిదద్భుతమ్ ।
భైరవాఖ్యం భ్రువోర్మధ్యాద్బ్రహ్మదర్పజిఘాంసయా ॥1॥

అంతట బ్రహ్మదేవుని గర్వమును అణిచే కోరికతో మహాదేవుడు తన రెండు కనుబొమల మధ్య నుండి భైరవుడనే ఒక అద్భుతపురుషుని సృష్టించాడు.

స వై తదా తత్ర పతిం ప్రణమ్య శివమంగణే ।
కిం కార్యం కరవాణ్యత్ర శీఘ్రమాజ్ఞాపయ ప్రభో ॥2॥

అపుడు రణస్థలమందున్న శివునికి ఆ పురుషుడు నమస్కారము చేసి "ప్రభూ! నేను చేయవలసిన పని ఏమి? వెంటనే ఆజ్ఞాపించండి" అని పలికాడు.

వత్స యోఽయం విధిస్సాక్షాజ్జగతామాద్యదైవతమ్ ।
నూనమర్చయ ఖడ్గేన తిగ్మేన జవసా పరమ్ ॥3॥

"వత్సా! ఈ బ్రహ్మదేవుడు లోకములన్నింటికి దైవము. కావున ఈ పదునైన కత్తితో ఈతనిని వేగముగా వెళ్లి, బాగా అర్చించుము" అని శివుడు పలికాడు.

స వై గృహీత్వైకకరేణ కేశం తత్పంచమం దృప్తమసత్యభాషణమ్ ।
ఛిత్వా శిరాంస్యస్య నిహంతుముద్యతః ప్రకంపయన్ ఖడ్గమతిస్ఫుటం కరైః ॥4॥

అపుడు భైరవుడు ఒకచేతితో జుట్టును పట్టి గర్వముతో అబద్ధము చెప్పిన బ్రహ్మ యొక్క అయిదవతలను నరికి, ప్రకాశించే ఆ కత్తిని చేతులతో త్రిప్పుచూ, మిగిలిన తలలను కూడా నరుకుటకు ప్రయత్నించాడు.

పితా తవోత్సృష్టవిభూషణాంబరస్రగుత్తరీయామలకేశసంహతిః ।
ప్రవాతరంభేవ లతేవ చంచలః పపాత వై భైరవపాదపంకజే ॥5॥

నీ తండ్రి యొక్క అలంకారములను, ఉత్తరీయమును, పూలమాలను, చక్కని జుట్టుముడిని జారవిడిచి, పెనుగాలిలో దెబ్బతిన్న అరటిచెట్టు లాగ, తీగవలె వణుకుతూ, భైరవుని పాదపద్మములపై పడ్డాడు. (బ్రహ్మతల)

తావద్విధిం తాత దిదృక్షురచ్యుతః కృపాలురస్మత్పతిపాదపల్లవమ్ ।
నిషిచ్య బాష్పైరవదత్ కృతాంజలిః యథా శిశుస్స్వం పితరం కలాక్షరమ్ ॥6॥

అంతలో బ్రహ్మను కాపాడే ఉద్దేశంతో దయామూర్తి అయిన విష్ణువు, ప్రభువైన శివుని పాదమును కన్నీటితో అభిషేకము చేసి, దోసిలి యొగ్గి, పిల్లవాడు తన తండ్రిని వేడుకొనే విధంగా తీయని స్వరముతో ఇట్లు పలికాడు.

అచ్యుత ఉవాచ - అచ్యుతుడు పలికాడు.

త్వయా ప్రయత్నేన పురా హి దత్తం యదస్య పంచాననమీశచిహ్నమ్ ।
తస్మాత్ క్షమస్వాద్యమనుగ్రహార్హం కురు ప్రసాదం విధయే హ్యముష్మై ॥7॥

ప్రయత్నించి పూర్వకాలములో ఈ బ్రహ్మకు ఐదుముఖములను ఈశ్వరుని గుర్తుగా ఇచ్చినావు. అందువలన ఈ మొదటిదైవమైన బ్రహ్మను క్షమించుము. ఈతడు నీ అనుగ్రహమునకు యోగ్యుడు. నీవు ఈ బ్రహ్మయందు ప్రేమను చూపుము.

ఇత్యర్థితోఽచ్యుతేనేశః తుష్టస్సురగణాంగణే ।
నివర్తయామాస తదా భైరవం బ్రహ్మదండతః ॥8॥

ఈ విధముగా దేవతల సమక్షంలో విష్ణువు ప్రార్థించగానే శివుడు బ్రహ్మను దండించవద్దని భైరవుని వెనుకకు పిలిచాడు.

అథాహ దేవః కితవం విధిం విగతకంధరమ్ ।
బ్రహ్మంస్త్వమర్హణాకాంక్షీ శఠమీశత్వమాస్థితః ॥9॥

నాతస్తే సత్కృతిర్లోకే భూయాత్ స్థానోత్సవాదికమ్ ।

అపుడు మోసము చేసి తలను పోగొట్టుకున్న బ్రహ్మతో శివుడు ఇట్లు పలికాడు. ఓ బ్రహ్మా! నీవు ఈశ్వరతత్త్వమునకు అర్హతను కోరుకొని, మోసము చేయాలనుకున్నావు కావున లోకములో నీకు స్థానము, ఉత్సవము, పూజ మొదలుగునవి లేకుండు గాక!

బ్రహ్మ ఉవాచ - బ్రహ్మ ఇట్లు పలికాడు.

స్వామిన్ ప్రసీదాద్య మహావిభూతే ।
మన్యే వరం వరద మే శిరసః ప్రమోక్షమ్ ॥10॥

స్వామీ! నీవు చాలా మహిమలు గల గొప్ప వాడవు. నాకు ప్రసన్నుడవు కమ్ము! వరములనిచ్చు దాతా! నా తల తెగి పడుట కూడా ఒక వరముగానే తలుస్తున్నాను.

నమస్తుభ్యం భగవతే బంధవే విశ్వయోనయే ।
సహిష్ణవే సర్వదోషాణాం శంభవే శైలధన్వనే ॥11॥

భగవంతుడు, బంధువు, జగత్తుకు కారణమైన వాడవు, అన్ని దోషములను సహించు వాడవు, మేరుపర్వతాన్ని ధనుస్సుగా కలవాడవు అగు నీకు నమసారము చేస్తున్నాను.

ఈశ్వర ఉవాచ - ఈశ్వరుడు పలికెను.

అరాజభయమేతద్వై జగత్సర్వం నశిష్యతి ।
తతస్త్వం జహి దండార్హం వహ లోకధురం శిశో ॥12॥

నీవు మరణించినచో, పరిపాలించు వాని భయము లేని ఈ ప్రపంచము పూర్తిగా నాశనమవుతుంది. అందువలన శిక్షకు అర్హుడవు అయినప్పటికీ నిన్ను విడిచి పెట్టాను. ఓ బాలుడా! నీవు లోకము యొక్క భారమును వహించు.

వరం దదామి తే తత్ర గృహాణ దుర్లభం పరమ్ ।
వైతానికేషు గృహ్యేషు యజ్ఞేషు చ భవాన్గురుః ॥13॥

ఇతరులకు లభించని గొప్పవరమును ఇస్తాను. అగ్నిష్టోమము, దర్శ మొదలగు యజ్ఞములలో నీకు గురుస్థానము కల్గుతుంది.

నిష్ఫలస్త్వదృతే యజ్ఞః సాంగశ్చ సహ దక్షిణః ।
అథాహ దేవః కితవం కేతకం కూటసాక్షిణమ్ ॥14॥

అవయవములన్నీ ఉన్నా, దక్షిణలు ఇచ్చినా నీవు లేని యజ్ఞము ఉపయోగము లేనిదౌతుంది. అంతట శివుడు అబద్ధము చెప్పి సాక్షిగా నిలిచిన మొగలిపువ్వుతో ఇట్లు పలికాడు.

రేరే కేతక దుష్టస్త్వం శఠదూరమితో వ్రజ ।
మమాపి ప్రేమ తే పుష్పే మా భూత్పూజాస్వితః పరమ్ ॥15॥

ఓసీ దుష్టబుద్ధి గల మొగలిపువ్వా! నీవు మోసము చేశావు. దూరంగా వెళ్లిపో! ఇకపై నాకు జరుగు పూజలలో నీయందు ప్రేమ ఉండదు గాక!

ఇత్యుక్తే తత్ర దేవేన కేతకం దేవజాతయః ।
సర్వా నివారయామాసుః తత్పార్శ్వాదన్యతస్తదా ॥16॥

అట్లు శివుడు పలుకగానే దేవతలు ఆ పువ్వును శివుని తల ప్రక్కనుండి తీసి దూరముగా ఉంచారు.

కేతక ఉవాచ – కేతకుడు పలికాడు.

నమస్తే నాథ మే జన్మ నిష్ఫలం భవదాజ్ఞయా ।
సఫలం క్రియతాం తాత క్షమ్యతాం మమ కిల్బిషమ్ ॥17॥

ఓ నాథా! నీకు నమస్కారము. నీ ఆజ్ఞ వలన నా జన్మ ఉపయోగము లేనిదవుతుంది. నా తప్పును మన్నించి, క్షమించి, పాపమును తొలగించి, నా జన్మను ఫలవంతము చేయుము.

జ్ఞానాజ్ఞానకృతం పాపం నాశయత్యేవ తే స్మృతిః ।
తాదృశే త్వయి దృష్టే మే మిథ్యాదోషః కుతో భవేత్ ॥18॥

తెలిసి గాని, తెలియక కాని చేసిన పాపము నిన్ను తలచినంతనే నశిస్తుంది. అటువంటి నిన్ను నేను దర్శించాను. ఇంక నాలో అబద్ధమాడిన దోషము ఎట్లుంటుంది?

తథా స్తుతస్తు భగవాన్ కేతకేన సభాతలే ।
న మే త్వద్ధారణం యోగ్యం సత్యవాగహమీశ్వరః ॥19॥

అట్లు సభలో కేతకముచే ప్రశంసింపబడిన భగవానుడు ఇట్లు పలికాడు. ఈశ్వరుడనగు నేను అన్నమాట నిజమై తీరుతుంది. కావున నేను నిన్ను ధరించుట తగదు.

మదీయా స్త్వాం ధరిష్యంతి జన్మ తే సఫలం తతః ।
త్వం వై వితానవ్యాజేన మమోపరి భవిష్యసి ॥20॥

కాని నా భక్తులు మాత్రం నిన్ను ధరిస్తారు. దాని వలన నీ జన్మ సార్థకత చెందుతుంది. నీవు ఛత్రరూపములో నాపైన ఉండగలవు (గొడుగు రూపంలో).

ఇత్యనుగృహ్య భగవాన్ కేతకం విధిమాధవౌ ।
విరరాజ సభామధ్యే సర్వదేవైరభిష్టుతః ॥21॥

భగవానుడు ఈ విధముగా మొగలిపువ్వును, బ్రహ్మను, విష్ణువును అనుగ్రహించి, సభామధ్యములో దేవతలందరిచే స్తుతించబడ్డాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ప్రథమాయం విద్యేశ్వరసంహితాయాం సాధ్యసాధనఖండే బ్రహ్మవిష్ణ్వోః ప్రతి శివానుగ్రహః నామ అష్టమోఽధ్యాయః ॥8॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వర సంహితయందు శివుడు బ్రహ్మవిష్ణువులననుగ్రహించుట అను పేరు గల ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

నవమోఽధ్యాయః - తొమ్మిదవ అధ్యాయం

శివరాత్రిః - అరుణాచలమ్ - శివరాత్రి - అరుణాచలం

నందికేశ్వర ఉవాచ - నందికేశ్వరుడు పలికాడు.

తత్రాంతరే తౌ చ నాథం ప్రణమ్య విధిమాధవౌ ।
బద్ధాంజలిపుటౌ తూష్ణీం తస్థతుర్దక్షవామగౌ ॥1॥

ఓ సనత్కుమారా! ఆ సమయమందు బ్రహ్మదేవుడు, విష్ణుమూర్తి ప్రభువగు పరమశివునికి దోసిలి యొగ్గి, నమస్కారం చేసి, కుడివైపు, ఎడమవైపు మౌనంగా నిల్చున్నారు.

తత్ర సంస్థాప్య తౌ దేవం సకుటుంబం వరాసనే ।
పూజయామాసతుః పూజ్యం పుణ్యైః పురుషవస్తుభిః ॥2॥

ఉత్తమమైన ఆసనంపై శివుని దేవీసమేతంగా కూర్చుండబెట్టి, పవిత్రమైన పురుషవస్తువులతో పూజించారు.

పౌరుషం ప్రాకృతం వస్తు జ్ఞేయం దీర్ఘాల్పకాలికమ్ ।
హారనూపురకేయూరకిరీటమణికుండలైః ॥3॥

ఎక్కువకాలం మన్నిక గల్గి ఉండే వాటిని పురుషవస్తువులని, తక్కువ కాలం మాత్రమే ఉండే వాటిని ప్రాకృతాలని తెలుసుకోవాలి. హారాలు (బంగారుదండలు), నూపురాలు (కాలికి ధరించు ఆభరణాలు), చేతులకు ధరించు ఆభరణాలు (కేయూరాలు), చెవులకు ధరించు వస్తువులు (మణికుండలాలు)

యజ్ఞసూత్రోత్తరీయస్రక్ క్షౌమమాల్యాంగులీయకైః ।
పుష్పతాంబూలకర్పూరచందనాగురులేపనైః ॥4॥

ధూపదీపసితచ్ఛత్రవ్యజనధ్వజచామరైః ।
అన్యైర్దివ్యోపహారైశ్చ వాఙ్మఽనోతీతవైభవైః ॥5॥

పతియోగ్యైః పశ్వలభ్యైస్తౌ సమర్చయతాం పతిమ్ ।
యద్యచ్ఛ్రేష్ఠతమం వస్తు పతియోగ్యం హితద్ధ్వజ ॥6॥

యజ్ఞోపవీతం, ఉత్తరీయం (పై వస్త్రము) పట్టుబట్టలు, మాలలు, పూలదండలు, ఉంగరాలు, పూలు, తాంబూలం, కర్పూరం, గంధం, అగరుపూతలతో శివుని సకలపూజలు చేశారు. ఇంకా ధూపం, దీపం, తెల్లని గొడుగు, విసనకఱ్ఱలు, ధ్వజం మొదలగు పవిత్రమగు వస్తువులతోను మాటలకు, మనస్సుకు అతీతమైన వైభవంతో కూడిన దివ్యమైన వస్తువులతోను, పశుపతికి ఈయదగినట్టియు సామాన్య మనుషులకు అందుబాటులో ఉండనట్టియు ఏయే శ్రేష్ఠతమమైన వస్తువులున్నాయో అట్టి సమస్త వస్తువులతోను, పశుపతియైన శివుని పూజించారు.

తద్వస్త్వఖిలమీశోఽపి పారంపర్యచికీర్షయా ।
సభ్యానాం ప్రదదౌ హృష్టః పృథక్ తత్ర యథాక్రమమ్ ॥7॥

అట్లు వారు చేసిన పూజలకు శివుడు ఆనందించి, తన పరంపరను తెలియ చేయదలచి, ఆ వస్తువులను అన్నింటినీ అక్కడున్న సభ్యులకు యథాక్రమంగా తిరిగి ఇచ్చివేశాడు.

కోలాహలో మహానాసీత్తత్ర తద్వస్తు గృహ్ణతామ్ ।
తత్రైవ బ్రహ్మవిష్ణుభ్యాం చార్చితశ్శంకరః పురా ॥8॥

ఆ వస్తువులన్నీ దేవతలు తీసుకొనే సమయంలో పెద్ద కోలాహలం జరిగింది. (కోలాహలం అనగా హడావిడి, పెద్ద సందడి). పూర్వం ఆ విధంగా బ్రహ్మవిష్ణువులు ఇద్దరి చేత శివుడు పూజింపబడ్డాడు.

ప్రసన్నః ప్రాహ తౌ నమ్రౌ సస్మితం భక్తివర్ధనః ।

శివుడు ప్రసన్నమైన ముఖంతో భక్తిని పెంచే విధంగా వారిరువురిని ఉద్దేశించి ఇట్లు పలికాడు.

ఈశ్వర ఉవాచ - ఈశ్వరుడు పలికాడు.

తుష్టోఽహమద్య వాం వత్సౌ పూజయాఽస్మిన్మహాదినే ॥9॥

పుత్రులారా! మీరు ఈనాడు నాకు చేసిన పూజకు సంతోషించాను.

దినమేతత్తతః పుణ్యం భవిష్యతి మహత్తరమ్ ।
శివరాత్రిరితి ఖ్యాతా తిథిరేషా మమ ప్రియా ॥10॥

ఈ రోజు చాలా గొప్పది. మరియు పవిత్రమైనది. ఈరోజు శివరాత్రి అనే పేరుతో పిలువబడుతుంది. ఈ తిథి నాకు ఇష్టమైనది.

ఏతత్కాలే తు యః కుర్యాత్పూజాం మల్లింగబేరయోః ।
కుర్యాత్తు జగతః కృత్యం స్థితిసర్గాదికం పుమాన్ ॥11॥

ఈ శుభతిథి రోజున నా మూర్తిస్వరూపాన్ని, లింగస్వరూపాన్ని పూజించినవారికి పుట్టించి, పోషించి, నాశనం చేయగల సామర్థ్యం కల్గుతుంది (సృష్టి - స్థితి - లయ కార్యక్రమాలు)

శివరాత్రావహోరాత్రం నిరాహారో జితేంద్రియః ।
అర్చయేద్వా యథాన్యాయం యథాబలమవంచకః ॥12॥

ఈ మహాశివరాత్రి పర్వదినాన మానవుడు ఉపవాసముండి, ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని, శాస్త్రప్రకారంగా, శక్తివంచనలేకుండా, యథాశక్తిగా నన్ను పూజించాలి.

యత్ఫలం మమ పూజాయాం వర్షమేకం నిరంతరమ్ ।
తత్ఫలం లభతే సద్యశ్శివరాత్రౌ మదర్చనాత్ ॥13॥

ఈ శివరాత్రి పుణ్యదినాన నన్ను పూజించినచో, ఒక సంవత్సరకాలం ప్రతిరోజూ నన్ను పూజించిన ఫలం లభిస్తుంది.

మద్ధర్మవృద్ధికాలోఽయం చంద్రకాల ఇవాంబుధేః ।
ప్రతిష్ఠాద్యుత్సవో యత్ర మామకో మంగలాయనః ॥14॥

చంద్రుడు ఉదయిస్తున్న సమయంలో సముద్రం ఎట్లు ఉప్పొంగునో అట్లు శివరాత్రిరోజున నా ధర్మం పెరుగుతుంటుంది. ఆ వేళల్లో శివప్రతిష్ఠ, శివ ఉత్సవాలు చేయుట వలన అన్ని శుభాలు కలుగుతాయి.

యత్పునః స్తంభరూపేణ స్వావిరాసమహం పురా ।
స కాలో మార్గశీర్షే తు స్యాదార్ద్రా ఋక్షమర్భకౌ ॥15॥

అలాగే ఓ కుమారులారా! నేను పూర్వకాలంలో ఆరుద్రనక్షత్రం, మార్గశిరమాసం, పూర్ణిమ శుభతిథినాడు స్తంభాకారంగా పుట్టాను. (వెలసితిని)

ఆర్ద్రాయాం మార్గశీర్షే తు యః పశ్యేన్మాముమాసఖమ్ ।
మద్బేరమపి వా లింగం స గుహాదపి మే ప్రియః ॥16॥

ప్రతిమార్గశిరమాసములో వచ్చే ఆరుద్రానక్షత్రంరోజున పార్వతితో కలసియున్న నా మూర్తిని లేదా లింగమును దర్శించినవారికి, నా కుమారుడగు కుమారస్వామికంటే ఎక్కువ ప్రేమతో చూడబడు యోగము కల్గుతుంది.

అలం దర్శనమాత్రేణ ఫలం తస్మిన్ దినే శుభే ।
అభ్యర్చనం చేదధికం ఫలం వాచామగోచరమ్ ॥17॥

ఆ మంచి రోజున కేవలం దర్శనం వలననే చాలా గొప్పఫలం కల్గుతుంది. ఇక ఆనాడు అర్చన కూడా చేసినచో వచ్చే మంచిఫలితాలు మాటలతో వివరింపజాలనివి.

రణరంగతలేఽముష్మిన్ యదహం లింగవర్ష్మణా ।
జృంభితో లింగవత్తస్మాల్లింగస్థానమిదం భవేత్ ॥18॥

ఈ యుద్ధప్రదేశంలో నేను లింగాకారంగా వ్యక్తమయ్యాన. కావున ఈ ప్రదేశం లింగస్థానంగా పేరు పొందుతుంది.

అనాద్యంతమిదం స్తంభమణుమాత్రం భవిష్యతి ।
దర్శనార్థం హి జగతాం పూజనార్థం హి పుత్రకౌ ॥19॥

ఓ కుమారులారా! మొదలు, చివర లేని ఈ స్తంభం ప్రజల దర్శనం కోసము, ముందు కాలంలో పూజకు వీలుగా ఉండడానికి అణుమాత్రమౌతుంది.

భోగావహమిదం లింగం భుక్తిముక్త్యైకసాధనమ్ ।
దర్శనస్పర్శనధ్యానాజ్జంతూనాం జన్మమోచనమ్ ॥20॥

ఈ శివలింగం మనుషులకు సర్వసుఖాలను ఇచ్చును. జీవనోపాధికి, తనువు చాలించిన తర్వాత ముక్తికి ఇది ఒకటే సాధనమౌతుంది. దీనిని చూసిన వారలకు, చేతితో ముట్టుకున్నవారికి మరలా జన్మ ఉండదు.

అనలాచలసంకాశం యదిదం లింగముత్థితమ్ ।
అరుణాచలమిత్యేవ తదిదం ఖ్యాతిమేష్యతి ॥21॥

అగ్నిపర్వతం వంటికాంతితో ఈ శివలింగం పుట్టుటవలన ఇది అరుణాచలం అనే పేరుతో పిలువబడుతుంది.

అత్ర తీర్థం చ బహుధా భవిష్యతి మహత్తరమ్ ।
ముక్తిరప్యత్ర జంతూనాం వాసేన మరణేన చ ॥22॥

ఈ ప్రదేశంలో గొప్పతీర్థం అనేక విధాలుగా ఏర్పాటౌతుంది. ఇక్కడ నివసించిన ప్రాణులకు, మరణం పొందిన ప్రాణులకు తప్పక ముక్తి లభిస్తుంది.

రథోత్సవాదికల్యాణం జనావాసం తు సర్వతః ।
అత్ర దత్తం హుతం జప్తం సర్వం కోటిగుణం భవేత్ ॥23॥

ఈ ప్రదేశంలో రథోత్సవాలు వంటి శుభకరమగు పనులు జరుగుతాయి. ఇక్కడ అన్నిచోట్ల ప్రజలు చక్కగా నివసిస్తారు. ఇక్కడ చేసిన జప, దాన, హోమాలకు కోటిరెట్లు పుణ్యఫలం లభిస్తుంది.

మత్క్షేత్రాదపి సర్వస్మాత్ క్షేత్రమేతన్మహత్తరమ్ ।
అత్ర సంస్మృతిమాత్రేణ ముక్తిర్భవతి దేహినామ్ ॥24॥

నా క్షేత్రములన్నింటిలో ఇది చాలా గొప్పది ఔతుంది. ఇక్కడ నన్ను స్మరించినంత మాత్రంచేతనే మానవులు తప్పక ముక్తిని పొందుతారు.

తస్మాన్మహత్తరమిదం క్షేత్రమత్యంతశోభనమ్ ।
సర్వకల్యాణసంపూర్ణం సర్వముక్తికరం శుభమ్ ॥25॥

అందువలన ఈ మిక్కిలి అందమైన ప్రదేశం చాలా గొప్పది. అన్నివిధాల శుభాలతో నిండి, అందరికీ మంచిఫలాలు, ముక్తిని ఇస్తుంది.

అర్చయిత్వాఽత్ర మామేవ లింగే లింగినమీశ్వరమ్ ।
సాలోక్యం చైవ సామీప్యం సారూప్యం సార్ష్టిరేవ చ ॥26॥

సాయుజ్యమితి పంచైతే క్రియాదీనాం ఫలం మతమ్ ।
సర్వేఽపి యూయం సకలం ప్రాప్స్యథాశు మనోరథమ్ ॥27॥

ఈ విధంగా లింగాకారంలో వెలసిన ఈశ్వరుడనైన నన్ను పూజించినచో, సాలోక్యం అనగా కైలాసంలో ఉండే అదృష్టం, సామీప్యం అనగా శివునికి దగ్గరగా ఉండటం, సారూప్యమనగా ఈశ్వరుని పోలిన రూపం లభిస్తాయి. సార్ష్టి అనగా శివునితో సమానమైన ఆనందానుభూతిని పొందుతారు.

అంతే కాకుండా, సాయుజ్యం అనగా శివునియందు లీనమగుట అనే ఐదురకాల ఫలితాలు కల్గుతాయి. మీరు అందరూకూడా మీ మనసులో గల కోరికలను తీర్చుకొను మార్గం వెంటనే పొందుతారు.

నందికేశ్వరోవాచ – నందికేశ్వరుడు పలికాడు.

ఇత్యనుగృహ్య భగవాన్ వినీతౌ విధిమాధవౌ ।
యత్పూర్వం ప్రహతం యుద్ధే తయోస్సైన్యం పరస్పరమ్ ॥28॥

తదుత్థాపయదత్యర్థం స్వశక్త్యాఽమృతధారయా ।
తయోర్మౌఢ్యంచ వైరం చ వ్యపనేతుమువాచ తౌ ॥29॥

భగవంతుడైన శివుడు బ్రహ్మ విష్ణువులిద్దరిని ఈ రకంగా అనుగ్రహించి అంతకు ముందు జరిగిన యుద్ధంలో మరణించిన ఇరుపక్క సైనికులను తన అమృతధార అను శక్తితో తిరిగి లేచి నిలబడునట్లు చేశాడు. బ్రహ్మవిష్ణువులిరువురి మూర్ఖత్వాన్ని, శత్రుత్వాన్ని తొలగించ ప్రయత్నించి వారితో ఇట్లు పలికాడు.

సకలం నిష్కలం చేతి స్వరూపద్వయమస్తి మే ।
నాన్యస్య కస్యచిత్తస్మాదన్యస్సర్వోఽప్యనీశ్వరః ॥30॥

నాకు రెండురూపాలు ఉన్నాయి. అందులో ఒకటి సాకారరూపం. రెండవది నిరాకారరూపం. ఇటువంటి రెండు రూపాలు మరెవ్వరికి లేవు. కావున వేరెవ్వరూ ఈశ్వరులుగా పిలవబడరు.

పురస్తాత్ స్తంభరూపేణ పశ్చాద్రూపేణ చార్భకౌ ।
బ్రహ్మత్వం నిష్కలం ప్రోక్తమీశత్వం సకలం తథా ॥31॥

ఓ పుత్రులారా! నేను మొదట స్తంభరూపంగానూ, ఆ తర్వాత సాక్షాద్రూపంగానూ వెలసినాను. అందు బ్రహ్మభావం నిరాకారంగానూ, ఈశ్వరతత్త్వం సాకారంగానూ ఉన్నాయి.

ద్వయం మమైవ సంసిద్ధం న మదన్యస్య కస్యచిత్ ।
తస్మాదీశత్వమన్యేషాం యువయోరపి న క్వచిత్ ॥ 32॥

ఈ రెండురూపాలు నాకు మాత్రమే సిద్ధించి ఉన్నాయి. నాకంటే వేరుగా మరొకరికి ఈ విధమగు రూపాలు లేవు. కావున మీకిరువురకు గాని, వేరేవారికిగాని ఈశత్వం లేదు.

తదజ్ఞానేన వాం వృత్తం ఈశమానం మహాద్భుతమ్ ।
తన్నిరాకర్తుమత్రైవముత్థితోఽహం రణక్షితౌ ॥33॥

ఈ జ్ఞానం లేకపోవడం చేత, నేనే ఈశుడుననే మీ ప్రవర్తన నాకు మహాద్భుతంగ కనిపిస్తోంది దానిని తొలగించడానికి నేను ఇక్కడ యుద్ధరంగమునందు స్వయంగా వెలిసాను.

త్యజతం మానమాత్మీయం మయీశే కురుతం మతిమ్ ।
మత్ప్రసాదేన లోకేషు సర్వోఽప్యర్థః ప్రకాశతే ॥34॥

మీరు ఇద్దరు ఈశ్వరుడనన్న గర్వాన్ని విడిచి, నన్ను ఈశ్వరునిగా భావించండి. ఈ లోకంలో ఉన్న పదార్థములన్నియు నా అనుగ్రహం చేతనే ప్రకాశింపబడుతున్నాయి.

గురూక్తిర్వ్యంజకం తత్ర ప్రమాణం వా పునః పునః ।
బ్రహ్మతత్త్వమిదం గూఢం భవత్ప్రీత్యా భణాఽమ్యహమ్ ॥35॥

గురువు యొక్క మాటలు కూడా ఈ సత్యాన్నే బోధిస్తున్నాయి. ఇది ప్రామాణికమైన వచనం. నేను ఈ బ్రహ్మతత్త్వరహస్యాన్ని మీయందు గల ప్రేమతో చెప్తున్నాను.

అహమేవ పరంబ్రహ్మ మత్స్వరూపం కలాకలమ్ ।
బ్రహ్మత్వాదీశ్వరశ్చాహం కృత్యం మేఽనుగ్రహాదికమ్ ॥36॥

నేనే పరబ్రహ్మను. సాకారనిరాకారాలు రెండు నా స్వరూపాలే. పరబ్రహ్మను, ఈశ్వరుడను నేనే. అనుగ్రహం, సృష్టి మొదలుగా గల ప్రపంచకార్యక్రమాలన్ని చేసేది - నేనే.

బృహత్త్వాద్బృంహణత్వాచ్చ బ్రహ్మాహం బ్రహ్మకేశవౌ ।
సమత్వాద్వ్యాపకత్వాచ్చ తథైవాత్మాహమర్భకౌ ॥37॥

బ్రహ్మవిష్ణువులారా! అన్నిటికంటే పెద్దవాడనగుట చేతను, అన్నింట వ్యాపించి ఉండుట చేతనూ నాకు బ్రహ్మమని పేరు. కుమారులారా! అందరిలో ఏకరూపంగా వ్యాపించుట వలన నాకు ఆత్మ అని పేరు వచ్చినది.

అనాత్మానః పరే సర్వే జీవా ఏవ న సంశయః ।
అనుగ్రహాద్యం సర్గాంతం జగత్కృత్యం చ పంకజమ్ ॥38॥

ఇతరులు అందరూ అనాత్మలు. అందుకే వారిని జీవులు అనుటలో సందేహం లేదు. సృష్టి మొదలు అంతం వరకు గల ప్రపంచకార్యక్రమాలన్నీ నాయందు నిత్యంగా ఉంటాయి.

ఈశత్వాదేవ మే నిత్యం న మదన్యస్య కస్యచిత్ ।
ఆదౌ బ్రహ్మత్వబుద్ధ్యర్థం నిష్కలం లింగముత్థితమ్ ॥39॥

ఈశుడనై, నిత్యమైయున్న నాకంటే వేరుగా మరొకరికి ఈ ఐదురకాల కర్మలు లేవు. అందుకే ముందుగా బ్రహ్మభావాన్ని తెలియచేయుటకై నిరాకారలింగరూపంగా తెలియబడ్డాను.

తస్మాదజ్ఞాతమీశత్వం వ్యక్తం ద్యోతయితుం హి వామ్ ।
సకలోఽహమతో జాతస్సాక్షాదీశస్తు తత్ క్షణాత్ ॥40॥

కావున లింగరూపదర్శనము వలన మీకు నా ఈశ్వరభావం తెలియజాలదు. అందువలన సాక్షాత్తు ఈశ్వరుడనై నేను వెనువెంటనే మీకు సాకారముగా కనబడ్డాను.

సకలత్వమతో జ్ఞేయమీశత్వం మయి సత్వరమ్ ।
యదిదం నిష్కలం స్తంభం మమ బ్రహ్మత్వబోధకమ్ ॥41॥

సాకారరూపమైన నన్ను ఈశ్వరునిగా తెలుసుకోండి. ఈ నిరాకారస్తంభము నా యొక్క బ్రహ్మాభావమును తెలుపునని గ్రహించండి.

లింగలక్షణయుక్తత్వాన్మమ లింగం భవేదిదమ్ ।
తదిదం నిత్యమభ్యర్చ్యం యువాభ్యామత్ర పుత్రకౌ ॥42॥

పుత్రులారా! ఈ స్తంభము లింగాకారముగా ఉంది. కావున లింగమేఔతుంది. మీరు ఇద్దరూ ఈ లింగాన్ని నిత్యమూ పూజించండి.

మదాత్మకమిదం నిత్యం మమ సాన్నిధ్యకారణమ్ ।
మహత్పూజ్యమిదం నిత్యమభేదాల్లింగలింగినోః ॥43॥

నా స్వరూపము లింగం. లింగసన్నిధి అంటే నా సన్నిధే. అటువంటి ఈ మహాలింగాన్నీ నిత్యము పూజించాలి. నాకునూ, ఈ లింగానికి ఎట్టి భేదంలేదని తెలుసుకో.

యత్ర ప్రతిష్ఠితం యేన మదీయం లింగమీదృశమ్ ।
తత్ర ప్రతిష్ఠితస్సోఽహమప్రతిష్ఠోఽపి వత్సకౌ ॥44॥

కుమారులారా! ఎక్కడ ఇటువంటి నా యొక్క లింగాన్ని ప్రతిష్ఠిస్తారో అక్కడ నేనుంటాను, ప్రతిష్ఠింపబడక పోయిన చోటకూడ నేనుంటాను.

మత్సామ్యమేకలింగస్య స్థాపనే ఫలమీరితమ్ ।
ద్వితీయే స్థాపితే లింగే మదైక్యం ఫలమేవ హి ॥45॥

ఒక్క శివలింగాన్ని స్థాపించినవాడు సారూప్యం అనగా ఈశ్వరుని పోలిన రూపం అనే మోక్షాన్ని, అలాగే రెండవ లింగాన్ని కూడ స్థాపించినచో సాయుజ్యం అనగా ఈశ్వరునిలో ఐక్యమగుటవంటి మోక్షాన్ని పొందుతాడు.

లింగం ప్రాధాన్యతః స్థాప్యం తథా బేరం తు గౌణకమ్ ।
లింగాభావేన తత్ క్షేత్రం సబేరమపి సర్వతః ॥46॥

అన్నిచోట్ల లింగాన్ని ప్రధానంగానూ, మూర్తిని అంత ప్రాధాన్యం లేని దానిగాను స్థాపించాలి. మూర్తి ఉన్నప్పటికీ లింగం లేనిచో అది క్షేత్రం కాజాలదు.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం శివరాత్రిః – అరుణాచలం నామ నవమోఽధ్యాయః ॥9॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు శివరాత్రి – అరుణాచలం అనుపేరు గల తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

దశమోఽధ్యాయః - పదవ అధ్యాయం

పంచకృత్యాని - ప్రణవః - పంచాక్షరి - పంచకృత్యాలు - ప్రణవం - పంచాక్షరి

బ్రహ్మవిష్ణూ ఊచతుః - బ్రహ్మవిష్ణువులు పలికారు.

సర్గాది పంచకృత్యస్య లక్షణం బ్రూహి నౌ ప్రభో ।

ప్రభో! మాకు సృష్టి మొదలగు ఐదింటిని జగత్తు యొక్క కార్యలక్షణాలను తెలియజేయండి.

శివ ఉవాచ- శివుడు ఇట్లు చెప్పాడు.

మత్కృత్యబోధనం గుహ్యం కృపయా ప్రబ్రవీమి వామ్ ॥1॥

నేను చేయు పనుల యొక్క జ్ఞానం రహస్యమైనది. అయిననూ మీకు కృపతో తెలియ చేస్తాను.

సృష్టిః స్థితిశ్చ సంహారస్తిరోభావోఽప్యనుగ్రహః ।
పంచైవ మే జగత్ కృత్యం నిత్యసిద్ధమజాచ్యుతౌ ॥2॥

ఓ బ్రహ్మవిష్ణులారా! సృష్టి, స్థితి, సంహార, తిరోభావ, అనుగ్రహాలు - అనే అయిదురకాల పనులు నాకు నిత్యం సిద్ధంగా ఉంటాయి.

సర్గస్సంసారసంరంభస్తత్ప్రతిష్ఠా స్థితిర్మతా ।
సంహారో మర్దనం తస్య తిరోభావస్తదుత్క్రయః ॥3॥

సంసారానికి ప్రారంభం సర్గం, ప్రారంభించిన సంసారం స్థిరంగా ఉండటమే స్థితి, అటువంటి జగత్తు నశించిపోవటమే సంహారం. ప్రాణులందరూ పరమాత్మలో కలసిపోవుటయే తిరోభావం.

తన్మోక్షోనుగ్రహస్తన్మే కృత్యమేవం హి పంచకమ్ ।
కృత్యమేతద్వహత్యన్యస్తూష్ణీం గోపురబింబవత్ ॥4॥

ఈ విధంగా జీవులకు మోక్షమునిచ్చుట అనుగ్రహం. ఈ అయిదు నేను చేయు పనులు. ఇతరులు ఈ పనులు చేయుట గోపురం పైనున్న బొమ్మగోపురం వంటిది.

సర్గాది యచ్చతుష్కృత్యం సంసారపరిజృంభణమ్ ।
పంచమం ముక్తిహేతుర్వై నిత్యం మయి చ సుస్థిరమ్ ॥5॥

సర్గం మొదలుకొని నాలుగుపనులు సంసారాన్ని పెంచుతూ వుంటాయి. మోక్షసంబంధమైన అయిదవ పని మాత్రం నాయందు స్థిరంగా ఉంటుంది.

తదిదం పంచభూతేషు దృశ్యతే మామకైర్జనైః ।
సృష్టిర్భూమౌ స్థితిస్తోయే సంహారః పావకే తథా ॥6॥

తిరోభావోఽనిలే తద్వదనుగ్రహ ఇహాంబరే ।
సృజ్యతే ధరయా సర్వమద్భిస్సర్వం ప్రవర్ధతే ॥7॥

నా భక్తులైన వారు ఈ అయిదుపనులను పంచభూతాలలో చూస్తుంటారు. భూమిలో సృష్టి, నీటిలో స్థితి, అగ్నిలో సంహారం, గాలిలో తిరోభావం, ఆకాశంలో అనుగ్రహం ఉన్నాయి. అన్నింటిని భూమి పుట్టిస్తుంది. పుట్టినవన్నియు నీటిచే ప్రవర్ధమానమౌతాయి.

అర్ద్యతే తేజసా సర్వం వాయునా చాపనీయతే ।
వ్యోమ్నానుగృహ్యతే సర్వం జ్ఞేయమేవం హి సూరిభిః ॥8॥

నిప్పు అన్నింటిని నాశనం చేస్తుంది. గాలి ప్రాణాలను తీసుకొని పోతుంది. ఆకాశం చేత అన్నియు అనుగ్రహింపబడతాయని పండితులు తెలిసికోవాలి.

పంచకృత్యమిదం వోఢుం మమాస్తి ముఖపంచకమ్ ।
చతుర్దిక్షు చతుర్వక్త్రం తన్మధ్యే పంచమం ముఖమ్ ॥9॥

ఈ విధంగా అయిదుపనులను చేయటానికి నాకు అయిదుముఖాలున్నాయి. నాలుగుదిక్కులలో నాలుగుముఖాలు, వాటిమధ్యలో అయిదవముఖం ఉంది.

యువాభ్యాం తపసా లబ్ధమేతత్కృత్య ద్వయం సుతౌ ।
సృష్టిస్థిత్యభిధం భాగ్యం మత్తః ప్రీతాదతిప్రియమ్ ॥10॥

కుమారులారా! మీరు తపస్సు చేసి, దాని ద్వారా నన్ను ఆనందింప చేసి, నా నుండి సృష్టి, స్థితి అనే రెండుపనులు చేసే భాగ్యాన్ని మీరిరువురు పొందారు.

తథా రుద్రమహేశాభ్యామన్యత్ కృత్యద్వయం పరమ్ ।
అనుగ్రహాఖ్యం కేనాపి లబ్ధుం నైవ హి శక్యతే ॥11॥

అదే విధంగా రుద్ర, మహేశులు తర్వాత రెండుపనులను చేస్తున్నారు. అనుగ్రహం అనే అయిదవ పని మాత్రం నాకు తప్ప ఇతరులు ఎవరికి వీలు కానిది.

తత్సర్వం పౌర్వికం కర్మ యువాభ్యాం కాలవిస్తృతమ్ ।
న తద్రుద్రమహేశాభ్యాం విస్మృతం కర్మ తాదృశమ్ ॥12॥

గతకాలంలోని ఈ చక్రాన్ని మీరు కాలగతిలో పూర్తిగా మరచి పోయారు. కాని రుద్రుడు, మహేశుడు ఈ సంగతిని మరచి పోలేదు.

రూపే వేశే చ కృత్యే చ వాహనే చాసనే తథా ।
ఆయుధాదౌ చ మత్సామ్యమస్మాభిస్తత్కృతే కృతమ్ ॥13॥

వాళ్లిద్దరికి రూపం, నివాసం, కార్యం, వాహనం, ఆసనం, ఆయుధాలను నాతో సమానంగా ఇచ్చాను.

మద్ధ్యానవిరహాద్వత్సా మౌఢ్యం వామేవమాగతామ్ ।
మజ్జ్ఞానే సతి నైవం స్యాన్మానం రూపే మహేశవత్ ॥14॥

నా ధ్యానాన్ని మరచిపోవటం ద్వారా మీకు ఈ అజ్ఞానం వచ్చింది. నా జ్ఞానం ఉన్నచో మీకు ఇలా జరిగి యుండేది కాదు. సాక్షాత్తు మహేశ్వరుని వంటి రూపం కలిగేది.

తస్మాన్మజ్జ్ఞానసిద్ధ్యర్థం మంత్రమోంకారనామకమ్ ।
ఇతఃపరం ప్రజపతం మామకం మానభంజనమ్ ॥15॥

కావున ఇకపై మీరు నా జ్ఞానాన్ని పొందడం కోసం ఓంకారమనే పేరుగల మంత్రాన్ని జపించండి. ఆ మంత్రం మీ ఆత్మాభిమానాన్ని పోగొడుతుంది.

ఉపాదిశం నిజం మంత్రమోంకారమురుమంగలమ్ ।
ఓంకారో మన్ముఖాజ్జజ్ఞే ప్రథమం మత్ప్రబోధకః ॥16॥

నేను పూర్వం మంగళప్రదమైన ఓంకారమనే నా మంత్రాన్ని చెప్పాను. ఓంకారం ముందుకాలంలో నా ముఖంనుండి పుట్టింది. అది నన్ను గూర్చి తెలియజేస్తుంది.

వాచకోఽయమహం వాచ్యో మంత్రోఽయం హి మదాత్మకః ।
తదనుస్మరణం నిత్యం మమానుస్మరణం భవేత్ ॥17॥

ఈ ఓంకారం వాచకం. నేను వచింపబడేవాడిని. ఈ మంత్రం నా యొక్క రూపమే. దానిని ప్రతిరోజు స్మరించటం అంటే నన్ను స్మరించటమే అవుతుంది.

అకార ఉత్తరాత్పూర్వముకారః పశ్చిమాననాత్ ।
మకారో దక్షిణముఖాద్బిందుః ప్రాఙ్ముఖతస్తథా ॥18॥

నాదో మధ్యముఖాదేవం పంచధాఽసౌ విజృంభితః ।
ఏకీభూతః పునస్తద్వదోమిత్యేకాక్షరోఽభవత్ ॥19॥

మొదట ఉత్తరవైపు ముఖం నుంచి అకారం, పడమర ముఖం నుంచి ఉకారం, దక్షిణ ముఖం నుంచి మకారం మరియు తూర్పువైపు ముఖం నుంచి బిందువు అలాగే మధ్యముఖం నుంచి నాదం పుట్టి, ఈ మంత్రం అయిదువిధాలుగా వ్యాపించి, మరలా ఆ అయిదు కలసి ఒక్కటై, ఓం అనే ఒక్క అక్షరమంత్రం అయింది.

నామరూపాత్మకం సర్వం వేదభూతకులద్వయమ్ ।
వ్యాప్తమేతేన మంత్రేణ శివశక్త్యోశ్చ బోధకః ॥20॥

పేర్లతో పిలవబడే ఈ సకలప్రపంచం, వేదం నుండి పుట్టి స్త్రీ, పురుష అని రెండు కులాలు ఈ మంత్రంచే వ్యాపించాయి. ఈ మంత్రం శివశక్తులను తెలియ చేస్తుంది.

అస్మాత్పంచాక్షరం జజ్ఞే బోధకం సకలస్య తత్ ।
ఆకారాది క్రమేణైవ నకారాది యథాక్రమమ్ ॥21॥

దీనినుండి అకారాది వరుసలోనే నకారాది వరుసలో పంచాక్షరిమంత్రం పుట్టింది. ఈ పంచాక్షరి సాకారరూపంలో ఉన్న భగవానుని తత్త్వాన్ని మనకు బోధిస్తుంది.

అస్మాత్పంచాక్షరాజ్జాతా మాతృకాః పంచభేదతః ।
తస్మాచ్ఛిరశ్చతుర్వక్త్రాత్ త్రిపాద్గాయత్రిరేవ హి ॥22॥

ఈ పంచాక్షరినుండి అయిదు, అయిదు విభాగాలతో కూడిన వర్ణమాల పుట్టింది. ఇది గాక శిరోమంత్రం అనే నాలుగవ పాదంతో సహా, మూడు పాదాలు గల గాయత్రీమంత్రం పుట్టింది.

వేదస్సర్వస్తతో జజ్ఞే తతో వై మంత్రకోటయః ।
తత్తన్మంత్రేణ తత్సిద్ధిస్సర్వసిద్ధిరితో భవేత్ ॥23॥

తరువాత దానినుండి అన్ని వేదాలు, వాటి నుండి కోట్లాదిమంత్రాలు పుట్టాయి. ఆ మంత్రాల వలన వాటికి సంబంధించిన ఫలితాలు వస్తాయి. కాని ఈ ప్రణవస్వరూపమైన ఓంకారమంత్రం వలన అన్ని రకాల సిద్ధులు కలుగుతాయి.

అనేన మంత్రకందేన భోగో మోక్షశ్చ సిద్ధ్యతి ।
సకలా మంత్రరాజానః సాక్షాద్భోగప్రదాశ్శుభాః ॥24॥

మంత్రసారం నిండియున్న ఈ ప్రణవం వల్ల సుఖాలే కాక, మోక్షం కూడా వస్తుంది. శ్రేష్ఠమైన మంత్రములన్నియు శుభాలను, ఐహికభోగాలను ప్రసాదిస్తాయి.

నందికేశ్వర ఉవాచ – నందికేశ్వరుడు పలికాడు.

పునస్తయోస్తత్ర తిరః పటంగురుః ప్రకల్ప్య మంత్రం చ సమాదిశత్పరమ్ ।
నిధాయ తచ్ఛీర్ష్ణి కరాంబుజం శనైరుదఙ్ముఖం సంస్థితయోస్సహాంబికః ॥25॥

అంబికతో కలసి ఉన్న శివగురువు ఉత్తరం వైపు కూర్చున్న వారిద్దరి (బ్రహ్మ, విష్ణువులు) తలలపై ఉంచి వారిద్దరికీ ఆ మహామంత్రాన్ని ఉపదేశించాడు.

త్రిరుచ్చార్యాగ్రహీన్మంత్రం యంత్రం తత్రోక్తిపూర్వకమ్ ।
శిష్యౌ చ తౌ దక్షిణాయామాత్మానం చ సమర్పయత్ ॥26॥

వారిద్దరు ఆ మంత్రాన్ని మూడుసార్లు ఉచ్చరించి, యంత్రతంత్రంగా తీసుకొని, శిష్యులైన వారిరువురు గురుదక్షిణగా తమను తాము సమర్పించుకున్నారు.

ప్రబద్ధ హస్తౌ కిల తౌ తదంతికే ।
తమేవ దేవం జగతుర్జగద్గురుమ్ ॥27॥

వారిద్దరు చేతులు జోడించి, జగద్గురువగు మహాదేవుని ఇట్లు ప్రార్థించారు.

బ్రహ్మాచ్యుతావూచతుః – బ్రహ్మ, విష్ణువులు ఇద్దరు పలికారు.

నమో నిష్కలరూపాయ నమో నిష్కలతేజసే ।
నమస్సకలనాథాయ నమస్తే సకలాత్మనే ॥28॥

నిరాకారుడవు, తేజోరూపుడవు, సాకారుడవు జగత్ప్రభుడవు అయిన నీకు నమస్కారం.

నమః ప్రణవవాచ్యాయ నమః ప్రణవలింగినే ।
నమస్సృష్ట్యాది కర్త్రే చ నమః పంచముఖాయ తే ॥29॥

ఓంకారవాచకుడవైన నీకు నమస్కారం. ఓంకారలింగరూపం గల్గి నట్టియు, సృష్టికి ఆదికర్తలైనట్టియు అయిదు ముఖాలు గలట్టియు నీకు నమస్కారం.

పంచబ్రహ్మస్వరూపాయ పంచకృత్యాయ తే నమః ।
ఆత్మనే బ్రహ్మణే తుభ్యమనంతగుణశక్తయే ॥30॥

పంచబ్రహ్మరూపుడవైన నీకు నమస్కారం. పంచకృత్యుడవైన నీకు నమస్కారం. ఆత్మరూపుడవై, పరబ్రహ్మస్వరూపుడవై, అనంతమైన గుణాలు, శక్తి కల నీకు నమస్కారం.

సకలాకలరూపాయ శంభవే గురవే నమః ।
ఇతి స్తుత్వా గురుం పద్యైర్బ్రహ్మా విష్ణుశ్చ నేమతుః ॥31॥

సాకార, నిరాకారరూపమైన శివగురువునకు నమస్కారం. ఈ విధంగా బ్రహ్మ, విష్ణువులు ఇద్దరు గురువగు శంభుని శ్లోకాలతో, ప్రార్థించి, నమస్కారం చేశారు.

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు పలికాడు.

వత్సకౌ సర్వతత్త్వం చ కథితం దర్శితం చ వామ్ ।
జపతం ప్రణవం మంత్రం దేవీదిష్టం మదాత్మకమ్ ॥32॥

కుమారులారా! నేను మీకు తత్త్వాన్ని పూర్తిగా బోధించి, నా స్వరూపాన్ని చూపించాను. మీరు దేవిచే ఉపదేశింపబడిన నా రూపమైన ఓంకారమంత్రాన్ని జపించండి.

జ్ఞానం చ సుస్థిరం భాగ్యం సర్వం భవతి శాశ్వతమ్ ।
ఆర్ద్రాయాం చ చతుర్దశ్యాం తజ్జాప్యం త్వక్షయం భవేత్ ॥33॥

ఓంకారజపం వల్ల స్థిరమైన జ్ఞానం, శాశ్వతమైన అన్ని భాగ్యాలు కలుగుతాయి. ఆరుద్రానక్షత్రంతో కూడిన చతుర్దశినాడు జపిస్తే మీకు తరిగిపోని ఫలాలు అందుతాయి.

సూర్యగత్యా మహార్ద్రాయామేకం కోటిగుణం భవేత్ ।
మృగశీర్షాంతిమో భాగః పునర్వస్వాదిమస్తథా ॥34॥

సూర్యుడు మహా ఆరుద్రానక్షత్రంలోకి వచ్చినపుడు చేసిన ఓంకారజపానికి కోటిరెట్లు ఫలం వస్తుంది. అలాగే మృగశిరనక్షత్రం నాల్గవపాదం, పునర్వసునక్షత్రం మొదటిపాదం కూడా ..

ఆర్ద్రాసమస్సదాజ్ఞేయః పూజాహోమాదితర్పణే ।
దర్శనం తు ప్రభాతే చ ప్రాతః సంగవకాలయోః ॥35॥

పూజ, హోమం, తర్పణం మొదలైన వాటితో ఆరుద్రనక్షత్రం సమానమైన దని, గొప్పదని తెలుసుకోండి. ఉషఃకాలంలోను, ప్రొద్దున సమయంలోను, మధ్యాహ్నసమయానికి ముందు సమయంలోను (సంగవకాలం), నన్ను దర్శించుకోవాలి.

చతుర్దశీ తథా గ్రాహ్యా నిశీథవ్యాపినీ భవేత్ ।
ప్రదోషవ్యాపినీ చైవ పరయుక్తా ప్రశస్యతే ॥36॥

రాత్రిసమయంలో కాని, లేదా ప్రదోషసమయంలో కాని ఉన్న చతుర్దశి తరువాతి తిథితో కలసి ఉన్న కాలంలో నన్ను దర్శించుకుంటే అది ప్రశస్తమైనది అవుతుంది.

లింగం బేరం చ మే తుల్యం యజతాం లింగముత్తమమ్ ।
తస్మాల్లింగం పరం పూజ్యం బేరాదపి ముముక్షుభిః ॥37॥

నా మూర్తిరూపం, లింగరూపం రెండూ సమానమైనవే. కాని లింగార్చన ఉత్తమమైనది. మోక్షం కావాలనుకునే వారికి మూర్తిరూపార్చన కంటె లింగారాధన ఉత్తమమైనది.

లింగమోంకారమంత్రేణ బేరం పంచాక్షరేణ తు ।
స్వయమేవ హి ద్రవ్యైశ్చ ప్రతిష్ఠాప్యం పరైరపి ॥38॥

నన్ను పూజించేవాడు లింగాన్ని ఓంకారమంత్రంతో, మూర్తిని పంచాక్షరితో పూజించాలి. పూజ చేసే వారు సొంతద్రవ్యాలతో లింగాన్ని ప్రతిష్ఠించుకోవాలి. ఇతరులచే కూడా ప్రతిష్ఠించేలా చేయాలి.

పూజయేదుపచారైశ్చ మత్పదం సులభం భవేత్ ।
ఇతి శాస్య తదా శిష్యౌ తత్రైవాంఽ తర్హితః శివః ॥39॥

ప్రతిష్ఠించిన శివలింగాన్ని వివిధవస్తువులతో, సేవలతో పూజిస్తే, నా స్థానం (ప్రదేశానికి) చేరుట తేలికగా జరుగుతుంది. ఈ విధంగా శివుడు శిష్యులను శాసించి, అక్కడనుండి మాయమయ్యాడు.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం పంచకృత్య - ప్రణవ - పంచాక్షరీ నామ దశమోఽధ్యాయః ॥10॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు పంచకృత్యములు - ప్రణవము - పంచాక్షరి అను పేరు గల పదవ అధ్యాయం సమాప్తం.

ఏకాదశో౽ధ్యాయః - పదకొండవ అధ్యాయం

లింగప్రతిష్ఠ - ప్రణవః - పంచాక్షరీ - లింగప్రతిష్ఠ - ప్రణవం - పంచాక్షరి

ఋషయ ఉవాచ - ఋషులు అన్నారు.

కథం లింగం ప్రతిష్ఠాప్యం కథం వా తస్య లక్షణమ్ ।
కథం వా తత్సమభ్యర్చ్యం దేశే కాలే చ కేన హి ॥1॥

లింగాన్ని ఏ విధంగా ప్రతిష్ఠించాలి? లింగానికి ఉండవలసిన లక్షణాలేంటి? దాన్ని ఎలా పూజించాలి? ఏ ప్రాంతంలో, ఏ కాలంలో, ఎలా పూజించాలి?

సూత ఉవాచ - సూతుడు చెప్పాడు.

యుష్మదర్థం ప్రవక్ష్యామి బుధ్యంతామవధానతః ।
అనుకూలే శుభే కాలే పుణ్యేతీర్థే తటే తథా ॥2॥

యథేష్టం లింగమారోప్యం యత్ర స్యాన్నిత్యమర్చనమ్ ।
పార్థివేన తథాప్యేనం తైజసేన యథా రుచి ॥3॥

మీకు ఈ విషయాలన్నీ చెబుతాను. సావధానంగా వినండి. అనుకూలమైన శుభసమయంలో పుణ్యతీర్థంలో నదికి ఒడ్డున మట్టిలింగము మరియు తేజోలింగాలలో నచ్చిన లింగాన్ని ప్రతిష్ఠ చేసి, ప్రతిరోజు పూజించాలి.

కల్పలక్షణసంయుక్తం లింగం పూజాఫలం లభేత్ ।
సర్వలక్షణసంయుక్తం సద్యః పూజాఫలప్రదమ్ ॥4॥

కల్పలక్షణాలతో ఉన్న శివలింగాన్ని పూజిస్తే పూజాఫలం అందుతుంది. అన్ని మంచి లక్షణాలు గల లింగాన్ని పూజిస్తే పూజాఫలం వెంటనే వస్తుంది.

చరే విశిష్యతే సూక్ష్మం స్థావరే స్థూలమేవ హి ।
సలక్షణం సపీఠం చ స్థాపయేచ్ఛివనిర్మితమ్ ॥5॥

కదిలించటానికి, మార్చుటకు వీలగునట్లు చిన్న లింగాన్ని, అలా కాకుంటే పెద్ద లింగాన్ని ఎంచుకోవాలి. అన్ని మంచి లక్షణాలున్న లింగాన్ని పీఠంతో సహా నిర్మించాలి.

మండలం చతురస్రం వా త్రికోణమథవా తథా ।
ఖట్వాంగవన్మధ్యసూక్ష్మం లింగపీఠం మహాఫలమ్ ॥6॥

లింగపీఠం (క్రింది భాగం) గుండ్రంగా కాని, చతురస్రంగా గాని, త్రికోణరూపంలో కాని, లేదా మంచం కోడు వలె మధ్యలో పలుచగా గాని ఉంటే మహాఫలములు కలుగుతాయి.

ప్రథమం మృచ్ఛిలాదిభ్యో లింగం లోహాదిభిః కృతమ్ ।
యేన లింగం తేన పీఠం స్థావరే హి విశిష్యతే ॥7॥

ముందుగా లింగాన్ని మట్టితో గాని, రాతితో గాని, లోహాలతో గాని తయారుచేసుకోవాలి, లింగం దేనితో తయారు చేయబడిందో, పీఠం కూడ దానితో చేయబడితే విశిష్టమైనదవుతుంది.

లింగం పీఠం చరే త్వేకం లింగం బాణకృతం వినా ।
లింగప్రమాణం కర్తౄణాం ద్వాదశాంగులముత్తమమ్ ॥8॥

చలప్రతిష్ఠవిషయంలో కూడా లింగాన్ని, పీఠాన్ని ఒకే పదార్థంతో తయారు చేయాలి. బాణలింగవిషయంలో ఈ నియమం అవసరం లేదు. లింగము పూజాకర్తలు చేయు పన్నెండు అంగుళాల పరిమాణంతో ఉన్నచో ఉత్తమం.

న్యూనం చేత్ఫలమల్పం స్యాదధికం నైవ దూష్యతే ।
కర్తురేకాంగులన్యూనం చరేపి చ తథైవ హి ॥9॥

లింగం పరిమాణం అంతకన్నా చిన్నదైతే ఫలితాలు తగ్గుతాయి. కాని ఎక్కువగా ఉంటే తప్పు లేదు. చల ప్రతిష్ఠలో లింగం పరిమాణం ఒక్క అంగుళమంత తక్కువగా కూడా ఉండవచ్చును.

ఆదౌ విమానం శిల్పేన కార్యం దేవగణైర్యుతమ్ ।
తత్ర గర్భగృహే రమ్యే దృఢే దర్పణసన్నిభే ॥10॥

ముందుగా శిల్పశాస్త్రం ప్రకారంగా గుడిని కట్టాలి. దానిపై దేవతల మూర్తులు ఉంచాలి. దానిలో అందంగా, గట్టిగా అద్దంలా చక్కగా ఉండే గర్భగుడిని కట్టాలి.

భూషితే నవరత్నైశ్చ దిగ్ద్వారే చ ప్రధానకైః ।
నీలం రక్తం చ వైదూర్యం శ్యామం మరకతం తథా ॥11॥

ముక్తాప్రవాలగోమేధవజ్రాణినవరత్నకమ్ ।
మధ్యే లింగం మహత్ ద్రవ్యం నిక్షిపేత్సహవేదికే ॥12॥

ఆ గుడికి నాలుగు దిక్కులలో అలంకరించిన ద్వారాలుండాలి. లింగాన్ని ప్రతిష్ఠించే చోట నీలం, రక్తం రంగు గల రత్నం, వైడూర్యం, నలుపు నీలం కలిసిన రత్నం, మరకతం (ఆకుపచ్చ) ఇంకా ముత్యం, పగడం, గోమేధికం, వజ్రం వంటి తొమ్మిది రత్నాలను ఇతర గొప్ప వస్తువులను వేదమంత్రాలతో ఆ చోటులో ఉంచాలి.

సంపూజ్య లింగం సద్యాద్యైః పంచస్థానే యథా క్రమమ్ ।
అగ్నౌ చ హుత్వా బహుధా హవిషా సకలం చ మామ్ ॥13॥

సద్యోజాతాదిమంత్రాలతో లింగాన్ని వరుసగా అయిదు స్థానములందు పూజించాలి. హవిస్సుతో అగ్నిహోత్రంలో అందరు దేవతలకు, సాకారరూపమైన నాకు హోమం చేయాలి.

అభ్యర్చ్య గురుమాచార్యమర్ఘైః కామైశ్చ బాంధవమ్ ।
దద్యాదైశ్వర్యమర్థిభ్యో జడమప్యజడం తథా ॥14॥

పురోహితునికి, ఆచార్యునికి దక్షిణలను ఇవ్వాలి. బంధుజనుల కోర్కెలు తీర్చి, జడసంపదలు అనగా ధన, సంపదలను, అజడములైన ధాన్య, పశువులను దానం చేయాలి.

స్థావరం జంగమం జీవం సర్వం సంతోష్య యత్నతః ।
సువర్ణపూరితే శ్వభ్రే నవరత్నైశ్చ పూరితే ॥15॥

అన్నిప్రాణులను ప్రయత్నంతో సంతోషపెట్టాలి. బంగారం, నవరత్నాలతో శివలింగప్రాంతాన్ని నింపాలి.

సద్యాదిబ్రహ్మ చోచ్చార్య ధ్యాత్వా దేవం పరం శుభమ్ ।
ఉదీర్య చ మహామంత్రమోంకారం నాదఘోషితమ్ ॥16॥

సద్యోజాతాది మంత్రాలను చదివి, మహాదేవుని ధ్యానం చేసి, ఓంకారమంత్రాన్ని జపించి, శంఖనాదం చేయాలి.

లింగం తత్ర ప్రతిష్ఠాప్య లింగం పీఠేన యోజయేత్ ।
లింగం సపీఠం నిక్షిప్య నిత్యలేపేన బంధయేత్ ॥17॥

ఆ విధంగా లింగాన్ని ప్రతిష్ఠించి పీఠంతో జత పర్చాలి. పీఠంతోసహా లింగాన్ని ఆ ప్రదేశంలో ఉంచి, తర్వాత గట్టిదనం కోసం లేపంతో లింగపీఠాలను స్థిరంగా ఉండేలా కట్టాలి.

ఏవం బేరం చ సంస్థాప్య తత్రైవ పరమం శుభమ్ ।
పంచాక్షరేణ బేరం తు ఉత్సవార్థం బహిస్తథా ॥18॥

అదే సమయంలో ఉత్సవాల కోసం మంగళకరుడైన శివునిమూర్తిని బయట పంచాక్షరితో ఉంచాలి,

బేరం గురుభ్యో గృహ్ణీయాత్సాధుభిః పూజితం తు వా ।
ఏవం లింగే చ బేరే చ పూజా శివపదప్రదా ॥19॥

ఆ శివమూర్తిని గురువులనుండి తెచ్చుకోవాలి. లేదా సాధుపురుషులు పూజించిన మూర్తిని గ్రహించాలి. ఈ విధంగా లింగ, మూర్తులను పూజిస్తే శివపదం లభిస్తుంది.

పునశ్చ ద్వివిధం ప్రోక్తం స్థావరం జంగమం తథా ।
స్థావరం లింగమిత్యాహుస్తరుగుల్మాదికం తథా ॥20॥

ఇంతే కాకుండా, లింగాలు రెండు రకాలని చెప్పబడ్డాయి. ఒకటి స్థావరం. రెండోది జంగమం. చెట్లు, తీగలు మొదలగు వాటిని స్థావరలింగం అంటారు.

జంగమం లింగమిత్యాహుః క్రిమికీటాదికం తథా ।
స్థావరస్య చ శుశ్రూషా జంగమస్య చ తర్పణమ్ ॥21॥

క్రిములు, కీటకాలకు జంగమం అని పేరు. స్థావరలింగానికి ఉపచారాలతో, సేవ చేయాలి, జంగమలింగాన్ని తర్పణంతో సేవించాలి.

తత్తత్సుఖానురాగేణ శివపూజాం విదుర్బుధాః ।
పీఠమంబామయం సర్వం శివలింగం చ చిన్మయమ్ ॥22॥

ఈ విధంగా ప్రేమతో వాటిని సుఖపెట్టడం శివపూజ అవుతుందని పండితులు చెప్పారు. అన్ని చోట్ల పీఠం దేవీస్వరూపం. శివలింగం చిద్రూపం.

యథాదేవీముమామంకే ధృత్వా తిష్ఠతి శంకరః ।
తథాలింగమిదం పీఠం ధృత్వా తిష్ఠతి సంతతమ్ ॥23॥

ఏ విధంగా శంకరుడు ఉమాదేవిని అంకంపై కూర్చుండబెట్టుకొంటాడో ఆ విధంగా ఈ లింగం ఎపుడూ పీఠాన్ని తోడుగా ధరించి ఉంటుంది.

ఏవం స్థాప్య మహాలింగం పూజయేదుపచారకైః ।
నిత్యపూజా యథాశక్తి ధ్వజాదికరణం తథా ॥24॥

ఈ విధంగా గొప్పదైన లింగాన్ని స్థాపించి, నిత్యం ఉపచారాలు, పూజలు చేయాలి. వీటితో పాటు యథాశక్తిగా ధ్వజారోహణ మొదలైన ఉత్సవాలు చేయాలి.

ఇతి సంస్థాపయేల్లింగం సాక్షాచ్ఛివపదప్రదమ్ ।
అథవా చరలింగం తు షోడశైరుపచారకైః ॥25॥

పూజయేచ్చ యథాన్యాయం క్రమాచ్ఛివపదప్రదమ్ ।
ఆవాహనం చాసనం చ అర్ఘ్యం పాద్యం తథైవ చ ॥26॥

తదంగాచమనం చైవ స్నానమభ్యంగపూర్వకమ్ ।
వస్త్రం గంధం తథా పుష్పం ధూపం దీపం నివేదనమ్ ॥27॥

నీరాజనం చ తాంబూలం నమస్కారో విసర్జనమ్ ।
అథవాఽర్ఘ్యాదికం కృత్వా నైవేద్యాంతం యథావిధి ॥28॥

ఇటువంటి అచలలింగాలను మానవుడు ప్రతిష్ఠించటం వల్ల శివపదాన్ని పొందుతాడు. అట్లు కాకుండా చలప్రతిష్ఠను చేసి పదహారు ఉపచారములతో పూజ చేసినచో ఆ పూజల ఫలితంగా శివపదమును పొందుతాడు. ఆవాహనం. ఆసనం, అర్ఘ్యం, పాద్యం, ఆచమనం, అభ్యంగస్నానం, వస్త్రం, గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం, నీరాజనం, తాంబూలం, నమస్కారం, ఉద్వాసనం అనే 16 ఉపచారాలు లేదా అర్ఘ్యంతో మొదలు పెట్టి, నైవేద్యం వరకు యథావిధిగా చేయాలి.

అథాభిషేకం నైవేద్యం నమస్కారం చ తర్పణమ్ ।
యథాశక్తి సదా కుర్యాత్ క్రమాచ్ఛివపదప్రదమ్ ॥29॥

అభిషేకం, నైవేద్యం, నమస్కారం, తర్పణం వీటిని ప్రతిదినం యథాశక్తి చేస్తే, కాలక్రమంలో శివపదం లభిస్తుంది.

అథవా మానుషే లింగేప్యార్షే దైవే స్వయంభువి ।
స్థాపితేఽపూర్వకే లింగే సోపచారం యథా తథా ॥30॥

పూజోపకరణే దత్తే యత్కించిత్ఫలమశ్నుతే ।
ప్రదక్షిణానమస్కారైః క్రమాచ్ఛివపదప్రదమ్ ॥31॥

మరియు, ఇతరులచే, లేక ఋషులచే, లేదా దేవతలచే ప్రతిష్ఠించబడిన లింగాన్ని, లేదా స్వయంగా వెలసిన లింగాన్ని, లేదా సాధకుడు తాను స్వంతంగా ప్రతిష్ఠించిన నూతనలింగాన్ని పదహారు రకాల పూజలతో అర్చించినా అలాగే పూజాద్రవ్యాలను దానం చేసినా అటువంటి పుణ్యం వస్తుంది. ప్రదక్షిణలు, నమస్కారాలు చేస్తే కూడా శివపదం చేరుకుంటారు.

లింగం దర్శనమాత్రం వా నియమేన శివప్రదమ్ ।
మృత్పిష్టగోశకృత్ పుష్పైః కరవీరేణ వా ఫలైః ॥32॥

గుడేన నవనీతేన భస్మనాన్నైర్యథా రుచి ।
లింగం యత్నేన కృత్వాంతే యజేత్తదనుసారతః ॥ 33॥

ప్రతిరోజూ శివలింగాన్ని చూడటం వల్ల కూడా శివుని సాయుజ్యం దొరుకుతుంది. మట్టి, పిండి, ఆవుపేడ, పువ్వులు, గన్నేరుపువ్వులు, పండ్లు ఇంకా బెల్లం, వెన్న, విభూతి, అన్నం మొదలగు మనసుకు నచ్చిన వాటితో లింగాన్ని చేసి, మంచిప్రయత్నంతో యథాశక్తి పూజించాలి.

అంగుష్ఠాదావపి తథా పూజామిచ్ఛంతి కేచన ।
లింగకర్మణి సర్వత్ర నిషేధోఽస్తి న కర్హిచిత్ ॥34॥

చేతి బొటనవేలు మొదలగు లింగాకారవస్తువులతో పూజ చేయవచ్చని కొందరి మాట. లింగపూజలో ఇటువంటి ఆకారాలు గల వస్తువులు, ఇతర మార్గాలుగా ఉన్నాయి. కావున ఏమీ అభ్యంతరం లేదు.

సర్వత్ర ఫలదాతా హి ప్రయాసానుగుణం శివః ।
అథవా లింగదానం వా లింగమౌల్యమథాపి వా ॥35॥

లింగాన్ని గాని, లింగం యొక్క వెల (ధర)ను గాని దానం చేసినా, అన్ని సమయాలలో పూజ చేసినా తగినంత ఫలాన్ని ఇచ్చే వాడు శివుడే కదా!

శ్రద్ధయా శివభక్తాయ దత్తం శివపదప్రదమ్ ।
అథవా ప్రణవం నిత్యం జపేద్దశసహస్రకమ్ ॥36॥

శ్రద్ధగా శివభక్తునికి దానం చేయటం ద్వారా శివపదం లభిస్తుంది. లేదా ప్రతిరోజూ పదివేలసార్లు ఓంకార జపం చేయాలి,

సంధ్యయోశ్చ సహస్రం వా జ్ఞేయం శివపదప్రదమ్ ।
జపకాలే మకారాంతం మనశ్శుద్ధికరం భజేత్ ॥37॥

లేక రెండుసంధ్యలలో వేయి చొప్పున జపిస్తే, శివపదం లభిస్తుంది. మకారాంతమైన 'ఓమ్' కారాన్ని జపిస్తూ మనస్సు శుద్ధమౌతుంది.

సమాధౌ మానసం ప్రోక్తముపాంశు సార్వకాలికమ్ ।
సమానప్రణవం చేమం బిందునాదయుతం విదుః ॥38॥

ఓంకారజపాన్ని సమాధిలో మానసికంగానూ, ఇతర సమయాలలో మెల్లగా అంటే ఇతరులకు వినబడని విధంగా చేయాలి. బిందునాదాలతో కూడిన ఓంకారాన్ని సమానప్రణవం అంటారు.

అథ పంచాక్షరం నిత్యం జపేదయుతమాదరాత్ ।
సంధ్యయోశ్చ సహస్రం వా జ్ఞేయం శివపదప్రదమ్ ॥39॥

పంచాక్షరీమంత్రాన్ని ప్రతిరోజూ పదివేలసార్లు శ్రద్ధతో జపించాలి. రెండు సంధ్యలలో వేయి చొప్పున జపిస్తే శివపదం లభిస్తుంది.

ప్రణవేనాదిసంయుక్తం బ్రాహ్మణానాం విశిష్యతే ।
దీక్షాయుక్తం గురోర్గ్రాహ్యం మంత్రం హ్యథ ఫలాప్తయే ॥40॥

బ్రాహ్మణులు పంచాక్షరిని జపించేటపుడు ముందు ఓంకారాన్ని కలిపి, జపించుట ఉత్తమం. మంత్రాన్ని గురువు నుండి దీక్షతో తీసుకొని చేస్తే ఫలితం వస్తుంది.

కుంభస్నానం మంత్రదీక్షా మాతృకా న్యాసమేవ చ ।
బ్రాహ్మణస్సత్యపూతాత్మా గురుఃజ్ఞానీ విశిష్యతే ॥41॥

కుండనీటితో స్నానం, మంత్రదీక్ష, మంత్రవర్ణములతో అంగాదిన్యాసం, సత్యంతో పవిత్రమైన మనసు గల బ్రాహ్మణుడు, జ్ఞానియైన గురువు ఉత్తమమైనవారు (మంచివి)

ద్విజానాం చ నమః పూర్వమన్యేషాం చ నమోంతకమ్ ।
స్త్రీణాం చ క్వచిదిచ్ఛంతి నమోంతం చ యథావిధి ॥42॥

పంచాక్షరిని బ్రాహ్మణులు నమఃశివాయ అని, ఇతరులు శివాయ నమః అని జపించాలి. స్త్రీలు కూడా నమః చివరగా జపించాలని కొంతమంది ఋషుల అభిప్రాయం.

విప్రస్త్రీణాం నమః పూర్వమిదమిచ్ఛంతి కేచన ।
పంచకోటిజపం కృత్వా సదాశివసమో భవేత్ ॥43॥

బ్రాహ్మణస్త్రీలు నమశ్శివాయ అని జపించాలని మరికొందరి అభిప్రాయం. అయిదుకోట్లసార్లు జపిస్తే సదాశివునితో సమానడౌతాడు.

ఏకద్విత్రిచతుః కోట్యా బ్రహ్మాదీనం పదం వ్రజేత్ ।
జపేదక్షరలక్షం వా అక్షరాణాం పృథక్ పృథక్ ॥44॥

ఒకటి, రెండు, మూడు, నాలుగుకోట్లు జపిస్తే క్రమంగా బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వర పదములు లభిస్తాయి. ఒక్కొక్క అక్షరాన్ని వేర్వేరుగా అక్షరలక్షలు జపించాలి.

అథవాక్షరలక్షం వా జ్ఞేయం శివపదప్రదమ్ ।
సహస్రం తు సహస్రాణాం సహస్రేణ దినేన హి ॥45॥

జపేన్మంత్రాదిష్టసిద్ధిర్నిత్యం బ్రాహ్మణభోజనాత్ ।
అష్టోత్తరసహస్రం వై గాయత్రీం ప్రాతరేవ హి ॥46॥

లేదా మంత్రాన్ని అక్షరలక్షలు జపిస్తే శివపదం లభిస్తుంది. ప్రతిరోజూ వేయి చొప్పున వేయిరోజులు జపించి, తర్వాత నిత్యం బ్రాహ్మణులకు భోజనం పెడితే కోరుకున్నవి జరుగుతాయి. ప్రతిరోజూ ఉదయమే బ్రాహ్మణుడు 108 సార్లు గాయత్రిని చేయాలి.

బ్రాహ్మణస్తు జపేన్నిత్యం క్రమాచ్ఛివపదప్రదాన్ ।
వేదమంత్రాంస్తు సూక్తాని జపేన్నియమమాస్థితః ॥47॥

బ్రాహ్మణుడు గాయత్రిని చేసిన తర్వాత శివపదాన్ని ఇచ్చే వేదమంత్రాల్ని, సూక్తుల్ని నియమంతో జపించాలి.

ఏకం దశార్ణం మంత్రం చ శతోనం చ తదూర్ధ్వకమ్ ।
ఆయుతం చ సహస్రం చ శతమేకం వినా భవేత్ ॥48॥

ఒక అక్షరంతో, పది అక్షరాలతో, తొంబై తొమ్మిది అక్షరాలతో, వందకు మించిన అక్షరాలతో, తొమ్మిదివేల తొమ్మిదివందలతొంభైతొమ్మిది అక్షరాలతో, తొమ్మిదివందలతొంభైతొమ్మిదిఅక్షరాలతో, కలిగిన మంత్రాలున్నాయి.

వేదపారాయణం చైవ జ్ఞేయం శివపదప్రదమ్ ।
అన్యాన్ బహుతరాన్మంత్రాన్ జపేదక్షరలక్షతః ॥49॥

వేదాన్ని చదవటం వలన శివపదం వస్తుందని తెలుసుకోవాలి. ఇంకా అనేకమంత్రాలను అక్షరలక్షలుగా జపించాలి.

ఏకాక్షరాంస్తథా మంత్రాన్ జపేదక్షరకోటితః ।
తతః పరం జపేచ్చైవ సహస్రం భక్తిపూర్వకమ్ ॥50॥

ఒకే అక్షరం గల మంత్రాలను ఒకకోటి జపం చేయాలి. ఆ తర్వాత భక్తితో ప్రతిదినం వేయి జపాన్ని చేయాలి.

ఏవం కుర్యాద్యథాశక్తి క్రమాచ్ఛివపదం లభేత్ ।
నిత్యం రుచికరం త్వేకం మంత్రమామరణాంతికమ్ ॥51॥

ఈ విధంగా యథాశక్తితో జపాన్ని చేస్తే కాలం గడచిన తర్వాత శివపదం లభిస్తుంది. మనస్సుకి నచ్చిన ఒక మంత్రాన్ని ఓంకారంతో కలిపి, చనిపోయేవరకు ప్రతిరోజూ చేస్తుండాలి.

జపేత్సహస్రమోమితి సర్వాభీష్టం శివాజ్ఞయా ।

వేయిసార్లు జపం చేస్తే శివుని ఆజ్ఞతో అన్ని కోరికలు తీరుతాయి.

పుష్పారామాదికం వాపి తథా సంమార్జనాదికమ్ ॥52॥

శివుని కోసం పూలతోటలు పెంచటం వలన, శివాలయంలో కడిగి, తుడిచి శుభ్రం చేయటం వల్ల సాధకునకు శివపదం లభిస్తుంది. ఇవన్నీ శివకార్యం కోసం, శివునికోసం ఉద్దేశించినవే. సాధకులు భక్తితో శివక్షేత్రంలో నివసించాలి.

శివాయ శివకార్యార్థే కృత్వా శివపదం లభేత్ ।
శివక్షేత్రే తథా వాసం నిత్యం కుర్యాచ్చ భక్తితః ॥53॥

జడానామజడానాం చ సర్వేషాం భుక్తిముక్తిదమ్ ।
తస్మాద్వాసం శివక్షేత్రే కుర్యాదామరణం బుధః ॥54॥

లింగాద్ధస్తశతం పుణ్యం క్షేత్రే మానుషకే విదుః ।
సహస్రారత్నిమాత్రం తు పుణ్యక్షేత్రే తథార్షకే ॥55॥

దైవలింగే తథా జ్ఞేయం సహస్రారత్నిమానతః ।
ధనుష్ప్రమాణసాహస్రం పుణ్యం క్షేత్రే స్వయంభువి ॥56॥

శివక్షేత్రంలో నివసించటం వల్ల, చెట్లు, తీగలు వంటి స్థావరాలకు, జంతువులు, మనుష్యులవంటి జంగమాలకు భుక్తి, ముక్తి కూడా లభిస్తుంది. కావున మరణించే వరకు పండితుడు శివక్షేత్రంలో నివసించాలి. మానవుడు నిర్మించిన శివక్షేత్రంలో లింగం నుండి ఉన్న వందబారల దూరం వరకు, ఋషి నిర్మించిన క్షేత్రంలో వేయి మూరలదూరం వరకు దేవతలు నిర్మించిన క్షేత్రంలో కూడా వేయిమూరల వరకు, అలాగే స్వయంగా వెలసిన క్షేత్రంలో వేయివిల్లుల (ధనుస్సు) ధనుస్సు= 4 మూరలు అనగా 4000 మూరల దూరం వరకు పవిత్రభూమియని పండితులు చెప్పారు.

పుణ్యక్షేత్రే స్థితా వాపీకూపాద్యం పుష్కరాణి చ ।
శివగంగేతి విజ్ఞేయం శివస్య వచనం యథా ॥57॥

పుణ్యక్షేత్రాలలో గల నూతులు, సరస్సులు మొదలైనవి శివగంగయని తెలుసుకోవాలని శివుడు చెప్పాడు.

తత్ర స్నాత్వా తథా దత్వా జపిత్వా హి శివం వ్రజేత్ ।
శివక్షేత్రం సమాశ్రిత్య వసేదామరణం తథా ॥58॥

వాటిలో స్నానం చేసి, దానం చేసి, జపం చేసిన వాడు శివుని పొందుతాడు. మనిషి చనిపోయేవరకు శివక్షేత్రాన్ని ఆశ్రయంగా చేసుకొని జీవించాలి.

దాహం దశాహం మాస్యం వా సపిండీకరణం తు వా ।
ఆబ్దికం వా శివక్షేత్రే క్షేత్రే పిండమథాపి వా ॥59॥

సర్వపాపవినిర్ముక్తస్సద్యశ్శివపదం లభేత్ ।
అథవా సప్తరాత్రం వా వసేద్వా పంచరాత్రకమ్ ॥ 60॥

త్రిరాత్రమేకరాత్రం వా క్రమాచ్ఛివపదం లభేత్ ।
స్వవర్ణానుగుణం లోకే స్వాచారాత్ప్రాప్నుతే నరః ॥61॥

మరణించిన మనిషిశరీరాన్ని శివక్షేత్రంలో కాల్చటం, లేక పదవరోజు కర్మను చేయటం, లేదా మాసికం పెట్టటం, లేక సపిండీకరణం, లేక ఆబ్దికం పెట్టటం, లేక పిండదానం చేయటం వల్ల ఆ జీవుడు వెంటనే పాపాలన్నింటి నుండి విముక్తి పొంది శివపదం చేరుతాడు. శివక్షేత్రంలో ఏడురాత్రులు కాని, అయిదురాత్రులు కాని మూడురాత్రులు కాని, ఒకరాత్రి కాని, నివసించినచో కాలక్రమంలో శివపదం లభిస్తుంది. మానవుడు లోకంలో వంశానుగుణమైన ఆచారాన్ని ఆచరిస్తే శివపదాన్ని పొందుతాడు.

వర్ణోద్ధారేణ భక్త్యా చ తత్ఫలాతిశయం నరః ।
సర్వం కృతం కామనయా సద్యః ఫలమవాప్నుయాత్ ॥62॥

వంశోద్ధరణ కొరకు భక్తితో పాటిస్తే గొప్పదైన ఫలాలు పొందుతారు. కోరికతో శివపూజ చేస్తే వెంటనే ఫలం లభిస్తుంది.

సర్వం కృతమకామేన సాక్షాచ్ఛివపదప్రదమ్ ।
ప్రాతర్మధ్యాహ్నసాయాహ్నమహస్త్రిష్వేకతః క్రమాత్ ॥63॥

కాని కోరికలు లేకుండా చేసినచో శివపదం లభిస్తుంది. ప్రొద్దున, మధ్యాహ్నం, సాయంత్రం అని రోజు మూడుభాగాలుగా ఉంది.

ప్రాతర్విధికరం జ్ఞేయం మధ్యాహ్నం కామికం తథా ।
సాయాహ్నం శాంతికం జ్ఞేయం రాత్రావపి తథైవ హి ॥64॥

ఉదయకాలంలో ప్రతిరోజూ విధిగా చేయవలసిన కర్మలకు, మధ్యాహ్నసమయం కోరికలకు సంబంధించిన కర్మలకు, సాయంకాలం శాంతిసంబంధకర్మలకు సరియైన కాలమని తెలుసుకోవాలి. రాత్రి సమయాలలో కూడా ఇలాంటి భాగాలు ఉన్నాయి.

కాలో నిశీథో వై ప్రోక్తో మధ్యయామద్వయం నిశి ।
శివపూజా విశేషేణ తత్కాలే ఽభీష్టసిద్ధిదా ॥65॥

రాత్రిసమయంలో మధ్యభాగంలో గల రెండు జాముల సమయాన్ని నిశీథికాలం అంటారు. ఆ సమయంలో శివపూజ చేస్తే, ప్రత్యేకంగా కోరికలన్నీ తీరుతాయి.

ఏవం జ్ఞాత్వా నరః కుర్వన్ యథోక్తఫలభాగ్భవేత్ ।
కలౌ యుగే విశేషేణ ఫలసిద్ధిస్తు కర్మణా ॥66॥

ఈ విషయాలను తెలుసుకొని ఆచరించిన వారికి పైన చెప్పిన ఫలితాలు వస్తాయి. ముఖ్యంగా కలియుగంలో కర్మవల్లనే ఫలితాలు వస్తాయి.

ఉక్తేన కేనచిద్వాపి అధికారవిభేదతః ।
సద్వృత్తిః పాపభీరుశ్చేత్తత్తత్ఫలమవాప్నుయాత్ ॥67॥

మనుషులు ధర్మవిధానం కలిగి, పాపం చేయుటయందు భయం కలిగి, వారికున్న అధికారాలనుబట్టి పైన చెప్పినవాటిలో ఏదో ఒక పద్ధతిని అనుసరిస్తే ఆ రకమైన ఫలితాలు పొందుతారు.

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

అథ క్షేత్రాణి పుణ్యాని సమాసాత్కథయస్వ నః ।
సర్వాః స్త్రియశ్చ పురుషా యాన్యాశ్రిత్య పదం లభేత్ ॥68॥

సూత యోగివరశ్రేష్ఠ శివక్షేత్రాగమాంస్తథా ।

ఓ సూతమహామునీ! నువ్వు యోగులలో గొప్పవాడివి. పుణ్యక్షేత్రాల గురించి వివరంగా చెప్పు. స్త్రీ పురుషులందరు వాటిని విని శివపదాన్ని చేరుతారు.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

శృణుత శ్రద్ధయా సర్వక్షేత్రాణి చ తదాగమాన్ ॥69॥

శివక్షేత్రాల గురించి వాటి ఆగమాల గురించి శ్రద్ధగా వినండి.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం లింగప్రతిష్ఠ – ప్రణవః – పంచాక్షరీ నామ ఏకాదశోఽధ్యాయః ॥11॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు లింగప్రతిష్ఠ – ప్రణవము – పంచాక్షరి అనే పదకొండవ అధ్యాయం సమాప్తం.

ద్వాదశోఽధ్యాయః - పన్నెండవ అధ్యాయం

తీర్థాని, క్షేత్రాణి - తీర్థములు, క్షేత్రములు

సూత ఉవాచ - సూతుడు ఇలా చెప్పాడు.

శృణుధ్వమృషయః ప్రాజ్ఞాశ్శివక్షేత్రం విముక్తిదమ్ ।
తదాగమాంస్తతో వక్ష్యే లోకరక్షార్థమేవ హి ॥1॥

ఓ పండితులైన ఋషులారా! నేను మోక్షాన్నిచ్చే శివక్షేత్రాల గురించి, మానవకల్యాణం కోసం శివుని రాకను గురించీ వివరిస్తాను వినండి.

పంచాశత్కోటివిస్తీర్ణా సశైలవనకాననా ।
శివాజ్ఞయా హి పృథివీ లోకం ధృత్వా చ తిష్ఠతి ॥2॥

యాభైకోట్ల యోజనాల విశాలంలో, పర్వతాలు, అడవులు కలిగిన భూమి శివుని ఆజ్ఞతో ప్రాణులను మోస్తోంది.

తత్ర తత్ర శివక్షేత్రం తత్ర తత్ర నివాసినామ్ ।
మోక్షార్థం కృపయా దేవః క్షేత్రం కల్పితవాన్ ప్రభుః ॥3॥

దయామయుడైన ఆ దేవుడు - మహాదేవుడు వివిధ ప్రాంతాలలో నివసించే జనులకు విముక్తిని కల్గించటం కోసం పుణ్యక్షేత్రాలను కల్పించాడు.

పరిగ్రహాదృషీణాం చ దేవానాం చ పరిగ్రహాత్ ।
స్వయంభూతాన్యథాన్యాని లోకరక్షార్థమేవ హి ॥4॥

ఋషులు నివసించటం వల్ల కొన్ని స్థలాలు, దేవతలు అనుగ్రహించటం వల్ల మరికొన్ని స్థలాలు, సహజంగా భూమిలో లింగాలు పుట్టినందు వల్ల ఇంకొన్ని క్షేత్రాలు వెలిసి మనుషులను రక్షిస్తున్నాయి.

తీర్థే క్షేత్రే సదా కార్యం స్నానదానజపాదికమ్ ।
అన్యథా రోగదారిద్ర్యమూకత్వాద్యాప్నుయాన్నరః ॥5॥

పుణ్యక్షేత్రాల్లో, తీర్థంలో ప్రతిరోజు స్నానం, దానం, జపం చేయాలి. అలా చేయని మనిషి రోగాన్ని, పేదరికం, మూగదనం లాంటి లోపాల్ని పొందుతాడు.

అథాస్మిన్ భారతే వర్షే ప్రాప్నోతి మరణం నరః ।
స్వయంభూస్థానవాసేన పునర్మానుష్యమాప్నుయాత్ ॥6॥

ఈ భరతఖండంలో స్వయంగా వెలసిన లింగక్షేత్రాల్లో చనిపోయిన మనిషికి మరల జన్మ ఉండదు.

క్షేత్రే పాపస్య కరణం దృఢం భవతి భూసురాః ।
పుణ్యక్షేత్రే నివాసే హి పాపమణ్వపి నాచరేత్ ॥7॥

ఓ బ్రాహ్మణులారా! పుణ్యక్షేత్రాల్లో చేసిన పాపానికి ఎక్కువ దోషం వస్తుంది. అందువలన అక్కడ నివసించే మనిషి చిన్నపాపం కూడా చేయకూడదు.

యేన కేనాప్యుపాయేన పుణ్యక్షేత్రే వసేన్నరః ।
సింధోశ్శతనదీతీరే సంతి క్షేత్రాణ్యనేకశః ॥8॥

కాబట్టి మనిషి ఏదో విధంగా ప్రయత్నించి, పుణ్యక్షేత్రంలో నివసించాలి. సింధునది దగ్గర, గంగానదీ ప్రాంతంలోను అనేక పుణ్యక్షేత్రాలున్నాయి.

సరస్వతీనదీ పుణ్యా ప్రోక్తా షష్టిముఖా తథా ।
తత్తత్తీరే వసేత్ప్రాజ్ఞః క్రమాద్బ్రహ్మపదం లభేత్ ॥9॥

అరవై ముఖాలతో (ధారలతో) ఉన్న సరస్వతీనది పవిత్రమైనది. తెలివి కలవాడు ఆ నదీతీరంలో నివసిస్తే క్రమంగా బ్రహ్మలోకాన్ని చేరుకుంటాడు.

హిమవద్గిరిజా గంగా పుణ్యా శతముఖా నదీ ।
తత్తీరే చైవ కాశ్యాదిపుణ్యక్షేత్రాణ్యనేకశః ॥10॥

వందముఖాలు గల పవిత్రగంగానది హిమాలయం నుండి పుట్టింది. గంగానదీతీరంలో కాశి మొదలైన పుణ్యక్షేత్రాలు అనేకం ఉన్నాయి.

తత్ర తీరం ప్రశస్తం హి మృగే మృగబృహస్పతౌ ।
శోణభద్రో దశముఖః పుణ్యోఽభీష్టఫలప్రదః ॥11॥

సూర్యుడు మకరరాశిలో ఉన్నపుడు అక్కడ నివసించటం మంచిది. అలాగే గురువు మకరరాశిలో ఉన్నపుడు శోణభద్రానది కోరిన ఫలితాలనిస్తుంది. శోణభద్రానదికి కూడా పదిముఖాలున్నాయి.

తత్ర స్నానోపవాసేన పదం వైనాయకం లభేత్ ।
చతుర్వింశముఖా పుణ్యా నర్మదా చ మహానదీ ॥12॥

తస్యాం స్నానేన వాసేన పదం వైష్ణవమాప్నుయాత్ ।

శోణభద్రానదిలో స్నానం చేసి, ఉపవాసం ఉంటే వినాయకపదం వస్తుంది. ఇరవైనాలుగుముఖాలుగల నర్మదానది మహాపవిత్రమైనది. నర్మదానదిలో స్నానం చేయడం వల్ల, నర్మదాతీరంలో నివసించడం వల్ల విష్ణుపదం పొందుతారు.

తమసా ద్వాదశముఖా రేవా దశముఖా నదీ ॥13॥

తమసానదికి పన్నెండుముఖాలు, రేవానదికి పదిముఖాలున్నాయి.

గోదావరీ మహాపుణ్యా బ్రహ్మగోవధనాశినీ ।
ఏకవింశముఖా ప్రోక్తా రుద్రలోకప్రదాయినీ ॥14॥

చాలా పవిత్రమైన గోదావరీనది బ్రహ్మహత్యాదోషం, ఆవును చంపిన దోషం పోగొడుతుంది. ఇరవైఒక్కముఖాలుగల గోదావరి రుద్రపదాన్ని ఇస్తుంది.

కృష్ణవేణీ పుణ్యనదీ సర్వపాపక్షయావహా ।
సాష్టాదశముఖా ప్రోక్తా విష్ణులోకప్రదాయినీ ॥15॥

పవిత్రమైన కృష్ణవేణీనది అన్ని పాపాల్ని పోగొడుతుంది. పద్దెనిమిదిముఖాలుగల కృష్ణవేణీనది విష్ణులోకాన్ని ఇస్తుంది.

తుంగభద్రా దశముఖా బ్రహ్మలోకప్రదాయినీ ।
సువర్ణముఖరీ పుణ్యా ప్రోక్తా నవముఖా తథా ॥16॥

పదిముఖాలుగల తుంగభద్రానది బ్రహ్మలోకాన్నిస్తుంది. పవిత్రమైన సువర్ణముఖీనదికి తొమ్మిదిముఖాలున్నాయి.

తత్రైవ సుప్రజాయంతే బ్రహ్మలోకచ్యుతాస్తథా ।
సరస్వతీ చ పంపా చ కన్యా శ్వేతనదీ శుభా ॥17॥

ఏతాసాం తీరవాసేన ఇంద్రలోకమవాప్నుయాత్ ।

బ్రహ్మలోకాన్ని విడిచిన జీవులు సువర్ణముఖీతీరంలో పుడతారు. సరస్వతీనది, పంపానది మంచినీటితో ఉండి మంగళాన్ని ఇస్తాయి. ఈ విధంగా కన్యానది మొదలగు నదీతీరాల్లో నివసిస్తే ఆ వ్యక్తి ఇంద్రలోకాన్ని చేరుకుంటాడు.

సహ్యాద్రిజా మహాపుణ్యా కావేరీతి మహానదీ ॥18॥

సహ్యాపర్వతం నుండి పుట్టిన కావేరినది చాలాగొప్పది. పవిత్రమైంది.

సప్తవింశముఖా ప్రోక్తా సర్వాభీష్టప్రదాయినీ ।
తత్తీరాః స్వర్గదాశ్చైవ బ్రహ్మవిష్ణుపదప్రదాః ॥19॥

శివలోకప్రదా శైవాస్తథాభీష్టఫలప్రదాః ।
నైమిషే బదరే స్నాయాన్మేషగే చ గురౌ రవౌ ॥20॥

అది ఇరవైఏడు పాయలు గలది. అన్ని కోరికలను తీర్చేది. ఆ కావేరీ తీరాలు స్వర్గాన్నీ, బ్రహ్మవిష్ణుస్థానాలనూ ఇవ్వగలవి. కోరుకున్న ఫలాలనిచ్చి, శివలోకాన్నిచ్చే శైవక్షేత్రాలు కావేరీనదీతీరంలో ఉన్నాయి. గురువు, సూర్యుడు మేషరాశిలో ఉన్నపుడు నైమిషంలో, బదరియందు స్నానం చేయాలి.

బ్రహ్మలోకప్రదం విద్యాత్తతః పూజాదికం తథా ।
సింధునద్యాం తథా స్నానం సింహే కర్కటగే రవౌ ॥21॥

అపుడు చేసిన పూజలవలన బ్రహ్మలోకం లభిస్తుంది. సూర్యుడు సింహరాశి, కర్కాటకరాశిలో ఉన్నపుడు సింధునదీ స్నానం చేయాలి.

కేదారోదకపానం చ స్నానం చ జ్ఞానదం విదుః ।
గోదావర్యాం సింహమాసే స్నాయాత్సింహబృహస్పతౌ ॥22॥

కేదారస్నానం వల్ల కేదారంలోని నీరు త్రాగటం వల్ల జ్ఞానం కలుగుతుంది. భాద్రపదమాసంలో గురువు సింహరాశిలో ఉన్నపుడు గోదావరిలో స్నానం చేయాలి.

శివలోకప్రదమితి శివేనోక్తం తథా పురా ।
యమునాశోణయోస్స్నానాద్గురౌ కన్యా గతే రవౌ ॥23॥

గురువు, రవి కన్యారాశిలో ఉన్నపుడు యమునా, శోణానదుల్లో స్నానం చేస్తే, శివలోకం వస్తుందని గతంలో శివుడు చెప్పాడు.

ధర్మలోకే దంతిలోకే మహాభోగప్రదం విదుః ।
కావేర్యాం చ తథా స్నాయాత్ తులాగే తు రవౌ గురౌ ॥24॥

సూర్యుడు, గురువు తులారాశిలో ఉన్నపుడు కావేరినదిలో స్నానం చేస్తే ధర్మలోకంలో, వినాయకలోకంలో మహాభోగాలు లభిస్తాయని ఋషులు చెప్పారు.

విష్ణోర్వచనమాహాత్మ్యాత్సర్వాభీష్టప్రదం విదుః ।
వృశ్చికే మాసి సంప్రాప్తే తథార్కే గురువృశ్చికే ॥25॥

మార్గశిరమాసంలో రవి, గురువు వృశ్చికరాశిలో ఉన్నపుడు విష్ణువచనమహిమ వల్ల కోరికలన్నీ తీరుతాయి అని ఋషులు చెప్పారు.

నర్మదాయాం నదీస్నానాద్విష్ణులోకమవాప్నుయాత్ ।
సువర్ణముఖరీ స్నానం చాపగే చ గురౌ రవౌ ॥26॥

శివలోకప్రదమితి బ్రహ్మణో వచనం యథా ।
మృగమాసి తథాస్నాయాజ్జాహ్నవ్యాం మృగగే గురౌ ॥27॥

గురువు, రవి ధనుస్సు రాశిలో ఉన్నపుడు సువర్ణముఖీనదిలో చేస్తే నర్మదానదిలో స్నానం చేస్తే విష్ణులోకం చేరుకుంటారు. సువర్ణముఖీ నదిలో స్నానం చేస్తే శివలోకం చేరు కుంటారు. అదేవిధంగా మాఘమాసంలో గురువు మకరరాశిలో ఉన్నపుడు గంగానదిలో స్నానం చేస్తే శివలోకం లభిస్తుందని బ్రహ్మ చెప్పాడు.

శివలోకప్రదమితి బ్రహ్మణో వచనం యథా ।
బ్రహ్మవిష్ణ్వోః పదే భుక్త్వా తదంతే జ్ఞానమాప్నుయాత్ ॥28॥

గంగాయాం మాఘమాసే తు తథా కుంభగతే రవౌ ।
శ్రాద్ధం వా పిండదానం వా తిలోదకమథాపి వా ॥29॥

వంశద్వయ పితౄణాం చ కులకోట్యుద్ధరం విదుః ।
కృష్ణవేణ్యాం ప్రశంసంతి మీనగే చ గురౌ రవౌ ॥30॥

అటువంటివారు బ్రహ్మలోక, విష్ణులోకాలను అనుభవించి, జ్ఞానాన్ని పొందిన తరువాత శివపదం పొందుతారని బ్రహ్మమాటలలోని అర్థం. మాఘమాసంలో రవి కుంభరాశిలో ఉండగా గంగలో శ్రాద్ధం గాని, పిండదానం గాని, తిలోదకమివ్వడం గాని చేస్తే రెండువంశాల తండ్రులు కోటితరాల వరకు ఉద్ధరింపబడతారని ఋషులు చెప్పారు. గురు, రవి ఇద్దరూ మీనరాశిలో ఉన్నపుడు కృష్ణానదిలో స్నానం మంచిదని గురువులుచెప్పారు.

తత్తత్తీర్థే చ తన్మాసి స్నానమింద్రపదప్రదమ్ ।
గంగాం వా సహ్యజాం వాపి సమాశ్రిత్య వసేద్బుధః ॥31॥

ఆయా మాసాలలో, ఆయా తీర్థాలలో స్నానం చేస్తే, ఇంద్రపదం వస్తుంది. పండితులు ఎపుడూ గంగాతీరంలోకాని, కావేరీతీరంలో కాని నివసించాలి.

తత్కాలకృతపాపస్య క్షయో భవతి నిశ్చితమ్ ।
రుద్రలోకప్రదాన్యేవ సంతి క్షేత్రాణ్యనేకశః ॥32॥

ఆ విధంగా చేస్తే, పాపాలు చేసిన వెంటనే నశిస్తాయనటంలో సందేహం లేదు. ఇంకా రుద్రలోకాన్నిచ్చే క్షేత్రాలు చాలా ఉన్నాయి.

తామ్రపర్ణీ వేగవతీ బ్రహ్మలోకఫలప్రదే ।
తయోస్తీరే హి సంత్యేవ క్షేత్రాణి స్వర్గదాని చ ॥33॥

తామ్రపర్ణి, వేగవతీనదులు బ్రహ్మలోకఫలాల్ని ఇస్తాయి. వాటి తీరంలో స్వర్గాన్నిచ్చే క్షేత్రాలున్నాయి.

సంతి క్షేత్రాణి తన్మధ్యే పుణ్యదాని చ భూరిశః ।
తత్ర తత్ర వసన్ ప్రాజ్ఞస్తాదృశం చ ఫలం లభేత్ ॥34॥

ఆ రెండునదుల మధ్యలో గొప్ప పుణ్యాన్నిచ్చే క్షేత్రాలున్నాయి. తెలివైన వారు ఆ క్షేత్రాలలో నివసించి గొప్ప ఫలాలను పొందుతారు.

సదాచారేణ సద్వృత్త్యా సదా భావనయాపి చ ।
వసేద్దయాలుః ప్రాజ్ఞో వై నాన్యథా తత్ఫలం లభేత్ ॥35॥

మానవుడు అన్నివేళలలో మంచిశీలం, మంచిప్రవర్తన, మంచి ఆలోచనలు, దయాగుణం కలవాడై క్షేత్రంలో నివసించాలి. అలా కాకున్నచో ఆయా క్షేత్రాలలో నివసించిన ఫలాలు లభించవు.

పుణ్యక్షేత్రే కృతం పుణ్యం బహుధా ఋద్ధిమృచ్ఛతి ।
పుణ్యక్షేత్రే కృతం పాపం మహదణ్వపి జాయతే ॥36॥

పుణ్యక్షేత్రంలో చేసిన పుణ్యం అనేకరెట్లు పెరుగుతుంది. పుణ్యక్షేత్రంలో చేసిన అణుమాత్రం పాపమైనా మహాపాపం అవుతుంది.

తత్కాలం జీవనార్థశ్చేత్పుణ్యేన క్షయమేష్యతి ।
పుణ్యమైశ్వర్యదం ప్రాహుః కాయికం వాచికం తథా ॥37॥

పుణ్యక్షేత్రనివాసం జీవనం గడపడం కోసమే అయితే నివాస పుణ్యం వెంటనే నశిస్తుంది. పుణ్యం వలన ఐశ్వర్యం వస్తుందని ఋషులు చెబుతుంటారు. ఇక్కడా పుణ్యమనగా శరీరంతో చేసిన, మాటతో చేసిన మరియు మనసుతో చేసిన పుణ్యమని అర్థం.

మానసం చ తథా పాపం తాదృశం నాశయేద్ద్విజాః ।
మానసం వజ్రలేపం తు కల్పకల్పానుగం తథా ॥38॥

అదే విధంగా చేసిన పాపం ఐశ్వర్యాన్ని నాశనం చేస్తుంది. మనసుతో చేసిన పాపం వజ్రలేపం లాగ మనసుని పట్టుకొని, యుగయుగాల వరకు వెంటాడుతుంది.

ధ్యానాదేవ హి తన్నశ్యేన్నాన్యథా నాశమృచ్ఛతి ।
వాచికం జపజాలేన కాయికం కాయశోషణాత్ ॥39॥

దానాద్ధనకృతం నశ్యేన్నాఽన్యథా కల్పకోటిభిః ।
క్వచిత్పాపేన పుణ్యం చ వృద్ధిపూర్వేణ నశ్యతి ॥40॥

ఆ పాపం ధ్యానం వల్ల మాత్రమే నశిస్తుంది. వేరే విధంగా చేయడం వల్ల అదినాశనం కాదు. ఎక్కువసార్లు జపం చేయటం వలన మాట్లాడటం వల్ల వచ్చిన పాపం నశిస్తుంది. శరీరాన్ని శుష్కింపచేసికోవడం వల్ల శరీరంతో చేసిన పాపం నశిస్తుంది. దానంవల్ల ధనం ద్వారా చేసిన పాపం నశిస్తుంది. ఈ పాపాలన్నీ కోటికల్పాల తరువాతైనా నశించటానికి వేరే దారి లేదు. ఒక్కొక్క సారి ఎక్కువ పాపాలు చేయటం వలన పుణ్యాలు కూడా నశిస్తాయి.

బీజాంశశ్చైవ వృద్ధ్యంశో భోగాంశః పుణ్యపాపయోః ।
జ్ఞాననాశ్యో హి బీజాంశో వృద్ధిరుక్తప్రకారతః ॥41॥

పుణ్యపాపాలు రెండింటికి బీజాంశం, వృద్ధి అంశం, భోగాంశం అనే మూడు భాగాలుంటాయి. పాపం యొక్క బీజాశం జ్ఞానం వల్ల, వృద్ధ్యంశం పైన చెప్పిన విధంగా నశిస్తాయి.

భోగాంశో భోగనాశ్యస్తు నాన్యథా పుణ్యకోటిభిః ।
బీజప్రరోహే నష్టే తు శేషో భోగాయ కల్పతే ॥42॥

పాపం యొక్క భోగాంశం అనుభవించడం వల్ల మాత్రమే నశిస్తుంది కాని కోటిపుణ్యాలు చేసినా నశించదు. పాపబీజాంశం నశించిన తర్వాత భోగాంశ మిగిలి ఉంటుంది.

దేవానాం పూజయా చైవ బ్రాహ్మణానాం చ దానతః ।
తపోధిక్యాచ్చ కాలేన భోగః సహ్యో భవేత్ నృణామ్ ॥
తస్మాత్పాపమకృత్వైవ వస్తవ్యం సుఖమిచ్ఛతా ॥43॥

దేవతలను పూజించటంవల్ల, బ్రాహ్మణులకు దానం చేయటం వల్ల, చాలా కాలం తపస్సు చేయటం వల్ల మానవులు పాపభోగాంశాన్ని అనుభవించడానికి సమర్థులౌతారు. కాబట్టి సుఖాలను కోరుకునే మనిషి పాపాలు చేయకుండానే జీవించాలి.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం తీర్థాని - క్షేత్రాణి నామ ద్వాదశోఽధ్యాయః ॥12॥

శ్రీ శివమహాపురాణములోని విద్యేశ్వర సంహితయందు తీర్థములు - క్షేత్రములు అనుపేరు గల పన్నెండవ అధ్యాయం సమాప్తం.

త్రయోదశోऽధ్యాయః - పదమూడవ అధ్యాయం

సదాచారః - శౌచం - ధర్మానుష్ఠానం - సదాచారం - శౌచం - ధర్మానుష్ఠానం

ఋషయ ఊచుః - ఋషులు పలికారు.

సదాచారం శ్రావయాశు యేన లోకాన్ జయేద్బుధః ।
ధర్మాధర్మమయాన్ బ్రూహి స్వర్గనారకదాంస్తథా ॥1॥

సదాచారం వల్ల వివేకంతో పుణ్యలోకాలను జయించగలడు. అలాంటి సదాచారం మాకు వెంటనే వినిపించండి. స్వర్గాన్నిచ్చే మంచి పనులను, నరకాన్నిచ్చే చెడు పనులను కూడా చెప్పండి.

సూత ఉవాచ - సూతుడు చెప్పాడు.

సదాచారయుతో విద్వాన్ బ్రాహ్మణో నామ నామతః ।
వేదాచారయుతో విప్రో హ్యేతైరేకైకవాన్ ద్విజః ॥2॥

మంచి ఆచారం గల విద్వాంసుణ్ణి బ్రాహ్మణుడని, వేదసంబంధమైనపనులను ఆచరించే వాడిని విప్రుడని, పేరు. మంచి ఆచారం, వేద, కర్మానుష్ఠానం అనే వాటిలో ఏదో ఒక గుణం కలవాడు ద్విజుడని అంటారు.

అల్పాచారోऽల్పవేదశ్చ క్షత్రియో రాజసేవకః ।
కించిదాచారవాన్ వైశ్యః కృషివాణిజ్యకృత్తయా ॥3॥

తక్కువ ఆచారం, తక్కువ వేదపఠనం కల్గి రాజసేవ చేయు బ్రాహ్మణుణ్ణి క్షత్రియబ్రాహ్మణులని పిలుస్తారు. కొద్ది ఆచారం కల్గి, వ్యవసాయ, వ్యాపారాలను చేసే బ్రాహ్మణుణ్ణి వైశ్యబ్రాహ్మణులంటారు.

శూద్రబ్రాహ్మణ ఇత్యుక్తః స్వయమేవ హి కర్షకః ।
అసూయాలుః పరద్రోహీ చండాలద్విజ ఉచ్యతే ॥4॥

స్వయంగా భూమిని దున్నే బ్రాహ్మణుణ్ణి శూద్రబ్రాహ్మణు డంటారు. ఇతరులపై అసూయ కలిగి, వారికి ద్రోహం చేసే బ్రాహ్మణుణ్ణి చండాలబ్రాహ్మణుడని అంటారు.

పృథివీపాలకో రాజా ఇతరే క్షత్రియా మతాః ।
ధాన్యాదిక్రయవాన్ వైశ్య ఇతరో వణిగుచ్యతే ॥5॥

భూమిని పాలించువాడిని రాజని, ఇతర రాజవంశీయుల్ని క్షత్రియులని పిలుస్తారు. ధాన్యం మొదలైన వాటిని అమ్మేవారిని వైశ్యులని, ఇతర వైశ్యవంశీయుల్ని వణిక్కు అని పిలుస్తారు.

బ్రహ్మక్షత్రియవైశ్యానాం శుశ్రూషుశ్శూద్ర ఉచ్యతే ।
కర్షకో వృషలో జ్ఞేయ ఇతరే చైవ దస్యవః ॥6॥

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు సేవ చేసే వాడు శూద్రుడని, వ్యవసాయం చేసేవారు కర్షకులని, మిగిలిన వాళ్లు దస్యులని తెలియాలి.

సర్వే హ్యుషః ప్రాచీముఖశ్చింతయేద్దేవపూర్వకాన్ ।
ధర్మానర్థాంశ్చ తత్ క్లేశానాయం చ వ్యయమేవ చ ॥7॥

వీళ్లందరూ సూర్యోదయానికి ముందే తూర్పువైపు తిరిగి పరమేశ్వరుని ధ్యానించి, ధర్మం, ధనం, అందులోని కష్టాలను, ఆదాయం, వ్యయం వాటి గురించి ఆలోచించాలి.

ఆయుర్ద్వేషశ్చ మరణం పాపం భాగ్యం తథైవ చ ।
వ్యాధిః పుష్టిస్తథా శక్తిః ప్రాతరుత్థానదిక్ఫలమ్ ॥8॥

ప్రొద్దున్నే నిద్రనుంచి లేచే సమయాన్నిబట్టి, పద్ధతినిబట్టి మనుషులకు ఆయుర్దాయం, ద్వేషం, మరణం, పాపం, సంపద, వ్యాధి, పుష్టి మరియు శక్తి అనే ఫలాలు కలుగుతాయి.

నిశాంత్యాయాముషా జ్ఞేయా యామార్థం సంధిరుచ్యతే ।
తత్కాలే తు సముత్థాయ విణ్మూత్రే విసృజేద్ద్విజః ॥9॥

రాత్రిలోని చివరిభాగాన్ని ఉషస్సు అని, దానిలోని సగభాగకాలానికి సంధి అని పేరు. ద్విజుడు ఆ సమయంలో లేచి, కాలకృత్యాలు తీర్చుకోవాలి.

గృహాద్దూరతతో గత్వా బాహ్యతః ప్రవృతస్తథా ।
ఉదఙ్ముఖః సమావిశ్య ప్రతిబంధేఽన్యదిఙ్ముఖః ॥10॥

ఇంటికి దూరంగా బయటికి వెళ్లి ఉత్తరముఖంలో కుర్చోవాలి. దానికి ఇబ్బంది అయితే వేరే దిక్కులు ముఖంలో కూర్చోవాలి.

జలాగ్ని బ్రాహ్మణాదీనాం దేవానాం నాభిముఖ్యతః ।
లింగం పిధాయ వామేన ముఖమన్యేన పాణినా ॥11॥

మలముత్సృజ్య చోత్థాయ న పశ్యేచ్చైవ తన్మలమ్ ।
ఉద్ధృతేన జలేనైవ శౌచం కుర్యాజ్జలాద్బహిః ॥12॥

నీరు, అగ్ని, బ్రాహ్మణుడు మొదలైన వాటికి, దేవతలకు ఎదురుగా కుర్చోరాదు. ఎడమచేతితో లింగభాగాన్ని, కుడిచేతితో నోటిని మూసుకొని మలవిసర్జన చేసి, పైకి లేచి ఆ మలమును చూడరాదు. జలాశయాల నుండి పాత్రతో బయటకు తెచ్చిన నీటితో మాత్రమే శుభ్రం చేసుకోవాలి.

అథవా దేవపిత్రార్షతీర్థావతరణం వినా ।
సప్తవా పంచ వా త్రీన్ వా గుదం సంశోధయేన్మృదా ॥13॥

దేవ, పితృ, ఋషి తీర్థాలలో దిగకుండా, ఏడు, ఐదు లేక మూడుసార్లు మట్టితో గుదాన్ని శుభ్రం చేయాలి.

లింగే కర్కోటమాత్రం తు గుదే ప్రసృతిరిష్యతే ।
తత ఉత్థాయ పద్ధస్తశౌచం గణ్డూషమష్టకమ్ ॥14॥

మారేడుకాయ ప్రమాణం గలిగిన మట్టితో గుహ్యాభాగాన్ని, గుదాన్ని శుద్ధి చేసుకోవాలి. తర్వాత లేచి కాళ్లను, చేతులను కడుక్కొని, ఎనిమిదిసార్లు నీటిని పుక్కిలించి ఉమ్మివేయాలి.

యేన కేన చ పత్రేణ కాష్ఠేన చ జలాద్బహిః ।
కార్యం న తర్జనీం త్యజ్య దంతధావనమీరితమ్ ॥15॥

ఏదో ఒక ఆకుతో గాని, పుల్లతో గాని చూపుడు వేలును ఉపయోగించకుండా పళ్ళు తోముకోవాలి. అది నీటిలో చేయకూడదు.

జలదేవాన్నమస్కృత్య మంత్రేణ స్నానమాచరేత్ ।
అశక్తః కంఠదఘ్నం వా కటిదఘ్నమథాపి వా ॥16॥

ఆజానుజలమావిశ్య మంత్రస్నానం సమాచరేత్ ।
దేవాదీంస్తర్పయేద్విద్వాంస్తత్ర తీర్థజలేన చ ॥17॥

వరుణ దేవునకు నమస్కారం చేసి, మంత్రాలతో స్నానం చేయాలి. అలా స్నానం చేయటానికి శక్తి లేకపోతే కంఠం వరకు నడుము వరకు నీటిలో మునిగి, లేదా మోకాళ్ల వరకు నీటిలో దిగి, మంత్రాలతో స్నానం చేయాలి. విద్వాంసులు ఆ తీర్థంలోని నీటితోనే దేవ, పితృ తర్పణం చేయాలి.

ధౌతవస్త్రం సమాదాయ పంచకచ్ఛేన ధారయేత్ ।
ఉత్తరీయం చ కించైవ ధార్యం సర్వేషు కర్మసు ॥18॥

ఉతికిన వస్త్రాన్ని తీసుకొని, అయిదుకచ్చలతో కట్టుకోవాలి. అన్నిరకాల కర్మలు చేసేటపుడు ఉత్తరీయాన్ని కూడా ధరించాలి.

నద్యాదితీర్థస్నానే తు స్నానవస్త్రం న శోధయేత్ ।
వాపీకూపగృహాదౌ తు స్నానాదూర్ధ్వం నయేద్బుధః ॥19॥

శిలాదార్వాదికే వాపి జలే వాపి స్థలేఽపి వా ।
సంశోధ్య పీడయేద్వస్త్రం పితౄణాం తృప్తయే ద్విజాః ॥20॥

నదులలో, ఇతర తీర్థాలలో స్నానం చేసేటపుడు స్నానవస్త్రాన్ని అక్కడ ఉతకకూడదు. పండితుడు దానిని స్నానం తరువాత బావి దగ్గరకు గాని, ఇంటికి గాని తీసుకెళ్లి రాతిపై కాని, దుంగ లేదా గట్టినేలపై కాని లేదా నీటియందు కాని ఉతికి పిండాలి. ఓ బ్రాహ్మణులారా! ఆ వస్త్రజలం పితృదేవతలకు తృప్తినిస్తుంది.

జాబాలకోక్తమంత్రేణ భస్మనా చ త్రిపుండ్రకమ్ ।
అన్యథా చేజ్జలే పాత ఇతస్తన్నరకమృచ్ఛతి ॥21॥

జాబాలోపనిషత్తులో ఉన్న "అగ్నిరితి భస్మ" అనే మంత్రాన్ని చదివి, బూడిదతో నుదుటిపై మూడునామములు పెట్టుకోవాలి. అలా కాకుండా బూడిదను నీటిలో పారవేస్తే, ఆ వ్యక్తి శరీరాన్ని విడిచాక నరకాన్ని పొందుతాడు.

ఆపోహిష్ఠేతి శిరసి ప్రోక్షయేత్పాపశాంతయే ।
యస్యేతి మంత్రం పాదే తు సంధిప్రోక్షణముచ్యతే ॥22॥

పాపాన్ని పోగొట్టుకోవడానికి 'ఆపోహిష్ఠా' అనే మంత్రంతో నీటిని తలపై చల్లుకోవాలి. "యస్య క్షయాయ" అనే మంత్రంతో పాదాలపై చల్లుకోవాలి. దీన్ని సంధ్యాప్రోక్షణం అంటారు.

పాదే మూర్ధ్ని హృది చైవ మూర్ధ్ని హృత్పాద ఏవ చ ।
హృత్పాదమూర్ధ్ని సంప్రోక్ష్య మంత్రస్నానం విదుర్బుధాః ॥23॥

ఆపోహిష్ఠా వంటి మంత్రాలతో పాదాన్ని, తలను, హృదయాన్ని, ఆ తర్వాత తల, హృదయం, పాదాన్ని, మరలా హృదయం, పాదం, తలను సంప్రోక్షణ అనగా నీటిని చల్లుకోవాలి. దీనిని పండితులు మంత్రస్నానం అంటారు.

ఈషత్ స్పర్శే చ దౌఃస్వాస్థ్యే రాజా రాష్ట్రభయేఽపి చ ।
అత్యాగతికాలే చ మంత్రస్నానం సమాచరేత్ ॥24॥

అపవిత్రమైనవి శరీరాన్ని తగిలినపుడు, ఆరోగ్యం బాగా లేనపుడు, రాజుకు, రాష్ట్రానికి భయం కలిగినపుడు, ప్రయాణసమయంలో కాని మంత్రస్నానాన్ని చేయాలి.

ప్రాతస్సూర్యానువాకేన సాయమగ్న్యనువాకతః ।
అపః పీత్వా తథా మధ్యే పునః ప్రోక్షణమాచరేత్ ॥25॥

పొద్దున 'సూర్యశ్చ' అనే మంత్రంతో, సాయంకాలం 'అగ్నిశ్చ' అనే మంత్రంతో నీటిని తాగి, మరలా మంత్రప్రోక్షణం చేసుకోవాలి.

గాయత్ర్యా జపమంత్రాంతే విరూర్ధ్వం ప్రాగ్వినిక్షిపేత్ ।
మంత్రేణ సహ చైకం వై మధ్యేఽర్ఘ్యం తు రవేర్ద్విజాః ॥26॥

ఓ బ్రాహ్మణులారా! పొద్దున్న గాయత్రితో మంత్రించిన నీటిని తూర్పువైపు ఎదురుగా సూర్యుడికి అర్ఘ్యం ఇవ్వాలి. మధ్యాహ్నం మంత్రపూర్వకంగా ఒకే అర్ఘ్యం ఇవ్వాలి.

జాతే చ సాయాహ్నే భువి పశ్చిమదిఙ్ముఖః ।
ఉద్ధృత్య దద్యాత్ప్రాతస్తు మధ్యాహ్నేంగులిభిస్తథా ॥ 27॥

అంగులీనాం చ రంధ్రేణ లంబం పశ్యేద్దివాకరమ్ ।
ఆత్మప్రదక్షిణం కృత్వా శుద్ధాచమనమాచరేత్ ॥28॥

సాయంకాలం నేలపై కూర్చొని పడమరవైపు తిరిగి అర్ఘ్యం ఇవ్వాలి. ఉదయం తూర్పువైపు తిరిగి నీళ్లని కొద్దిగా పైకి చల్లి అర్ఘ్యం ఇవ్వాలి. మధ్యాహ్నం వేళ్లనుండి అర్ఘ్యాన్నిచ్చి వేళ్ల మధ్యనుంచి నిటారుగా సూర్యుణ్ణి చూడాలి. తర్వాత ఆత్మప్రదక్షిణ చేసి, శుద్ధాచమనం చేయాలి.

సాయం ముహూర్తాదర్వాక్తు కృతా సంధ్యా వృథా భవేత్ ।
అకాలాత్ కాల ఇత్యుక్తో దినేఽతీతే యథాక్రమమ్ ॥29॥

దివాఽతీతే చ గాయత్రీం శతం నిత్యే క్రమాజ్జపేత్ ।
ఆదశాహాత్పరాఽతీతే గాయత్రీం లక్షమభ్యసేత్ ॥ 30॥

మాసాతీతే తు నిత్యే హి పునశ్చోపనయం చరేత్ ।
ఈశో గౌరీ గుహో విష్ణుర్బ్రహ్మా చేంద్రశ్చ వై యమః ॥31॥

ఏవం రూపాంశ్చ వై దేవాంస్తర్పయేదర్థసిద్ధయే ।
బ్రహ్మార్పణం తతః కృత్వా శుద్ధాచమనమాచరేత్ ॥32॥

సాయంకాలసంధ్యా సమయం నుండి ముందుగా సంధ్యను ఉపాసించటం వలన ఫలితం ఉండదు. ఎందుకనగా అకాలం కావున. ప్రతిరోజు కాలాతీతంలో సంధ్యోపాసన చేసినచో ఏ రోజుకారోజు నిత్యగాయత్రి కంటె అధికంగా శతగాయత్రిని జపించాలి. ఆ విధంగా పదవరోజు నుండి కాలాతీత సమయంలో సంధ్యోపాసన చేసినచో నిత్యగాయత్రితో బాటు లక్షగాయత్రి జపించాలి. ఈ విధంగా నెలరోజులు కాలాతీతంలో సంధ్యోపాసన చేసినచో తిరిగి ఉపనయనం చేసుకోవాలి. మనకోరికలు నెరవేరడానికి శివుడు, గౌరి, సుబ్రహ్మణ్యేశ్వరుడు, విష్ణువు, బ్రహ్మ, ఇంద్రుడు మరియు యముడు మొదలైన దేవతలను మనసులో స్మరించి తర్పణాలు ఇవ్వాలి. తర్వాత బ్రహ్మార్పణం చేసి, శుద్ధాచమనం చేయాలి.

తీర్థదక్షిణతశ్శస్తే మఠే మంత్రాలయే బుధః ।
తత్ర దేవాలయే వాపి గృహే వా నియతస్థలే ॥33॥

పండితుడు తీర్థానికి దక్షిణంగా ఉండే మంచి మఠంలో గాని, మంత్రాలయంలో కాని, దేవాలయంలో కాని, గృహంలో కాని, ఒక ఎంచుకున్న ప్రదేశంలో కాని.....

సర్వాన్ దేవాన్నమస్కృత్య స్థిరబుద్ధిః స్థిరాసనః ।
ప్రణవం పూర్వమభ్యస్య గాయత్రీమభ్యసేత్తతః ॥34॥

జీవబ్రహ్మైక్యవిషయం బుద్ధ్వా ప్రణవమభ్యసేత్ ।
త్రైలోక్యసృష్టికర్తారం స్థితికర్తారమచ్యుతమ్ ॥35॥
సంహర్తారం తథా రుద్రం స్వప్రకాశముపాస్మహే ।
జ్ఞానకర్మేంద్రియాణాం చ మనోవృత్తీర్ధియస్తథా ॥36॥

భోగమోక్షప్రదే ధర్మే జ్ఞానే చ ప్రేరయేత్సదా ।
ఇత్థమర్థం ధియా ధ్యాయన్ బ్రహ్మప్రాప్నోతి నిశ్చయః ॥37॥

స్థిరంగా ఉన్న చోటులో కూర్చుని, నిశ్చలమైన మనస్సుతో దేవతలందరికి నమస్కరించి, ముందు ఓంకారాన్ని, తర్వాత గాయత్రిని జపించాలి. జీవబ్రహ్మలు ఒకటే అనే భావనతో ఓంకారాన్ని జపించాలి. మూడులోకాలను పుట్టించిన బ్రహ్మను, పెంచి పోషించు విష్ణువును నాశనం చేయు రుద్రుని ఆత్మప్రకాశరూపంగా ఉపాసిస్తాము.

ఓంకారం మా జ్ఞానేంద్రియాల్ని, కర్మేంద్రియాల్ని, మనోవృత్తుల్ని, ధీవృత్తుల్ని అన్ని సమయాలలో భోగం, మోక్షం ఇచ్చు ధర్మం నందు, మరియు జ్ఞానము నందు ప్రేరేపించు గాక! ఈ విధంగా ఓంకారం యొక్క అర్థాన్ని బుద్ధితో ధ్యానించే వాడు తప్పకుండా బ్రహ్మమును పొందుతాడు.

కేవలం వా జపేన్నిత్యం బ్రాహ్మణ్యస్య చ పూర్తయే ।
సహస్రమభ్యసేన్నిత్యం ప్రాతర్బ్రాహ్మణపుంగవః ॥38॥

ఈ అర్థం తెలియకపోయినా బ్రాహ్మణత్వం సంపూర్ణంగా పొందటం కోసం నిత్యం ఓంకారాన్ని జపించాలి. బ్రాహ్మణుడు ప్రతిరోజూ ప్రాతఃకాలంలో గాయత్రిని వేయిసార్లు జపించాలి.

అన్యేషాం చ యథాశక్తి మధ్యాహ్నే చ శతం జపేత్ ।
సాయం ద్విదశకం జ్ఞేయం శిఖాష్టకసమన్వితమ్ ॥39॥

ఇతరులు యధాశక్తి జపించాలి. మధ్యాహ్నసమయంలో గాయత్రిని వందసార్లు, సాయంకాలం శిఖాష్టకంతో బాటు ఇరవైసార్లు జపించాలని తెలుసుకోవాలి.

మూలాధారం సమారభ్య ద్వాదశాంతస్థితాంస్తథా ।
విద్యేశబ్రహ్మవిష్ణీశజీవాత్మపరమేశ్వరాన్ ॥40॥

మూలాధారం నుండి సహస్రారం వరకు ఉన్న ఆరు చక్రాలలో విద్యేశ్వర, బ్రహ్మ, విష్ణు, ఈశ, జీవాత్మ, పరమాత్మలను ధ్యానించాలి.

బ్రహ్మబుద్ధ్యా తదైక్యం చ సోఽహం భావనయా జపేత్ ।
తానేవ బ్రహ్మరంధ్రాదౌ కాయాద్బాహ్యే చ భావయేత్ ॥41॥

'సోఽహం' అనగా "అది నేనే" అనే పరబ్రహ్మ బుద్ధితో బ్రహ్మైక్యాన్ని భావన చేస్తూ గాయత్రిని జపించాలి. మరియు ఆ బ్రహ్మమును బ్రహ్మరంధ్రమందు, శరీరానికి బయట కూడా భావన చేయాలి.

మహత్తత్త్వం సమారభ్య శరీరం తు సహస్రకమ్ ।
ఏకైకస్మాజ్జపాదేకమతిక్రమ్య శనైశ్శనైః ॥42॥

మహాతత్త్వం లోంచి ఈ వేలాదిశరీరాలు బయట పడినవి. ఒక్కొక్క గాయత్రీ జపంలో ఒక్కొక్క శరీరాన్ని మెల్లగా దాటుకుంటూ

పరస్మిన్ యోజయేజ్జీవం జపతత్త్వముదాహృతమ్ ।
శతద్విదశకం దేహం శిఖాష్టకసమన్వితమ్ ॥43॥

జీవుని పరమాత్మలో లీనం చేయాలి. ఇదే జపం యొక్క తత్త్వం అని చెప్పారు. భౌతికదేహరక్షణకొరకు గాయత్రీమంత్రాన్ని శిఖాష్టకంతో బాటు 2వేల సార్లు జపించాలి.

మంత్రాణాం జప ఏవం హి జపమాదిక్రమాద్విదుః ।
సహస్రం బ్రాహ్మదం విద్యాచ్ఛతమైంద్రప్రదం విదుః ॥44॥

ఈ విధంగా శరీరభావన మరిచి జపించాలి. వేయిసార్లు జపిస్తే బ్రహ్మలోకం, వందసార్లు జపిస్తే ఇంద్రలోకం లభిస్తాయి.

ఇతరత్త్వాత్మరక్షార్థం బ్రహ్మయోనిషు జాయతే ।
దివాకరముపస్థాయ నిత్యమిత్థం సమాచరేత్ ॥45॥

ఇతరులు గాయత్రీమంత్రాన్ని జపించి, మంచి జన్మలను పొంది, ఆత్మను ఉద్ధరించుకుంటారు. ఈ విధంగా జపించి సూర్యునికి ఎదురుగా ఉపస్థానాన్ని చెప్పాలి. ఈ విధంగా ప్రతినిత్యం ఆచరించాలి.

లక్షద్వాదశయుక్తస్తు పూర్ణబ్రాహ్మణ ఈరితః ।
గాయత్ర్యా లక్షహీనం తు వేద కార్యే న యోజయేత్ ॥46॥

పన్నెండులక్షలసార్లు గాయత్రీమంత్రాన్ని జపించినవాడిని పూర్ణబ్రాహ్మణుడని అంటారు. లక్షకు తక్కువగా గాయత్రిని జపిస్తే వాడు వైదికకర్మలకు అర్హత లేని వాడవుతాడు.

ఆసప్తతేస్తు నియమం పశ్చాత్ప్రవాజనం చరేత్ ।
ప్రాతర్ద్వాదశసాహస్రం ప్రవ్రాజీ ప్రణవం జపేత్ ॥ 47॥

డెబ్బైయేడేళ్ల వయసు వరకు నియమాలు పాటించి తర్వాత సన్యసించాలి. సన్యాసి ప్రతిఉదయం పన్నెండు వేలసార్లు ఓంకారాన్ని జపించాలి.

దినే దినే త్వతిక్రాంతే నిత్యమేవం క్రమాజ్జపేత్ ।
మాసాదౌ క్రమశోఽతీతే సార్ధలక్షజపేన హి ॥48॥

ఒకరోజు జపం మానేస్తే రెండోరోజున రెండురోజుల జపాన్ని పూర్తి చేయాలి. నెలరోజుల పాటు జపం మానేస్తే యాభైవేలసార్లు జపిస్తే ఆ దోషం తొలగి పోతుంది.

అత ఊర్ధ్వమతిక్రాంతే పునః ప్రైషం సమాచరేత్ ।
ఏవం కృత్వా దోషశాంతిరన్యథా రౌరవం వ్రజేత్ ॥49॥

అంతకుమిచి జపాన్ని విడిచి పెడితే గురువు వద్ద దీక్ష పొందాలి. అట్లు చేస్తే దోషం తగ్గుతుంది. లేదా రౌరవ నరకం వస్తుంది.

ధర్మార్థయోస్తతో యత్నం కుర్యాత్కామీ న చేతరః ।
బ్రాహ్మణో ముక్తికామస్స్యాద్బ్రహ్మజ్ఞానం సదాభ్యసేత్ ॥50॥

కోరికలు కల వాడు ఆ కోరికలు తీరే వేదోక్తకార్యాలను చేసి ప్రయత్నించాలి. వాటి కొరకు ధనాన్ని సంపాదించాలి. కోరికలు లేని వానికి ఈ ప్రయత్నం అనవసరం. బ్రాహ్మణుడు ముముక్షువై ఎపుడూ బ్రహ్మజ్ఞానాన్ని నేర్చుకోవాలి.

ధర్మాదర్థోఽర్థతో భోగో భోగాద్వైరాగ్యసంభవః ।
ధర్మార్జితార్థభోగేన వైరాగ్యముపజాయతే ॥51॥

ధర్మం వలన ధనం, ధనం వలన భోగం వస్తాయి. ధర్మంగా సంపాదించిన ధనంతో వచ్చిన భోగం వైరాగ్యానికి కారణం అవుతుంది.

విపరీతార్థభోగేన రాగ ఏవ ప్రజాయతే ।
ధర్మశ్చ ద్వివిధః ప్రోక్తో ద్రవ్య దేహద్వయేన చ ॥52॥

అధర్మంగా సంపాదించిన ధనంతో అనుభవించే భోగాలు రాగాన్ని కలిగిస్తాయి. ధర్మం రెండు రకాలు. ఒకటి ద్రవ్యధర్మం, రెండవది దేహధర్మం.

ద్రవ్యమిజ్యాదిరూపం స్యాత్తీర్థస్నానాది దైహికమ్ ।
ధర్మేణ ధనమాప్నోతి తపసా దివ్యరూపతామ్ ॥53॥

యజ్ఞం మొదలైన వాటిని ద్రవ్యధర్మాలని, తీర్థాలలో స్నానం చేయుట దేహధర్మాలని అంటారు. ధర్మం వల్ల మరింత ధనం వస్తుంది. తపస్సు వల్ల దివ్యరూపం వస్తుంది.

నిష్కామశ్శుద్ధిమాప్నోతి శుద్ధ్యా జ్ఞానం న సంశయః ।
కృతాదౌ హి తపః శ్లాఘ్యం ద్రవ్యధర్మః కలౌ యుగే ॥54॥

కోరికలు లేకుండా ధర్మాన్ని ఆచరిస్తే మనసు శుద్ధి అవుతుంది. శుద్ధి వల్ల జ్ఞానం వస్తుందనటంలో సందేహం లేదు. కృతయుగం మొదలుకొని ఇతర యుగాలలో తపస్సు చాలా గొప్పది. కలియుగంలో ద్రవ్యధర్మం అంటే దానం చాలా గొప్పది.

కృతే ధ్యానాత్ జ్ఞానసిద్ధిః త్రేతాయాం తపసా తథా ।
ద్వాపరే యజనాత్ జ్ఞానం ప్రతిమాపూజయా కలౌ ॥55॥

కృతయుగంలో ధ్యానం వల్ల, త్రేతాయుగంలో తపస్సు వల్ల, ద్వాపరంలో యజ్ఞం, అనుష్ఠానం వల్ల, కలియుగంలో మూర్తి (విగ్రహం) పూజ వల్ల జ్ఞానం కలుగుతుంది.

యాదృశం పుణ్యం పాపం వా తాదృశం ఫలమేవ హి ।
ద్రవ్యదేహాంగభేదేన న్యూనవృద్ధిక్షయాదికమ్ ॥56॥

పుణ్యపాపాలు ఎటువంటివో, వాటి ఫలాలు కూడా అటువంటివే అవుతాయి. దానం మొదలైన వాటిల్లో ధనాన్ని బట్టి, తపస్సులో శరీరం పడే బాధను బట్టి పుణ్యఫలాల్లో ఎక్కువ తక్కువలుంటాయి.

అధర్మో హింసికారూపో ధర్మస్తు సుఖరూపకః ।
అధర్మాద్దుఃఖమాప్నోతి ధర్మాద్వై సుఖమేధతే ॥57॥

అధర్మం హింసారూపం. ధర్మం సుఖరూపం. అధర్మం బాధను, ధర్మం సుఖాన్ని వృద్ధి చేస్తాయి.

విద్యాదుర్వృత్తితో దుఃఖం సుఖం విద్యాత్సువృత్తితః ।
ధర్మార్జనమతః కుర్యాత్ భోగమోక్షప్రసిద్ధయే ॥58॥

విద్యను దురుపయోగం చేస్తే దుఃఖం, మంచిగా ఉపయోగిస్తే సుఖం కల్గుతాయి. కావున భోగం, మోక్షం రెండూ లభించాలంటే ధర్మాన్ని సంపాదించాలి.

సకుటుంబస్య విప్రస్య చతుర్జనయుతస్య చ ।
శతవర్షస్య వృత్తిం తు దద్యాత్తద్బ్రహ్మలోకదమ్ ॥59॥

నలుగురువ్యక్తులున్న బ్రాహ్మణకుటుంబానికి వందసంవత్సరాల జీవితసౌకర్యాలు ఏర్పాటు చేస్తే అట్టి దానం వలన బ్రహ్మలోకం లభిస్తుంది.

చాంద్రాయణసహస్రం తు బ్రహ్మలోకప్రదం విదుః ।
సహస్రస్య కుటుంబస్య ప్రతిష్ఠాం క్షత్రియశ్చరేత్ ॥ 60॥

ఇంద్రలోకప్రదం విద్యాదయుతం బ్రహ్మలోకదమ్ ।
యాం దేవతాం పురస్కృత్య దానమాచరతే నరః ॥ 61॥

తత్తల్లోకమవాప్నోతి ఇతి వేదవిదో విదుః ।

వేయిచాంద్రాయణవ్రతాలు చేస్తే, బ్రహ్మలోకం లభిస్తుందని చెప్తారు. వేయికుటుంబాలకు జీవనసౌకర్యాలు కలిగించిన క్షత్రియుడు (రాజు) ఇంద్రలోకాన్ని చేరుకుంటాడు. పదివేలమందికి విద్యాసౌకర్యం కలిగిస్తే, బ్రహ్మలోకం లభిస్తుంది. ఏ దేవతను ఉద్దేశించి దానం చేయునో ఆయా లోకాలను చేరుతాడని వేదవేత్తల మాట.

అర్థహీనః సదా కుర్యాత్తపసామార్జనం తథా ॥

అర్థహీనులు ఎల్లప్పుడు తపస్సుతో ఆరాధించిన ధనలాభం కలుగుతుంది.

తీర్థాచ్చ తపసా ప్రాప్యం సుఖమక్షయ్యమశ్నుతే ॥62॥

తీర్థం తీసుకోవటం వల్ల, తపస్సు వల్ల పొందిన సుఖం అక్షయమౌతుంది.

అర్థార్జనమథో వక్ష్యే న్యాయతః సుసమాహితః ॥63॥

ఇపుడు న్యాయంగా ఎలా ధనాన్ని సంపాదించాలో చెప్తాను.

కృతాత్ప్రతిగ్రహాచ్చైవ యాజనాచ్చ విశుద్ధితః ।
అదైన్యాదనతిక్లేశాత్ బ్రాహ్మణో ధనమార్జయేత్ ॥64॥

బ్రాహ్మణుడు యాచించకుండా ఎక్కువ నష్టం పొందకుండా దానాన్ని తీసుకోవడం వల్ల, పవిత్రయజ్ఞం చేయించుట వల్ల ధనాన్ని సంపాదించాలి.

క్షత్రియో బాహువీర్యేణ కృషిగోరక్షణాద్విశః ।
న్యాయార్జితస్య విత్తస్య దానాత్సిద్ధిం సమశ్నుతే ॥65॥

క్షత్రియులు భుజబలంతోను, వైశ్యులు వ్యవసాయంతోను, గోవులను పోషించుట చేత ధనాన్ని సంపాదించాలి. న్యాయంగా సంపాదించిన ధనాన్ని దానం చేయటం వల్ల జ్ఞానం వస్తుంది.

జ్ఞానసిద్ధ్యా మోక్షసిద్ధిః సర్వేషాం గుర్వనుగ్రహాత్ ।
మోక్షాత్స్వరూపసిద్ధిస్స్యాత్పరానందం సమశ్నుతే ॥66॥

గురువు యొక్క అనుగ్రహంతో జ్ఞానసిద్ధి వల్ల అందరకు మోక్షం వస్తుంది. మోక్షం వల్ల ఆత్మసాక్షాత్కారం కల్గి పరమానందం కలుగుతుంది.

సత్సంగాత్సర్వమేతద్వై నరాణాం జాయతే ద్విజాః ।
ధనధాన్యాదికం సర్వం దేయం వై గృహమేధినా ॥67॥

ఓ బ్రాహ్మణులారా! ఇదంతా మనుషులకు సత్సంగం వల్ల లభిస్తాయి. గృహస్థుడు ధనధాన్యాలను ఇతరులకు దానం చేయాలి.

యద్యత్కాలే వస్తుజాతం ఫలం వా ధాన్యమేవ చ ।
తత్తత్సర్వం బ్రాహ్మణేభ్యో దేయం వై హితమిచ్ఛతా ॥68॥

ఏయే కాలంలో ఏయే వస్తువులు, ఫలాలు మరియు ధాన్యాలు లభిస్తాయో వాటిని అన్నింటిని మానవుడు బ్రాహ్మణులకు దానం ఇవ్వాలి.

జలం చైవ సదా దేయమన్నం క్షుద్వ్యాధిశాంతయే ।
క్షేత్రం ధాన్యం తథాఽఽమాన్నమన్నమేవం చతుర్విధమ్ ॥69॥

ఎల్లప్పుడు జలదానం చేయాలి. ఆకలి అనే రోగాన్ని తగ్గించటానికి అన్నం పెట్టాలి. భూమిని, ధాన్యాన్ని, అపక్వమైన అన్నాన్ని (బియ్యం), అన్నాన్ని దానం చేయాలి.

యావత్కాలం యదన్నం వై భుక్త్వా శ్రవణమేధతే ।
తావత్ కృతస్య పుణ్యస్య త్వర్థం దాతుర్నసంశయః ॥70॥

దాత పెట్టిన అన్నం తిన్న మనిషి ఆ శక్తితో ఎంత వరకు పుణ్యం సంపాదిస్తాడో, దానిలో సగం పుణ్యం ఆ దాతకు వస్తుందనటంలో సందేహం లేదు.

గ్రహీతా హి గృహీతస్య దానాద్వై తపసా తథా ।
పాపసంశోధనం కుర్యాదన్యథా రౌరవం వ్రజేత్ ॥71॥

దానాన్ని స్వీకరించిన (తీసుకొన్న) మనిషి, దానిలో కొంతభాగాన్ని మరలా దానం చేసి, మరియు తపస్సు చేసి, ఆ పాపాన్ని వదిలించుకోవాలి. అలా కాకపోతే రౌరవనరకాన్ని పొందుతాడు.

ఆత్మవిత్తం త్రిధా కుర్యాత్ ధర్మవృద్ధ్యాత్మభోగతః ।
నిత్యం నైమిత్తికం కామ్యం కర్మ కుర్యాత్తు ధర్మతః ॥72॥

మానవుడు తన దగ్గరున్న ధనాన్ని ధర్మం చేయటం కోసం, పెంచుకోవటం కోసం, అనుభవించటం కోసం మూడుభాగాలుగా చేసి, ప్రతిరోజూ ధర్మంగా నిత్యనైమిత్తిక కార్యాలు, కామ్యాలు కొరకు వినియోగించాలి.

విత్తస్య వర్ధనం కుర్యాత్ వృద్ధ్యంశేన హి సాధకః ।
హితేన మితమేధ్యేన భోగం భోగాంశతశ్చరేత్ ॥73॥

వృద్ధిభాగంతో ధనాన్ని వృద్ధి చేసుకోవాలి. సాధకుడు భోగభాగంతో హితకరమైన, అనుచితం కాని విధంగా భోగాన్ని అనుభవించాలి.

కృష్యర్జితే దశాంశం హి దేయం పాపస్య శుద్ధయే ।
శేషేణ కుర్యాద్ధర్మాది అన్యథా రౌరవం వ్రజేత్ ॥74॥

వ్యవసాయం వల్ల లభించిన ధనంలో పదవవంతును పాపం పోగొట్టుకునేందుకు దానం చేయాలి. మిగిలిన ధనంతో ధర్మ, వృద్ధి, భోగాలు చేయాలి. అలా కానిచో రౌరవనరకాన్ని పొందుతారు.

అథవా పాపబుద్ధిస్స్యాత్ క్షయం వా సత్యమేష్యతి ।
వృద్ధివాణిజ్యకే దేయః షడంశో హి విచక్షణైః ॥75॥

అలాకాక, పాపంతో నిండిన బుద్ధి కలవాడైతే నిజంగా నాశనమును పొందుతాడు. తెలివికల వాళ్లు వ్యాపారంలో వచ్చిన ధనంలో ఆరవవంతు భాగాన్ని దానం చేయాలి.

శుద్ధప్రతిగ్రహే దేయశ్చతుర్థాంశో ద్విజోత్తమైః ।
అకస్మాదుత్థితే ఉర్ధే హి దేయమర్ధం ద్విజోత్తమైః ॥76॥

బ్రాహ్మణులు తాము పవిత్రంగా పొందిన ధనంలో నాలుగవవంతును, ఆకస్మాత్తుగా వచ్చినదానిలో సగాన్ని దానం చేయాలి.

అసత్ప్రతిగ్రహస్సర్వం దుర్దానం సాగరే క్షిపేత్ ।
ఆహూయ దానం కర్తవ్యమాత్మభోగసమృద్ధయే ॥77॥

అపవిత్రంగా వచ్చిన మొత్తాన్ని పూర్తిగా సముద్రంలో పడవేయాలి. మానవుడు తనకు భోగాభివృద్ధి కలగడానికి పండితులను ఆహ్వానించి, దానం చేయాలి.

పృష్టం సర్వం సదా దేయమాత్మశక్త్యనుసారతః ।
జన్మాంతరే ఋణీ హి స్యాదదత్తే పృష్టవస్తుని ॥78॥

యాచకుడు అడిగిన వాటిని అన్నింటిని తన శక్తి మీరకుండా దానం చేయాలి. కోరిన వస్తువును దానం చేయనిచో వేరే జన్మలో ఇతనికి ఋణపడి యుంటాడు.

పరేషాం చ తథా దోషం న ప్రశంసేద్విచక్షణః ।
విశేషేణ తథా బ్రహ్మన్ శ్రుతం దృష్టం చ నో వదేత్ ॥79॥

వివేకులైన వారు ఇతరుల దోషాలను వర్ణించకూడదు. ఓ బ్రాహ్మణులారా! మనం చూసిన, విన్న పరదోషాలను పైకి మరలా చెప్పరాదు.

న వదేత్సర్వజంతూనాం హృది రోషకరం బుధః ।
సంధ్యయోరగ్నికార్యం చ కుర్యాదైశ్వర్యసిద్ధయే ॥80॥

వివేకం కల వారు ఇతరులకు కోపం కలిగించేలా మాట్లాడరాదు. సంపదలు కలగటం కోసం రెండుసంధ్యలలో అగ్నిహోత్రాన్ని అనుష్ఠించాలి.

అశక్తస్త్వేకకాలే వా సూర్యాగ్నీ చ యథావిధి ।
తండులం ధాన్యమాజ్యం వా ఫలం కందం హవిస్తథా ॥81॥

రోజూ రెండుసార్లు అగ్నిహోత్రం చేయటానికి శక్తి లేకపోతే, ఒకసారైనా సూర్యునికి, అగ్నికి బియ్యం, ధాన్యం, నెయ్యి, పండు, దుంప వంటి హవిస్సును శాస్త్రప్రకారంగా అర్పించాలి.

స్థాలీపాకం తథా కుర్యాద్యథాన్యాయం యథావిధి ।
ప్రధానహోమమాత్రం వా హవ్యాభావే సమాచరేత్ ॥82॥

పద్ధతి ప్రకారం స్థాలీపాకం చేయాలి. హవిస్సు లేకపోతే ప్రధానహోమమైనా చేయాలి.

వి. స్థాలి అనగా గిన్నె. పాకమనగా వంట చేయుట. ఆ అన్నం నుండి అగ్ని మొదలగు దేవతలు హవిర్భాగాలిచ్చి హోమం చేస్తున్నారు. "ఆఘారసమిధౌ ప్రహరతి"-హోమానికి అర్హత గల ఎనిమిది వస్తువులకు, పదకొండు రుద్రులకు, పన్నెండు ఆదిత్యులకు, ఈ అన్నం తగులు గాక. అట్లు నేతితో తడిసిన హవిశ్శేషాలను బ్రాహ్మణులకు పెట్టాలి. తండులహోమం నిత్యం చేయాలి. మన వివాహవ్యవస్థలో కూడా స్థాలీపాకం ప్రస్తావన ఉంది.

నిత్యసంధానమిత్యుక్తం తమజస్రం విదుర్బుధాః ।
అథవా జపమాత్రం వా సూర్యవందనమేవ చ ॥83॥

ఎపుడూ ఆరిపోని అగ్నిని పండితులు అజస్రమని పిలుస్తారు. ఆ విధంగా అగ్నిని ఉపాసించలేని వారు జపమైనా చేయాలి. లేదా సూర్యునికి నమస్కారమైనా చేయాలి.

ఏవమాత్మార్థినః కుర్యురర్థార్థీ చ యథావిధి ।
బ్రహ్మయజ్ఞరతా నిత్యం దేవ పూజారతాస్తథా ॥84॥

అగ్నిపూజా పరా నిత్యం గురుపూజారతాస్తథా ।
బ్రాహ్మణానాం తృప్తికరాస్సర్వే స్వర్గస్య భాగినః ॥85॥

ఆత్మజ్ఞానాన్ని కోరేవారు మరియు ధనాన్ని కోరుకునేవారు యథాప్రకారం ఉపాసన చేయాలి. బ్రహ్మయజ్ఞాన్ని శ్రద్ధతో చేసేవారు, ప్రతిరోజూ ఈశ్వరుణ్ణి పూజించే వాళ్లు అగ్నిని ఉపాసించే వాళ్లు, గురువుకి సేవలను శ్రద్ధగా చేసేవారు, బ్రాహ్మణులకు తృప్తిని కలిగించే వాళ్లు, వీళ్లందరికీ స్వర్గం ప్రాప్తిస్తుంది.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం సదాచారః - శౌచం - ధర్మానుష్ఠానో నామ త్రయోదశోఽధ్యాయః ॥13॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు సదాచారము - శౌచము - ధర్మానుష్ఠానం అను పేరుగల పదమూడవ అధ్యాయం సమాప్తం.

చతుర్థశోఽధ్యాయః - పద్నాల్గవ అధ్యాయం

యజ్ఞత్రయమ్ - సప్తాహమ్ - మూడు యజ్ఞాలు - సప్తాహం

ఋషయ ఊచుః - ఋషులు పలికారు.

అగ్నియజ్ఞం దేవయజ్ఞం బ్రహ్మయజ్ఞం తథైవ చ ।
గురుపూజాం బ్రహ్మతృప్తిం క్రమేణ బ్రూహి నః ప్రభో ॥1॥

ఓ మహానుభావా! అగ్నియజ్ఞ, దేవయజ్ఞ, బ్రహ్మయజ్ఞాలను, గురుపూజను, బ్రహ్మతృప్తి గురించి మాకు వరుసగా చెప్పండి.

సూత ఉవాచ - సూతుడు ఈ విధంగా పలికాడు.

అగ్నౌ జుహోతి యద్ద్రవ్యమగ్నియజ్ఞస్స ఉచ్యతే ।
బ్రహ్మచర్యాశ్రమస్థానాం సమిదాధానమేవ హి ॥2॥

అగ్నిలో హోమద్రవ్యాన్ని సమర్పించే విధానాన్ని అగ్నియజ్ఞమని అంటారు. బ్రహ్మచర్యం అనే మొదటి ఆశ్రమంలో ఉండేవాళ్లు అగ్నిలో సమిధలను వేసి హోమం చేయాలి.

సమిధగ్నౌ వ్రతాద్యం చ విశేషయజనాదికమ్ ।
ప్రథమాశ్రమిణామేవం యావదౌపాసనం ద్విజాః ॥3॥

బ్రహ్మచర్యాశ్రమంలో ఉండేవారు. సమిధలతో అగ్నిని అర్చించాలి. వీరు వ్రతాలను పాటించాలి. గృహస్థుగా ఉండి, ఔపాసనకర్మలను చేసే వరకు విశేషయజ్ఞాలు చేయాలి.

ఆత్మన్యారోపితాగ్నీనాం వనినాం యతినాం ద్విజాః ।
హితం చ మితమేధ్యాన్నం స్వకాలే భోజనం హుతిః ॥4॥

ఓ బ్రాహ్మణులారా! ఆత్మలో ఆవాహన చేసిన అగ్నులు గల వానప్రస్థులకు, యతులకు ఇష్టమైన, పవిత్రమైన ఆహారాన్ని మితంగా సకాలంలో భుజించటాన్ని అగ్నియజ్ఞం అంటారు.

ఔపాసనాగ్నిసంధానం సమారభ్య సురక్షితమ్ ।
కుండే వాప్యథ భాండే వా తదజస్రం సమీరితమ్ ॥5॥

ఔపోసనాగ్నిని ప్రారంభించిన రోజు నుండి ఒకకుండలో దానిని ఆరిపోకుండా సురక్షితంగా ఉంచినచో దానిని అజస్రం అంటారు.

అగ్నిమాత్మన్యరణ్యాం వా రాజదైవవశాద్ ధ్రువమ్ ।
అగ్నిత్యాగభయాదుక్తం సమారోపితముచ్యతే ॥6॥

రాజభయం వలన గాని, దైవం అనుకూలంగా లేకపోవడం వలన గాని, అగ్నిని కాపాడలేని పరిస్థితిలో ఆత్మలో కాని లేక ఆరణిలో గాని న్యాసం చేయబడిన అగ్నిని సమారోపితం అంటారు.

సంపత్కరీ తథా జ్ఞేయా సాయమగ్న్యాహుతిర్ద్విజాః ।
ఆయుష్కరీతి విజ్ఞేయా ప్రాతస్సూర్యాహుతిస్తథా ॥7॥

ఓ బ్రాహ్మణులారా! సాయంకాలం అగ్నిలో ఇచ్చిన ఆహుతి సంపదను ఇస్తుంది. ప్రొద్దున సమయంలో ఇచ్చిన ఆహుతి ఆయుష్షును పెంచుతుంది.

అగ్నియజ్ఞో హ్యయం ప్రోక్తో దివా సూర్యనివేశనాత్ ।
ఇంద్రాదీన్సకలాన్దేవానుద్దిశ్యాగ్నౌ జుహోతి యత్ ॥8॥

దేవయజ్ఞం హి తం విద్యాత్ స్థాలీపాకాదికాన్ క్రతూన్ ।
చౌలాదికం తథా జ్ఞేయం లౌకికాగ్నౌ ప్రతిష్ఠితమ్ ॥9॥

పగటిపూట అగ్ని సూర్యునియందుంటుంది. కావున ఈ ఆహుతులకు అగ్నియజ్ఞం అనే పేరు వచ్చింది. స్థాలీపాకం వంటి క్రతువులలో ఇంద్రాదిదేవతలనను ఉద్దేశించి అగ్నిలో హోమం చేస్తారు. దానిని దేవయజ్ఞం అంటారు. చూడాకరణంవంటి సంస్కారాలతో లౌకికాగ్నితో చేయబడే హోమాన్ని కూడా దేవయజ్ఞం అంటారు.

బ్రహ్మయజ్ఞం ద్విజః కుర్యాద్దేవానాం తృప్తయే సకృత్ ।
బ్రహ్మయజ్ఞ ఇతి ప్రోక్తో వేదస్యాఽధ్యయనం భవేత్ ॥10॥

బ్రాహ్మణుడు దేవతల తృప్తి కోసం నిత్యం బ్రహ్మయజ్ఞం చేయాలి. వేదాధ్యయనానికి బ్రహ్మయజ్ఞమని పేరుంది.

నిత్యానంతరమాసాయాం తతస్తు న విధీయతే ।
అనగ్నౌ దేవయజనం శృణుత శ్రద్ధయాదరాత్ ॥11॥

ప్రొద్దున్న నిత్యకర్మను చేసి, తర్వాత సాయంకాలం వరకు వేదాన్ని చదవాలి. రాత్రియందు వేదం చదవకూడదు. అగ్ని లేకుండా చేసే దేవయజ్ఞం గురించి చెప్తున్నా. శ్రద్ధగా వినండి.

ఆది సృష్టౌ మహాదేవః సర్వజ్ఞః కరుణాకరః ।
సర్వలోకోపకారార్థం వారాన్ కల్పితవాన్ ప్రభుః ॥12॥

అన్ని విషయాలు సంపూర్ణంగా తెలిసినవాడు, సముద్రం వంటి కరుణ గలవాడు అయిన మహాదేవుడు సృష్టిప్రారంభంలో అన్నిప్రాణుల క్షేమంకోసం వారాలను కల్పించాడు.

సంసారవైద్యస్సర్వజ్ఞస్సర్వభేషజభేషజమ్ ।
ఆదావారోగ్యదం వారం స్వవారం కృతవాన్ ప్రభుః ॥13॥

సంసారం అనే రోగానికి వైద్యుడు, సర్వజ్ఞుడు, అన్నింటా సమర్థుడైన శివుడు మందులలో గొప్పదైన మందుగా ఆరోగ్యాన్నిచ్చే తన వారాన్ని ముందుగా చేశాడు.

సంపత్కారం స్వమాయాయా వారం చ కృతవాంస్తతః ।
జననే దుర్గతిక్రాంతే కుమారస్య తతః పరమ్ ॥14॥

తర్వాత సంపదలనిచ్చే తన మాయ యొక్క వారాన్ని, తర్వాత జన్మసమయంలో శిశువు యొక్క కష్టాలను దాటటం కోసం కుమారవారాన్ని చేశాడు.

ఆలస్య దురతిక్రాంత్యై వారం కల్పితవాన్ ప్రభుః ।
రక్షకస్య తథా విష్ణోర్లోకానాం హితకామ్యయా ॥15॥

లోకకల్యాణం చేయాలనుకొన్న శివుడు, సోమరితనాన్ని, ఆలస్య లక్షణాన్ని పోగొట్టుటకై రక్షకుడైన విష్ణువు యొక్క వారాన్ని కల్పించాడు.

పుష్ట్యర్థం చైవ రక్షార్థం వారం కల్పితవాన్ ప్రభుః ।
ఆయుష్కరం తతో వారమాయుషాం కర్తురేవ హి ॥16॥

త్రైలోక్యసృష్టికర్తుర్హి బ్రహ్మణః పరమేష్ఠినః ।
జగదాయుష్యసిద్ధ్యర్థం వారం కల్పితవాన్ ప్రభుః ॥17॥

మానవుల పుష్టికోసం, రక్షణకోసం వారాన్ని కల్పించి, బ్రహ్మ యొక్క ఆయువు వృద్ధియగు విధంగా వారాన్ని మానవులకు ఆయువు లభించుటకోసం కల్పించెను.

ఆదౌ త్రైలోక్యవృద్ధ్యర్థం పుణ్యపాపే ప్రకల్పితే ।
తయోః కర్త్రోస్తతో వారమింద్రస్య చ యమస్య చ ॥18॥

సృష్టి మొదటిలో మూడులోకాల అభివృద్ధికోసం పుణ్యం, పాపం కల్పించబడ్డాయి. తర్వాత వాటిని పరిపాలించటం కోసం ఇంద్రుడు, యమునికి వారాలు కల్పించబడ్డాయి.

భోగప్రదం మృత్యుహరం లోకానాం చ ప్రకల్పితమ్ ।
ఆదిత్యాదీన్ స్వస్వరూపాన్ సుఖదుఃఖస్య సూచకాన్ ॥19॥

వారేశాన్ కల్పయిత్వాదౌ జ్యోతిశ్చక్రే ప్రతిష్ఠితాన్ ।
స్వస్వవారే తు తేషాం తు పూజా స్వస్వఫలప్రదా ॥20॥

ఈ రెండువారాలు మానవులకు భోగాలనిచ్చి, మరణాన్ని హరిస్తాయి. మానవులకు సుఖదుఃఖాలను సూచించేవి, శివస్వరూపమైనవి అయిన వారాలకు ప్రభువులైన సూర్యుడు మొదలుగాగల దేవతలను శివుడు సృష్టి మొదట్లో గ్రహమండలంలో ప్రతిష్ఠించాడు. ఆయా ఆయా దేవతలను దేవతల వారంలో పూజించటం వల్ల ఆయా ఫలితాలు కల్గుతాయి.

ఆరోగ్యం సంపదశ్చైవ వ్యాధీనాం శాంతిరేవ చ ।
పుష్టిరాయుస్తథా భోగో మృతేర్హానిర్యథాక్రమమ్ ॥21॥

ఆరోగ్యం, సంపదలు, వ్యాధి, నాశనం, పుష్టి, ఆయుష్షు, భోగం, అమృతత్వం అనే ఫలాలు వరుసగా కల్గుతాయి.

వారక్రమఫలం ప్రాహుర్దేవప్రీతిపురస్సరమ్ ।
అన్యేషామపి దేవానాం పూజాయాః ఫలదశ్శివః ॥22॥

ఆయా దేవతలు సంతోషిస్తే క్రమంగా ఆయా వారఫలాలు కల్గుతాయి. ఇతరదేవతలను పూజించినా ఫలితాన్నిచ్చువాడు మాత్రం శివుడే.

దేవానాం ప్రీతయే పూజా పంచధైవ ప్రకల్పితా ।
తత్తన్మంత్రజపో హోమో దానం చైవ తపస్తథా ॥23॥

స్థండిలే ప్రతిమాయాం చ హ్యగ్నౌ బ్రాహ్మణవిగ్రహే ।
సమారాధనమిత్యేవం షోడశైరుపచారకైః ॥24॥

దేవతల ఆనందం కోసం అయిదురకాల పూజలు కల్పించబడ్డాయి. ఆయా మంత్రాల జపం, హోమం, దానం, తపస్సు మరియు సమారాధన అనే అయిదురకాలు. సమారాధన అంటే వేదిని, విగ్రహాన్ని, అగ్నిని లేక బ్రాహ్మణుని షోడశోపచారాలతో పూజించాలి.

ఉత్తరోత్తరవైశిష్ట్యాత్పూర్వాభావే తథోత్తరమ్ ।
నేత్రయోశ్శిరసో రోగే తథా కుష్ఠస్య శాంతయే ॥25॥

ఆదిత్యం పూజయిత్వా తు బ్రాహ్మణాన్ భోజయేత్తతః ।
దినం మాసం తథా వర్షం వర్షత్రయమథాపి వా ॥26॥

పైన చెప్పిన నాలుగురకాలకంటే తరువాతదైన అయిదవది గొప్పది కనుక ఆ నాలుగు లేకున్ననూ, తర్వాత దానిని ఆచరించాలి. నేత్రసంబంధరోగాలు, మరియు తలకు సంబంధించిన రోగాలు, కుష్ఠురోగం తగ్గుట కోసం సూర్యభగవానుణ్ణి పూజించి, బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. ఈ విధంగా ఒకరోజు, నెల, సంవత్సరం లేదా మూడుసంవత్సరాలు చేయాలి.

ప్రారబ్ధం ప్రబలం చేత్ స్యాన్నశ్యేద్రోగజరాదికమ్ ।
జపాద్యమిష్టదేవస్య వారాదీనాం ఫలం విదుః ॥27॥

ప్రారబ్ధకర్మ వలన వచ్చిన రోగం బలమైనదైనప్పటికీ, రోగం, వృద్ధాప్యం మొదలైనవి తొలగిపోతాయి. ఆయా వారాలలో ఇష్టదేవతలకు జపాదులు చేస్తే ఆయా మంచిఫలాలు వస్తాయి.

పాపశాంతిర్విశేషేణ హ్యాదివారే నివేదయత్ ।
ఆదిత్యస్యైవ దేవానాం బ్రాహ్మణానాం విశిష్టదమ్ ॥28॥

ఆదివారం రోజున సూర్యుణ్ణి, ఇతర దేవతలను, బ్రాహ్మణులను పూజిస్తే, పాపాలు నశించి గొప్ప ఫలితాలు వస్తాయి.

సోమవారే చ లక్ష్మ్యాదీన్ సంపదర్థం యజేద్బుధః ।
ఆజ్యాన్నేన తథా విప్రాన్ సపత్నీకాంశ్చ భోజయేత్ ॥29॥

పండితుడు సోమవారం నాడు సంపద కోసం లక్ష్మి మొదలైన దేవతలను ఆరాధించి, బ్రాహ్మణదంపతులకు నెయ్యి అన్నాన్ని, భోజనాన్ని పెట్టాలి.

కాల్యాదీన్ భౌమవారే తు యజేద్రోగప్రశాంతయే ।
మాషముద్గాఢకాన్నేన బ్రాహ్మణాంశ్చైవ భోజయేత్ ॥30॥

మంగళవారం నాడు రోగాలు తగ్గడం కోసం కాళి మొదలగు దేవతలను పూజించి మినుము, కంది, పెసరపప్పులతో బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి.

సౌమ్యవారే తథా విష్ణుం దధ్యన్నేన యజేద్బుధః ।
పుత్రమిత్రకలత్రాదిపుష్టిర్భవతి సర్వదా ॥31॥

బుధవారం రోజున పండితుడు పెరుగు అన్నాన్ని నైవేద్యం పెట్టి, విష్ణువును పూజించాలి. ఆ విధంగా చేస్తే, కొడుకులు, మిత్రులు, భార్య మొదలగు వారికి అన్ని వేళల ఆరోగ్యం కలుగుతుంది.

ఆయుష్కామో గురోర్వారే దేవానాం పుష్టిసిద్ధయే ।
ఉపవీతేన వస్త్రేణ క్షీరాజ్యేన యజేద్బుధః ॥32॥

ఆయుష్షును, ఆరోగ్యాన్ని కోరుకునే పండితుడు గురువారం నాడు దేవతలను ఉపవీతంతో, వస్త్రాలతో, పాలతో, నేయితో అర్చించాలి.

భోగార్థం భృగువారే తు యజేద్దేవాన్ సమాహితః ।
షడ్రసోపేతమన్నం చ దద్యాద్బ్రాహ్మణతృప్తయే ॥33॥

శుక్రవారం నాడు శ్రద్ధతో దేవతలను పూజిస్తే భోగాలు లభిస్తాయి. ఆరురుచుల వంటలతో బ్రాహ్మణులకు తృప్తిగా అన్నం పెట్టాలి.

స్త్రీణాం చ తృప్తయే తద్వద్దేయం వస్త్రాదికం శుభమ్ ।
అపమృత్యుహరం మందే రుద్రాదీంశ్చ యజేద్బుధః ॥34॥

స్త్రీలకు కూడా తృప్తి కలుగు విధంగా శుభమగు బట్టలు పెట్టాలి. అకాలమృత్యుదోషం నుండి తప్పించుకోవడానికి శనివారం నాడు రుద్రాదిదేవతలను పూజించాలి.

తిలహోమేన దానేన తిలాన్నేన చ భోజయేత్ ।
ఇత్థం యజేచ్చ విబుధానారోగ్యాది ఫలం లభేత్ ॥35॥

శనివారం రోజున నువ్వులతో హోమం చేసి, నువ్వులను దానమిచ్చి, నువ్వులు అన్నంతో పండితులకు భోజనం పెడితే ఆరోగ్యం మొదలైన ఫలితాలు లభిస్తాయి.

దేవానాం నిత్యయజనే విశేషయజనేపి చ ।
స్నానే దానే జపే హోమే బ్రాహ్మణానాం చ తర్పణే ॥36॥

రోజూ దేవతలను ఆరాధించాలి. తీర్థంలో స్నానం చేసి, జప, హోమ, దానాలను చేయాలి. బ్రాహ్మణులను సంతోష పెట్టాలి.

తిథి నక్షత్ర యోగే చ తత్తద్దేవప్రపూజనే ।
ఆదివారాది వారేషు సర్వజ్ఞో జగదీశ్వరః ॥37॥

తత్తద్రూపేణ సర్వేషామారోగ్యాది ఫలప్రదః ।
దేశకాలానుసారేణ తథా పాత్రానుసారతః ॥38॥

ఆదివారం మొదలుగా అన్ని వారాలలో తిథి, నక్షత్రం కలిసి వచ్చినపుడు ఆయా దేవతలను పూజించాలి. సర్వజ్ఞుడు, జగతికి ప్రభువైన శివుడు ఆయా దేవతల రూపంలో భక్తులందరికీ దేశకాలాల ననుసరించీ, యోగ్యత ననుసరించీ ఆరోగ్యం మొదలైన ఫలాలను ఇస్తాడు.

ద్రవ్యశ్రద్ధానుసారేణ తథా లోకానుసారతః ।
తారతమ్య క్రమాద్దేవస్త్వారోగ్యాదీన్ ప్రయచ్ఛతి ॥39॥

ధనాన్ని, శ్రద్ధను మరియు లోకాలకు సంబంధించిన తారతమ్యాలకు అనుగుణంగా మహాదేవుడు ఆరోగ్యం మొదలైన ఫలాలను ఇస్తాడు.

శుభాదావశుభాంతే చ జన్మర్‌క్షేషు గృహే గృహీ ।
ఆరోగ్యాదిసమృద్ధ్యర్థమాదిత్యాదీన్ గ్రహాన్ యజేత్ ॥40॥

గృహస్థుడు తన ఇంటిలోని శుభకర్మలకి ప్రారంభం లోనూ, అశుభకర్మలకు చివర లోనూ, జన్మనక్షత్రం రోజున ఆరోగ్యం, సమృద్ధి రావటం కోసమూ ఆదిత్యాదినవగ్రహాలను పూజించాలి.

తస్మాద్వై దేవయజనం సర్వాభీష్టఫలప్రదమ్ ।
సమంత్రకం బ్రాహ్మణానామ్ అన్యేషాం చైవ తాంత్రికమ్ ॥41॥

దేవతారాధన వలన కోరిన ఫలాలన్నీ వస్తాయి. బ్రాహ్మణులు మంత్రయుక్తంగానూ, ఇతరులు తంత్రయుక్తంగానూ దేవయజ్ఞం చేయాలి.

యథాశక్త్యనురూపేణ కర్తవ్యం సర్వదా నరైః ।
సప్తస్వపి చ వారేషు నరైశ్శుభఫలేప్సుభిః ॥42॥

శుభఫలితాలు కోరుకునే మానవులు ఏడువారాలలో తమశక్తికి అనుకూలంగా దేవపూజను చేయాలి.

దరిద్రస్తపసా దేవాన్ యజేదాఢ్యో ధనేన హి ।
పునశ్చైవం విధం ధర్మం కురుతే శ్రద్ధయా సహ ॥43॥

పునశ్చ భోగాన్వివిధాన్ భుక్త్వా భూమౌ ప్రజాయతే ।
ఛాయాం జలాశయం బ్రహ్మప్రతిష్ఠాం ధర్మసంచయమ్ ॥44॥

సర్వం చ విత్తవాన్ కుర్యాత్సదా భోగప్రసిద్ధయే ।
కాలాచ్చ పుణ్యపాకేన జ్ఞానసిద్ధిః ప్రజాయతే ॥45॥

ధనం లేని వాడు తపస్సుతో దేవతలను ఆరాధించాలి. ధనికుడు ధనాన్ని వినియోగించి శ్రద్ధతో దేవపూజలు చేసి, ధర్మాన్ని అనుష్ఠిస్తే పరలోకంలో వివిధభోగాలు అనుభవించి, మరల భూలోకంలో జన్మిస్తారు. నీడనిచ్చే చెట్లను పాతటం, చెరువులను తవ్వించటం, వేదపాఠశాలలు నిర్మించటం వంటి అనేక ధర్మకార్యక్రమాల్ని ధనవంతుడు చేస్తే అనేక భోగములు పొందుతాడు. అట్టి దాత కాలక్రమంలో పుణ్యప్రభావంతో జ్ఞానసిద్ధిని కూడా పొందుతాడు.

య ఇమం శ్రుణుతేఽధ్యాయం పఠతే వా నరో ద్విజః ।
శ్రవణస్యోపకర్తా చ దేవయజ్ఞఫలం లభేత్ ॥46॥

ఓ బ్రాహ్మణులారా! ఏ మానవుడైతే ఈ అధ్యాయాన్ని వినునో, చదువునో, వినుటకు సహకరించునో, అతడు దేవయజ్ఞఫలాలను పొందుతాడు.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం యజ్ఞత్రయమ్-సప్తాహమ్ నామ చతుర్దశోఽధ్యాయః ॥14॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వర సంహితయందు మూడు యజ్ఞాలు – సప్తాహమనే పద్నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచదశోఽధ్యాయః - పదిహేనవ అధ్యాయం
దానాని, దేశకాలపాత్రాణి - దానము, దేశకాలపాత్రలు

ఋషయ ఊచు - ఋషులు ఇట్లు పలికారు.

దేశాదీన్ క్రమశో బ్రూహి సూత సర్వార్థ విత్తమ ।

అన్ని విషయాలు తెలిసినవారిలో గొప్పవాడవైన ఓ సూతా! మాకు దేశం, కాలం మొదలైన విషయాలు వరసగా చెప్పండి.

సూత ఉవాచ - సూతుడు ఇట్లు చెప్పాడు.

శుద్ధం గృహం సమఫలం దేవయజ్ఞాదికర్మసు ॥1॥

దేవయజ్ఞం మొదలైన కర్మలకు శుద్ధగృహం సమఫలాన్ని ఇస్తుంది.

తతో దశగుణం గోష్ఠం జలతీరం తతో దశ ।
తతో దశగుణం బిల్వతులస్యశ్వత్థమూలకమ్ ॥2॥

గోశాల దానికంటే పదిరెట్లు ఫలాన్ని, జలాశయతీరాల్లో దానికంటే పదిరెట్లు ఫలాన్ని, మారేడు, తులసి, రావిచెట్ల మూలం దానికంటే పదిరెట్ల ఫలాల్ని ఇస్తుంది.

తతో దేవాలయం విద్యాత్తీర్థతీరం తతో దశ ।
తతో దశగుణం నద్యాస్తీర్థనద్యాస్తతో దశ ॥3॥

దేవాలయం దానికంటే పదిరెట్ల ఫలాన్ని, తీర్థంయొక్క తీరం దానికంటే పదిరెట్ల ఫలాన్ని, నదీతీరం దానికంటే పదిరెట్లు ఫలాన్ని ఇస్తుంది.

సప్తగంగానదీతీరం తస్యా దశగుణం భవేత్ ।
గంగాగోదావరీ చైవ కావేరీ తామ్రపర్ణికా ॥4॥

సింధుశ్చ సరయూ రేవా సప్తగంగాః ప్రకీర్తితాః ।
తతోఽబ్ధితీరం దశ చ పర్వతాగ్రే తతో దశ ॥5॥

ఏడుగంగలనే నదుల తీరాలు దానికంటే పదిరెట్లు ఫలాన్ని ఇస్తాయి. గంగ, గోదావరి, కావేరి, తామ్రపర్ణి. సింధు, సరయు, రేవా నదులకు సప్తగంగలని పేరు. సముద్రతీరం వాటికంటే పదిరెట్లు ఫలాన్ని, దానికంటే పదిరెట్లు ఫలాన్ని పర్వతశిఖరం ఇస్తుంది.

సర్వస్మాదధికం జ్ఞేయం యత్ర వా రోచతే మనః ।
కృతే పూర్ణఫలం జ్ఞేయం యజ్ఞదానాదికం తథా ॥6॥

మనసుకి నచ్చిన చోటు అన్నింటికంటే ఎక్కువ ఫలాన్నిస్తుంది. యజ్ఞం, దానం వంటి కర్మలకు కృతయుగంలో సంపూర్ణఫలం,

త్రేతాయుగే త్రిపాదం చ ద్వాపరేఽర్ధం సదా స్మృతమ్ ।
కలౌ పాదం తు విజ్ఞేయం తత్పాదోనం తతోఽర్ధకే ॥7॥

త్రేతాయుగంలో నాలుగింట మూడొంతుల ఫలం, ద్వాపరంలో సగం ఫలం లభిస్తుందని చెప్పబడింది. కలియుగంలో నాల్గవ వంతు ఫలం లభిస్తుంది. కలియుగంలో సగకాలం పూర్తయిన తర్వాత నాల్గవ వంతుకంటే తక్కువ ఫలం వస్తుందని తెలుసుకోవాలి.

శుద్ధాత్మనశ్శుద్ధదినం పుణ్యం సమఫలం విదుః ।
తస్మాద్దశగుణం జ్ఞేయం రవిసంక్రమణే బుధాః ॥8॥

శుద్ధమైన మనస్సుతో పవిత్రమైన రోజున పుణ్యకర్మ చేస్తే, సమఫలాలు వస్తాయని చెప్తారు. ఓ పండితులారా! రవిసంక్రమణం రోజున చేస్తే, దానికి పదిరెట్లు ఫలితాలు వస్తాయి.

విషువే తద్దశగుణమయనే తద్దశ స్మృతమ్ ।
తద్దశ మృగసంక్రాంతౌ తచ్చంద్రగ్రహణే దశ ॥9॥

సూర్యుడు విషురేఖపై ఉన్నపుడు చేసినచో దానికి పదిరెట్లు ఫలం వస్తుంది. దక్షిణాయన ఆరంభంలో చేస్తే దానికి పదిరెట్లు ఫలం వస్తుంది. మకరసంక్రాంతి నాడు అయితే దానికంటే పదిరెట్లు, చంద్రగ్రహణం నాడు దానికంటే పదిరెట్లు ఫలం వస్తుంది.

తతశ్చ సూర్యగ్రహణే పూర్ణకాలోత్తమే విదుః ।
జగద్రూపస్య సూర్యస్య విషయోగాచ్చ రోగదమ్ ॥ 10॥

అతస్తద్విషశాంత్యర్థం స్నానదానజపాంశ్చరేత్ ।
విషశాంత్యర్థకాలత్వాత్సకాలః పుణ్యదః స్మృతః ॥11॥

దానికంటే ఉత్తమమైంది పూర్తిఫలాలను ఇచ్చేది సూర్యగ్రహణకాలం అని చెప్తారు. ప్రపంచానికి రూపాన్ని ఇచ్చే సూర్యుడు రాహువుచే పట్టుబడిన వాడగుట చేత ఆ దోషం పోవటం కోసం స్నానం, జపం చేయాలి. ఆ కాలం దోషశాంతిని చేస్తుంది. కాబట్టి పుణ్యకాలమన్నారు.

జన్మర్క్షే చ వ్రతాంతే చ సూర్యరాగోపమం విదుః ।
మహతాం సంగకాలశ్చ కోట్యర్కగ్రహణం విదుః ॥12॥

జన్మనక్షత్రం వచ్చిన రోజు, వ్రతం పూర్తయిన రోజు సూర్యగ్రహణకాలంతో సమమైన రోజు అని చెప్పారు. మహాపురుషుల కలయిక కోటిసూర్యగ్రహణాలతో సమానమైనదని చెప్పారు.

తపోనిష్ఠా జ్ఞాననిష్ఠా యోగినో యతయస్తథా ।
పూజాయాః పాత్రమేతే హి పాపసంక్షయకారణమ్ ॥13॥

తపస్సు చేసిన వాళ్లు, జ్ఞానులు, యోగులు మరియు యతులు పూజకు అర్హత గలవాళ్లు. వీళ్లని పూజిస్తే పాపాలు నశిస్తాయి.

చతుర్వింశతిలక్షం వా గాయత్ర్యా జపసంయుతః ।
బ్రాహ్మణస్తు భవేత్పాత్రం సంపూర్ణఫలభోగదమ్ ॥14॥

గాయత్రిని ఇరవైనాలుగులక్షలసార్లు జపం చేసిన బ్రాహ్మణుడు సంపూర్ణఫలాల్ని, భోగాలను ఇచ్చే దానానికి అర్హత గల వాడని చెప్పబడినది.

పతనాత్త్రాయత ఇతి పాత్రం శాస్త్రే ప్రయుజ్యతే ।
దాతుశ్చ పాతకాత్త్రాణాత్పాత్రమిత్యభిధీయతే ॥15॥

మానవుడు పతితుడు కాకుండా రక్షించునది పాత్రము అని శాస్త్రం చెప్తోంది. మరియు దానం ఇచ్చిన వాడిని పాతకము నుండి రక్షించునది పాత్రము అని చెప్పబడుచున్నది.

గాయకం త్రాయతే పాతాద్గాయత్రీత్యుచ్యతే హి సా ।
యదార్థహీనో లోకేఽస్మిన్ పరస్యార్థం న యచ్ఛతి ॥16॥

గానం (జపం) చేసేవాడిని పతితుడు కాకుండా రక్షించేది కాబట్టి గాయత్రీమంత్రానికి ఆ పేరు వచ్చింది. ఈ లోకంలో ధనం లేని వాడు ఇతరులకు ధనం ఇవ్వలేడు.

అర్థవానిహ యో లోకే పరస్యార్థం ప్రయచ్ఛతి ।
స్వయం శుద్ధో హి పూతాత్మా నరాన్ సంత్రాతుమర్హతి ॥17॥

ధనం కలవాడే ఇతరులకు ధనాన్ని ఇవ్వగలడు. అలాగే శుద్ధమైన, పవిత్రమైన మనస్సు కలవాడు మాత్రమే ఇతరులను రక్షించగలడు.

గాయత్రీ జపశుద్ధో హి శుద్ధబ్రాహ్మణ ఉచ్యతే ।
తస్మాద్దానే జపే హోమే పూజాయాం సర్వకర్మణి ॥18॥

దానం కర్తుం తథా త్రాతుం పాత్రం తు బ్రాహ్మణోఽర్హతి ।
అన్నస్య క్షుధితం పాత్రం నారీనరమయాత్మకమ్ ॥19॥

గాయత్రీజపంతో శుద్ధిని పొందిన వానిని శుద్ధబ్రాహ్మణుడంటారు. కాబట్టి జప, హోమ, పూజవంటి అన్ని కర్మలలో మరియు దానం చేయటానికి, తీసుకోవటానికి ఇటువంటి బ్రాహ్మణుడు మాత్రమే అర్హుడవుతాడు. స్త్రీ గాని, పురుషుడు కాని ఆకలి వేసిన వ్యక్తి అన్నానికి పాత్రుడౌతాడు.

బ్రాహ్మణం శ్రేష్ఠమాహూయ యత్కాలే సుసమాహితమ్ ।
తదర్థం శబ్దమర్థం వా సద్బోధకమభీష్టదమ్ ॥20॥

శ్రేష్ఠుడు, మంచి మనస్సు కలవాడు, మంచి ఆచార్యుడైన బ్రాహ్మణుని పిలిచి, గాయత్రీమంత్రాన్ని పూర్తిగా కాని, లేదా సగం కాని తెలుసుకుంటే కోరికలన్నీ నెరవేరుతాయి.

ఇచ్ఛావతః ప్రదానం చ సంపూర్ణఫలదం విదుః ।
యత్ప్రశ్నానంతరం దత్తం తదర్ధం ఫలదం విదుః ॥21॥

ఒకవస్తువుపై ఇష్టంగల మనిషికి దానిని అడగక ముందే ఇస్తే, పూర్తిపుణ్యం వస్తుంది. అడిగిన తర్వాత ఇస్తే సగం ఫలం వస్తుందని ఋషుల అభిప్రాయం.

యత్సేవకాయ దత్తం స్యాత్తత్పాదఫలదం విదుః ।
జాతిమాత్రస్య విప్రస్య దీనవృత్తేర్ద్విజర్షభాః ॥22॥

దత్తమర్థం హి భోగాయ భూర్లోకే దశవార్షికమ్ ।
వేదయుక్తస్య విప్రస్య స్వర్గే హి దశవార్షికమ్ ॥23॥

సేవకులకు దానం చేస్తే నాలుగవ వంతు ఫలం లభిస్తుంది. ఓ బ్రాహ్మణోత్తములారా! పుట్టుకతో బ్రాహ్మణుడై పేదరికంతో జీవిస్తున్న వారికి ధనాన్నిస్తే భూలోకంలో పదిసంవత్సరాల భోగాలు దాతలకు లభిస్తాయి. అదే ధనాన్ని వేదవేత్తయైన బ్రాహ్మణునికిస్తే, స్వర్గంలో పదిసంవత్సరాలు భోగాలు లభిస్తాయి.

గాయత్రీ జపయుక్తస్య సత్యే హి దశవార్షికమ్ ।
విష్ణుభక్తస్య విప్రస్య దత్తం వైకుంఠదం విదుః ॥24॥

శివభక్తస్య విప్రస్య దత్తం కైలాసదం విదుః ।
తత్తల్లోకోపభోగార్థం సర్వేషాం దానమిష్యతే ॥25॥

గాయత్రీజపం చేసే వానికిస్తే, పదిసంవత్సరములు సత్యలోకంలో భోగాలు కలుగుతాయి. విష్ణుభక్తి గల బ్రాహ్మణునకిస్తే వైకుంఠం అలాగే శివభక్తి గల బ్రాహ్మణునికి దానం చేస్తే కైలాసమే లభిస్తుందని చెప్పారు. వీళ్లందరికీ దానం చేస్తే, ఆయా లోకాలన్నిటిలో భోగాలు లభిస్తాయి.

దశాంగమన్నం విప్రస్య భానువారే దదన్నరః ।
పరజన్మని చారోగ్యం దశవర్షం సమశ్నుతే ॥26॥

బ్రాహ్మణునికి ఆదివారం నాడు పది అంగాలతో కూడిన అన్నం పెడితే, దాతకు మరుజన్మలో పదిసంవత్సరాలఆరోగ్యం వస్తుంది.

బహుమానమథాహ్వానమభ్యంగం పాదసేవనమ్ ।
వాసో గంధాద్యర్చనం చ ఘృతాపూపరసోత్తరమ్ ॥27॥

షడ్రసం వ్యంజనం చైవ తాంబూలం దక్షిణోత్తరమ్ ।
నమశ్చానుగమశ్చైవ స్వన్నదానం దశాంగకమ్ ॥28॥

ఆదరం, ఆహ్వానం, అభ్యంగస్నానం, పాదసేవ, వస్త్రం, గంధాలతో పూజ, నేతి అప్పములతో పచ్చళ్లతో కూడిన ఆరురుచుల భోజనం మరియు తాంబూలం, దక్షిణ, నమస్కారం, కొంతదూరం వరకు వెళ్లి సాగనంపటం అనే పది అంగాలతో కూడిన అన్నం పెట్టాలి.

దశాంగమన్నం విప్రేభ్యో దశభ్యో వై దదన్నరః ।
అర్కవారే తథాఽఽరోగ్యం శతవర్షం సమశ్నుతే ॥29॥

దశాంగాలతో కూడిన అన్నాన్ని ఆదివారంనాడు పదిమంది బ్రాహ్మణులకు పెట్టిన వ్యక్తి వందసంవత్సరాలు ఆరోగ్యంగా జీవిస్తాడు.

సోమవారాది వారేషు తత్తద్వారగుణం ఫలమ్ ।
అన్నదానస్య విజ్ఞేయం భూర్లోకే పరజన్మని ॥30॥

సోమ మొదలైన వారాలలో అన్నదానం చేసిన వారికి ఈ లోకంలో, పరలోకంలో దానిఫలం వార సంఖ్యను బట్టి అన్నిరెట్లు అవుతుందని తెలుసుకోవాలి.

సప్తస్వపి చ వారేషు దశభ్యశ్చ దశాంగకమ్ ।
అన్నం దత్త్వా శతం వర్షమారోగ్యాదికమశ్నుతే ॥31॥

ఏడువారాలలో పదిమందికి దశాంగాలతో కూడిన అన్నం పెడితే, వందసంవత్సరాల ఆరోగ్యం మొదలైన ఫలాలు పొందుతారు.

ఏవం శతేభ్యో విప్రేభ్యో భానువారే దదన్నరః ।
సహస్రవర్షమారోగ్యం శర్వలోకే సమశ్నుతే ॥32॥

అదే విధంగా ఆదివారం నాడు వందమంది బ్రాహ్మణులకు అన్నదానం చేస్తే శివలోకంలో వేయిసంవత్సరాలు ఆరోగ్యం వస్తుంది.

సహస్రేభ్యస్తథా దత్త్వాఽయుతవర్షం సమశ్నుతే ।
ఏవం సోమాదివారేషు విజ్ఞేయం హి విపశ్చితా ॥33॥

వేయిమందికి అన్నం పెడితే పదివేల సం॥లు శివలోకంలో భోగాలు పొందుతారు. సోమ మొదలగు వారాలలో కూడా ఇటువంటి ఫలితాలు వస్తాయని విద్వాంసులు తెలుసుకోవాలి.

భానువారే సహస్రాణాం గాయత్రీపూతచేతసామ్ ।
అన్నం దత్త్వా సత్యలోకే హ్యారోగ్యాది సమశ్నుతే ॥34॥

గాయత్రీమంత్రముచే పవిత్రమైన మనస్సు గల వేయిమందికి ఆదివారం నాడు అన్నదానం చేసిన మనిషికి సత్యలోకంలో ఆరోగ్యాది భోగాలు వస్తాయి.

అయుతానాం తథా దత్వా విష్ణులోకే సమశ్నుతే ।
అన్నం దత్వా తు లక్షాణాం రుద్రలోకే సమశ్నుతే ॥35॥

పదివేలమందికి పెట్టినచో విష్ణులోకమందు, లక్షమందికి పెడితే రుద్రలోకంలో భోగాలు వస్తాయి.

బాలానాం బ్రహ్మబుద్ధ్యా హి దేయం విద్యార్థిభిర్నరైః ।
యూనాం చ విష్ణుబుద్ధ్యా హి పుత్రకామార్థిభిర్నరైః ॥36॥

విద్య కావాలనుకున్న మనుషులు బాలురయందు బ్రహ్మభావన కల్గి, అన్నదానం చేయాలి. పుత్రసంతానాన్ని కావాలనుకున్నవాళ్లు విష్ణుబుద్ధితో దానం చేయాలి.

వృద్ధానాం రుద్రబుద్ధ్యా హి దేయం జ్ఞానార్థిభిర్నరైః ।
బాలస్త్రీ భారతీబుద్ధ్యా బుద్ధికామైర్నరోత్తమైః ॥37॥

జ్ఞానం కోరుకునే వారు వృద్ధులయందు రుద్రబుద్ధితో దానం చేయాలి. బుద్ధిశక్తిని కోరుకునే వారు కన్యలయందు సరస్వతిని భావన చేసి, దానం చేయాలి.

లక్ష్మీబుద్ధ్యా యువస్త్రీషు భోగకామైర్నరోత్తమైః ।
వృద్ధాసు పార్వతీబుద్ధ్యా దేయమాత్మార్థిభిర్నరైః ॥38॥

భోగములను కోరే మనుషులు యువతులయందు లక్ష్మీబుద్ధితో, ఆత్మజ్ఞానాన్ని కోరేవారు వృద్ధస్త్రీలయందు పార్వతీభావంతోను దానం చేయాలి.

శిలవృత్త్యోంఛవృత్త్యా చ గురుదక్షిణయార్జితమ్ ।
శుద్ధద్రవ్యమితి ప్రాహుస్తత్పూర్ణఫలదం విదుః ॥39॥

శిలావృత్తి అనగా పొలంలో పడిన వరి, గోధుమ కంకులను ఏరుకొనుట, ఉంఛవృత్తి అనగా పొలంలో కింద పడిన గింజలను ఏరుకొనుట. ఈ విధంగా దొరికినవి, గురుదక్షిణగా వచ్చిన ధనం శుద్ధమని, వాటిని దానం చేస్తే పూర్తి ఫలం వస్తుందని చెప్పారు.

శుక్లప్రతిగ్రహాద్దత్తం మధ్యమం ద్రవ్యముచ్యతే ।
కృషివాణిజ్యకోపేతమధమం ద్రవ్యముచ్యతే ॥40॥

శుద్ధంగా బహుమతి తీసుకున్న ధనం మధ్యమం అని, వ్యవసాయం, వ్యాపారాల వల్ల వచ్చిన ధనం అధమం అని చెప్పబడింది.

క్షత్రియాణాం విశాం చైవ శౌర్యవాణిజ్యకార్జితమ్ ।
ఉత్తమం ద్రవ్యమిత్యాహుశ్శూద్రాణాం భృతకార్జితమ్ ॥41॥

క్షత్రియులకు పరాక్రమం వల్ల వచ్చిన ధనం, వైశ్యులకు వ్యాపారం వల్ల వచ్చిన ధనం, శూద్రులకు శ్రమతో వచ్చిన ధనం ఉత్తమమైనవి.

స్త్రీణాం ధర్మార్థినాం ద్రవ్యం పైతృకం భర్తృకం తథా ।
గవాదీనాం ద్వాదశీనాం చైత్రాదిషు యథాక్రమమ్ ॥42॥

ధర్మాన్ని కోరుకునే స్త్రీలకు తండ్రి, భర్త ఇచ్చిన ధనం ఉత్తమం. చైత్రమాసం మొదలు పన్నెండుమాసాలలో ఆవు మొదలగు పన్నెండు వస్తువులను వరుసగా దానం చేయాలి.

సంభూయ వా పుణ్యకాలే దద్యాదిష్టసమృద్ధయే ।
గోభూతిలహిరణ్యాజ్య వాసో ధాన్య గుడాని చ ॥43॥

రౌప్యం లవణకుష్మాండే కన్యా ద్వాదశకం తథా ।
గోదానాద్దత్తగవ్యేన గోమయేనోపకారిణా ॥44॥

లేదా వాటన్నింటిని కలిపి పుణ్యకాలంలో దానం చేస్తే కోరుకున్నవి నెరవేరుతాయి. ఆవు, భూమి, నువ్వులు, బంగారం, నెయ్యి, బట్టలు, ధాన్యం, బెల్లం వెండి, ఉప్పు, గుమ్మడికాయ, కన్య అనే పన్నెండువస్తువులు, ఆవును, ఆవుపాలను, నెయ్యిని, దానం చేసినచో, ధనం, ధాన్యం వాటితో కూడిన చెడుఫలితాలు దూరమౌతాయి. పేడ కూడా ధాన్యాదుల రక్షణకు ఉపయోగపడుతుంది.

ధనధాన్యాద్యాశ్రితానాం దురితానాం నివారణమ్ ।
జలస్నేహాశ్రితానాం చ దురితానాం తు గోజలైః ॥45॥

ఆవు ముట్టుకున్న నీళ్లను ప్రోక్షిస్తే, జల, తైల దోషాలు తొలగిపోతాయి.

కాయికాది త్రయాణాం తు క్షీరదధ్యాజ్యకైస్తథా ।
తథా తేషాం చ పుష్టిశ్చ విజ్ఞేయో హి విపశ్చితా ॥46॥

ఆవుపాలు, పెరుగు, నెయ్యిని దానం చేస్తే శారీరక, వాచక, మానసికాలను మూడురకాలదోషాలు తొలగిపోయి, శరీరం మాట, మనస్సు కూడా పుష్టికరాలౌతాయని విద్వాంసులు తెలుసుకోవాలి.

భూదానం తు ప్రతిష్ఠార్థమిహ చాఽముత్ర చ ద్విజాః ।
తిలదానం బలార్థం హి సదా మృత్యుజయం విదుః ॥47॥

ఓ బ్రాహ్మణులారా! భూదానం వలన ఇహపరలోకంలో స్థిరత్వం వస్తుంది. నువ్వుల దానం వల్ల బలం, మరణాన్ని జయించగల శక్తి వస్తాయి.

హిరణ్యం జాఠరాగ్నేస్తు వృద్ధిదం వీర్యదం తథా ।
ఆజ్యం పుష్టికరం విద్యాద్వస్త్రమాయుష్కరం విదుః ॥48॥

బంగారాన్ని దానం చేస్తే జఠరాగ్ని (ఆకలిని పుట్టించే శక్తి) ద్వారా బలం వస్తుంది. పరాక్రమము కలుగుతుంది నెయ్యి దానం చేస్తే పుష్టి, బట్టలు దానం చేస్తే ఆయుష్షు కల్గుతాయని తెలుసుకోవాలి.

ధాన్యమన్నం సమృద్ధ్యర్థం మధురాహారదం గుడమ్ ।
రౌప్యం రేతోభివృద్ధ్యర్థం షడ్రసార్థం తు లావణమ్ ॥49॥

ధాన్యం వల్ల అన్నం కావలసినంత పెరుగుతుంది. బెల్లం వల్ల తీయని ఆహారం లభిస్తుంది. వెండి దానం చేయటం వల్ల వీర్యాభివృద్ధి, ఉప్పు దానం చేయటం వల్ల ఆరు రుచులతో కలసిన మంచి ఆహారం లభిస్తుంది.

సర్వం సర్వసమృద్ధ్యర్థం కుష్మాండం పుష్టిదం విదుః ।
ప్రాప్తిదం సర్వభోగానామిహ చాఽముత్ర చ ద్విజాః ॥50॥

అన్నింటిని దానం చేస్తే, అన్నిరకాల అభివృద్ధులు కలుగుతాయి. గుమ్మడికాయను దానం చేస్తే పుష్టి కలుగుతుంది.

యావజ్జీవనముక్తం హి కన్యాదానం తు భోగదమ్ ।
పనసామ్రకపిత్థానాం వృక్షాణాం ఫలమేవ చ ॥51॥

కదల్యాద్యౌషధీనాం చ ఫలం గుల్మోద్భవం తథా ।
మాషాదీనాం చ ముద్గానాం ఫలం శాకాదికం తథా ॥52॥

మరీచిసర్షపాద్యానాం శాకోపకరణం తథా ।
యదృతౌ యత్ఫలం సిద్ధం తద్దేయం హి విపశ్చితా ॥53॥

కన్యాదానం వలన జీవించియున్నంతకాలం భోగాలు లభిస్తాయి. పనస, మామిడి, వెలగ, అరటి మొదలగు పళ్లను, మినుములు, పెసలు, కూరలను మిరియాలు, ఆవాలు మొదలగు కూరకు అవసరమయ్యే వస్తువులను, ఆయా ఋతువుల్లో పంచే పండ్లను పుష్పాలను దాత దానం చేయాలి.

శ్రోత్రాదీంద్రియతృప్తిశ్చ సదా దేయా విపశ్చితా ।
శబ్దాదిదశభోగార్థం దిగాదీనాం చ తుష్టిదా ॥54॥

విద్వాంసుడు ఇతరుల మనస్సు, బుద్ధి, చెవులకు ఆనందాన్నిచ్చే శబ్దాది పదివిషయాలను సమకూర్చి, దిశ మొదలైన ఇంద్రియాధిష్ఠానదేవతలకు సంతోషాన్ని కలిగించాలి.

వేదశాస్త్రం సమాదాయ బుద్ధ్వా గురుముఖాత్స్వయమ్ ।
కర్మణాం ఫలమస్తీతి బుద్ధిరాస్తిక్యముచ్యతే ॥55॥

గురువు ముఖం నుండి వేదశాస్త్రాలను తెలసుకొని, కర్మలకు ఫలాలు ఉంటాయన్న నమ్మిన తర్వాత బుద్ధిని కలిగియుండుట ఆస్తిక్యం అంటారు.

బంధురాజభయాద్బుద్ధి శ్రద్ధా సా చ కనీయసీ ।
సర్వాభావే దరిద్రస్తు వాచా వా కర్మణా యజేత్ ॥56॥

చుట్టాలు లేక రాజు భయం వల్ల శ్రద్ధ, బుద్ధి కలిగి ఉంటే అది అధమమైన శ్రద్ధ అవుతుంది. పేదవాడు ఏ వస్తువులు లేనివాడైనప్పటికి మాటలు, శరీరం ద్వారా యజ్ఞం చేయాలి.

వాచికం యజనం విద్యాన్మంత్రస్తోత్రజపాదికమ్ ।
తీర్థయాత్రా వ్రతాద్యం హి కాయికం యజనం విదుః ॥57॥

మంత్రాన్ని, స్తోత్రాన్ని చదవటం, జపం చేయటం వాటిని వాచిక యజ్ఞం అని; తీర్థయాత్రలు చేయటం, వ్రతాలు చేయటం వాటిని కాయికయజ్ఞాలని తెలిసికోవాలి.

యేన కేనాప్యుపాయేన హి అల్పం వా యది వా బహు ।
దేవతార్పణబుద్ధ్యా చ కృతం భోగాయ కల్పతే ॥58॥

ఏదో ఒక ఉపాయాన్ని ఆలోచించి, ఎక్కువ కాని, తక్కువ కాని దానాన్ని లేదా కర్మలను దేవతలకు అర్పించే బుద్ధితో చేస్తే అట్టి మనుషులు భోగాలు అనుభవిస్తారు.

తపశ్చర్యా చ దానం చ కర్తవ్యముభయం సదా ।
ప్రతిశ్రయం ప్రదాతవ్యం స్వవర్ణగుణశోభితమ్ ॥59॥

తపస్సు, దానం అనే రెండింటిని అన్ని వేళల్లో చేస్తుండాలి. చక్కని రంగులతో సౌకర్యాలతో ఉండే గృహాన్ని దేవతల ప్రీతికొరకు దానం చేయాలి.

దేవానాం తృప్తయేఽత్యర్థం సర్వభోగప్రదం బుధైః ।
ఇహాఽముత్రోత్తమం జన్మ సదా భోగం లభేద్బుధః ॥
ఈశ్వరార్పణబుద్ధ్యా హి కృత్వా మోక్షఫలం లభేత్ ॥60॥

ఆ విధంగా దేవతల తృప్తికొరకు మిక్కిలిగా దానం చేసిన దాతకు ఈ లోకంలో ఉత్తమజన్మ, పరలోకంలో ఉత్తమగతి వస్తాయి. చేసే ప్రతిపని ఈశ్వరార్పణం చేస్తూ దానం చేసే వ్యక్తికి మోక్షం వస్తుంది.

య ఇమం పఠతేఽధ్యాయం యః శృణోతి సదా నరః ।
తస్య వై ధర్మబుద్ధిశ్చ జ్ఞానసిద్ధిః ప్రజాయతే ॥61॥

ఈ అధ్యాయాన్ని ప్రతిరోజూ శ్రద్ధతో చదివిన వారికి ధర్మబుద్ధి కల్గి జ్ఞానం వస్తుంది.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం దానాని-దేశకాలపాత్రాణి నామ పంచదశోఽధ్యాయః ॥15॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు దానము - దేశకాలపాత్రలు అనుపేరు గల పదిహేనవ అధ్యాయం సమాప్తం.

షోడశోఽధ్యాయః - పదహారవ అధ్యాయం

పూజావిధానమ్, పూజాఫలమ్ - పూజావిధానం, పూజాఫలం

ఋషయ ఊచుః - ఋషులు ఇలా పలికారు.

పార్థివప్రతిమాపూజావిధానం బ్రూహి సత్తమ ।
యేన పూజావిధానేన సర్వాభీష్టమవాప్యతే ॥1॥

ఓ మహానుభావా! ఏ పూజల వలన కోర్కెలు తీరుతాయో, అటువంటి మట్టి ప్రతిమను పూజించే విధానం చెప్పండి.

సూత ఉవాచ - సూతుడు ఇలా చెప్పాడు.

సుసాధు పృష్టం యుష్మాభిః సదా సర్వార్థదాయకమ్ ।
సద్యో దుఃఖస్య శమనం శృణుత ప్రబ్రవీమి వః ॥2॥

మీరు చాలా చక్కగా అడిగారు. అన్నివేళలలో అన్ని ఫలాలు ఇచ్చి, వెనువెంటనే దుఃఖాలను పోగొట్టే పూజావిధానాన్ని వినండి.

అపమృత్యుహరం కాలమృత్యోశ్చాపి వినాశనమ్ ।
సద్యః కలత్రపుత్రాది ధనధాన్యప్రదం ద్విజాః ॥3॥

ఓ బ్రాహ్మణులారా! ఈ పూజాపద్ధతి వలన అపమృత్యుదోషమే కాకుండా, కాలమృత్యువు కూడా నాశనమౌతుంది. వెనువెంటనే భార్య, పుత్రుడు, ధనధాన్యాలు లభిస్తాయి.

అన్నాది భోజ్యం వస్త్రాది సర్వముత్పద్యతే యతః ।
తతో మృదాదిప్రతిమా పూజాభీష్టప్రదా భువి ॥4॥

మట్టి మొదలైన వాటితో చేసిన ప్రతిమలను పూజిస్తే, భూలోకంలో అన్నం, వస్త్రాలు (బట్టలు) ఇంకా అన్ని కోరికలు నెరవేరుతాయి.

పురుషాణాం చ నారీణామధికారోఽత్ర నిశ్చితమ్ ।
నద్యాం తడాగే కూపే వా జలాంతర్మృదమాహరేత్ ॥5॥

సంశోధ్య గంధచూర్ణేన పేషయిత్వా సుమండపే ।
హస్తేన ప్రతిమాం కుర్యాత్ క్షీరేణ చ సుసంస్కృతామ్ ॥6॥

ఈ పూజలు పురుషులు, స్త్రీలు చేసుకొనుటకు అధికారం కలదనటంలో సందేహం లేదు. నదిలో గాని, చెరువులో గాని, బావి లేదా నీటిలోపల ఉన్న మట్టిని తీసుకువచ్చి శుద్ధిచేసి, గంధం పొడితో కలిపి చేసిన ప్రతిమను చేసి, అందంగా మండపంలో ఉంచి, పాలతో శుభ్రం చేయాలి.

అంగప్రత్యంగకోపేతామాయుధైశ్చ సమన్వితామ్ ।
పద్మాసనస్థితాం కృత్వా పూజయేదాదరేణ హి ॥7॥

అంగప్రత్యంగాలతో, ఆయుధాలతో ఉన్న ఆ ప్రతిమను పద్మాసనంలో ఉంచి శ్రద్ధతో పూజించాలి.

విఘ్నేశాదిత్యవిష్ణూనామంబాయాశ్చ శివస్య చ ।
శివస్య శివలింగం చ సర్వదా పూజయేద్ద్విజ ॥8॥

ఓ బ్రాహ్మణులారా! వినాయక, విష్ణువుల ప్రతిమల్ని, పార్వతీపరమేశ్వరుల ప్రతిమల్ని, శివలింగాన్ని నిత్యం పూజించాలి.

షోడశైరుపచారైశ్చ కుర్యాత్తత్ఫలసిద్ధయే ।
పుష్పేణ ప్రోక్షణం కుర్యాదభిషేకం సమంత్రకమ్ ॥9॥

పూజాఫలితాల కోసం షోడశోపచారాలతో పూజించాలి. పుష్పాలతో నీటిని చల్లుతూ మంత్రాలతో అభిషేకం చేయాలి.

శాల్యన్నేనైవ నైవేద్యం సర్వం కుడవమానతః ।
గృహే తు కుడవం జ్ఞేయం మానుషే ప్రస్థమిష్యతే ॥10॥

పావుబియ్యంతో వండిన అన్నాన్ని నైవేద్యం పెట్టాలి. ఇందులోని ప్రతిమకు పావు, మనుష్యులు ప్రతిష్ఠించిన దేవాలయంలో పూజ చేసినపుడు శేరుబియ్యంతో అన్నం వండి నైవేద్యం పెట్టాలి.

దైవే ప్రస్థత్రయం యోగ్యం స్వయంభోః ప్రస్థపంచకమ్ ।
ఏవం పూర్ణఫలం విద్యాదధికం వై ద్వయం త్రయమ్ ॥11॥

దైవప్రతిష్ఠ దేవాలయం అయితే మూడుశేరులు, స్వయంభూలింగమైతే ఐదుశేర్లబియ్యాన్ని వండి నైవేద్యం పెడితే పూర్తి ఫలం వస్తుంది. ఈ విధంగా రెండు మూడుసార్లు పూజ చేస్తే, ఎక్కువ ఫలాలు వస్తాయి.

సహస్రపూజయా సత్యం సత్యలోకం లభేద్ద్విజః ।
ద్వాదశాంగులమాయామం ద్విగుణం చ తతోఽధికమ్ ॥12॥

ప్రమాణమంగులస్యైకం తదూర్ధ్వం పంచకత్రయమ్ ।
అయోదారుకృతం పాత్రం శివమిత్యుచ్యతే బుధైః ॥13॥

బ్రాహ్మణుడు వేయిసార్లు పూజ చేస్తే తప్పకుండా సత్యలోకాన్ని పొందుతాడు. పన్నెండు అంగుళాల వెడల్పు, ఇరవైఅయిదు అంగుళాల పొడవు పదిహేను అంగుళాల ఎత్తు గల చెక్క పాత్రను లేదా లోహపాత్రను పండితులు "శివం" అంటారు.

తదష్టభాగః ప్రస్థస్స్యాత్ తచ్చతుః కుడవం మతమ్ ।
దశప్రస్థం శతప్రస్థం సహస్రప్రస్థమేవ చ ॥14॥

దానిలో ఎనిమిదవ భాగం ప్రస్థం అంటే శేరు. దానిలో నాల్గవభాగం కుడవం అనగా పావు. మానవ నిర్మిత లింగానికి 10 శేర్లు, ఋషి ప్రతిష్ఠించిన లింగానికి వందశేర్లు, స్వయంగా భూలింగానికి వేయిశేర్లు.

జలతైలాదిగంధానాం యథాయోగ్యం చ మానతః ।
మానుషార్షస్వయంభూనాం మహాపూజేతి కథ్యతే ॥15॥

బియ్యాన్ని వండి, నైవేద్యం పెట్టి, నీటితో అభిషేకం, నూనెతో అభిషేకం, గంధం మొదలైన వాటితో ఉపచారాలను కూడా తగినంతగా చేస్తే ఆ పూజను మహాపూజ అంటారు.

అభిషేకాదాత్మశుద్ధిర్గంధాత్పుణ్యమవాప్యతే ।
ఆయుస్తృప్తిశ్చ నైవేద్యాత్ ధూపాదర్థమవాప్యతే ॥16॥

శివునికి అభిషేకం చేస్తే చిత్తశుద్ధి కల్గుతుంది. గంధం అర్పించటం వల్ల పుణ్యం, నైవేద్యం చేయటం వల్ల ఆయుష్షు, తృప్తి; ధూపాన్ని ఇవ్వటం వల్ల ధనం లభిస్తాయి.

దీపాత్జ్ఞానమవాప్నోతి తాంబూలాద్భోగమాప్నుయాత్ ।
తస్మాత్ స్నానాదికం షట్కం ప్రయత్నేన ప్రసాధయేత్ ॥17॥

దీపాన్ని చూపటం వల్ల జ్ఞానం, తాంబూలాన్నివ్వటం వల్ల భోగం వస్తాయి. కావున స్నానంతో మొదలైన ఈ ఆరు ఉపచారాల్ని శ్రద్ధతో అర్పించాలి.

నమస్కారో జపశ్చైవ సర్వాభీష్టప్రదావుభౌ ।
పూజాంతే చ సదాకార్యౌ భోగమోక్షార్థిభిర్నరైః ॥18॥

భోగాల్ని, మోక్షాన్ని కోరుకునే వారు నిత్యపూజ అయిన తర్వాత కోరికలన్నిటినీ తీర్చే నమస్కారం, జపం అనే రెండింటిని చేయాలి.

సంపూజ్య మనసా పూర్వం కుర్యాత్తత్తత్సదా నరః ।
దేవానాం పూజయా చైవ తత్తల్లోకమవాప్నుయాత్ ॥19॥

తదవాంతరలోకే చ యథేష్టం భోగ్యమాప్యతే ।
తద్విశేషాన్ప్రవక్ష్యామి శృణుత శ్రద్ధయా ద్విజాః ॥20॥

ముందుగా మనస్సులో భగవంతుని తలచుకొని తర్వాత మిగిలిన ఉపచారాలు అర్పించాలి. మానవులు దేవతలను పూజిస్తే ఆయా లోకాలు పొందటమే కాకుండా అవాంతరలోకాలలో కూడా స్వేచ్ఛగా భోగాలను అనుభవిస్తారు. ఓ బ్రాహ్మణులారా! ఆ విశేషాలు చెప్తాను. శ్రద్ధగా వినండి.

విఘ్నేశపూజయా సమ్యగ్ భూర్లోకేఽభీష్టమాప్నుయాత్ ।
శుక్రవారే చతుర్థ్యాం చ సితే శ్రావణ భాద్రకే ॥21॥

శుక్రవారం, శ్రావణ, భాద్రపదమాసాలలో శుక్లపక్షచతుర్థి రోజున వినాయకుని పూజించటం వల్ల భూలోకంలో కోర్కెలు తీరుతాయి.

భిషగృక్షే ధనుర్మాసే విఘ్నేశం విధివద్యజేత్ ।
శతం పూజాసహస్రం వా తత్సంఖ్యాకదినైర్వ్రజేత్ ॥22॥

ధనుర్మాసంలో శతభిషా నక్షత్రం నాడు వినాయకుని విధిగా పూజించాలి. వంద లేక వేయిరోజులు వరుసగా పూజించాలి.

దేవాగ్ని శ్రద్ధయా నిత్యం పుత్రదం చేష్టదం నృణామ్ ।
సర్వపాపప్రశమనం తత్తద్దురితనాశనమ్ ॥23॥

దేవతలు మరియు అగ్నియందు శ్రద్ధ కలిగి నిత్యం పూజలు, హోమాలు చేసిన మనుషులకు సంతానం కల్గుతుంది. కోరికలన్నీ తీరి పాపాలన్నీ నశిస్తాయి. పాపకర్మలన్నీ దూరమౌతాయి.

వారపూజాం శివాదీనామాత్మశుద్ధిప్రదాం విదుః ।
తిథినక్షత్రయోగానామాధారం సార్వకామికామ్ ॥24॥

శివుని దేవతలను ఆయా వారములందు పూజించుట వల్ల మనస్సు శుద్ధి అవుతుందని పెద్దలు చెప్పారు. తిథి, నక్షత్ర, యోగాలకు వారమే ఆధారం. కోరికలన్నిటినీ వారపూజ తీరుస్తుంది.

తథా వృద్ధిక్షయాభావాత్ పూర్ణబ్రహ్మాత్మకం విదుః ।
ఉదయాదుదయం వారో బ్రహ్మ ప్రభృతి కర్మణామ్ ॥25॥

ఇంకా వారానికి తగ్గుదల, పెరగటం అనేవి లేవు కాబట్టి, వారాన్ని పూర్ణబ్రహ్మస్వరూపమని చెప్తారు. బ్రాహ్మణాదులు చేసే కర్మలకు సూర్యోదయం నుండి మరల సూర్యోదయం వరకు ఒకవారంగా తీసుకోవాలి.

తిథ్యాదౌ దేవపూజా హి పూర్ణభోగప్రదా నృణామ్ ।
పూర్వభాగః పితౄణాం తు నిశియుక్తః ప్రశస్యతే ॥26॥

తిథి యొక్క మొదటి సమయంలో దేవపూజ చేసేవారికి పూర్ణభోగాలు లభిస్తాయి. రాత్రితో కూడినదైతే ముందుభాగం పితృదేవతల అర్చనకు మంచిది.

పరభాగస్తు దేవానాం దివాయుక్తః ప్రశస్యతే ।
ఉదయవ్యాపినీ గ్రాహ్యా మధ్యాహ్నే యది సా తిథిః ॥27॥

తిథియొక్క రెండవభాగం పగటితో కలిసి ఉంటే దేవపూజకు మంచిది. తిథి ఉదయాన్ని వ్యాపించి, మధ్యాహ్నం వరకు ఉంటే అదే చాలా మంచిది.

దేవకార్యే తథాగ్రాహ్యాస్తిథిఋక్షాదికాశ్శుభాః ।
సమ్యగ్విచార్య వారాదీన్ కుర్యాత్పూజజపాదికమ్ ॥28॥

ఈ విధంగా చక్కగా తెలుసుకొని, శుభమైన తిథి, నక్షత్రాలలో దేవపూజ, జపం వంటివి చేయాలి.

పూర్జాయతే హ్యనేనేతి వేదేష్వర్థస్య యోజనా ।
పూర్ణభోగఫలసిద్ధిశ్చ జాయతే తేన కర్మణా ॥29॥

వేదాలలో పూజా శబ్దానికి అర్థం చెప్పారు. పూః జాయతే అనేన. అనేన అనగా ఈ కర్మచేత పూః అనగా భోగాలు, ఫలాల సిద్ధి, జాయతే అనగా కలుగుతాయి.

మనోభావాంస్తథా జ్ఞానమిష్టభోగార్థయోజనాత్ ।
పూజాశబ్దార్థ ఏవం హి విశ్రుతో లోకవేదయోః ॥30॥

మనోభావములు, మనసుకు నచ్చిన వస్తువులు కావచ్చు మరియు పరమార్థజ్ఞానం కావచ్చు. పూజవలన సిద్ధిస్తాయి. ఈ వాక్యార్థమును పైశ్లోకంతో కలిపి సమన్వయం చేయాలి పూజకు ఈ లోకంలో వేదాలందు ఈ అర్థము ప్రఖ్యాతమై యున్నది.

నిత్యనైమిత్తికం కాలాత్సద్యః కామ్యేష్వనుష్ఠితే ।
నిత్యం మాసం చ పక్షం చ వర్షం చైవ యథాక్రమమ్ ॥31॥

తత్తత్కర్మఫలప్రాప్తిఃతాదృక్పాపక్షయః క్రమాత్ ।
మహాగణపతేః పూజా చతుర్థ్యాం కృష్ణపక్షకే ॥32॥

నిత్యం చేసే కర్మలు కాలం గడిచే కొలది మంచి ఫలితాలను ఇస్తాయి. చక్కగా చేసిన కర్మలు వెంటనే మంచి ఫలితాలను ఇస్తాయి. పదిహేనురోజులు, ఒకనెల, ఒకసంవత్సరం కాని వరుసగా చేసిన నిత్యపూజలు ఆయా కాలాలకు చెందిన ఫలాలను ఇచ్చి, ఆయా కాలములలోని పాపాలను పోగొట్టుతాయి. కృష్ణపక్ష చతుర్థినాడు మహాగణపతిని పూజిస్తే

పక్షపాపక్షయకరీ పక్షభోగఫలప్రదా ।
చైత్రే చతుర్థ్యాం పూజా చ కృతా మాసఫలప్రదా ॥33॥

పదిహేనురోజుల పాపాలు తొలగిపోయి, పదిహేనురోజులు భోగాలు, ఫలాలు లభిస్తాయి. చైత్రచతుర్థినాడు పూజించినచో మాసపూజాఫలం లభిస్తుంది.

వర్షభోగప్రదా జ్ఞేయా కృతా వై సింహభాద్రకే ।
శ్రావణ్యాదిత్యవారే చ సప్తమ్యాం హస్తభే దినే ॥34॥

భాద్రపదమాసంలో సూర్యుడు సింహరాశిలో ఉన్నపుడు పూజిస్తే సంవత్సరకాలం భోగములు లభిస్తాయి. శ్రావణమాసం - భానువాసరము, సప్తమితిథి-హస్తానక్షత్రంతో కూడిన రోజు గణపతిని పూజించవలెను.

మాఘశుక్లే చ సప్తమ్యామాదిత్య యజనం చరేత్ ।
జ్యేష్ఠభాద్రకసౌమ్యే చ ద్వాదశ్యాం శ్రవణర్క్షకే ॥35॥

ద్వాదశ్యాం విష్ణుయజనమిష్టం సంపత్కరం విదుః ।
శ్రావణే విష్ణుయజనమిష్టారోగ్యప్రదం భవేత్ ॥36॥

మాఘమాసం - శుక్ల-సప్తమినాడు ఆదిత్యుని యజనం, పూజనం చేయవలెను. జ్యేష్ఠ, భాద్రపద మాసాలలో బుధవారం నాడు, శ్రవణానక్షత్రద్వాదశి రోజున మరియు కేవలం ద్వాదశిరోజున విష్ణువును పూజిస్తే, కోరిన కోరికలు తీరుతాయని ఋషులు చెప్పారు. శ్రావణమాసంలో విష్ణువును పూజిస్తే కోర్కెలు తీరి, ఆరోగ్యం వస్తుంది.

గవాదీన్ ద్వాదశానర్థాన్ సాంగాన్ దత్త్వా తు యత్ ఫలమ్ ।
తత్ఫలం సమవాప్నోతి ద్వాదశ్యాం విష్ణుతర్పణాత్ ॥37॥

ఆవు మొదలైన 12 వస్తువులు దానం చేయటం వల్ల, ఏమి ఫలితాలు వస్తాయో, అవన్నీ ద్వాదశినాడు విష్ణువును పూజిస్తే వస్తాయి.

ద్వాదశ్యాం ద్వాదశాన్ విప్రాన్ విష్ణోర్ద్వాదశనామతః ।
షోడశైరుపచారైశ్చ యజేత్తత్ప్రీతిమాప్నుయాత్ ॥38॥

ద్వాదశిరోజున పన్నెండుమంది బ్రాహ్మణులను విష్ణువు యొక్క పన్నెండు నామాలతో, షోడశోపచారాలతో పూజించు మానవుడు విష్ణువు యొక్క ప్రీతికి పాత్రుడవుతాడు.

ఏవం చ సర్వదేవానాం తత్తద్ ద్వాదశనామకైః ।
ద్వాదశబ్రహ్మయజనం తత్తత్ప్రీతికరం భవేత్ ॥39॥

ఇదే విధంగా దేవతలనందరిని వారి వారి పన్నెండు నామాలతో పన్నెండు మంది బ్రాహ్మణులను పూజిస్తే, ఆయా దేవతలకు ప్రీతిపాత్రుడవుతాడు.

కర్కటే సోమవారే చ నవమ్యాం మృగశీర్షకే ।
అంబాం యజేద్భూతికామః సర్వభోగఫలప్రదామ్ ॥40॥

సంపదలను కోరుకునేవారు సూర్యుడు కర్కాటకరాశికి వచ్చిన సమయంలో, సోమవారం నాడు, మృగశిరానక్షత్రనవమి దినాలలో అన్ని భోగాలను ఇచ్చే జగన్మాతను పూజించాలి.

ఆశ్వయుచ్ఛుక్లనవమీ సర్వాభీష్టఫలప్రదా ।
ఆదివారే చతుర్దశ్యాం కృష్ణపక్షే విశేషతః ॥41॥

ఆశ్వయుజశుక్లనవమి కోరినవాటినన్నింటినీ ఇస్తుంది. విశేషించి కృష్ణపక్షం నాటి చతుర్దశితో కూడిన ఆదివారం ఇంకా చాలా మంచిది.

ఆర్ద్రాయాం చ మహార్ద్రాయాం శివపూజా విశిష్యతే ।
మాఘకృష్ణచతుర్దశ్యాం సర్వాభీష్టఫలప్రదా ॥42॥

ఈ తిథులనాడే కాకుండా, ఆరుద్రనక్షత్రం రోజున, అలాగే సూర్యసంక్రాంతితో కూడిన ఆరుద్రనక్షత్రం (మహార్ద్ర) రోజున శివపూజకు చాలా మంచిది. మాఘకృష్ణ చతుర్దశి – శివపూజ సర్వఅభీష్ట ఫలప్రదము.

ఆయుష్కరీ మృత్యుహరా సర్వసిద్ధికరీ నృణామ్ ।
జ్యేష్ఠమాసే మహార్ద్రాయాం చతుర్దశీ దినేఽపి చ ॥43॥

మార్గశీర్షార్ద్రకాయాం వా షోడశైరుపచారకైః ।
తత్తన్మూర్తిశివం పూజ్య తస్య వై పాదదర్శనమ్ ॥44॥

మరణము తొలగిపోయి, ఆయుష్షు పెరుగుతుంది. జ్యేష్ఠమాసంలో మహా ఆరుద్రా, మరియు చతుర్దశి మార్గశిరమాసంలో ఆరుద్ర అనే రోజులలో షోడశోపచారములతో శివుని మూర్తిని పూజించు వ్యక్తి యొక్క పాదాలను దర్శించాలి.

శివస్య యజనం జ్ఞేయం భోగమోక్షప్రదం నృణామ్ ।
వారాదిదేవయజనం కార్తికే హి విశిష్యతే ॥45॥

శివుణ్ణి పూజించే వారికి భోగం, మోక్షం లభిస్తాయి. కార్తీకమాసంలో ఆయా వారదేవతలను పూజించుట విశేష ఫలదాయకము.

కార్తికే మాసి సంప్రాప్తే సర్వాన్ దేవాన్ యజేద్బుధః ।
దానేన తపసా హోమైర్జపేన నియమేన చ ॥46॥

షోడశైరుపచారైశ్చ ప్రతిమా విప్రమంత్రకైః ।
బ్రాహ్మణానాం భోజనేన నిష్కామార్తికరో భవేత్ ॥47॥

కార్తికమాసం రాగానే దేవతలనందరినీ పూజించాలి. దానం, తపస్సు, హోమం, జపం, నియమం షోడపచారాలతో మరియు మంత్రాలతో ప్రతిమను పూజించి, బ్రాహ్మణులకు అన్నం పెట్టాలి. ఈ పూజను కోరికలు లేకుండా, శాంతమైన మనస్సుతో చేయాలి.

కార్తికే దేవయజనం సర్వభోగప్రదం భవేత్ ।
వ్యాధీనాం హరణం చైవ భవేద్భూతగ్రహక్షయః ॥48॥

కార్తికమాసంలో దేవతలను పూజిస్తే అన్నిభోగాలు లభించును. రోగాలు తగ్గుతాయి. భూతాలు, గ్రహాలు నశిస్తాయి.

కార్తికాదిత్యవారేషు నృణామాదిత్యపూజనాత్ ।
తైలకార్పాసదానాత్తు భవేత్కుష్ఠాది సంక్షయః ॥49॥

కార్తికమాసంలో భానువారములందు సూర్యుణ్ణి పూజించి, నూనె, నేతవస్త్రాలను దానం చేస్తే కుష్ఠు మొదలగు రోగాలు తొలగిపోతాయి.

హరీతకీమరీచీనాం వస్త్రక్షీరాది దానతః ।
బ్రహ్మప్రతిష్ఠయా చైవ క్షయరోగక్షయో భవేత్ ॥50॥

కరక్కాయలు, మిరియాలు, వస్త్రాలు, పాలు మొదలైన వాటిని దానం చేసి, బ్రాహ్మణులకు ప్రతిష్ఠను కలిగిస్తే క్షయరోగం పోతుంది.

దీపసర్షపదానాచ్చ అపస్మారక్షయో భవేత్ ।
కృత్తికా సోమవారేషు శివస్య యజనం నృణామ్ ॥51॥

మహాదారిద్ర్యశమనం సర్వసంపత్కరం భవేత్ ।
గృహక్షేత్రాది దానాచ్చ గృహోపకరణాదినా ॥52॥

దీపాన్ని, ఆవాలను దానం చేస్తే అపస్మారకరోగం పోతుంది. సోమవారంతో కలిసిన కృత్తికానక్షత్రం రోజున శివుని పూజించిన మనుషులకు దారిద్ర్యం పూర్తిగా పోయి అన్ని సంపదలు కలుగుతాయి. ఇల్లు, ఇంటికుపయోగించే వస్తువులు, భూమిని దానం చేసినా దారిద్ర్యనాశనమే ఫలం

కృత్తికాభౌమవారేషు స్కందస్య యజనాన్నృణామ్ ।
దీపఘంటాదిదానాద్వై వాక్సిద్ధిరచిరాద్భవేత్ ॥53॥

కృత్తికానక్షత్రం ఉన్న మంగళవారరోజున కుమారస్వామిని పూజించి, దీపం, ఘంట దానం చేయటంవల్ల వాక్శుద్ధి వస్తుంది.

కృత్తికాసౌమ్యవారేషు విష్ణోర్వై యజనం నృణామ్ ।
దధ్యోదనస్య దానం చ సత్సంతానకరం భవేత్ ॥54॥

కృత్తికానక్షత్రం ఉన్న బుధవారం రోజున విష్ణువును పూజించి, పెరుగు అన్నం దానం చేసినవారికి మంచిసంతానం కలుగుతుంది.

కృత్తికాగురువారేషు బ్రహ్మణో యజనాద్ధనైః ।
మధుస్వర్ణాజ్యదానేన భోగవృద్ధిర్భవేన్నృణామ్ ॥55॥

కృత్తికానక్షత్రం ఉన్న గురువారం నాడు బ్రహ్మను పూజించి, తేనె, బంగారం, నెయ్యిని దానం చేస్తే మనుషులకు భోగాలు పెరుగుతాయి.

కృత్తికాశుక్రవారేషు గజతుండస్య యాజనాత్ ।
గంధపుష్పాన్నదానేన భోగ్యవృద్ధిర్భవేన్నృణామ్ ॥56॥

కృత్తికానక్షత్రం ఉన్న శుక్రవారం నాడు వినాయకుని పూజించి, గంధం, పువ్వులు, అన్నం, దానం చేసే వారికి భోగాలు పెరుగుతాయి.

వంధ్యా సుపుత్రం లభతే స్వర్ణరౌప్యాది దానతః ।
కృత్తికాశనివారేషు దిక్పాలానాం చ వందనమ్ ॥57॥

దిగ్గజానాం చ నాగానాం సేతుపానాం చ పూజనమ్ ।
త్ర్యంబకస్య చ రుద్రస్య విష్ణోః పాపహరస్య చ ॥58॥

జ్ఞానదం బ్రహ్మణశ్చైవ ధన్వంతర్యశ్వినోస్తథా ।
రోగాపమృత్యుహరణం తత్కాలవ్యాధిశాంతిదమ్ ॥ 59॥

బంగారం, వెండి మొదలైన వాటిని దానం చేస్తే పిల్లలు లేని స్త్రీకి మంచికుమారుడు కలుగుతాడు. కృత్తికానక్షత్రం ఉన్న శనివారం రోజున దిక్పాలకులకు దణ్ణం పెట్టుకొని దిగ్గజాలను, పాములను, సేతుపాలకులను పూజించాలి. మూడుకన్నుల దైవమైన రుద్రుణ్ణి, పాపాలను లేకుండా చేసే విష్ణువును పూజించినచో జ్ఞానం వస్తుంది. బ్రహ్మను, ధన్వంతరిని, అశ్వినీదేవతలను పూజిస్తే, రోగాలు, మరణభయం ఉండవు. వ్యాధులు తొందరగా తగ్గుతాయి.

లవణాయసతైలానాం మాషాదీనాం చ దానతః ।
త్రికటుఫలగంధానాం జలాదీనాం చ దానతః ॥60॥

ద్రవాణాం కఠినానాం చ ప్రస్థేన ఫలమానతః ।
స్వర్గప్రాప్తిర్ధనుర్మాసే హ్యుషః కాలే చ పూజనమ్ ॥61॥

ఉప్పు, ఇనుము, నూనె, మినుములు, శొంఠి, అల్లం, మిరప (త్రికటు) గంధం, జలం మొదలైన వాటిని దానం చేస్తే స్వర్గం లభిస్తుంది. ద్రవపదార్థాలను శేరు, ఘనపదార్థాలను మూడుతులాలు (పలము) తగ్గకుండా ఇవ్వాలి. ధనుర్మాసంలో తెల్లవారుజామున పూజచేయాలి.

శివాదీనాం చ సర్వేషాం క్రమాద్వై సర్వసిద్ధయే ।
శాల్యన్నస్య హవిష్యస్య నైవేద్యం శస్తముచ్యతే ॥62॥

శివుడు మొదలగు దేవతలను పూజిస్తే, అన్ని సిద్ధులు కల్గుతాయి. మంచిబియ్యంతో వండిన అన్నం మరియు వెన్న నైవేద్యానికి మంచిదని చెప్పబడింది.

వివిధాన్నస్య నైవేద్యం ధనుర్మాసే విశిష్యతే ।
మార్గశీర్షేఽన్నదస్యైవ సర్వమిష్టఫలం భవేత్ ॥63॥

ధనుర్మాసంలో అనేక రకాల అన్నాలను నైవేద్యం పెట్టడం మంచిది. మార్గశిరమాసంలో అన్నదానం చేసే వారికి కోరిన ఫలాలన్నీ లభిస్తాయి.

పాపక్షయం చేష్టసిద్ధిం చారోగ్యం ధర్మమేవ చ ।
సమ్యగ్వేదపరిజ్ఞానం సదనుష్ఠానమేవ చ ॥64॥

ఇహాముత్ర మహాభోగానంతే యోగం చ శాశ్వతమ్ ।
వేదాంతజ్ఞానసిద్ధిం చ మార్గశీర్షాన్నదో లభేత్ ॥65॥

పాపాలు నశించి, కోరికలు తీరుట, ఆరోగ్యం, ధర్మం, వేదాలలో మంచిజ్ఞానం, మంచి పనులను ఆచరించటం ఈ లోకంలో, పరలోకంలో మహాభోగాలు, ఎప్పటికీ శివునిలో కలసి పోవటం, వేదాంతజ్ఞానం కలగటం అనే మంచి ఫలితాలు, మార్గశిరమాసంలో అన్నదానం చేసిన వారికి వస్తుంది.

మార్గశీర్షే హ్యుషః కాలే దినత్రయమథాపి వా ।
యజేద్దేవాన్ భోగకామో నా ధనుర్మాసికో భవేత్ ॥66॥

భోగాలను కోరుకునే మనుషులు మార్గశిరమాసంలో కనీసం మూడురోజులు తెల్లవారుజామున దేవతలను పూజించాలి. ధనుర్మాసంలో ఏనాడు పూజ చేయకుండా ఉండరాదు.

యావత్సంగవకాలం తు ధనుర్మాసో విధీయతే ।
ధనుర్మాసే నిరాహారో మాసమాత్రం జితేంద్రియః ॥67॥

ఆమధ్యాహ్నం జపేద్విప్రో గాయత్రీం వేదమాతరమ్ ।
పంచాక్షరాదికాన్ మంత్రాన్ పశ్చాదాసప్తికం జపేత్ ॥68॥

తెల్లవారుజాము నుండి తెల్లారేవరకు మాత్రమే ధనుర్మాసపూజ చేయాలని చెప్పారు. బ్రాహ్మణుడు ధనుర్మాసంలో అన్నిరోజులు మధ్యాహ్నం వరకూ భోజనం చేయకుండా, ఇంద్రియనిగ్రహం కలవాడై వేదమాతైన గాయత్రీదేవిని జపించాలి. ఆ తర్వాత పడుకునేవరకు పంచాక్షరీ లాంటి మంత్రాలను జపించాలి.

జ్ఞానం లబ్ధ్వా చ దేహాంతే విప్రో ముక్తిమవాప్నుయాత్ ।
అన్యేషాం నరనారీణాం త్రిః స్నానేన జపేన చ ॥69॥

సదా పంచాక్షరస్యైవ విశుద్ధం జ్ఞానమాప్యతే ।
ఇష్టమంత్రాన్ సదా జప్త్వా మహాపాపక్షయం లభేత్ ॥70॥

అట్టి బ్రాహ్మణుడు జ్ఞానాన్ని పొంది, శరీరాన్ని విడిచిన తర్వాత మోక్షాన్ని పొందుతాడు. ఇతరులు, స్త్రీలు మూడుకాలాలలో స్నానం చేసి ఎపుడూ పంచాక్షరిని జపిస్తే శుద్ధమైన జ్ఞానం వస్తుంది. అన్నివేళలా ఇష్టదేవతల మంత్రాలు జపించు వారికి పెద్ద పెద్ద పాపాలన్నీ తొలగి పోతాయి.

ధనుర్మాసే విశేషేణ మహానైవేద్యమాచరేత్ ।
శాలితండులభారేణ మరీచప్రస్థకేన చ ॥71॥

గణనాద్ద్వాదశం సర్వం మధ్వాజ్యకుడవేన హి ।
ద్రోణయుక్తేన ముద్గేన ద్వాదశవ్యంజనేన చ ॥72॥

ఘృతపక్వైరపూపైశ్చ మోదకైశ్శాలికాదిభిః ।
ద్వాదశైవ దధిక్షీరైర్ద్వాదశప్రస్థకేన చ ॥73॥

నారికేలఫలాదీనాం తథా గణనయా సహ ।
ద్వాదశక్రముకైర్యుక్తం షట్త్రింశత్ పత్రకైర్యుతమ్ ॥74॥

కర్పూర ఖురచూర్ణేన పంచసౌగంధికైర్యుతమ్ ।
తాంబూలయుక్తం తు యదా మహానైవేద్యలక్షణమ్ ॥75॥

ధనుర్మాసంలో విశేషంగా మహానైవేద్యం చేయాలి. మంచి బియ్యాన్ని ఎక్కువగా వండాలి. శేరు మిరియాలు, పన్నెండు పావుల తేనె, నెయ్యి, కుంచెడు పెసరపప్పు, పన్నెండు వ్యంజనాలు (కూర, పచ్చళ్లు మొదలైనవి) నెయ్యితో చేసిన అప్పాలు, వరితో చేసిన ఉండ్రాళ్లు, పన్నెండు శేర్లు పెరుగు కొబ్బరికాయలు, వక్కలు, ముప్పై ఆరు తమలపాకులు కర్పూరసుగంధచూర్ణం, ఐదుసుగంధాలుగల తాంబూలం ఇవన్నీ కలసి మహానైవేద్యమౌతుంది.

మహానైవేద్యమేతద్వై దేవతార్పణపూర్వకమ్ ।
వర్ణానుక్రమపూర్వేణ తద్భక్తేభ్యః ప్రదాపయేత్ ॥76॥

ఈ మహానైవేద్యాన్ని ఈశ్వరునికి సమర్పించి, అన్ని వర్ణాలకు చెందిన భక్తులకు పంచిపెట్టాలి.

ఏవం చౌదననైవేద్యాద్భూమౌ రాష్ట్రపతిర్భవేత్ ।
మహానైవేద్యదానేన నరస్స్వర్గమవాప్నుయాత్ ॥77॥

ఈ విధంగా అన్నం నైవేద్యం పెట్టిన వ్యక్తి ఈ లోకంలో సామ్రాజ్యాధిపతి అవుతాడు. మహానైవేద్యాన్ని దానం చేసే మనిషి స్వర్గాన్ని పొందుతాడు.

మహానైవేద్యదానేన సహస్రేణ ద్విజర్షభాః ।
సత్యలోకే చ తల్లోకే పూర్ణమాయురవాప్నుయాత్ ॥78॥

ఓ బ్రాహ్మణులారా! వేయిమహానైవేద్యాలను దానం చేసే వ్యక్తి సత్యలోకంలో పూర్ణ ఆయుష్షను పొందుతాడు.

సహస్రాణాం చ త్రింశత్యా మహానైవేద్యదానతః ।
తదూర్ధ్వలోకమాప్యైవ న పునర్జన్మభాగ్భవేత్ ॥79॥

ముప్పైవేలమహాదానాలు చేసిన మనిషి అంతకంటే గొప్పదైన పైలోకాలను చేరుతాడు. అతనికి పునర్జన్మ ఉండదు.

సహస్రాణాం చ షట్త్రింశజ్జన్మనైవేద్యమీరితమ్ ।
తావన్నైవేద్యదానం తు మహాపూర్ణం తదుచ్యతే ॥80॥

ముప్పై ఆరువేలమహానైవేద్యాలను జన్మనైవేద్యమని పిలుస్తారు. అన్ని మహానైవేద్యాలకు మహాపూర్ణమని పేరు ఉంది.

మహాపూర్ణస్య నైవేద్యం జన్మనైవేద్యమిష్యతే ।
జన్మనైవేద్యదానేన పునర్జన్మ న విద్యతే ॥
ఊర్జే మాసి దినే పుణ్యే జన్మనైవేద్యమాచరేత్ ॥81॥

మహాపూర్ణ నైవేద్యాన్ని జన్మ నైవేద్యమంటారు. జన్మనైవేద్యాన్ని దానం చేసే వ్యక్తికి పునర్జన్మ లేదు. కార్తికమాసంలో మంచిరోజున జన్మనైవేద్యం చేయాలి.

సంక్రాంతిపాతజన్మర్క్ష పౌర్ణమాస్యాది సంయుతే ।
అబ్ద జన్మదినే కుర్యాజ్జన్మనైవేద్యముత్తమమ్ ॥82॥

సంక్రాంతి, జన్మనక్షత్రం, పూర్ణిమ, పుట్టినరోజున ఇటువంటి రోజులలో ఉత్తమమైన జన్మనైవేద్యం చేయాలి.

సాంతరేషు జన్మర్క్షపూర్ణయోగదినేఽపి చ ।
మేలనే చ శనేర్వాపి తావత్సాహస్రమాచరేత్ ॥83॥

ఇతరమాసాలలో జన్మనక్షత్రం పూర్ణయోగములో ఉన్నరోజున గాని, శనితో కూడి ఉన్న రోజున కాని చేయాలి.

జన్మనైవేద్యదానేన జన్మార్పణఫలం లభేత్ ।
జన్మార్పణాచ్ఛివః ప్రీతః స్వసాయుజ్యం దదాతి హి ॥84॥

జన్మనైవేద్యాన్ని దానం చేస్తే, జన్మను అర్పించిన ఫలం వస్తుంది. జన్మను అర్పిస్తే శివుడు ప్రీతి చెంది, తన సాయుజ్యాన్ని ఇస్తాడు.

ఇదంతజ్జన్మనైవేద్యం శివస్యైవ ప్రదాపయేత్ ।
యోనిలింగస్వరూపేణ శివో జన్మానిరూపకః ॥85॥

ఈ జన్మనైవేద్యాన్ని శివునికి మాత్రమే ఇవ్వాలి. స్త్రీపురుషరూపంలో జన్మనిచ్చేది శివుడే.

తస్మాజ్జన్మనివృత్త్యర్థం జన్మపూజా శివస్య హి ।
బిందునాదాత్మకం సర్వం జగత్ స్థావరజంగమమ్ ॥86॥

కాబట్టి మరలా జన్మ లేకుండా ఉండటం కోసం శివునికి జన్మపూజ చేయాలి. ఈ సకల చరాచర ప్రపంచం మొత్తం బిందునాదాత్మకమైంది.

బిందుశ్శక్తిశ్శివో నాదశ్శివశక్త్యాత్మకం జగత్ ।
నాదాధారమిదం బిందుర్బింద్వాధారమిదం జగత్ ॥87॥

బిందువు శక్తి. నాదం శివుడు. శివభక్తుల స్వరూపం ఈ జగత్తు. బిందువుకి నాదం ఆధారం. ప్రపంచానికి బిందువు ఆధారం.

జగదాధారభూతౌ హి బిందునాదౌ వ్యవస్థితౌ ।
బిందునాదయుతం సర్వం సకలీకరణం భవేత్ ॥88॥

బిందు, నాదాలు రెండు ప్రపంచానికి ఆధారాలై ఉన్నాయి. మొత్తం అంతా బిందునాదాలతో కలసి ఉంది. బిందువు నాదంలో కలియటమే సకలీకరణ.

సకలీకరణాజ్జన్మ జగత్ప్రాప్నోత్యసంశయః ।
బిందునాదాత్మకం లింగం జగత్కారణముచ్యతే ॥89॥

సకలీకరణమునుండే ప్రపంచం పుట్టిందనటంలో సందేహం లేదు. లింగం, బిందునాదాత్మకం కాబట్టి ప్రపంచానికి కారణమని చెప్పబడింది.

బిందుర్దేవీ శివో నాదశ్శివలింగం తు కథ్యతే ।
తస్మాజ్జన్మనివృత్త్యర్థం శివలింగం ప్రపూజయేత్ ॥90॥

బిందువు దేవి. శివుడు నాదం. రెండు ఆత్మలు కలసి శివలింగం అని అర్థం. కావున జన్మలేకుండుటకు శివలింగాన్ని పూజించాలి.

మాతా దేవీ బిందురూపా నాదరూపశ్శివః పితా ।
పూజితాభ్యాం పితృభ్యాం తు పరమానంద ఏవ హి ॥91॥

బిందురూపమైన దేవి తల్లి. నాదరూపమైన శివుడు తండ్రి. తల్లితండ్రులను పూజిస్తే పరమానందం కలుగుతుంది.

పరమానందలాభార్థం శివలింగం ప్రపూజయేత్ ।
సా దేవీ జగతాం మాతా స శివో జగతః పితా ॥92॥

పరమానందం కోసం శివలింగాన్ని శ్రద్ధతో పూజించాలి. ప్రపంచాలకు తల్లి ఆ దేవి. ప్రపంచానికి తండ్రి ఆ శివుడు.

పిత్రోశ్శుశ్రూషకే నిత్యం కృపాధిక్యం హి వర్ధతే ।
కృపయాంతర్గతైశ్వర్యం పూజకస్య దదాతి హి ॥93॥

అట్లు తల్లితండ్రులను నిత్యం పూజించు వానియందు వారికి ఎక్కువ దయ కలుగుతుంది. వారికి శివుడు దయతో మానసిక ఐశ్వర్యాన్ని ఇస్తాడు.

తస్మాదంతర్గతానందలాభార్థం మునిపుంగవాః ।
పితృమాతృస్వరూపేణ శివలింగం ప్రపూజయేత్ ॥94॥

కాబట్టి ఓ మునులారా! అంతరంగంలో ఆనందం పొందటానికి, శివలింగాన్ని తల్లితండ్రులుగా తలంచి పూజించాలి.

భర్గః పురుషరూపో హి భర్గా ప్రకృతిరుచ్యతే ।
అవ్యక్తాంతరధిష్ఠానం గర్భః పురుష ఉచ్యతే ॥95॥

సువ్యక్తాంతరధిష్ఠానం గర్భః ప్రకృతిరుచ్యతే ।
పురుస్త్వాదిగర్భో హి గర్భవాన్ జనకో యతః ॥96॥

భర్గుడనగా పురుషుడు, భర్గ అంటే ప్రకృతి అని చెప్పబడ్డాయి. పైకి తెలియని, కనిపించని అంతరధిష్ఠానం కల గర్భం పురుషుడని బాగుగా పైకి కనిపించి, తెలియబడే అంతరధిష్ఠానం కల గర్భమును, ప్రకృతి అంటారు. మొదటిగర్భం పురుషుడే. పురుషుడు ప్రపంచానికి తండ్రి కాబట్టి గర్భవాన్ అంటారు.

పురుషాత్ప్రకృతో యుక్తం ప్రథమం జన్మ కథ్యతే ।
ప్రకృతేర్వ్యక్తతాం యాతం ద్వితీయం జన్మ కథ్యతే ॥97॥

పురుష, ప్రకృతిల కలయిక మొదటి జన్మమని, ప్రకృతి నుండి ప్రపంచం తెలియబడుట రెండవ జన్మ అని చెప్తారు.

జన్మజంతుర్మృత్యుజన్మ పురుషాత్ప్రతిపద్యతే ।
అన్యతో భావ్యతే వశ్యం మాయయా జన్మ కథ్యతే ॥98॥

జీవి పురుషుని నుండే పుట్టుకను, చావును, మరల పుట్టుకలను పొందుతాడు. మాయచే మరో రూపంలో తెలియబడటమే జన్మ అని చెప్పబడింది.

జీర్యతే జన్మకాలాద్యత్తస్మాజ్జీవ ఇతి స్మృతః ।
జన్మతే తన్యతే పాశైర్జీవ శబ్దార్థ ఏవ హి ॥99॥

పుట్టినప్పటి నుండి జీర్ణమవుతారు కావున జీవులని పేరు వచ్చింది. జీర్ణమనగా అరిగిపోవుట, తరిగిపోవుటం, తగ్గిపోవటం అనే అర్థాలున్నాయి. జీర్ణ శబ్దానికి "పుట్టి, బంధనాలలో బంధింపబడేవాడ"ని అర్థం ఉంది.

జన్మపాశనివృత్యర్థం జన్మలింగం ప్రపూజయేత్ ।
భం వృద్ధిం గచ్ఛతీత్యర్థాద్భగః ప్రకృతిరుచ్యతే ॥100॥

ఈ జన్మబంధం తొలగిపోవటం కోసం తల్లి, తండ్రి రూపంలో ఉన్న శివలింగాన్ని పూజించాలి. భం గచ్ఛతీతి భగః. భం అంటే పెరుగుదల గచ్ఛతి ఇతి పొందేది కనుక భగః అనే పేరు ప్రకృతికి వచ్చింది.

ప్రాకృతైశ్శబ్దమాత్రాద్యైః ప్రాకృతేంద్రియభోజనాత్ ।
భగస్యేదం భోగమితి శబ్దార్థో ముఖ్యతః శ్రుతః ॥101॥

ప్రకృతినుండి పుట్టిన ఇంద్రియాలు ప్రకృతినుండి పుట్టిన శబ్దాలను అనుభవిస్తాయి. భగానికి అనగా ప్రకృతికి సంబంధించినది అనే అర్థంలో కూడా భోగశబ్దం ప్రయోగంలో ఉంది.

ముఖ్యో భగస్తు ప్రకృతిః భగవాన్ శివ ఉచ్యతే ।
భగవాన్ భోగదాతా హి నాన్యో భోగప్రదాయకః ॥102॥

భగము ప్రకృతి. భగవానుడు శివుడు. భోగాలనిచ్చేది భగవానుడే కాని ఇతరులు కాదు.

భగస్వామీ చ భగవాన్ భర్గ ఇత్యుచ్యతే బుధైః ।
భగేన సంహితం లింగం భగం లింగేన సంయుతమ్ ॥103॥

ప్రకృతికి ప్రభువైన భగవానుణ్ణి ఋషులు భర్గుడని పిలుస్తారు. ప్రకృతి పురుషునితో, పురుషుడు ప్రకృతితో కలసి ఉంటుంది.

ఇహాముత్ర చ భోగార్థం నిత్యభోగార్థమేవ చ ।
భగవంతం మహాదేవం శివలింగం ప్రపూజయేత్ ॥104॥

ఈ లోకంలో, పరలోకంలో భోగాల కోసం నిత్యభోగార్థము మానవుడు శివలింగరూపంలో భగవానుడైన మహాదేవుని రూపంలో పూజించాలి.

లోకప్రసవితా సూర్యస్తచ్చిహ్నం ప్రసవాద్భవేత్ ।
లింగే ప్రసూతికర్తారం లింగినం పురుషం యజేత్ ॥105॥

లోకాలను ప్రకాశింప చేసే సూర్యుడు భగవానుని ప్రతీక. ప్రకృతిలో ప్రపంచాన్ని సృష్టించే పురుషుని శివలింగరూపంలో పూజించాలి.

లింగార్థగమకం చిహ్నం లింగమిత్యభిధీయతే ।
లింగమర్థం హి పురుషం శివం గమయతీత్యదః ॥106॥

ఒక వస్తువును తెలియచేసే గుర్తుకి లింగం అని పేరు. శివలింగం పురుషుడైన శివుని తెలియ చేసే గుర్తు.

శివశక్త్యోశ్చ చిహ్నస్య మేలనం లింగముచ్యతే ।
స్వచిహ్నపూజనాత్ప్రీతః చిహ్నకార్యం న వీయతే ॥107॥

శివశక్తుల గుర్తులు శివలింగంలో మిళితమై ఉన్నాయి. తన గుర్తును పూజించుట వల్ల శివుడు ఆనందిస్తాడు. గుప్తకార్యమగు పుట్టుట, మరణించుట శివపూజ చేసే వాడిని గ్రహించవు.

చిహ్నకార్యం తు జన్మాది జన్మాద్యం వినివర్తతే ।
ప్రాకృతైః పురుషైశ్చాపి బాహ్యాభ్యంతరసంభవైః ॥108॥

షోడశైరుపచారైశ్చ శివలింగం ప్రపూజయేత్ ।
ఏవమాదిత్యవారే హి పూజా జన్మనివర్తికా ॥109॥

ఆదివారే మహాలింగం ప్రణవేనైన పూజయేత్ ।
ఆదివారే పంచగవ్యైరభిషేకో విశిష్యతే ॥110॥

పూజ చేసే వారికి పుట్టుట, చనిపోవుట రూపంలో ఉన్న సంసారం తొలగిపోతుంది. ఇంట్లో, బయట ప్రాకృత, పురుషవస్తువులతో శివలింగానికి షోడశోపచారపూజ చేయాలి. ఆదివారం రోజున అలా చేస్తే ఆ వ్యక్తికి పునర్జన్మ ఉండదు. ఆదివారం రోజున మహాలింగాన్ని ఓంకారంతో మాత్రమే పూజించాలి. ఆదివారం రోజున పంచగవ్యములతో అభిషేకం మంచిది.

గోమయం, గోజలం, క్షీరం, దధ్యాజ్యం పంచగవ్యకమ్ ।
క్షీరాద్యం చ పృథక్ చైవ మధునా చేక్షుసారకైః ॥111॥

పేడ (గోమయం), మూత్రం (గోజలం) పాలు (గోక్షీరం) పెరుగు, నెయ్యి అనే అయిదింటిని పంచగవ్యాలంటారు. పాలు, పెరుగు, నెయ్యిలతో వేరువేరుగా అభిషేకం చేసి, తేనె, చక్కెరలతో కలిపి కూడా అభిషేకం చేయాలి.

గవ్యక్షరాన్ననైవేద్యం ప్రణవేనైవ కారయేత్ ।
ప్రణవం ధ్వనిలింగం తు నాదలింగం స్వయంభువః ॥112॥

బిందులింగం తు యంత్రస్స్యాన్మకారం తు ప్రతిష్ఠితమ్ ।
ఉకారం చరలింగం స్యాదకారం గురువిగ్రహమ్ ॥113॥

ఆవుపాలతో చేసిన పాయసాన్ని ఓంకారంతో మాత్రమే నివేదన చేయాలి. ఓంకారానికి ధ్వని లింగం అని, స్వయంభువలింగానికి నాదలింగమని యంత్రానికి బిందులింగం అని, ప్రతిష్ఠించిన లింగానికి మకారలింగం అని, ఉత్సవాల్లో ఊరేగించే లింగానికి ఉకార లింగం అని, గురువు యొక్క శరీరానికి అకార లింగం అని పేర్లున్నాయి.

షట్ లింగం పూజయా నిత్యం జీవన్ముక్తో న సంశయః ।
శివస్య భక్త్యా పూజా హి జన్మముక్తికరీ నృణామ్ ॥114॥

నిత్యమూ షడ్లింగ పూజతో జీవన్ముక్తుడవుతాడు శివుని భక్తితో పూజించే మానవులు జన్మబంధం నుండి బయటపడి ముక్తిని పొందుతారు.

రుద్రాక్షధారణాత్పాదమర్ధం వైభూతిధారణాత్ ।
త్రిపాదం మంత్రజాప్యాచ్చ పూజయా పూర్ణభక్తిమాన్ ॥115॥

మానవులు రుద్రాక్షను ధరించటం వల్ల భక్తిలో నాలగవవంతు, విభూతి ధరించట వల్ల సగం భక్తి, మంత్రాన్ని జపిస్తే మూడుపాదాల భక్తిని, పూజిస్తే సంపూర్ణ భక్తి కలవారౌతారు.

శివలింగం చ భక్తం చ పూజ్య మోక్షం లభేన్నరః ।
య ఇమం పఠతేఽధ్యాయం శృణుయాద్వా సమాహితః ॥116॥

తస్యైవ శివభక్తిశ్చ వర్ధతే సుదృఢా ద్విజాః ॥117॥

మానవుడు శివలింగాన్ని, శివభక్తుణ్ణి పూజిస్తే మోక్షం పొందుతాడు. ఓ బ్రాహ్మణులారా! ఎవరైతే ఈ అధ్యాయాన్ని చదువుతారో లేక మనసుపెట్టి వింటారో వారికి దృఢమైన శివభక్తి పెరుగుతుంది.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం పూజావిధానం – పూజాఫలం నామ షోడశోఽధ్యాయః ॥16॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు పూజావిధానం – పూజాఫలం అను పేరు గల పదహారవ అధ్యాయం సమాప్తం.

సప్తదశోఽధ్యాయః – పదిహేడవ అధ్యాయం

ప్రణవపంచాక్షరీ మంత్రాణాం మహిమా – శివలోకవైభవమ్

ప్రణవపంచాక్షరీమంత్రముల మహిమ – శివలోకవైభవం

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

ప్రణవస్య చ మాహాత్మ్యం షడ్లింగస్య మహామునే ।
శివభక్తస్య పూజాం చ క్రమశో బ్రూహి నః ప్రభో ॥1॥

ఓ మహర్షీ! ఓ ప్రభూ! ఓంకారం యొక్క మహిమను, ఆరులింగాల మహిమను మరియు శివభక్తుని పూజను మాకు వరుసగా చెప్పండి.

సూత ఉవాచ – సూతుడు చెప్పాడు.

తపోధనైర్భవద్భిశ్చ సమ్యక్ ప్రశ్నస్త్వయం కృతః ।
అస్యోత్తరం మహాదేవో జానాతి స్మ న చాపరః ॥2॥

తపోధనులైన మీరు మంచిప్రశ్న వేశారు. దీనికి సమాధానం మహాదేవుడు తప్ప మరొకడు చెప్పలేడు.

అథాపి వక్ష్యే తమహం శివస్య కృపయైవ హి ।
శివోఽస్మాకం చ యుష్మాకం రక్షాం గృహ్ణాతు భూరిశః ॥3॥

అయినప్పటికి, నేను శివునికృపతో సమాధానం చెప్తాను. శివుడు మమ్మల్ని, మిమ్మల్ని ఎక్కువగా రక్షించుగాక!

ప్రో హి ప్రకృతిజాతస్య సంసారస్య మహోదధేః ।
నవం నావాంతరమితి ప్రణవం వై విదుర్బుధాః ॥4॥

ప్రకృతి నుండి పుట్టిన సంసారమహాసముద్రానికి 'ప్ర' అని పేరు. దీనిని దాటించే నావ కాబట్టి ఓంకారానికి ప్రణవం అని పేరు వచ్చిందని పండితులు చెప్పారు. (ప్ర + నవ)

ప్రః ప్రపంచో న నాస్తి వో యుష్మాకం ప్రణవం విదుః ।
ప్రకర్షేణ నయేద్యస్మాన్మోక్షం వః ప్రణవం విదుః ॥5॥

'ప్ర' అనగా ప్రపంచం., 'న' అనగా లేదు, 'వః' అనగా మీకు అనే అర్థాన్ని బట్టి కూడా ఓంకారానికి ప్రణవం అని పేరు వచ్చింది. అలాగే ప్ర = నిశ్చయంగా, న = నడిపించును (మోక్షానికి), వః = మిమ్మల్ని అను అర్థంలో కూడా ఓంకారం ప్రణవం అనబడుతుంది.

స్వజాపకానాం యోగినాం స్వమంత్రపూజకస్య చ ।
సర్వకర్మక్షయం కృత్వా దివ్యజ్ఞానం తు నూతనమ్ ॥6॥

ఓంకారాన్ని జపించి, శివుణ్ణి ఓంకారంతో పూజించే వాళ్లకి అన్ని కర్మలు నశించి, కొత్తదైన దివ్యజ్ఞానం వస్తుంది.

తమేవ మాయారహితం నూతనం పరిచక్షతే ।
ప్రకర్షేణ మహాత్మానం నవం శుద్ధస్వరూపకమ్ ॥7॥

మాయకు అతీతుడు, శుద్ధచైతన్యస్వరూపుడైన పరమాత్మను 'నూతనుడు' అని పిలిచారు.

నూతనం వై కరోతీతి ప్రణవం తం విదుర్బుధాః ।
ప్రణవం ద్వివిధం ప్రోక్తం సూక్ష్మస్థూలవిభేదతః ॥8॥

సాధన చేసే వాడిని నూతనుణ్ణి చేస్తుంది. కాబట్టి ఓంకారానికి ప్రణవం అనే పేరు వచ్చిందని పండితులు చెప్తారు. ప్రణవం సూక్ష్మం, స్థూలం అని రెండు రకాలుగా ఉంది.

సూక్ష్మమేకాక్షరం విద్యాత్ స్థూలం పంచాక్షరం విదుః ।
సూక్ష్మమవ్యక్తపంచార్ణం సువ్యక్తార్ణం తథేతరత్ ॥9॥

ఓం అనే ఒక అక్షరానికి సూక్ష్మప్రణవమని, పంచాక్షరికి స్థూలప్రణవమని పేరు. సూక్ష్మప్రణవంలో అవ్యక్తములగు పంచవర్ణములు స్థూలప్రణవంలో సువ్యక్తములగుతాయి.

జీవన్ముక్తస్య సూక్ష్మం హి సర్వసారం హి తస్య హి ।
మంత్రేణార్థానుసంధానం స్వదేహవిలయావధి ॥10॥

జీవన్ముక్తుడైన జ్ఞాని సర్వమంత్రసారమైన సూక్ష్మప్రణవాన్ని, అర్థజ్ఞానపూర్వకంగా శరీరం నశించు వరకు జపించాలి.

స్వదేహే గలితే పూర్ణం శివం ప్రాప్నోతి నిశ్చయః ।
కేవలం మంత్రజాపీ తు యోగం ప్రాప్నోతి నిశ్చయః ॥11॥

అటువంటి జ్ఞాని శరీరం నశించిన తర్వాత పూర్ణస్వరూపుడైన శివుని చేరుట జరిగిన తీరుతుంది. అర్థానుసంధానం లేకుండా కేవలం మంత్రాన్ని జపించే వ్యక్తి యోగాన్ని పొందుట నిశ్చయం.

షట్త్రింశత్కోటిజాపీ తు నిశ్చయం యోగమాప్నుయాత్ ।
సూక్ష్మం చ ద్వివిధం జ్ఞేయం హ్రస్వదీర్ఘవిభేదతః ॥12॥

ముప్పై ఆరుకోట్ల జపం చేసిన వ్యక్తి తప్పకుండా యోగాన్ని పొందుతాడు. సూక్ష్మప్రణవం మరలా హ్రస్వం, దీర్ఘం అని రెండు రకాలుగా ఉంది.

అకారశ్చ ఉకారశ్చ మకారశ్చ తతః పరమ్ ।
బిందునాదయుతం తద్ధి శబ్దకాలకలాన్వితమ్ ॥13॥

అకార, ఉకార, మకార, బిందు, నాదములతో, శబ్ద, కాల, కలలతో కూడినది దీర్ఘప్రణవము.

దీర్ఘ ప్రణవమేవం హి యోగినామేవ హృద్గతమ్ ।
మకారం తం త్రితత్త్వం హి హ్రస్వప్రణవ ఉచ్యతే ॥14॥

దీర్ఘప్రణవంఅనునది యోగుల హృదయంలో మాత్రమే ఉంటుంది. అకార, ఉకార, మకారములనే మూడు వర్ణములతో మాత్రమే కూడిన ప్రణవాన్ని హ్రస్వప్రణవం అని అంటారు.

శివశ్శక్తిస్తయోరైక్యం మకారం తు త్రికాత్మకమ్ ।
హ్రస్వమేవం హి జాప్యం స్యాత్ సర్వపాపక్షయైషిణామ్ ॥15॥

అకారం శివుడు, ఉ కారం శక్తి, మ కారం శివశక్తుల ఐక్యం. అన్నిపాపాలను తొలగించుకోవాలనుకునే సాధకులు ఈ దృష్టితో హ్రస్వప్రణవాన్ని జపించాలి.

భూవాయుకనకార్ణోద్యోః శబ్దాద్యాశ్చ తథా దశ ।
ఆశాన్వయే దశపునః ప్రవృత్తా ఇతి కథ్యతే ॥16॥

భూమి, గాలి, నిప్పు, నీరు, ఆకాశం అనే పంచభూతాలు, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనే అయిదువిషయాలు మొత్తం కలసి ఈ పదింటిలో ఆశతో జీవించే పదిరకాల మానవులను “ప్రవృత్తులు” అని పిలుస్తారు.

హ్రస్వమేవ ప్రవృత్తానాం నివృత్తానాం తు దీర్ఘకమ్ ।
వ్యాహృత్త్యాదౌ చ మంత్రాదౌ కామం శబ్దకలాయుతమ్ ॥17॥

వేదాదౌ చ ప్రయోజ్యం స్యాద్వందనే సంధ్యయోరపి ।
నవకోటిజపాన్ జప్త్వాన్ సంశుద్ధః పురుషో భవేత్ ॥18॥

వ్యాహృత్యాది మంత్రముల ప్రారంభమున శబ్దకలాయుతమగు ప్రవృత్తులకు హ్రస్వప్రణవము నివృత్తులకు దీర్ఘ ప్రణవము చెప్పబడినది. వేదాన్ని చదివేటపుడు ప్రారంభంలోను, మూడుపొద్దుల చేసే సంధ్యావందనసమయంలో ఓంకారాన్ని జపించాలి. తొమ్మిదికోట్లు ఓంకారాన్ని జపం చేసిన మనిషి పూర్తిగా శుద్ధుడౌతాడు.

పునశ్చ నవకోట్యా తు పృథివీ జయమాప్నుయాత్ ।
పునశ్చ నవకోట్యా తు హ్యపాం జయమవాప్నుయాత్ ॥19॥

మరల తొమ్మిదికోట్లు జపిస్తే భూతత్త్వాన్ని, ఇంకో తొమ్మిదికోట్లు జపిస్తే నీటి తత్త్వాన్ని జయిస్తాడు.

పునశ్చ నవకోట్యా తు తేజసాం జయమాప్నుయాత్ ।
పునశ్చ నవకోట్యా తు వాయోర్జయమవాప్నుయాత్ ॥
ఆకాశజయమాప్నోతి నవకోటిజపేన వై ॥20॥

ఇంకో తొమ్మిదికోట్లు జపం చేస్తే అగ్నితత్త్వాన్ని, ఇంకో తొమ్మిదికోట్ల జపం చేస్తే ఆకాశతత్త్వాన్ని జయిస్తాడు.

గంధాదీనాం క్రమేణైవ నవకోటిజపేన వై ।
అహంకారస్య చ పునర్నవకోటిజపేన వై ॥21॥

ఇలాగే వరుసగా తొమ్మిదికోట్లు చొప్పున జపించే వ్యక్తి గంధాదులను జయిస్తాడు. ఇంకో తొమ్మిదికోట్లు జపిస్తే అహంకారతత్త్వాన్ని జయిస్తాడు.

సహస్రమంత్రజప్తేన నిత్యం శుద్ధో భవేత్పుమాన్ ।
తతః పరం స్వసిద్ధ్యర్థం జపో భవతి హి ద్విజాః ॥22॥

ప్రతిరోజూ వేయిసార్లు మంత్రాన్ని జపించిన వాడు శుద్ధుడౌతాడు. ఓ బ్రాహ్మణులారా! ఆ తర్వాత మానవుడు ఆత్మసాక్షాత్కారం కోసం జపం చేయాలి.

ఏవమష్టోత్తరశతకోటిజప్తేన వై పునః ।
ప్రణవేన ప్రబుద్ధస్తు శుద్ధయోగమవాప్నుయాత్ ॥23॥

ఈ విధంగా 108 కోట్లు ప్రణవాన్ని జపించిన మనిషి జ్ఞానియై శుద్ధయోగమును పొందుతాడు.

శుద్ధయోగేన సంయుక్తో జీవన్ముక్తో న సంశయః ।
సదా జపన్ సదా ధ్యాయన్ శివం ప్రణవరూపిణమ్ ॥24॥

సమాధిస్థో మహాయోగీ శివ ఏవ న సంశయః ।
ఋషిచ్ఛందో దేవతాది న్యస్య దేహే పునర్జపేత్ ॥25॥

శుద్ధయోగాన్ని పొందిన జ్ఞాని జీవన్ముక్తుడవటంలో సందేహం లేదు. ప్రణవరూపమైన శివుణ్ణి ఎల్లపుడూ ధ్యానిస్తూ, ప్రణవాన్ని ఎల్లపుడూ జపిస్తూ సమాధిలో ఉండే మహాయోగి శివుడే అనుటలో సందేహం లేదు. మంత్రం యొక్క ఋషి, ఛందస్సు, దేవతలను స్మరించి, అంగన్యాస, కరన్యాస జపాలు చేయాలి.

ప్రణవం మాతృకాయుక్తం దేహే న్యస్య ఋషిర్భవేత్ ।
దశమాతృషడధ్వాది సర్వం న్యాసఫలం లభేత్ ॥26॥

అ,ఇ,ఉ మరియు బిందువుతో కూడిన ప్రణవాన్ని తన దేహం నందు న్యాసం చేసిన మనిషి ఋషి అవుతాడు. పదిమాతృకలు, ఆరు అధ్వలు మున్నగువాటితో కూడి సంపూర్ణన్యాసఫలమును పొందును.

ప్రవృత్తానాం చ మిశ్రాణాం స్థూలప్రణవమిష్యతే ।
క్రియా తపోజపైః యుక్తాస్త్రివిధాశ్శివయోగినః ॥27॥

ప్రవృత్తులు, నివృత్తులూ అయినచో వారికి స్థూలప్రణవము యుక్తము. శివయోగులు మూడురకాలుగా ఉన్నారు. క్రియాయోగి, జపయోగి, తపోయోగి.

ధనాది విభవైశ్చైవ కరాద్యంగైర్నమాదిభిః ।
క్రియయా పూజయా యుక్తః క్రియాయోగీతి కథ్యతే ॥28॥

సంపదను ఖర్చు పెట్టి, పూజను చేస్తూ, సాష్టాంగనమస్కారం వంటి పనులు చేయు భక్తుడిని క్రియాయోగి అంటారు.

పూజాయుక్తశ్చ మితభుక్ బాహ్యేంద్రియజయాన్వితః ।
పరద్రోహాదిరహితస్తపోయోగీతి కథ్యతే ॥29॥

పూజ చేస్తూ, మితంగా ఆహారాన్ని తీసుకుంటూ, బయట ఇంద్రియాలను జయించి, ఇతరులకు ద్రోహం చేయకుండా ఉండేవాడిని తపోయోగి అంటారు.

ఏతైర్యుక్తస్సదా క్రుద్ధస్సర్వకామాదివర్జితః ।
సదా జపపరశ్శాంతో జపయోగీతి తం విదుః ॥30॥

ఈ మంచిగుణాలన్ని కల్గి కోపం లేకుండా ఉండి, కోరికలను విడిచి, శాంతమైన మనసుతో అన్ని వేళలలో జపం చేయు భక్తుణ్ణి జపయోగి అంటారు.

ఉపచారైః షోడశభిః పూజయా శివయోగినామ్ ।
సాలోక్యాదిక్రమేణైవ శుద్ధో ముక్తిం లభేన్నరః ॥31॥

శివయోగులను షోడశోపచారాలతో పూజించే మానవుడు శుద్ధుడై సాలోక్యాదిక్రమంలో ముక్తిని పొందుతాడు.

జపయోగమథో వక్ష్యే గదతః శృణుత ద్విజాః ।
తపః కర్తుర్జపః ప్రోక్తో యజ్జన్మ పరిమార్జతే ॥32॥

ఓ బ్రాహ్మణులారా! నేనిపుడు జపయోగం గురించి చెప్తాను. వినండి! తపస్సు చేసే వారి కోసం జపం విధించబడింది. జపం జన్మబంధాన్ని నాశనం చేస్తుంది.

శివనామ నమఃపూర్వం చతుర్థ్యాం పంచతత్త్వకమ్ ।
స్థూలప్రణవరూపం హి శివపంచాక్షరం ద్విజాః ॥33॥

ముందుగా నమః ఉచ్చరించి, తరువాత చతుర్థీవిభక్తిలో శివనామం చేరిస్తే నమశ్శివాయ అనే పంచాక్షరి అవుతుంది. ఓ బ్రాహ్మణులారా! శివపంచాక్షరి స్థూలప్రణవం.

పంచాక్షరజపేనైవ సర్వసిద్ధిం లభేన్నరః ।
ప్రణవేనాదిసంయుక్తం సదా పంచాక్షరం జపేత్ ॥34॥

పంచాక్షరి జపించు మానవుడు సర్వసిద్ధులను పొందుతాడు. ఎపుడూ ఓంకారంతో కూడిన పంచాక్షరిని జపించాలి.

గురూపదేశం సంగమ్య సుఖవాసే సుభూతలే ।
పూర్వపక్షే సమారభ్య కృష్ణభూతావధి ద్విజాః ॥35॥

గురువు నుండి ఉపదేశం పొంది, చక్కని నేలపై సుఖాసనంపై కూర్చొని జపించాలి. ఓ బ్రాహ్మణులారా! శుక్లపక్షంలో మొదలు పెట్టి, కృష్ణపక్షం పూర్తయ్యే వరకు జపించాలి.

మాఘం భాద్రం విశిష్టం తు సర్వకాలోత్తమోత్తమమ్ ।
ఏకవారం మితాశీ తు వాగ్యతో నియతేంద్రియః ॥36॥

మాఘమాసం, భాద్రపదమాసం జపానికి చాలా మంచివి. సాధకుడు ఒకపూట భోజనం చేయాలి. తక్కువగా తినాలి. తక్కువగా మాట్లాడాలి. ఇంద్రియాలను జయించాలి.

స్వస్య రాజపితౄణాం చ శుశ్రూషణం చ నిత్యశః ।
సహస్రజపమాత్రేణ భవేచ్ఛుద్ధో౽న్యథా ఋణీ ॥37॥

దేశాన్ని పాలించే రాజుకు, తల్లితండ్రులకు నిత్యం సేవ చేయాలి. ఈ విధంగా నియమంతో వేయిసార్లు జపం చేస్తే సాధకుడు శుద్ధుడౌతాడు. జపం చేయని వాడు ఋణి ఔతాడు.

పంచాక్షరం పంచలక్షం జపేచ్ఛివమనుస్మరన్ ।
పద్మాసనస్థం శివదం గంగాచంద్రకలాన్వితమ్ ॥38॥

వామోరుస్థితశక్త్యా చ విరాజంతం మహాగణైః ।
మృగటంకధరం దేవం వరదాభయపాణికమ్ ॥39॥

సదానుగ్రహకర్తారం సదాశివమనుస్మరన్ ।
సంపూజ్య మనసా పూర్వం హృది వా సూర్యమండలే ॥40॥

జపేత్పంచాక్షరీం విద్యాం ప్రాఙ్ముఖః శుద్ధ కర్మకృత్ ।

శివుని స్మరిస్తూ పంచాక్షరిని ఓం నమఃశివాయ అను మంత్రమును 5 లక్షలసార్లు జపం చేయాలి. పద్మాసనస్థుడై, శుభప్రదుడై, గంగతో, చంద్రకళతో కూడి ఎడమతొడపైనున్న శక్తితో ప్రమథగణాలతో, విరాజిల్లుతూ, మృగాన్ని, త్రిశూలాన్ని ధరించి, ప్రకాశస్వరూపపుడై, చేతులలో వరద, అభయ ముద్రలు కలిగి భక్తులను ఎపుడూ అనుగ్రహించే సదాశివుణ్ణి ధ్యానించాలి. పవిత్రంగా ఆచరించే సాధకుడు ముందుగా హృదయంలో గాని, సూర్యమండలంలో కాని శివుని భావన చేసి, మానసికపూజ చేసి, తూర్పువైపు కూర్చొని, పంచాక్షరీమంత్రం జపించాలి.

ప్రాతః కృష్ణచతుర్దశ్యాం నిత్యకర్మ సమాప్య చ ॥41॥

మనోరమే శుచౌ దేశే నియతఃశుద్ధమానసః ।
పంచాక్షరస్య మంత్రస్య సహస్రం ద్వాదశం జపేత్ ॥42॥

కృష్ణపక్ష చతుర్దశినాడు అనగా జపం ఆఖరిరోజు ఉదయాన్నే నిత్యం చేసే పనులు చేసుకొని అందంగా, శుభ్రంగా ఉన్నచోట కూర్చుని, శుద్ధమైన ఏకాగ్రమనసుతో సాధకుడు పంచాక్షరీ మంత్రాన్ని పన్నెండు వేలసార్లు జపించాలి.

వరయేచ్చ సపత్నీకాన్ శైవాన్ వై బ్రాహ్మణోత్తమాన్ ।
ఏకం గురువరం శిష్టం వరయేత్సాంబమూర్తికమ్ ॥43॥

శివభక్తులైన బ్రాహ్మణులను భార్యలతో సహా ఆహ్వానించాలి. సాంబమూర్తి స్వరూపుడైన ఒక శిష్టుని గురువుగా వరించాలి.

ఈశానం చాథ పురుషమఘోరం వామమేవ చ ।
సద్యోజాతం చ పంచైవ శివభక్తాన్ ద్విజోత్తమాన్ ॥44॥

శివభక్తులైన బ్రాహ్మణులలో ఈశాన, తత్పురుష, అఘోర, వామదేవ, సద్యోజాత రూపాలను భావన చేయాలి.

పూజాద్రవ్యాణి సంపాద్య శివపూజాం సమారభేత్ ।
శివపూజాం చ విధివత్ కృత్వా హోమం సమారభేత్ ॥45॥

పూజాద్రవ్యాలను సంపాదించి, శివపూజ మొదలు పెట్టాలి. యథావిధిగా శివపూజను చేసి, హోమాన్ని మొదలు పెట్టాలి.

ముఖాంతం చ స్వసూత్రేణ కృత్యా హోమం సమారభేత్ ।
దశైకం వా శతైకం వా సహస్రైకమథాపి వా ॥46॥

కాపిలేన ఘృతేనైవ జుహుయాత్స్వయమేవ హి ।
కారయేచ్ఛివభక్తైర్వాప్యష్టోత్తరశతం బుధః ॥47॥

అగ్నిని తమ సొంత ఇంటి నియమాలప్రకారం హోమం చేయాలి. పదకొండు, నూటొకటి, లేదా వేయిన్నొకటి ఆహుతులను, కపిల ఆవు యొక్క నేతితో చేసి, స్వయంగా తానే ఇవ్వాలి. లేకపోతే శివభక్తులచే నూట ఎనిమిది ఆహుతులను ఇప్పించాలి.

హోమాంతే దక్షిణా దేయా గురోర్గోమిథునం తథా ।
ఈశానాది స్వరూపాంస్తాన్ గురుం సాంబం విభావ్య చ ॥48॥

తేషాం పత్సిక్తతోయేన స్వశిరః స్నానమాచరేత్ ।
షట్త్రింశత్కోటితీర్థేషు సద్యస్స్నానఫలం లభేత్ ॥49॥

హోమం అయిన తర్వాత గురువుకు రెండు ఆవులను దక్షిణ ఇవ్వాలి. ఈశానాదులను సాంబుని గురువునందు చూసి వారి పాదజలాన్ని తలపై చల్లుకోవాలి. అట్లు చేసిన సాధకునికి 36 కోట్ల తీర్థాలలో స్నానం చేసిన ఫలం వెంటనే కల్గుతుంది.

దశాంగమన్నం తేషాం వై దద్యాద్వై భక్తిపూర్వకమ్ ।
పరాబుద్ధ్యా గురోః పత్నీమీశానాది క్రమేణ తు ॥50॥

పరమాన్నేన సంపూజ్య యథా విభవవిస్తరమ్ ।
రుద్రాక్షవస్త్రపూర్వం చ వటకాపూపకైర్యుతమ్ ॥51॥

బలిదానం తతః కృత్వా భూరిభోజనమాచరేత్ ।
తతస్సంప్రార్థ్య దేవేశం జపం తావత్సమాపయేత్ ॥52॥

తర్వాత వారికి పది అంగాలతో కూడిన భోజనాన్ని భక్తితో పెట్టాలి. గురువుభార్యలో పరాశక్తిని, బ్రాహ్మణులలో ఈశానాది ఐదురూపాలను భావన చేసి వారి వైభవానికి తగ్గట్టు పరమాన్నంతో పూజించి, రుద్రాక్షలను, బట్టలను ఇవ్వాలి. తర్వాత వడలు, అప్పాలుతో కూడిన అన్నాన్ని కాకుల వంటి ప్రాణులకు పెట్టాలి. తర్వాత సాధకుడు తృప్తిగా సుష్ఠుగా భోజనం చేయాలి. తర్వాత శివుణ్ణి ప్రార్థించి జపాన్ని ముగించాలి.

పురశ్చరణమేవం తు కృత్వా మంత్రీ భవేన్నరః ।
పునశ్చ పంచలక్షేణ సర్వపాపక్షయో భవేత్ ॥53॥

ఈ విధంగా మంత్రపునశ్చరణ చేసిన వాడికి మంత్రసిద్ధి వస్తుంది. ఇతడు మరలా అయిదులక్షలు జపం చేస్తే అన్నిపాపాలు నశించి పోతాయి.

అతలాది సమారభ్య సత్యలోకావధి క్రమాత్ ।
పంచలక్షజపాత్తత్తల్లోకైశ్వర్యమవాప్నుయాత్ ॥54॥

5 లక్షలు చొప్పున జపం చేసిన వాడు వరుసగా అతలలోకం నుండి సత్యలోకం వరకు ఉన్న ఆయా లోకాలన్నింటిలో ఐశ్వర్యాన్ని పొందుతాడు.

మధ్యే మృతశ్చేద్భోగాంతే భూమౌ తజ్జాపకో భవేత్ ।
పునశ్చ పంచలక్షేణ బ్రహ్మసామీప్యమాప్నుయాత్ ॥55॥

మధ్యలో చనిపోతే పరలోకంలో భోగాలను అనుభవించి, భూమియందు పుట్టి పంచాక్షరిని జపిస్తాడు. మరలా అయిదు లక్షలు జపించి బ్రహ్మలోకానికి చేరుకుంటాడు.

పునశ్చ పంచలక్షేణ సారూప్యైశ్వర్యమాప్నుయాత్ ।
ఆహత్య శతలక్షేణ సాక్షాద్బ్రహ్మసమో భవేత్ ॥56॥

మరొక అయిదు లక్షలు జపిస్తే సారూప్య ఐశ్వర్యాన్ని పొందుతాడు. మొత్తం కోటిజపం చేసిన వాడు బ్రహ్మతో సమానుడౌతాడు.

కార్యబ్రహ్మణ ఏవం హి సాయుజ్యం ప్రతిపద్య వై ।
యథేష్టం భోగమాప్నోతి తద్బ్రహ్మ ప్రళయావధి ॥57॥

అతడు నాలుగుముఖాలు ఉన్న కార్యబ్రహ్మయొక్క సాయుజ్యాన్ని పొంది, ఆ బ్రహ్మ ప్రళయాన్ని పొందేవరకు భోగాలను అనుభవిస్తాడు.

పునః కల్పాంతరే వృత్తే బ్రహ్మపుత్రస్సజాయతే ।
పునశ్చ తపసా దీప్తః క్రమాన్ముక్తో భవిష్యతి ॥58॥

మరియొక కల్పం ప్రారంభం కాగానే అతడు బ్రహ్మపుత్రుడుగా పుడతాడు. అతడు మరల తపస్సుచే ప్రకాశించి క్రమంగా ముక్తుడౌతాడు.

పృథ్వ్యాది కార్యభూతేభ్యో లోకా వై నిర్మితాః క్రమాత్ ।
పాతాలాది చ సత్యాంతం బ్రహ్మలోకాశ్చతుర్దశ ॥59॥

భూమి మొదలైన కార్యభూతాల నుండి క్రమంగా పాతాళం మొదలు సత్యలోకం వరకు పదునాలుగు బ్రహ్మలోకాలు నిర్మించబడ్డాయి.

సత్యాదూర్ధ్వం క్షమాంతం వై విష్ణులోకాశ్చతుర్దశ ।
క్షమాలోకే కార్యవిష్ణుర్వైకుంఠే వరపత్తనే ॥60॥

సత్యలోకం పైన క్షమాలోకం వరకు పదునాలుగు విష్ణులోకములు. క్షమాలోకం నందు మంచి పట్టణమైన వైకుంఠంలో కార్యవిష్ణువు,

కార్యలక్ష్మ్యా మహాభోగిరక్షాం కృత్వాఽధితిష్ఠతి ।
తదూర్ధ్వగాశ్చాశుచ్యంతా లోకాష్టావింశతిః స్థితాః ॥61॥

కార్యలక్ష్మితో కూడి ఆదిశేషునిపై నివసించి రక్షిస్తుంటాడు. దానిపైన శుచిలోకం వరకు ఇరవై ఎనిమిది లోకాలున్నాయి.

శుచౌ లోకే తు కైలాసే రుద్రో వై భూతహృత్ స్థితః ।
షడుత్తరాశ్చ పంచాశదహింసాతాస్తదూర్ధ్వగాః ॥62॥

శుచిలోకంలోని కైలాసంలో ప్రాణులను చంపే రుద్రుడు ఉంటాడు. దానిపైన అహింసాలోకం వరకు ఏభైఆరు లోకాలున్నాయి.

అహింసా లోకమాస్థాయ జ్ఞానకైలాసకే పురే ।
కార్యేశ్వరస్తిరోభావం సర్వాన్ కృత్వాధితిష్ఠతి ॥63॥

అహింసాలోకంలోని జ్ఞానకైలాసపురాన్ని, అన్నిప్రాణుల్ని తిరోధానం చేసే కార్యేశ్వరుడు అధిష్ఠించి ఉంటాడు.

తదంతే కాలచక్రం హి కాలాతీతస్తతః పరమ్ ।
శివేనాధిష్ఠితస్తత్ర కాలశ్చక్రేశ్వరాహ్వయః ॥64॥

అహింసాలోకానికి చివరలో కాలచక్రం ఉంది. దానిపైన కాలాతీతలోకం ఉంది. దాన్ని శివుడు అధిష్ఠించి ఉంటాడు.

మాహిషం ధర్మమాస్థాయ సర్వాన్ కాలేన యుంజతి ।
అసత్యశ్చాశుచిశ్చైవ హింసా చైవాథ నిర్ఘృణా ॥65॥

అసత్యాదిచతుష్పాదః సర్వాంశః కామరూపధృక్ ।
నాస్తిక్యలక్ష్మీర్దుఃసంగో వేదబాహ్యధ్వనిః సదా ॥66॥

క్రోధసంగః కృష్ణవర్ణో మహామహిషవేషవాన్ ।
తావన్మహేశ్వరః ప్రోక్తస్తిరోధాస్తావదేవ హి ॥67॥

తదర్వాక్ కర్మభోగో హి తదూర్ధ్వం జ్ఞానభోగకమ్ ।
తదర్వాక్ కర్మమాయా హి జ్ఞానమాయా తదూర్ధ్వకమ్ ॥68॥

అక్కడ చక్రేశ్వరుడనే కాలుడు మహిషము (ఎద్దు) ను ఎక్కి, ధర్మబద్ధంగా అందరిని కాలానికి అధీనులుగా చేస్తాడు. అసత్యం అశుచి, హింస, క్రౌర్యం అనెడి నాలుగు పాదాలు కలిగి, కోరిన రూపాన్ని ధరించగలిగి, నాస్తికత్వమే నేత్రాలుగా చెడు సావాసాలతో ఎప్పుడు వేదవ్యతిరేకంగా మాట్లాడుతూ క్రోధమే కొమ్ములుగా కలిగి నల్లని రంగు గల విశాలమైన అధర్మమనే దున్నపోతును ఎక్కి వున్న కాలచక్రాన్ని మహేశ్వరుడు ఇంత వరకే తిరోధానం చేస్తాడు. దీనికింద కర్మ నుండి వచ్చిన భోగం, దీనిపైన జ్ఞానం నుండి వచ్చిన ఆనందం ఉంటాయి. దీని కింద కర్మమాయ, దీనిపైన జ్ఞానమాయ ఉన్నాయి.

మాలక్ష్మీః కర్మభోగో వై యాతి మాయేతి కథ్యతే ।
మాలక్ష్మీర్జ్ఞానభోగో వై యాతి మాయేతి కథ్యతే ॥69॥

మా అంటే లక్ష్మి. దానినుండి కర్మభోగము ప్రాప్తిస్తుంది కనుక దానిని మాయ అని అంటారు. అట్లే మా అనగా లక్ష్మినుండి జ్ఞానభోగము ప్రాప్తిస్తోంది కనుక దానిని మాయ అంటారు.

తదూర్ధ్వం నిత్యభోగో హి తదర్వాజ్ నశ్వరం విదుః ।
తదర్వాక్ చ తిరోధానం తదూర్ధ్వం న తిరోధనమ్ ॥70॥

జ్ఞానానందం జ్ఞాని పొందుతాడు అను అర్థంలో మాయ అనబడుతుంది. అహింసా లోకానికి పైన శాశ్వతానందం, దానికింద నశించే భోగాలుంటాయి. దానికిందగల తిరోధానం దానిపైన ఉండదు.

తదర్వాక్ పాశబంధో హి తదూర్ధ్వం న హి బంధనమ్ ।
తదర్వాక్ పరివర్తంతే కామ్యకర్మానుసారిణః ॥71॥

దాని కింద సంసారబంధం ఉంది. దాని పైన బంధం లేదు. కామ్యకర్మలను చేసేవారు కిందిలోకాల్లో తిరుగుతూ ఉంటారు.

నిష్కామకర్మభోగస్తు తదూర్ధ్వం పరికీర్తితః ।
తదర్వాక్ పరివర్తంతే బిందుపూజాపరాయణాః ॥72॥

కోరికలు లేకుండా కర్మలు చేసే వాళ్లు దానిపైలోకంలో ఆనందం అనుభవిస్తారు. బిందుపూజ నిష్ఠ కల వాళ్లు దానికింద తిరుగుతూ ఉంటారు.

తదూర్ధ్వం హి వ్రజంత్యేవ నిష్కామా లింగపూజకాః ।
తదర్వాక్ పరివర్తంతం శివాన్యసురపూజకాః ॥73॥

దానిపైన నిష్కామరూపులై లింగపూజ చేసే వాళ్ళు ఉంటారు. దాని కింద శివభిన్నపూజకులు ఉంటారు.

శివైకనిరతా యే చ తదూర్ధ్వం సంప్రయాంతి తే ।
తదర్వాగ్జీవకోటిస్స్యాత్తదూర్ధ్వం పరకోటికాః ॥74॥

శివునియందు మాత్రమే నిష్ఠ కల వారు దాని పై లోకాలను పొందుతారు. దాని కింద జీవకోటి, దాని పైన ఈశ్వరకోటి ఉంటుంది.

సాంసారికాస్తదర్వాక్చ ముక్తాః ఖలు తదూర్ధ్వగాః ।
తదర్వాక్పరివర్తంతే ప్రాకృతద్రవ్యపూజకాః ॥75॥

సంసారానికి పరిమితమైన వాళ్లు దాని కింద, ముక్తులు దాని పైన ఉంటారు. ప్రాకృతవస్తువులతో పూజలు చేసే వాళ్లు దాని కింద తిరుగుతూ ఉంటారు.

తదూర్ధ్వం హి వ్రజంత్యేతే పౌరుషద్రవ్యపూజకాః ।
తదర్వాక్ శక్తిలింగం తు శివలింగం తదూర్ధ్వకమ్ ॥76॥

పురుషవస్తువులతో పూజలు చేసే వాళ్లు దాని పైలోకాలను పొందుతారు. దాని కింద శక్తిలింగం, దాని పైన శివలింగం ఉంటాయి.

తదర్వాగావృతం లింగం తదూర్ధ్వం హి నిరావృతి ।
తదర్వాక్ కల్పితం లింగం తదూర్ధ్వం వై న కల్పితమ్ ॥77॥

దాని కింద సుడులు తిరిగిన లింగం, దానిపైన సుడులు లేని లింగం ఉంటాయి. దాని కింద కల్పించిన లింగం, దాని పైన కల్పితం కాని అంటే స్వయంభువలింగం ఉంటాయి.

తదర్వాక్ బాహ్యలింగం స్యాదంతరంగం తదూర్ధ్వకమ్ ।
తదర్వాక్ఛక్తిలోకా హి శతం వై ద్వాదశాధికమ్ ॥78॥

దాని కింద బాహ్యలింగం, దాని పైన అంతర్లింగం (అంటే భావనారూపలింగం) ఉంటుంది. దాని కింద 112 శక్తిలోకాలున్నాయి.

తదర్వాగ్బిందురూపం హి నాదరూపం తదుత్తరమ్ ।
తదర్వాక్కర్మలోకస్తు తదూర్ధ్వం జ్ఞానలోకకః ॥79॥

దాని కింద బిందురూపం, దానిపైన నాదరూపం, దాని కింద కర్మలోకం, దాని పైన జ్ఞానలోకం ఉన్నాయి.

నమస్కారస్తదూర్ధ్వం హి మదాహంకారనాశనః ।
జనిజం వై తిరోధానం నానిషిద్ధ్వాతతే ఇతి ॥80॥

జ్ఞానశబ్దార్థ ఏవం హి తిరోధాననివారణాత్ ।
తదర్వాక్ పరివర్తంతే హ్యధిభౌతికపూజకాః ॥81॥

గర్వాన్ని, అహంకారాన్ని నశింప చేసే నమస్కారం దానిపై లోకాలను పొందేట్లు చేస్తుంది. జన్మ నుండి పుట్టిన తిరోధానం దానిలో లేదు. తిరోధానాన్ని నిషేధించక పోతే అహింసాలోకానికి పై స్థానాన్ని పొందలేము. జ్ఞానశబ్దానికి తిరోధానాన్ని తొలగించేది అని అర్థం. బాహ్యమైన అర్చన చేయు వారు అహింసా లోకానికి కింద తిరుగుతుంటారు.

ఆధ్యాత్మికార్చకా ఏవ తదూర్ధ్వం సంప్రయాంతి వై ।
తావద్వై వేదిభాగం తన్మహాలోకాత్మలింగకే ॥82॥

కాని హృదయంలో శివుని అర్చించే వారు దానికంటే ఊర్ధ్వలోకాలను పొందుతారు. మహాలోకాలతో కూడిన బ్రహ్మాండం లింగాకారంలో ఉంది.

ప్రకృత్యాద్యష్టబంధోఽపి వేద్యంతే సంప్రతిష్ఠితః ।
ఏవమేతాదృశం జ్ఞేయం సర్వం లౌకికవైదికమ్ ॥83॥

కార్యజగత్తులోని ఆ లింగం వేది అనగా పానవట్టం వరకు వ్యాపించి ఉంటూంది. అంతవరకు బద్ధ జీవులుంటారు. వైదికమైనా లౌకికమైనా ఇది పూర్తిగా ఇలాగే ఉంటుంది.

సత్యాదిధర్మయుక్తా యే శివపూజాపరాశ్చ యే ।
తదూర్ధ్వం వృషభో ధర్మో బ్రహ్మచర్యస్వరూపధృక్ ॥84॥

సత్యం మొదలైన ధర్మాలను పాటిస్తూ, శివుని పూజించే భక్తులు మాత్రమే తరిస్తారు. కాలచక్రానికి పైన ధర్మమనే ఎద్దు ఉంది. బ్రహ్మచర్యమే దాని స్వరూపం.

సత్యాదిపాదయుక్తస్తు శివలోకాగ్రతః స్థితః ।
క్షమాశృంగః శమః శ్రోత్రో వేదధ్వనివిభూషితః ॥85॥

సత్యం, శుభ్రం, అహింసా, దయ అనే నాలుగుపాదాలు గల ఆ ధర్మవృషభం శివలోకానికి ఎదుట నిలబడి ఉంటుంది. దానికి క్షమయే కొమ్ము. ఇంద్రియనిగ్రహం చెవులు, అది వేదధ్వనితో ప్రకాశిస్తుంది.

ఆస్తిక్యచక్షుర్నిశ్వాసగురుబుద్ధిమనా వృషః ।
క్రియాది వృషభా జ్ఞేయాః కారణాదిషు సర్వదా ॥86॥

ఆస్తికత్వమే దాని నేత్రములు, నిఃశ్వాసలే గొప్పదైనమనస్సు మరియు బుద్ధి, క్రియాదులు వృషభములు. అవి కారణము మున్నగువాటియందు ఎల్లప్పుడు ఉంటాయి.

తం క్రియా వృషభం ధర్మం కాలాతీతోఽధితిష్ఠతి ।
బ్రహ్మవిష్ణుమహేశానాం స్వస్వాయుర్దినముచ్యతే ॥ 87॥

ఆ క్రియారూపమైన ధర్మవృషభాన్ని కాలాతీతుడగు శివుడు అధిష్ఠిస్తాడు. బ్రహ్మ, విష్ణు మహేశ్వరుల ఆయుష్షులను రోజు అంటారు. (దినము)

తదూర్ధ్వం న దినం రాత్రిర్న జన్మమరణాదికమ్ ।
పునః కారణసత్యాంతాః కారణబ్రహ్మణస్తథా ॥88॥

ఆ కాలచక్రం పైన రోజు, రాత్రి, పుట్టుక, చావు మొదలైనవి లేవు. మరల కారణసత్యలోకాల వరకు కారణబ్రహ్మలోకాలున్నాయి.

గంధాదిభ్యస్తు భూతేభ్యస్తదూర్ధ్వం నిర్మితాస్సదా ।
సూక్ష్మగంధస్వరూపా హి స్థితా లోకాశ్చతుర్దశ ॥89॥

ఇవి గంధం మొదలుగా గల భూతతన్మాత్రల నుండి నిర్మించబడి, కాలచక్రానికి పైన ఉన్నాయి. వీటి సంఖ్య పదునాలుగు.

పునః కారణవిష్ణోర్వై స్థితా లోకాశ్చతుర్దశ ।
పునః కారణరుద్రస్య లోకాష్టావింశకా మతాః ॥90॥

కారణవిష్ణులోకాలు పదునాలుగు, కారణరుద్రలోకాలు ఇరవైయెనిమిది.

పునశ్చ కారణేశస్య షట్పంచాశత్తదూర్ధ్వగాః ।
తతః పరం బ్రహ్మచర్యలోకాఖ్యం శివసమ్మతమ్ ॥91॥

వాటికి పైన కారణ ఈశాసుని లోకాలు ఏబైఆరు ఉన్నాయి. ఆ పైన శివునికి ప్రియమైన బ్రహ్మచర్యలోకం ఉంది.

తత్రైవ జ్ఞానకైలాసే పంచావరణసంయుతే ।
పంచమండలసంయుక్తం పంచబ్రహ్మకలాన్వితమ్ ॥92॥

ఆదిశక్తిసమాయుక్తమాదిలింగం తు తత్ర వై ।
శివాలయమిదం ప్రోక్తం శివస్య పరమాత్మనః ॥93॥

అక్కడ అయిదుప్రాకారాలతో ఉన్న జ్ఞానకైలాసంలో, అయిదు మండలాలతో, అయిదు బ్రహ్మకళలతో. ఆదిశక్తితో కూడి ఉన్న ఆదిలింగం ఉంది. పరమాత్మ అయిన శివుడు విరాజిల్లే శివాలయం ఇదే.

పరాశక్త్యా సమాయుక్తస్త్రైవ పరమేశ్వరః ।
సృష్టిస్థితిశ్చ సంహారస్తిరోభావోఽప్యనుగ్రహః ॥94॥

పంచకృత్యప్రవీణోఽసౌ సచ్చిదానందవిగ్రహః ।
ధ్యానధర్మస్సదా యస్య సదానుగ్రహతత్పరః ॥95॥

పరమేశ్వరుడు శక్తితో కలసి ఇక్కడే ఉంటాడు. సృష్టి, స్థితి, సంహార, తిరోధాన, అనుగ్రహాలనే అయిదు జగత్కార్యాలను నిర్వహించటంలో సమర్థవంతుడు. సచ్చిదానందమూర్తి అన్ని వేళలయందు భక్తులను అనుగ్రహించుటలో తత్పరుడైన ఆ శివుని నిత్యధర్మం ధ్యానం.

సమాధ్యాసనమాసీనః స్వాత్మారామో విరాజతే ।
తస్య సందర్శనం సాధ్యం కర్మధ్యానాదిభిః క్రమాత్ ॥96॥

ఆయన సమాధియోగ్యమైన ఆసనంలో కూర్చుని, ఆత్మారాముడై ప్రకాశిస్తాడు. నిత్యం కర్మానుష్ఠానం, ధ్యానం మొదలైన వాటి అభ్యాసం వల్ల క్రమంగా ఆ శివుణ్ణి దర్శించటం సంభవమే.

నిత్యాది కర్మయజనాచ్ఛివకర్మమతిర్భవేత్ ।
క్రియాది శివకర్మభ్యః శివజ్ఞానం ప్రసాధయేత్ ॥97॥

కావున మానవుడు నిత్యం కర్మలను పాటిస్తూ శివపూజలో నిమగ్నమై ఉండాలి. పూజ మొదలైన శివకర్మలను ఆచరించి, మానవుడు శివజ్ఞానప్రసాదం పొందాలి.

తద్దర్శనగతాస్సర్వే ముక్తా ఏవ న సంశయః ।
ముక్తిరాత్మస్వరూపేణ స్వాత్మారామత్వమేవ హి ॥98॥

శివుని కృపాదృష్టికి పాత్రులైన వాళ్లందరూ మోక్షాన్ని పొందుతారనటంలో సందేహం లేదు. ముక్తి అంటే ఆత్మరూపుడై, ఆత్మారాముడై ఉండటమే.

క్రియా తపో జపజ్ఞానధ్యానధర్మేషు సుస్థితః ।
శివస్య దర్శనం లబ్ధ్వా స్వాత్మారామత్వమేవ హి ॥99॥

కర్మలు, తపస్సు, జపం, స్వాధ్యాయం, ధ్యానం అనే ధర్మాలను శ్రద్ధగా ఆచరించే సాధకుడు శివుని దర్శనాన్ని, ఆత్మారామత్వాన్ని పొందుతాడు.

యథా రవిఃస్వకిరణాదశుద్ధిమపనేష్యతి ।
కృపా విచక్షణశ్శంభురజ్ఞానమపనేష్యతి ॥100॥

సూర్యుడు తన కిరణాలతో అపరిశుభ్రాలను తొలగించే విధంగా, శివుడు తన దయాదృష్టితో అజ్ఞానాన్ని తొలగిస్తాడు.

అజ్ఞానవినివృత్తౌ తు శివజ్ఞానం ప్రవర్తతే ।
శివజ్ఞానాత్స్వస్వరూపమాత్మారామత్వమేష్యతి ॥101॥

అజ్ఞానం పోయిన వెంటనే శివజ్ఞానం కల్గుతుంది. సాధకుడు శివజ్ఞానం వలన స్వరూపాన్ని, ఆత్మారామత్వాన్ని పొందుతాడు.

పునశ్చ శతలక్షేణ బ్రహ్మణః పదమాప్నుయాత్ ।
పునశ్చ శతలక్షేణ విష్ణోః పదమవాప్నుయాత్ ॥102॥

పంచాక్షరిని కోటిజపం చేసిన వాడు బ్రహ్మలోకాన్ని, మరియొక కోటిసార్లు చేసినచో విష్ణులోకాన్ని పొందుతాడు.

పునశ్చ శతలక్షేణ రుద్రస్య పదమాప్నుయాత్ ।
పునశ్చ శతలక్షేణ ఐశ్వర్యం పదమాప్నుయాత్ ॥103॥

మరియొక కోటిసార్లు చేస్తే రుద్రలోకాన్ని, ఇంకో కోటి చేస్తే ఈశ్వరలోకాన్ని పొందుతాడు.

పునశ్చైవం విధేనైవ జపేత్ సుసమాహితః ।
శివలోకాదిభూతం హి కాలచక్రమవాప్నుయాత్ ॥104॥

ఇదే విధంగా ఏకాగ్రమైన మనసుతో ఇంకనూ జపం చేసిన మానవుడు శివలోకానికి మొదట్లో ఉండే కాలచక్రాన్ని చేరుకుంటాడు.

కాలచక్రం పంచచక్రమేకైకేన క్రమోత్తరే ।
సృష్టిమోహౌ బ్రహ్మచక్రం భోగమోహౌ తు వైష్ణవమ్ ॥105॥

కాలచక్రంలో ఒకదానిపైన మరొకటి చొప్పున అయిదు చక్రాలున్నాయి. సృష్టిమోహాలు, బ్రహ్మచక్రం, భోగమోహాలు విష్ణుచక్రం,

కోపమోహౌ రౌద్రచక్రం భ్రమణం చైశ్వరం విదుః ।
శివచక్రం జ్ఞానమోహౌ పంచచక్రం విదుర్బుధాః ॥106॥

కోపమోహాలు రుద్రచక్రాలు, సంసారంలో తిరగటం ఈశ్వరచక్రం, జ్ఞానమోహాలు శివచక్రం. మొత్తం అయిదు చక్రాలని పండితులు చెప్తారు.

పునశ్చ దశకోట్యా హి కారణబ్రహ్మణః పదమ్ ।
పునశ్చ దశకోట్యా హి తత్పదైశ్వర్యమాప్నుయాత్ ॥107॥

పంచాక్షరీమంత్రాన్ని పదికోట్లసార్లు జపిస్తే కారణేశ్వరలోకాన్ని పొందుతారు. మరో పదికోట్లు జపిస్తే మహాఐశ్వర్యాన్ని పొందుతాడు.

ఏవం క్రమేణ విష్ణ్వాదేః పదం లబ్ధ్వా మహౌజసః ।
క్రమేణ తత్పదైశ్వర్యం లబ్ధ్వా చైవ మహాత్మనః ॥108॥

ఈ విధంగా భక్తుడు ఇదే వరుసలో మహావిష్ణుస్థానాన్ని, మహేశ్వరుని స్థానాన్ని పొందుతాడు.

శతకోటిమనుం జప్త్వా పంచోత్తరమతంద్రితః ।
శివలోకమవాప్నోతి పంచమావరణాద్బహిః ॥109॥

పంచాక్షరీమంత్రాన్ని శ్రద్ధతో 105 కోట్ల జపం చేసిన భక్తుడు శివలోకంలో అయిదవ ప్రాకారానికి బయట ఉండే చోటు పొందుతాడు.

రాజసం మండపం తత్ర నందీసంస్థానముత్తమమ్ ।
తపోరూపశ్చ వృషభస్తత్రైవ పరిదృశ్యతే ॥110॥

అక్కడ మంచి వెండిమండపం ఉంది. అదే నందీశ్వరుని స్థానం. తపోరూపంలో ఉన్న ఎద్దు అక్కడే ఉంటుంది.

సద్యోజాతస్య తత్ స్థానం పంచమావరణం పరమ్ ।
వామదేవస్య చ స్థానం చతుర్థావరణం పునః ॥111॥

ఆ గొప్పదైన అయిదవప్రాకారం సద్యోజాతుని చోటు. నాలుగవప్రాకారం వామదేవుని చోటు.

అఘోరనిలయం పశ్చాత్ తృతీయావరణం పరమ్ ।
పురుషస్యైవ సాంబస్య ద్వితీయావరణం శుభమ్ ॥112॥

దాని తర్వాత ఉండే మూడవప్రాకారం అఘోరుని చోటు. పురుషుడైన శివుడు అంబతో కలసిన రెండవ చోటే సాంబునిది.

ఈశానస్య పరస్యైవ ప్రథమావరణం తతః ।
ధ్యానధర్మస్య చ స్థానం పంచమం మండపం తతః ॥113॥

ఆ తర్వాత ఉన్న మొదటిప్రాకారం ఈశానదేవునిది. అక్కడ ఉన్న అయిదవ మండపం ధ్యానధర్ముని స్థానం.

బలినాథస్య సంస్థానం తత్ర పూర్ణామృతప్రదమ్ ।
చతుర్థం మండపం పశ్చాచ్చంద్రశేఖరమూర్తిమత్ ॥114॥

పూర్ణమైన ఆనందాన్నిచ్చే నాలుగవ మండపం బలినాథునిది. దానియందు చంద్రశేఖరుని మూర్తి ఉంది.

సోమస్కందస్య చ స్థానం తృతీయం మండపం పరమ్ ।
ద్వితీయం మండపం నృత్యమండపం ప్రాహురాస్తికాః ॥115॥

మూడవ గొప్పమండపం సోమస్కందుని చోటు. రెండవ మండపం నృత్యమండపమని ఆస్తికులు చెప్తారు.

ప్రథమం మూలమాయాయాః స్థానం తత్రైవ శోభనమ్ ।
తతః పరం గర్భగృహం లింగస్థానం పరం శుభమ్ ॥116॥

అక్కడే ఉన్న అందమైన మొదటి మండపం మూలమాయ యొక్క స్థానం. దాని తర్వాత మంగళప్రదమైన గర్భగృహం ఉంది. దానియందు శివలింగం ఉంది.

నంది సంస్థానతః పశ్చాన్న విదుశ్శివవైభవమ్ ।
నందీశ్వరో బహిస్తిష్ఠన్పంచాక్షరముపాసతే ॥117॥

నందీశ్వరుదున్న స్థానం తర్వాత శివుని వైభవం ఎవ్వరికైనా తెలియదు. నందీశ్వరుడు బయట కూర్చుని పంచాక్షరిని ఉపాసన చేస్తుంటాడు.

ఏవం గురుక్రమాల్లబ్ధం నందీశాచ్చ మయా పునః ।
తతః పరం స్వసంవేద్యం శివేనైవానుభావితమ్ ॥118॥

ఈ విధముగా గురుపరంపర నుండి లభ్యమైన ఈ జ్ఞానం నందీశు నుండి నాకు లభ్యమైనది. అటుపైన స్వయముగా తెలియదగినది. శివుని చేతనే అనుభావితమైనది.

శివస్య కృపయా సాక్షాచ్ఛివలోకస్య వైభవమ్ ।
విజ్ఞాతుం శక్యతే సర్వైర్నాన్యథేత్యాహురాస్తికాః ॥119॥

శివుని దయ ఉంటే శివలోకవైభవం ఎవ్వరికైనా తెలుస్తుందని ఆస్తికులు చెప్తారు. మరో రీతిగా కుదరదు.

ఏవం క్రమేణ ముక్తాస్స్యుర్బ్రాహ్మణా వై జితేంద్రియాః ।
అన్యేషాం చ క్రమం వక్ష్యే గదతః శృణుతాదరాత్ ॥120॥

జితేంద్రియులైన బ్రాహ్మణులు ఈ విధంగా మోక్షాన్ని పొందుతారు. ఇతరులు మోక్షం పొందే విధాన్ని కూడా చెప్తాను. శ్రద్ధగా వినండి.

గురూపదేశాజ్జాప్యం వై బ్రాహ్మణానాం నమోంఽతకమ్ ।
పంచాక్షరం పంచలక్షమాయుష్యం ప్రజపేద్విధిః ॥121॥

బ్రాహ్మణస్త్రీలు గురువు ఉపదేశాన్ని తీసుకొని 'నమః' తో ముగిసేలా పంచాక్షరిని జపించాలని విధి. అయిదు లక్షల పంచాక్షరి జపిస్తే ఆయుష్షు కల్గుతుంది.

స్త్రీ త్వాపనయానార్థం తు పంచలక్షం జపేత్పునః ।
మంత్రేణ పురుషో భూత్వా క్రమాన్ముక్తో భవేద్బుధః ॥122॥

మరల ఇంకో అయిదు లక్షలు జపిస్తే మళ్లీ జన్మలో స్త్రీత్వం తొలగి మళ్లీ జన్మలో పురుషుడై, తెలివైన వాడై క్రమంగా ముక్తిని పొందుతాడు.

క్షత్రియః పంచలక్షేణ క్షత్రత్వమపనేష్యతి ।
పునశ్చ పంచలక్షేణ క్షత్రియో బ్రాహ్మణో భవేత్ ॥123॥

క్షత్రియుడు అయిదు లక్షల జపం చేస్తే క్షత్రియత్వాన్ని విడిచిపెడతాడు. మరల అయిదు లక్షలు చేస్తే బ్రాహ్మణుడవుతాడు.

మంత్రసిద్ధిర్జపాచ్చైవ క్రమాన్ముక్తో భవేన్నరః ।
వైశ్యస్తు పంచలక్షేణ వైశ్యత్వమపనేష్యతి ॥124॥

మానవుడు జపాన్ని చేయటం వలన మంత్రసిద్ధిని పొంది క్రమంగా ముక్తుడౌతాడు. వైశ్యుడు అయిదు లక్షలు జపం చేస్తే వైశ్యత్వం పోతుంది.

పునశ్చ పంచలక్షేణ మంత్రక్షత్రియ ఉచ్యతే ।
పునశ్చ పంచలక్షేణ క్షత్రత్వమపనేష్యతి ॥125॥

మరల అయిదులక్షలు జపిస్తే మంత్రక్షత్రియుడంటారు. మరలా ఇంకొక అయిదులక్షలు జపిస్తే క్షత్రియత్వం పోతుంది.

పునశ్చ పంచలక్షేణ మంత్రబ్రాహ్మణ ఉచ్యతే ।

మరల అయిదులక్షలు జపిస్తే మంత్రబ్రాహ్మణుడంటారు.

శూద్రశ్చైవ నమోంఽతేన పంచవింశతిలక్షతః ॥126॥

మంత్రవిప్రత్వమాపద్య పశ్చాచ్ఛూద్రో భవేద్ద్విజః ।
నారీ వాథ నరో వాథ బ్రాహ్మణో వాన్య ఏవ వా ॥127॥

శూద్రుడు కూడా ఇరవైఅయిదు లక్షల పంచాక్షరిని 'నమః' చివర పలుకుతూ జపిస్తే మంత్రబ్రాహ్మణత్వాన్ని పొంది తర్వాత బ్రాహ్మణుడౌతాడు. స్త్రీ కాని, పురుషుడు కాని, బ్రాహ్మణుడు కాని, ఇతరులు కాని

నమోంఽతం వా నమః పూర్వమాతురస్సర్వదా జపేత్ ।
తతః స్త్రీణాం తథైవోహ్య గురు ర్నిర్దర్శయేత్ క్రమాత్ ॥128॥

ఇబ్బందులలో ఉన్నవాడు నమః చివరలో గాని ముందు గాని ఉండేట్లు సర్వదా పంచాక్షరిని జపించాలి. అలాగే స్త్రీలకు గురువు తన ఆలోచనను బట్టి నిర్దేశించాలి.

సాధకః పంచలక్షాంతే శివప్రీత్యర్థమేవ హి ।
మహాభిషేకనైవేద్యం కృత్వా భక్తాంశ్చ పూజయేత్ ॥129॥

సాధకుడు శివుని ప్రీతికోసం మాత్రమే అయిదు లక్షల జపం పూర్తి చేసి, మహాభిషేకాన్ని నైవేద్యాన్ని చేసి, భక్తులను పూజించాలి.

పూజయా శివభక్తస్య శివః ప్రీతతరో భవేత్ ।
శివస్య శివభక్తస్య భేదో నాస్తి శివో హి సః ॥130॥

శివభక్తులను పూజిస్తే శివుడు చాలా సంతోషిస్తాడు. శివునకు శివభక్తులకు తేడా లేదు.

శివస్వరూపమంత్రస్య ధారణాచ్ఛివ ఏవ హి ।
శివభక్తశరీరే హి శివే తత్పరమో భవేత్ ॥131॥

శివభక్తాః క్రియాస్సర్వా వేదసర్వక్రియాం విదుః ।
యావద్యావచ్ఛివం మంత్రం యేన జప్తం భవేత్ క్రమాత్ ॥132॥

తావద్వై శివసాన్నిధ్యం తస్మిన్ దేహే న సంశయః ।
దేవీలింగం భవేద్రూపం శివభక్తస్త్రియాస్తథా ॥133॥

యావన్మంత్రం జపేద్దేవ్యాస్తావత్సాన్నిధ్యమస్తి హి ।
శివం సంపూజయేద్ధీమాన్స్వయం వై శబ్దరూపభాక్ ॥134॥

శివభక్తుడు శివుని స్వరూపమైన మంత్రాన్ని జపించుటం వల్ల శివుడే అవుతాడు. శివభక్తుని శరీరంలో శివుడుంటాడు. కావున శివభక్తుని శ్రద్ధతో ఆరాధించాలి. శివభక్తులకు లౌకిక, వైదిక, క్రియలన్నీ తెలిసినవే. భక్తుడు ఎంత ఎక్కువ శివమంత్రాన్ని జపిస్తాడో అంత ఎక్కువగా అతని శరీరంలో శివుని సన్నిధి ఉంటుందనటంలో సందేహం లేదు. శివభక్తురాలైన స్త్రీ దేవి స్వరూపమౌతుంది. శివభక్తుడు ఎంత అధికంగా దేవీమంత్రం జపిస్తే దేవి సాన్నిధ్యం అంత ఎక్కువగా పొందగలడు. తాను శివుడై శివుని పూజించాలి.

స్వయం చైవ శివో భూత్వా పరాం శక్తిం ప్రపూజయేత్ ।
శక్తిం బేరం చ లింగం చ హ్యాలేఖ్యా మాయయా యజేత్ ॥135॥

శివలింగం శివం మత్వా స్వాత్మానం శక్తిరూపకమ్ ।
శివలింగం నాదరూపబిందురూపం తు శక్తికమ్ ॥
శక్తిలింగం చ దేవీం చ మత్వా స్వం శివరూపకమ్ ॥136॥

ఉపప్రధానభావేన అన్యోన్యాసక్తలింగకమ్ ॥137॥

భక్తుడు తనను తాను శివుని భావన చేసికొని, పరాశక్తిని పూజించాలి. దేవిని, శివుని మూర్తిని, లింగాన్ని మరియు శివుని చిత్రపటాన్ని కపటం లేకుండా పూజించాలి. భక్తుడు తనను శక్తిరూపంగా భావన చేసి, శక్తిలింగాన్ని దేవిగానూ, తనను శివుని గానూ భావించుకొని శివలింగంలో శివుని పూజించాలి. శివలింగం నాదరూపం, శక్తి బిందురూపం.

పూజయేచ్చ శివం శక్తిం స శివో మూలభావనాత్ ।

శివశక్తులు రెండు ఒకదానికొకటి ప్రధాన గుణభావంతో కలసి ఉంటాయి. ఈ విధంగా శివుని పూజించే భక్తుడు మూలాన్ని భావన చేయటం ద్వారా, శివస్వరూపుడౌతాడు.

శివభక్తాన్ శివమంత్రరూపకాన్ శివరూపకాన్ ॥138॥

షోడశైరుపచారైశ్చ పూజయేదిష్టమాప్నుయాత్ ।
యేన శుశ్రూషణాద్యైశ్చ శివభక్తస్య లింగినః ॥139॥

ఆనందం జనయేద్విద్వాన్ శివః ప్రీతతరో భవేత్ ।
శివభక్తాన్ సపత్నీకాన్ పత్న్యా సహ సదైవ తత్ ॥140॥

పూజయేద్భోజనాద్యైశ్చ పంచ వా దశ వా శతమ్ ।
ధనే దేహే చ మంత్రే చ భావనాయామవంచకః ॥141॥

శివశక్తిస్వరూపేణ న పునర్జాయతే భువి ।

శివమంత్రభావంతో శివస్వరూపులైన శివభక్తులను షోడశోపచారాలతో పూజించే భక్తునికి కోరికలన్నీ నెరవేరుతాయి. విద్వాంసుడు శివస్వరూపమైన శివభక్తునకు శుశ్రూష చేసి, ఆనందం కల్గించాలి. అలా చేస్తే శివుడు ఎక్కువ ఆనందిస్తాడు. భక్తుడు భార్యతో కలసి భార్యలతో కలసి ఉన్న శివభక్తులను ఆదరంతో అయిదుగురు కాని, పదిమందిని కాని లేక వందమందిని కాని భోజనాదులతో పూజించాలి. ధనవిషయంలో కాని, శరీరకష్టవిషయంలో కాని, మంత్రంలో కాని, భావనలో కాని లోటు రానీయరాదు. అట్లు చేసినవాడు శివశక్తిస్వరూపుడగుటచే పునర్జన్మను పొందడు.

నాభేరథో బ్రహ్మభాగమాకంఠం విష్ణుభాగకమ్ ॥142॥

ముఖం లింగమితి ప్రోక్తం శివభక్తశరీరకమ్ ।
మృతాన్ దాహాదియుక్తాన్వా దాహాదిరహితాన్మృతాన్ ॥143॥

ఉద్దిశ్య పూజయేదాదిపితరం శివమేవ హి ।
పూజాం కృత్వాదిమాతుశ్చ శివభక్తాంశ్చ పూజయేత్ ॥144॥

శివభక్తుని శరీరంలో పాదం నుండి నాభివరకు బ్రహ్మభాగమని, నాభినుంచి కంఠం వరకు విష్ణుభాగమని, ముఖం లింగమని చెప్పబడింది. చనిపోయిన వాని శరీరాన్ని కాల్చినా లేక ఖననం చేసినా ఆది తండ్రి అయిన శివుణ్ణి, ఆది తల్లి అయిన శక్తిని, శివభక్తులను పూజించాలి.

పితృలోకం సమాసాద్య క్రమాన్ముక్తో భవేన్మృతః ।
క్రియాయుక్తదశభ్యశ్చ తపోయుక్తో విశిష్యతే ॥145॥

అపుడు మరణించిన జీవుడు, పితృలోకాన్ని పొంది క్రమంగా మోక్షాన్ని పొందుతాడు. మంచి పనులు చేసే పదిమందికన్నా తపస్సు చేసేవాడు మేలు.

తపోయుక్తశతేభ్యశ్చ జపయుక్తో విశిష్యతే ।
జపయుక్తసహస్రేభ్యః శివజ్ఞానీ విశిష్యతే ॥146॥

వందమంది తపస్సు చేసేవారి కంటే జపం చేసే వాడు మేలు. వేయిమంది జపం చేసే వాళ్ల కంటే శివజ్ఞానం కలవాడు మేలు.

శివజ్ఞానిషు లక్షేషు ధ్యానయుక్తో విశిష్యతే ।
ధ్యానయుక్తేషు కోటిభ్యః సమాధిస్థో విశిష్యతే ॥147॥

లక్షమంది శివజ్ఞానుల కంటే ధ్యానం చేసేవాడు మేలు. కోటిమంది ధ్యానం చేసేవారి కంటే సమాధిలో ఉండే వాడు మేలు.

ఉత్తరోత్తరవైశిష్ట్యాత్పూజాయాముత్తరోత్తరమ్ ।
ఫలం వైశిష్ట్యరూపం చ దుర్విజ్ఞేయం మనీషిభిః ॥148॥

వీరిలో క్రమంగా, ఉత్తరోత్తరంగా మహిమ పెరుగుతుంది. వాళ్లని పూజించటం వలన కలుగు మహాఫలాలు ఇటువంటివని చెప్పటానికి విద్వాంసుల బుద్ధికి అందదు.

తస్మాద్వై శివభక్తస్య మహిమానం వేత్తి కో నరః ।
శివశక్త్యోః పూజనం చ శివభక్తస్య పూజనమ్ ॥149॥

కురుతే యో నరో భక్త్యా స శివశ్శివమేధతే ।
య ఇమం పఠతే ధ్యాయమర్థవద్వేదసమ్మతమ్ ॥150॥

శివజ్ఞానీ భవేద్విప్రః శివేన సహ మోదతే ।
శ్రావయేచ్ఛివభక్తాంశ్చ విశేషజ్ఞో మునీశ్వరాః ॥151॥

శివప్రసాదసిద్ధిస్స్యాచ్ఛివస్య కృపయా బుధాః ॥152॥

శివభక్తుని మహిమను తెలియ కల్గిన వారెవ్వరు? శివభక్తులను మరియు శివభక్తులను పూజించు మానవుడు శివస్వరూపుడై మంగళాలను చూస్తాడు. వేద సమానమై, చాలా గొప్ప అర్థాన్ని కలిగి ఉన్న ఈ అధ్యాయాన్ని చదివే బ్రాహ్మణుడు శివజ్ఞానియై, శివునితో కలసి ఆనందిస్తాడు. మునిశ్రేష్ఠులారా! ఈ అధ్యాయంలోని విశేషాలు తెలిసిన మనిషి వీటిని శివభక్తులకు వినిపించాలి. ఓ విద్వాంసులారా! అట్టివానికి శివునిదయ కలిగి శివుని అనుగ్రహం సిద్ధిస్తుంది.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం ప్రణవపంచాక్షరీ మంత్రాణాం మహిమా - శివలోక వైభవమ్ నామ సప్తదశోఽధ్యాయః ॥17॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు ప్రణవపంచాక్షరీమంత్రముల మహిమ - శివలోక వైభవం అను పేరుగల పదిహేడవ అధ్యాయం సమాప్తం.

అష్టాదశోఽధ్యాయః - పద్దెనిమిదవ అధ్యాయం

శివలింగ మహిమా - శివలింగ మహిమ

ఋషయ ఊచుః - ఋషులు ఇలా పలికారు.

బంధమోక్షస్వరూపం హి బ్రూహి సర్వార్థవిత్తమ ।

అన్ని విషయములు తెలిసిన వారిలో శ్రేష్ఠుడవైన ఓ సూతమహర్షీ! బంధమోక్షాల స్వరూపాన్ని తెలియచేయండి.

సూత ఉవాచ - సూతుడు ఇలా చెప్పాడు.

బంధమోక్షం తథోపాయం వక్ష్యేఽహం శృణుతాదరాత్ ॥1॥

బంధాన్నీ, మోక్షాన్నీ మరియు మోక్షోపాయాన్ని నేను వివరిస్తాను. మీరు శ్రద్ధగా వినండి.

ప్రకృత్యాద్యష్టబంధేన బద్ధో జీవస్స ఉచ్యతే ।
ప్రకృత్యాద్యష్టబంధేన నిర్ముక్తో ముక్త ఉచ్యతే ॥2॥

ప్రకృతి మొదలైన ఎనిమిది బంధాలచే బంధింపబడ్డ జీవుడిని బద్ధుడంటారు. ఆ ప్రకృతి మొదలైన ఎనిమిది బంధాల నుండి విడుదల పొందిన జీవుణ్ణి ముక్తుడంటారు.

ప్రకృత్యాదివశీకారో మోక్ష ఇత్యుచ్యతే స్వతః ।
బద్ధజీవస్తు నిర్ముక్తో ముక్తజీవస్స కథ్యతే ॥3॥

ప్రకృతి మొదలైన వాటిని వశం చేసుకొనటమే మోక్షం. మోక్షం స్వతస్సిద్ధం - అనగా సహజంగా ఉండేది. బంధింపబడిన జీవుడు ముక్తుడైన తర్వాత ముక్తజీవనుడు అవుతాడు.

ప్రకృత్యగ్రే తతో బుద్ధిరహంకారో గుణాత్మకః ।
పంచతన్మాత్రమిత్యేతే ప్రకృత్యాద్యష్టకం విదుః ॥4॥

ప్రకృతి, బుద్ధి, త్రిగుణాత్మకమైన అహంకారం, అయిదు తన్మాత్రలు అనే ఎనిమిది తత్త్వాలకు ప్రకృత్యాద్యష్టకమని పేరు

ప్రకృత్యాద్యష్టజో దేహో దేహజం కర్మ ఉచ్యతే ।
పునశ్చ కర్మజో దేహో జన్మ కర్మ పునః పునః ॥5॥

ప్రకృత్యాదష్టకంనుండి దేహం పుడుతుంది. దేహంనుండి కర్మ పుడుతుంది. మరల కర్మ నుండి దేహం పుడుతుంది. ఈ విధంగా జన్మనుండి కర్మ, కర్మనుండి జన్మ మరల మరల పుడుతూ ఉంటుంది.

శరీరం త్రివిధం జ్ఞేయం స్థూలం సూక్ష్మం చ కారణమ్ ।
స్థూలం వ్యాపారదం ప్రోక్తం సూక్ష్మమింద్రియ భోగదమ్ ॥6॥

శరీరం స్థూల, సూక్ష్మ, కారణరూపాలతో మూడువిధాలుగా ఉంది. స్థూలశరీరం పనులు చేస్తుంది. సూక్ష్మశరీరం ఇంద్రియభోగాలనిస్తుంది.

కారణం త్వాత్మభోగార్థం జీవకర్మానురూపతః ।
సుఖం దుఃఖం పుణ్యపాపైః కర్మభిః ఫలమశ్నుతే ॥7॥

కారణశరీరం ఆత్మానందాన్నిస్తుంది. జీవుడు తన కర్మలకు అనురూపంగా పుణ్యపాపాలను, వాటివలన సుఖదుఃఖాలను పొందుతున్నాడు.

తస్మాద్ధి కర్మరజ్జ్వా హి బద్ధో జీవః పునః పునః ।
శరీరత్రయకర్మాభ్యాం చక్రవద్భ్రామ్యతే సదా ॥8॥

ఇలా జీవుడు కర్మ అనే తాడుతో కట్టబడి, మూడుశరీరాలతో, కర్మలతో కూడి ఎపుడూ సంసారచక్రంలో తిరుగుతూనే ఉంటాడు.

చక్రభ్రమనివృత్త్యర్థం చక్రకర్తారమీడయేత్ ।
ప్రకృత్యాది మహాచక్రం ప్రకృతేః పరతశ్శివః ॥9॥

ఈ సంసారచక్రంలో తిరగటాన్ని నివారించాలంటే చక్రాన్ని సృష్టించిన ఈశ్వరుణ్ణి ప్రార్థించాలి. ప్రకృత్యాద్యష్టకమే ఈ మహాచక్రం. శివుడు ప్రకృతి కంటే పై వాడు.

చక్రకర్తా మహేశో హి ప్రకృతేః పరతో యతః ।
పిబతి వాథ వమతి జీవన్ బాలో జలం యథా ॥10॥

ప్రకృతికన్నా ఉత్కృష్టమైన మహేశ్వరుడు చక్రకర్త. బాలుడు నీటిని పీల్చుకొని వదలినట్లుగా పరమేశ్వరుడు సృష్టిని లోనికి తీసికొని బయటకు వదలును.

శివస్తథా ప్రకృత్యాదివశీకృత్యాధితిష్ఠతి ।
సర్వం వశీకృతం యస్మాత్తస్మాచ్ఛివ ఇతి స్మృతః ।
శివ ఏవ హి సర్వజ్ఞః పరిపూర్ణశ్చ నిస్పృహః ॥11॥

అలాగే శివుడు ప్రకృత్యాద్యష్టకాలను వశపరచుకొని, సృష్టిని చేస్తాడు. సర్వం వశంలో ఉంటుంది. కాబట్టి అతనికి శివుడని పేరు వచ్చింది. శివుడే సర్వజ్ఞుడు. పరిపూర్ణుడు. కోరికలు లేనివాడు.

సర్వజ్ఞతా తృప్తిరనాదిబోధః స్వతంత్రతా నిత్యమలుప్తశక్తిః ।
అనంతశక్తిశ్చ మహేశ్వరస్య యన్మానసైశ్వర్యమవైతి వేదః ॥12॥

సర్వజ్ఞత్వం, తృప్తి, అనాదిజ్ఞానం, స్వాతంత్ర్యం మరియు నిత్యమైన, లోపం లేని అనంతమైన శక్తి మహేశ్వరునికి ఉన్నాయి. శివునికున్న ఈ ఐశ్వర్యాలను వేదం మాత్రమే తెలియ చేస్తుంది.

అతశ్శివప్రసాదేన ప్రకృత్యాది వశం భవేత్ ।
శివప్రసాదలాభార్థం శివమేవ ప్రపూజయేత్ ॥13॥

కాబట్టి శివుని అనుగ్రహం ఉంటే ప్రకృత్యాదులు వశమౌతాయి. శివుని అనుగ్రహం పొందటానికి ఆయనను పూజించాలి.

నిస్స్పృహస్య చ పూర్ణస్య తస్య పూజా కథం భవేత్ ।
శివోద్దేశకృతం కర్మ ప్రసాదజనకం భవేత్ ॥14॥

కోరికలు లేని వాడు, పూర్ణుడైన శివుని పూజించటం ఎలా? శివుని ఉద్దేశించి చేసిన కర్మయే అనుగ్రహాన్ని కలిగిస్తుంది.

లింగే బేరే భక్తజనే శివముద్దిశ్య పూజయేత్ ।
కాయేన మనసా వాచా ధనేనాపి ప్రపూజయేత్ ॥15॥

లింగమునందు, మూర్తియందు, భక్తునియందు శివుణ్ణి తలచుకొని, శరీరంతో, మనసుతో, వాక్కుతో మరియు ధనంతో సాదరంగా పూజించాలి.

పూజయా తు మహేశో హి ప్రకృతేః పరమశ్శివః ।
ప్రసాదం కురు తే సత్యం పూజకస్య విశేషతః ॥16॥

ప్రకృతి కంటే పై వాడైన శివుడు భక్తుని పూజతో ఎక్కువ సంతోషించి తప్పకుండా గొప్పదైన అనుగ్రహాన్నిస్తాడు.

శివప్రసాదాత్కర్మాద్యం క్రమేణ స్వవశం భవేత్ ।
కర్మారభ్య ప్రకృత్యంతం యదా సర్వం వశం భవేత్ ॥17॥

తదా ముక్త ఇతి ప్రోక్తః స్వాత్మారామో విరాజతే ।
ప్రసాదాత్పరమేశస్య కర్మ దేహో యదా వశః ॥18॥

తదా వై శివలోకే తు వాసః సాలోక్యముచ్యతే ।
సామీప్యం యాతి సాంబస్య తన్మాత్రే చ వశం గతే ॥19॥

సాధకునికి శివుని అనుగ్రహం వల్ల కర్మ మొదలైనవి స్వాధీనమౌతాయి. కర్మతో సర్వం ఎవనికి స్వాధీనమౌతుందో వానిని ముక్తుడంటారు. ముక్తుడు ఆత్మారాముడై విరాజిల్లుతాడు. పరమేశ్వరుని అనుగ్రహం వలన కర్మ, దేహం వశం కాగానే సాధకునికి శివలోకనివాసం లభిస్తుంది. దీనినే సాలోక్యమంటారు. తన్మాత్రలు వశం కాగానే అతడు సాంబుని సమీపంలో ఉంటాడు.

తదా తు శివసాయుజ్యమాయుధాద్యైః క్రియాదిభిః ।
మహాప్రసాదలాభే చ బుద్ధిశ్చాపి వశా భవేత్ ॥20॥

దీనియందు ముక్తునకు శివునితో సమానమైన ఆయుధాలు, క్రియలు మొదలైనవి సిద్ధిస్తాయి. ఇలా శివుని మహానుగ్రహం లభించిన సాధకునికి సమష్టిబుద్ధి కూడా వశమౌతుంది.

బుద్ధిస్తు కార్యం ప్రకృతేస్తత్సార్ష్టిరితి కథ్యతే ।
పునర్మహాప్రసాదేన ప్రకృతిర్వశమేష్యతి ॥21॥

ప్రకృతి నుండి పుట్టిన సమిష్టిబుద్ధి వశమైతే లభించే ముక్తికి సార్ష్టి అని అనిపేరు. అనగా శివునితో సమానమైన శక్తి అని అర్థం. మరియు శివుని మహానుగ్రహం వల్ల భక్తుడికి ప్రకృతి వశమౌతుంది.

శివస్య మానసైశ్వర్యం తదాఽయత్నం భవిష్యతి ।
సార్వజ్ఞాద్యం శివైశ్వర్యం లబ్ధ్వా స్వాత్మని రాజతే ॥22॥

అపుడు ఆ భక్తునికి శివుని సర్వజ్ఞత్వాది మానసైశ్వర్యాలు ప్రయత్నం లేకుండానే వచ్చి, ఆత్మారాముడై ప్రకాశిస్తాడు.

తత్సాయుజ్యమితి ప్రాహుర్వేదాగమపరాయణాః ।
ఏవం క్రమేణ ముక్తిస్స్యాల్లింగాదౌ పూజయా స్వతః ॥23॥

వేదాలు, శాస్త్రలు తెలిసిన పండితులు అలాంటి ముక్తిని సాయుజ్యం అంటారు. ఇలా లింగాదులను పూజిస్తే క్రమంగా ముక్తి లభిస్తుంది.

అతశ్శివప్రసాదార్థం క్రియాద్యైః పూజయేచ్ఛివమ్ ।
శివక్రియావివ తపః శివమంత్రజపః సదా ॥24॥

శివజ్ఞానం శివధ్యానముత్తరోత్తరమభ్యసేత్ ।
ఆసుప్తేరామృతేః కాలం నయేద్వై శివచింతయా ।
సద్యాదిభిశ్చ కుసుమైరర్చయేచ్ఛివమేష్యతి ॥25॥

కాబట్టి శివుని అనుగ్రహం పొందటం కోసం ఆయనను క్రియ మొదలైన వాటితో పూజించాలి. శివక్రియ, శివతపస్సు అన్ని వేళలలో శివనామజపం శివజ్ఞానం, శివధ్యానం అనే వాటిని ఒకదాని తర్వాత మరొక దానిని అభ్యసించాలి. జీవించియున్నంత కాలం ప్రతిరోజూ నిద్రపోయే వరకు శివుని స్మరిస్తూ గడపాలి. శివుణ్ణి 'సద్యోజాతం' వంటి మంత్రాలతో, పువ్వులతో పూజించిన భక్తుడు శివుణ్ణి పొందుతాడు.

ఋషయ ఊచుః - ఋషులు ఇలా పలికారు.

లింగాదౌ శివపూజాయా విధానం బ్రూహి సర్వతః ॥26॥

లింగం మొదలైన వాటియందు శివుని పూజించే విధానాన్ని వివరంగా చెప్పండి.

సూత ఉవాచ - సూతుడు ఇలా పలికాడు.

లింగానాం చ క్రమం వక్ష్యే యథావచ్ఛృణుత ద్విజాః ।
తదేవ లింగం ప్రథమం ప్రణవం సార్వకామికమ్ ॥27॥

ఓ బ్రాహ్మణులారా! లింగాల వరుసను ఉన్నది ఉన్నట్లుగా చెప్తాను వినండి. కోరికలనన్నింటినీ తీర్చే సూక్ష్మప్రణవం ఓం.....ఇది మొదటి లింగం.

సూక్ష్మప్రణవరూపం హి సూక్ష్మరూపం తు నిష్కలమ్ ।
స్థూలలింగం హి సకలం తత్పంచాక్షరముచ్యతే ॥28॥

ఓంకారం నిరాకారమైంది. సాకారమైన స్థూలప్రణవం పంచాక్షరి. ఇది రెండవ లింగం.

తయోః పూజాతపః ప్రోక్తం సాక్షాన్మోక్షప్రదే ఉభే ।
పౌరుషప్రకృతిభూతాని లింగాని సుబహూని చ ॥29॥

స్థూల, సూక్ష్మప్రణవాలు రెండింటి పూజ తపస్సు అని చెప్పబడును. ఆ రెండూ మోక్షప్రదాలు. ఇవే కాక పురుష, ప్రకృతిలింగాలు చాలా ఉన్నాయి.

తాని విస్తరతో వక్తుం శివో వేత్తి న చాపరః ।
భూవికారాణి లింగాని జ్ఞాతాని ప్రబ్రవీమి వః ॥30॥

వాటి పూర్తి వివరాలు శివుడికి తప్ప మరెవ్వరికి తెలియదు. భూవికారాలగు లింగాలను గూర్చి నాకు తెలిసినంత వరకు మీకు చెప్తాను.

స్వయంభూలింగం ప్రథమం బిందులింగం ద్వితీయకమ్ ।
ప్రతిష్ఠితం చరం చైవ గురులింగం తు పంచమమ్ ॥31॥

స్వయంభూలింగం మొదటిది. బిందులింగం రెండవది. ప్రతిష్ఠితలింగం మూడవది. చరలింగం నాలుగవది. గురులింగం ఐదవది.

దేవర్షితపసా తుష్టస్సాన్నిధ్యార్థం తు తత్ర వై ।
పృథివ్యంతర్గతశ్శర్వో బీజం వై నాదరూపతః ॥32॥

శివుడు దేవతల తపస్సుకు మెచ్చి, వాళ్లకు తన సాన్నిధ్యాన్ని ఇవ్వాలనుకొని, భూమిలోపల నాదరూపంలో ఉండి,

స్థావరాంకురవద్భూమిముద్భిద్యవ్యక్త ఏవ సః ।
స్వయంభూతం జాతమితి స్వయంభూరితి తం విదుః ॥33॥

తల్లింగపూజయా జ్ఞానం స్వయమేవ ప్రవర్ధతే ।

చెట్టు యొక్క విత్తనం భూమిని చీల్చుకొని మొలకెత్తిన విధంగా, బయటకు తెలియబడతాడు. ఇట్లు తనంతటతానుగా తెలియబడి బయటపడిన లింగానికి స్వయంభూలింగం అని పేరు. అలాంటి లింగాన్ని పూజించిన వానికి జ్ఞానం తనంతటతానుగా పెరుగుతుంది.

సువర్ణరజతాదౌ వా పృథివ్యాం స్థండిలేపి వా ॥34॥

స్వహస్తాల్లిఖితం లింగం శుద్ధప్రణవమంత్రకమ్ ।
యంత్రలింగం సమాలిఖ్య ప్రతిష్ఠావాహనం చరేత్ ॥35॥

బంగారురేకుపై కాని, వెండిరేకుపై కాని, భూమియందు కాని, వేదియందు కాని శుద్ధమైన ప్రణవమంత్రరూపంలో ఉన్న లింగాన్ని సాధకుడు తన చేతులతో రాసి, దానిలో శివుని ప్రతిష్ఠించి ఆవాహన చేయాలి.

బిందునాదమయం లింగం స్థావరం జంగమం చ యత్ ।
భావనామయమేతద్ధి శివదృష్టం న సంశయః ॥36॥

బిందు, నాదలింగాలు స్థిర, చర భేదంతో ఉంటాయి. వాటిలో శివుని దర్శించటం భావనారూపం మాత్రమే అనటంలో సందేహం లేదు.

యత్ర విశ్వస్యతే శంభుస్తత్ర తస్మై ఫలప్రదః ।
స్వహస్తాల్లిఖితే యంత్రే స్థావరాదావకృత్రిమే ॥37॥

సాధకునికి ఏ లింగమందు శ్రద్ధ ఉంటుందో, ఆ రూపంగానే శివుడు ఫలాన్నిస్తాడు. భక్తుడు తన చేతులతో రాసిన యంత్రంలో, కృత్రిమంగా లేని చెట్లయందు శివుని ఆవాహన చేసి పూజించాలి.

ఆవాహ్య పూజయేచ్ఛంభుం షోడశైరుపచారకైః ।
స్వయమైశ్వర్యమాప్నోతి జ్ఞానమభ్యాసతో భవేత్ ॥38॥

ఆ విధంగా ఆవాహన, షోడశోపచారాలతో శివునికి పూజ చేయాలి. అలా చేసిన భక్తుడు తాను ఈశ్వరత్వం పొందుతాడు. మరల మరల పూజించిన భక్తుడు జ్ఞానాన్ని పొందుతాడు.

దేవైశ్చ ఋషిభిశ్చాపి స్వాత్మసిద్ధ్యర్థమేవ హి ।
సమంత్రేణాత్మహస్తేన కృతం యచ్ఛుద్ధమండలే ॥39॥

శుద్ధభావనయా చైవ స్థాపితం లింగముత్తమమ్ ।
తల్లింగం పౌరుషం ప్రాహుస్తత్ప్రతిష్ఠితముచ్యతే ॥40॥

దేవతలు, ఋషులు ఆత్మసిద్ధి కోసం మంత్రపూర్వకంగా పవిత్రమైన మండలంలో తమ చేతులతో పవిత్రమైన మనసుతో స్థాపించిన శ్రేష్ఠలింగానికి పౌరుష, ప్రతిష్ఠితలింగం అని పేర్లున్నాయి.

తల్లింగపూజయా నిత్యం పౌరుషైశ్వర్యమాప్నుయాత్ ।
మహద్భిర్బ్రాహ్మణైశ్చాపి రాజభిశ్చ మహాధనైః ॥41॥

శిల్పినా కల్పితం లింగం మంత్రేణ స్థాపితం చ యత్ ।
ప్రతిష్ఠితం ప్రాకృతం హి ప్రాకృతైశ్వర్యభోగదమ్ ॥42॥

ఆ లింగాన్ని నిత్యం పూజిస్తే పౌరుష, ఐశ్వర్యాలు లభిస్తాయి. మహాత్ములయిన బ్రాహ్మణులచే మరియు బాగా సంపన్నులైన రాజులచే మంత్రాలతో స్థాపించబడిన, శిల్పి తయారు చేసిన లింగాన్ని ప్రతిష్ఠితలింగం అని, ప్రాకృతలింగం అని అంటారు. అలాంటి లింగాన్ని పూజిస్తే ప్రకృతి, ఐశ్వర్యం, భోగాలు లభిస్తాయి.

యదూర్జితం చ నిత్యం చ తద్ధి పౌరుషముచ్యతే ।
యద్దుర్బలమనిత్యం చ తద్ధి ప్రాకృతముచ్యతే ॥43॥

బలంగా ఎపుడూ ఉండే దానిని పౌరుషం అంటారు. బలహీనమై అనిత్యం అయిన దానిని ప్రాకృతం అంటారు.

లింగం నాభిస్తథా జిహ్వా నాసాగ్రం చ శిఖా క్రమాత్ ।
కట్యాదిషు త్రిలోకేషు లింగమాధ్యాత్మికం చరమ్ ॥44॥

నాభి, నాలుక, ముక్కు కొనభాగం, సిగ అనే వరుసలో కటి, హృదయం, తల అనే మూడుచోట్లలో భావన చేసిన లింగం ఆధ్యాత్మికలింగం అని, చరలింగం అని చెప్పబడుతుంది.

పర్వతం పౌరుషం ప్రోక్తం భూతలం ప్రాకృతం విదుః ।
వృక్షాది పౌరుషం జ్ఞేయం గుల్మాది ప్రాకృతం విదుః ॥45॥

పర్వతం, చెట్లు మొదలైన వాటిని పౌరుషలింగాలని, భూమండలం, పొదలు మొదలైన వాటిని ప్రాకృత లింగాలని అంటారు.

షాష్టికం ప్రాకృతం జ్ఞేయం శాలిగోధూమపౌరుషమ్ ।
ఐశ్వర్యం పౌరుషం విద్యాదణిమాద్యష్టసిద్ధిదమ్ ॥46॥

తక్కువ నాణ్యం గల (అరవైరోజులలో పండు) ధాన్యం ప్రాకృతమని, విలువైన ధాన్యం, గోధుమలు పౌరుషాలని తెలుసుకోవాలి. అణిమ మొదలైన అష్టసిద్ధులను ఇచ్చే ఐశ్వర్యం పౌరుషం.

సుస్త్రీధనాదివిషయం ప్రాకృతం ప్రాహురాస్తికాః ।
ప్రథమం చరలింగేషు రసలింగం ప్రకథ్యతే ॥47॥

భార్య, ధనం మొదలైన ఐశ్వర్యాలను ప్రాకృతమని ఆస్తికులు చెప్తున్నారు. చరలింగాలలో రసలింగం గొప్పదని చెప్పబడింది.

రసలింగం బ్రాహ్మణానాం సర్వాభీష్టప్రదం భవేత్ ।
బాణలింగం క్షత్రియాణాం మహారాజ్యప్రదం శుభమ్ ॥48॥

రసలింగం పూజించిన బ్రాహ్మణుల కోరికలన్నీ నెరవేరుతాయి. మంగళకరమైన బాణలింగం క్షత్రియులకు సామ్రాజ్యాన్నిస్తుంది.

స్వర్ణలింగం తు వైశ్యానాం మహాధనపతిత్వదమ్ ।
శిలాలింగం తు శూద్రాణాం మహాశుద్ధికరం శుభమ్ ॥49॥

బంగారు లింగం వైశ్యులకు గొప్పధనాన్ని, మంగళకరమైన రాతిలింగం శూద్రులకు గొప్ప పవిత్రతను ఇస్తుంది.

స్ఫాటికం బాణలింగం చ సర్వేషాం సర్వకామదమ్ ।
స్వీయాభావేఽన్యదీయం తు పూజాయాం న నిషిధ్యతే ॥50॥

స్ఫటికంతో చేసిన బాణలింగం అందరికి అన్ని కోర్కెలు తీరుస్తుంది. తన వద్ద లింగం లేకపోతే భక్తుడు ఇతరుల లింగాన్ని పూజించటం నిషేధం కాదు.

స్త్రీణాం తు పార్థివం లింగం సభర్తృణాం విశేషతః ।
విధవానాం ప్రవృత్తానాం స్ఫాటికం పరికీర్తితమ్ ॥51॥

భర్త గల స్త్రీలకు మట్టితో చేసిన లింగం చాలా మంచిది. ప్రవృత్తి మార్గంలో ఉన్న భర్త లేని స్త్రీలకు స్ఫటికలింగం మంచిది.

విధవానాం నివృత్తానాం రసలింగం విశిష్యతే ।
బాల్యే వా యౌవనే వాపి వార్ధకే వాపి సువ్రతాః ॥52॥

శుద్ధస్ఫటికలింగం తు స్త్రీణాం తత్సర్వభోగదమ్ ।
ప్రవృత్తానాం పీఠపూజా సర్వాభీష్టప్రదా భువి ॥53॥

నివృత్తిమార్గంలో ఉన్న భర్తలేని స్త్రీలకు రసలింగం శ్రేష్ఠమైనది. గొప్పవ్రతం గల ఓ ఋషులారా! స్త్రీలు బాల్యంలో కాని, యౌవనంలో కాని, వార్ధక్యంలో కాని శుద్ధస్ఫటికలింగాన్ని పూజిస్తే సర్వభోగాలు లభిస్తాయి. ప్రవృత్తిమార్గంలో ఉన్న స్త్రీలు పీఠపూజను చేస్తే కోర్కెలు నెరవేరుతాయి.

పాత్రేణైవ ప్రవృత్తస్తు సర్వపూజాం సమాచరేత్ ।
అభిషేకాంతే నైవేద్యం శాల్యన్నేన సమాచరాత్ ॥54॥

ప్రవృత్తిమార్గంలో ఉన్న మానవుడు పూజనంతటినీ సరియైన గురువు సహాయంతో చేయాలి. అభిషేకం తర్వాత బియ్యంతో అన్నం నైవేద్యం పెట్టాలి.

పూజాంతే స్థాపయేల్లింగం సంపుటేషు పృథక్ గృహే ।
కరపూజా నివృత్తానాం స్వభోజ్యం తు నివేదయేత్ ॥55॥

పూజ అయిన తర్వాత లింగాన్ని ఇంట్లో వేరుగా సంపుటంలో ఉంచాలి. నివృత్తి మార్గంలో ఉన్నవాళ్లు అరచేతిలో లింగం ఉంచి పూజించి, భిక్షాన్నాన్ని నివేదన చేయాలి.

నివృత్తానాం పరం సూక్ష్మలింగమేవ విశిష్యతే ।
విభూత్యభ్యర్చనం కుర్యాద్విభూతిం చ నివేదయేత్ ॥56॥

నివృత్తిమార్గంలో ఉన్నవాళ్లకి సూక్ష్మలింగం చాలా మంచిది. వారు విభూతితో అర్చించి, విభూతిని నివేదన చేయాలి.

పూజాం కృత్వాథ తల్లింగం శిరసా ధారయేత్సదా ।
విభూతిస్త్రివిధా ప్రోక్తా లోకవేదశివాగ్నిభిః ॥57॥

పూజ చేసిన లింగాన్ని ఎపుడూ తలయందు ధరించాలి. లోకాగ్నిజం, వేదాగ్నిజం, శివాగ్నిజం అని విభూతి మూడురకాలుగా ఉంది.

లోకాగ్నిజమథో భస్మ ద్రవ్యశుద్ధ్యర్థమావహేత్ ।
మృద్దారులోహరూపాణాం ధాన్యానాం చ తథైవ చ ॥58॥

తిలాదీనాం చ ద్రవ్యాణాం వస్త్రాదీనాం తథైవ చ ।
తథా పర్యుషితానాం చ భస్మనా శుద్ధిరిష్యతే ॥59॥

లౌకికమైన నిప్పునుండి పుట్టిన భస్మాన్ని ద్రవ్యాల శుద్ధి కోసం వాడాలి. మట్టి, చెక్క, లోహవస్తువుల్ని ధాన్యాలను నూనె ద్రవ్యాలు, బట్టలు, పాతబడిన ఆహారపదార్థాలను భస్మంతో శుద్ధి చేయాలి.

శ్వాదిభిర్దూషితానాం చ భస్మనా శుద్ధిరిష్యతే ।
సజలం నిర్జలం భస్మ యథాయోగ్యం తు యోజయేత్ ॥60॥

కుక్క మొదలైన జంతువులు ముట్టుకున్న వాటిని భస్మంతో శుద్ధి చేయాలి. భస్మాన్ని పరిస్థితిని బట్టి పొడిగా కాని లేదా నీటితో తడిపి కాని ఉపయోగించాలి.

వేదాగ్నిజం తథా భస్మ తత్కర్మాంతేషు ధారయేత్ ।
మంత్రేణ క్రియయా జన్యం కర్మాగ్నౌ భస్మరూపధృక్ ॥61॥

వేదాగ్నిహోత్రం నుండి పుట్టిన భస్మాన్ని ఆ కర్మ పూర్తయిన వెంటనే ధరించాలి. వేదమంత్రాలతో హవిస్సు అందించే క్రియ నుండి పుట్టిన హవనం అనే వైదికకర్మ అగ్నిలో భస్మరూపాన్ని కల్గివుంటుంది.

తద్భస్మధారణాత్కర్మ స్వాత్మన్యారోపితం భవేత్ ।
అఘోరేణాత్మమంత్రేణ బిల్వకాష్ఠం ప్రదాహయేత్ ॥62॥

ఆ భస్మాన్ని ధరిస్తే భక్తుడు ఆ కర్మను తనయందు ఆరోపించుకున్నట్లు అవుతుంది. 'అఘోరేభ్యో' అనే శివమంత్రాన్ని ఉచ్చరించి, మారేడుసమిధను అగ్నిలో వేయాలి.

శివాగ్నిరితి సంప్రోక్తస్తేన దగ్ధం శివాగ్నిజమ్ ।
కపిలా గోమయం పూర్వం కేవలం గవ్యమేవ వా ॥63॥

ఆ అగ్నిని శివాగ్ని అంటారు. దాని నుండి పుట్టిన భస్మం మామూలు ఆవుపేడతో చేసిన పిడకలను....

శమ్యశ్వత్థపలాశాన్వా వటారగ్వధ బిల్వకాన్ ।
శివాగ్నినా దహేచ్ఛుద్ధం తద్వై భస్మ శివాగ్నిజమ్ ॥64॥

జమ్మి, రావి, పలాశం, అరగ్వధం, మారేడు అనే చెట్లసమిధలను శివాగ్నియందు కాల్చితే లభించే భస్మాన్ని శివాగ్నిజమంటారు.

దర్భాగ్నౌ వా దహేత్కాష్ఠం శివమంత్రం సముచ్చరన్ ।
సమ్యక్ సంశోధ్య వస్త్రేణ నవకుంభే నిధాపయేత్ ॥65॥

శివమంత్రాన్ని జపిస్తూ దర్భల జ్వాలయందు సమిధను కాల్చి, ఆ భస్మాన్ని వస్త్రంతో బాగా శుద్ధి చేసి, కొత్తకుండలో దాచుకోవాలి.

దీప్త్యర్థం తత్తు సంగ్రాహ్యం మన్యతే పూజ్యతేఽపి చ ।
భస్మ శబ్దార్థ ఏవం హి శివః పూర్వం తథాఽకరోత్ ॥66॥

దానిని ధరించిన వాడు శోభను పొంది, జనుల మర్యాదలకు పాత్రుడౌతాడు. సృష్టి ఆదిలో శివుడు భస్మశబ్దానికి అర్థాన్ని ఇలా చెప్పాడు.

యథా స్వవిషయే రాజా సారం గృహ్ణాతి యత్కరమ్ ।
యథా మనుష్యాః సస్యాదీన్ దగ్ధ్వా సారం భజంతి వై ॥67॥

రాజు తన రాజ్యంలో సారభూతమైన పన్నును తీసుకొంటాడు. మనుషులు ధాన్యాదులను వేడి చేసి వాటి సారాన్ని గ్రహిస్తారు.

యథా హి జాఠరాగ్నిశ్చ భక్ష్యాదీన్ వివిధాన్ బహూన్ ।
దగ్ధ్వా సారతరం సారాత్ స్వదేహం పరిపుష్యతి ॥68॥

మనం తినే వివిధరకాల భక్ష్యపదార్థాలను జఠరాగ్ని దహింపజేసి ఆ సారంతో దేహానికి పుష్టిని కలిగిస్తోంది.

తథా ప్రపంచకర్తాపి స శివః పరమేశ్వరః ।
స్వాధిష్ఠేయప్రపంచస్య దగ్ధ్వా సారం గృహీతవాన్ ॥69॥

ఆ విధంగానే ప్రపంచాన్ని సృష్టించిన పరమశివుడు కూడా తనచే అధిష్టింపబడిన జగత్తును దహించి సారాన్ని తీసుకొన్నాడు.

దగ్ధ్వా ప్రపంచం తద్భస్మ స్వాత్మన్యారోపయచ్ఛివః ।
ఉద్ధూలనేన వ్యాజేన జగత్సారం గృహీతవాన్ ॥70॥

భస్మరూపంలో ఉన్న ఆ సారాన్ని తనదేహానికి పూసుకున్నాడు. శివుడు భస్మాన్ని ధరించే వంకతో జగత్తు సారాన్ని తీసుకున్నాడు.

స్వరత్నం స్థాపయామాస స్వకీయే హి శరీరకే ।
కేశమాకాశసారేణ వాయుసారేణ వై ముఖమ్ ॥71॥

హృదయం చాగ్నిసారేణ త్వపాం సారేణ వై కటిమ్ ।
జానుచావనిసారేణ తద్వత్సర్వం తదంగకమ్ ॥72॥

తన రూపంలో ఉన్న ప్రపంచసారాన్ని తన శరీరంలో ఉంచుకొని, ఆకాశసారంలో జుట్టును, గాలిసారంలో ముఖాన్ని, అగ్నిసారంతో హృదయాన్ని, నీటిసారంతో నడుమును, భూసారంతో మోకాళ్లను ఇదే విధంగా ఇతర అవయవాలను ధరించాడు.

బ్రహ్మవిష్ణ్వోశ్చ రుద్రాణాం సారం చైవ త్రిపుండ్రకమ్ ।
తథా తిలకరూపేణ లలాటాంతే మహేశ్వరః ॥73॥

బ్రహ్మ, విష్ణు, రుద్రుల సారభూతమైన భస్మాన్ని మహేశ్వరుడు మూడుపుండ్రములు (రేఖలుగా) తిలకంగా ధరిస్తాడు.

భవృద్ధ్యా సర్వమేతద్ధి మన్యతే స్వయమిత్యసౌ ।
ప్రపంచసారసర్వస్వమనేనైవ వశీకృతమ్ ॥74॥

విభూతిని ధరించటం వల్ల ప్రకాశం పెరుగుతుంది. తన ఐశ్వర్యం విభూతి వల్లనే వచ్చిందని శివుడు భావిస్తాడు. ప్రపంచసారాన్ని అంతటిని శివుడు భస్మం చేత మాత్రమే వశం చేసుకుంటాడు.

తస్మాదస్య వశీకర్తా నాస్తీతి స శివస్స్మృతః ।
యథా సర్వమృగాణాం చ హింసకో మృగహింసకః ॥
అస్య హింసా మృగో నాస్తి తస్మాత్సింహ ఇతీరితః ॥75॥

కావున శివుణ్ణి వశం చేసుకునే వాడు మరొకడు లేడు. వశియగుట వలననే ఆయన శివుడైనాడు. సింహం మృగాలనన్నింటినీ హింసిస్తుంది. కాని సింహాన్ని హింసించగల మృగం లేదు. అందువల్లనే దానికి సింహం అని పేరు వచ్చింది.

శం నిత్యం సుఖమానందమికారః పురుషః స్మృతః ॥76॥

శం అనగా శాశ్వతంగా ఉండే ఆనందం. ఇ కారము పురుషుని బోధిస్తుందని చెప్పబడింది.

వకారశ్శక్తిరమృతం మేలనం శివ ఉచ్యతే ।
తస్మాదేవం స్వమాత్మానం శివం కృత్వార్చయేచ్ఛివమ్ ॥77॥

వ కారం శక్తిని, అమృతాన్ని బోధిస్తుంది. వీటి కలయికే శివుడు. కావున భక్తుడు తన ఆత్మను శివునిగా భావించి, శివుణ్ణి అర్చించాలి.

తస్మాదుద్ధూలనం పూర్వం త్రిపుండ్రం ధారయేత్పరమ్ ।
పూజాకాలే హి సజలం శుద్ధ్యర్థం నిర్జలం భవేత్ ॥78॥

ముందుగా భస్మాన్ని శరీరావయవాలకు రాసుకొని, తర్వాత నుదుటయందు త్రిపుండ్రాన్ని పెట్టుకోవాలి. పూజాసమయంలో విభూతిని తడిపి వాడాలి. వస్తువులశుద్ధి చేసేటపుడు పొడి విభూతిని వాడాలి.

దివా వా యది వా రాత్రౌ నారీ వాథ నరోపి వా ।
పూజార్థం సజలం భస్మ త్రిపుండ్రేణైవ ధారయేత్ ॥79॥

పగలు కాని, రాత్రి కాని, స్త్రీ కాని, పురుషుడు కాని పూజాసమయంలో విభూతిని నీటితో తడిపి నుదుటిపై త్రిపుండ్రాన్ని పెట్టుకోవాలి.

త్రిపుండ్రం సజలం భస్మ ధృత్వా పూజాం కరోతి యః ।
శివపూజా ఫలం సాంగం తస్యైవ హి సునిశ్చితమ్ ॥80॥

ఎవరైతే నీటితో తడిపిన విభూతితో త్రిపుండ్రం ధరించి, శివుని పూజిస్తారో వారు మాత్రమే నిశ్చయంగా పూర్ణశివపూజాఫలాన్ని పొందుతారు.

భస్మ వై శివమంత్రేణ ధృత్వా హ్యత్యాశ్రమీ భవేత్ ।
శివాశ్రమీతి సంప్రోక్తశ్శివైకపరమో యతః ॥81॥

శివమంత్రాన్ని జపిస్తూ భస్మాన్ని ధరించే వ్యక్తి అత్యాశ్రమి అవుతాడు. శివనిష్ఠాపరాయణుడైన వానిని శివాశ్రమి అంటారు.

శివవ్రతైకనిష్ఠస్య నాశౌచం న చ సూతకమ్ ।
లలాటేఽగ్రే సితం భస్మ తిలకం ధారయేన్ముదా ॥82॥

శివవ్రతమే ఒకే ఒక నిష్ఠగా ఉన్న భక్తునికి మైల, పురుడు దోషాలుండవు. నుదుటిపై తెల్లని భస్మాన్ని ఆనందంతో తిలకాన్ని ధరించాలి.

స్వహస్తాద్గురుహస్తాద్వా శివభక్తస్య లక్షణమ్ ।
గుణాన్ రుంధ ఇతి ప్రోక్తో గురుశబ్దస్య విగ్రహః ॥83॥

తిలకాన్ని తాను స్వయంగా పెట్టుకోవచ్చు. లేదా గురువుచేత పెట్టించుకోవచ్చు. ఈ విధంగా తిలకం పెట్టుకోవటం శివభక్తుని లక్షణం. గురు శబ్దానికి గుణాన్ రుంధే (గుణాలను తొలగించుట) అని నిర్వచనం.

సవికారాన్ రాజసాదీన్ గుణాన్ రుంధే వ్యపోహతి ।
గుణాతీతః పరశివో గురురూపం సమాశ్రితః ॥84॥

మూడుగుణాలకు అతీతుడైన పరమశివుడు గురురూపాన్ని ధరించి వికారాలతో కలసి ఉన్న గుణాలను తొలగించివేస్తాడు.

గుణత్రయం వ్యపోహ్యాగ్రే శివం బోధయతీతి సః ।
విశ్వస్తానాం తు శిష్యాణాం గురురిత్యభిధీయతే ॥85॥

గురువు విశ్వాసం గల శిష్యులకు ముందుగా మూడుగుణాలను తొలగించి, తర్వాత శివుని గురించి బోధిస్తాడు. అందువల్లనే ఆయనకు గురువనే పేరు వచ్చింది.

తస్మాద్గురుశరీరం తు గురులింగం భవేద్బుధః ।
గురులింగస్య పూజా తు గురుశుశ్రూషణం భవేత్ ॥86॥

కాబట్టి గురుదేహమే గురులింగమని తెలుసుకోవాలి. గురువుకు సేవ చేస్తే గురులింగాన్ని పూజించినట్లే అవుతుంది.

శ్రుతం కరోతి శుశ్రూషా కాయేన మనసా గిరా ।
ఉక్తం యద్గురుణా పూర్వం శక్యం వాఽశక్యమేవ వా ॥87॥

కరోత్యేవ హి పూతాత్మా ప్రాణైరపి ధనైరపి ।
తస్మాద్వై శాసనే యోగ్యశ్శిష్య ఇత్యభిధీయతే ॥88॥

శిష్యుడు గురువునకు శరీరంతో, మనస్సు, మాటతో సేవ చేయాలి. పవిత్రమైన మనసుగల శిష్యుడు గురువు ఆజ్ఞను వీలైనా, కాకున్నా, ప్రాణాలను పణంగా పెట్టి అయినా, ధనాన్ని ఖర్చు పెట్టి అయినా, నెరవేర్చి తీరాలి. శాసించదగ్గ వాడు కాబట్టే శిష్యుడని పేరు వచ్చింది.

శరీరాద్యర్థకం సర్వం గురోర్దత్వా సుశిష్యకః ।
అగ్రపాకం నివేద్యాగ్రే భుంజీయాద్గుర్వనుజ్ఞయా ॥89॥

యోగ్యుడైన శిష్యుడు శరీరానికుపయోగించే అన్ని పదార్థాలను గురువుకు సమర్పిస్తాడు. ఆహారాన్ని ముందుగా గురువుకు ఇచ్చి వారి అనుమతితో తాను తింటాడు.

శిష్యః పుత్ర ఇతి ప్రోక్తస్సదా శిష్యత్వయోగతః ।
జిహ్వాలింగాన్మంత్రశుక్రం కర్ణయోనౌ నిషిచ్య వై ॥90॥

గురువునకు శిష్యుడు పుత్రుడు అని అర్థం. నాలుక అనే లింగం నుండి మంత్రమనే రేతస్సును (వీర్యం) చెవి అనే యోని లోపలికి తీసుకోవాలి.

జాతః పుత్రో మంత్రపుత్రః పితరం పూజయేద్గురుమ్ ।
నిమజ్జయతి పుత్రం వై సంసారే జనకః పితా ॥91॥

మంత్రపుత్రుడైన శిష్యుడు పుట్టాడు. కావున శిష్యుడు గురువును తండ్రిలా పూజించాలి. కన్నతండ్రి కొడుకుని సంసారంలోకి లాగుతాడు.

సంతారయతి సంసారాద్గురుర్వై బోధకః పితా ।
ఉభయోరంతరం జ్ఞాత్వా పితరం గురుమర్చయేత్ ॥92॥

గురువనే తండ్రి సంసారంనుండి శిష్యుని తరింప చేస్తాడు. వీరిద్దరికి కల తేడాను గుర్తించి శిష్యుడు గురువును తండ్రిలా పూజించాలి.

అంగశుశ్రూషయా చాపి ధనాద్యైః స్వార్జితైర్గురుమ్ ।
పాదాదికేశపర్యంతం లింగాన్యంగాని యద్గురోః ॥93॥

గురువు శరీరానికి సేవ చేయాలి. స్వార్జితమైన (సొంతంగా సంపాదించిన) ధనాన్ని గురువుకివ్వాలి. పాదాల నుండి తలజుట్టు వరకు ఉన్న శరీరం శివస్వరూపమే.

ధనరూపైః పాదుకాద్యైః పాదసంగ్రహణాదిభిః ।
స్నానాభిషేకనైవేద్యైర్భోజనైశ్చ ప్రపూజయేత్ ॥94॥

గురువును ధనంతో, పాదపూజతో, పాదసంవాహనాలతో, స్నానాభిషేకనైవేద్యాలతో, భోజనంతో శ్రద్ధగా పూజించాలి.

గురుపూజైవ పూజాస్యాచ్ఛివస్య పరమాత్మనః ।
గురుశేషం తు యత్సర్వమాత్మశుద్ధికరం భవేత్ ॥95॥

గురువును పూజిస్తే, పరమశివుణ్ణి పూజించినట్లే అవుతుంది. గురుశేషం అంతా శిష్యునికి అంతః కరణశుద్ధిని కలిగిస్తుంది.

గురోశ్శేషశ్శివోచ్ఛిష్టం జలమన్నాది నిర్మితమ్ ।
శిష్యాణాం శివభక్తానాం గ్రాహ్యం భోజ్యం భవేద్ద్విజాః ॥96॥

గురువు తాగి విడిచిన నీరు, తిని మిగిల్చిన అన్నం మొదలైనవి శివోచ్ఛిష్టంతో సమానం. కావున ఓ బ్రాహ్మణులారా! శివభక్తులైన శిష్యులు వాటిని తీసుకొని తినాలి.

గుర్వనుజ్ఞావిరహితం చోరవత్సకలం భవేత్ ।
గురోరపి విశేషజ్ఞం యత్నాద్గృహ్ణీత వై గురుమ్ ॥97॥

గురువు అనుమతి లేకుండా ఏదైన తీసుకుంటే అది దొంగతనం అవుతుంది. గురువుకన్న గొప్పజ్ఞానం కలవాడు కనిపిస్తే ఆయనను ప్రయత్నంతో గురువుగా చేసుకోవాలి.

అజ్ఞానమోచనం సాధ్యం విశేషజ్ఞో హి మోచకః ।
ఆదౌ చ విఘ్నశమనం కర్తవ్యం కర్మపూర్తయే ॥98॥

అజ్ఞానాన్ని పోగొట్టుకోవటమే జీవితలక్ష్యం. గొప్పజ్ఞానం కలవాడు మాత్రమే అజ్ఞానం నుండి విముక్తి కలిగించగలడు. కర్మలు, విఘ్నాలు లేకుండా సమాప్తం అవ్వాలంటే ముఖ్యంగా విఘ్నశాంతిని చేయాలి.

నిర్విఘ్నేన కృతం సాంగం కర్మ వై సఫలం భవేత్ ।
తస్మాత్సకలకర్మాదౌ విఘ్నేశం పూజయేద్బుధః ॥99॥

అన్ని అంగాలను నిర్విఘ్నంగా చేసిన కర్మ మాత్రమే ఫలాన్నిస్తుంది. కావున కర్మలన్నింటినీ ముందుగా విఘ్నేశ్వరుని పూజించాలి.

సర్వబాధానివృత్త్యర్థం సర్వాన్దేవాన్ యజేద్బుధః ।
జ్వరాదిగ్రంథిరోగాశ్చ బాధా హ్యాధ్యాత్మికా మతా ॥100॥

అన్ని రకాల బాధలు తొలగిపోవటం కోసం తెలివి కల వాడు దేవతలనందరిని పూజించాలి. జ్వరం మొదలైన రోగాలు, కీళ్లనొప్పులను ఆధ్యాత్మికబాధలని అంటారు.

పిశాచజంబుకాదీనాం వల్మీకాద్యుద్భవే తథా ।
అకస్మాదేవ గోధాదిజంతూనాం పతనేఽపి చ ॥101॥

గృహే కచ్ఛప సర్పస్త్రీ దుర్జనాఽఽదర్శనేఽపి చ ।
వృక్షనారీ గవాదీనాం ప్రసూతి విషయేఽపి చ ॥102॥

భావిదుఃఖం సమాయాతి తస్మాత్తే భౌతికా మతాః ।
అమేధ్యాశనిపాతశ్చ మహామారీ తథైవ చ ॥103॥

జ్వరమారీ విషూచిశ్చ గోమారీ చ మసూరికా ।
జన్మర్క్షగ్రహసంక్రాంతి గ్రహయోగా స్వరాశికే ॥104॥

దుఃస్వప్నదర్శనాద్యాశ్చ మతా వై హ్యాధిదైవికాః ।
శవచాండాలపతిత స్పర్శాదంతర్గృహే గతే ॥105॥

పిశాచపీడ, నక్కల అరుపులు, పుట్టలు మొలవటం, ఉడుము మొదలైన జంతువులు హఠాత్తుగా చనిపోవటం, ఇంటిలో తాబేలు, పాము, దుర్జనుడు, కనిపించటం మొదలైనవి చెట్లకు, స్త్రీలకు, ఆవులకు, ఇతర పశువులకు వాటి సంతానానికి, రాబోవు దుఃఖాన్ని తెలియ చేస్తుంది. వీటిని ఆదిభౌతికబాధలంటారు. ఆకాశం నుండి అశుచిపదార్థాలు పడటం, పిడుగులు పడటం, మహామారి జ్వరాలు, విషూచి, గోమారి, మసూచి, జన్మనక్షత్రంలోకి గ్రహాల ప్రవేశం, జన్మరాశిలో గ్రహయోగం చెడుకలలు వచ్చుట మొదలుగునవి ఆధిదైవికబాధలని అంటారు.

ఏతాదృశే సముత్పన్నే భావిదుఃఖస్య సూచకే ।
శాంతియజ్ఞం తు మతిమాన్ కుర్యాత్తద్దోషశాంతయే ॥106॥

రాబోవు దుఃఖాలను సూచించే ఇలాంటి ఘటనలు జరిగినపుడు, తెలివి కలవాడు ఆ దోషం శాంతించుట కోసం శాంతియజ్ఞం చేయాలి.

దేవాలయేఽథ గోష్ఠే వా చైత్యే వాపి గృహాంగణే ।
ప్రాదేశోన్నతధిష్ణ్యే వై ద్విహస్తేయస్వలంకృతే ॥107॥

భారమాత్రవ్రీహిధాన్యం ప్రస్థాప్య పరిస్తృత్య చ ।
మధ్యే విలిఖ్య కమలం తథా దిక్షు విలిఖ్య వై ॥108॥

తంతునా వేష్టితం కుంభం నవగుగ్గులధూపితమ్ ।
మధ్యే స్థాప్య మహాకుంభం తథా దిక్ష్వపి విన్యసేత్ ॥109॥

దేవాలయం, పశువుల శాల (గోశాల), యజ్ఞశాల లేదా ఇంటివాకిలిలో కాని, తూర్పువైపు ఉన్న రెండుచేతుల కొలతలు గల చోటును చక్కగా అలంకరించి పుట్టెడు గోధుమలను అచట చతురస్రంగా చేసి మధ్యలో నాలుగుమూలల పద్మాన్ని చేతితో వ్రాసి, దారంతో చుట్టిన, కొత్త గుగ్గిలాన్ని ధూపం వేసిన పెద్దకుండను మధ్యలో ఉంచి, ఇతరకుంభాలను దిక్కులయందుంచాలి.

సనాలామ్రకకూర్చాదీన్ కలశాంశ్చ తథాష్టసు ।
పూరయేన్మంత్రపూతేన పంచద్రవ్యయుతేన హి ॥110॥

మామిడి ఆకుల గుత్తులను ఉంచిన కలశాలను ఎనిమిది వైపుల ఉంచి, పంచామృతాలు కల నీటితో సమంత్రకంగా నింపి ఉంచాలి.

ప్రక్షిపేన్నవరత్నాని నీలాదీన్ క్రమశస్తథా ।
కర్మజ్ఞం చ సపత్నీకమాచార్యం వరయేద్బుధః ॥111॥

దానిలో నీలం మొదలైన తొమ్మిది రత్నాలను ఉంచాలి. తెలివైనవాడు (వివేకి) కర్మజ్ఞానం కల ఆచార్యుని, ఆయన భార్యతో సహా వరణం చేయాలి.

సువర్ణప్రతిమాం విష్ణోరింద్రాదీనాం చ నిక్షిపేత్ ।
సశిరస్కే మధ్యకుంభే విష్ణుమావాహ్య పూజయేత్ ॥112॥

బంగారంతో చేసిన విష్ణుని ప్రతిమను, ఇంద్రాది దేవతల ప్రతిమలను మంటపంలో ఉంచాలి. మధ్యనున్న కుండలో కొబ్బరికాయను పెట్టి విష్ణువును ఆవాహన చేసి పూజించాలి.

ప్రాగాదిషు యథామంత్రమింద్రాదీన్ క్రమశో యజేత్ ।
తత్తన్నామ్నా చతుర్థ్యాం చ నమోఽంతేన యథాక్రమమ్ ॥113॥

తూర్పువైపున ఇంద్రుణ్ణి, ఇతర దిక్కులందు ఆయా దిక్పాలకుల్ని వరుసగా పూజించాలి. ఆయా దేవతల నామాల చతుర్థీవిభక్తికి "నమః" శబ్దం కలిపి పూజించాలి.

ఆవాహనాదికం సర్వమాచార్యేణైవ కారయేత్ ।
ఆచార్యఋత్విజా సార్ధం తన్మంత్రాన్ ప్రజపేచ్ఛతమ్ ॥114॥

ఆవాహనం మొదలు పూజనంతటిని పూర్తిగా ఆచార్యుని చేత చేయించాలి. యజమాని ఆచార్యునితో, ఋత్విక్కులతో కలసి దేవతల మంత్రాలను వందసార్లు జపించాలి.

కుంభస్య పశ్చిమే భాగే జపాంతే హోమమాచరేత్ ।
కోటిం లక్షం సహస్రం వా శతమష్టోత్తరం బుధాః ॥115॥

జపం అయిన తర్వాత కుంభానికి పశ్చిమం వైపు హోమాన్ని చేయాలి. ఓ విద్వాంసులారా! కోటి గాని, లక్ష గాని, వేయి గాని, నూటఎనిమిదిసార్లు కాని హోమం చేయాలి.

ఏకాహం వా నవాహం వా తథా మండలమేవ వా ।
యథాయోగ్యం ప్రకుర్వీత కాలదేశానుసారతః ॥116॥

ఒకరోజు కాని, తొమ్మిదిరోజులు కాని, నలభైరోజులు కాని శక్తిని బట్టి, కాలాన్ని ప్రదేశాన్ని అనుసరించి హోమం చేయాలి.

శమీ హోమశ్చ శాంత్యర్థే వృత్త్యర్థే చ పలాశకమ్ ।
సమిధన్నాజ్యకైర్ద్రవ్యైర్నామ్నా మంత్రేణ వా హునేత్ ॥117॥

శాంతికోసం శమీ సమిధలతోను, వృత్తికోసం మోదుగ సమిధలతోను మంత్ర పూర్వకమైన నేతితో కలిసిన అన్నంతోపాటు హోమద్రవ్యంగా వాడి హోమం చేయాలి.

ప్రారంభే యత్కృతం ద్రవ్యం తత్క్రియాంతం సమాచరేత్ ।
పుణ్యాహం వాచయిత్వాంతే దినే సంప్రోక్షయేజ్జలైః ॥118॥

హోమానికి ప్రారంభంలో ఉపయోగించిన ద్రవ్యాన్నే, హోమం పూర్తయ్యేవరకు ఉపయోగించాలి. చివరిరోజున పుణ్యాహవాచనం చేసి, ఆ నీటిని అన్నిచోట్ల చల్లాలి.

బ్రాహ్మణాన్ భోజయేత్పశ్చాత్ యావదాహుతిసంఖ్యయా ।
ఆచార్యశ్చ హవిష్యాశీ ఋత్విజశ్చ భవేద్బుధాః ॥119॥

హోమం ఎన్నిసార్లు చేశారో, అన్నిసార్లు అంతమంది బ్రాహ్మణులకు భోజనాలు పెట్టాలి. ఓ విద్వాంసులారా! ఆచార్యుడు ఋత్విక్కులు హవిస్సును భోజనం చేయాలి.

ఆదిత్యాదీన్ గ్రహానిష్ట్వా సర్వహోమాంత ఏవ హి ।
ఋత్విగ్భ్యో దక్షిణాం దద్యాన్నవరత్నం యథాక్రమమ్ ॥120॥

సూర్యుడు మొదలైన నవగ్రహాలకు హోమం చేయాలి. హోమాలన్నీ పూర్తయిన తర్వాత ఋత్విక్కులకు వరుసగా నవరత్నాలను ఇవ్వాలి.

దశదానం తతః కుర్యాద్భూరిదానం తతః పరమ్ ।
బాలానాముపనీతానాం గృహిణాం వనినాం ధనమ్ ॥121॥

కన్యానాం చ సభర్తృణాం విధవానాం తతః పరమ్ ।
తంత్రోపకరణం సర్వమాచార్యాయ నివేదయేత్ ॥122॥

తర్వాత పది దానాలు చేసి, అటు తర్వాత విరివిగా ఇతరదానాలు చేయాలి. ఉపనయనం అయిన బాలురకు, గృహస్థులకు, వానప్రస్థులకు, కన్యలకు, ముత్తయిదువలకు, భర్త లేని స్త్రీలకు ధనం ఇవ్వాలి. యజ్ఞసామగ్రిని పూర్తిగా ఆచార్యునికివ్వాలి.

ఉత్పాతానాం చ మారీణాం దుఃఖస్వామీ యమః స్మృతః ।
తస్మాద్యమస్య ప్రీత్యర్థం కాలదానం ప్రదాపయేత్ ॥123॥

ఉత్పాతాలు, జ్వరాలు కలిగించి, దుఃఖాన్నిచ్చే వాడిని యముడని అంటారు. కాబట్టి యముని ప్రీతికోసం కాలదానం చేయాలి.

శతనిష్కేణ వా కుర్యాద్దశనిష్కేణ వా పునః ।
పాశాంకుశధరం కాలం కుర్యాత్పురుషరూపిణమ్ ॥124॥

అంటే, వంద లేక పది పలాల బంగారంతో బంగారు పాశాన్ని, అంకుశం ధరించిన కాలపురుషుని బొమ్మను తయారు చేయించాలి.

తత్స్వర్ణప్రతిమాదానం కుర్యాద్దక్షిణయా సహ ।
తిలదానం తతః కుర్యాత్పూర్ణాయుష్యప్రసిద్ధయే ॥125॥

ఆ బొమ్మను దక్షిణతో సహా దానం ఇవ్వాలి. తర్వాత పూర్ణ ఆయుష్షు కోసం నువ్వులను దానం చేయాలి.

ఆజ్యావేక్షణదానం చ కుర్యాత్ వ్యాధినివృత్తయే ।
సహస్రం భోజయేద్విప్రాన్ దరిద్రశ్శతమేవ వా ॥126॥

రోగాలను పోగొట్టుకోవటం కోసం నేతిలో ముఖం చూసి, దానిని దానం ఇవ్వాలి. వెయ్యి మంది బ్రాహ్మణులకు శక్తి లేనిచో వందమందివిప్రులకు భోజనం పెట్టాలి.

విత్తాభావే దరిద్రస్తు యథాశక్తి సమాచరేత్ ।
భైరవస్య మహాపూజాం కుర్యాద్భూతాది శాంతయే ॥127॥

ధనం లేని వారు తమ శక్తి కొలది చేసుకోవాలి. భూతదోషాలు పోయేందుకు, శాంతించుట కోసం భైరవుణ్ణి పూజించాలి.

మహాభిషేకం నైవేద్యం శివస్యాంతే తు కారయేత్ ।
బ్రాహ్మణాన్ భోజయేత్పశ్చాత్ భూరిభోజనరూపతః ॥128॥

తర్వాత శివునికి మహాభిషేకాన్ని నైవేద్యం చేయాలి. తర్వాత బ్రాహ్మణులకు విరివిగా భోజనాలు పెట్టాలి.

ఏకం కృతేన యజ్ఞేన దోషశాంతిమవాప్నుయాత్ ।
శాంతియజ్ఞమిమం కుర్యాద్వర్షే వర్షే తు ఫాల్గునే ॥129॥

ఈ విధంగా యజ్ఞం చేయటం వలన దోషాలు శాంతిస్తాయి. ఈ శాంతియజ్ఞాన్ని ప్రతిసంవత్సరం ఫాల్గునమాసంలో చేయాలి.

దుర్దర్శనాదౌ సద్యో వై మాసమాత్రే సమాచరేత్ ।
మహాపాపాదిసంప్రాప్తౌ కుర్యాద్భైరవపూజనమ్ ॥130॥

ఉత్పాతాలు కనపడినపుడు వెనువెంటనే గాని, ఒక నెలరోజుల్లో గాని చేయాలి. మహాపాపం వచ్చినపుడు భైరవుణ్ణి పూజించాలి.

మహావ్యాధిసముత్పత్తౌ సంకల్పం పునరాచరేత్ ।
సర్వాభావే దరిద్రస్తు దీపదానమథాచరేత్ ॥131॥

మహావ్యాధి కలిగితే మరలా సంకల్పం చేయాలి. ఏమీ లేని పేదవారు దీపదానం చేయాలి.

తదప్యశక్తః స్నాత్వా వై యత్కించిద్దానమాచరేత్ ।
దివాకరం నమస్కుర్యాన్మంత్రేణాష్టోత్తరం శతమ్ ॥ 132॥

అది కూడా చేయలేని వారు స్నానం చేసి, ఏదో ఒకటి దానం చేయాలి. విద్వాంసుడు సూర్యమంత్రాన్ని జపిస్తూ 108 నమస్కారాలు చేయాలి.

సహస్రమయుతం లక్షం కోటిం వా కారయేద్బుధః ।
నమస్కారాత్మయజ్ఞేన తుష్టాః స్యుస్సర్వదేవతాః ॥133॥

వేయి, పదివేలు, లక్ష లేక కోటి నమస్కారాలు చేయించాలి. నమస్కారం అనే ఆత్మయజ్ఞం వల్ల దేవతలందరూ సంతోషిస్తారు.

త్వత్స్వరూపేఽర్పితా బుద్ధిర్న తేఽశూన్యే చ రోచతి ।
యా చాస్త్యస్మదహంతేతి త్వయి దృష్టే వివర్జితా ॥134॥

నా బుద్ధి నీ స్వరూపంలో అర్పించాను. నీవు లేని చోట నా బుద్ధి పని చేయదు. అహంకార, మమకారాలు నిన్ను చూడగానే మాయమౌతాయి.

నమ్రోఽహం హి స్వదేహేన భో మహాంస్త్వమసి ప్రభో ।
న శూన్యో మత్స్వరూపో వై తవ దాసోఽస్మి సాంప్రతమ్ ॥135॥

నేను నీకు సాష్టాంగం చేస్తున్నాను. ఓ ప్రభూ! నీ మహిమ గొప్పది. నా స్వరూపం శూన్యం కాదు.

యథాయోగ్యం స్వాత్మయజ్ఞం నమస్కారం ప్రకల్పయేత్ ।
అథాత్ర శివనైవేద్యం దత్త్వా తాంబూలమాహరేత్ ॥136॥

అని ఈ విధంగా నమస్కారమనే ఆత్మయజ్ఞం చేయాలి. ఆ తర్వాత భక్తుడు శివుడికి నైవేద్యం పెట్టి తాంబూలాన్ని ఇవ్వాలి.

శివప్రదక్షిణం కుర్యాత్స్వయమష్టోత్తరం శతమ్ ।
సహస్రమయుతం లక్షం కోటిమన్యేన కారయేత్ ॥ 137॥

భక్తుడు తాను 108 సార్లు శివుడికి ప్రదక్షిణ చేయాలి. వేయి, పదివేలు, లక్ష లేక కోటిసార్లు ఇతరులచేత చేయించాలి.

శివప్రదక్షిణాత్సర్వం పాతకం నశ్యతి క్షణాత్ ।
దుఃఖస్య మూలం వ్యాధిర్హి వ్యాధేర్మూలం హి పాతకమ్ ॥138॥

శివప్రదక్షిణ చేయటంవల్ల పాపాలన్ని క్షణంలో నశిస్తాయి. దుఃఖానికి మూలం వ్యాధి. వ్యాధికి మూలం పాపం.

ధర్మేణైవ హి పాపానామపనోదనమీరితమ్ ।
శివోద్దేశకృతో ధర్మః క్షమః పాపవినోదనే ॥139॥

ధర్మం వలన పాపాలన్నీ తొలగిపోతాయని చెప్పబడింది. శివుణ్ణి ఉద్దేశించి చేసిన ధర్మం పాపాలను పోగొట్టడంలో సమర్థవంతమైనది.

అధ్యక్షం శివధర్మేషు ప్రదక్షిణమితీరితమ్ ।
క్రియయా జపరూపం హి ప్రణవం తు ప్రదక్షిణమ్ ॥140॥

శివధర్మాలలో ప్రదక్షిణం చాలా గొప్పదని చెప్పబడింది. జపం క్రియఅవుతుంది, ప్రదక్షిణ ప్రణవం అవుతుంది.

జననం మరణం ద్వంద్వం మాయాచక్రమితీరితమ్ ।
శివస్య మాయాచక్రం హి బలిపీఠం తదుచ్యతే ॥141॥

పుట్టుట, చనిపోవుట అనే రెండింటికి మాయాచక్రం అని పేరు. శివుని మాయాచక్రానికి బలిపీఠం అని పేరు ఉంది.

బలిపీఠం సమారభ్య ప్రాదక్షిణ్యక్రమేణ వై ।
పదే పదాంతరం గత్వా బలిపీఠం సమావిశేత్ ॥142॥

బలిపీఠం దగ్గర ఎడమ నుండి కుడివైపుకు నడిచి, మరల బలిపీఠం దగ్గరకు రావాలి.

నమస్కారం తతః కుర్యాత్ప్రదక్షిణమితీరితిమ్ ।
నిర్గమాజ్జననం ప్రాప్తం నమస్స్వాత్మసమర్పణమ్ ॥143॥

జననం మరణం ద్వంద్వం శివమాయా సమర్పితమ్ ।
శివమాయార్పితద్వంద్వో న పునస్స్వాత్మభాగ్భవేత్ ॥144॥

అపుడు నమస్కారం చేయాలి. అది ఒక ప్రదక్షిణం కింద లెక్క. శివుని మాయ నుండి బయటకు రావటం వల్ల జన్మ వచ్చింది. నమస్కారం చేసి ఆత్మసమర్పణ చేస్తేచావు, పుట్టుకలనే రెండు శివమాయకు సమర్పించి నట్లవుతుంది. ఆ విధంగా రెండింటిని శివమాయకు సమర్పిస్తే అది మరలా బంధించదు.

యావద్దేహం క్రియాధీనస్సజీవో బద్ధ ఉచ్యతే ।
దేహత్రయవశీకారే మోక్ష ఇత్యుచ్యతే బుధైః ॥145॥

జీవుని శరీరం కర్మకు అధీనమై ఉన్నంత కాలం ఆ జీవుడిని బద్ధుడంటారు. మూడురకాల దేహాలను (స్థూల, సూక్ష్మ, కారణ) వశం చేసుకోవటమే మోక్షమని పండితులు చెప్పారు.

మాయాచక్రప్రణేతా హి శివః పరమకారణమ్ ।
శివమాయార్పితద్వంద్వం శివస్తు పరిమార్జతి ॥146॥

మాయాచక్రాన్ని తిప్పే శివుడు జగత్తుకు పరమకారణ మౌతున్నాడు. శివమాయలో అర్పించిన ద్వంద్వాన్ని శివుడు మాత్రమే తుడిచివేస్తాడు.

శివేన కల్పితం ద్వంద్వం తస్మిన్నేవ సమర్పయేత్ ।
శివస్యాతిప్రియం విద్యాత్ప్రదక్షిణం నమో బుధాః ॥147॥

శివుడిచే కల్పించబడ్డ ద్వంద్వాన్ని శివునికే సమర్పించాలి. ఓ పండితులారా! ప్రదక్షిణనమస్కారాలు శివునికి చాలా ఇష్టమైనవని తెలుసుకోండి.

ప్రదక్షిణనమస్కారాః శివస్య పరమాత్మనః ।
షోడశైరుపచారైశ్చ కృతపూజా ఫలప్రదా ॥148॥

పరమశివునకు ప్రదక్షిణ చేసి, నమస్కారం చేస్తే షోడశోపచారపూజ చేసిన ఫలితం దక్కుతుంది.

ప్రదక్షిణాఽవినాశ్యం హి పాతకం నాస్తి భూతలే ।
తస్మాత్ప్రదక్షిణేనైవ సర్వపాపం వినాశయేత్ ॥149॥

ప్రదక్షిణ వల్ల నాశనం కాని పాపమేదీ ఈ లోకంలో లేదు. కాబట్టి ప్రదక్షిణం చేసి పాపాలనన్నింటినీ పోగొట్టుకోవాలి.

శివపూజాపరో మౌనీ సత్యాది గుణసంయుతః ।
క్రియాతపోజపజ్ఞానధ్యానేష్వేకైకమాచరేత్ ॥150॥

శివపూజయందు నిష్ఠ ఉన్న భక్తుడు మౌనాన్ని పాటిస్తూ, సత్యం మొదలైన గుణాలు కలిగి, శివకర్మ, తపస్సు, జ్ఞానం, ధ్యానం అనేవాటిని ఒక్కొక్కటిగా ఆచరించాలి.

ఐశ్వర్యం దివ్యదేహశ్చ జ్ఞానమజ్ఞానసంశయః ।
శివసాన్నిధ్యమిత్యేతే క్రియాదీనాం ఫలం భవేత్ ॥151॥

ఈ అయిదింటినీ ఆచరించటం వల్ల ఐశ్వర్యం, దివ్యదేహం, జ్ఞానం, అజ్ఞాననివృత్తి, శివసన్నిధి అనే ఫలాలు క్రమంగా వస్తాయి.

కరణేన ఫలం యాతి తమసః పరిహాపనాత్ ।
జన్మనః పరిమార్జిత్వాజ్ఞబుద్ధ్యా జనితాని చ ॥152॥

శివపూజ ద్వారా అజ్ఞానం తొలగించుకోవటం వల్ల జన్మరాహిత్యం (మరుజన్మ లేకపోవటం) జ్ఞానోదయం అనే ఫలాలు లభిస్తాయి.

యథాదేశం యథాకాలం యథాదేహం యథాధనమ్ ।
యథాయోగ్యం ప్రకుర్వీత క్రియాదీన్ శివభక్తిమాన్ ॥153॥

శివభక్తుడు దేశకాలపరిస్థితులకు, తనశరీరానికి, తన దగ్గరున్న ధనానికి అనుగుణంగా పైన చెప్పిన క్రియలను యోగ్యతప్రకారం చెయ్యాలి.

న్యాయార్జితసువిత్తేన వసేత్ప్రాజ్ఞశ్శివస్థలే ।
జీవహింసాదిరహితమతిక్లేశవివర్జితమ్ ॥154॥

జీవహింసను చేయని వాడై, అధిక కష్టాన్ని విడిచి జీవించాలి. జ్ఞాని శివక్షేత్రంలో న్యాయంగా సంపాదించిన ధనంతో జీవించాలి.

పంచాక్షరేణ జప్తం చ తోయమన్నం విదుస్సుఖమ్ ।
అథవాహుర్దరిద్రస్య భిక్షాన్నం జ్ఞానదం భవేత్ ॥155॥

పంచాక్షరీమంత్రంతో ప్రోక్షించిన నీరు, అన్నం, సుఖాన్ని కలిగిస్తాయి. ఒకవేళ భక్తుడు ధనం లేనివాడైతే భిక్షాన్నంతో జీవించాలి. అలా చేయటం వలన జ్ఞానాన్ని పొందుతాడు.

శివభక్తస్య భిక్షాన్నం శివభక్తివివర్ధనమ్ ।
శంభుసత్రమితి ప్రాహుర్భిక్షాన్నం శివయోగినః ॥156॥

శివభక్తునకు భిక్ష వల్ల లభించిన అన్నం శివభక్తిని పెంచుతుంది. శివయోగి భుజించే భిక్షాన్నానికి శంభుసత్రమని పేరు.

యేన కేనాప్యుపాయేన యత్ర కుత్రాపి భూతలే ।
శుద్ధాన్నభుక్ సదా మౌనీ రహస్యం న ప్రకాశయేత్ ॥157॥

ఏదో ఒక ఉపాయం చేసి, సాధకుడు ఒకచోట నివసిస్తూ, వట్టినేలపై పడుకోవాలి. శుద్ధమైన అన్నాన్ని తినాలి. ఎపుడూ మౌనంగా ఉండాలి. తన సాధనారహస్యం బయటకు చెప్పకూడదు.

ప్రకాశయేత్తు భక్తానాం శివమాహాత్మ్యమేవ హి ।
రహస్యం శివమంత్రస్య శివో జానాతి నాపరః ॥158॥

భక్తులకు శివుని మహిమను మాత్రమే తెలియ చెప్పాలి. శివమంత్రం యొక్క రహస్యం శివుడు తప్ప మరొకరు ఎరుగలేనిది.

శివభక్తో వసేన్నిత్యం శివలింగం సమాశ్రితః ।
స్థాణులింగాశ్రయేణైవ స్థాణుర్భవతి భూసురాః ॥159॥

శివభక్తుడు ఎపుడూ శివలింగాన్ని ఆశ్రయించి బ్రతకాలి. ఓ ద్విజులారా! ప్రతిష్ఠలింగాన్ని ఆశ్రయించి బ్రతికే మనిషి శివసాయుజ్యాన్ని పొందుతాడు.

పూజయా చరలింగస్య క్రమాన్ముక్తో భవేద్ధ్రువమ్ ।
సర్వముక్తం సమాసేన సాధ్యసాధనముత్తమమ్ ॥160॥

చరలింగాన్ని పూజించే భక్తుడు క్రమంగా ముక్తిని పొందుతాడు. ఉత్తమమైన సాధ్యసాధనాలను సమగ్రంగా చెప్పాను.

వ్యాసేన యత్పురా ప్రోక్తం యచ్ఛ్రుతం హి మయా పురా ।
భద్రమస్తు హి వోఽస్మాకం శివభక్తిర్దృఢాస్తు సా ॥161॥

నేను దీనిని పూర్వం వ్యాసుడు చెప్పగా విన్నాను. మీ అందరకు మంగళమగు గాక! మన అందరకు దృఢమైన శివభక్తి కల్గు గాక!

య ఇమం పఠతేఽధ్యాయం యశ్శృణోతి నరస్సదా ।
శివజ్ఞానం స లభతే శివస్య కృపయా బుధాః ॥162॥

ఓ విద్వాంసులారా! ఈ అధ్యాయాన్ని పఠించినా లేక విన్నా శివుని కృప వలన శివజ్ఞానాన్ని పొందుతాడు నరుడు.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం సాధ్యసాధనఖండే శివలింగమహిమావర్ణనో నామ అష్టాదశోఽధ్యాయః ॥18॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయాం సాధ్యసాధనఖండం యందలి శివలింగమహిమవర్ణనం అను పేరు గల పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోనవింశోఽధ్యాయః - పందొమ్మిదవ అధ్యాయం

పార్థివశివలింగపూజన మాహాత్మ్యం - పార్థివశివలింగ పూజన మాహాత్మ్యం

ఋషయ ఊచుః - ఋషులు ఇలా పలికారు.

సూత సూత చిరంజీవ ధన్యస్త్వం శివభక్తిమాన్ ।
సమ్యగుక్తస్త్వయా లింగమహిమాసత్ఫలప్రదః ॥1॥

సూతా! నీవు చిరకాలం జీవించు. శివభక్తి ఉన్న నీవు ధన్యుడవు. మంచిఫలాలనిచ్చే లింగమహిమను చక్కగా వివరించావు.

యత్ర పార్థివమాహేశలింగస్య మహిమాధునా ।
సర్వోత్కృష్టశ్చ కథితో వ్యాసతో బ్రూహి తం పునః ॥2॥

మహేశ్వరుని పార్థివలింగం చాలా గొప్పదని వ్యాసుడు గతంలో చెప్పాడు. నీవు మరలా పార్థివలింగమహిమను తెలియచేయుము.

సూత ఉవాచ - సూతుడు ఇలా పలికాడు.

శృణుధ్వమృషయస్సర్వే సద్భక్త్యాదరతోఽఖిలాః ।
శివపార్థివలింగస్య మహిమా ప్రోచ్యతే మయా ॥3॥

ఋషులారా! మీరందరూ శివుని గూర్చి భక్తితో వినండి. నేను శివుని పార్థివలింగమహిమను చెప్తున్నాను.

ఉక్తేష్వేతేషు లింగేషు పార్థివం లింగముత్తమమ్ ।
తస్య పూజనతో విప్రా బహవస్సిద్ధిమాగతాః ॥4॥

వర్ణింపబడిన లింగాలన్నింటిలో పార్థివలింగం ఉత్తమమైంది. ఓ బ్రాహ్మణులారా! దాని పూజ చేసి ఎందరో సిద్ధిని పొందారు.

హరిర్బ్రహ్మా చ ఋషయస్సప్రజాపతయస్తథా ।
సంపూజ్య పార్థివం లింగం ప్రాపుస్సర్వేప్సితం ద్విజాః ॥5॥

ఓ ద్విజులారా! విష్ణువు, బ్రహ్మ, ఋషులు మరియు ప్రజాపతులు పార్థివలింగాన్ని పూజించి, కోర్కెల నన్నింటినీ తీర్చుకున్నారు.

దేవాసురమనుష్యాశ్చ గంధర్వోరగరాక్షసాః ।
అన్యేఽపి బహవస్తం సంపూజ్య సిద్ధిం గతాః పరమ్ ॥6॥

దేవతలు, రాక్షసులు, మనుష్యులు, గంధర్వులు, పన్నగులు ఇంకా చాలామంది దానిని పూజించి పరమసిద్ధిని పొందారు.

కృతే రత్నమయం లింగం త్రేతాయాం హేమసంభవమ్ ।
ద్వాపరే పారదం శ్రేష్ఠం పార్థివం తు కలౌ యుగే ॥7॥

కృతయుగంలో రత్నలింగం, త్రేతాయుగంలో బంగారులింగం, ద్వాపరంలో రసలింగం, కలియుగంలో పార్థివలింగం శ్రేష్ఠమైనవి.

అష్టమూర్తిషు సర్వాసు మూర్తిర్వై పార్థివీ వరా ।
అనన్యపూజితా విప్రాస్తపస్తస్మాన్మహత్ఫలమ్ ॥8॥

శివుని అష్టమూర్తులలో (పంచభూతాలు, సూర్యచంద్రులు, సోమయాజి) పార్థివమూర్తి ఉత్తమమైనది. కావున ఓ బ్రాహ్మణులారా! ఇతరపూజలకన్నా పార్థివలింగపూజే గొప్పఫలాన్నిచ్చే తపస్సు అవుతుంది.

యథా సర్వేషు దేవేషు జ్యేష్ఠః శ్రేష్ఠో మహేశ్వరః ।
ఏవం సర్వేషు లింగేషు పార్థివం శ్రేష్ఠముచ్యతే ॥9॥

దేవతలందరిలో మహేశ్వరుడు గొప్పవాడు. అటువంటి శివుణ్ణి లింగరూపంలో పూజించటం అన్నిటికంటే గొప్పది.

యథా నదీషు సర్వాసు జ్యేష్ఠా శ్రేష్ఠా సురాపగా ।
తథా సర్వేషు లింగేషు పార్థివం శ్రేష్ఠముచ్యతే ॥10॥

నదులన్నిటిలో గంగానది చాలా గొప్పది. ఆ విధంగానే లింగాలన్నింటిలో పార్థివలింగం చాలా గొప్పది.

యథా సర్వేషు మంత్రేషు ప్రణవో హి మహాన్ స్మృతః ।
తథేదం పార్థివం శ్రేష్ఠమారాధ్యం పూజ్యమేవ హి ॥11॥

మంత్రాలన్నింటిలో ఓంకారం చాలా గొప్పదని స్మృతులు చెబుతున్నాయి. ఆ విధంగానే, లింగాలలో పార్థివలింగం శ్రేష్ఠమైనది. ఆరాధించి పూజింపదగింది.

యథా సర్వేషు వర్ణేషు బ్రాహ్మణః శ్రేష్ఠ ఉచ్యతే ।
తథా సర్వేషు లింగేషు పార్థివం శ్రేష్ఠముచ్యతే ॥12॥

వర్ణాలన్నింటిలో బ్రాహ్మణుడు శ్రేష్ఠుడైనట్లు లింగాలలో పార్థివలింగం శ్రేష్ఠమైనది.

యథా పురీషు సర్వాసు కాశీ శ్రేష్ఠతమా స్మృతా ।
తథా సర్వేషు లింగేషు పార్థివం శ్రేష్ఠముచ్యతే ॥13॥

నగరాలన్నింటిలో కాశీనగరం లాగ లింగాలన్నింటిలో పార్థివలింగం శ్రేష్ఠమైనది.

యథా వ్రతేషు సర్వేషు శివరాత్రివ్రతం పరమ్ ।
తథా సర్వేషు లింగేషు పార్థివం శ్రేష్ఠముచ్యతే ॥14॥

వ్రతాలన్నింటిలో శివరాత్రివ్రతం లాగ లింగాలన్నింటిలో పార్థివలింగం శ్రేష్ఠమైనది.

యథా దేవీషు సర్వాసు శైవీశక్తిః పరా స్మృతా ।
తథా సర్వేషు లింగేషు పార్థివం శ్రేష్ఠముచ్యతే ॥15॥

దేవీమూర్తులందరిలో శైవీశక్తి వలె, లింగాలన్నింటిలో పార్థివలింగం శ్రేష్ఠమైనది.

ప్రకృత్య పార్థివం లింగం యోఽన్యదేవం ప్రపూజయేత్ ।
వృథా భవతి సా పూజా స్నానదానాదికం వృథా ॥16॥

పార్థివలింగానికి కాక, మరొకలింగాన్ని పూజిస్తే, ఆ పూజ వృథా అవుతుంది. ఆ సందర్భంలో చేసిన స్నానం దానం మొదలగునవి అన్నియు కూడా వృథాయే.

పార్థివారాధనం పుణ్యం ధన్యమాయుర్వివర్ధనమ్ ।
తుష్టిదం పుష్టిదం శ్రీదం కార్యం సాధకసత్తమైః ॥17॥

పార్థివలింగారాధన సాధకుడికి పుణ్యాన్నిచ్చి, ఆయుష్షును పెంచి, జీవితాన్ని ధన్యం చేస్తుంది. తృప్తిని, పుష్టిని, సంపదను ఇస్తుంది. సాధకులు తప్పక చేయగలిగినది.

యథా లబ్ధోపచారైశ్చ భక్త్యా శ్రద్ధాసమన్వితః ।
పూజయేత్పార్థివం లింగం సర్వకామార్థసిద్ధిదమ్ ॥18॥

సాధకుడు తనకు దొరికిన సామగ్రితో ఉపచారాలను చేసి, భక్తి, శ్రద్ధ కలిగినవాడై, పార్థివలింగాన్ని పూజిస్తే కోరికలన్నీ నెరవేరుతాయి.

యః కృత్వా పార్థివం లింగం పూజయేచ్ఛుభవేదికమ్ ।
ఇహైవ ధనవాన్ శ్రీమాన్ అంతే రుద్రోఽభిజాయతే ॥19॥

పార్థివలింగానికి శుభకరమైన మట్టివేదికను తయారు చేసి పూజించు సాధకుడు ఈ లోకంలో ధనంతో, శోభతో వెలుగొంది, మరణించిన తర్వాత రుద్రునితో ఐక్యం అవుతాడు.

త్రిసంధ్యం యోఽర్చయేల్లింగం కృత్వా బిల్వేన పార్థివమ్ ।
దశైకాదశకం యావత్తస్య పుణ్యఫలం శృణు ॥20॥

పార్థివలింగాన్ని చేసి, దానికి మూడుసంధ్యలలో మారేడు ఆకులతో పది, పదకొండు సంవత్సరాలు పూజించిన మనిషికి వచ్చే పుణ్యఫలం వినండి.

అనేనైవ స్వదేహేన రుద్రలోకే మహీయతే ।
పాపహం సర్వమర్త్యానాం దర్శనాత్స్పర్శనాదపి ॥21॥

అతడు ఈ దేహంతోనే రుద్రలోకమందు విరాజిల్లుతాడు. అతనిని చూసి ముట్టుకున్న వారందరికి పాపాలు పోతాయి.

జీవన్ముక్తస్స వై జ్ఞానీ శివ ఏవ న సంశయః ।
తస్య దర్శనమాత్రేణ భుక్తిర్ముక్తిశ్చ జాయతే ॥22॥

అతనిని జీవన్ముక్తుడు, జ్ఞాని, శివస్వరూపుడు అనటంలో సందేహం లేదు. అలాంటి వానిని చూడటం వల్లనే ఇహపరాలు సంపన్నమౌతాయి.

శివం యః పూజయేన్నిత్యం కృత్వా లింగం తు పార్థివమ్ ।
యావజ్జీవనపర్యంతం స యాతో శివమందిరమ్ ॥23॥

పార్థివలింగాన్ని చేసి, నిత్యం జీవించినంతకాలం పూజిస్తే ఆ వ్యక్తి శివుని సన్నిధానం చేరుతాడు.

మృదేనాప్రమితాన్ వర్షాన్ శివలోకే హి తిష్ఠతి ।
సకామః పునరాగత్య రాజేంద్రో భారతే భవేత్ ॥24॥

అతడు శివుడితో కలసి లెక్కలేనన్ని సంవత్సరాలు శివలోకంలో ఉంటాడు. అతడు కోరికలు గలవాడైతే భూలోకంలో పుట్టి భారతదేశానికి చక్రవర్తి అవుతాడు.

నిష్కామః పూజయేన్నిత్యం పార్థివం లింగముత్తమమ్ ।
శివలోకే సదా తిష్ఠేత్తతస్సాయుజ్యమాప్నుయాత్ ॥25॥

కోరికలు లేని వాడు నిత్యం శ్రేష్ఠమైన పార్థివలింగ పూజ చేస్తే, శివలోకంలో చాలా కాలం ఉండి, తర్వాత శివసాయుజ్యం పొందుతాడు.

పార్థివం శివలింగం చ విప్రో యది న పూజయేత్ ।
స యాతి నరకం ఘోరం శూలప్రోతం సుదారుణమ్ ॥26॥

బ్రాహ్మణుడు పార్థివలింగాన్ని పూజించనిచో భయంకరమైన నరకంలో శూలాలకు కట్టబడి దారుణంగా బాధను పొందుతాడు.

యథా కథంచిద్విధినా రమ్యం లింగం ప్రకారయేత్ ।
పంచసూత్రవిధానం చ పార్థివేన విచారయేత్ ॥27॥

కాబట్టి మానవుడు ఏదో విధంగా కష్టపడి, అందమైన పార్థివలింగాన్ని తయారు చేయాలి. పార్థివలింగపూజలో పంచసూత్రవిధానం గురించి ఆలోచించవలెను.

అఖండం తద్ధి కర్తవ్యం న విఖండం ప్రకారయేత్ ।
ద్విఖండం తు ప్రకుర్వాణో నైవ పూజాఫలం లభేత్ ॥28॥

పార్థివలింగాన్ని అఖండంగా చేయాలి. (ముక్కలుండరాదు) రెండుభాగాలను అతికించరాదు. అట్లు రెండుముక్కలు చేస్తే పూజాఫలం దక్కదు.

రత్నజం హేమజం లింగం పారదం స్ఫాటికం తథా ।
పార్థివం పుష్పరాగోత్థమఖండం తు ప్రకారయేత్ ॥29॥

రత్నం, బంగారం, రసం, స్ఫటికం, మట్టి మరియు పుష్పరాగాలతో చేసే లింగం అఖండంగా (ముక్కలు కానిదిగా) ఉండాలి.

అఖండం తు చరం లింగం ద్విఖండమచరం స్మృతమ్ ।
ఖండాఖండవిచారోఽయం సచరాచరయోః స్మృతః ॥30॥

చరలింగం అఖండంగానూ, ప్రతిష్ఠితలింగం ద్విఖండంగాను ఉండాలని చెప్పబడుతోంది.

వేదికా తు మహావిద్యా లింగం దేవో మహేశ్వరః ।
అతో హి స్థావరే లింగే స్మృతా శ్రేష్ఠా ద్విఖండితాః ॥31॥

వేదిక మహావిద్య, లింగం మహేశ్వరుడు. కాబట్టి ప్రతిష్ఠితలింగం ద్విఖండంగా ఉండటం శ్రేష్ఠము.

ద్విఖండం స్థావరం లింగం కర్తవ్యం హి విధానతః ।
అఖండం జంగమం ప్రోక్తం శైవసిద్ధాంతవేదిభిః ॥32॥

స్థావరలింగం అనగా ప్రతిష్ఠితలింగాన్ని ద్విఖండం గాను, చరలింగాన్ని అఖండం గాను నిర్మించాలని శైవసిద్ధాంతపండితులు చెప్తారు.

ద్విఖండం తు చరం లింగం కుర్వంత్యజ్ఞానమోహితాః ।
నైవ సిద్ధాంతవేత్తారో మునయః శాస్త్రకోవిదాః ॥33॥

సిద్ధాంతం తెలియని వారు, మునులు కాని వారు, శాస్త్రపాండిత్యం లేని అజ్ఞానులు చరలింగాన్ని ద్విఖండంగా చేస్తారు.

అఖండం స్థావరం లింగం ద్విఖండం చరమేవ చ ।
యే కుర్వంతి నరా మూఢా న పూజాఫలభాగినః ॥34॥

స్థావరలింగాన్ని అఖండం గాను, చరలింగాన్ని ద్విఖండం గాను చేసే మూర్ఖులకు పూజాఫలం దక్కదు.

తస్మాచ్ఛాస్త్రోక్తవిధినా అఖండం చరసంజ్ఞకమ్ ।
ద్విఖండం స్థావరం లింగం కర్తవ్యం పరయా ముదా ॥35॥

కాబట్టి శాస్త్రపద్ధతిని అనుసరించి మిక్కిలి ఆనందంతో చరలింగాన్ని అఖండంగా, స్థావరలింగాన్ని ద్విఖండంగా చేయాలి.

అఖండేషు చరే పూజా సంపూర్ణఫలదాయినీ ।
ద్విఖండేషు చరే పూజా మహాహానిప్రదా స్మృతా ॥36॥

అఖండమైన చరలింగాన్ని పూజిస్తే, సంపూర్ణఫలాలు దక్కుతాయి. ద్విఖండచరలింగాన్ని పూజిస్తే గొప్ప హాని కలుగుతుందది.

అఖండే స్థావరే పూజా న కామఫలదాయినీ ।
ప్రత్యవాయకరీ నిత్యమిత్యుక్తం శాస్త్రవేదిభిః ॥37॥

అఖండమైన స్థావరలింగాన్ని పూజిస్తే కోరికలు తీరకపోవటమే కాదు, ప్రత్యవాయం కూడా సంభవిస్తుందని శాస్త్రవేత్తలు చెప్పారు.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం సాధ్యసాధనఖండే పార్థివశివలింగపూజన మాహాత్మ్యం నామ ఏకోనవింశో ఽధ్యాయః ॥19॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు సాధ్యసాధనఖండంలోని పార్థివశివలింగపూజన మాహాత్మ్యం అను పేరు గల పందొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

వింశోఽధ్యాయః - ఇరవైయవ అధ్యాయం

పార్థివశివలింగపూజావిధి వర్ణనమ్ - పార్థివశివలింగపూజావిధి వర్ణనం

సూత ఉవాచ - సూతుడు ఇలా పలికాదు.

అథ వైదికభక్తానాం పార్థివార్చాం నిగద్యతే ।
వైదికేనైవ మార్గేణ భుక్తిముక్తిప్రదాయినీ ॥1॥

ఇపుడు వైదికభక్తులు చేసే పార్థివలింగపూజ చెప్పబడుతోంది. వైదికమార్గం మాత్రమే ఇహపరాలను ఇవ్వగలదు.

సూత్రోక్తవిధినా స్నాత్వా సంధ్యాం కృత్వా యథావిధి ।
బ్రహ్మయజ్ఞం విధాయాదౌ తతస్తర్పణమాచరేత్ ॥2॥

గృహ్యసూత్రాలలో చెప్పిన విధంగా స్నానం చేసి, యథావిధిగా సంధ్యావందనం చేసి, ముందుగా బ్రహ్మయజ్ఞాన్ని, తర్వాత తర్పణాన్ని చేయాలి.

నైత్యికం సకలం కర్మ విధాయానంతరం పుమాన్ ।
శివస్మరణపూర్వం హి భస్మరుద్రాక్షధారకః ॥3॥

భక్తుడు నిత్యకర్మలను చేసిన తర్వాత, శివుని స్మరిస్తూ భస్మాన్ని, రుద్రాక్షలను ధరించాలి.

వేదోక్తవిధినా సమ్యక్సంపూర్ణఫలసిద్ధయే ।
పూజయేత్పరయా భక్త్యా పార్థివం లింగముత్తమమ్ ॥4॥

అపుడు భక్తుడు పూర్తి ఫలాన్ని పొందటం కోసం పరాభక్తితో, మంచిదైన పార్థివలింగాన్ని వేదవిధానంతో చక్కగా పూజించాలి.

నదీతీరే తడాగే చ పర్వతే కాననేఽపి చ ।
శివాలయే శుచౌ దేశే పార్థివార్చా విధీయతే ॥5॥

నదీతీరంలో గాని, చెరువు ఒడ్డునగాని, పర్వతమునందు గాని, అడవిలో గాని, శివాలయంలో గాని లేదా ఏదైన శుద్ధప్రదేశంలో గాని పార్థివలింగాన్ని పూజించాలని విధి.

శుద్ధప్రదేశే సంభూతాం మృదమాహృత్య యత్నతః ।
శివలింగం ప్రకల్పేత సావధానతయా ద్విజాః ॥6॥

ఓ బ్రాహ్మణులారా! శుద్ధమైన ప్రదేశంలోని మట్టిని శ్రద్ధతో తెచ్చి, సావధానంగా శివలింగాన్ని నిర్మించాలి.

విప్రే గౌరా స్మృతా శోణా బాహుజే పీతవర్ణకా ।
వైశ్యే కృష్ణా పాదజాతే హ్యథవా యత్ర యా భవేత్ ॥7॥

బ్రాహ్మణులు తెల్లని మట్టిని, క్షత్రియుడు ఎర్రమట్టిని, వైశ్యుడు పచ్చని మట్టిని, శూద్రుడు నల్లని మట్టిని వాడాలి. లేదా దొరికిన మట్టిని వాడవచ్చును.

సంగృహ్య మృత్తికాం లింగనిర్మాణార్థం ప్రయత్నతః ।
అతీవ శుభదేశే చ స్థాపయేత్తాం మృదం శుభామ్ ॥8॥

లింగం నిర్మించటానికి మట్టిని ప్రయత్నంతో సేకరించి, ఆ పవిత్రమైన మట్టిని చాలా శుచి గల ప్రదేశంలో ఉంచాలి.

సంశోధ్య చ జలేనాపి పిండీకృత్య శనైశ్శనైః ।
విధీయేత శుభం లింగం పార్థివం వేదమార్గతః ॥9॥

తతస్సంపూజయేద్భక్త్యా భుక్తిముక్తిఫలాప్తయే ।
తత్ప్రకారమహం వచ్మి శృణుధ్వం సంవిధానతః ॥10॥

నీటితో దానిని శుద్ధి చేసి, మెల్ల మెల్లగా పిండాన్ని చేసి, శుభకరమైన పార్థివలింగాన్ని చేయాలి. అపుడు వేదవిధానంతో అటుపిమ్మట భుక్తిముక్తులను పొందుటకు పార్థివ లింగమును భక్తితో పూజించవలెను. నేను ఆ పద్ధతిని యథావిధిగా తెలియ చేస్తాను. వినండి.

నమశ్శివాయ మంత్రేణార్చనం ద్రవ్యం చ ప్రోక్షయేత్ ।
భూరసీతి చ మంత్రేణ క్షేత్రసిద్ధిం ప్రకారయేత్ ॥11॥

పంచాక్షరీ మంత్రంతో పూజాసామగ్రిని శుద్ధి చేసి, భూరసి మంత్రంతో క్షేత్రాన్ని సిద్ధం చేయాలి.

ఆపోఽస్మానితి మంత్రేణ జలసంస్కారమాచరేత్ ।
నమస్తే రుద్రమంత్రేణ స్ఫాటికాబంధముచ్యతే ॥12॥

ఆపోఽస్మాన్ అనే మంత్రంతో నీటిని సంస్కరించాలి. 'నమస్తే రుద్ర' అనే మంత్రంతో స్ఫటికబంధాన్ని తయారు చేయాలి.

శంభవాయేతి మంత్రేణ క్షేత్రశుద్ధిం ప్రకారయేత్ ।
నమః పూర్వేణ కుర్యాత్ చ పంచామృతస్యాపి ప్రోక్షణమ్ ॥13॥

నమశ్శంభవే చ అనే మంత్రంతో ప్రదేశాన్ని శుద్ధి చేసి పంచామృతాలను ప్రోక్షణ చేయాలి.

నీలగ్రీవాయ మంత్రేణ నమః పూర్వేణ భక్తిమాన్ ।
చరేచ్ఛంకరలింగస్య ప్రతిష్ఠాపనముత్తమమ్ ॥14॥

సాధకుడు భక్తి కూడిన వాడై "నమో నీలగ్రీవాయ" అనే మంత్రంతో ఈ ఉత్తమమైన శివలింగాన్ని ప్రతిష్ఠించాలి.

భక్తితస్తత ఏతత్తే రుద్రాయేతి చ మంత్రతః ।
ఆసనం రమణీయం వై దద్యాద్వైదికమార్గకృత్ ॥15॥

తరువాత వైదికమార్గంలో పూజను చేయు ఈ భక్తుడు భక్తితో 'ఏతత్తే రుద్ర' అనే మంత్రంతో అందమైన ఆసనాన్ని సమర్పించాలి.

మానో మహాంతమితి చ మంత్రేణావాహనం చరేత్ ।
యాతే రుద్రేణ మంత్రేణ సంచరేదుపవేశనమ్ ॥16॥

'మానోమహాంతం' అనే మంత్రంతో శివుణ్ణి ఆవాహన చేసి, 'యాతేరుద్ర' అనే మంత్రంతో శివుణ్ణి ఆసనముపై కూర్చుండబెట్టాలి.

మంత్రేణ యామిషుమితి న్యాసం కుర్యాచ్ఛివస్య చ ।
అధ్యవోచదితి ప్రేమ్ణాధివాసం మనునాఽచరేత్ ॥17॥

'యామిషుం' అనే మంత్రంతో శివుడికి న్యాసం చేయాలి. 'అధ్యవోచత్' అనే మంత్రంతో ప్రేమతో అధివాసం చేయాలి.

మనునాఽసౌ య ఇతి దేవతాన్యాసమాచరేత్ ।
అసౌ యోఽవసర్పతీతి చాచరేదపసర్పణమ్ ॥18॥

'అసౌ యస్తామ్రః' అనే మంత్రంతో లింగంనందు ఇష్టదైవమైన శివుని న్యాసాన్ని ఆచరించాలి. 'అసౌ యో వసర్పతి' అనే మంత్రంతో శివుని దగ్గరకు వెళ్లాలి.

నమోఽస్తు నీలగ్రీవాయేతి పాద్యం మనునా హరేత్ ।
అర్ఘ్యం చ రుద్ర గాయత్ర్యాఽచమనం త్ర్యంబకేణ చ ॥19॥

"నమోఽస్తు నీలగ్రీవాయ" అనే మంత్రంతో నీటిని ఇవ్వాలి (పాద్యం) "తత్పురుషాయ" అనే రుద్రగాయత్రితో అర్ఘ్యాన్ని, "త్ర్యంబకం యజామహే" అనే మంత్రంతో ఆచమనాన్ని ఇవ్వాలి.

పయః పృథివ్యామితి చ పయసా స్నానమాచరేత్ ।
దధిక్రావ్ణ్ణేతి మంత్రేణ దధిస్నానం చ కారయేత్ ॥20॥

"పయః పృథివ్యామ్" అనే మంత్రంతో పాలతో అభిషేకాన్ని, "దధిక్రావ్ణ్ణో" అనే మంత్రంతో పెరుగుతో అభిషేకాన్ని చేయాలి.

ఘృతం స్నానే ఖలు ఘృతం ఘృతయావేతి మంత్రతః ।
మధువాతా మధునక్తం మధుమాన్న ఇతి త్వృచా ॥21॥

మధుఖండస్నపనం ప్రోక్తమితి పంచామృతం స్మృతమ్ ।
అథవా పాద్యమంత్రేణ స్నానం పంచామృతేన చ ॥22॥

"ఘృతం ఘృత యావా" అనే మంత్రంతో నేతి అభిషేకం చెయ్యాలి. "మధువాతా, మధునక్తం, మధుమాన్నః" అనే మూడుమంత్రాలతో తేనె, చక్కెర, నీటిని ఉపయోగించి అభిషేకించాలి. ఈ అయిదుద్రవ్యాలతో చేసే అభిషేకానికి పంచామృతస్నానమని పేరు. ఇలా కాకుండా పాద్యమంత్రంతో పంచామృతస్నానం అనే అభిషేకాన్ని చేయవచ్చు.

మానస్తోకే ఇతి ప్రేమ్ణా మంత్రేణ కటిబంధనమ్ ।
నమో ధృష్ణవే ఇతి వా ఉత్తరీయం చ ధాపయేత్ ॥23॥

"మానస్తోకే" అనే మంత్రాన్ని స్మరించి ప్రేమతో శివునికి కటిబంధనాన్ని, "నమో ధృష్ణవే" అనే మంత్రంతో ఉత్తరీయాన్ని ఇవ్వాలి.

యా తే హేతిరితి ప్రేమ్ణా ఋక్చతుష్కేణ వైదికః ।
శివాయ విధినా భక్తశ్చరేద్వస్త్రసమర్పణమ్ ॥24॥

వైదిక భక్తుడు 'యాతే హేతి' అను నాలుగుమంత్రాలతో ప్రేమతో శివునికి యథావిధి వస్త్రాన్ని ఇవ్వాలి.

నమః శ్వభ్య ఇతి ప్రేమ్ణా గంధం దద్యాదృచా సుధీః ।
నమస్తక్షభ్య ఇతి చాక్షతాన్ మంత్రేణ చార్పయేత్ ॥25॥

భక్తుడు పవిత్రమైన మనసు కలవాడై "నమః శ్వభ్యః" అనే మంత్రంతో ప్రేమతో గంధాన్ని ఇవ్వాలి. "నమస్తక్షభ్య" అనే మంత్రంతో అక్షతలను సమర్పించాలి.

నమః పార్యాయ ఇతి వా పుష్పం మంత్రేణ చార్పయేత్ ।
నమః పర్ణ్యాయ ఇతి వా బిల్వపత్రసమర్పణమ్ ॥26॥

"నమః పార్యాయ" అనే మంత్రంతో పువ్వుల్ని, "నమః పర్ణ్యాయ" అనే మంత్రంతో మారేడుఆకుల్ని సమర్పించాలి.

నమః కపర్దినే చేతి ధూపం దద్యాద్యథావిధి ।
దీపం దద్యాద్యథోక్తం తు నమ ఆశవ ఇత్యృచా ॥27॥

"నమః కపర్దినే చ" అనే మంత్రంతో యథావిధిగా ధూపం ఇవ్వాలి. "నమ ఆశవే" అనే మంత్రంతో యథావిధిగా దీపం ఇవ్వాలి.

నమో జ్యేష్ఠాయ మంత్రేణ దద్యాన్నైవేద్యముత్తమమ్ ।
మనునా త్ర్యంబకమితి పునరాచమనం స్మృతమ్ ॥28॥

"నమో జ్యేష్ఠాయ" అనే మంత్రంతో ఉత్తమమైన నైవేద్యాన్ని, "త్రంబంకం" అనే మంత్రంతో మళ్లీ ఆచమనం చేయాలి

ఇమాం రుద్రాయేతి ఋచా కుర్యాత్ఫలసమర్పణమ్ ।
నమో గోష్ఠ్యాయేతి ఋచా సకలం శంభవేఽర్పయేత్ ॥29॥

“ఇమాగ్ం రుద్రాయ” అనే మంత్రంతో పండ్లు అర్పించాలి. “నమో గోష్ఠ్యాయ” అనే మంత్రంతో సర్వాన్ని శివునికి అర్పించాలి.

మానో మహాంతమితి చ మానస్తోకే ఇతి తతః ।
మంత్రద్వయేనైకదశాక్షతై రుద్రాన్ ప్రపూజయేత్ ॥30॥

‘మానో మహాంతమ్’, ‘మానసోక్తే’ అనే రెండుమంత్రాలతో ఏకాదశరుద్రుల్ని అక్షతలతో పూజించాలి.

హిరణ్యగర్భ ఇతి త్ర్యృచా దక్షిణాం హి సమర్పయేత్ ।
దేవస్య త్వేతి మంత్రేణ హ్యభిషేకం చరేద్బుధః ॥31॥

“హిరణ్య గర్భః” అనే మూడుమంత్రాలతో దక్షిణను ఇవ్వాలి. విద్వాంసుడు “దేవస్య త్వా” అనే మంత్రంతో అభిషేకం చెయ్యాలి.

దీపమంత్రేణ వా శంభోర్నీరాజనవిధం చరేత్ ।
పుష్పాంజలిం చరేద్భక్త్యా ఇమాం రుద్రాయ చ ॥32॥

దీపమంత్రంతో శివునికి నీరాజనం ఇవ్వాలి. తర్వాత “ఇమాగ్ం రుద్రాయ” అనే మూడు మంత్రాలతో రుద్రునికి దోసెడుపువ్వులను భక్తితో ఇవ్వాలి.

మానో మహాంతమితి చ చరేత్ప్రాజ్ఞః ప్రదక్షిణమ్ ।
మానస్తోకేతి మంత్రేణ సాష్టాంగం ప్రణమేత్సుధీః ॥33॥

ప్రాజ్ఞుడు “మానో మహాంతమ్” అనే మంత్రాలతో ప్రదక్షిణ చేసి, పవిత్రమైన మనసుతో “మానసోక్తే” అనే మంత్రాన్ని చదివి, సాష్టాంగంగా నమస్కరించాలి.

ఏష తే ఇతి మంత్రేణ శివముద్రాం ప్రదర్శయేత్ ।
యతో యత ఇత్యభయాం జ్ఞానాఖ్యాం త్ర్యంబకేణ చ ॥34॥

“ఏష తే రుద్ర” అనే మంత్రంతో శివముద్రను, “యతో యతః” అనే మంత్రంతో అభయముద్రను, “త్ర్యంబకమ్” అనే మంత్రంతో జ్ఞానముద్రను

నమస్సేనేతి మంత్రేణ మహాముద్రాం ప్రదర్శయేత్ ।
దర్శయేద్ధేనుముద్రాం చ నమో గోభ్య ఋచానయా ॥35॥

‘నమస్సే’న అను మంత్రంతో మహాముద్రను, “నమో గోభ్యః” అనే మంత్రంతో ధేనుముద్రను చూపాలి.

పంచముద్రాః ప్రదర్శ్యాథ శివమంత్రజపం చరేత్ ।
శివరుద్రాయ మంత్రేణ జపేద్వేదవిచక్షణః ॥36॥

ఈ విధంగా పంచముద్రలు చూపించి, శివమంత్రాన్ని జపించాలి. వేదవేత్త శతరుద్రీయం జపించాలి.

తతః పంచాంగపాఠం చ కుర్యాద్వేదవిచక్షణః ।
దేవాగాత్విత్విత మంత్రేణ కుర్యాచ్ఛంభోర్విసర్జనమ్ ॥37॥

తరువాత వేదవేత్త పంచాంగాన్ని చదవాలి. దేవాగాత్ అనే మంత్రంతో శివుడికి ఉద్యాపన చెప్పాలి.

ఇత్యుక్తః శివపూజయా వ్యాసతో వైదికో విధిః ।
సమాసతశ్చ శృణుత వైదికం విధిముత్తమమ్ ॥38॥

ఇంతవరకు శివపూజ యొక్క వైదికవిధానం వివరంగా చెప్పాను. ఇపుడు ఉత్తమమైన ఆ వైదిక విధి యొక్క సంగ్రహరూపమును వినండి.

ఋచా సద్యోజాతమితి మృదాహరణమాచరేత్ ।
వామదేవాయ ఇతి చ జలప్రక్షేపమాచరేత్ ॥39॥

"సద్యోజాతం" అనే మంత్రంతో మట్టిని తీసుకు వచ్చి, "వామదేవాయ" అనే మంత్రంతో నీటిని ప్రోక్షించాలి.

అఘోరేణ చ మంత్రేణ లింగనిర్మాణమాచరేత్ ।
తత్పురుషేణ మంత్రేణాహ్వానం కుర్యాద్యథావిధి ॥40॥

"అఘోరేభ్యః" అనే మంత్రంతో లింగాన్ని నిర్మించి, "తత్పురుషాయ" అనే మంత్రంతో శివుని యథావిధి ఆహ్వానించాలి.

సంయోజయేద్వేదికాయామీశానమనునాహరమ్ ।
అన్యత్సర్వం విధానం చ కుర్యాత్సంక్షేపతః సుధీః ॥41॥

"ఈశానః" అనే మంత్రంతో శివుణ్ణి వేదికపై ప్రతిష్ఠించి భక్తుడు శుద్ధమైన మనస్సు కలవాడై మిగిలిన విధానాన్నంతటినీ సంక్షిప్తంగా చేయాలి.

పంచాక్షరేణ మంత్రేణ గురుదత్తేన వా తథా ।
కుర్యాత్పూజాం షోడశోపచారేణ విధివత్సుధీః ॥42॥

భక్తుడు పంచాక్షరీ మంత్రంతో కాని, గురువు ఇచ్చిన ఇతర మంత్రంతో కాని షోడశోపచారపూజను యథావిధిగా చేయాలి.

భవాయ భవనాశాయ మహాదేవాయ ధీమహి ।
ఉగ్రాయ ఉగ్రనాశాయ శర్వాయ శశిమౌలినే ॥43॥

భవుడు = ఎప్పటికీ ఉండువాడూ, సంసారమును నశింప చేసే వాడు, భయంకరుడు; ఉగ్రదోషాలను నశింప చేసే వాడు, సంహారకర్త, చంద్రుని తలపై ధరించిన మహాదేవుడు అని ధ్యానిస్తాము

అనేన మనునా వాపి పూజయేచ్ఛంకరం సుధీః ।
సుభక్త్యా చ భ్రమం త్యక్త్వా భక్త్యైవ ఫలదశ్శివః ॥44॥

ఈ మంత్రంతో శంకరుని భక్తితో, భ్రమలను విడిచి పూజించాలి. శివుడు భక్తిచేత మాత్రమే ఫలాన్నిస్తాడు.

ఇత్యపి ప్రోక్తమాదృత్య వైదికక్రమపూజనమ్ ।
ప్రోచ్యతేఽన్యవిధిస్సమ్యక్సాధారణతయా ద్విజాః ॥45॥

వైదికపద్ధతిలో పూజించే విధానం తెలియచేయబడింది. ఓ బ్రాహ్మణులారా! అందరికి ఉపయోగపడే మరొక పూజావిధానం కూడా చెప్తున్నాను.

పూజా పార్థివలింగస్య సంప్రోక్తా శివనామభిః ।
తాం శృణుధ్వం మునిశ్రేష్ఠాః సర్వకామప్రదాయినీమ్ ॥46॥

పార్థివలింగాన్ని శివునినామాలతో పూజించే విధానం ఉంది. ఓ మునులారా! కోరికలనన్నింటినీ తీర్చే ఆ పూజావిధానం వినండి.

హరో మహేశ్వరశ్శంభుః శూలపాణిః పినాకధృక్ ।
శివః పశుపతిశ్చైవ మహాదేవ ఇతి క్రమాత్ ॥47॥

ఓం హరాయ నమః, ఓం మహేశ్వరాయ నమః, ఓం శంభవే నమః, ఓం శూలపాణయే నమః, ఓం పినాకధృతే నమః వినాయనమః, పశుపతయే నమః మహాదేవాయ నమః అనే నామాలను పఠిస్తూ వరుసగా

మృదాహరణసంఘట్టప్రతిష్ఠాహ్వానమేవ చ ।
స్నపనం పూజనం చైవ క్షమస్వేతి విసర్జనమ్ ॥48॥

మట్టిని తెచ్చుట, లింగాన్ని చేయుట, శివుని ప్రతిష్ఠించుట, ఆహ్వానం, స్నానం, పూజ, క్షమాపణం, ఉద్వాసన అనే విధులను,

ఓంకారాది చతుర్థ్యంతైర్నమోఽంతైర్నామభిః క్రమాత్ ।
కర్తవ్యా చ క్రియా సర్వా భక్త్యా పరమయా ముదా ॥49॥

ఓంకారంతో మొదలైన పంచాక్షరిని వరుసగా చేస్తూ, చేసే అన్నిపనులను భక్తితో, ఆనందంతో చేయాలి.

కృత్వా న్యాసవిధిం సమ్యక్ షడంగకరయోస్తథా ।
షడక్షరేణ మంత్రేణ తతో ధ్యానం సమాచరేత్ ॥50॥

ఓం నమశ్శివాయతో యథావిధిగా ఆరు అంగన్యాసాలను, ఆరు కరన్యాసాలను చేసి ధ్యానం చేయాలి.

కైలాసపీఠాసనమధ్యసంస్థం భక్తైస్సనందాదిభిరర్చ్యమానమ్ ।
భక్తార్తిదావానలమప్రమేయం ధ్యాయేదుమాలింగితవిశ్వభూషమ్ ॥51॥

కైలాసంలో సింహాసనమధ్యభాగంలో విరాజిల్లు వాడు, సనందుడు మొదలైన భక్తులచే పూజింపబడే వాడు, భక్తులదుఃఖానికి దావాగ్నిలాంటి వాడు, పార్వతిచే కౌగిలింపబడినవాడు బ్రహ్మాండానికి అలంకారమైనవాడునైన శివుని ధ్యానించాలి.

ధ్యాయేన్నిత్యం మహేశం రజతగిరినిభం చారుచంద్రావతంసం
రత్నాకల్పోజ్జ్వలాంగం పరశుమృగవరాభీతిహస్తం ప్రసన్నమ్ ।
పద్మాసీనం సమంతాత్ స్థితమమరగణైః వ్యాఘ్రకృత్తిం వసానం
విశ్వాద్యం విశ్వబీజం నిఖిలభయహరం పంచవక్త్రం త్రినేత్రమ్ ॥52॥

వెండికొండవలె ప్రకాశించే వాడు, సుందరమైన చంద్రుణ్ణి కిరీటంలో ధరించిన వాడు, రత్నాభరణాలచే ప్రకాశించు దేహం కల వాడు, పరశు, లేడి, వరముద్ర, అభయముద్రలను అరచేతియందు ధరించిన వాడు, ప్రసన్నుడు, పద్మాసనమునందున్న వాడు, చుట్టూ దేవతలు కలవాడు పులిచర్మాన్ని ధరించిన వాడు, బ్రహ్మాండానికి మొదటి వాడు, అన్ని బ్రహ్మాండానికి కారణమైన వాడు, భయాల్ని పోగొట్టే వాడు, అయిదుముఖాలు కల వాడు, మూడుకన్నులు కల వాడు అయిన మహేశ్వరుని ప్రతిదినము ధ్యానించాలి.

ఇతి ధ్యాత్వా చ సంపూజ్య పార్థివం లింగముత్తమమ్ ।
జపేత్పంచాక్షరం మంత్రం గురుదత్తం యథావిధి ॥53॥

ఈ విధంగా శ్రేష్ఠమైన పార్థివలింగాన్ని పూజించి, ధ్యానించి, గురువుచేత యథావిధిగా ఈయబడిన పంచాక్షరమంత్రాన్ని జపించాలి.

స్తుతిభిశ్చైవ దేవేశం స్తువీత ప్రణమన్ సుధీః ।
నానాభిధాభిర్విపేంద్రాః పఠేద్వై శతరుద్రియమ్ ॥54॥

ఓ విప్రులారా! వివేకి మహదేవుని అనేకవిధాల స్తోత్రాలచే స్తుతించి, నమస్కరించాలి. మరియు శతరుద్రీయాన్ని చదవాలి.

తతస్సాక్షతపుష్పాణి గృహీత్వాంజలినా ముదా ।
ప్రార్థయేచ్ఛంకరం భక్త్యా మంత్రైరేభిస్సుభక్తితః ॥55॥

తర్వాత అక్షతలను, పువ్వులను దోసిలితో తీసుకొని ఆనందంతో, భక్తితో శంకరుని ఈ మంత్రాలతో ప్రార్థించాలి.

తావకస్త్వద్గతప్రాణస్త్వచ్చిత్తోఽహం సదా మృడ ।
కృపానిధే ఇతి జ్ఞాత్వా భూతనాథ ప్రసీద మే ॥56॥

హే మృడ! నేను నీ వాడను. నా జీవితం నీ అధీనంలో ఉంది. నా మనస్సులో సదా నీవే ఉన్నావు. హే కృపానిధే! హే భూతనాథా! ఈ విషయం తెలుసుకొని నన్ను అనుగ్రహించు.

అజ్ఞానాద్యది వా జ్ఞానాజ్జపపూజాదికం మయా ।
కృతం తదస్తు సఫలం కృపయా తవ శంకర ॥57॥

ఓ శంకరా! తెలిసి కాని, తెలియక కాని చేసిన జపపూజాదులు నీ కృపచే సఫలమగు గాక!

అహం పాపీ మహానద్య పావనశ్చ భవాన్మహాన్ ।
ఇతి విజ్ఞాయ గౌరీశ యదిచ్ఛసి తథా కురు ॥58॥

నేను గొప్ప పాపిని. నీవు గొప్ప పావనుడవు. అని గ్రహించి హే గౌరీపతే! నీకు నచ్చినట్లు చేయి.

వేదైః పురాణైస్సిద్ధాంతైః ఋషిభిర్వివిధైరపి ।
న జ్ఞాతోఽసి మహాదేవ కుతోఽహం త్వం సదాశివ ॥59॥

ఓ మహాదేవా! వేదాలు, పురాణాలు, వివిధసిద్ధాంతాలు మరియు ఋషులు కూడా నిన్ను తెలుసుకోలేక పోయారు. నేనెంతవాడను?

యథా తథా త్వదీయోఽస్మి సర్వభావైర్మహేశ్వర ।
రక్షణీయస్త్వయాహం వై ప్రసీద పరమేశ్వర ॥60॥

హే మహేశ్వరా! నేను అన్నివిధముల భావముల చేతను, నీ వాడనై ఉన్నాను. హే పరమేశ్వరా! నీవు నన్ను అనుగ్రహించి రక్షించాలి.

ఇత్యేవం చాక్షతాన్ పుష్పాన్ ఆరోప్య చ శివోపరి ।
ప్రణమేద్భక్తితశ్శంభుం సాష్టాంగం విధివన్మునే ॥61॥

ఓ మహర్షీ! ఈ విధంగా ప్రార్థించి, అక్షతలను, పువ్వులను శివుని మీద ఉంచి, భక్తితో శివునకు యథావిధిగా సాష్టాంగనమస్కారాన్ని చేయాలి.

తతః ప్రదక్షిణాం కుర్యాద్యథోక్తవిధినా సుధీః ।
పునస్తువీత దేవేశం స్తుతిభిః శ్రద్ధయాన్వితః ॥62॥

తర్వాత మంచి బుద్ధి గల భక్తుడు యథావిధిగా ప్రదక్షిణ చేసి, మరల మహాదేవుని శ్రద్ధతో స్తుతించాలి.

తతో గలరవం కృత్వా ప్రణమేచ్ఛుచినమ్రధీః ।
కుర్యాద్విజ్ఞప్తిమాదృత్య విసర్జనమథాచరేత్ ॥63॥

తర్వాత బిగ్గరగా జయధ్వానం చేసి, పవిత్రమైన, వినీతమైన మనసుతో నమస్కరించి, సాదరంగా విన్నవించుకొని, తర్వాత ఉద్వాసన చెప్పాలి.

ఇత్యుక్త్వా మునిశార్దూలాః పార్థివార్చా విధానతః ।
భుక్తిదా ముక్తిదా చైవ శివభక్తివివర్ధనీ ॥64॥

ఓ మునిపుంగవులారా! ఇహపరాలను ఇచ్చే శివుని భక్తిని పెంచుకునే పార్థివలింగ పూజావిధానం చెప్పాను.

ఇత్యధ్యాయం సుచిత్తేన యః పఠేచ్ఛృణుయాదపి ।
సర్వపాపవిశుద్ధాత్మా సర్వాన్కామానవాప్నుయాత్ ॥ 65॥

ఈ అధ్యాయాన్ని చదివే లేదా వినే వ్యక్తి పాపాలన్నింటినీ తొలగించుకొని, కోర్కెలనన్నింటిని పొందుతాడు.

ఆయురారోగ్యదం చైవ యశస్యం స్వర్గమేవ చ ।
పుత్రపౌత్రాది సుఖదమాఖ్యానమిదముత్తమమ్ ॥66॥

ఈ పవిత్రమైన ఆధ్యాయం ఆయువును, ఆరోగ్యాన్ని, కీర్తిని, స్వర్గమును, పుత్రపౌత్రాది సుఖాలను ఇస్తుంది.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం సాధ్యసాధనఖండే పార్థివశివలింగపూజావిధి వర్ణనం నామ వింశో ఽధ్యాయః ॥20॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు సాధ్యసాధనఖండంలో పార్థివశివలింగపూజా విధానవర్ణనము అను పేరు గల ఇరవైయవ అధ్యాయం సమాప్తం.

ఏక వింశోఽధ్యాయః - ఇరవైయొకటవ అధ్యాయం

పార్థివపూజావర్ణనమ్ - పార్థివపూజావర్ణనము

ఋషయ ఊచుః - ఋషులు ఇలా పలికారు.

సూత సూత మహాభాగ వ్యాసశిష్య నమోఽస్తు తే ।
సమ్యగుక్తం త్వయా తాత పార్థివార్చావిధానకమ్ ॥1॥

ఓ సూతా! మహాత్మా! వ్యాసశిష్యా! నీకు నమస్కారము. నీవు పార్థివలింగపూజావిధానాన్ని చక్కగా వివరించావు.

కామనాభేదమాశ్రిత్య సంఖ్యాం బ్రూహి విధానతః ।
శివపార్థివలింగానాం కృపయా దీనవత్సల ॥2॥

దీనదయాళో! భక్తుల కోరికలలోని తేడాను బట్టి పూజించాల్సిన పార్థివలింగాల సంఖ్యను దయతో చెప్పండి.

సూత ఉవాచ - సూతుడిలా చెప్పాడు.

శృణుధ్వమృషయస్సర్వే పార్థివార్చావిధానకమ్ ।
యస్యానుష్ఠానమాత్రేణ కృతకృత్యో భవేన్నరః ॥3॥

ఓ ఋషులారా! మీరందరూ వినండి. పార్థివలింగ పూజావిధానం చెప్తాను. మానవుడు ఈ పూజ చేసినంతమాత్రాన కృతకృత్యుడవుతాడు.

అకృత్వా పార్థివం లింగం యోఽన్యదేవం ప్రపూజయేత్ ।
వృథా భవతి సా పూజా దమదానాదికం వృథా ॥4॥

పార్థివలింగాన్ని కాక ఇతరదేవతలను పూజిస్తే ఆ పూజ, ఇంద్రియ నిగ్రహం, దానం ఇలాంటివన్నీ వృథా అవుతాయి.

సంఖ్యా పార్థివలింగానాం యథాకామం నిగద్యతే ।
సంఖ్యా సద్యో మునిశ్రేష్ఠ నిశ్చయేన ఫలప్రదా ॥5॥

కోరికలను బట్టి పూజించవలసిన పార్థివలింగాల సంఖ్య చెప్తాను. ఓ మునీంద్రా! ఈ సంఖ్యను అనుసరించి పూజను చేస్తే ఫలం వెనువెంటనే వస్తుంది. ఇది నిశ్చయం.

ప్రథమావాహనం తత్ర ప్రతిష్ఠా పూజనం పృథక్ ।
లింగాకారం సమం తత్ర సర్వం జ్ఞేయం పృథక్పృథక్ ॥6॥

లింగాలన్నింటి ఆకారం సమంగా ఉండాలి. ఆవాహనం, ప్రతిష్ఠ, పూజ ఇవన్నీ లింగాలన్నిటికీ వేరువేరుగా చేయాలి.

విద్యార్థీ పురుషః ప్రీత్యా సహస్రమితి పార్థివమ్ ।
పూజయేచ్ఛివలింగం హి నిశ్చయాత్తత్ఫలప్రదమ్ ॥7॥

విద్య కావాలని కోరుకున్న వారు వేయిపార్థివలింగాలను పూజిస్తే తప్పకుండా ఫలితం లభిస్తుంది.

నరః పార్థివలింగానాం ధనార్థీ చ తదర్థకమ్ ।
పుత్రార్థీ సార్ధసాహస్రం వస్త్రార్థీ శతపంచకమ్ ॥8॥

మోక్షార్థీ కోటిగుణితం భూకామశ్చ సహస్రకమ్ ।
దయార్థీ చ త్రిసాహస్రం తీర్థార్థీ ద్విసహస్రకమ్ ॥9॥

సుహృత్కామీ త్రిసాహస్రం వశ్యార్థీ శతమష్టకమ్ ।
మరణార్థీ సప్తశతం మోహనార్థీ శతాష్టకమ్ ॥10॥

ధనాన్ని కోరుకున్న మానవులు అయిదువందలు, పుత్రుడు కావాలని కోరేవారు పదిహేను వందలు, బట్టలను కోరేవారు అయిదువందలు, మోక్షాన్ని కోరే వాడు కోటి, భూమిని కోరే వాడు వేయి, పరమేశ్వరుని దయ కోరే వాడు మూడువేలు, తీర్థయాత్రను కోరే వాడు రెండువేలు, స్నేహితుని కోరే వాడు మూడువేలు, ఇతర వ్యక్తి తనవశం కావాలని కోరే వాడు ఎనిమిదివందలు, శత్రునాశనం కోరు వాడు ఏడువందలు, ఇతరులను మోహింపచేయాలని కోరే వాడు ఎనిమిదివందలు పార్థివలింగాలను అర్చించాలి.

ఉచ్చాటనపరశ్చైవ సహస్రం చ యథోక్తతః ।
స్తంభనార్థీ సహస్రం తు ద్వేషణార్థీ తదర్థకమ్ ॥11॥

నిగడాన్ముక్తికామస్తు సహస్రం సార్ధముత్తమమ్ ।
మహారాజభయే పంచశతం జ్ఞేయం విచక్షణైః ॥12॥

భూతాల వశం కోరే వాడు వేయి, భూతాదులను స్తంభనం చేయకోరే వారు వేయి, శత్రునాశనం కోరే వారు అయిదువందలు సంకెళ్ల నుండి విముక్తి కోరే వాడు పదిహేనువందలు, మహారాజభయం కలిగినపుడు అయిదువందల లింగాలను విచక్షణాశక్తిగలవారిచే తెలుసుకొని పూజించవలెను.

చోరాదిసంకటే జ్ఞేయం పార్థివానాం శతద్వయమ్ ।
ఢాకిన్యాదిభయే పంచశతం జ్ఞేయం విచక్షణైః ॥13॥

చోరుల వలన నష్టం కలిగినపుడు రెండువందలు, డాకిని మొదలగు భయములు కల్గినపుడు ఐదువందల లింగములను పూజించవలెను.

దారిద్ర్యే పంచసాహస్రమయుతం సర్వకామదమ్ ।
అథ నిత్యవిధిం వక్ష్యే శ్రుణుధ్వం మునిసత్తమాః ॥14॥

దారిద్ర్యం పోవుటకు అయిదువేలు, కోరికలన్నీ తీరుటకు పదివేలు ఉత్తమపార్థివలింగాలను యథావిధిగా పూజించాలని పండితులు తెలుసుకోవాలి. ఓ మునిశ్రేష్ఠులారా! ఇప్పుడు నిత్యవిధి గురించి చెప్తాను. వినండి.

ఏకం పాపహరం ప్రోక్తం ద్విలింగం చార్థసిద్ధిదమ్ ।
త్రిలింగం సర్వకామానాం కారణం పరమీరితమ్ ॥15॥

ఒక లింగాన్ని పూజిస్తే, పాపాలు తొలగిపోతాయి. రెండులింగాలను అర్చిస్తే, కార్యసిద్ధి కలుగుతుంది. మూడు లింగాలను పూజిస్తే, కోరికలన్నీ తీరుతాయని చెప్పబడింది.

ఉత్తరోత్తరమేవం స్యాత్పూర్వోక్తగణనావధి ।
మతాంతరమథో వక్ష్యే సంఖ్యాయాం మునిభేదతః ॥16॥

ఇదే విధంగా అధికలింగాలను పూజించినకొద్ది అధికఫలం లభిస్తుంది. ఈ సంఖ్యావిషయంలో మునుల అభిప్రాయంలో భేదము ఉంది.

లింగానామయుతం కృత్వా పార్థివానాం సుబుద్ధిమాన్ ।
నిర్భయా హి భవేన్నూనం మహారాజభయం హరేత్ ॥17॥

బుద్ధిమంతుడు 10 వేల లింగాలను పూజిస్తే మహారాజభయమే కాక అన్నిభయాలు తొలగిపోతాయి.

కారాగృహాదిముక్త్యర్థమయుతం కారయేద్బుధః ।
ఢాకిన్యాదిభయే సప్తసహస్రం కారయేత్తథా ॥18॥

చెరసాల నుండి విముక్తి కోరే వ్యక్తి పదివేల లింగాలను పూజించాలి. ఢాకిని మొదలగు పిశాచముల వల్ల భయం కలిగితే ఏడువేల లింగాలను పూజించాలి.

సహస్రాణి పంచ పంచాశదపుత్రః ప్రకారయేత్ ।
లింగానామయుతేనైవ కన్యకా సంతతిం లభేత్ ॥19॥

పుత్రసంతానం లేని వాడు 55 వేల లింగాలను పూజించాలి. పదివేల లింగాలను పూజిస్తే పుత్రిక జన్మిస్తుంది.

లింగానామయుతేనైవ విష్ణ్వాద్వైశ్వర్యమాప్నుయాత్ ।
లింగానాం ప్రయుతేనైవ హ్యతులాం శ్రియమాప్నుయాత్ ॥20॥

పదివేల లింగాలను అర్చించటం వల్ల విష్ణు మొదలగు దేవతల ఐశ్వర్యంతో సమానమైన ఐశ్వర్యం లభిస్తుంది. లక్షలింగాలను పూజించిన వ్యక్తి సాటిలేని సంపదను పొందుతాడు.

కోటిమేకాం తు లింగానాం యః కరోతి నరో భువి ।
శివ ఏవ భవేత్సోఽపి నాత్ర కార్యా విచారణా ॥21॥

ఈ లోకంలో కోటిలింగాలను అర్చించిన మానవుడు శివస్వరూపుడవుతాడు అనటంలో సందేహం లేదు.

అర్చా పార్థివలింగానాం కోటియజ్ఞఫలప్రదా ।
భుక్తిదా ముక్తిదా నిత్యం తతః కామార్థినాం నృణామ్ ॥22॥

పార్థివలింగార్చనవలన కోటియజ్ఞాల ఫలం లభిస్తుంది. ఈ అర్చన వల్ల మానవులకు భుక్తిని, ముక్తిని ఇచ్చుటయే కాక కోరికలన్నింటినీ తీరుస్తుంది.

వినా లింగార్చనం యస్య కాలో గచ్ఛతి నిత్యశః ।
మహాహానిర్భవేత్తస్య దుర్వృత్తస్య దురాత్మనః ॥23॥

ఏనాడూ లింగార్చన చేయకుండా కాలం గడుపు దురాత్మునికి గొప్ప హాని కలుగుతుంది.

ఏకతస్సర్వదానాని వ్రతాని వివిధాని చ ।
తీర్థాని నియమా యజ్ఞా లింగార్చా చైకతః స్మృతా ॥24॥

అన్ని దానాలు, వివిధవ్రతాలు, తీర్థాలు, నియమాలు మరియు యజ్ఞాలు ఒకవైపు లింగార్చన మరియొకవైపు అని స్మృతులు చెప్తున్నాయి.

కలౌ లింగార్చనం శ్రేష్ఠం తథా లోకే ప్రదృశ్యతే ।
తథా నాస్తీతి శాస్త్రాణామేష సిద్ధాంతనిశ్చయః ॥25॥

కలియుగంలో లింగార్చన లోకంలో ఎట్లు శ్రేష్ఠమై ఉన్నదో అట్టి శ్రేష్ఠమైనది మరొకటి లేదని శాస్త్రాలు నిర్ణయించాయి.

భుక్తిముక్తిప్రదం లింగం వివిధాపన్నివారణమ్ ।
పూజయిత్వా నరో నిత్యం శివసాయుజ్యమాప్నుయాత్ ॥26॥

భుక్తిని, ముక్తిని ఇచ్చి, విభిన్న ఆపదలను తొలగించే లింగాన్ని, నిత్యం అర్చించు మానవుడు శివసాయుజ్యాన్ని పొందుతాడు.

శివనామమయం లింగం నిత్యం పూజ్యం మహర్షిభిః ।
యతశ్చ సర్వలింగేషు తస్మాత్పూజ్యం విధానతః ॥27॥

పంచాక్షరీమంత్రరూపమైన లింగం లింగాలన్నింటిలో శ్రేష్ఠమైనది కాబట్టి, మహర్షులు నిత్యం దానిని యథావిధిగా ఉపాసించాలి.

ఉత్తమం మధ్యమం నీచం త్రివిధం లింగమీరితమ్ ।
మానతో మునిశార్దూలాస్తచ్ఛృణుధ్వం వదామ్యహమ్ ॥28॥

లింగాలు మహిమను బట్టి ఉత్తమ, మధ్యమ, నీచమని మూడువిధాలుగా ఉన్నాయి. ఓ మునులారా! వీటి వివరాలు చెప్తాను వినండి.

చతురంగులముచ్ఛ్రాయం రమ్యం వేదికయా యుతమ్ ।
ఉత్తమం లింగమాఖ్యాంతం మునిభిః శాస్త్రకోవిదైః ॥29॥

నాలుగుఅంగుళాల ఎత్తు ఉండి, పీఠాన్ని కల్గివున్న అందమైన లింగం ఉత్తమమైందని శాస్త్రపండితులైన మునులు చెప్పారు.

తదర్ధం మధ్యమం ప్రోక్తం తదర్ధమధమం స్మృతమ్ ।
ఇత్థం త్రివిధమాఖ్యాతముత్తరోత్తరతః పరమ్ ॥30॥

దానిలో సగం ఎత్తు ఉన్నది మధ్యమమని, నాల్గవవంతు ఎత్తు ఉన్నది అధమమని చెప్పబడింది. ఈ విధంగా మూడులింగాలు ఉత్తరోత్తరం అధికమహిమకలవని చెప్పబడ్డాయి.

అనేకలింగం యో నిత్యం భక్తిశ్రద్ధాసమన్వితః ।
పూజయేత్స లభేత్కామాన్మనసా మానసేప్సితాన్ ॥31॥

అనేకలింగాలను నిత్యం భక్తిశ్రద్ధలతో పూజించే మానవుని మనోరథములు తీరును.

న లింగారాధనాదన్యత్పుణ్యం వేదచతుష్టయే ।
విద్యతే సర్వశాస్త్రాణామేష ఏవ వినిశ్చయః ॥32॥

నాలుగువేదాలలో లింగారాధనం కంటే ఎక్కువ పుణ్యమైన కర్మ లేదని అన్నిశాస్త్రముల నిశ్చయమై ఉన్నది.

సర్వమేతత్పరిత్యజ్య కర్మజాలమశేషతః ।
భక్త్యా పరమయా విద్వాన్ లింగమేకం ప్రపూజయేత్ ॥33॥

విద్వాంసుడు సర్వకర్మలనూ విడిచి పెట్టి, పూర్ణభక్తితో ఒకే లింగమును పూజించాలి.

లింగేఽర్చితేఽర్చితం సర్వం జగత్ స్థావరజంగమమ్ ।
సంసారాంబుధిమగ్నానాం నాన్యత్తారణసాధనమ్ ॥34॥

లింగాన్ని పూజిస్తే, చరాచరజగత్తంతటిని పూజించినట్లవుతుంది. ఇది తప్ప సంసారసముద్రమును దాటుటకు మరొక సాధనము లేదు.

అజ్ఞానతిమిరాంధానాం విషయాసక్తచేతసామ్ ।
ప్లవో నాన్యోఽస్తి జగతి లింగారాధనమంతరా ॥35॥

అజ్ఞానం అనే చీకటిచే గ్రుడ్డివారై, ఇంద్రియభోగాలయందు మనస్సు కలిగినవారికి లింగార్చన తప్ప మరొక నావ లేదు.

హరిబ్రహ్మాదయో దేవా మునయో యక్షరాక్షసాః ।
గంధర్వాశ్చారణాస్సిద్ధా దైతేయా దానవాస్తథా ॥36॥

నాగాశ్శేషప్రభృతయో గరుడాద్యాః ఖగాస్తథా ।
సప్రజాపతయశ్చాన్యే మనవః కిన్నరా నరాః ॥37॥

పూజయిత్వా మహాభక్త్యా లింగం సర్వార్థసిద్ధిదమ్ ।
ప్రాప్తాః కామానభీష్టాంశ్చ తాంస్తాన్సర్వాన్ హృది స్థితాన్ ॥38॥

విష్ణువు, బ్రహ్మ మొదలగు దేవతలు, మునులు, యక్షులు, రాక్షసులు, గంధర్వులు, చారణులు, సిద్ధులు, దైత్యులు, దానవులు మరియు శేషుడు మొదలగు నాగులు, గరుడుడు మొదలైన పక్షులు, ప్రజాపతులు, మనువులు, కిన్నెరలు మరియు మానవులు సర్వకార్యాలను సిద్ధింప చేసే లింగాన్ని మహాభక్తితో పూజించి, తమ తమ కోరికలన్నింటినీ తీర్చుకున్నారు.

బ్రాహ్మణః క్షత్రియో వైశ్యః శూద్రో వా ప్రతిలోమజః ।
పూజయేత్సతతం లింగం తత్తన్మంత్రేణ సాదరమ్ ॥39॥

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు ఇంకా ఎవరైనా అందరూ లింగాన్ని ఆయా మంత్రాలతో శ్రద్ధగా నిత్యం పూజించాలి.

కిం బహూక్తేన మునయః స్త్రీణామపి తథాన్యతః ।
అధికారోఽస్తి సర్వేషాం శివలింగార్చనే ద్విజాః ॥40॥

ఓ మునులారా! ఇన్ని మాటలేల? ఓ బ్రాహ్మణులారా! స్త్రీలకు, ఇతరులకు, అందరికి కూడా శివలింగార్చన చేయటంలో అధికారం ఉంది.

ద్విజానాం వైదికేనాపి మార్గేణారాధనం వరమ్ ।
అన్యేషామపి జంతూనాం వైదికేన న సమ్మతమ్ ॥41॥

బ్రాహ్మణులు వైదికపద్ధతిలో ఆరాధించుటయే మంచిది. ఇతరులకు వైదికపద్ధతి అనుకూలం కాదు.

వైదికానాం ద్విజానాం చ పూజా వైదికమార్గతః ।
కర్తవ్యా నాన్యమార్గేణ ఇత్యాహ భగవాంచ్ఛివః ॥42॥

వేదవేత్తలగు బ్రాహ్మణులు వైదికపద్ధతిలోనే పూజించాలని, ఇతరపద్ధతిలో కాదని పరమేశ్వరుడు చెప్పాడు.

దధీచిగౌతమాదీనాం శాపేనాదగ్ధచేతసామ్ ।
ద్విజానాం జాయతే శ్రద్ధా నైవ వైదికకర్మణి ॥43॥

దధీచి, గౌతముడు మొదలైన ఋషుల శాపంతో భ్రష్టమైన అంతఃకరణం కల బ్రాహ్మణులకు, వైదికకర్మలయందు శ్రద్ధ కలగనే కలగదు.

యో వైదికమనాదృత్య కర్మ స్మార్తమథాపి వా ।
అన్యత్సమాచరేన్మర్త్యో న సంకల్పఫలం లభేత్ ॥44॥

వైదిక, స్మార్త కర్మలను అశ్రద్ధ చేసి, ఇతర కర్మలనాచరించు మానవుడు తాను కోరిన ఫలాన్ని పొందడు.

ఇత్థం కృత్వార్చనం శంభోర్నైవేద్యాంతం విధానతః ।
పూజయేదష్టమూర్తీశ్చ తత్రైవ త్రిజగన్మయీః ॥45॥

ఈ విధంగా నైవేద్యంవరకు యథావిధిగా అర్చించి, ఆ లింగమునందే త్రిలోకాలను వ్యాపించి ఉన్న అష్టమూర్తులను పూజించాలి.

క్షితిరాపోఽనలోవాయురాకాశస్సూర్యసోమకౌ ।
యజమాన ఇతి త్వష్టౌ మూర్తయః పరికీర్తితాః ॥46॥

నేల, నీరు, నిప్పు, గాలి ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, సోమయాజి అనేవి అష్టమూర్తులుగా కీర్తించబడ్డాయి.

శర్వో భవశ్చ రుద్రశ్చ ఉగ్రో భీమ ఇతీశ్వరః ।
మహాదేవః పశుపతిరేతాన్మూర్తిభిరర్చయేత్ ॥47॥

శర్వుడు, భవుడు, రుద్రుడు, ఉగ్రుడు, భీముడు, ఈశ్వరుడు, మహాదేవుడు, పశుపతి అనే నామాలను అష్టమూర్తులతో పాటు భావించి, అర్చించాలి.

పూజయేత్పరివారం చ తతశ్శంభోస్సుభక్తితః ।
ఈశానాదిక్రమాత్తత్ర చందనాక్షతపత్రకైః ॥48॥

తరువాత శివుని పరివారాన్ని ఈశానునితో మొదలుపెట్టి క్రమంగా చందనము, అక్షతలు బిల్వపత్రములతో పూజించవలెను.

ఈశానం నందినం చండం మహాకాలం చ భృంగిణమ్ ।
వృషం స్కందం కపర్దీశం సోమం శుక్రం చ తత్క్రమాత్ ॥49॥

అగ్రతో వీరభద్రం చ పృష్ఠే కీర్తిముఖం తథా ।
తత ఏకాదశాన్ రుద్రాన్ పూజయేద్విధినా తతః ॥50॥

ఈశానునితో మొదలు పెట్టి నందిని, చండ, మహాకాల, భృంగి, వృష, స్కంద, కపర్దీశ, సోమ, శుక్రులను అగ్రభాగంలో వీరభద్రుని, వెనుక కీర్తిముఖుని, గంధ, అక్షత, బిల్వపత్రాలతో పూజించాలి. తర్వాత పదకొండు గురు రుద్రుల్ని యథావిధిగా పూజించాలి.

తతః పంచాక్షరం జప్త్వా శతరుద్రీయమేవ చ ।
స్తుతీర్నానావిధాః కృత్వా పంచాంగపఠనం తథా ॥51॥

తతః ప్రదక్షిణాం కృత్వా నత్వా లింగం విసర్జయేత్ ।
ఇతి ప్రోక్తమశేషం చ శివ పూజనమాదరాత్ ॥52॥

తర్వాత పంచాక్షరిని జపించి రుద్రాధ్యాయాన్ని చదవాలి. తర్వాత అనేకస్తుతులను, పంచాంగాన్ని చదివి. తర్వాత ప్రదక్షిణం చేసి, నమస్కరించి, లింగానికి ఉద్వాసన చెప్పాలి. ఈ విధంగా శివపూజను నిశ్శేషంగా శ్రద్ధతో చెప్పాను.

రాత్రావుదఙ్ముఖః కుర్యాద్దేవకార్యం సదైవ హి ।
శివార్చనం సదాప్యేవం శుచిః కుర్యాదుదఙ్ముఖః ॥53॥

దేవకార్యాన్ని రాత్రియందు ఎపుడైననూ, ఉత్తరం వైపు కూర్చుండి మాత్రమే చెయ్యాలి. శివుని ఎప్పుడైనా భక్తుడు శుచికలవాడై ఉత్తరం వైపునుండే శివుణ్ణి అర్చించాలి.

న ప్రాచీమగ్రతశ్శంభోర్నోదీచీం శక్తిసంహితామ్ ।
న ప్రతీచీం యతః పృష్ఠమతో గ్రాహ్యం సమాశ్రయేత్ ॥54॥

శివలింగమునకు అడ్డముగా తూర్పుగా, పడమటగా వెనుకనుండి అమ్మవారితో కలసియున్నపుడు ఉత్తరముగాను శివార్చన చేయరాదు. కనుక యధాయోగ్యముగా (దక్షిణముఖముగా) అర్చించవలెను.

వినా భస్మత్రిపుండ్రేణ వినా రుద్రాక్షమాలయా ।
బిల్వపత్రం వినా నైవ పూజయేచ్ఛంకరం బుధః ॥55॥

భస్మత్రిపుండ్రం లేకుండా, రుద్రాక్షమాల లేకుండా, మారేడుదళాలు లేకుండా తెలివి కలవాడు శంకరుని అర్చించరాదు.

భస్మాప్రాప్తౌ మునిశ్రేష్ఠాః ప్రవృత్తే శివపూజనే ।
తస్మాన్మృదాపి కర్తవ్యం లలాటే చ త్రిపుండ్రకమ్ ॥56॥

ఓ మునిశ్రేష్ఠులారా! శివపూజ ప్రారంభమైనపుడు భస్మం దొరకకపోతే మట్టితోనైనా నుదుటియందు త్రిపుండ్రాన్ని ధరించాలి.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం సాధ్యసాధనఖండే పార్థివపూజనవర్ణనో నామైకవింశోఽధ్యాయః ॥21॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు సాధ్యసాధనఖండంలో పార్థివపూజనవర్ణనం అను పేరు గల ఇదవై ఒకటవ అధ్యాయం సమాప్తం.

ద్వావింశోऽధ్యాయః - ఇరవై రెండవ అధ్యాయం

శివనైవేద్యవర్ణనమ్ - శివనైవేద్యవర్ణనము

ఋషయ ఊచుః - ఋషులిట్లు పలికారు.

అగ్రాహ్యం శివనైవేద్యమితి పూర్వం శ్రుతం వచః ।
బ్రూహి తన్నిర్ణయం బిల్వమాహాత్మ్యమపి సన్మునే ॥1॥

శివనైవేద్యాన్ని తీసుకోరాదని పూర్వం విన్నాం. దాని నిర్ణయాన్ని తెలియచెప్పండి. ఓ మహాముని! బిల్వమహిమను కూడా చెప్పండి.

సూత ఉవాచ - సూతుడు ఇలా చెప్పాడు.

శృణుధ్వం మునయస్సర్వే సావధానతయాధునా ।
సర్వం వదామి సంప్రీత్యా ధన్యా యూయం శివవ్రతాః ॥2॥

ఓ మునులారా! మీరందరూ ఇపుడు సావధానంగా వినండి. అన్నింటిని ప్రేమతో వివరిస్తాను. శివవ్రతులైన మీరు ధన్యులు.

శివభక్తశ్శుచిశ్శుద్ధస్సద్వ్రతీ దృఢనిశ్చయః ।
భక్షయేచ్ఛివనైవేద్యం త్యజేదగ్రాహ్యభావనామ్ ॥3॥

బయట, లోపల శుచి కలవాడు, దృఢనిర్ణయం, దృఢవ్రతం, కలవాడు అయిన శివభక్తుడు "తీసుకోరాదేమో" అనే ఆలోచనను విడిచి శివనైవేద్యాన్ని తినవచ్చును.

దృష్ట్వాపి శివనైవేద్యం యాంతి పాపాని దూరతః ।
భుక్తే తు శివనైవేద్యే పుణ్యాన్యాయాంతికోటిశః ॥4॥

శివనైవేద్యాన్ని చూచినంతనే పాపాలు దూరమౌతాయి. శివనైవేద్యం తినిన వెంటనే కోటిపుణ్యాలు లభిస్తాయి.

అలం యాగసహస్రేణాప్యలం యాగార్బుదైరపి ।
భక్షితే శివనైవేద్యే శివసాయుజ్యమాప్నుయాత్ ॥5॥

వేలాదిగా, లక్షలాదిగా యాగాలను చేయవలసిన పని లేదు. శివనైవేద్యాన్ని తీసుకున్న వ్యక్తి శివసాయుజ్యాన్ని పొందుతాడు.

యద్గృహే శివనైవేద్యప్రచారోऽపి ప్రజాయతే ।
తద్గృహం పావనం సర్వమన్యపావనకారణమ్ ॥6॥

ఏ ఇంటిలో శివనైవేద్యాన్ని తీసుకొని, ఇతరులకు ఇస్తారో ఆ ఇల్లు పవిత్రమౌతుంది. ఇంటిలోని వారిని, ఇంటికి వచ్చిన వారిని పవిత్రం చేస్తుంది.

ఆగతం శివనైవేద్యం గృహీత్వా శిరసా ముదా ।
భక్షణీయం ప్రయత్నేన శివస్మరణపూర్వకమ్ ॥7॥

భక్తుడు తనకు దొరికిన శివనైవేద్యాన్ని ఆనందంతో, వినయంగా తీసుకొని, శివుని స్మరిస్తూ శ్రద్ధగా తినాలి.

ఆగతం శివనైవేద్యమన్యథా గ్రాహ్యమిత్యపి ।
విలంబే పాపసంబంధో భవత్యేవ హి మానవే ॥8॥

శివనైవేద్యం దొరికినపుడు, మరోసారి తీసుకోవచ్చనే ఆలోచనతో ఆలస్యం చేసిన మానవుడు తప్పక పాపాన్ని పొందుతాడు.

న యస్య శివనైవేద్యగ్రహణేచ్ఛా ప్రజాపతే ।
స పాపిష్ఠో గరిష్ఠస్స్యాన్నరకం యాత్యపి ధ్రువమ్ ॥9॥

శివనైవేద్యాన్ని తీసుకోవాలనే కోరిక ఎవడికి కలగదో, వాడు మహాపాపియై, తప్పకుండా నరకాన్ని పొందుతాడు.

హృదయే చంద్రకాంతే చ స్వర్ణరూప్యాది నిర్మితే ।
శివదీక్షావతా భక్తేనేదం భక్ష్యమితీర్యతే ॥10॥

చంద్రకాంతం, బంగారం, వెండి మొదలైన వాటితో చేసిన శివలింగమును హృదయమందు నిలుపుకొని ఆయనకు నైవేద్యం పెట్టిన పదార్థాలను శివదీక్షలో ఉన్న భక్తుడు భుజించాలని ఋషులు చెప్పారు.

శివదీక్షాన్వితో భక్తో మహాప్రసాదసంజ్ఞకమ్ ।
సర్వేషామపి లింగానాం నైవేద్యం భక్షయేచ్ఛుభమ్ ॥11॥

శివదీక్షను పొందిన భక్తుడు మహాప్రసాదం అనబడే శుభకరమైన అన్నిలింగాల నైవేద్యాన్ని భుజించాలి.

అన్యదీక్షయుజాం నృణాం శివభక్తిరతాత్మనామ్ ।
శృణుధ్వం నిర్ణయం ప్రీత్యా శివనైవేద్యభక్షణే ॥12॥

ఇతరదీక్షలు గలవారు శివభక్తియందు మనసు లగ్నం కలవారైతే, వారు ప్రీతితో శివనైవేద్యం భుజించటం అనే విషయంలో గల నిర్ణయాన్ని వినండి.

సాలగ్రామోద్భవే లింగే రసలింగే తథా ద్విజాః ।
పాషాణే రాజతే స్వర్ణే సురసిద్ధప్రతిష్ఠితే ॥13॥

కాశ్మీరే స్ఫాటికే రాత్నే జ్యోతిర్లింగేషు సర్వశః ।
చాంద్రాయణసమం ప్రోక్తం శంభోర్నైవేద్యభక్షణమ్ ॥14॥

ఓ బ్రాహ్మణులారా! సాలగ్రామమునందు పుట్టిన లింగం, రసలింగం, శిలాలింగం, వెండి, బంగారులింగాలు, దేవతలు మరియు సిద్ధులు ప్రతిష్ఠింప చేసిన లింగాలు అన్ని జ్యోతిర్లింగాలలో కాశ్మీరములోని స్ఫటికలింగము, రత్నలింగములు మరియు విరాజిల్లే శివుని నైవేద్యాన్ని భుజించిన భక్తునికి చాంద్రాయణవ్రతం చేసిన ఫలం వస్తుంది.

బ్రహ్మహాపి శుచిర్భూత్వా నిర్మాల్యం యస్తు ధారయేత్ ।
భక్షయిత్వా ద్రుతం తస్య సర్వపాపం ప్రణశ్యతి ॥15॥

ఎవడైతే శుచియై శివుని నిర్మాల్యాన్ని ధరించి, ప్రసాదం భుజించునో వాడు బ్రహ్మహత్యను చేసిన వాడైననూ, వాడిపాపమంతా వెంటనే నశిస్తుంది.

చండాధికారో యత్రాస్తి తద్భోక్తవ్యం న మానవైః ।
చండాధికారో నో యత్ర భోక్తవ్యం తచ్చ భక్తితః ॥16॥

చండీశ్వరుని అధికారం గల ప్రతిష్ఠలో మానవులు నైవేద్యం తినరాదు. చండీశ్వరాధికారం లేని దేవాలయంలో నైవేద్యాన్ని భక్తితో తినవచ్చు.

బాణలింగే చ లౌహే చ సిద్ధే లింగే స్వయంభువి ।
ప్రతిష్ఠాసు చ సర్వాసు న చండోఽధికృతో భవేత్ ॥17॥

బాణలింగం, లోహనిర్మితలింగం, సిద్ధప్రతిష్ఠితలింగం, స్వయంభూలింగం మరియు అన్నిరకాల శివప్రతిమల విషయంలో చండీశ్వరుని అధికారం ఉండదు.

స్నాపయిత్వా విధానేన యో లింగస్నపనోదకమ్ ।
త్రిః పిబేత్ త్రివిధం పాపం తస్యేహాశు వినశ్యతి ॥18॥

ఎవరైతే లింగానికి యథావిధిగా అభిషేకం చేసి, ఆ తీర్థాన్ని మూడుసార్లు తీసుకుంటారో వాని మూడువిధాల పాపాలు వెనువెంటనే నశిస్తాయి.

అగ్రాహ్యం శివనైవేద్యం పత్రం పుష్పం ఫలం జలమ్ ।
శాలగ్రామశిలాసంగాత్సర్వం యాతి పవిత్రతామ్ ॥19॥

గ్రహింపదగని శివనైవేద్యం, పత్రం, పుష్పం, ఫలం, జలం, ఇటువంటి వన్నీ శాలగ్రామశిలను ముట్టుకోవటం వల్ల పవిత్రతను పొందుతాయి.

లింగోపరి చ యద్ద్రవ్యం తదగ్రాహ్యం మునీశ్వరాః ।
సుపవిత్రం చ తద్ జ్ఞేయం యల్లింగస్పర్శబాహ్యతః ॥20॥

ఓ మునిశ్రేష్ఠులారా! లింగంపై ఉంచిన ద్రవ్యాన్ని తీసుకొనరాదు. కాని లింగస్పర్శకు బయట ఉన్న శివనైవేద్యం చాలా పవిత్రమైనది.

నైవేద్యనిర్ణయః ప్రోక్త ఇత్థం వో మునిసత్తమాః ।
శృణుధ్వం బిల్వమాహాత్మ్యం సావధానతయాఽఽదరాత్ ॥21॥

ఓ మునిపుంగవులారా! మీకింతకరకు నైవేద్యనిర్ణయాన్ని చెప్పాను. ఇంక ఇపుడు సావధానంగా బిల్వమహిమను శ్రద్ధగా వినండి.

మహాదేవస్వరూపోఽయం బిల్వో దేవైరపి స్తుతః ।
యథాకథంచిదేతస్య మహిమా జ్ఞాయతే కథమ్ ॥22॥

మారేడుచెట్టు మహాదేవుని స్వరూపం. దీన్ని దేవతలు కూడా పొగుడుతారు. దీని మహిమ తెలియటం చాలా కష్టం.

పుణ్యతీర్థాని యావంతి లోకేషు ప్రథితాన్యపి ।
తాని సర్వాణి తీర్థాని బిల్వమూలే వసంతి హి ॥23॥

లోకంలో ప్రసిద్ధి చెందిన పుణ్యతీర్థాలు ఎన్ని ఉన్నాయో అవన్నీ మారేడుచెట్టు మూలంలో నివసించి ఉంటాయి.

బిల్వమూలే మహాదేవం లింగరూపిణమవ్యయమ్ ।
యః పూజయతి పుణ్యాత్మా స శివం ప్రాప్నుయాద్ధ్రువమ్ ॥24॥

మారేడుచెట్టు మూలంలో లింగరూపంలో ఉన్న వ్యయరహితుడు అయిన మహాదేవుని పూజించు పుణ్యాత్ముడు తప్పక శివుని పొందుతాడు.

బిల్వమూలే జలైర్యస్తు మూర్ధానమభిషించతి ।
స సర్వతీర్థస్నాతస్స్యాత్ స ఏవ భువి పావనః ॥25॥

మారేడుచెట్టు మొదట్లో స్నానం చేసిన వాడు సర్వతీర్థాలలో స్నానం చేసిన ఫలాన్ని పొందుతాడు. అట్టి వాడు మాత్రమే ఈ లోకంలో పవిత్రుడు.

ఏతస్య బిల్వమూలస్యాథాలవాలమనుత్తమమ్ ।
జలాకులం మహాదేవో దృష్ట్వా తుష్టో భవత్యలమ్ ॥26॥

మారేడుచెట్టు మూలంలో కట్టిన కుదురు సర్వోత్కృష్టమైనది. అది నీటితో తడిసి ఉంటే మహాదేవుడు చూసి సంతోషిస్తాడు. శివుని అనుగ్రహం పొందాలంటే ఆ విధంగా నీరు పోయాలి.

పూజయేద్బిల్వమూలం యో గంధపుష్పాదిభిర్నరః ।
శివలోకమవాప్నోతి సంతతిర్వర్ధతే సుఖమ్ ॥27॥

ఏ మానవుడు గంధం, పువ్వులు మొదలైన వాటితో మారేడుచెట్టు మూలాన్ని పూజించునో అతడు శివలోకాన్ని పొందుతాడు. అట్టి వారికి సంతానం, సుఖం అభివృద్ధి చెందుతాయి.

బిల్వమూలే దీపమాలాం యః కల్పయతి సాదరమ్ ।
స తత్త్వజ్ఞానసంపన్నో మహేశాంతర్గతో భవేత్ ॥28॥

మారేడుచెట్టు మొదట్లో శ్రద్ధతో వరుసగా దీపాలు పెట్టిన మానవుడు తత్త్వజ్ఞానాన్ని పొంది మహేశ్వరునిలో ఐక్యం అవుతాడు.

బిల్వశాఖాం సమాదాయ హస్తేన నవపల్లవమ్ ।
గృహీత్వా పూజయేద్బిల్వం స చ పాపైః ప్రముచ్యతే ॥29॥

కొత్తచిగురులతో ఉన్న మారేడుకొమ్మను చేతితో పట్టుకొని, మారేడుచెట్టును పూజిస్తే మానవుడు పాపాలనుండి బయటపడతాడు.

బిల్వమూలే శివరతం భోజయేద్యస్తు భక్తితః ।
ఏకం వా కోటి గుణితం తస్య పుణ్యం ప్రజాయతే ॥30॥

మారేడుచెట్టు కింద శివభక్తునికి ఒక్కడికి భోజనం పెడితే కోటిరెట్లు పుణ్యం వస్తుంది.

బిల్వమూలే క్షీరయుక్తమన్నమాజ్యేన సంయుతమ్ ।
యో దద్యాచ్ఛివభక్తాయ స దరిద్రో న జాయతే ॥31॥

మారేడుచెట్టు కింద పాలు, నెయ్యి కూడిన అన్నాన్ని శివభక్తునికి పెడితే అట్టి వాడు దరిద్రుడై పుట్టడు.

సాంగోపాంగమితి ప్రోక్తం శివలింగప్రపూజనమ్ ।
ప్రవృత్తానాం నివృత్తానాం భేదతో ద్వివిధం ద్విజాః ॥32॥

ఓ బ్రాహ్మణులారా! ఈ విధంగా శివలింగపూజను, అందులోని వివిధ అంగాలను, చిన్నవివరాలతో చెప్పాను. ప్రవృత్తి, నివృత్తి అనే రెండుమార్గాలలో ఉన్న భక్తులు చేసే పూజలు వేర్వేరుగా ఉంటాయి.

ప్రవృత్తానాం పీఠపూజా సర్వాభీష్టప్రదా భువి ।
పాత్రేణైవ ప్రవృత్తస్తు సర్వపూజాం సమాచరేత్ ॥33॥

ప్రవృత్తులతో పీఠపూజను చేయాలి. దానివలన వారికి అన్నిదేవతలను పూజించిన ఫలం లభిస్తుంది. లోకవ్యవహారములో ప్రవర్తించువారు పీఠపూజచేయవలెను. ఆ పూజ భూమిపై అన్ని కోరికలను తీర్చగలదు. యోగ్యుడైన బ్రాహ్మణుని ద్వారా అన్ని విధములైన పూజలు చేయించవలెను.

అభిషేకాంతే నైవేద్యం శాల్యన్నేన సమాచరేత్ ।
పూజాంతే స్థాపయేల్లింగం పుటే శుద్ధే పృథగ్గృహే ॥34॥

ప్రవృత్తులు అభిషేకం చేసి, నాణ్యమైన బియ్యంతో వండిన అన్నాన్ని నైవేద్యం పెట్టాలి. పూజ అయిన తర్వాత లింగాన్ని శుద్ధమైన పెట్టెలో పెట్టి ఇంట్లో జాగ్రత్త చేయాలి.

కరపూజా నివృత్తానాం స్వభోజ్యం తు నివేదయేత్ ।
నివృత్తానాం పరం సూక్ష్మం లింగమేవ విశిష్యతే ॥35॥

నివృత్తిమార్గంలో ఉన్నవారు చేతియందు లింగాన్ని ఉంచుకొని పూజించి, భిక్షాటన ద్వారా లభించిన అన్నాన్ని నైవేద్యం పెట్టాలి. నివృత్తిపరులు సూక్ష్మలింగాన్ని (ఓం) ఉపాసించటం చాలా మంచిది.

విభూత్యభ్యర్చనం కుర్యాద్విభూతిం చ నివేదయేత్ ।
పూజాం కృత్వా తథా లింగం శిరసా ధారయేత్సదా ॥36॥

వారు లింగాన్ని విభూతితో పూజించి విభూతిని నైవేద్యంగా పెట్టాలి. పూజ అయిన తర్వాత లింగాన్ని ఎపుడూ తలపై ధరించాలి.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం సాధ్యసాధనఖండే శివనైవేద్య వర్ణనం నామ ద్వావింశోఽధ్యాయః ॥22॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు సాధ్యసాధనఖండంలో శివనైవేద్య వర్ణనము అను పేరు గల ఇరవై రెండవ అధ్యాయం సమాప్తం.

త్రయోవింశోఽధ్యాయః - ఇరవై మూడవ అధ్యాయం

శివనామమాహాత్మ్యవర్ణనమ్ - శివనామమాహాత్మ్యవర్ణనము

ఋషయ ఊచుః - ఋషులు ఇలా పలికారు.

సూత సూత మహాభాగ వ్యాసశిష్య నమోఽస్తు తే ।
తదేవ వ్యాసతో బ్రూహి భస్మమాహాత్మ్యముత్తమమ్ ॥1॥

ఓ సూతా! మహాత్మా! వ్యాసశిష్యుడవైన నీకు నమస్కారం. ఉత్తమమైన భస్మమహిమను విపులముగా చెప్పుము.

తథా రుద్రాక్షమాహాత్మ్యం నామమాహాత్మ్యముత్తమమ్ ।
త్రితయం బ్రూహి సుప్రీత్యా మమానందయ చేతసమ్ ॥2॥

రుద్రాక్షమహిమ, ఉత్తమమైన నామ మహిమ అనే మూడింటిని మిక్కిలి ప్రేమతో సంగ్రహంగా చెప్పి, మా మనస్సులకు ఆనందం కలగచేయండి.

సూత ఉవాచ - సూతుడు ఇట్లు పలికాడు.

సాధు పృష్టం భవద్భిశ్చ లోకానాం హితకారకమ్ ।
భవంతో వై మహాధన్యాః పవిత్రాః కులభూషణాః ॥3॥

మీరు లోకాలకు హితం చేసే ప్రశ్నను చక్కగా అడిగారు. మీరు చాలా ధన్యులు. వంశానికి అలంకారంవంటి వాళ్లు.

యేషాం చైవ శివస్సాక్షాద్దైవతం పరమం శుభమ్ ।
సదాశివకథా లోకే వల్లభా భవతాం సదా ॥4॥

మీరు పరమదైవమైన శివుణ్ణి కొలుస్తున్నారు. మీకు, ఈ లోకానికి శివునికథ ఎక్కువ ఇష్టమై ఉంది.

తే ధన్యాశ్చ కృతార్థాశ్చ స ఫలం దేహధారణమ్ ।
ఉద్ధృతం చ కులం తేషాం యే శివం సముపాసతే ॥5॥

శివుణ్ణి ఉపాసించు వారు ధన్యులు, కృతకృత్యులు. వారిజన్మ సఫలమై వారికులం ఉద్ధరింపబడుతుంది.

ముఖే యస్య శివ నామ సదాశివ శివేతి చ ।
పాపాని న స్పృశంత్యేవ ఖదిరాంగారకం యథా ॥6॥

శ్రీశివాయ నమస్తుభ్యం ముఖం వ్యాహరతే యదా ।
తన్ముఖం పావనం తీర్థం సర్వపాపవినాశనమ్ ॥7॥

ఎవరినోటి నుండి ఎల్లప్పుడూ శివ శివ అని ఉచ్చారణ జరుగుతుందో వారికి పాపాలు అంటవు. ఓ శివా! నీకు నమస్కారమని పలికే నోరు పాపాలన్నింటినీ పోగొట్టే పవిత్రతీర్థం.

తన్ముఖం చ తథా యో వై పశ్యతి ప్రీతిమాన్నరః ।
తీర్థజన్యం ఫలం తస్య భవతీతి సునిశ్చితమ్ ॥8॥

అటువంటి భక్తుని ముఖాన్ని ప్రీతితో, తీర్థభావనతో చూచు వానికి కూడా తీర్థదర్శనఫలం తప్పకుండా లభిస్తుంది.

యత్ర త్రయం సదా తిష్ఠేదేతచ్ఛుభతరం ద్విజాః ।
తస్య దర్శనమాత్రేణ వేణీస్నానఫలం లభేత్ ॥9॥

ఓ బ్రాహ్మణులారా! ఎవడిలో అత్యంతశుభకరాలైన శివనామం, విభూతి, రుద్రాక్షలు అనే మూడు ఉంటాయో, అటువంటి వాడిని కలిసినంతమాత్రాన త్రివేణీసంగమంలో స్నానం చేసిన ఫలం లభిస్తుంది.

శివనామవిభూతిశ్చ తథా రుద్రాక్ష ఏవ చ ।
ఏతత్త్రయం మహాపుణ్యం త్రివేణీసదృశం స్మృతమ్ ॥10॥

శివనామం, విభూతి, రుద్రాక్ష అనే ఈ మూడు చాలా పవిత్రములైనవి. త్రివేణి అనే మూడునదులతో సమానమైనవి అని ఋషులు చెప్పారు.

ఏతత్త్రయం శరీరే చ యస్య తిష్ఠతి నిత్యశః ।
తస్యైవ దర్శనం లోకే దుర్లభం పాపహారకమ్ ॥11॥

ఈ మూడు ఎవని శరీరమునందు రోజూ ఉంటాయో అట్టి వాడి దర్శనం లోకంలో చాలా కష్టం. వాని దర్శనం పాపాలను పోగొడుతుంది.

తద్దర్శనం యథా వేణీ నోభయోరంతరం మనాక్ ।
ఏవం యో న విజానాతి స పాపిష్ఠో న సంశయః ॥12॥

వానిదర్శనానికి త్రివేణి సంగమదర్శనానికి తేడా లేదు. ఈ నిజాన్ని తెలియని వాడిని పాపాత్ముడనటంలో సందేహం లేదు.

విభూతిర్యస్య నో ఫాలే నాంగే రుద్రాక్షధారణమ్ ।
నాస్యే శివమయీ వాణీ తం త్యజేదధమం యథా ॥13॥

ఎవనినుదుటిపై విభూతి లేదో, ఎవని శరీరమందు రుద్రాక్ష ధరింపబడదో, ఎవని మాటలు శివనామభరితాలు కావో అట్టి వానిని అధమునిలాగ వదలి వేయాలి.

శైవం నామ యథా గంగా విభూతిర్యమునా మతా ।
రుద్రాక్షం విధిజా ప్రోక్తా సర్వపాపవినాశినీ ॥14॥

శివనామం గంగ వంటిది. విభూతి యమున వంటిది. రుద్రాక్ష సర్వపాపాలు పోగొట్టే సరస్వతీనది వంటిది.

శరీరే చ త్రయం యస్య తత్ఫలం చైకతస్థితమ్ ।
ఏకతో వేణికాయాశ్చ స్నానజం తు ఫలం బుధైః ॥15॥

తదేవం తులితం పూర్వం బ్రహ్మణా హితకారిణా ।
సమానం చైవ తజ్జాతం తస్మాద్ధార్యం సదా బుధైః ॥16॥

ఈ మూడు ఎవని శరీరం మీద ఉంటాయో వాని పుణ్యాన్ని ఒకవైపు, త్రివేణిసంగమస్నానం వల్ల లభించిన పుణ్యం ఒకవైపు ఉంచి, విద్వాంసులే కాక పూర్వం బ్రహ్మ కూడా లోకహితాన్ని కోరి పోల్చి చూస్తే, రెండింటిఫలం సమానంగా ఉంది. కాబట్టి విద్వాంసులు వీటిని అన్ని వేళలా ధరించాలి.

తద్దినం హి సమారభ్య బ్రహ్మవిష్ణ్వాదిభిస్సురైః ।
ధార్యతే త్రితయం తచ్చ దర్శనాత్పాపహారకమ్ ॥17॥

ఆ రోజు నుండి బ్రహ్మ, విష్ణువు మొదలగు దేవతలే మూడింటినీ ధరిస్తున్నారు. వీటి దర్శనం పాపాలను పోగొడుతుంది.

ఋషయ ఊచుః – ఋషులు ఇలా పలికారు.

ఈదృశం హి ఫలం ప్రోక్తం నామాది త్రితయోద్భవమ్ ।
తన్మాహాత్మ్యం విశేషేణ వక్తుమర్హసి సువ్రత ॥18॥

నామం మొదలగు మూడింటికి గల ఫలం గొప్పది కదా! గొప్ప వ్రతశాలివైన ఓ సూతా! వాటి మాహాత్మ్యమును వివరించి చెప్పండి.

సూత ఉవాచ – సూతుడు ఇట్లు పలికాడు.

ఋషయో హి మహాప్రాజ్ఞాః సచ్ఛైవా జ్ఞానినాం వరాః ।
తన్మాహాత్మ్యం హి సద్భక్త్యా శృణుతాదరతో ద్విజాః ॥19॥

ఋషులారా! మీరు గొప్పబుద్ధిశాలురు. మంచిశైవులు, జ్ఞానులలో శ్రేష్ఠులు. కాబట్టి ఓ బ్రాహ్మణులారా! వాటి మాహాత్మ్యమును మంచి భక్తిశ్రద్ధలతో వినండి.

సుగూఢమపి శాస్త్రేషు పురాణేషు శ్రుతిష్వపి ।
భవత్స్నేహాన్మయా విప్రాః ప్రకాశః క్రియతేఽధునా ॥20॥

ఓ బ్రాహ్మణులారా! ఇది శాస్త్రాలలో, పురాణాలలో, మరియు వేదాలలో మిక్కిలి రహస్యంగా ఉంది. అయినా, మీ మీద గల ప్రేమతో దీనిని నేను ఇపుడు బయట పెడుతున్నాను.

కస్త్రిత్రితయమాహాత్మ్యం సంజానాతి ద్విజోత్తమాః ।
మహేశ్వరం వినా సర్వం బ్రహ్మాండే సదసత్పరమ్ ॥21॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! బ్రహ్మాండంలోని వ్యక్తావ్యక్తాలకంటే పరుడైన మహేశ్వరుడు తప్ప ఈ మూడింటి మహిమను మరి ఎవ్వరు తెలియజేయగలరు?

వచ్మ్యహం నామ మాహాత్మ్యం యథాభక్తి సమాసతః ।
శృణుత ప్రీతితో విప్రాః సర్వపాపహరం పరమ్ ॥22॥

ఓ బ్రాహ్మణులారా! నేను నామ మహిమను భక్తితో సంగ్రహంగా చెప్తాను. అన్నిపాపాలను హరించే ఉత్తమమైన నామ మహిమను మీరు ప్రేమతో వినండి.

శివేతి నామ దావాగ్నేర్మహాపాతకపర్వతాః ।
భస్మీభవంత్యనాయాసాత్సత్యం సత్యం న సంశయః ॥23॥

శివనామం అనే దావాగ్ని ముందర మహాపాపాలనే పర్వతాలు తేలికగా బూడిదై పోతాయనే మాట ముమ్మాటికీ నిజం.

పాపమూలాని దుఃఖాని వివిధాన్యపి శౌనక ।
శివనామైకనశ్యాని నాన్యనశ్యాని సర్వథా ॥24॥

ఓ శౌనకా! పాపాలవలన కలిగే దుఃఖాలు కూడా కేవలం శివనామం వల్ల నశిస్తాయి కాని మరోవిధంగా నశించవు.

స వైదికస్సపుణ్యాత్మా స ధన్యస్స బుధో మతః ।
శివనామజపాసక్తో యో నిత్యం భువి మానవః ॥25॥

ఈ లోకంలో ఏ మానవుడు నిత్యం శివనామం జపించటంలో ఆసక్తి కల్గియుంటాడో అతడే వైదికుడు. అతడే పుణ్యాత్ముడు. అతడే ధన్యుడు. అతడే పండితుడు.

భవంతి వివిధా ధర్మాస్తేషాం సద్యః ఫలోన్ముఖాః ।
యేషాం భవతి విశ్వాసశ్శివనామ జపే మునే ॥26॥

ఓ మహర్షీ! శివనామం జపించటంలో విశ్వాసం కల మానవులు ఆచరించే వివిధధర్మాలు వెనువెంటనే ఫలాలను ఇవ్వగల సమర్థవంతమైనవి.

పాతకాని వినశ్యంతి యావంతి శివనామతః ।
భువి తావంతి పాపాని క్రియన్తే న నరైర్మునే ॥27॥

ఓ మహర్షీ! శివనామం వల్ల ఎన్నిపాపాలు నశిస్తాయో అన్ని పాపాలను భూలోకంలోని మానవులు చేయరు.

బ్రహ్మహత్యాది పాపానాం రాశీ న ప్రతిమాన్మునే ।
శివనామద్రుతం ప్రోక్తం నాశయత్యఖిలాన్నరైః ॥28॥

ఓ మహర్షీ! మానవులు శివనామం అనుకున్న వెంటనే బ్రహ్మహత్య మొదలైన పాపాల సాటిలేని రాశులు నశిస్తాయి.

శివనామతరీం ప్రాప్య సంసారాబ్ధిం తరంతి యే ।
సంసారమూలపాపాని తాని నశ్యంత్యసంశయమ్ ॥29॥

శివనామం అనే పడవతో సంసారమనే సముద్రాన్ని దాటే వాళ్ల యొక్క సంసారకారణపాపాలన్నీ నశిస్తాయనటంలో సందేహం లేదు.

సంసారమూలభూతానాం పాతకానాం మహామునే ।
శివనామకుఠారేణ వినాశో జాయతే ధ్రువమ్ ॥30॥

ఓ మహర్షీ! సంసారానికి మూలమైన పాపాలు శివనామం అనే గొడ్డలితో తప్పకుండా నాశనం అవుతాయి.

శివనామామృతం పేయం పాపదావానలార్దితైః ।
పాపదావాగ్నితప్తానాం శాంతిస్తేన వినా న హి ॥31॥

పాపమనే దావాగ్నిచే పీడింపబడిన మనుష్యులు శివనామం అనే అమృతాన్ని తాగాలి. పాపమనే దావాగ్నిచే సంతృప్తి చెందని వారికి శివనామం లేక పోతే శాంతి లేదు.

శివేతి నామ పీయూషవర్షధారాపరిప్లుతాః ।
సంసారదవమధ్యేఽపి న శోచంతి కదాచన ॥32॥

శివనామం అనే అమృతవర్షధారలతో తడిసిన మానవులు సంసారమనే దావాగ్ని మధ్యలోనైన ఏనాడు దుఃఖమును పొందరు.

శివనామ్ని మహద్భక్తిర్జాతా యేషాం మహాత్మనామ్ ।
తద్విధానం తు సహసా ముక్తిర్భవతి సర్వథా ॥33॥

శివనామమునందు గొప్పభక్తి కలిగిన మహాత్ములకు ముక్తి వెంటనే లభిస్తుంది.

అనేకజన్మభిర్యేన తపస్తప్తం మునీశ్వర ।
శివనామ్ని భవేద్భక్తిస్సర్వపాపాపహారిణీ ॥34॥

ఓ మునీశ్వరా! అనేక జన్మలు తపస్సు చేసిన వానికి పాపాలన్నింటినీ పోగొట్టే శివనామమునందు భక్తి కుదురుతుంది.

యస్యాసాధారణం శంభునామ్ని భక్తిరఖండితా ।
తస్యైవ మోక్షస్సులభో నాన్యస్యేతి మతిర్మమ ॥35॥

ఎవడికి శివనామంలో అతిశయించిన నిరంతరభక్తి కుదురుతుందో వాడికి మాత్రమే మోక్షం సులభమని, ఇతరులకు చాలా కష్టమని అనగా దొరకనిదని నా అభిప్రాయం.

కృత్వాప్యనేకపాపాని శివనామ జపాదరః ।
సర్వపాపవినిర్ముక్తో భవత్యేవ న సంశయః ॥36॥

అనేకపాపాలు చేసిన వాడైనా, శివజపమునందు ఆదరం కల వాడైతే అతడు పాపాలన్నింటినుండి విముక్తుడౌతాడనటంలో సందేహం లేదు.

భవంతి భస్మసాద్వృక్షాదవదగ్ధా యథా వనే ।
తథా తావంతి దగ్ధాని పాపాని శివనామతః ॥37॥

అడవిలోని చెట్లు దావాగ్నికి భస్మమైనట్లు, పాపాలన్నీ శివనామం వల్ల దగ్ధమౌతాయి.

యో నిత్యం భస్మపూతాంగశ్శివనామజపాదరః ।
సంతరత్యేవ సంసారం సుఘోరమపి శౌనక ॥38॥

ఓ శౌనకా! నిత్యం విభూతిని ధరించి, ఆదరంతో శివనామాన్ని జపించే వ్యక్తి ఘోరమైన సంసారసముద్రాన్ని తప్పకుండా దాటగలడు.

బ్రహ్మస్వహరణం కృత్వా హత్వాపి బ్రాహ్మణాన్ బహూన్ ।
న లిప్యతే నరః పాపైశ్శివనామజపాదరః ॥39॥

బ్రాహ్మణుల ధనాన్ని అపహరించటం, అనేక బ్రాహ్మణులను చంపటం, ఇటువంటి పాపాలు శివనామాన్ని ఆదరంతో జపించే వాడిని అంటుకోవు.

విలోక్య వేదానఖిలాన్ శివనామ జపః పరమ్ ।
సంసారతారణోపాయ ఇతి పూర్వైర్వినిశ్చితః ॥40॥

పూర్వవిద్వాంసులు వేదాలన్నింటినీ పరిశీలించి, శివనామజపం సంసారాన్ని తరింప చేసే గొప్ప ఉపాయమని తేల్చి చెప్పారు.

కిం బహూక్త్యా మునిశ్రేష్ఠాః శ్లోకేనైకేన వచ్మ్యహమ్ ।
శివనామ్నో మహిమానం సర్వపాపాపహారిణమ్ ॥41॥

ఓ మునిశ్రేష్ఠులారా! ఎక్కువ మాటల వల్ల లాభం ఏమి? పాపాలన్నింటినీ హరించే శివనామం యొక్క మహిమను ఒకే శ్లోకంలో నేను చెప్తాను.

పాపానాం హరణే శంభోర్నామ్నశ్శక్తిర్హి పావనీ ।
శక్నోతి పాతకం తావత్కర్తుం నాపి నరః క్వచిత్ ॥42॥

శివనామం ఎన్ని పాపములను హరించి పావనం చేయగలదో అన్ని పాపాలను మానవుడు ఎక్కడైననూ చేయలేడు.

శివనామప్రభావేన లేభే సద్గతిముత్తమామ్ ।
ఇంద్రద్యుమ్ననృపః పూర్వం మహాపాపః పురా మునే ॥43॥

ఓ మహర్షీ! పూర్వం మహాపాపి అయిన ఇంద్రద్యుమ్నమహారాజు శివనామప్రభావంతో పుణ్యలోకాన్ని పొందాడు.

తథా కాచిత్ ద్విజాయోషాఽసౌ మునే బహుపాపినీ ।
శివనామ ప్రభావేణ లేభే సద్గతిముత్తమామ్ ॥44॥

మరియు ఓ మహర్షీ! అనేకమైన పాపాలు చేసిన ఒక బ్రాహ్మణస్త్రీ శివనామమహిమ వల్ల ఉత్తమగతిని పొందింది.

ఇత్యుక్తం వో ద్విజశ్రేష్ఠా నామమాహాత్మ్యముత్తమమ్ ।
శృణుధ్వం భస్మమాహాత్మ్యం సర్వపావనపావనమ్ ॥45॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! ఇంతవరకు మీకు నామమహిమను చెప్పాను. పవిత్రాన్ని కూడా పవిత్రం చేసే భస్మమహిమను వినండి.

ఇతి శ్రీశివమహాపురాణే విద్యేశ్వరసంహితాయాం సాధ్యసాధనఖండే శివనామమాహాత్మ్య వర్ణనం నామ త్రయోవింశోఽధ్యాయః ॥23॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు సాధ్యసాధనఖండంలో శివనామమాహాత్మ్యవర్ణనం అను పేరు గల ఇరవై మూడవ అధ్యాయం సమాప్తం.

చతుర్వింశోఽధ్యాయః - ఇరవై నాల్గవ అధ్యాయం

భస్మధారణవర్ణనమ్ - భస్మధారణ వర్ణనం

సూత ఉవాచ - సూతుడు ఇలా చెప్పాడు.

ద్వివిధం భస్మసంప్రోక్తం సర్వమంగలమిదం పరమ్ ।
తత్ప్రకారమహం వక్ష్యే సావధానతయా శృణు ॥1॥

భస్మం అన్ని మంగళాలను ఇస్తుంది. ఉత్తమమైంది. అది రెండువిధాలుగా ఉంది. ఆ వివరాలు చెప్తాను. శ్రద్ధగా వినండి.

ఏకం జ్ఞేయం మహాభస్మ ద్వితీయం స్వల్పసంజ్ఞకమ్ ।
మహాభస్మ ఇతిప్రోక్తం భస్మ నానావిధం పరమ్ ॥2॥

భస్మం మహాభస్మం, స్వల్పభస్మం అని రెండురకాలుగా ఉంది. మహాభస్మంలో మరలా భేదాలున్నాయి.

తద్భస్మ త్రివిధం ప్రోక్తం శ్రౌతం స్మార్తం చ లౌకికమ్ ।
భస్మైవ స్వల్పసంజ్ఞో వై బహుధా పరికీర్తితమ్ ॥3॥

మహాభస్మం శ్రౌతం, స్మార్తం, లౌకికం అని మూడురకాలుగా ఉంది. స్వల్పభస్మంలో కూడా అనేక భేదాలున్నాయి.

శ్రౌతం భస్మ తథా స్మార్తం ద్విజానామేవ కీర్తితమ్ ।
అన్యేషామపి సర్వేషామపరం భస్మలౌకికమ్ ॥4॥

శ్రౌత, స్మార్త, భస్మాలను బ్రాహ్మణులు మాత్రమే ధరించాలి. ఇతరులందరూ లౌకికభస్మం ధరించాలని చెప్పబడింది.

ధారణం మంత్రతః ప్రోక్తం ద్విజానాం మునిపుంగవైః ।
కేవలం ధారణం జ్ఞేయమన్యేషాం మంత్రవర్జితమ్ ॥5॥

బ్రాహ్మణులు మంత్రపూర్వకంగానూ, ఇతరులు మంత్రం లేకుండా భస్మాన్ని ధరించాలని మహర్షులు చెప్పారు.

ఆగ్నేయముచ్యతే భస్మ దగ్ధగోమయసంభవమ్ ।
తదపి ద్రవ్యమిత్యుక్తం త్రిపుండ్రస్య మహామునే ॥6॥

ఓ మహర్షీ! గోమయమును కాల్చగా వచ్చిన భస్మానికి ఆగ్నేయభస్మమని పేరు. అది త్రిపుండ్రానికి యోగ్యమైన భస్మమని చెప్పబడింది.

అగ్నిహోత్రోత్థితం భస్మ సంగ్రాహ్యం వా మనీషిభిః ।
అన్యయజ్ఞోత్థితం వాపి త్రిపుండ్రస్య చ ధారణే ॥7॥

విద్వాంసులు అగ్నిహోత్రంలోని భస్మాన్ని గాని, ఇతరయజ్ఞాలలో దొరికే భస్మాన్ని కాని జాగ్రత్త పెట్టుకొని, దానిని త్రిపుండ్రధారణం కోసం ఉపయోగించాలి.

అగ్నిరిత్యాదిభిర్మంత్రైర్జాబాలోపనిషద్గతైః ।
సప్తభిర్ధూలనం కార్యం భస్మనా సజలేన చ ॥8॥

జాబాలోపనిషత్తులో "అగ్నిః" మొదలైన ఏడుమంత్రాలను ఉచ్చరిస్తూ భస్మాన్ని నీటితో కలిపి, శరీర అవయవాలయందు ధరించాలి.

వర్ణానామాశ్రమాణాం చ మంత్రతోఽమంత్రో పి చ ।
త్రిపుండ్రోద్ధూలనం ప్రోక్తం జాబాలైరాదరేణ చ ॥9॥

అన్ని వర్ణాల వారు, ఆశ్రమాల వారు మంత్రంతో కాని, మంత్రం లేకుండా కాని, భస్మాన్ని శరీర అవయవాలయందు త్రిపుండ్రంగా నుదుటి మీద శ్రద్ధతో ధరించాలని జాబాలఋషి యొక్క అనుయాయులు చెప్పారు.

భస్మనోద్ధూలనం చైవ యథా తిర్యక్ త్రిపుండ్రకమ్ ।
ప్రమాదాదపి మోక్షార్థీ న త్యజేదితి విశ్రుతిః ॥10॥

మోక్షాన్ని కోరేవాడు శరీరావయవాలయందు భస్మధారణాన్ని, నుదుటియందు అడ్డంగా భస్మంతో త్రిపుండ్రధారణాన్ని పొరపాటునైనా విడిచిపెట్టరాదని వేదాలు చెప్పుచున్నాయి.

శివేన విష్ణునా చైవ తథా తిర్యక్ త్రిపుండ్రకమ్ ।
ఉమాదేవీ చ లక్ష్మీశ్చ వాచాన్యాభిశ్చ నిత్యశః ॥11॥

శివుడు, విష్ణువు, ఉమాదేవి, లక్ష్మి, సరస్వతి మరియు ఇతర దేవతలు నిత్యం నుదుటిమీద అడ్డంగా త్రిపుండ్రాన్ని ధరిస్తారు.

బ్రాహ్మణైః క్షత్రియైర్వైశ్యైశ్శూద్రైరపి చ సంకరైః ।
అపభ్రంశైర్ధృతం భస్మ త్రిపుండ్రోద్ధూలనాత్మనా ॥12॥

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులేకాక, మానవులందరూ భస్మాన్ని శరీరావయవములందు, నుదుటిపై త్రిపుద్రంగా ధరించాలి.

ఉద్ధూలనం త్రిపుండ్రం చ శ్రద్ధయా నాచరన్తి యే ।
తేషాం నాస్తి సమాచారో వర్ణాశ్రమసమన్వితః ॥13॥

ఉద్ధూలన చేయని, అనగా శరీర అవయవాలయందు భస్మాన్ని ధరించని, త్రిపుండ్రాలను శ్రద్ధగా ధరించనివాళ్లకి వర్ణాశ్రమధర్మాలు సిద్ధించవు.

ఉద్ధూలనం త్రిపుండ్రం చ శ్రద్ధయా నాచరంతి యే ।
తేషాం నాస్తి వినిర్ముక్తిస్సంసారాజ్జన్మకోటిభిః ॥14॥

ఉద్ధూలన, త్రిపుండ్రాలను శ్రద్ధగా ధరించని వారికి, కోటిజన్మలు ఎత్తిననూ సంసారం నుండి విముక్తి కలుగదు.

ఉద్ధూలనం త్రిపుండ్రం చ శ్రద్ధయా నాచరంతి యే ।
తేషాం నాస్తి శివజ్ఞానం కల్పకోటిశతైరపి ॥15॥

ఉద్ధూలన, త్రిపుండ్రాలను శ్రద్ధగా ధరించని వారికి వందలకోట్ల కల్పాల తర్వాత కూడా శివజ్ఞానం కలగదు.

ఉద్ధూలనం త్రిపుండ్రం చ శ్రద్ధయా నాచరంతి యే ।
తే మహాపాతకైర్యుక్తా ఇతి శాస్త్రీయనిర్ణయః ॥16॥

ఉద్ధూలన, త్రిపుండ్రాలను ఎవరైతే శ్రద్ధగా ఆచరించరో వారు మహాపాపులని శాస్త్రనిర్ణయం.

ఉద్ధూలనం త్రిపుండ్రం చ శ్రద్ధయా నాచరంతి యే ।
తేషామాచరితం సర్వం విపరీతఫలాయ హి ॥17॥

ఉద్ధూలన, త్రిపుండ్రాలను ఎవరైతే శ్రద్ధగా ఆచరించరో వారు చేసే అన్ని కర్మలు విపరీత ఫలాలనిస్తాయి.

మహాపాతకయుక్తానాం జంతూనాం శర్వవిద్విషామ్ ।
త్రిపుండ్రోద్ధూలనద్వేషో జాయతే సుదృఢం మునే ॥18॥

ఓ మహర్షీ! శివుని ద్వేషించే మహాపాపులకు భస్మముతో ఉద్ధూలన, త్రిపుండ్రాలు ధరించటంలో దృఢమైన ద్వేషం కలుగుతుంది.

శివాగ్నికార్యం యః కృత్వా కుర్యాత్త్రియాయుషాత్మవిత్ ।
ముచ్యతే సర్వపాపైస్తు స్పృష్టేన భస్మనా నరః ॥19॥

ఆత్మవేత్త అయిన భక్తుడు త్రియాయుషాది మంత్రాలతో శివాగ్నికార్యాన్ని చేసి, సర్వపాపాల నుండి విముక్తుడవటమే కాక, ఆ అగ్నియొక్క భస్మాన్ని ముట్టుకున్న మానవుడు పాపాలనుండి బయటపడతాడు.

సితేన భస్మనా కుర్యాత్ త్రిసంధ్యం యస్త్రిపుండ్రకమ్ ।
సర్వపాపవినిర్ముక్తః శివేన సహ మోదతే ॥20॥

మూడువేళలా తెల్లని భస్మంతో త్రిపుండ్రాన్ని ధరించే భక్తుడు పాపాలన్నింటి నుండి బయటపడి, శివునితో కలసి ఆనందిస్తాడు.

సితేన భస్మనా కుర్యాల్లలాటే తు త్రిపుండ్రకమ్ ।
యోஉసావనాదిభూతాన్ హి లోకానాప్తో మృతో భవేత్ ॥21॥

తెల్లనిభస్మంతో త్రిపుండ్రాన్ని ధరించిన భక్తుడు మరణించిన తర్వాత శాశ్వతలోకాన్ని పొందుతాడు.

అకృత్వా భస్మనా స్నానం న జపేద్వై షడక్షరమ్ ।
త్రిపుండ్రం చ రచిత్వా తు విధినా భస్మనా జపేత్ ॥22॥

భస్మాన్ని ధరించకుండా "ఓం నమశ్శివాయ" మంత్రాన్ని జపించకూడదు. భస్మంతో త్రిపుండ్రాన్ని యథావిధిగా ధరించి మంత్రాన్ని జపించాలి.

అదయో వాధమో వాపి సర్వపాపాన్వితోஉపి వా ।
ఉపః పాపాన్వితో వాపి మూర్ఖో వా పతితోஉపి వా ॥23॥

దయ లేని వాడు, అధముడు, అన్ని పాపాలను చేసిన వాడు, ఉపపాపాలను చేసేవాడు మూర్ఖుడు, పతితుడు అయినప్పటికీ..........

యస్మిన్ దేశే వసేన్నిత్యం భూతిశాసనసంయుతః ।
సర్వతీర్థైశ్చ క్రతుభిః సాన్నిధ్యం క్రియతే సదా ॥24॥

విభూతి ధరించి ఏ స్థానంలో నివసిస్తాడో అక్కడ అన్నితీర్థాలు, క్రతువులు అతని సన్నిధిలో ఉంటాయి.

త్రిపుండ్రం సహితో జీవః పూజ్యస్సర్వైస్సురాసురైః ।
పాపాన్వితోஉపి శుద్ధాత్మా కిం పునః శ్రద్ధయా యుతః ॥25॥

త్రిపుండ్రం ధరించే జీవుడు పాపాత్ముడైనప్పటికీ దేవతలచే, రాక్షసులచే, అందరిచే పూజింపబడతాడు. శ్రద్ధ కలిగిన ధర్మాత్మునిగురించి చెప్పేదేముంది?

యస్మిన్ దేశే శివజ్ఞానీ భూతిశాసనసంయుతః ।
గతో యదృచ్ఛయాద్యాపి తస్మింస్తీర్థాస్సమాగతాః ॥26॥

ఏ ప్రదేశంలో శివభక్తుడు విభూతి ధరించి ఉంటాడో అక్కడ అనుకోకుండానే అన్ని తీర్థాలు వచ్చి చేరుతాయి.

బహునాత్ర కిముక్తేన ధార్యం భస్మ సదా బుధైః ।
లింగార్చనం సదా కార్యం జప్యో మంత్రః షడక్షరః ॥27॥

ఈ విషయంలో ఎక్కువగా చెప్పడం ఎందుకు? విద్వాంసులు సదా భస్మాన్ని ధరించాలి. లింగార్చన చేయాలి. ఓం నమశ్శివాయ మంత్రాన్ని జపించాలి.

బ్రహ్మణా విష్ణునా వాపి రుద్రేణ మునిభిస్సురైః ।
భస్మధారణమాహాత్మ్యం న శక్యం పరిభాషితుమ్ ॥28॥

బ్రహ్మ, విష్ణు, రుద్రుడు, మునులు మరియు దేవతలు కూడా భస్మధారణమహిమను వర్ణించలేరు.

ఇతి వర్ణాశ్రమాచారో లుప్తవర్ణక్రియోఽపి చ ।
పాపాత్సకృత్త్రిపుండ్రస్య ధారణాత్సోఽపి ముచ్యతే ॥29॥

వర్ణాశ్రమాలను పాటించే వాడు కాని, పాటించని వాడు కాని, ఒక్కసారి త్రిపుండ్రాన్ని పెట్టుకుంటే పాపము నుండి బయట పడతాడు.

యే భస్మధారణం త్యక్త్వా కర్మ కుర్వన్తి మానవాః ।
తేషాం నాస్తి వినిర్మోక్షస్సంసారాజ్జన్మకోటిభిః ॥30॥

భస్మధారణను విడిచి పెట్టి, కర్మను చేయు మానవులకు కోటిజన్మలు ఎత్తిననూ సంసారం నుండి విముక్తి కలగదు.

తేనాధీతం గురోస్సర్వం తే సర్వమనుష్ఠితమ్ ।
యేన విప్రేణ శిరసి త్రిపుండ్రం భస్మనా కృతమ్ ॥31॥

ఏ బ్రాహ్మణుడైతే నుదుటియందు భస్మముతో త్రిపుండ్రాన్ని ధరిస్తాడో అతడే గురువు దగ్గర అన్నింటిని చదివినట్లు, అన్నికర్మలను అనుష్ఠించినట్లవుతుంది.

యే భస్మధారిణం దృష్ట్వా నరాః కుర్వంతి తాడనమ్ ।
తేషాం చండాలతో జన్మ బ్రహ్మన్నూహ్యం విపశ్చితా ॥32॥

ఓ మహర్షీ! భస్మాన్ని ధరించిన వ్యక్తిని అవమానించే మానవులకు అతినీచమైన జన్మలు లభిస్తాయని తెలుసుకోవాలి.

మానస్తోకేన మంత్రేణ మంత్రితం భస్మ ధారయేత్ ।
బ్రాహ్మణః క్షత్రియశ్చైవ ప్రోక్తేష్వంగేషు భక్తిమాన్ ॥33॥

బ్రాహ్మణులు, క్షత్రియులు “మానస్తోకే తనయే” అనే మంత్రంతో భస్మాన్ని మంత్రించి, భక్తితో ప్రత్యేకమైన అవయవములందు ధరించాలి.

వైశ్యస్త్రియంబకేనైవ శూద్రః పంచాక్షరేణ తు ।
అన్యేషాం విధవాస్త్రీణాం విధిః ప్రోక్తశ్చ శూద్రవత్ ॥34॥

వైశ్యుడు త్ర్యంబకమంత్రంతోనూ, శూద్రుడు పంచాక్షరీమంత్రంతోనూ భస్మాన్ని ధరించాలి. ఇతరులు, భర్తలు లేని స్త్రీలు పంచాక్షరీతో ధరించాలని విధిగా చెప్పబడింది.

పంచబ్రహ్మాదిమనుభిర్గృహస్థస్య విధీయతే ।
త్రయంబకేన మనునా విధిర్వై బ్రహ్మచారిణః ॥35॥

అఘోరేణాథ మనునా విపినస్థవిధిః స్మృతః ।
యతిస్తు ప్రణవేనైవ త్రిపుండ్రాదీని కారయేత్ ॥36॥

గృహస్థుడు బ్రహ్మాది అయిదుమంత్రాలతో, బ్రహ్మచారి త్ర్యంబకమంత్రంతో వానప్రస్థుడు అఘోరమంత్రంతో, సన్యాసి ఓంకారంతో త్రిపుండ్రాన్ని ధరించాలని ఋషులు చెప్పారు.

అతివర్ణాశ్రమీ నిత్యం శివోఽహం భావనాత్పరాత్ ।
శివయోగీ చ నియతమీశానేనాపి ధారయేత్ ॥37॥

సర్వకాలములయందు "శివుడను నేనే" అను పరమభావన వలన వర్ణాశ్రమాలకు అతీతుడైన శివయోగి తప్పనిసరిగా ఈశానమంత్రంతో భస్మాన్ని ధరించాలి.

న త్యాజ్యం సర్వవర్ణైశ్చ భస్మధారణముత్తమమ్ ।
అన్యైరపి యథా జీవైస్సదేతి శివశాసనమ్ ॥38॥

సర్వవర్ణముల వాళ్లే కాక, సర్వమానవులు ఏనాడు ఉత్తమమైన భస్మధారణను మానరాదని శివుని ఆజ్ఞ.

భస్మస్నానేన యావంతః కణాస్స్వాంగే ప్రతిష్ఠితాః ।
తావంతి శివలింగాని తనౌ ధత్తే హి ధారకః ॥39॥

భస్మస్నానంతో ఎన్ని భస్మకణాలు దేహాన్ని అంటుకుంటాయో అన్ని శివలింగాలను భక్తుడు తన దేహంలో ధరించినట్లు అవుతుంది.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాశ్శూద్రాశ్చాపి చ సంకరాః ।
స్త్రియోఽథ విధవా బాలాః ప్రాప్తాః పాఖండినస్తథా ॥40॥

బ్రహ్మచారీ గృహీ వన్యః సన్న్యాసీ వా వ్రతీ తథా ।
నార్యో భస్మత్రిపుండ్రాంకా ముక్తా ఏవ న సంశయః ॥41॥

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు, ఇతరులు, స్త్రీలు, భర్తలేని స్త్రీలు, కన్యలు, పాపాత్ములు మరియు బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు, సన్న్యాసి, వ్రతదీక్షయందున్న వాడు స్త్రీలు త్రిపుండ్రాన్ని ధరిస్తే ముక్తులవుతారనటంలో సందేహం లేదు.

జ్ఞానాజ్ఞానధృతో వాపి వహ్నిదాహసమో యథా ।
జ్ఞానాజ్ఞానధృతం భస్మ పావయేత్సకలం నరమ్ ॥42॥

తెలిసి ముట్టుకున్నా, తెలియక ముట్టుకున్నా నిప్పు సమంగా కాలుస్తుంది. అలాగే తెలిసి కాని, తెలియక కాని భస్మాన్ని ధరిస్తే అది ఆ వ్యక్తిని పూర్ణపవిత్రుణ్ణి చేస్తుంది.

నాశ్నీయాజ్జలమన్నమల్పమపి వా భస్మాక్షధృత్యా వినా ।
భుక్త్వా వాథ గృహీ వనీపతియతిర్వర్ణీ తథా సంకరః ॥
ఏనోభుజ్ నరకం ప్రయాతి స తదా గాయత్రిజాపేన తత్
వర్ణానాం తు యతేఽస్తు ముఖ్యప్రణవా జాపేన ముక్తం భవేత్ ॥43॥

భస్మాన్ని, రుద్రాక్షను ధరించకుండా నీళ్లు త్రాగకూడదు. కొంచెం అయినా తినకూడదు. గృహస్థుడు, వానప్రస్థుడు, సన్యాసి, నాలుగువర్ణాల వారు లేక ఇతరులు ఎవరైనా గాని, ఆ విధంగా చేస్తే పాపాన్ని భుజించినట్లు అవుతుంది. అట్టి వాడు నరకాన్ని పొందుతాడు. గాయత్రీజపం చేస్తే ఆ పాపం తొలగిపోతుంది. సన్యాసి అయితే ప్రణవాన్ని జపించాలి

త్రిపుండ్రం యే వినిందంతి నిందంతి శివమేవ తే ।
ధారయంతి చ యే భక్త్యా ధారయంతి తమేవ తే ॥44॥

త్రిపుండ్రాన్ని నిందిస్తే వారు శివుణ్ణి నిందించినట్లవుతుంది. దానిని భక్తితో ధరిస్తే శివుణ్ణి ధరించినట్లవుతుంది.

ధిగ్భస్మరహితం ఫాలం ధిగ్గ్రామమశివాలయమ్ ।
ధిగనీశార్చనం జన్మ ధిగ్విద్యామశివాశ్రయామ్ ॥45॥

భస్మం ధరించని నుదుటి భాగం, శివాలయం లేని గ్రామం, శివుని పూజించని జన్మ మరియు శివసంబంధం లేని విద్యలు నిందనీయాలు.

యే నిందంతి మహేశ్వరం త్రిజగతామాధారభూతం హరం
యే నిందంతి త్రిపుండ్రధారణకరం దోషస్తు తద్దర్శనే ।
తే వై సంకరసూకరాసురఖరశ్వక్రోష్టుకీటోపమా
జాతా ఏవ భవంతి పాపపరమాస్తే నారకాః కేవలమ్ ॥46॥

మూడులోకాలకు ఆధారభూతమైన, పాపహరుడైన మహేశ్వరుణ్ణి, త్రిపుండ్రం ధరించిన వాణ్ణి ఎవరు దూషిస్తారో అట్టి వారిని చూసిన దోషం కలుగుతుంది. ఆ పాపాత్ములు నరకాన్ని అనుభవించి, పంది, రాక్షసుడు, గాడిద, కుక్క, నక్క, కీటకం మొదలైన జన్మలను పొందుతారు.

తే దృష్ట్వా శశిభాస్కరౌ నిశి దినే స్వప్నేఽపి నో కేవలం
పశ్యంతు శ్రుతిరుద్రసూక్త జపతో ముచ్యేత తేనాద్రుతాః ।
సత్సంభాషణతో భవేద్ధి నరకం నిస్తారవానాస్థితం
యే భస్మాది విధారణం హి పురుషం నిందంతి మందా హి తే ॥47॥

వారు పగలు సూర్యుణ్ణి, రాత్రి, చంద్రుణ్ణి చూడలేని గ్రుడ్డివారితో సమానం. వారు కలలోనైననూ రుద్రసూక్తాన్ని జపిస్తే అది వారిని రక్షించి మోక్షాన్నిస్తుంది. మంచివారితో మాట్లాడు మానవుడు నరకాన్ని దాటగలడు. భస్మాన్ని ధరించిన మనుషులను నిందించిన వారు మూర్ఖులు.

న తాంత్రికస్త్వధికృతో నోర్ధ్వపుండ్రధరో మునే ।
సంతప్తచక్రచిహ్నోఽత్ర శివయజ్ఞే బహిష్కృతః ॥48॥

ఓ మహర్షీ! తాంత్రికవిద్య తెలిసిన వానికి, ఊర్ధ్వపుండ్రాన్ని ధరించే వానికి, కాల్చిన ఇనుముతో శరీరముపై చక్రం వేసుకున్నవాళ్లకి శివయజ్ఞం నందు అధికారం లేదు కాబట్టి వారు బహిష్కరింపబడుతారు.

తత్రైతే బహవో లోకా బృహజ్జాబాలచోదితాః ।
తే విచార్యాః ప్రయత్నేన తతో భస్మరతో భవేత్ ॥49॥

ఎందరో బృహజ్జాబాల మునిచే ప్రేరితులయ్యారు. వారి గురించి తెలుసుకొని భస్మధారణయందు ఆసక్తులు కావలెను.

యచ్చందనైశ్చందనకేపి మిశ్రం ధార్యం హి భస్మైవ త్రిపుండ్రభస్మనా ।
విభూతిఫాలోపరి కించనాపి ధార్యం సదా నో యది సంతి బుద్ధయః ॥50॥

గంధాన్ని ధరించాలనుకునే వాళ్లు దానిని భస్మంతో కలిపి త్రిపుండ్రాన్ని ధరించాలి. విభూతిని నుదుటిపై ధరించి, దానిపై మరొక పదార్థం ధరించరాదు. అలా చేసేవాళ్లు మూర్ఖులు.

స్త్రీభిస్త్రిపుండ్రమలకావధి ధారణీయం భస్మద్విజాదిభిరథో విధవాభిరేవమ్ ।
తద్వత్సదాశ్రమవతాం విశదా విభూతిః ధార్యాపవర్గఫలదా సకలాఘహంత్రీ ॥51॥

స్త్రీలు ముంగురులు ఉండుచోటు వరకు లలాటం నందు త్రిపుండ్రాన్ని ధరించాలి. బ్రాహ్మణులు, ఇతరులు మరియు భర్తలు లేని స్త్రీలు ఇదే విధంగా భస్మాన్ని ధరించాలి. భస్మం పాపాలన్నింటినీ పోగొట్టి, మోక్షఫలాన్ని ఇస్తుంది.

త్రిపుండ్రం కురుతే యస్తు భస్మనా విధిపూర్వకమ్ ।
మహాపాతకసంఘాతైర్ముచ్యతే చోపపాతకైః ॥52॥

భస్మంతో యథావిధిగా త్రిపుండ్రాన్ని ధరించిన మానవుడు మహాపాతకసమూహాల నుండి మరియు ఉపపాతకాల నుండి విముక్తిని పొందుతాడు.

బ్రహ్మచారీ గృహస్థో వా వానప్రస్థోఽథవా యతిః ।
బ్రహ్మక్షత్రాశ్చ విట్శూద్రాస్తథాన్యే పతితాధమాః ॥53॥

ఉద్ధూలనం త్రిపుండ్రం చ ధృత్వా శుద్ధా భవంతి చ ।
భస్మనో విధినా సమ్యక్ పాపరాశిం విహాయ చ ॥54॥

బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు మరియు యతి, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు మరియు పతితులు, అధములు భస్మమును శరీరావయవములందు పూసుకొని, నుదుటిపై త్రిపుండ్రాన్ని ధరిస్తే పరిశుద్ధులవుతారు. భస్మధారణం అనేది పాపరాశులను పూర్తిగా తొలగిస్తుంది.

భస్మధారీ విశేషేణ స్త్రీగోహత్యాదిపాతకైః ।
వీరహత్యాశ్వహత్యాభ్యాం ముచ్యతే నాత్ర సంశయః ॥55॥

భస్మాన్ని ధరించే భక్తుడు స్త్రీహత్య, గోహత్య, వీరపురుషహత్య, గుఱ్ఱాన్ని హత్య చేయడం వంటి పాపాల నుండి విముక్తుడవుతాడు. సందేహం లేదు.

పరద్రవ్యాపహరణం పరదారాభిమర్శనమ్ ।
పరనిందా పరక్షేత్రహరణం పరపీడనమ్ ॥56॥

సస్యారామాదిహరణం గృహదాహాదికర్మ చ ।
గోహిరణ్యమహిష్యాదితిలకంబలవాససామ్ ॥57॥

అన్నధాన్యజలాదీనాం నీచేభ్యశ్చ పరిగ్రహః ।
దశవేశ్యామతంగీషు వృషలీషు నటీషు చ ॥58॥

రజస్వలాసు కన్యాసు విధవాసు చ మైథునమ్ ।
మాంసచర్మరసాదీనాం లవణస్య చ విక్రయః ॥59॥

పైశున్యం కూటవాదశ్చ సాక్షిమిథ్యాభిలాషిణామ్ ।
ఏవమాదీన్యసంఖ్యాని పాపాని వివిధాని చ ।
సద్య ఏవ వినశ్యంతి త్రిపుండ్రస్య చ ధారణాత్ ॥60॥

ఇతరుల ధనాన్ని దొంగిలించటం, ఇతరుని భార్యను కామించటం, ఇతరులని తిట్టడం, ఇతరుల భూమిని దొంగిలించటం, ఇతరులను పీడించటం పంట, గృహాలవంటివి అపహరించుట, ఇళ్లను తగులబెట్టడం, నీచుల నుండి ఆవు, బంగారం, గేదె, నువ్వులు, కంబళి, వస్త్రం అన్నం, ధాన్యం, నీరు మొదలైనవాటిని తీసుకోవటం, వేశ్యలు, అవివాహితలు, నాట్యకత్తెలు రజస్వలలు, భర్తలు లేని స్త్రీలతో సంభోగించటం, మాంసం, చర్మం, పాదరసం, ఉప్పు మొదలైన వాటిని అమ్మటం కొండెములు చెప్పటం, కూటసాక్ష్యాన్ని చెప్పటం, చెప్పించటం మొదలగు వివిధరకాలైన లెక్కలేనన్ని పాపములు త్రిపుండ్రం ధరిస్తే వెంటనే నశిస్తాయి.

శివద్రవ్యాపహరణం శివనిందా చ కుత్రచిత్ ।
నిందా చ శివభక్తానాం ప్రాయశ్చిత్తైర్న శుద్ధ్యతి ॥61॥

శివధనాన్ని దొంగిలించటం, శివుణ్ణి నిందించటం, శివభక్తులను నిందించటం అనే పాపాలకు ప్రాయశ్చిత్తం లేదు.

రుద్రాక్షం యస్య గాత్రేషు లలాటే చ త్రిపుండ్రకమ్ ।
స చండాలోఽపి సంపూజ్యస్సర్వవర్ణోత్తమోత్తమః ॥62॥

ఎవని మెడలో రుద్రాక్ష ఉండునో, ఎవని నుదుటియందు త్రిపుండ్రం ఉండునో, వానిని ఏ వర్ణం వాడైనప్పటికి అన్నివర్ణాలలో శ్రేష్ఠమైనవానినిగా పూజించాలి.

యాని తీర్థాని లోకేఽస్మిన్ గంగాద్యాస్సరితశ్చ యాః ।
స్నాతో భవతి సర్వత్ర లలాటే యస్త్రిపుండ్రకమ్ ॥63॥

నుదుటియందు త్రిపుండ్రాన్ని ధరించే భక్తుడు ఈ లోకంలో గల గంగాది తీర్థాలన్నింటిలో స్నానం చేసిన పుణ్యాన్ని పొందుతాడు.

సప్తకోటిమహామంత్రాః పంచాక్షరపురస్సరాః ।
తథాన్యే కోటిశో మంత్రాశ్శైవకైవల్యహేతవః ॥64॥

అన్యే మంత్రాశ్చ దేవానాం సర్వసౌఖ్యకరా మునే ।
తే సర్వే తస్య వశ్యాస్స్యుర్యో బిభర్తి త్రిపుండ్రకమ్ ॥65॥

ఓ మహర్షీ! పంచాక్షరి ఇత్యాది ఏడుకోట్ల మహామంత్రాలు, మోక్షదాయకాలైన కోట్లాదిమంత్రాలు మరియు సుఖాలన్నింటినీ ఇచ్చే ఇతరమంత్రాలు, త్రిపుండ్రం ధరించువారికి వశమౌతాయి.

సహస్రం పూర్వజాతానాం సహస్రం జనయిష్యతామ్ ।
స్వవంశజానాం జ్ఞాతీనాముద్ధరేద్యస్త్రిపుండ్రకృత్ ॥66॥

త్రిపుండ్రాన్ని ధరించే వాడు తన వంశంలో వేయిపూర్వతరాలకు, రాబోవు వేయిభవిష్యత్తరాలకు చెందిన తన వంశములో పుట్టిన జ్ఞాతులను ఉద్ధరిస్తాడు.

ఇహ భుక్త్వాఖిలాన్ భోగాన్ దీర్ఘాయుర్వ్యాధివర్జితః ।
జీవితాంతే చ మరణం సుఖేనైవ ప్రపద్యతే ॥67॥

అట్టి వాడు ఈ లోకంలో దీర్ఘాయువును కల్గి, వ్యాధులు లేని వాడై, భోగాలన్నింటినీ అనుభవించి, ఆయుర్దాయం పూర్తయిన తర్వాత అనాయాసమరణాన్ని పొందుతాడు.

అష్టైశ్వర్యగుణోపేతం ప్రాప్య దివ్యవపుశ్శివమ్ ।
దివ్యం విమానమారుహ్య దివ్యత్రిదశసేవితమ్ ॥68॥

తర్వాత ఆ భక్తుడు అష్టైశ్వర్య గుణాలతో కూడిన మంగళకరమైన దివ్యదేహాన్ని పొంది, దేవతావిమానాన్ని ఎక్కి దేవతలచే సేవించబడతాడు.

విద్యాధరాణాం సర్వేషాం గంధర్వాణాం మహౌజసామ్ ।
ఇంద్రాదిలోకపాలానాం లోకేషు చ యథాక్రమమ్ ॥69॥

భుక్త్వా భోగాన్ సువిపులాన్ ప్రజేశానాం పదేషు చ ।
బ్రహ్మణః పదమాసాద్య తత్ర కన్యాశతం రమేత్ ॥70॥

విద్యాధరులు, గంధర్వులు, తేజస్వంతులైన ఇంద్రుడు మొదలగు దిక్పాలకుల లోకములయందు క్రమంగా దేవతలలోకంలో వరుసగా ఎక్కువగా భోగాలను అనుభవించి, ప్రజాపతులలోకం పొందుతాడు. అతడు బ్రహ్మలోకాన్ని పొంది వందమంది కన్యలతో రమిస్తాడు.

తత్ర బ్రహ్మాయుషో మానం భుక్త్వా భోగాననేకశః ।
విష్ణోర్లోకే లభేద్భోగం యావద్బ్రహ్మశతాత్యయః ॥71॥

అక్కడ బ్రహ్మయొక్క ఆయుర్దాయానికి సమమైన కాలం భోగాలు అనుభవించి విష్ణులోకాన్ని పొంది, వందబ్రహ్మలు గతించు వరకు భోగాలను పొందుతాడు.

శివలోకం తతః ప్రాప్య లబ్ధ్వేష్టం కామమక్షయమ్ ।
శివసాయుజ్యమాప్నోతి సంశయో నాత్ర జాయతే ॥72॥

తర్వాత శివలోకాన్ని పొంది, క్షయంకాని కోరికలను అనుభవించి శివసాయుజ్యాన్ని పొందుతాడు. దీనిలో సందేహం లేదు.

సర్వోపనిషదాం సారం సమాలోక్య ముహుర్ముహుః ।
ఇదమేవ హి నిర్ణీతం పరం శ్రేయస్త్రిపుండ్రకమ్ ॥73॥

ఉపనిషత్తులన్నింటినీ అనేకసార్లు పరిశీలించాక త్రిపుండ్రం సర్వశ్రేష్ఠమైన శ్రేయస్సాధనంగా వాటిసారంగా నిర్ణయింపబడింది.

విభూతిం నిందతే యో వై బ్రాహ్మణః సోఽన్యజాతకః ।
యాతి చ నరకే ఘోరే యావద్బ్రహ్మా చతుర్ముఖః ॥74॥

బ్రాహ్మణుడు గాని ఇతరుడు గాని విభూతిని నిందిస్తే, చతుర్ముఖబ్రహ్మ ఉన్నంతకాలం ఘోరనరకంలో ఉంటాడు.

శ్రాద్ధే యజ్ఞే జపే హోమే వైశ్వదేవే సురార్చనే ।
ధృతత్రిపుండ్రః పూతాత్మా మృత్యుం జయతి మానవః ॥75॥

శ్రాద్ధం, యజ్ఞం, జపం, హోమం, వైశ్వదేవం, దేవపూజ అనే వాటియందు త్రిపుండ్రాన్ని ధరించిన మానవుడు పవిత్రమైన మనస్సు కలవాడై మృత్యువును జయిస్తాడు.

జలస్నానం మలత్యాగే భస్మస్నానం సదాశుచి ।
మంత్రస్నానం హరేత్పాపం జ్ఞానస్నానే పరం పదమ్ ॥76॥

కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత నీటితో స్నానం చేయాలి. భస్మస్నానం (భస్మాన్ని ధరించటం) చేసే వ్యక్తి ఎపుడూ శుచి కలవాడవుతాడు. మంత్రస్నానం పాపాన్ని పోగొడుతుంది జ్ఞానస్నానం వల్ల మోక్షమొస్తుంది.

సర్వతీర్థేషు యత్పుణ్యం సర్వతీర్థేషు యత్ ఫలమ్ ।
తత్ఫలం సమవాప్నోతి భస్మస్నానకరో నరః ॥77॥

అన్ని తీర్థాలయందు ఏ పుణ్యమొస్తుందో అన్ని తీర్థాలయందు ఏ ఫలమొస్తుందో ఆ పుణ్యఫలాన్ని భస్మస్నానం చేసిన మానవుడు పొందుతాడు.

భస్మస్నానం పరం తీర్థం గంగాస్నానం దినే దినే ।
భస్మరూపీ శివస్సాక్షాద్భస్మ త్రైలోక్యపావనమ్ ॥78॥

భస్మస్నానం పవిత్రతీర్థస్నానంతో సమానమైంది. ప్రతిరోజూ భస్మాన్ని ధరించటం వల్ల ప్రతిరోజూ గంగాస్నానం చేసిన ఫలం వస్తుంది. శివుడు స్వయంగా భస్మరూపాన్ని ధరించి ఉంటాడు. భస్మం మూడులోకాలను పవిత్రం చేస్తుంది.

న తత్ స్నానం న తద్ధ్యానం న తద్దానం జపో న సః ।
త్రిపుండ్రేన వినా యేన విప్రేణ యదనుష్ఠితమ్ ॥79॥

త్రిపుండ్రం ధరించకుండా బ్రాహ్మణుడు చేసే స్నానం స్నానం కాదు. ధ్యానం ధ్యానం కాదు. దానం దానం కాదు. జపం జపం కాదు.

వానప్రస్థస్య కన్యానాం దీక్షాహీననృణాం తథా ।
మధ్యాహ్నాత్ప్రాగ్జలైర్యుక్తం పరతో జలవర్జితమ్ ॥80॥

వానప్రస్థుడు, కన్యలు, దీక్షలు లేని మానవులు మధ్యాహ్నానికి ముందు నీటితో కలిపి, మధ్యాహ్నం తర్వాత నీరు లేకుండా భస్మాన్ని ధరించాలి.

ఏవం త్రిపుండ్రం యః కుర్యాన్నిత్యం నియతమానసః ।
శివభక్తస్స విజ్ఞేయో భుక్తిం ముక్తిం చ విందతి ॥ 81॥

ఈ విధంగా నియమంతో గూడిన మనసుతో ప్రతిరోజు త్రిపుండ్రాన్ని ధరించే మానవుడే శివభక్తుడని తెలియాలి. అతడు భుక్తిని, ముక్తిని పొందుతాడు.

యస్యాంగే నైవ రుద్రాక్ష ఏకోఽపి బహుపుణ్యదః ।
తస్య జన్మ నిరర్థస్స్యాత్ త్రిపుండ్రరహితో యది ॥82॥

గొప్పపుణ్యాన్నిచ్చే రుద్రాక్ష ఒక్కటైనను శరీరమందు లేనివానికి, త్రిపుండ్రాన్ని ధరించనివానికి వాని జన్మ వ్యర్థము.

ఏవం త్రిపుండ్రమాహాత్మ్యం సమాసాత్కథితం మయా ।
రహస్యం సర్వజంతూనాం గోపనీయమిదం త్వయా ॥83॥

ఇంతవరకు నేను త్రిపుండ్రమహిమను చెప్పాను. ఇది అందరికీ తెలిసేది కాదు. దీనిని నీవు రహస్యంగా ఉంచాలి.

తిస్రో రేఖా భవంత్యేవ స్థానేషు మునిపుంగవాః ।
లలాటాదిషు సర్వేషు యథోక్తేషు బుధైర్మునే ॥84॥

ఓ మునిశ్రేష్ఠులారా! మహర్షులచే చెప్పబడినట్లుగా లలాటము మొదలగు స్థానాలన్నింటిలో మూడురేఖలు ఉండునట్లు భస్మాన్ని ధరించాలి.

భ్రువోర్మధ్యం సమారభ్య యావదంతో భవేద్భ్రువోః ।
తావత్ప్రమాణం సంధార్యం లలాటే చ త్రిపుండ్రకమ్ ॥85॥

నుదుటి మీద, కనుబొమల మధ్య నుండి కనుబొమల చివరి వరకు త్రిపుండ్రాన్ని ధరించాలి.

మధ్యమానామికాంగుల్యా మధ్యే తు ప్రతిలోమతః ।
అంగుష్ఠేన కృతా రేఖా త్రిపుండ్రాఖ్యాభిధీయతే ॥86॥

మధ్యవేలు మరియు అనామికతో భస్మాన్ని ధరించి, ఆ రేఖలమధ్యలో విలోమముగా బొటనవేలితో మరొక రేఖను ధరిస్తే, దానిని త్రిపుండ్రం అంటారు.

మధ్యేఽంగులిభిరాదాయ తిసృభిర్భస్మ యత్నతః ।
త్రిపుండ్రం ధారయేద్భక్త్యా భుక్తిముక్తిప్రదం పరమ్ ॥87॥

మూడువేళ్లతో కూడా భస్మాన్ని త్రిపుండ్రంగా ధరించవచ్చు. భక్తితో త్రిపుండ్రం ధరించేవానికి భుక్తి, ముక్తి లభిస్తాయి.

తిసృణామపి రేఖానాం ప్రత్యేకం నవదేవతాః ।
సర్వత్రాంగేషు తా వక్ష్యే సావధానతయా శృణు ॥88॥

శరీరం అంతా ఉండే ఈ మూడురేఖలతో ప్రతిరేఖకు తొమ్మిదిమంది దేవతలు ఉన్నారు. ఆ వివరాలు చెప్తాను. శ్రద్ధగా వినండి.

అకారో గార్హపత్యాగ్నిర్భూర్ధర్మశ్చ రజోగుణః ।
ఋగ్వేదశ్చ క్రియాశక్తిః ప్రాతస్సవనమేవ చ ॥89॥

అకారము, గార్హపత్యాగ్ని, భూమి, ధర్మం, రజోగుణం. ఋగ్వేదం క్రియాశక్తి, ప్రాతస్సవనమున్ను

మహాదేవశ్చ రేఖాయాః ప్రథమాయాశ్చ దేవతాః ।
విజ్ఞేయా మునిశార్దూలాశ్శివదీక్షాపరాయణైః ॥90॥

ఓ మునిపుంగవులారా! మహాదేవుడును మొదటిరేఖకు దేవతలు అని శివదీక్షాపరాయణులు తెలిసికోవాలి.

ఉకారో దక్షిణాగ్నిశ్చ నభస్తత్త్వం యజుస్తథా ।
మధ్యందినం చ సవనమిచ్ఛా శక్త్యంతరాత్మకౌ ॥91॥

ఉకారం, దక్షిణాగ్ని, ఆకాశతత్త్వం, యజుర్వేదం, మాధ్యందినసవనము, ఇచ్ఛాశక్తి, అంతరాత్మ.........

మహేశ్వరశ్చ రేఖాయా ద్వితీయాయాశ్చ దేవతా ।
విజ్ఞేయా మునిశార్దూలాశ్శివదీక్షాపరాయణైః ॥92॥

మరియు మహేశ్వరుడు రెండవరేఖకు దేవతలని శివదీక్షాపరాయణులు తెలుసుకోవాలి.

మకారా హవనీయౌ చ పరమాత్మా తమో దివౌ ।
జ్ఞానశక్తిస్సామవేదస్తృతీయం సవనం తథా ॥93॥

ఓ మునిశ్రేష్ఠా! మకారము, ఆహవనీయం, పరమాత్మ, తమోగుణం, ద్యులోకం, జ్ఞానశక్తి, సామవేదం, మూడవ సవనం........

శివశ్చైవ చ రేఖాయాస్తృతీయాయాశ్చ దేవతా ।
విజ్ఞేయా మునిశార్దూలాశ్శివదీక్షాపరాయణైః ॥94॥

మరియు మహాదేవుడు మూడవరేఖకు దేవతలని శివదీక్షాపరాయణులు తెలసుకోవాలి.

ఏవం నిత్యం నమస్కృత్య సద్భక్త్యా స్థానదేవతాః ।
త్రిపుండ్రం ధారయేచ్ఛుద్ధో భుక్తిం ముక్తిం చ విందతి ॥95॥

ఈ విధంగా స్థానదేవతలకు నిత్యం భక్తితో నమస్కరించి, శుద్ధుడై త్రిపుండ్రాన్ని ధరించు భక్తుడు భుక్తిని, ముక్తిని పొందుతాడు.

ఇత్యుక్తాః స్థానదేవాశ్చ సర్వాంగేషు మునీశ్వర ।
తేషాం సంబంధినో భక్త్యా స్థానాని శృణు సాంప్రతమ్ ॥96॥

ఓ మునిశ్రేష్ఠా! నేను ఇంతవరకు వివిధ అవయవాల స్థానదేవతలను గురించి చెప్పాను. ఆ స్థానవివరాలు ఇపుడు చెప్తాను. భక్తితో విను.

ద్వాత్రింశత్ స్థానకే వార్ధషోడశస్థానకేఽపి చ ।
అష్టస్థానే తథా చైవ పంచస్థానేఽపి వా న్యసేత్ ॥97॥

ముప్పైరెండు, పదహారు, ఎనిమిది, లేదా అయిదుస్థానాలలో భస్మాన్ని ధరించాలి.

ఉత్తమాంగే లలాటే చ కర్ణయోర్నేత్రయోస్తథా ।
నాసావక్త్రగలేష్వేవం హస్తద్వయమతఃపరమ్ ॥98॥

తల, నుదురు, చెవులు, కళ్లు, ముక్కు, నోరు, కంఠం, రెండుచేతులు,

కూర్పరే మణిబంధే చ హృదయే పార్శ్వయోర్ద్వయోః ।
నాభౌ ముష్కద్వయే చైవమూర్వోర్గుల్ఫే చ జానుని ॥99॥

మోచేతులు, మణికట్టు, హృదయం, రెండుప్రక్కలు, నాభి, గుహ్యములు రెండు ఊరువులు (తొడలు) చీలమండలు, మోకాళ్లు,

జంఘాద్వయే పదద్వంద్వే ద్వాత్రింశత్ స్థానముత్తమమ్ ।
అగ్న్యబ్భూవాయుదిగ్దేశ దిక్పాలాన్ వసుభిస్సహ ॥100॥

రెండు పిక్కలు, రెండుపాదాలు, మొత్తం ముప్పైరెండు ఉత్తమస్థానాలలో భస్మమును ధరించాలి. నిప్పు, నీరు, భూమి, గాలి, దిక్కులు, దిక్పాలకులు మరియు ఎనమండుగురు వసువులను,

ధరాధ్రువశ్చ సోమశ్చ ఆపశ్చేవానిలోనలః ।
ప్రత్యూషశ్చ ప్రభాసశ్చ వసవోష్ట ప్రకీర్తితాః ॥101॥

ఆయా నామాలతో స్మరించి, ధర, ధృవుడు, సోముడు, జలాధిష్ఠానదేవత, నిప్పు, గాలి, ప్రత్యూషుడు, ప్రభాసుడు, అనే వారిని అష్టవసువులంటారు.

ఏతేషాం నామమాత్రేణ త్రిపుండ్రం ధారయేద్బుధాః ।
కుర్యాద్వా షోడశస్థానే త్రిపుండ్రం తు సమాహితః ॥102॥

భక్తుడు శ్రద్ధతో త్రిపుండ్రాన్ని పదహారుస్థానాలలో ధరించాలి.

శీర్షకే చ లలాటే చ కంఠే చాంసద్వయే భుజే ।
కూర్పరే మణిబంధే చ హృదయే నాభిపార్శ్వకే ॥103॥

తల, నుదురు, కంఠం, రెండుభుజస్కంధాలు, రెండుభుజాలు, రెండుమోచేతులు, రెండుమణికట్టులు, హృదయం, నాభి, రెండుపార్శ్వాలు,

పృష్ఠే చైవం ప్రతిష్ఠాయ యజేత్తత్రాశ్విదైవతే ।
శివశక్తిం తథా రుద్రమీశం నారదమేవ చ ॥104॥

వామాదినవశక్తీశ్చ ఏతాః షోడశదేవతాః ।
నాసత్యోదస్రకశ్చైవ అశ్వినౌ ద్వౌ ప్రకీర్తితౌ ॥105॥

మరియు పృష్ఠభాగాన భస్మాన్ని ధరించాలి. ఆ స్థానాలలో అశ్వనీదేవతలు, శివుడు, శక్తి, రుద్రుడు, ఈశుడు, నారదుడు వామ మొదలగు నవశక్తులు పదహారుదేవతలను భావన చేయాలి. నాసత్యుడు, దస్రుడు అను దేవతలకు అశ్వినీదేవతలని పేరు.

అథవా మూర్ధ్ని కేశే చ కర్ణయోర్వదనే తథా ।
బాహుద్వయే చ హృదయే నాభ్యామూరుయుగే తథా ॥106॥

జానుద్వయే చ పదయోః పృష్ఠ భాగే చ షోడశ ।
శివశ్చంద్రశ్చ రుద్రః కో విఘ్నేశో విష్ణురేవ వా ॥107॥

శ్రీశ్చైవ హృదయే శంభుస్తథా నాభౌ ప్రజాపతిః ।
నాగశ్చ నాగకన్యాశ్చ ఉభయోః ఋషికన్యకాః ॥108॥

పాదయోశ్చ సముద్రాశ్చ తీర్థాః పృష్ఠే విశాలతః ।
ఇత్యేవ షోడశస్థానమథోచ్యతే ॥109॥

పదహారుస్థానాలను, దేవతలను మరోవిధంగా చెప్పవచ్చు. తల, జుట్టు, రెండుచెవులు, ముఖం, రెండుచేతులు, హృదయం, నాభి, రెండు తొడలు, రెండుమోకాళ్లు, రెండుపాదాలు, వెనుకభాగం, అనే పదహారుస్థానాల్లో భస్మాన్ని ధరించాలి. ఈ స్థానాల్లో వరుసగా శివుడు, చంద్రుడు, రుద్రుడు, బ్రహ్మ, విఘ్నేశ్వరుడు, విష్ణువు హృదయమున లక్ష్మి, నాభియందు శంభువు, ప్రజాపతి, నాగదేవత, ఇద్దరు నాగకన్యలు, ఇద్దరు ఋషికన్యలు ఉందురు. పాదముల వెనుకభాగంలో విశాలమైన సముద్రము తీర్థాలు ఉన్నాయి. ఈ విధంగా పదహారుస్థానాలని తెలుసుకోవాలి.

గుహ్యస్థానం లలాటశ్చ కర్ణద్వయమనుత్తమమ్ ।
అసంయుగ్మం చ హృదయం నాభిరిత్యేవమష్టకమ్ ॥110॥

గుహ్యం, నుదురు, రెండుచెవులు, రెండుభుజాలు, హృదయం, నాభి అనే ఎనిమిదిస్థానాలలో భస్మమును ధరించాలి.

బ్రహ్మ చ ఋషయస్సప్తదేవతాశ్చ ప్రకీర్తితాః ।
ఇత్యేవం తు సముద్దిష్టం భస్మవిద్భిర్మునీశ్వరాః ॥111॥

ఓ మహర్షులారా! ఆ స్థానాలకు బ్రహ్మ, సప్తఋషులు దేవతలని భస్మజ్ఞానము గల ఋషులు చెప్పారు.

అథవా మస్తకం బాహూ హృదయం నాభిరేవ చ ।
పంచస్థానాన్యమూన్యాహుర్ధారణే భస్మవిజ్జనాః ॥112॥

లేదా తల, రెండుచేతులు, హృదయం, నాభి అనే అయిదుస్థానాలలో భస్మమును ధరించవచ్చు.

యథాసంభవనం కుర్యాద్దేశకాలాద్యపేక్షయా ।
ఉద్ధూలనేఽప్యశక్తశ్చేత్త్రిపుండ్రాదీని కారయేత్ ॥113॥

దేశకాలములననుసరించి భక్తుడు యథాసంభవంగా భస్మమును ధరించవచ్చు. భస్మముతో అంగలేపనం చేయలేని భక్తుడు త్రిపుండ్రం ధరించాలి.

త్రినేత్రం త్రిగుణాధారం త్రిదేవజనకం శివమ్ ।
స్మరన్నమశ్శివాయేతి లలాటే తు త్రిపుండ్రకమ్ ॥114॥

ముక్కంటి, త్రిగుణాత్మకప్రకృతి ఆశ్రయం, బ్రహ్మ, విష్ణు, రుద్రులకు తండ్రియైన శివుణ్ణి "నమశ్శివాయ" అని స్మరించి, నుదుటిపై త్రిపుండ్రాన్ని ధరించాలి.

ఈశాభ్యాం నమః ఇత్యుక్త్వా పార్శ్వయోశ్చ త్రిపుండ్రకమ్ ।
బీజాభ్యాం నమః ఇత్యుక్త్వా ధారయేత్తు ప్రకోష్ఠయోః ॥115॥

కుర్యాదధః పితృభ్యాం చ ఉమేశాభ్యాం తథోపరి ।
భీమాయేతి తతః పృష్ఠే శిరసః పశ్చిమే తథా ॥116॥

"ఈశాభ్యాం నమః" అని ఉచ్చరించి, పార్శ్వములందు, "బీజాభ్యాం నమః" అని ముంజేతులయందు "పితృభ్యాం నమః" అని శరీరంలోని క్రింది అవయవాలయందు, "ఉమేశాభ్యాం నమః" అని శరీరంయొక్క పైభాగమునందు, "భీమాయ నమః" అని పలుకుతూ శిరస్సు వెనుకభాగంలో భస్మం ధరించాలి.

ఇతి శ్రీశివమహాపురాణే ప్రథమాయాం విద్యేశ్వరసంహితాయాం సాధ్యసాధనఖండే భస్మధారణవర్ణనో నామ చతుర్వింశోఽధ్యాయః ॥24॥

శ్రీశివమహాపురాణంలోని విద్యేశ్వరసంహితయందు భస్మధారణవర్ణనం అను పేరుగల ఇరవై నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచవింశోఽధ్యాయః - ఇరవై అయిదవ అధ్యాయం

రుద్రాక్షమాహాత్మ్యం - రుద్రాక్ష మాహాత్మ్యం

సూత ఉవాచ - సూతుడు ఇలా పలికాడు.

శౌనకర్షే మహాప్రాజ్ఞ శివరూప మహాపతే ।
శృణు రుద్రాక్షమాహాత్మ్యం సమాసాత్కథయామ్యహమ్ ॥1॥

శౌనకమహర్షీ! నీవు గొప్పజ్ఞానివి. శివస్వరూపుడవు. గొప్పవారిలో గొప్పవాడివి. నేను రుద్రాక్షమహిమను సంగ్రహంగా చెప్తాను. విను.

శివప్రియతమో జ్ఞేయో రుద్రాక్షః పరపావనః ।
దర్శనాత్ స్పర్శనాజ్జాప్యాత్సర్వపాపహరస్స్మృతః ॥2॥

మిక్కిలి పవిత్రమైన రుద్రాక్ష శివునకు ఎంతో ఇష్టమైనది. పరులను పావనం చేయునది. రుద్రాక్షను చూసినా, ముట్టుకున్నా, రుద్రాక్షమాలతో జపం చేసినా పాపాలన్నీ తొలగిపోతాయని ఋషులు చెప్పారు.

పురా రుద్రాక్షమహిమా దేవ్యగ్రే కథితో మునే ।
లోకోపకరణార్థాయ శివేన పరమాత్మనా ॥3॥

ఓ మహర్షీ! పూర్వం శివపరమాత్మ లోకోపకారం కొరకై పార్వతీదేవికి రుద్రాక్షమహిమను వివరంగా చెప్పాడు.

శివ ఉవాచ - శివుడిట్లు పలికెను.

శృణు దేవి మహేశాని రుద్రాక్షమహిమా శివే ।
కథయామి తవ ప్రీత్యా భక్తానాం హితకామ్యయా ॥4॥

ఓ మహేశానీ! దేవీ! శివే! భక్తుల హితం కోరి, నేను నీకు ప్రేమతో రుద్రాక్షమహిమను చెప్తాను, విను.

దివ్యవర్షసహస్రాణి మహేశాని పునః పురా ।
తపః ప్రకుర్వతస్త్రస్తం మనస్సంయమ్య వై మమ ॥5॥

ఓ మహేశ్వరీ! పూర్వం నేను వేలాదిసంవత్సరాలు సంయమనంతో తపస్సు చేస్తుండగా నా మనసు భయపడింది.

స్వతంత్రేణ పరేశేన లోకోపకృతికారిణా ।
లీలయా పరమేశాని చక్షురున్మీలితం మయా ॥6॥

ఓ పరమేశ్వరీ! పరమేశ్వరుడు, స్వతంత్రుడు, అయిన నేను లోకాలకు ఉపకారం చేయాలనే భావంతో నేను లీలగా కళ్లు తెరిచాను.

పుటాభ్యాం చారుచక్షుర్భ్యాం పతితా జలబిందవః ।
తత్రాశ్రుబిందవో జాతా వృక్షా రుద్రాక్షసంజ్ఞకాః ॥7॥

సుందరమైన ఆ కళ్లపుటాల నుండి నీటిబిందువులు రాలినవి. ఆ కన్నీటిబిందువులే రుద్రాక్ష అను పేరు గల చెట్లు అయ్యాయి.

స్థావరత్వమనుప్రాప్య భక్తానుగ్రహకారణాత్ ।
తే దత్తా విష్ణుభక్తేభ్యశ్చతుర్వర్ణేభ్య ఏవ చ ॥8॥

ఆ కన్నీటి చుక్కలు భక్తుల అనుగ్రహం కోసం చెట్టురూపం పొందింది. ఆ రుద్రాక్షలను శివుడు విష్ణుభక్తులకే గాక సర్వవర్ణముల వారికి ఇచ్చాడు.

భూమౌ గౌండోద్భవాంశ్చక్రే రుద్రాక్షాన్ శివవల్లభాన్ ।
మధురాయామయోధ్యాయాం లంకాయాం మలయే తథా ॥9॥

సహ్యాద్రౌ చ తథా కాశ్యాం దశేష్వన్యేషు వా తథా ।

శివుడికి ఇష్టమైన రుద్రాక్షలు భూలోకంలో గౌడదేశంలో పుట్టాయి. శివుడు వాటిని మధుర, అయోధ్య, లంక, మలయ సహ్యపర్వతాలు, కాశీ మాత్రమే కాక, ఇంకా పదిచోట్ల దొరికేటట్లు చేశాడు.

పరానసహ్యాపాపౌఘభేదనాన్ శ్రుతినోదనాన్ ॥10॥

వేదసమ్మతములైన రుద్రాక్షలు సంహరింప శక్యం కాని పాపసమూహాలను నశింప చేస్తాయి.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాశ్శూద్రా జాతా మమాజ్ఞయా ।
రుద్రాక్షాస్తే పృథివ్యాం తు తజ్జాతీయాశ్శుభాక్షకాః ॥11॥

నా ఆజ్ఞచే ఈ శుభకరమైన రుద్రాక్షలు భూలోకంలో బ్రాహ్మణ, క్షత్రియ వైశ్య, శూద్ర అనే నాలుగుభేదాలతో పుట్టినవారికి వారిజాతి భేదాన్ని అనుసరించి ప్రవర్తిల్లుతాయి.

శ్వేతరక్తాః పీతకృష్ణా వర్ణా జ్ఞేయాః క్రమాద్బుధైః ।
స్వజాతీయం నృభిర్ధార్యం రుద్రాక్షం వర్ణతః క్రమాత్ ॥12॥

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, జాతులవారు క్రమంగా రుద్రాక్షలలో తెలుపు, ఎరుపు, పసుపు, నలుపు అను నాలుగురంగులలో ఉన్న రుద్రాక్షలను జాతిక్రమంగా తీసుకొని ధరించాలి. అని పండితులు చెబుతుంటారు.

వర్ణైస్తు తత్ఫలం ధార్యం భుక్తిముక్తిఫలేప్సుభిః ।
శివభక్తైర్విశేషేణ శివయోః ప్రీతయే సదా ॥13॥

విశేషించి భుక్తిని, ముక్తిని కోరుకునే శివభక్తులు పార్వతీపరమేశ్వరుల ప్రీతి కోసం ఆయా రంగుల రుద్రాక్షలను ధరించాలి.

ధాత్రీఫలప్రమాణం యచ్ఛ్రేష్ఠమేతదుదాహృతమ్ ।
బదరీఫలమాత్రం తు మధ్యమం సంప్రకీర్తితమ్ ॥14॥

అధమం చణమాత్రం స్యాత్ప్రక్రియైషాపరోచ్యతే ।

పెద్ద ఉసిరికాయ ప్రమాణంగల రుద్రాక్షను ధరించటం ఉత్తమమని, రేగుపండు ప్రమాణం గల రుద్రాక్ష ధరించటం మధ్యమమని శనగగింజ ప్రమాణం గల రుద్రాక్షను ధరించటం అధమమనే భావన ఉంది.

శృణు పార్వతి సుప్రీత్యా భక్తానాం హితకామ్యయా ॥15॥

ఓ పార్వతీ! భక్తుల హితాన్ని కోరి నేను చెప్పే విషయాన్ని ప్రీతితో విను.

బదరీఫలమాత్రం చ యత్ స్యాత్ కిల మహేశ్వరి ।
తథాపి ఫలదం లోకే సుఖసౌభాగ్యవర్ధనమ్ ॥16॥

ఓ మహేశ్వరీ! రేగుపండు ప్రమాణం గల రుద్రాక్ష ఈ లోకంలో సుఖసౌభాగ్యాలను మాత్రమే కాక, ఇతర ఫలాలను కూడా ఇస్తుంది.

ధాత్రీఫలసమం యత్ స్యాత్ సర్వారిష్టవినాశనమ్ ।
గుంజయా సదృశం యత్స్యాత్సర్వార్థఫలసాధనమ్ ॥17॥

ఉసిరికాయ ప్రమాణం గల రుద్రాక్ష అరిష్టాలను అన్నింటినీ తొలగిస్తుంది. గురువిందప్రమాణం గల రుద్రాక్ష సర్వకార్యాలను సిద్ధింప చేస్తుంది.

యథా యథా లఘుస్స్యాద్వై తథాధికఫలప్రదమ్ ।
ఏకైకతః ఫలం ప్రోక్తం దశాంశైరధికం బుధైః ॥18॥

రుద్రాక్ష ఎంత చిన్నదో అంత ఎక్కువ ఫలాన్నిస్తుంది. పై మూడింటిలో అల్పప్రమాణం కల రుద్రాక్ష క్రమంగా అధికప్రమాణం కలదానికంటే పదిరెట్లు ఎక్కువ ఫలాలను ఇస్తుందని పండితులు చెప్పారు.

రుద్రాక్షధారణం ప్రోక్తం పాపనాశనహేతవే ।
తస్మాచ్చ ధారణీయో వై సర్వార్థసాధనో ధ్రువమ్ ॥19॥

రుద్రాక్షను ధరిస్తే పాపాలన్నీ దూరమౌతాయి. కాబట్టి అన్నికార్యాలను సిద్ధింప చేసే రుద్రాక్షలను తప్పక ధరించాలి.

యథా చ దృశ్యతే లోకే రుద్రాక్షః ఫలదశ్శుభః ।
న తథా దృశ్యతేఽన్యా చ మాలికా పరమేశ్వరి ॥20॥

ఓ పరమేశ్వరీ! లోకంలో శుభకరమైన రుద్రాక్షమాలలు ఇచ్చినఫలాలను ఇతర మాలిక ఇచ్చినట్లు కనబడటం లేదు.

సమాస్స్నిగ్ధా దృఢాస్థూలాః కంటకైస్సంయుతాశ్శుభాః ।
రుద్రాక్షాః కామదా దేవి భుక్తిముక్తిప్రదాస్సదా ॥21॥

ఓ దేవీ! సమానపరిణామం ఉన్నవి, మెత్తనిస్పర్శ కలవి, దృఢమైనవి, పెద్దవి, కంటకాలతో (ముళ్లు) కూడి ఉన్న రుద్రాక్షలు అన్ని వేళలా శుభాలను కలిగించి, కోరికలను తీర్చి, భుక్తిని, ముక్తిని ఇస్తాయి.

క్రిమిదుష్టం ఛిన్నభిన్నం కంటకైర్హీనమేవ చ ।
వ్రణయుక్తమవృత్తం చ రుద్రాక్షాన్ షడ్వివర్జయేత్ ॥22॥

పురుగులు పట్టినది, పగిలినది, విరిగినది, ముళ్లు లేనిది, వ్రణం కలది, గుండ్రంగా లేనిది అనే ఆరు రకాల రుద్రాక్షలు పనికి రావు.

స్వయమేవ కృతద్వారం రుద్రాక్షం స్యాదిహోత్తమమ్ ।
యత్తు పౌరుషయత్నేన కృతం తన్మధ్యమం భవేత్ ॥23॥

సహజంగా రంధ్రాలున్న రుద్రాక్ష ఉత్తమమైంది. మనుషులు ప్రయత్నం చేసి రంధ్రాలు చేస్తే అది మధ్యమం అవుతుంది.

రుద్రాక్షధారణం ప్రోక్తం మహాపాతకనాశనమ్ ।
రుద్రసంఖ్యాశతం ధృత్వా రుద్రరూపో భవేన్నరః ॥24॥

రుద్రాక్షలను ధరిస్తే మహాపాతకాలు నశిస్తాయి. వందరుద్రాక్షలను ధరించిన మానవుడు రుద్రరూపుడౌతాడు.

ఏకాదశశతానీహ ధృత్వా యత్ఫలమాప్యతే ।
తత్ఫలం శక్యతే నైవ వక్తుం వర్షశతైరపి ॥25॥

పదకొండువందల రుద్రాక్షలను ధరించటం వల్ల లభించే ఫలాన్ని వర్ణించటానికి వందలాది సంవత్సరాలు కూడా సరిపోవు.

శతార్ధేనయుతైః పంచశతైర్వై ముకుటం మతమ్ ।
రుద్రాక్షైర్విరచేత్సమ్యగ్భక్తిమాన్ పురుషో వరః ॥26॥

అయిదువందలయాభై రుద్రాక్షలతో కిరీటాన్ని చేసి భక్తుడు ధరించాలి. అటువంటి భక్తుడు పురుషోత్తముడు అవుతాడు.

త్రిభిశ్శతైః షష్టియుక్తైస్త్రిరావృత్యా తథా పునః ।
రుద్రాక్షైరుపవీతం చ నిర్మీయాద్భక్తితత్పరః ॥27॥

భక్తుడు మూడువందలఅరవై రుద్రాక్షలను మూడుపేటలుగా చేసి యజ్ఞోపవీత ఆకారంగా ధరించాలి.

శిఖాయాం చ త్రయం ప్రోక్తం రుద్రక్షాణాం మహేశ్వరి ।
కర్ణయోః షట్ చ షట్ చైవ వామదక్షిణయోస్తథా ॥28॥

శతమేకోత్తరం కంఠే బాహ్వోర్వై రుద్రసంఖ్యయా ।
కూర్పరద్వారయోస్తత్ర మణిబంధే తథా పునః ॥29॥

ఓ మహేశ్వరీ! శిఖలో మూడు, చెవులకు ఒక దానికి ఆరు చొప్పున కంఠం నందు నూటఒకటి, బాహువులకు, మోచేతులకు, మణికట్టులకు, ఒక్కొక్కింటికి పదకొండు చొప్పునకట్టాలి.

ఉపవీతే త్రయం ధార్యం శివభక్తిరతైర్నరైః ।
శేషానుర్వరితాన్ పంచసమ్మితాన్ ధారయేత్కటౌ ॥30॥

యజ్ఞోపవీతమునందు మూడురుద్రాక్షలను శివభక్తులు ధరించాలి. మరియు, నడుముకు సమాన ప్రమాణము కల అయిదుపెద్దరుద్రాక్షలను ధరించాలి.

ఏతస్సంఖ్యా ధృతా యేన రుద్రాక్షాః పరమేశ్వరి ।
తద్రూపం తు ప్రణమ్యం హి స్తుత్యం సర్వైర్మహేశవత్ ॥31॥

ఓ పరమేశ్వరీ! ఈ సంఖ్యలో రుద్రాక్షలను ధరించిన భక్తుడు ఈశ్వరుని వలె అందరిచేత నమస్కరింపబడువాడు స్తుతింపబడువాడౌతాడు.

ఏవం భూతం స్థితం ధ్యానే యదా కృత్వాసనైర్జపమ్ ।
శివేతి వ్యాహరంశ్చైవ దృష్ట్వా పాపైః ప్రముచ్యతే ॥32॥

ఈ విధంగా రుద్రాక్షలను ధరించి, ధ్యానంలో శివనామం జపించే భక్తుని చూస్తే, పాపాలు నశిస్తాయి.

శతాధికసహస్రస్య విధిరేష ప్రకీర్తితః ।
తదభావే ప్రకారోఽన్యః శుభస్సంప్రోచ్యతే మయా ॥33॥

పదకొండువందల రుద్రాక్షలను ధరించే విధానాన్ని నేను ఇంత వరకు చెప్పాను. ఇపుడు రుద్రాక్షలను ధరించే మరో మంగళప్రదమైన పద్ధతిని చెప్తున్నాను.

శిఖాయామేకరుద్రాక్షం శిరసా త్రిశతం వహేత్ ।
పంచాశచ్చ గలే దద్యాద్బాహ్వోః షోడశ షోడశ ॥34॥

శిఖలో ఒకటి, తలపై మూడువందలు, కంఠం నందు యాభై, ఒక్కొక్క బాహువులలో పదహారు, పదహారు రుద్రాక్షలను ధరించాలి.

మణిబంధే ద్వాదశ ద్విస్కంధే పంచశతం వహేత్ ।
అష్టోత్తరశతైర్మాల్యముపవీతం ప్రకల్పయేత్ ॥35॥

మణికట్టునందు పన్నెండు, భుజస్కంధములు రెండింటిలో అయిదువందలు చొప్పున రుద్రాక్షలను ధరించాలి. 108 రుద్రాక్షలతో యజ్ఞోపవీతాన్ని తయారు చేసుకోవాలి.

ఏవం సహస్రరుద్రాక్షాన్ ధారయేద్యో దృఢవ్రతః ।
తం నమంతి సురాస్సర్వే యథా రుద్రస్తథైవ సః ॥36॥

ఈ విధంగా దృఢమైనవ్రతంతో, రుద్రాక్షలను ధరించే భక్తునకు దేవతలందరూ నమస్కరిస్తారు. అట్టి వాడు సాక్షాత్తు రుద్రుడే.

ఏకం శిఖాయాం రుద్రాక్షం చత్వారింశత్తు మస్తకే ।
ద్వాత్రింశత్ కంఠదేశే తు వక్షస్యష్టోత్తరం శతమ్ ॥37॥

ఏకైకం కర్ణయోః షట్ షడ్బాహ్వోః షోడశ షోడశ ।
కరయో రవిమానేన ద్విగుణేన మునీశ్వర ॥38॥

శిఖలో ఒకటి, తలలో నలభై, కంఠంలో ముప్పైరెండు, వక్షస్థలంలో నూటఎనిమిది, చెవులకు ఒక్కొక్కటి, బాహువులకు ఆరు ఆరు లేక పదహారు చేతులకు సూర్యమానం ప్రకారం రెట్టింపు రుద్రాక్షలను ధరించాలి.

సంఖ్యాప్రీతిర్ధృతా యేన సోఽపి శైవజనః పరః ।
శివవత్పూజనీయో హి వంద్యస్సర్వైరభీక్ష్ణశః ॥39॥

ఈ సంఖ్యలో రుద్రాక్షలను ప్రీతితో ధరించువాడు శ్రేష్ఠుడు అయిన శివుడౌతాడు. అందరూ అతనిని అపర శివుని వలె నమస్కరించి పూజిస్తారు.

శిరసీశానమంత్రేణ కర్ణే తత్పురుషేణ చ ।
అఘోరేణ గలే ధార్యం తేనైవ హృదయేఽపి చ ॥40॥

శిరస్సునందు ఈశానమంత్రంతో, చెవులందు తత్పురుషమంత్రంతో, హృదయమునందు కంఠనందు కూడా అఘోర మంత్రంతో రుద్రాక్షలు ధరించాలి.

అఘోరబీజమంత్రేణ కరయోర్ధారయేత్సుధీః ।
పంచాదశాక్షగ్రథితాం వామదేవేన చోదరే ॥41॥

వివేకి అఘోరబీజమంత్రంతో రెండుచేతులయందు రుద్రాక్షలను ధరించాలి. ఉదరం (పొట్టభాగం) నందు పదిహేను రుద్రాక్షలమాలను వామదేవమంత్రంతో ధరించాలి.

పంచబ్రహ్మభిరంగైశ్చ త్రిమాలాం పంచ సప్త చ ।
అథవా మూలమంత్రేణ సర్వానక్షాంస్తు ధారయేత్ ॥42॥

సద్యోజాత మొదలుగాగల పంచబ్రహ్మమంత్రాలను 5 సార్లు జపించి, 3, 5 లేదా 7 మాలలను ధరించాలి లేదా మూలమంత్రంతో రుద్రాక్షలన్నింటినీ ధరించాలి.

మద్యం మాంసం తు లశునం పలాండుం శిగ్రుమేవ చ ।
శ్లేష్మాంతకం విడ్వరాహం భక్షణే వర్జయేత్తతః ॥43॥

రుద్రాక్షలను ధరించినవారు మద్యం, మాంసం, వెల్లుల్లి, నీరుల్లిని, మునగకూరను, విరిగిచెట్టు కూరను, పందిమాంసాన్ని తినరాదు.

వలక్షం రుద్రాక్షం ద్విజతనుభిరేవేహ విహితం
సురక్తం క్షత్రాణాం ప్రముదితముమే పీతమసకృత్ ।
తతో వైశ్యైర్ధార్యం ప్రతిదివసమావశ్యకమహో
తథా కృష్ణం శూద్రైః శ్రుతిగదితమార్గోఽయమగజే ॥44॥

ఉమా! తెల్లని రుద్రాక్షలను బ్రాహ్మణులు మాత్రమే ధరించాలి. క్షత్రియులు ఎర్రని రుద్రాక్షలను ఆనందంతో ధరించాలి. వైశ్యులు పచ్చని రుద్రాక్షలను నిత్యం ధరించాలి. శూద్రులు నల్లనివి ధరించాలి. ఓ పార్వతీ! ఇది వేదవిహితమైన మార్గం.

వర్ణీ వనీ గృహయతిర్నియమేన దధ్యాదేతద్రహస్యపరమో న హి జాతు తిష్ఠేత్ ।
రుద్రాక్షధారణమిదం సకృతైశ్చ లభ్యం త్యక్త్వేదమేతదఖిలాన్నరకాన్ ప్రయాంతి ॥45॥

బ్రహ్మచారి, నాన ప్రస్థుడు గృహస్థుడు, నియమంగా రుద్రాక్షలు ధరించాలి. రుద్రాక్షలు లేకుండా ఒక్కక్షణమైనా ఉండరాదు. రుద్రాక్షలను ధరించు భాగ్యం పుణ్యం వల్లనే వస్తుంది. రుద్రాక్షలు వీడిన మానవులు సమస్తనరకాలను పొందుతారు.

ఆదావామలకాత్ప్వతో లఘుతరా రుగ్ణాస్తతః కంటకైః
సందష్టాః క్రిమిభిస్తనూపకరణచ్ఛిద్రేణ హీనాస్తథా ।
ధార్యా నైవ శుభేప్సుభిశ్చణకవద్రుద్రాక్షమప్యంతతో
రుద్రాక్షో మమ లింగమంగలముమే సూక్ష్మం ప్రశస్తం సదా ॥46॥

ముందుగా ఉసిరికాయప్రమాణంకల రుద్రాక్షలను, లేదా అంతకంటే తేలికైన వాటిని ధరించాలి. రోగం కలవి, కంటకములు లేనివి, పురుగుపట్టినవి, సూదితో గుచ్చుటకు తగినంత రంధ్రం లేనివి అయిన రుద్రాక్షలను శు భాలను కోరే భక్తుడు ధరించరాదు. చిక్కుడుగింజ ప్రమాణం గల రుద్రాక్ష చాలా మంచిది. ఉమాదేవీ! రుద్రాక్ష నాయొక్క మంగళకరమైన గుర్తు.

సర్వాశ్రమాణాం వర్ణానాం స్త్రీశూద్రాణాం శివాజ్ఞయా ।
ధార్యాస్సదైవ రుద్రాక్షా యతీనాం ప్రణవేన హి ॥47॥

అన్ని వర్ణాల వారు, ఆశ్రమముల వారు, స్త్రీలు, శూద్రులు సర్వదా రుద్రాక్షలను ధరించాలని శివుని ఆజ్ఞ. యతులు ఓకారం పఠిస్తూ రుద్రాక్షలను ధరించాలి.

దివాబిభ్రద్రాత్రికృతైః రాత్రౌ బిభ్రద్దివాకృతైః ।
ప్రాతర్మధ్యాహ్నసాయాహ్నే ముచ్యతే సర్వపాతకైః ॥48॥

పగలు ధరిస్తే రాత్రియందు చేసిన పాపాలు, రాత్రియందు ధరిస్తే పగలు చేసిన పాపాలు, అన్నికాలాల్లో ధరిస్తే అన్నిపాపాలు తొలగిపోతాయి.

యే త్రిపుంద్రధరా లోకే జటాధారిణ ఏవ యే ।
యే రుద్రాక్షధరాస్తే చ యమలోకం ప్రయాంతి న ॥49॥

ఈ లోకంలో త్రిపుండ్రం ధరించే వారు, జటలను ధరించే వారు, రుద్రాక్షలను ధరించు వారు యమలోకానికి వెళ్ళరు.

రుద్రాక్షమేకం శిరసా బిభర్తి తథా త్రిపుండ్రం చ లలాటమధ్యే ।
పంచాక్షరం యే హి జపంతి మంత్రం పూజ్యా భవద్భిః ఖలు తే హి సాధవః ॥50॥

ఒక రుద్రాక్షను తలపై ధరించి, నుదుటిపై త్రిపుండ్రం ధరించి, పంచాక్షరీమంత్రాన్ని జపించే మానవులు సాధువులు. వారిని మీరు పూజించాలి.

యస్యాంగే నాస్తి రుద్రాక్షస్త్రిపుండ్రం భాలపట్టకే ।
ముఖే పంచాక్షరం నాస్తి తమానయ యమాలయమ్ ॥51॥

జ్ఞాత్వా జ్ఞాత్వా తత్ప్రభావం భస్మరుద్రాక్షధారిణః ।
తే పూజ్యాస్సర్వదాస్మాకం నో నేతవ్యాః కదాచనః ॥52॥

శరీరం మీద రుద్రాక్ష లేనివాడిని, నుదుటిపై త్రిపుండ్రం లేనివాడిని, నోటిలో పంచాక్షరం పలకని వాడిని యమలోకానికి తీసుకొని రండి. విభూతిని, రుద్రాక్షలను ధరించే మనుషుల మహిమను సరిగ్గా తెలుసుకోండి. వారు అన్ని కాలాల్లో పూజింపదగిన వారు. వారిని ఎపుడు యమపురికి తీసుకొని రావద్దు.

ఏవమాజ్ఞాపయామాస కాలోఽపి నిజకింకరాన్ ।
తథేతి మత్వా తే సర్వే తూష్ణీమాసన్ సువిస్మితాః ॥53॥

అని యముడు తన కింకరులకు చెప్పాడు. అపుడు వారందరూ ఆశ్చర్యంతో అలాగే అని మాటలాడక ఊరకుండి పోయారు.

అత ఏవ మహాదేవి! రుద్రాక్షోఽత్యఘనాశనః ।
తద్ధరో మత్ప్రియశ్శుద్ధోఽత్యఘవానపి పార్వతి ॥54॥

ఓ మహాదేవీ! రుద్రాక్ష పాపాలను పోగొట్టడంలో చాలా గొప్పది. ఓ పార్వతీ! పాపియైనప్పటికీ రుద్రాక్షలను ధరించే వాడు శుద్ధుడై నాకు ఇష్టమైనవాడౌతాడు.

హస్తే బాహౌ తథా మూర్ధ్ని రుద్రాక్షం ధారయేత్తు యః ।
అవధ్యస్సర్వభూతానాం రుద్రరూపీ చరేద్భువి ॥55॥

చేతులయందు, బాహువులయందు మరియు తలపై రుద్రాక్షలను ధరించే వ్యక్తి, అన్ని ప్రాణులకు అవధ్యుడై, రుద్రరూపుడై భూలోకంలో సంచరిస్తాడు.

సురాసురాణాం సర్వేషాం వందనీయస్సదా స వై ।
పూజనీయో హి దృష్టస్య పాపహా చ యథా శివః ॥56॥

అట్టివాడు దేవతలకు, రాక్షసులకు, సర్వమానవులకు అన్నివేళలలో నమస్కరింపదగిన వాడు, పూజింప దగిన వాడు. అతని దర్శనం శివుని దర్శనంలాగానే పాపాలను పోగొడుతుంది.

ధ్యానజ్ఞానావముక్తోఽపి రుద్రాక్షం ధారయేత్తు యః ।
సర్వపాపవినిర్ముక్తస్స యాతి పరమాం గతిమ్ ॥57॥

ధ్యానం, జ్ఞానం లేని వాడైనా, రుద్రాక్షలను ధరించే మానవుడు పాపాలన్నింటినుండి విముక్తుడై మోక్షాన్ని పొందుతాడు.

రుద్రాక్షేణ జపన్మంత్రం పుణ్యం కోటిగుణం భవేత్ ।
దశకోటి గుణం పుణ్యం ధారణాల్లభతే నరః ॥58॥

రుద్రాక్షమాలతో మంత్రాన్ని జపిస్తే కోటిరెట్లు పుణ్యం లభిస్తుంది. రుద్రాక్షలను ధరించి జపించు మానవుడు పదికోట్లరెట్లు పుణ్యాన్ని పొందుతాడు.

యావత్కాలం హి జీవస్య శరీరస్థో భవేత్స వై ।
తావత్కాలం స్వల్పమృత్యుర్న తం దేవి విబాధతే ॥59॥

ఓ దేవీ! జీవుని శరీరమునందు రుద్రాక్ష ఉన్నంత వరకు అకాలమృత్యువు ఆ జీవుని బాధించదు.

త్రిపుండ్రేణ చ సంయుక్తం రుద్రాక్షావిలసాంగకమ్ ।
మృత్యుంజయం జపంతం చ దృష్ట్వా రుద్రఫలం లభేత్ ॥60॥

త్రిపుండ్రం ధరించి, రుద్రాక్షలతో ప్రకాశించు అవయవాలు కలిగినవాడు, మృత్యుంజయమంత్రాన్ని జపించే వాడు అయినవ్యక్తిని చూస్తే శివదర్శనఫలం లభిస్తుంది.

పంచదేవప్రియశ్చైవ సర్వదేవప్రియస్తథా ।
సర్వమంత్రాన్ జపేద్భక్తో రుద్రాక్షమాలయా ప్రియే ॥61॥

ఓ పార్వతీ! రుద్రాక్షమాలతో మంత్రాలన్నింటినీ జపించే భక్తుడు బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశాన, సదాశివులకు మాత్రమే కాక సర్వదేవతలకు ప్రియుడౌతాడు.

విష్ణ్వాదిదేవభక్తాశ్చ ధారయేయుర్న సంశయః ।
రుద్రభక్తో విశేషేణ రుద్రాక్షాన్ ధారయేత్సదా ॥62॥

విష్ణువు మొదలగు ఇతరదేవతల భక్తులు కూడా రుద్రాక్షలను ధరించాలనటంలో సందేహం లేదు. రుద్రభక్తులు ప్రత్యేకశ్రద్ధతో అన్ని వేళలా రుద్రాక్షలను ధరించాలి.

రుద్రాక్షా వివిధాః ప్రోక్తాస్తేషాం భేదాన్ వదామ్యహమ్ ।
శృణు పార్వతి సద్భక్త్యా భుక్తిముక్తిఫలప్రదాన్ ॥63॥

రుద్రాక్షలు అనేక రకాలుగా ఉన్నాయి. వాటిలోని భేదాలను చెప్తాను. ఓ పార్వతీ! భుక్తిని, ముక్తిని ఇచ్చే ఈ రుద్రాక్షల వివరాలను భక్తితో విను.

ఏకవక్త్రశ్శివస్సాక్షాత్ భుక్తిముక్తిఫలప్రదః ।
తస్య దర్శనమాత్రేణ బ్రహ్మహత్యాం వ్యపోహతి ॥64॥

ఏకముఖిరుద్రాక్ష సాక్షాత్తుగా శివస్వరూపమే. అది భుక్తిని, ముక్తిని, ఇతర ఫలాలను ఇస్తుంది. దాని దర్శనమాత్రం చేతనే బ్రహ్మహత్యాదోషం తొలగిపోతుంది.

యత్ర సంపూజితస్తత్ర లక్ష్మీర్దూరతరా న హి ।
నశ్యంత్యుపద్రవాస్సర్వే సర్వకామా భవంతి హి ॥65॥

ఏకముఖి రుద్రాక్షను బాగా పూజించుచోట సిరిసంపదలుంటాయి. ఉపద్రవాలు తొలగిపోయి, కోరికలు తీరుతాయి.

ద్వివక్త్రో దేవ దేవేశస్సర్వకామఫలప్రదః ।
విశేషతస్స రుద్రాక్షో గోవధం నాశయేద్ద్రుతమ్ ॥66॥

రెండుముఖాలు ఉన్న రుద్రాక్ష చాలా గొప్పది. అది కోరికలనన్నింటినీ తీరుస్తుంది. అది ఆవును చంపిన పాపాన్ని పోగొడుతుంది.

త్రివక్త్రో యో హి రుద్రాక్షస్సాక్షాత్సాధనదస్సదా ।
తత్ప్రభావాద్భవేయుర్వై విద్యాస్సర్వాః ప్రతిష్ఠితాః ॥67॥

మూడుముఖాలు గల రుద్రాక్ష సాధనసంపత్తిని కలిగిస్తుంది. దాని ప్రభావంతో సాధకునికి విద్యలన్నీ స్థిరంగా ఉంటాయి.

చతుర్వక్త్రస్స్వయం బ్రహ్మా నరహత్యాం వ్యపోహతి ।
దర్శనాత్స్పర్శనాత్సద్యశ్చతుర్వర్గఫలప్రదః ॥68॥

నాలుగుముఖాలు గల రుద్రాక్ష సాక్షాత్తు బ్రహ్మస్వరూపం. అది నరహత్యా పాపాన్ని పోగొడుతుంది. దానిని చూచి, ముట్టుకుంటే నాలుగు పురుషార్థాలు సిద్ధిస్తాయి.

పంచవక్త్రస్స్వయం రుద్రః కాలాగ్నిర్నామతః ప్రభుః ।
సర్వముక్తిప్రదశ్చైవ సర్వకామఫలప్రదః ॥69॥

అయిదుముఖాలు కల రుద్రాక్ష సాక్షాత్తు రుద్రస్వరూపం. సర్వసమర్థమగు ఈ రుద్రాక్షకు కాలాగ్ని అని పేరు. ఇది అన్నివిధాలుగా ముక్తినిచ్చి, అన్ని కోరికలు తీరుస్తుంది.

అగమ్యాగమనం పాపమభక్ష్యస్య చ భక్షణమ్ ।
ఇత్యాది సర్వపాపాని పంచవక్త్రో వ్యపోహతి ॥70॥

వెళ్లకూడని చోటికి వెళ్లటం, తినకూడనిది తినటం మొదలైన పాపాలన్నింటినీ అయిదుముఖాల రుద్రాక్ష పోగొడుతుంది.

షడ్వక్త్రః కార్తికేయస్తు ధారణాద్దక్షిణే భుజే ।
బ్రహ్మహత్యాదికైః పాపైర్ముచ్యతే నాత్ర సంశయః ॥71॥

ఆరుముఖాల రుద్రాక్ష సాక్షాత్తు కుమారస్వామిస్వరూపం, దానిని కుడి భుజమునందు ధరించిన మానవుడు బ్రహ్మహత్యాది పాపాల నుండి బయటపడతాడు అనటంలో సందేహం లేదు.

సప్తవక్త్రో మహేశాని హ్యనంగో నామ నామతః ।
ధారణాత్తస్య దేవేశి దరిద్రోఽపీశ్వరో భవేత్ ॥72॥

ఓ పార్వతీ! ఏడుముఖాల రుద్రాక్షకు అనంగమని పేరు. దానిని ధరించు దరిద్రుడైనా సర్వసమర్థుడవుతాడు.

రుద్రాక్షశ్చాష్టవక్త్రశ్చ వసుమూర్తిశ్చ భైరవః ।
ధారణాత్తస్య పూర్ణాయుర్మృతో భవతి శూలభృత్ ॥73॥

ఎనిమిది ముఖముల రుద్రాక్ష వసువుల స్వరూపమై ఉంది. దానికి భైరవమని పేరు. దానిని ధరించిన మానవుడు పూర్ణాయుష్షును పొందుతాడు.

భైరవో నవవక్త్రశ్చ కపిలశ్చ మునిః స్మృతః ।
దుర్గా వా తదధిష్ఠాత్రీ నవరూపా మహేశ్వరీ ॥74॥

తొమ్మిది ముఖాల రుద్రాక్ష భైరవుని స్వరూపం, అలాగే కపిలమహర్షి స్వరూపం అని చెప్పబడింది. తొమ్మిదిరూపాలతో విలసిల్లు దుర్గామహేశ్వరి దానికి అధిష్ఠానదేవత.

తం ధారయేద్వామహస్తే రుద్రాక్షం భక్తితత్పరః ।
సర్వేశ్వరో భవేన్నూనం మమ తుల్యో న సంశయః ॥75॥

అట్టి రుద్రాక్షను భక్తితో ఎడమచేతియందు ధరించు మానవుడు అన్నివిధాల సమర్థుడవటమే కాదు, నాతో సమానుడనటంలో సందేహం లేదు.

దశవక్త్రో మహేశాని స్వయం దేవో జనార్దనః ।
ధారణాత్తస్య దేవేశి సర్వాన్ కామానవాప్నుయాత్ ॥76॥

ఓ పరమేశ్వరీ! పదిముఖాల రుద్రాక్ష సాక్షాత్తు జనార్దనుని స్వరూపం. ఓ దేవీ! దానిని ధరించిన వారి కోరికలన్నీ నెరవేరుతాయి.

ఏకాదశముఖో యస్తు రుద్రాక్షః పరమేశ్వరి ।
స రుద్రో ధారణాత్తస్య సర్వత్ర విజయీ భవేత్ ॥77॥

ఓ పరమేశ్వరీ! పదకొండుముఖాలు గల రుద్రాక్ష సాక్షాత్తు రుద్రుని స్వరూపం. దానిని ధరించే వ్యక్తి అన్నింటా విజయాన్ని పొందుతాడు.

ద్వాదశాస్యం తు రుద్రాక్షం ధారయేత్కేశదేశకే ।
ఆదిత్యాశ్చైవ తే సర్వే ద్వాదశైవ స్థితాస్తథా ॥78॥

పన్నెండుముఖాల రుద్రాక్షను జుట్టులో ధరించాలి. ద్వాదశ ఆదిత్యులు అనగా 12 ఆదిత్యులు దానిలో ప్రతిష్ఠులై ఉంటారు.

త్రయోదశముఖో విశ్వేదేవాస్తద్ధారణాన్నరః ।
సర్వాన్ కామానవాప్నోతి సౌభాగ్యం మంగలం లభేత్ ॥79॥

పదమూడు ముఖాల రుద్రాక్షలు విశ్వదేవతల స్వరూపం, వాటిని ధరించటం వల్ల మానవులకు కోరికలన్నీ తీరి. సౌభాగ్యం, మంగళం కలుగుతాయి.

చతుర్దశముఖో యో హి రుద్రాక్షః పరమశ్శివః ।
ధారయేన్మూర్ధ్ని తం భక్త్యా సర్వపాపం ప్రణశ్యతి ॥80॥

పద్నాలుగు ముఖాల రుద్రాక్ష పరమశివుని రూపం. దానిని భక్తితో తలపై ధరిస్తే పాపాలన్నీ నశిస్తాయి.

ఇతి రుద్రాక్ష భేదా హి ప్రోక్తా వై ముఖభేదతః ।
తత్తన్మంత్రాన్ శృణు ప్రీత్యా క్రమాచ్ఛైలేశ్వరాత్మజే ॥81॥

ఓ శైలరాజపుత్రీ! ముఖాల సంఖ్యను బట్టి రుద్రాక్షలలో గల భేదాలను నీకు వివరించాను. ఆయా రుద్రాక్షలకు సంబంధించిన మంత్రాలను భక్తితో వరుసగా విను.

1.	ఓం హ్రీం నమః	8.	ఓం హుం నమః
2.	ఓం నమః	9.	ఓం హ్రీం హుం నమః
3.	ఓం క్లీం నమః	10.	ఓం హ్రీం నమః నమః
4.	ఓం హ్రీం నమః	11.	ఓం హ్రీం హుం నమః
5.	ఓం హ్రీం నమః	12.	ఓం క్రోం క్షౌం రౌం నమః
6.	ఓం హ్రీ హుం నమః	13.	ఓం హ్రీం నమః
7.	ఓం హుం నమః	14.	ఓం నమః – అనేవి పద్నాలుగు మంత్రాలు.

భక్తిశ్రద్ధాయుతశ్చైవ సర్వకామార్థసిద్ధయే ।
రుద్రాక్షాన్ ధారయేన్మంత్రైర్దేవనాలస్య వర్జితః ॥82॥

సాధకుడు భక్తి శ్రద్ధలు కలవాడై, అన్ని కోరికలు తీరుట కోసం, సోమరితనం వీడి మంత్రపూర్వకంగా రుద్రాక్షలను ధరించాలి.

వినా మంత్రేన యో ధత్తే రుద్రాక్షం భువి మానవః ।
స యాతి నరకం ఘోరం యావదింద్రాశ్చతుర్దశ ॥83॥

మంత్రం లేకుండా రుద్రాక్షలను ధరించే మానవుడు పద్నాలుగు ఇంద్రుల కాలాన్ని నరకంలో గడుపుతాడు.

రుద్రాక్షమాలినం దృష్ట్వా భూతప్రేతపిశాచకాః ।
ధాకినీ శాకినీ చైవ యే చాన్యే ద్రోహకారకాః ॥84॥

రుద్రాక్షమాలను ధరించిన వ్యక్తిని చూస్తే, భూత, ప్రేత, పిశాచ, ధాకినీ, శాకినీ మొదలగు ద్రోహం చేసే ప్రాణులు తొలగిపోతాయి.

కృత్రిమం చైవ యత్కించిదభిచారాదికం చ యత్ ।
తత్సర్వం దూరతో యాతి దృష్ట్వా శంకితవిగ్రహమ్ ॥85॥

చేతబడి మొదలైన కృత్రిమమైన విషయాలు కూడా రుద్రాక్షలను ధరించేవారికి దూరంగా పోతాయి.

రుద్రాక్షమాలినం దృష్ట్వా శివో విష్ణుః ప్రసీదతి ।
దేవీ గణపతిస్సూర్యస్సురాశ్చాన్యేఽపి పార్వతి ॥86॥

ఓ పార్వతీ! రుద్రాక్షమాలను ధరించు మనిషి, శివునికి, విష్ణువుకు, దేవికి, గణపతికి, సూర్యునికి, ఇతరదేవతలకు కూడా ప్రీతిపాత్రుడవుతాడు.

ఏవం జ్ఞాత్వా తు మాహాత్మ్యం రుద్రాక్షస్య మహేశ్వరి ।
సమ్యగ్ధార్యాస్సమంత్రాశ్చ భక్త్యా ధర్మవివృద్ధయే ॥87॥

ఓ మహేశ్వరీ! భక్తుడు ఈ విధముగా రుద్రాక్షమహిమను తెలుసుకొని, ధర్మం పెంచుట కోసం భక్తితో రుద్రాక్షలను సమంత్రంగా ధరించాలి.

ఇత్యుక్తం గిరిజాగ్రే హి శివేన పరమాత్మనా ।
భస్మరుద్రాక్షమాహాత్మ్యం భుక్తిముక్తిఫలప్రదమ్ ॥88॥

పరమాత్మ అయిన శివుడు పార్వతి ఎదుట ఈ విధంగా భుక్తిని, ముక్తిని ఒసంగు భస్మరుద్రాక్షల మహిమను వివరించాడు.

శివస్యాతిప్రియౌ జ్ఞేయౌ భస్మరుద్రాక్షధారిణౌ ।
తద్ధారణప్రభావాద్ధి భుక్తిర్ముక్తిర్న సంశయః ॥89॥

భస్మాన్ని ధరించిన వారు, రుద్రాక్షలను ధరించిన వారు అంటే శివునికి చాలా ఇష్టం. వాటిని ధరిస్తే వాటి మహిమ వల్ల భుక్తి, ముక్తి లభిస్తాయనటంలో సందేహం లేదు.

భస్మరుద్రాక్షధారీ యశ్శివభక్తస్స ఉచ్యతే ।
పంచాక్షరజపాసక్తః పరిపూర్ణశ్చ సన్ముఖే ॥90॥

ఓ పార్వతీ! భస్మమును, రుద్రాక్షలను ధరించి పంచాక్షరీమంత్రం జపించే ఆసక్తి కల వ్యక్తి పరిపూర్ణుడగు శివభక్తుడని పిలుస్తారు.

వినా భస్మత్రిపుండ్రేణ వినా రుద్రాక్షమాలయా ।
పూజితోఽపి మహాదేవో నాభీష్ట ఫలదాయకః ॥91॥

భస్మత్రిపుండ్రం, రుద్రాక్షమాల లేకుండా మహాదేవుని పూజించినా మహాదేవుడు ఆతడు కోరిన కోరికలను తీర్చడు.

తత్సర్వం చ సమాఖ్యాతం యత్పృష్టం హి మునీశ్వర ।
భస్మరుద్రాక్షమాహాత్మ్యం సర్వకామసమృద్ధిదమ్ ॥92॥

ఓ మునిశ్రేష్ఠా! నీవు కోరిన విషయాలన్నీ చెప్పాను. కోరికలను తీర్చే భస్మ, రుద్రాక్ష మహిమలను చెప్పాను.

ఏతద్యః శృణుయాన్నిత్యం మాహాత్మ్యం పరమం శుభమ్ ।
రుద్రాక్షభస్మనోర్భక్త్యా సర్వాన్ కామానవాప్నుయాత్ ॥93॥

రుద్రాక్షభస్మముల ఈ పరమపవిత్రమైన మహాత్మ్యాన్ని భక్తితో వినే మానవుడు కోరికలన్నింటినీ పొందుతాడు.

ఇహ సర్వసుఖం భుక్త్వా పుత్రపౌత్రాదిసంయుతః ।
లభేత్పరత్ర సన్మోక్షం శివస్యాతిప్రియో భవేత్ ॥94॥

అటువంటి మావవుడు ఈ లోకంలో కుమారులు, మనుమలతో కూడి సర్వసౌఖ్యాలు అనుభవించి, పరలోకంలో ఉత్తమమైన మోక్షాన్ని పొంది, శివుడికి చాలా ప్రీతిపాత్రుడవుతాడు.

విద్యేశ్వరసంహితేయం కథితా వో మునీశ్వరాః ।
సర్వసిద్ధిప్రదా నిత్యం ముక్తిదా శివశాసనాత్ ॥95॥

ఓ మునిశ్రేష్ఠులారా! విద్యేశ్వరసంహితలో చెప్పిన ఈ విషయాలను తెలుసుకొని ఎల్లవేళలా సిద్ధులన్నింటినీ పొందిచివరలో మోక్షాన్నిపొందుతారు.

ఇతి శ్రీశివమహాపురాణే ప్రథమాయాం విద్యేశ్వరసంహితాయాం సాధ్యసాధనఖండే రుద్రాక్షమాహాత్మ్యవర్ణనం నామ పంచవింశోఽధ్యాయః ॥25॥

శ్రీశివమహాపురాణంలో మొదటిదైన విద్యేశ్వరసంహితలోని సాధ్యసాధనఖండంలో రుద్రాక్షమాహాత్మ్య వర్ణనము అను పేరు గల విద్యేశ్వరసంహిత సమాప్తం.

విద్యేశ్వరసంహిత సమాప్తం

రుద్రసంహితా - సృష్టి ఖండః

ప్రథమోఽధ్యాయః - మొదటి అధ్యాయం

మునిప్రశ్న వర్ణనమ్ - మునిప్రశ్న వర్ణనం

శ్రీగణేశాయ నమః ॥ గౌరీ శంకరాభ్యాం నమః ॥ అథ ద్వితీయా రుద్ర సంహితా ప్రారభ్యతే ॥
విశ్వోద్భవ స్థితిలయాదిషు హేతుమేకం గౌరీపతిం విదితతత్త్వమనంతకీర్తిమ్ ॥
మాయాశ్రయం విగతమాయమచింత్యరూపం బోధస్వరూపమమలం హి శివం నమామి ॥1॥

శ్రీగణేశునకు, శ్రీగౌరీశంకరులకు నమస్కారం. ఇపుడు రెండవదైన రుద్రసంహిత ప్రారంభించబడుతోంది. ప్రపంచం యొక్క పుట్టుక, పెరుగుదల, నాశనమునకు కారణమైన వాడు, గౌరీదేవికి భర్త, తత్త్వాలను తెలిసిన వాడు, అంతులేని కీర్తి కల వాడు, మాయకు ఆశ్రయమైన వాడు, మాయచే ప్రభావితం కాని వాడు, మనసుతో ఊహించ వీలుకాని రూపం కల వాడు, జ్ఞానస్వరూపుడు, నిర్దోషి అయిన శివునికి నమస్కరిస్తున్నాను.

వందే శివం తం ప్రకృతేరనాదిం ప్రశాంతమేకం పురుషోత్తమం హి ।
స్వమాయయా కృత్స్నమిదం హి సృష్ట్వా నభో వదంతర్బహిరాస్థితో యః ॥2॥

ప్రకృతిప్రారంభం కాక ముందే ఉన్నవాడు, శాంతస్వరూపుడు, అద్వితీయుడు, పురుషోత్తముడు అయిన శివునికి నమస్కరిస్తున్నాను. ఆయన ఈ ప్రపంచాన్నంతటిని తన మాయచే పుట్టించి, ప్రపంచానికి లోపల, బయట ఆకాశం లాగ వ్యాపించి ఉన్నాడు.

వందేఽన్తరస్థం నిజగూఢరూపం శివం స్వతస్స్రష్టుమిదం విచష్టే ।
జగంతి నిత్యం పరితో భ్రమంతి యత్సన్నిధౌ చుంబకలోహవత్తమ్ ॥3॥

శివుడు ఈ ప్రపంచాన్ని తన స్వరూపం నుండి పుట్టించి, అందులోనే వ్యాపించి ఉన్నవాడై, తన రహస్య రూపంలో ప్రతిష్ఠితుడై ఉన్నాడు. అయస్కాంతం దగ్గరలో ఉన్న లోహపు ముక్క లాగ, ఈ భువనాలు ప్రతిరోజు ఆయన చుట్టూ తిరుగుతున్నాయి. అటువంటి శివునికి నమస్కరిస్తున్నాను.

వ్యాస ఉవాచ - వ్యాసుడు పలికాడు.

జగతః పితరం శంభుం జగతో మాతరం శివామ్ ।
తత్పుత్రం చ గణాధీశం నత్వైతద్వర్ణయామహే ॥4॥

జగత్తుకు తండ్రి అయిన శివుని, తల్లి అయిన పార్వతిని, వారి కుమారుడైన గణపతిని నమస్కరించి ఈ గాథను తెలియజేస్తున్నాను.

ఏకదా మునయస్సర్వే నైమిశారణ్యవాసినః ।
ప్రపచ్ఛుర్వరయా భక్త్యా సూతం తే శౌనకాదయః ॥5॥

ఒకప్పుడు నైమిశారణ్యంలో నివసించే శౌనకుడు మొదలైన మునులందరూ గొప్పభక్తితో సూతుని ప్రశ్నించారు.

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

విద్యేశ్వరసంహితాయాః శ్రుతా సత్కథా శుభా ।
సాధ్యసాధనఖండాఖ్యా రమ్యాద్యా భక్తవత్సలా ॥6॥

మంగళకరము, సాధ్యసాధనఖండము అను పేరు గలది, సుందరమైనది, మొట్టమొదటిదీ భక్తులకు అనుగ్రహకారకమైనదీ అయిన విద్యేశ్వరసంహితా ప్రసంగాన్ని విన్నాం.

సూత సూత మహాభాగ చిరంజీవ సుఖీభవ ।
యచ్ఛ్రావయసి నస్తాత శాంకరీం పరమాం కథామ్ ॥7॥

ఓ సూతా! మహాత్మా! చిరకాలం సుఖంగా జీవించు. వత్సా! నీవు మాకు శంకరుని దివ్యగాథను వినిపిస్తున్నావు కదా!

పిబంతస్త్వన్ముఖాంభోజచ్యుతం జ్ఞానామృతం వయమ్ ।
అవితృప్తాః పునః కించిత్ ప్రష్టుమిచ్ఛామహేఽనఘ ॥8॥

ఓ పుణ్యాత్మా! నీ ముఖపద్మం నుండి ప్రసరించు జ్ఞానామృతాన్ని మేము ఆస్వాదించాము. కాని మాకు తృప్తి కలుగుట లేదు. మేము నిన్ను ఒక విషయం అడగాలనుకుంటున్నాము.

వ్యాసప్రసాదాత్సర్వజ్ఞో ప్రాప్తోఽసి కృతకృత్యతామ్ ।
నాజ్ఞాతం విద్యతే కించిద్భూతం భవ్యం భవచ్చ యత్ ॥9॥

నీవు వ్యాసుని అనుగ్రహముచే సర్వజ్ఞుడవు, కృతార్థుడవు అయ్యావు. భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో నీకు తెలియనిది లేదు.

గురోర్వ్యాసస్య సద్భక్త్యా సమాసాద్య కృపాం పరామ్ ।
సర్వం జ్ఞాతం విశేషణ సర్వం సార్థం కృతం జనుః ॥10॥

నీవు గొప్ప భక్తి వల్ల గురువు అయిన వ్యాసుని యొక్క పరమకృపను పొంది, సర్వాన్ని వివరంగా తెలుసుకున్నావు. నీ జన్మ సార్థకమైనది.

ఇదానీం కథయ ప్రాజ్ఞ శివరూపమనుత్తమమ్ ।
దివ్యాని వై చరిత్రాణి శివయోరప్యశేషతః ॥11॥

ఓ గొప్పజ్ఞానీ! ఇపుడు సర్వశ్రేష్ఠమైన శివుని స్వరూపాన్ని, శివపార్వతుల దివ్యచరిత్రములను సవివరముగా తెలియజేయి.

అగుణో గుణతాం యాతి కథం లోకే మహేశ్వరః ।
శివతత్త్వం వయం సర్వే న జానీమో విచారతః ॥12॥

మహేశ్వరుడు నిర్గుణుడైనప్పటికీ లోకంలో సగుణుడిగా ఉన్నాడు. ఇది ఎలా? విచారించగా మాకెవ్వరికీ శివుని తత్త్వం అవగతమగుట లేదు.

సృష్టేః పూర్వం కథం శంభుస్స్వరూపేణావతిష్ఠతే ।
సృష్టిమధ్యే స హి కథం క్రీడన్ సంవర్తతే ప్రభుః ॥13॥

శంభుడు సృష్టికి పూర్వం ఏ స్వరూపంలో ఉండేవాడు? స్థితి కాలంలో ఆ ప్రభువు క్రీడించు విధానం ఎటువంటిది?

తదంతే చ కథం దేవస్స తిష్ఠతి మహేశ్వరః ।
కథం ప్రసన్నతాం యాతి శంకరో లోకశంకరః ॥14॥

మహేశ్వరుడు లయకాలంలో ఎలా ఉంటాడు? లోకాలకు శుభం కలుగ చేసే ఆ శంకరుడు ప్రసన్నుడగు విధానమేమిటి?

స ప్రసన్నో మహేశానః కిం ప్రయచ్ఛతి సత్ఫలమ్ ।
స్వభక్తేభ్యః పరేభ్యశ్చ తత్సర్వం కథయస్వ నః ॥15॥

ఆ మహేశ్వరుడు ప్రసన్నుడై తన భక్తులకు, ఇతరులకు ఇచ్చే సత్ఫలం ఏమిటి? ఈ విషయాన్ని మాకు సవిస్తరంగా తెలియజేయండి.

సద్యః ప్రసన్నో భగవాన్ భవతీత్యనుశుశ్రుమ ।
భక్తప్రయాసం స మహాన్న పశ్యతి దయాపరః ॥16॥

భగవంతుడు చాలా తొందరగా ప్రసన్నుడు అవుతాడని విన్నాం. దయామయుడైన ఆ మహాదేవుడు భక్తుల కష్టాలను చూడజాలడు.

బ్రహ్మా విష్ణుర్మహేశశ్చ త్రయో దేవాశ్శివాంగజాః ।
మహేశస్తత్ర పూర్ణాంశస్స్వయమేవ శివో పరః ॥17॥

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు అనే ముగ్గురు దేవతలు శివుని శరీరం నుండి పుట్టారు. వారిలో మహేశుడు శివుని యొక్క పూర్ణాంశ కలవాడు, కాబట్టి సాక్షాత్తూ శివస్వరూపుడే.

తస్యావిర్భావమాఖ్యాహి చరితాని విశేషతః ।
ఉమావిర్భావమాఖ్యాహి తద్వివాహం తథా ప్రభో! ॥18॥

హే ప్రభూ! ఆ శివుని పుట్టుక, చరిత్రలను, ఉమాదేవి పుట్టుక మరియు వారి వివాహం వివరంగా తెలియజేయండి.

తద్గార్హస్థ్యం విశేషేణ తథా లీలాః పరా అపి ।
ఏతత్సర్వం తదన్యచ్చ కథనీయం త్వయాఽనఘ! ॥19॥

ఓ అనఘా! శివుని గృహస్థాశ్రమకథలను, ఇతరలీలలను వివరంగా చెప్పండి. అవి మాత్రమే కాకుండా ఇంకనూ చెప్పదగిన విశేషాలు కూడా చెప్పగలరని ప్రార్థిస్తున్నాను.

వ్యాస ఉవాచ – వ్యాసుడు పలికాడు.

ఇతి పృష్టస్తదా తైస్తు సూతో హర్షసమన్వితః ।
స్మృతా శంభుపదాంభోజం ప్రత్యువాచ మునీశ్వరాన్ ॥20॥

ఈ విధంగా మునీశ్వరులచే ప్రార్థించబడిన సూతుడు శంభుని పాదాలను స్మరించి వారికి ఇలా సమాధానం చెప్పాడు.

సూత ఉవాచ – సూతుడు ఇలా పలికాడు.

సమ్యక్ పృష్టం భవద్భిశ్చ ధన్యా యూయం మునీశ్వరాః! ।
సదాశివ కథాయాం వో యజ్జాతా నైష్ఠికీ మతిః ॥21॥

ఓ మునిశ్రేష్ఠులారా! మీరు చక్కగా అడిగారు. మీ మనస్సులలో సదాశివుని గాథలయందు నిష్ఠ కలిగింది. మీరు ధన్యులు.

సదాశివకథాప్రశ్నః పురుషాన్ స్త్రీన్ పునాతి హి ।
వక్తారం పృచ్ఛకం శ్రోతౄన్ జాహ్నవీసలిలం యథా ॥22॥

సదాశివుని కథలను గురించిన ప్రశ్న గంగాజలం వలె స్త్రీలను, పురుషులను, అడిగేవాడిని వక్తను మరియు శ్రోతలను పవిత్రం చేస్తుంది.

శంభోర్గుణానువాదాత్కో విరజ్యేత పుమాన్ ద్విజాః! ।
వినా పశుఘ్నం త్రివిధజనానందకరాత్సదా ॥23॥

ఓ బ్రాహ్మణులారా! శంభుని గుణాల ప్రసంగం సాత్త్వికులను, రాజసులను, తామసులను కూడా ఎప్పుడూ ఆనందింపజేస్తుంది. అటువంటి ప్రసంగమునందు జీవహింసకునికి తప్ప మరెవ్వరికి విరక్తి కలుగుతుంది?

గీయమానో వితృష్ణైశ్చ భవరోగౌషధోఽపి హి ।
మనః శ్రోత్రాభిరామశ్చ యతస్సర్వార్థదస్స వై ॥24॥

శంభుని గుణములను నిష్కామభావనతో ఏకాగ్రచిత్తుడై గానం చేసే భక్తునకు సంసారం అనే రోగం తొలగి పోతుంది. ఈ గుణగానం మనస్సుకి ఆహ్లాదకరంగాను, చెవులకు ఇంపుగా చేయటమే కాక, అన్ని కార్యాలను సిద్ధింప చేస్తుంది.

కథయామి యథాబుద్ధి భవత్ప్రశ్నానుసారతః ।
శివలీలాం ప్రయత్నేన ద్విజాస్తాం శృణుతాదరాత్ ॥25॥

మీ ప్రశ్నకు సమాధానంగా నేను శివలీలను నా బుద్ధికి తోచినంతలో శ్రద్ధతో వివరిస్తాను. ఓ బ్రాహ్మణులారా! మీరు ఆదరంతో వినండి.

భవద్భిః పృచ్ఛ్యతే యద్వత్తత్తథా నారదేన వై ।
పృష్టం పిత్రే ప్రేరితేన హరిణా శివరూపిణా ॥26॥

ఒకప్పుడు నారదుడు శివస్వరూపమైన విష్ణువుచే ప్రోత్సహింపబడిన వాడై, తండ్రియైన బ్రహ్మను ఇదే ప్రశ్నను మీరు అడిగినట్లే అడిగాడు.

బ్రహ్మా శ్రుత్వా సుతవచశ్శివభక్తః ప్రసన్నధీః ।
జగౌ శివయశః ప్రీత్యా హర్షయన్ మునిసత్తమమ్ ॥27॥

శివభక్తిగల బ్రహ్మ కుమారుని ప్రశ్నను విని, ప్రసన్నమైన మనసు కలవాడై నారదునికి ఆనందం కలిగే విధంగా ప్రీతితో శివుని గూర్చి గానం చేశాడు.

సూతోక్తమితి తద్వాక్యమాకర్ణ్య ద్విజసత్తమాః! ।
పప్రచ్ఛుస్తత్సుసంవాదం కుతూహలసమన్వితాః ॥28॥

సూతుడు పలికిన ఈ మాటలను విని ఆ మునివరులు కుతూహలం కలవారై ఆ చక్కని సంవాదమును చెప్పమని ఆయనను అడిగారు.

ఋషయ ఊచుః – ఋషులు పలికారు.

సూత సూత! మహాభాగ! శైవోత్తమ! మహామతే! ।
శ్రుత్వా తవ వచో రమ్యం చేతో నస్సకుతూహలమ్ ॥29॥

ఓ సూతా! మహాత్మా! నీవు శైవులలో గొప్పవాడివి. చాలా బుద్ధిశాలివి. నీ తీయని మాటలను వినటానికి మా మనస్సులు కుతూహలంగా ఉన్నాయి.

కదా బభూవ సుఖకృద్విధినారదయోర్మహాన్ ।
సంవాదో యత్ర గిరీశసులీలా భవమోచినీ ॥30॥

బ్రహ్మకు, నారదునికి అందమైన ఆ గొప్పసంవాదం ఎప్పుడు జరిగింది? కైలాసగిరివాసుని ఆ లీలాసంవాదం సంసారంనుండి విముక్తిని కలిగిస్తుంది.

విధినారదసంవాదపూర్వకం శాంకరం యశః ।
బ్రూహి నస్తాత! తత్ప్రీత్యా తత్తత్ప్రశ్నానుసారతః ॥31॥

ఓ సూతా! శంకరుని కీర్తిని గానం చేసే బ్రహ్మ నారద సంవాదాన్ని ప్రీతితో మా ప్రశ్నలకు అనుగుణంగా మాకు వివరించండి.

ఇత్యాకర్ణ్య వచస్తేషాం మునీనాం భావితాత్మనామ్ ।
సూతః ప్రోవాచ సుప్రీతస్తత్సంవాదానుసారతః ॥32॥

పవిత్రమైన అంతఃకరణ గల ఆ మహర్షుల ఈ మాటలను విని సూతుడు చాలా సంతోషించి ఆ సంవాద వివరాలను తెలియ చేశాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే సృష్ట్యుపాఖ్యానే మునిప్రశ్నవర్ణనో నామ ప్రథమోఽధ్యాయః ॥1॥

శ్రీశివమహాపురాణం రెండవదైన రుద్రసంహిత సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటిఖండంలో మునిప్రశ్న వర్ణనమనే మొదటి అధ్యాయం సమాప్తం.

ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయం

నారదుని తపస్సు - నారదుని తపస్సు

సూత ఉవాచ - సూతుడు పలికాడు.

ఏకస్మిన్ సమయే విప్రా! నారదో మునిసత్తమః ।
బ్రహ్మపుత్రో వినీతాత్మా తపోఽర్థం మన ఆదధే ॥1॥

ఓ బ్రాహ్మణులారా! ఒకప్పుడు మునిశ్రేష్ఠుడు, బ్రహ్మకుమారుడు, వినయస్వభావం కల నారదుడు తపస్సు చేయాలని అనుకున్నాడు.

హిమశైలగుహా కాచిదేకా పరమశోభనా ।
యత్సమీపే సురనదీ సదా వహతి వేగతః ॥2॥

హిమవత్పర్వతమందు ఒక చక్కని గుహ ఉంది. దానికి దగ్గరలో జీవనదియైన గంగ వేగంగా ప్రవహిస్తూ ఉంటుంది.

తత్రాశ్రమో మహాదివ్యో నానాశోభాసమన్వితః ।
తపోఽర్థం స యయౌ తత్ర నారదో దివ్యదర్శనః ॥3॥

అక్కడ అనేకశోభలతో నిండివున్న, దివ్యమైన ఆశ్రమం ఉంది. దివ్యదర్శనుడైన నారదుడు అక్కడికి తపస్సు కోసం వెళ్ళాడు.

తాం దృష్ట్వా మునిశార్దూలస్తేపే స సుచిరం తపః ।
బధ్వాసనం దృఢం మౌనీ ప్రాణానాయమ్య శుద్ధధీః ॥4॥

ఆ మునిపుంగవుడు ఆ దివ్యనదిని చూసి, అక్కడే దృఢమైన ఆసనం వేసి, మౌనిలా ప్రాణాయామం చేస్తూ, మంచి మనస్సుతో చాలాకాలం తపస్సు చేశాడు.

చక్రే మునిస్సమాధిం తమహం బ్రహ్మేతి యత్ర హ ।
విజ్ఞానం భవతి బ్రహ్మసాక్షాత్కారకరం ద్విజాః! ॥5॥

నారదముని "అహం బ్రహ్మాస్మి" (బ్రహ్మను నేనే) అనే దర్శనం కల సమాధిని పొందాడు. ఓ బ్రాహ్మణులారా! ఇలాంటి తపస్సు వల్ల బ్రహ్మసాక్షాత్కారానికి కారణమయ్యే జ్ఞానం సిద్ధిస్తుంది.

ఇత్థం తపతి తస్మిన్ వై నారదే మునిసత్తమే ।
చకంపేఽథ శునాసీరో మనస్సంతాపవిహ్వలః ॥6॥

మునిపుంగవుడైన నారదుడు ఈ విధంగా తపస్సు చేస్తుంటే, మనస్సంతాపంతో విహ్వలుడైన ఇంద్రుడు కంపించి పోయాడు.

మనసీతి విచింత్యాసౌ మునిర్మే రాజ్యమిచ్ఛతి ।
తద్విఘ్నకరణార్థం హి హరిర్యత్నమియేష సః ॥7॥

"ఈ మహర్షి నా రాజ్యాన్ని కోరుకుంటున్నాడు" అని అనుకున్నవాడై ఇంద్రుడు నారదుని తపస్సును భంగం చేయాలని నిశ్చయించుకున్నాడు.

సస్మార స్మరం శక్రశ్చేతసా దేవనాయకః ।
ఆజగామ ద్రుతం కామస్సమధీర్మహిషీసుతః ॥8॥

దేవతల నాయకుడైన ఇంద్రుడు మనసులో మన్మథుణ్ణి తలచాడు. అపుడు మహిమ కలవాడు, పుష్పబాణుడు అయిన మన్మథుడు వెంటనే వచ్చాడు.

అథాగతం స్మరం దృష్ట్వా సంబోధ్య సురరాట్ ప్రభుః ।
ఉవాచ తం ప్రపశ్యాశు స్వార్థే కుటిలశేముషిః ॥9॥

దేవతలకు ప్రభువైన ఇంద్రుడు మన్మథుడు రావటాన్ని చూశాడు. అతడు తన స్వార్థాన్ని సాధించుకోవటంలో కుటిలమైన బుద్ధిచతురత కలవాడు. అతడు మన్మథుణ్ణి వెంటనే పిలిచి ఇలా అన్నాడు.

ఇంద్ర ఉవాచ - ఇంద్రుడు అన్నాడు.

మిత్రవర్య! మహావీర! సర్వదా హితకారక! ।
శృణు ప్రీత్యా వచో మే త్వం కురు సాహాయ్యమాత్మనా ॥10॥

ఓ శ్రేష్ఠమిత్రమా! నీవు గొప్పవీరుడవు. మాకు ఎప్పుడు హితాన్ని చేసే వాడివి. నీవు నా మాటలను ప్రేమతో విని సహాయము చేయుము.

త్వద్బలాన్మే బహూనాం చ తపోగర్వో వినాశితః ।
మద్రాజ్యస్థిరతా మిత్ర! త్వదనుగ్రహతస్సదా ॥11॥

నేను నీ బలంతోనే అనేకమంది తపోగర్వాన్ని అణిచి వేశాను. ఓ మిత్రమా! నా రాజ్యం యొక్క స్థిరత్వం అన్ని వేళల్లో నీ అనుగ్రహంపై ఆధారపడి ఉంది.

హిమశైలగుహాయాం హి మునిస్తపతి నారదః ।
మనసోద్దిశ్య విశ్వేశం మహా సంయమవాన్ దృఢః ॥12॥

హిమవత్పర్వతగుహలో నారదుడు విశ్వేశునుద్దేశించి, గొప్ప నియమముతో కఠినమైన తపస్సును చేస్తున్నాడు.

యాచేన్న విధితో రాజ్యం స మమేతి విశంకితః ।
అద్యైవ గచ్ఛ తత్ర త్వం తత్తపో విఘ్నమాచర ॥13॥

ఆ నారదుడు నా రాజ్యాన్ని వరంగా కోరుతాడేమో అని శంక కలుగుతోంది. నీవు ఈ రోజే అక్కడికి వెళ్ళి ఆయన తపస్సును భంగం చేయాలి.

ఇత్యాజ్ఞప్తో మహేంద్రేణ స కామస్సమధుప్రియః ।
జగామ తత్థ్సలం గర్వాదుపాయం స్వం చకార హ ॥14॥

ఈ విధంగా మహేంద్రునిచే ఆజ్ఞాపించబడిన ఆ మన్మథుడు ప్రియస్నేహితుడైన వసంతునితో కలసి గర్వంతో ఆ ప్రదేశానికి వెళ్లి తన ప్రయత్నాన్ని మొదలు పెట్టాడు.

రచయామాస తత్రాశు స్వకలాస్సకలా అపి ।
వసంతోఽపి స్వప్రభావం చకార వివిధం మదాత్ ॥15॥

అతడు అక్కడ తన కళలనన్నింటినీ ప్రదర్శించాడు. వసంతుడు కూడా గర్వించి తన ప్రభావాన్ని అనేకవిధాలుగా చూపించాడు.

న బభూవ మునేశ్చేతో వికృతం మునిసత్తమాః! ।
భ్రష్టో బభూవ తద్గర్వో మహేశానుగ్రహేణ హ ॥16॥

ఓ మునులారా! నారదుని మనస్సు మహేశ్వరుని అనుగ్రహం వల్ల వికారం పొంద లేదు. మన్మథునికి గర్వభంగమైంది.

శృణుతాదరతస్తత్ర కారణం శౌనకాదయః ।
ఈశ్వరానుగ్రహేణాత్ర న ప్రభావః స్మరస్య హి ॥17॥

ఓ శౌనకాది ఋషులారా! అలా జరగటానికి గల కారణం శ్రద్ధగా వినండి. ఈశ్వరుని ప్రభావం ఉన్న ఆ ప్రదేశంలో మన్మథుని శక్తి నిరుపయోగమయ్యింది.

అత్రైవ శంభునాఽకారి సుతపశ్చ స్మరారిణా ।
అత్రైవ దగ్ధస్తేనాశు కామో మునితపోపహః ॥18॥

మన్మథశత్రువైన శంభుడు గొప్పతపస్సు చేసిన చోటు ఇదే. మహర్షుల తపస్సు భంగం చేసే మన్మథుడు అక్కడే శివుని చేత దగ్ధం చేయబడ్డాడు.

కామజీవనహేతోర్హి రత్యా సంప్రార్థితైస్సురైః ।
సంప్రార్థిత ఉవాచేదం శంకరో లోకశంకరః ॥19॥

మన్మథుణ్ణి బ్రతికించమని రతీదేవి దేవతలను ప్రార్థించగా, వారు శివుణ్ణి ప్రార్థించారు. లోకాలకు మంగళమును చేయు శంకరుడు అపుడు ఇలా అన్నాడు.

కంచిత్సమయమాసాద్య జీవిష్యతి సురాః! స్మరః ।
పరం త్విహ స్మరోపాయశ్చరిష్యతి న కశ్చన ॥20॥

ఓ దేవతలారా! కొంత కాలం తరువాత మన్మథుడు జీవిస్తాడు. కాని ఈ ప్రదేశంలో మన్మథుని ప్రతాపములేవీ సాగవు.

ఇహ యావద్దృశ్యతే భూర్జ్ఞనైస్థిత్వాఽమరాస్సదా ।
కామబాణప్రభావోఽత్ర న చలిష్యత్యసంశయమ్ ॥21॥

ఓ దేవతలారా! ఇచటనుండి కనుచూపుమేర వరకు ఉండే ప్రాంతంలో మన్మథబాణాల ప్రభావం పని చేయదు. దీనిలో ఎటువంటి సందేహం లేదు.

ఇతి శంభూక్తితః కామో మిథ్యాత్మగతికస్తదా ।
నారదే స జగామాశు దివమింద్రసమీపతః ॥22॥

శివుని మాటల వల్ల నారదునియందు తన ప్రతాపం భగ్నం కాగా, మన్మథుడు వెంటనే ఇంద్రుని దగ్గరకు స్వర్గం వెళ్లాడు.

ఆచఖ్యౌ సర్వవృత్తాంతం ప్రభావం చ మునేస్స్మరః ।
తదాజ్ఞయా యయౌ స్థానం స్వకీయం స మధుప్రియః ॥23॥

మన్మథుడు నారదుని ప్రభావాన్ని, జరిగిన కథను పూర్తిగా ఇంద్రునికి తెలియ చేశాడు. వసంతమిత్రుడైన మన్మథుడు ఇంద్రుని దగ్గర సెలవు తీసుకొని తన చోటుకి బయలుదేరాడు.

విస్మితోఽ భూత్సురాధీశః ప్రశశంసాథ నారదమ్ ।
తద్వృత్తాంతానభిజ్ఞో హి మోహితశ్శివమాయయా ॥24॥

అపుడు ఇంద్రుడు ఆశ్చర్యపడి నారదుణ్ణి మెచ్చుకున్నాడు. నారదుని కథ తెలియని ఇంద్రుడు శివమాయచే మోహితుడయ్యాడు.

దుర్జ్ఞేయా శాంభవీమాయా సర్వేషాం ప్రాణినామిహ ।
భక్తం వినార్పితాత్మానం తయా సమ్మోహ్యతే జగత్ ॥25॥

శివుని మాయ అన్నిప్రాణులకు తెలియశక్యం కాదు అన్నింటిని స్వయంగా అర్పణ చేసిన భక్తులు తప్ప. ఈ ప్రపంచమంతా శివుని మాయచే మోహితమౌతుంది.

నారదోఽ పి చిరం తస్థౌ తత్రేశానుగ్రహేణ హ ।
పూర్ణం మత్వా తపస్తత్స్వం విరరామ తతో మునిః ॥26॥

ఈశ్వరుని అనుగ్రహంతో నారదుడు అక్కడ చాలా కాలం ఉన్నాడు. తర్వాత తన తపస్సు పూర్ణమైనదని తలచి విరమించాడు.

కామాజ్జయం నిజం మత్వా గర్వితోఽ భూన్మునీశ్వరాః! ।
వృథైవ విగతజ్ఞానశ్శివమాయావిమోహితః ॥27॥

మన్మథునిపై విజయం తన గొప్పతనం అని మహర్షి నారదుడు అనుకున్నాడు. ఆయన శివమాయచే మోహితుడైన నారదుడు తన విజ్ఞానాన్ని పోగొట్టుకొని వ్యర్థంగా ఉండి పోయాడు.

ధన్యా ధన్యా మహామాయా శాంభవీ మునిసత్తమాః! ।
తద్గతిం న హి పశ్యంతి విష్ణుబ్రహ్మాదయోఽ పి హి ॥28॥

ఓ మునులారా! శంభుని మహామాయ చాలా ధన్యమైనది. బ్రహ్మ, విష్ణువులకు కూడా దాని ప్రసారం తెలియనిది.

తయా సమ్మోహితోఽతీవ నారదో మునిసత్తమః ।
కైలాసం ప్రయయౌ శీఘ్రం స్వవృత్తం గదితుం మదీ ॥29॥

మునిశ్రేష్ఠుడైన నారదుడు ఆ మాయచే సమ్మోహితుడై, గర్వితుడై తన గొప్పతనాన్ని శివునికి చెప్పాలనుకొని వెంటనే కైలాసానికి బయలుదేరాడు.

రుద్రం నత్వాబ్రవీత్సర్వం స్వవృత్తం గర్వవాన్మునిః ।
మత్వాత్మానం మహాత్మానం స్వప్రభుం చ స్మరంజయమ్ ॥30॥

గర్వంతో నారదమహర్షి మహాత్ముడనని, మన్మథుని జయించినవాడనని తనను భావించుకొని తన ప్రభువైన రుద్రునకు నమస్కరించి ఇలా పలికాడు.

తచ్ఛ్రుత్వా శంకరః ప్రాహ నారదం భక్తవత్సలః ।
స్వమాయామోహితం హేత్వనభిజ్ఞం భ్రష్టచేతసమ్ ॥31॥

భక్తవత్సలుడైన శంకరుడు ఆ మాటలను విని, తన మాయ వల్ల వివేకాన్ని కోల్పోయిన నారదునితో ఇలా అన్నాడు.

రుద్ర ఉవాచ – రుద్రుడు పలికాడు.

హే తాత! నారద! ప్రాజ్ఞ! ధన్యస్త్వం శృణు మద్వచః ।
వాచ్యమేవం న కుత్రాపి హరేరగ్రే విశేషతః ॥32॥

వత్సా! నారదా! నీవు ప్రాజ్ఞుడవు. ధన్యుడవు. నీవు నా మాటలు విను. ఈ మాటలను ఇతరుల వద్ద చెప్పకు. విశేషించి విష్ణువు దగ్గర చెప్పరాదు.

పృచ్ఛమానోఽపి న బ్రూయాః స్వవృత్తం మే యదుక్తవాన్ ।
గోప్యం గోప్యం సర్వథా హి నైవ వాచ్యం కదాచన ॥33॥

నీవు నాకు చెప్పిన ఈ కథను అడిగినా ఎవరికీ చెప్పకు. సర్వధా అతిరహస్యంగా ఉంచు. ఎన్నటికీ దీనిని బయట పెట్టకు.

శాస్మ్యహం త్వాం విశేషేణ మమ ప్రియతమో భవాన్ ।
విష్ణుభక్తో యతస్త్వం హి తద్భక్తోఽతీవ మేఽనుగః ॥34॥

నీవు విష్ణుభక్తుడవు. విష్ణుభక్తులు నాయందు కూడా మిక్కిలి భక్తిని కలిగి ఉంటారు. కావున నీవు నాకు చాలా ఇష్టమైనవాడవు. కావున నేను నిన్ను ప్రత్యేకించి శాసిస్తున్నాను.

శాస్తిస్మేత్థం చ బహుశో రుద్రస్సూతికరః ప్రభుః ।
నారదో న హి తం మేనే శివమాయావిమోహితః ॥35॥

ఈ విధంగా జగత్తును సృష్టించి, పాలించే రుద్రుడు నారదునికి అనేకవిధాలుగా నచ్చ జెప్పాడు. అయినా నారదుడు శివమాయా విమోహితుడై ఆ మాటలను లెక్క చేయలేదు.

ప్రబలా భావినీ కర్మ గతిర్జ్ఞేయా విచక్షణైః ।
న నివార్యా జనైః కైశ్చిదపీచ్ఛా సైవ శాంకరీ ॥36॥

రాబోవు కర్మఫలాలు చాలా బలీయమైనవి అని విద్వాంసులు తెలుసుకోవాలి. మానవులు ఎవరైనా తప్పించుకోవాలని అనుకున్నా కర్మను తప్పించుకొనలేరు. శంకరుని ఇష్టప్రకారం కర్మగతి ప్రవర్తిస్తుంది.

తతస్స మునివర్యో హి బ్రహ్మలోకం జగామ హ ।
విధిం నత్వాఽబ్రవీత్కామజయం స్వస్య తపోబలాత్ ॥37॥

అపుడా నారద మహర్షి బ్రహ్మలోకానికి వెళ్ళి బ్రహ్మకు నమస్కరించి, తన తపశ్శక్తితో కాముని జయించానని బ్రహ్మకు చెప్పాడు.

తదాకర్ణ్య విధిస్సోఽథ స్మృత్వా శంభుపదాంబుజమ్ ।
జ్ఞాత్వా సర్వం కారణం తన్నిషిషేధ సుతం తదా ॥38॥

బ్రహ్మ ఆ మాటలను విని శంభుని పాదపద్మాలను స్మరించి, కాముని జయించుటకు గల కారణాలన్నింటిని తెలుసుకొని, తన కుమారుడైన నారదుని ఆ విధంగా ప్రచారం చేయవద్దని చెప్పాడు.

మేనే హితం న విధ్యుక్తం నారదో జ్ఞానిసత్తమః ।
శివమాయామోహితశ్చ రూఢచిత్తమదాంకురః ॥39॥

నారదుడు గొప్పజ్ఞాని అయినప్పటికీ, శివమాయచే మోహితుడై, అతని మనసులో గర్వం పుట్టి, బ్రహ్మ మాటలను పెడచెవిని పెట్టాడు.

శివేచ్ఛా యాదృశీ లోకే భవత్యేవ హి సా తదా ।
తదధీనం జగత్సర్వం వచస్యస్తిస్థితం యతః ॥40॥

లోకములందు అన్ని శివుని కోరిక ప్రకారం జరుగుతాయి. జగత్తు అంతా శివుని ఆధీనంలో ఉంటుంది ఇది నిజం. అతని మాటలోనే అంతా ఉంది.

నారదోఽథ యయౌ శీఘ్రం విష్ణులోకం వినష్టధీః ।
మదాంకురమనా వృత్తం గదితుం స్వం తదగ్రతః ॥41॥

వివేకం నశించిన నారదుడు గర్వంతో తన గొప్పతనాన్ని ప్రకటించటానికి వెనువెంటనే విష్ణులోకానికి వెళ్ళాడు.

ఆగచ్ఛంతం మునిం దృష్ట్వా నారదం విష్ణురాదరాత్ ।
ఉత్థిత్వాగ్రే గతోఽరం తం శిశ్లేషజ్ఞాతహేతుకః ॥42॥

నారదముని రావటం చూసి, విష్ణువు లేచి ఎదురుగా వెళ్ళి కౌగిలించుకొన్నాడు. నారదుడు ఎందుకు వచ్చాడో ఆయనకు తెలుసు.

స్వాసనే సముపావేశ్య స్మృత్వా శివపదాంబుజమ్ ।
హరిః ప్రాహ వచస్తథ్యం నారదం మదనాశనమ్ ॥43॥

విష్ణువు నారదుని తన ఆసనం మీద కూర్చోబెట్టి, శివుని పాదాలను స్మరించి అతని గర్వాన్ని పోగొట్టే వాస్తవమైన పలుకులను ఇలా పలికాడు.

విష్ణుః ఉవాచ – విష్ణువు పలికాడు.

కుత ఆగమ్యతే తాత! కిమర్థమిహ చాగతః ।
ధన్యస్త్వం మునిశార్దూల! తీర్థోఽహం తు తవాగమాత్ ॥44॥

వత్సా! ఎక్కడినుండి వస్తున్నావు? ఇక్కడికి రావటానికి కారణమేమిటి? ఓ మునిశ్రేష్ఠా! నీవు ధన్యుడవు. నీవు రావటంవల్ల నేను పవిత్రుడనైనాను.

విష్ణువాక్యమితి శ్రుత్వా నారదో గర్వితో మునిః ।
స్వవృత్తం సర్వమాచష్ట సమదం మదమోహితః ॥45॥

విష్ణువు మాటలు విన్న నారదుడు మోహానికి వశుడై అహంకారంతో జరిగిన కథంతా చెప్పాడు.

శ్రుత్వా మునివచో విష్ణుస్సమదం కారణం తతః ।
జ్ఞాతవానఖిలం స్మృత్వా శివపాదాంబుజం హృది ॥46॥

అపుడు విష్ణువు గర్వంతో నారదుడు పలికిన వాక్యాలు విన్నాడు. తదనంతరం విష్ణువు శివపాదాంబుజాలను మనసులో స్మరించి కామజయానికి కారణాలనన్నింటిని తెలుసుకున్నాడు.

తుష్టావ గిరిశం భక్త్యా శివాత్మా శైవరాడ్ హరిః ।
సాంజలిర్విసుధీర్నమ్రమస్తకః పరమేశ్వరమ్ ॥47॥

పరిశుద్ధమైన మనస్సుతో శివాత్ముడైన, శైవాగ్రగణ్యుడైన విష్ణువు శిరస్సు వంచి, దోసిలి పట్టి పరమేశ్వరుని భక్తితో ప్రార్థించాడు.

విష్ణురువాచ – విష్ణువు ఇలా పలికాడు.

దేవదేవ! మహాదేవ! ప్రసీద పరమేశ్వర! ।
ధన్యస్త్వం శివ! ధన్యా తే మాయా సర్వవిమోహినీ ॥48॥

హే శివా! పరమేశ్వరా! నీవు దేవదేవుడవు. అనుగ్రహించు. నీవు ధన్యుడవు. అందరిని మోహింప చేసే నీ మాయ ధన్యమైనది.

ఇత్యాది స స్తుతిం కృత్వా శివస్య పరమాత్మనః ।
నిమీల్య నయనే ధ్యాత్వా విరరామ పదాంబుజమ్ ॥49॥

ఈ విధంగా విష్ణువు పరమేశ్వరుణ్ణి స్తుతించి, కళ్లు మూసుకొని, శివుని పాదపద్మాలను ధ్యానించి విరమించాడు.

యత్కర్తవ్యం శంకరస్య స జ్ఞాత్వా విశ్వపాలకః ।
శివశాసనతః ప్రాహ హృదాథ మునిసత్తమమ్ ॥50॥

శివుని ఆజ్ఞచే జగత్తును పరిపాలించే విష్ణువు మనస్సులో శంకరప్రభావమైన కామజయవిషయాన్ని తెలుసుకొని నారదమహర్షితో ఇలా అన్నాడు.

విష్ణురువాచ - విష్ణువు ఇలా పలికాడు.

ధన్యస్త్వం మునిశార్దూల తపోనిధిరుదారధీః ।
భక్తిత్రికం న యస్యాస్తి కామమోహాదయో మునే ॥51॥

వికారాస్తస్య సద్యో వై భవంత్యఖిలదుఃఖదాః ।
నైష్ఠికో బ్రహ్మచారీ త్వం జ్ఞానవైరాగ్యవాన్ సదా ॥52॥

ఓ మునిశ్రేష్ఠా! నీవు ధన్యుడవు. తపస్సునకు నిధి వంటి వాడవు. గొప్పజ్ఞానివి. ఓ మహర్షీ! భక్తి జ్ఞాన వైరాగ్యాలనే మూడు లేనివానికి సర్వదుఃఖాలను ఇచ్చే కామమోహాది వికారాలు వెంటనే కలుగుతాయి. నీవు నిష్ఠ గల బ్రహ్మచారివి. ఎపుడూ జ్ఞానవైరాగ్యాలు కలిగిన వాడవు.

కథం కామవికారీ స్యా జ్జన్మనాఽవికృతస్సుధీః ।
ఇత్యాద్యుక్తం వచో భూరి శ్రుత్వా స మునిసత్తమః ॥53॥

విజహాస హృదా నత్వా ప్రత్యువాచ వచో హరిమ్ ।
కిం ప్రభావః స్మరస్స్వామిన్ కృపా యద్యస్తి తే మయి ॥54॥

ఇత్యుక్త్వా హరిమానమ్య యయౌ యాదృచ్ఛికో మునిః ॥55॥

నీవు జన్మతః కామవికారాలు లేనివాడవు. గొప్పజ్ఞానివి. నీకు కామవికారమెట్లు కలుగుతుంది? ఈ విధంగా అనేకమైన మాటలను విని ఆ నారద మహర్షి పెద్దగా నవ్వాడు. అతడు మనస్సులో విష్ణువునకు నమస్కరించి ఇలా బదులు చెప్పాడు. ప్రభూ! నీ దయ నాయందు ఉంటే మన్మథుని ప్రభావం నన్నేమి చేస్తుంది? ఈ విధంగా మాట్లాడి విష్ణువునకు నమస్కరించి ఆ మహర్షి తన దారిన తాను వెళ్ళిపోయాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే నారదతపోవర్ణనం నామ ద్వితీయోఽధ్యాయః ॥2॥

శ్రీశివమహాపురాణంలోని రెండవది అయిన రుద్రసంహితలో సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటిఖండంలో నారదతపోవర్ణనమనే రెండవ అధ్యాయం సమాప్తం.

తృతీయోఽధ్యాయః - మూడవ అధ్యాయం

నారదుని మోహం - నారదుని మోహం

ఋషయ ఊచుః - ఋషులు పలికారు.

సూత సూత! మహాభాగ! వ్యాసశిష్య! నమోఽస్తు తే ।
అద్భుతేయం కథా తాత వర్ణితా కృపయా హి నః ॥1॥

ఓ సూతా! మహాత్మా! వ్యాసశిష్యుడవైన నీకు నమస్కారం. వత్సా! నీవు మాకు దయతో ఈ అద్భుతమైన కథను చెప్పావు.

మునౌ గతే హరిస్తాత కిం చకార తతః పరమ్ ।
నారదోఽపి గతః కుత్ర తన్మే వ్యాఖ్యాతుమర్హసి ॥2॥

ఓ వత్సా! మహర్షి వెళ్లిన తరువాత విష్ణువు ఏమి చేశాడు? నారదుడు ఎక్కడికి వెళ్లాడు? దయచేసి ఆ విషయాలను తెలియజేయగలరు.

వ్యాస ఉవాచ - వ్యాసుడు ఇలా చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచస్తేషాం సూతః పౌరాణికోత్తమః ।
ప్రత్యువాచ శివం స్మృత్వా నానాసూతికరం బుధః ॥3॥

పౌరాణికశ్రేష్ఠుడు, విద్వాంసుడు అయిన సూతుడు వాళ్ళ ఈ మాటలను విని అనేకలీలలు చేసే శివుని స్మరించి ఇలా పలికాడు.

సూత ఉవాచ - సూతుడు ఇలా పలికాడు.

మునౌ యదృచ్ఛయా విష్ణుర్గతే తస్మిన్ హి నారదే ।
శివేచ్ఛయా చకారాశు మాయా మాయావిశారదః ॥4॥

ఆ నారదముని తన దారిని వెళ్లగానే, మాయలు కల్పించటంలో సమర్థుడైన విష్ణువు శివుని ఇచ్ఛానుసారం వెంటనే మాయను ప్రయోగించాడు.

మునిమార్గస్య మధ్యే తు విరేచే నగరం మహత్ ।
శతయోజనవిస్తారమద్భుతం సుమనోహరమ్ ॥5॥

స్వలోకాదధికం రమ్యం నానావస్తువిరాజితమ్ ।
నరనారీవిహారాఢ్యం చతుర్వర్ణాకులం పరమ్ ॥6॥

నారదుడు వెళ్లే దారిలో ఒక గొప్ప నగరాన్ని నిర్మించాడు. వంద యోజనాల విస్తీర్ణం ఉన్న ఆ అద్భుతనగరం చాలా సుందరంగా ఉంది.

విష్ణులోకం కన్నా సుందరంగా ఆ నగరం అనేకవస్తువులతో ప్రకాశిస్తున్నది. ఇది స్త్రీ పురుషులు విహారయోగ్యమైనది. నాలుగు వర్ణాల వారితో ఆ నగరం విరాజిల్లింది.

తత్ర రాజా శీలనిధిర్నామైశ్వర్యసమన్వితః ।
సుతాస్వయంవరోద్యుక్తో మహోత్సవసమన్వితః ॥7॥

ఆ నగరాన్ని శీలనిధి అనే రాజు పరిపాలిస్తున్నాడు. అతడు చాలా సంపన్నుడు. అతడు తన కుమార్తె వివాహం చేయడానికి సముద్యుక్తుడై, మహోత్సాహంతోనున్నాడు.

చతుర్దిగ్భ్యః సమయాతైస్సంయుతం నృపనందనైః ।
నానావేషైస్సుశోభైశ్చ తత్కన్యావరణోత్సుకైః ॥8॥

ఏతాదృశం పురం దృష్ట్వా మోహం ప్రాప్తోఽథ నారదః ।
కౌతుకీ తన్నృపద్వారం జగామ మదనైధితః ॥9॥

ఆ కన్యను పెళ్లి చేసుకోవాలనే ఉత్సుకతతో నాలుగు దిక్కుల నుండి రాజకుమారులు వచ్చారు. సుందరమైన వేషాలను ధరించిన, ఆ రాజకుమారులతో నిండిన ఆ నగరాన్ని చూసి నారదుడు మోహం పొందాడు. అతడు కామవశుడై, ఉత్కంఠతో రాజద్వారం దగ్గరకు వెళ్లాడు.

ఆగతం మునివర్యం తం దృష్ట్వా శీలనిధిర్నృపః ।
ఉపవేశ్యార్చయాంచక్రే రత్నసింహాసనే వరే ॥10॥

అక్కడకు వచ్చిన నారదమునిని చూసి శీలనిధి మహారాజు ఆయనను శ్రేష్ఠమైన రత్నసింహాసనం మీద కూర్చోబెట్టి పూజించాడు.

అథ రాజా స్వతనయాం నామతశ్శ్రీమతీం వరామ్ ।
సమానీయ నారదస్య పాదయోస్సమపాతయత్ ॥11॥

అపుడు రాజు తన కుమార్తె అయిన శ్రీమతిని పిలిచాడు. ఆమెచే రాజు నారదుని పాదాలకు నమస్కరింప చేశాడు.

తత్కన్యాం ప్రేక్ష్య స మునిర్నారదః ప్రాహ విస్మితః ।
కేయం రాజన్మహాభాగా కన్యా సురసుతోపమా ॥12॥

నారదమహర్షి ఆ కన్యను చూసి, ఆశ్చర్యపడి ఇలా అన్నాడు. రాజా! దేవకన్యలా ఉన్న ఈ శ్రేష్ఠకన్య ఎవరు?

తస్య తద్వచనం శ్రుత్వా రాజా ప్రాహ కృతాంజలిః ।
దుహితేయం మమ మునే శ్రీమతీ నామ నామతః ॥13॥

రాజు ఆ మాటలు విని, దోసిలి పట్టి ఇలా పలికాడు. మహర్షీ! ఈమె నా కుమార్తె. పేరు శ్రీమతి.

ప్రదానసమయం ప్రాప్తా వరమన్వేషతీ శుభమ్ ।
సా స్వయంవరసంప్రాప్తా సర్వలక్షణలక్షితా ॥14॥

ఈమెను కన్యాదానం చేయవలసిన సమయం వచ్చింది. అన్ని శుభలక్షణాలు గల ఈమెకు సరియైన వరుని కోసం స్వయంవరం ఏర్పాటు చేశాము.

అస్యా భాగ్యం వద మునే సర్వం జాతకమాదరాత్ ।
కీదృశం తనయేయం మే వరమాప్స్యతి తద్వద ॥15॥

ఓ మహర్షీ! ఈమె జాతకాన్ని చూసి ఈమె భాగ్యాన్ని చెప్పండి. ఈమె ఎటువంటి భర్తను పొందుతుందో సెలవీయగలరు.

ఇత్యుక్తో మునిశార్దూలస్తామిచ్ఛుః కామవిహ్వలః ।
సమాభాష్య స రాజానం నారదో వాక్యమబ్రవీత్ ॥16॥

ఆమెను పొందాలని కోరిక కల నారదుడు మన్మథ విచలితుడై రాజును ఉద్దేశించి ఇలా పలికాడు.

సుతేయం తవ భూపాల సర్వలక్షణలక్షితా ।
మహాభాగ్యవతీ ధన్యా లక్ష్మీరివ గుణాలయా ॥17॥

ఓ రాజా! ఈ నీ కుమార్తె అన్ని మంచి లక్షణాలతో విరాజిల్లుతోంది. ఈమె మహాభాగ్యం కల ధన్యురాలు. ఈమె లక్ష్మీదేవిలా మంచిగుణాలకు నిలయమైనది.

సర్వేశ్వరోఽజితో వీరో గిరీశసదృశో విభుః ।
అస్యాః పతిర్ధ్రువం భావీ కామజిత్సురసత్తమః ॥18॥

సర్వసమర్థుడు, ఓటమి తెలియనివాడు, వీరుడు, శివునితో సమానమైన మహిమ కలవాడు, మన్మథుని జయించిన వాడు అయిన దేవశ్రేష్ఠుడు ఈమెకు భర్త కాగలడు.

ఇత్యుక్త్వా నృపమామంత్ర్య యయౌ యాదృచ్ఛికో మునిః ।
బభూవ కామవివశశ్శివమాయావిమోహితః ॥19॥

ఈ విధంగా రాజుతో మాట్లాడిన నారదుడు రాజు దగ్గర సెలవు తీసుకొని తన దారిన తాను వెళ్లాడు. ఆ ఋషి శివమాయచే మోహితుడై కామానికి వశుడై ఉన్నాడు.

చిత్తే విచింత్య స మునిరాప్నుయాం కన్యకాం కథమ్ ।
స్వయంవరే నృపాలానామేకం మాం వృణుయాత్కథమ్ ॥20॥

"ఈమెను నేను పొందుట ఎలాగ? రాజకుమారులు వచ్చే స్వయంవరంలో ఈమె నన్ను వరించే ఉపాయం ఏమిటి?" అని మహర్షి తన మనసులో ఆలోచించాడు.

సౌందర్యం సర్వనారీణాం ప్రియా భవతి సర్వథా ।
తద్దృష్ట్వైవ ప్రసన్నా సా స్వవశా నాత్రసంశయః ॥21॥

స్త్రీలందరికి సౌందర్యమంటేనే ఇష్టం. సౌందర్యం చూసి మాత్రమే ఆమె తనకు వశురాలవుతుందనడంలో సందేహం లేదు.

విధాయేత్థం విష్ణురూపం గ్రహీతుం మునిసత్తమః ।
విష్ణులోకం జగామాశు నారదస్స్మరవిహ్వలః ॥22॥

కామవశుడైన నారదుడు ఇలా అనుకొని విష్ణువుయొక్క రూపాన్ని పొందటానికి వెంటనే విష్ణులోకానికి వెళ్లాడు.

ప్రణిపత్య హృషీకేశం వాక్యమేతదువాచ హ ।
రహసి త్వాం ప్రవక్ష్యామి స్వవృత్తాంతమశేషతః ॥23॥

ఆయన విష్ణువుకి నమస్కరించి "నా కథను నీకు పూర్తిగా ఏకాంతంలో చెప్పాలి" అని అన్నాడు.

తథేత్యుక్తే తథా భూతే శివేచ్ఛా కార్యకర్తరి ।
బ్రూహీత్యుక్తవతి శ్రీశే మునిరాహ చ కేశవమ్ ॥24॥

శివుని ఇష్టం ప్రకారం కార్యాలను నిర్వర్తించే లక్ష్మీపతి "సరే చెప్పు" అని సమాధానం ఇవ్వగానే నారదుడు కేశవునితో ఇలా అన్నాడు.

నారద ఉవాచ - నారదుడు చెప్పాడు.

త్వదీయో భూపతిః శీలనిధిస్స వృషతత్పరః ।
తస్య కన్యా విశాలాక్షీ శ్రీమతీ వరవర్ణినీ ॥25॥

శీలనిధి మహారాజు నీ భక్తుడు. ధర్మాత్ముడు. అతని కుమార్తె విశాలమైన కన్నులు గల సుందరి. ఆమె పేరు శ్రీమతి.

జగన్మోహిన్యభిఖ్యాతా త్రైలోక్యేప్యతిసుందరీ ।
పరిణేతుమహం విష్ణో! తామిచ్ఛామ్యద్య మా చిరమ్ ॥26॥

ఆమె మూడులోకాలలోకెల్లా అద్భుతసుందరి. జగన్మోహినిగా పేరు పొందింది. హే విష్ణో! నేను ఆమెను ఈరోజే ఆలస్యం లేకుండా పెళ్లిచేసుకోవాలనుకుంటున్నాను.

స్వయంవరం చకారాసౌ భూపతిస్తనయేచ్ఛయా ।
చతుర్దిగ్భ్య స్సమాయాతా రాజపుత్రాస్సహస్రశః ॥27॥

ఆమె కోరికమేరకు శీలనిధి మహారాజు స్వయంవరాన్ని ఏర్పాటు చేశాడు. వేలాది రాజపుత్రులు నాలుగు దిక్కుల నుండి వచ్చారు.

యది దాస్యసి రూపం మే తదా తాం ప్రాప్నుయాం ధ్రువమ్ ।
త్వద్రూపం సా వినా కంఠే జయమాలాం న ధాస్యతి ॥28॥

నీవు నాకు మంచి రూపాన్ని ఇస్తే నేను ఆమెను నిశ్చయంగా పొందగలను. నీ రూపం నాకు లేకపోతే ఆమె నా మెడలో జయమాలను వేయదు.

స్వరూపం దేహి మే నాథ సేవకోఽహం ప్రియస్తవ ।
వృణుయాన్మాం యథా సా వై శ్రీమతీ క్షితిపాత్మజా ॥29॥

ఓ నాథా! నీ రూపాన్ని నాకు ప్రసాదించు. నేను నీకు ప్రియ సేవకుణ్ణి. నీ రూపం నాకుంటే ఆ రాజకుమార్తె శ్రీమతి నన్ను వరిస్తుంది.

సూత ఉవాచ – సూతుడు పలికాడు.

వచః శ్రుత్వా మునేరిత్థం విహస్య మధుసూదనః ।
శాంకరీం ప్రభుతాం బుద్ధ్వా ప్రత్యువాచ దయాపరః ॥30॥

మహర్షి యొక్క ఈ మాటను విని దయాళుడైన మధుసూదనుడు శంకరుని సామర్థ్యం తెలిసినవాడై చిరునవ్వుతో ఇలా అన్నాడు.

విష్ణు రువాచ – విష్ణువు పలికాడు.

స్వేష్టదేశం మునే గచ్ఛ కరిష్యామి హితం తవ ।
భిషగ్వరో యథార్తస్య యతః ప్రియతరోఽసి మే ॥31॥

ఓ మహర్షీ! నీవు నీకు తోచిన చోటుకి వెళ్లు. నీవు నాకు చాలా ప్రియతముడవు. కావున మంచివైద్యుడు రోగికి హితం చేకూర్చినట్టు నీకు హితం చేస్తాను.

ఇత్యుక్త్వా మునయే తస్మై దదౌ విష్ణుర్ముఖం హరేః ।
స్వరూపమనుగృహ్యాస్య తిరోధానం జగామ సః ॥32॥

విష్ణువు ఇలా పలికి ఆ నారదునికి హరి (కోతి) ముఖాన్ని ఇచ్చాడు. ఈ విధంగా తన రూపాన్ని నారదునకు అనుగ్రహించి మాయమయ్యాడు.

ఏవముక్తో మునిర్హృష్టస్స్వరూపం ప్రాప్య వై హరేః ।
మేనే కృతార్థమాత్మానం తద్యత్నం న బుబోధ సః ॥33॥

ఈ మాటలను విని నారదుడు చాలా ఆనందించి, కృతార్థుడైనట్లు తలచి, ఆయన హరి రూపాన్ని పొందాడు. విష్ణువు చేసినపనిలోని అంతరార్థాన్ని నారదుడు తెలుసుకోలేక పోయాడు.

అథ తత్ర గతశ్శీఘ్రం నారదో మునిసత్తమః ।
చక్రే స్వయంవరం యత్ర రాజపుత్రైస్సమాకులమ్ ॥34॥

అపుడు నారదమహర్షి వెనువెంటనే రాజపుత్రులతో కోలాహలంగా ఉన్న స్వయంవరసభకు చేరుకున్నాడు.

స్వయంవరసభా దివ్యా రాజపుత్రసమావృతా ।
శుశుభేఽతీవ విప్రేంద్రా యథా శక్రసభాపరా ॥35॥

ఓ విప్రశ్రేష్ఠులారా! రాజపుత్రులతో నిండివున్న ఆ దివ్యమైన స్వయంవర సభ రెండవ ఇంద్రసభ లాగ ప్రకాశించింది.

తస్యాం నృపసభాయాం వై నారదస్సముపావిశత్ ।
స్థిత్వా తత్ర విచింత్యేతి ప్రీతియుక్తేన చేతసా ॥36॥

మాం వరిష్యతి నాన్యం సా విష్ణురూపధరం ధ్రువమ్ ।
ఆననస్య కురూపత్వం న వేద మునిసత్తమః ॥37॥

నారదుడు ఆనందంతో నిండిన మనస్సు కలవాడై ఆ రాజసభలో కూర్చున్నాడు విష్ణురూపాన్ని ధరించిన తనను తప్ప ఆమె మరొకరిని వరించదు. అని నిశ్చయించుకున్నాడు. ఆ మహర్షికి తన ముఖం యొక్క కురూపత్వం తెలియదు.

పూర్వరూపం మునిం సర్వే దదృశుస్తత్ర మానవాః ।
తద్భేదం బుబుధుస్తే న రాజపుత్రాదయో ద్విజాః ॥38॥

ఓ బ్రాహ్మణులారా! అక్కడున్న జనులందరూ ఆ మహర్షి యొక్క పూర్వరూపాన్ని మాత్రమే చూశారు. రాజపుత్రులకు, ఇతరులకు నారదుని యొక్క రూపంలోని మార్పు గురించి తెలియలేదు.

తత్ర రుద్రగణౌ ద్వౌ తద్రక్షణార్థం సమాగతౌ ।
విప్రరూపధరౌ గూఢౌ తద్భేదం జజ్ఞతుః పరమ్ ॥39॥

నారదుని రక్షణ కోసం అక్కడకు బ్రాహ్మణవేషంలో వచ్చిన ఇద్దరు రుద్రానుయాయులు మాత్రం ఆ రూప భేదాన్ని తెలుసుకున్నారు.

మూఢం మత్వా మునిం తౌ తన్నికటం జగ్మతుర్గణౌ ।
కురుతస్తత్ర్పహాసం వై భాషమాణౌ పరస్పరమ్ ॥40॥

వాళ్లిద్దరు నారదుని మూఢునిగా తలచి ఆయన దగ్గరకు వెళ్లి ఒకరితో ఒకరు మాట్లాడుతూ నారదుని వెటకారం చేశారు.

పశ్య నారదరూపం హి విష్ణోరివ మహోత్తమమ్ ।
ముఖం తు వానరస్యేవ వికటం చ భయంకరమ్ ॥41॥

విష్ణువు లాంటి గొప్పరూపాన్ని కలిగిన నారదుని చూడు. కాని ఈతని ముఖం కోతిముఖం వలె వికటంగా భయంకరంగా ఉంది.

ఇచ్ఛత్యయం నృపసుతాం వృథైవ స్మరమోహితః ।
ఇత్యుక్త్వా సచ్ఛలం వాక్యముపహాసం ప్రచక్రతుః ॥42॥

మన్మథమోహం వల్ల ఇతడు రాజకుమార్తెను కోరుతున్నాడు. ఇతని కోరిక వ్యర్థం. ఈ విధంగా వారు నిందలతో మహర్షిని హేళన చేశారు.

న శుశ్రావ యథార్థం తు తద్వాక్యం స్మరవిహ్వలః ।
పర్యైక్షచ్చ్రీమతీం తాం వై తల్లిప్సుర్మోహితో మునిః ॥43॥

కామమోహంలో ఉన్న నారదమహర్షి వారు చెప్పిన నిజాన్ని చెవిని పెట్ట లేదు. ఆమెను పొందవలెనను కోరికతో మోహితుడైన నారదుడు, ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు.

ఏతస్మిన్నంతరే భూపకన్యా చాంతఃపురాత్తు సా ।
స్త్రీభిస్సమావృతా తత్రాజగామ వరవర్ణినీ ॥44॥

ఇంతలో సౌందర్యవతి అయిన రాజకుమార్తె అంతఃపురం నుండి పరిచారికలతో కలసి అక్కడికి వచ్చింది.

మాలాం హిరణ్మయీం రమ్యామాదాయ శుభలక్షణా ।
తత్ర స్వయంవరే రేజే స్థితా మధ్యే రమేవ సా ॥45॥

శుభలక్షణాలు గల ఆమె అందమైన బంగారుదండను పట్టుకొని స్వయంవరసభామధ్యలో లక్ష్మీదేవిలా నిలబడింది.

బభ్రామ సా సభాం సర్వాం మాలామాదాయ సువ్రతా ।
వరమన్వేషతీ తత్ర స్వాత్మాభీష్టం నృపాత్మజా ॥46॥

దృఢవ్రతం గల రాజకుమారి, మాలను చేత్తో పట్టుకొని తనకు నచ్చిన వరుడి కోసం వెదుకుతూ సభంతా తిరిగింది.

వానరాస్యం విష్ణుతనుం మునిం దృష్ట్వా చుకోప సా ।
దృష్టిం నివార్య చ తతః ప్రస్థితా ప్రీతమానసా ॥47॥

ఉల్లాసంగా ఉన్న ఆమె విష్ణుశరీరాన్ని, కోతి ముఖాన్ని కలిగిన ఆ మునిని చూసి కోపంతో ముఖాన్ని తిప్పుకుని అక్కడనుండి కదిలిపోయింది.

న దృష్ట్వా స్వవరం తత్ర త్రస్తాసీన్మనసేప్సితమ్ ।
అంతస్సభాస్థితా కస్మిన్నర్పయామాస న స్రజమ్ ॥48॥

ఆమెకు తన మనసుకు నచ్చిన వారెవ్వరూ దొరకరేమో అనే భయం కల్గింది. ఆమె సభలోని వారెవ్వరికీ మాలను వేయకుండా సభలో నిలబడింది.

ఏతస్మిన్నంతరే విష్ణురాజగామ నృపాకృతిః ।
న దృష్టః కైశ్చిదపరైః కేవలం సా దదర్శ హి ॥49॥

ఇంతలో అక్కడికి రాజువేషంలో విష్ణువు వచ్చాడు. ఆయన ఇతరులు ఎవ్వరికి కనిపించలేదు. ఆమె మాత్రమే ఆయనను చూసింది.

అథ సా తం సమాలోక్య ప్రసన్నవదనాంబుజా ।
అర్పయామాస తత్కంఠే తాం మాలాం వరవర్ణినీ ॥50॥

అపుడు ఆ సుందరి ఆయనను చూసి ప్రసన్నమైన ముఖపద్మం కలదై ఆయన మెడలో మాలను వేసింది.

తామాదాయ తతో విష్ణూ రాజరూపధరః ప్రభుః ।
అంతర్ధానమగాత్సద్యస్స్వస్థానం ప్రయయౌ కిల ॥51॥

అపుడు రాజరూపాన్ని ధరించిన విష్ణువు ఆమెను తీసుకొని, మాయమై వెంటనే తన లోకానికి వెళ్లాడు.

సర్వే రాజకుమారాశ్చ నిరాశాః శ్రీమతీం ప్రతి ।
మునిస్తు విహ్వలోఽతీవ బభూవ మదనాతురః ॥52॥

శ్రీమతి విషయంలో రాజకుమారులందరూ నిరాశను పొందారు. మన్మథపీడితుడై నారదుడు చాలా బాధపడ్డాడు.

తదా తావూచతుస్సద్యో నారదం స్మరవిహ్వలమ్ ।
విప్రరూపధరౌ రుద్రగణౌ జ్ఞానవిశారదౌ ॥53॥

అపుడు జ్ఞానులు, బ్రాహ్మణవేషధారులైన రుద్ర అనుచరులు ఇద్దరు బాధపడుతున్న నారదునితో ఇలా అన్నారు.

గణౌ వూచతుః – రుద్ర అనుచరులు ఇద్దరు ఇలా అన్నారు.

హే నారదమునే త్వం హి వృథా మదనమోహితః ।
తల్లిప్సుస్స్వముఖం పశ్య వానరస్యేవ గర్హితమ్ ॥54॥

ఓ నారదమునీ! నీవు కామపీడితుడవై ఆమెను కోరుకోవటం అనవసరం. నీ ముఖాన్ని చూసుకో. కోతిముఖం వలె వికటంగా ఉంది.

సూత ఉవాచ – సూతుడు పలికాడు.

ఇత్యాకర్ణ్య తయోర్వాక్యం నారదో విస్మితోఽభవత్ ।
ముఖం దదర్శ ముకురే శివమాయావిమోహితః ॥55॥

వారి మాటలను విని, ముఖాన్ని అద్దంలో చూసుకొని, ఆశ్చర్యాన్ని పొందాడు. శివమాయ వల్ల మోహితుడైన ఆ ఋషి

స్వముఖం వానరస్యేవ దృష్ట్వా చుక్రోధ సత్వరమ్ ।
శాపం దదౌ తయోస్తత్ర గణయోర్మోహితో మునిః ॥56॥

తన ముఖం కోతిముఖంలా ఉండటం చూసిన ఋషికి వెంటనే కోపం వచ్చింది. మోహంతోనున్న ఆ ముని రుద్ర అనుచరులను ఇద్దరిని శపించాడు.

యువాం మమోపహాసం వై చక్రతుర్బ్రాహ్మణస్య హి ।
భవేతాం రాక్షసౌ విప్రవీర్యజౌ హి తదాకృతీ ॥57॥

మీరిద్దరు బ్రాహ్మణుడనైన నన్ను పరిహాసం చేశారు. కావున మీరిద్దరూ బ్రాహ్మణులకు పుట్టి బ్రాహ్మణరూపం పొంది రాక్షసులు అగుదురు గాక!

శ్రుత్వా హరగణావిత్థం స్వశాపం జ్ఞానిసత్తమౌ ।
న కించిదూచతుస్తౌ హి మునిమాజ్ఞాయ మోహితమ్ ॥58॥

మహర్షి మోహితుడై ఉండటాన్ని తెలుసుకున్న శివగణంలోని ఆ జ్ఞానులిద్దరూ ఋషి తమకిచ్చిన శాపాన్ని విని ఏమీ బదులు చెప్పలేదు.

స్వస్థానం జగ్మతుర్విప్రా! ఉదాసీనౌ శివస్తుతిమ్ ।
చక్రతుర్మన్యమానౌ వై శివేచ్ఛాం సకలాం సదా ॥59॥

ఓ విప్రులారా! ఉదాసీనంగా ఉన్న వాళ్లిద్దరు తమ లోకానికి వెళ్లారు. ఎల్లవేళలా శివుని ఇష్టప్రకారం జరుగుతుందని తలచి వాళ్లు శివుణ్ణి ప్రార్థించారు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే నారదమోహవర్ణనో నామ తృతీయోఽధ్యాయః ॥3॥

శ్రీశివమహాపురాణంలోని రెండవది అయిన రుద్రసంహితలోని సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటిఖండంలో నారదమోహవర్ణనమనే మూడవ అధ్యాయం సమాప్తం.

చతుర్థోऽధ్యాయః - నాల్గవ అధ్యాయం
నారదస్య విష్ణూపదేశః - నారదునకు విష్ణువు గావించిన ఉపదేశం

ఋషయ ఊచుః - ఋషులు పలికారు.

సూత సూత! మహాప్రాజ్ఞ! వర్ణితా హ్యద్భుతా కథా ।
ధన్యా తు శాంభవీ మాయా తదధీనం చరాచరమ్ ॥1॥

ఓ సూతా! మహాజ్ఞానివైన నీవు అద్భుతమైన కథను చెప్పావు. శాంభవి మాయధన్యమైనది. ఈ ప్రపంచం అంతా దాని అధీనంలోనే ఉంది.

గతయోర్గణయోశ్శంభోస్స్వయమాత్మేచ్ఛయా విభోః ।
కిం చకార మునిః క్రుద్ధో నారదస్స్మరహ్వలః ॥2॥

శివుని అనుచరులిద్దరు శివుని ఇష్టాన్ని తెలుసుకొని, తమ స్థానానికి వెళ్లగా, కామమోహితుడైన క్రుద్ధుడైన నారదుడు ఏమి చేశాడు?

సూత ఉవాచ - సూతుడు పలికాడు.

విమోహితో మునిర్దత్వా తయోశ్శాపం యథోచితమ్ ।
జలే ముఖం నిరీక్ష్యాథ స్వరూపం గిరిశేచ్ఛయా ॥3॥

శివేచ్ఛయా న ప్రబుద్ధః స్మృత్వా హరికృతచ్ఛలమ్ ।
క్రోధం దుర్విషహం కృత్వా విష్ణులోకం జగామ హ ॥4॥

మోహితుడై ఉన్న నారదుడు వారిద్దరికి తగిన శాపాన్నిచ్చి, నీటిలో ఈశ్వరుని ఇచ్ఛవల్ల సంక్రమించిన తన ముఖాన్ని, తన దేహరూపాన్ని చూసుకున్నాడు. శివేచ్ఛ వల్ల అతనికి ఇంకా జ్ఞానప్రబోధం కాలేదు. అతడు విష్ణువు చేసిన మోసాన్ని తలచుకొని, సహింపరాని కోపాన్ని పొంది విష్ణులోకానికి వెళ్లాడు.

ఉవాచ వచనం క్రుద్ధస్సమిద్ధ ఇవ పావకః ।
దురుక్తిగర్భితం వ్యంగ్యం నష్టజ్ఞానశ్శివేచ్ఛయా ॥5॥

శివసంకల్పం వల్ల విచక్షణకోల్పోయిన నారదుడు ఇంధనం రేపిన అగ్నిలాగ క్రోధంతో మండిపడుతూ అతడు వెటకారంగా నిందాపూర్వకంగా ఇలా మాట్లాడాడు.

నారద ఉవాచ - నారదుడు పలికాడు.

హే హరే త్వం మహాదుష్టః కపటీ విశ్వమోహనః ।
పరోత్సాహం న సహసే మాయావీ మలినాశయః ॥6॥

ఓ హరీ! నీవు చాలా దుష్టుడవు. మోసగాడివి. ప్రపంచాన్ని వ్యామోహంలో పెడతావు. దుష్టస్వభావం గల నీవు ఇతరుల ఉత్సాహాన్ని సహించలేవు.

మోహినీరూపమాదాయ కపటం కృతవాన్ పురా ।
అసురేభ్యోఽపాయయస్త్వం వారుణీమమృతం న హి ॥7॥

నీవు గతంలో మోహినీ అవతారం ధరించి, మోసం చేసి, రాక్షసులచే సురను త్రాగించావు. అమృతాన్ని కాదు.

చేత్పిబేన్న విషం రుద్రో దయాం కృత్వా మహేశ్వరః ।
భవేన్నష్టాఽఖిలా మాయా తవ వ్యాజరతే హరే! ॥8॥

మోసం చేయటంలో ఆసక్తి గల ఓ హరీ! మహేశ్వరుడగు రుద్రుడు దయతో విషాన్ని తాగకుంటే, నీ మొత్తం మాయ ఆనాడే నశించి ఉండేది.

గతిస్సకపటా తేఽతి ప్రియా విష్ణో! విశేషతః ।
సాధుస్వభావో న భవాన్ స్వతంత్రః ప్రభుణా కృతః ॥9॥

ఓ హరీ! నీకు మోసమార్గమంటే చాలా ఇష్టం. విశేషించి నీవు సాధుస్వభావం కలవాడవు కాదు అయినా శంకరప్రభువు నిన్ను స్వతంత్రునిగా చేశాడు.

కృతం సముచితం నైవ శివేన పరమాత్మనా ।
తత్ప్రభావబలం ధ్యాత్వా స్వతంత్రకృతికారకః ॥10॥

త్వద్గతిం సుసమాజ్ఞాయ పశ్చాత్తాపమవాప సః ।
విప్రం సర్వోపరి ప్రాహ స్వోక్తవేదప్రమాణకృత్ ॥11॥

నిన్ను స్వతంత్రుని చేయటంలో శివుడు పొరపాటు చేశాడు. నిన్ను స్వతంత్రుని చేసిన ఈశ్వరుడు ఆ స్వతంత్ర ప్రభావాన్ని తలచుకొని, నీ ప్రవృత్తిని చూసి శివుడు పశ్చాత్తాపం పొందాడు. ఆయన తాను చెప్పిన వేదప్రమాణాన్ని చూపించి బ్రాహ్మణుడు గొప్పవాడని చెప్పాడు.

తత్ జ్ఞాత్వాహం హరే! త్వాద్య శిక్షయిష్యామి తద్బలాత్ ।
యథా న కుర్యాః కుత్రాపీదృశం కర్మ కదాచన ॥12॥

ఓ హరీ! నేను ఆ విషయాన్ని తెలుసుకొని, ఆ బలంతో నీవు మరలా ఇలాంటి పనిని ఏనాడు చేయకుండా ఉండేలా నిన్ను ఈనాడు శిక్షిస్తాను.

అద్యాపి నిర్భయస్త్వం హి సంగం నాపస్తరస్వినా ।
ఇదానీం లప్స్యసే విష్ణో! ఫలం స్వకృతకర్మణః ॥13॥

నీకు ఇప్పటికైనా భయం కలుగలేదు. నీవు ఇంతవరకు తేజశ్శాలి అయిన వ్యక్తిని ఎదుర్కోలేదు. విష్ణూ! ఈనాడు నీవు చేసిన పనికి తగిన ఫలాన్ని పొందుతావు.

ఇత్థముక్త్వా హరిం సోఽథ మునిర్మాయా విమోహితః ।
శశాప క్రోధనిర్విణ్ణో బ్రహ్మతేజః ప్రదర్శయన్ ॥14॥

మాయామోహితుడైన నారదుడు విష్ణువుతో ఈ విధంగా బ్రహ్మతేజస్సును ప్రదర్శిస్తూ, క్రోధావేశంతో శపించాడు.

స్త్రీకృతే వ్యాకులం విష్ణో! మామకార్షీర్విమోహకః ।
అన్వకార్షీస్స్వరూపేణ యేన కాపట్యకార్యకృత్ ॥15॥

తద్రూపేణ మనుష్యస్త్వం భవ తద్దుఃఖభుగ్ఘరే ।
యన్ముఖం కృతవాన్ మే త్వం తే భవంతు సహాయినః ॥16॥

స్త్రీ కోసం నేను వ్యాకులపడేలా చేశావు. హరీ! నీవు మోసం చేసి నాకు ఏ రూపాన్నిచ్చావో అదే రూపంతో మనిషివై జన్మించి ఆ జన్మలో ఈ దుఃఖాన్ని అనుభవిస్తావు. నీవు నాకు ఏ కోతి రూపాన్ని ప్రసాదించావో అవే కోతులు నీకు సహాయం చేస్తాయి.

త్వం స్త్రీ వియోగజం దుఃఖం లభస్వ పరదుఃఖదః ।
మనుష్యగతికః ప్రాయో భవాజ్ఞానవిమోహితః ॥17॥

నీవు స్త్రీవియోగదుఃఖం పొందుతావు. తరుచు ఇతరులకు దుఃఖాన్ని కలిగించే మానవజన్మను పొంది, అజ్ఞాన మోహితుడవుకాగలవు.

ఇతి శప్త్వా హరిం మోహాన్నారదోఽజ్ఞానమోహితః ।
విష్ణుర్జగ్రాహ తం శాపం ప్రశంసన్ శాంభవీమజామ్ ॥18॥

అజ్ఞానంతో మోహితుడైన నారదుడు విష్ణువును ఇలా శపించగా, విష్ణువు ఆ శివమాయను మెచ్చుకొని, ఆ శాపాన్ని తీసుకున్నాడు.

అథ శంభుర్మహాలీలో నిశ్చకర్ష విమోహినీమ్ ।
స్వమాయాం మోహితో జ్ఞానీ నారదోఽప్యభవద్యయా ॥19॥

అపుడు గొప్ప లీలలు గల శంభుడు తన మాయను ఉపసంహరించాడు. జ్ఞానియైన నారదుడు కూడా ఆ మాయచేతనే మోహితుడయ్యాడు కదా!

అంతర్హితాయాం మాయాయాం పూర్వవన్మతిమానభూత్ ।
నారదో విస్మితమనాః ప్రాప్తబోధో నిరాకులః ॥20॥

మాయ తొలగిపోయిన వెంటనే నారదుడు పూర్వంవలె జ్ఞాని అయ్యాడు. జ్ఞానం కలగగానే దుఃఖం తొలగగా నారదుడు ఆశ్చర్యపోయాడు.

పశ్చాత్తాపమవాప్యాతినినింద స్వం ముహుర్ముహుః ।
ప్రశశంస తదా మాయాం శాంభవీం జ్ఞానమోహినీమ్ ॥21॥

అతడు పశ్చాత్తాపం పొంది తాను చేసిన పనులను మళ్లీ మళ్లీ తలచుకొని తనను తాను నిందించుకున్నాడు. అపుడు జ్ఞానాన్ని కూడా మోహానికి గురిచేసిన శివమాయను మెచ్చుకున్నాడు.

అథ జ్ఞాత్వా మునిస్సర్వం మాయావిభ్రమమాత్మనః ।
అపతత్పాదయోర్విష్ణోర్నారదో వైష్ణవోత్తమః ॥22॥

అపుడు ఆ మహర్షికి తాను మాయలో పడి చేసిన పనులన్నీ తెలిసికొని, వైష్ణవోత్తముడైన నారదుడు విష్ణుని పాదాలపై పడ్డాడు.

హర్యుపస్థాపితః ప్రాహ వచనం నష్టదుర్మతిః ।
మయా దురుక్తయః ప్రోక్తా మోహితేన కుబుద్ధినా ॥23॥

శ్రీహరి అతన్ని పైకి లేవదీయగా, దుష్టబుద్ధి తొలగిపోయిన నారదుడు ఇలా అన్నాడు. "మోహితుడనైన నేను దుష్టబుద్ధితో దుష్టవచనాలు పలికాను."

దత్తశ్శాపోఽపి తే నాథ వితథం కురు తం ప్రభో! ।
మహత్పాపమకార్షం హి యాస్యామి నిరయం ధ్రువమ్ ॥24॥

పైగా శాపం కూడా ఇచ్చాను. ఓ ప్రభూ! ఆ శాపం అసత్యం అయ్యేలా చేయండి. నేను మహాపాపం చేశాను. నేను నరకం పొందటం నిశ్చయం.

కముపాయం హరే! కుర్యాం దాసోఽహం తే తమాదిశ ।
యేన పాపకులం నశ్యేన్నిరయో న భవేన్మమ ॥25॥

ఓ హరీ! నేను నీ దాసుణ్ణి. పాపమంతా నశించి నేను నరకం పొందకుండా ఉండే ఉపాయం ఏమైనా ఉందా? ఉంటే నాకు అలాంటి ఉపాయాన్ని ఉపదేశించండి.

ఇత్యుక్త్వా స పునర్విష్ణోః పాదయోర్మునిసత్తమః ।
పపాత సుమతిర్భక్త్యా పశ్చాత్తాపముపాగతః ॥26॥

ఈ విధంగా పలికిన నారదముని పశ్చాత్తాపాన్ని పొందినవాడై, సద్బుద్ధి కలవాడై భక్తితో మరల విష్ణువు పాదాలపై పడ్డాడు.

అథ విష్ణుస్తముత్థాప్య బభాషే సూనృతం వచః ।

విష్ణువు అపుడు అతనిని లేపి సత్యవాక్యాలు ఇలా పలికాడు.

విష్ణు రువాచ – విష్ణువు పలికాడు.

న ఖేదం కురు మే భక్త వరస్త్వం నాత్ర సంశయః ॥27॥

నీవు చింతించవద్దు. నీవు నా భక్తులలో శ్రేష్ఠమైన వాడివి. ఇందులో సందేహం ఏమీ లేదు.

శృణు తాత! ప్రవక్ష్యామి సుహితం తవ నిశ్చయాత్ ।
నిరయస్తే న భవితా శివశ్శం తే విధాస్యతి ॥28॥

వత్సా! నీకు తప్పకుండా హితాన్ని బోధిస్తాను. విను. నీకు నరకం రాదు. శివుడు నీకు మంగళమే చేస్తాడు.

యదకార్షీశ్శివవచో వితథం మదమోహితః ।
స దత్తవానీదృశం తే ఫలం కర్మఫలప్రదః ॥29॥

నువ్వు గర్వంతో, మోహంతో శివుని మాటను అబద్ధం చేశావు. కనుక కర్మఫలాలను ఇచ్చే శివుడు నీకు ఈ ఫలాన్ని ఇచ్చాడు.

శివేచ్ఛయాఽఖిలం జాతం కుర్విత్థం నిశ్చితాం మతిమ్ ।
గర్వాపహర్తా స స్వామీ శంకరః పరమేశ్వరః ॥30॥

అన్నీ శివుని ఇష్టప్రకారం జరుగుతాయని నీ మనస్సులో నిశ్చయించుకో. ఆ శంకరస్వామియే గర్వాన్ని పోగొడతాడు. ఆయనే పరమేశ్వరుడు.

పరంబ్రహ్మ పరాత్మా స సచ్చిదానందబోధనః ।
నిర్గుణో నిర్వికారీ చ రజస్సత్త్వతమః పరః ॥31॥

అతడు పరంబ్రహ్మ, పరమాత్మ, సచ్చిదానంద స్వరూపుడు, నిర్గుణుడు, వికారరహితుడు, సత్త్వ, రజ, తమో గుణాలకు అతీతుడు.

ఏవమాదాయ మాయాం స్వాం త్రిధా భవతి రూపతః ।
బ్రహ్మవిష్ణుమహేశాత్మా నిర్గుణోఽనిర్గుణోఽపి సః ॥32॥

ఆయన మాయను ఈ విధంగా వశం చేసుకొని, బ్రహ్మ విష్ణు మహేశ్వరులనే త్రిమూర్తుల రూపంలో ఉంటాడు. సగుణుడు, నిర్గుణుడు కూడా ఆయనే.

నిర్గుణత్వే శివాహ్వో హి పరమాత్మా మహేశ్వరః ।
పరంబ్రహ్మావ్యయోఽనంతో మహాదేవేతి గీయతే ॥33॥

నిర్గుణుడైన పరమాత్మకు శివుడని పేరు. ఆయనే మహేశ్వరుడు. పరబ్రహ్మ, అవ్యయుడు, అనంతుడు, మహాదేవుడు అని కీర్తింపబడుతున్నాడు.

తత్సేవయా విధిస్స్రష్టా పాలకో జగతామహమ్ ।
స్వయం సర్వస్య సంహారీ రుద్రరూపేణ సర్వదా ॥34॥

శివుణ్ణి సేవించి బ్రహ్మ సృష్టి కర్త అయ్యాడు. నేను జగత్తుకు పాలకుడనయ్యాను. శివుడు స్వయంగా రుద్ర స్వరూపుడై సర్వాన్ని హరిస్తాడు.

సాక్షీ శివస్వరూపేణ మాయాభిన్నస్స నిర్గుణః ।
స్వేచ్ఛాచారీ సంవిహారీ భక్తానుగ్రహకారకః ॥35॥

పరమాత్మ శివస్వరూపంలో సాక్షిగా ఉంటాడు. నిర్గుణుడైన పరమాత్మకు, మాయకు బేధం లేదు. ఆయన స్వేచ్ఛగా విహరిస్తాడు. ఆయన భక్తులను అనుగ్రహిస్తాడు.

శృణు త్వం నారదమునే సదుపాయం సుఖప్రదమ్ ।
సర్వపాపాపహర్తారం భుక్తిముక్తిప్రదం సదా ॥36॥

ఓ నారదమహర్షీ! సర్వపాపాలను పోగొట్టి సుఖాన్నిచ్చేది, ఎల్లవేళలా భుక్తిని, ముక్తిని ఇచ్చేది అయిన మంచి ఉపాయం చెబుతాను విను.

త్యక్త్వా స్వసంశయం సర్వం గాయన్ శంకరసద్యశః ।
శతంనామ శివస్తోత్రం సదానన్యమతిర్జప ॥37॥

నీవు నీ సందేహాలన్నింటిని విడిచి, శంకరుని గొప్పతనాన్ని గానం చేయి. ఏది జపిస్తే నీ పాపమంతా నశిస్తుందో ఆ శివశతనామ స్తోత్రాన్ని, దాని యందే నీ మనస్సును లగ్నంచేసి ఎల్లప్పుడు జపించు.

యజ్జపిత్వా ద్రుతం సర్వం తవ పాపం వినశ్యతి ।
ఇత్యుక్త్వా నారదం విష్ణుః పునః ప్రాహ దయాన్వితః ॥38॥

అని నారదునికి బోధించి దయామయుడైన విష్ణువు మరలా ఇలా అంటున్నాడు.

మునే న కురు శోకం త్వం త్వయా కించిత్ కృతం న హి ।
స్వేచ్ఛయా కృతవాన్ శంభురిదం సర్వం న సంశయః ॥39॥

ఓ మహర్షీ! నువ్వు శోకించకు. నీవు చేసినదేమీ లేదు. దీనినంతటిని శంభుడే స్వయంగా ఇష్టానుసారం నడిపించాడనటంలో సందేహం లేదు.

అహార్షీత్త్వన్మతిం దివ్యాం కామక్లేశమదాత్స తే ।
త్వన్ముఖాద్దాపయాంచక్రే శాపం మే స మహేశ్వరః ॥40॥

నీ మనస్సులో కామము, మనోవికారాలు, గర్వం ప్రవేశించాయి. అందువల్లనే ఆయన నీ దివ్యమైన బుద్ధిని తన సొంతం చేసుకున్నాడు. ఆ మహేశ్వరుడే నీ నోటినుండి నాకు శాపాన్ని ఇప్పించాడు.

ఇత్థం స్వచరితం లోకే ప్రకటీకృతవాన్ స్వయమ్ ।
మృత్యుంజయః కాలకాలో భక్తోద్ధారపరాయణః ॥41॥

మృత్యువు (మరణం)ను జయించిన వాడు, మృత్యువునకు మృత్యువు, భక్తులను ఉద్ధరించటమే ముఖ్యలక్ష్యంగా కలవాడైన శివుడు తన చరితమును తానే లోకంలో ఈ విధంగా ప్రకటించుకున్నాడు.

న మే శివసమానోఽస్తి ప్రియస్స్వామీ సుఖప్రదః ।
సర్వశక్తిప్రదో మేఽస్తి స ఏవ పరమేశ్వరః ॥42॥

నాకు శివునితో సమానమైనవారు మరొకరు లేరు. నాకు ఇష్టుడు సుఖాలనిచ్చే ప్రభువు వేరొకరు లేరు. ఆ పరమేశ్వరుడే నాకు అన్ని శక్తులను ఇచ్చాడు. అతడే పరమేశ్వరుడు.

తస్యోపాస్యాం కురు మునే తమేవ సతతం భజ ।
తద్యశః శ్రుణు గాయ త్వం కురు నిత్యం తదర్చనమ్ ॥43॥

ఓ మహర్షీ! నువ్వు శివుణ్ణి ఉపాసించు. ఎపుడూ శివుణ్ణే భజించు. శివుని కీర్తిని విను. పాడుతూ ఉండు. ప్రతిరోజూ శివుణ్ణి పూజించు.

కాయేన మనసా వాచా యశ్శంకరముపైతి భో ।
స పండిత ఇతి జ్ఞేయస్స జీవన్ముక్త ఉచ్యతే ॥44॥

ఓ నారదా! దేహంతో, మనస్సుతో, మాటతో ఎవడు శంకరుణ్ణి పొందుతాడో వాడే పండితుడని తెలుసుకోవాలి. అతడే జీవన్ముక్తుడు.

శివేతి నామ దావాగ్నేర్మహాపాతకపర్వతాః ।
భస్మీ భవన్త్యనాయాసాత్సత్యం సత్యం న సంశయః ॥45॥

శివనామం అనే దావాగ్ని మహాపాతకాలనే పర్వతాలను తేలికగా బూడిద చేస్తుంది. ఇది ముమ్మాటికి నిజం ఇందులో ఏ సందేహం లేదు.

పాపమూలాని దుఃఖాని వివిధాన్యపి తాన్యతః ।
శివార్చనైకనశ్యాని నాన్యనశ్యాని సర్వథా ॥46॥

వివిధదుఃఖాలకు పాపాలే కారణం. అవి శివార్చన చేత మాత్రమే నశిస్తాయి. అవి నశించే మార్గం మరొకటి లేనే లేదు.

సవైదికస్స పుణ్యాత్మా స ధన్యస్స బుధో మునే ।
యస్సదా కాయవాక్చిత్తైశ్శరణం యాతి శంకరమ్ ॥47॥

ఓ మహర్షీ! ఎవడైతే ఎప్పుడూ శరీరంతో, వాక్కుతో, మనస్సుతో శంకరుని శరణు వేడునో వాడే వైదికుడు; వాడే పుణ్యాత్ముడు. వాడే ధన్యుడు; వాడే పండితుడు.

భవంతి వివిధా ధర్మా యేషాం సద్యః ఫలోన్ముఖాః ।
తేషాం భవతి విశ్వాసస్త్రిపురాంతకపూజనే ॥48॥

త్రిపురాలను నశింప చేసిన శివుని పూజ పట్ల శ్రద్ధ ఉన్నవాళ్లు ఆచరించే ధర్మాలు వెంట వెంటనే ఫలాలను ఇస్తాయి.

పాతకాని వినశ్యంతి యావంతి శివపూజయా ।
భువి తావంతి పాపాని న సంత్యేవ మహామునే ॥49॥

ఓ మహర్షీ! శివపూజ వలన ఎన్ని పాపాలు నశిస్తాయో అన్ని పాపాలు భూలోకంలో లేనే లేవు.

బ్రహ్మహత్యాది పాపానాం రాశయోఽప్యమితా మునే ।
శివస్మృత్యా వినశ్యంతి సత్యం సత్యం వదామ్యహమ్ ॥50॥

ఓ మహర్షీ! అంతులేని బ్రహ్మహత్యాది పాపాల రాశులు కూడా శివస్మరణ చేత నశిస్తాయి. నేను ముమ్మాటికి నిజాన్నే చెప్తున్నాను.

శివనామతరీం ప్రాప్య సంసారాబ్ధిం తరంతి తే ।
సంసారమూలపాపాని తస్య నశ్యంత్యసంశయమ్ ॥51॥

శివనామం అనే పడవను చేరినవారి సంసారమూలభూతాలైన పాపాలన్నీ నశించి, వారు సంసారమనే సముద్రాన్ని దాటుతారు. ఇది నిజం.

సంసారమూలభూతానాం పాతకానాం మహామునే ।
శివనామకుఠారేణ వినాశో జాయతే ధ్రువమ్ ॥52॥

ఓ మహర్షీ! సంసారానికి మూలమైన పాపాలు శివనామం అనే గొడ్డలిచే నశించటం నిశ్చయం.

శివనామామృతం పేయం పాపదావానలార్దితైః ।
పాపదావాగ్నితప్తానాం శాంతిస్తేన వినా న హి ॥53॥

పాపమనే దావాగ్నిచే పీడింపబడే మానవులు శివనామం అనే అమృతాన్ని తాగాలి. పాపమనే దావాగ్నిచే బాధపడేవారికి శివనామం లేకుండా శాంతి కలుగదు.

శివేతి నామపీయూషవర్షధారాపరిప్లుతాః ।
సంసారదవమధ్యేపి న శోచంతి న సంశయః ॥54॥

శివనామం అనే అమృతధారలతో తడిసిన మానవులు సంసారమనే దావాగ్ని మధ్యలో ఉన్నప్పటికీ దుఃఖించరు. దీనిలో సందేహం లేదు.

న భక్తిశ్శంకరే పుంసాం రాగద్వేషరతాత్మనామ్ ।
తద్విధానాం హి సహసా ముక్తిర్భవతి సర్వథా ॥55॥

రాగద్వేషాలయందు ఆసక్తి గల మనసు కలవారికి శంకరునియందు భక్తి కుదరదు. శంకరునియందు భక్తి కుదిరినవారికి మాత్రమే త్వరగా మోక్షం లభిస్తుంది.

అనంతజన్మభిర్యేన తపస్తప్తం భవిష్యతి ।
తస్యైవ భక్తిర్భవతి భవానీప్రాణవల్లభే ॥56॥

అనేక జన్మల నుండి తపస్సుచే తప్తులైన వారికి మాత్రమే భవానీదేవి యొక్క ప్రభువైన శంకరునియందు భక్తి కలుగుతుంది.

జాతాపి శంకరే భక్తిరద్య సాధారణీ వృథా ।
పరంత్వవ్యభిచారేణ శివభక్తిరపేక్షితా ॥57॥

సంసారంలోని ఇతర వస్తువులతో సమానంగా శంకరునియందు భక్తి కుదిరినా అది వ్యర్థమే. శివునియందు స్థిరమైన పరాభక్తి మోక్షానికి సాధనమవుతుంది.

యస్యా సాధారణీశంభౌ భక్తిరవ్యభిచారిణీ ।
తస్యైవమోక్షస్సులభో నాన్యస్యేతి మతిర్మమ ॥58॥

ఎవడైతే శివునియందు నిరంతర భక్తిని కలిగియుంటాడో అట్టివానికి మోక్షము అత్యంత సులభము. ఇతరునకు కాదని నా అభిప్రాయం.

కృత్వాప్యనంతపాపాని యది భక్తిర్మహేశ్వరే ।
సర్వపాపవినిర్ముక్తో భవత్యేవ న సంశయః ॥59॥

అంతులేని పాపాలు చేసిన వాడైనా మహేశ్వరునియందు భక్తి గలవాడైతే ఆ పాపాలన్నీ తొలగిపోతాయనటంలో సందేహం లేదు.

భవంతి భస్మసాద్వృక్షా దవదగ్ధా యథా వనే ।
తథా భవంతి దగ్ధాని శాంకరాణామఘాన్యపి ॥60॥

అడవిలోని చెట్లు దావాగ్నిచే దగ్ధమైనట్లు శంకరభక్తుల పాపాలన్నీ దగ్ధమౌతాయి.

యో నిత్యం భస్మపూతాంగో శివపూజోన్ముఖో భవేత్ ।
స తరత్యేవ సంసారమపారమతిదారుణమ్ ॥61॥

ఎవడైతే ప్రతిరోజు భస్మం ధరించిన దేహం కలవాడై, శివపూజాతత్పరుడై ఉంటాడో వాడు అనంతమైన, మిక్కిలి భయంకరమైన సంసారసముద్రాన్ని నిశ్చయంగా దాటగలడు.

బ్రహ్మస్వహరణం కృత్వా హత్వాపి బ్రాహ్మణాన్ బహూన్ ।
న లిప్యతే నరః పాపైర్విరూపాక్షస్య సేవకః ॥62॥

విరూపాక్షుని పూజించే భక్తునికి బ్రాహ్మణధనాన్ని దొంగిలించిన పాపం మరియు అనేక బ్రహ్మాహత్యా పాతకముల పాపం అంటదు.

విలోక్య వేదానఖిలాన్ శివస్యైవార్చనం పరమ్ ।
సంసారనాశనోపాయ ఇతి పూర్వైర్వినిశ్చితమ్ ॥63॥

పూర్వపు ఋషులందరు వేదాలన్నింటినీ పరిశీలించి, శివార్చనయే చాలా కష్టమైన సంసారతరణసాధనమని తేల్చి చెప్పారు.

అద్యప్రభృతి యత్నేన సావధానో యథావిధి ।
సాంబం సదాశివం భక్త్యా భజ నిత్యం మహేశ్వరమ్ ॥64॥

నీవు ఈ రోజునుండి సావధానుడవై, ప్రయత్నంతో ప్రతిరోజూ యథావిధిగా భక్తితో సాంబసదాశివుణ్ణి భజించు.

ఆపాదమస్తకం సమ్యక్ భస్మనోద్ధూల్య సాదరమ్ ।
సర్వశ్రుతిశ్రుతం శైవం మంత్రం జప షడక్షరమ్ ॥65॥

పాదాలనుండి తల వరకు విభూతిని శ్రద్ధతో చక్కగా ధరించి, అన్ని వేదాలు ప్రతిపాదించిన "ఓం నమశ్శివాయ" అనే ఆరు అక్షరాల శివమంత్రాన్ని జపించు.

సర్వాంగేషు ప్రయత్నేన రుద్రాక్షాన్ శివవల్లభాన్ ।
ధారయస్వాతిసద్భక్త్యా సమంత్రం విధిపూర్వకమ్ ॥66॥

శివునికి ఇష్టమైన రుద్రాక్షలను ఎక్కువ భక్తితో ప్రయత్నపూర్వకంగా మంత్రంతో యథావిధిగా శరీరములోని సర్వాంగములందు ధరించు.

శృణు శైవీం కథాం నిత్యం వద శైవీం కథాం సదా ।
పూజయస్వాతియత్నేన శివభక్తాన్ పునః పునః ॥67॥

ప్రతిరోజు శివకథలను విను. ఎప్పుడూ శివగాథలను ఇతరులకు చెప్పు. శివభక్తులను పదేపదే పూజించు.

అప్రమాదేన సతతం శివైకశరణో భవ ।
శివార్చనేన సతతమానందః ప్రాప్యతే యతః ॥68॥

అన్నివేళల్లో జాగ్రత్త కలవాడవై ఏ శివుణ్ణి అర్చిస్తే నిత్యానందం లభిస్తుందో ఆ శివుని మాత్రమే శరణం వేడు.

ఉరస్యాధాయ విశదే శివస్య చరణాంబుజౌ ।
శివతీర్థాని విచర ప్రథమం మునిసత్తమ ॥69॥

ఓ మహర్షీ! శివపాదుకలను స్వచ్ఛమైన వక్షస్థలంపై ఉంచుకొని, ముందుగా శివ తీర్థాలను దర్శించు.

పశ్యన్ మాహాత్మ్యమతులం శంకరస్య పరాత్మనః ।
గచ్ఛానందవనం పశ్చాచ్ఛంభుప్రియతమం మునే ॥70॥

పరమాత్మ అయిన శంకరుని సాటిలేని మహిమ తెలుసుకో. ఓ మహర్షీ! తర్వాత శంకరునికి చాలా ఇష్టమైన కాశీనగరానికి వెళ్లు.

తత్ర విశ్వేశ్వరమ్ దృష్ట్వా పూజనం కురు భక్తితః ।
నత్వా స్తుత్వా విశేషేణ నిర్వికల్పో భవిష్యసి ॥71॥

అక్కడ విశ్వేశ్వరుణ్ణి దర్శించి, భక్తితో పూజించు, నమస్కరించు, విశేషంగా స్తుతించు. నీ సందేహాలన్నీ తొలగిపోతాయి.

తతశ్చ భవతా నూనం విధేయం గమనం మునే ।
బ్రహ్మలోకే స్వకామార్థం శాసనాన్మమ భక్తితః ॥72॥

ఓ మహర్షీ! తరువాత నీవు నా ఆజ్ఞ ప్రకారం బ్రహ్మలోకానికి వెళ్లు. అచట నీ కోరిక తీరుతుంది.

నత్వా స్తుత్వా విశేషణ విధిం స్వజనకం మునే ।
ప్రష్టవ్యం శివమాహాత్మ్యం బహుశః ప్రీతచేతసా ॥73॥

ఓ మునీ! నీ తండ్రియగు బ్రహ్మకు నమస్కరించి స్తుతించి, ఆనందంతో నిండిన మనస్సుతో శివుని మహాత్మ్యం విస్తారంగా అడిగి తెలుసుకో.

స శైవప్రవరో బ్రహ్మా మాహాత్మ్యం శంకరస్య తే ।
శ్రావయిష్యతి సుప్రీత్యా శతనామస్తవం చ హి ॥74॥

శైవులలో గొప్పవాడైన ఆ బ్రహ్మదేవుడు నీకు శంకరుని శతనామస్తోత్రాన్ని చాలా ప్రీతితో వినిపించగలడు.

అద్యతస్త్వం భవ మునే శైవశ్శివపరాయణః ।
ముక్తిభాగీ విశేషేణ శివస్తే శం విధాస్యతి ॥75॥

ఓ మహర్షీ! ఈ రోజు నుండి నువ్వు శివుణ్ణి శ్రద్ధతో పూజించి శివపరాయణుడవు కమ్ము. అలా చేస్తే నువ్వు మోక్షాన్ని పొందుతావు. శివుడు నీకు శుభాలను ఇచ్చి మంగళం చేస్తాడు.

ఇత్థం విష్ణుర్మునిం ప్రీత్యా హ్యుపదిశ్య ప్రసన్నధీః ।
స్మృత్వా నుత్వా శివం స్తుత్వా తతస్త్వంతరధీయత ॥76॥

ప్రసన్నమైన మనసుగల విష్ణువు నారదునికి ఇలా ఉపదేశించి, శివుని స్మరించి, నమస్కరించి, స్తుతించి, తరువాత అదృశ్యమయ్యాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం ప్రథమఖండే సృష్ట్యుపాఖ్యానే నారదస్య విష్ణూపదేశో నామ చతుర్థోఽధ్యాయః ॥4॥

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితం ప్రథమఖండంలో సృష్ట్యుపాఖ్యానంలో నారదునకు విష్ణువు ఉపదేశించుట అనే నాల్గవ అధ్యాయం సమాప్తం.

అథ పంచమోऽధ్యాయః - అయిదవ అధ్యాయం

నారదుడు తండ్రిని ప్రశ్నించుట - నారదుడు తండ్రిని ప్రశ్నించుట

సూత ఉవాచ - సూతుడు అన్నాడు.

అంతర్హితే హరౌ విప్రా! నారదో మునిసత్తమః ।
విచచార మహీం పశ్యన్ శివలింగాని భక్తితః ॥1॥

ఓ బ్రాహ్మణులారా! విష్ణువు అదృశ్యమవ్వగానే నారదుడు భక్తితో శివలింగాలను దర్శిస్తూ భూలోకమంతా తిరిగాడు.

పృథివ్యా అటనం కృత్వా శివరూపాణ్యనేకశః ।
దదర్శ ప్రీతితో విప్రా భుక్తిముక్తిప్రదాని సః ॥2॥

ఓ విప్రులారా! అతడు భూలోకమంతా తిరిగి భుక్తిని, ముక్తిని ఇచ్చే అనేక శివలింగాలను దర్శించాడు.

అథ తం విచరంతం కౌ నారదం దివ్యదర్శనమ్ ।
జ్ఞాత్వా శంభుగణౌ తౌ తు సుచిత్తముపజగ్మతుః ॥3॥

దివ్యజ్ఞానియైన నారదుడు ప్రసన్నమనసుతో భూలోకంలో సంచారం చేస్తున్నాడని తెలిసి ఆ శివగణంలోని ఇద్దరు అతని దగ్గరకు చేరారు.

శిరసా సుప్రణమ్యాశు గణావూచతురాదరాత్ ।
గృహీత్వా చరణౌ తస్య శాపోద్ధారేచ్ఛయా చ తౌ ॥4॥

తమకు నారదుడు ఇచ్చిన శాపం నుండి విముక్తి కోరినవారై వెంటనే అతనికి తలవంచి నమస్కారం చేసి పాదాలను పట్టుకొని ఆదరణతో ఇలా అన్నారు.

శివగణావూచతుః - శివభక్తులు అన్నారు.

బ్రహ్మపుత్ర సురర్షే హి శృణు ప్రీత్యావయోర్వచః ।
తవాపరాధకర్తారావావాం విప్రౌ న వస్తుతః ॥5॥

బ్రహ్మపుత్రా! దేవర్షీ! నీవు ప్రసన్నుడవై మా ఇద్దరి మాటలు వినుము. బ్రాహ్మణులమైన మేము నిజంగా అపరాధం చేయలేదు.

ఆవాం హరగణౌ విప్ర! తవాగస్కారిణౌ మునే ।
స్వయంవరే రాజపుత్ర్యా మాయామోహితచేతసా ॥6॥

ఓ బ్రాహ్మణా! మేము ఇద్దరం శివగణంలోని వారము. ఓ మహర్షీ! నీవు స్వయంవరంలో మాయాప్రభావంతో నీ మనసు రాజపుత్రికయందు మోహంతో నున్న సమయంలో మేము నీయందు తప్పుచేశాము.

త్వయా దత్తశ్చ నౌ శాపః పరేశప్రేరితేన హ ।
జ్ఞాత్వా కుసమయం తత్ర మౌనమేవ హి జీవనమ్ ॥7॥

అలాంటి నీవు మా ఇద్దరికి శాపాన్నిచ్చావు. పరమేశ్వరుని ప్రేరణతో అలా జరిగింది. అది మాట్లాడటానికి సమయం కాదని, మౌనమే రక్ష అనుకొని మిన్నకున్నాము.

స్వకర్మణః ఫలం ప్రాప్తం కస్యాపి న హి దూషణమ్ ।
సుప్రసన్నో భవ విభో కుర్వనుగ్రహమద్య నౌ ॥8॥

జీవుడు తన కర్మఫలాన్ని పొందుతాడు. ఇతరులను దూషించనక్కర్లేదు. ఓ ప్రభూ! నీవు మాయందు ప్రసన్నుడవై మమ్మల్ని అనుగ్రహించు.

సూత ఉవాచ – సూతుడు పలికాడు.

వచ ఆకర్ణ్య గణయోరితి భక్త్యుక్తమాదరాత్ ।
ప్రత్యువాచ మునిః ప్రీత్యా పశ్చాత్తాపమవాప్య సః ॥9॥

శివుని అనుచరులిద్దరూ భక్తితో చెప్పిన మాటలను విని నారదముని పశ్చాత్తాపం పొంది, ప్రేమతో, ఆదరంతో ఇలా సమాధానం ఇచ్చాడు.

నారద ఉవాచ – నారదుడు చెప్పాడు.

శృణుతం మే మహాదేవగణౌ మాన్యతమౌ సతామ్ ।
వచనం సుఖదం మోహనిర్ముక్తం చ యథార్థకమ్ ॥10॥

ఓ మహాదేవా అనుచరులారా! నా మాట వినండి. మీరు పురుషులలో శ్రేష్ఠమైన వాళ్లు. మీరు సుఖాన్ని కలిగించే మోహం లేని సత్యాన్ని చెప్పారు.

పురా మమ మతిర్భ్రష్టాసీచ్ఛివేచ్ఛావశాత్ ధ్రువమ్ ।
సర్వదా మోహమాపన్నశ్శప్తవాన్ వాం కుశేముషిః ॥11॥

కొద్దికాలం క్రితం నా బుద్ధి చెడింది. శివుని కోరిక ప్రకారం అలా జరిగిందనటం నిశ్చయం. నేను పూర్తిగా మోహంలో పడి, దుష్టబుద్ధితో మీ ఇద్దర్నీ శపించాను.

యదుక్తం తత్తథా భావి తథాపి శృణుతాం గణౌ ।
శాపోద్ధారమహం వచ్మి క్షమేథామఘమద్య మే ॥12॥

నా శాపవచనాలు నిజంగా జరిగి తీరుతాయి. అయినా ఓ శివభక్తులారా! నేను మీకు శాపవిముక్తి చెప్తాను. నా ఈ పాపాన్ని క్షమించండి.

వీర్యాన్మునివరస్యాప్త్వా రాక్షసేశత్వమాదిశమ్ ।
స్యాతాం విభవసంయుక్తౌ బలినౌ సుప్రతాపినౌ ॥13॥

మునికుమారులై పుట్టి, మీరు సంపదలు, బలం, ప్రతాపం కల రాక్షసప్రభువులు అవుతారు.

సర్వబ్రహ్మాండరాజానౌ శివభక్తౌ జితేంద్రియౌ ।
శివాపరతనోర్మృత్యుం ప్రాప్య స్వం పదమాప్స్యథః ॥14॥

మీరు ఇంద్రియజయం గల శివభక్తులై శివుని రెండవ స్వరూపమైన విష్ణువు చేతిలో మరణం పొంది, మీ నిజస్థానానికి చేరెదరు.

సూత ఉవాచ – సూతుడు పలికాడు.

ఇత్యాకర్ణ్య మునేర్వాక్యం నారదస్య మహాత్మనః ।
ఉభౌ హరగణౌ ప్రీతౌ స్వం పదం జగ్మతుర్ముదా ॥15॥

మహాత్ముడైన నారదుని మాటలు శివానుచరులు ఇద్దరు విని, చాలా సంతోషించి, ఆనందంతో తమ స్థానాలకు వెళ్లిపోయారు.

నారదో౽పి పరం ప్రీతో ధ్యాయఞ్ఛివమనన్యధీః ।
విచచార మహీం పశ్యన్ శివతీర్థాన్యభీక్ష్ణశః ॥16॥

నారదుడు కూడా మిక్కిలి సంతోషించి, శివుణ్ణి ఏకాగ్రబుద్ధితో ధ్యానిస్తూ, భూలోకంలోని శివ తీర్థాలన్నీ దర్శిస్తూ సంచరించాడు.

కాశీం ప్రాప్యాథ స మునిః సర్వోపరి విరాజితామ్ ।
శివప్రియాం శంభుసుఖప్రదాం శంభుస్వరూపిణీమ్ ॥17॥

తర్వాత నారదముని కాశీకి వెళ్ళాడు. తీర్థాలన్నింట్లో కాశీ చాలా గొప్పది. శివుడికి చాలా ఇష్టమైంది. ఈశ్వర స్వరూపమైనదీ, శివునికి సుఖాన్నిచ్చేదీ ఆ కాశీ.

దృష్ట్వా కాశీం కృతార్థో౽భూత్ కాశీనాథం దదర్శ హ ।
ఆనర్చ పరమప్రీత్యా పరమానందసంయుతః ॥18॥

అతడు కాశీని, కాశీనాథుని దర్శించి కృతార్థుడయ్యాడు పరమానందంతో పూజించాడు.

స ముదః సేవ్య తాం కాశీం కృతార్థో మునిసత్తమః ।
నమన్ సంవర్ణయన్ భక్త్యా సంస్మరన్ ప్రేమవిహ్వలః ॥19॥

ఆ మహర్షి ఆనందంతో కాశీనగరాన్ని సేవించి, శివుణ్ణి దర్శించి, భక్తితో శివమహిమను వర్ణించి, ప్రేమతో శివుణ్ణి స్మరించి నమస్కరించి ధన్యుడయ్యాడు.

బ్రహ్మలోకం జగమాథ శివస్మరణసన్మతిః ।
శివతత్త్వం విశేషేణ జ్ఞాతుమిచ్ఛుస్స నారదః ॥20॥

శివస్మరణతో పవిత్రమైన బుద్ధి గల వాడైన నారదుడు శివతత్త్వాన్ని ఇంకా ఎక్కువగా తెలుసుకోవాలనే కోరికతో బ్రహ్మలోకానికి వెళ్ళాడు.

నత్వా తత్ర విధిం భక్త్యా స్తుత్వా చ వివిధైస్స్తవైః ।
పప్రచ్ఛ శివతత్త్వం చ శివసంభక్తమానసః ॥21॥

అక్కడ బ్రహ్మను భక్తితో నమస్కరించి, అనేక స్తోత్రాలతో స్తుతించి, శివునియందు మనస్సు కలవాడై, శివతత్త్వం గురించి అడిగాడు.

నారద ఉవాచ - నారదుడు పలికాడు.

బ్రహ్మన్! బ్రహ్మస్వరూపజ్ఞ! పితామహ! జగత్ప్రభో! ।
త్వత్ప్రసాదాన్మయా సర్వం విష్ణోర్మాహాత్మ్యముత్తమమ్ ॥22॥

ఓ బ్రహ్మా! నువ్వు పరబ్రహ్మస్వరూపాన్ని తెలిసిన వాడవు. ఓ తండ్రీ! నువ్వు ప్రపంచానికి అధిపతివి. నేను నీ అనుగ్రహముచే విష్ణుమాహాత్మ్యాన్ని పూర్తిగా తెలుసుకున్నాను.

భక్తిమార్గం జ్ఞానమార్గం తపోమార్గం సుదుస్తరమ్ ।
దానమార్గం చ తీర్థానాం మార్గం చ శ్రుతవానహమ్ ॥23॥

భక్తి, జ్ఞాన మార్గాలను, కష్టతరమైన తపోమార్గాన్ని, దాన, తీర్థ మార్గాల గురించి విన్నాను.

న జ్ఞాతం శివతత్త్వం చ పూజావిధిమతః క్రమాత్ ।
చరిత్రం వివిధం తస్య నివేదయ మమ ప్రభో ॥24॥

కాని నాకు శివతత్త్వం తెలియడం లేదు. కాబట్టి ఓ ప్రభూ! నాకు శివపూజావిధానాన్ని, శివుని వివిధ రకాల చరిత్రలను క్రమంగా తెలియజేయండి.

నిర్గుణోఽపి శివస్తాత! సగుణశ్శంకరః కథమ్ ।
శివతత్త్వం న జానామి మోహితశ్శివమాయయా ॥25॥

తండ్రీ! శివుడు నిర్గుణుడైనా సగుణుడుగా ఎలా అయ్యాడు? నేను శివమాయచే మోహితుణ్ణి అవటం వల్ల శివతత్త్వం తెలియకున్నాను.

సృష్టేః పూర్వం కథం శంభుస్స్వరూపేణ ప్రతిష్ఠితః ।
సృష్టిమధ్యే స హి కథం క్రీడన్ సంవర్తతే ప్రభుః ॥26॥

సృష్టికి పూర్వం శంభుడు తన రూపంలో ఎలా ఉన్నాడు? ఆ ప్రభువు స్థితి కాలంలో క్రీడించే విధానం ఎలా వుంటుంది?

తదంతే చ కథం దేవస్స తిష్ఠతి మహేశ్వరః ।
కథం ప్రసన్నతాం యాతి శంకరో లోకశంకరః ॥27॥

ఆ మహేశ్వరుడు ప్రళయకాలంలో ఎలా ఉంటాడు? లోకాలకు శుభాలనిచ్చే శివుణ్ణి ప్రసన్నం చేసుకునే విధానం ఎటువంటిది?

సంతుష్టశ్చ స్వభక్తేభ్యః పరేభ్యశ్చ మహేశ్వరః ।
కిం ఫలం యచ్ఛతి విధే! తత్సర్వం కథయస్వ మే ॥28॥

ఓ విధీ! పరమేశ్వరుడు సంతృప్తి చెంది తన భక్తులకు, ఇతరులకు ఏమి వరాలు ఇస్తాడు? ఏమి ఫలాలను ఇస్తాడు? ఇవన్నీ నాకు తెలియ చేయండి.

సద్యః ప్రసన్నో భగవాన్ భవతీత్యనుసంశ్రుతమ్ ।
భక్తప్రయాసం స మహాన్న పశ్యతి దయాపరః ॥29॥

భగవాన్! శంకరుడు త్వరగా ప్రసన్నుడౌతాడని ఆయన దయామయుడని, భక్తుల కష్టాలను సహింపజాలడని విన్నాం.

బ్రహ్మావిష్ణుర్మహేశశ్చ త్రయో దేవాశివాంశజాః ।
మహేశస్తత్ర పూర్ణాంశస్స్వయమేవ శివః పరః ॥30॥

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురూ శివుని అంశనుండి జన్మించారు. వారిలో మహేశుడు శివుడి పూర్ణ అంశతో పుట్టాడు. కాబట్టి మహేశుడు సాక్షాత్తూ పరమశివుడే.

తస్యావిర్భావమాఖ్యాహి చరితాని విశేషతః ।
ఉమావిర్భావమాఖ్యాహి తద్వివాహం తథా విభో ॥31॥

శివుడు పుట్టిన విధానాన్ని, విశేషమైన లీలను మరియు ఉమ పుట్టిన విధానం మరియు కళ్యాణ విశేషాలు తెలియజేయండి.

తద్గార్హస్థ్యం విశేషేణ తథా లీలాః పరా అపి ।
ఏతత్సర్వం తథాన్యచ్చ కథనీయం త్వయానఘ ॥32॥

ఓ అనఘా! శివుని గృహస్థ జీవితాన్ని, లీలలను, అంతేకాక ఇతర గాథలన్నింటినీ తెలియజేయండి.

తదుత్పత్తిం వివాహం చ శివాయాస్తు విశేషతః ।
ప్రబ్రూహి మే ప్రజానాథ గుహజన్మ తథైవ చ ॥33॥

హే ప్రజాపతే! ఉమ యొక్క పుట్టుక, వివాహం మరియు కుమారస్వామి పుట్టుక నాకు చెప్పండి.

బహుభ్యశ్చ శ్రుతం పూర్వం న తృప్తోఽస్మి జగత్ప్రభో ।
అతస్త్వాం శరణం ప్రాప్తః కృపాం కురు మమోపరి ॥34॥

హే జగన్నాయకా! నేను అనేకుల నోటనుండి పూర్వం విన్నాను. అయినా తృప్తి కలగ లేదు. కాబట్టే నిన్ను శరణు వేడుతున్నాను. నాపై దయ చూపు.

ఇతి శ్రుత్వా వచస్తస్య నారదస్యాంగజస్య హి ।
ఉవాచ వచనం తత్ర బ్రహ్మా లోకపితామహః ॥35॥

కుమారుడైన నారదుని మాటలు విని, లోకపితామహుడైన బ్రహ్మ అప్పుడు ఇలా చెప్పాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే నారదప్రశ్నవర్ణనం నామ పంచమోఽధ్యాయః ॥5॥

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితం సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటిఖండంలో నారద ప్రశ్నవర్ణనము అనే అయిదవ అధ్యాయం సమాప్తం.

షష్ఠోఽధ్యాయః - ఆరవ అధ్యాయం

విష్ణువు జన్మించుట - విష్ణువు జన్మించుట

బ్రహ్మ ఉవాచ - బ్రహ్మ పలికాడు.

భో బ్రహ్మన్! సాధు పృష్టోఽహం త్వయా విబుధసత్తమ ।
లోకోపకారిణా నిత్యం లోకానాం హితకామ్యయా ॥1॥

ఓ మహర్షీ! నీవు గొప్ప విద్వాంసుడవు. నిత్యం లోకుల హితం కోరి, లోకానికి ఉపకారం చేసే నీవు నన్ను చక్కగా అడిగావు.

యచ్ఛ్రుత్వా సర్వలోకానాం సర్వపాపక్షయో భవేత్ ।
తదహం తే ప్రవక్ష్యామి శివతత్త్వమనామయమ్ ॥2॥

నేను నీకు చెప్పబోయే దోషములు లేని శివతత్త్వాన్ని విన్న మానవులందరి పాపాలు నశిస్తాయి.

శివతత్త్వం మయా నైవ విష్ణునాపి యథార్థతః ।
జ్ఞాతం చ పరమం రూపమద్భుతం చ పరేణ న ॥3॥

శివతత్త్వాన్ని నేను గాని, విష్ణువుగాని సమగ్రంగా తెలియని వాళ్లమే. అది చాలా కష్టతరమైంది. అద్భుతమైంది. ఇతరులకు తెలియరానిది.

మహాప్రలయకాలే చ నష్టే స్థావరజంగమే ।
ఆసీత్తమోమయం సర్వమనర్కగ్రహతారకమ్ ॥4॥

మహాప్రళయం వచ్చిన కాలంలో చరాచరజగత్తు నశిస్తుంది సూర్యుడు, గ్రహాలు, నక్షత్రాలు లేకపోవడం వల్ల సమస్తం చీకటితో నిండిపోతుంది.

అచంద్రమనహోరాత్రమనగ్న్యనిలభూజలమ్ ।
అప్రధానం వియచ్ఛూన్యమన్యతేజో వివర్జితమ్ ॥5॥

చంద్రుడు, రాత్రి, పగలు, నిప్పు, గాలి, భూమి, నీరు, కనిపించని ఇతరతత్త్వాలు, ఇతర తేజస్సులు లేని. ఆకాశం శూన్యంగా ఉంది.

అదృష్టత్వాదిరహితం శబ్దస్పర్శసముజ్ఝితమ్ ।
అవ్యక్తగంధరూపం చ రసత్యక్తమదిఙ్ముఖమ్ ॥6॥

ఏవీ ప్రకటితం కాలేదు. కనుక అదృష్టత్వం (కనబడకపోవడం) కూడా లేకుండా ఉంది. శబ్ద, స్పర్శ, గంధ, రూపాలు రసాలు లేవు. దిక్కుల భాగాలు లేవు.

ఇత్థం సత్యం చ తమసే సూచీభేద్యే నిరంతరే ।
తత్సద్బ్రహ్మేతి యచ్ఛ్రుత్వా సదేకం ప్రతిపద్యతే ॥7॥

ఈ విధంగా సూదితో పొడుచుటకు వీలు కానిదన్నట్లు ఉన్న దట్టమైన కటికచీకటి మాత్రమే ఉంది. తత్సత్ బ్రహ్మ అను శ్రుతిచే ప్రతిపాదించే సత్ ఒక్కటి మాత్రమే ఉంది.

ఇతీదృశం యదా నాసీద్యత్తత్సదసదాత్మకమ్ ।
యోగినోంతర్హితాకాశే యత్పశ్యంతి నిరంతరమ్ ॥8॥

ఈ విధంగా మూర్తిసంబంధమైన జగత్తులేని సమయంలో ఉన్న పరబ్రహ్మను యోగులు హృదయం అనే ఆకాశంలో ఎప్పుడూ దర్శిస్తారు.

అమనోగోచరం వాచాం విషయం న కదాచన ।
అనామరూపవర్ణం చ న చ స్థూలం న యత్కృశమ్ ॥9॥

అది మనసుకు కనిపించనిది. మాటలకు అందేది కాదు, దానికి పేరు, రూపం, రంగు లేవు. అది స్థూలం కాదు. సూక్ష్మమైనది కాదు.

అహ్రస్వదీర్ఘమలఘుగురుత్వపరివర్జితమ్ ।
న యత్రోపచయః కశ్చిత్తథా నాపచయోऽపి చ ॥10॥

పొట్టి కాదు, పొడుగు కాదు, తేలిక కాదు, బరువు కాదు. దానిలో పెరగటం లేదు. తరగటం అనేది లేదు.

అభిదత్తే సచకితం యదస్తీతి శ్రుతిః పునః ।
సత్యం జ్ఞానమనంతం చ పరానందం పరం మహః ॥11॥

సత్యజ్ఞానానంతస్వరూపం, పరమానందఘనం, పరంజ్యోతిరూపమైన పరబ్రహ్మను గురించి, “ఉంది” అని శ్రుతి చెప్పడమే ఆశ్చర్యం కలిగిస్తుంది.

అప్రమేయమనాధారమవికారమనాకృతి ।
నిర్గుణం యోగిగమ్యం చ సర్వవ్యాప్యేకకారకమ్ ॥12॥

పరబ్రహ్మం ప్రమాణానికి (కొలతలకు) అందేది కాదు. ఇతరులపై ఆధారపడదు. అది వికారాలు లేనిది. ఆకారం లేనిది. గుణం లేనిది. అన్నింటిలో వ్యాపించి ఉండేది. ప్రపంచానికి ఒకే ఒక కారణమైన పరబ్రహ్మయోగులచేత తెలుసుకోబడేది.

నిర్వికల్పం నిరారంభం నిర్మాయం నిరుపద్రవమ్ ।
అద్వితీయమనాద్యంతమవికారం చిదాత్మకమ్ ॥13॥

అది వికల్పాలు లేనిది. ఆరంభం లేనిది. మాయా ప్రభావం లేనిది. ఉపద్రవములు లేనిది. బ్రహ్మం కంటె భిన్నమైన రెండవ వస్తువు ఏదియూ లేనిది. అది తుది, మొదలు లేనిది. వికారాలు లేనిది. అది చైతన్యఘనం.

యస్యేత్థం సంవికల్పంతే సంజ్ఞా సంజ్ఞోక్తితస్స్మ వై ।
కియతా చైవ కాలేన ద్వితీయేచ్ఛాఽభవత్కిల ॥14॥

ఈ విధంగా పరబ్రహ్మ గురించి స్వరూప, తటస్థ లక్షణాలు ఊహింపబడ్డాయి. అట్టి పరమాత్మకు చాలా కాలం తర్వాత ద్వైతం నందు కోరిక కలిగింది.

అమూర్తేన స్వమూర్తిశ్చ తేనాకల్పి స్వలీలయా ।
సర్వైశ్వర్యగుణోపేతా సర్వజ్ఞానమయీ శుభా ॥15॥

నిరాకారుడైన ఆ పరమాత్మ తన లీలచే అన్ని ఐశ్వర్యాలు, గుణాలతో నిండినదీ, సర్వజ్ఞానంతో కూడి ఉన్నదీ అయిన మంగళకరమైన స్వీయమూర్తిని కల్పించాడు.

సర్వగా సర్వరూపా చ సర్వదృక్సర్వకారిణీ ।
సర్వైకవంద్యా సర్వాద్యా సర్వదా సర్వసంస్కృతిః ॥16॥

ఆ మూర్తి అన్ని రూపాలను ధరించి, అన్నింటినీ పొంది (కలిగివుండి) అన్నింటినీ చూస్తూ, అన్నీ చేస్తుంది. అందరిచే నమస్కరింపబడేదిగా, అన్నింటికీ మొదటిదై అన్నింటిని ఇచ్చేదిగా ఉంటుంది. ఆమెయే అన్ని సంస్కృతులకు మూలమైనది.

పరికల్ప్యేతి తాం మూర్తిమైశ్వరీం శుద్ధరూపిణీమ్ ।
అద్వితీయమనాద్యంతం సర్వాభాసం చిదాత్మకమ్ ॥
అంతర్దధే పరాఖ్యం యద్బ్రహ్మ సర్వగమవ్యయమ్ ॥17॥

రెండవదిగా లేనిదీ, మొదలు చివర లేనిది,అన్నింటిని ప్రకాశింపజేయగలదీ చైతన్యరూపమయినదీ అన్నింటా వ్యాపించినది, నాశనం లేనిదీ అయిన పరబ్రహ్మ. ఈశ్వరి అయిన ఆ రూపాన్ని (మూర్తిని) పుట్టించి అదృశ్యమయ్యింది.

అమూర్తే యత్పరాఖ్యం వై తస్య మూర్తిస్సదాశివః ।
అర్వాచీనాః పరాచీనా ఈశ్వరం తం జగుర్బుధాః ॥18॥

రూపం (మూర్తి) లేని పరబ్రహ్మం యొక్క రూపమే సదాశివుడు. ఆయనే ఈశ్వరుడని ప్రాచీన, ఆధునిక విద్వాంసులు చెప్పారు.

శక్తిస్తదైకలేనాపి స్వైరం విహరతా తనుః ।
స్వవిగ్రహాత్స్వయం సృష్టా స్వశరీరానపాయినీ ॥19॥

ఒంటరిగా, స్వేచ్ఛగా తిరిగే సదాశివుడు తన స్వరూపం నుండి తన కంటే వేరేగా లేని, వేరు కాని శక్తిని సొంతంగా సృష్టించాడు.

ప్రధానం ప్రకృతిం తాం చ మాయాం గుణవతీం పరామ్ ।
బుద్ధితత్త్వస్య జననీమాహుర్వికృతివర్జితామ్ ॥20॥

ప్రధానమైనదిగానూ, ప్రకృతిగానూ, సత్త్వరజస్తమోగుణాత్మకమైన మాయగా చెప్పారు. బుద్ధితత్త్వానికి తల్లిగానూ చెప్పారు. ఆమె మార్పులేనిదిగా పేర్కొన్నారు.

సా శక్తిరంబికా ప్రోక్తా ప్రకృతిస్సకలేశ్వరీ ।
త్రిదేవజననీ నిత్యా మూలకారణమిత్యుత ॥21॥

ఆ శక్తియే అంబిక, ప్రకృతి సమస్తానికి ఈశ్వరి అని చెప్పబడింది. మరియు ఆమె బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు తల్లి. శాశ్వతమైనదనీ మూలకారణమనీ కూడా చెప్పారు.

అస్యా అష్టౌ భుజాశ్చాసన్ విచిత్రవదనా శుభా ।
రాకాచంద్రసహస్రస్య వదనే భాశ్చ నిత్యశః ॥22॥

ఆమెకు ఎనిమిది భుజాలున్నాయి. ఆమె ముఖం అనేక రంగులలో ఉంటుంది. మంగళకరమైనది ఆమె ముఖంలో వేల పున్నమచంద్రుల కాంతి నిత్యం ప్రకాశిస్తూంది.

నానాభరణసంయుక్తా నానాగతిసమన్వితా ।
నానాయుధధరా దేవీ ఫుల్లపంకజలోచనా ॥23॥

ఆమె అనేక రకాల ఆభరణాలను ధరిస్తుంది. ఆమె అనేకవిధములుగా చరించగలదు. అనేక ఆయుధాలను ధరిస్తుంది. ఆ దేవి యొక్క కళ్లు వికసించిన పద్మాల్లాగా ఉన్నాయి.

అచింత్యతేజసా యుక్తా సర్వయోనిస్సముద్యతా ।
ఏకాకినీ యదా మాయా సంయోగాచ్చాప్యనేకికా ॥24॥

ఆమె తేజస్సు ఊహకు అందనిది. ఉద్యమశీలియైన ఆమెయే అన్నింటికి కారణభూతురాలు. ఆ మాయ ఒంటరిదైనా, గుణములలో కలవటం వలన అనేకంగా మారుతుంది.

పరః పుమానీశ్వరస్స శివశ్శంభురనీశ్వరః ।
శీర్షే మందాకినీధారీ ఫాలచంద్రస్త్రిలోచనః ॥25॥

ఆ సదాశివుడే పరమపురుషుడు, ఈశ్వరుడు, శివుడు, శంభువు. ఆయనకు ఈశ్వరులు లేరు. తలపై మందాకినినీ, నుదుటియందు చంద్రుని ధరిస్తాడు. ఆయన మూడు కన్నులు కలవాడు.

పంచవక్త్రః ప్రసన్నాత్మా దశబాహుస్త్రిశూలధృక్ ।
కర్పూరగౌరససితో భస్మోద్ధూలితవిగ్రహః ॥26॥

అయిదు ముఖాలు, పది చేతులు కలవాడు. ప్రసన్నమైన మనసు కలవాడు. ఆయన త్రిశూలాన్ని ధరిస్తాడు. ఆయన శరీరం కర్పూరం వలె పచ్చగా, తెల్లగా ఉంటుంది. ఆయన శరీరమంతా భస్మాన్ని పూసుకొని ఉంటాడు.

యుగపచ్చ తయా శక్త్యా సాకం కాలస్వరూపిణా ।
శివలోకాభిధం క్షేత్రం నిర్మితం తేన బ్రహ్మణా ॥27॥

కాలస్వరూపుడైన ఆ పరబ్రహ్మ శక్తితో పాటు శివలోకం అనే క్షేత్రాన్ని కూడా నిర్మించాడు.

తదేవ కాశికేత్యేతత్ప్రోచ్యతే క్షేత్రముత్తమమ్ ।
పరం నిర్వాణసంఖ్యానం సర్వోపరి విరాజితమ్ ॥28॥

ఆ ఉత్తమక్షేత్రానికి కాశీ అనే పేరు. కాశీక్షేత్రం చాలా గొప్పదైన మోక్షనగరం. తీర్థాలన్నింటిలో గొప్పదిగా ప్రకాశిస్తోంది.

తాభ్యాం చ రమణాభ్యాం చ తస్మిన్ క్షేత్రే మనోరమే ।
పరమానందరూపాభ్యాం పరమానందరూపిణీ ॥29॥

అందమైన ఆ క్షేత్రం పరమానందస్వరూపులు, క్రీడించువారు అయిన వారిద్దరితో బ్రహ్మానంద స్వరూపమే!

మునే ప్రలయకాలేపి న తత్ క్షేత్రం కదాచన ।
విముక్తం హి శివాభ్యాం యదవిముక్తం తతో విదుః ॥30॥

ఓ మహర్షీ! పార్వతీపరమేశ్వరులు ఏనాడు ఆ క్షేత్రాన్ని విడిచిపెట్టరు. ప్రళయకాలంలో కూడా విడిచిపెట్టరు. అందువల్లనే ఆ క్షేత్రానికి అవిముక్తం అని పేరు.

అస్యానందవనం నామ పురాకారి పినాకినా ।
క్షేత్రస్యానందహేతుత్వాదవిముక్తమనంతరమ్ ॥31॥

పూర్వం ఈశ్వరుడు ఈ క్షేత్రానికి, ఆనందాన్ని కలిగిస్తు ఉండడం వల్ల ఆనందవనమని పేరు పెట్టాడు. తరువాత అవిముక్తమని పేరు వచ్చింది.

అథానందవనే తస్మిన్ శివయో రమమాణయోః ।
ఇచ్ఛేత్యభూత్సురర్షే! హి సృజ్యః కోప్యపరః కిల ॥32॥

ఓ మహర్షీ! శివభక్తులు ఇద్దరూ ఆనందవనంలో రమిస్తుండగా మరియొకరిని పుట్టించాలని వారికి ఆలోచన కలిగింది.

యస్మిన్ యస్య మహాభారమావాం స్వస్వైరచారిణౌ ।
నిర్వాణధారణం కుర్వః కేవలం కాశిశాయినౌ ॥33॥

"అలా పుట్టించిన వానియందు సృష్టిభారం అంతా ఉంచి, మనము ఇద్దరం స్వేచ్ఛాచారులమై కాశీనగరంలో పరమానందాన్ని పొందుదాం" అని వారు భావించారు.

స ఏవ సర్వం కురుతాం స ఏవ పరిపాతు చ ।
స ఏవ సంవృణోత్యంతే మదనుగ్రహతస్సదా ॥34॥

ఆ పురుషుడు ఎపుడు నా అనుగ్రహముచే అన్నింటినీ పుట్టించి అతడే పరిపాలిస్తాడు. ప్రళయసమయంలో అతడే అన్నింటినీ ఉపసంహరిస్తాడు.

చేతస్సముద్రమాకుంచ్య చింతాకల్లోలలోలితమ్ ।
సత్త్వం రత్నం తమోగ్రాహం రజోవిద్రుమవల్లితమ్ ॥35॥

యస్య ప్రాసాదాత్తిష్ఠావస్సుఖమానందకాననే ।
పరిక్షిప్తమనోవృత్తౌ బహిశ్చింతాతురే సుఖమ్ ॥36॥

చింత అనే అలల కల్లోలంతో చలించేదీ రజోగుణమనే పగడపు తీగతో చుట్టబడినదీ, అయిన మనస్సముద్రం నుండి సత్త్వమనే రత్నాన్ని తీసుకొని ఆ పురుషుని అనుగ్రహం వల్ల మనమిద్దరం మన మనోవ్యాపారాల్ని అతని చుట్టూఉంచి దుఃఖానికి బాధకు దూరంగా ఆనందకాననంలో సుఖంగా ఉందాం.

సంప్రధార్యేతి స విభుస్తయా శక్త్యా పరేశ్వరః ।
సవ్యే వ్యాపారయాంచక్రే దశమేఽంగే సుధాసవమ్ ॥37॥

కాబట్టి మనం ఇచట సుఖంగా ఉందామని నిశ్చయించుకొని శక్తితో కూడిన ఆ పరమేశ్వరుడు తన ఎడమభాగమందలి జననేంద్రియమునందు అమృతరసాన్ని చిందించాడు.

తతః పుమానావిరాసీదేకః త్రైలోక్యసుందరః ।
శాంతస్సత్త్వగుణోద్రిక్తో గాంభీర్యామితసాగరః ॥38॥

అపుడు త్రిలోకసుందరుడైన పురుషుడు పుట్టాడు. అతడు శాంతుడు. సత్త్వగుణాన్ని ప్రధానంగా కలవాడు. గాంభీర్యంలో అంతులేని సముద్రం వంటి వాడు.

తథా చ క్షమయా యుక్తో మునేఽలబ్ధోపమోఽభవత్ ।
ఇంద్రనీలద్యుతిః శ్రీమాన్పుండరీకోత్తమేక్షణః ॥39॥

అదేవిధంగా క్షమాగుణం కలవాడు, పోలికలో సాటి లేని వాడు, ఆ పురుషుడు ఇంద్రనీలమణుల కాంతి కలవాడు. శ్రీమంతుడు పద్మాల వలె అందమైన కళ్లు కలవాడు.

సువర్ణ కృతిభృచ్ఛేష్టదుకూలయుగలావృతః ।
లసత్ప్రచండదోర్దండయుగలో హ్యపరాజితః ॥40॥

బంగారు ఆభరణాలను ధరించాడు. రెండు పట్టు వస్త్రాలను ధరించాడు. ప్రకాశించే బలమైన భుజదండాలు గల అతడిని ఎవరూ జయించ లేరు.

తతస్స పురుషశ్శంభుం ప్రణమ్య పరమేశ్వరమ్ ।
నామాని కురుమే స్వామిన్ వద కర్మ జగావితి ॥41॥

అపుడు ఆ పురుషుడు పరమేశ్వరుడైన శంభునకు నమస్కరించి "ఓ స్వామీ! నాకు పేరు పెట్టి నేను చేయవలసిన పనిని ఆదేశించండి" అని పలికాడు.

తచ్ఛ్రుత్వా వచనం ప్రాహ శంకరః ప్రహసన్ ప్రభుః ।
పురుషం తం మహేశానో వాచా మేఘగభీరయా ॥42॥

ఆ మాటను విని శంకరప్రభువు చిరునవ్వు నవ్వి, మేఘగర్జన వంటి స్వరంతో ఆ పురుషునితో ఇలా అన్నాడు.

శివ ఉవాచ - శివుడు పలికాడు.

విష్ణ్వితి వ్యాపకత్వాత్తే నామ ఖ్యాతం భవిష్యతి ।
బహూన్యన్యాని నామాని భక్తసౌఖ్యకరాణి హ ॥43॥

వ్యాపకుడవయినందున నీకు విష్ణువు అని పేరు ప్రసిద్ధి చెందగలదు. భక్తులకు ఆనందం కల్గించటానికి అనేక ఇతర నామాలు నీకు వర్తిస్తాయి.

తపః కురు దృఢో భూత్వా పరమం కార్యసాధనమ్ ।
ఇత్యుక్త్వా శ్వాసమార్గేణ దదౌ చ నిగమం తతః ॥44॥

కార్యసిద్ధికి తపస్సు ఒక గొప్ప సాధనం. కాబట్టి నీవు బలమైన చిత్తంతో తపస్సు చేయి. ఇలా పలికి శ్వాసమార్గం ద్వారా వేదాన్ని ఇచ్చాడు.

తతోఽచ్యుతశ్శివం నత్వా చకార విపులం తపః ।
అంతర్ధానం గతశ్శక్త్యా సలోకః పరమేశ్వరః ॥45॥

అపుడు విష్ణువు శివునికి నమస్కారం చేసి, గొప్ప తపస్సును చేశాడు. పరమేశ్వరుడు శక్తితో కూడి మాయమయ్యాడు. శివలోకం కూడా మాయమైంది.

దివ్యం ద్వాదశసాహస్రం వర్షం తప్త్వాపి చాచ్యుతః ।
న ప్రాప స్వాభిలషితం సర్వదం శంభుదర్శనమ్ ॥46॥

అచ్యుతుడు పన్నెండువేల సంవత్సరాలు తపస్సు చేసినా తనకు ఇష్టమైన అన్నిటిని ఇచ్చే శివదర్శనం మాత్రం లభింపలేదు.

తత్తస్సంశయమాపన్నశ్చింతితం హృది సాదరమ్ ।
మయాద్య కిం ప్రకర్తవ్యమితి విష్ణుశ్శివం స్మరన్ ॥47॥

విష్ణుని మనసులో అనేక సందేహాలు మొదలయ్యాయి. అతడు ఆదరంతో శివుణ్ణి స్మరిస్తూ నా తక్షణకర్తవ్యం ఏమిటి? అని బాధ పడ్డాడు.

ఏతస్మిన్నంతరే వాణీ సముత్పన్నా శివాచ్ఛుభా ।
తపః పునః ప్రకర్తవ్యం సంశయస్యాపనుత్తయే ॥48॥

ఇంతలో శివుని నుండి "సంశయాలను పోగొట్టుకోవటానికి మరల తపస్సు చెయ్యి" అనే మంగళకరమైన మాట వినిపించింది.

తతస్తేన చ తచ్ఛ్రుత్వా తపస్తప్తం సుదారుణమ్ ।
బహుకాలం తథా బ్రహ్మధ్యానమార్గపరేణ హి ॥49॥

ఆ మాటను విని అతడు చాలాకాలం పరబ్రహ్మధ్యానమార్గ పరాయణుడై కఠోర తపస్సును చేశాడు.

తతస్స పురుషో విష్ణుః ప్రబుద్ధో ధ్యానమార్గతః ।
సుప్రీతో విస్మయం ప్రాప్తః కిం యత్తవ మహో ఇతి ॥50॥

అప్పుడు ఆ విష్ణువు ధ్యానమార్గం నుండి బయటకు వచ్చి, శివుని మహిమను స్మరించుకొని ప్రీతిని, ఆశ్చర్యాన్ని పొందాడు.

పరిశ్రమవతస్తస్య విష్ణోస్స్వాంగేభ్య ఏవ చ ।
జలధారా హి సంయాతా వివిధాశ్శివమాయయా ॥51॥

ఈ విధంగా కఠిన తపస్సు చేసిన విష్ణువు యొక్క అవయవాల నుండి శివమాయాప్రభావం చేత అనేక నీటిధారలు బయటకు వచ్చాయి.

అభివ్యాప్తం చ సకలం శూన్యం యత్తన్మహామునే ।
బ్రహ్మరూపం జలమభూత్స్పర్శనాత్పాపనాశనమ్ ॥52॥

అపుడు అలా వ్యాపించిన చోటంతా ఆ బ్రహ్మస్వరూపం నీటితో నిండిపోయింది. ఆ నీటిని ముట్టుకుంటే పాపాలు నశిస్తాయి.

తథా శ్రాంతశ్చ పురుషో విష్ణుస్తస్మిన్ జలే స్వయమ్ ।
సుష్వాప పరమప్రీతో బహుకాలం విమోహితః ॥53॥

అప్పుడు అలసిపోయిన విష్ణువు ఆ నీటిలో ఎక్కువ ఆనందంతో చాలాకాలం మోహితుడై నిద్రపోయాడు.

నారాయణేతి నామాపి తస్యాసీచ్ఛ్రుతిసంమతమ్ ।
నాన్యత్కించిత్తదా హ్యాసీత్ ప్రాకృతం పురుషం వినా ॥54॥

అందుకే ఆయనకు వేదసమ్మతమైన నారాయణ (నీటిపై నిద్రించు వాడు) అనే పేరు వచ్చింది. అపుడు ఆ పురుషుడు తప్ప ఇతర ప్రకృతివికారాలు ఏవీ లేవు.

ఏతస్మిన్నంతరే కాలే తత్త్వాన్యాసన్మహాత్మనః ।
తత్ప్రకారం శృణు ప్రాజ్ఞ గదతో మే మహామతే ॥55॥

ఈ కాలంలోనే ఆ మహాత్ముడి నుండి చాలా తత్త్వాలు పుట్టాయి. ఓ నారదా! నీవు చాలా బుద్ధిశాలివి. ఆ తత్త్వాలు పుట్టిన విధం నేను చెప్తాను విను.

ప్రకృతేశ్చ మహానాసీన్మహతశ్చ గుణాస్త్రయః ।
అహంకారస్తతో జాతస్త్రివిధో గుణవిభేదతః ॥56॥

ప్రకృతినుంచి మహత్తు, మహత్తునుంచి సత్త్వ, రజః తమో గుణాలు పుట్టాయి. ఈ గుణభేదముచే మూడు రకాలైన అహంకారములు పుట్టాయి.

తన్మాత్రాశ్చ తతో జాతః పంచభూతాని వై తతః ।
తదైవ తానీంద్రియాణి జ్ఞానకర్మమయానిచ ॥57॥

అహంకారము నుండి పంచతన్మాత్రలు, వాటి నుండి అయిదు స్థూలభూతాలు పుట్టాయి. అదే సమయంలో జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు పుట్టాయి.

తత్త్వానామితి సంఖ్యానముక్తం తే ఋషిసత్తమ ।
జడాత్మకం చ తత్సర్వం ప్రకృతేః పురుషం వినా ॥58॥

ఓ మహర్షీ! నీకు ఈ విధంగా తత్త్వాల సంఖ్యను చూపించాను. పురుషుడు తప్ప, ప్రకృతి నుండి పుట్టిన తత్త్వాలన్నీ జడములే.

తత్తదైకీకృతం తత్త్వం చతుర్వింశతిసంఖ్యకమ్ ।
శివేచ్ఛయా గృహీత్వా స సుష్వాప బ్రహ్మరూపకే ॥59॥

విష్ణువు ఈ ఇరవైనాలుగు తత్త్వాలను ఒకటిగా చేసి, దాన్ని శివుని ఇష్టప్రకారం తనలో ఉంచుకొని, బ్రహ్మరూపమైన నీటిలో నిద్రపోయాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్ర సంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే విష్ణూత్పత్తి వర్ణనం నామ షష్ఠోఽధ్యాయః ॥6॥

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితం సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటిఖండంలో విష్ణూత్పత్తి వర్ణనం అనే ఆరవ అధ్యాయం సమాప్తం.

సప్తమోఽధ్యాయః - ఏడవ అధ్యాయం

విష్ణు బ్రహ్మ వివాదమ్ - విష్ణు బ్రహ్మల వివాదం

బ్రహ్మోవాచ - బ్రహ్మ పలికాడు.

సుప్తే నారాయణే దేవే నాభౌ పంకజముత్తమమ్ ।
ఆవిర్బభూవ సహసా బృహద్వై శంకరేచ్ఛయా ॥1॥

నారాయణదేవుడు నిద్రించగానే, శంకరుని కోరిక ప్రకారం అతని నాభిలో ఉత్తమమైన పెద్ద పద్మము ఒకటి ఉద్భవించింది.

అనంతయష్టికాయుక్తం కర్ణికారసమప్రభమ్ ।
అనంతయోజనాయామమనంతోచ్ఛ్రాయసంయుతమ్ ॥2॥

చివరభాగం తెలియనంత పొడవైన కాడతో విరాజిల్లుతోంది. అది కర్ణికారం (గోరింట (చెవి ఆభరణం) పువ్వులాగ) ప్రకాశించింది. అది లెక్కలేనన్ని యోజనాల వెడల్పు, ఎత్తు కలిగి ఉంది.

కోటిసూర్యప్రతీకాశం సుందరం తత్త్వసంయుతమ్ ।
అత్యద్భుతం మహారంభం దర్శనీయమనుత్తమమ్ ॥3॥

సుందరమైన ఆ పద్మం ప్రకృతితత్త్వాలన్నింటినీ కలిగి ఉంది. కోటి సూర్యుల వలె ప్రకాశించింది. అతి అద్భుతం, అతి సుందరం అయిన ఆ పద్మం చూడముచ్చటగా ఉంది.

కృత్వా యత్నం పూర్వవత్స శంకరః పరమేశ్వరః ।
దక్షిణాంగాన్నిజాన్మాం వై సాంబశ్శంభురజీజనత్ ॥4॥

శుభాలనిచ్చే పరమేశ్వరుడు సాంబశివుడు పూర్వం లాగే ప్రయత్నించి తన దేహంలోని కుడిభాగం నుండి నన్ను సృష్టించాడు.

స మాయామోహితం కృత్వా మాం మహేశో ద్రుతం మునే ।
తన్నాభి పంకజాదావిర్భావయామాస లీలయా ॥5॥

ఓ మహర్షీ! ఆ మహేశ్వరుడు వెంటనే నన్ను మాయతో మోహింప చేసి, తన లీలలో భాగంగా నన్ను ఆ నాభి నుంచి వచ్చేలా చేశాడు.

ఏవమ్ పద్మాత్తతో జజ్ఞే పుత్రోఽహం హేమగర్భకః ।
చతుర్ముఖో రక్తవర్ణస్త్రిపుండ్రాంకితమస్తకః ॥6॥

ఈ విధంగా హిరణ్యగర్భుడనైన నేను నాలుగు ముఖాలతో, ఎర్రని శరీరంతో, త్రిపుండ్రంతో ఉన్న ప్రకాశిస్తున్న నుదుటి భాగంతో, ఆ ఆదిదేవుని కుమారుడుగా పద్మం నుండి జన్మించాను.

తన్మాయామోహితశ్చాహం నావిదం కమలం వినా ।
స్వదేహజనకం తాత! పితరం జ్ఞానదుర్బలః ॥7॥

వత్సా! ఆ శివుని మాయచే మోహితుడనైన నాకు అల్పబుద్ధి కలగటంతో, నాకు జన్మను ఇచ్చిన తండ్రిని తెలుసుకోలేక, నాకు జన్మ నిచ్చింది కమలమే అని భావించాను. అంతకంటె ఏమీ తెలుసుకోలేక పోయాను.

కో౽హం వా కుత ఆయాతః కిం కార్యం తు మదీయకమ్ ।
కస్య పుత్రో౽హముత్పన్నః కేనైవ నిర్మితో౽ధునా ॥8॥

నేనెవరిని? ఎక్కడ నుండి వచ్చాను? నేను చేయవలసిన పని ఏమిటి? నేను ఎవరికి కుమారుడనై పుట్టాను? ఈ పద్మాన్ని సృష్టించినదెవరు?

ఇతి సంశయాపన్నం బుద్ధిర్మాం సమపద్యత ।
కిమర్థం మోహమాయామి తద్‌జ్ఞానం సుకరం ఖలు ॥9॥

ఇలాంటి సంశయాలలో ఉన్న నాకు ఒక ఊహ కలిగింది. నేను ఇలా మోహాన్ని పొందటం ఎందుకు? ఈ విషయాన్ని సులభంగా తెలుసుకోవచ్చు కదా!

ఏతత్కమలపుష్పస్య పత్రారోహస్థలం హ్యధః ।
మత్కర్తా చ స వై తత్ర భవిష్యతి న సంశయః ॥10॥

ఈ కమలానికి క్రింది భాగంలో కమలపత్రాలు మొదటిగా పుట్టిన చోట నన్ను పుట్టించిన వాడు ఉంటాడు అనటంలో సందేహం లేదు.

ఇతి బుద్ధిం సమాస్థాయ కమలాదవరోహయన్ ।
నాలే నాలే గతస్తత్ర వర్షాణాం శతకం మునే ॥11॥

ఓ మహర్షీ! ఈ విధంగా భావించి నేను కమలం నుండి క్రిందికి దిగి ప్రతీరంధ్రం నుండి దిగుతూ వందసంవత్సరాలు గడిపాను.

న లబ్ధం తు మయా కమలస్థానముత్తమమ్ ।
సంశయం చ పునః ప్రాప్తః కమలే గంతుముత్సుకః ॥12॥

కాని ఆ కమలము యొక్క శ్రేష్ఠమైన మొదలు నాకు దొరకలేదు. నాకు మళ్ళీ సంశయాలు మొదలై తిరిగి కమలంలోకి వెళ్లాలని ప్రయత్నించాను.

ఆరురోహాథ కమలం నాలమార్గేణ వై మునే ।
కుడ్మలం కమలస్యాథ లబ్ధవాన్న విమోహితః ॥13॥

ఓ మహర్షీ! అపుడు నేను మళ్ళీ నాళం ద్వారా పైకి వెళ్లాను. కాని మోహితుడనై పద్మం మొదటికి చేరుకోలేక పోయాను.

నాలమార్గేణ భ్రమతో గతం వర్షశతం పునః ।
క్షణమాత్రం తదా తత్ర తతస్తిష్ఠన్విమోహితః ॥14॥

ఆ నాళమార్గంలో నేను వందసంవత్సరాలు తిరిగాను. అపుడు అక్కడ మోహంతో క్షణకాలం నిలబడ్డాను.

తదా వాణీ సముత్పన్నా తపేతి పరమా శుభా ।
శివేచ్ఛయా పరా వ్యోమ్నో మోహవిధ్వంసినీ మునే! ॥15॥

ఓ మహర్షీ! అపుడు శివుని ఇచ్ఛతో ఆకాశంనుండి "తపస్సు చేయి" అనే మోహనాశకమైనదీ, శుభకరమైనదీ అయిన మాట వెలువడింది.

తచ్ఛ్రుత్వా వ్యోమవచనం ద్వాదశాబ్దం ప్రయత్నతః ।
పునస్తప్తం తపోఘోరం ద్రష్టుం స్వజనకం తదా ॥16॥

ఆ ఆకాశవాణిని విని నా తండ్రిని చూడాలనే కోరికతో మరలా పన్నెండు సంవత్సరాలు యత్నంతో ఘోరమైన తపస్సు చేశాను.

తదా హి భగవాన్విష్ణుశ్చతుర్బాహుస్సులోచనః ।
మయ్యేవానుగ్రహం కర్తుం ద్రుతమావిర్బభూవ హ ॥17॥

ఆయన నాలుగు భుజాలు, అందమైన కన్నులు గల విష్ణుభగవానుడు నన్ను అనుగ్రహించుట కోసం వెనువెంటనే ప్రత్యక్షమయ్యాడు.

శంఖచక్రాయుధకరో గదాపద్మధరః పరః ।
ఘనశ్యామలసర్వాంగః పీతాంబరధరః పరః ॥18॥

ఆయన శంఖ, చక్రములను ఆయుధాలను చేతులయందు ధరించి ఉన్నాడు. నీలమేఘశ్యామవర్ణ శరీరంతో ఉన్న విష్ణువు గదను, పద్మాన్ని ధరించి పీతాంబరుడై ప్రకాశించాడు.

ముకుటాదిమహాభూషః ప్రసన్నముఖపంకజః ।
కోటికందర్పసంకాశస్సందృష్టో మోహితేన సః ॥19॥

కిరీటాన్ని, ఇతర ఆభరణాలను ధరించిన విష్ణువు ముఖపద్మం ప్రసన్నంగా ఉంది. నేను కోటి మన్మథుల సౌందర్యం ఉన్న విష్ణువును చూసి మోహం పొందాను.

తద్దృష్ట్వా సుందరం రూపం విస్మయం పరమం గతః ।
కాలాభం కాంచనాభం చ సర్వాత్మానం చతుర్భుజమ్ ॥20॥

నల్లని శరీరంతో, బంగారు ఆభరణాలతో, నాలుగు భుజాలతో ప్రకాశించే సర్వాత్ముడైన విష్ణువు యొక్క సుందరరూపాన్ని చూసి, నేను ఆశ్చర్యంలో మునిగిపోయాను.

తథాభూతమహం దృష్ట్వా సదసన్మయమాత్మనా ।
నారాయణం మహాబాహుం హర్షితో హ్యభవం తదా ॥21॥

ప్రకృతిపురుషరూపుడు, మహాబాహువైన ఆ నారాయణుని సుందరరూపాన్ని చూసి నేనప్పుడు సంతోషించాను.

మాయయా మోహితశ్శంభోస్తదా లీలాత్మనః ప్రభోః ।
అవిజ్ఞాయ స్వజనకం తమవోచం ప్రహర్షితః ॥22॥

లీలామయుడైన శివప్రభువు యొక్క మాయచే మోహితుడనైన నేను ఆ సమయంలో నన్ను సృష్టించిన తండ్రి గురించి తెలిసికొనలేక పోయాను. నేనపుడు ఆనందించి విష్ణువుతో ఇలా అన్నాను.

బ్రహ్మో వాచ - బ్రహ్మ పలికాడు.

కస్త్వం వదేతి హస్తేన సముత్థాప్య సనాతనమ్ ।
తదా హస్తప్రహారేణ తీవ్రేణ సుదృఢేన తు ॥23॥

సనాతనుడైన విష్ణువును నేను "నీవెవరివి?" అని చేతితో తట్టి లేపాను. చేతితో తట్టినపుడు ఆయనకు గట్టి దెబ్బ తగిలింది.

ప్రబుద్ధ్యోత్థాయ శయనాత్సమాసీనః క్షణం వశీ ।
దదర్శ నిద్రావిక్లిన్ననీరజామలలోచనః ॥24॥

ఆయన తెలివి తెచ్చుకొని, శయ్య మీద నుండి లేచి, క్షణకాలంలో నిద్రను జయించి, నిద్ర తొలగిపోయి పద్మాల వంటి స్వచ్ఛమైన నేత్రాలతో చూశాడు.

విష్ణు రువాచ - విష్ణువు చెప్పాడు.

మామత్ర సంస్థితం భాసాధ్యాసితో భగవాన్ హరిః ।
ఆహ చోత్థాయ బ్రహ్మాణం హసన్మాం మధురం సకృత్ ॥25॥

గొప్ప ప్రకాశం గల విష్ణుభగవానుడు లేచి, అక్కడ నిలబడి నన్ను చూసి నవ్వుతూ మధురంగా మాటలాడ సాగాడు.

స్వాగతం స్వాగతం వత్స పితామహ మహాద్యుతే ।
నిర్భయో భవ దాస్యేఽహం సర్వాన్కామాన్న సంశయః ॥26॥

వత్సా! పితామహా! నీకు స్వాగతం. స్వాగతం. నీవు గొప్పగా ప్రకాశిస్తున్నావు. నీ కోరికలనన్నింటినీ నేను నిస్సందేహంగా తీరుస్తాను.

తస్య తద్వచనం శ్రుత్వా స్మితపూర్వం సురర్షభః ।
రజసా బద్ధవైరశ్చ తమవోచం జనార్దనమ్ ॥27॥

దేవతలలో గొప్పవాడైన జనార్దనుని చిరునవ్వుతో కూడిన ఆ మాటను విని, రజోగుణంవల్ల ఆయనతో వైరం కల వాడనై ఇలా అన్నాను.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

భాషసే వత్స వత్సేతి సర్వసంహారకారణమ్ ।
మామిహాతిస్మితం కృత్వా గురుశ్శిష్యమివానఘ ॥28॥

ఓ పూజ్యుడా! సర్వాన్ని సంహరించటంలో కారణమైన నన్ను ఉద్దేశించి, గురువు శిష్యుడు లాగ, చిరునవ్వుతో వత్సా! వత్సా! అని మాట్లాడుతున్నావు.

కర్తారం జగతాం సాక్షాత్ ప్రకృతేశ్చ ప్రవర్తకమ్ ।
సనాతనమజం విష్ణుం విరించిం విష్ణుసంభవమ్ ॥29॥

నేను సాక్షాత్తూ సృష్టికర్తను. ప్రకృతిని ప్రవర్తించేట్లు చేసేది నేనే. నేను సనాతనుడను. జన్మ లేని వాణ్ణి. అన్నింటా వ్యాపించి ఉన్న వాణ్ణి. విష్ణువు నుండి పుట్టినవాడను.

విశ్వాత్మానం విధాతారం ధాతారం పంకజేక్షణమ్ ।
కిమర్థం భాషసే మోహాద్వక్తుమర్హసి సత్వరమ్ ॥30॥

విశ్వస్వరూపుడనైన విధాతను. పద్మాల వంటి కళ్లు ఉన్న ధాతను. నీవు మోహితుడవై నాతో ఇలా అనటానికిగల కారణం వెంటనే చెప్పు.

వేదో మాం వక్తి నియమాత్స్వయంభువమజం విభుమ్ ।
పితామహం స్వరాజం చ పరమేష్ఠినముత్తమమ్ ॥31॥

వేదం తప్పనిసరిగా నన్ను స్వయంభువుడు, జన్మ లేని వాడు, వ్యాపకుడు, స్వరాట్, పరమేష్ఠి మరియు ఉత్తముడు అని ఉద్ఘాటిస్తోంది.

ఇత్యాకర్ణ్య హరిర్వాక్యం మమ కృద్ధో రమాపతిః ।
సోఽపి మామాహ జానే త్వాం కర్తారమితి లోకతః ॥32॥

ఈ నా మాటలు విని లక్ష్మీపతియైన విష్ణువు కోపించి "లోకాలను పుట్టించింది నీవే అని నాకు తెలుసు" అని అన్నాడు.

విష్ణురువాచ – విష్ణువు ఇలా చెప్పాడు.

కర్తుం ధర్తుం భవానంగాదవతీర్ణో మమావ్యయాత్ ।
విస్మృతోఽసి జగన్నాథం నారాయణమనామయమ్ ॥33॥

పురుషం పరమాత్మానం పురుహూతం పురుష్టుతమ్ ।
విష్ణుమచ్యుతమీశానం విశ్వస్య ప్రభవోద్భవమ్ ॥34॥

నారాయణం మహాబాహుం సర్వవ్యాపకమీశ్వరమ్ ।
మన్నాభిపద్మతస్త్వం హి ప్రసూతో నాత్ర సంశయః ॥35॥

నీవు జగత్తును సృష్టించి, ధరించుట కోసం నాశనం లేని నా శరీరం నుండి పుట్టావు. కాని లోకాలకు ప్రభువు, దోషాలు లేని వాడు అయిన నారాయణున్ని మరచిపోయావు. పురుషుడు, పరమాత్మ, అందరిచే ప్రార్థింపబడు వాడు, వ్యాపించిన వాడు, అచ్యుతుడు, లోకాలను రక్షించే వాడు, ప్రపంచానికి నిమిత్తోపాదనకారణాలైన వాడు. నాలుగు చేతులు కల్గి సర్వసమర్థుడు, నారాయణుడైన నన్ను మరచిపోయావు. నీవు నాభి అందలి పద్మం నుండి పుట్టావు అనటంలో సందేహం లేదు.

తవాపరాధో నాస్త్యత్ర త్వయి మాయాకృతం మమ ।
శృణు సత్యం చతుర్వక్త్ర సర్వదేవేశ్వరో హ్యహమ్ ॥36॥

దీనిలో నీ తప్పేదీ లేదు. నువు నా మాయచే మోహితుడయ్యావు. ఓ నాలుగు ముఖాలవాడా! నిజాన్ని విను. దేవతలందరికి ప్రభువును నేనే.

కర్తా హర్తా చ భర్తా చ న మయాస్తి సమో విభుః ।
అహమేవ పరబ్రహ్మ పరం తత్త్వం పితామహ ॥37॥

ప్రపంచ సృష్టి స్థితి లయాలకు కారణం నేనే. నాతో సమానమైన విభుడు లేడు. ఓ పితామహా! పరతత్త్వమైన పరబ్రహ్మను నేనే.

అహమేవ పరంజ్యోతిః పరమాత్మా త్వహం విభుః ।
అద్య దృష్టం శ్రుతం సర్వం జగత్యస్మింశ్చరాచరమ్ ॥38॥

తత్తద్విద్ధి చతుర్వక్త్ర సర్వం మన్మయమిత్యథ ।
మయా సృష్టం పురావ్యక్తం చతుర్వింశతితత్త్వకమ్ ॥39॥

పరంజ్యోతి పరమాత్మను నేనే. నేను సర్వ వ్యాపకుడను. ఓ నాలుగు ముఖాలవాడా! ఈ జగత్తులో కనపడే మరియు వినపడే స్థావర జంగమాలన్నీ నా స్వరూపమని తెలుసుకో. ఇరవైనాలుగుతత్త్వాల అవ్యక్తాన్ని పూర్వం నేనే సృష్టించాను.

నిత్యం తేష్వణవో బద్ధాస్సృష్టః క్రోధభయాదయః ।
ప్రభవాచ్చ భవానంగాన్యనేకానీహ లీలయా ॥40॥

వాటియందు నిత్యమైన అణువులను నేనే నిర్మించాను. నేను నా ప్రభావం చేత లీలగా క్రోధం, భయం మొదలైన వాటినే కాక, నిన్ను, జగత్తులోని అనేక అంశాలను పుట్టించాను.

సృష్టా బుద్ధిర్మయా తస్యామహంకారస్త్రిధా తతః ।
తన్మాత్రం పంకజం తస్మాన్మనో దేహేంద్రియాణి చ ॥41॥

నేను వ్యక్తం కాని దాని నుండి బుద్ధిని, బుద్ధి నుండి మూడు రకాల అహంకారాలను, పంచతన్మాత్రలను, పద్మాన్ని మరియు మనస్సును, శరీరాన్ని, ఇంద్రియాలను పుట్టించాను.

ఆకాశాదీని భూతాని భౌతికాని చ లీలయా ।
ఇతి బుద్ధ్వా ప్రజానాథ! శరణం వ్రజ మే విధే! ॥42॥

నేను లీలతో ఆకాశం వంటి పంచభూతాలను, భౌతిక పదార్థాలను పుట్టించాను. ఓ ప్రజాపతీ! ఓ బ్రహ్మన్! నీవు ఈ నిజాన్ని తెలుసుకుని, నన్ను శరణు పొందు.

అహం త్వాం సర్వదుఃఖేభ్యో రక్షిష్యామి న సంశయః ।

నేను నిన్ను సంశయం లేకుండా అన్ని దుఃఖాలనుండి రక్షిస్తాను.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

ఇతి శ్రుత్వా వచస్తస్య బ్రహ్మా క్రోధసమన్వితః ।
కో వా త్వమితి సంభర్త్స్యాబ్రువం మాయావిమోహితః ॥43॥

అతని ఈ మాటలను విన్న బ్రహ్మకు కోపం వచ్చింది. మాయచే మోహితుడై నీవు ఎవరు? అని గట్టిగా కోపంగా అరిచాడు.

కిమర్థం భాషసే భూరి బహ్వనర్థకరం వచః ।
నేశ్వరస్త్వం పరబ్రహ్మ కశ్చిత్కర్తా భవేత్తవ ॥44॥

అనర్థకరమైన మాటలు ఎక్కువగా మాట్లాడుతున్నా వెందుకు? “నువ్వు ఈశ్వరుడవు కాదు. పరబ్రహ్మవు కాదు. నిన్ను పుట్టించిన వాడు మరొకడు ఉన్నాడు.” అని అన్నాను.

మాయయా మోహితశ్చాహం యుద్ధం చక్రే సుదారుణమ్ ।
హరిణా తేన వై సార్థం శంకరస్య మహాప్రభో! ॥45॥

అలా శంకరుని మాయలో పడి ఆ విష్ణువుతో భయంకరమైన యుద్ధం చేశాను.

ఏవం మమ హరేశ్చాసీత్సంగరో రోమహర్షణః ।
ప్రలయార్ణవమధ్యే తు రజసా బద్ధవైరయోః ॥46॥

ఈ విధంగా ప్రళయకాలసముద్రమధ్యంలో రజోగుణప్రభావంచే పరస్పరం వైరం గల మాకు, భయంకరయుద్ధం జరిగింది.

ఏతస్మిన్నంతరే లింగమభవచ్చావయోః పురః ।
వివాదశమనార్థం హి ప్రబోధార్థం తథాஉஉవయోః ॥47॥

ఇంతలో మా ఇద్దరి యుద్ధాన్ని చల్లార్చటం కోసం మాఇద్దరికీ తెలియజెప్పడం కోసం మా ఎదురుగా లింగం ఏర్పడింది.

జ్వాలామాలాసహస్రాఢ్యం కాలానలశతోపమమ్ ।
క్షయవృద్ధివినిర్ముక్తమాదిమధ్యాంతవర్జితమ్ ॥48॥

అది అనేకజ్వాలలతో నిండి, లెక్క లేనన్ని ప్రళయాగ్నులను పోలినట్లుంది. తగ్గుదల, పెరుగుదల లేని ఆ లింగానికి మొదలు, చివర, మధ్యభాగం లేవు.

అనౌపమ్యమనిర్దేశ్యమవ్యక్తం విశ్వసంభవమ్ ।
తస్య జ్వాలాసహస్రేణ మోహితో భగవాన్ హరిః ॥49॥

ఆ లింగం సాటిలేనిది. ఇంద్రియాలకు అందనిది. జగత్తు, సృష్టికి ఆధారమైంది. ఆ లింగంయొక్క వేలాది జ్వాలలచే మోహితుడైన విష్ణుభగవానుడు ఇలా అన్నాడు.

మోహితం చాహ మామత్ర కిమర్థం స్పర్ధసేఽధునా ।
ఆగతస్తు తృతీయోఽత్ర తిష్ఠతాం యుద్ధమావయోః ॥50॥

ఇపుడు నాతో నీకు ఈ పోటీ ఎందుకు? మన ఇద్దరి మధ్య ఈ మూడవది వచ్చింది. మనం ఈ యుద్ధాన్ని ఆపేద్దాం.

కుత ఏవాత్ర సంభూతః పరీక్షావోఽగ్నిసంభవమ్ ।
అధో గమిష్యామ్యనలస్తంభస్యానుపమస్య చ ॥51॥

ఈ అగ్నిస్తంభం ఎక్కడ నుండి వచ్చిందో తెలుసుకుందాం. ఈ సాటిలేని అగ్నిస్తంభం యొక్క క్రింది భాగాన్ని నేను వాయువేగంతో వెళ్ళి పరిశీలిస్తాను.

పరీక్షార్థం ప్రజానాథ తస్య వై వాయువేగతః ।
భవానూర్ధ్వం ప్రయత్నేన గంతుమర్హతి సత్వరమ్ ॥52॥

ప్రజాపతీ! ఈ లింగాన్ని పరిశీలించడానికి, నువ్వు వాయువేగంతో పైకి వెంటనే బయల్దేరు.

బ్రహ్మో వాచ - బ్రహ్మ చెప్పాడు.

ఏవం వ్యాహృత్య విశ్వాత్మా స్వరూపమకరోత్తదా ।
వారాహమహమప్యాశు హంసత్వం ప్రాప్తవాన్మునే ॥53॥

ఇలా మాట్లాడి విష్ణువు వరాహరూపాన్ని పొందాడు. ఓ మహర్షీ! నేను కూడా వెంటనే హంసరూపాన్ని పొందాను.

తదా ప్రభృతి మామాహుర్హంసహంసో విరాడితి ।
హంస హంసేతి యో బ్రూయాత్స హంసోఽథ భవిష్యతి ॥54॥

అప్పటినుండి లోకంలో నాకు హంస అని, విరాట్ అని పేరు వచ్చింది. హంస జపాన్ని చేసేవాడు హంస (విరాట్) రూపుడౌతాడు.

సుశ్వేతో హ్యనలప్రఖ్యో విశ్వతః పక్షసంయుతః ।
మనోఽనిలజవో భూత్వా గత్వోర్ధ్వం చోర్ధ్వతః పురా ॥55॥

తెల్లనిది, అగ్నిలా ప్రకాశించేది, విశాలమైన రెక్కలున్నది, మనసుతో మరియు గాలితో సమానమైన వేగం కలది అయిన హంసరూపాన్ని ధరించి పైకి, పైపైకి వెళ్ళాను.

నారాయణోऽపి విశ్వాత్మా సుశ్వేతో హ్యభవత్తదా ।
దశయోజనవిస్తీర్ణం శతయోజనమాయతమ్ ॥56॥

నారాయణుడు కూడా తెల్లని వరాహరూపాన్ని ధరించాడు. ఆ వరాహము పదియోజనాల వెడల్పు, వందయోజనాల పొడవు కలిగి ఉంది.

మేరుపర్వతవర్ష్మాణం గౌరతీక్ష్ణోగ్రదంష్ట్రిణమ్ ।
కాలాదిత్య సమాభాసం దీర్ఘఘోణం మహాస్వనమ్ ॥57॥

మేరు పర్వతం వంటి శరీరం కలిగి ఉండి దాని తెల్లని పదునైన కోరలు భయాన్ని కల్గిస్తున్నాయి. ప్రళయకాలసూర్యుడి లాగ ప్రకాశించే ఆ వరాహం పెద్ద ముట్టెని కలిగి పెద్ద ధ్వని చేసింది.

హ్రస్వపాదం విచిత్రాంగం జైత్రం దృఢమనౌపమమ్ ।
వారాహాకారమాస్థాయ గతవాంస్తదధో జవాత్ ॥58॥

ఆ వరాహ పాదాలు చిన్నవిగాను, అవయవాలు విచిత్రంగానూ ఉన్నాయి. సాటి లేని దారుఢ్యం గల దాని శరీరం సమర్థవంతంగా ఉంది. ఆ వరాహం వేగంగా కిందకు ప్రయాణించింది.

ఏవం వర్షసహస్రం చ చరన్ విష్ణురధో గతః ।
తథాప్రభృతి లోకేషు శ్వేతవారాహసంజ్ఞకః ॥59॥

కల్పో బభూవ దేవర్షే నరాణాం కాలసంజ్ఞకః ।
బభ్రామ బహుధా విష్ణుః ప్రభవిష్ణురధోగతః ॥60॥

విష్ణువు ఇలాంటి రూపాన్ని ధరించి ఆ లింగం క్రిందివైపుకి వేగంగా ప్రయాణం చేస్తూ వేయి సంవత్సరాలు గడిపాడు. ఓ దేవర్షీ! అప్పటి నుండి మానవలోకంలో ఒక కల్పానికి శ్వేతవరాహకల్పం అనే పేరు వచ్చింది. సమర్థుడైన విష్ణువు వరాహరూపంలో దాని క్రింది భాగం వైపు అనేక విధాలుగా ప్రయాణం చేశాడు.

నాపశ్యదల్పమప్యస్య మూలం లింగస్య సూకరః ।
తావత్కాలం గతశ్చోర్ధ్వమహమప్యరిసూదన ॥61॥

దాని మూలానికి దరిదాపులకు కూడా చేరలేక పోయాడు. అంతః శత్రువులను జయించిన ఓ మహర్షీ! అదే కాలంలో నేను కూడా దాని అగ్రాన్ని (కొన భాగాన్ని) చూసే కోరికతో వేగంగా ప్రయత్నించి పైకి ప్రయాణించాను.

సత్వరం సర్వయత్నేన తస్యాంతం జ్ఞాతుమిచ్ఛయా ।
శ్రాంతో న దృష్ట్వా తస్యాంతమహం కాలాదధో గతః ॥62॥

తొందరగా దాని చివరభాగాన్ని చూడాలనే కోరికతో అన్ని ప్రయత్నాలు చేసి అలసిపోయాను కానీ కనుగొనలేక పోయాను. చివరకు కిందకు వచ్చేశాను.

తథైవ భగవాన్విష్ణుశ్శ్రాంతం కమలలోచనః ।
సర్వదేవనిభస్తూర్ణముత్థితస్సమహావపుః ॥63॥

సమాగతో మయా సార్ధం ప్రణిపత్య భవం ముహుః ।
మాయయా మోహితశ్శంభోస్తస్థౌ సంవిగ్నమానసః ॥64॥

పద్మములవంటి కళ్లు ఉన్న విష్ణువు కూడా అలసి పోయి అక్కడకు వచ్చాడు. మేము అనేక సార్లు శివునికి నమస్కారం చేశాం. సర్వదేవతాస్వరూపుడైన ఆ వరాహమూర్తి పెద్ద శరీరంతో అక్కడికి నేను చేరిన సమయానికే వచ్చాడు. శివుని మాయ వల్ల మోహితుడైన విష్ణువు కలత చెందిన మనస్సు కలవాడై ఏమీ తోచనివాడై నిలుచున్నాడు.

పృష్ఠతః పార్శ్వతశ్చైవ హ్యగ్రతః పరమేశ్వరమ్ ।
ప్రణిపత్య మయా సార్ధం సస్మార కిమిదం త్వితి ॥65॥

నాతో కలిసి పరమేశ్వరునికి వెనుక, ప్రక్కన, మరియు ఎదురుగా నమస్కరించాడు. ఇది ఏమిటి ఏమై ఉంటుంది? అని ఆశ్చర్యపోయాము.

అనిర్దేశ్యం చ తద్రూపమనామకర్మవర్జితమ్ ।
అలింగం లింగతాం ప్రాప్తం ధ్యానమార్గేఽప్యగోచరమ్ ॥66॥

పరమేశ్వరుని రూపం ఇదమిత్థంగా (ఇది అని చెప్పలేని స్థితి) నిర్ణయించటం వీలు కానిది. పేరు, గుర్తులు లేనట్టిది. ధ్యానంలో కూడ కనిపించని పరమేశ్వరుడు లింగాకారం పొందాడు.

స్వస్థం చిత్తం తదా కృత్వా నమస్కారపరాయణౌ ।
బభూవతురుభావావామహం హరిరపి ధ్రువమ్ ॥67॥

నేను, విష్ణువు స్వచ్ఛమైన మనస్సులు కలిగి (బుద్ధిని) శివునికి నమస్కారాలు చేశాము.

జానీవో న హి తే రూపం యోఽసి యోఽసి మహాప్రభో ।
నమోఽస్తు తే మహేశాన రూపం దర్శయ నౌ త్వరన్ ॥68॥

మహాప్రభో! నీవు ఎవ్వరివో, నీ స్వరూపమేమిటో మాకు తెలియటం లేదు. మహేశ్వరా! నీకు నమస్కారం. నువ్వు నీ రూపాన్ని మాకు వెంటనే చూపించు.

ఏవం శరచ్ఛతాన్యాసన్నమస్కారం ప్రకుర్వతోః ।
ఆవయోర్మునిశార్దూల మదమాస్థితయోస్తదా ॥69॥

ఈ విధంగా శివునికి నమస్కారం చేస్తూ మేము వంద సంవత్సరాలు గడిపాం. ఓ మహర్షీ! అపుడు మేము గర్వించిన మనసుతో ఉన్నాం.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే విష్ణుబ్రహ్మవివాదవర్ణనో నామ సప్తమోఽధ్యాయః ॥7॥

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితలో సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటి ఖండంలో విష్ణు, బ్రహ్మ వివాదవర్ణనమనే ఏడవ అధ్యాయం సమాప్తం.

అష్టమోఽధ్యాయః - ఎనిమిదవ అధ్యాయం

శబ్ద బ్రహ్మ తనువర్ణనః - శబ్ద బ్రహ్మ తనువర్ణనం

బ్రహ్మోవాచ - బ్రహ్మ ఇట్లు పలికెను.

ఏవం తయోర్మునిశ్రేష్ఠ దర్శనం కాంక్షమాణయోః ।
విగర్వయోశ్చ సురయోస్సదా నౌ స్థితయోర్మునే ॥1॥

దయాలురభవచ్ఛంభుర్దీనానాం ప్రతిపాలకః ।
గర్విణాం గర్వహర్తా చ సర్వేషాం ప్రభురవ్యయః ॥2॥

ఓ మునిశ్రేష్ఠా! గర్వం పోయి, దర్శనం కోరి, అక్కడ నిలబడి ఉన్న మా ఇద్దరి మీద దీనులను రక్షించేవాడు, గర్వాన్ని అణచేవాడు, అన్ని ప్రాణులకు ప్రభువు, వినాశనం లేనివాడు అయిన శివుడికి దయ కల్గింది.

తదా సమభవత్తత్ర నాదో వై శబ్దలక్షణః ।
ఓమోమితి సురశ్రేష్ఠాత్సువ్యక్తః ప్లుతలక్షణః ॥3॥

అపుడు అక్కడ దేవతాశ్రేష్ఠుడైన శివుని నుండి "ఓం ఓం" అనే స్పష్టమైన, దీర్ఘమైన శబ్దం బయలుదేరింది.

కిమిదం త్వితి సంచింత్య మయా తిష్ఠన్మహాస్వనః ।
విష్ణుస్సర్వసురారాధ్యో నిర్వైరస్తుష్టచేతసా ॥4॥

ఆ మహాశబ్దం ఏమై ఉంటుంది? అని అనుకుంటూ దేవతలందరిచే పూజింపబడే విష్ణువు వైరభావం తొలగిపోవడంతో సంతోషంగా ఉన్న మనస్సు కలవాడై నాతో పాటు నిలబడి ఉన్నాడు.

లింగస్య దక్షిణే భాగే తథా పశ్యత్సనాతనమ్ ।
ఆద్యం వర్ణమకారాఖ్యముకారం చోత్తరం తతః ॥5॥

మకారం మధ్యతశ్చైవ నాదమంతేఽస్య చోమితి ।
సూర్యమండలవద్దృష్ట్వా వర్ణమాద్యం తు దక్షిణే ॥6॥

ఉత్తరే పావకప్రఖ్యముకారమృషిసత్తమ ।
శీతాంశుమండలప్రఖ్యం మకారం తస్య మధ్యతః ॥7॥

తస్యోపరి తదాఽపశ్యచ్ఛుద్ధస్ఫటికసుప్రభమ్ ।
తురీయాతీతమమలం నిష్కలం నిరుపద్రవమ్ ॥8॥

నిర్ద్వంద్వం కేవలం శూన్యం బాహ్యాభ్యంతరవర్జితమ్ ।
స బాహ్యాభ్యంతరే చైవ బాహ్యాభ్యంతరసంస్థితమ్ ॥9॥

ఆదిమధ్యాంతరహితమానందస్యాపి కారణమ్ ।
సత్యమానందమమృతం పరం బ్రహ్మపరాయణమ్ ॥10॥

అపుడాయన లింగానికి దక్షిణం వైపు సనాతనం, మొదటి వర్ణమైన అకారాన్ని, ఉత్తరంవైపు ఉకారాన్ని, మధ్యలో మకారాన్ని, చివరలో ఓం అను నాదాన్ని చూశారు. ఓ మహర్షీ! దక్షిణాన ఉన్న మొదటి వర్ణం సూర్యమండలం వలె, ఉత్తరానున్న ఉకారం అగ్నిహోత్రంచే, మధ్యలోని మకారం చంద్రమండలం వలె ప్రకాశిస్తోంది. అపుడు ఆ ఓంకారంపైన, స్ఫటికంలా శుద్ధం, కాంతులను వెదజల్లేది, జాగ్రత్, స్వప్న, సుషుప్తులకు అతీతమైన తురీయతత్త్వం, దోషాలు లేని, అంశాలు లేని, దుఃఖానికి అతీతమైనది రెండవది లేని, ఏకమై ఉన్న, ఆకాశరూపం, బయట లోపల అనే భేదం లేనిది, బయట లోపల కూడా వ్యాపించి ఉన్నది. మొదలు, మధ్య, చివర లేనిది, ఆనందఘనం, సత్యం, అమృతం, సర్వోత్కృష్టం అయిన పరబ్రహ్మను చూశాడు.

కుత ఏవాత్ర సంభూతః పరీక్షావోఽగ్నిసంభవమ్ ।
అథో గమిష్యామ్యనలస్తంభస్యానుపమస్య చ ॥11॥

ఈ అగ్ని స్తంభం ఎక్కడి నుండి పుట్టింది? మరోసారి మనమిద్దరం చూద్దాం. సాటిలేని ఈ అగ్నిస్తంభం యొక్క క్రింది భాగాన్ని నేను చూస్తాను.

వేదశబ్దోభయావేశం విశ్వాత్మానం వ్యచింతయత్ ।
తదాఽభవదృషిస్తత్ర ఋషేస్సారతమం స్మృతమ్ ॥12॥

అపుడు విష్ణువు వేదావేశ, శబ్దావేశాలు కల జగత్స్వరూపుడైన శివుణ్ణి స్మరించాడు. అపుడు అక్కడ ఋషిపరంపరకు సారభూతుడైన ఋషి ఒకరు ప్రత్యక్షమయ్యారు.

తేనైవ ఋషిణా విష్ణుర్జ్ఞాతవాన్పరమేశ్వరమ్ ।
మహాదేవం పరంబ్రహ్మ శబ్దబ్రహ్మతనుం పరమ్ ॥13॥

పరమేశ్వరుడు, పరబ్రహ్మ, శబ్దమే దేహంగా కలవాడు, సర్వోత్కృష్టుడైన మహాదేవుని విష్ణువు ఆ ఋషి వలన దర్శించగలిగాడు.

చింతయా రహితో రుద్రో వాచో యన్మనసా సహ ।
అప్రాప్య తన్నివర్తంతే వాచ్యస్త్వేకాక్షరేణ సః ॥14॥

రుద్రుడు మనోవృత్తులకు అతీతుడు, మాటలతో పాటు. మనస్సు ఆయనను చేరలేక వెనుకకు మళ్ళింది. అలాంటి శివుడు ఓంకారం అనే ఒక అక్షరంతో చెప్పబడతాడు.

ఏకాక్షరేణ తద్వాక్యమమృతం పరమకారణమ్ ।
సత్యమానందమమృతం పరం బ్రహ్మ పరాత్పరమ్ ॥15॥

సర్వకారణకారణం, అమృతం, సత్యం, ఆనందం, సర్వశ్రేష్ఠమైన పరబ్రహ్మను ఓంకారం నిర్దేశిస్తుంది.

ఏకాక్షరాదకారాఖ్యాద్భగవాన్ బీజకోండజః ।
ఏకాక్షరాదుకారాఖ్యాద్ధరిః పరమకారణమ్ ॥16॥

అకారమనే ఒక అక్షరంచే భగవాన్ హిరణ్యగర్భుడు (సృష్టికర్త), ఉకారమనే ఒక అక్షరంచే పరమకారణం (స్థితికర్త) అగు విష్ణువు నిర్దేశింపబడతారు.

ఏకాక్షరాన్మకారాఖ్యాద్భగవాన్నీలలోహితః ।
సర్గకర్తా త్వకారాఖ్యో హ్యుకారాఖ్యస్తు మోహకః ॥17॥

మకారమనే ఒక అక్షరం భగవాన్ శివుణ్ణి నిర్దేశిస్తుంది. అకారం సృష్టికర్త. ఉకారం మోహింప చేస్తుంది.

మకారాఖ్యస్తు యో నిత్యమనుగ్రహకరోఽభవత్ ।
మకారాఖ్యో విభుర్బీజీ హ్యకారో బీజ ఉచ్యతే ॥18॥

మకారం ఎపుడూ అనుగ్రహాన్నిస్తుంది. మకారంచే చెప్పబడే సర్వవ్యాపకుడైన శివుడు బీజి (బీజం కలవాడు) అనుబడతాడు. అ కారం బీజం.

ఉకారాఖ్యో హరిర్యోనిః ప్రధానపురుషేశ్వరః ।
బీజీ చ బీజం తద్యోనిర్నాదాఖ్యశ్చ మహేశ్వరః ॥19॥

ఉకారం చెప్పబడే విష్ణువు యోని. ప్రకృతికి, పురుషుడికి ప్రభువైన మహేశ్వరుడిలో బీజి, బీజం, యోని ఐక్యమౌతాయి. ఆయన నాదస్వరూపుడు.

బీజీ విభజ్య చాత్మానం స్వేచ్ఛయా తు వ్యవస్థితః ।
అస్య లింగాదభూద్బీజమకారో బీజినః ప్రభోః ॥20॥

ఉకారయోనౌ నిక్షిప్తమవర్ధత సమంతతః ।
సౌవర్ణమభవచ్చాండమావేద్యం తదలక్షణమ్ ॥21॥

బీజి తన ఇష్టంతో తనని తాను విభజించుకుంటుంది. ప్రభువగు బీజి యొక్క అకారరూపమైన బీజం ఉకారమనే యోనిలో పడి ఉకారంతో కలసి అన్నింటా విస్తరించి, సౌవర్ణం అండంగా అయింది. దానికి ఇతర లక్షణాలు లేవు.

అనేకాబ్దం తథా చాప్సు దివ్యమండం వ్యవస్థితమ్ ।
తతో వర్షసహస్రాంతే ద్విధాకృతమజోద్భవమ్ ॥22॥

ఆ దివ్యమైన అండం అనేక సంవత్సరాలు నీటిలో ఉంది. ఆ అండం వేయి సంవత్సరాల తర్వాత రెండు భాగాలయ్యింది.

అండమప్సు స్థితం సాక్షాద్వ్యాఘాతేనేశ్వరేణ తు ।
తథాస్య సుశుభం హైమం కపాలం చోర్ధ్వసంస్థితమ్ ॥23॥

జజ్ఞే సా ద్యౌస్తదపరం పృథివీ పంచలక్షణా ।
తస్మాదండాద్భవో జజ్ఞే కకారాఖ్యశ్చతుర్ముఖః ॥24॥

స స్రష్టా సర్వలోకానాం స ఏవ త్రివిధః ప్రభుః ।
ఏవమోమోమితి ప్రోక్తమిత్యాహుర్యజుషాం వరః ॥ 25॥

నీటిలో ఉన్న ఆ అండం ఈశ్వరుని ఆఘాతం వలన రెండు ముక్కలయ్యింది. ఆ పైభాగమైన ఆ సువర్ణ (బంగారం) అండం ద్యులోకం అయింది. క్రిందనున్న సగభాగం అయిదు గుణాలతో కూడిన పృథ్వి (భూమి) అయ్యింది. ఆ అండం నుండి నాలుగు ముఖాల బ్రహ్మ పుట్టాడు. ఆయనకు క కారం గుర్తు. ఆయన అన్ని లోకాలను సృష్టించాడు. ఈ విధంగా ప్రభువైన మహేశ్వరుడు మూడు రూపాలను ధరించాడు. ఈ విధంగా ఓం ఓం అని వేదాలు పరమేశ్వరుని నిర్దేశించునని శ్రేష్ఠమైన యజుర్వేదమంత్రాలు చెప్తున్నాయి.

యజుషాం వచనం శ్రుత్వా ఋచః సామాని సాదరమ్ ।
ఏవమేవ హరే బ్రహ్మన్నిత్యాహుశ్చావయోస్తదా ॥26॥

యజుర్వేదమంత్రాల ప్రతిపాదనను విన్న ఋగ్వేదసామవేద మంత్రాలు కూడా ఓ విష్ణూ! హే బ్రహ్మన్! అది సత్యమే అని మాతో అన్నాయి.

తతో విజ్ఞాయ దేవేశం యథావచ్ఛక్తిసంభవైః ।
మంత్రైర్మాహేశ్వరం దేవం తుష్టావ సుమహోదయమ్ ॥27॥

ఈ విధంగా దేవతలకు ప్రభువు, మహేశ్వరుడు అని తెలుసుకుని యథాశక్తి వెలువడిన మంత్రాలతో స్తుతించాము.

ఏతస్మిన్నంతరేऽన్యచ్చ రూపమద్భుతసుందరమ్ ।
దదర్శ చ మయా సార్ధం భగవాన్ విశ్వపాలకః ॥28॥

పంచవక్త్రం దశభుజం గౌరకర్పూరవన్మునే ।
నానాకాంతిసమాయుక్తం నానాభూషణభూషితమ్ ॥29॥

ఇంతలో విశ్వాన్ని పాలించే విష్ణువు నాతో కూడి మరొక అద్భుతసుందరరూపం చూశాడు. ఓ మహర్షీ! అయిదు ముఖాలు కలదీ, పది భుజాలు కలదీ, తెల్లని కర్పూరంలా ఉన్నదీ, అనేకకాంతులతో ప్రకాశిస్తున్నదీ అనేక భూషణాలను ధరించినదీ, అయిన రూపాన్ని చూశాము.

మహోదారం మహావీర్యం మహాపురుషలక్షణమ్ ।
తం దృష్ట్వా పరమం రూపం కృతార్థోऽభూన్మయా హరిః ॥30॥

అతిశయించిన శోభ కలిగి, గొప్ప శక్తి కలిగి, మహాపురుషలక్షణాలు ఉన్న పరమేశ్వరుని దివ్యరూపాన్ని చూసి నేను, విష్ణువు కృతార్థులయ్యాం.

అథ ప్రసన్నో భగవాన్ మహేశః పరమేశ్వరః ।
దివ్యం శబ్దమయం రూపమాఖ్యాయ ప్రహసన్ స్థితః ॥31॥

అపుడు భగవాన్ మహేశ్వరుడు ప్రసన్నుడై తన దివ్యమైన నాదరూపాన్ని ప్రకటించి చిరునవ్వుతో నిలబడి ఉన్నాడు.

అకారస్తస్య మూర్ధా హి లలాటో దీర్ఘ ఉచ్యతే ।
ఇకారో దక్షిణం నేత్రమీకారో వామలోచనమ్ ॥32॥

ఉకారో దక్షిణం శ్రోత్రమూకారో వామ ఉచ్యతే ।
ఋకారో దక్షిణం తస్య కపోలం పరమేష్ఠినః ॥33॥

వామం కపోలమ్మకారో లుల్యా నాసాపుటే ఉభే ।
ఏకారశ్చోష్ఠ ఊర్ధ్వశ్చ హ్యైకారస్త్వధరో విభోః ॥34॥

ఓకారశ్చ తథౌకారో దంతపంక్తిద్వయం క్రమాత్ ।
అమస్తు తాలునీ తస్య దేవదేవస్య శూలినః ॥35॥

కాదిపంచాక్షరాణ్యస్య పంచహస్తాశ్చ దక్షిణే ।
చాదిపంచాక్షరాణ్యేవం పంచహస్తాస్తు వామతః ॥36॥

టాదిపంచాక్షరం పాదాస్తాదిపంచాక్షరం తథా ।
పకార ఉదరం తస్య ఫకారః పార్శ్వ ఉచ్యతే ॥37॥

బకారో వామపార్శ్వస్తు భకారః స్కంధ ఉచ్యతే ।
మకారో హృదయం శంభోర్మహాదేవస్య యోగినః ॥38॥

యకారాదిసకారాంతా విభోర్వై సప్తధాతవః ।
హకారో నాభిరూపో హి క్షకారో ఘ్రాణ ఉచ్యతే ॥39॥

అకారం పరమేశ్వరుని తల, ఆకారం లలాటం (నుదురు) ఇ కారం కుడి కన్ను, ఈ కారం ఎడమ కన్ను. ఉ కారం కుడి చెవి, ఊ కారం ఎడమ చెవి, ఋకారం ఆ పరమేశ్వరుని కుడి చెక్కిలి. ౠ కారం ఎడమ చెక్కిలి (బుగ్గ),ఌౡ కారములు   రెండు ముక్కు పుటాలు. ఏ కారం పై పెదవి. ఐ కారం ఈశ్వరుని క్రింది పెదవి. ఒ కారం పై పళ్ల వరుస. ఓ కారం కింది పలువరస దేవదేవుడైన శివునికి అం, అః అనేవి తాలుస్థానాలు అయ్యాయి. క వర్గంలోని అయిదు అక్షరాలు అయిదు కుడి చేతులు కాగా, చ వర్గంలోని అయిదు అక్షరాలు ఎడమ చేతులయ్యాయి. ట వర్గంలోని అయిదు, త వర్గంలోని అయిదు మొత్తం పది అక్షరాలు పాదాల వేళ్లు అయ్యాయి. ప కారం పొట్ట

కాగా, ఫ కారం కుడి ప్రక్కగా అయింది. బ కారం ఎడమ ప్రక్క కాగా, భ కారం స్కంధమయ్యింది. యోగీశ్వరుడైన, మహాదేవుడు శంభునికి హృదయం 'మ' కారం. సర్వవ్యాపియైన శివునికి 'య'కారం మొదలు 'స'కారం వరకు గల ఏడు అక్షరాలు ఏడు ధాతువులు (మజ్జ, మాంసాదులు) అయ్యాయి. హకారం నాభి అని, క్షకారం ముక్కు అని చెప్పబడింది.

ఏవం శబ్దమయం రూపమగుణస్య గుణాత్మనః ।
దృష్ట్వా తముమయా సార్ధం కృతార్థోఽభూన్మయా హరిః ॥40॥

నేను, మరియు విష్ణువు, నిర్గుణుడయినా గుణస్వరూపుడైన శివుని ఉమాసహితమైన ఈ శబ్దమయరూపం చూచి కృతార్థులమయ్యాం.

ఏవం దృష్ట్వా మహేశానం శబ్దబ్రహ్మతనుం శివమ్ ।
ప్రణమ్య చ మయా విష్ణుః పునశ్చాపశ్యదూర్ధ్వతః ॥41॥

ఓంకారప్రభవం మంత్రం కలాపంచకసంయుతమ్ ।
శుద్ధస్ఫటికసంకాశం శుభాష్టత్రింశదక్షరమ్ ॥42॥

మేధాకారమభూద్భూయస్సర్వధర్మార్థసాధకమ్ ।
గాయత్రీప్రభవం మంత్రం సహితం వశ్యకారకమ్ ॥43॥

చతుర్వింశతి వర్ణాఢ్యం చతుష్కాలమనుత్తమమ్ ।
అథ పంచసితం మంత్రం కలాష్టకసమాయుతమ్ ॥44॥

ఆభిచారికమత్యర్థం ప్రాయస్త్రింశచ్ఛుభాక్షరమ్ ।
యజుర్వేదసమాయుక్తం పంచవింశచ్ఛుభాక్షరమ్ ॥45॥

కలాష్టకసమాయుక్తం సుశ్వేతం శాంతికం తథా ।
త్రయోదశకలాయుక్తం బాలాద్యైస్సహలేహితమ్ ॥46॥

బభూవురస్య చోత్పత్తివృద్ధిసంహారకారణమ్ ।
వర్ణా ఏకాధికాః షష్టిరస్య మంత్రవరస్య తు ॥47॥

పునర్మృత్యుంజయం మంత్రం పంచాక్షరమతః పరమ్ ।
చింతామణిం తథా మంత్రం దక్షిణామూర్తిసంజ్ఞకమ్ ॥48॥

తతస్తత్త్వమసీత్యుక్తం మహావాక్యం హరస్య చ ।
పంచమంత్రాంస్తథా లబ్ధ్వా జజాప భగవాన్ హరిః ॥49॥

ఈ విధంగా నాదబ్రహ్మరూపంలో శివుణ్ణి చూసి, నమస్కరించి, విష్ణువు, నేను మరలా పైకి చూశాం. ఓంకారం నుండి పుట్టినదై, అయిదు కళలు కలదై, శుద్ధస్ఫటికంలా ప్రకాశించే ముప్పైఎనిమిది అక్షరాలు కల

శుభమంత్రాన్ని పొందాము. మరియు బుద్ధిరూపమైనట్టి, అన్ని ధర్మాలను, పురుషార్థాలను సాధించునదీ, ఇంద్రియజయాలకు కారణమైనదీ. ఇరవైనాలుగు అక్షరాలున్నదీ, నాలుగు కళలు కలిగినదీ అయిన సర్వశ్రేష్ఠమైన గాయత్రిని చూశాం. తర్వాత అయిదు ముఖాలు గల మంత్రంతో, ఎనిమిది కళలతో కూడినది, శత్రువులను సంహరించ కలదీ, ముప్పై శుభ వర్ణాలు కలదీ యజుర్వేదానికి సంబంధించిన, ఇరవయ్యాయిదు శుభవర్ణాలతో కూడినదీ ఎనిమిది కళలు కలిగినదీ, చాలా తెల్లని రంగు గలదీ, అయిన శాంతికరమైన మంత్రాన్ని చూశాం. మరియు పదమూడు కళలు కల్గినదీ, బాలురకు కూడా ఇష్టమైనట్టిదీ అయిన సృష్టి, స్థితి, లయాలకు కారణమైనదీ, అరవై ఒక్క వర్ణాలు గలదీ అయిన గొప్ప మంత్రాన్ని పొందాము. మరల మృత్యుంజయమంత్రం, పంచాక్షరమంత్రం, చింతామణిమంత్రం, దక్షిణామూర్తిమంత్రం, తత్త్వమసి అనే శివుని మహావాక్యం అనే ఈ అయిదు మంత్రాలను పొంది విష్ణుభగవానుడు జపించాడు.

అథ దృష్ట్వా కలావర్ణమృగ్యజుస్సామరూపిణమ్ ।
ఈశానమీశముకుటం పురుషాఖ్యం పురాతనమ్ ॥50॥

అఘోరహృదయం హృద్యం సర్వగుహ్యం సదాశివమ్ ।
వామపాదం మహాదేవం మహాభోగీంద్రభూషణమ్ ॥51॥

విశ్వతః పాదవంతం విశ్వతోక్షికరం శివమ్ ।
బ్రహ్మణోఽధిపతిం సర్గస్థితిసంహారకారణమ్ ॥52॥

తుష్టావ వాగ్భిరిష్టాభిస్సాంబం వరదమీశ్వరమ్ ।
మయా చ సహితో విష్ణుర్భగవాంస్తుష్టచేతసా ॥53॥

ఋగ్, యజుస్, సామవేదస్వరూపుడు, నాదశరీరి, దేవతాసార్వభౌముడు, జగన్నియంత, పురుషుడనే శబ్దంతో పిలవబడే వాడు, జగత్తుకు తండ్రి, ప్రసన్నమైన హృదయం కల వాడు, సుందరమైన వాడు, అన్ని ప్రాణుల హృదయాలలో ఉండే వాడు, అందమైన పాదాలు కల వాడు, దేవోత్తముడు, గొప్పవైన నాగరాజులను (పాములను) నగలుగా గల వాడు. అన్నిచోట్లా పాదాలు కల వాడు, అన్నిచోట్లా కళ్లు కల వాడు, మంగళకరుడు, బ్రహ్మకు ప్రభువు, సృష్టి, స్థితి, లయ కర్త, అయిన సదాశివుణ్ణి చూసి, విష్ణువు నాతో కలిసి, వరాలనిచ్చే దైవం అయిన సాంబుని ప్రసన్నమైన మనసుతో ప్రియమైన మాటలతో స్తుతించాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే శబ్దబ్రహ్మ తను వర్ణనో నామ అష్టమోఽధ్యాయః ॥8॥

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితం సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటిఖండంలో శబ్దబ్రహ్మ తను వర్ణనమనే ఎనిమిదవ అధ్యాయం సమాప్తం.

నవమోఽధ్యాయః - తొమ్మిదవ అధ్యాయం

శివతత్త్వమ్ - శివతత్త్వం

బ్రహ్మోవాచ - బ్రహ్మ పలికాడు.

అథాకర్ణ్య నుతిం విష్ణుకృతాం స్వస్య మహేశ్వరః ।
ప్రాదుర్బభూవ సుప్రీతస్సవామం కరుణానిధిః ॥1॥

పంచవక్త్రస్త్రినయనో బాలచంద్రో జటాధరః ।
గౌరవర్ణో విశాలాక్షో భస్మోద్ధూలితవిగ్రహః ॥2॥

దశబాహుర్నీలగలస్సర్వాభరణభూషితః ।
సర్వాంగసుందరో భస్మ త్రిపుండ్రాంకితమస్తకః ॥3॥

దయానిధి అయిన మహేశ్వరుడు, విష్ణువు మరియు నేను చేసిన స్తోత్రాలను విని, చాలా సంతోషించి ఉమతో కలసి ఆవిర్భవించాడు. అయిదు ముఖాలు, మూడు కన్నులు కల వాడు, నుదుట చంద్రుడు కల వాడు, జటలను ధరించిన వాడు, తెల్లని శరీరవర్ణం కల వాడు, విశాలమైన కన్నులు కల వాడు, భస్మం పూయబడ్డ శరీరం కల వాడు, పదిచేతులు కల వాడు, నీలకంఠుడు, అన్ని ఆభరణాలతో సర్వాంగసుందరుడు, భస్మత్రిపుండ్రంతో అలంకరింపబడిన నుదురు కలవాడు, అయిన

తం దృష్ట్వా తాదృశం దేవం సవామం పరమేశ్వరమ్ ।
తుష్టావ పునరిష్టాభిర్వాగ్భిర్విష్ణుర్మయా సహ ॥4॥

ఉమతో కూడి ఉన్న పరమేశ్వరుణ్ణి చూసి విష్ణువు మరియు నేను మరల మంచి మాటలతో స్తుతించాము.

నిగమం శ్వాసరూపేణ దదౌ తస్మై తతో హరః ।
విష్ణవే చ ప్రసన్నాత్మా మహేశః కరుణాకరః ॥5॥

అపుడు దయాళుడు, దేవదేవుడు అయిన శివుడు సంతోషించి, విష్ణువుకు వేదాన్ని శ్వాస ద్వారా అందించాడు.

తతో జ్ఞానమదాత్తస్మై హరయే పరమాత్మనే ।
పరమాత్మా పునర్మహ్యం దత్తవాన్ కృపయా మునే ॥6॥

తర్వాత విష్ణువుకు జ్ఞానాన్ని కూడా ఇచ్చాడు. ఓ మహర్షీ! విష్ణువు దయతో నాకు జ్ఞానాన్ని ఇచ్చాడు.

సంప్రాప్య నిగమం విష్ణుః ప్రపచ్ఛ పునరేవ తమ్ ।
కృతార్థస్సాంజలిర్నత్వా మయా సహ మహేశ్వరమ్ ॥7॥

ఈ విధంగా విష్ణువు, నేను వేదాన్ని తీసుకొని, ధన్యులమై దోసిలి యొగ్గి, శివునికి నమస్కరించి మరలా ఇలా అడిగాము.

విష్ణురువాచ – విష్ణువు పలికాడు.

కథం చ తుష్యసే దేవ మయా పూజ్యః కథం ప్రభో ।
కథం ధ్యానం ప్రకర్తవ్యం కథం వ్రజసి వశ్యతామ్ ॥8॥

హే దేవా! నువ్వు సంతోషించే మార్గం ఏది? ఓ ప్రభూ! నిన్ను పూజించే విధానం ఎటువంటిది? నిన్ను ధ్యానించు పద్ధతి ఏది? నువ్వు వశమయ్యే ఉపాయం ఏది?

కిం కర్తవ్యం మహాదేవ హ్యావాభ్యాం తవ శాసనాత్ ।
సదా సదా జ్ఞాపయ నౌ ప్రీత్యర్థే కురు శంకర ॥9॥

మహాదేవా! మేమిద్దరం నీ ఆజ్ఞతో చేయవలసిన పని ఏమి? ఓ శంకరా! మాకు నువ్వు ఎల్లప్పుడూ మంచి పనులను ఆజ్ఞాపించి, మాయందు దయను చూపుము.

ఏతత్సర్వం మహారాజ కృపాం కృత్వాఽఽవయోః ప్రభో ।
కథనీయం తథాన్యచ్చ విజ్ఞాయ స్వానుగౌ శివ ॥10॥

ఓ ప్రభూ! శివా! మహారాజా! నీవు దయచేసి నీ భక్తులమైన మా ఇద్దరికి ఈ చెప్పిన విషయాలే కాక, చెప్పవలసిన ఇతర విషయాలను కూడా చెప్పండి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

ఇత్యేతద్వచనం శ్రుత్వా ప్రసన్నో భగవాన్ హరః ।
ఉవాచ వచనం ప్రీత్యా సుప్రసన్నః కృపానిధిః ॥11॥

దయానిధి అయిన భగవాన్ శంకరుడు ఈ మాటలను విని, చాలా ప్రసన్నుడై ప్రీతితో ఇలా చెప్పాడు.

శ్రీ శివ ఉవాచ – శివుడు పలికాడు.

భక్త్యా చ భవతోర్నూనం ప్రీతోఽహం సురసత్తమౌ ।
పశ్యతం మాం మహాదేవం భయం సర్వం విముంచతామ్ ॥12॥

ఓ దేవోత్తములారా! మీ ఇద్దరి భక్తికి నేను సంతోషించాను. మహాదేవుడనైన నన్ను చూసి భయాన్నంతటిని విడిచి పెట్టండి.

మమ లింగం సదా పూజ్యం ధ్యేయం చైతాదృశం మమ ।
ఇదానీం దృశ్యతే యద్వత్తథా కార్యం ప్రయత్నతః ॥13॥

మీ ఎదురుగా ఉన్న అగ్నిలింగంతో సదృశమైన ఆకారం కల శివలింగాన్ని ప్రయత్నంతో తయారు చేసి, నిత్యం పూజించి ధ్యానించాలి.

పూజితో లింగరూపేణ ప్రసన్నో వివిధం ఫలమ్ ।
దాస్యామి సర్వలోకేభ్యో మనోభీష్టాన్యనేకశః ॥14॥

లింగపూజలు చేసిన వారందరియందు నేను ప్రసన్నుడనై, వారి మనస్సులలోని కోరికలన్నింటిని తీరుస్తాను.

యదా దుఃఖం భవేత్తత్ర యువయోస్సురసత్తమౌ ।
పూజితే మమ లింగే చ తదా స్యాద్దుఃఖనాశనమ్ ॥15॥

ఓ దేవోత్తములారా! మీకు దుఃఖం కలిగితే లింగాన్ని పూజించండి. అపుడు దుఃఖం తొలగిపోతుంది.

యువాం ప్రసూతౌ ప్రకృతేర్మదీయాయా మహాబలౌ ।
గాత్రాభ్యాం సవ్యాపసవ్యాభ్యాం మమ సర్వేశ్వరస్య హి ॥16॥

మహాబలశాలురైన మీరిద్దరూ విశ్వప్రభువు అయిన నా దేహం (ప్రకృతి) యొక్క కుడి ఎడమల భాగాలనుండి పుట్టారు.

అయం మే దక్షిణాత్పార్శ్వాద్బ్రహ్మా లోకపితామహః ।
వామపార్శ్వాచ్చ విష్ణుస్త్వం సముత్పన్నః పరాత్మనః ॥17॥

పరమాత్మనైన నా కుడి ప్రక్కనుంచి లోకానికి పితామహుడైన ఈ బ్రహ్మ, ఎడమ వైపు నుండి నీవు (విష్ణువు) పుట్టారు.

ప్రీతోఽహం యువయోస్సమ్యగ్వరం దద్యాం యథేప్సితమ్ ।
మయి భక్తిర్దృఢా భూయాద్యువయోరభ్యనుజ్ఞయా ॥18॥

మీ యందు నేను చాలా ప్రసన్నుడయ్యాను. మీరు కోరిన వరాన్ని ఇస్తాను. మీ ఇద్దరికీ నా అనుగ్రహంచే నా యందు దృఢభక్తి కలుగు గాక!

పార్థివీం చైవ మన్మూర్తిం విధాయ కురుతం యువామ్ ।
సేవాం చ వివిధాం ప్రాజ్ఞౌ కృత్వా సుఖమవాప్స్యథ ॥19॥

ప్రాజ్ఞులైన మీరిద్దరూ పార్థివలింగాన్ని నిర్మించి అనేక సేవలను చేసి సుఖాన్ని పొందండి.

బ్రహ్మన్ సృష్టిం కురు త్వం హి మదాజ్ఞాపరిపాలకః ।
వత్స వత్స హరే త్వం చ పాలయైవం చరాచరమ్ ॥20॥

ఓ బ్రహ్మా! నీవు నా ఆజ్ఞను పాలించువాడవై సృష్టిని చేయి. వత్సా హరీ! నీవు ఈ చరాచరప్రపంచాన్ని రక్షించు.

బ్రహ్మోవాచ - బ్రహ్మ ఇలా అన్నాడు.

ఇత్యుక్త్వా నౌ ప్రభురతాభ్యాం పూజావిధిమదాచ్ఛుభామ్ ।
యేనైవ పూజితశ్శంభుః ఫలం యచ్ఛత్యనేకశః ॥21॥

ప్రభువైన శంభుడు మాకు ఇలా చెప్పి మంగళకరమైన పూజావిధానాన్ని బోధించాడు. ఆ విధిప్రకారం పూజించేవారికి ఆయన అనేక ఫలాలను అనుగ్రహిస్తాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

ఇత్యాకర్ణ్య వచశ్శంభోర్మయా చ సహితో హరిః ।
ప్రత్యువాచ మహేశానం ప్రణిపత్య కృతాంజలిః ॥22॥

విష్ణువు నాతో కలిసి శివుని ఈ మాటలను విని, దోసిలి ఒగ్గి నమస్కారం చేసి, మహేశ్వరునితో ఇలా అన్నాడు.

విష్ణురువాచ – విష్ణువు పలికాడు.

యది ప్రీతిః సముత్పన్నా యది దేయో వరశ్చ నౌ ।
భక్తిర్భవతు నౌ నిత్యం త్వయి చావ్యభిచారిణీ ॥23॥

నీకు మా యందు దయ కలిగి వరం ఇవ్వదలచుకుంటే, మాకు నీ యందు ఎప్పుడూ స్థిరమైన భక్తిని అనుగ్రహించు.

త్వమప్యవతరస్వాద్య లీలయా నిర్గుణోఽపి హి ।
సహాయం కురు నౌ తాత త్వం పరః పరమేశ్వరః ॥24॥

ఓ తండ్రీ! నీవు నిర్గుణుడవే అయినా, ఇపుడు నీ లీలతో అవతరించు. మాకు సహాయం చేయుము. నీవు సర్వోత్కృష్టుడవు, పరమేశ్వరుడవు.

ఆవయోర్దేవదేవేశ వివాదమపి శోభనమ్ ।
ఇహాగతోభవాన్యస్మాద్వివాదశమనాయ నౌ ॥25॥

ఓ దేవదేవా! నీవు మా ఇద్దరివివాదం చల్లార్చటానికి ఇచటకు వచ్చావు. కావున మాకు వివాదం కూడా మంగళకరమైంది.

బ్రహ్మోవాచ – బ్రహ్మ పలికాడు.

తస్య తద్వచనం శ్రుత్వా పునః ప్రాహ హరో హరిమ్ ।
ప్రణిపత్య స్థితమ్ మూర్ధ్నా కృతాంజలిపుటస్స్వయమ్ ॥26॥

ఇట్లు పలికి విష్ణువు దోసిలి ఒగ్గి, శిరసా నమస్కరించి నిలబడ్డాడు. అపుడు శివుడు ఆ మాటలను విని, మరలా ఇలా అన్నాడు.

మహేశ ఉవాచ – మహేశ్వరుడు ఇలా అన్నాడు.

ప్రలయస్థితిసర్గాణాం కర్తాహం సగుణోఽగుణః ।
పరంబ్రహ్మ నిర్వికారీ సచ్చిదానందలక్షణః ॥27॥

జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ కర్తను నేనే. నేను నిర్గుణపరబ్రహ్మనే అయినా సగుణుడను. నేను వికారాలు లేని సచ్చిదానందస్వరూపుడను.

త్రిధా భిన్నో హ్యహం విష్ణో బ్రహ్మవిష్ణుహరాఖ్యయా ।
సర్గరక్షాలయగుణైర్నిష్కలోఽహం సదా హరే ॥28॥

హే విష్ణో! నేను సృష్టి స్థితి లయలను చేసే బ్రహ్మ, విష్ణు, రుద్ర రూపాలతో మూడుగా విడి పోయాను. కాని నా యందు ఏనాడూ భిన్నస్థితి లేదు.

స్తుతోఽహం యత్త్వయా విష్ణో బ్రహ్మణా మేఽవతారణే ।
ప్రార్థనాం తాం కరిష్యామి సత్యాం యద్భక్తవత్సలః ॥29॥

హే విష్ణో! నీవు, బ్రహ్మ కలిసి నన్ను అవతరించమని అడిగారు. భక్తులయందు ప్రేమ గల నేను మీ ఆ ప్రార్థనను నిజం చేస్తాను.

మద్రూపం పరమం బ్రహ్మన్నీదృశం భవదంగతః ।
ప్రకటీభవితా లోకే నామ్నా రుద్రః ప్రకీర్తితః ॥30॥

ఓ బ్రహ్మ! నా శ్రేష్ఠరూపం నీ దేహం ద్వారా ప్రకటమై లోకంలో రుద్రుడనే పేరుతో ప్రసిద్ధి చెందుతుంది.

మదంశాత్తస్య సామర్థ్యం న్యూనం నైవ భవిష్యతి ।
యోఽహం సోఽహం న భేదోఽస్తి పూజావిధివిధానతః ॥31॥

నా అంశయే అవటం వలన రుద్రుడు సామర్థ్యంతో నా కంటే తక్కువ కానే కాదు. నేనే రుద్రుడను. రుద్రుడే నేను. పూజావిధిలోనైనా మాలో భేదం లేదు.

యథా చ జ్యోతిషస్సంగాజ్జలాదేస్స్పృశ్యతా న వై ।
తథా మమాగుణస్యాపి సంయోగాద్బంధనం న హి ॥32॥

జలము మున్నగువానితో జ్యోతిస్సునకు ప్రతిబింబముగా సంపర్కము కల్గినను జ్యోతిస్సునందు స్పర్శదోషం లేనట్లు నిర్గుణుడైన నాకు ప్రకృతి కలయిక వల్ల బంధం లేదు.

శివరూపం మమైతచ్చ రుద్రోఽపి శివవత్తదా ।
న తత్ర పరభేదో వై కర్తవ్యశ్చ మహామునే ॥33॥

ఓ మహర్షీ! శివునికి, రుద్రునికి భేదము లేదు. కాబట్టి వారి యందు భేదబుద్ధిని చేయరాదు.

వస్తుతో హ్యేకరూపం హి ద్విధా భిన్నం జగత్యుత ।
అతో న భేదో విజ్ఞేయశ్శివే రుద్రే కదాచన ॥34॥

ఒకే పరమాత్మ శివరుద్రులుగా ప్రకటమైనారు కనుక వాళ్లిద్దరిలో భేదాన్ని ఏనాడూ తలంచ కూడదు.

సువర్ణస్య తథైకస్య వస్తుత్వం నైవ గచ్ఛతి ।
అలంకృతికృతే దేవ నామభేదో న వస్తుతః ॥35॥

బంగారంతో చేసే అనేక ఆభరణాలకు పేర్లు ఉంటాయి. కాని వాటి స్వరూపభూతమైన వస్తువులో భేదమేమీ లేదు. అక్కడ బంగారం తప్ప మరొకటి లేదు.

తథైకస్యా మృదో భేదో నానాపాత్రే న వస్తుతః ।
కారణస్యైవ కార్యే చ సన్నిధానం నిదర్శనమ్ ॥36॥

ఆ విధంగానే మట్టి నుండి వివిధపాత్రలు తయారవుతాయి. కాని మూలపదార్థం ఒక్కటే. అన్నిటియందు మూలమైన ఒకే కారణం అనువృత్తమై ఉంటుంది కదా!

జ్ఞాతవ్యం బుధవర్యైశ్చ నిర్మలజ్ఞానిభిస్సురౌ ।
ఏవం జ్ఞాత్వా భవద్భ్యాం తు న దృశ్యం భేదకారణమ్ ॥37॥

ఓ దేవతలారా! శుద్ధజ్ఞానం గల పండితులు కూడా ఈ విషయాన్ని తెలుసుకోవాలి. మీరు కూడా ఈ నిజాన్ని తెలుసుకొని భేదదృష్టిని విడిచి పెట్టండి.

వస్తువత్సర్వదృశ్యం చ శివరూపం మతం మమ ।
అహం భవానజశ్చైవ రుద్రో యోఽయం భవిష్యతి ॥38॥

ఏకరూపా న భేదస్తు భేదే వై బంధనం భవేత్ ।
తథాపి చ మదీయం హి శివరూపం సనాతనమ్ ॥39॥

ఈ కనిపించే వస్తువులన్నీ శివస్వరూపమేనని నా అభిప్రాయం. నేను, నీవు, బ్రహ్మ మరియు రాబోయే రుద్రుడు మనందరి స్వరూపం ఒక్కటే. వీరిలో భేదము లేదు. భేదాన్ని భావించే వారికి బంధము కలుగుతుంది. వీరి స్వరూపం అతి పురాతనుడు, శివుడు అయిన నేనే.

మూలీభూతం సదోక్తం చ సత్యజ్ఞానమనంతకమ్ ।
ఏవం జ్ఞాత్వా సదా ధ్యేయం మనసా చైవ తత్త్వతః ॥40॥

సత్యజ్ఞానానంతస్వరూపమైన పరబ్రహ్మయే ఈ బ్రహ్మాదులకు మూలకారణమైందని చెప్పబడింది. ఈ సత్యాన్ని తెలుసుకొని మనస్సులో పరబ్రహ్మను ఎప్పుడూ ధ్యానించాలి.

శ్రూయతాం చైవ భో బ్రహ్మన్ యద్గోప్యం కథ్యతే మయా ।
భవంతౌ ప్రకృతేర్యాతౌ నాయం వై ప్రకృతేః పునః ॥41॥

ఓ బ్రహ్మో! నా మాట విను. నేను చెప్పేది రహస్యం. మీరిద్దరూ ప్రకృతి నుండి పుట్టారు. కాని రుద్రుడు ప్రకృతి నుండి ఉద్భవించ లేదు.

మదాజ్ఞా జాయతే తత్ర బ్రహ్మణో భ్రుకుటేరహమ్ ।
గుణేష్వపి యథా ప్రోక్తస్తామసః ప్రకృతో హరః ॥42॥

నా ఆజ్ఞ ఇలా ఉంది. నేను బ్రహ్మ యొక్క కనుబొమ్మ నుండి జన్మిస్తాను. గుణాలయందు హరుణ్ణి తమోగుణం కలవాడని అంటారు.

వైకారికశ్చ విజ్ఞేయో యోఽహంకార ఉదాహృతః ।
నామతో వస్తుతో నైవ తామసః పరివక్ష్యతే ॥43॥

కాని ప్రకృతి వికారమైన అహంకారం మాత్రమే తామసం అని పండితులు అంటారు. ఈ గుణభేదం నామరూపాలందు మాత్రమే ఉంది. తత్త్వంలో లేదు. హరుడు తామసుడు కానే కాదు.

ఏతస్మాత్కారణాద్బ్రహ్మన్ కరణీయమిదం త్వయా ।
సృష్టికర్తా భవ బ్రహ్మన్ సృష్టేశ్చ పాలకో హరిః ॥44॥

ఓ బ్రహ్మా! ఈ కారణం వల్ల నువ్వు నేను చెప్పినట్లు చెయ్యి. నువ్వు సృష్టిని చెయ్యి. విష్ణువు జగత్తును పాలిస్తాడు.

మదీయశ్చ తథాంఽశో యో లయకర్తా భవిష్యతి ।
ఇయం యా ప్రకృతిర్దేవీ హ్యుమాఖ్యా పరమేశ్వరీ ॥45॥

నా అంశ అయిన రుద్రుడు లయాన్ని చేస్తాడు. ఈమె పరమేశ్వరి అయిన ఉమాదేవి. ఈమెయే ప్రకృతి.

తస్యాస్తు శక్తిర్వాగ్దేవీ బ్రహ్మాణం సా భజిష్యతి ।
అన్యా శక్తిః పునస్తత్ర ప్రకృతేస్సంభవిష్యతి ॥46॥

ఈమె యొక్క శక్తి వాగ్దేవి. ఆమె బ్రహ్మను సేవిస్తుంది. ఈ ప్రకృతి నుండి మరొక శక్తి పుడుతుంది.

సమాశ్రయిష్యతి విష్ణుం లక్ష్మీరూపేణ సా తదా ।
పునశ్చ కాలీ నామ్నా సా మదంశం ప్రాప్స్యతి ధ్రువమ్ ॥47॥

ఆ శక్తి లక్ష్మీరూపంలో విష్ణువును ఆశ్రయిస్తుంది. కాళి అనే పేరు గల మరో శక్తి పుట్టి, నా అంశయైన రుద్రుని పొందుతుంది.

జ్యోతీరూపేణ సా తత్ర కార్యార్థే సంభవిష్యతి ।
ఏవం దేవ్యాస్తథా ప్రోక్తాశ్శక్తయః పరమాశ్శుభాః ॥48॥

ప్రకాశరూపంలో రుద్రునికి లయకార్యానికి సహకరిస్తుంది. ఈ విధంగా శక్తి స్వరూపిణులు, పరమమంగళాలను ఇచ్చే దేవీమూర్తులుగా చెప్పబడ్డారు.

సృష్టిస్థితిలయానాం హి కార్యం తాసాం క్రమాద్ధ్రువమ్ ।
ఏతస్యాః ప్రకృతేరంశా మత్ప్రియాయాస్సురోత్తమ ॥49॥

క్రమంగా సృష్టి, స్థితి, లయ కార్యాలయందు సహాయం చేయగలరు. ఓ సురశ్రేష్ఠులారా! ఈ దేవీ మూర్తులు నా ప్రియురాలైన ప్రకృతి అంశలు.

త్వం చ లక్ష్మీముపాశ్రిత్య కార్యం కర్తుమిహార్హసి ।
బ్రహ్మంస్త్వం చ గిరాం దేవీం ప్రకృత్యంశామవాప్య చ ॥50॥

సృష్టికార్యం హృదా కర్తుం మన్నిర్దేశాదిహార్హసి ।
అహం కాలీం సమాశ్రిత్య మత్ప్రియాంశాం పరాత్పరమ్ ॥51॥

రుద్రరూపేణ ప్రలయం కరిష్యే కార్యముత్తమమ్ ।
చతుర్వర్ణమయం లోకం తత్సర్వైరాశ్రమైః ధ్రువమ్ ॥52॥

తదన్యైర్వివిధైః కార్యైః కృత్వా సుఖమవాప్స్యథః ।
జ్ఞానవిజ్ఞానసంయుక్తో లోకానాం హితకారకః ॥53॥

ముక్తిదోఽత్ర భవానద్య భవ లోకే మదాజ్ఞయా ।
మద్దర్శనే ఫలం యద్వత్తదేవ తవదర్శనే ॥54॥

హే విష్ణో! నీవు లక్ష్మిని ఆశ్రయంగా చేసుకొని నీ పనులను చేస్తూ ఉండు. ఓ బ్రహ్మా! నీవు ప్రకృతి యొక్క అంశయగు వాగ్దేవిని పొంది, నా ఆజ్ఞచే ఆనందంగా సృష్టిని చెయ్యి. నా ప్రియురాలి అంశ అయిన, సర్వశ్రేష్ఠురాలైన కాళిని ఆశ్రయించి నేను రుద్ర రూపంలో ఉత్తమ కార్యమైన ప్రళయాన్ని చేస్తాను. నాలుగు వర్ణాలతో, నాలుగు ఆశ్రమములతో వివిధ పదార్థాలతో కూడిన ప్రపంచాన్ని నిర్మించి సుఖాన్ని పొందండి. హే విష్ణో! నీవు జ్ఞానవిజ్ఞానములు కలవాడవై లోకాలకు హితం చేస్తూ ఈ జగత్తులో నా ఆజ్ఞచే ముక్తిని ఇచ్చువాడవు. నన్ను దర్శిస్తే ఏ ఫలం లభిస్తుందో, నిన్ను దర్శించినా అదే ఫలం వస్తుంది.

ఇతి దత్తో వరస్తేఽద్య సత్యం సత్యం న సంశయః ।
మమైవ హృదయే విష్ణుర్విష్ణోశ్చ హృదయే హ్యహమ్ ॥55॥

నేను నీకు ఈ వరాన్ని ఇస్తున్నాను. ఇది ముమ్మాటికీ నిజం. సందేహం లేదు. విష్ణువు నా హృదయంలో ఉన్నాడు. విష్ణుని హృదయంలో నేను ఉన్నాను.

ఉభయోరంతరం యో వై న జానాతి మనో మమ ।
వామాంగజో మమ హరిర్దక్షిణాంగోద్భవో విధిః ॥56॥

మా ఇద్దరిలో భేదాలను చూసే వారికి నా మనస్సు తెలియజాలదు. నా ఎడమభాగంనుండి విష్ణువు, కుడి భాగంనుండి బ్రహ్మ ఉద్భవించారు.

మనోప్రలయకృద్రుద్రో విశ్వాత్మా హృదయోద్భవః ।
త్రిధా భిన్నో హ్యహం విష్ణో బ్రహ్మవిష్ణుభవాఖ్యయా ॥57॥

జగత్స్వరూపుడు, నా హృదయంనుండి పుట్టిన వాడూ, మహాప్రళయాన్ని చేసే రుద్రుడు, ఇలా మూడురూపాలతో బ్రహ్మవిష్ణురుద్ర నామాలతో నేనే ముగ్గురయ్యాను. రుద్రుడు మహాప్రళయకర్త అవుతాడు.

సర్గరక్షాలయకరస్త్రిగుణైరజ ఆదిభిః ।
గుణభిన్నశ్శివస్సాక్షాత్ ప్రకృతేః పురుషాత్పరః ॥58॥

రజస్సు, సత్త్వం, తమస్సు అనే గుణములను కలిగి, సృష్టి, స్థితి లయాలను చేసి, గుణభేదం వల్ల త్రిమూర్తి భేదాన్ని పొందాను. ప్రకృతి కంటే, పురుషునికంటే అతీతమైన పరంబ్రహ్మాన్ని నేనే.

పరం బ్రహ్మాద్వయో నిత్యోఽనంతః పూర్ణో నిరంజనః ।
అంతస్తమో బహిస్సత్త్వస్త్రిజగత్పాలకో హరిః ॥59॥

పరంబ్రహ్మ అద్వితీయం, నిత్యం, అనంతం, పూర్ణం మరియు అసంగం. మూడు లోకాలు పాలించే విష్ణువుకు లోపల తమోగుణం, బయట సత్త్వగుణం ఉంటుంది.

అంతస్సత్త్వస్తమోబాహ్యస్త్రిజగల్లయకృద్ధరః ॥60॥

మూడు లోకాలను లయం చేసే హరునికి లోపల సత్త్వగుణం బయట తమోగుణం ఉంటుంది.

అంతర్బహీరజాశ్చైవ త్రిజగత్సృష్టికృద్విధిః ।
ఏవం గుణాస్త్రిదేవేషు గుణభిన్నశ్శివస్మృతః ॥61॥

మూడు లోకాలను సృష్టించు బ్రహ్మకు లోపల మరియు బయట రజోగుణం ఉంటుంది. త్రిమూర్తులలో గుణములు ఈ విధంగా ఉన్నాయి. శివుడు గుణాతీతుడు.

విష్ణో సృష్టికరం ప్రీత్యా పాలయైనం పితామహమ్ ।
సంపూజ్యస్త్రిషు లోకేషు భవిష్యసి మదాజ్ఞయా ॥62॥

హే విష్ణో! సృష్టికర్త అయిన ఈ పితామహుని రక్షించు. నువ్వు నా ఆజ్ఞచే మూడు లోకములందు పూజలందుకుంటావు.

తవ సేవ్యో విధేశ్చాపి రుద్ర ఏవ భవిష్యతి ।
శివపూర్ణావతారో హి త్రిజగల్లయకారకః ॥63॥

నీవు మరియు బ్రహ్మ రుద్రుణ్ణి పూజించండి. మూడు లోకాలను లయం చేసే రుద్రుడు శివుని పూర్ణ అవతారం.

పాద్మే భవిష్యతి సుతః కల్పే తవ పితామహః ।
తదా ద్రక్ష్యసి మాం చైవ సోఽపి ద్రక్ష్యసి పద్మజః ॥64॥

నీవు కల్పం మొదటిలో (కల్ప ప్రారంభంలో) పద్మమునందు బ్రహ్మసుతుడవై జన్మిస్తారు. అపుడు నీవు, బ్రహ్మ నన్ను చూస్తారు.

ఏవముక్త్వా మహేశానః కృపాం కృత్వా తులాం హరః ।
పునః ప్రోవాచ సుప్రీత్యా విష్ణుం సర్వేశ్వరః ప్రభుః ॥65॥

మహేశ్వరుడు ఈ విధంగా మాట్లాడి సాటిలేని దయను చూపాడు. సర్వేశ్వరుడైన శివుడు మిక్కిలి ప్రీతితో విష్ణువును ఉద్దేశించి ఇలా పలికాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే విష్ణుబ్రహ్మవివాదవర్ణనో నామ నవమోఽధ్యాయః ॥9॥

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితం సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటి ఖండంలో శివతత్త్వ వర్ణనమనే తొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

దశమోఽధ్యాయః - పదవ అధ్యాయం

పరమశివతత్త్వమ్ - పరమశివతత్త్వం

పరమేశ్వర ఉవాచ - పరమేశ్వరుడు ఇలా చెప్పాడు.

అన్యచ్ఛృణు హరే విష్ణో శాసనం మమ సువ్రత ।
సదా సర్వేషు లోకేషు మాన్యః పూజ్యో భవిష్యసి ॥1॥

హే విష్ణో! నువ్వు మంచి నిష్ఠగలవాడివి. మరొక మాట విను. నువ్వు లోకంలో ఎపుడు ఆదరణీయుడవు, పూజ్యుడవు కాగలవు. ఇది శాసనం.

బ్రహ్మణా నిర్మితే లోకే యదా దుఃఖం ప్రజాయతే ।
తదా త్వం సర్వదుఃఖానాం నాశాయ తత్పరో భవ ॥2॥

బ్రహ్మ నిర్మించిన సృష్టిలో దుఃఖం పెచ్చు పెరిగినపుడు నీవు ఆ దుఃఖాలను నాశనం చేయుటయందు నిమగ్నుడవై ఉండు.

సహాయం తే కరిష్యామి సర్వకార్యే చ దుస్సహే ।
తవ శత్రూన్ హనిష్యామి దుస్సాధ్యాన్పరమోత్కటాన్ ॥3॥

నేను నీకు కష్టమైన పనులలో సహాయం చేస్తాను. మహాబలవంతులు, దుర్జయులు అయిన నీ శత్రువులను సంహరిస్తాను.

వివిధానవతారాంశ్చ గృహీత్వా కీర్తిముత్తమమ్ ।
విస్తారయ హరే లోకే తారణాయ పరో భవ ॥4॥

హే! హరే! నీవు విభిన్న అవతారాలను ధరించి లోకంలో శ్రేష్ఠమైన కీర్తిని విస్తరించుకో. లోకాలను రక్షించుటలో నిమగ్నమై ఉండు.

గుణరూపో హ్యయం రుద్రో హ్యనేన వపుషా సదా ।
కార్యం కరిష్యే లోకానాం తవాశక్యం న సంశయః ॥5॥

నా గుణరూపుడే ఈ రుద్రుడు. లోకాలకు నీవు చేయలేని పనిని నేను రుద్రశరీరంతో చేస్తాను.

రుద్రధ్యేయో భవాంశ్చైవ భవద్ధ్యేయో హరస్తథా ।
యువయోరంతరం నైవ తవ రుద్రస్య కించన ॥6॥

నిన్ను రుద్రుడు ధ్యానిస్తాడు. నీవు రుద్రుణ్ణి ధ్యానిస్తావు. నీకు రుద్రునికీ లేశమైనా భేదం లేదు.

వస్తుతశ్చాపి చైకత్వం వరతోఽపి తథైవ చ ।
లీలయాపి మహావిష్ణో! సత్యం సత్యం న సంశయః ॥7॥

స్వరూపంలో మీకిద్దరికీ భేదం లేదు. మరియు ఓ మహావిష్ణూ! నా లీలలచే, నేనిచ్చిన వరప్రభావం వల్ల మీకిద్దరికీ భేదం లేదు. ఇది ముమ్మాటికి సత్యం. సంశయం లేదు.

రుద్రభక్తో నరో యస్తు తవ నిందాం కరిష్యతి ।
తస్య పుణ్యం చ నిఖిలం ద్రుతం భస్మ భవిష్యతి ॥8॥

రుద్రభక్తుడైన మానవుడు నిన్ను నిందిస్తే వాని పుణ్యమంతా భస్మీపటలం అవుతుంది.

నరకే పతనం తస్య త్వద్ద్వేషాత్పురుషోత్తమ! ।
మదాజ్ఞయా భవేద్విష్ణో! సత్యం సత్యం న సంశయః ॥9॥

హే పురుషోత్తమా! విష్ణూ! నిన్ను ద్వేషించు వాడు నా ఆజ్ఞానుసారం నరకంలో పడతాడు. ఇది ముమ్మాటికి నిజం. ఇందులో సందేహం లేదు.

లోకేఽస్మిన్ ముక్తిదో నృణాం భక్తిదశ్చ విశేషతః ।
ధ్యేయః పూజ్యశ్చ భక్తానాం నిగ్రహానుగ్రహౌ కురు ॥10॥

నీవు ఈ లోకంలో మానవులకు భక్తిని, ముక్తిని ఇచ్చేవాడవై భక్తులచే ధ్యానింపబడతావు. పూజింపబడతావు. నీవు భక్తులను శిక్షించుట, అనుగ్రహించుట అనే పనులు చేయాలి.

ఇత్యుక్త్వా మాం చ ధాతారం హస్తే ధృత్వా స్వయం హరిమ్ ।
కథయామాస దుఃఖేషు సహాయో భవ సర్వదా ॥11॥

అని చెప్పి శివుడు బ్రహ్మనైన నన్ను చేతితో పట్టుకొని, విష్ణువుతో ఈతనికి కష్టాల సమయంలో ఎపుడూ తోడుగా ఉండమని చెప్పాడు.

సర్వాధ్యక్షశ్చ సర్వేషు భక్తిముక్తిప్రదాయకః ।
భవ త్వం సర్వథా శ్రేష్ఠస్సర్వకామప్రసాదకః ॥12॥

ఓ హరీ! నీవు సర్వానికి అధ్యక్షుడవు. భక్తిని, ముక్తిని ఇచ్చేవాడవు. సర్వశ్రేష్ఠుడవు. కోరికలన్నింటినీ తీర్చేవాడివవుతావు.

సర్వేషాం ప్రాణరూపశ్చ భవ త్వం చ మమాజ్ఞయా ।
సంకటే భజనీయో హి స రుద్రో మత్తనుర్హరే ॥13॥

ఓ విష్ణూ! నీవు నా ఆజ్ఞచే ప్రాణులన్నింటికి ప్రాణరూపుడవు కావాలి. నా అంశయైన రుద్రుణ్ణి నీవు కష్టకాలంలో సేవించు.

త్వాం యస్సమాశ్రితో నూనం మామేవ స సమాశ్రితః ।
అంతరం యశ్చ జానాతి నిరయే పతతి ధ్రువమ్ ॥14॥

నిన్ను ఆశ్రయించిన వ్యక్తి నిశ్చయంగా నన్ను ఆశ్రయించినట్లు అవుతుంది. మన మధ్య భేదాన్ని చూసే వ్యక్తి నరకంలో పడడం నిశ్చయం.

ఆయుర్బలం శృణుష్వాద్య త్రిదేవానాం విశేషతః ।
సందేహోఽత్ర న కర్తవ్యో బ్రహ్మావిష్ణుహరాత్మనామ్ ॥15॥

ఇపుడు బ్రహ్మ, విష్ణు, రుద్రులు అనే త్రిమూర్తుల ఆయుర్దాయాన్ని బలాన్ని వివరిస్తాను. విను. దీని విషయంలో మీరు సందేహించకండి.

చతుర్యుగసహస్రాణి బ్రహ్మణో దినముచ్యతే ।
రాత్రిశ్చ తావతీ తస్య మానమేతత్క్రమేణ హ ॥16॥

వేయి మహాయుగాలు బ్రహ్మకు ఒక పగలు. అంతే కాలం అతనికి ఒక రాత్రి. ఈ లెక్కతో అతని ఆయుష్షును లెక్కించాలి.

తేషాం త్రింశద్దినైర్మాసో ద్వాదశైస్తైశ్చ వత్సరః ।
శతవర్షప్రమాణేన బ్రహ్మాయుః పరికీర్తితమ్ ॥17॥

అలాంటి 30 రోజులు ఒక నెల. పన్నెండు నెలలు ఒక సంవత్సరం. బ్రహ్మ యొక్క ఆయుర్దాయం ఇలాంటి వంద సంవత్సరములని చెప్పబడింది.

బ్రహ్మణో వర్షమాత్రేణ దినం వైష్ణవముచ్యతే ।
సోఽపి వర్షశతం యావదాత్మమానేన జీవతి ॥18॥

బ్రహ్మ యొక్క ఒక సంవత్సరం విష్ణువుకి ఒక రోజు అవుతుంది. ఈ లెక్కలో ఆయనకు 100 సంవత్సరములు ఆయుర్దాయం ఉంటుంది.

వైష్ణవేన తు వర్షేణ దినం రౌద్రం భవేద్ధ్రువమ్ ।
హరో వర్షశతే యాతే నరరూపేణ సంస్థితః ॥19॥

విష్ణువు యొక్క ఒక సంవత్సరం రుద్రునికి ఒకరోజు రుద్రుడు అలాంటి 100 సంవత్సరాలు గడిచాక నరరూపంలో ఉంటాడు.

యావదుచ్ఛ్వసితం వక్త్రే సదాశివసముద్భవమ్ ।
పశ్చాచ్ఛక్తిం సమభ్యేతి యావన్నిశ్శ్వసితం భవేత్ ॥20॥

సదాశివుడు ఊపిరి తీసుకుని వదిలేలోపు అతడు శక్తిని పొందుతాడు.

నిశ్వాసోచ్ఛ్వసితానాం చ సర్వేషామేవ దేహినామ్ ।
బ్రహ్మవిష్ణుహరాణాం చ గంధర్వోరగరక్షసామ్ ॥21॥

ఏకవింశసహస్రాణి శతైః షడ్భిశ్శతాని చ ।
అహోరాత్రాణి చోక్తాని ప్రమాణం సురసత్తమౌ ॥22॥

ఓ దేవశ్రేష్ఠులారా! అన్ని ప్రాణులకు, బ్రహ్మ, విష్ణు, రుద్రులకు మరియు గంధర్వులకు, పాతాళంలో నివసించే నాగులకు, రాక్షసులకు 21,600 ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఒక రోజు అని తెలుసుకోవాలి.

షడ్భిరుచ్ఛ్వాసనిశ్వాసైః పలమేకం ప్రవర్తితమ్ ।
ఘటీ షష్టి పలాః ప్రోక్తా సా షష్ట్యా చ దినం నిశా ॥23॥

ఆరు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఒక పలం అవుతుంది. అరవై పలాలు ఒక గడియ, అరవై గడియలు ఒక రోజు అవుతుంది.

నిశ్వాసోచ్ఛ్వాసితానాం చ పరిసంఖ్యా న విద్యతే ।
సదాశివసముత్థానామేతస్మాత్సోఽక్షయః స్మృతః ॥24॥

సదాశివుని నుండి వెలువడిన ఉచ్ఛ్వాస, నిశ్వాసాలకు పరిమితి లేదు. కాబట్టి ఆయన అక్షయుడని చెప్పబడ్డాడు.

ఇత్థం రూపం త్వయా తావద్రక్షణీయం మమాజ్ఞయా ।
తావత్సృష్టేశ్చ కార్యం వై కర్తవ్యం వివిధైర్గుణైః ॥25॥

ఈ విధమైన జగత్ రూపాన్ని నీవు నా ఆజ్ఞచే రక్షించు. మీరిద్దరూ వివిధ గుణాలను ఆశ్రయించి సృష్టికార్యములన్నీ చేయండి.

బ్రహ్మోవాచ - బ్రహ్మ ఇలా పలికాడు.

ఇత్యాకర్ణ్య వచశ్శంభోర్మయా చ భగవాన్హరిః ।
ప్రణిపత్య చ విశ్వేశం ప్రాహ మందతరం వశీ ॥26॥

శంభుని ఈ మాటలు విని నేను, విష్ణుభగవానుడు జగత్తుకు తండ్రి అయిన ఆయనకు నమస్కరించాము. సర్వసమర్థుడైన విష్ణువు మెల్లగా శివుడితో ఇలా అన్నాడు.

విష్ణురువాచ - విష్ణు ఇలా పలికాడు.

శంకర శ్రూయతామేతత్కృపాసింధో! జగత్పతే! ।
సర్వమేతత్కరిష్యామి భవదాజ్ఞావశానుగః ॥27॥

శంకరా! నువ్వు కృపాసముద్రుడవు. జగత్తుకు తండ్రివి. నీ ఆజ్ఞకు వశుడనై నీ పనులన్నీ చేస్తాను.

మమ ధ్యేయస్సదాత్వం చ భవిష్యసి న చాన్యథా ।
భవతస్సర్వసామర్థ్యం లబ్ధం చైవ పురా మయా ॥28॥

నేను ఎప్పుడూ నిన్నే ధ్యానిస్తాను. సందేహం లేదు. నేను పూర్వం నీ నుండే సామర్థ్యాలన్నింటినీ పొంది ఉన్నాను.

క్షణమాత్రమపి స్వామింస్తవ ధ్యానం పరం మమ ।
చేతసో దూరతో నైవ నిర్గచ్ఛతు కదాచన ॥29॥

ఓ స్వామీ! నీ తలపు నా మనసు నుండి క్షణమాత్రం కూడా ఏనాడూ తొలగి పోరాదు.

మమ భక్తశ్చ యః స్వామింస్తవ నిందా కరిష్యతి ।
తస్య వై నిరయే వాసం ప్రయచ్ఛ నియతం ధ్రువమ్ ॥30॥

ఓ స్వామీ! నా భక్తుడెవ్వరైనా నిన్ను నిందిస్తే తప్పకుండా వానికి నరకవాసాన్ని ఇవ్వు.

త్వద్భక్తో యో భవేత్స్వామిన్మమ ప్రియతరో హి సః ।
ఏవం వై యో విజానాతి తస్య ముక్తిర్న దుర్లభా ॥ 31॥

ఓ స్వామీ! నీ భక్తుడైన మానవుడు నాకు మిక్కిలి ప్రీతిపాత్రుడౌతాడు. ఈ సత్యాన్ని తెలుసుకున్న వానికి ముక్తి దుర్లభం కాదు.

మహిమా చ మదీయోఽద్య వర్ధితో భవతా ధ్రువమ్ ।
కదాచిదగుణశ్చైవ జాయతే క్షమ్యతామితి ॥32॥

ఈ రోజు నీ వల్ల నా మహిమ నిశ్చయంగా వృద్ధి చెందింది. నేను ఏనాడైనా తప్పు చేస్తే క్షమించాలి.

తదా శంభుస్తదీయం హి శ్రుత్వా వచనముత్తమమ్ ।
ఉవాచ విష్ణుం సుప్రీత్యా క్షమ్యా తేఽగుణతా మయా ॥33॥

అపుడు శంభుడు విష్ణువు మాటలను విని ప్రేమతో అతనితో "నీ తప్పు నా చేత క్షమించదగిందే" అని అన్నాడు.

ఏవముక్త్వా హరిం నౌ స కరాభ్యాం పరమేశ్వరః ।
పస్పర్శ సకలాంగేషు కృపయా తు కృపానిధిః ॥34॥

కృపానిధి అయిన ఆ పరమేశ్వరుడు విష్ణువుతో ఇలా చెప్పి మా ఇద్దరి శరీరావయవాలన్నీ చేతితో తడిమి, ముట్టుకొన్నాడు.

ఆదిశ్య వివిధాన్ధర్మాన్సర్వదుఃఖహరో హరః ।
దదౌ వరాననేకాంశ్చావయోర్హితచికీర్షయా ॥35॥

దుఃఖాలనన్నింటినీ పోగొట్టే శివుడు మాకు ఇద్దరికి వివిధధర్మాలను ఆదేశించి, మాకు సంతోషం కలిగించేలా అనేక వరాలనిచ్చాడు.

తతస్స భగవాన్ శంభుః కృపయా భక్తవత్సలః ।
దృష్ట్వా సంపశ్యతోశ్శీఘ్రం తత్రైవాంతరధీయత ॥36॥

అపుడు భక్తవత్సలుడైన ఆ శంభుడు కృపాదృష్టితో చూసి మేము చూస్తుండగానే వెంటనే మాయమయ్యాడు.

తదా ప్రభృతి లోకేஉస్మిన్ లింగపూజావిధిః స్మృతః ।
లింగే ప్రతిష్ఠితశ్శంభుర్భుక్తిముక్తిప్రదాయకః ॥37॥

అప్పటి నుండి లోకంలో లింగపూజావిధానం మొదలైంది. భక్తిని, ముక్తిని ఇచ్చే శంభుడు లింగంలో ప్రతిష్ఠితుడై ఉన్నాడు.

లింగవేదిర్మహాదేవీ లింగం సాక్షాన్మహేశ్వరః ।
లయనాల్లింగమిత్యుక్తం తత్రైవ నిఖిలం జగత్ ॥38॥

లింగం యొక్క వేది మహాదేవి అయిన ఉమ. లింగం సాక్షాత్తూ మహేశ్వరుడు. దానిలో జగత్తు అంతా లయమవటం వల్ల దానికి లింగమని పేరు వచ్చింది.

యస్తు లైంగం పఠేన్నిత్యం ఆఖ్యానం లింగసన్నిధౌ ।
షణ్మాసాన్ శివరూపో వై నాత్ర కార్యా విచారణా ॥39॥

లింగసన్నిధిలో నిత్యం ఆరుమాసాలు లింగావిర్భావగాథను చదివే వానిని శివస్వరూపుడనటంలో సందేహం లేదు.

యస్తు లింగసమీపే తు కార్యం కించిత్కరోతి చ ।
తస్య పుణ్యఫలం వక్తుం న శక్నోమి మహామునే ॥40॥

ఓ మహర్షీ! లింగ సన్నిధిలో ఏదైన ధర్మకార్యం చేసే మనిషికి వచ్చే పుణ్యఫలాన్ని నేను వర్ణించలేను.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే పరమశివతత్త్వవర్ణనం నామ దశమోஉధ్యాయః ॥10॥

శ్రీశివ మహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితలోని సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటి ఖండంలో పరమశివతత్త్వవర్ణనమనే పదవ అధ్యాయం సమాప్తం.

ఏకాదశోఽధ్యాయః – పదకొండవ అధ్యాయం

శివపూజావిధిః – శివపూజావిధి

సూతసూత! మహాభాగ! వ్యాసశిష్య! నమోఽస్తు తే ।
శ్రావితాద్యాద్భుతా శైవకథా పరమపావనీ ॥1॥

ఓ సూతా! మహాత్మా! వ్యాస శిష్యుడవైన నీకు నమస్కారం. నువ్వు అద్భుతం, పరమపావనం అయిన శివకథను వినిపించావు.

తత్రాద్భుతా మహాదివ్యా లింగోత్పత్తిశ్రుతా శుభా ।
శ్రుత్వా యస్యాః ప్రభావం చ దుఃఖనాశో భవేదిహ ॥2॥

దానియందు మేము చాలా దివ్యమైన, శుభకరమైన లింగావిర్భావం గురించి విన్నాం. ఈ గాథను వింటే ఆ ప్రభావం వల్ల ఈ సంసారంలో దుఃఖం నశిస్తుంది.

బ్రహ్మనారదసంవాదమనుసృత్య దయానిధే ।
శివార్చనవిధిం బ్రూహి యేన తుష్టో భవేచ్ఛివః ॥3॥

ఓ దయాసముద్రా! నీవు బ్రహ్మ నారద సంవాదాన్ని అనుసరించి శివునికి ఇష్టమైన పూజావిధానాన్ని చెప్పు.

బ్రాహ్మణైః క్షత్రియైర్వైశ్యైశ్శూద్రైర్వా పూజ్యతే శివః ।
కథం కార్యం చ తద్ బ్రూహి యథా వ్యాసముఖాచ్ఛ్రుతమ్ ॥4॥

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు శివుణ్ణి పూజిస్తారు. ఈ పూజను ఎలా చేయాలి? నువ్వు వ్యాసుని ముఖం నుండి విన్న ఆ పూజావిధానం తెలియ చేయి.

తచ్ఛ్రుత్వా వచనం తేషాం శర్మదం శ్రుతిసమ్మతమ్ ।
ఉవాచ సకలం ప్రీత్యా మునిప్రశ్నానుసారతః ॥5॥

సుఖకరం, వేదసమ్మతం అయిన వాళ్ల ఆ మాటలను విని, సూతుడు ప్రీతితో మునుల ప్రశ్నకు అనురూపంగా అన్నింటిని బోధించాడు.

సూత ఉవాచ – సూతుడు ఇలా చెప్పాడు.

సాధు పృష్టం భవద్భిశ్చ తద్రహస్యం మునీశ్వరాః ।
తదహం కథయామ్యద్య యథాబుద్ధి యథా శ్రుతమ్ ॥6॥

ఓ మునీశ్వరులారా! శివపూజారహస్యం గురించి మీరు చక్కగా అడిగారు. నేను ఆ విషయాలను అపుడు నేను విన్నదానికి అనురూపంగా నా బుద్ధికి అందినంతవరకు చెప్తాను.

భవద్భిః పృచ్ఛ్యతే తద్వత్తథా వ్యాసేన వై పురా ।
పృష్టం సనత్కుమారాయ తచ్ఛ్రుతం హ్యుపమన్యునా ॥7॥

మీరు నన్ను అడిగిన విధంగానే, పూర్వము వ్యాసుడు సనత్కుమారుణ్ణి అడిగాడు. ఆ ప్రసంగాన్ని ఉపమన్యుడు కూడా విన్నాడు.

తతో వ్యాసేన వై శ్రుత్వా శివపూజాదికం చ యత్ ।
మహ్యం చ పాఠితం తేన లోకానాం హితకామ్యయా ॥8॥

వ్యాసుడు శివపూజాదులను విని, లోకాలకు హితాన్ని చేయాలనుకొని నాకు బోధించాడు.

తచ్ఛ్రుతం చైవ కృష్ణేన హ్యుపమన్యోర్మహాత్మనః ।
తదహం కథయిష్యామి యథా బ్రహ్మావదత్పురా ॥9॥

మహాత్ముడగు ఉపమన్యుని నుండి దానిని శ్రీకృష్ణుడు విన్నాడు. పూర్వం బ్రహ్మచే చెప్పబడిన ఆ విషయాన్ని నేను చెప్తాను.

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఈ విధంగా చెప్పాడు.

శృణు నారద వక్ష్యామి సంక్షేపాల్లింగపూజనమ్ ।
వక్తుం వర్షశతేనాపి న శక్యం విస్తరాన్మునే ॥10॥

నారదా! లింగపూజను సంక్షిప్తంగా చెప్తాను విను. ఓ మహర్షీ! దానిని విస్తారంగా చెప్పటానికి 100 సంవత్సరాలైనా చాలదు.

ఏవం తు శాంకరం రూపం సుఖం స్వచ్ఛం సనాతనమ్ ।
పూజయేత్పరయా భక్త్యా సర్వకామఫలాప్తయే ॥11॥

మానవుడు సర్వకోరికలను పొందడం కోసం పరాభక్తితో సుఖకరమూ, శుద్ధమూ, సనాతనము అయిన శంకరుని లింగరూపాన్ని ఈ విధంగా పూజించాలి.

దారిద్ర్యం రోగదుఃఖం చ పీడనం శత్రుసంభవమ్ ।
పాపం చతుర్విధం తావద్యావన్నార్చయతే శివమ్ ॥12॥

దారిద్ర్యం, రోగం, దుఃఖం, శత్రుపీడ అనే నాలుగు రకాల పాపఫలాలు మానవుడికి శివుని అర్చించనంతవరకు మాత్రమే ఉంటాయి.

సంపూజితే శివే దేవే సర్వదుఃఖం విలీయతే ।
సంపద్యతే సుఖం సర్వం పశ్చాన్ముక్తిరవాప్యతే ॥13॥

మహాదేవుని పూజిస్తే దుఃఖాలన్నీ తొలగిపోయి, సర్వసుఖాలు కలుగుతాయి. మరణించిన తర్వాత ముక్తి కలుగుతుంది.

యే వై మానుష్యమాశ్రిత్య ముఖ్యం సంతానతస్సుఖమ్ ।
తేన పూజ్యో మహాదేవస్సర్వకార్యార్థసాధకః ॥14॥

మానుషశరీరాన్ని పొంది, ఏ మనిషి ప్రధానంగా సంతానం నుండి సుఖాన్ని కోరుకుంటాడో అలాంటి వాడు అన్ని కార్యాలు సిద్ధించటం కోసం మహాదేవుని కొలవాలి.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాశ్శూద్రాశ్చ విధివత్క్రమాత్ ।
శంకరార్చాం ప్రకుర్వంతు సర్వకామార్థసిద్ధయే ॥15॥

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు కోరికలన్నీ తీరేందుకు వేదంలో చెప్పబడినట్టు శంకరుని పూజించాలి.

ప్రాతః కాలే సముత్థాయ ముహూర్తే బ్రహ్మసంజ్ఞకే ।
గురోశ్చ స్మరణం కృత్వా శంభోశ్చైవ తథా పునః ॥16॥

తీర్థానాం స్మరణం కృత్వా ధ్యానం చైవ హరేరపి ।
మమాపి నిర్జరాణాం వై మున్యాదీనాం తథా మునే ॥17॥

తతః స్తోత్రం శుభం నామ గృహ్ణీయాద్విధిపూర్వకమ్ ।
తథోత్థాయ మలోత్సర్గం దక్షిణస్యాం చరేద్దిశి ॥18॥

ఓ మహర్షీ! ఉదయమే బ్రహ్మముహూర్తంలో నిద్ర లేచి, గురువును, శంభుని మరీ మరీ స్మరించి తీర్థాలను స్మరించి, హరిని, నన్ను, దేవతలను మరియు మునులను ధ్యానించాలి. తరువాత స్తోత్రాలను పఠించి, పవిత్రమైన నామాన్ని యథావిధిగా జపించాలి. తర్వాత లేచి మలవిసర్జనకు దక్షిణం వైపుగా వెళ్లాలి.

ఏకాంతే తు విధిం కుర్యాన్మలోత్సర్గస్య యచ్ఛ్రుతమ్ ।
తదేవ కథయామ్యద్య శృణ్వాధాయ మనో మునే ॥19॥

ఏకాంతంలో మలవిసర్జన చేయాలి. ఓ మహర్షీ! ఆ విధిని ఇపుడు చెప్తాను. మనస్సును లగ్నం చేసి విను.

శుద్ధాం మృదం ద్విజో లిప్యాత్పంచవారం విశుద్ధయే ।
క్షత్రియశ్చ చతుర్వారం వైశ్యో వారత్రయం తథా ॥20॥

బ్రాహ్మణుడు శుద్ధి కోసం శుద్ధమైన మట్టిని అయిదుసార్లు, క్షత్రియుడు నాలుగుసార్లు, వైశ్యుడు మూడుసార్లు పూసుకోవాలి.

శూద్రో ద్వివారం చ మృదం గృహ్ణీయాద్విధిశుద్ధయే ।
గుదే వాథ సకృల్లింగే వారమేకం ప్రయత్నతః ॥21॥

శూద్రుడు రెండుసార్లు గుదమునకు లేపనం చేయాలి. ఒకసారి గుదాన్నీ, గుహ్యాన్ని ప్రయత్నంతో లేపనం చేయాలి.

దశవారం వామహస్తే సప్తవారం ద్వయోస్తథా ।
ప్రత్యేకం పాదయోస్తాత త్రివారం కరయోః పునః ॥22॥

వత్సా! ఎడమచేతిని పదిసార్లు, రెండు చేతులను ఏడుసార్లు, పాదాలను ఒక్కొక్కసారి, మరలా చేతులను మూడుసార్లు కడుక్కోవాలి.

స్త్రీభిశ్చ శూద్రవత్కార్యం మృదా గ్రహణముత్తమమ్ ।
హస్తౌ పాదౌ చ ప్రక్షాల్య పూర్వవన్మృదమాహరేత్ ॥23॥

స్త్రీలు శూద్రుల వలెనే చేయాలి. మట్టి శుద్ధికి ఉత్తమమైంది. చేతులను, పాదాలను కడుక్కొని, ముందుచెప్పినట్లు మట్టిని సంగ్రహించాలి

దంతకాష్ఠం తతః కుర్యాత్స్వవర్ణక్రమతో నరః ॥24॥

తర్వాత మానవుడు తన వర్ణానికి తగ్గట్లు దంతకాష్ఠంతో దంతాలను శుభ్రం చేసుకోవాలి.

విప్రః కుర్యాద్దంతకాష్ఠం ద్వాదశాంగులమానతః ।
ఏకాదశాంగులం రాజా వైశ్యః కుర్యాద్దశాంగులమ్ ॥25॥

శూద్రో నవాంగులం కుర్యాదితి మానమిదం స్మృతమ్ ।
కాలదోషం విచార్యైవ మనుదృష్టం వివర్జయేత్ ॥26॥

షష్ఠ్యాద్యామాశ్చ నవమీ వ్రతమస్తం రవేర్దినమ్ ।
తథా శ్రాద్ధదినం తాత నిషిద్ధం రదధావనే ॥27॥

బ్రాహ్మణుడు పన్నెండు అంగుళాల పుల్లను, క్షత్రియుడు పదకొండు అంగుళాల పుల్లను, వైశ్యుడు పది అంగుళాల పుల్లను, శూద్రుడు తొమ్మిది అంగుళాల పుల్లను ఉపయోగించాలి. కాలదోషాన్ని బట్టి మనువు చెప్పిన విధంగా షష్ఠి, పాడ్యమి, అమావాస్య, నవమి, వ్రతదినం, సూర్యాస్తమయకాలం, ఆదివారం మరియు శ్రాద్ధదినాలలో పుల్లతో పళ్లు తోముకొనరాదు.

స్నానం తు విధివత్కార్యం తీర్థాదిషు క్రమేణ తు ।
దేశకాలవిశేషేణ స్నానం కార్యం సమంత్రకమ్ ॥28॥

తీర్థాలలో యథావిధి స్నానమును చేయాలి. దేశ, కాలాలను బట్టి సమంత్రకంగా స్నానం చేయాలి.

ఆచమ్య ప్రథమం తత్ర ధౌతవస్త్రం చ ధారయేత్ ।
ఏకాంతే సుస్థలే స్థిత్వా సంధ్యావిధిమథాచరేత్ ॥29॥

ముందుగా ఆచమించి ఉతికిన బట్టను ధరించి, తర్వాత ఏకాంతంలో మంచిచోట కూర్చుని సంధ్యావందన మాచరించాలి.

యథాయోగ్యం విధిం కృత్వా పూజావిధిమథారభేత్ ।
మనస్తు సుస్థిరం కృత్వా పూజాగారం ప్రవిశ్య చ ॥30॥

పూజావిధిం సమాదాయ స్వాసనే హ్యుపవిశ్య వై ।
న్యాసాదికం విధాయాదౌ పూజయేత్క్రమశో హరమ్ ॥31॥

తర్వాత పూజావిధిని ప్రారంభించాలి. మనస్సును నిశ్చలంగా ఉంచుకొని, పూజామందిరంలోకి ప్రవేశించాలి. పూజావిధిని ఆరంభించటానికి మంచి ఆసనం మీద కూర్చుని, అంగన్యాసకర న్యాసాదులను ఆచరించి, క్రమంగా శివుణ్ణి పూజించాలి.

ప్రథమం చ గణాధీశం ద్వారపాలాంస్తథైవ చ ।
దిక్పాలాంశ్చ సుసంపూజ్య పశ్చాత్పీఠం ప్రకల్పయేత్ ॥32॥

అథవాఽష్టదలం కృత్వా పూజాద్రవ్యం సమీపతః ।
ఉపవిశ్య తతస్తత్ర ఉపవేశ్య శివం ప్రభుమ్ ॥33॥

ఆచమనత్రయం కృత్వా ప్రక్షాల్య చ పునః కరౌ ।
ప్రాణాయామత్రయం కృత్వా మధ్యే ధ్యాయేత్ త్ర్యంబకమ్ ॥34॥

పంచవక్త్రం దశభుజం శుద్ధస్ఫటికసన్నిభమ్ ।
సర్వాభరణసంయుక్తం వ్యాఘ్రచర్మోత్తరీయకమ్ ॥35॥

ముందుగా గణపతిని, ద్వారపాలకులను, దిక్పాలకుల్ని చక్కగా పూజించి, పీఠాన్ని ఏర్పాటు చేయాలి. లేదా ఎనిమిది దళాలున్న పద్మాన్ని పూజాద్రవ్యాల దగ్గరలో రచించి, అక్కడ కూర్చుని శివప్రభువును కూర్చుండబెట్టి మూడు సార్లు ఆచమనం చేసి, మరలా చేతులను శుద్ధి చేసుకొని, మూడుసార్లు ప్రాణాయామాలను చేయాలి. వాటి మధ్యలో మూడు కన్నులు కలవాడు అయిదు ముఖాలు కలవాడు, పది చేతులు కలవాడు, స్వచ్ఛమైన స్ఫటికంలా భాసించేవాడు, సర్వాభరణాలు ధరించినవాడు, పులిచర్మాన్ని ఉత్తరీయంగా ధరించినవాడు అయిన శివుణ్ణి ధ్యానించాలి.

తస్య సారూప్యతాం స్మృత్వా దహేత్పాతం నరస్సదా ।
శివం తతస్సముత్థాప్య పూజయేత్పరమేశ్వరమ్ ॥36॥

శివునితో ఎప్పుడూ సారూప్యాన్ని భావించి, మానవుడు పాపాలను పోగొట్టుకోవాలి. అపుడు పరమేశ్వరుడైన శివుణ్ణి ఆహ్వానించి పూజించాలి.

దేహశుద్ధిం తతః కృత్వా మూలమంత్రం న్యసేత్క్రమాత్ ।
సర్వత్ర ప్రణవేనైవ షడంగన్యాసమాచరేత్ ॥37॥

శరీరాన్ని పవిత్రం చేసుకొని వరసగా మూలమంత్రన్యాసాన్ని చెయ్యాలి. ఓంకారంతో ఆరు అంగన్యాసాలు చేయాలి.

కృత్వా హృది ప్రయోగం చ తతః పూజాం సమారభేత్ ।
పాద్యార్ఘ్యాచమనార్థం చ పాత్రాణి చ ప్రకల్పయేత్ ॥38॥

పూజాప్రయోగాన్ని మనసులో ఉంచుకొని, పూజను ప్రారంభించాలి. పాద్యం, అర్ఘ్యం, ఆచమనాల కోసం పాత్రలను ఉంచుకోవాలి.

స్థాపయేద్ద్వివిధాన్ కుంభాన్ నవ ధీమాన్యథావిధి ।
దర్భైరాచ్ఛాద్య తైరేవ సంస్థాప్యాభ్యుక్షవారిణా ॥39॥

తేషు తేషు చ సర్వేషు క్షిపేత్తోయం సుశీతలమ్ ।
ప్రణవేన క్షిపేత్తేషు ద్రవ్యాణ్యాలోక్య బుద్ధిమాన్ ॥40॥

ఉశీరం చందనం చైవ పాద్యే తు పరికల్పయేత్ ।
జాతీకం కోలకర్పూరవటమూలతమాలకమ్ ॥41॥

చూర్ణయిత్వా యథాన్యాయం క్షిపేదాచమనీయకే ।
ఏతత్సర్వేషు పాత్రేషు దాపయేచ్చందనాన్వితమ్ ॥42॥

పార్శ్వయోర్దేవదేవస్య నందీశం తు సమర్చయేత్ ।
గంధైర్ధూపైస్తథా దీపైర్వివిధైః పూజయేచ్ఛివమ్ ॥43॥

బుద్ధిమంతుడు యథావిధిగా తొమ్మిదిరకాల కలశాలను ఉంచి, వాటిని దర్భలతే కప్పి నీటితో ప్రోక్షించి చల్లని నీటితో వాటిని నింపాలి. పిమ్మట మంత్రపూర్వకంగా వాటిలో ద్రవ్యాలనుంచాలి. నీళ్లు పోసిన కలశాలలో వట్టివేరును, చందనాన్ని వేయాలి. మల్లె, మిరియాలు, కర్పూరం, మఱ్ఱిచెట్టు వేళ్లు మరియు తమలపాకులను చూర్ణం చేసి ఆచమనకలశాలలో ఉంచాలి. ఈ కలశాలన్నిటిలో చందనాన్ని వేయాలి. దేవదేవుని ప్రక్కనున్న నందీశ్వరుణ్ణి పూజించాలి. గంధం, ధూపం, దీపం వంటి ఉపచారాలతో శివుణ్ణి పూజించాలి.

లింగశుద్ధిం తతః కృత్వా ముదా యుక్తో నరస్తదా ।
యథోచితం తు మంత్రౌఘైః ప్రణవాదిర్నమోంతకైః ॥44॥

కల్పయేదాసనం స్వస్తి పద్మాదిప్రణవేన తు ।
తస్మాత్పూర్వదిశం సాక్షాదణిమామయమక్షరమ్ ॥45॥

లఘిమా దక్షిణం చైవ మహిమా పశ్చిమం తథా ।
ప్రాప్తిశ్చైవోత్తరం పత్రం ప్రాకామ్యం పావకస్య చ ॥46॥

ఈశిత్వం నైర్ఋతం పత్రం వశిత్వం వాయుగోచరే ।
సర్వజ్ఞత్వం తథైశాన్యం కర్ణికా సోమ ఉచ్యతే ॥47॥

సోమస్యాధస్తథా సూర్యస్తస్యాధః పావకస్త్వయమ్ ।
ధర్మాదీనపి తస్యాధో భవతః కల్పయేత్ క్రమాత్ ॥48॥

తర్వాత లింగం దగ్గరున్న మాలిన్య ద్రవ్యాలన్నింటినీ తీసివేసి, ఆనందంగా సాధకుడు ఓంకారం ఆదియందు, నమః చివరచేర్చి తగిన మంత్రాలతో యథోచితంగా స్వస్తికాసనం, పద్మాసనం వంటివి వేయాలి. ఆ పద్మం తూర్పువైపున ఉన్న ఆకు నాశనం లేని అణిమా అనే సిద్ధి (సూక్ష్మరూపాన్ని ధరించిన శక్తి) అని దక్షిణవైపున్న ఆకు లఘిమ (చాలా తేలికగా అయ్యే శక్తి) అని, పశ్చిమం వైపున్న ఆకు మహిమ (చాలా పెద్ద రూపం ధరించే శక్తి) అని, ఉత్తరానున్న ఆకు ప్రాప్తి (ఏ వస్తువునైనా పొందగలిగే శక్తి) అని,ఆగ్నేయంలో ఉన్న ఆకు ప్రాకామ్యం (అమోఘ సంకల్పశక్తి) అని, నైరుతివైపుగల ఆకు ఈశిత్వం (సర్వోత్కృష్టమైనది) అని, వాయువ్యంవైపు కల ఆకు వశిత్వం (జితేంద్రియ తత్వం) అని, ఈశాన్యపత్రం సర్వజ్ఞత్వం అని, కర్ణిక చంద్రుడని చెప్పబడింది. చంద్రుని క్రింద సూర్యుడు, ఆ క్రింద అగ్ని ఉన్నారు. వాటి క్రింద ధర్మార్థకామమోక్షాలను భావన చేయాలి.

అవ్యక్తాదిచతుర్దిక్షు సోమస్యాంతే గుణత్రయమ్ ।
సద్యోజాతం ప్రవక్ష్యామీత్యావాహ్య పరమేశ్వరమ్ ॥49॥

నాలుగు దిక్కులయందు అవ్యక్తం, మహత్తత్వం, అహంకారం, పంచభూతాలు అనే తత్త్వాలను, చంద్రునికి పైన త్రిగుణాలను భావన చేయాలి. సద్యోజాతం ప్రవక్ష్యామి అనే మంత్రంతో పరమేశ్వరుని ఆవాహన చేయాలి.

వామదేవేన మంత్రేణ తిష్ఠేచ్చైవాసనోపరి ।
సాన్నిధ్యం రుద్రగాయత్ర్యా అఘోరేణ నిరోధయేత్ ॥50॥

వామదేవాయ అనే మంత్రంతో శివునికి ఆసనం వేయాలి. తత్పురుషాయ అనే మంత్రంతో శివుణ్ణి ధ్యానించి, అఘోరేభ్యః అనే మంత్రంతో శివుడిని స్థిరం చేయాలి.

ఈశానం సర్వవిద్యానామితి మంత్రేణ పూజయేత్ ।
పాద్యమాచమనీయం చ విధాయార్ఘ్యం ప్రదాపయేత్ ॥51॥

ఈశానం సర్వ విద్యానామ్ అనే మంత్రంతో పూజించాలి. పాద్యాన్ని, ఆచమనాన్ని, అర్ఘ్యాన్ని ఇవ్వాలి.

స్థాపయేద్విధినా రుద్రం గంధచందనవారిణా ।
పంచగవ్యవిధానేన గృహ్యపాత్రేఽభిమంత్ర్య చ ॥52॥

ప్రణవేనైవ గవ్యేన స్నాపయేత్పయసా చ తమ్ ।
దధ్నా చ మధునా చైవ తథా చేక్షురసేన తు ॥53॥

ఘృతేన తు యథాపూజ్య సర్వకామహితావహమ్ ।
పుణ్యైర్ద్రవ్యైర్మహాదేవం ప్రణవేనాభిషేచయత్ ॥54॥

గంధజలంతో రుద్రుని యథావిధిగా ఆవాహన చెయ్యాలి. పంచగవ్యాలను పాత్రలో ఉంచి, ప్రణవంతో అభిమంత్రించి అభిషేకించాలి. మరియు ఆవుపాలతో అభిషేకం చేయాలి. పెరుగు, తేనె, చెరుకురసం నేయి అనే ద్రవ్యాలతో అభిషేకిస్తే, కోరికలన్నీ తీరుతాయి. పుణ్యద్రవ్యాలతో, ప్రణవమంత్రంతో మహాదేవుని అభిషేకించాలి.

పవిత్రజలభాండేషు మంత్రైస్తోయం క్షిపేత్తతః ।
శుద్ధీకృత్య యథాన్యాయం సితవస్త్రేణ సాధకః ॥55॥

తావద్దూరం న కర్తవ్యం న యావచ్చందనం క్షిపేత్ ।
తందులైస్సుందరైస్తత్ర పూజయేచ్ఛంకరం ముదా ॥56॥

కుశాపామార్గకర్పూరజాతిచంపకపాటలైః ।
కరవీరైస్సితైశ్చైవ మల్లికాకమలోత్పలైః ॥57॥

అపూర్వపుష్పైర్వివిధైశ్చందనాద్యైస్తథైవ చ ।
జలేన జలాధారాం చ కల్పయేత్పరమేశ్వరే ॥58॥

పాత్రైశ్చ వివిధైర్దేవం స్నాపయేచ్చ మహేశ్వరమ్ ।
మంత్రపూర్వం ప్రకర్తవ్యా పూజా సర్వఫలప్రదా ॥59॥

పవిత్రకలశాలలో మంత్రాలతో నింపాలి. సాధకుడు ఆ నీటిని తెల్లని వస్త్రంతో వడగట్టి శుద్ధి చేసి శివునికి చందనాన్ని అర్పించే దాకా ఆ నీటిని దూరం చేయకూడదు. అపుడు శంకరుని ఆనందంగా చక్కని అక్షతలతో పూజించాలి. దర్భలు, ఉత్తరేణి పువ్వులు, తెల్లని మల్లెలు, ముద్ద సంపెంగలు, పాటలీ పువ్వులు, తెల్లగన్నేరు పువ్వులు, మల్లెలు, పద్మాలు, కలువలు, ఇటువంటి వివిధ రకాల పువ్వులతో, చందనాదులతో పూజించాలి. పరమేశ్వరునిపై పడేవిధంగా నీటిధారలు ఏర్పాటు చేయాలి. వివిధ కలశాలలోని నీటితో మహేశ్వరునికి అభిషేకం చేయాలి. మంత్రాలతో చేసే పూజ అన్ని ఫలాలను ఇస్తుంది.

మంత్రాంశ్చ తుభ్యం తాంస్తాత సర్వకామార్థసిద్ధయే ।
ప్రవక్ష్యామి సమాసేన సావధానతయా శృణు ॥60॥

ఓ వత్సా! కోరికలన్నీ తీరేందుకు నీకు ఆ మంత్రాలన్నీ సంగ్రహంగా చెప్తాను. సావధానంగా విను.

పావ్యమానేన మంత్రేణ తథా వాఙ్మయకేన చ ।
రుద్రేణ నీలరుద్రేణ సుశుక్లేన శుభేన చ ॥61॥

హోతారేణ తథా శీర్ష్ణా శుభేనాథర్వణేన చ ।
శాంత్యా వాథ పునశ్శాంత్యాహ్యారుణేనారుణేన చ ॥62॥

అర్థాభీష్టేన సామ్నా చ తథా దేవవ్రతేన చ ॥63॥

రథంతరేణ పురుషేణ సూక్తేన యుక్తేన చ ।
మృత్యుంజయేన మంత్రేణ తథా పంచాక్షరేణ చ ॥64॥

జలధారాస్సహస్రేణ శతేనైకోత్తరేణ వా ।
కర్తవ్యా వేదమార్గేణ నామభిర్వాథ వా పునః ॥65॥

పవమానసూత్రం, వాజ్మే ఇటువంటి మంత్రం, రుద్ర, నీలరుద్రమంత్రాలు, శుక్లయజుర్వేదమంత్రాలు శుభకరములైన ఋగ్వేదమంత్రాలు మరియు అధర్వశీర్షమంత్రాలు, వివిధశాఖలలోని శాంతి మంత్రాలు, అరుణమంత్రాలు, భేరుండమంత్రాలు అర్థాభీష్ట సామమంత్రాలు, దేవవ్రత సామమంత్రాలు రథంతర సామ, పురుషసూక్తం, మృత్యుంజయమంత్రం, పంచాక్షరి, ఇటువంటి మంత్రాలతో, వేయి జలధారలతో, లేదా నూటొక్క నీటి ధారలతో వేదంలో చెప్పబడినట్టు అభిషేకించాలి. నామాలతో కూడా పూజించవచ్చు.

తతశ్చందనపుష్పాది రోపణీయం శివోపరి ।
దాపయేత్ప్రణవేనైవ ముఖవాసాదికం తథా ॥66॥

తర్వాత చందనం, పువ్వులు, తాంబూలం మొదలైన వాటిని శివునికి ఓంకారంతో సమర్పించాలి.

తతః స్ఫటికసంకాశం దేవం నిష్కలమక్షయమ్ ।
కారణం సర్వలోకానాం సర్వలోకమయం పరమ్ ॥67॥

బ్రహ్మేంద్రోపేంద్రవిష్ణ్వాద్యైరపి దేవైరగోచరమ్ ।
వేదవిద్భిర్హి వేదాంతే త్వగోచరమితి స్మృతమ్ ॥68॥

ఆదిమధ్యాంతరరహితం భేషజం సర్వరోగిణామ్ ।
శివతత్వమితి ఖ్యాతం శివలింగే వ్యవస్థితమ్ ॥69॥

ప్రణవేనైవ మంత్రేణ పూజయేల్లింగమూర్ధని ।
ధూపైర్దీపైశ్చ నైవేద్యైస్తాంబూలైస్సుందరైస్తథా ॥70॥

నీరాజనేన రమ్యేణ యథోక్తవిధినా తతః ।
నమస్కారైస్స్తవైశ్చాన్యైర్మంత్రైర్నానావిధైరపి ॥71॥

అర్ఘ్యం దత్వా తు పుష్పాణి పాదయోస్సువికీర్య చ ।
ప్రణిపత్య చ దేవేశమాత్మనారాధయేచ్ఛివమ్ ॥72॥

తర్వాత, స్ఫటికం వలె తెల్లని వాడు, అంశములు లేని వాడు, సర్వలోకాలకు కారణమైన వాడు, సర్వలోకాలకు స్వరూపమైన వాడు, బ్రహ్మ, ఇంద్రుడు, ఉపేంద్రుడు, విష్ణువు మొదలగు దేవతలకు కూడా గోచరం కాని వాడు, ఉపనిషత్తులలో కూడా గోచరం కాని వాడు అని వేదవేత్తలచేత వర్ణింపబడ్డాడు. మొదలు, మధ్య, చివరలు లేని వాడు, అన్ని రోగాలకు మందు అయినవాడు, సర్వమంగళకరతత్త్వమని ప్రఖ్యాతి పొందిన వాడు, శివలింగంలో ఉండే వాడైన మహాదేవుని లింగమునందు ఓంకారముచే పూజించాలి. ధూప, దీప, నైవేద్యాలతో, అందమైన తాంబూలాలతో మరియు అందమైన నీరాజనంతో యథావిధిగా పూజించి, తర్వాత నమస్కారం చేసి ఇతర మంత్రాలతో స్తుతించి అర్ఘ్యాన్నిచ్చి, పాదాల దగ్గర పువ్వులు చల్లి, సాష్టాంగనమస్కారం చేసి, మనస్సులో దేవదేవుణ్ణి తలచుకోవాలి.

హస్తే గృహీత్వా పుష్పాణి సముత్థాయ కృతాంజలిః ।
ప్రార్థయేత్పునరీశానం మంత్రేణానేన శంకరమ్ ॥73॥

అజ్ఞానాద్యది వా జ్ఞానాజ్జపపూజాదికం మయా ।
కృతం తదస్తు సఫలం కృపయా తవ శంకర ॥74॥

పఠిత్వైవం చ పుష్పాణి శివోపరి ముదా న్యసేత్ ।
స్వస్త్యయనం తతః కృత్వా హ్యాశిషో వివిధాస్తథా ॥75॥

మార్జనం తు తతః కార్యం శివస్యోపరి వై పునః ।
నమస్కారం తతః క్షాంతిం పునరాచమనాయ చ ॥76॥

అఘోచ్చారణముచ్చార్య నమస్కారం ప్రకల్పయేత్ ।
ప్రార్థయేచ్చ పునస్తత్ర సర్వభావసమన్వితః ॥77॥

శివే భక్తిశ్శివే భక్తిశ్శివే భక్తిర్భవే భవే ।
అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ ॥78॥

ఇతి సంప్రార్థ్య దేవేశం సర్వసిద్ధిప్రదాయకమ్ ।
పూజయేత్పరయా భక్త్యా గలనాదైర్విశేషతః ॥79॥

చేతితో పువ్వులు తీసుకొని నిలబడి, దోసిలి పట్టి ఈ క్రింది మంత్రంతో మరలా శంకరుని ప్రార్థించాలి. హే శంకరా! తెలిసి గాని, తెలియక గాని నేను చేసిన పూజలు, జపాలు నీ దయతో సఫలమగు గాక! ఈ విధంగా చదివి, ఆ పువ్వుల్ని ఆనందంతో శివుని మీద చల్లాలి. తర్వాత స్వస్తిమంత్రాలను చదివి వివిధ రకాల ఆశీస్సులు పొందాలి. తర్వాత మళ్లీ శివునివద్ద శుభ్రం చెయ్యాలి. తర్వాత నమస్కారం చేసి, అపరాధక్షమాపణను చెప్పి, మళ్లీ ఆచమనం చేయాలి. అఘోరమంత్రాన్ని చదివి నమస్కారం చెయ్యాలి. మరల పూర్వశ్రద్ధతో కూడి ప్రార్థించాలి. ప్రతిజన్మలోనూ శివునియందు దృఢమైన భక్తి కలగాలి, నాకు మరొక శరణు లేదు, నీవే నాకు శరణు, అన్ని సిద్ధులను ఇచ్చే దేవదేవుని ఈ విధంగా ప్రార్థించి, జయజయ ధ్వానాలు చేస్తూ పరమశ్రద్ధతో పూజించాలి.

నమస్కారం తతః కృత్వా పరివారగణైస్సహ ।
ప్రహర్షమతులం లబ్ధ్వా కార్యం కుర్యాద్యథాసుఖమ్ ॥80॥

ఏవం యః పూజయేన్నిత్యం శివభక్తిపరాయణః ।
తస్య వై సకలా సిద్ధిర్జాయతే తు పదే పదే ॥81॥

వాగ్మీ స జాయతే తస్య మనోభీష్టఫలం ధ్రువమ్ ।
రోగం దుఃఖం చ శోకం చ హ్యుద్వేగం కృత్రిమం తథా ॥82॥

కౌటిల్యం చ గరం చైవ యద్యద్దుఃఖముపస్థితమ్ ।
తద్దుఃఖం నాశయత్యేవ శివః శివకరః పరః ॥83॥

కల్యాణం జాయతే తస్య శుక్లపక్షే యథా శశీ ।
వర్ధతే సద్గుణస్తత్ర ధ్రువం శంకరపూజనాత్ ॥84॥

తర్వాత, కుటుంబసభ్యులతో కలసి నమస్కరించి, గొప్ప ఆనందాన్ని పొంది సుఖంగా మిగిలిన పనులు చేసుకోవాలి. ఈ విధంగా ఎవడైతే శివభక్తితో నిండిన హృదయం కలవాడై నిత్యం పూజిస్తాడో, వానికి అడుగడుగునా అన్ని కార్యాలు సిద్ధిస్తాయి. అతడు గొప్ప వక్త అవుతాడు. అతని మనస్సులో కోరికలన్ని నెరవేరుతాయి. రోగం, శోకం, తాత్కాలికమైన ఉద్వేగం మోసం, విషం ఇలాంటి ఆపదలు ఏమి వచ్చినా, పరమమంగళకరుడైన శివుడు ఆ దుఃఖాలను నిశ్చయంగా నాశనం చేస్తాడు. శంకరుని పూజించే భక్తులకు మంగళాలు కలుగుతాయి. అతని సద్గుణం శుక్లపక్షం నాటి చంద్రుని వలె పెరుగుతుంది.

ఇతి పూజావిధిశ్శంభోః ప్రోక్తస్తే మునిసత్తమ ।
అతః పరం చ శుశ్రూషుః కిం ప్రష్టాసి చ నారద ॥85॥

ఓ మహర్షీ! నారదా! నీకు ఇంతవరకు శివపూజావిధిని చెప్పాను. ఇంకా వినాలని కోరిక ఉంటే ప్రశ్నించవచ్చు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే శివపూజావిధివర్ణనం నామ ఏకాదశోఽధ్యాయః ॥11॥

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితలో సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటి ఖండంలో శివపూజావిధివర్ణనం అనే పదకొండవ అధ్యాయం సమాప్తం.

ద్వాదశోఽధ్యాయః - పన్నెండవ అధ్యాయం

సార, అసార వస్తు విచారమ్ - సార, అసారవస్తువిచారం

నారద ఉవాచ - నారదుడు ఇలా పలికాడు.

బ్రహ్మన్ ప్రజాపతే తాత ధన్యస్త్వం శివసక్తధీః ।
ఏతదేవ పునస్సమ్యగ్ బ్రూహి మే విస్తరాద్విధే ॥1॥

ఓ ప్రజాపతీ! తండ్రీ! శివునియందు లగ్నమైన మనసున్న నీవు ధన్యుడవు. హే బ్రహ్మన్! ఈ విషయాన్ని మరలా వివరంగా చెప్పు.

బ్రహ్మోవాచ - బ్రహ్మ ఇలా చెప్పాడు.

ఏకస్మిన్ సమయే తాత ఋషీనాహూయ సర్వతః ।
నిర్జరాంశ్చాఽవదం ప్రీత్యా సువచః పద్మసంభవః ॥2॥

యది నిత్యసుఖే శ్రద్ధా యది సిద్ధేశ్చ కాముకాః ।
ఆగంతవ్యం మయా సార్ధం తీరం క్షీరపయోనిధేః ॥3॥

ఇత్యేతద్వచనం శ్రుత్వా గతాస్తే హి మయా సహ ।
యత్రాస్తే భగవాన్ విష్ణుస్సర్వేషాం హితకారకః ॥4॥

తత్ర గత్వా జగన్నాథం దేవదేవం జనార్దనమ్ ।
ఉపతస్థుస్సురా నత్వా సుకృతాంజలయోః మునే ॥5॥

తాన్ దృష్ట్వా చ తదా విష్ణుర్బ్రహ్మాద్యానమరాన్ స్థితాన్ ।
స్మరన్ శివపదాంభోజమబ్రవీత్పరమం వచః ॥6॥

వత్సా! ఒకప్పుడు పద్మసంభవుడనైన నేను అన్నిచోట్ల నుండి ఋషులను దేవతలను ఆహ్వానించి వారితో ప్రేమగా ఇలా అన్నాను. మీకు శాశ్వతసుఖము పట్ల శ్రద్ధ, మోక్షం గురించిన ఇష్టం ఉంటే నాతో పాలసముద్రానికి రండి. ఈ నా మాటలు విని వారు నాతో బయలుదేరారు. అందరికి హితాన్ని ఇచ్చే విష్ణుభగవానుడున్న చోటుకి వెళ్లాము. ఓ మహర్షీ! అక్కడికి వెళ్లి దేవదేవుడైన జనార్దనుని నమస్కరించి, దోసిలి యొగ్గి దేవతలు దగ్గరకు వెళ్లారు. అపుడు విష్ణువు బ్రహ్మాది దేవతలను చూసి, శివుని పాదాలను స్మరించి, ఈ విధంగా చెప్పాడు.

విష్ణురువాచ - విష్ణువు ఇలా పలికాడు.

కిమర్థమాగతా యూయం బ్రహ్మాద్యాశ్చ సురర్షయః ।
సర్వం వదత తత్ప్రీత్యా కిం కార్యం విద్యతేఽధునా ॥7॥

దేవశ్రేష్ఠులైన మీరు బ్రహ్మతో కలిసి ఇక్కడికి రావటానికి గల కారణాన్ని పూర్తిగా చెప్పండి. నేను ఇపుడు చేయవలసిన పని ఏది?

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇలా అన్నాడు.

ఇతి పృష్టాస్సదా తేన విష్ణునా చ మయా సురాః ।
పునః ప్రణమ్య తం ప్రీత్యా కిం కార్యం విద్యతేఽధునా ॥
వినివేదయితుం కార్యం హ్యబ్రువన్వచనం శుభమ్ ॥8॥

విష్ణువు ఇలా ప్రశ్నించగా, దేవతలు కూడా నాతో కలిసి నమస్కారం చేసి, తాము కోరుకున్న కార్యాన్ని చెప్పటానికి ఈ విధంగా అడిగారు.

దేవా ఊచుః – దేవతలు ఇలా అన్నారు.

నిత్యం సేవా తు కస్యైవ కార్యా దుఃఖాపహారిణీ ॥9॥

ఇత్యేతద్వచనం శ్రుత్వా భగవాన్ భక్తవత్సలః ।
సామరస్య మమ ప్రీత్యా కృపయా వాక్యమబ్రవీత్ ॥10॥

నిత్యం ఎవర్ని సేవిస్తే దుఃఖాలు తొలగిపోతాయి? భక్తవత్సలుడైన విష్ణువు ఈ మాటను విని దేవతలలో ఉన్న నాతో ప్రేమగా ఇలా అన్నాడు.

శ్రీ భగవానువాచ – శ్రీ భగవానుడు ఇలా అన్నాడు.

బ్రహ్మన్ శృణు సురైస్సమ్యక్ శ్రుతం చ భవతా పురా ।
తథాపి కథ్యతే తుభ్యం దేవేభ్యశ్చ తథా పునః ॥11॥

ఓ బ్రహ్మా! విను. పూర్వం నీవు, దేవతలు పూర్తిగా విని ఉన్నారు. అయినా నీకు, దేవతలకు మరలా చెప్తున్నాను.

దృష్టం చ దృశ్యతేఽద్యైవ కిం పునః పృచ్ఛ్యతేఽధునా ।
బ్రహ్మన్ దేవైస్సమస్తైశ్చ బహుధా కార్యతత్పరైః ॥12॥

సేవ్యస్సేవ్యస్సదా దేవశ్శంకరస్సర్వదుఃఖహా ।
మమాపి కథితం తేన బ్రహ్మణోఽపి విశేషతః ॥13॥

దీనిని ఇది వరకు మీరు చూశారు. ఇపుడు చూస్తున్నారు. మరల ఇపుడు మళ్ళీ ఎందుకు అడుగుతున్నారు. ఓ బ్రహ్మా! వివిధ పనులలో నిమగ్నమైన దేవతలందరూ ఎల్లపుడు అన్ని దుఃఖాలను పోగొట్టే శంకరదేవుని సేవించాలి. ఈ విషయాన్ని ఆయన నాకు, బ్రహ్మకు ప్రత్యేకంగా చెప్పారు.

ప్రస్తుతం చైవ దృష్టం వస్సర్వం దృష్టాంతమద్భుతమ్ ।
త్యాజ్యం తదర్చనం నైవం కదాపి సుఖమీప్సుభిః ॥14॥

అద్భుతమైన లింగావిర్భావాన్ని మీరు చూసే ఉన్నారు. మీరు సుఖాన్ని కోరుకునే వారైతే శివార్చనను ఏనాడూ విడిచి పెట్టవద్దు.

సంత్యజ్య దేవదేవేశం లింగమూర్తిం మహేశ్వరమ్ ।
దారాపుత్రైస్తథైవైతే నష్టాస్తేఽపి సబాంధవాః ॥15॥

దేవదేవుడైన మహేశ్వరుని, లింగమూర్తిని విడిచిన వాళ్లు భార్య, పిల్లలు మరియు బంధువులతో కూడి వినాశమును పొందుతారు.

మయా చ మోహితాస్తే వై మాయయా దూరతః కృతాః ।
సర్వే వినష్టాః ప్రధ్వస్తాశ్శివేన రహితా యదా ॥16॥

వారిని నేను మాయ చేత మోహింప చేసి, నాకు దూరమయ్యేలా చేస్తాను. శివుని విడిచి పెట్టిన వారందరూ అన్నింటినీ పోగొట్టుకొని వినాశనాన్ని పొందుతారు.

తస్మాత్సదా పూజనీయో లింగమూర్తిధరో హరః ।
సేవనీయో విశేషేణ శ్రద్ధయా దేవసత్తమః ॥17॥

కావున లింగాకారం ధరించిన శివుణ్ణి ఎల్లపుడూ పూజించాలి. దేవోత్తముడైన శివుణ్ణి ప్రత్యేకశ్రద్ధతో సేవించాలి.

శర్వలింగార్చనాదేవ దేవా దైత్యాశ్చ సత్తమాః ।
అహం త్వం చ తథా బ్రహ్మన్ కథం తద్విస్మృతం త్వయా ॥18॥

లింగార్చన వల్లనే దేవతలు, రాక్షసులు, నేను మరియు నీవు గొప్పవాళ్లం అయ్యాం. బ్రహ్మా! నువ్వు ఈ విషయాన్ని ఎలా మరచిపోయావు?

తల్లింగమర్చయేన్నిత్యం యేన కేనాపి హేతునా ।
తస్మాద్బ్రహ్మన్ సురశ్శర్వస్సర్వకామఫలేప్సయా ॥19॥

ఓ బ్రహ్మా! దేవతలారా! కారణమేదైనా కోరికలన్ని తీరటానికి నిత్యం శివలింగాన్ని అర్చించాలి.

సా హానిస్తన్మహాఛిద్రం సాంధతా సా చ ముగ్ధతా ।
యన్ముహూర్తం క్షణం వాపి శివం నైవ సమర్చయేత్ ॥20॥

ముహూర్తకాలం కాని, క్షణకాలం కాని శివుని అర్చించక పోతే, అది హానిని కలిగిస్తుంది. అది మహాదోషం. అది అజ్ఞానం. అది మోహం.

భవభక్తిపరా యే చ భవప్రణతచేతసః ।
భవసంస్మరణా యే చ న తే దుఃఖస్య భాజనాః ॥21॥

భవనాని మనోజ్ఞాని మనోజ్ఞాభరణాః స్త్రియః ।
ధనం చ తుష్టిపర్యంతం పుత్రపౌత్రాదిసంతతిః ॥22॥

ఆరోగ్యం చ శరీరం చ ప్రతిష్ఠాం చాప్యలౌకికీమ్ ।
యే వాంఛంతి మహాభాగాస్సుఖం వా త్రిదశాలయమ్ ॥23॥

అంతే ముక్తిఫలం చైవం భక్తిం వా పరమేశితుః ।
పూర్వపుణ్యాతిరేకేణ తేఽర్చయంతి సదాశివమ్ ॥24॥

శివునియందు దృఢభక్తి కలవాళ్లు, శివునికి మనసారా నమస్కారం చేసేవాళ్లు, మరియు శివుణ్ణి స్మరించేవారు దుఃఖాన్ని పొందరు. అందమైన భవనాలు, సుందరమైన ఆభరణాలను, స్త్రీలను, చాలు అనేంతటి ధనాన్ని, పుత్రులు, మనుమలు మొదలైన సంతానాన్ని, ఆరోగ్యాన్ని, దృఢమైన శరీరాన్ని, దివ్యమైన కీర్తిని, స్వర్గలోకసుఖాన్ని చివరలో ముక్తిని, లేదా పరమేశ్వరునియందు భక్తి కోరే పుణ్యాత్ములు గొప్పదైన పూర్వపుణ్యప్రభావంతో సదాశివుణ్ణి అర్చిస్తారు.

యోఽర్చయేచ్ఛివలింగం వై నిత్యం భక్తిపరాయణః ।
తస్య వై సఫలాసిద్ధిర్న స పాపైః ప్రయుజ్యతే ॥25॥

నిత్యం శివలింగాన్ని ఎల్లప్పుడూ అర్చించే మానవుడు సకలసిద్ధులు పొందుతాడు. పాపాలు అతని దగ్గరకు రావు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇట్లు పలికాడు.

ఇత్యుక్తాశ్చ తదా దేవాః ప్రణిపత్య హరిం స్వయమ్ ।
లింగాని ప్రార్థయామాసుస్సర్వకామాప్తయే నృణామ్ ॥26॥

విష్ణువు ఈ విధంగా చెప్పగానే దేవతలు ఆయనకు నమస్కరించి, మానవుల అన్ని కోరికలు తీరటం కోసం లింగాలను ప్రార్థించారు.

తచ్ఛ్రుత్వా చ తదా విష్ణుర్విశ్వకర్మాణమబ్రవీత్ ।
అహం చ మునిశార్దూల జీవోద్ధారపరాయణః ॥27॥

ఓ మునిశ్రేష్ఠా! ఆ మాటలను విని జీవులను ఉద్ధరించటమే గొప్ప లక్ష్యంగా పెట్టుకున్న విష్ణువు మరియు నేను విశ్వకర్మతో ఇలా అన్నాం.

విశ్వకర్మన్ యథా శంభోః కల్పయిత్వా శుభాని చ ।
లింగాని సర్వదేవేభ్యో దేయాని వచనాన్మమ ॥28॥

ఓ విశ్వకర్మా! నా శాసనంచే శంభుని మంగళకరములైన లింగాలను తయారు చేసి దేవతలందరికి ఇవ్వాలి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇట్లు పలికాడు.

లింగాని కల్పయిత్వైవమధికారానురూపతః ।
విశ్వకర్మా దదౌ తేభ్యో నియోగాన్మమ వా హరేః ॥ 29॥

విశ్వకర్మ నా ఆజ్ఞతో, లేదా విష్ణువు ఆజ్ఞతో అధికారానికి తగినట్లు లింగాలను తయారు చేసి వారికిచ్చాడు.

తదేవ కథయామ్యద్య శ్రూయతామృషిసత్తమ ।
పద్మరాగమయం శక్రో హేమవిశ్రవసస్సుతః ॥30॥

పీతం మణిమయం ధర్మో వరుణశ్శ్యామలం శివమ్ ।
ఇంద్రనీలమయం విష్ణుర్బ్రహ్మా హేమమయం తథా ॥31॥

విశ్వేదేవాస్తథా రౌప్యం వసవశ్చ తథైవ చ ।
ఆరకూటమయం వాపి పార్థివం హ్యశ్వినౌ మునే ॥32॥

లక్ష్మీశ్చ స్ఫాటికం దేవీ హ్యాదిత్యాస్తామ్రనిర్మితమ్ ।
మౌక్తికం సోమరాజో వై వజ్రలింగం విభావసుః ॥ 33॥

మృణ్మయం చైవ విప్రేంద్రా విప్రపత్న్యస్తథైవ చ ।
చాందనం చ మయో నాగాః ప్రవాలమయమాదరాత్ ॥34॥

నవనీతమయం దేవీ యోగీ భస్మమయం తథా ।
యక్షా దధిమయం లింగం ఛాయా పిష్టమయం తథా ॥35॥

శివలింగం చ బ్రహ్మాణీ రత్నం పూజయతి ధ్రువమ్ ।
పారదం పార్థివం బాణస్సమర్చతి పరేఽపి వా ॥36॥

ఓ మహర్షీ! ఆ వివరాలను చెప్తాను విను. ఇంద్రుడు పద్మరాగలింగాన్ని, కుబేరుడు బంగారు లింగాన్ని, యముడు పచ్చని మణిలింగాన్ని, వరుణుడు శుభకరమైన శ్యామవర్ణం కల లింగాన్ని, విష్ణువు ఇంద్రనీల మాణిక్యాలున్న లింగాన్ని, బ్రహ్మ బంగారు లింగాన్ని, విశ్వదేవతలు వెండి లింగాన్ని, వసువులు ఇత్తడి లింగాన్ని, అశ్వినీ దేవతలు పార్థివలింగాన్ని, లక్ష్మీదేవి స్ఫటికలింగాన్ని, ఆదిత్యులు రాగి లింగాన్ని, చంద్రుడు ముత్యపు లింగాన్ని, అగ్ని వజ్రలింగాన్ని తీసుకున్నారు. బ్రాహ్మణులు మరియు వారి భార్యలు మట్టితో చేసిన లింగాలను, మయుడు చందనలింగాన్ని, నాగులు పగడపు లింగాన్ని, ప్రేమతో తీసుకున్నారు. శచీదేవి వెన్నతో చేసిన లింగాన్ని, యోగులు భస్మలింగాన్ని, యక్షులు పెరుగు లింగాన్ని, ఛాయాదేవి పిండి లింగాన్ని సరస్వతి రత్నలింగాన్ని పూజించారు. బాణుడు, ఇతరులు పార్థివలింగాన్ని, పూజిస్తారు.

ఏవం విధాని లింగాని దత్తాని విశ్వకర్మణా ।
తే పూజయంతి సర్వే వై దేవా ఋషిగణాస్తథా ॥37॥

విశ్వకర్మ ఆ విధంగా నానారకాల లింగాలను ఇవ్వగా అందరు దేవతలు, ఋషులు పూజిస్తున్నారు.

విష్ణుర్దత్వా చ లింగాని దేవేభ్యో హితకామ్యయా ।
పూజావిధిం సమాచష్ట బ్రహ్మణే మే పినాకినః ॥38॥

అందరి కోరికల ప్రకారం విష్ణువు నాకు, దేవతలకు లింగాలనిచ్చి, పినాకపాణి అయిన శివుని పూజా విధానాన్ని తెలియ చేశాడు.

తచ్ఛ్రుత్వా వచనం తస్య బ్రహ్మాహం దేవసత్తమైః ।
ఆగచ్ఛం చ స్వకం ధామ హర్షనిర్భరమానసః ॥39॥

విష్ణువు ఉపదేశం విన్న తర్వాత బ్రహ్మనైన నేను దేవతలతో కూడి ఆనందంతో నా ధామానికి తిరిగి వచ్చాను.

తత్రాగత్య ఋషీన్ సర్వాన్ దేవాంశ్చాహం తథా మునే ।
శివపూజావిధిం సమ్యగబ్రువం సకలేష్టదమ్ ॥40॥

ఓ మహర్షీ! తిరిగి వచ్చిన తర్వాత దేవతలకు, ఋషులకు అందరికి, అన్ని కోరికలు తీర్చే శివపూజావిధానాన్ని వివరించాను.

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇలా చెప్పాడు.

శ్రూయతామృషయస్సర్వే సామరాః ప్రేమతత్పరాః ।
శివపూజావిధిం ప్రీత్యా కథయే భుక్తిముక్తిదమ్ ॥41॥

ఓ ఋషులారా! మీరందరూ ప్రేమ నిండిన హృదయం కలవారై దేవతలతో కలిసి వినండి. భుక్తిని, ముక్తిని ఇచ్చే శివపూజావిధానాన్ని ప్రీతితో చెప్తాను.

మానుషం జన్మ సంప్రాప్యం దుర్లభం సర్వజంతుషు ।
తత్రాపి సత్కులే దేవా దుష్ప్రాప్యం చ మునీశ్వరాః ॥42॥

ఓ మునులారా! దేవతలారా! అన్ని ప్రాణులలో మనుష్యజన్మ దొరకటం చాలా కష్టం. మనుష్యులలో మంచికులంలో పుట్టటం మరింత కష్టమైనది.

అవ్యంగం చైవ విప్రేషు సాచారేషు స పుణ్యతః ।
శివసంతోషహేతోశ్చ కర్మ స్వోక్తం సమాచరేత్ ॥43॥

సదాచారులైన బ్రాహ్మణుని ఇంటిలో పుట్టటం పుణ్యం వల్లనే వస్తుంది. మానవులు తమకు విహితమైన వర్ణాశ్రమధర్మాలను శివుని సంతోషంకొరకు ఆచరించాలి.

యద్యజ్జాతిసముద్దిష్టం తత్తత్కర్మ న లంఘయేత్ ।
యావద్దానస్య సంపత్తిస్తావత్కర్మ సమావహేత్ ॥44॥

ఏ ఏ జాతులకు ఏ ఏ కర్మలు చెప్పారో విహితకర్మలను విడిచిపెట్ట కూడదు. ఉన్న సంపదకు తగినట్లుగా దానం చెయ్యాలి.

కర్మయజ్ఞసహస్రేభ్యస్తపోయజ్ఞో విశిష్యతే ।
తపోయజ్ఞసహస్రేభ్యో జపయజ్ఞో విశిష్యతే ॥45॥

వేయి కర్మయజ్ఞాలకంటే ఒక తపోయజ్ఞం గొప్పది. వేయి తపోయజ్ఞాలకంటే ఒక జపయజ్ఞం గొప్పది.

ధ్యానయజ్ఞాత్పరం నాస్తి ధ్యానం జ్ఞానస్య సాధనమ్ ।
యతస్సమరసం స్వేష్టం యోగీ ధ్యానేన పశ్యతి ॥46॥

ధ్యానం కంటే గొప్ప యజ్ఞం లేదు. ధ్యానం జ్ఞానానికి సాధనం. ఎందుకంటే యోగి ధ్యానంతో తన ఇష్టదైవాన్ని దర్శించి ప్రశాంతతను పొందుతాడు.

ధ్యానయజ్ఞరతస్యాస్య సదా సన్నిహితశ్శివః ।
నాస్తి విజ్ఞానినాం కించిత్ప్రాయశ్చిత్తాది శోధనమ్ ॥47॥

ధ్యాన యజ్ఞ నిష్ఠ కల యోగికి శివుడు ఎపుడూ దగ్గరగా ఉంటాడు. విజ్ఞానులకు శుద్ధి కొరకై ప్రాయశ్చిత్తం వంటి వాటితో పని లేదు.

విశుద్ధా విద్యయా యే చ బ్రహ్మన్! బ్రహ్మవిదో జనాః ।
నాస్తి క్రియా చ తేషాం వై సుఖం దుఃఖం విచారతః ॥48॥

బ్రహ్మవేత్తలకు జ్ఞానమే శుద్ధి కారణం. వారికి కర్మలతో పని లేదు. వారు సుఖ, దుఃఖాలను పరిగణనకు తీసుకోరు.

ధర్మాధర్మౌ జపో హోమో ధ్యానం ధ్యానవిధిస్తథా ।
సర్వదా నిర్వికారాస్తే విద్యయా చ తయామరాః ॥49॥

వారు ధర్మాధర్మాలకు, జపహోమాలకు, ధ్యానానికి, ధ్యానవిధికి అతీతులు. జ్ఞానముచే అమరులు, ముక్తులు.

పరానందకరం లింగం విశుద్ధం శివమక్షరమ్ ।
నిష్కలం సర్వగం జ్ఞేయం యోగినాం హృది సంస్థితమ్ ॥50॥

పరమానందాన్నిచ్చేది, విశుద్ధమైనది, మంగళకరమైనది, నాశనం లేనిది, అన్నింటా వ్యాపించి ఉన్నది అయిన నిరాకారలింగం యోగుల హృదయాలలో ఉంటుందని తెలుసుకోవాలి.

లింగం తు ద్వివిధం ప్రోక్తం బాహ్యమాభ్యంతరం ద్విజాః! ।
బాహ్యం స్థూలం సముద్దిష్టం సూక్ష్మమాభ్యంతరం మతమ్ ॥51॥

ఓ బ్రాహ్మణులారా! బాహ్యం, అంతరం అని లింగం రెండురకాలుగా ఉంది. స్థూలలింగం బాహ్యం. హృదయగుహలో ఉండేది సూక్ష్మం. అనగా ఆంతరలింగం అని చెప్పబడింది.

కర్మయజ్ఞరతా యే చ స్థూలలింగార్చనే రతాః ।
అసతాం భావనార్థాయ సూక్ష్మేణ స్థూలవిగ్రహాః ॥52॥

స్థూలలింగాన్ని అర్చించే వాళ్లు కర్మయజ్ఞపరాయణులు అవుతారు. సూక్ష్మరూపంలో శివునికి ధ్యానం చేయుటకు అశక్తులైన అజ్ఞానులకొఱకు స్థూలవిగ్రహకల్పన చేయబడింది.

ఆధ్యాత్మికం తు యల్లింగం ప్రత్యక్షం యస్య నో భవేత్ ।
స తల్లింగే తథా స్థూలే కల్పయేచ్చ న చాన్యథా ॥53॥

హృదయంలో ఆరాధింపబడే సూక్ష్మలింగం ఎవరకు ప్రత్యక్షం కాదో. ఆ సాధకుడు స్థూలలింగమునందు అర్చన చేస్తూ, ఆంతరలింగధ్యానం చెయ్యాలి.

జ్ఞానినాం సూక్ష్మమమలం భావాత్ప్రత్యక్షమవ్యయమ్ ।
యథా స్థూలమయుక్తానాముత్కృష్టాదౌ ప్రకల్పితమ్ ॥54॥

ఉత్కృష్టమైన ధనంతో నిర్మించబడిన స్థూలలింగం అజ్ఞానులకు ఏ విధంగా కనిపిస్తుందో, అదే విధంగా జ్ఞానులకు దోషం లేని, వినాశం కాని, సూక్ష్మలింగం భావాత్మకంగా కనిపిస్తుంది.

అహో విచారతో నాస్తి హ్యన్యత్తత్త్వార్థవాదినః ।
నిష్కలం సకలం చిత్తే సర్వం శివమయం జగత్ ॥55॥

శివతత్త్వం తెలిసిన జ్ఞానికి భిన్నంగా నిరాకారలింగం గాని, సాకారలింగం కాని లేవు. ఈ రెండూ అతని హృదయంలోనే ఉన్నాయి. విచారించి చూస్తే జగత్తు అంతా శివునితో నిండి వుంది.

ఏవం జ్ఞానవిముక్తానాం నాస్తి దోషవికల్పనా ।
విధిశ్చైవ తథా నాస్తి విహితావిహితే తథా ॥56॥

ఈ విధంగా జ్ఞానముచే జీవన్ముక్తులైన వారికి దోషం యొక్క స్పర్శ కూడా తగలదు. వారికి విధినిషేధాలు వర్తించవు.

యథా జలేషు కమలం సలిలైర్నావలిప్యతే ।
తథా జ్ఞానీ గృహే తిష్ఠన్ కర్మణా నావబధ్యతే ॥57॥

నీటిలో ఉండే కమలం నీటితో తడవదు. అటులనే సంసారంలో ఉన్నప్పటికీ జ్ఞాని కర్మబద్ధుడు కాదు.

ఇతి జ్ఞానం సముత్పన్నం యావన్నైవ నరస్య వై ।
తావచ్చ కర్మణా దేవం శివమారాధయేన్నరః ॥58॥

మానవుడు జ్ఞానం కలిగేంతవరకు శివుని వివిధ రకాల ఉపచారాలతో పూజించాలి.

ప్రత్యయార్థం చ జగతామేకస్థోఽపి దివాకరః ।
ఏకోఽపి బహుధా దృష్టో జలధారాదివస్తుషు ॥59॥

సూర్యుడు ఒక్కడే అయినా, నీరు గల అనేక పాత్రలలో అనేకంగా కనపడతాడు.

దృశ్యతే శ్రూయతే లోకే యద్యత్సదసదాత్మకమ్ ।
తత్తత్సర్వం సురా విత్త పరంబ్రహ్మ శివాత్మకమ్ ॥60॥

ఆ విధంగానే, ఓ దేవతలారా! లోకంలో సద్రూపంగానూ అసద్రపంగానూ వినిబడేవీ, కనబడేవీ అన్నీ పరబ్రహ్మ అయిన శివస్వరూపంగా తెలుసుకోండి.

భేదో జలానాం లోకేऽస్మిన్ ప్రతిభావే విచారతః ।
ఏవమాహుస్తథా చాన్యే సర్వే వేదార్థతత్త్వగాః ॥61॥

నీటిలో అనేకభేదాలు కన్పిస్తాయి కాని, విచారణ చేస్తే అదంతా నీరే. ఆ విధంగానే, జగత్తంతా పరమేశ్వరరూపం అని వేదతత్త్వం తెలిసినవారు చెప్తారు.

హృది సంసారిణః సాక్షాత్సకలః పరమేశ్వరః ।
ఇతి విజ్ఞానయుక్తస్య కిం తస్య ప్రతిమాదిభిః ॥62॥

మానవుని హృదయంలో పరమేశ్వరుడు స్వయంగా సగుణరూపుడై ఉన్నాడు. ఈ దర్శనం చేసుకునే జ్ఞానికి ప్రతిమల (విగ్రహాల) తో పని ఏముంది?

ఇతి విజ్ఞానహీనస్య ప్రతిమాకల్పనా శుభా ।
పదముచ్చైస్సమారోఢుం పుంసో హ్యాలంబనం స్మృతమ్ ॥63॥

కాని ఈ దర్శనం లేనివాడు ప్రతిమను ఏర్పాటు చేసుకోవటం మంచిది. ఉన్నతస్థితిని పొందటం కోసం మానవునకు ఆలంబన కావాలని పెద్దలు చెప్తారు.

ఆలంబనం వినా తస్య పదముచ్చైః సుదుష్కరమ్ ।
నిర్గుణప్రాప్తయే నృణాం ప్రతిమాలంబనం స్మృతమ్ ॥64॥

ఆలంబన లేకుండా ఉన్నతస్థితికి వెళ్లడం చాలా కష్టమైన పని. అలాగే నిర్గుణపరమాత్మను పొందటం కోసం మానవులకు ప్రతిమ ఆలంబనంగా (తోడుగా) చెప్పబడింది.

సగుణాన్నిర్గుణప్రాప్తిర్భవతీతి సునిశ్చితమ్ ।
ఏవం చ సర్వదేవానాం ప్రతిమా ప్రత్యయావహా ॥65॥

సగుణారాధన వలన నిర్గుణబ్రహ్మసాక్షాత్కారం కలుగుతుందని సిద్ధాంతం. శివప్రతిమ లాగే ఇతరదేవతల ప్రతిమలు కూడా హృదయంలో ఈశ్వరాకారవృత్తిని కలిగించి సహాయపడతాయి.

దేవశ్చాయం మహీయాన్వై తస్యార్థే పూజనం త్విదమ్ ।
గంధచందనపుష్పాది కిమర్థం ప్రతిమాం వినా ॥66॥

శివుడు దేవోత్తముడు. ప్రతిమ లేకుండా శివుని పూజ కోసం సిద్ధం చేసుకున్న గంధం, చందనం, పువ్వులకు వినియోగమేముంది?

తావచ్చ ప్రతిమా పూజ్యా యావద్విజ్ఞానసంభవః ।
జ్ఞానాభావే న పూజ్యేత పతనం తస్య నిశ్చితమ్ ॥67॥

జ్ఞానం వచ్చేంత వరకు ప్రతిమను పూజించాలి. జ్ఞానం కలగకుండా పూజను విడనాడితే పతనం నిశ్చయం.

ఏతస్మాత్కారణాద్విప్రాః శ్రూయతాం పరమార్థతః ।
స్వజాత్యుక్తం తు యత్కర్మ కర్తవ్యం తత్ప్రయత్నతః ॥68॥

ఓ విప్రులారా! పరమార్థాన్ని వినండి. ఈ కారణం వల్ల తనకు విహితమైన కర్మను ప్రయత్నపూర్వకంగా చేయాలి.

యత్ర యత్ర యథా భక్తిః కర్తవ్యం పూజనాదికమ్ ।
వినా పూజనదానాది పాతకం న చ దూరతః ॥69॥

మానవుడు భక్తికి అనురూపంగా వివిధ రకాల ప్రతిమలను పూజించాలి. పూజ, దానం మొదలైన కర్మలను విడిచిపెడితే పాపం దూరం కాదు.

యావచ్చ పాతకం దేహే తావత్సిద్ధిర్న జాయతే ।
గతే చ పాతకే తస్య సర్వం చ సఫలం భవేత్ ॥70॥

దేహంలో పాపం ఉన్నంతవరకు సిద్ధి కలగదు. పాపం నశించిన మానవుడికి అన్నీ సఫలం అవుతాయి.

తథా చ మలినే వస్త్రే రంగశ్శుభతరో న హి ।
క్షాలనే హి కృతే శుద్ధే సర్వో రంగః ప్రసజ్జతే ॥71॥

మలినంతో ఉన్న బట్టపై రంగు అందంగా పట్టుకోదు. ఉతికి, శుభ్రం చేసిన బట్టపై రంగు పూర్తిగా పడుతుంది.

తథా చ నిర్మలే దేహే దేవానాం సమ్యగర్చయా ।
జ్ఞానరంగః ప్రజాయేత తదా విజ్ఞానసంభవః ॥72॥

అదే విధంగా, దేవతలను చక్కగా అర్చించుట వలన సాధకునికి దేహం శుద్ధమై జ్ఞానమనే రంగు కలుగుతుంది. అపుడు విశేషమైన జ్ఞానం పుడుతుంది.

విజ్ఞానస్య చ సన్మూలం భక్తిరవ్యభిచారిణీ ।
జ్ఞానస్యాపి చ సన్మూలం భక్తిరేవాభిధీయతే ॥73॥

చలనం లేని మంచి భక్తి విజ్ఞానానికి మూలం. జ్ఞానానికి కూడా మంచి భక్తే మూలమని చెప్పబడింది.

భక్తేర్మూలం హి సత్కర్మ స్వేష్టదేవాదిపూజనమ్ ।
తన్మూలం సద్గురుః ప్రోక్తస్తన్మూలం సంగతిస్సతామ్ ॥74॥

తనకు నచ్చిన దైవాన్ని పూజించటం వంటి మంచి పనులు భక్తికి మూలం కదా! మంచి కర్మలకు మంచి గురువు మూలం. సద్గురువు లభించటానికి సత్సంగం మూలమని చెప్పబడింది.

సంగత్యా గురురాప్యేత గురోర్మంత్రాది పూజనమ్ ।
పూజనాజ్జాయతే భక్తిర్భక్త్యా జ్ఞానం ప్రజాయతే ॥75॥

సత్సంగతితో గురువు లభిస్తాడు. గురువు నుండి మంత్రం, పూజావిధి లభిస్తాయి. పూజ వలన భక్తి, భక్తి వలన జ్ఞానం వస్తాయి.

విజ్ఞానం జాయతే జ్ఞానాత్పరబ్రహ్మప్రకాశకమ్ ।
విజ్ఞానం చ యదా జాతం తదా భేదో నివర్తతే ॥76॥

జ్ఞానం నుండి విజ్ఞానం పుట్టి, విజ్ఞానం పరబ్రహ్మాన్ని ప్రకాశింప చేస్తుంది. విజ్ఞానం పుట్టగానే భేదాలు తొలగి పోతాయి.

భేదే నివృత్తే సకలే ద్వంద్వదుఃఖవిహీనతా ।
ద్వంద్వదుఃఖవిహీనస్తు శివరూపో భవత్యసౌ ॥77॥

అన్ని భేదాలు తొలగి పోతే ద్వంద్వాల (రాగద్వేషాలు) వల్ల కలిగే దుఃఖం దూరమౌతుంది. ద్వంద్వదుఃఖాలు తొలగి పోతే భక్తుడు శివస్వరూపుడు అవుతాడు.

ద్వంద్వాప్రాప్తౌ న జాయేతాం సుఖదుఃఖే విజానతః ।
విహితావిహితే తస్య న స్యాతాం చ సురర్షయః ॥78॥

జ్ఞానానికి ద్వంద్వాలు (రాగద్వేషాలు) ఉండవు. కాబట్టి సుఖదుఃఖాలుండవు. ఓ దేవతలారా! ఋషులారా! జ్ఞానికి విధినిషేధాలు కూడ ఉండవు.

ఈదృశో విరలో లోకే గృహాశ్రమవివర్జితః ।
యది లోకే భవత్యస్మిన్దర్శనాత్పాపహారకః ॥79॥

గృహస్థాశ్రమాన్ని వదిలిన ఇటువంటి వ్యక్తి లోకంలో అరుదుగా ఉంటాడు. ఒకవేళ ఉంటే ఆయనను దర్శిస్తే పాపాలన్నీ పోతాయి.

తీర్థాని శ్లాఘయంతీహ తాదృశం జ్ఞానవిత్తమమ్ ।
దేవాశ్చ మునయస్సర్వే పరబ్రహ్మాత్మకం శివమ్ ॥80॥

అటువంటి జ్ఞాని, శ్రేష్ఠులు పరబ్రహ్మస్వరూపులనీ, శివమూర్తులనీ తీర్థాలు (అధిష్ఠాన దేవతలు), దేవతలు మరియు మునులు అందరూ స్తుతిస్తుంటారు.

తాదృశాని న తీర్థాని న దేవా మృచ్ఛిలామయాః ।
తే పునంత్యురుకాలేన విజ్ఞానీ దర్శనాదపి ॥81॥

తీర్థాలు కాని, మట్టితో రాతితో చేసిన దేవతామూర్తులు కానీ, జ్ఞాని యొక్క దర్శనం పునీతం చేసినట్టు చేయలేవు ఎందుకంటే అవి చిరకాలానికి మానవులను పవిత్రుల్ని చేస్తాయి.

యావద్గృహాశ్రమే తిష్ఠేత్తావదాకారపూజనమ్ ।
కుర్యాచ్ఛ్రేష్ఠస్య సంప్రీత్యా సురేషు ఖలు పంచసు ॥82॥

సాధకుడు గృహస్థాశ్రమంలో ఉన్నంతకాలం అయిదుగురు దేవతలలో శ్రేష్ఠుడైన శివుణ్ణి ప్రీతితో పూజించాలి. మిగిలిన వారిని కూడా పూజించాలి. (బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశాన, సదాశివులు - అయిదుగురు దేవతలు)

అథవా చ శివః పూజ్యో మూలమేకం విశిష్యతే ।
మూలే సిక్తే తథా శాఖాస్తృప్తాస్సంత్యఖిలాస్సురాః ॥83॥

లేదా, శివుని పూజిస్తే చాలును. మూలమే ప్రధానం కదా! ఓ దేవతలారా! మూలమున నీరు పోస్తే అన్ని శాఖలు తృప్తి చెందుతాయి.

శాఖాసు చ సుతృప్తాసు మూలం తృప్తం న కర్హిచిత్ ।
ఏవం సర్వేషు తృప్తేషు సురేషు మునిసత్తమాః ॥84॥

సర్వథా శివతృప్తిర్నో విజ్ఞేయా సూక్ష్మబుద్ధిభిః ।
శివే చ పూజితే దేవాః పూజితాస్సర్వ ఏవ హి ॥85॥

కాని శాఖలకు నీరు పోస్తే మూలం తృప్తి చెందటం అసంభవం. ఇదే తీరున ఓ మునిశ్రేష్ఠులారా! దేవతలందరూ తృప్తిచెందినా శివుడు తృప్తి చెందడని సూక్ష్మబుద్ధి కలవారు తెలుసుకోవాలి. కాని శివుణ్ణి పూజిస్తే దేవతలందర్నీ పూజించినట్లే అవుతుంది.

తస్మాచ్చ పూజయేద్దేవం శంకరం లోకశంకరమ్ ।
సర్వకామఫలావాప్త్యై సర్వభూతహితే రతః ॥86॥

అందువలన సర్వప్రాణుల హితాన్ని కోరే, లోకాలకు మంగళాన్నిచ్చే శంకరదేవుణ్ణి కోరికలన్నీ తీరేందుకు పూజించాలి.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే పూజావిధి వర్ణనే సారాసారవిచారవర్ణనం నామ ద్వాదశోఽధ్యాయః ॥12॥

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహిత సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటిఖండంలో సారాసారవిచారవర్ణనమనే పన్నెండవ అధ్యాయం సమాప్తం.

త్రయోదశోఽధ్యాయః - పదమూడవ అధ్యాయం

శివపూజావర్ణనమ్ - శివపూజావర్ణనం

బ్రహ్మోవాచ - బ్రహ్మ చెప్పాడు.

అతః పరం ప్రవక్ష్యామి పూజావిధిమనుత్తమమ్ ।
శ్రూయతామృషయో దేవాస్సర్వకామసుఖావహమ్ ॥1॥

ఓ ఋషులారా! దేవతలారా! మీకు ఇకపైన అన్నింటికన్నా శ్రేష్ఠం, అన్ని కోరికలను తీర్చే పూజావిధిని చెప్తాను. వినండి.

బ్రాహ్మే ముహూర్తే చోత్థాయ సంస్మరేత్సాంబకం శివమ్ ।
కుర్యాత్తత్ప్రార్థనాం భక్త్యా సాంజలిర్నతమస్తకః ॥2॥

బ్రహ్మముహూర్తములో నిద్రలేచి సాంబసదాశివుణ్ణి స్మరించాలి. తలవంచి, అంజలి యొగ్గి ఆయనను భక్తితో ప్రార్థించాలి.

ఉత్తిష్ఠోత్తిష్ఠ దేవేశ ఉత్తిష్ఠ హృదయేశయ ।
ఉత్తిష్ఠ త్వముమాస్వామిన్ బ్రహ్మాండే మంగలం కురు ॥3॥

ఓ దేవదేవా! లెమ్ము! హృదయమునందున్నవాడా లే. ఉమాపతే! నీవు లే. జగత్తుకు శుభాలను కలుగచేయుము.

జానామి ధర్మం న చ మే ప్రవృత్తిః జానామ్యధర్మం న చ మే నివృత్తిః ।
త్వయా మహాదేవ హృదిస్థితేన యథా నియుక్తోఽస్మి తథా కరోమి ॥4॥

నేను ధర్మాన్ని తెలిసి వుండి కూడా ఆచరించలేకున్నాను. అధర్మాన్ని తెలిసి కూడా పరిహరించలేకపోతున్నా. హృదయంలో ఉన్న నువ్వు ఎలా ఆజ్ఞాపిస్తే అలాగే చేస్తున్నాను.

ఇత్యుక్త్వా వచనం భక్త్యా స్మృత్వా చ గురుపాదకే ।
బహిర్గచ్ఛేద్దక్షిణాశాం త్యాగార్థం మలమూత్రయోః ॥5॥

ఈ విధంగా భక్తితో స్తోత్రం చేసి, గురుపాదాలను స్మరించి, మలమూత్రవిసర్జన కొరకు దక్షిణంవైపుకు వెళ్లాలి.

దేహశుద్ధిం తతః కృత్వా స మృజ్జలవిశోధనైః ।
హస్తౌ పాదౌ చ ప్రక్షాల్య దంతధావనమాచరేత్ ॥6॥

తరువాత మట్టితో మరియు నీళ్లతో శరీరాన్ని శుద్ధి చేసుకొని, చేతులు, కాళ్లు కడుక్కొని, పళ్ళు తోముకోవాలి.

దివానాథే త్వనుదితే కృత్వా వై దంతధావనమ్ ।
ముఖం షోడశవారం తు ప్రక్షాల్యాంజలిభిస్తథా ॥7॥

సూర్యుడు ఉదయించక ముందే పళ్లు తోముకొని, దోసిలిలోని నీళ్లతో పదహారు సార్లు కడుక్కోవాలి.

షష్ఠ్యాద్యామాశ్చ తిథయో నవమ్యర్కదినే తథా ।
వర్జ్యాస్సురర్షయో యత్నాద్భక్తేన రదధావనే ॥8॥

ఓ దేవతలారా! ఋషులారా! షష్ఠి, పాడ్యమి, అమావాస్య, నవమి అనే తిథుల నాడు, ఆదివారం రోజున భక్తుడు పుల్లతో పళ్లు తోముకోవడం, కష్టపడైనా విడిచిపెట్టాలి.

యథావకాశం సుస్నాయాన్నద్యాదిష్వథవా గృహే ।
దేశకాలావిరుద్ధం చ స్నానం కార్యం నరేణ చ ॥9॥

అవకాశాన్నిబట్టి నది, సరస్సు లేదా ఇంట్లో గాని చక్కగా స్నానం చేయాలి. మానవుడు దేశకాలాలకు ఇబ్బంది లేకుండా స్నానం చేయాలి.

రవేర్దినే తథా శ్రాద్ధే సంక్రాంతౌ గ్రహణే తథా ।
మహాదానే తథా తీర్థే హ్యుపవాసదినే తథా ॥10॥

అశౌచేప్యథవా ప్రాప్తే న స్నాయాదుష్ణవారిణా ।
యథా సాభిముఖం స్నాయాత్తీర్థాదౌ భక్తిమాన్నరః ॥11॥

ఆదివారం నాడు, శ్రాద్ధదినం రోజున, సంక్రాంతియందు, గ్రహణం రోజున, శివరాత్రి నాడు, పుణ్యక్షేత్రంలో, ఉపవాసం ఉన్నరోజున మరియు అశౌచం (మైల) వచ్చినపుడు, వేడినీళ్లతో స్నానం చేయకూడదు. భక్తితో మానవుడు ప్రవాహానికి ఎదురుగా స్నానం చేయాలి.

తైలాభ్యంగం చ కుర్వీత వారాన్ దృష్ట్వా క్రమేణ చ ।
నిత్యమభ్యంగకే చైవ వాసితం వా న దూషితమ్ ॥12॥

వారాలలోని గుణదోషాలను తెలుసుకొని, నూనెతో అభ్యంగన స్నానం చేయాలి. నిత్యం అభ్యంగన స్నానం చేసే వారు నూనెను వాడటంలో దోషం లేదు. సుగంధద్రవ్యాలు కలిపిన నూనెలను వాడడంలో దోషం లేదు.

శ్రాద్ధే చ గ్రహణే చైవోపవాసే ప్రతిపద్దినే ।
అథవా సార్షపం తైలం న దుష్యేద్గ్రహణం వినా ॥13॥

శ్రాద్ధదినం రోజున, గ్రహణకాలాన్ని విడచిపెట్టి, ఉపవాసం రోజున మరియు పాడ్యమి నాడు ఆవాల నూనెను వాడుట దోషం కాదు.

దేశం కాలం విచార్యైవం స్నానం కుర్యాద్యథావిధి ।
ఉత్తరాభిముఖశ్చైవ ప్రాఙ్ముఖోఽప్యథవా పునః ॥14॥

ఈ విధంగా దేశ, కాల పరిస్థితులను చూసుకొని, తూర్పు లేదా ఉత్తర ముఖంగా స్నానం చేయాలి.

ఉచ్ఛిష్టేనైవ వస్త్రేణ న స్నాయాత్స కదాచన ।
శుద్ధవస్త్రేణ స స్నాయాత్తద్దేవ స్మరపూర్వకమ్ ॥15॥

కట్టి విడిచిన వస్త్రంతో ఎపుడూ స్నానం చేయరాదు. శుద్ధవస్త్రాన్ని ధరించి, పరమేశ్వరుని స్మరిస్తూ స్నానం చేయాలి.

పరిధార్యం చ నోచ్ఛిష్టం రాత్రౌ చ విధృతం చ యత్ ।
తేన స్నానం తథా కార్యం క్షాలితం చ పరిత్యజేత్ ॥16॥

ధరించే వస్త్రం ఉచ్ఛిష్టము కాకూడదు. రాత్రి కట్టి విడిచిన వస్త్రం ఉచ్ఛిష్టం అలాంటి వస్త్రాలను స్నానానికి ఉపయోగించి ఉతకడానికి విడిచిపెట్టాలి.

తర్పణం చ తతః కార్యం దేవర్షిపితృతృప్తిదమ్ ।
ధౌతవస్త్రం తతో ధార్యం పునరాచమనం చరేత్ ॥ 17॥

స్నానం చేసిన తర్వాత దేవతలకు, ఋషులకు, పితరులకు తర్పణాలను ఇచ్చి తృప్తిని కలిగించాలి. తర్వాత ఉతికిన వస్త్రాలను కట్టుకొని మరలా ఆచమనం చేయాలి.

శుచౌ దేశే తతో గత్వా గోమయాద్యుపమార్జితే ।
ఆసనం చ శుభం తత్ర రచనీయం ద్విజోత్తమాః ॥18॥

తర్వాత శుభ్రమైన ఆవుపేడతో అలికిన స్థానాన్ని చేరుకొని, ఓ విప్రులారా! అక్కడ శుభమైన ఆసనం ఏర్పాటు చేసుకోవాలి.

శుద్ధకాష్ఠసముత్పన్నం పూర్ణం స్తరితమేవ వా ।
చిత్రాసనం తథా కుర్యాత్సర్వకామఫలప్రదమ్ ॥19॥

చక్కని చెక్కతో చేసిన పీటపై కోరికలు తీరే విధంగా చిత్రాసనాన్ని ఏర్పాటు చేసుకోవాలి.

యథాయోగ్యం పునర్గ్రాహ్యం మృగచర్మాదికం చ యత్ ।
తత్రోపవిశ్య కుర్వీత త్రిపుండ్రం భస్మనా సుధీః ॥20॥

ఆపైన దానిపై మృగచర్మాన్ని ఉంచి, దానిపై కూర్చుండి భస్మంతో త్రిపుండ్రాన్ని పెట్టుకోవాలి.

జపస్తపస్తథా దానం త్రిపుండ్రాత్సఫలం భవేత్ ।
అభావే భస్మనస్తత్ర జలస్యాది ప్రకీర్తితమ్ ॥21॥

త్రిపుండ్రం పెట్టుకొని చేసిన జపం, తపం మరియు దానం సఫలమౌతాయి. భస్మ దొరకకపోతే నీటితో త్రిపుండ్రాలు పెట్టుకోవాలని చెప్పారు.

ఏవం కృత్వా త్రిపుండ్రం చ రుద్రాక్షాన్ధారయేన్నరః ।
సంపాద్య చ స్వకం కర్మ పునరారాధయేచ్ఛివమ్ ॥22॥

ఈ విధంగా సాధకుడు త్రిపుండ్రాన్ని, రుద్రాక్షను ధరించి, అటు తర్వాత నిత్యకర్మను చేసి మరలా శివుణ్ణి ఆరాధించాలి.

పునరాచమనం కృత్వా త్రివారం మంత్రపూర్వకమ్ ।
ఏకం వాథ ప్రకుర్యాచ్చ గంగాబిందురితి బ్రువన్ ॥23॥

అన్నోదకం తథా తత్ర శివపూజార్థమాహరేత్ ।
అన్యద్వస్తు చ యత్కించిద్యథాశక్తి సమీపగమ్ ॥24॥

కృత్వా స్థేయం చ తత్రైవ ధైర్యమాస్థాయ వై పునః ।
అర్ఘ్యపాత్రం తథా చైకం జలగంధాక్షతైర్యుతమ్ ॥25॥

దక్షిణాంసే తథా స్థాప్యముపచారస్య క్లుప్తయే ।
గురోశ్చ స్మరణం కృత్వా తదనుజ్ఞామవాప్య చ ॥26॥

సంకల్పం విధివత్ కృత్వా కామనాం చ నియుజ్య వై ।
పూజయేత్పరయా భక్త్యా శివం సపరివారకమ్ ॥27॥

మరలా మంత్రంతో మూడు సార్లు కాని, ఒకసారి కాని ఆచమనం చేయాలి. తర్వాత శివపూజ కోసం గంగానదిని స్మరించి పూజకు కావలసిన వస్తువులన్ని యథాశక్తి దగ్గర ఉంచుకుని శివపూజకు అన్నోదకాన్ని తీసుకురావాలి. తర్వాత ఆసనంపై స్థిరంగా ధైర్యంతో కూర్చోవాలి. తర్వాత అర్ఘ్యపాత్రను నీళ్లతో నింపి గంధం, అక్షతలతో అలంకరించి కుడివైపున ఉంచి, ఆ నీటితో ఉపచారం చేయాలి. గురువును స్మరించి, వారి అనుమతిని పొంది, యథావిధిగా సంకల్పం చేసి, మనసులోని కోరికలను తెలియ చేస్తూ, గొప్పభక్తితో పరివారంతో కూడిన శివుణ్ణి పూజించాలి.

ముద్రామేకాం ప్రదర్శ్యైవ పూజయేద్విఘ్నహారకమ్ ।
సిందూరాదిపదార్థైశ్చ సిద్ధిబుద్ధిసమన్వితమ్ ॥28॥

ఒక ముద్రను చూపించి, సిద్ధి బుద్ధులతో కూడిన వినాయకుని సిందూరం మొ॥ వాటితో పూజించాలి.

లక్షలాభయుతం తత్ర పూజయిత్వా నమేత్పునః ।
చతుర్థ్యంతైర్నామపదైర్నమోంతైః ప్రణవాదిభిః ॥29॥

లెక్క లేనన్ని లాభాలను ఇచ్చే విఘ్నేశ్వరుని ఓంకారంతో మొదలయ్యే చతుర్థీవిభక్తి కలిగి నమః తో అంతమయ్యే నామాలతో పూజించి మరలా నమస్కారం చేయాలి.

క్షమాప్యైనం తదా దేవం భ్రాత్రా చైవ సమన్వితమ్ ।
పూజయేత్పరయా భక్త్యా నమస్కుర్యాత్పునః పునః ॥30॥

కుమారస్వామితో కూడి ఉన్న వినాయకునికి అపరాధ క్షమాపణను తెలియ చేసి భక్తితో పూజించి, అనేక సార్లు నమస్కారం చేయాలి.

ద్వారపాలం సదా ద్వారి తిష్ఠంతం చ మహోదరమ్ ।
పూజయిత్వా తతః పశ్చాత్పూజయేద్గిరిజాం సతీమ్ ॥31॥

ఎపుడూ ద్వారం దగ్గర నిలబడి ఉన్న ద్వారపాలకుడైన మహోదరుణ్ణి పూజించి, తర్వాత గిరిజాదేవిని పూజించాలి.

చందనైః కుంకుమైశ్చైవ ధూపైర్దీపైరనేకశః ।
నైవేద్యైర్వివిధైశ్చైవ పూజయిత్వా తతశ్శివమ్ ॥32॥

నమస్కృత్య పునస్తత్ర గచ్ఛేచ్చ శివసన్నిధౌ ।
యది గేహే పార్థివీం వా హైమీం వా రాజతీం తథా ॥33॥

ధాతుజన్యాం తథైవాన్యాం పారదాం వా ప్రకల్పయేత్ ।
నమస్కృత్య పునస్తాం చ పూజయేద్భక్తితత్పరః ॥34॥

తర్వాత గంధాలు, కుంకుమలు, ధూపాలు, అనేకదీపాలు మరియు వివిధనైవేద్యాలతో శివుణ్ణి పూజించాలి. మళ్లీ శివునికి నమస్కరించి శివాలయానికి వెళ్లాలి. లేదా ఇంట్లో మట్టితో కాని, బంగారంతో కాని, వెండితో కాని ఇతరధాతువులతో కాని లేదా పాదరసంతో కాని, శివుని ప్రతిమ నిర్మించాలి. ఆ ప్రతిమకు భక్తితో నమస్కరించి మరల పూజించాలి.

తస్యాం తు పూజతాయాం వై సర్వే స్యుః పూజితాస్తదా ।
స్థాపయేచ్చ మృదా లింగం విధాయ విధిపూర్వకమ్ ॥35॥

శివుని ప్రతిమను పూజిస్తే దేవతలందర్ని పూజించినట్లే అవుతుంది. మట్టితో యథావిధిగా లింగాన్ని నిర్మించి స్థాపించాలి.

కర్తవ్యం సర్వథా తత్ర నియమాత్స్వగృహే స్థితైః ।
ప్రాణప్రతిష్ఠాం కుర్వీత భూతశుద్ధిం విధాయ చ ॥36॥

లింగసన్నిధిలో నియమంతో ఇంట్లో లభించే పదార్థాలతో భూతశుద్ధిని చేసి ప్రాణప్రతిష్ఠను చేయాలి.

దిక్పాలాన్పూజయేత్తత్ర స్థాపయిత్వా శివాలయే ।
గృహే శివస్సదా పూజ్యో మూలమంత్రాభియోగతః ॥37॥

శివాలయంలో దిక్పాలకులను స్థాపించి పూజించాలి. ఇంట్లో ప్రతిరోజూ శివుణ్ణి మూలమంత్రంతో ఆరాధించాలి.

తత్ర తు ద్వారపాలానాం నియమో నాస్తి సర్వథా ।
గృహే లింగం చ యత్పూజ్యం తస్మిన్ సర్వం ప్రతిష్ఠితమ్ ॥38॥

ఇంట్లో ద్వారపాలకులను ప్రతిష్ఠించాలనే నియమం లేదు. ఇంట్లో పూజించే లింగాలలో అన్నీ ప్రతిష్ఠితమై ఉంటాయి.

పూజాకాలే చ సాంగం వై పరివారేణ సంయుతమ్ ।
ఆవాహ్య పూజయేద్దేవం నియమోఽత్ర న విద్యతే ॥39॥

పూజాకాలంలో శివుణ్ణి సాంగంగా, సపరివారంగా ఆవాహన చేసి పూజించాలి. ఇంతకు మించి నియమం ఏదీ లేదు.

శివస్య సన్నిధిం కృత్వా స్వాసనం పరికల్పయేత్ ।
ఉదఙ్ముఖస్తదా స్థిత్వా పునరాచమనం చరేత్ ॥40॥

భక్తుడు శివసన్నిధిలో ఆసనం తయారు చేసుకొని, ఉత్తర దిక్కుగా నిలబడి మరలా ఆచమనం చేయాలి.

ప్రక్షాల్య హస్తౌ పశ్చాద్వై ప్రాణాయామం ప్రకల్పయేత్ ।
మూలమంత్రేణ తత్రైవ దశావర్తం నయేన్నరః ॥41॥

తర్వాత చేతులు కడుక్కొని భక్తుడు శివసన్నిధిలో కూర్చుండి, మూలమంత్రంతో పదిసార్లు ప్రాణాయామం చేయాలి.

పంచముద్రాః ప్రకర్తవ్యాః పూజావశ్యం కరేప్సితాః ।
ఏతా ముద్రాః ప్రదర్శ్యైవ చరేత్పూజావిధిం నరః ॥42॥

పూజ సార్థకం అవటానికి 5 కరముద్రలను ప్రదర్శించాలి. దీని తర్వాతనే పూజావిధిని అనుష్ఠించాలి.

దీపం కృత్వా తదా తత్ర నమస్కారం గురోరథ ।
బద్ధ్వా పద్మాసనం తత్ర భద్రాసనమథాపి వా ॥43॥

ఉత్తానాసనకం కృత్వా పర్యంకాసనకం తథా ।
యథా సుఖం తథా స్థిత్వా ప్రయోగం పునరేవ చ ॥44॥

కృత్వా పూజాం పురా జాతాం వట్టకేనైవ తారయేత్ ।
యది వా స్వయమేవేహ గృహే న నియమోఽస్తి చ ॥45॥

తర్వాత అక్కడ దీపం వెలిగించి, గురువుకి నమస్కారం చేసి, పద్మాసనం కాని, భద్రాసనం కాని ఉత్తానాసనం కాని, పర్యంకాసనం కాని వేసి సుఖంగా ఆసనమునందుండి పూజావిధిని అనుష్ఠించాలి. స్వయంభువలింగాన్ని పానవట్టంతో సహా పూజించిన వ్యక్తి ముక్తిని పొందును. ఇలాంటి లింగాన్ని పానవట్టం లేకుండా కూడా పూజించవచ్చు. ఇంటిలో చేసే పూజకు ఈ నియమం లేదు.

పశ్చాచ్చైవార్ఘ్యపాత్రేణ క్షాలయేల్లింగముత్తమమ్ ।
అనన్యమానసో భూత్వా పూజాద్రవ్యం నిధాయ చ ॥46॥

పశ్చాచ్చావాహయేద్దేవం మంత్రేణానేన వై నరః ।
కైలాసశిఖరస్థం చ పార్వతీపతిముత్తమమ్ ॥47॥

యథోక్తరూపిణం శంభుం నిర్గుణం గుణరూపిణమ్ ।
పంచవక్త్రం దశభుజం త్రినేత్రం వృషభధ్వజమ్ ॥48॥

కర్పూరగౌరం దివ్యాంగం చంద్రమౌలిం కపర్దినమ్ ।
వ్యాఘ్రచర్మోత్తరీయం చ గజచర్మాంబరం శుభమ్ ॥49॥

వాసుక్యాదిపరీతాంగం పినాకాద్యాయుధాన్వితమ్ ।
సిద్ధయోఽష్టౌ చ యస్యాగ్రే నృత్యంతీహ నిరంతరమ్ ॥50॥

జయజయేతి శబ్దైశ్చ సేవితం భక్తపూజకైః ।
తేజసా దుస్సహేనైవ దుర్లక్ష్యం దేవసేవితమ్ ॥51॥

శరణ్యం సర్వసత్త్వానాం ప్రసన్నముఖపంకజమ్ ।
వేదైశ్శాస్త్రైర్యథా గీతం విష్ణుబ్రహ్మనుతం సదా ॥52॥

భక్తవత్సలమానందం శివమావాహయామ్యహమ్ ।
ఏవం ధ్యాత్వా శివం సాంబమాసనం పరికల్పయేత్ ॥53॥

తర్వాత ఉత్తమమైన ఆ శివలింగాన్ని, అర్ఘ్యపాత్రతో క్షాళన (శుభ్రం) చేయాలి. మనసును అటు ఇటు మరలనివ్వకుండా, పూజాద్రవ్యాలను సిద్ధం చేసుకొని భక్తుడు ఈ మంత్రంతో శివుణ్ణి ఆవాహన చేయాలి. కైలాస శిఖరమునందు ఉండేవాడు. పార్వతీపతి, దేవోత్తముడు, మంగళాలను ఇచ్చేవాడు, నిర్గుణుడు, గుణరూపంలో తెలియబడే వాడు, అయిదు ముఖాలు, పదిచేతులు, మూడు కన్నులు కల వాడు, వృషభాన్ని ధ్వజమందున్న వాడు, కర్పూరం లాగ తెల్లని వాడు, దివ్యశరీరం కల వాడు, చంద్రుని తలపై ధరించిన వాడు, జటాజూటం కల వాడు, పులిచర్మం ఉత్తరీయంగా కల వాడు, ఏనుగు చర్మాన్ని ధరించిన వాడు, శుభకరుడు, వాసుకి మొదలగు పాములతో చుట్టబడిన శరీరం కల వాడు, పినాకం మొదలగు ఆయుధాలతో కూడిన వాడు, తన ఎదురుగా ఎల్లప్పుడూ నాట్యం చేసే అష్టసిద్ధులు కల వాడు, పూజలు చేసే భక్తులచే జయజయారావాలతో సేవించబడే వాడు, సహింప శక్యం కాని తేజస్సును కలిగి ఉండటం వలన చూడశక్యం కాని వాడు, దేవతలచే సేవింపబడే వాడు అన్ని ప్రాణులకు శరణు పొంద తగిన వాడు, ప్రసన్నమైన ముఖపద్మం కలవాడు, వేదశాస్త్రలతో గానం చేయబడే వాడు విష్ణువు చేత బ్రహ్మచేత కీర్తింపబడేవాడు. భక్తులయందు వాత్సల్యం కల వాడు, ఆనందరూపుడైన శివుణ్ణి నేను ఆవాహన చేస్తున్నాను. ఈ విధంగా సాంబశివుణ్ణి ధ్యానించి ఆసనాన్ని ఏర్పాటు చేయాలి.

చతర్థ్యంతపదేనైవ సర్వం కుర్యాద్యథాక్రమమ్ ।
తతః పాద్యం ప్రదద్యాద్వై తతోఽర్ఘ్యం శంకరాయ చ ॥54॥

ఉపచారాలన్నింటినీ చతుర్థీ విభక్తి పదాలతో వరుసగా చేయాలి. తర్వాత శంకరునికి పాద్యాన్ని, అర్ఘ్యాన్ని ఇవ్వాలి.

తతశ్చాచమనం కృత్వా శంభవే పరమాత్మనే ।
పశ్చాచ్చ పంచభిర్ద్రవ్యైస్స్నాపయేచ్ఛంకరమ్ ముదా ॥55॥

తర్వాత శంభుపరమాత్మకు ఆచమనం ఇచ్చి, తర్వాత శంకరునికి పంచామృతాలతో ఆనందంగా అభిషేకం చేయాలి.

వేదమంత్రైర్యథాయోగ్యం నామభిర్వా సమంత్రకైః ।
చతుర్థ్యంతపదైర్భక్త్యా ద్రవ్యాణ్యేవార్పయేత్తదా ॥56॥

వేదమంత్రాలతో కాని, మంత్రాలతో కూడిన నామాలతో కాని, అభిషేకం చేయాలి. భక్తితో చతుర్థీ విభక్తి పదాలను చదివి, వివిధ ద్రవ్యాలను అర్పించాలి.

తథాభిలషితం ద్రవ్యమర్పయేచ్ఛంకరోపరి ।
తతశ్చ వారుణం స్నానం కరణీయం శివాయ వై ॥57॥

మానవుడు తనకు నచ్చిన ద్రవ్యాలను శివునికి అర్పించాలి. తర్వాత శివునికి శుద్ధోదకస్నానం చేయించాలి.

సుగంధం చందనం దద్యాదన్యలేపాని యత్నతః ।
ససుగంధజలేనైవ జలధారాం ప్రకల్పయేత్ ॥58॥

సువాసనలు గల గంధాన్ని, ఇతరలేపనాలను శ్రద్ధతో అర్పించాలి. సుగంధం గల నీటితో మాత్రమే జలధారలను కల్పించాలి.

వేదమంత్రైః షడంగైర్వా నామభీ రుద్రసంఖ్యయా ।
యథావకాశం తాన్ దత్వా వస్త్రేణ మార్జయేత్తతః ॥59॥

ఆరు అంగాలతో కూడిన వేదమంత్రాలతో కాని, పదకొండు నామాలతో కాని వీలును బట్టి జలధారను అర్పించి, తర్వాత గుడ్డతో తుడవాలి.

పశ్చాదాచమనం దద్యాత్తతో వస్త్రం సమర్పయేత్ ।
తిలాశ్చైవ జవా వాపి గోధూమా ముద్గమాషకాః ॥60॥

అర్పణీయాశ్శివాయైవం మంత్రైర్నానావిధైరపి ।
తతః పుష్పాణి దేయాని పంచాస్యాయ మహాత్మనే ॥61॥

తర్వాత ఆచమనాన్ని, వస్త్రాన్ని సమర్పించాలి. నువ్వులను, యవలను, గోధుమలను, పెసలను, మినుములను అనేకవిధాలైన మంత్రాలతో శివుణ్ణి అర్చించాలి. తర్వాత అయిదు ముఖాల మహాదేవునికి పువ్వులు సమర్పించాలి.

ప్రతివక్త్రం యథా ధ్యానం యథాయోగ్యాభిలాషతః ।
కమలైశ్శతపత్రైశ్చ శంఖపుష్పైః పరైస్తథా ॥62॥

కుశపుష్పైశ్చ ధత్తూరైర్మందారైర్ద్రోణసంభవైః ।
తథా చ తులసీపత్రైర్బిల్వపత్రైర్విశేషతః ॥63॥

పూజయేత్పరయా భక్త్యా శంకరం భక్తవత్సలమ్ ।
సర్వాభావే బిల్వపత్రమర్పణీయం శివాయ వై ॥64॥

యోగ్యతకు, కోరికలకు అనుగుణంగా భక్తుడు అయిదు ముఖాలను ధ్యానించాలి. వందరేకుల కమలాలతో, గొప్పవైన శంఖపుష్పాలతో కుశ, ధత్తూర, మందార, ద్రోణ పువ్వులు, తులసీ ఆకులు మరియు విశేషించి మారేడు ఆకులతో భక్తవత్సలుడైన శంకరుని గొప్పభక్తితో పూజించాలి. ఇతరరకాల పువ్వులు లేకపోయినా మారేడు ఆకులను తప్పక అర్పించాలి.

బిల్వపత్రార్పణేనైవ సర్వపూజా ప్రసిద్ధ్యతి ।
తతస్సుగంధచూర్ణం వై వాసితం తైలముత్తమమ్ ॥65॥

అర్పణీయం చ వివిధం శివాయ పరయా ముదా ।
తతో ధూపః ప్రకర్తవ్యో గుగ్గులా గురుభిర్ముదా ॥66॥

మారేడు ఆకులను అర్పిస్తే అన్ని పువ్వులతో పూజించినట్లే. తర్వాత సుగంధభరితమైన పొడిని, మంచి సుగంధం కల నూనెను శివునికి ఆనందంగా అర్పించాలి. తర్వాత గుగ్గిలంతో, అగరుతో ధూపాన్ని సమర్పించాలి.

దీపో దేయస్తతస్తస్మై శంకరాయ ఘృతప్లుతః ।
అర్ఘ్యం దద్యాత్ పునస్తస్మై మంత్రేణానేన భక్తితః ॥ 67॥

తర్వాత శంకరునికి నేతితో దీపాన్ని పెట్టాలి. మరల ఈ మంత్రాన్ని చదివి భక్తితో అర్ఘ్యం ఇవ్వాలి.

కారయేత్ భావతో భక్త్యా వస్త్రేణ ముఖమార్జనమ్ ।
రూపం దేహి యశో దేహి భోగం దేహి చ శంకర ॥68॥

భక్తి శ్రద్ధలతో శివుని ముఖాన్ని వస్త్రంతో వత్తాలి. హే శంకరా! రూపాన్ని, కీర్తిని, భోగాన్ని ఇవ్వు.

భుక్తిముక్తిఫలం దేహి గృహీత్వార్ఘ్యం నమోస్తు తే ।
తతో దేయం శివాయైవ నైవేద్యం వివిధం శుభమ్ ॥69॥

నీకు నమస్కారం. ఈ అర్ఘ్యాన్ని తీసుకొని భుక్తిని, మోక్షఫలాన్ని ప్రసాదించు. తర్వాత శివుడికి వివిధ శుభపదార్థాలను నైవేద్యంగా పెట్టాలి.

తత ఆచమనం ప్రీత్యా కారయేద్వా విలంబతః ।
తతశ్శివాయ తాంబూలం సాంగోపాంగం విధాయ చ ॥70॥

తర్వాత కొంచెం సేపు ఆగి, శివుడికి ఆచమనం ఇవ్వాలి. తర్వాత వివిధద్రవ్యాలతో కలసిన తాంబూలం సమర్పించాలి.

కుర్యాదారార్తికం పంచవర్తికామనుసంఖ్యయా ।
పాదయోశ్చ చతుర్వారం ద్విఃకృత్వో నాభిమండలే ॥71॥

ఏకకృత్వో ముఖే సప్తకృత్వస్సర్వాంగ ఏవ హి ।
తతో ధ్యానం యథోక్తం వై కృత్వా మంత్రముదీరయేత్ ॥72॥

సంఖ్యానియమాన్ని బట్టి ఐదు వత్తుల హారతిని ఇవ్వాలి. పాదాలకు నాలుగు సార్లు, నాభిప్రాంతంలో రెండు సార్లు, ముఖమందు ఒకసారి, అన్ని అవయవాలయందు ఏడు సార్లు హారతి ఇవ్వాలి. తర్వాత ధ్యానం చేసి మంత్రాన్ని జపించాలి.

యథాసంఖ్యం యథాజ్ఞానం కుర్యాన్మంత్రవిధిం నరః ।
గురూపదిష్టమార్గేణ కృత్వా మంత్రజపం సుధీః ॥73॥

ఉచితమగు సంఖ్య, జ్ఞానము ననుసరించి భక్తుడు మంత్రప్రయోగం చేయాలి. గురువు మంత్రోపదేశం చేసిన విధంగా శాస్త్రసంఖ్యప్రకారం జపించాలి.

స్తోత్రైర్నానావిధైః ప్రీత్యా స్తువీత వృషభధ్వజమ్ ।
తతః ప్రదక్షిణాం కుర్యాచ్ఛివస్య చ శనైశ్శనైః ॥74॥

తర్వాత వృషభధ్వజంలో ఉన్న శివుణ్ణి స్తోత్రాలతో స్తుతించాలి. తర్వాత శివునికి మెల్లగా ప్రదక్షిణ చెయ్యాలి.

నమస్కారాంస్తతః కుర్యాత్సాష్టాంగం విధివత్పుమాన్ ।
తతః పుష్పాంజలిర్దేయో మంత్రేణానేన భక్తితః ॥75॥

తర్వాత భక్తుడు సాష్టాంగనమస్కారం చేయాలి. తర్వాత దేవదేవుడైన శివుడికి భక్తితో ఈ మంత్రాన్ని చదివి పువ్వులతో అంజలి ఇవ్వాలి.

శంకరాయ పరేశాయ శివసంతోషహేతవే ।
అజ్ఞానాద్యది వా జ్ఞానాద్యద్యత్పూజాదికం మయా ॥76॥

కృతం తదస్తు సఫలం కృపయా తవ శంకర ।
తావకస్త్వద్గతప్రాణస్త్వచ్చిత్తోఽహం సదా మృడ ॥77॥

హే శంకరా! నేను తెలిసి గాని, తెలియక కాని, చేసిన పూజలన్నీ నీ దయ వలన సఫలమగు గాక! హే మృడా! నేను నీ వాడను. నా ప్రాణములన్నీ నీ యందే ఉన్నాయి. నేను ఎప్పుడూ నిన్నే స్మరిస్తాను.

ఇతి విజ్ఞాయ గౌరీశ భూతనాథ ప్రసీద మే ।
భూమౌ స్ఖలితపాదానాం భూమిరేవావలంబనమ్ ॥78॥

ఈ విధంగా పార్వతీపతికి విజ్ఞాపన చేయాలి. హే భూతనాథా! నా యందు దయ చూపు. భూమి మీద జారి పడిన వారికి భూమే ఆధారమవుతుంది.

త్వయి జాతాపరాధానాం త్వమేవ శరణం ప్రభో ।
ఇత్యాది బహువిజ్ఞప్తిం కృత్వా సమ్యగ్విధానతః ॥79॥

పుష్పాంజలిం సమర్ప్యైవం పునః కుర్యాన్నతిం ముహుః ।
స్వస్థానం గచ్ఛ దేవేశ పరివారయుతః ప్రభో ॥80॥

పూజాకాలే పునర్నాథ త్వయా గంతవ్యమాదరాత్ ।
ఇతి సంప్రార్థ్య బహుశశ్శంకరమ్ భక్తవత్సలమ్ ॥81॥

విసర్జయేత్స్వహృదయే తదపో మూర్ధ్ని విన్యసేత్ ।
ఇతి ప్రోక్తమశేషేణ మునయశ్శివపూజనమ్ ॥82॥

హే ప్రభో! అదే విధంగా నీ యందు అపరాధం చేసిన వారికి నీవే శరణు. ఈ విధంగా శివుని దగ్గర అనేక విన్నపాలు చెయ్యాలి. ఈ విధంగా పుష్పాంజలినిచ్చి మరల అనేక సార్లు నమస్కరించాలి. హే దేవదేవా! ప్రభో! పరివారంతో కలసి మీ స్వస్థానానికి వెళ్లండి. హే నాథా! పూజాసమయానికి మరలా దయతో విచ్చేయండి. ఈ విధంగా భక్తవత్సలుడు అయిన శంకరుణ్ణి అనేకంగా ప్రార్థించి, తన హృదయంలోనికి తీసుకోవాలి. ఆ నీటిని తలపై చల్లుకోవాలి. ఓ మునులారా! మీకు ఈ విధంగా శివపూజావిశేషాలను ఏమీ మిగల్చకుండా చెప్పాను.

భుక్తిముక్తి ప్రదం చైవ కిమన్యచ్ఛ్రోతుమర్హథ ॥83॥

భుక్తి, ముక్తిని, ఇచ్చే వేటిని ఇంకా మీరు వినగోరుచున్నారు? అని ప్రశ్నించాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే శివపూజావర్ణనం నామ త్రయోదశోఽధ్యాయః ॥13॥

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితం సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటిఖండంలో శివపూజావర్ణనం అనే పదమూడవ అధ్యాయం సమాప్తం.

చతుర్దశోఽధ్యాయః – పద్నాల్గవ అధ్యాయం

శివపూజా – శివపూజ

ఋషయ ఊచుః – ఋషులు ఇలా అడిగారు.

వ్యాసశిష్య మహాభాగ కథయ త్వం ప్రమాణతః ।
కైః పుష్పైః పూజితశ్శంభుః కిం కిం యచ్ఛతి వై ఫలమ్ ॥1॥

ఓ వ్యాసశిష్యా! మహాత్మా! నీవు ప్రమాణపూర్వకంగా చెప్పు. శివుణ్ణి ఏ ఏ పువ్వులతో పూజిస్తే ఏ విధమైన ఫలాలు వస్తాయి?

సూత ఉవాచ – సూతుడు ఇలా చెప్పాడు.

శౌనకాద్యాశ్చ ఋషయశ్శృణుతాదరతోఽఖిలమ్ ।
కథయామ్యద్య సుప్రీత్యా పుష్పార్పణవినిర్ణయమ్ ॥2॥

శౌనకాది ఋషులారా! శ్రద్ధతో వినండి. మీకు ఈ రోజు పుష్పాలను అర్చించటంలో ఉన్న అన్ని నిర్ణయాలను ఇష్టంతో చెప్తాను.

ఏష ఏవ విధిః పృష్టో నారదేన మహర్షిణా ।
ప్రోవాచ పరమప్రీత్యా పుష్పార్పణవినిర్ణయమ్ ॥3॥

పువ్వులతో శివుని అర్చించటంలో ఉన్న భేదవిశేషాన్ని నారదుడు ప్రశ్నించగా బ్రహ్మ ఎంతో ప్రీతితో ఇలా చెప్పాడు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇలా చెప్పాడు.

కమలైర్బిల్వపత్రైశ్చ శతపత్రైస్తథా పునః ।
శంఖపుష్పైస్తథా దేవం లక్ష్మీకామోఽర్చయేచ్ఛివమ్ ॥4॥

సంపదలను కోరే భక్తుడు శివదేవుని కమలాలు, మారేడు ఆకులు, పద్మాలు మరియు శంఖపుష్పాలతో అర్చించాలి.

ఏతైశ్చ లక్షసంఖ్యాకైః పూజితశ్చేద్భవేచ్ఛివః ।
పాపహానిస్తథా విప్ర లక్ష్మీస్స్యాన్నాత్ర సంశయః ॥5॥

ఓ మహర్షీ! లక్ష సంఖ్య గల ఈ పుష్పాలతో శివుణ్ణి అర్చిస్తే పాపాలు పోవటమే కాక సంపదలు కల్గుతాయనటంలో సందేహం లేదు.

వింశతిః కమలానాం తు ప్రస్థమేకముదాహృతమ్ ।
బిల్వే దళసహస్రేణ ప్రస్థార్ధం పరిభాషితమ్ ॥6॥

ఇరవైకమలాలకు ఒక ప్రస్థం అనిపేరు. వేయి బిల్వదళాలకు అర్ధప్రస్థం అని పేరు.

శతపత్రసహస్రేణ ప్రస్థార్ధం పరిభాషితమ్ ।
పలైష్షోడశభిః ప్రస్థః పలం టంకదశః స్మృతః ॥7॥

వేయి పద్మాలు అర్ధప్రస్థమవుతుంది. పదహారు పలాలు ఒక ప్రస్థం పది టంకములు ఒక పలం అని, చెప్పబడింది.

అనేనైవ తు మానేన తులామారోపయేద్యదా ।
సర్వాన్కామానవాప్నోతి నిష్కామశ్చేచ్ఛివో భవేత్ ॥8॥

భక్తుడు ఈ కొలతల ప్రకారం పువ్వులను తూచి శివుడికి అర్పిస్తే, కోరికలన్నీ తీరుతాయి. భక్తుడు కోరికలు లేనివాడైతే శివస్వరూపుడౌతాడు.

రాజ్యస్య కాముకో యో వై పార్థివానాం చ పూజయా ।
తోషయేచ్ఛంకరం దేవం దశకోట్యా మునీశ్వరాః ॥9॥

ఓ మునిశ్రేష్ఠులారా! రాజ్యాన్ని కోరుకునే వాడు పదికోట్ల పువ్వులతో పార్థివలింగాలను పూజించి, శంకరదేవుని సంతోషపెట్టాలి.

లింగం శివం తథా పుష్పమఖండం తండులం తథా ।
చర్చితం చందనేనైవ జలాధారాం తథా పునః ॥10॥

ప్రతిరూపం తథా మంత్రం బిల్వీదలమనుత్తమమ్ ।
అథవా శతపత్రం చ కమలం వా తథా పునః ॥11॥

శంఖపుష్పైస్తథా ప్రోక్తం విశేషేణ పురాతనైః ।
సర్వకామఫలం దివ్యం పరత్రేహాపి సర్వథా ॥12॥

ధూపం దీపం చ నైవేద్యమర్ఘ్యం చారార్తికం తథా ।
ప్రదక్షిణాం నమస్కారం క్షమాపనవిసర్జనే ॥13॥

కృత్వా సాంగం తథా భోజ్యం కృతం యేన భవేదిహ ।
తస్య వై సర్వథా రాజ్యం శంకరః ప్రదదాతి చ ॥14॥

శివలింగానికి పువ్వుతో అలంకరించి అంతులేని బియ్యాన్ని సమర్పించి చందనాన్ని అద్దాలి. నీటి ధారలతో అభిషేకించాలి. మంత్రాలతో, మారేడు దళాలతో శివుణ్ణి పూజించటం ఉత్తమం. నూరురేకుల పద్మాలతో, కమలాలతో శంఖపుష్పాలతో పూజించడం, విశేషమని పూర్వం ఋషులు చెప్పారు. ఇలా పూజించటం వల్ల ఇహలోకమందే గాక పరలోకంలో కూడా కోరికలు తీరుతాయి. ధూపదీపనైవేద్యాలను, అర్ఘ్యాన్ని, హారతిని ఇచ్చి ప్రదక్షిణ

నమస్కారములు చేయాలి. క్షమాపణ చెప్పి వదలి వేయాలి. తర్వాత సంతృప్తికరమైన భోజనం పెట్టాలి. ఇలా చేసే భక్తుడు తప్పకుండా రాజ్యాధికారాన్ని పొందుతాడు.

ప్రాధాన్యకాముకో యో వై తదర్ధేనార్చయేత్పుమాన్ ।
కారాగృహగతో యో వై లక్షేనైవార్చయేద్ధరమ్ ॥15॥

ప్రధానాధికారం కోరే వాడు దీనిలో సగం పూజ చేయాలి. కారాగృహవాసాన్ని పొందినవాడు శివునికి లక్షార్చన చేయాలి.

రోగగ్రస్తో యదా స్యాద్వైతదర్ధేనార్చయేచ్ఛివమ్ ।
కన్యాకామో భవేద్యో వై తదర్ధేన శివం పునః ॥16॥

రోగంతో బాధపడే వాడు దానిలో సగం పూజను, కన్యను కోరే వాడు దానిలో సగం పూజను శివునికి చేయాలి.

విద్యాకామస్తథా యస్స్యాత్తదర్ధేనార్చయేచ్ఛివమ్ ।
వాణీకామో భవేద్యో వై ఘృతేనైవార్చయేచ్ఛివమ్ ॥17॥

విద్యను కోరే వాడు దానిలో సగం పూజను శివుడికి చేయాలి. మధురమైన కంఠధ్వని కోరే వారు నేతితో అభిషేకించాలి.

ఉచ్చాటనార్థం శత్రూణాం తన్మితేనైవ పూజనమ్ ।
మారణే వై తు లక్షేణ మోహనే తు తదర్ధతః ॥18॥

శత్రునాశనం కోరే వాడు ఆ లెక్కతోనే పూజించాలి. శత్రుసంహారం అయితే లక్షార్చన, శత్రువశం కోసం దానిలో సగం పూజను చేయాలి.

సామంతానాం జయే చైవ కోటిపూజా ప్రశస్యతే ।
రాజ్ఞామయుతసంఖ్యం చ వశీకరణకర్మణి ॥19॥

సామంతరాజుల్ని జయించడానికి కోటిపూజ శ్రేష్ఠం! రాజుల్ని వశపరచుకోవడం కోసం పదివేల పుష్పాలతోనూ పూజించాలి.

యశసే చ తథా సంఖ్యా వాహనాద్యైస్సహస్రికా ।
ముక్తికామో ఽర్చయేచ్ఛంభుం పంచకోట్యా సుభక్తితః ॥20॥

కీర్తిని కోరుకునే వాడు అదే పూజను, వాహనాలను కోరు వాడు వేయి పూలతో అర్చించాలి. ముక్తిని కోరే వాడు 5 కోట్ల పువ్వులతో భక్తితో పూజ చేయాలి.

జ్ఞానార్థీ పూజయేత్కోట్యా శంకరమ్ లోకశంకరమ్ ।
శివదర్శనకామో వై తదర్ధేన ప్రపూజయేత్ ॥21॥

జ్ఞానాన్ని కోరుకునే వాడు లోకాలకు మంగళాన్నిచ్చే శంకరునకు కోటి పూలతో పూజను చేయాలి. శివుని దర్శించాలని కోరే వాడు దానిలో సగం పూలతో పూజను చెయ్యాలి.

తథా మృత్యుంజయో జాప్యః కామనాఫలరూపతః ।
పంచలక్షా జపా యర్హి ప్రత్యక్షం తు భవేచ్ఛివః ॥22॥

ఇదే విధంగా మృత్యుంజయమంత్రాన్ని కోరికలను బట్టి జపించాలి. అయిదులక్షలు జపిస్తే శివుడు ప్రత్యక్షమౌతాడు.

లక్షేణ భజతే కశ్చిద్ద్వితీయే జాతిసంభవః ।
తృతీయో కామనాలాభశ్చతుర్థే తం ప్రపశ్యతి ॥23॥

లక్ష జపించగానే భక్తుడు మహాత్ముడై సేవిస్తాడు. రెండులక్షలు జపించగానే పూర్వజన్మస్మృతి కలుగుతుంది. మూడులక్షలు జపించగానే కోరికలు తీరుతాయి. నాలుగవలక్ష పూర్తవగానే శివుడు ప్రత్యక్షమౌతాడు.

పంచమం చ యదా లక్షం ఫలం యచ్ఛత్యసంశయమ్ ।
అనేనైవ తు మంత్రేణ దశలక్షే ఫలం లభేత్ ॥24॥

అయిదు లక్షలు జపించగానే ఫలాన్నిస్తాడనటంలో సందేహం లేదు. ఈ మృత్యుంజయమంత్రాన్ని పదిలక్షలు జపిస్తే మహాఫలం సిద్ధిస్తుంది.

ముక్తికామో భవేద్యో వై దర్భైశ్చ పూజనం చరేత్ ।
లక్షసంఖ్యా తు సర్వత్ర జ్ఞాతవ్యా మునిసత్తమ ॥25॥

ముక్తిని కోరే వాడు దర్భలతో పూజించాలి. ఓ మునిశ్రేష్ఠా! ఈ పూజలన్నింటినీ లక్ష సంఖ్యలో చేయాలని తెలుసుకోండి.

ఆయుః కామో భవేద్యో వై దూర్వాభిః పూజనం చరేత్ ।
పుత్రకామో భవేద్యో వై ధత్తూరకుసుమైశ్చరేత్ ॥26॥

ఆయుర్దాయాన్ని కోరుకునే వాళ్లు దూర్వలతో పూజించాలి. కుమారులను కోరే వారు ఉమ్మెత్తపువ్వులతో పూజించాలి.

రక్తదండశ్చ ధత్తూరః పూజనే శుభదః స్మృతః ।
అగస్త్యకుసుమైశ్చైవ పూజకస్య మహద్యశః ॥27॥

ఎఱ్ఱని కాడలు గల ఉమ్మెత్తపువ్వులతో పూజిస్తే శుభాలు కల్గుతాయని చెప్పబడింది. అగస్త్య (అవిసె) పువ్వులతో పూజించే వారికి గొప్ప కీర్తి లభిస్తుంది.

భుక్తిముక్తిఫలం తస్య తులస్యా పూజయేద్యది ।
అర్కపుష్పైః ప్రతాపశ్చ కుబ్జకల్హారకైస్తథా ॥28॥

తులసితో పూజిస్తే భుక్తి, ముక్తి లభిస్తాయి. జిల్లేడు పువ్వులతో పూజిస్తే భక్తుడికి పరాక్రమం కలుగుతుంది. ఎర్రకలువలు మరియు ఉత్తరేణి పువ్వులతో పూజిస్తే అవే ఫలాలు కల్గుతాయి.

జపాకుసుమపూజా తు శత్రూణాం మృత్యుదా స్మృతా ।
రోగోచ్చాటనకానీహ కరవీరాణి వై క్రమాత్ ॥29॥

ఎర్రగులాబి పూలతో పూజిస్తే, శత్రువుకి మృత్యువు కలుగుతుంది. ఎర్రగన్నేరు పూలతో పూజిస్తే రోగాలు తొలగి పోతాయి.

బంధుకైః భూషణావాప్తిర్జాత్యా వాహోన్న సంశయః ।
అతసీపుష్పకైర్దేవం విష్ణువల్లభతామియాత్ ॥30॥

మంకెనపూలపూజ ఆభరణాల్నిస్తుంది. జాజిపువ్వులతో పూజించే వానికి వాహనములు లభిస్తాయనటంలో సందేహం లేదు. శివుణ్ణి అవిసె పూలతో పూజించే వాడు విష్ణువుకు ప్రియభక్తుడు అవుతాడు.

శమీపత్రైస్తథా ముక్తిః ప్రాప్యతే పురుషేణ చ ।
మల్లికాకుసుమైర్దత్తైస్త్రియం శుభతరాం శివః ॥31॥

జమ్మిపత్రితో పూజించిన భక్తుడు ముక్తిని పొందుతాడు. మల్లెలతో పూజించే భక్తునకు పతివ్రత అయిన భార్యను శివుడు అనుగ్రహిస్తాడు.

యూథికాకుసుమైశ్శస్యైర్గృహం నైవ విముచ్యతే ।
కర్ణికారైస్తథా వస్త్రసంపత్తిర్జాయతే నృణామ్ ॥32॥

అడవి మొల్లపూలు మరియు ధాన్యాలతో పూజించే వానికి నివాసగృహం చేజారి పోదు. కొండగోగుపూలతో పూజించే వారికి వస్త్రములు బాగా లభిస్తాయి.

నిర్గుండీకుసుమైర్లోకే మనో నిర్మలతాం వ్రజేత్ ।
బిల్వపత్రైస్తథా లక్షైస్సర్వాన్కామానవాప్నుయాత్ ॥33॥

లోకంలో వావిలిపూలతో పూజించే వారికి మనస్సు నిర్మలమౌతుంది. లక్షబిల్వార్చన చేస్తే కోరికలన్నీ తీరుతాయి.

శృంగారహారపుష్పైస్తు వర్ధతే సుఖసంపదా ।
ఋతుజాతాని పుష్పాణి ముక్తిదాని న సంశయః ॥34॥

సింధూరపువ్వులతో మరియు మాలతో అర్చించే వానికి సుఖసంపదలు పెరుగుతాయి. ఆయా ఋతువులలో పుష్పించే పూలతో పూజిస్తే ముక్తి వస్తుందనటంలో సందేహం లేదు.

రాజికాకుసుమానీహ శత్రూణాం మృత్యుదాని చ ।
ఏషాం లక్షం శివే దద్యాద్దద్యాచ్చ విపులం ఫలమ్ ॥35॥

ఆవపూలతో పూజిస్తే పూజించిన వాని శత్రువులు మరణిస్తారు. వీటిని ఒకలక్ష శివునికి అర్పిస్తే మహాఫలములను పొందుతాడు.

విద్యతే కుసుమం తన్న యన్నైవ శివవల్లభమ్ ।
చంపకం కేతకం హిత్వా త్వన్యత్సర్వం సమర్పయేత్ ॥36॥

శివునికి ఇష్టం కాని పూవు ఏది లేదు. సంపంగి, మొగలిపూలు విడిచి పెట్టి మిగిలిన పువ్వులన్నింటినీ సమర్పించాలి.

అతః పరం చ ధాన్యానాం పూజనే శంకరస్య చ ।
ప్రమాణం చ ఫలం సర్వం ప్రీత్యా శృణు చ సత్తమ ॥37॥

ఓ మహర్షీ! శంకరుడికి ధాన్యాలతో చేసే పూజాఫలాన్ని, ధాన్యప్రమాణాన్ని వివరంగా ఇపుడు చెప్తాను.

తండులారోపణే నృణాం లక్ష్మీవృద్ధిః ప్రజాయతే ।
అఖండితవిధౌ విప్ర సమ్యగ్భక్త్యా శివోపరి ॥38॥

ఓ బ్రాహ్మణా! మానవులు భక్తితో శివుడిపై నూకలు లేని బియ్యాన్ని పోసి పూజిస్తే సంపదలు అభివృద్ధి చెందుతాయి.

షట్కేనైవ తు ప్రస్థానం తదర్ధేన తథా పునః ।
పలద్వయం తథా లక్షమానేన సముదాహృతమ్ ॥39॥

ఆరు ప్రస్థాలు కాని, దానిలో సగం కాని, రెండు పలములు కాని మరియు లక్ష (ఒక కొలతగా) కాని బియ్యాన్ని పూజించాలి.

పూజాం రుద్రప్రధానేన కృత్వా వస్త్రం సుసుందరమ్ ।
శివోపరి న్యసేత్తత్ర తండులార్పణముత్తమమ్ ॥40॥

ముఖ్యంగా రుద్రాధ్యాయంతో పూజను చేసి, శివునిపై అందమైన వస్త్రాన్ని ఉంచి దానిపై మంచి బియ్యాన్ని అర్పించాలి.

ఉపరి శ్రీఫలం త్వేకం గంధపుష్పాదిభిస్తథా ।
రోపయిత్వా చ ధూపాది కృత్వా పూజాఫలం లభేత్ ॥41॥

దానిపైన గంధం పూవులతో అలంకరింపబడిన మారేడు ఫలాన్ని ఒక దానిని ఉంచి ఉపచారాలు చేస్తే పూజాఫలం లభిస్తుంది.

ప్రాజాపత్యద్వయం రౌప్యమాషసంఖ్యా చ దక్షిణా ।
దేయా తదుపదేష్ట్రే హి శక్త్యా వా దక్షిణా మతా ॥42॥

ఆ బియ్యం మొత్తాన్ని ప్రజాపతికి సంబంధించిన రెండువెండి రూపాయల దక్షిణతో గానీ మాషసంఖ్యలోగానీ ఈ వ్రతాన్ని ఉపదేశించిన వానికి ఇవ్వాలి. దక్షిణ యథాశక్తిగా కూడా ఇవ్వవచ్చు.

ఆదిత్యసంఖ్యయా తత్ర బ్రాహ్మణాన్ భోజయేత్తతః ।
లక్షపూజా తథా జాతా సాంగం చ మంత్రపూర్వకమ్ ॥43॥

తర్వాత పన్నెండుమంది బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. ఇలా చేయటం వల్ల మంత్రపూర్వకంగా పూర్తి లక్షార్చనఫలం వస్తుంది.

శతమష్టోత్తరం తత్ర మంత్రే విధిరుదాహృతః ।
తిలానాం పలం లక్షం మహాపాతకనాశనమ్ ॥44॥

మంత్రాన్ని 108 సార్లు జపించాలని విధి ఉంది. పలము లేక కొలమానం ప్రకారం లక్ష నువ్వులతో ఇదే విధంగా పూజిస్తే మహాపాపాలు తొలగి పోతాయి.

ఏకాదశపలైరేవ లక్షమానముదాహృతమ్ ।
పూర్వవత్పూజనం తత్ర కర్తవ్యం హితకామ్యయా ॥45॥

పదకొండుపలములు ఒకలక్ష అవుతుంది. నువ్వులను శివుడిపై ఉంచి తర్వాత గతంలో చేసిన విధంగా పూజిస్తే భక్తుడు కోరినవి పొందుతాడు.

భోజ్యా వై బ్రాహ్మణాస్తస్మాదత్ర కార్యా నరేణ హి ।
మహాపాతకజం దుఃఖం తత్ క్షణాన్నశ్యతి ధ్రువమ్ ॥46॥

భక్తుడు తర్వాత బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. దీని వలన మహాపాపాల వల్ల వచ్చే దుఃఖం వెంటనే నశించి పోతుంది. ఇది తప్పక జరుగుతుంది.

యవపూజా తథా ప్రోక్తా లక్షేణ పరమా శివే ।
ప్రస్థానామష్టకం చైవ తథా ప్రస్థార్ధకం పునః ॥47॥

పలద్వయయుతం తత్ర మానమేతత్పురాతనమ్ ।
యవపూజా చ మునిభిస్స్వర్గసౌఖ్యవివర్ధినీ ॥48॥

లక్షకొలత కల యవధాన్యాన్ని శివుడికి అర్పించటం చాలా మంచిది. మరియు ఎనిమిదిన్నరప్రస్థాలు రెండుపలాలు యవధాన్యాన్ని అర్పించాలని పూర్వఋషులు ఈ కొలమానం నిర్ణయించారు. ఈ విధంగా యవధాన్యాన్ని సమర్పిస్తే స్వర్గసౌఖ్యాలు వస్తాయని మహర్షులు చెప్పారు.

ప్రాజాపత్యం బ్రాహ్మణానాం కర్తవ్యం చ ఫలేప్సుభిః ।
గోధూమాన్నైస్తథా పూజా ప్రశస్తా శంకరస్య వై ॥49॥

ఫలాలను కోరే భక్తులు ప్రాజాపత్యం చేయాలి. శంకరుని గోధుమలతోను, అన్నంతోను పూజించటం చాలా మంచిది.

సంతతిర్వర్ధతే తస్య యది లక్షావధిః కృతా ।
ద్రోణార్ధేన భవేల్లక్షం విధానం విధిపూర్వకమ్ ॥50॥

లక్షపరిమాణం గల బియ్యాన్ని అర్పిస్తే భక్తునికి సంతానం అభివృద్ధి చెందుతుంది. ద్రోణం అనే పరిమాణంలో సగం లక్ష అవుతుంది.

ముద్గానాం పూజనే దేవశ్శివో యచ్ఛతి వై సుఖమ్ ।
ప్రస్థానాం సప్తకేనైవ ప్రస్థార్ధేనాథ వా పునః ॥51॥

పలద్వయయుతేనైవ లక్షముక్తం పురాతనైః ।
బ్రాహ్మణాశ్చ తథా భోజ్యా రుద్రసంఖ్యాప్రమాణతః ॥52॥

పెసలతో పూజిస్తే శివుడు సుఖాన్ని ఇస్తాడు. ఏడున్నర ప్రస్థములకు రెండు పలాలను కలిపితే ఒక లక్ష అవుతుందని పూర్వఋషులు చెప్పారు. 11 మంది బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి.

ప్రియంగుపూజనాదేవ ధర్మాధ్యక్షే పరాత్మని ।
ధర్మార్థకామా వర్ధంతే పూజా సర్వసుఖావహా ॥53॥

ధర్మాధ్యక్షుడు, పరమాత్మ అయిన శివునికి ప్రియంగుధాన్యం (కొర్రధాన్యం) సమర్పిస్తే ధర్మార్థకామములు వర్ధిల్లి సర్వసుఖాలు కలుగుతాయి.

ప్రస్థైకేన చ తస్యోక్తం లక్షమేకం పురాతనైః ।
బ్రహ్మభోజం తథా ప్రోక్తమర్కసంఖ్యాప్రమాణతః ॥54॥

ధాన్యాన్ని ఒక ప్రస్థంతో కూడ ఒక లక్ష ప్రమాణంతో అర్పించాలని పూర్వఋషులు చెప్పారు. మరియు 12 మంది బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి.

రాజికాపూజనం శంభోశ్శత్రోర్మృత్యుకరం స్మృతమ్ ।
సార్షపానాం తథా లక్షం పలైర్వింశతిసంఖ్యయా ॥55॥

తేషాం చ పూజనాదేవ శత్రోర్మృత్యురుదాహృతః ।
ఆఢకీనాం దలైశ్చైవ శోభయిత్వార్చయేచ్ఛివమ్ ॥56॥

వృతా గౌశ్చ ప్రదాతవ్యా బలీవర్ధస్తథైవ చ ।
మరీచిసంభవా పూజా శత్రోర్నాశకరీస్మృతా ॥57॥

ఆఢకీనం దలైశ్చైవ రంజియిత్వార్చయేచ్ఛివమ్ ।
నానాసుఖకరీ హ్యేషా పూజా సర్వఫలప్రదా ॥58॥

నల్లఆవాలతో శంభుని పూజిస్తే శత్రువుకి మృత్యువు వస్తుంది. ఇరవైపలాల తెల్లఆవాలు ఒకలక్ష కొలత అవుతుంది. వానితో శివుని పూజించిన వెంటనే శత్రువు నశిస్తాడు. కందిపువ్వుల దళములతో శివుణ్ణి అలంకరించి పూజించాలి. దూడతో కూడిన ఆవును, ఎద్దును దానం చేయాలి. మిరియాలతో పూజిస్తే శత్రువు నశిస్తాడని చెప్పబడింది. లక్షపత్రాలతో శివునికి పూజ చేస్తే సర్వసుఖాలను, సర్వఫలాలను ఇస్తుంది.

ధాన్యమానమితి ప్రోక్తం మయా తే మునిసత్తమ ।
లక్షమానం తు పుష్పాణాం శృణు ప్రీత్యా మునీశ్వర ॥59॥

ఓ మునిశ్రేష్ఠా! నేనింతవరకు ధాన్యాలతో పూజించే విధానాన్ని చెప్పాను. పువ్వులకు సంబంధించిన లక్షమానాన్ని తెలియచేస్తాను.

ప్రస్థానాం చ తథా చైకం శంఖపుష్పసముద్భవమ్ ।
ప్రోక్తం వ్యాసేన లక్షం హి సూక్ష్మమానప్రదర్శినా ॥60॥

ఓ మునిశ్రేష్ఠా! పువ్వులకు సంబంధించిన లక్షమానాన్ని ప్రీతితో వినండి. శంఖపువ్వులు ఒక ప్రస్థం అంటే ఒక లక్ష అవుతుందని సూక్ష్మమానాన్ని వివరించిన వ్యాసుడు చెప్పాడు.

ప్రస్థైరేకాదశైర్జాతీ లక్షమానం ప్రకీర్తితమ్ ।
యూథికాయాస్తథా మానం రాజికాయాస్తదర్ధకమ్ ॥61॥

పదకొండు ప్రస్థాల అడవిమల్లెలు ఒక లక్ష అవుతుంది. కొండమల్లెల మానం కూడా అంతే. దీనిలో సగం ఆవపువ్వులు లక్ష అవుతాయి.

ప్రస్థైర్వింశతికైశ్చైవ మల్లికామానముత్తమమ్ ।
తిలపుష్పైస్తథామానం ప్రస్థాన్న్యూనం తథైవ చ ॥62॥

ఇరవై ప్రస్థాల తీగమల్లెపూలు ఒక లక్ష అవుతాయి. ప్రస్థం కంటె కొద్ది తక్కువ నువ్వు పువ్వులు ఒక లక్ష అవుతాయి.

తతశ్చ ద్విగుణం మానం కరవీరభవే స్మృతమ్ ।
నిర్గుండీకుసుమే మానం తథైవ కథితం బుధైః ॥63॥

దీనికి రెండురెట్లు ఎర్రగన్నేరు పువ్వులు ఒక లక్షమానం అవుతుంది. సిందూర పువ్వుల విషయంలో కూడా కొలత ఇలాగే ఉంటుందనీ చెప్పారు.

కర్ణికారే తథా మానం శిరీషకుసుమే పునః ।
బంధుజీవే తథా మానం ప్రస్థానం దశకేన చ ॥64॥

కొండగోగుపువ్వులకు మరియు దిరిసెనపువ్వులకు ఇదే కొలమానమని పండితులు చెప్పారు. మంకెనపువ్వులు విషయంలో 40 మానికెల కొలత ఒక లక్ష అవుతుంది.

ఇత్యాద్యైః వివిధైర్మానం దృష్ట్వా కుర్యాచ్ఛివార్చనమ్ ।
సర్వకామసమృద్ధ్యర్థం ముక్త్యర్థం కామనోజ్ఝితః ॥65॥

భక్తుడు ఈ విధమైన కొలమానాలు పరిశీలించి శివుణ్ణి పూజిస్తే అన్ని కోరికలు తీరుతాయి. కోరికలు లేని వానికి ముక్తి లభిస్తుంది.

అతః పరం ప్రవక్ష్యామి ధారాపూజాఫలం మహత్ ।
యస్య శ్రవణమాత్రేణ కల్యాణం జాయతే నృణామ్ ॥66॥

విధానపూర్వకం పూజాం కృత్వా భక్త్యా శివస్య వై ।
పశ్చాచ్చ జలధారా హి కర్తవ్యా భక్తితత్పరైః ॥67॥

ఇకపై పరమపవిత్రమైన ధారాపూజ యొక్క ఫలాన్ని చెప్తాను. దీనిని విన్నంత మాత్రాన మానవులకు మంగళాలు లభిస్తాయి. శివునికి యథావిధిగా భక్తితో పూజ చేసి, ఆ తర్వాత సాధకులు శివునిపై జలధారను ఏర్పాటు చేయాలి.

జ్వరప్రలాపశాంత్యర్థం జలధారా శుభావహా ।
శతరుద్రియమంత్రేణ రుద్రస్యైకాదశేన తు ॥68॥

రుద్రజాప్యేన వా తత్ర సూక్తేన పౌరుషేణ వా ।
షడంగేనాథ వా తత్ర మహామృత్యుంజయేన చ ॥69॥

గాయత్ర్యా వా నమోంతైశ్చ నామభిః ప్రణవాదిభిః ।
మంత్రైర్వాథాగమోక్తైశ్చ జలధారాదికం తథా ॥70॥

జ్వరం, దాని వల్ల ప్రలాపం శాంతించి శుభాలు కలగాలంటే శివునిపై జలధారలు అభిషేకించాలి. శతరుద్రీయాన్ని 11 సార్లు. లేదా పురుషసూక్తం పఠించి అభిషేకించాలి. ఋషి, దేవత, ఛందస్సు, బీజం, శక్తి, కీలకం అనే 6 అంగాలతో మహామృత్యుంజయమంత్రంతో కాని గాయత్రీమంత్రంతో కాని లేదా ఓంకారంతో మొదలై నమః తో అంతమయ్యే నామాలతో కాని అభిషేకించాలి. లేదా ఆగమోక్తమంత్రాలతో జలధారను శివుడిపై అభిషేకిస్తే అది ఉత్తమమైన అభిషేకం.

సుఖసంతానవృద్ధ్యర్థం ధారాపూజనముత్తమమ్ ।
నానాద్రవ్యైశ్శుభైర్దివ్యైః ప్రీత్యా సద్భస్మధారిణా ॥71॥

భక్తుడు మంచి భస్మము ధరించి శుభద్రవ్యాలతో శివుని పూజిస్తే చక్కని సంతానం కలుగుతుంది.

ఘృతధారా శివే కార్యా యావన్మంత్రసహస్రకమ్ ।
తదా వంశస్య విస్తారో జాయతే నాత్ర సంశయః ॥72॥

సహస్రనామాలను చదువుతూ నేతిధారతో శివుణ్ణి అభిషేకించాలి. అపుడు వంశం విస్తరిస్తుందనటంలో సందేహం లేదు.

ఏవం మదుక్తమంత్రేణ కార్యం వై శివపూజనమ్ ।
బ్రహ్మభోజ్యం తథా ప్రోక్తం ప్రాజాపత్యం మునీశ్వరైః ॥73॥

ఈ విధంగా నేను చెప్పిన మంత్రంతో శివుణ్ణి పూజించాలి. మరియు బ్రాహ్మణులకు భోజనం పెట్టి, ప్రాజాపత్యవ్రతాన్ని చేయాలని మునిశ్రేష్ఠులు చెప్పారు.

కేవలం దుగ్ధధారా చ తదా కార్యా విశేషతః ।
శర్కరామిశ్రితా తత్ర యదా బుద్ధిర్జడో భవేత్ ॥74॥

తస్యాస్సంజాయతే జీవసదృశీ బుద్ధిరుత్తమా ।
యావన్మంత్రాయుతం న స్యాత్తావద్ధారాప్రపూజనమ్ ॥75॥

యదా చోచ్చాటనం దేహే జాయతే కారణం వినా ।
యత్ర కుత్రాపి వా ప్రేమ దుఃఖం చ పరివర్ధితమ్ ॥76॥

స్వగృహే కలహో నిత్యం యదా చైవ ప్రజాయతే ।
తద్ధారాయాం కృతాయాం వై సర్వం దుఃఖం విలీయతే ॥77॥

బుద్ధిమాంద్యం ఉన్న భక్తుడు శివునిపై పంచదార కలిపిన పాలధారతో అభిషేకించాలి. అటువంటి భక్తునికి జీవునికి తగిన ఉన్నతమైన బుద్ధి కలుగుతుంది. కానీ పదివేలు మంత్రజపం పూర్తయ్యే వరకు ధారతో నిరంతరం జపించాలి. శరీరంలో కారణం లేకుండా ఉద్వేగం కల్గినా, ఏదో ఒక వస్తువుపై, లేక వ్యక్తిపై ప్రేమ కలిగి దుఃఖం పెరిగినపుడు, ఇంట్లో నిత్యం కొట్లాటలు, బయలుదేరినపుడు అటువంటి ధారలతో అభిషేకిస్తే దుఃఖాలన్నీ తొలగిపోతాయి.

శత్రూణాం తాపనార్థం వై తైలధారా శివోపరి ।
కర్తవ్యా సుప్రయత్నేన కార్యసిద్ధిర్ధ్రువం భవేత్ ॥78॥

శత్రువులకు తపన (వేదన) కల్గించటానికి శివునిపై ప్రయత్నపూర్వకంగా నూనెతో అభిషేకిస్తే తప్పక విజయం లభిస్తుంది. అత్యంతం కష్టపడి అయినా ఈ అభిషేకం చేస్తే ఆ కార్యం తప్పక సిద్ధిస్తుంది.

వాసితేనైవ తైలేన భోగవృద్ధిః ప్రజాయతే ।
సార్షపేనైవ తైలేన శత్రునాశో భవేద్ధ్రువమ్ ॥79॥

సువాసనలు కల నూనెతో అభిషేకిస్తే భోగాలు వర్ధిల్లుతాయి. ఆవాలనూనెతో అభిషేకిస్తే శత్రువులు తప్పకుండా నశిస్తారు.

మధునా యక్షరాజో వై గచ్ఛేచ్చ శివపూజనాత్ ।
ధారా చేక్షురసస్యాపి సర్వానందకరీ శివే ॥80॥

తేనెతో శివుని అభిషేకిస్తే దీర్ఘవ్యాధి తొలగిపోతుంది. చెఱకురసంతో అభిషేకం చేస్తే అన్నిరకాల ఆనందాలు కల్గుతాయి.

ధారా గంగాజలస్యైవ భుక్తిముక్తిఫలప్రదా ।
ఏతాస్సర్వాశ్చ యాః ప్రోక్తా మృత్యుంజయసముద్భవాః ॥81॥

గంగాజలధారతో అభిషేకిస్తే భుక్తి, ముక్తి కలుగుతుంది. ఈ అభిషేకాలన్నీ పదివేల మృత్యుంజయమంత్రం పూర్తయ్యేవరకు చేయాలనేది విధి.

తత్రాఽయుతప్రమాణం హి కర్తవ్యం తద్విధానతః ।
కర్తవ్యం బ్రాహ్మణానాం చ భోజ్యం వై రుద్రసంఖ్యయా ॥82॥

పైన చెప్పిన పద్ధతిలో అభిషేకం. పదివేలసార్లు చెయ్యాలి. అయిన తర్వాత పదకొండుమంది బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి.

ఏతత్తే సర్వమాఖ్యాతం యత్పృష్టోఽహం మునీశ్వర ।
ఏతద్వై సఫలం లోకే సర్వకామహితావహమ్ ॥83॥

ఓ మునిశ్రేష్ఠా! నీవు అడిగిన వాటిని అన్నింటిని నీకు చెప్పాను. ఈ జ్ఞానాన్ని విన్న మానవుడు ఈ లోకంలో అన్ని కోరికలను, ఇష్టాలను పొందుతాడు.

స్కందోమాసహితం శంభుం సంపూజ్య విధినా సహ ।
యత్ఫలం లభతే భక్త్యా తద్వదామి యథాశ్రుతమ్ ॥84॥

స్కందునితో, పార్వతితో కూడిన శంభుని విధిగా, భక్తితో పూజించిన వానికి కలుగు ఫలాలు నేను విన్నంత మేరకు చెప్తాను.

అత్ర భుక్త్వాఖిలం సౌఖ్యం పుత్రపౌత్రాదిభిశ్శుభమ్ ।
తతో యాతి మహేశస్య లోకం సర్వసుఖావహమ్ ॥85॥

అట్టివాడు ఈ లోకంలో పుత్రులతో పౌత్రులతో (మనుమలు, మనుమరాళ్లు) కూడిన మంగళకర సౌఖ్యాలనన్నింటినీ అనుభవించి తర్వాత సర్వసుఖాలను పొందే మహేశుని లోకాన్ని పొందుతాడు.

సూర్యకోటిప్రతీకాశైర్విమానైస్సర్వకామగైః ।
రుద్రకన్యాసమాకీర్ణైర్గేయవాద్యసమన్వితైః ॥86॥

క్రీడతే శివభూతశ్చ యావదాభూతసంప్లవమ్ ।
తతో మోక్షమవాప్నోతి విజ్ఞానం ప్రాప్య చావ్యయమ్ ॥87॥

అక్కడ శివస్వరూపుడై, కోటిసూర్యుల కాంతితో ప్రకాశించే స్వేచ్ఛాసంచారం కల్గి, రుద్రకన్యలతో నిండియున్న గానవాద్యాలతో అలరించే విమానములనెక్కి మహాప్రళయం దాకా క్రీడిస్తాడు. (ఆనందిస్తాడు) తర్వాత వినాశనము లేని విజ్ఞానం పొంది, మోక్షాన్ని పొందుతాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే శివపూజా వర్ణనో నామ చతుర్దశోఽధ్యాయః ॥14॥

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహిత సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటిఖండంలో శివపూజా వర్ణనం అనే పద్నాల్గవ అధ్యాయం సమాప్తం.

పంచదశోఽధ్యాయః - పదిహేనవ అధ్యాయం

రుద్రావతారావిర్భావమ్ - రుద్రావతారావిర్భావం

నారద ఉవాచ - నారదుడు ఇలా పలికాడు.

విధే విధే మహాభాగ ధన్యస్త్వం సురసత్తమ ।
శ్రావితాద్యాద్భుతా శైవకథా పరమపావనీ ॥1॥

హే బ్రహ్మ! మహాత్మా! సురశ్రేష్ఠా! నీవు ధన్యుడవు. నీవు ఈనాడు అద్భుతం, పరమపవిత్రం అయిన శివగాథను వినిపించావు.

తత్రాద్భుతా మహాదివ్యా లింగోత్పత్తిశ్రుతా శుభా ।
శ్రుత్వా యస్యాః ప్రభావం చ దుఃఖనాశో భవేదిహ ॥2॥

ఆ గాథలో భాగంగా చాలా దివ్యమైన, శుభకరమైన లింగోద్భవం వినిపించావు. లింగమహాత్మ్యం విన్న మానవులకు ఈ లోకంలో దుఃఖం నశిస్తుంది.

అనంతరం చ యజ్జాతం మాహాత్మ్యం చరితం తథా ।
సృష్టేశ్చైవ ప్రకారం చ కథయ త్వం విశేషతః ॥3॥

లింగం ఉద్భవించిన తర్వాత జరిగిన విషయాలను, మాహాత్మ్యాన్ని, సృష్టిప్రకారమును తెలియచేయండి.

బ్రహ్మోవాచ - బ్రహ్మ ఇలా చెప్పాడు.

సమ్యక్ పృష్టం చ భవతా యజ్జాతం తదనంతరమ్ ।
కథయిష్యామి సంక్షేపాద్యథాపూర్వం శ్రుతం మయా ॥4॥

నువ్వు చక్కగా ప్రశ్నించావు. తర్వాత జరిగిన కథనంతటిని నేను పూర్వం విని ఉన్నాను. వాటిని సంగ్రహంగా చెప్తాను.

అంతర్హితే తదా దేవే శివరూపే సనాతనే ।
అహం విష్ణుశ్చ విప్రేంద్ర! అధికం సుఖమాప్తవాన్ ॥5॥

ఓ విప్రశేష్ఠ! అపుడు సనాతనుడైన శివదేవుడు అంతర్ధానం కాగా నేను మరియు విష్ణువు చాలా సుఖాన్ని పొందాము.

మయా చ విష్ణునా రూపం హంసవారాహయోస్తదా ।
సంవృతం తు తతస్తాభ్యాం లోకసర్గావనేచ్ఛయా ॥6॥

అపుడు లోకాలను సృజించాలి, రక్షించాలనే కోరికతో నేను, విష్ణువు ఇద్దరం హంసవరాహరూపములను ధరించాము.

నారద ఉవాచ - నారదుడు ఇలా పలికాడు.

విధే బ్రహ్మన్! మహాప్రాజ్ఞ సంశయో హృది మే మహాన్ ।
కృపాం కృత్వాతులాం శీఘ్రం తం నాశయితుమర్హసి ॥7॥

హే బ్రహ్మ! నువ్వు ప్రాజ్ఞుడవు. నా మదిలో గొప్ప సందేహం ఒకటి ఉంది. నువ్వు దయతో ఆ సందేహాన్ని వెంటనే తొలగించాలి.

హంసవారాహయోః రూపం యువాభ్యాం చ ధృతం కథమ్ ।
అన్యద్రూపం విహాయైవ కిమత్ర వద కారణమ్ ॥8॥

మీరిద్దరు ఇతర రూపాలను విడిచి పెట్టి హంస వరాహరూపాలను మాత్రమే ధరించటానికి గల కారణాలు చెప్పండి.

సూత ఉవాచ - సూతుడు ఇలా పలికాడు.

ఇత్యేతద్వచనం శ్రుత్వా నారదస్య మహాత్మనః ।
స్మృత్వా శివపదాంభోజం బ్రహ్మా సాదరమబ్రవీత్ ॥9॥

నారదముని యొక్క ఈ మాటలను విని బ్రహ్మ శివుని పాదపద్మాలను స్మరించి ప్రేమతో ఇలా అన్నాడు.

బ్రహ్మోవాచ - బ్రహ్మ ఇలా చెప్పాడు.

హంసస్య చోర్ధ్వగమనే గతిర్భవతి నిశ్చలా ।
తత్త్వాతత్త్వవివేకోఽస్తి జలదుగ్ధవిభాగవత్ ॥10॥

హంస నిశ్చలంగా పైకి ఎగుర గలదు. మరియు నీటిని పాలను వేరు చేసిన విధంగా, తత్త్వా తత్త్వాల్ని విభజించి తెలుసుకునే వివేకం కూడా హంసకు ఉంది.

అజ్ఞానజ్ఞానయోస్తత్త్వం వివేచయతి హంసకః ।
హంసరూపం ధృతం తేన బ్రహ్మణా సృష్టికారిణా ॥11॥

జ్ఞానాజ్ఞానముల తత్త్వమును వేరుగా చూపే సామర్థ్యం కల్గియుండుట వలన సృష్టికర్త అయిన బ్రహ్మ హంసరూపాన్ని ధరించాడు.

వివేకో నైవ లబ్ధశ్చ యతో హంసో వ్యలీయత ।
శివస్వరూపతత్త్వస్య జ్యోతిరూపస్య నారద ॥12॥

జ్యోతిస్స్వరూపమగు శివస్వరూపతత్తము యొక్క యాథార్థము తెలియకపోవుట వలన హంసరూపమును పొందెను.

సృష్టిప్రవృత్తికామస్య కథం జ్ఞానం ప్రజాయతే ।
యతో లబ్ధే వివేకోఽపి న మయా హంసరూపిణా ॥13॥

సృష్టిలో ప్రవర్తిల్లాలనే కోరిక గల వానికి జ్ఞానం ఎలా కలుగుతుంది? హంసరూపం పొందినా నేను వివేకాన్ని పొందలేక పోయాను.

గమనేఽధో వరాహస్య గతిర్భవతి నిశ్చలా ।
ధృతం వారాహరూపం హి విష్ణునా వనచారిణా ॥14॥

క్రిందికి దూసుకు పోవటంలో వరాహానికి (పందికి) స్థిరమైన కదలిక ఉంది. అందువల్లనే అడవులలో తిరిగే విష్ణువు పంది రూపాన్ని ధరించాడు.

అథవా భవకల్పార్థం తద్రూపం హి ప్రకల్పితమ్ ।
విష్ణునా చ వరాహస్య భువనావనకారిణా ॥15॥

లేదా లోకాలను రక్షించే విష్ణువు సృష్టిలో కల్పవ్యవస్థ కోసం ఆ రూపాన్ని ధరించి ఉంటాడు.

యద్దినం హి సమారభ్య తద్రూపం ధృతవాన్హరిః ।
తద్దినం ప్రతికల్పోఽసౌ కల్పో వారాహసంజ్ఞకః ॥16॥

ఏ రోజు హరి ఆ రూపాన్ని ధరించాడో, ఆనాటి నుండి మొదలైన కల్పానికి వరాహకల్పమని పేరు వచ్చింది.

తదిచ్ఛా వా తదా జాతా తాభ్యాం రూపం హి ధారణే ।
తద్దినం ప్రతికల్పోఽసౌ కల్పో వారాహసంజ్ఞకః ॥17॥

ఆ రూపమును ధరించడమనే కారణం చేత ఆ కల్పమునకు వరాహకల్పమనే పేరు సార్థకత చెందింది.

ఇతి ప్రశ్నోత్తరం దత్తం ప్రస్తుతం శృణు నారద ।
స్మృత్వా శివపదాంభోజం వక్ష్యే సృష్టివిధిం మునే ॥18॥

ఓ నారదా! నీ ప్రశ్నలలో కొన్నింటికి సమాధానం చెప్పాను. ఓ మహర్షీ! నేనిపుడు శివుని పాదపద్మాలను స్మరించి సృష్టిప్రకారాన్ని చెప్తాను.

అంతర్హితే మహాదేవే త్వహం లోకపితామహః ।
తదీయం వచనం కర్తుమధ్యాయన్ ధ్యానతత్పరః ॥19॥

మహాదేవుడు మాయమవగానే లోకాలకు పితామహుడనైన నేను శివుని ఆజ్ఞను పాలించటానికి ధ్యానంలో ఉండిపోయాను.

నమస్కృత్య తదా శంభుం జ్ఞానం ప్రాప్య హరేస్తదా ।
ఆనందం పరమం గత్వా సృష్టిం కర్తుం మనో దధే ॥20॥

అపుడు నేను శంభునికి నమస్కరించి, విష్ణువు నుండి జ్ఞానాన్ని పొంది సృష్టిని చేయటానికి నిశ్చయించాను.

విష్ణుశ్చాపి తదా తత్ర ప్రణిపత్య సదాశివమ్ ।
ఉపదిశ్య చ మాం తాత హ్యంతర్ధానముపాగతః ॥21॥

అపుడు విష్ణువు కూడా ఓవత్సా! సదాశివునికి నమస్కరించి నాకు ఉపదేశించి మాయమయ్యాడు.

బ్రహ్మాండాచ్చ బహిర్గత్వా ప్రాప్య శంభోరనుగ్రహమ్ ।
వైకుంఠనగరం గత్వా తత్రోవాస హరిస్సదా ॥22॥

విష్ణువు బ్రహ్మాండానికి ఆవల ఉన్న వైకుంఠనగరాన్ని శంభుని అనుగ్రహంతో పొంది, అక్కడ చాలాకాలం నివసించాడు.

అహం స్మృత్వా శివం తత్ర విష్ణుం వై సృష్టికామ్యయా ।
పూర్వం సృష్టం జలం యచ్చ తత్రాంజలిముదాక్షిపమ్ ॥23॥

నేను సృష్టిని చేయాలనుకొని, శివుణ్ణి, విష్ణువును స్మరించి, పూర్వం సృష్టించబడిన నీటినుండి దోసిలితో నీటిని తీసుకుని పైకి చిమ్మెను.

అతోంఽడమభవత్తత్ర చతుర్వింశతిసంజ్ఞకమ్ ।
విరాడ్రూపమభూద్విప్ర జడరూపమపశ్యతః ॥24॥

హే విప్రా! ఆ నీటినుండి 24 తత్త్వాలతో కూడిన విరాడ్రూపము అండాకారంలో పుట్టింది. ఆ విరాట్ రూపంలో జడత్వమే కాని చైతన్యం కనిపించ లేదు.

తతస్సంశయమాపన్నస్తపస్తేపే సుదారుణమ్ ।
ద్వాదశాబ్దమహం తత్ర విష్ణుధ్యానపరాయణః ॥25॥

అపుడు నాకు సందేహం కలిగి విష్ణుధ్యానంలో 12 సంవత్సరాలు దారుణమైన తపస్సులో ఉండిపోయాను.

తస్మింశ్చ సమయే తాత ప్రాదుర్భూతో హరిస్స్వయమ్ ।
మామువాచ మహాప్రీత్యా మదంగం సంస్పృశన్ముదా ॥26॥

ఓ వత్సా! అపుడు విష్ణువు స్వయంగా ప్రత్యక్షమై ప్రీతితో నా శరీరాన్ని ముట్టుకొని నాతో ఇలా అన్నాడు.

విష్ణురువాచ - విష్ణువు ఇలా పలికాడు.

వరం బ్రూహి ప్రసన్నోఽస్మి నాదేయో విద్యతే తవ ।
బ్రహ్మన్ శంభుప్రసాదేన సర్వం దాతుం సమర్థకః ॥27॥

ఓ బ్రహ్మ! నేను ప్రసన్నుడయ్యాను. వరాన్ని కోరుకో. నీకు ఇవ్వజాలని వరం లేదు. శంభుని అనుగ్రహంతో నేను అన్నింటిని ఇవ్వగల సమర్థుణ్ణి.

బ్రహ్మోవాచ - బ్రహ్మ ఇలా పలికాడు.

యుక్తమేతన్మహాభాగ దత్తోఽహం శంభునా చ తే ।
తదుక్తం యాచతే మేఽద్య దేహి విష్ణో నమోఽస్తు తే ॥28॥

మహాత్మా! నీవు చక్కగా చెప్పావు. శంభుడు నన్ను నీకు అప్పగించాడు. ఓ విష్ణూ! నేను కోరుకున్న దానిని ఇవ్వు. నీకు నమస్కారం.

విరాడ్రూపమిదం హ్యండం చతుర్వింశతిసంజ్ఞకమ్ ।
న చైతన్యం భవత్యాదౌ జడీభూతం ప్రదృశ్యతే ॥29॥

24 తత్త్వాలు ఉన్న ఈ విరాడ్రూపమయిన అండం జడంగా ఉంది. దీనియందు చైతన్యం రావటం లేదు.

ప్రాదుర్భూతో భవానద్య శివానుగ్రహతో హరే ।
ప్రాప్తం శంకరసంభూత్యా హ్యండం చైతన్యమావహ ॥30॥

హే విష్ణో! నీవు ఈ రోజు శివుని అనుగ్రహం వలన ప్రత్యక్షమైనావు. శంకర అనుగ్రహంతో దొరికిన ఈ అండాన్ని చైతన్యముతో నింపు.

ఇత్యుక్తే మహావిష్ణుశ్శంభోరాజ్ఞాపరాయణః ।
అనంతరూపమాస్థాయ ప్రవివేశ తదండకమ్ ॥31॥

బ్రహ్మ ఇలా మాట్లాడినంతలో శంభుని ఆజ్ఞను శ్రద్ధగా పాటించే మహావిష్ణువు అనంతరూపంలో ఆ అండంలో ప్రవేశించాడు.

సహస్రశీర్షాపురుషస్సహస్రాక్షస్సహస్రపాత్ ।
స భూమిం సర్వతస్స్పృత్వా తదండం వ్యాప్తవానితి ॥32॥

ఆయన అనేక తలలు, అనేక కళ్లు, అనేక పాదాలు గల విరాట్ పురుషుడై, భూమినంతటా వ్యాపించి, ఆ అండమును వ్యాపించాడు.

ప్రవిష్టే విష్ణునా తస్మిన్నండే సమ్యక్స్తుతేన మే ।
సచేతనమభూదండం చతుర్వింశతిసంజ్ఞకమ్ ॥33॥

నేను చక్కగా ఆయనను ప్రార్థించాను. ఆయన నా ప్రార్థనను మన్నించి, అండంలో ప్రవేశించగానే 24 తత్త్వాల ఆ అండం చైతన్యం పొందినది.

పాతాలాదిసమారభ్య సప్తలోకాధిపస్స్వయమ్ ।
రాజతే స్మ హరిస్తత్ర వైరాజః పురుషః ప్రభుః ॥34॥

విరాట్పురుషుడు విష్ణువు పాతాళంతో మొదలైన ఏడు లోకాలకు ప్రభువై బ్రహ్మాండంలో స్వయంగా ప్రకాశించాడు.

కైలాసనగరం రమ్యం సర్వోపరి విరాజితమ్ ।
నివాసార్థం నిజస్యైవ పంచవక్త్రశ్చకార హ ॥35॥

ఈ ఏడు లోకములపైన సుందరమైన కైలాసనగరాన్ని, అయిదు ముఖాల దైవం తన నివాసం కొరకు నిర్మించాడు.

బ్రహ్మాండస్య తథా నాశే వైకుంఠస్య చ తస్య చ ।
కదాచిదేవ దేవర్షే నాశో నాస్తి తయోరిహ ॥36॥

ఓ మహర్షీ! బ్రహ్మాండం నశించినా, వైకుంఠ కైలాసాలకు ఏనాడూ నాశము లేదు.

సత్యం పదముపాశ్రిత్య స్థితో౾హం మునిసత్తమ ।
సృష్టికామో౾భవం తాత మహాదేవాజ్ఞయా హ్యహమ్ ॥37॥

ఓ మహర్షీ! నేను సత్యలోకాన్ని ఆశ్రయించి ఉన్నాను. వత్సా! నేను మహాదేవుని ఆజ్ఞతో సృష్టిని చేయ తలపెట్టాను.

సిసృక్షోరథ మే ప్రాదురభవత్పాపసర్గకః ।
అవిద్యాపంచకస్తాత! బుద్ధిపూర్వస్తమోపమః ॥38॥

సృష్టిని చేయాలనుకున్న నేను ముందుగా అంధకారాన్ని పోలినదీ, పంచ అవిద్యలతో ఉన్నదీ అయిన పాపసర్గాన్ని సృష్టించాను.

తతో ప్రసన్నచిత్తో౾హమసృజం స్థావరాభిధమ్ ।
ముఖ్యసర్గం చ నిస్సంగమధ్యాయం శంభుశాసనాత్ ॥39॥

అపుడు నేను ప్రసన్నమైన మనసుతో చెట్లు, లతల రూపమైన కదలని పదార్థాల్ని సృష్టించాను. అపుడు శివుని ఆజ్ఞచే నేను మరల సృష్టిని గూర్చి ధ్యానం చేశాను.

తం దృష్ట్వా మే సిసృక్షోశ్చ జ్ఞాత్వా సాధకమాత్మనః ।
సర్గో౾వర్తత దుఃఖాద్యస్తిర్యక్స్రోతో న సాధకః ॥40॥

ఈ సృష్టి కూడా పురుషార్థసాధకం కాదని అనుకున్నాను. తర్వాత పశు, పక్ష్యాదులతో కూడిన బహుళమైన సర్గాన్ని చేశాను. అదీ దుఃఖభాజకమైనది. అదియు పురుషార్థకం కాలేదు.

తం చాసాధకమాజ్ఞాయ పునశ్చింతయతశ్చ మే ।
అభవత్సాత్త్వికస్సర్గ ఊర్ధ్వస్రోతా ఇతి ద్రుతమ్ ॥41॥

ఆ సృష్టికూడా సాధకం కాదని తెలుసుకొని మరల విచారణ చేయగా సత్త్వగుణప్రధానమైనదీ, పైకి ప్రసరించేదీ అయిన సృష్టి జరిగింది.

దేవసర్గః ప్రతిఖ్యాతస్సత్యో౾తీవ సుఖావహః ।
తమప్యసాధకం మత్వా౾చింతయం ప్రభుమాత్మనః ॥42॥

సత్యగుణం కలది, ఎక్కువ సుఖాన్ని కలిగించేది అయిన దేవసర్గం పుట్టింది. అది కూడా పురుషార్థ సాధకం కాదని తలచి నా ప్రభువైన శివుణ్ణి స్మరించాను.

ప్రాదురాసీత్తతస్సర్గో రాజసశ్శంకరాజ్ఞయా ।
అర్వాక్ స్రోతా ఇతి ఖ్యాతో మానుషః పరసాధకః ॥43॥

అపుడు శంకరుని ఆజ్ఞచే క్రిందకు ప్రసరించే రేతస్సుకలదీ రజోగుణస్వరూపమైనదీ, అయిన మానుషసృష్టి జరిగింది.

మహాదేవాజ్ఞయా సర్గస్తతో భూతాదికోఽభవత్ ।
ఇతి పంచవిధా సృష్టిః ప్రవృత్తా వై కృతా మయా ॥44॥

తర్వాత మహాదేవుని ఆజ్ఞతో భూతాదుల సృష్టి జరిగింది. ఈ విధంగా నేను సృష్టిని 5 విధాలుగా సృష్టించాను.

త్రయస్సర్గాః ప్రకృత్యాశ్చ బ్రహ్మణః పరికీర్తితాః ।
తత్రాద్యో మహతస్సర్గో ద్వితీయః సూక్ష్మభౌతికః ॥45॥

మరలా ప్రకృతి నుండి 3 సర్గలు బయలుదేరాయి. మొదటిది 'మహత్' సృష్టి. రెండోది సూక్ష్మ భౌతికసృష్టి.

వైకారికస్తృతీయశ్చ ఇత్యేతే ప్రాకృతాస్త్రయః ।
ఏవం చాష్టవిధాస్సర్గాః ప్రకృతేర్వైకృతైస్సహ ॥46॥

మూడవది పాంచభౌతికసృష్టి (వైకారిక). ఈ మూడు ప్రకృతి నుండి బయలుదేరాయి. ఈ విధంగా ప్రకృతి నుండి పుట్టిన వాటితో కలిపి 8 సర్గలున్నాయి.

కౌమారో నవమః ప్రోక్తః ప్రాకృతో వైకృతశ్చ సః ।
ఏషామవాంతరో భేదో మయా వక్తుం న శక్యతే ॥47॥

అల్పత్వాదుపయోగస్య వచ్మి సర్గం ద్విజాత్మకమ్ ।
కౌమారః సనకాదీనాం యత్ర సర్గో మహానభూత్ ॥48॥

తొమ్మిదవది కౌమారసర్గం. అది ప్రాకృతం, వైకృతం కూడా. ఈ సర్గములలో ఉన్న అవాంతరభేదాలను నేను చెప్పలేను. ఈ అవాంతరభేదాల ప్రయోజనం అల్పమగుటవల్ల చెప్పటం లేదు. అపుడు ద్విజసర్గాన్ని చెప్తాను. కౌమార సర్గమంటే ఇదే. దీనిలో సనకాదిమహాత్ముల సృష్టి జరిగింది.

సనకాద్యాస్సుతా మే హి మానసా బ్రహ్మసమ్మితాః ।
మహావైరాగ్యసంపన్నా అభవన్ పంచసువ్రతాః ॥49॥

నాకు నాతో సమానమైన వారు, గొప్ప వైరాగ్యసంపన్నులు, దృఢవ్రతులు అయిన సనకాది మానస పుత్రులు ఐదుగురు కలిగారు.

మయాజ్ఞప్తా అపి చ తే సంసారవిముఖా బుధాః ।
శివధ్యానైకమనసో న సృష్టౌ చక్రిరే మతిమ్ ॥50॥

పండితులు, శివధ్యానమునందు మాత్రమే నిమగ్నులైన వారు, సంసారం పట్ల అభిరుచి లేని వారై, నేను ఆజ్ఞాపించినప్పటికీ సృష్టియందు మనస్సును లగ్నం చేయలేదు.

ప్రత్యుత్తరం చ తైర్దత్తం శ్రుత్వాహం మునిసత్తమ ।
అకార్షం క్రోధమత్యుగ్రం మోహమాప్తశ్చ నారద ॥51॥

ఓ మహర్షీ! వారు చెప్పిన సమాధానాలు విని నేను తీవ్రంగా కోపపడ్డాను. నారదా! నేను కూడా మోహాన్ని పొందాను.

క్రుద్ధస్య మోహితస్యాథ విహ్వలస్య మునే మమ ।
క్రోధేన ఖలు నేత్రాభ్యాం ప్రాపతన్నశ్రుబిందవః ॥52॥

ఓ మహర్షీ! మోహంతో కోపించటం వల్ల విచలితుండనైన నాకు కళ్ల నుండి కన్నీటి చుక్కలు రాలాయి.

తస్మిన్నవసరే తత్ర స్మృతేన మనసా మయా ।
ప్రబోధితోఽహం త్వరితమాగతేన హి విష్ణునా ॥53॥

ఆ సమయంలో నేను మనసులో విష్ణువును స్మరించగా, ఆయన వెంటనే నాకు కర్తవ్యాన్ని తెలియ చేశాడు.

తపః కురు శివస్యేతి హరిణా శిక్షితోఽప్యహమ్ ।
తపోకారీ మహద్ఘోరం పరమం మునిసత్తమ ॥54॥

శివుణ్ణి గూర్చి తపస్సు చేయమని విష్ణువు హెచ్చరించగా నేను ఘోరతపస్సును చేశాను.

తపస్యతశ్చ సృష్ట్యర్థం భ్రువోర్ఘ్రాణస్య మధ్యతః ।
అవిముక్తాభిధాద్దేశాత్ స్వకీయాన్మే విశేషతః ॥55॥

త్రిమూర్తీనాం మహేశస్య ప్రాదురాసీద్ఘృణానిధిః ।
అర్ధనారీశ్వరో భూత్వా పూర్ణాంశస్సకలేశ్వరః ॥56॥

ఓ మహర్షీ! సృష్టిని చేయాలని తపస్సు చేస్తుండగా కనుబొమ్మలకు నాసికకు మధ్య కల, అవిముక్తం అనే పేరున్న స్థానం నుండి త్రిమూర్తులకు ప్రభువు, దయానిధి, సర్వజగత్ప్రభువగు పరమేశ్వరుడు పూర్ణాంశతో అర్ధనారీశ్వరస్వరూపుడై సాక్షాత్కరించాడు.

తమజం శంకరం సాక్షాత్తేజోరాశిముమాపతిమ్ ।
సర్వజ్ఞం సర్వకర్తారం నీలలోహితసంజ్ఞకమ్ ॥57॥

దృష్ట్వా నత్వా మహాభక్త్యా స్తుత్వాహం తు ప్రహర్షితః ।
అవోచం దేవదేవేశం సృజ త్వం వివిధాః ప్రజాః ॥58॥

పుట్టుక లేని వాడు, తేజోరాశి, పార్వతీపతి, అన్నీ తెలిసిన వాడు, అన్నింటికి కర్త నీలలోహితుడనే పేరు గల వాడు అయిన ఆ శంకరుని ప్రత్యక్షంగా చూసి, మహాభక్తితో నమస్కారం చేసి, మహానందంతో స్తుతించాను. "విభిన్నప్రజలను నీవే సృష్టించు" అని దేవదేవుడైన శివుడితో అన్నాను.

శ్రుత్వా మమ వచస్సోఽథ దేవదేవో మహేశ్వరః ।
ససర్జ స్వాత్మనస్తుల్యాన్రుద్రో రుద్రగణాన్ బహూన్ ॥59॥

నా మాటలు విన్న దేవదేవుడు తనతో సమానమైన అనేక రుద్రగణాలను సృష్టించాడు.

అవోచం పునరేవేశం మహారుద్రం మహేశ్వరమ్ ।
జన్మమృత్యుభయావిష్టాస్సృజ దేవ ప్రజా ఇతి ॥60॥

అపుడు నేను మరలా మహేశ్వరునితో ఇలా అన్నాను. దేవా! ప్రజలను జన్మ, మృత్యుభయం కలవారుగా పుట్టించు.

ఏవం శ్రుత్వా మహాదేవో మద్వచః కరుణానిధిః ।
ప్రహస్యోవాచ మాం సద్యః ప్రహస్య మునిసత్తమ ॥61॥

ఓ మహర్షీ! దయానిధి అయిన మహాదేవుడు నా మాటను విని, వెంటనే చిరునవ్వుతో నాతో ఇలా అన్నాడు.

మహేదేవ ఉవాచ – మహాదేవుడు ఇలా పలికాడు.

జన్మమృత్యుభయావిష్టా నాహం స్రక్ష్యే ప్రజా విధే ।
అశోభనాః కర్మవశా విమగ్నా దుఃఖవారిధౌ ॥62॥

బ్రహ్మా! జన్మ, మృత్యు భయంతో ఉండేవాళ్లని, శోభ లేని వారు, కర్మకు వశులై దుఃఖసముద్రంలో మునిగిన వాళ్లని నేను సృష్టించను.

అహం దుఃఖోదధౌ మగ్నాన్ ఉద్ధరిష్యామి చ ప్రజాః ।
సమ్యక్జ్ఞానప్రదానేన గురుమూర్తిపరిగ్రహః ॥63॥

నేను గురురూపం తీసుకొని, నిజమైన జ్ఞానాన్నిచ్చి, దుఃఖసముద్రంలో మునిగిపోతున్న ప్రజలను ఉద్ధరిస్తాను.

త్వమేవ సృజ దుఃఖాఢ్యాః ప్రజాస్సర్వాః ప్రజాపతే ।
మదాజ్ఞయా న బద్ధస్త్వం మాయయా సంభవిష్యసి ॥64॥

ఓ ప్రజాపతీ! నీవే నా ఆజ్ఞచే దుఃఖితులైన ప్రజలను సృష్టించు. నీకు మాయాబంధం ఉండబోదు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇలా చెప్పాడు.

ఇత్యుక్త్వా మాం స భగవాన్ సుశ్రీమాన్నీలలోహితః ।
సగణః పశ్యతో మే హి ద్రుతమంతర్దధే హరః ॥65॥

శోభాయుతుడు, నీలరక్తవర్ణాలతో దేహం కలవాడు అయిన హరభగవానుడు నాతో ఇలా మాట్లాడి గణాలతో కూడి నేను చూస్తుండగానే వెంటనే మాయమయ్యాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే రుద్రావతారావిర్భావవర్ణనో నామ పంచదశోఽధ్యాయః ॥15॥

శ్రీశివపురాణంలోని రెండవదైన రుద్రసంహిత సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటి ఖండంలో రుద్రావతారావిర్భావవర్ణనం అనే పదిహేనవ అధ్యాయం సమాప్తం.

షోడశోఽధ్యాయః - పదహారవ అధ్యాయం

బ్రహ్మ నారద సంవాదంలో సృష్టివర్ణనమ్ - బ్రహ్మ నారద సంవాదంలో సృష్టివర్ణనం

బ్రహ్మోవాచ - బ్రహ్మ ఇలా చెప్పాడు.

శబ్దాదీని చ భూతాని పంచీకృత్వాహమాత్మనా ।
తేభ్యఃస్థూలం నభో వాయుం వహ్నిం చైవ జలం మహీమ్ ॥1॥

నేను శబ్ద, స్పర్శ, రూప, రసగంధాలనే సూక్ష్మభూతాలను పంచీకరణం చేసి, వాటినుండి ఆకాశం, గాలి, నిప్పు, నీరు, భూమి అనే స్థూలభూతాలను పుట్టించాను.

పంచీకరణం : 50శాతం భూమికి మిగిలిన నాలుగు సూక్ష్మభూతాలను పన్నెండున్నర శాతం చొప్పున కలిపితే స్థూలభూమి అవుతుంది.

పర్వతాంశ్చ సముద్రాంశ్చ వృక్షాదీనపి నారద ।
కలాదియుగపర్యంతాన్ కాలానన్యానవాసృజమ్ ॥2॥

ఓ నారదా! సముద్రాదులు, వృక్షాదులు, పర్వతాలు, కళ మొదలు యుగం వరకు ఉన్న కాలావయవాలన్నింటిని పుట్టించాను.

సృష్ట్వంతానపరాంశ్చాపి నాహం తుష్టోఽభవం మునే ।
తతో ధ్యాత్వా శివం సాంబం సాధకానసృజం మునే ॥3॥

ఓ మహర్షీ! జననమరణాలున్న ప్రాణులను పుట్టించాను. కాని సంతృప్తి కలగ లేదు. అపుడు సాంబశివుని ధ్యానించి, సృష్టిసాధకులైన ఋషులను సృష్టించాను.

మరీచిం చ స్వనేత్రాభ్యాం హృదయాద్భృగుమేవ చ ।
శిరసోఽంగిరసం వ్యానాత్పులహం మునిసత్తమమ్ ॥4॥

ఉదానాచ్చ పులస్త్యం హి వసిష్ఠం చ సమానతః ।
క్రతుం త్వపానాచ్ఛ్రోత్రాభ్యామత్రిం దక్షం చ ప్రాణతః ॥5॥

అసృజం త్వాం తదోత్సంగాచ్ఛాయాయాః కర్దమం మునిమ్ ।
సంకల్పాదసృజం ధర్మం సర్వసాధనసాధనమ్ ॥6॥

నా కళ్లనుండి మరీచిని, హృదయం నుండి భృగువును, తల నుండి అంగీరసుని, శరీరమంతటా వ్యాపించే వాయువైన వ్యానం నుండి మునిపుంగవుడైన పులహుని పుట్టించాను. ఉదానం నుండి పులస్త్యుని, సమానం నుండి వసిష్ఠుని, అపానం నుండి క్రతువును, చెవుల నుండి అత్రిని, ప్రాణం నుండి దక్షుని, తొడ నుండి నిన్ను, నీడ నుండి కర్దమమహర్షిని, సంకల్పం నుండి సర్వసాధకులకు సాధనమైన ధర్మాన్ని పుట్టించాను.

ఏవమేతానహం సృష్ట్వా కృతార్థస్సాధకోత్తమాన్ ।
అభవం మునిశార్దూల మహాదేవప్రసాదతః ॥7॥

సాధకులైన ఈ ఉత్తములను మహాదేవుని అనుగ్రహంతో సృష్టించి నేను కృతార్థుడయ్యాను.

తతో మదాజ్ఞయా తాత ధర్మః సంకల్పసంభవః ।
మానవం రూపమాపన్నస్సాధకైస్తు ప్రవర్తితః ॥8॥

ఓ మునిశ్రేష్ఠా! అపుడు సంకల్పం నుండి పుట్టిన ధర్మం నా ఆజ్ఞచే మానవుని రూపం పొందగా, సాధకులు దానిని ప్రవర్తిల్లజేశారు.

తతోఽసృజం స్వగాత్రేభ్యో వివిధేభ్యోఽమితాన్సుతాన్ ।
సురాసురాదికాంస్తేభ్యో దత్త్వా తాం తాం తనుం మునే ॥9॥

ఓ మహర్షీ! అపుడు నేను శరీర అవయవాల నుండి దేవతలు, రాక్షసులు మొదలైన లెక్కలేనంతమంది సంతానాన్ని వారికి ఆయా దేహాలనిచ్చి సృష్టించాను.

తతోఽహం శంకరేణాథ ప్రేరితోంఽతర్గతేన హ ।
ద్విధా కృత్వాత్మనో దేహం ద్విరూపశ్చాభవం మునే ॥10॥

ఓ మహర్షీ! అపుడు నేను అంతర్యామి అయిన శంకరునిచే ప్రేరేపించబడి, నా శరీరాన్ని రెండు భాగాలుగా చేసి, రెండు రూపాలను ధరించాను.

అర్ధేన నారీ పురుషశ్చార్ధేన సంతతో మునే ।
స తస్యామసృజద్ద్వంద్వం సర్వసాధనముత్తమమ్ ॥11॥

ఓ మునీ! సగం భాగం స్త్రీ కాగా, రెండవ సగం పురుషుడయ్యాడు. వీరిద్దరి మధ్య విభేదం లేదు. ఆ పురుషుడు ఆమెయందు సర్వానికి సాధనమైన శ్రేష్ఠమగు జంటను సృష్టించాడు.

స్వాయంభువో మనుస్తత్ర పురుషః పరసాధనమ్ ।
శతరూపాభిధా నారీ యోగినీ సా తపస్వినీ ॥12॥

ఆ జంటలోని పురుషుడు ఉత్తమసాధకుడు అయిన స్వాయంభువమనువు. శతరూప అనే పేరు గల స్త్రీ యోగిని మరియు తపస్విని.

సా పునర్మనునా తేన గృహీతాఽతీవ శోభనా ।
వివాహవిధినా తాతాఽసృజత్సర్గం సమైథునమ్ ॥13॥

ఓ వత్సా! మనువు సౌందర్యవతి అయిన ఆమెను యథావిధిగా పెళ్లి చేసుకొని, స్త్రీ పురుష సంపర్క జనితమైన సృష్టిని చేశాడు.

తస్యాం తేన సముత్పన్నస్తనయశ్చ ప్రియవ్రతః ।
తథైవోత్తానపాదశ్చ తథా కన్యాత్రయం పునః ॥14॥

వారికి ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే కొడుకులు మరియు ముగ్గురు కూతుళ్లు పుట్టారు.

ఆకూతిర్దేవహూతిశ్చ ప్రసూతిరితి విశ్రుతాః ।
ఆకూతిం రుచయే ప్రాదాత్కర్దమాయ తు మధ్యమామ్ ॥15॥

దదౌ ప్రసూతిం దక్షాయోత్తానపాదానుజాం సుతాః ।
తాసాం ప్రసూతిప్రసవైస్సర్వం వ్యాప్తం చరాచరమ్ ॥16॥

వారికి ఆకూతి, దేవహూతి, ప్రసూతి అని పేర్లు పెట్టారు. ఆకూతిని రుచికి, దేవహూతిని కర్దమమునికి ప్రసూతిని దక్షునికి ఇచ్చి పెండ్లి చేశారు. వారిలో ప్రసూతి యొక్క సంతానం వలన చరాచరప్రపంచం అంతా వ్యాపించింది.

ఆకుత్యాం చ రుచేశ్చాభూద్ద్వంద్వం యజ్ఞశ్చ దక్షిణా ।
యజ్ఞస్య జజ్ఞిరే పుత్రా దక్షిణాయాం చ ద్వాదశ ॥17॥

రుచికి ఆకూతి యందు యజ్ఞం, దక్షిణ అనే కవలలు కలిగినారు. యజ్ఞానికి దక్షిణయందు పన్నెండు మంది పుత్రులు పుట్టారు.

దేవహూత్యాం కర్దమాచ్చ బహ్వ్యో జాతాస్సుతా మునే ।
దక్షాజ్జాతాశ్చతస్రశ్చ తథా పుత్ర్యశ్చ వింశతిః ॥18॥

ఓ మహర్షీ! కర్దమునికి దేవహూతియందు చాలామంది కొడుకులు పుట్టారు. దక్షునికి ఇరవైనాలుగు మంది కూతుళ్లు పుట్టారు.

ధర్మాయ దత్తా దక్షేణ శ్రద్ధాద్యాస్తు త్రయోదశ ।
శృణు తాసాం చ నామాని ధర్మస్త్రీణాం మునీశ్వర ॥19॥

దక్షుడు, శ్రద్ధా మొదలగు పదమూడుమందిని ధర్మునికి ఇచ్చి పెండ్లి చేశాడు. ఓ మహర్షీ! ధర్ముని భార్యల పేర్లు చెబుతా విను.

శ్రద్ధా లక్ష్మీర్ధృతిస్తుష్టిః పుష్టిర్మేధా తథా క్రియా ।
వసుర్బుద్ధిర్లజ్జాశాంతిస్సిద్ధిః కీర్తిస్త్రయోదశ ॥20॥

శ్రద్ధ, లక్ష్మి, ధృతి తుష్టి, పుష్టి, మేధ, క్రియ, వసువు, బుద్ధి, లజ్జ, శాంతి, సిద్ధి, కీర్తి అనేవి వాళ్ల పేర్లు.

తాభ్యాం శిష్టా యవీయస్య ఏకాదశ సులోచనాః ।
ఖ్యాతిస్సత్యథసంభూతిః స్మృతిః ప్రీతిః క్షమా తథా ॥21॥

సన్నతిశ్చానురూపా చ ఊర్జా స్వాహా స్వధా తథా ।
భృగుర్భవో మరీచిశ్చ తథా చైవాంగిరా మునిః ॥22॥

పులస్త్యః పులహశ్చైవ క్రతుశ్చర్షివరస్తథా ।
అత్రిర్వసిష్ఠో వహ్నిశ్చ పితరశ్చ యథాక్రమమ్ ॥23॥

మిగిలిన పదకొండు అమ్మాయిలు వారి కంటె చిన్నవారు. ఖ్యాతి, సతి, సంభూతి, స్మృతి, ప్రీతి, క్షమ సన్నతి, అనురూప, ఊర్జ, స్వాహా, స్వధా అనేవి వారి పేర్లు. వీరిని వరుసగా భృగువు, భవుడు, మరీచి, అంగీరసుడు. పులస్త్యుడు, పులహుడు, క్రతువు, అత్రి, వసిష్ఠుడు, అగ్ని మరియు పితరులు పెళ్లి చేసుకున్నారు.

ఖ్యాతాస్తా జగృహుః కన్యా భృగ్వాద్యాస్సాధకా వరాః ।
తతస్సంపూరితం సర్వం త్రైలోక్యం సచరాచరమ్ ॥24॥

భృగువు మొదలగు సాధకశ్రేష్ఠులు ఈ కన్యలను పెళ్లాడిన తర్వాత స్థావరజంగమప్రాణులతో ముల్లోకాలు నిండి ఉన్నాయి.

ఏవం కర్మానురూపేణ ప్రాణినామంబికాపతేః ।
ఆజ్ఞయా బహవో జాతా అసంఖ్యాతా ద్విజర్షభాః ॥25॥

ఓ బ్రాహ్మణశ్రేష్ఠులారా! పార్వతీపతి యొక్క ఆదేశంతో కర్మలకు అనుగుణంగా లెక్కలేనన్ని జీవులు పుట్టాయి.

కల్పభేదేన దక్షస్య షష్టిః కన్యాః ప్రకీర్తితాః ।
తాసాం దశ చ ధర్మాయ శశినే సప్తవింశతిమ్ ॥26॥

విధినా దత్తవాన్దక్షః కశ్యపాయ త్రయోదశ ।
చతస్రః పరరూపాయ దదౌ తార్క్ష్యాయ నారద ॥27॥

భృగ్వంగిరః కృశాశ్వేభ్యో ద్వే ద్వే కన్యే చ దత్తవాన్ ।
తాభ్యస్తేభ్యస్తు సంజాతా బహ్వీ సృష్టిశ్చరాచరా ॥28॥

మరొక కల్పంలో దక్షునకు 60 మంది కన్యలు పుట్టారని చెప్పబడింది. వారిలో పదిమందిని ధర్మునకు, ఇరవయ్యేడుమందిని చంద్రునికి, కశ్యపునకు పదమూడుమందిని ఇచ్చి దక్షుడు పెళ్లి చేశాడు. ఓ నారదా! దక్షుడు నలుగురు కన్యలను గొప్పరూపం కల గరుత్మంతునకు ఇచ్చి పెళ్లి చేశాడు. భృగువు, అంగీరస, కృశాశ్వులకు ఇద్దరిద్దరు కన్యలను ఇచ్చాడు. ఈ దంపతుల ద్వారా చరాచరసృష్టి విస్తారమైంది.

త్రయోదశమితాస్తస్మై కశ్యపాయ మహాత్మనే ।
దత్తా దక్షేణ యాః కన్యా విధివన్మునిసత్తమ ॥29॥

తాసాం ప్రసూతిభిర్వ్యాప్తం త్రైలోక్యం సచరాచరమ్ ।
స్థావరం జంగమం చైవ శూన్యం నైవ తు కించన ॥30॥

ఓ మహర్షీ! దక్షుడు మహాత్ముడైన కశ్యపునకు ఏ పదమూడుమంది కన్యలను ఇచ్చి వివాహం చేశాడో, స్థావరజంగమాత్మకమైన వారి సంతానంతో మూడు లోకాలు నిండి ఖాళీ స్థలం లేకుండా అయ్యింది.

దేవాశ్చ ఋషయశ్చైవ దైత్యాశ్చైవ ప్రజజ్ఞిరే ।
వృక్షాశ్చ పక్షిణశ్చైవ సర్వే పర్వతవీరుధః ॥31॥

దేవతలు, ఋషులు, దైత్యులు, వృక్షాలు, పర్వతాలు, పక్షులు, లతలు మొదలైనవి సృష్టించబడ్డాయి.

దక్షకన్యాప్రసూతైశ్చ వ్యాప్తమేవం చరాచరమ్ ।
పాతాలతలమారభ్య సత్యలోకావధి ధ్రువమ్ ॥32॥

పాతాళం నుండి సత్యలోకం వరకు ఉన్న చరాచరజగత్తు అంతా దక్షకన్యల సంతానముచే నిండిపోయింది.

బ్రహ్మాండం సకలం వ్యాప్తం శూన్యం నైవ కదాచన ।
ఏవం సృష్టిః కృతా సమ్యగ్బ్రహ్మణా శంభుశాసనాత్ ॥33॥

బ్రహ్మాండం అంతా వ్యాపించి శూన్యస్థానం లేకుండా ఉంది. ఈ విధంగా శంభుని ఆదేశంతో బ్రహ్మ చక్కగా సృష్టిని చేశాడు.

సతీ నామ త్రిశూలాగ్రే సదా రుద్రేణ రక్షితా ।
తపోఽర్థం నిర్మితా పూర్వం శంభునా సర్వవిష్ణునా ॥34॥

పూర్వం శంభునిచే తపస్సు చేయుట కొరకు నిర్మింపబడిన సతీదేవిని రుద్రుడు త్రిశూలపు కొనలయందు ఉంచి రక్షించాడు.

సైవ దక్షాత్సముద్భూతా లోకకార్యార్థమేవ చ ।
లీలాశ్చకార బహుశో భక్తోద్ధరణహేతవే ॥35॥

ఆమె లోకకార్యాలన్నింటినీ సిద్ధింపజేయటం కోసం దక్షుని కూతురుగా జన్మించి, భక్తులను ఉద్ధరించుటకై అనేక లీలలను చేసినది.

వామాంగో యస్య వైకుంఠో దక్షిణాంగోఽహమేవ చ ।
రుద్రో హృదయజో యస్య త్రివిధస్తు శివస్స్మృతః ॥36॥

శివుని వామభాగం విష్ణువు, కుడిభాగం నేను, హృదయము నుండి రుద్రుడు పుట్టాడు. ఈ విధంగా శివుడు మూడు రూపాలలో ఉన్నాడని మహర్షులు చెప్పారు.

అహం విష్ణుశ్చ రుద్రశ్చ గుణాస్త్రయ ఉదాహృతాః ।
స్వయం సదా నిర్గుణశ్చ పరబ్రహ్మావ్యయశ్శివః ॥37॥

నేను, విష్ణువు మరియు రుద్రుడు త్రిగుణస్వరూపులము. శివపరబ్రహ్మ సదా నిర్గుణుడు. వికారాలు లేనివాడు.

విష్ణుస్సత్త్వం రజోఽహం చ తమో రుద్ర ఉదాహృతః ।
లోకాచారత ఇత్యేవం నామతో వస్తుతోఽన్యథా ॥ 38॥

విష్ణువు సత్త్వగుణం, నేను రజోగుణం, రుద్రుడు తమోగుణం. సృష్టి కార్యాలను బట్టి ఈ నామాలు ఏర్పడ్డాయి. కాని స్వాభావికంగా భేదం లేదు.

అంతస్తమో బహిస్సత్త్వో విష్ణూ రుద్రస్తథా మతః ।
అంతస్సత్త్వస్తమో బాహ్యో రజోఽహం సర్వథా మునే ॥39॥

ఓ మహర్షీ! విష్ణువునకు లోపల తమోగుణం, బయట సత్త్వగుణం ఉంటుంది. రుద్రునకు లోపల సత్త్వగుణం, బయట తమోగుణం ఉంటుంది. నాకు లోపల, బయటా రజోగుణం ఉంటుంది.

రాజసీ చ సురాదేవీ సత్త్వరూపాత్తు సా సతీ ।
లక్ష్మీస్తమోమయీ జ్ఞేయా త్రిరూపా చ శివా పరా ॥40॥

సరస్వతి రజోగుణప్రధాన, సతీదేవి సత్త్వస్వరూపురాలు. లక్ష్మీదేవి తమోమయి. శివాదేవియే ఈ మూడు రూపాలుగా ఉందని తెలుసుకోవాలి.

ఏవం శివా సతీ భూత్వా శంకరేణ వివాహితా ।
పితుర్యజ్ఞే తనుం త్యక్త్వా నాదాత్తాం స్వపదం యయౌ ॥41॥

శివాదేవి సతియై శంకరుని పెండ్లి చేసుకొంది. తండ్రి దక్షుడు చేసిన యజ్ఞంలో ఆమె శరీరాన్ని విడిచి, మరల ఆ శరీరాన్ని తీసుకోకుండా ఆమె తన ధామంలో ఉండిపోయింది.

పునశ్చ పార్వతీ జాతా దేవప్రార్థనయా శివా ।
తపః కృత్వా సువిపులం పునశ్శివముపాగతా ॥42॥

మరల దేవతలు ప్రార్థించగానే పార్వతిగా పుట్టి, ఆమె ఘోరమైన తపస్సు చేసి, మరల శివుణ్ణి పొందింది.

తస్యా నామాన్యనేకాని జాతాని చ మునీశ్వర ।
కాలికా చండికా భద్రా చాముండా విజయా జయా ॥43॥

జయంతీ భద్రకాళీ చ దుర్గా భగవతీతి చ ।
కామాఖ్యా కామదా హ్యంబా మృడానీ సర్వమంగలా ॥44॥

నామధేయాన్యనేకాని భుక్తిముక్తిప్రదాని చ ।
గుణకర్మానురూపాణి ప్రాయశస్తత్ర పార్వతీ ॥45॥

ఓ మహర్షీ! ఆమెకు చాలా పేర్లు ఉన్నాయి. కాళిక, చండిక, భద్ర, చాముండ, విజయ, జయ జయంతి, భద్రకాళి, దుర్గ, భగవతి, కామాఖ్య, కామద, అంబ, మృడాని, సర్వమంగళ ఇలా అనేక పేర్లు ఆమెకు గుణాలను బట్టి, కర్మలను బట్టి ఏర్పడ్డాయి. ఈ నామాలు భుక్తిని, ముక్తిని ఇస్తాయి. వాటిలో పార్వతి అను పేరు ప్రసిద్ధమైనది.

గుణమయ్యస్తథా దేవ్యో దేవా గుణమయాస్త్రయః ।
మిలిత్వా వివిధం సృష్టేశ్చక్రుస్తే కార్యముత్తమమ్ ॥46॥

గుణస్వరూపులైన త్రిమూర్తులు, గుణస్వరూపిణులు అయిన దేవీమూర్తులు కలిపి ఉత్తమమైన సృష్టికార్యాన్ని చేశారు.

ఏవం సృష్టిప్రకారస్తే వర్ణితో మునిసత్తమ ।
శివాజ్ఞయా విరచితో బ్రహ్మాండస్య మయాఽఖిలః ॥47॥

ఓ మహర్షీ! నేను ఈ సృష్టిక్రమాన్ని నీకు వివరించి చెప్పాను. నేనీ బ్రహ్మాండాలన్నింటినీ శివుని ఆజ్ఞతో చేశాను.

పరం బ్రహ్మ శివః ప్రోక్తస్తస్య రూపాస్త్రయస్సురాః ।
అహం విష్ణుశ్చ రుద్రశ్చ గుణభేదానురూపతః ॥48॥

శివుడు పరంబ్రహ్మ. నేను, విష్ణువు, రుద్రుడు అనే త్రిమూర్తులు గుణభేదంతో ఏర్పడిన ఆ శివుని రూపాలు మాత్రమే అని ఋషులు చెప్తున్నారు.

శివయా రమతే స్వైరం శివలోకే మనోరమే ।
స్వతంత్రః పరమాత్మా హి నిర్గుణస్సగుణోఽపి వై ॥49॥

ఆయన మనోహరమైన శివలోకంలో ఉమతో కలసి యథేచ్ఛగా తిరుగుతుంటాడు. ఆయన స్వతంత్రుడైన పరమాత్మ. నిర్గుణుడు. సగుణుడు కూడా.

తస్య పూర్ణావతారో హి రుద్రస్సాక్షాచ్ఛివః స్మృతః ।
కైలాసే భవనం రమ్యం పంచవక్త్రశ్చకార హ ॥
బ్రహ్మాండస్య తథా నాశే తస్య నాశోఽస్తి వై న హి ॥50॥

రుద్రుడు ఆయన యొక్క పూర్ణావతారం కాబట్టి సాక్షాత్తూ శివుడే అని చెప్పబడినాడు. అయిదు ముఖాల శివుడు కైలాసంలో సుందరమైన భవనం నిర్మించాడు. బ్రహ్మాండం నశించినా దానికి నాశనం లేదు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే బ్రహ్మ నారద సంవాదంలో సృష్టి వర్ణనం నామ షోడశోఽధ్యాయః ॥16॥

శ్రీశివపురాణంలోని రెండవదైన రుద్రసంహిత సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటిఖండంలో బ్రహ్మ నారదసంవాదంలో సృష్టివర్ణనం అనే పదహారవ అధ్యాయం సమాప్తం.

సప్తదశోఽధ్యాయః - పదిహేడవ అధ్యాయం

గుణనిధి చరిత్ర - గుణనిధి చరిత్ర

సూత ఉవాచ - సూతుడు ఇలా పలికాడు.

ఇత్యాకర్ణ్య వచస్తస్య బ్రహ్మణస్స తు నారదః ।
పునః పప్రచ్ఛ తం నత్వా వినయేన మునీశ్వరాః ॥1॥

ఓ మహర్షులారా! బ్రహ్మ యొక్క ఈ మాటలను విని నారదుడు వినయంతో నమస్కరించి, ఆయనను మరలా ఇలా ప్రశ్నించాడు.

నారద ఉవాచ - నారదుడు ఇలా పలికాడు.

కదా గతో హి కైలాసం శంకరో భక్తవత్సలః ।
క్వ వా సఖిత్వం తస్యాసీత్కుబేరేణ మహాత్మనా ॥2॥

భక్తవత్సలుడైన శంకరుడు కైలాసానికి ఎపుడు వెళ్లాడు? ఆయనకు మహాత్ముడైన కుబేరునితో స్నేహం ఎక్కడ కలిగింది?

కిం చకార హరస్తత్ర పరిపూర్ణశ్శివాకృతిః ।
ఏతత్సర్వం సమాచక్ష్వ పరం కౌతూహలం హి మే ॥3॥

పరిపూర్ణుడైన శివుడు అక్కడ ఏమి చేశాడు?ఈ విషయాలన్నింటినీ చెప్పండి. నాకు వినాలని చాలా కుతూహలంగా ఉంది.

బ్రహ్మోవాచ - బ్రహ్మ ఇలా చెప్పాడు.

శృణు నారద వక్ష్యామి చరితం శశిమౌలినః ।
యథా జగామ కైలాసం సఖిత్వం ధనదస్య చ ॥4॥

నారదా! విను. చంద్రమౌళి యొక్క చరిత్రను చెప్తాను. ఆయన కైలాసానికి ఎలా వెళ్లాడు. కుబేరునితో స్నేహం ఎలా కలిగింది అనే విషయాలు వివరిస్తాను.

అసీత్కాంపిల్యనగరే సోమయాజికులోద్భవః ।
దీక్షితో యజ్ఞదత్తాఖ్యో యజ్ఞవిద్యావిశారదః ॥5॥

కాంపిల్యనగరంలో యజ్ఞదత్తుడనే పండితుడున్నాడు. ఆయన సోమయాజుల వంశంలో పుట్టాడు. ఆయన యజ్ఞదీక్షను తీసుకున్న వాడు. యజ్ఞవిద్యలో సమర్థుడు.

వేదవేదాంగవిత్ప్రాజ్ఞో వేదాంతాదిషు దక్షిణః ।
రాజమాన్యోఽథ బహుధా వదాన్యః కీర్తిభాజనః ॥6॥

అతడు వేదవేదాంగాలను తెలిసినవాడు. వేదాంతాలైన ఉపనిషత్తులలో సమర్థుడు. అనేక రాజసన్మానాలను పొందినవాడు, దాత, కీర్తి కలవాడు.

అగ్నిశుశ్రూషణరతో వేదాధ్యయనతత్పరః ।
సుందరో రమణీయాంగశ్చంద్రబింబసమాకృతిః ॥7॥

అగ్నికార్యమందు శ్రద్ధ కలవాడు. వేదాధ్యయనంలో నిరతుడు. రమణీయమైన అవయవాలు గల సుందరుడు. చంద్రబింబమువంటి ముఖం కలవాడు.

ఆసీద్గుణనిధిర్నామ దీక్షితస్యాస్య వై సుతః ।
కృతోపనయనస్సోఽష్టౌ విద్యా జగ్రాహ భూరిశః ॥
అథ పిత్రానభిజ్ఞాతో ద్యూతకర్మరతోఽభవత్ ॥8॥

దీక్షితుడైన యజ్ఞదత్తునికి గుణనిధి అనే కుమారుడున్నాడు. అతడు ఎనిమిదవ యేటనే ఉపనయనం చేసుకొని అనేక విద్యలను నేర్చుకున్నాడు. అతడు తండ్రికి తెలియకుండా జూదం నందు అభిరుచి పెంచుకున్నాడు.

ఆదాయాదాయ బహుశో ధనం మాతుస్సకాశతః ।
సమదాద్ద్యూతకారేభ్యో మైత్రీం తైశ్చ చకార సః ॥9॥

తల్లివద్ద నుండి చాలా సార్లు ధనాన్ని తీసుకొని, జూదగాళ్లకు ఆ సొమ్మును ఇచ్చి, వాళ్లతో స్నేహం చేసే వాడు.

సంత్యక్తబ్రాహ్మణాచారస్సంధ్యాస్నానపరాఙ్ముఖః ।
నిందకో వేదశాస్త్రాణాం దేవబ్రాహ్మణనిందకః ॥10॥

అతడు స్నానం, సంధ్య వంటి బ్రాహ్మణాచారాలను వదలి, వేదశాస్త్రాలను, దేవబ్రాహ్మణులను నిందించేవాడైనాడు.

స్మృత్యాచారవిహీనస్తు గీతవాద్యవినోదభాక్ ।
నటపాఖండభాండైస్తు బద్ధప్రేమపరంపరః ॥11॥

స్మృతి, ఆచారాలను విడిచి పెట్టి, సంగీత, వినోదాలలో మునిగి పోయాడు. నటులతో, హాస్యగాళ్లతో మరియు పాపులతో దృఢమైన స్నేహాన్ని చేశాడు.

ప్రేరితోఽపి జనన్యా స న యయౌ పితురంతికమ్ ।
గృహకార్యాంతరవ్యాప్తో దీక్షితో దీక్షితాయినీమ్ ॥12॥

యదా యదైవ తాం పృచ్ఛేదయే గుణనిధిస్సుతః ।
న దృశ్యతే మయా గేహే కల్యాణి విదధాతి కిమ్ ॥13॥

తల్లి ప్రోత్సహించినా, అతడు తండ్రి దగ్గరకు వెళ్లలేదు. ఇతర ఇంటిపనులలో మునిగిపోయిన ఆ తండ్రి, భార్యతో ఓసీ! మన కుమారుడు గుణనిధి నాకు ఇంట్లో కనిపించటం లేదు. ఓ కల్యాణీ! వాడు ఏమి చేస్తున్నాడు?

తదా తదేతి సా బ్రూయాదిదానీం స బహిర్గతః ।
స్నాత్వా సమర్చ్య వై దేవానేతావంతమనేహసమ్ ॥14॥

అలా అడిగిన ప్రతిసారి ఆమె వాడు స్నానం చేసి, దేవతలను ఆరాధించి ఇంతవరకు పాఠాలు చదువుకొని, ఇపుడే బయటకు వెళ్లాడని చెప్పేది.

అధీత్యాధ్యయనార్థం స ద్విత్రైర్మిత్రైస్సమం యయౌ ।
ఏకపుత్రేతి తన్మాతా ప్రతారయతి దీక్షితమ్ ॥15॥

మరలా చదువుకోవటం కోసం ఇద్దరు, ముగ్గురు స్నేహితులతో వెళ్లాడు అని చెప్పేది. ఒక్కడే కొడుకు అవటం వల్ల ఆ తల్లి భర్తను మోసం చేసేది.

న తత్కర్మ చ తద్వృత్తం కించిద్వేత్తి స దీక్షితః ।
సర్వం కేశాంతకర్మాస్య చక్రే వర్షేఽథ షోడశే ॥16॥

ఆయనకు కుమారుడి చేతలు గురించి కాని, వ్యవహారం గురించి కాని ఏ మాత్రం తెలియ లేదు. దీక్షితుడు కుమారునకు పదహారవ ఏట స్నాతకం చేశాడు.

అథ స దీక్షితో యజ్ఞదత్తః పుత్రస్య తస్య చ ।
గృహ్యోక్తేన విధానేన పాణిగ్రాహమకారయేత్ ॥17॥

యజ్ఞదత్తుడు తన కుమారునకు పిమ్మట సంస్కారాలన్నింటినీ చేయించి, గృహ్యసూత్రాల ప్రకారం వివాహం చేశాడు.

ప్రత్యహం తస్య జననీ సుతం గుణనిధిం మృదు ।
శాస్తి స్నేహార్ద్రహృదయా హ్యుపవేశ్య స్మ నారద ॥18॥

ఓ నారదా! ప్రతిదినం ప్రేమ నిండిన హృదయంతో ఆ తల్లి కుమారుడు గుణనిధిని కుర్చోబెట్టి నెమ్మదిగా చెప్పేది.

క్రోధనస్తేఽస్తి తనయ స మహాత్మా పితేత్యలమ్ ।
యది జ్ఞాస్యతి తే వృత్తం త్వాం చ మాం తాడయిష్యతి ॥19॥

భయమును చెప్పేది. కుమారా! మహాత్ముడైన నీ తండ్రి చాలా కోపిష్ఠి. ఈ చెడు పనులను మానుకో. నీ విషయాలన్నీ ఆయనకు తెలిస్తే నిన్ను నన్నూ కూడా దండిస్తారు.

ఆచ్ఛాదయామి తే నిత్యం పితురగ్రే కుచేష్టితమ్ ।
లోకమాన్యోఽస్తి తే తాతస్సదాచారైర్న వై ధనైః ॥20॥

ప్రతిరోజూ నీ చెడుపనులు ఆయనకు తెలియకుండా కప్పిపుచ్చుతున్నాను. వత్సా! నీ తండ్రి ధనం వల్ల కాకుండా మంచి ఆచారాల వల్ల అందరికి పూజ్యుడయ్యాడు.

బ్రాహ్మణానాం ధనం తాత సద్విద్యా సాధుసంగమః ।
కిమర్థం న కరోషి త్వం సురుచిం ప్రీతమానసః ॥21॥

బ్రాహ్మణులకు మంచి విద్య, మంచివారితో స్నేహం అనేవి సంపదల్లాంటివి. నీకు వీటియందు ఇష్టం లేకపోవడమేంటి?

సచ్ఛ్రోత్రియాస్తేఽనూచానా దీక్షితాస్సోమయాజినః ।
ఇతి రూఢిమిహ ప్రాప్తాస్తవ పూర్వపితామహాః ॥22॥

నీ పూర్వీకులు, తాత ముత్తాతలు మంచి శ్రోత్రియులు; దీక్షితులు, సోమయాగాన్ని చేసిన వాళ్లు అని లోకంలో పేరుంది.

త్యక్త్వా దుర్వృత్తసంసర్గం సాధుసంగరతో భవ ।
సద్విద్యాసు మనో ధేహి బ్రాహ్మణాచారమాచర ॥23॥

నీవు చెడువారితో స్నేహాలు మానేసి మంచివారితో పరిచయాలు పెంచుకో. మంచి చదువులలో మనసు నిల్పు. బ్రాహ్మణ ఆచారాలను పాటించు.

తాతానురూపో రూపేణ యశసా కులశీలతః ।
తతో న త్రపసే కిన్నస్త్యజ దుర్వృత్తతాం స్వకామ్ ॥24॥

రూపంలో, కీర్తిలో, కులంలో, శీలంలో తండ్రికి తగినవాడివని అనిపించుకో. తండ్రిని చూసి నీవెందుకు భయపడవు? నీ చెడు పనులు మానుకో.

ఊనవింశతికోఽసి త్వమేషా షోడశవార్షికీ ।
ఏతాం సంవృణు సద్వృత్తాం పితృభక్తియుతో భవ ॥25॥

నీకు పంతొమ్మిది సంవత్సరాలు. ఈమె పదహారు సంవత్సరాల అమ్మాయి. పతివ్రత అయిన ఈమెను, ప్రేమించు. తండ్రియందు మంచిభక్తిని పెంచుకో.

శ్వశురోఽపి హి తే మాన్యస్సర్వత్ర గుణశీలతః ।
తతో న త్రపసే కిన్నస్త్యజ దుర్వృత్తతాం సుత ॥26॥

నీ మామగారు కూడా సద్గుణాలతోనూ, అతని ప్రవర్తనవల్లనా అన్నిచోట్ల పూజింపబడతారు. నీకు ఆయనవల్లనైనా భయం లేకపోవటానికి కారణమేమిటి? కుమారా! చెడు పనులను కట్టి పెట్టు.

మాతులాస్తేఽతులాః పుత్ర విద్యాశీలకులాదిభిః ।
తేభ్యోఽపి న బిభేషి త్వం శుద్ధోఽస్యుభయవంశితః ॥27॥

పుత్రా! విద్య, శీలం, కులం ఇలాంటి వాటిలో నీ మేనమామలు సాటి లేని వారు. నీకు వాళ్లను చూసినా భయం లేకున్నది. నీ తల్లివైపు, తండ్రివైపు వంశాలు చాలా శుద్ధమైనవి.

పశ్యైతాన్ ప్రతివేశ్మస్థాన్ బ్రాహ్మణానాం కుమారకాన్ ।
గృహేఽపి శిష్యాన్ పశ్యైతాన్ పితుస్తే వినయోచితాన్ ॥28॥

మన చుట్టు ప్రక్కల ఇళ్లలోని బ్రాహ్మణ పిల్లలను చూడు. మన ఇంట్లో ఉన్న నీ తండ్రిగారి శిష్యులను, వారి వినయాన్ని చూడు.

రాజాపి శ్రోష్యతి యదా తవ దుశ్చేష్టితం సుత ।
శ్రద్ధాం విహాయ తే తాతే వృత్తిలోపం కరిష్యతి ॥29॥

కుమారా! నీ చెడు పనుల గురించి రాజుగారికి తెలియవచ్చు. అపుడు వారికి నీ తండ్రియందు శ్రద్ధ తొలగి పోయి, ఉద్యోగానికే ముప్పు రాగలదు.

బాలచేష్టితమేవైతద్వదంత్యద్యాపి తే నరాః ।
అనంతరం హరిష్యంతి యుక్తాం దీక్షితతామిహ ॥30॥

ప్రజలు నీవి కుర్రవాని పనులని అనుకుంటున్నారు. కాని వారు కొద్దికాలంలో మీ తండ్రిగారి దీక్షితత్వాన్ని తొలగిస్తారు.

సర్వేప్యాక్షారయిష్యంతి తవ తాతం చ మామపి ।
మాతుశ్చరిత్రం తనయో ధత్తే దుర్భాషణైరితి ॥31॥

ప్రజలందరూ తండ్రిని, నన్ను కూడా నిందిస్తారు. తల్లి యొక్క శీలం కుమారునికి సంక్రమిస్తుంది. అటువంటి చెడు మాటలంటారు.

పితాపి తే న పాపీయాన్ శ్రుతిస్మృతిపథానుగః ।
తదంఘ్రిలీనమనసో మమ సాక్షీ మహేశ్వరః ॥32॥

శ్రుతి, స్మృతులు చెప్పిన దారిలో జీవించే నీ తండ్రి ఏ పాపం ఎరుగరు. నేను వారి పాదాలయందు మనసు పెట్టిన దానను. నాకు మహేశ్వరుడు సాక్షి.

న చర్తుస్నాతయాపీహ ముఖం దుష్టస్య వీక్షితమ్ ।
అహో బలీయాన్స విధిర్యేన జాతో భవానితి ॥33॥

నేను ఋతుస్నానం చేసిన తర్వాత దుష్టుల ముఖం కూడా చూడలేను. నీవు నా కొడుకువవటం విధి బలీయం అనటానికి నిదర్శనం.

ప్రతిక్షణం జనన్యేతి శిక్ష్యమాణోఽతిదుర్మతిః ।
న తత్యాజ చ తద్ధర్మం దుర్బోధో వ్యసనీ యతః ॥34॥

ఈ విధంగా ఆ తల్లి అతనికి ఎన్నిసార్లు చెప్పినా, అతిదుష్టుడైన అతడు తన చెడు తిరుగుళ్లు విడిచి పెట్టలేదు. వ్యసనాలకు బానిస అయిన వాడికి బోధించడం కష్టం.

మృగయామద్యపైశున్యానృతచౌర్యదురోదరైః ।
స వారదారైర్వ్యసనైరేభిః కోఽత్ర న ఖండితః ॥35॥

వేట, మద్యపానం, కొండెములు చెప్పటం, అబద్ధం చెప్పటం, దొంగతనం, జూదం, వేశ్యల వద్దకు పోవటం అనే వ్యసనాల వల్ల చెడిపోని వాడెవ్వడు?

యద్యన్మధ్యగృహే పశ్యేత్తత్తన్నీత్వా సుదుర్మతిః ।
అర్పయేద్ద్యూతకారాణాం సకుప్యం వసనాదికమ్ ॥36॥

దుష్టుడైన అతడు ఇంటిలో కనిపించిన వస్తువులన్నింటినీ, గిన్నెలు, బట్టలతో సహా జూదగాళ్లకు ఇచ్చేశాడు.

న్యస్తాం రత్నమయీం గేహే కరస్య పితురూర్మికామ్ ।
చోరయిత్వైకదాదాయ దురోదరకరేఽర్పయత్ ॥37॥

ఒకరోజు అతడు తన తండ్రి వ్రేలి రత్నపుటుంగరాన్ని ఇంటిలో నుండి దొంగిలించి జూదగాడికి అప్పగించాడు.

దీక్షితేన పరిజ్ఞాతో దైవాద్ద్యూతకృతః కరే ।
ఉవాచ దీక్షితస్తం చ కుతో లబ్ధా త్వయోర్మికా ॥38॥

దైవవశాన దీక్షితుడు ఆ జూదగాని చేతికి గల ఉంగరాన్ని గుర్తించి అతనితో ఇలా అన్నాడు. "నీకీ ఉంగరం ఎక్కడి నుంచి వచ్చింది?"

పృష్టస్తేనాథ నిర్బంధాదసకృత్తమువాచ సః ।
మామాక్షిపసి విప్రోచ్చైః కిం మయా చౌర్యకర్మణా ॥39॥

ఆయన వాడిని అనేక సార్లు నిర్బంధంతో ప్రశ్నించగా అతడు ఇలా అన్నాడు. బ్రాహ్మణోత్తమా! నన్ను బలవంతంగా అడుగుతున్నావు. నేను దొంగతనం చేసి ఈ ఉంగరాన్ని సంపాదించాననుకున్నావా?

లబ్ధా ముద్రా త్వదీయేన పుత్రేణైవ సమర్పితా ।
మమ మాతుర్హి పూర్వేద్యుర్జిత్వా నీతో హి శాటకః ॥40॥

దీనిని నీ కుమారుడే నాకిచ్చాడు. అతడు నిన్న గెలిచి నా తల్లి చీరను పట్టుకెళ్ళిపోయాడు.

న కేవలం మమైవైతదంగులీయం సమర్పితమ్ ।
అన్యేషాం ద్యూతకర్తౄణాం భూరి తేనార్పితం వసు ॥41॥

రత్నకుప్యదుకూలాని శృంగారప్రభృతీని చ ।
భాజనాని విచిత్రాణి కాంస్యతామ్రమయాని చ ॥42॥

నాకు మాత్రమే ఈ ఉంగరాన్ని ఇవ్వలేదు. అతడు ఇతర జూదగాళ్లకి చాలా ధనాన్ని ఇచ్చాడు. రత్నాలను, పట్టుబట్టలను, ఇతర వస్త్రాలను, విచిత్రమైన కంచు, రాగి పాత్రలను కూడా పణంగా పెట్టి అతడు జూదంలో ఓడిపోయాడు.

నగ్నీకృత్య ప్రతిదినం బధ్యతే ద్యూతకారిభిః ।
న తేన సదృశః కశ్చిదాక్షికో భూమిమండలే ॥43॥

అతనిని జూదగాళ్లు ప్రతిరోజూ బంధించి బట్టలు ఒలుచుకుంటున్నారు. ఈ భూమండలంలో అతనితో సమానమైన జూదగాడు లేడు.

అద్యావధి త్వయా విప్ర దురోదరశిరోమణిః ।
కథం నాజ్ఞాయి తనయోఽవినయానయకోవిదః ॥44॥

హే బ్రాహ్మణోత్తమా! నీ కొడుకు జూదగాళ్లకు నాయకుడు. అవినయంలో, మోసంలో పండితుడు. అలాంటి సంగతులు ఈనాటి వరకు, నీకెందుకు తెలియలేదు?

ఇతి శ్రుత్వా త్రపాభారవినమ్రతరకంధరః ।
ప్రావృత్య వాససా మౌలిం ప్రావిశన్నిజమందిరమ్ ॥45॥

ఈ మాటలను విని సిగ్గుతో తలను, వంచుకొని, బట్టతో శిరస్సును కప్పుకొని ఇంటికి వెళ్లాడు.

మహాపతివ్రతామస్య పత్నీం ప్రోవాచ తామథ ।
స దీక్షితో యజ్ఞదత్తశ్రౌతకర్మపరాయణః ॥46॥

అపుడు దీక్షితుడు, వేదకర్మపండితుడు అయిన యజ్ఞదత్తుడు మహాపతివ్రత అయిన భార్యతో అన్నాడు.

యజ్ఞదత్త ఉవాచ – యజ్ఞదత్తుడు ఇలా అన్నాడు.

దీక్షితాయని! కుత్రాస్తి ధూర్తో గుణనిధిస్సుతః ।
అథ తిష్ఠతు కిం తేన క్వా సా మమ శుభోర్మికా ॥ 47॥

ఓ సోమిదేవమ్మా! ధూర్తుడయిన! నీ కొడుకు గుణనిధి ఎక్కడ ఉన్నాడు? అయినా వాడితో నాకు పనేంటి? నా మంగళకరమైన ఉంగరం ఎక్కడుంది?

అంగోద్వర్తనకాలే యా త్వయా మేఽంగులితో హృతా ।
సా త్వం రత్నమయీ శీఘ్రం తామానీయ ప్రయచ్ఛ మే ॥48॥

నీవు నా వంటికి నూనె మర్దనం చేసే సమయంలో నా వేలునుండి తీశావు. కాబట్టి నీవు నా రత్నపుటుంగరాన్ని వెంటనే తెచ్చి నాకు ఇవ్వు.

ఇతి శ్రుత్వాథ తద్వాక్యం భీతా సా దీక్షితాయనీ ।
ప్రోవాచ స్నానమధ్యాహ్నీం క్రియాం నిష్పాదయంత్యథ ॥49॥

ఈ మాటలు విని భయపడిన సోమిదేవమ్మ ఇలా అంది. నేను మీకు మధ్యాహ్నస్నానానికి ఏర్పాటు చేస్తున్నాను.

వ్యగ్రాస్మి దేవపూజార్థముపహారాదికర్మణి ।
సమయోఽయమతిక్రామేదతిథీనాం ప్రియాతిథే! ॥50॥

మరియు దేవపూజకు కావలసిన ఏర్పాట్లలో తీరిక లేక ఉన్నాను. మీకు అతిథులంటే చాలా ఇష్టం కదా! వారికి వేళ మించి పోగలదు.

ఇదానీమేవ పక్వాన్నకారణవ్యగ్రయా మయా ।
స్థాపితా భాజనే క్వాపి విస్మృతేతి న వేద్మ్యహమ్ ॥51॥

నేను ఇపుడు అన్నం వండే పనితో తీరిక లేకుండా ఉన్నాను. నేను ఆ ఉంగరాన్ని ఏదో గిన్నెలో పెట్టాను. ఎక్కడ అన్నది మరచిపోయాను ఇపుడు అది ఎక్కడుందో తెలియదు.

దీక్షిత ఉవాచ - దీక్షితుడు ఇలా అన్నాడు.

హం హేఽసత్పుత్రజనని నిత్యం సత్యప్రభాషిణి ।
యదా యదా త్వాం సంపృచ్ఛేత్తనయః క్వ గతస్త్వితి ॥52॥

తదా తదేతి త్వం బ్రూయాన్నాథేదానీం స నిర్గతః ।
అధీత్యాధ్యయనార్థం చ ద్విత్రైర్మిత్రైస్సయుగ్బహిః ॥53॥

ఓసీ! దుష్టకుమారుని తల్లీ! నువ్వు నిత్యం నిజాన్నే చెబుతావు కాబోలు. కుమారుడు ఎక్కడకు వెళ్లాడు? అని అడిగిన ప్రతిసారి నాథా! ఇప్పటి వరకు చదువుకొని ఇద్దరు ముగ్గురు మిత్రులతో కలసి, చదువుకోవటానికి ఇపుడే బయటకు వెళ్లాడు అని చెప్పేదానివి.

కుతస్తే శాటకః పత్ని మాంజిష్ఠో యో మయార్పితః ।
లంభతేయోఽనిశం ధామ్ని తథ్యం బ్రూహి భయం త్యజ ॥54॥

హే పత్నీ! నేను నీకు చక్కగా ప్రకాశించే ఎర్రని పట్టుచీర ఇచ్చాను. అది ఏమైంది? భయం లేకుండా నిజం చెప్పు.

సాంప్రతం నేక్ష్యతే సోఽపి భృంగారో మణిమండితః ।
పట్టసూత్రమయీ సాపి త్రిపటీ యా మయార్పితా ॥55॥

ఇంకా, మణులు పొదిగిన బంగారు గిన్నె కనిపించటం లేదు. నేను నీకు మూడుపేటలతో నేసిన పట్టువస్త్రమును ఇచ్చాను. అదీ కనిపించటం లేదు.

క్వ దాక్షిణాత్యం తత్కాంస్యం గౌడీ తామ్రఘటీ క్వ సా ।
నాగదంతమయీ సా క్వ సుఖకౌతుకమంచికా ॥56॥

దక్షిణదేశం నుండి తెచ్చిన ఇత్తడిగిన్నె ఎక్కడుంది? గౌడ దేశం నుండి తెచ్చిన రాగిపాత్ర ఏది? ఏనుగు దంతాలతో తయారైనదీ సుఖాన్నిచ్చేదీ అయిన మంచం ఎక్కడ?

క్వ సా పర్వతదేశీయా చంద్రకాంతిరివాద్భుతా ।
దీపకవ్యగ్రహస్తాగ్రాలంకృతా శాలభంజికా ॥57॥

పర్వతప్రాంతంలో తయారైనదీ, వెన్నెలలా ప్రకాశించేదీ చేతిలో దీపం పట్టుకున్నదీ అయిన శాలభంజిక ఏది?

కిం బహూక్తేన కులజే తుభ్యం కుప్యామ్యహం వృథా ।
తదాభ్యవహరిష్యేహముపయంస్యామ్యహం యదా ॥58॥

ఇన్ని మాటలెందుకు? నీవు కులస్త్రీవి. నీపై కోపించటం అనవసరం. నేను (మళ్ళీ) పెళ్లి చేసుకున్న తర్వాతే భోజనం చేస్తాను.

అనపత్యోఽస్మి తేనాహం దుష్టేన కులదూషిణా ।
ఉత్తిష్ఠానయ పాథస్త్వం తస్మై దద్యాస్తిలాంజలిమ్ ॥59॥

దుష్టుడు, కులనాశనం చేసిన వాడు అయిన వాడు నా కొడుకే కాదు. లే. నీళ్లను తీసుకొనిరా. వాడికి నువ్వులు, నీళ్లు వదిలేయి.

అపుత్రత్వం వరం నృణాం కుపుత్రాత్కులపాంసనాత్ ।
త్యజేదేకం కులస్యార్థే నీతిరేషా సనాతనీ ॥60॥

కులాన్ని చెడగొట్టేవాడైన కుపుత్రుని కంటే మానవులకు పుత్రుడు లేకపోవటమే మంచిది. కులం కోసం ఒకరిని విడిచి పెట్టాలని సనాతనధర్మం చెబుతుంది.

స్నాత్వా నిత్యవిధిం కృత్వా తస్మిన్నేవాహ్ని కస్యచిత్ ।
శ్రోత్రియస్య సుతాం ప్రాప్య పాణిం జగ్రాహ దీక్షితః ॥61॥

అతడు స్నానం చేసి నిత్యకర్మలను ఆచరించి, అదే రోజున ఒక శ్రోత్రియుని కూతుర్ని పెళ్లి చేసుకున్నాడు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే గుణనిధిచరిత్ర వర్ణనం నామ సప్తదశోఽధ్యాయః ॥17॥

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహిత సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటిఖండంలో గుణనిధిచరిత్ర అనే పదిహేడవ అధ్యాయం సమాప్తం.

అష్టాదశోఽధ్యాయః - పద్దెనిమిదవ అధ్యాయం

గుణనిధి సద్గతిని పొందుట - గుణనిధి సద్గతిని పొందుట

బ్రహ్మోవాచ - బ్రహ్మ ఇలా పలికాడు.

శ్రుత్వా తథా స వృత్తాంతం ప్రాక్తనం స్వం వినింద్య చ ।
కాంచిద్దిశం సమాలోక్య నిర్యయౌ దీక్షితాంగజః ॥1॥

దీక్షితపుత్రుడు గుణనిధి పూర్వవృత్తాంతమును విని, తన పాతకర్మలను నిందించుకొని ఏదో ఒక దిక్కుకి బయలుదేరాడు.

కియచ్చిరం తతో గత్వా యజ్ఞదత్తాత్మజస్స హి ।
దుష్టో గుణనిధిస్తస్థౌ గతోత్సాహో విసర్జితః ॥2॥

చాలాసేపు అలా ప్రయాణం చేసి, తండ్రిచే వదలిపెట్టబడిన గుణనిధి ఉత్సాహం లేకుండా ఉన్నాడు.

చింతామవాప మహతీం క్వ యామి కరవాణి కిమ్ ।
నాహమభ్యస్తవిద్యోఽస్మి న చైవాతిధనోఽస్మ్యహమ్ ॥3॥

అతడు చాలా బాధపడి నేను ఎక్కడికి వెళ్లగలను? ఏమి చేయగలను? నేను ఏ విద్యను నేర్చుకోలేదు. నా దగ్గర ధనం కూడా ఎక్కువగా లేదు.

దేశాంతరే యస్య ధనం స సద్యస్సుఖమేధతే ।
భయమస్తి ధనే చౌరాత్స విఘ్నస్సర్వతో భవః ॥4॥

మరియొకదేశంలో ధనం ఉన్నవారికి సుఖం వెంటనే లభిస్తుంది. ధనం ఉంటే దొంగల భయం తప్పదు. ఈ భయం నలుదిక్కులనుండి కలుగుతుంది.

యాజకస్య కులే జన్మ కథం మే వ్యసనం మహత్ ।
అహో బలీయాన్హి విధిః భావికర్మానుసంధయేత్ ॥5॥

దీక్షితుని ఇంటపుట్టిన నాకు ఈ చెడు అలవాట్లు ఎలా వచ్చాయి? ఆశ్చర్యం. విధి బలీయమైనది. నేను ఇపుడు ఏమి చేయాలో ఆలోచించాలి.

భిక్షితుం నాధిగచ్ఛామి న మే పరిచితః క్వచిత్ ।
న చ పార్శ్వే ధనం కించిత్ కిమత్ర శరణం భవేత్ ॥6॥

యాచించటానికి వెళ్ళలేకపోతున్నాను. నాకు తెలిసిన వాడెవ్వడూ కన్పించటం లేదు. నా దగ్గర ధనం లేదు. ఈ పరిస్థితులలో నాకు దిక్కెవరు?

సదానభ్యుదితే భానౌ ప్రసూర్మే మిష్టభోజనమ్ ।
దద్యాదద్యాత్ర కం యాచే న చేహ జననీ మమ ॥7॥

తెల్లవారకుండానే నా తల్లి నాకు విందు భోజనం పెట్టేది. ఆ తల్లి ఇపుడు ఇక్కడ లేదు. నేను ఎవరిని యాచించగలను?

ఇతి చింతయతస్తస్య బహుశస్త్ర నారద ।
అతిదీనం తరోర్మూలే భానురస్తాచలం గతః ॥8॥

ఓ నారదా! ఈ విధంగా అతడు ఒక చెట్టు మొదట్లో కూర్చుని చాలా రకాలుగా విచారిస్తుండగా సూర్యుడు అస్తమించాడు.

ఏతస్మిన్నేవ సమయే కశ్చిన్మాహేశ్వరో నరః ।
సహోపహారానాదాయ నగరాద్బహిరభ్యగాత్ ॥9॥

నానావిధాన్ మహాదివ్యాన్ స్వజనైః పరివారితః ।
సమభ్యర్చితుమీశానం శివరాత్రావుపోషితః ॥10॥

అదే సమయంలో ఒక మహేశ్వరభక్తుడు నైవేద్యం కోసం పదార్థాలను తీసుకొని నగరం నుండి బయటకు బయలుదేరాడు. అతని దగ్గర అనేక రకాల తినుపదార్థాలున్నాయి. అతని చుట్టూ వాని బంధువులున్నారు. అతడు శివరాత్రినాడు ఉపవాసం ఉండి, శివుణ్ణి పూజించటానికి వెళ్తున్నాడు.

శివాలయం ప్రవిశ్యాథ స భక్తశ్శివసక్తధీః ।
యథోచితం సుచిత్తేన పూజయామాస శంకరమ్ ॥11॥

శివునిలో మనస్సు లగ్నం చేసిన ఆ భక్తుడు శివాలయంలోకి వెళ్లి, పవిత్రమైన మనస్సుతో శివుణ్ణి పూజించాడు.

పక్వాన్నగంధమాఘ్రాయ యజ్ఞదత్తాత్మజో ద్విజః ।
పితృత్యక్తో మాతృహీనః క్షుధితస్స తమన్వగాత్ ॥12॥

తండ్రిచే విడువబడి, తల్లి లేక ఆకలితో ఉన్న గుణనిధి ఆహారపదార్థాల వాసనను చూసి అతని వెనుకనే వెళ్లాడు.

ఇదమన్నం మయా గ్రాహ్యం శివాయోపకృతం నిశి ।
సుప్తే శైవజనే దైవాత్సర్వస్మిన్ వివిధం మహత్ ॥13॥

శివభక్తులు ఆ అన్నాన్ని నైవేద్యం పెట్టి రాత్రి నిద్రపోయాక, నేను ఆ వంటకాలన్నింటిని తింటాను.

ఇత్యాశామవలంబ్యాథ ద్వారి శంభోరుపావిశత్ ।
దదర్శ చ మహాపూజాం తేన భక్తేన నిర్మితామ్ ॥14॥

ఆ విధంగా ఆలోచించి శివసన్నిధిలో గుమ్మం దగ్గర కూర్చుని ఆ భక్తుడు చేసే మహాపూజను చూశాడు.

విధాయ నృత్యగీతాది భక్తాస్సుప్తాః క్షణే యదా ।
నైవేద్యం స తదా దాతుం భర్గాగారం వివేశ హ ॥15॥

ఆ భక్తులు పాటలు పాడి, నాట్యాలు చేసి, నిద్రపోగానే, ఆ నైవేద్యాన్ని తినటానికి శివసన్నిధికి వెళ్లాడు.

దీపం మందప్రభం దృష్ట్వా పక్వాన్న వీక్షణాయ సః ।
నిజచైలాంజలాద్వర్తిం కృత్వా దీపం ప్రకాశ్య చ ॥16॥

అక్కడున్న ఆహారపదార్థాలు చూడాలంటే తగినంత దీపకాంతి లేదు. అతడు తన ఉత్తరీయం నుండి చిన్న ముక్కను చింపి వత్తిని చేసి దీపాన్ని ప్రకాశింప చేశాడు.

యజ్ఞదత్తాత్మజస్సోఽథ శివనైవేద్యమాదరాత్ ।
జగ్రాహ సహసా ప్రీత్యా పక్వాన్నం బహుశస్తతః ॥17॥

అపుడు యజ్ఞదత్తుని కుమారుడు వండిన వివిధ రకాల శివనైవేద్యాన్ని ప్రీతితో, ఆనందంతో తిన్నాడు.

తతః పక్వాన్నమాదాయ త్వరితం గచ్ఛతో బహిః ।
తస్య పాదతలాఘాతాత్ప్రసుప్తః కోప్యబుధ్యత ॥18॥

అతడు ఆహారాన్ని తిని కంగారుగా బయటకు వెళ్తుండగా వాని కాలు తగిలి నిద్రపోతున్న వ్యక్తి మేల్కొన్నాడు.

కోఽయం కోఽయం త్వరాపన్నో గృహ్యతాం గృహ్యతామసౌ ।
ఇతి చుక్రోశ స జనో గిరా భయమహోచ్చయా ॥19॥

ఎవరు వారు? ఎవరు వారు తొందరగా పట్టుకోండి అని భయంతో పెద్దగా అరిచాడు.

యావద్భయాత్సమాగత్య తావత్స పురరక్షకైః ।
పలాయమానో నిహతః క్షణాదంధత్వమాగతః ॥20॥

గుణనిధి భయపడి పరుగెత్తుతుంటే రక్షకభటులు కొట్టారు. అతడు కిందపడిపోయి కంటి చూపును పోగొట్టుకున్నాడు.

అభక్షయచ్చ నైవేద్యం యజ్ఞదత్తాత్మజో మునే ।
శివానుగ్రహతో నూనం భావి పుణ్యబలాన్న సః ॥21॥

ఓ మహర్షీ! గుణనిధి శివుని అనుగ్రహం వల్ల, మరియు లభించబోయే పుణ్య ప్రభావం వల్ల నైవేద్యాన్ని తిన్నాడు.

అథ బద్ధస్సమాగత్య పాశముద్గరపాణిభిః ।
నినీషుభిస్సంయమనీం యామ్యైస్స వికటైర్భటైః ॥22॥

అతడు మరణించుటచే భయంకరాకారులు, పాశం, ముద్గరం అనే ఆయుధాలు ధరించిన యమభటులు అక్కడికి వచ్చి అతనిని బంధించి యమలోకానికి తీసుకెళ్లటానికి సిద్ధమయ్యారు.

తావత్పారిషదాః ప్రాప్తాః కింకిణీ జాలమాలినః ।
దివ్యం విమానమాదాయ తం నేతుం శూలపాణయః ॥23॥

అపుడు చిరుగంటల మాలలు ధరించిన, చేతియందు శూలాలు ఉన్న శివగణాలు అతనిని తీసుకెళ్లటానికి దివ్యవిమానాన్ని తీసుకొచ్చారు.

శివగణా ఊచుః – శివగణములు ఇలా అన్నారు.

ముంచతైనం ద్విజం యామ్యా గణాః! పరమధార్మికమ్ ।
దండయోగ్యో న విప్రోఽసౌ దగ్ధసర్వాఘసంచయః ॥24॥

యమగణములారా! గొప్పధార్మికుడైన ఈ బ్రాహ్మణుణ్ణి విడిచి పెట్టండి. ఇతడు శిక్షకు అర్హుడు కాదు. ఇతని పాపాలన్నీ నశించాయి.

ఇత్యాకర్ణ్య వచస్తే హి యమరాజగణాస్తతః ।
మహాదేవగణానాహుర్బభూవుశ్చకితా భృశమ్ ॥25॥

ఈ మాటలు విన్న యమభటులు ఆశ్చర్యపడి, మహాదేవగణాలతో ఇలా అన్నారు.

శంభోర్గణానథాలోక్య భీతైస్తైర్యమకింకరైః ।
అవాది ప్రణతైరిత్థం దుర్వృత్తోఽయం గణా ద్విజః ॥26॥

శంభుగణాలను చూసి భయపడిన యమగణాలు నమస్కరించి ఓ గణములారా! "ఈ బ్రాహ్మణుడు దుర్మార్గుడు" అన్నారు.

యమగణా ఊచుః – యమగణాలు ఇలా అన్నారు.

కులాచారం ప్రతీర్యైష పిత్రోర్వాక్యపరాఙ్ముఖః ।
సత్యశౌచపరిభ్రష్టస్సంధ్యాస్నానవివర్జితః ॥27॥

ఈతడు కులాచారాలను విడిచి పెట్టి, తండ్రి మాటను జవదాటాడు. సత్యం, శౌచం, సంధ్యాస్నానాలను విడిచిపెట్టాడు.

ఆస్తాం దూరేస్య కర్మాణి శివనిర్మాల్యలంఘకః ।
ప్రత్యక్షతోఽత్ర వీక్షధ్వమస్పృశ్యోఽయం భవాదృశామ్ ॥28॥

ఇతడు చేసిన ఇతర పాపాలను అలా ఉంచండి. ఇతడు శివనిర్మాల్యాన్ని అవమానించటాన్ని ప్రత్యక్షంగా చూడండి. మీవంటి వాళ్లు ముట్టుకోవడానికి కూడా ఇతడు తగడు.

శివనిర్మాల్యభోక్తారశ్శివనిర్మాల్యలంఘకాః ।
శివనిర్మాల్యదాతారస్స్పర్శస్తేషాం హ్యపుణ్యకృత్ ॥29॥

శివనిర్మాల్యాన్ని తిన్నవారిని, అవమానించిన వారిని, మరియు ఇచ్చిన వారిని ముట్టుకుంటే పాపం కలుగుతుంది.

విషమాలోక్య వా పేయం శ్రేయో వా స్పర్శనం పరమ్ ।
సేవితవ్యం శివస్వం న ప్రాణైః కంఠగతైరపి ॥30॥

విషాన్ని ముట్టుకోవచ్చు. లేదా త్రాగవచ్చు. కాని ప్రాణాలు పోయే సమయంలో కూడా శివధనాన్ని తీసుకోకూడదు.

యూయం ప్రమాణం ధర్మేషు యథా న చ తథా వయమ్ ।
అస్తి చేద్ధర్మలేశోఽస్య గణాస్తం శృణుమో వయమ్ ॥31॥

ధర్మాల విషయంలో మీలా మేము ప్రమాణం. కాదు. ఓ గణములారా! వీనియందు ధర్మం కొంచెం అయినా ఉంటే మేము వింటాం.

ఇత్థం తద్వాక్యమాకర్ణ్య యామానాం శివకింకరాః ।
స్మృత్వా శివపదాంభోజం ప్రోచుః పారిషదాస్తు తాన్ ॥32॥

శివకింకరులు యమకింకరుల ఈ మాటలు విని, శివుని పాదపద్మాలను స్మరించి వారితో ఇలా అన్నారు.

శివకింకరా ఊచుః - శివకింకరులు ఇలా అన్నారు.

కింకరాశ్శివధర్మా యే సూక్ష్మాస్తే తు భవాదృశైః ।
స్థూలలక్షైః కథం లక్ష్యా లక్ష్యా యే సూక్ష్మదృష్టిభిః ॥33॥

ఓ యమకింకరులారా! శివధర్మాలు సూక్ష్మమైనవి. సూక్ష్మదృష్టి కలవాళ్లు మాత్రమే చూడగలిగే ఆ ధర్మాలను స్థూలదృష్టి ఉన్న మీలాంటి వారికి ఎట్లు కనిపిస్తాయి?

అనేనానేన సా కర్మ యత్కృతం శృణుతేహ తత్ ।
యజ్ఞదత్తాత్మజేనాథ సావధానతయా గణాః ॥34॥

ఆ పాపి అయిన గుణనిధి చేసిన కర్మను ఓ గణములారా! సావధానంగా వినండి.

పతంతీ లింగశిరసి దీపచ్ఛాయా నివారితా ।
స్వచైలాంచలతోఽనేన దత్త్వా దీపదశాం నిశి ॥35॥

ఇతడు నిన్న రాత్రి తన బట్టతో వత్తిని చేసి దీపాన్ని కాపాడి, లింగశిరస్సుపై దీపం నీడ పడకుండా చేశాడు.

అపరోఽపి పరో ధర్మో జాతస్తత్రాస్య కింకరః ।
శృణ్వతశ్శివనామాని ప్రసంగాదపి గృహ్ణతామ్ ॥36॥

ఓ కింకరులారా! ప్రసంగవశాత్తు శివనామాలను విని మరొక గొప్పధర్మాన్ని ఆచరించాడు.

భక్తేన విధినా పూజా క్రియమాణా నిరీక్షితా ।
ఉపోషితేన భూతాయామనేనాస్థితచేతసా ॥37॥

భక్తుడు ఉపవాసం ఉండి, మనసు లగ్నం చేస్తూ యథావిధిగా చేసిన పూజను ఇతడు చూశాడు.

శివలోకమయం హృద్యం గంతాస్మాభిస్సహైవ తు ।
కించిత్కాలం మహాభోగాన్ కరిష్యతి శివానుగః ॥38॥

ఇపుడు ఇతడు మాతో శివలోకానికి వచ్చి, శివుని అనుచరుడై, కొంతకాలం మహాభోగాలు అనుభవిస్తాడు.

కలింగరాజో భవితా తతో నిర్ధూతకల్మషః ।
ఏష ద్విజవరో నూనం శివప్రియతరో యతః ॥39॥

తర్వాత అన్ని దోషాలు తొలగిపోయిన ఈ బ్రాహ్మణశ్రేష్ఠుడు శివునికి మిక్కిలి ఇష్టం కలిగినవాడైనందు వలన కళింగదేశరాజు అవుతాడు.

అన్యత్కించిన్న వక్తవ్యం యూయం యాత యథాగతమ్ ।
యమదూతాస్స్వలోకం తు సుప్రసన్నేన చేతసా ॥40॥

మీతో చెప్పటానికి ఇంకేమి లేదు. యమదూతలారా! మీరు ప్రసన్నమనసులతో వచ్చిన దారినే మీ లోకానికి వెళ్లండి.

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇలా పలికాడు.

ఇత్యాకర్ణ్య వచస్తేషాం యమదూతా మునీశ్వర ।
యథాగతం యయుస్సర్వే యమలోకం పరాఙ్ముఖాః ॥41॥

ఓ మునిశ్రేష్ఠా! యమదూతలు ఈ మాటలను విని వెనుదిరిగి యమలోకానికి వచ్చిన దారినే అందరూ వెళ్లిపోయారు.

సర్వం నివేదయామాసుశ్శమనాయ గణా మునే ।
తద్వృత్తమాదితః ప్రోక్తం శంభుదూతైశ్చ ధర్మతః ॥ 42॥

మహర్షీ! శంభుని దూతలు ధర్మం ప్రకారం చేసిన ఈ పనులన్నింటినీ యమదూతలు యమునికి తెలియ చేసి విన్నవించారు.

యమధర్మరాజ ఉవాచ – యమధర్మరాజు ఇలా అన్నాడు.

సర్వే శ్రుణుత మద్వాక్యం సావధానతయా గణాః ।
తదేవ ప్రీత్యా కురుత మచ్ఛాసనపురస్సరమ్ ॥43॥

ఓ గణములారా! మీరంతా సావధానంగా నా మాటలను విని, నా ఈ ఆజ్ఞను ఇష్టంతో ఆచరించండి.

యే త్రిపుండ్రధరా లోకే విభూత్యా సితయా గణాః ।
తే సర్వే పరిహర్తవ్యా నానేతవ్యాః కదాచన ॥44॥

లోకంలో తెల్లని విభూతితో త్రిపుండ్రాన్ని ధరించే వాళ్లని ఇచటకు ఎప్పుడూ తీసుకొని రావద్దు. వారికి దూరంగా ఉండండి.

ఉద్ధూలనకరా యే హి విభూత్యా సితయా గణాః ।
తే సర్వే పరిహర్తవ్యా నానేతవ్యాః కదాచన ॥45॥

తెల్లని విభూతితో చేతులను భస్మమయం చేసుకున్నవారిని ఇచటకు ఎపుడూ తీసికొని రావద్దు. వారికి దూరంగా ఉండండి.

యే రుద్రాక్షధరా లోకే జటాధారిణ ఏవ యే ।
తే సర్వే పరిహర్తవ్యా నానేతవ్యాః కదాచన ॥46॥

రుద్రాక్షలను ధరించే వారిని, జటాధారుల్ని ఇక్కడకు ఎప్పుడూ తీసుకొని రావద్దు. వారికి దూరంగా ఉండండి.

శివవేషతయా లోకే యేన కేనాపి హేతునా ।
తే సర్వే పరిహర్తవ్యా నానేతవ్యాః కదాచన ॥47॥

కారణం ఏదైనా శివవేషధారుల్ని ఎప్పుడూ తీసికొని రావద్దు. వారికి దూరంగా ఉండండి.

ఉపజీవనహేతోశ్చ శివవేషధరా హి యే ।
తే సర్వే పరిహర్తవ్యా నానేతవ్యాః కదాచన ॥48॥

జీవిక కోసం శివవేషాన్ని ధరించిన వారిని ఇక్కడికి ఎప్పుడూ తీసికొని రావద్దు. వారికి దూరంగా ఉండండి.

దంభేనాపి చ్ఛలేనాపి శివవేషధరా హి యే ।
తే సర్వే పరిహర్తవ్యా నానేతవ్యాః కదాచన ॥49॥

తాము ధర్మాత్ములమని చెప్పటం కోసం కాని, ఇతరులను మోసగించటానికి గాని శివవేషం ధరించిన వారిని ఇక్కడికి ఎప్పుడూ తీసికొని రావద్దు. వారికి దూరంగా ఉండండి.

ఏవమాజ్ఞాపయామాస స యమో నిజకింకరాన్ ।
తథేతి మత్వా తే సర్వే తూష్ణీమాసన్ శుచిస్మితాః ॥50॥

ఈ విధంగా యముడు తన భటులను ఆదేశించాడు. వారందరూ చిరునవ్వుతో అలాగే చేస్తామని నిర్ణయించుకున్నారు.

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇలా చెప్పాడు.

పార్షదైర్యమదూతేభ్యో మోచితస్త్వితి స ద్విజః ।
శివలోకం జగామాశు తైర్గణైశ్శుచిమానసః ॥51॥

యమదూతల నుండి ఈ విధంగా శివగణాలచే విడిపింపబడి ఆ బ్రాహ్మణుడు శుద్ధమైన మనస్సు కలిగి వాళ్లతో కలసి శివలోకానికి వెళ్లాడు.

తత్ర భుక్త్వాఖిలాన్ భోగాన్ సంసేవ్య చ శివాశివౌ ।
అరిందమస్య తనయః కలింగాధిపతేరభూత్ ॥52॥

అక్కడ అన్ని భోగాలను అనుభవించి, పార్వతీ పరమేశ్వరులను చక్కగా సేవించి, కలింగ రాజైన అరిందముని కుమారునిగా పుట్టాడు.

దమ ఇత్యభిధానోఽభూచ్ఛివసేవపరాయణః ।
బాలోఽపి శిశుభిస్సాకం శివభక్తిం చకార సః ॥53॥

అతని పేరు దముడు. అతడు చిన్నతనం నుండే శివుని పూజించడంలో శ్రద్ధ కలవాడై పిల్లలతో కలసి శివుని భజించే వాడు.

క్రమాద్రాజ్యమవాప్యాథ పితర్యుపరతే యువా ।
ప్రీత్యా ప్రవర్తయామాస శివధర్మాంశ్చ సర్వశః ॥54॥

క్రమంగా కొంత కాలానికి, తండ్రి మరణించాక యువకుడైన దమునికి రాజ్యాధికారం కలిగింది. అతడు అన్నిచోట్లా శివధర్మాలను అభివృద్ధి చేశాడు.

నాన్యం ధర్మం స జానాతి దుర్దమో భూపతిర్దమః ।
శివాలయేషు సర్వేషు దీపదానాదృతే ద్విజాః ॥55॥

ఓ బ్రాహ్మణులారా! ఆ దమమహారాజుకి శివాలయాలన్నింటిలో దీపాలను వెలిగింప చేయటం తప్ప మరో ధర్మం తెలియదు.

గ్రామాధీశాన్సమాహూయ సర్వాన్స విషయస్థితాన్ ।
ఇత్థమాజ్ఞాపయామాస దీపా దేయాశ్శివాలయే ॥56॥

అతడు రాజ్యంలోని గ్రామాధికారులనందర్నీ పిలిచి శివాలయాల్లో దీపాలు వెలిగించాలని ఆజ్ఞాపించాడు.

అన్యథా సత్యమేవేదం స మే దండ్యో భవిష్యతి ।
దీపదానాచ్ఛివస్తుష్టో భవతీతి శ్రుతీరితమ్ ॥57॥

అలా చేయని వారిని దండిస్తాను. ఇది నిజం. దీపాలు వెలిగిస్తే శివుడు సంతృప్తి చెందుతాడని వేదాలు చెప్తున్నాయి.

యస్య యస్యాభితో గ్రామం యావంతశ్చ శివాలయాః ।
తత్ర తత్ర సదా దీపో ద్యోతనీయోఽవిచారితమ్ ॥58॥

ప్రతి అధికారి తనకు అధికారం ఉన్న గ్రామంలో ఎన్ని శివాలయాలు ఉన్నాయో, అన్నింట్లోనూ ప్రతిరోజూ దీపాన్ని ఏర్పాటు చేయాలి. ఈ విషయంలో చర్చకు చోటు లేదు.

మమాజ్ఞాభంగదోషేణ శిరచ్ఛేత్స్యామ్యసంశయమ్ ।
ఇతి తద్భయతో దీప్తాః దీపాః ప్రతిశివాలయమ్ ॥59॥

నా ఆజ్ఞను వ్యతిరేకించినవారికి ఉరిశిక్ష వేయబడుతుంది. సందేహం లేదు. ఈ విధమైన రాజభయం వల్ల ప్రతి శివాలయంలో దీపాలు ప్రకాశించాయి.

అనేనైవ స ధర్మేణ యావజ్జీవం దమో నృపః ।
ధర్మర్ధిం మహతీం ప్రాప్య కాలధర్మవశం గతః ॥60॥

దమమహారాజు బ్రతికి ఉన్నంతకాలం ఇదే ధర్మాన్ని ఆచరించి, మంచి పుణ్యాన్ని సంపాదించుకొని కాలధర్మాన్ననుసరించి మరణించాడు.

స దీపవాసనాయోగాద్బహూన్దీపాన్ప్రదీప్య వై ।
అలకాయాః పతిరభూద్రత్నదీపశిఖాశ్రయః ॥61॥

అతడు దీపాన్ని వెలిగించిన సంస్కార బలంతో, అనేక దీపాలను వెలిగించి, దీపకాంతులకు నిలయమైన అలకానగరానికి ప్రభువు అయ్యాడు.

ఏవం ఫలతి కాలేన శివేఽల్పమపి యత్కృతమ్ ।
ఇతి జ్ఞాత్వా శివే కార్యం భజనం సుసుఖార్థిభిః ॥62॥

ఈ విధంగా శివునికి చేసిన ఆరాధన అతి చిన్నదైనా కొంతకాలానికి ఫలిస్తుందని తెలుసుకొని సుఖాన్ని కోరుకునే మానవులు శివుని భజించాలి.

క్వ స దీక్షితదాయాదస్సర్వధర్మారతిస్సదా ।
శివాలయే దైవయోగాద్యాతశ్చోరయితుం వసు ॥
స్వార్థదీపదశోద్యోతలింగమౌలితమో హరః ॥63॥

అన్నివేళలా అన్ని ధర్మాలకు దూరమైన దీక్షితపుత్రుడు ఎక్కడ? ఆతడు దైవయోగం వలన శివాలయ సంపదను దోచుకొనేందుకు శివాలయంలోకి వెళ్లాడు. ఒక ప్రయోజనం కోసం ఈతడు దీపాన్ని ప్రకాశింప చేస్తే శివలింగశిరస్సుపై ఉన్న చీకటి పోయింది.

కలింగవిషయే రాజ్యం ప్రాప్తో ధర్మరతిం సదా ।
శివాలయే సముద్దీప్య దీపాన్ ప్రాగ్వాసనోదయాత్ ॥64॥

అతడు కళింగదేశాధిపతి అయ్యి, ఎపుడూ ధర్మశ్రద్ధ కలిగి ఉన్నాడు. పూర్వసంస్కారం వలన ఇతడు శివాలయంలో దీపాలు వెలిగించేటట్లు చేసాడు.

క్వైషా దిక్పాలపదవీ మునీశ్వర! విలోకయ ।
మనుష్యధర్మిణానేన సాంప్రతం యేహ భుజ్యతే ॥65॥

ఓ మునిశ్రేష్ఠా! దిక్పాలపదవి ఎక్కడ? చూడు. ఇపుడు ఇతడు కుబేరుడై ఎంతో ఉన్నతమైన దిక్పాలపదవిని అనుభవిస్తున్నాడు.

ఇతి ప్రోక్తం గుణనిధేర్యజ్ఞదత్తాత్మజస్య హి ।
చరితం శివసంతోషం శృణ్వతాం సర్వకామదమ్ ॥66॥

యజ్ఞదత్తుని కుమారుడైన గుణనిధికథను ఇంతవరకు చెప్పాను. ఈ చరితం శివునికి ఆనందం కలిగిస్తుంది. వినే వారి కోరికలనన్నింటినీ తీరుస్తుంది.

సర్వదేవ శివేనాసౌ సఖిత్వం చ యథేయివాన్ ।
తదప్యేకమనా భూత్వా శృణు తాత బ్రవీమి తే ॥67॥

దేవదేవుడగు శివునితో ఇతనికి స్నేహం ఎలా కలిగిందో ఆ వృత్తాంతాన్ని చెప్తాను. హే వత్సా! నువ్వు మనసును లగ్నం చేసుకొని విను.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే గుణనిధిసద్గతిర్నామ అష్టాదశోఽధ్యాయః ॥18॥

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితలోని సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటి ఖండంలోని గుణనిధి సద్గతిని పొందుట అనే పద్దెనిమిదవ అధ్యాయం సమాప్తం.

ఏకోనవింశోఽధ్యాయః - పందొమ్మిదవ అధ్యాయం

శివకుబేరమైత్రీ - శివునితో కుబేరుని మైత్రి

బ్రహ్మోవాచ - బ్రహ్మ ఇలా చెప్పాడు.

పాద్మే కల్పే మమ పురా బ్రహ్మణో మానసాత్సుతాత్ ।
పులస్త్యాద్విశ్రవా జజ్ఞే తస్య వై శ్రవణస్సుతః ॥1॥

పూర్వం పాద్మకల్పంలో బ్రహ్మయైన నా యొక్క మానసపుత్రుడు పులస్త్యునకు విశ్రవశుడు అనే కొడుకు పుట్టాడు. అతనికి వైశ్రవణుడు (కుబేరుడు) అనే కొడుకు పుట్టాడు.

తేనేయమలకా భుక్తా పురీ విశ్వకృతా కృతా ।
ఆరాధ్య త్ర్యంబకం దేవమత్యుగ్రతపసా పురా ॥2॥

అతడు పూర్వం మూడు కన్నుల దేవుని అతిఘోరమైన తపస్సుతో ఆరాధించి, విశ్వకర్మచే నిర్మించబడిన ఈ అలకాపురిని పాలించాడు.

వ్యతీతే తత్ర కల్పే వై ప్రవృత్తే మేఘవాహనే ।
యాజ్ఞదత్తిరసౌ శ్రీదస్తపస్తేపే సుదుస్సహమ్ ॥3॥

పాద్మకల్పం గడిచి, మేఘవాహనకల్పం రాగా, యజ్ఞదత్తుని కుమారుడుగా ఉన్న ఆ కుబేరుడు ఘోరమైన తపస్సు చేశాడు.

భక్తిప్రభావం విజ్ఞాయ శంభోస్తద్దీపమాత్రతః ।
పురా పురారేస్సంప్రాప్య కాశికాం చిత్ప్రకాశికామ్ ॥4॥

దీపం వెలిగించిన మహాపుణ్యంతో, భక్తిప్రభావాన్ని తెలుసుకొని, అతడు శివుని చైతన్యస్వరూపాన్ని ప్రకాశింపచేసే కాశీనగరానికి వెళ్లాడు.

శివైకాదశముద్బోధ్య చిత్తరత్నప్రదీపకైః ।
అనన్యభక్తిస్నేహాఢ్యస్తన్మయో ధ్యాననిశ్చలః ॥5॥

అతడు మనస్సు అనే రత్నదీపంతో పదకొండు రుద్రులను మేల్కొలిపి, గొప్పదైన భక్తితో, ధ్యానంలో కదలని మనస్సుతో ఉన్నాడు.

శివైక్యం సుమహాపాత్రం తపోగ్నిపరిబృంహితమ్ ।
కామక్రోధమహావిఘ్నపతంగాఘాతవర్జితమ్ ॥6॥

తపస్సనే అగ్నిచే వర్ధిల్లజేయబడి; కామం, క్రోధం, పెద్ద ఆటంకం అనే పక్షుల దెబ్బలులేని శివైక్యభావాన్ని యోగ్యులే పొందగలరు.

ప్రాణసంరోధనిర్వాతం నిర్మలం నిర్మలేక్షణాత్ ।
సంస్థాప్య శాంభవం లింగం సద్భావకుసుమార్చితమ్ ॥7॥

అతడు ప్రాణాయామంతో వాయువును స్తంభింప చేసి, అంతర్ముఖత్వంతో శంభులింగాన్ని స్థాపించుకొని, పవిత్రమైన చిత్తవృత్తులనే పువ్వులతో పూజించాడు.

తావత్తతాప స తపస్త్వగస్థిపరిశేషితమ్ ।
యావద్బభూవ తద్వర్ష్మవర్షాణామయుతం శతమ్ ॥8॥

అతడు శరీరంలో చర్మం, ఎముకలు మిగిలేంతవరకు పదివేలసంవత్సరాల కాలం తపస్సు చేశాడు.

తతస్సహ విశాలాక్ష్యా దేవో విశ్వేశ్వరస్స్వయమ్ ।
అలకాపతిమాలోక్య ప్రసన్నేనాంతరాత్మనా ॥9॥

అపుడు విశ్వేశ్వరుడు విశాలాక్షితో కలసి, ప్రసన్నమైన మనసుతో స్వయంగా ప్రత్యక్షమై, అలకాపతి అయిన కుబేరుని చూశాడు.

లింగే మనస్సమాధాయ స్థితం స్థాణుస్వరూపిణమ్ ।
ఉవాచ వరదోఽస్మీతి తదాచక్ష్వాలకాపతే ॥10॥

అతడు మనస్సును లింగంపై లగ్నం చేసి రాయిలా నిల్చున్నాడు. అపుడు శివుడు 'ఓ అలకాపతీ! వరాన్నిస్తాను. కోరుకో' అన్నాడు.

ఉన్మీల్య నయనే యావత్స పశ్యతి తపోధనః ।
తావదుద్యత్సహస్రాంశుసహస్రాధికతేజసమ్ ॥11॥

పురో దదర్శ శ్రీకంఠం చంద్రచూడముమాధవమ్ ।
తత్తేజః పరిభూతాక్షితేజాః సమ్మీల్య లోచనే ॥12॥

తపస్సే ధనంగా గల ఆ కుబేరుడు కన్నులు తెరిచి ఉదయించే కోటిసూర్యులకన్న అధికమైన తేజస్సు కలిగి విషాన్ని కంఠంలో ధరించి, చంద్రుని శిరస్సుపై అలంకరించుకొని, నిలిచిన పార్వతీపతిని ఎదురుగా చూశాడు. ఆ తేజస్సును కళ్లతో చూడలేక వెంటనే కళ్లు మూసుకున్నాడు.

ఉవాచ దేవదేవేశం మనోరథపదాతిగమ్ ।
నిజాంఘ్రిదర్శనే నాథ దృక్సామర్థ్యం ప్రయచ్ఛ మే ॥13॥

మనస్సుకి కనిపించని ఆ దేవదేవునితో అతడు ఇలా అన్నాడు. "నాథా! నీ పాదాలను చూడగలిగే శక్తిని నా కన్నులకు ప్రసాదించు".

అయమేవ వరో నాథ యత్త్వం సాక్షాన్నిరీక్ష్యసే ।
కిమన్యేన వరేణేశ నమస్తే శశిశేఖర ॥14॥

నాథా! నిన్ను ప్రత్యక్షంగా చూడగల్గుటయే నేను కోరే వరం. ఈశా! ఇతర వరాలతో పని ఏంటి? ఓ చంద్రశేఖరా! నీకు నమస్కారం.

ఇతి తద్వచనం శ్రుత్వా దేవదేవ ఉమాపతిః ।
దదౌ దర్శనసామర్థ్యం స్పృష్ట్వా పాణితలేన తమ్ ॥15॥

పార్వతీపతి ఈ మాటలను విని, అతనిని అరచేతితో ముట్టుకొని, చూడగలిగే శక్తిని ఇచ్చాడు.

ప్రసార్య నయనే పూర్వముమామేవ వ్యలోకయత్ ।
తతోఽసౌ యాజ్ఞదత్తిస్తు తత్సామర్థ్యమవాప్య చ ॥16॥

యజ్ఞదత్తు కుమారుడైన ఆ కుబేరుడు చూడగలిగే శక్తిని పొంది, కళ్లను తెరిచి, ముందుగా పార్వతీదేవిని చూశాడు.

శంభోస్సమీపే కా యోషిదేషా సర్వాంగసుందరీ ।
అనయా కిం తపస్తప్తం మమాపి తపసోఽధికమ్ ॥17॥

శంభుని సమీపంలో సర్వాంగ సుందరియైన ఈ యువతి ఎవరు? ఈమె ఎలాంటి తపస్సు చేసిందో కదా! నాకంటె ఎక్కువ తపస్సు చేసినదేమో?

అహో రూపమహో ప్రేమ సౌభాగ్యం శ్రీరహో భృశమ్ ।
ఇత్యవాదీదసౌ పుత్రో ముహుర్ముహురతీవ హి ॥18॥

అహో! ఏమి రూపం? అహో ఏమి ప్రేమ? ఏమి సౌభాగ్యం? ఏమి శోభ? ఇలా కుబేరుడు మరల మరలా పలుకుతూ అతిగా ప్రవర్తించాడు.

క్రూరదృగ్వీక్షతే యావత్పునః పునరిదం వదన్ ।
తావత్పుస్ఫోట తన్నేత్రం వామం వామవిలోకనాత్ ॥19॥

ఇలా మాట్లాడుతూ ఆమెను క్రూరంగా చూడటం వలన అతని ఎడమ కన్ను పగిలిపోయింది.

అథ దేవ్యబ్రవీద్దేవం కిమసౌ దుష్టతాపసః ।
అసకృద్వీక్ష్య మాం వక్తి కురు త్వం మే తపఃప్రభామ్ ॥20॥

అపుడా దేవి శివునితో ఇలా పలికింది. 'ఏమి ఇది? ఈ దుష్టుడు అదే పనిగా నన్ను చూసి మాట్లాడుతున్నాడు? నా తపశ్శక్తిని వీనికి తెలియ చేయండి.

అసకృద్దక్షిణేనాక్ష్ణా పునర్మామేవ పశ్యతి ।
అసూయమానో మే రూపప్రేమసౌభాగ్యసంపదా ॥21॥

మరల మరల నన్నే చూస్తున్నాడు. నా రూపాన్ని, ప్రేమను, సౌభాగ్యాన్ని, సంపదను చూసి అసూయ పడుతున్నాడు'.

ఇతి దేవీగిరం శ్రుత్వా ప్రహస్య ప్రాహ తాం ప్రభుః ।
ఉమే త్వదీయః పుత్రోఽయం న చ క్రూరేణ చక్షుషా ॥22॥

దేవి పార్వతి మాటలను విని శివప్రభువు చిరునవ్వుతో ఇలా అన్నాడు. 'ఉమా! ఇతడు నీ కుమారుడు. ఇతడు నిన్ను క్రూరదృష్టితో చూడటం లేదు.

సంపశ్యతి తపోలక్ష్మీం తవ కిం త్వధివర్ణయేత్ ।
ఇతి దేవీం సమాభాష్య తమీశః పునరబ్రవీత్ ॥23॥

పైగా నీ తపస్సంపదను వర్ణిస్తున్నాడు'. ఇలా దేవితో పలికి మరలా ఈశ్వరుడు కుబేరునితో ఇలా అన్నాడు.

వరాన్ దదామి తే వత్స తపసానేన తోషితః ।
నిధీనామథ నాథస్త్వం గుహ్యకానాం భవేశ్వరః ॥24॥

'వత్సా! నీ తపస్సుకు మెచ్చాను. నీకు వరాలు ఇస్తాను. నీవు నిధులకు నాథుడవౌతావు. గుహ్యకులకు ప్రభువౌతావు.

యక్షాణాం కిన్నరాణాం చ రాజ్ఞాం రాజా చ సువ్రతః ।
పతిః పుణ్యజనానాం చ సర్వేషాం ధనదో భవ ॥25॥

యక్షులకు, కిన్నరులకు, రాజులకు రాజువై వ్రతాలను చేయి. పుణ్యాత్ములకు ప్రభువౌతావు. అందరికీ నీవే ధనాన్ని ఇస్తావు.

మయా సఖ్యం చ తే నిత్యం వత్స్యామి చ తవాంతికే ।
అలకాం నికషా మిత్ర తవ ప్రీతివివృద్ధయే ॥26॥

నీతో నాకు నిత్య స్నేహం కుదిరింది. నేను నీకు దగ్గరగా అలాకానగరసమీపంలో నివసిస్తాను. ఓ! మిత్రమా! నేను నీకు ఎక్కువ ప్రీతిని కలిగిస్తాను.

ఆగచ్ఛ పాదయోరస్యాః పత తే జననీ త్వియమ్ ।
యాజ్ఞదత్తే మహాభక్త సుప్రసన్నేన చేతసా ॥27॥

యజ్ఞదత్తకుమారా! నీవు మహాభక్తుడవు. రమ్ము. ఈమె నీ తల్లి. ప్రసన్నమనసుతో ఈమె పాదాలపై పడు

బ్రహ్మోవాచ – బ్రహ్మ ఇలా అన్నాడు.

ఇతి దత్త్వా వరాన్దేవః పునరాహ శివాం శివః ।
ప్రసాదం కురు దేవేశి తపస్విన్యంగజేఽత్ర వై ॥28॥

శివదేవుడు ఈ విధంగా వరాలిచ్చి మరలా దేవితో ఇలా అన్నాడు. 'ఓ దేవీ! తపశ్శాలియైన ఈ కుమారునిపై దయను చూపు'.

ఇత్యాకర్ణ్య వచశ్శంభోః పార్వతీ జగదంబికా ।
అబ్రవీద్యాజ్ఞదత్తిం తం సుప్రసన్నేన చేతసా ॥29॥

శంభుని మాటలు విని, జగదంబ అయిన పార్వతి ప్రసన్నమనసుతో యజ్ఞదత్తకుమారునితో ఇలా పలికింది.

దేవ్యువాచ - దేవి ఇలా చెప్పింది.

వత్స తే నిర్మలా భక్తిర్భవే భవతు సర్వదా ।
భవైకపింగో నేత్రేణ వామేన స్ఫుటితేన హ ॥30॥

'వత్సా! నీకు అన్ని వేళలలో శివునిపై నిర్మలమైన భక్తి కలుగు గాక! నీ ఎడమకన్ను పగిలింది కదా! కాబట్టి ఎర్రని ఒక కన్ను కలవాడివి అవుతావు.

దేవేన దత్తా యే తుభ్యం వరాస్సంతు తథైవ తే ।
కుబేరో భవ నామ్నా త్వం మమ రూపేర్ష్యయా సుత ॥31॥

నీకు శివుడు ఇచ్చిన వరాలు ఫలించుగాక. నీవు నా రూపం చూచి ఈర్ష్య చెందావు కాబట్టి కుబేరుడనే పేరుతో గొప్పవాడివౌతావు'.

ఇతి దత్త్వా వరాన్దేవో దేవ్యా సహ మహేశ్వరః ।
ధనదాయావివేశాథ ధామ వైశ్వేశ్వరాభిధమ్ ॥32॥

మహేశ్వరుడు ఈ విధంగా దేవితో కూడి కుబేరునికి వరాలిచ్చి, విశ్వేశ్వరధామానికి వెళ్లాడు.

ఇత్థం సఖిత్వం శ్రీశంభోః ప్రాపైష ధనదః పురమ్ ।
అలకాన్నికషా చాసీత్కైలాసశ్శంకరాలయః ॥33॥

కుబేరుడు ఈ విధంగా శ్రీశంభుని స్నేహాన్ని, అలకానగరాన్ని పొందాడు. శంకరుని నివాసం అలకానగరానికి దగ్గరలో వెలసింది.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే శివకుబేరమైత్రీ నామ నవమోఽధ్యాయః ॥19॥

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితం సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటి ఖండంలో కుబేరునకు శివునితో స్నేహం అనే పందొమ్మిదవ అధ్యాయం సమాప్తం.

వింశోఽధ్యాయః - ఇరవైయవ అధ్యాయం

శివస్యకైలాస గమనమ్ - శివుడు కైలాసానికి వెళ్లుట

బ్రహ్మోవాచ - బ్రహ్మ ఇలా చెప్పాడు.

నారద త్వం శృణు మునే శివాగమనసత్తమమ్ ।
కైలాసే పర్వతశ్రేష్ఠే కుబేరస్య తపోబలాత్ ॥1॥

ఓ నారదమునీ! కుబేరుని తపస్సు ప్రభావం వలన శివుడు పర్వతరాజమైన కైలాసానికి రావటం అనే పుణ్యకథను చెప్తాను. విను.

నిధిపత్వవరం దత్వా గత్వా స్వస్థానముత్తమమ్ ।
విచింత్య హృది విశ్వేశః కుబేరవరదాయకః ॥2॥

నిధులకు స్వామి యగునట్లు విశ్వేశ్వరుడు కుబేరునికి వరాలిచ్చి, శ్రేష్ఠమైన తన ధామానికి వెళ్లి, మదిలో ఇలా ఆలోచించాడు.

విధ్యంగజస్వరూపో యే పూర్ణః ప్రలయకార్యకృత్ ।
తద్రూపేణ గమిష్యామి కైలాసం గుహ్యకాలయమ్ ॥3॥

బ్రహ్మశరీరం నుండి పుట్టిన ప్రళయకర్త అయిన రుద్రుడు నా పూర్ణావతారం. నేను ఆ రూపంలో గుహ్యకులుండే కైలాసానికి వెళ్తాను.

రుద్రో హృదయజో మే హి పూర్ణాంశో బ్రహ్మనిష్ఫలః ।
హరిబ్రహ్మాదిభిస్సేవ్యో మదభిన్నో నిరంజనః ॥4॥

నా హృదయం నుండి పుట్టిన రుద్రుడు పూర్ణాంశుడు. నిర్గుణబ్రహ్మ. హరిబ్రహ్మాదులచే సేవింపబడే వాడు. నాకంటే వేరుకాని వాడు. దోషాలు లేని వాడు.

తత్స్వరూపేణ తత్రైవ సుహృద్భూత్వా విలాస్యహమ్ ।
కుబేరస్య చ వత్స్యామి కరిష్యామి తపో మహత్ ॥ 5॥

నేను ఆ రూపంతో అచట కుబేరునికి స్నేహితుడనై విహరిస్తాను. మరియు గొప్ప తపస్సు చేస్తాను.

ఇతి సంచింత్య రుద్రోఽసౌ శివేచ్ఛాం గంతుముత్సుకః ।
ననాద తత్ర ఢక్కాం స్వాం సుగతిం నాదరూపిణీమ్ ॥6॥

ఇలా అనుకున్న వెంటనే, రుద్రుడు శివుని కోరికను పూర్తి చేయటంలో ఉత్సాహం కలవాడై పుణ్యాన్నిచ్చే నాదరూపిణి అయిన తన ఢక్కను మ్రోగించాడు.

త్రైలోక్యమానసే తస్యా ధ్వనిరుత్సాహకారకః ।
ఆహ్వానగతిసంయుక్తో విచిత్రస్సాంద్రశబ్దకః ॥7॥

ఉత్సాహాన్నిచ్చేది, ఆగమనాన్ని ఆహ్వానించేది, విచిత్ర గంభీరశబ్దం కలది అయిన ఆ ఢక్క ధ్వని మూడులోకాలలో వినిపించింది.

తచ్ఛ్రుత్వా విష్ణుబ్రహ్మాద్యాస్సురాశ్చ మునయస్తథా ।
ఆగమా నిగమా మూర్తాస్సిద్ధా జగ్ముశ్చ తత్ర వై ॥8॥

ఆ ధ్వనిని విని, విష్ణు బ్రహ్మాది దేవతలు, మునులు, ఆగమాలు, వేదాలు సిద్ధులు మూర్తి దాల్చి, అక్కడికి వెళ్లాయి.

సురాసురాద్యాస్సకలాస్తత్ర జగ్ముశ్చ సోత్సవాః ।
సర్వేఽపి ప్రమథా జగ్ముర్యత్ర కుత్రాపి సంస్థితాః ॥9॥

అందరు దేవతలు, రాక్షసులు, ఉత్సాహంతో అక్కడికి వెళ్లారు. రుద్రగణాలు (ప్రమథులు) కూడా అక్కడికి బయలుదేరారు.

గుణపాశ్చ మహాభాగాస్సర్వలోకనమస్కృతాః ।
తేషాం సంఖ్యామహం వచ్మి సావధానతయా శృణు ॥10॥

మహాత్ములు, అన్ని జీవులచే నమస్కరించబడే గుణవంతులు కూడా బయలుదేరారు. వాళ్ల సంఖ్యను చెప్తాను. సావధానంగా విను.

అభ్యయాచ్ఛంఖకర్ణశ్చ గణకోట్యా గణేశ్వరః ।
దశభిః కేకరాక్షశ్చ వికృతోఽష్టాభిరేవ చ ॥11॥

చతుఃషష్ట్యా విశాఖశ్చ నవభిః పారియాత్రకః ।
షడ్భిస్సర్వాంతకః శ్రీమాన్ దుందుభోఽష్టాభిరేవ చ ॥12॥

జాలంకో హి ద్వాదశభిః కోటిభిర్గణపుంగవః ।
సప్తభిస్సమదశ్శ్రీమాంస్తథైవ వికృతాననః ॥13॥

పంచభిశ్చ కపాలీ హి షడ్భిస్సందారకశ్శుభః ।
కోటికోటిభిరేవేహ కందుకః కుండకస్తథా ॥14॥

విష్టంభోఽష్టాభిరగమదష్టాభిశ్చంద్రతాపనః ॥15॥

మహాకేశస్సహస్రేణ కోటీనాం గణపో వృతః ॥16॥

కుండీ ద్వాదశభిర్వాహస్తథా పర్వతకశ్శుభః ।
కాలశ్చ కాలకశ్చైవ మహాకాలశ్శతేన వై ॥17॥

అగ్నికశ్శతకోట్యా వై కోట్యాభిముఖ ఏవ చ ।
ఆదిత్యమూర్ధా కోట్యా చ తథా చైవ ధనావహః ॥18॥

సన్నాహశ్చ శతేనైవ కుముదః కోటిభిస్తథా ।
అమోఘః కోకిలశ్చైవ కోటికోట్యా సుమంత్రకః ॥19॥

కాకపాదోఽపరష్షష్ట్యా షష్ట్యా సంతానకః ప్రభుః ।
మహాబలశ్చ నవభిర్మధుపింగశ్చ పింగలః ॥20॥

శంఖకర్ణుడను, గణనాథుడు కోటిగణాలతో బయలుదేరాడు. కేకరాక్షుడు పది, వికృతుడు ఎనిమిది విశాఖుడు అరవైనాలుగు, పారియత్రకుడు తొమ్మిది, సర్వాంతకుడు ఆరు, శ్రీమంతుడైన దుందుభుడు ఎనిమిది గణశ్రేష్ఠుడైన జాలంకుడు పన్నెండు, శ్రీమంతుడైన సమదుడు ఏడు, వికృతాసనుడు కూడా ఏడు కపాలి ఐదు, శుభకరుడగు సందారకుడు ఆరు, కందుకుడు, కుండకుడు ఒక్కొక్కడు కోటి గణాలతో కలసి వెళ్లారు. విష్టంభుడు ఎనిమిది, చంద్రతాపసుడు ఎనిమిది మహాకేశుడనే గణపతి వేయి. కుండి, వాహుడు, శుభకరుడైన పర్వతకుడు, కాలుడు, కాలకుడు అనేవారు ఒక్కొక్కరు పన్నెండు, మహాకాలుడు వంద అగ్నికుడు వంద, అభిముఖుడు, ఆదిత్యమూర్ధుడు, ధనవాహుడు ఒక్కొక్కటి, సన్నాహుడు వంద, కుముదుడు వంద, అమోఘుడు, కోకిలుడు, సుమంత్రకుడు ఒక్కొక్కరు కోటి కాకపాదుడనే వాడు అరవై, సంతానకుడనే గణపతి అరవై, మహాబలుడు, మధుపింగుడు, పింగలుడు ఒక్కొక్కరు తొమ్మిదికోట్లగణాలతో వచ్చారు.

నీలో నవత్యా దేవేశం పూర్ణభద్రస్తథైవ చ ।
కోటీనాం చైవ సప్తానాం చతుర్వక్త్రో మహాబలః ॥21॥

నీలుడు తొంభై, పూర్ణభద్రుడు కూడా తొంభై, మహాబలశాలి అయిన చతుర్వక్త్రుడు ఏడుకోట్ల గణాలతో శివుని దగ్గరకు వచ్చారు.

కోటికోటిసహస్రాణాం శతైర్వింశతిభిర్వృతః ।
తత్రాజగామ సర్వేశః కైలాసగమనాయ వై ॥22॥

సర్వేశ్వరుడైన శివుడు కైలాసానికి వెళ్లటానికి ఇరవైవందలకోటికోట్లగణాలతో కూడి బయలుదేరాడు.

కాష్ఠాగూఢశ్చతుష్షష్ట్యా సుకేశో వృషభస్తథా ।
కోటిభిస్సప్తభిశ్చైత్రో నకులీశస్స్వయం ప్రభుః ॥23॥

లోకాంతకశ్చ దీప్తాత్మా తథా దైత్యాంతకః ప్రభుః ।
దేవో భృంగీరిటిశ్శ్రీమాన్ దేవదేవప్రియస్తథా ॥24॥

అశనిర్భానుకశ్చైవ చతుష్షష్ట్యా సనాతనః ।
నందీశ్వరో గణాధీశశ్శతకోట్యా మహాబలః ॥25॥

కాష్ఠాగూఢుడు, సుకేశుడు, వృషభుడు, ఒక్కొక్కరు అరవైనాలుగు, చైత్రుడు, నకులీశుడు లోకాంతకుడు, దీప్తాత్మ, దైత్యాంతకుడు, భృంగిదేవుడు, శివునికి అతి ప్రియుడైన శ్రీమంతుడు భృంగి రిటి అశని, భానుకుడు ఒక్కొక్కరు ఏడు, సనాతనుడు అరవైనాలుగు, మహాబలుడైన నందీశ్వరుడు అనే గణపతి వంద కోట్ల గణాలతో వచ్చారు.

ఏతే చాన్యే చ గణపా అసంఖ్యాతా మహాబలాః ।
సర్వే సహస్రహస్తాశ్చ జటాముకుటధారిణః ॥26॥

వీరే కాకుండా మహాబలశాలురైన గణాధీశులు ఎందరో లెక్కలేనంత మంది వచ్చారు. వారందరూ అనేక చేతులు కలిగి ఉన్నారు. వారు జటలను, కిరీటాలను ధరించారు.

సర్వే చంద్రావతంసాశ్చ నీలకంఠాస్త్రిలోచనాః ।
హారకుండలకేయూరముకుటాద్యైరలంకృతాః ॥27॥

వీరందరూ చంద్రుని తలపై ధరించి, నల్లని కంఠాన్ని, మూడు కన్నులను కలిగి ఉన్నారు. వాళ్లు హారాలు, కుండలాలు, కేయూరాలు, కిరీటాలు మొదలగు వాటిని అలంకరించుకున్నారు.

బ్రహ్మేంద్రవిష్ణుసంకాశా అణిమాదిగణైర్వృతాః ।
సూర్యకోటిప్రతీకాశాస్తత్రాజగ్ముర్గణేశ్వరాః ॥28॥

వారు బ్రహ్మ, ఇంద్ర, విష్ణువులతో సమానమగు సామర్థ్యాన్ని కలిగి ఉన్నారు. వారిని అణిమాది సిద్ధులు సేవిస్తున్నాయి. కోటిసూర్యకాంతులు కలిగిన గణపతులు అక్కడికి వచ్చారు.

ఏతే గణాధిపాశ్చాన్యే మహాత్మానోఽమలప్రభాః ।
జగ్ముస్తత్ర మహాప్రీత్యా శివదర్శనలాలసాః ॥29॥

మహాత్ములు, దివ్యకాంతులు కలిగినవారు, శివుని దర్శించాలనే కోరికతో ఎందరో గణాధిపతులు అక్కడికి వచ్చారు.

గత్వా తత్ర శివం దృష్ట్వా నత్వా చక్రుః పరాం నుతిమ్ ।
సర్వే సాంజలయో విష్ణుప్రముఖా నతమస్తకాః ॥30॥

విష్ణువు మొదలగు వాళ్లంతా శివుని దగ్గరకు వెళ్లి, ఆయనను చూసి, దోసిలి యొగ్గి శిరసా నమస్కారం చేసి, గొప్ప స్తోత్రాలను చేశారు.

ఇతి విష్ణ్వాదిభిస్సార్ధం మహేశః పరమేశ్వరః ।
కైలాసమగమత్ప్రీత్యా కుబేరస్య మహాత్మనః ॥31॥

పరమేశ్వరుడైన మహేశుడు విష్ణువు మొదలగు వాళ్లతో కలిసి, మహాత్ముడైన కుబేరుని పట్ల గల ప్రేమతో కైలాసానికి వెళ్లాడు.

కుబేరోప్యాగతం శంభుం పూజయామాస సాదరమ్ ।
భక్త్యా నానోపహారైశ్చ పరివారసమన్వితః ॥32॥

కుబేరుడు పరివారంతో కలసి, విచ్చేసిన శివుని ఆదరంతో, భక్తితో ఎన్నో కానుకల నిచ్చి పూజించాడు.

తతో విష్ణ్వాదికాన్ దేవాన్ గణాంశ్చాన్యానపి ధ్రువమ్ ।
శివానుగాన్సమానర్చ శివతోషణహేతవే ॥33॥

తర్వాత ఆయన శివుణ్ణి ఆనందింప జేయటం కోసం విష్ణువు మొదలైన దేవతలను, శివుడి అనుచర గణాలను ఆదరంతో పూజించాడు.

అథ శంభుస్సమాలింగ్య కుబేరం ప్రీతమానసః ।
మూర్ధ్ని చాఘ్రాయ సంతస్థావలకాం నికషాఖిలైః ॥34॥

అపుడు శంభుడు ఆనందించి, కుబేరుని కౌగిలించుకొని, నుదుటిపై ముద్దు పెట్టుకొని, అందరితో కలిసి అలకానగరానికి దగ్గరలో ఉన్నాడు.

శశాస విశ్వకర్మాణం నిర్మాణార్థం గిరౌ ప్రభుః ।
నానాభక్తైర్నివాసాయ స్వపరేషాం యథోచితమ్ ॥35॥

ప్రభువైన శివుడు, తనకీ, తన భక్తులందరికీ నివసించటానికి తగిన నివాసాలు పర్వతమందు నిర్మించాలని విశ్వకర్మను ఆజ్ఞాపించాడు.

విశ్వకర్మా తతో గత్వా తత్ర నానావిధాం మునే ।
రచనాం రచయామాస ద్రుతం శంభోరనుజ్ఞయా ॥36॥

ఓ మహర్షీ! విశ్వకర్మ శంభుని ఆజ్ఞచే కైలాసానికి వెళ్లి, అక్కడ వివిధ రకాల భవనాలను వెంటనే నిర్మించాడు.

అథ శంభుః ప్రముదితో హరిప్రార్థనయా తదా ।
కుబేరానుగ్రహం కృత్వా యయౌ కైలాసపర్వతమ్ ॥37॥

చాలా ఆనందించిన శివుడు విష్ణువు ప్రార్థనలు విని, కుబేరుని అనుగ్రహించి, కైలాసపర్వతానికి వెళ్లాడు.

సుమూహూర్తే ప్రతిశ్యాసౌ స్వస్థానం పరమేశ్వరః ।
అకరోదఖిలాన్ప్రీత్యా సనాథాన్ భక్తవత్సలః ॥38॥

పరమేశ్వరుడు మంచిముహూర్తంలో తన స్థానమైన కైలాసంలో ప్రవేశించాడు. భక్తవత్సలుడైన శివుడు ప్రీతితో అందరిని సనాథులను చేశాడు.

అథ సర్వే ప్రముదితా విష్ణుప్రభృతయస్సురాః ।
మునయశ్చాపరే సిద్ధా అభ్యషించన్ముదా శివమ్ ॥39॥

అపుడు విష్ణువు మొదలైన దేవతలందరూ ఆనందించి, మునులతో, సిద్ధులతో కలిసి శివుణ్ణి అభిషేకించారు.

సమానర్చుః క్రమాత్సర్వే నానోపాయనపాణయః ।
నీరాజనం సమాకర్షుర్మహోత్సవపురస్సరమ్ ॥40॥

వారందరూ చేతులలో ఉపాయనాలను పట్టుకొని, శివుని వరుసగా అర్చించి, ఎంతో ఉత్సాహంతో నీరాజనాలు ఇచ్చారు.

తదాసీత్సుమనోవృష్టిర్మంగలాయతనా మునే ।
సుప్రీతా ననృతుస్తత్రాప్సరసో గానతత్పరాః ॥41॥

ఓ మహర్షీ! అపుడు దేవతలు మంగళకరమైన పూలవర్షాన్ని కురిపించారు. అచట అప్సరసలు పాటలు పాడుతూ నాట్యం చేశారు.

జయశబ్దో నమశ్శబ్దస్తత్రాసీత్సర్వసంస్కృతః ।
తదోత్సాహో మహానాసీత్సర్వేషాం సుఖవర్ధనః ॥42॥

అపుడు అచట జయ జయ ధ్వానాలు, నమః శబ్దాలు అందరూ పలికారు. ఆ గొప్ప ఉత్సాహం అందరికి సుఖాన్నిచ్చింది.

స్థిత్వా సింహాసనే శంభుర్విరరాజాధికం తథా ।
సర్వైస్సంసేవితోఽభీక్ష్ణం విష్ణ్వాద్యైశ్చ యథోచితమ్ ॥43॥

శంభుడు సింహాసనం మీద విరాజిల్లగా, విష్ణు మొదలగు దేవతలు యథోచితంగా ఆయనను సేవించారు.

అథ సర్వే సురాద్యాశ్చ తుష్టువుస్తం పృథక్ పృథక్ ।
అర్థ్యాభిర్వాగ్భిరిష్టాభిశ్శంకరం లోకశంకరమ్ ॥44॥

అపుడు దేవతలు, ఇతరులు లోకాలకు శుభాలనిచ్చే శివుణ్ణి అర్థవంతమైన, ప్రియమైన మాటలతో వేర్వేరుగా స్తుతించారు.

ప్రసన్నాత్మా స్తుతిం శ్రుత్వా తేషాం కామాన్ దదౌ శివః ।
మనోఽభిలాషితాన్ ప్రీత్యా వరాన్ సర్వేశ్వరః ప్రభుః ॥45॥

సర్వేశ్వరుడైన ప్రభువు-శివుడు-వారి స్తోత్రాలను విని, ప్రసన్నమనసుతో వారు మనసులో కోరుకున్న కోర్కెలను వరాలుగా ఇచ్చాడు.

శివాజ్ఞయాథ తే సర్వే స్వం స్వం ధామ యయుర్మునే ।
ప్రాప్తకామాః ప్రముదితా అహం చ విష్ణునా సహ ॥46॥

అపుడు వారందరూ శివుని దగ్గర సెలవు తీసుకొని తమ తమ చోట్లకు వెళ్లారు. ఓ మునీ! నేను మరియు విష్ణువు తీరిన కోరికలతో చాలా ఆనందించాము.

ఉపవేశ్యాసనే విష్ణుం మాం చ శంభురువాచ హ ।
బహుసంబోధ్య సుప్రీత్యానుగృహ్య పరమేశ్వరః ॥47॥

పరమేశ్వరుడైన శంభుడు నన్ను, విష్ణువును ఆసనమందు కుర్చోబెట్టి, మిక్కిలి ప్రేమతో అనుగ్రహించి, అనేక విధాలుగా సంబోధించి, ఇలా అన్నాడు.

శివ ఉవాచ – శివుడు ఇలా చెప్పాడు.

హే హరే హే విధే తాత యువాం ప్రియతరౌ మమ ।
సురోత్తమౌ త్రిజగతోఽవనసర్గకరౌ సదా ॥48॥

ఓ హరీ! ఓ బ్రహ్మా! వత్సలారా! మీరిద్దరు నాకు చాలా ఇష్టమైన వాళ్లు. మీరు దేవోత్తములు. మీరు ప్రపంచాన్ని సృష్టించి, రక్షిస్తుంటారు.

గచ్ఛతం నిర్భయాన్నిత్యం స్వస్థానం చ మదాజ్ఞయా ।
సుఖప్రదాతాహం వై వాం విశేషాత్ప్రేక్షకస్సదా ॥49॥

మీరు మీ స్థానానికి వెళ్లండి. ప్రతిరోజూ నిర్భయంగా ఉండండి. ఇది నా ఆజ్ఞ. నేను మీకు సుఖాలను ఇస్తాను. ఎపుడూ మీ బాగోగులు చూసుకుంటాను.

ఇత్యాకర్ణ్య వచశ్శంభోస్సుప్రణమ్య తదాజ్ఞయా ।
అహం హరిశ్చ స్వం ధామాగమావ ప్రీతిమానసౌ ॥50॥

శంభుని మాటలు విని, విష్ణువూ నేనూ ఆయనకు నమస్కారం చేసి, చాలా సంతోషించి, ఆయన ఆజ్ఞచే మా స్థానాలకు తిరిగి వచ్చాము.

తదానీమేవ సుప్రీతశ్శంకరో నిధిపం ముదా ।
ఉపవేశ్య గృహీత్వా తం కర ఆహ శుభం వచః ॥51॥

ఆ సమయంలో శంకరుడు ఆనందంతో కుబేరుని చెయ్యి పట్టుకొని కూర్చుండబెట్టి, శుభకరమైన మాటలను ఇలా చెప్పాడు.

శివ ఉవాచ – శివుడు ఇలా చెప్పాడు.

తవ ప్రేమ్ణా వశీభూతో మిత్రతాగమనం సఖే ।
స్వస్థానం గచ్ఛ విభయస్సహాయోఽహం సదానఘ ॥52॥

ఓ మిత్రమా! నీ ప్రేమచే నేను నీకు వశమై స్నేహం కోసం ఇక్కడకు వచ్చాను. ఓ అనఘా! (పాపాలు లేనివాడా) నీ చోటుకి వెళ్లు. నీకు భయం లేదు. నేను నీకు ఎపుడూ సాయం చేస్తాను.

ఇత్యాకర్ణ్య వచశ్శంభోః కుబేరః ప్రీతమానసః ।
తదాజ్ఞయా స్వకం ధామ జగామ ప్రమదాన్వితః ॥53॥

శంభుని మాటలను విని, కుబేరుడు సంతోషించి, ఆనందంతో శివుని ఆజ్ఞ ప్రకారం తన చోటుకు వెళ్లాడు.

స ఉవాస గిరౌ శంభుః కైలాసే పర్వతోత్తమే ।
సగణో యోగనిరతస్స్వచ్ఛందో ధ్యానతత్పరః ॥54॥

శివుడు గణాలతో కూడినవాడై, యోగాసక్తుడై ధ్యాన తత్పరుడై, పర్వతరాజమైన కైలాసంలో నివసించాడు.

క్వచిద్ధ్యా స్వమాత్మానం క్వచిద్యోగరతోఽభవత్ ।
ఇతిహాసగణాన్ ప్రీత్యావాదీత్స్వచ్ఛందమానసః ॥55॥

ఒకసారి ఆత్మరతుడై, మరోసారి యోగనిష్ఠుడై ఉన్నాడు. ఆయన మనసుకి నచ్చినపుడు ప్రీతితో ఎన్నో ఇతిహాసాలను చెప్పేవాడు.

క్వచిత్కైలాసకుధరసుస్థానేషు మహేశ్వరః ।
విజహార గణైః ప్రీత్యా వివిధేషు విహారవిత్ ॥56॥

విహారం తెలిసిన శివుడు ఒకప్పుడు కైలాసపర్వతప్రాంతాలందు గణాలతో కలిసి ప్రీతితో విహరించేవాడు.

ఇత్థం రుద్రస్వరూపోఽసౌ శంకరః పరమేశ్వరః ।
అకార్షీత్స్వగిరౌ లీలా నానా యోగివరోఽపి యః ॥57॥

శంకరుడు యోగిశ్రేష్ఠుడే అయినా, ఈ విధంగా రుద్రరూపుడై తన పర్వతప్రాంతంలో అనేకలీలలు చేశాడు.

నీత్వా కాలం కియంతం సోఽపత్నీకః పరమేశ్వరః ।
పశ్చాదవాప స్వాం పత్నీం దక్షపత్నీసముద్భవామ్ ॥58॥

ఆ పరమేశ్వరుడు భార్య లేకుండా కొంత కాలం గడిపి, తర్వాత దక్షుని కుమార్తెను పెళ్లి చేసుకున్నాడు.

విజహార తయా సత్యా దక్షపుత్ర్యా మహేశ్వరః ।
సుఖీ బభూవ దేవర్షే లోకాచారపరాయణః ॥59॥

ఓ దేవర్షీ! మహేశ్వరుడు దక్షుని కుమార్తె సతితో కలిసి, లోకాచారాలను అనుష్ఠిస్తూ సుఖంగా విహరించాడు.

ఇత్థం రుద్రావతారస్తే వర్ణితోఽయం మునీశ్వర ।
కైలాసాగమనం చాస్య సఖిత్వాన్నిధిపస్య హి ॥60॥

తదంతర్గతలీలాపి వర్ణితా జ్ఞానవర్ధినీ ।
ఇహాముత్ర చ యా నిత్యం సర్వకామఫలప్రదా ॥61॥

ఈ గాథలో అంతర్గతంగా (లోలోపల) ఉన్న లీలలను కూడా వర్ణించి చెప్పాను. ఈ కథ జ్ఞానాన్ని పెంచుతుంది. ఇహపరాలలో నిత్యం కోరికలను తీరుస్తుంది.

ఇమాం కథాం పఠేద్యస్తు శృణుయాద్వా సమాహితః ।
ఇహ భుక్తిం సమాసాద్య లభేన్ముక్తిం పరత్ర సః ॥62॥

ఎవరైతే ఈ కథను శ్రద్ధతో చదువుతారో లేదా వింటారో, వారు ఇహలోకంలో భుక్తిని పొంది, పరలోకంలో ముక్తిని పొందుతారు.

ఇతి శ్రీశివమహాపురాణే ద్వితీయాయాం రుద్రసంహితాయాం సృష్టిఖండే సృష్ట్యుపాఖ్యానే ప్రథమఖండే కైలాసోపాఖ్యానే శివస్య కైలాసాగమనం నామ వింశోఽధ్యాయః ॥20॥

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహిత సృష్టిఖండంలో సృష్ట్యుపాఖ్యానం అనే మొదటిఖండంలో కైలాసోపాఖ్యానంలో శివుడు కైలాసానికి వెళ్లుట అనే ఇరవైయవ అధ్యాయం సమాప్తం.

శ్రీశివమహాపురాణంలోని రెండవదైన రుద్రసంహితం సృష్టిఖండం సమాప్తం.

పురాణప్రశస్తి

(అష్టాదశపురాణాలు)

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥
నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అతి ప్రాచీనకాలంలో గురుకులాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదునాలుగు విధాలైన విద్యల నభ్యసించేవారు. ఆ విద్యల నిలా పేర్కొనడం జరిగింది.

అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।
పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥

శిక్ష,వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం–అనే ఆరు వేదాంగాలు, ఋగ్యజుస్సామా థర్వణము లనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం–అనేవే పదునాల్గు విద్యలు.

'వేదోఽ ఖిలో ధర్మమూలం' అన్నట్లు వేదమంతా ధర్మమూల మైనది. వేదోక్తమైన ధర్మాలను గ్రహించడం అందరికీ సాధ్యం కాని పని. అందుచేత వేదాలను విభజించిన వేదవ్యాసుడే వేదార్థాలను సామాన్యులు గూడా గ్రహించడాని కనువుగా పురాణాలను రచించాడు. **అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీ సుతః** –అను ప్రమాణవచనం కూడా పదునెన్మిది పురాణాల రచయిత సత్యవతీ సుతుడైన వ్యాసుడే అని నిరూపిస్తున్నది.

ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।
బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥

అల్పజ్ఞుడు తనకు హాని కల్గిస్తాడేమో అని వేదం భయపడుతుంది. అందువల్ల ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింపజేయాలి. ఈ దృష్టితోనే, అనగా అల్పజ్ఞులను దృష్టిలో పెట్టుకొనే వ్యాసుడు వేదార్థాలను పురాణాలద్వారా విస్తరింపజేశాడు. అట్లని పురాణాలు అల్పజ్ఞులకు మాత్రమే పరిమితమైనవి కావు. అధికజ్ఞులు కూడా గ్రహించవలసిన విషయాలు పురాణాలలో ఎన్నో ఉన్నాయి.

వేదం ప్రభువుతో సమానమైనది. శబ్దప్రధానమైన వేదవాణి కర్తవ్యవిషయంలో రాజాజ్ఞను పోలివుంటుంది. పురాణవచనం మిత్రతుల్యంగా వుంటుంది. అది అర్థప్రధానమై శ్రోతను కర్తవ్యానికి పురికొల్పుతుంది. కావ్యం కాంతాసమ్మితమై సరసంగా బోధించి పాఠకుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది అని ఆలంకారికులు వేదార్థాలను వివరించే పురాణాలకు మిత్రసాదృశ్యాన్ని ప్రతిపాదించారు.

యద్వేదాత్ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానా చ్చిరం
యచ్చార్థ ప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్ ।
కాన్తాసమ్మితయా యయా సరసతామాపాద్య కావ్యశ్రియా
కర్తవ్యే కుతుకీ బుధో విరచితస్తస్యై స్పృహాం కుర్మహే ॥ (ప్రతాపరుద్రీయం)

పురాణాలలో గూడా కావ్యశైలిని పాటించి రసవత్తరంగా కర్తవ్యబోధ కావించిన ఘట్టాలెన్నో ఎడనెడా కానవస్తాయి.

పురాణాలలో పూర్వకాలానికి చెందిన అనేక కథలున్నాయి. కథా కథనం ద్వారా ధర్మ స్వరూపం అందులో నిరూపింపబడింది. పురాణ కథలు వాగ్వైభవాన్ని ప్రదర్శించడానికి చెప్పినవి కావనీ, విజ్ఞానవైరాగ్యాలను విస్తరించి చెప్పడానికే ఆ కథలను వివరించడమయిందనీ భాగవతపురాణంలో వ్యాసభగవానుడే చెప్పాడు.

కథా ఇమాస్తే కథితా మహీయసాం
వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।
విజ్ఞానవైరాగ్య వివక్షయా విభో!
వచోవిభూతిర్న చ పారమార్థ్యమ్ ॥ (భాగవతం-12-3-14)

ఇక్కడ 'విజ్ఞాన' మంటే వేదవిజ్ఞానమనే గ్రహించాలి.

'వేదాః ప్రతిష్ఠితా స్సర్వే పురాణే నాత్ర సంశయః'

పురాణాలలో వేదాలు ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఇందులో సందేహం లేదు. కథల ద్వారా అవి ఆవిష్కృతాలవుతాయి.

పురాణ ప్రాముఖ్యం

యన్న దృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।
ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥

వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో కనిపిస్తుంది. శ్రుతి స్మృతులు రెండింటిలో కనిపించనిది పురాణం ద్వారా అవగతం అవుతుంది అన్న ప్రమాణాన్ని బట్టి శ్రుతులలోనూ, స్మృతులలోనూ లేని విషయాలను సైతం విస్తృతరచనావిధానం కల పురాణాలద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్'** అన్నట్లు శాస్త్రాలన్నింటిలోను మొదటిదిగా పురాణాన్ని విధాత స్మరించాడని విదితమవుతున్నది. యాగానుష్ఠానసమయంలో పురాణాలు పఠించే సంప్రదాయం కద్దు. ఇంకా పురాణాలలో భగవన్మహిమ, భగవదవతారాలు, భక్తిప్రబోధం, నానా విధాలైన ఆచారాలు, ధర్మాధర్మాలు, సాంఘిక -చారిత్రకాంశాలు, కళలు, వేదాంతతత్త్వాలు, నీతి ఇత్యాదిగా ఎన్నో విషయాలు నిరూపితాలయ్యాయి.

పురాణం ఐహికాముష్మిక సుఖసాధనం. మన సంస్కృతి సంప్రదాయాలను గ్రహించడానికి పురాణజ్ఞానం అవసరం.

పురాణ శబ్దనిర్వచనం

పురాణం అంటే – పురా భవం ప్రాచీన కాలంలో రచించబడినది అని అర్థం.

పురాఽపి నవం – ప్రాచీనమైనా విషయ విశిష్టతను బట్టి క్రొత్తది అని మరొక అర్థం.

పురా–అణతి–ఆగతానాగతే కథయతీతి పురాణం–అంటే జరిగిన, జరుగనున్న కాలానికి చెందిన విషయాలను వివరించునది అని వేరొక అర్థం.

పురా–పూర్వస్మిన్ జాతమితి పురాణమ్–పూర్వం ఎప్పుడో జరిగిన వృత్తాంతం పురాణం అని భావం.

పురా–అంటే పరంపరను వ్యక్తం చేసేది పురాణం అని మరొక వివరణ.

పురా–ప్రాచీన కాలోదంతం అనక్తీతి పురాణం – పురాతన కాలానికి చెందిన చరిత్రను చెప్పునది పురాణం.

ఇలా పురాణ శబ్దానికి పలు విధాల నిర్వచనం పెద్దలు చెప్పారు.

పురాణోత్పత్తి

అథర్వవేదంలో పురాణ శబ్దం ప్రయుక్తమైంది. యజ్ఞోచ్ఛిష్టంనుండి పురాణం పుట్టినదని అందులో చెప్పబడింది.

ఋచఃసామాని ఛందాంసి పురాణం యజుషా సహ ।
ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః ॥ అథర్వ సంహిత (11-7-24)

నాల్గువేదాల తరువాత ఇక్కడ పురాణోత్పత్తి నిర్దేశించబడింది. పురాణాల ఉనికి వేద సమకాలికమని తెలుస్తున్నది.

అందుచేత వేదసంహితల కాలంలోనే పురాణాలకు చెందిన మూలస్వరూపం రూపొందిందని భావించవచ్చు. బృహదారణ్యకోపనిషత్తులోని ఈ క్రింది వాక్యం గమనార్హం

"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్ యదృగ్వేదో, యజుర్వేద స్సామవేదోఽథర్వాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి".(2-4-10)

ఈ ఉపనిషద్ వాక్యం వేదాదులతోపాటు పురాణం కూడా పరమాత్మయొక్క నిఃశ్వాసరూపమైనదని వ్యక్తం చేస్తున్నది. దీనివల్ల వేదం ఎంత ప్రాచీనమో పురాణం కూడా అంతే ప్రాచీనమని గ్రహించవచ్చు. ఇక్కడ పురాణ శబ్దం ఏకవచనంలో ప్రయుక్తమైనది. అందుచేత పూర్వం సంక్షిప్తంగా ఉండిన పురాణం కాలక్రమంలో విస్తృతరూపం సంతరించుకొని వివిధ పురాణాలుగా విస్తరించిందని భావించవచ్చు.

భారతీయసంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు పురాణాలు. సామాన్య జనానీకంలో సనాతన ధర్మతత్త్వాన్ని ప్రచారం చేయడంలో అవి ప్రముఖపాత్ర వహించాయి. ఆధునికకాలంలో ప్రాచ్య పండితులేకాక పాశ్చాత్య పండితులు కూడా పురాణాల విశిష్టతను గుర్తించారు. పురాణం అన్న వ్యవహారమే ఇది అతిప్రాచీన సాహిత్యమని తెలియజేస్తుంది.

పురాణాలకంటే భిన్నంగా ఇతిహాసాలను గూడా మన పెద్దలు పేర్కొన్నారు. గతకాలంలో జరిగిన సంఘటనలను తెలిపేవి ఇతిహాసాలు. ఇతి హ+ఆస = ఇతిహాసం అనగా ఇలా పూర్వం జరిగినది-అని అర్థం. పురాణంలోని విషయాలు ఇతిహాసంలోని అంశాలకంటె వ్యాపకంగానూ, విస్తృతంగానూ వుంటాయి.

సాధారణ పురాణాల నుద్దేశించి నిర్దేశించిన సర్గం, ప్రతిసర్గం మొదలైన లక్షణాల కంటె భిన్నమైన వివిధ విషయాలు పురాణాలలో గోచరిస్తాయి. ఉదా: అగ్నిపురాణాన్ని పరిశీలిస్తే వివిధ విద్యలు, పదార్థలక్షణాలు, స్వప్నాలు, శకున ఫలితాలు, కావ్యనాటక లక్షణాలు, ప్రళయస్వరూపం, నరకం తీరుతెన్నులు, అద్వైత బ్రహ్మతత్త్వం మున్నగు అంశాలు అందులో ఉండడం గమనార్హం. అందుకే అగ్నిపురాణాన్ని 'జ్ఞానకోశం' అన్నారు.

సృష్ట్యారంభంనుండి నేటివరకు సమాజంలోని స్థితిగతులను చెప్పే పురాణాలను శ్రద్ధతో పఠించి పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతేకాని అవేవో కల్పనాత్మకమైన కథలని ఉపేక్షించడం తగదు. పురాణాలను ఏ దృష్టితో వ్యాసభగవానుడు రచించాడు? అన్న ప్రశ్నకు ఈ క్రింది శ్లోకం సమాధానమిస్తున్నది.

విష్ణోరంశో మునిర్జాతః సత్యవత్యాం పరాశరాత్ ।
పురాణసంహితాం దధ్యౌ తేషాం ధర్మవిధిత్సయా ॥

విష్ణ్వంశంతో జనించిన సత్యవతీ పరాశరుల పుత్రుడగు వ్యాసుడు ధర్మస్వరూప నిరూపణకై పురాణసంహితను రూపొందించాడని భావం.

అంతేకాక శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్యాసరూపుడై వేదార్థాల విస్తృతి నపేక్షించి భూతలములో పురాణాలు రచించాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।
వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥

సూతుని ద్వారా ఈ పురాణవాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. నైమిశారణ్యనివాసులైన శౌనకాది మునులు సూతునినుండి ఈ పురాణాలను విన్నారు.

విష్ణువుయొక్క అవయవాలే పురాణాలు

త్రిమూర్తులలో ఒక్కడుగా, స్థితికారకుడుగా, దుష్టశిక్షకుడుగా, శిష్టరక్షకుడుగా, ధర్మసంస్థాపకుడుగా ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణుదేవుని యొక్క అవయవాలుగా పదునెన్మిది పురాణాలను పేర్కొనడం కద్దు. దీన్నిబట్టి ధర్మప్రభువైన అచ్యుతునికీ, ధర్మస్వరూపనిరూపకాలైన పురాణాలకూ కల సామ్యాన్ని గ్రహించవచ్చు. పురాణాలు ఈ క్రిందివిధంగా విష్ణుదేవుని అవయవాలుగా పేర్కొనబడ్డాయి.

బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ ।
వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥

ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ ।
మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥

భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః ।
బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥

లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ ।
స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥

కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే ।
మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥

ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

దీని తాత్పర్యం ఇది-శ్రీమహావిష్ణువునకు బ్రహ్మపురాణం-శిరస్సు, పద్మపురాణం-హృదయం, విష్ణుపురాణం-దక్షిణహస్తం, వాయుపురాణం-వామహస్తం, భాగవతపురాణం-తొడలు, నారదపురాణం-నాభి, మార్కేండయ పురాణం-దక్షిణపాదం, అగ్నిపురాణం-వామపాదం, భవిష్యపురాణం-కుడిమోకాలు, బ్రహ్మవైవర్త పురాణం-ఎడమ మోకాలు, లింగపురాణం-కుడి చీలమండ, వరాహపురాణం-ఎడమ చీలమండ, స్కాంద పురాణం-కేశాలు, వామనపురాణం-చర్మం, కూర్మపురాణం-వీపు, మత్స్యపురాణం-మెదడు, గరుడపురాణం-మజ్జ, బ్రహ్మాండపురాణం-ఎముకలు. ఇలా శ్రీహరి పురాణాలే అవయవాలుగా కల్గి వున్నాడు.

పురాణ సంఖ్య

పురాణాలు మొత్తం పదునెనిమిది. వీటిని ఆయా పురాణాల పేర్లలో మొదటి అక్షరాన్ని మాత్రం పేర్కొనే ఒక శ్లోకంలో ఇలా చెప్పడమయింది.

మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయమ్ ।
అనాపలింగ కూస్కాని పురాణాని విదుర్బుధాః ॥

'మ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే పురాణాలు రెండు-(1) మత్స్య పురాణం (2) మార్కండేయ పురాణం. 'భ' అను అక్షరంతో ప్రారంభమయ్యేవి, రెండు -(1) భాగవతం (2) భవిష్యపురాణం -'బ్ర'తో ప్రారంభమయ్యేవి -మూడు (1) బ్రహ్మ పురాణం (2) బ్రహ్మాండ పురాణం (3) బ్రహ్మవైవర్త పురాణం -'వ' కారంతో ప్రారంభమయ్యేవి నాల్గు (1) విష్ణు పురాణం (2) వాయు పురాణం (3) వామన పురాణం (4) వరాహ పురాణం -అ=అగ్నిపురాణం నా=నారదపురాణం-ప=పద్మపురాణం, లిం=లింగపురాణం, గ=గరుడ పురాణం, కూ=కూర్మపురాణం, స్కా=స్కాందపురాణం ఇలా మొత్తం పురాణాల సంఖ్య పదునెన్మిది.

పురాణ విభాగం

పురాణాలను మహాపురాణాలనీ, ఉప పురాణాలనీ రెండు విధాలుగా విభజించడం కద్దు. పైన ప్రథమాక్షర నిర్దేశంతో పేర్కొన్నవన్నీ మహాపురాణాలే. ఈ క్రింది విధంగా కూడా ఈ పురాణాలను పెద్దలు నిర్దేశించారు.

బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవ చ ।
భాగవతం నారదీయం మార్కండేయం చ కీర్తితమ్ ॥
ఆగ్నేయం చ భవిష్యం చ బ్రహ్మవైవర్త లింగకే ।
వారాహం చ తథా స్కాందం వామనం కూర్మ సంజ్ఞకమ్ ।
మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥

ఈ పదునెన్మిది పురాణాలనూ పద్మపురాణం సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు వర్గాలుగా విభజించింది.

సాత్త్వికాలు-

వైష్ణవం నారదీయం చ తథా భాగవతం శుభమ్ ।
గారుడం చ తథా పాద్మం వారాహం శుభదర్శనే ॥

రాజసాలు-

బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం మార్కండేయం తథైవ చ ।
భవిష్యం వామనం బ్రాహ్మం రాజసాని నిబోధత ॥

తామసాలు-

మాత్స్యం కౌర్మం తథా లైంగం శైవం స్కాందం తథైవ చ ।
ఆగ్నేయం చ షడేతాని తామసాని నిబోధత ॥

ఇందులో (1) వైష్ణవం (2) నారదీయం (3) భాగవతం (4) గారుడం (5) వారాహం (6) పాద్మం -అనునవి సాత్త్వికపురాణాలు. (1) బ్రహ్మాండం (2) బ్రహ్మవైవర్తం (3) మార్కండేయం, (4) భవిష్యం (5) వామనం (6) బ్రాహ్మం-అనేవి రాజసాలు. (1) మాత్స్యం (2) కౌర్మం (3) లైంగం (4) వాయవీయం (శైవం) (5) స్కాందం (6) అగ్నేయం అనేవి తామసాలు.

ఇలా ఒక్కొక్క వర్గంలో ఆరేసి పురాణాలు లెక్కకు వస్తాయి.

సాత్త్వికపురాణాలు శ్రీమహావిష్ణువు యొక్క ప్రాధాన్యాన్నీ, రాజస పురాణాలు చతుర్ముఖ బ్రహ్మ ప్రాముఖ్యాన్నీ, తామస పురాణాలు శివునియొక్క ఆధిక్యాన్నీ వర్ణిస్తున్నాయి. ఈ ముగ్గురు దేవతలు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు.

అన్ని పురాణాలూ ఈ దేవత లందరికీ సమప్రాధాన్యాన్ని ప్రతిపాదించక కొన్ని పురాణాలు ఒక దేవతను ఇతరదేవతల కంటే అధికుడని చెప్పడం యుక్తమా? అనే సంశయం కలుగవచ్చు.

వేదం **'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అని చెప్పింది. అంటే సద్రూపుడైన పరమాత్మ ఒక్కడే, తత్త్వజ్ఞులు ఆయనను నానానామరూపాలతో వర్ణిస్తారని భావం. పరబ్రహ్మానికి మూర్తమని, అమూర్తమని రెండు రూపాలు కలవనీ; అందులో మూర్తం క్షరం–అంటే నశించే స్వభావం కలిగినదనీ, అమూర్తం నాశం లేనిదనీ గ్రహించాలి. క్షరాక్షరాలు సకలభూతాలలోనూ సమంగా ఉన్నాయి. అక్షరం పరబ్రహ్మం కాగా, ఈ చరాచరజగత్తు క్షరం అవుతున్నది. ఈ విషయాన్ని విష్ణుపురాణం ఇలా వివరించింది.–

ద్వే రూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ ।
క్షరాక్షరస్వరూపే తే సర్వభూతేష్వవస్థితే ।
అక్షరం తత్ పరం బ్రహ్మ క్షరం సర్వమిదం జగత్ ॥

దీనినిబట్టి పురాణాలలో వర్ణింపబడిన త్రిమూర్తులలో ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే తేడాలు లేవు. ఒకే తత్త్వం మూడు రూపాలతో విరాజిల్లుతున్నది. ఆ దేవతలు నిర్వహించే క్రియలలోని భేదమే వారిని మూడురూపాలతో నిర్దేశించడానికి హేతువైనది. ఈ సంగతినే విష్ణుపురాణం ఈ విధంగా వివరించింది.

సృష్టిస్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ ।
స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః ॥

ఒక జనార్దనుడే సృష్టి, స్థితి, లయం – అనే మూడు కార్యాలు నిర్వహించడంవల్ల బ్రహ్మ, విష్ణువు, శివుడు అన్న మూడు సంజ్ఞలు పొందాడని భావం.

ఈ సత్యాన్ని గ్రహిస్తే ఆయా దేవతల పట్ల వైషమ్యం తొలగి సమత్వం నెలకొంటుంది. అందువల్ల త్రిమూర్తుల ప్రభావాలను సమయానుగుణంగా వర్ణించే పురాణాల పట్ల సమన్వయదృష్టినే కలిగివుండాలి.

మహాపురాణాల లాగానే ఉపపురాణాలు గూడా పదునెన్మిది ఉన్నాయని కూర్మ పురాణం పేర్కొంటున్నది.

ఆద్యం సనత్కుమారోక్తం నారసింహం తథాఽపరమ్ ।
తృతీయం స్కంద ముద్దిష్టం కుమారేణ తు భాషితమ్ ॥

చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశ భాషితమ్ ।
దుర్వాససోక్తమాశ్చర్యం నారదోక్తమతఃపరమ్ ॥

కపిలం వామనం చైవ తథోశనససేవితమ్ ।
బ్రహ్మాండం వారుణం చాథ కాలికాహ్వయమేవ చ ॥

మాహేశ్వరం తథా సాంబం సౌరం సర్వార్థ సంచయమ్ ।
పరాశరోక్త మపరే మారీచం భాస్కరాహ్వయమ్ ॥

ఉపపురాణాలు–(1) సనత్కుమారోక్తం (2) నారసింహం (3) స్కాందం (4) శివధర్మం (5) దౌర్వాసం (6) నారదోక్తం (7) కాపిలం (8) వామనం (మానవం) (9) ఉశనసఃప్రోక్తం (10) బ్రహ్మాండం (11) వారుణం

(12) కాలికా పురాణం (13) మాహేశ్వరం (14) సాంబం (15) సౌరం (16) పరాశరోక్తం (17) మారీచం (18) భాస్కరం (భార్గవం).

కొందరి మతంప్రకారం ఉపపురాణాల సంఖ్య ముప్పదినాల్గుగా నిర్దిష్టమయింది. వీటికి తోడుగా ఔపపురాణాలు అన్న పేరుతో మరొక పదునెన్మిది పురాణాలను గూడ నిర్దేశించడం కద్దు.

పురాణ లక్షణం

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।
వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం-అని పురాణం ఐదు లక్షణాలు గల్గి యుంటుంది. వీటి సంగ్రహవివరణ ఇది.

1. సర్గం - అవ్యాకృతతత్త్వం నుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారతత్త్వం, దానినుండి సూక్ష్మభూతాల సృష్టి.
2. ప్రతిసర్గం - మరీచ్యాదులవల్ల జరిగిన చరాచరసృష్టి.
3. వంశం-ఆయా ఋషుల, రాజుల వంశాలు.
4. మన్వంతరాలు- మనువుల పరిపాలనకాలంలో జరిగిన విషయాలు మరియు ఆయా మన్వంతరాలలో సప్తఋషులు, మునులు మొదలగువారి వివరణ.
5. వంశానుచరితం-ఆ యా రాజవంశీయులైన రాజుల పరిపాలన మున్నగువాటికి చెందిన కథలను వివరించడం.

పక్షాంతరంలో పురాణాలకు పది లక్షణాలు గూడా నిర్దేశించడం కద్దు. పైన చెప్పిన ఐదు లక్షణాలు సాధారణపురాణాల లక్షణం కాగా, క్రింద చెప్పబోయే పదిలక్షణాలు మహాపురాణాలకు చెందినవని పెద్దల అభిప్రాయం.

అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః ।
మన్వంతరేశానకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాన కథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం-అనేవే ఈ పది లక్షణాలు.

వీటి సంగ్రహ వివరణ ఇది-

(1) సర్గం -భగవత్ప్రేరణతో సత్త్వరజస్తమోగుణాలలో క్షోభ ఏర్పడి పంచభూతాలు, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, అహంకారం, మహత్తత్త్వం జనించడాన్ని సర్గమంటారు.

2) విసర్గం:-విరాట్పురుషునినుండి ఉదయించిన బ్రహ్మ వివిధ చరాచరాలను సృష్టిస్తాడు. ఈ సృష్టినే విసర్గమంటారు.

3) స్థానం:–వినాశోన్ముఖమైన సృష్టిని ఒక మర్యాదలో నిల్పడమే స్థానం.

4) పోషణం:–భగవానుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావిస్తాడు. జగత్తుకు మేలు గల్గించే సందేశాన్ని అందిస్తాడు. నామరూపాలతో పుష్టిని కల్గిస్తాడు. దీనిని పోషణమంటారు.

5) ఊతులు:–కర్మవాసనలను ఊతులంటారు.

6) మన్వంతరాలు:–మనువులు మారినప్పుడు మన్వంతరకాలంలో తత్కాలానికి చెందిన అధిపతులు భక్తినీ,ధర్మాన్నీ ప్రబోధించే సంఘటనను మన్వంతరమంటారు.

7) ఈశానకథలు:– భగవదవతారాలు, భక్తులు–వీరికి సంబంధించిన చరిత్రలు.

8) నిరోధం:–జీవోపాధులను తనలో లీనం చేసుకొని భగవానుడు యోగనిద్రాముద్రితుడు కావడమే నిరోధం.

9) ముక్తి:–వేరే రూపాలు వదలి స్వస్వరూపంతో వుండడమే ముక్తి. ప్రకృతినుండి విముక్తి లభించే స్థితి ఇది.

10) ఆశ్రయం:– అధిష్ఠానమే ఆశ్రయం. దీని విశుద్ధికొరకే పై తొమ్మిది లక్షణాలనూ వివరించడం జరిగింది.

పై పది లక్షణాలూ మహాపురాణమైన శ్రీమద్భాగవతానికి చక్కగా అన్వయిస్తాయి. పెద్దలు వ్రాసిన గ్రంథాలలో వాటి సమన్వయాన్ని చూడవచ్చు.

పురాణశ్లోక సంఖ్య

భాగవతంలోని ద్వాదశస్కంధమందలి పదమూడవ అధ్యాయంలో ఆయా పురాణాలలోని శ్లోకాల సంఖ్య ఈ క్రిందివిధంగా నిర్దేశించడమయింది.

బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పఞ్చోనషష్టి చ ।
శ్రీవైష్ణవం త్రయోవింశచ్చతుర్వింశతి శైవకమ్ ॥

దశాష్టౌ శ్రీభాగవతం నారదం పఞ్చవింశతిః ।
మార్కండేయం నవాగ్నేయం దశపఞ్చ చతుశ్శతమ్ ॥

చతుర్దశ భవిష్యం స్యాత్తథా పఞ్చశతాని చ ।
దశాష్టౌ బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశైవ తు ॥

చతుర్వింశతి వారాహమేకాశీతిసహస్రకమ్ ।
స్కాందం శతం తథా చైకం వామనం దశ కీర్తితమ్ ॥

కౌర్మం సప్తదశాఽఽఖ్యాతం మాత్స్యం తత్తు చతుర్దశ ।
ఏకోనవింశత్సౌపర్ణం బ్రహ్మాండం ద్వాదశైవ తు ॥

త్రయోదశే పురాణానాం సంఖ్యామాహ యథాక్రమమ్ । (భాగవతం–12–13–2––9)

1. బ్రహ్మపురాణం	-	10,000	శ్లోకాలు
2. పద్మపురాణం	-	55,000	,,
3. విష్ణుపురాణం	-	23,000	,,
4. వాయుపురాణం	-	24,000	,,
5. భాగవతపురాణం	-	18,000	,,
6. నారదపురాణం	-	25,000	,,
7. మార్కండేయపురాణం	-	9,000	,,
8. అగ్నిపురాణం	-	15,400	,,
9. భవిష్యపురాణం	-	14,500	,,
10. బ్రహ్మవైవర్తపురాణం	-	18,000	,,
11. లింగపురాణం	-	11,000	,,
12. వరాహపురాణం	-	24,000	,,
13. స్కందపురాణం	-	81,100	,,
14. వామనపురాణం	-	10,000	,,
15. కూర్మపురాణం	-	17,000	,,
16. మత్స్యపురాణం	-	14,000	,,
17. గరుడపురాణం	-	19,000	,,
18. బ్రహ్మాండపురాణం	-	12,000	,,
మొత్తం శ్లోకాలు	-	**4,00,000**	

పురాణాలలో ముఖ్యాంశాలు

పురాణాలు మానవకర్తవ్యాలను నిర్దేశిస్తూ కొన్ని ముఖ్యమైన సందేశాత్మక ప్రబోధాలు కావించాయి. ధర్మాన్ని రక్షించవలసిన ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కథల ద్వారా అవి విశదీకరించాయి.

విశ్వమంతా భగవన్మయమనీ, మోక్షప్రాప్తికి భక్తి ముఖ్యసాధనమనీ, వివిధ వ్రతాలను వాటికి తగిన కాలాలలో అనుష్ఠించి పవిత్రులు కావాలనీ, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనీ, ఆయా క్షేత్రాలలో ప్రతిష్ఠితులైన దేవతలను ఆరాధిస్తే శుభాలు సిద్ధిస్తాయనీ, పితృదేవతలకు శ్రాద్ధవిధిని తప్పక అనుష్ఠించాలనీ, కర్మఫలం అనుభవించక తప్పదనీ ఇత్యాదిగా పురాణాలు ప్రబోధించే అంశాలు అందరికీ గమనింపదగినవై యున్నాయి.

వర్ణనాశైలి

కవితా రూపంలో గల రచనలను కవులు ఆలంకారిక ప్రక్రియలో కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ పాఠకులను ఆకర్షిస్తుంది. యథాతథంగా సాగే కథాకథనంతోపాటు అవసరమైనచోట అలంకార ప్రక్రియనాశ్రయించి కవులు వర్ణన నిర్వహిస్తారు. అతిశయోక్తులను గూడా మేళవిస్తారు. ఉన్నదున్నట్లు చెప్పడం యథాతథకథనం కాగా కథనంలో ఉపమారూపకాదులను ఆశ్రయించడం ఒక విశిష్టమైన పద్ధతి. వేదాలలో గూడ ఈ పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తులో

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥

ఇత్యాదిగా శరీరానికి రథరూపకల్పన చేసి ఆత్మను రథికునిగా పేర్కొనడం జరిగింది. సూర్యుని కిరణాలలోని ఏడు రంగులను ఏడు గుర్రాలుగా వర్ణించడం గూడా ఈ ప్రక్రియకు చెందిన విషయమే.

పురాణాలు గూడా ఈ శైలిని విస్తృతంగా అనుకరించాయి. అతిశయోక్తిని గూడా విపులంగా వినియోగించాయి. ఈ పద్ధతి పురాణ వాఙ్మయానికి శోభావహ మైందనడంలో ఏ మాత్రం సందేహంలేదు.

పురాణ ప్రయోజనం

యథా పాపాని పూయన్తే గంగావారివిగాహనాత్ ।
తథా పురాణ శ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥

గంగాజలంలో స్నానం చేయడంవల్ల పాపాలు నశించినట్లే పురాణశ్రవణంవల్ల దురితాలు నశిస్తాయి.

సదాచారప్రబోధం

యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఇత్యాదిగా ఎన్ని చేసినా – సదాచారం లేనివాడు ఆత్మోన్నతి పొందలేడు.

దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతి ।

అన్నట్లు దురాచారుడైన మనుజుడు ఇహపరలోకాలు రెండింటా సుఖానికి దూరమౌతాడు.

ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాః సహ షడ్భిరంగైః ।

సదాచారం లేనివాడిని వేదాలుగూడా పవిత్రుణ్ణి చేయజాలవు. దురాచారాలు, సదాచారాల స్వరూపాన్ని వివిధ కథల ద్వారా పురాణాలు చక్కగా నిరూపించాయి. రామాయణంలో రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్, –రామాదులవలె ప్రవర్తించాలి కాని, రావణాదులవలె ప్రవర్తించరాదు అన్న విధంగా నీతిప్రబోధం పురాణాలలో రమణీయంగా చేయబడింది.

అందువల్ల పురాణ పఠన శ్రవణాలు సమాజాభ్యున్నతి కల్గిస్తాయి. పూర్వం గ్రామసీమలలో గూడ రాత్రివేళల పౌరాణికులు పురాణ పఠనం కావించి అందలి విశేషాలను సామాన్య జనులకు బోధించేవారు. ఈ బోధ ప్రజానీకానికి సముచిత సంస్కారం కల్గించేది. తద్ద్వారా వారు ఆత్మోన్నతి కల్గించే మార్గంలో నడిచేవారు.

కాలనిర్ణయం

పురాణాల కాలనిర్ణయం అంత సుకరం కాదు. శ్రీ శంకరభగవత్పాదులు మున్నగువారు తమ రచనల్లో పురాణాల నుదాహరించియున్నారు. బాణకవి (క్రీ.శ.625) తన హర్షచరిత్రలో **పురాణేషు వాయుప్రలపితం** అని చెప్పి వాయుపురాణాన్ని ప్రస్తావించాడు.

కలియుగరాజులను నిర్దేశించిన పురాణాలు గూడా ఉన్నాయి. విష్ణు పురాణంలో మౌర్యవంశం పేర్కొనబడింది. మాత్స్యపురాణం–దాక్షిణాత్యులైన ఆంధ్రరాజులను (క్రీ.శ 225) ప్రస్తావించింది. గుప్తరాజుల ప్రస్తావన వాయుపురాణంలో కనిపిస్తున్నది.

లక్ష శ్లోకాలుగల ఇప్పటి మహాభారతం రూపొందకముందే పురాణాల ఉనికిని పరిశోధకులు గుర్తించారు. మహాభారతవక్త అయిన రౌమహర్షణి పురాణాలలో పారంగతుడు. అతని తండ్రిగూడ పౌరాణికుడుగా ప్రసిద్ధుడే. మహాభారతంలో పెక్కు శ్లోకాలు పురాణాంతర్గత శ్లోకాలతో సామ్యం కల్గి వున్నాయి. మహాభారతంలోని కొన్ని ఆఖ్యానాల ప్రాచీన స్వరూపం పురాణాలలో గోచరిస్తున్నది. దీన్ని బట్టి మహాభారతం కంటె పురాణాలు ప్రాచీనమైనవని విశ్వసించవచ్చు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పురాణ ప్రస్తావన ఉన్నది. అపమార్గగాములైన రాజకుమారులను పురాణోపదేశం ద్వారా సన్మార్గగాములను చేయాలని కౌటిల్యుడు వచించాడు. రాజుకు సంబంధించిన అధికారులలో పౌరాణికుడు గూడా ఒకడని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంచేత కౌటిల్యుని కంటె పురాణాలు ప్రాచీనాలని భావించడం సముచితం. కౌటిల్యుడు క్రీ.పూర్వం తృతీయ శతకం వాడని అనేకుల భావన. అందువల్ల ఆ కాలానికంటె ముందే పురాణాలుండేవని భావించాలి.

గౌతమ–ఆపస్తంబ సూత్రగ్రంథాలలో గూడ పురాణప్రస్తావన వస్తుంది. రాజు శాసనవ్యవస్థలో వేదంతోపాటు పురాణాన్ని గూడా ప్రముఖంగా గ్రహించాలని గౌతముడు చెప్పాడు. అతిప్రాచీన పురాణభాగాలనుండి మూడు శ్లోకాలను ఆపస్తంబ ధర్మసూత్రాలలో ఉదాహరించడం జరిగింది. ఆ శ్లోకాలతో సామ్యం కల శ్లోకాలు నేటి పురాణాలలో లభిస్తున్నాయి. కాబట్టి సూత్రకాలంలో గూడా పురాణ గ్రంథాలుండేవని బోధపడుతున్నది.

మరొక ముఖ్యాంశ మేమంటే అతిప్రాచీనములైన ఉపనిషత్తులలో గూడా పురాణ ప్రస్తావన కలదు, ఛాందోగ్యంలో నారద సనత్కుమారుల సంవాదంలో ఇతర శాస్త్రాలతోపాటు పురాణాలను పేర్కొన్నారు.

“ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదం” (ఛాందో 7-1-2).

అందుచేత 600వ సం॥ పూర్వం పురాణాల నిర్మాణం జరిగిందని పెద్దల భావన. వాటికి మూల భూతమైన పురాణా లిప్పుడు లభించవు.

పురాణాలు ఏ ఒక్క శతాబ్దానికో చెందిన రచనలు కావు. కాలక్రమములో వాటిలో క్రొత్తక్రొత్త అధ్యాయాలు చేర్చడం జరిగింది. గుప్తకాలానికి పురాణాలు నేటిరూపం సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

పురాణ వైశిష్ట్యం

పురాణాలు సామాన్యులకు దుర్బోధమైన వేదార్థాలను వారికవగతమయ్యే రీతిలో కథలు జోడించి చెప్పాయి. ప్రాచీనకాలానికి చెందిన భారతీయసమాజస్వరూపస్వభావాలను అర్థం చేసుకోవడానికి పురాణాలే ప్రామాణికమైన ఆధారాలు. ఆనాటి ఋషుల చరిత్రలను మనం పురాణాలనుండే సమగ్రంగా గ్రహించడానికి వీలవుతుంది.

భారతభౌగోళికస్థితి, నదీనదపర్వతాల ఉనికి, వివిధ తీర్థాల స్థితిగతులు, పలువృక్షాలు, జంతువులు– వీటిని గూర్చిన విజ్ఞానం కూడా పురాణాలలో లభిస్తుంది.

పురాణాలను, శిలాశాసనాదులగు ఇతర ప్రామాణికాధారాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే గత చరిత్రకు చెందిన అనేక విషయాలు తేటతెల్లమవుతాయి.

కాబట్టి భారతీయులే కాక పాశ్చాత్యులు గూడా పురాణాలను శ్రద్ధతో పరిశోధించి మానవజాతి గతచరిత్రను సమగ్రంగా అవగతం చేసుకోవచ్చు.

ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ సామాన్యప్రజలను చైతన్యవంతులను చేయడంలో పురాణాలు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైనది. మొత్తం పదునెనిమిది పురాణాలలోని శ్లోకాల సంఖ్య నాల్గు లక్షలని ముందే చెప్పుకొన్నాం. ఇంత విస్తృతమైన గ్రంథరాశి సంస్కృతభాషానిబద్ధమై లభిస్తున్నది.

వేదాలలోని నిగూఢమైన వేదాంతతత్త్వాన్ని సామాన్య జనులకు గూడా అర్థం కావాలనే దృష్టితో ఆఖ్యానాలతోనూ, ఉపాఖ్యానాలతోనూ పురాణాలు వివరించాయి.

ప్రాచీనకాలంలో యజ్ఞాలు నిర్వహించే ప్రదేశాలలో పురాణపఠనం విధిగా నిర్వహింపబడేది. పురాణపఠనం పాపనివారకమనీ, పుణ్యప్రదమనీ ప్రశంసింపబడింది. పౌరాణికులు పురాణాలను పఠిస్తూ ప్రవృత్తినివృత్తిరూపాలైన రెండు విధాల ధర్మాలనూ ప్రజలకు వివరించేవారు.

పురాణాలను ఆధారంగా చేసుకొని కవులు కావ్యనాటకాదులు విస్తృతంగా రచించారు. భారతీయుల జీవితాలకూ, విశ్వాసాలకూ పురాణాలు శతాబ్దాల తరబడి మార్గనిర్దేశకా లయ్యాయి. వేదార్థాలను అతివిస్తృతస్థాయిలో జనానీకానికి అందజేయడానికి పురాణాలు ముఖ్యసాధనా లయ్యాయి.

వేదాంతతత్త్వాన్ని బోధించడాని కవతరించిన శ్రీశంకరరామానుజాద్యాచార్యులు గూడా అవసరమైన చోట పురాణవచనాలను ప్రమాణాలుగా పేర్కొనియున్నారు.

కర్మ–భక్తి–ధ్యాన–జ్ఞాన యోగాలు మోక్షసౌధాన్ని అధిష్ఠించడానికి సోపానాలు. ఇందులో కలియుగంలో భక్తియొక్కటే సులభమైన తరణోపాయమని పెద్దలు పేర్కొన్నారు.

“కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః” అన్నట్లు కలియుగంలో అనన్యభక్తిచేతనే భగవదనుగ్రహం కలుగుతుందన్న సత్యాన్ని భాగవతాది పురాణాలు ప్రహ్లాదచరిత్రాదికథల ద్వారా మనోజ్ఞంగా నిరూపించాయి.

అట్లే గృహస్థులు పాటించవలసిన పలురకాలైన కర్మవిధానాలూ, వ్రతాలూ, వాటివల్ల కలిగే ఫలితాలూ పురాణాలలో ఎడనెడా విశదంగా నిరూపించబడ్డాయి. ఈ విధంగా కర్మయోగ నిరూపణం గూడా పురాణాలలో కనిపిస్తుంది. వివిధ విషయాలతో కూడిన పురాణాలను విజ్ఞానసర్వస్వాలుగా, జ్ఞాననిలయాలుగా భావించవచ్చు.

పురాణాలలో వివిధ ప్రదేశాలలో గల నానాతీర్థాలు, ఆ తీర్థాల ప్రాముఖ్యం, తీర్థయాత్రలవల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలు పలుచోట్ల వివరింపబడివున్నాయి. తీర్థయాత్రలవల్ల ప్రజలలో ఏకజాతీయతా భావం పెంపొందుతుంది. గతచరిత్రకు సంబంధించిన విజ్ఞానం భావిపురోగతికి దోహదం చేస్తుంది. పురాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే భారతదేశ గతచరిత్రకు చెందిన ఎన్నో విషయాలు గోచరిస్తాయి. "పురోఽభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతమును మరువరాదు" అని శ్రీమలయాళస్వామి సూక్తి. అందుచేత చారిత్రక పరిశోధకులు పురాణాలను పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తమ పాలనలో ఎదురయ్యే సమస్యలను ఆనాటి పాలకులు పురాణవృత్తాంతాలను ప్రమాణంగా పరిగ్రహించి పరిష్కరించేవారు. అందుచేత రాజధర్మ పరిజ్ఞానానికి గూడా పురాణసారస్వతం ఉపకరిస్తుంది.

పురాణాలలో బోధింపబడిన నీతులను కేవలం హిందూజాతికి మాత్రమే పరిమితా లని భావించరాదు. ప్రపంచజను లందరికీ ఉపయోగపడే శాశ్వతనైతికబోధ లందులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు పురాణాలలో నిర్దిష్టములై యున్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులలో కొందరి భావన. అందుచేత వైజ్ఞానిక పరిశోధకులకు గూడా పురాణజ్ఞానం అవసరమే.

అతిప్రాచీనకాలంనుండీ నేటివరకూ అమూల్య సారస్వతరూపంలో మనకు ఉపలబ్ధమవుతున్న వాఙ్మయంలో పూర్వోక్తపద్ధతిలో పురాణాలకు గల ప్రాముఖ్యాన్ని గుర్తించి మానవజాతిపురోగతికి వాటిని వినియోగించుకొని సర్వతోముఖమైన శ్రేయస్సును పొందుదుము గాక!

తిరుపతి
తేది. 10-01-2019

సముద్రాల లక్ష్మణయ్య
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం

1. బ్రహ్మపురాణం

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇది విష్ణుదేవుని మాహాత్మ్యాన్ని విశదీకరిస్తుంది. ఆ దేవుని శిరస్సుగా వర్ణింపబడిన ఈ పురాణం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధపురుషార్థాల ప్రాప్తికి తగిన ఉపాయాలను వివరిస్తుంది.

10,000 శ్లోకాలు గల ఈ పురాణంలో పలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. నైమిశారణ్య వర్ణనం, ప్రళయస్వరూపం, హరిశ్చంద్రసగరాదుల చరిత్రలు, సప్తద్వీపాలు, పార్వతీ స్వయంవరం, సాగరస్నానవిధి, గోదావరీ పవిత్రత, క్షీరసాగరమథనం, దధీచి వృత్తాంతం, వరాహాద్యవతారాలు–ఇత్యాదిగా అనేక విషయాలు ఇందులో నిబంధింపబడి వున్నాయి.

భారతావని, దండకారణ్యం, గంగాదినదుల ప్రాశస్త్యం విస్తృతంగా ఈ పురాణంలో వివరించడమయింది.

ప్రతిపురాణంలోనూ తత్త్వాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధించే కథలు ఉంటాయి. ఈ పురాణంలోని కథలలో 'కందు' మహర్షి కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది. అతని తపస్సుకు భంగం కల్గించడానికి దేవతలు పంపిన అప్సరస ప్రమ్లోచ దాదాపు 900 సంవత్సరాలు అతనితో విహరించి అతని నియమానికి భంగం కల్గిస్తుంది.

చివరికి తన పొరబాటు గుర్తించిన మహర్షి పురుషోత్తమక్షేత్రమనే పూరీజగన్నాథక్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని సేవించి ముక్తుడవుతాడు.

తరువాతి కథలలో కార్తవీర్యార్జునుని వృత్తాంతం ప్రముఖమైనది. ఇది మిక్కిలి విస్తృతమైన చరిత్ర. దత్తాత్రేయుని అనుగ్రహంతో సహస్రబాహువులు కల్గి శిష్టరక్షణ కావిస్తూ రావణాదులను జయించి ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించిన ఈ రాజు చివరికి తనకంటే బలవంతుడైన పరశురామునిచే వీరమరణం పొందుతాడు. ఏడువందల యాగాలు నిర్వహించినవాడుగా ఈతడు ప్రసిద్ధుడయ్యాడు. విష్ణుతత్త్వం బోధించే పలు విషయాలు ఇంకా ఎన్నో ఈ పురాణంలో గోచరిస్తాయి.

ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।
యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥

వేదతుల్యమైన ఈ పురాణాన్ని శ్రద్ధతో చదివినవాడు, లేక విన్నవాడు హరినిలయమైన వైకుంఠం చేరుకుంటాడని ఫలశ్రుతి.

2. పద్మపురాణం

మహావిష్ణువుయొక్క హృదయస్థానంతో పోల్చబడిన పురాణమిది. సృష్టి ప్రక్రియ ఆ దేవుని నాభికమలంనుండి జన్మించిన బ్రహ్మద్వారా మొదలయింది. ఆ ప్రక్రియయే ఈ పురాణాని కాధారం. కాన ఇది 'పద్మపురాణ' మనబడింది. ఇందులో 55,000 శ్లోకాలున్నాయి.

సృష్టిఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళఖండం, ఉత్తరఖండం – అని ఐదు ఖండాలుగా విభజింపబడిన ఇందులో మొత్తం 641 అధ్యాయాలున్నాయి.

కాలపరిమాణం, క్షీరసాగరమథనం, దక్షయాగధ్వంసం, చంద్రవంశం, వామనావతారం, తారకాసుర వృత్తాంతం, నృసింహావతారం, సదాచారం – ఇత్యాదిగా పలువిషయాలను ఈ పురాణం వివరిస్తున్నది.

శరీరవర్ణనం, ఆత్మస్వరూపం, విష్ణుభక్తి మహిమ, కార్తికమాస ప్రాశస్త్యం, దీపావళీమాహాత్మ్యం పూజావిధానాలు, యుగధర్మాలు మున్నగు విషయాలను విపులంగా ఇందులో చూడవచ్చు.

ప్రపంచమంతా శ్రీహరిమయమే అని ఈ పురాణం ఘోషిస్తున్నది. ఇందులో పేర్కొన్న సదాచారాలు అవశ్యం ఆచరింపదగివున్నాయి.

తల్లిదండ్రుల విశిష్టతను ప్రశంసించి **"మాతరం పితరం తస్మాత్సర్వయత్నేన పూజయేత్"** –సకల ప్రయత్నాలతోనూ తల్లిదండ్రుల నర్చించాలి అని ఈ పురాణం బోధించింది. ఇది **'మాతృదేవో భవ, పితృదేవో భవ'** అన్న శ్రుతివచనానికి వివరణగా ఉన్నది.

ఇంకా ఉసిరికాయకు గల పవిత్రత, దాన్ని సేవించే విధానం విపులంగా ఇందులో పేర్కొనబడింది. అట్లే తులసికి గల ప్రాశస్త్యం కీర్తించబడింది.

పురాణపఠనావశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనం, కలియుగధర్మాలు, ఆ యుగంలో స్త్రీపురుషుల స్వభావాలు, జనుల విపరీతప్రవృత్తులు విశదంగా ఇందులో నిరూపింపబడియుండడం గమనార్హం.

కలియుగంలో ధర్మాత్మకమైన కర్మను మనుజుడు భక్తితో భగవదర్పితంగా ఆచరిస్తే సర్వపాపనిర్ముక్తుడవుతాడని ఈ పురాణం ప్రతిపాదించింది. ఇలా ఏ పురాణాన్ని పరిశీలించినా నానావిధములైన, ఆత్మోన్నతిహేతువులైన, మానవజీవితాని కవసరములైన పెక్కు విషయాలు విశదీకరింపబడివున్నాయి.

ఈ పద్మపురాణాన్ని చదివేవారికి, వినేవారికి కోరిన కోర్కెలన్నీ శ్రియఃపతి అనుగ్రహం వల్ల సిద్ధిస్తాయని ఫలశ్రుతి.

యద్యదిష్టం పఠంత్యేతత్ శృణ్వంతి చ ముముక్షవః ।
లభన్తే తత్తదేవాశు ప్రసాదాత్కమలాపతేః ॥

3. విష్ణుపురాణం

శ్రీ మహావిష్ణువు యొక్క దక్షిణబాహువుగా విష్ణుపురాణం వర్ణించబడింది. ఆరు అంశాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 126 అధ్యాయాలున్నాయి. విష్ణు ధర్మోత్తరంతోగూడ కలుపుకొంటే ఇందలి మొత్తం శ్లోకాలు 23,000. పరాశరమహర్షి మైత్రేయునకు జెప్పిన పురాణ మిది.

ఇరవైనాలుగు తత్త్వాలు, జగదావిర్భావం, కాలస్వరూపం, వరాహావతారం, భూవిభజన, సనకాదుల జననం, స్వాయంభువమనువు పుట్టుక, దక్షపుత్రికల వివాహం, ధ్రువచరిత్ర, నృసింహావతారం, భరతవంశవర్ణన, జడభరతోపాఖ్యానం-ఇత్యాదిగా అనేకాంశాలు ఈ పురాణంలో విశదీకరింపబడ్డాయి.

మరియు బ్రహ్మజ్ఞాన ప్రాశస్త్యం, వేదవిభాగం, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు, దేవాసురుల యుద్ధం, సగరవంశవర్ణన, శ్రీకృష్ణావతారం, కలి లక్షణాలు, నామసంకీర్తనప్రభావం మొదలైన విషయాలు గూడ విపులంగా ఇందులో నిరూపించడమైనది.

వైష్ణవులకు మిక్కిలిగా ఆరాధనీయమైన పురాణమిది. వైష్ణవసిద్ధాంతాలకు మూలభూతమైన గ్రంథం గాన శ్రీభగవద్రామానుజాచార్యులు ఆ సిద్ధాంతప్రచారాన్ని ఈ పురాణాన్ని ఆధారంగా స్వీకరించి నిర్వర్తించారు.

శరణాగతి, భగవద్గుణకర్మనామాల గానం, విష్ణ్వర్పణంగా కర్మల ననుష్ఠించడం మొదలగు అంశాలకు ఈ పురాణంలో ప్రాముఖ్యం ఇవ్వడమయింది.

మరియు శ్రవణం, కీర్తనం మున్నగు నవవిధభక్తి మార్గాలు ఇందులో విస్తృతంగా ప్రతిపాదింపబడి వున్నాయి. భాగవతపురాణం లాగా ఈ పురాణం గూడా భక్తియోగానికి ప్రాధాన్యాన్ని ప్రతిపాదించింది.

దేవతలను ఆరాధించేవారిలో అనేకులు శివకేశవులలో భేదాన్ని చూస్తారు. అయితే ఈ పురాణంలో–

"అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।
వదంతి భేదం పశ్యన్తి చావయోరన్తరం హర!" ॥

'అవిద్యామోహితులే నీకూ, నాకు భేదం పాటిస్తారు' అని కేశవుడు శివునితో చెప్పాడు. ఈ శివకేశవాభేద సిద్ధాంతం ఇక్కడ గమనార్హం.

ఈ పురాణంలో జడభరతుని వృత్తాంతం మిక్కిలి ఆసక్తిని రేకెత్తించేదిగా వర్ణితమై వున్నది. ఆతని మూడు జన్మలకు సంబంధించిన విశేషాలు గ్రహిస్తే మనలో జ్ఞానవిజ్ఞానాలు వికసిస్తాయి.

యో నరః పఠతే భక్త్యా యః శృణోతి చ సాదరమ్ ।
తావుభౌ విష్ణులోకం హి వ్రజేతాం భుక్తభోగకౌ ॥

అన్నట్లు – భక్తితో దీన్ని పఠించేవాడు, ఆదరంతో వినేవాడూ ఈ లోకంలో భోగాలనుభవించి తుదకు విష్ణుసాన్నిధ్యం చేరగలరని ఫలశ్రుతి.

4. వాయుపురాణం

వాయుదేవుడు శివలీలలను వివరించిన పురాణమిది. అందుచేత దీన్ని 'శివపురాణ' మని కూడా పేర్కొంటారు. **'చతుర్వింశతి సాహస్రం పురాణం'** –అనుటవల్ల ఇందులో 24,000 శ్లోకాలున్నాయని గ్రహించాలి. కాని ఇపుడు

మనకు లభించేవి 11,000 శ్లోకాలు మాత్రమే. శ్లోకసంఖ్యలలో ఇట్టి వ్యత్యాసాలు కొన్ని పురాణాలలో కనిపిస్తున్నాయి. ఈ పురాణం మహావిష్ణువుయొక్క వామభుజంగా పేర్కొనబడింది.

ఇందులో (1) ప్రక్రియాపాదం (2) అనుషంగ పాదం (3) ఉపోద్ఘాత పాదం (4) ఉపసంహార పాదం–అని నాలుగు పాదాలున్నాయి.

భూగోళ–ఖగోళాలు, బ్రహ్మాండసృష్టి, యుగధర్మాలు మున్నగు విషయాలతోపాటు కైలాసవర్ణన, గంగావతరణవర్ణన మొదలగు వర్ణనలు గూడా ఇందు గోచరిస్తాయి.

ఇది శైవపురాణం. అయినా సందర్భానుగుణంగా మహావిష్ణువు గూడా ఇందు వర్ణింపబడినాడు.

వివేకవిజ్ఞానాలు కావాలంటే తప్పకుండా పురాణాల అధ్యయనం చేయాలని ఈ పురాణం చెబుతున్నది.

యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో నరః ।
న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥

నాల్గువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు చదివినా పురాణం చదువనివాడు విచక్షణుడు కాలేదని భావం. కాబట్టి పురాణాధ్యయనం ఎంత ముఖ్యమైనదో గ్రహించాలి.

ఈనాడు మనం యోగాభ్యాసాని కెంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. వాయుపురాణంలో యోగాని కవసరమైన ప్రాణాయామాన్ని గూర్చి విపులమైన వివరణ ఉన్నది. బ్రహ్మప్రాప్తికది అవసరం. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం–అనే నాల్గు ప్రయోజనాలు దానివల్ల కల్గుతాయని ఈ పురాణం చెబుతున్నది.

ఓంకారోపాసన గూడా ఇందులో చెప్పడమయింది. ఓంకారధ్యానపరులకు శివసాయుజ్యం కల్గుతుందని ఇందులో నిరూపించబడివున్నది.

'రమణకం' అనే దేశంలోని ప్రజలు పదివేల సంవత్సరాలు, 'హిరణ్యకం' లోనివారు పదకొండు వేల సంవత్సరాలు జీవిస్తారంటూ అక్కడి ప్రకృతివిశిష్టతను ఇక్కడ చెప్పడమయింది.

అక్కడి చెట్లు ఫలాలతోపాటు వస్త్రాలనూ, ఆభరణాలను గూడా ప్రసాదిస్తాయని చెప్పడం ఆశ్చర్యావహంగా ఉన్నది. కథాకథనంకంటే ఇట్టి వర్ణనలే ఈ గ్రంథంలో ఎక్కువగా గోచరిస్తాయి.

గయాక్షేత్రప్రాముఖ్యం గూడా ఇందు చెప్పడమయింది. గయను సందర్శించిన పుత్రుడు పితరులకు రక్షకుడనీ, అతణ్ణి చూచి పితరులు హర్షిస్తారనీ ఇక్కడ పేర్కొనబడింది.

ఈ పురాణకీర్తనం శ్రవణం,ధారణ–కీర్తినీ, పూర్ణాయువునూ, పాపనాశాన్నీ కల్గిస్తాయని ఫలశ్రుతి.

ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।
కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥

5. శ్రీమద్భాగవతం

శ్రీమహావిష్ణుని ఊరువుగా వర్ణించబడిన శ్రీమద్భాగవతంలో పన్రెండు స్కంధాలు, 18,000 శ్లోకాలున్నాయి. ఇది భక్తియోగ ప్రాముఖ్యాన్ని కథలతో, ఉపకథలతో వివరించే పురాణం.

'నిగమకల్పతరోర్గళితం ఫలం'-అన్నట్లు వేదమనే కల్పవృక్షంనుండి జారిపడిన పండుగా దీన్ని కీర్తించడమయింది. భక్తితోపాటు జ్ఞానవైరాగ్యాలు గూడా ఇందు నిర్దేశించబడి వున్నాయి.

వేదాలను విభజించిన వ్యాసుడు ధర్మనిరూపకమైన ఒక లక్షశ్లోకాలతో గూడిన మహాభారతం రచించాడు. అయినా మనశ్శాంతి లేక, చింతాక్రాంతు డయ్యాడు. నారదుడాయన చెంతకు వచ్చి 'నీచింతకు కారణ మేమి?' అని ప్రశ్నించాడు! 'అదేదో నీవే చెప్పు' అని వ్యాసుడన్నాడు.

అపుడు నారదమహర్షి ఊరక ధర్మాలు చెప్పితే చాలదు, విష్ణుకథాప్రధానమైన గ్రంథం రచిస్తే కానీ నీకు మనశ్శాంతి లభించదంటాడు. ఆయన చెప్పినట్లు వ్యాసభగవానుడు భగవంతుని గుణకర్మనామాలను కీర్తించే విష్ణుకథలను వర్ణిస్తూ భాగవతం రచించాడు, మనశ్శాంతి పొందాడు. భాగవత రచనకు చెందిన వృత్తాంతమిది.

దీని కథాప్రారంభమిది-పాండవవంశంలో జన్మించిన పరీక్షిత్తు వేటకు వెళ్ళి అలసిపోయి తపోనిమగ్నుడైన శమీక మహర్షిని నీళ్ళిమ్మంటాడు. నిర్వికల్పధ్యానంలో ఉన్న ఆ ముని కతనిమాట వినిపించదు. కోపించిన రాజు అతని మెడలో సర్పశవాన్ని వేసి శృంగిశాపానికి గురి అవుతాడు. వారం దినాలలో మరణించవలసిన దుఃస్థితి పాలవుతాడు.

అంతట రాజకార్యాలు త్యజించి ప్రాయోపవిష్టుడై ఏడు దినాలలో ముక్తి పొందే ఉపాయమేమి? అని విచారిస్తాడు. అపుడు శుకుడు వచ్చి అందుకు ఉపాయం భాగవతశ్రవణమే అని చెప్పి భాగవతప్రవచనం కావిస్తాడు.

ఇందులో ధ్రువుడు, జడభరతుడు, అజామిళుడు, దధీచి, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, రంతిదేవుడు మున్నగు భాగవతుల కథలు మనోజ్ఞంగా వివరింపబడివున్నాయి. ఆ కథల ద్వారా విజ్ఞానవైరాగ్యభక్తివిశేషాలు నిరూపితాలయ్యాయి.

దశమస్కంధం ఇందులో అతిముఖ్యమైనది. శ్రీకృష్ణావతారప్రతిపాదకమైన ఇందులో శ్రీకృష్ణుని లీలలు, ఆయన కావించిన కంసాదుల సంహారం, రుక్మిణీ కల్యాణం, కుచేలాదుల ఉద్ధరణ-ఇత్యాదిగా పలు అంశాలు రసవత్తరంగా చిత్రించబడినాయి.

ముఖ్యంగా గోపికలు కృష్ణుణ్ణి ప్రేమించిన ఘట్టం మనోహరంగా ఉన్నది. మధురభక్తితత్త్వం ఇందులో ప్రతిపాదితమయింది.

పదకొండవ స్కంధంలోని ఉద్ధవగీత ప్రశస్తం. శ్రీకృష్ణుడు అవసానదశలో గావించిన ఆధ్యాత్మిక ప్రబోధమిది. చివరి స్కంధంలో కలిస్వరూపం నిరూపించబడింది. మార్కండేయ చరిత్రను గూడా ఇందులో చూడవచ్చు.

'విద్యావతాం భాగవతే పరీక్షా' అన్నట్లు విద్యావంతుల జ్ఞానవిజ్ఞానాలను భాగవతం ద్వారా పరీక్షించవచ్చు. భగవన్నామసంకీర్తనం సర్వపాపప్రణాశకమని భాగవతం చెప్పింది. భారతావనిలో జన్మించి గూడా భాగవతం విననివారు ఆత్మఘాతకులని పేర్కొనబడ్డారు.

భారతే మానవం జన్మ ప్రాప్య భాగవతం న యైః ।
శ్రుతం పాపపరాధీనైరాత్మఘాతస్తు తైః కృతః ॥

భాగవత శ్రవణ ఫలం ఈ క్రిందిశ్లోకంలో ఇలా పేర్కొనబడింది.

మత్కథావాచనే నిత్యం మత్కథాశ్రవణే రతమ్ ।
మత్కథాప్రీతమనసం నాహం త్యక్ష్యామి తం నరమ్ ॥

'నాకథలు పఠించేవాడు, వినేవాడు, నాకథలచే సంతోషించేవాడు అయిన జనుణ్ణి నేను వదలను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

6. నారదపురాణం

మహావిష్ణువుయొక్క నాభిస్థానంగా కీర్తింపబడిన పురాణమిది. నారదుడు ఉపదేశించినది కావడం వల్ల 'నారద పురాణం' అనే పేరు దీనికి స్థిరపడింది. ఇందులో ఇరువదియైదువేల శ్లోకాలున్నాయి.

పూర్వఖండం, ఉత్తరఖండం అని ఈ పురాణం రెండు ఖండాలుగా విభక్తమై యున్నది. పూర్వఖండంలో 125, ఉత్తరఖండంలో 82 అధ్యాయాలు ఉన్నాయి.

పురాణాల ప్రశస్తి. శివకేశవుల అభేదం, భక్తికి గల ప్రాముఖ్యం, సదాచార ప్రాశస్త్యం, పౌరాణికుల గురుత్వం-ఇత్యాదులు ఇందులో చక్కగా కీర్తితాలయ్యాయి.

సత్యహరిశ్చంద్రుని గాథ ఇందులో ఉన్నది. అట్లే శ్రీకృష్ణుని ప్రభావం చక్కగా పేర్కొనబడివున్నది. బ్రహ్మాండోత్పత్తి ఎలా జరిగిందో ఇందులో చూడవచ్చు.

విష్ణుభక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించే ఈ పురాణంలోని క్రిందిశ్లోకం గమనార్హమై యున్నది-

లోకే స ధన్యః స శుచి స్స విద్వాన్ స ఏవ వక్తా స చ ధర్మశీలః ।
జ్ఞాతా స దాతా స చ సత్యవక్తా యస్యాస్తి భక్తిః పురుషోత్తమాఖ్యే ॥

పురుషోత్తమునిపై భక్తి గలవాడే లోకంలో ధన్యుడు, శుచి, విద్వాంసుడు, ధర్మశీలుడు, జ్ఞాత, దాత, సత్యవక్త అని భావం. భక్తిలేనివాని గుణాలు విలువలేనివని తాత్పర్యం.

ఒక్క భక్తినే కాక తీర్థయాత్రలో సేవించవలసిన తీర్థాల ప్రాశస్త్యాన్ని గూడా ఈ పురాణం విశదీకరించింది. అయోధ్య, మధుర, మాయ, కాశి, కంచి, అవంతిక, ద్వారక-ఈ ఏడు నగరాలు మోక్షప్రదాలని ఈ పురాణం ఉద్ఘాటించింది.

రాజధర్మాలను గూడా ఈ పురాణం వివరించింది. ప్రజారక్షణ, శత్రుసంహారం, న్యాయబద్ధంగా పన్నులు వసూలు చేయడం, గోరక్షణ, అన్న-వస్త్ర గృహాలు అనే కనీసపు సౌకర్యాలను ప్రజలకు కల్గించడం, మద్యనిషేధం-మున్నగు రాజుల కర్తవ్యాలు గూడా ఇందులో నిర్దేశింపబడివున్నాయి.

పరులపై దౌర్జన్యం, వారిని హింసించడం మున్నగు పది పాపాలు పరిహరణీయాలు. వాటి వినాశానికే, 'దశహరా' అని పేరు. దానికి ప్రతీకగానే నేటికీ 'దశరా' పండుగ జరుపుకొంటున్నాము.

భర్తృహరిసుభాషితంవంటి గ్రంథాలలో మనం ఎన్నో సుభాషితాలు చదువుతుంటాం. వాటిని పోలిన పలు సుభాషితాలను మనం ఈ నారదపురాణంలో గూడా చూడవచ్చు.

యః శృణోతి నరో భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।
స యాతి బ్రహ్మణో ధామ నాత్ర కార్యా విచారణా ॥

అని ఫలశ్రుతి. ఎవడు భక్తితో ఈ పురాణాన్ని వింటాడో, లేదా వినిపిస్తాడో, అతడు బ్రహ్మలోకం చేరుతాడు. ఇందుకు సందేహం లేదు.

7. మార్కండేయ పురాణం

మునులు తమ సందేహాలను మార్కండేయ మహర్షికి తెల్పగా ఆయన వారి సంశయాలు తొలగిస్తూ చెప్పిన పురాణమిది. విష్ణు భగవానుని దక్షిణపాదంగా ఇది కీర్తింపబడింది. ఇందులో 134 అధ్యాయాలు, తొమ్మిదివేల శ్లోకాలు ఉన్నాయి.

బలరాముని తీర్థయాత్రలు, హరిశ్చంద్రుని వృత్తాంతం, పతివ్రతాస్త్రీల ప్రభావం, కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని అనుగ్రహం పొందడం, రాజధర్మాలు, యోగశాస్త్రవిషయాలు, ఓంకారనిరూపణ, బ్రహ్మాండోత్పత్తి, దేవీమాహాత్మ్యం, సూర్యవంశవర్ణన ఇత్యాదిగా గల వివిధ విషయాలు ఈ పురాణంలో నిరూపించడమయింది.

దుర్గాదేవి జనుల ననుగ్రహించి వారి కోర్కెలు తీర్చే దేవత. ఆ దేవిని ఆరాధించడంలో సప్తశతీపారాయణం ముఖ్యకర్తవ్యం. ఆ సప్తశతి ఈ పురాణంలోని భాగమే. దేవీనవరాత్ర్యుత్సవాలలో సప్తశతిని పారాయణం చేస్తారు.

మహిళామణులలో కొందరు మహాయోగిను లున్నారు. వారిలో మదాలసాదేవి ఒకరు. ఈమెకు సంబంధించిన అద్భుతమైన చరిత్ర ఈ పురాణంలో అతి విపులంగానూ, రమణీయంగానూ నిరూపింపబడివున్నది.

ఋతధ్వజుడనే రాజుయొక్క ధర్మపత్ని మదాలస. ఈమెకు విక్రాంతుడు, సుబాహుడు, అరిమర్దనుడు, అలర్కుడు-అని నల్గురు కుమారులు. ఆమె ఉగ్గుబాలతోపాటు మొదటి ముగ్గురికీ బ్రహ్మవిద్యను గూడా బోధించింది. వారు అధ్యాత్మవిద్యలో ఆరితేరి సంసారవిరక్తులవుతారు. ఋతధ్వజుడు నాల్గవ కుమారుణ్ణి తల్లి వద్ద అధ్యాత్మవిద్యనభ్యసింపనీకుండా లౌకికవిద్యలు బోధించే ఏర్పాటు చేస్తాడు. అవసానదశలో ఆమె అతణ్ణి కూడా సత్సంగప్రభావముతో తత్త్వవేత్తగా రూపొందేటట్లు చేస్తుంది. ఇది ఆ కథా సంగ్రహ సారాంశం.

విష్ణువుయొక్క నాల్గు రూపాలు వాసుదేవ–శేష–ప్రద్యుమ్న–అనిరుద్ధములని ప్రసిద్ధాలు. వీటికి సంబంధించిన వివరణ కూడా ఈ పురాణంలో వస్తుంది.

ఇక ధర్మపక్షులుగా ప్రసిద్ధి వహించిన పక్షుల వృత్తాంతం గూడా మార్కండేయపురాణంలో పేర్కొనబడివున్నది. జైమినిమహర్షి తనకు గల్గిన సంశయాల నన్నింటినీ ఈ పక్షులద్వారానే తొలగించుకొంటాడు.

ఈ పురాణం పుత్రులను మూడురకాలుగా విభజించింది. తండ్రినుండి సంక్రమించిన కీర్తినీ, ధనాన్నీ పెంపొందించేవాడు ఉత్తముడు, పెంపొందించకున్నా పోగొట్టకుండా ఉండేవాడు మధ్యముడు, పోగొట్టుకొనేవాడు అధముడు. ఎంతో చక్కని ప్రబోధమిది.

తండ్రిపేరు చెప్పుకొని కాలం గడపువాడు వ్యర్థజన్ముడు. తండ్రికి కీర్తి తెచ్చేవాడు ఉత్తముడు ఇలాంటి విషయాలు యుక్తియుక్తంగా ఆసక్తిజనకంగా ఇందులో వివరించబడివున్నాయి.

శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।
సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥

అని ఫలశ్రుతి. ఇది విని దీనిని పూజించేవాడు సకలపాపవిముక్తుడై తన కులాన్ని పావనం చేస్తాడు.

8. అగ్నిపురాణం

అగ్నిదేవుడు వసిష్ఠమహర్షికి ఉపదేశించినదే అగ్నిపురాణం. ఇది విష్ణుదేవుని ఎడమపాదంగా వర్ణింపబడింది. ఇందులో 383 అధ్యాయాలు, 15,400 శ్లోకాలు ఉన్నాయి.

దశావతారాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మరియు రామాయణ మహాభారతాలలోని కొన్ని ఘట్టాలు ఇందులో కనిపిస్తాయి.

దేవాలయ నిర్మాణం, సాలగ్రామలక్షణాలు, సూర్యపూజ, శివపూజ, వాస్తుపూజ, చతురాశ్రమధర్మాలు ఈ పురాణంలో పేర్కొనబడివున్నాయి. పలురకాల వ్రతాలు, రాజధర్మాలు, స్వప్న ఫలితాలు, స్త్రీ పురుష లక్షణాలు, ఆయుర్వేద విషయాలు, అద్వైతవేదాంతతత్త్వం ఇత్యాదిగా గల పలువిషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

కూర్మావతారవర్ణన సందర్భంలో విష్ణువు దేవతలకు ఎలా ఉపకరించాడో ఇక్కడ మనోజ్ఞంగా చెప్పడమయింది.

ఇక రామాయణ ఘట్టాలలో సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ చూపినప్పుడు రాముడతనికి పంపిన తీక్ష్ణపదజాలంతో కూడిన సందేశం పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రామాయణంలో సీతాపహరణకు రావణుడు మారీచుణ్ణి ప్రేరేపించినప్పుడు మారీచుడు చెప్పిన ఈ క్రిందిశ్లోకం గమనార్హం.

రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘవాదపి ।
అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥

“రావణుని ఆజ్ఞ పాటించకుంటే అతనినుండి చావు తప్పదు. పాటిస్తే రామునిచేత మరణం తప్పదు. రావణునికన్న రామునిచేత మరణించడమే మేలు” అని భావం. ఇలా రామాయణభారతాదులలోని కొన్ని ఘట్టాలు ఈ పురాణాల్లో కనిపిస్తాయి.

భగవంతు డనే పదానికి ఈ క్రింది శ్లోకంలో ఇచ్చిన నిర్వచనం అర్థవంతంగా ఉంది.

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।
వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥

సృష్టిస్థితిలయాలు, జీవుల జననమరణాలు, విద్యా విద్యల స్వరూపం సమగ్రంగా ఎరిగినవాడే భగవంతుడు.

ఇక దేవాలయ నిర్మాణానికి చెందిన విశేషాలు కూడా ఈ పురాణంలో లభిస్తున్నాయి. ఆలయనిర్మాణం వల్ల బ్రహ్మహత్యాది దోషాలు కూడా తొలగిపోతాయని చెప్పడం విశేషం.

ఈ పురాణంలో కథలకు అంతగా ప్రాముఖ్యం లేదు కాని విద్యలు, పదార్థ లక్షణాలు, శుభాశుభస్వప్నాలు, శకునాలు, ఇవి మొదలుగాగల అనేక విషయాలు నిరూపింపబడి వున్నాయి. వివిధ శాస్త్రాలకు చెందిన విషయాలు ఇందులో ఉండడం వల్ల ఇదొక విశిష్టమైన పురాణంగా ప్రశంసింపబడుతున్నది. దీని ఫలశ్రుతి యిది–

‘ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్’

ఈ ఆగ్నేయ పురాణాన్ని చదివినా, ధ్యానించినా భుక్తిముక్తులు చేకూరుతాయని, శుభం కలుగుతుందని చెప్పడమయినది.

9. భవిష్యపురాణం

విష్ణుదేవుని కుడిమోకాలితో పోల్చబడిన ఈ పురాణంలో 14,500 శ్లోకాలున్నాయి. ఇందలి అధ్యాయాల సంఖ్య 585.

సృష్టివివరణ, పురాణాల ఉత్పత్తి, షోడశసంస్కారాలు. సావిత్రీమాహాత్మ్యం, స్త్రీలక్షణాలు, వివిధ వ్రతాలు ఇందులో వివరించడమయినది. రథసప్తమీ మాహాత్మ్యం, సూర్యుని ప్రభావం, ప్రతిమాలక్షణాలు, ధర్మస్వరూపం, జీమూతవాహనాదుల చరిత్రలు, అన్నదానప్రశస్తి మున్నగు విషయాలు అతివిస్తృతంగా ఇందులో వర్ణించడం జరిగింది.

భర్తపట్ల భార్య, భార్యపట్ల భర్త ప్రవర్తించవలసిన తీరుతెన్నులు చక్కగా ప్రతిపాదింపబడినాయి. సూర్యప్రభావవర్ణనా సందర్భంలో రాజు, దొంగలు, గ్రహాలు, పాములు, పేదరికం, దుఃఖాలు–ఇవేవీ సూర్యానుగ్రహం పొందిన వారిని బాధించవు అని చెప్పడం విశేషం.

ఇక జీవితంలో అతిముఖ్యమైన వివాహాన్ని గురించి వివరిస్తూ సమస్థాయిగలవారిలో జరిగే వివాహాలు శుభకరాలని, తదితరవివాహాలు దుఃఖదాయకాలని ఈ పురాణం చెప్పింది. స్మృతులలో పేర్కొనబడిన వివిధ

వివాహభేదాలు ఇందులో ప్రతిపాదింపబడివున్నాయి. సామాజిక జీవితంలో అత్యావశ్యకాలైన వివాహాది విషయాలను ఈ పురాణంలో ప్రతిపాదించడంవల్ల సంఘశ్రేయస్సుపట్ల పురాణకర్తకు కల అభినివేశమెట్టిదో వ్యక్తమవుతున్నది.

అన్నదాన ప్రాశస్త్యాన్ని పేర్కొంటూ-

"అన్నం వై ప్రాణినాం ప్రాణా అన్నమోజో బలం సుఖమ్ ।
ఏతస్మాత్కారణాత్సద్భిరన్నదః ప్రాణదః స్మృతః ॥

ప్రాణులకు అన్నమే ప్రాణం. అన్నమే ఓజస్సు, బలం, సుఖం. అందుచేత అన్నదాత ప్రాణదాతగా పేర్కొనబడినాడు. ఈ పురాణంలో మరొక విశేషం విక్రమాదిత్యుడికీ, బేతాళునికీ సంబంధించిన కథలు. ఈ కథలు మిక్కిలి లోకప్రసిద్ధి వహించాయి. కథలలో జీవితంలో ఎదురయ్యే గడ్డు సమస్యలను పరిష్కరించే నైతికసూత్రాలు మనోజ్ఞంగా నిరూపింపబడివున్నాయి.

ఈ పురాణానికి ఫలశ్రుతిని వివరిస్తూ గ్రంథకర్త ఇలా అన్నాడు-

యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో నృప! ।
అశ్వమేధఫలం ప్రాప్య గచ్ఛేద్భానుం న సంశయః ॥

ఈ పురాణం వింటే సకలపాపవిముక్తి చేకూరుతుంది. అశ్వమేధయాగ ఫలం లభిస్తుంది. చివరికి సూర్య సాయుజ్యప్రాప్తి కలుగుతుంది.

10. బ్రహ్మవైవర్తపురాణం

సావర్ణిమనువు నారదమునీంద్రునికి చెప్పిన పురాణమిది. ఇందులో వరాహమూర్తికి, శ్రీకృష్ణునికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ప్రతిపాదించబడివున్నాయి. ఈ పురాణం శ్రీమహావిష్ణువుయొక్క ఎడమ మోకాలుగా కీర్తింపబడింది.

బ్రహ్మఖండం, ప్రకృతిఖండం, గణేశఖండం, శ్రీకృష్ణఖండమని నాలుగు ఖండాలుగా ఇది విభజింపబడివున్నది. అన్ని ఖండాలలోను కలిపి మొత్తం 18,000వేల శ్లోకాలున్నాయి. **'సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముచ్యతే'** అన్నట్లు ఈ పురాణం పురాణా లన్నింటికీ సారభూతమైనదిగా ప్రశస్తి పొందింది.

బ్రహ్మఖండంలో పరబ్రహ్మవర్ణన చేయబడింది. ప్రకృతిఖండంలో దుర్గాదేవి మున్నగు స్వరూపాలతో ప్రకృతి ఆవిర్భవించడం నిర్దేశించబడింది. గణేశఖండంలో వినాయక చరిత్ర నిబద్ధమైనది. శ్రీకృష్ణఖండంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన మొదలగు అంశాలు పేర్కొనబడ్డాయి.

అతిథిని పూజించవలసిన అవశ్యకతను వివరిస్తూ ఈ పురాణం చెప్పిన విషయమిది-

అపూజితోఽతిథిర్యస్య భవనాద్వినివర్తతే ।
పితృదేవాగ్నయః పశ్చాద్గురవో యాన్త్యపూజితాః ॥

ఏ గృహస్థుని యింట అతిథి ఆదరింపబడడో ఆ యింటినుండి పితరులు, దేవతలు, అగ్నిదేవుడు, గురువులు పూజలను తిరస్కరించి వెళ్ళిపోతారని భావం.

ఇక జన్మకారణమైన తండ్రితోపాటు విద్యాదాత, అన్నదాత, భయమునుంచి కాపాడినవాడు, కన్యాదాత– ఈ నలుగురు కూడ తండ్రులుగానే పేర్కొనబడ్డారు. అట్లే సేవకుడు, శిష్యుడు, పోషితుడు, ఔరసుడు, శరణాగతుడు– ఈ ఐదుగురు పుత్రులుగానే పరిగణింపదగి ఉన్నారు.

ఈ గ్రంథంలో మొదటి పురుషార్థమైన ధర్మముయొక్క ప్రాశస్త్యం ఈ క్రిందివిధంగా ఉగ్గడింపబడింది–

నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాస్తి ధర్మాత్పరం ధనమ్ ।
ధర్మాత్ప్రియతరః కో వా స్వధర్మం రక్ష యత్నతః ॥

"ధర్మంకంటే శ్రేష్ఠుడైన బంధువు లేడు. మేలైన ధనం లేదు. ధర్మంకంటే ప్రియతరమైన దేదీ లేదు. కాన ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి." అని భావం. అట్లే మరొక చోట గురువులో సకలదేవతలూ ఉన్నారని గురుమహిమ ప్రశంసింప బడినది.

పై విషయాలతోపాటు భగవంతుని స్వరూపం, సరస్వతీపూజ, భూదానప్రాశస్త్యం, గంగావతరణం, సంక్షిప్త రామాయణం, తులసీమాహాత్మ్యం, దుర్గోపాఖ్యానం మొదలైన విషయాలు కూడా ఈ పురాణంలో వివరింపబడి వున్నాయి.

ఈ గ్రంథంలో పేర్కొన్న కథలలో ముఖ్యంగా పేర్కొనదగినది వేదవతీ చరిత్ర. కృతయుగంలో వేదవతిగా, త్రేతాయుగంలో సీతగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా వేదవతిని పురాణం వర్ణించింది. తదుపరి పురాణాల కథలలో ఈ వేదవతియే పద్మావతిగా అవతరించి విష్ణుని రూపాంతరమైన వేంకటేశ్వరుణ్ణి చేపట్టినట్లు చెప్పడమయినది.

కశ్యపమహర్షిమానసపుత్రిక జరత్కారువుయొక్క స్తుతి కూడా ఈ పురాణంలోనే లభిస్తున్నది.

శుభదం పుణ్యదం చైవ విఘ్ననిఘ్నకరం పరమ్ ।
హరిదాస్యప్రదం చైవ పరలోకే ప్రహర్షదమ్ ॥

ఇత్యాదిగా ఈ పురాణ పఠనం శుభాన్నీ, పుణ్యాన్నీ, విఘ్నవినాశాన్నీ, హరిదాస్యాన్నీ, పరలోకంలో సంతోషాన్నీ ప్రసాదిస్తుంది అని చెప్పడమైనది.

11. లింగపురాణం

అగ్నిలింగంలో అంతర్గతుడైవున్న శివుడు ఉపదేశించినదే లింగపురాణం. ఇది విష్ణుదేవుని కుడిచీల మండతో పోల్చబడింది. శివుని ప్రభావాన్ని వర్ణించే ఈ పురాణంలో 11,000వేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వార్ధమనీ, ఉత్తరార్ధమనీ రెండు భాగాలుగా ఉన్నది. పూర్వార్ధంలో 108, ఉత్తరార్ధంలో 55 కలిపి మొత్తం 163 అధ్యాయాలున్నాయి.

శివుని అవతారాలను ఈ పురాణం విరివిగా వర్ణిస్తున్నది. అందుచేత శైవులు ఈ పురాణాన్ని ప్రముఖంగా ఆదరిస్తారు. అష్టాంగయోగ సహితమైన శివారాధన, విష్ణువు కావించిన శివస్తోత్రం, బ్రహ్మజననం, లింగార్చనా విధానం, శివునికి చెందిన మానసపూజ, యుగ ధర్మాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు, దిక్పాలకుల నగర వర్ణన, చంద్రవంశరాజుల వృత్తాంతం, త్రిపురాసురసంహారం, కైలాసగిరివర్ణన, సదాచారం ఇత్యాదిగా పలు విషయాలు ఈ పురాణంలో అతివిస్తృతంగా ప్రతిపాదింపబడివున్నాయి.

ఇందలి ఉత్తరార్ధంలో పృథివి, జలం, అగ్ని, వాయువు మొదలగు అష్టవిధాలైన శివుని మూర్తుల వివరణ వున్నది. శివభక్తిని ప్రతిపాదించే కథలు కూడా ఈ పురాణంలో చోటు చేసుకొనివున్నాయి.

మృత్యువు సమీపించిన శ్వేతుడు అనే శివభక్తుడు శివుని అనుగ్రహంచేత మరణంనుంచి తప్పించుకొనిన కథ శివారాధనవల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తున్నది.

ఇక కాశీక్షేత్రమహిమ ఇందులో విస్తారంగా ప్రతిపాదితమయింది.

కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్హి వివిధాః క్రియాః ।
అవిముక్తే త్యజేత్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥

భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, యథేచ్ఛగా వివిధక్రియలాచరిస్తూ కూడ ఈ క్షేత్రంలో మరణిస్తే మోక్షం సిద్ధిస్తుందని ఇందులో చెప్పడమయినది.

అష్టదిక్పాలకులుగా ఇంద్రాదులు ప్రసిద్ధులు. వారు నివసించే నగరాలు క్రమంగా 1. అమరావతి 2.తేజస్విని 3.వైవస్వతి 4.కృష్ణవర్ణ 5. శుద్ధవతి, 6.గన్ధవతి 7.అలక 8.యశోవతి – అనేవి ఈ పురాణంలో పేర్కొనబడ్డాయి.

ఇది శైవపురాణం కాన శివపూజామాహాత్మ్యాన్ని ఘనంగా కీర్తిస్తున్నది. శివానుగ్రహంతోనే పరాశరుడు ఎన్నడో మరణించిన తన తండ్రిని, పినతండ్రులను చూస్తాడు. ఇట్టి విశిష్టమైన కథలతోను, వర్ణనలతోనూ సాగిపోయే లింగపురాణం చాలా ప్రభావోపేతమైనది.

మంచినీతులు చెప్పిన సందర్భాలు కూడా ఈ పురాణంలో లేకపోలేదు. భోగాశను నిరోధించాలనీ, విషయ విచారణచేత అది సాధ్యమనీ, మనోవాక్కాయాలతో వైరాగ్యాన్ని పాటించాలనీ చెప్పే ఈక్రింది శ్లోకం గమనార్హం–

భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।
తస్మాద్విరాగః కర్తవ్యః మనసా కర్మణా గిరా ॥

ఈ పురాణపఠన ప్రయోజనాన్ని ఈ క్రిందిశ్లోకం ఇలా చెప్పింది–

యః పఠేచ్ఛృణుయాద్వాఽపి లైంగం పాపహరం నరః ।
స భుక్తభోగో లోకేఽస్మిన్నన్తే శివపురం వ్రజేత్ ॥

పాపహరమైన ఈ పురాణాన్ని చదివేవారు, వినేవారు ఈ లోకంలో ఉన్నంతకాలం సకల భోగాల ననుభవించి కడపట కైలాసం చేరుకోగలరు.

12. వరాహపురాణం

వరాహావతారధారియైన విష్ణుదేవుడు భూదేవికి చెప్పిన పురాణమే వరాహపురాణం. ఇందులో 24వేల శ్లోకాలున్నాయి. విష్ణువుయొక్క ఎడమ చీలమండతో ఈ పురాణాన్ని పోల్చడమయింది. ఇందలి అధ్యాయాల సంఖ్య 215.

నానావిధ సృష్టులు, నారదమునీంద్రుని పూర్వజన్మచరిత్ర, విష్ణుభగవానుని అష్టమూర్తులు, ధర్మవ్యాధుని చరిత్ర, దక్షయాగధ్వంసం, పార్వతీజననం, వినాయకుని పుట్టుక, వివిధవ్రతాలు, వాటి ఫలితాలు, నాలుగు యుగాలు, అన్నదానప్రాశస్త్యం, వరాహస్వామి భూదేవిని ఉద్ధరించడం, నాచికేతుని వృత్తాంతం ఇత్యాదిగా పలువిషయాలు ఈ పురాణంలోని అంశాలుగా ఉన్నాయి.

అష్టాదశపురాణాల క్రమమూ, వివరణ గూడా ఇందులో నిర్దేశింపబడివున్నది. మహావిష్ణువు తన భక్తులకు అంగరక్షకుడై ఉంటాడన్న విషయం ఈ గ్రంథంలో చెప్పడమయింది.

శ్రీకృష్ణుడు గీతలో **'మమ మాయా దురత్యయా'** అని అంటాడు. 'నామాయ దాటరానిది' అని దీని అర్థం. భూదేవి 'మాయ' అంటే ఏమిటి? దాని స్వరూపం వివరించుమని విష్ణువును అడుగుతుంది. అందు కాదేవుడు తన మాయాస్వరూపాన్ని ఈ పురాణంలో అతి విస్తృతంగా వివరిస్తాడు.

లోకంలో తరచు సంభవించే అతివృష్టి, అనావృష్టి మున్నగు విపరీత సంఘటనలు, మాయవల్లనే కల్గుతున్నాయనీ, సృష్టిలో క్రమబద్ధంగా జరిగే సూర్యోదయాదులు, పంచభూతాల ప్రవర్తన, మాయాప్రభావం వల్లనే ఏర్పడుతున్నాయనీ ఇక్కడ చెప్పడమయింది.

దానాలన్నింటిలో అన్నదానం ప్రశస్తమయింది. అట్లే మనం వాడే వివిధములైన లోహాలతో నిర్మించబడిన పాత్రలలో రాగిపాత్రలు మేలైనవి అని ఈ పురాణం నిరూపించింది.

ఇంకా ఈ పురాణంలో వివిధతీర్థాల ప్రభావం గూడా వర్ణింపబడివున్నది. ఏ తీర్థాన్ని ఎప్పుడు సేవిస్తే మంచిదో ఇక్కడ వివరించబడివున్నది.

విష్ణుమందిరాలలో సేవలు చేసే వారికి గలిగే ఫలమేమి? అన్న భూదేవి ప్రశ్నకు విష్ణువు అట్టి వివిధ సేవాఫలాలను వివరంగా పేర్కొంటాడు. సకల జగత్తుకు సత్యమే ఆధారం కాన, సత్యాన్ని తప్పక పాటించాలన్న సంగతి ఇందులో చెప్పడమయింది.

ఇక కఠోపనిషత్తులో నాచికేతుని వృత్తాంతం ఇందులో రమ్యంగా ప్రతిపాదితమయింది. ఇంకా ఎన్నో కథాంశాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

శ్రుత్వా తు పూజయేద్యస్తు శాస్త్రం వారాహ సంజ్ఞితమ్ ।
సర్వపాపవినిర్ముక్తో విష్ణుసాయుజ్యమాప్రజేత్ ॥

అన్నట్లు దీన్ని ఎవరు శ్రవణం చేసి భక్తితో పూజిస్తారో, వారు సర్వపాపనిర్ముక్తులై విష్ణుసాయుజ్యం పొందుతారని ఫలశ్రుతి.

13. స్కాందపురాణం

స్కందుడనగా శివుని కుమారుడైన కుమారస్వామి. ఆ దేవుని పేరుతో ఈ పురాణం ప్రసిద్ధమయింది. శివుడు స్కందుణ్ణి ఉద్దేశించి చెప్పిన విషయమే ఈ స్కాందపురాణం. తండ్రినుండి విన్న ఈ పురాణాన్ని తరువాత స్కందుడు మునుల కుపదేశిస్తాడు.

'ఏకాశీతిసహస్రం తు స్కాందం సర్వాఘకృంతనం' – అన్నట్లు సకల పాపవిచ్ఛేదకమైన ఈ పురాణంలో 81,000 శ్లోకాలున్నాయి. దీన్ని బట్టి ఇతరపురాణాలకంటె ఇది ఆకృతిలో చాలా పెద్ద పురాణమని తెలుస్తున్నది.

మహావిష్ణుని వెండ్రుకలతో పోల్చబడిన ఈగ్రంథంలో మహేశ్వరఖండం, వైష్ణవఖండం, బ్రహ్మఖండం, కాశీఖండం, అవంతీఖండం, నాగరఖండం, ప్రభాసఖండం అని ఏడు ఖండాలున్నాయి.

మహేశ్వరఖండంలో కేదారఖండం, కౌమారీ ఖండం, అరుణాచలమాహాత్మ్యం మొదలైన అంశాలున్నాయి. వైష్ణవఖండంలో వేంకటాచల–జగన్నాథక్షేత్రాల మాహాత్మ్యం, బ్రహ్మఖండంలో సేతు మాహాత్మ్యం, ధర్మారణ్య, బ్రహ్మోత్తరఖండాలున్నాయి. కాశీఖండంలో కాశీక్షేత్రప్రభావం విస్తృతంగా వర్ణింపబడి వున్నది. నాగరఖండంలో వివిధ తీర్థాల వర్ణన ఉన్నది. విశ్వకర్మోపాఖ్యానాదికథలు గూడా ఉన్నాయి.

ప్రభాసఖండంలో ద్వారకానగరపరిసరాల ప్రభావం వివరించబడివున్నది. సంహితారూపంలో గూడా ఈ స్కాందపురాణం ప్రసిద్ధమైవున్నది.

సనత్కుమారసంహిత, సూతసంహిత, శంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత, అనేవే ఈ సంహితలు.

సూతసంహితలో శివోపాసనాప్రాముఖ్యం కీర్తింపబడివున్నది. కాశీక్షేత్రప్రభావాన్ని వర్ణించే కాశీఖండంలో అయోధ్యాదిక్షేత్రాలలో మరణించినవారు స్వర్లోకసుఖం అనుభవించి తరువాత కాశిలో జన్మించి అక్కడ ముక్తులవుతారని చెప్పడం విశేషం. **'కాశ్యాం తు మరణాన్ముక్తిః'** అన్న మాట గూడా ప్రసిద్ధం.

జీర్ణదేవాలయోద్ధరణ చేసేవారికి కలిగే ఫలాన్ని గూడా ఈ పురాణం వివరించింది. సత్యనారాయణ వ్రతస్వరూపం ఇందలి రేవాఖండంలో నిరూపితమయింది.

ఇంకను రామావతారం, క్షీరసాగరమథనం, గిరిజా కల్యాణం, కుమారోత్పత్తి, ఓంకారప్రభావం, 14 మంది మనువుల వర్ణన ఇత్యాద్యంశాలు ఇందులో గోచరిస్తాయి. అంతే కాక వనభోజనం, కార్తికవైభవం, ఉసిరిక విశిష్టత, ఇత్యాదివిషయాలు గూడా గమనింపదగివున్నాయి.

సర్వేషామేవ ధర్మాణాం గురుపూజా పరా మతా ।
గురుశుశ్రూషయా సర్వం ప్రాప్నోతి హి న సంశయః ॥

అన్ని ధర్మాలలోనూ గురుపూజ మేలైన ధర్మం. గురుసేవచేత అన్ని ఫలితాలూ పొందవచ్చు అని గురుసేవా ప్రాశస్త్యం పేర్కొనబడింది. రుద్రాక్ష మహిమ కథాకథన పూర్వాంకంగా ఇందులో వివరించబడింది.

పురాణ శ్రవణ ఫలాన్ని ఈ పురాణం 136 శ్లోకాలతో వివరించింది. జ్ఞానదీపాలుగా, భవరోగౌషధాలుగా పురాణాలిందులో కీర్తింపబడివున్నాయి.

14. వామనపురాణం

బ్రహ్మదేవుడు వామనావతార ప్రభావాన్ని కీర్తిస్తూ చెప్పినదే వామనపురాణం. మహావిష్ణుని చర్మంతో దీన్ని పోల్చారు. ఇందలి శ్లోకాలు పదివేలు, అధ్యాయాలు 95.

వైష్ణవధర్మ ప్రతిపాదకమైన ఈ పురాణంలో విష్ణుమందిరాలు, విష్ణుభక్తుల వృత్తాంతాలు అధికంగా కనిపిస్తాయి. ఉత్పత్తి ప్రళయాలు, కామదహనం, ప్రహ్లాదవరదానం, దేవీమాహాత్మ్యం, నానావిధ తీర్థాలు, వినాయక విజయం ఇత్యాద్యంశాలు ఈ పురాణంలో వర్ణించబడివున్నాయి.

వివిధ దేవతలకు చెందిన 25 స్తోత్రాలు ఈ పురాణంలో లభిస్తాయి. దేవతలలో మహావిష్ణువు, ఆయుధాలలో సుదర్శనం, పక్షులలో గరుడుడు, సర్పాలలో వాసుకి, ఈ రీతిగా ఆయా వర్గాలలో మేలైనవారినీ, వస్తువులను కీర్తించే ఇందలి ఘట్టం ఆసక్తి జనకంగా ఉంటుంది.

లోకంలో ఎన్నో పాపాలున్నాయి, కాని అన్నింటినీ మించిన పాపం కృతఘ్నుత్వమని ఈ పురాణం చెబుతున్నది.

నిత్యమూ ఉదయం లేవగానే త్రిమూర్తులు, గ్రహాలూ, సప్తర్షులూ, సప్తలోకాలూ తనకు శుభావహాలు కావాలని ప్రార్థించాలని ఈ గ్రంథం బోధిస్తున్నది.

జీవితంలో ఎన్ని విపత్తు లెదురైనా, షండుడు, మార్జారుడు, ఆఖువు, కుక్కుటుడు, పతితుడు, అపవిద్ధుడు, నగ్నుడు, చండాలుడు, అధముడు–ఇట్టివారిని ఆశ్రయించరాదని ఇందులో చెప్పడమయింది.

మనుజుడు అవశ్యం ఆచరించవలసిన సదాచారాలను 122 శ్లోకాలలో ఈ పురాణం వివరించింది.

పుత్రుడు – శిష్యుడు–వీరిరువురిలో శ్రేష్ఠు డెవరు? అన్న ప్రశ్నకు ఇందులో బ్రహ్మ పుత్రునికంటె శిష్యుడే శ్రేష్ఠుడని సమాధానం చెబుతాడు.

పున్నామ్నో నరకాత్త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।
శిష్టపాపహరశ్శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥

'పుత్' అనే నరకం నుండి మాత్రమే రక్షించువాడు పుత్రుడు కాగా తక్కిన సకలపాపాలనుండీ కాపాడేవాడు శిష్యుడని భావం.

పాపాలను దూరం చేసుకొనే విధానాన్ని ప్రతిపాదిస్తూ దానికి ఉదాహరణంగా ఇందులో కోశకారుని వృత్తాంతం చక్కగా వర్ణించబడింది. పూర్వజన్మకృతపాపాలు తరువాతి జన్మలో స్మరణకు వస్తాయని ఈ కథ ద్వారా తెలుస్తున్నది.

యే పఠంతి చ శృణ్వంతి తేఽపి యాన్తి పరాం గతిమ్ ।

అన్నట్లు ఈ వామనపురాణం చదివేవారు, వినేవారు ఉత్తమగతిని పొందుతారని ఫలశ్రుతి.

15. కూర్మపురాణం

17000 శ్లోకాలు గల కూర్మపురాణం విష్ణువు యొక్క పృష్ఠంగా వర్ణించబడింది. పూర్వార్ధం, ఉత్తరార్ధం అని రెండు విభాగాలుగా ఉన్న ఈ పురాణంలో 53+46=99 అధ్యాయాలున్నాయి.

కూర్మరూపంలో ఉన్న విష్ణుదేవుడు మహర్షుల నుద్దేశించి చెప్పిన పురాణమిది. లక్ష్మి ఇంద్రద్యుమ్నుల సంవాదం, విష్ణువు–మహర్షులకు జరిగిన సంవాదం, సృష్టివిధానం, వర్ణాశ్రమాలు, భృగువంశవర్ణన, యుగధర్మాలు, కాశీప్రయాగక్షేత్రాల మాహాత్మ్యం, సదాచారాలు, ద్వాదశాదిత్యుల వర్ణన–ఇత్యాదిగా గల అనేకాంశాలు ఈ పురాణంలో ఉన్నాయి.

మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు. పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు–అనే తొమ్మిదిమంది బ్రహ్మపుత్రులుగా ఇందు పేర్కొనబడినారు. మొదటికాలంలో ప్రజలు సుఖసంతోషాలతో వుండేవారనీ, క్రమంగా రాగద్వేషాలు కారణంగా ప్రజలకు దుఃస్థితి ఏర్పడిందనీ ఈ పురాణం చెబుతున్నది.

ధర్మం ఆచరణీయమనీ, ధర్మంవల్లనే తక్కిన పురుషార్థాలు సిద్ధిస్తాయనీ ఈ పురాణం పేర్కొంటున్నది.

ధర్మాత్సంజాయతే హ్యర్థో ధర్మాత్కామోఽభిజాయతే ।
ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాశ్రయేత్ ॥

అనగా ధర్మంనుంచే అర్థ,కామ,మోక్షాలు సిద్ధిస్తాయి. కాన ధర్మాన్ని ఆశ్రయించాలి అని భావం.

శివకేశవులకు భేదం లేదని భక్తులు ఏఏరూపాలను ఆరాధిస్తారో భగవంతుడు ఆయా రూపాలతోనే వారిని అనుగ్రహిస్తాడని ఈ పురాణంలో చెప్పిన విషయం భగవద్గీతలోని

'యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం' అనే వచనానికి అనుగుణంగా ఉన్నది.

స్వధర్మాన్ని త్యజించి చేసే తీర్థయాత్రలవల్ల ప్రయోజనం శూన్యమనీ, దేవాలయాదులను మిక్కిలి పరిశుభ్రంగా ఉంచాలనీ, మూత్రవిసర్జనాదులతో అపరిశుద్ధం చేయరాదనీ, అలాచేయడం పాపహేతువనీ ఈ పురాణం హెచ్చరిస్తున్నది. పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం ఇందులో చక్కగా వివరించబడింది.

వేదాన్ని విభజించేవారు వేదవ్యాసు లనబడతారు. అట్టివారు 26మంది ఉన్నారనీ పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడు చివరివాడనీ ఈ పురాణం చెప్పిన విషయం గమనార్హమై ఉన్నది.

ఇంకను సమాజంలో వున్నవారి కర్తవ్యాలు, గురువులవద్ద ఉండవలసిన తీరుతెన్నులు, పాపాత్ములతో చేసే సాంగత్యంవల్ల కలిగే దోషాలు–ఇత్యాది విషయాలు మిక్కిలి ఆసక్తిదాయకంగా ఈ పురాణంలో చెప్పడమయినది.

ఇందులో వామనావతారానికి సంబంధించిన చరిత్ర చాలా చక్కగా నిరూపించబడివున్నది. భక్తిప్రధానమైన దుర్జయు డనేవాని కథవంటి కొన్ని కథలు పాఠకులకు చక్కని చైతన్యం కలిగిస్తాయి. అట్టివి ఇందులో పలుకథలు వున్నాయి.

ఏతత్కూర్మపురాణం తు చతుర్వర్గఫలప్రదమ్ ।
పఠతాం శృణ్వతాం నృణాం సర్వోత్కృష్టగతిప్రదమ్ ॥

ఈ పురాణం చదివేవారికి, వినేవారికి చతుర్వర్గ ఫలాలు సిద్ధిస్తాయి. సర్వోత్కృష్టగతి కూడా కలుగుతుంది.

16. మత్స్యపురాణం

మహావిష్ణువు మత్స్యరూపుడై వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన పురాణమిది. విష్ణువుయొక్క మెదడుతో దీన్ని పోల్చడమైనది. ఇందులో 14.000 వేల శ్లోకాలున్నాయి. మొత్తం అధ్యాయాల సంఖ్య 283.

ఇందలి ముఖ్య విషయాలివి–మత్స్యావతారవర్ణన, అజాండసృష్టి, సూర్యచంద్రవంశాలు, గయాక్షేత్రవర్ణన, పురూరవుని చరిత్ర, కచదేవయానుల కథ, కార్తవీర్యార్జునుని వృత్తాంతం, కలిధర్మాలు మరియు కృష్ణాష్టమి, అక్షయ తృతీయ, కల్యాణసప్తమి మున్నగు పలువ్రతాల వర్ణన, సప్తద్వీపాల వివరణ, త్రిపురాసురవృత్తాంతం, తారక వృత్తాంతం మున్నగు విషయాలే కాక రాజధర్మాలు, చతుర్విధ దండోపాయాలు, స్వప్నఫలాలు, వామన వరాహావతారాల వర్ణన ఇత్యాదిగా గల విషయాలు ప్రతిపాదితాంశాలై వున్నాయి.

పుట్టిన ప్రతివాడూ పురుషార్థసాధనకై ప్రయత్నించాలి. అలా చేయనివాని జన్మ వ్యర్థమని ఈ పురాణం నొక్కి వక్కాణిస్తున్నది.

లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయే త్పౌరుషం నరః ।
జన్మ తస్య వృథా భూతమజన్మా తు విశిష్యతే ॥

శ్రాద్ధకాలంలో పితృదేవతలకు అన్నపానాదులు సమర్పించడాన్ని గూర్చిన విశేషవివరణ యిందులో కనిపిస్తున్నది. శ్రాద్ధ కర్మలు అవశ్యాచరణీయాలని ఇక్కడ పేర్కొనడమైనది.

ఇక కాలమానం గురించి ప్రస్తావిస్తూ బ్రహ్మ, శివుడు, విష్ణువు అను త్రిమూర్తులకు చెందిన వివిధ కాలమానాల విశ్లేషణ ఇందులో చేయబడింది.

1.భృగువు 2.అత్రి 3. వసిష్ఠుడు 4. విశ్వకర్మ 5.మయుడు 6. నారదుడు 7. నగ్నజిత్తు 8. విశాలాక్షుడు 9. పురందరుడు 10. బ్రహ్మ 11. కుమారుడు 12.నందీశుడు 13.శౌనకుడు 14. గర్గుడు 15. వాసుదేవుడు 16. అనిరుద్ధుడు 17. శుకుడు 18. బృహస్పతి అనే ఈ పదునెనిమిది మంది వాస్తుశాస్త్రోపదేశకులుగా ఇందులో పేర్కొనబడినారు.

తల,లలాటం మున్నగు అవయవాల కదలికవల్ల కలిగే ఫలాన్ని కూడా భగవంతుడు ఈ పురాణంలో చెప్పియున్నాడు.

ఇక పితృశ్రాద్ధంవల్ల కలిగే ఫలాన్ని వివరించే కౌశికుడనే విద్యావంతుడు, అతని ఏడుగురు కుమారులకు చెందిన విస్తృతమైన కథ ఇందులో కనిపిస్తున్నది. భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధం గోహత్యను కూడా పోగొడుతుందని ఈ కథలో నిరూపితమయినది. బ్రహ్మదత్తుని కథలో ఆడు చీమ, మగ చీమలమధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది.

పతివ్రతల ప్రభావం గురించి చెప్పే ఈ క్రింది శ్లోకం వారిపట్ల గౌరవంతో వుండాలని హెచ్చరిస్తున్నది.

పతివ్రతానాం వచనం ప్రకృష్టం తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా ।
న జాతు లోకేషు చరాచరేషు తస్మాత్సదా తాః పరిపూజనీయాః ॥

పతివ్రతల మాట శ్రేష్ఠమైనది. ఎప్పుడును వారి మాట మిథ్య కాదు. అందువల్ల వారు సదా పూజింపదగిన వారు.

ఇక ఫలశ్రుతి –

అస్మాత్పురాణాదపి పాదమేకం పఠేత్తు యస్సోఽపి విముక్తపాపః ।
నారాయణాఖ్యం పదమేతి నూనమనంగవద్దివ్యసుఖాని భుంక్తే ॥

ఈ పురాణంలో ఒక్క పాదం చదివినా పాపనివృత్తుడై వైకుంఠం పొందగలడని, సకల దివ్యసుఖాలు అనుభవింపగలడని ఫలశ్రుతి చెబుతున్నది.

17. గరుడపురాణం

విష్ణువాహనమైన గరుడుడు అడిగిన ప్రశ్నలకు విష్ణుదేవుడు చెప్పిన సమాధానాలే గరుడపురాణం, ఇందులో 19వేల శ్లోకాలు గల పూర్వఖండం, ఉత్తరఖండం అనే రెండు ఖండాలున్నాయి.

పూర్వఖండంలో 229, ఉత్తరఖండంలో 35 కలిపి 264 అధ్యాయాలు గల పురాణమిది. విష్ణుదేవుని "మజ్జ" గా ఇది వర్ణించబడింది.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో ప్రేతకల్పం మిక్కిలి ప్రశస్తమైనది. మరణానంతరం జీవుని స్థితిగతులను విస్తృతంగా వివరించే ఘట్టమిది. అందువల్లనే మరణించిన వానియింట పదవ దినంలోగా ఈ పురాణాన్ని పఠించే సంప్రదాయమేర్పడింది.

గరుడపురాణం కేవలం యమలోకవృత్తాంతాన్ని మాత్రమే చెబుతుందని కొందరు భావించడం కద్దు. ఈ భావన తగదు. ఇందలి పూర్వఖండంలో ఈ క్రింద నిర్దేశించబడిన నానావిషయాలున్నాయి.

భగవదవతారాలు, సరస్వత్యుపాసన, విష్ణుదీక్ష, శివార్చనావిధి, సుదర్శనచక్ర పూజావిధానం, సూర్యార్చన, దేవతాప్రతిష్ఠ, నిత్యనైమిత్తిక కామ్యకర్మల వివరణ, పాపప్రాయశ్చిత్తవిధి, నవరత్నాల పరీక్ష, వివిధములైన వ్రతాలు, ఆయుర్వేద వైద్యవిధానాలు మున్నగు అనేక విషయాలు ఈ పురాణంలో గోచరిస్తాయి. పశువుల చికిత్సా విధానం కూడా ఇందులో నిర్దిష్టమైయున్నది.

మానవజీవితానికి అత్యవసరమైన పలు నీతులు గూడా ఈ గ్రంథంలో పేర్కొనబడివున్నాయి. యజమానులు నిష్కారణంగా సేవకులను నిందించరాదన్న ఉపదేశం ఇందులో ఉన్నది. ధనం, జ్ఞానం, రూపం, మిత్రులు–వీరి స్వభావా లెలా ఉండాలో ఇందులో సూచించబడింది.

అర్థేన కిం కృపణహస్తగతేన పుంసాం జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।
రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన మిత్రేణ కిం వ్యసనకాలపరాఙ్ముఖేన ॥

కృపణుని చేతి ధనం, మొండి మనిషికి గలజ్ఞానం, గుణపరాక్రమాలులేని రూపం, వ్యసనకాలంలో కనిపించని మిత్రుడు ఉండీ ప్రయోజనం లేదని భావం. కష్టకాలంలో పరిచితవ్యక్తులు సైతం ఎలా తప్పించుకొంటారో సోదాహరణంగా ఈ పురాణం వివరించింది. గృహంలో వుంటూనే ముక్తిని సాధించే విధానం గూడా చెప్పడమయింది.

గరుడ పురాణంలో ఎన్నో కథలున్నాయి. కథలకంటె ఇందలి నీతివచనాలు మనోజ్ఞాలు. ఉదాహరణకు వేలకొలది గోవులలో దూడ తన తల్లిని గుర్తించి అనుసరించినట్లు మనమెంత దూరంగా ఉన్నా మనకర్మ మనల్ని విడువక వెంటాడుతూ వుంటుందని నీతిబోధ.

హయగ్రీవ పూజావిధి, పంచమహాయజ్ఞాలు, రాజలక్షణాలు, సేవకలక్షణాలు, రోగనివారణోపాయాలు మున్నగునవి కూడా ఈ పురాణంలో చూడవచ్చు.

'కీర్తితం పాపశమనం పఠతాం శృణ్వతాం నృణామ్' అనగా ఈ పురాణం చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విడుదల పొందుతారని దీనికి ఫలశ్రుతి చెప్పబడింది.

18. బ్రహ్మాండ పురాణం

బ్రహ్మదేవుని సృష్టిని వివరించే పురాణమిది. "బ్రహ్మాండం చాస్థి గీయతే" అన్నట్లు విష్ణువుయొక్క ఎముకలుగా ఇది పేర్కొనబడింది. ఇందులో 12,000 శ్లోకాలున్నాయి. బ్రహ్మాండపురాణం పూర్వభాగం, మధ్యభాగం,

ఉత్తరభాగమని మూడు భాగాలుగా వున్నది. పూర్వభాగంలో 38, మధ్యభాగంలో 74, ఉత్తర భాగంలో 44, మొత్తం కలిపి 156 అధ్యాయాల గ్రంథమిది. రోమహర్షణుడనే ముని కురుక్షేత్రంలో ఋషులకు చెప్పిన పురాణమిది.

ప్రక్రియాపాదం, అనుషఙ్గపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదమని నాలుగు భాగాలుగా ఈ పురాణం విభజింపబడింది. నైమిశారణ్యవర్ణన, చతుర్ముఖబ్రహ్మ వర్ణనం, వరాహావతారం మున్నగు విషయాలు ప్రక్రియాపాదంలో కనిపిస్తాయి.

తరువాతి పాదంలో చతురాశ్రమ ధర్మాలు, మునుల జన్మవృత్తాంతం, దక్షుడు గావించిన శివనింద, సతీదేవి అగ్నిప్రవేశం, దక్షుడు, శంకరుడు పరస్పరం శపించుకొనడం, ప్రియవ్రతవర్ణన మున్నగు విషయాలతోపాటు సప్తద్వీపాల వర్ణన, సూర్యుని మహిమ, సూర్యుని అధీనంలో ఉండి ఇతర గ్రహాలు సంచరించడం, రాత్రింబవళ్ళు, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనబడే కాలానికి సూర్యుడే మూలకారణమని నిరూపించడం, లింగజననం, యుగధర్మాలు, మొదలగు విషయాలు ఇందులో కనిపిస్తాయి.

మూడవదైన ఉపోద్ఘాతపాదంలో సప్తర్షులజననం, నృసింహావతార వర్ణన, కుమారసంభవం, పుణ్యప్రదేశవర్ణన, శ్రాద్ధాలకు ప్రశస్తమైన నదులు, తీర్థాలు, అన్నదానం, గయలో శ్రాద్ధం, మొదలగు విషయాలు నిరూపింపబడి వున్నాయి. పరశురాముని తపస్సు, జమదగ్నిని కార్తవీర్యార్జునుడు హతమార్చడం, జమదగ్ని పునర్జననం, సగర యయాతుల చరిత్ర మున్నగు విషయాలు కనిపిస్తాయి.

చివరిపాదంలో లలితాదేవి వర్ణన, కామాక్షీ మాహాత్మ్యం, దేవీదీక్ష, మొదలైన విషయాలు ఉన్నాయి. ఈ పురాణపఠనఫలం క్రింది విధంగా పేర్కొనబడింది.

య ఇదం కీర్తయేద్వత్స! శృణోతి చ సమాహితః ।
స విధూయేహ పాపాని యాతి లోకమనామయమ్ ॥

బ్రహ్మాండపురాణం పఠించేవాడు, ఏకాగ్రతతో వినేవాడు పాపరహితుడై సర్వోత్తమలోకాలను చేరుకుంటాడు అని భావం.

సముద్రాల లక్ష్మణయ్య
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణ ఇతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.,